ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు
NAAC WITH B GRADE
(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)
చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఇండియా.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కోవూరు
స్టవ్ బీడి కాలనీ, పెద్దపడుగుపాడు, కోవూరు టౌన్,
నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.



# భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 03 - Spl. Edition - March 2022 - ISSN No. : 2456-4702


# తెలుగు సాహిత్యం - మహిళ

## అంతర్జాల జాతీయ సదస్సు

3 - 4 మార్చి 2022



నిర్వహణ :

**తెలుగు విభాగం**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోవూరు, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 19 - *Special Issue* - 3 - March 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu (Rtd.),** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Associate Professor,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.



**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.



గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**



Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# తెలుగు సాహిత్యం - మహిళ

## అంతర్జాల జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

### మార్చి - 3 - 4, 2022.


ప్రధాన సంపాదకులు :

డా॥. వి. శ్రీదేవి

డా॥. సి. పి. లక్ష్మీప్రసూన

డా॥. పి. శ్రీనివాసులు

డా॥. సిహెచ్. శ్యామల కుమార్

# తెలుగు సాహిత్యం - మహిళ

## అంతర్జాల జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

**భావవీణ** ప్రత్యేక సంచిక

**ISSN No. : 2456-4702**

**RNI No. APTEL/2003/12253**
**UGC CARE - Journal - Arts & Humanities**

ప్రథమ ముద్రణ : **మార్చి 2022**

ప్రతులు : **500**

కాపీలకు : **ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు & శ్రీ వై.కె.ఆర్ & కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కోవూరు**

గమనిక : **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**

ఎడిటోరియల్ చిరునామా : **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు – 522 002.**

డి.టి.పి & ప్రింటింగ్ : **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# AP State Council of Higher Education

**Mangalagiri, Andhra Pradesh.**



**ప్రొ॥. కె. హేమచంద్రారెడ్డి**

**ఛైర్మన్, ఎ.పి.ఎస్.హెచ్.సి., ఆంధ్రప్రదేశ్.**

## సందేశము

ప్రతి వర్గానికి ప్రతి సమాజానికి తమదైన జీవన దృక్కోణం ఉంటుంది. దానిని బట్టి ఆ సమాజం లోని స్త్రీపురుషులు పాటించవలసిన, అందుకోవలసిన ప్రమాణాలు ఉంటాయి. భారతదేశానికి సంబంధించి గడచిన కొన్ని సంవత్సరాలుగా మహిళలు రెండు పరస్పర వ్యతిరేక దిక్కులలో చేరినట్లు కనబడుతుంది. ఒకవైపు సంప్రదాయ విధేయ మహిళలు, మరొకవైపున సంప్రదాయమును లెక్కచేయమనీబీ స్వేచ్ఛ తమ లక్ష్యమనీ ప్రకటించుకున్న మహిళలు. ఈ నేపథ్యంలో ఆదర్శాలను, విలువలను పునః పరిశీలన చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

ఒక సమాజంలో స్త్రీకిగల స్థానం ఎప్పుడూ కూడా ఆసమాజపు చింతనకు, ప్రగతికి, సార్థకత కు సూచికగా ఉంటూ వచ్చింది. సమాజజీవనం సంక్లిష్టమై ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో సంబంధాలు ఏర్పడ్డాక ఎప్పటికప్పుడు ఆలోచించుకుంటూ జీవన ప్రవాహగతిని సరిదిద్దుకుంటూ ఉండవలసిన అవసరం ఏ సమాజానికైనా ఉంటుంది. అందుకొరకు మనం యుగయుగాలుగా పయనిస్తూ వచ్చిన మార్గాన్ని పరిశీలించుకోవాలి. దాని ఆధారంగా ప్రస్తుత సంక్లిష్టతల గుండా మన ముందున్న మార్గాన్ని పరిశీలించుకోవాలి.

భారత మహిళ ప్రాచీన, మధ్యయుగాల కాలంలో బ్రహ్మవాదినులు గాను, రాజ్యపాలకులుగా కూడా ఉన్న విషయం చరిత్ర మనకు తెలియజేస్తున్నది. తదనంతర కాలంలో కేవలం గృహ నిర్వహణ కార్యకలాపాలకే పరిమితమై మరల ఆధునిక కాలంలో అంతరిక్ష గమనం చేయడం వరకు మహిళ అభివృద్ధి చెందడం మనం చూస్తున్నాం. శాస్త్ర సాంకేతిక రంగాలే కాకుండా కళలు, సాహిత్యం, బోధన, రాజకీయ, ఆర్థిక రంగాలలో కూడా మహిళలు పురుషుల కంటే ముందున్నట్లు మనం గ్రహించవచ్చు.

అటు ప్రాచీనం నుండి ఇటు ఆధునికం వరకు మహిళలు సాగించిన ఈ ప్రస్థానాన్ని ఆవిష్కరించే దిశగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేబ్రోలు, శ్రీ వై కె ఆర్ అండ్ కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోవూరు వారు సంయుక్తంగా చేస్తున్న ఈ ప్రయత్నానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ అంతర్జాల సదస్సు ద్వారా "తెలుగు సాహిత్యం- మహిళ"కు సంబంధించిన అనేక ప్రత్యేక అంశాలను వెలుగులోకి తీసుకువచ్చి మహిళలు అధికంగా అభివృద్ధి చెందేలా చేయాలని ఆశిస్తూ ఈ సదస్సు అనుకున్న లక్ష్యాలను సాధించి విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.



Chairman
A.P.State Council of Higher Education
(A Statutory body of the Government of A.P.)
3rd, 4th and 5th Floors, Neeladri Towers,
Sri Ram Nagar, 6th Battalion Road, Atmakur Village,
MANGALAGIRI-522 503. Guntur District, A.P.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు**
*NAAC with B Grade*
(ఎ.ఎన్.యు. అనుబంధ కళాశాల)
చేబ్రోలు, గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కోవూరు**
స్టవ్ బీడీ కాలనీ, పెద్దపడుగుపాడు, కోవూరు
టౌన్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.



డా॥. వి. శ్రీదేవి



డా॥. సి. పి. లక్ష్మీప్రసన్న

# అభినందన

"యత్ర నార్యస్తు పూజ్యంతే
రమంతే తత్ర దేవతాః"

ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు అన్నది స్మృతి వాక్యం. ఈ ఆధునికయుగంలో ఎంత చదువు చదివినా, ఎంత విజ్ఞానం సంపాదించినా, పై న్యాయం అరణ్యరోదనగా మిగిలిపోతోంది. అసమానతలు తొలగి, అభిజాత్యాలు మరచి అందరూ సుఖశాంతులతో జీవించాలన్నా, సమత,మమత, మానవతలు సమాజంలో వెల్లివిరియాలన్నా సాహిత్య అధ్యయనం తప్పనిసరి.

భారతీయ సంస్కృతీ విలువలకు పెద్దపీట వేసిన ప్రాచీన తెలుగు సాహిత్యం, అంతర్జాతీయ పోకడలను కూడా ఒడిసి పట్టుకున్న ఆధునిక తెలుగు సాహిత్యాలను జమిలిగా అధ్యయనం చేసి ప్రస్తుత తెలుగు సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. ఆ విధమైన దిశానిర్దేశంలో నాటి నుండి నేటి వరకు మహిళలు సాగించిన సాగిస్తున్న ప్రస్థానాన్ని వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం మహిళను చిత్రించిన తీరు వెలుగులోకి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఈ అంతర్జాల తెలుగు సదస్సు "తెలుగు సాహిత్యం- మహిళ" తన లక్ష్యాన్ని చేరుకుంటుందని ఆశిస్తూ మా రెండు కళాశాలల తెలుగు శాఖల వారికి, ఐక్యుఎసి విభాగము వారికి, మహిళా సాధికార విభాగము వారికి అభినందనలు తెలియజేస్తున్నాము .

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు
NAAC with B Grade
(ఎ.ఎన్.యు. అనుబంధ కళాశాల)
చేబ్రోలు, గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కోవూరు
స్టవ్ బీడీ కాలనీ, పెద్దపడుగుపాడు, కోవూరు
టౌన్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.



డా॥. పి. శ్రీనివాసులు



డా॥. సిహెచ్. శ్యామల కుమార్

# ముందుమాట

కరోన ప్రభావం తగ్గుముఖంపడుతున్నవేళ, అయినా ఇంకా ఏదో తెలియని భయం మనస్సులలోంచి తొలగని స్థితి. ప్రత్యక్షంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించడానికి అందరిలో మానసిక సంసిద్ధత వ్యక్తంచేయలేని స్థితిలో అంతర్జాల సదస్సు “తెలుగు సాహిత్యం - మహిళ” అనే అంశం పై నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఈ అంతర్జాల సదస్సు నిర్వహించడంలో మమ్మల్ని ప్రోత్సహించిన కళాశాల విద్య కమీషనరు డా. పోలా భాస్కర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి భావవీణ ప్రత్యేక సంచికను ఇ-బుక్ గా ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్ర రెడ్డి గారికి ధన్యవాదాలు. గౌరవ అతిథి ఆచార్య జి. సుబ్రహ్మణ్యం గారికి కృతజ్ఞతలు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి కృతజ్ఞతలు. ప్రారంభ సమావేశానికి ముఖ్యభూమిక వహించి కీలకోపన్యాసాన్ని ఇచ్చిన ఆచార్య కె. మధుజ్యోతి గారికి, ఆచార్య ఎన్.వి.కృష్ణారావు గారికి కృతజ్ఞతాంజలి సమర్పించుకుంటున్నాము.

తెలుగు సాహిత్యంలో నన్నయ నుండి నేటి వరకు ఈసదస్సులో దాదాపు 113 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్ర సమర్పణ చేయటం జరిగింది.వేదకాలం నుండి నేటికాలం వరకు ఉన్న స్త్రీల స్థితిగతులను తెలియజేస్తూ, స్త్రీల పాత్ర చిత్రణలో వచ్చిన మార్పులు, స్త్రీల ఆలోచనా విధానంలో వచ్చిన, వస్తున్న మార్పులను వివిధ కాలలలో వివిధ రచయితలు, రచయిత్రులు చిత్రీకరించిన తీరును వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు వారి పరిశోధన పత్రాలద్వారా వివరించారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

రెండు రోజులపాటు జరిగిన మొత్తం 11 సమావేశాలకు అధ్యక్షత వహించిన ఆచార్యులకు, అధ్యాపకులకు మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి ఈ అంతర్జాలసదస్సు పత్రాలను ప్రత్యేకసంచికగా తీసుకురావడానికి తోడ్పాటునందించిన 'భావవీణ' సంపాదకులు డా. బూసి వెంకటస్వామి గారికి ప్రత్యేక ధన్యవాదములు.

సమాపనోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి, ఈసదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలియజేసిన ఆచార్య జి.ఎమ్.సుందరవల్లి, వైస్ ఛాన్సలర్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు వారికి మా రెండు కళాశాలల తరపున ప్రత్యేక కృతజ్ఞతాంజలులు సమర్పించుకుంటున్నాము. గౌరవఅతిథిగా విచ్చేసిన డా. వి.ఆర్. జ్యోత్స్నకుమారి, ఆర్. జె. డి, కళాశాల విద్య, గుంటూరు వారు రెండు కళాశాలల ప్రిన్సిపాళ్లను అభినందించారు. వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డా. ఎన్. సదాశివరెడ్డి, సహాయాచార్యులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం వారు ప్రాచీన సాహిత్యంలో స్త్రీపాత్రకు, జానపద సాహిత్యంలో స్త్రీ పాత్రచిత్రణలో ఉన్న భేదాలను వివరించారు, వారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన డా. ఎన్. ఈశ్వరరెడ్డి,సహాయ ఆచార్యులు, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప వారికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాము. ఆచార్య రమాదేవి, సహాయ ఆచార్యులు ,యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము. మా రెండు కళాశాలల సిబ్బందికి, ఇంకా ఈకార్యక్రమంలో పాల్గొని, మాకు సహకరించి, మమ్మల్ని ప్రోత్సహించించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాము.

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | మొల్ల రామాయణం - స్త్రీ పాత్ర చిత్రణ | - ఆచార్య ఎం. రామనాథంనాయుడు | 14 |
| 2. | ఆంధ్ర కవయిత్రులు - కవితా దృక్పథం | - డా॥. డి. ఉదయకుమారి | 19 |
| 3. | పాతివ్రత్య ధర్మానికి ప్రతీక - సీత | - డా॥. వి. శ్రీదేవి | 24 |
| 4. | అనాది నుండి ఆధునికం వరకు భారతీయ మహిళ | - డా॥. సి.పి. లక్ష్మీ ప్రసూన | 28 |
| 5. | ప్రకృతి వైద్యరంగంలో మహిళా రత్నాలు | - డా॥. టి.మోహనశ్రీ | 33 |
| 6. | భారతంలో శకుంతల | - డా॥. ఎ. బాలకృష్ణ | 36 |
| 7. | ఆంధ్ర మహాభారతం - శర్మిష్ఠ, దేవయాని | - డా॥. దేవినేని జ్యోతమ్మ | 39 |
| 8. | విశ్వనాథ నవలల్లో యోగినీ స్త్రీలు - పరిశీలన | - ఆతుకూరి వేంకటేశ్వర్లు(యోగి) | 44 |
| 9. | ఆత్మచరితము : విశేషాంశాలు | - డా॥. శిరీష ఈడ్పుగంటి | 48 |
| 10. | డా॥ వి. చంద్రశేఖరరావు కథలు - స్త్రీ చైతన్యం | - డా॥. కడియాల వెంకటరమణ | 53 |
| 11. | మొల్ల రామాయణంలో సీత సాధికారత | - డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 56 |
| 12. | మహిళా లోకానికే ఆదర్శం - 'సీతాదేవి' | - డా॥. కసుకుర్తి. ఈశ్వరమ్మ | 59 |
| 13. | గుండెల్ని పిండేసే స్త్రీల వ్యథ 'తాయమ్మ కథ' | - డా॥. ఎం. హరికృష్ణ | 62 |
| 14. | స్వాతంత్ర్యం తెలుగు స్త్రీల పాత్రలు | - డా॥. పి. ఎస్. మైథిలి | 67 |
| 15. | సంస్కృతి మాయాజాలంలో మహిళా చైతన్యం | - డా॥. పి. ఎ. సత్యనారాయణ | 70 |
| 16. | 'రక్త స్పర్శ' కవుల కవిత్వం - స్త్రీ దృక్పథం | - భూక్యా కాశీరామ్ | 73 |
| 17. | దళిత స్త్రీ వాదం | - డా॥. సి. హెచ్. శ్యామలకుమార్ | 78 |
| 18. | మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విరచిత శ్రీ వెంకటాచల ... | - డా॥. కొయ్యా శ్రీనివాసులు | 82 |
| 19. | 'వెండిమేఘం' నవల - ముస్లిం స్త్రీ సామాజిక జీవనం | - డా॥. లింగాల మంగమ్మ | 87 |
| 20. | నాగప్పగారి సుందర్రాజు కథల్లో మహిళ - లైంగిక వివక్ష - అత్యాచారాలు | - డా॥. మల్లెల నాగరాజు | 92 |
| 21. | కృష్ణరాయబారంలో ద్రౌపది పలుకులు | - డా॥. మల్లెపోగు మాదన్న | 95 |
| 22. | శివారెడ్డి కవిత్వంలో స్త్రీ | - డా॥. మోకా ప్రతాప్ | 98 |
| 23. | మాలతీ చందూర్ నవలల్లోని - మహిళల పాత్రలు | - డా॥. ఎం. ప్రభావతి | 102 |
| 24. | వంటింటి సూర్యోదయాలలో స్త్రీల వెతలు | - డా॥. మురాడి శ్యామల | 107 |
| 25. | రామభద్రాంబ జీవితం - సాహిత్యం | - యస్. విద్యాసాగర్ | 109 |
| 26. | ప్రాచీన సాహిత్యంలో మొల్ల | - డా॥. పి. చైతన్య | 118 |
| 27. | ప్రసిద్ధ పౌరాణిక నాటకాలలో "మహిళ" | - డా॥. చుక్కా యశోద | 120 |
| 28. | భాగవతంలోని స్త్రీ పాత్రలు - విశ్లేషణ | - డా॥. ఇ. వాసు | 123 |
| 29. | నన్నయ అరణ్య పర్వం - దమయంతి వ్యక్తిత్వం | - డా॥. ఈతకోట ఈశ్వర రావు | 126 |

| | | |
|---|---|---|
| 30. ఓల్గా రాజకీయ కథలు - స్త్రీవాదం | - డా॥. కె. సుజాత | 131 |
| 31. తెలుగు సినిమా పాటల్లో స్త్రీ | - డా॥. చింతల రాకేశ్ భవాని | 134 |
| 32. స్త్రీల పట్ల స్త్రీ వాద కవిత్వ దృక్పథం | - డా॥. బి. భవాని | 138 |
| 33. ప్రాచీన సాహిత్యము - ధీర వనితలు | - డా॥. వాసిరెడ్డి భవాని | 140 |
| 34. పరిపూర్ణతకు స్త్రీకారం - సాహితీ వివేచన | - డా॥. పి. విజయకుమార్ | 145 |
| 35. ఆధునిక కవిత్వంలో మహిళ - డా॥. అద్దేపల్లి రచనల్లో ఆవేదన | - డా॥. టేకుమళ్ళ వెంకటప్పయ్య | 150 |
| 36. తెలంగాణ తొలి తరం కథల్లో మహిళా చైతన్యం | - డా॥. తత్త్వాది ప్రమోద కుమార్ | 154 |
| 37. 'వాణిశ్రీ' నవల - స్త్రీ పాత్రలు | - డా॥. కటుకం శారద | 159 |
| 38. స్త్రీవాద దృక్కోణంలో ఆడియో గీతాలు | - పి. అనిల్ కుమార్ | 164 |
| 39. విశ్వభారతి నవల - భారతి పాత్ర ప్రస్థానం | - యస్. గంగాధర రెడ్డి | 170 |
| 40. డా॥ వి.చంద్రశేకరరావు కథలు - దళిత మహిళ జీవిత చిత్రణ | - పి. ఇందిర | 174 |
| 41. "ఆశల అంచులో" నాటిక - స్త్రీ పాత్రల ఉద్బోధ" | - ఓబిలి వెంకటయ్య | 178 |
| 42. ఓల్గా రాజకీయ కథలు - స్త్రీ | - షేక్ షానాజ్ బేగం | 182 |
| 43. చిల్లర దేవుళ్ళు నవలలో మహిళ | - యస్. రజిత | 187 |
| 44. ద్రౌపది జీవితంలోని ప్రధాన ఘట్టాలు - ఎదుర్కొన్న తీరు | - కే. హరీష్ కుమార్ | 189 |
| 45. మహాభారతంలో సహనం కలిగిన స్త్రీమూర్తులు | - డా॥. బి. మేరికుమారి | 194 |
| 46. కాలువ మల్లయ్య గలుమ కథలో స్త్రీ పాత్రల విశ్లేషణ | - ఎ. నిరోష | 196 |
| 47. కోటి నదులు నవల - త్రివేణి పాత్ర చిత్రణ | - ఎం. పవన్ కుమార్ రెడ్డి | 198 |
| 48. 'చిత్రభారతం'లో 'రంభ' పాత్ర చిత్రణ | - డా॥. రాంభట్ల వేంకటరాయశర్మ | 201 |
| 49. రామాయణంలో స్త్రీ పాత్రలు - సుమిత్ర, సీత, త్రిజట | - జి. యమ్. మల్లేశ్వరి | 206 |
| 50. చీకటి ముడులు నవల - స్త్రీ జీవితం | - గంటెపోగు రత్నకుమారి | 209 |
| 51. ఇంద్రగంటి జానకీబాల కథలలో మగువ | - దారపురెడ్డి కనకమహాలక్ష్మి | 211 |
| 52. "అతడు - ఆమె"లో ఆమె పాత్ర | - డా॥. పసుపులేటి నాగమల్లిక | 214 |
| 53. అరణ్యకృష్ణ కవిత్వంలో - ఆమె | - డా॥. సుంకర గోపాల్ | 216 |
| 54. వేమన శతకం - స్త్రీ | - డా॥. కలవకుంట ఈశ్వరబాబు | 219 |
| 55. రామాయణంలో మహిళల పాత్ర | - డా॥. ఆర్. అరుణాదేవి | 222 |
| 56. ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్ర చిత్రణ పరిశోధన పరిధి - పరిమితి | - బలిజేపల్లి విజయలక్ష్మి | 225 |
| 57. జాషువా రచనల్లో స్త్రీ | - డా॥. ఎల్. కస్తూరి | 229 |
| 58. ప్రబంధ సాహిత్యం - మహిళ | - తేలు వెంకటకుమారి | 233 |
| 59. ఐతిహాసిక నారీమణుల మాతృ సందేశం | - వడ్డాది బాలగాయత్రీ | 237 |
| 60. మహాభారతం - స్త్రీ పాత్ర చిత్రణ | - జక్కె పద్మ | 240 |

| | | |
|---|---|---|
| 61. వాల్మీకి రామాయణంలో మంథర | - ఏ. మృణాళిని | 243 |
| 62. రాయలసీమ కథలు - దళిత స్త్రీ పాత్రల విశ్లేషణ | - యం. భైరవేశ్వర | 246 |
| 63. రాయలసీమ కథలు - స్త్రీ | - యం. శోభారాణి | 249 |
| 64. స్త్రీవాదం - భాష, అభివ్యక్తి రీతులు | - యం. కోటీశ్వరులు | 252 |
| 65. ఆంధ్ర మహాభారతంలో గాంధారి | - కోష్టు గోవిందరావు | 258 |
| 66. అడకత్తెర నవల - అన్నపూర్ణ పాత్ర చిత్రణ | - బి. రాజశేఖర్ | 262 |
| 67. 'ఇంద్రగంటి' వారి 'జీవనరాజకీయం'లో ప్రతిబింబించే స్త్రీవాద దృక్పథం | - దాసరి రమేష్ | 265 |
| 68. భారతీయ సంస్కృతిలో స్త్రీ | - ఎక్కలదేవీ మోహనకృష్ణ భార్గవ | 267 |
| 69. ఆంధ్ర మహాభారతం ద్రౌపది | - కాకర్ల చిన్న ఓబులేసు | 271 |
| 70. సత్య నిరూపణలో మేటి మన శాకుంతల | - బి. సైదారావు | 274 |
| 71. కంబరామాయణం - సీత సుందరకాండ | - చక్రహరి రమణ | 278 |
| 72. పాల్కూరి సోమనాథుని సాహిత్యంలో - స్త్రీ | - బూర్గుల స్వరూప | 281 |
| 73. మొల్ల రామాయణము - పాత్రల చిత్రణ | - డా॥. బి. మల్లికార్జున రాజు | 283 |
| 74. రాయలసీమ కథ - శ్రామిక మహిళ | - తమ్మిశెట్టి వెంకటనారాయణ | 286 |
| 75. విషాద మాధవి పద్యకావ్యం - స్త్రీ వాదం | - తంగి ఓగేశ్వరరావు | 291 |
| 76. ఆంధ్ర మహాభారతం - స్త్రీ పర్వం (గాంధారి పాత్ర చిత్రణ) | - డా॥. గుంటుపల్లి గౌరి | 297 |
| 77. యోగి వేమన శతకంలో వర్ణించబడిన స్త్రీ | - డా॥. రత్నశేఖర్ కట్టెపోగు | 302 |
| 78. రామాయణకాలంలోని మహిళ | - డా॥. దండెబోయిన పార్వతీదేవి | 307 |
| 79. 'వొంతు' కథల సంపుటి - స్త్రీల సమస్యల చిత్రణ | - డా॥. పి. జయచంద్రుడు | 311 |
| 80. భారతంలోని ద్రౌపది భూలోక లక్ష్మి | - యం. భీమయ్య | 315 |
| 81. నేలదిగిన వాన నవల - స్త్రీ పాత్రలు | - డా॥. జి. పార్వతి | 319 |
| 82. పాలగుమ్మి కథల్లో స్త్రీ | - డా॥. నల్లపనేని విజయలక్ష్మి | 323 |
| 83. జ్ఞాన తులసి "కౌసల్య" | - డా॥. శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ | 327 |
| 84. ధీరనాయిక రుక్మిణి | - డా॥. జి. వెంకటలక్ష్మి - గంజి శశిధర్ | 331 |
| 85. మట్టి మొగ్గలు కథా సంపుటి - స్త్రీ జీవన చిత్రణ | - డి. విశ్వనాథ్ | 334 |
| 86. పోతన భాగవతంలోని ధీరోదాత్త ప్రజ్ఞా స్త్రీమూర్తుల ... | - కె. మాధవి | 337 |
| 87. "తొలి కథకురాలు - భండారు అచ్చమాంబ" | - పత్ర గాయత్రి | 341 |
| 88. కిన్నెరసాని పాటల్లో స్త్రీ జీవిత చిత్రణ | - డా॥. వై. వి. సిహెచ్. లీలాపద్మజ | 350 |
| 89. అనంత కథానిక భీష్ముడు సింగమనేని కథలు-స్త్రీ అస్తిత్వ స్పృహ | - డా॥. బత్తల అశోక్ కుమార్ | 353 |

| | | |
|---|---|---|
| 90. స్త్రీవాద సాహిత్యానికి "ఆరంజ్యోతి" - ఓల్గా | - కప్పల శ్రీరాములు | 359 |
| 91. మాజేటి జయశ్రీ కథల్లో - మహిళ | - ఎస్. శశికళ | 363 |
| 92. శతక సాహిత్యం - స్త్రీ | - డా॥. పి. రమాదేవి | 368 |
| 93. గురజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' నాటకం - మధురవాణి.. | - డా॥. బి. సరస్వతి & | 372 |
| | - డా॥. జి. శ్రీనివాస్ | |
| 94. కార్యనిర్వహణాధికారిగా మార్గదర్శకత్వం వహించగల స్త్రీ మూర్తి తార | - డా॥. గోపవరం పద్మప్రియ | 375 |
| 95. బండి నారాయణస్వామి కథానికలు - స్త్రీ అస్తిత్వస్పృహ | - డా॥. జెన్నే యోగీశ్వరనాయుడు | 379 |
| 96. "రాముడుండాడు - రాజ్జి వుండాది" - వెనుకబడిన కులాల వృత్తి జీవనం" | - డా॥. యమ్. విజయశ్రీ | 383 |
| 97. విస్మృత ధీర - యశోబుద్ధ | - డా॥. జి. స్వర్ణలత | 385 |
| 98. ముదిగంటి సుజాతా రెడ్డి "మరో మార్క్స్ పుట్టాలె!" కథలు-మహిళా దృక్పథం | - జె. కోమలా ప్రియదర్శిని | 389 |
| 99. ఆధునిక సాహిత్యంలో డా॥ జ్యోత్స్న ప్రభగారి కవిత్వ 'కలల పరిమళం'-పరిశీలన | - అలువాల మహేందర్ | 391 |
| 100.సాహితీ రుద్రమ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ | - డా॥. వి. శ్రీదేవి | 395 |
| 101. మార్క్సిస్టు దృష్టిలో మహిళ | - డా॥. మానమ మునిరత్నం | 404 |
| 102.సుల్తానీ నాటకం-లంబాడి స్త్రీ జీవిత చిత్రణ | - డా॥. పి.భగ్గు నాయక్ | 410 |
| 103.మైదానం రాజేశ్వరి | - లలిత సాహుకారు | 415 |
| 104.ముస్లిం మైనారిటీ కథా సాహిత్యంలో - మహిళ | - డా॥. ఎం. షామిద బేగం | 417 |
| 105.స్త్రీశక్తి ప్రతీక - ఉభయభారతి | - డా॥. యస్. దివిజాదేవి | 421 |
| 106.షెహనాజ్ కథల్లో - సర్దుబాటు | - డా॥. సిరిగిరెడ్డి గంగాదేవి & | 425 |
| | - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి | |
| 107."రామకథను మలుపు తిప్పిన మహిళలు" | - యం. ప్రదీప్ | 427 |
| 108.1990 దశకపు పూర్వ తెలుగు కథ - దళిత మహిళ | - డా॥. జంపాల అనూరాధ | 429 |
| 109.ఆంధ్ర మహాభాగవతము - మహిళ | - డా॥. కె.వి. సత్యనారాయణ | 432 |
| 110. ఆంధ్ర మహా భారతము - కుంతి మాతృత్వము | - డా॥. భూక్య జ్యోతి | 437 |
| 111. రామాయణంలో మహిళల పాత్ర | - డా॥. ఆర్. అరుణాదేవి | 440 |
| 112. 90 వ దశకంలో స్త్రీవాదం - మహిళ | - డా॥. పత్తూరి శ్రీనివాసులు & | 443 |
| | - డా॥. కె. బలరామ్ | |
| 113. ఐతిహాసిక నారీమణుల మాతృ సందేశం | - వడ్డాది బాలగాయత్రీ | 446 |
| 114. కవయిత్రి షాజహాన కవిత్వం - ముస్లిం మహిళల వేదన | - బసవరాజప్ప | 449 |

# మొల్ల రామాయణం - స్త్రీ పాత్ర చిత్రణ

– ఆచార్య ఎం. రామనాథంనాయుడు, తెలుగు విభాగం, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూర్, కర్ణాటక.

తెలుగులో మొట్టమొదటగా సంగ్రహ రామాయణ కావ్యాన్ని రచించి, ప్రజాదరణను, ప్రఖ్యాతిని పొందిన మొదటి కవయిత్రి మొల్ల. ఈమె రచించిన రామాయణం 3 ఆశ్వాసాలు కలిగి, 879 గద్య పద్యాలతో కావ్య ప్రబంధ రీతులను సంతరించుకుని తెలుగు సాహితీ ప్రియులను ఎంతగానో అలరించింది.

మొల్ల పేరు వినగానే రామాయణం గుర్తుకు వస్తుంది. తెలుగు వారికి ఇష్టమైన కావ్యాలలో ''మొల్ల రామాయణం'' ఒకటి. ఈ రామాయణాన్ని శ్రీరామ చంద్రునికి అంకితం ఇచ్చింది మొల్ల.

రామాయణ అవతారికలో మొల్ల

"తేనెసోక నోరు తీయనయగు రీతి
తోడనర్థమెల్ల తోచకుండ
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగచెవిటి వారి ముచ్చటగును" అంటూ తేట మాటలతో తేనెలూరే కవిత్వాన్ని అందించింది. తేనె తాకి నాకితేచాలు నోరు తీయగా అవుతుంది. అలాగే మాట చెప్పగానే అర్థం కావాలి. లేకపోతే మూగవాడు, చెవిటి వాడు ముచ్చటలాడుకున్నట్లుంటుంది. ఒకడికి మాట రాదు. మరొకడికి వినపడదు. ఎవరికి తోచిన అర్థం వాళ్ళు తీసుకోవాల్సిందేనంటూ తన రచనా దృక్పథాన్ని తెలియజేసింది. రచనలో సారళ్యం వుండాలని, అది అందరికీ అందుబాటులో వుండాలని, పద ఆడంబరం కాదు అర్థపుష్టి ముఖ్యమని తెలిపింది.

మొల్ల శ్రీ - వాణి - గిరిజలను స్మరిస్తూ, వారిలోని తల్లి ప్రేమను, గృహిణి ధర్మాలను స్తుతించింది. పసిబిడ్డల అల్లరిచేష్టలకు ఆనందించే జగన్మాతగా పార్వతీదేవిని, కాముని తల్లిగా లక్ష్మీదేవిని వర్ణిస్తుంది. సరస్వతీ దేవిని చదువుల తల్లిగానే కాక, వినయ విధేయతలు గల ఇల్లాలిగా కూడా వివరిస్తుంది. రాయంచపైన విహరించి వచ్చిన చతుర్ముఖ బ్రహ్మకు సంతోషంతో, సోగకన్నులతో స్వాగతం పలుకుతుందని వర్ణించింది. భారతీయ గృహిణీ ధర్మాన్ని భారతీదేవిలో మొల్ల ఆరోపించింది. మొల్ల తీర్చిదిద్దిన స్త్రీ పాత్రలలోనే గాక ఆమె రచనలో ఎంతో మాతృత్వం కన్పిస్తుంది. చిన్న పిల్లలకు గోరు ముద్దలను తినిపించినట్టు మొల్ల తన రామాయణ కథను అలతి అలతి తెలుగు పదాలతో అందమైన కంద పద్యాల్లోనే ఎక్కువగా కథను కొనసాగించి సాహితీ ప్రియులకు అందించింది.

మొల్ల తన రామాయణంలో సీత, కైక, మండోదరి పాత్రలను ముఖ్యంగా ఉటంకించింది. ప్రధాన పాత్ర సీతదే అయిన రామాయణ కథలో మొదటగా దర్శనమిచ్చేది కైక. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడంటే కైకకు అభిమాన, ఆప్యాయత లుంటాయి. కానీ తన పరిచారిక మంథర దుర్బోధతో శ్రీరామచంద్రుడిని అరణ్యవాసానికి పంపుతుంది. అయితే మొల్ల తీర్చిదిద్దిన కైక మాత్రం స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్వతంత్ర ధీరత్వం కలిగిన ధృడచిత్తురాలు. పట్టినపట్టును విడవని కార్య సాధకురాలు. తాను అనుకున్నది సాధించడానికి ఏ మార్గాన్ని అయినా ఎన్నుకునే చతుర. కార్య దీక్షాపరురాలు. మహారాణికి వుండవలసిన దర్పం. ఠీవి మొల్ల తీర్చిన కైకలో కన్పిస్తాయి. మొల్ల రామాయణంలో మంథరగాని, ఆమె దుర్బోధగానీ లేవు.

దశరథుడు రామునికి పట్టాభిషేకం జరపాలని నిర్ణయించుకున్న తర్వాత సూర్యాస్తమయం జరుగుతుంది. చీకటి వ్యాపిస్తుంది. ఆ రాత్రి కైక భర్తకు నచ్చేవిధంగా ప్రవర్తించి, అతని మెప్పుపొందిన తర్వాత మెల్లగా వరాలను కోరుతుంది.

'అనిలోనున్న నృపాలు చిత్తమునకే నావ్లో దముంగూర్చి, నా
తనయుం బట్టముగట్టి, రాఘవుని బద్నాల్గేండ్లు కాంతారమం
దనువర్తిల్లగ, బంప గొన్న వరమున్ ద్రోయంగ రాదెంతయు
న్వనసీమన్ మునివృత్తినుండు మనుడీ, వైళంబు యారామునిన్'

రాచస్త్రీ అయినా వీరవనితగా రణరంగంలో భర్తకు తోడ్పడి, అతని విజయసాధనలో పాలుపంచుకున్న కైక, రాత్రి సమయంలో తన అందచందాలతో చాతుర్యంతో భర్తమెప్పును పొందడం, అనుకున్నది సాధించడం, ఆమె ధీరత్వానికి సముచితమన్పించదు. అయినా చరిత్రలో క్లియోపాత్రా నుండి కైక వరకు రాచవంశాల్లోని స్త్రీలనేకులు తమ అందచందాలతో, చతురతతో పురుషులను స్వాధీనం చేసుకున్నారు. మగవారిని ఆకట్టుకోవడంలో ఆడవారు పన్నే ఎత్తుగడల్లో ఇది ముఖ్యమైందని భావించవచ్చు.

కైక వరాలను దశరథుడు నిస్సహాయంగా ఒప్పుకుంటాడు. ఆ రాత్రిగడచి తెల్లవారింతర్వాత సుమంత్రుడు రామచంద్రుని పట్టాభిషేకానికి సమయం ఆసన్నమైందని దశరథునితో విన్నవిస్తాడు. దశరథునికి బదులుగా కైకయే సుమంత్రునికి సమాధానమిస్తుంది.

యుద్ధరంగంలో భర్తకు సంతోషాన్ని కల్గించినందుకు తనకు వరాలను ప్రసాదించాడనీ, కోరిన వరాలెటువంటివైనా, ఇవ్వడం భర్తగా, ప్రభువుగా దశరథుని కర్తవ్యమనీ, నృపాలుని కర్తవ్యాన్ని నెరవేర్చవలసిన బాధ్యత మంత్రియైన సుమంత్రునిపైన ఉందనీ తన చర్యను తానే సమర్థించుకుంటూ ప్రభువు ప్రధాని విధులను, బాధ్యతలను కూడా సూచిస్తుంది. అంతేకాకుండ కైక నా కొడుక్కు పట్టము కట్టి రాఘవుణ్ణి పద్నాల్గేండ్లు అరణ్యవాసం చేయడానికి వరాలను కోరానని అంటుంది. "రాఘవుడు" అన్న పదప్రయోగంలోనే కైక వాక్చాతుర్యం వ్యక్తమవుతుంది. రఘువంశస్థులు ఆడితప్పకూడదని విశ్వామిత్రుడు కూడ దశరథుణ్ణి హెచ్చరిస్తాడు. కైక కూడ రఘువంశస్థుల సత్యవాక్య పరిపాలనా బాధ్యతను పరోక్షంగా అతినైపుణ్యంగా గుర్తుచేస్తుంది. తన మాటను నెరవేర్చవలసిన బాధ్యత, మంత్రిగా సుమంత్రునికి ఉందని కైక, రాణిగా బెదిరిస్తుంది.

'ఆ రాముడు' అని కైక అనడంలో దశరథుని జ్యేష్ఠపుత్రుడైన రామునిపైన తండ్రిమాటను నెరవేర్చే గురుతర బాధ్యత ఉందని హెచ్చరిస్తుంది. ఈ విధంగా ఒకే పద్యంలో మొల్ల, భరతుని పట్టాభిషేకాన్ని, రాముని అరణ్యవాసాన్ని, తండ్రీకొడుకుల బాధ్యతలను కూడ మహారాజ్ఞిలా కైక చేత ఆదేశింపచేసింది. మొల్ల 3 కందపద్యాల్లో, మూడు చిన్న చిన్న వచనాల్లో ఒక మత్తేభ విక్రీడితంలో రామాయణ కథకు ప్రధాన ఘట్టమైన కైక ప్రవర్తనను అతి నిపుణంగా ప్రదర్శించింది. స్త్రీసహజమైన సంభాషణా చాతుర్యాన్ని సార్థక పదప్రయోగాల్లో, అలతి అలతి పదాల్లో పొదుపుగా కైక పాత్రలో మొల్ల వ్యక్తీకరించింది. పద్మపురాణం, మహాభారతం, రఘువంశం, దేవీభాగవతంలో మంథర దుర్బోధ లేకుండానే కైక తన స్వతంత్ర్య వ్యక్తిత్వంతో దశరథుణ్ణి వరాలను కోరుతుంది.

వాల్మీకి రామాయణంలోని కైక మాదిరి మొల్లకైక అరణ్య వాసానికి బయలుదేరిన సీతారాములకు నారచీరలను బహూకరించదు. పట్టుబట్టలను, ఆభరణాలను తీసివేయమని శాసించదు. మొల్లకైక, ధైర్యంగా, సమయోచితంగా ప్రవర్తించి భరతుని పట్టాభిషేకం, రాముని అరణ్యవాసం వంటి పెద్ద కోరికలనే మహారాజ్ఞిలా కోరుతుంది. కాని నారచీరలను ధరించమనీ, నగలను తీసివేయమనే అల్పకోరికలను కోరలేదు.

మొల్ల తన రామాయణంలో మంథరను ప్రస్తావించలేదు. అదే విధంగా అహల్య పేరునుగానీ, ఆమె వృత్తాంతాన్ని గానీ పేర్కొనలేదు. శ్రీరాముని పాదస్పర్శతో

కఠినశిల కరిగిన బంగారు పూదీవ వలె, లావణ్య స్థితిలో, కులపావనగా ప్రకాశించింది. ఆ దృశ్యాన్ని చూచిన విశ్వామిత్రుడు పులకరించాడు. శ్రీరాముని పాదరజ మహిమను వర్ణించడమే మొల్ల ప్రధానోద్దేశం కానీ, అహల్య కళంకితమైన శాపవృత్తాంతాన్ని, జీవితాన్ని వర్ణించడం కానీ ఆమెకిష్టం లేదేమో. అందుకే ఆమె అహల్య కథను త్యజించింది అని ఊహించవచ్చు.

మొల్ల రామాయణంలో సీత పాత్రచిత్రణ అద్భుతంగా ఉంటుంది. సీత జన్మవృత్తాంతాన్ని గానీ, జనక మహారాజు కూతురుగా ఆమె పెరిగిన విధానాన్ని గానీ ఆమె వివరించ లేదు. రాముడు శివధనుస్సును తునిమిన సందర్భంలో పరాజితులైన రాజకుమారులు తలవంచుకొని సిగ్గుపడగా, పెళ్ళికూతురుకు సహజమై సిగ్గుతో సిగ్గిల్లక, సంతోషంతో మేను పెంచి నిలబడుతుంది. లంకలో బందీగా ఉన్న ప్పుడు కూడా రావణాసురుడామెను “వ్రీడ యలం కారముగా నాడుము” అని అంటాడు. కానీ ఆమె రావణునితో సిగ్గుపడక బెదరక, ధైర్యంగా, స్థైర్యంగా, నిబ్బరంగా ఆత్మవిశ్వాసంతో సంభాషిస్తుంది. రావణుని వైపు చూడకుండ, గడ్డి పరకను పట్టుకొని దానితోనే మాట్లాడుతున్నట్లు మాట్లాడి, అతణ్ణి తృణీకరిస్తుంది. ఆమె తన ప్రవర్తనలోగానీ, మాటల్లోగానీ దీనత్వాన్ని, బేలతనాన్ని చూపెట్టదు. సీత ధైర్యానికి, రావణుడు ఉక్రోషంతో, రోషంతో ఆమె నాలుకను చీలుస్తాననీ, ఆమెను దయ్యా లకు బలి ఇస్తాననీ బెదిరించి, భయపెట్టి వెళ్ళిపోతాడు.

శత్రువుల ముందు అంతరంగంలోని ఆవేశాన్ని, అభిమానాన్ని, కసినీ, కక్షనూ, చూపెట్టిననూ, ఆప్తులు ఆత్మీయులు కన్పించినపుడు, వారి ముందు మాత్రం తమ మనస్సును తొలచివేస్తున్న బాధలను, కష్టాలను చెప్పుకోవడం మగువల సహజగుణం. అశోకవనంలోని సీతకు, రామదూత హనుమంతుణ్ణి చూడగానే, అతడు ఆమెకు ఆత్మీయబంధువుగా అనిపించాడు. అందుకే సీతాదేవి తన మనస్సులోని ఆందోళనలనూ, ఆరాటా లనూ హనుమంతునికి చెప్పుకుంటుంది.

హిందూస్త్రీలు కర్మసిద్ధాంతాన్ని అక్షరాల నమ్ము తుంటారు. హిందూ స్త్రీలలోని సౌజన్యమూర్తులు, సహన వతులు తమ జీవితంలోని కష్టనష్టాలకు కారణాలను ఇతరులపైన వేయరు. తమ కష్టాలకూ, దురదృష్టానికీ కారణం ఆవేశం, ఆలోచనారాహిత్య ప్రవర్తనవే మూలమనుకుంటారు. సౌజన్యవతి సీతకూడ తాను అనాలోచితంగా, ఆవేశంతో లక్ష్మణుడ్ని అనుమానించి నందుకు, నిందించినందుకే రామునితో ఎడబాటు కల్గిందనీ, రావణాసురునికి బందీని అయినానని భావి స్తుంది, నమ్ముతుంది. అంతేకాకుండా హనుమంతునితో, తనను క్షమించుమని సౌమిత్రికి చెప్పమంటుంది. చేసింది తప్పని గుర్తించడం, పశ్చాత్తాపాన్ని అనుభవించడం, తనకంటే చిన్నవారిని క్షమించమని కోరడంలో సీత హృదయనైర్మాల్యానికీ, విశాల హృదయానికీ ఒక నిదర్శనం.

అశోకవనంలో రావణునితో ధీరగా మాట్లాడిన సీత, హనుమంతుని ముందు బేల అవుతుంది. రావణుడు తనను కష్టపెడుతున్న వైనాన్ని, తన వియోగబాధను శ్రీరామునికి కరుణ కలిగేటట్లుగా వివరంగా విన్నపం చేయుమని దీనంగా వేడుకుంటుంది. హనుమంతుడు ఆమె అనుభవిస్తున్న కష్టాలను గుర్తించి, వీపున కూర్చోబెట్టుకొని సూర్యోదయానికి ముందే రాముని ముందు నిలబెడుతానని అంటాడు. హనుమంతుని మాటలకు సీత సంతసించదు, అతని సలహాను తిరస్కరించి, తన ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రదర్శి స్తుంది. “దొంగిలి తెచ్చిన దైత్యుని చంపక, దొంగిలికొని పోవదగునే దొరలకు”- అని హనుమంతుణ్ణి ప్రభువుల విద్యుక్త ధర్మపరిపాలను గుర్తుకు తెచ్చి ప్రశ్నిస్తుంది.

రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పంటించినట్లు విని అగ్నిమంత్రం, బ్రహ్మమంత్రమునుచ్చరించి, అతనికి శీతలత్వాన్ని కల్గించడంలో, ఆమె మంత్రశాస్త్ర ప్రభావం మనకు విదితమవుతుంది.

రావణ సంహారణానంతరం రాముడు సీతను అలంక

రించుకొని తీసుకొని రమ్మంటాడు. కాబోయే అయోధ్య మహారాణిగా రాక్షసులామెను చూచి సంతోషించాలని రాముని కోరిక. పతి ఆజ్ఞననుసరించి సీత అలంకరించు కొని వచ్చి వినమ్రంగా నమస్కరిస్తుంది. రాముడు "శత్రువును గెలచితి బగచంపితి ఇక నీ యిచ్చ జనుము నేను నిన్నొల్లను' అని నిక్కచ్చిగా మాట్లాడి, ఆమెను స్వీకరించడానికి నిరాకరిస్తాడు. సీత అతని మాటలకు నొచ్చుకొని "నరవర నాదు చిత్తము మనంబున నీవ యెఱింగి యుండినన్ బరుషములాడనేమిటికి, నాయెడ బాపములేదు. కాదు పో సురలు నుతింప మేటి సొద జొచ్చెద'' అని ధైర్యంగా ఆత్మాభిమానంతో సమాధానమిస్తుంది. అగ్నిలో ప్రవేశించి తన పాతి వ్రత్యాన్ని, పవిత్రతను రామునికీ, లోకానికీ చాటుతుంది.

మొల్ల, తన రామాయణంలో సీతను అమాయకమైన అబలగా గాకుండ, కష్టాలకు కూడ తలవంచక సహనంతో సహించి, రాక్షసరాజైన రావణుడ్ని కూడ ధైర్యంగా ధిక్కరించి, శత్రు సంహారానికి మూలకారణమై, తనననుమానించిన భర్త కొరకు అగ్ని ప్రవేశం చేసి తన పాతివ్రత్యా మహిమను లోకానికి చాటిన ధీరగా, పతివ్రతగా తీర్చిదిద్దింది.

మొల్ల రామాయణంలోని మూడవ ముఖ్యమైన పాత్ర రావణుని భార్య మండోదరి. రావణాసురుని పాతాళ హోమాన్ని భంగం చేయడానికి వానరులు మండోదరిని జుట్టు పట్టుకొని ఈడ్చుకొని వస్తారు. వారు పెడుతున్న హింసలను, చేసిన అవమానాలను భరించలేక మండోదరి రావణుణ్ణే నిందిస్తుంది., నిష్ఠూరంగా అతణ్ణి ఎత్తిపొడుస్తు మాట్లాడుతుంది. "మయదైత్యుని తనయగా, నీరాణిగా, ఇంద్రజిత్తు తల్లిగా పూజలందుకునే నేను నీవల్ల అవమానాలను భరిస్తున్నాను, నా మానం కాపాడని నీ మానుషమేటికి'' అని అతని పౌరుషాన్ని రెచ్చగొట్టడానికి ప్రోత్సాహిస్తుంది. మునిగా హోమం చేయడం కంటే, రామునితో యుద్ధం చేసి గెలిస్తే జయం కల్గుతుంది, లేదా రాముని చేతిలో చస్తే మోక్షం ప్రాప్తిస్తుందని బోధించి, గెలుపు, ఓటముల గురించి భయమెందుకు, దైన్యమెందకు, అని వీరోచితంగా, ధైర్యంగా భర్తకు కర్తవ్యాన్ని ఉపదేశిస్తుంది. మండోదరి తన మాటలతోనే భర్తలోనే పౌరుష,రోషాలను రెచ్చగొట్టుతుంది. అతనికి వీరస్వర్గానికి దారి చూపెడుతుంది.

పగవారైన పురుషులు తమ మధ్య ఉండే ప్రతీకారా లను తీర్చుకోవడానికి స్త్రీలనొక సాధనంగా వాడు కుంటారు. రామ సంహారం కొరకు హోమం చేస్తున్న రావణుని ఏకాగ్రతను భగ్నం చేయడానికి, మండోదరిని వానరులు హింసిస్తారు, అవమానిస్తారు. మొల్ల పురుషుల స్వభావాన్ని మండోదరిని హింసించిన వానరుల ప్రవర్తనలో ఆరోపించింది.

మొల్ల రామాయణంలో మండోదరి తర్వాత శబరిని పేర్కొనవచ్చు. మొల్లకు శబరి భక్తిపైన ఆరాధనా భావం ఉన్నట్లు ఆమె రచన వల్ల తెలుస్తుంది. ఆమె భక్తిపైన ఉండే గౌరవం వల్లనే మొల్ల మూడు పద్యాల్లో ముచ్చటగా శబరిని వర్ణించింది. ఘనముక్తి వధూ విలాస శబరి రాముణ్ణి సద్భక్తితో పూజించి సుగ్రీవుణ్ణి స్నేహితునిగా చేసుకొమ్మని సలహానిస్తుంది. వాల్మీకి రామాయణంలో కబంధుడు శాపవిముక్తుడై గంధర్వుడై సుగ్రీవునితో సఖ్యం చేసుకొమ్మని సలహానిస్తాడు. మొల్ల మాత్రం శబరియే రామునికి సలహానిచ్చినట్లు చేసిన మార్పు, శబరి రామభక్తికి ఔచిత్యపు తీర్పు. మొల్ల కల్పించిన ఈ కల్పన ఆమెకు శబరిపైనుండే భక్తిశ్రద్ధలకొక ప్రతీక.

పాత్రచిత్రణలోనే గాక వర్ణనలోను, మొల్ల స్త్రీ మనస్తత్వం ప్రదర్శితమవుతుంది. స్త్రీలకు ఆచార వ్యవహారాలపైన పట్టింపెక్కువ, అభిమానం అధికం. సీతారాముల వివాహఘట్ట సందర్భంలో తెలుగువారి పెళ్ళివేడుకులను, ఆచారాలను వివరంగా వివరిస్తుంది. జనక మహారాజు శుభలేఖను రాయించి పంపడం నుండి అల్లుళ్ళను ఘనంగా అరణాలతో సత్కరించి సాగనంపే వరకు మొల్ల విశదంగా వర్ణిస్తుంది.

శ్రీరామ పట్టాభిషేక నిర్ణయానంతరం సూర్యుడస్తమిస్తాడు. చీకటి వ్యాపిస్తుంది. ఆ చీకటి నల్లటి కాటుకవలె, మినుముల రాశివలె ఉన్నదని వర్ణించడంలో మొల్ల స్త్రీహృదయం వ్యక్తమవుతుంది. "వెన్నెల్లో భామినులు శారదలైరి" అని స్త్రీలను సరస్వతీమూర్తులుగా వర్ణించి స్త్రీ పక్షపాతాన్ని చూపెట్టుకుంది.

స్త్రీలకు పువ్వులమీద, నగలమీద మక్కువ ఎక్కువ. మొల్ల వర్ణనలో కూడ వేగుచుక్కలను చేమంతిబంతిగా వ్రేళ్ల చివర్ల చిమ్మిన నెత్తుర్లను కెంపుల మాదిరిగా ఉన్నాయని వర్ణిస్తుంది. చీకటిని ఇంద్రనీలమణులతోను పోలుస్తుంది. సంధ్యాసమయం, చీకటి కలసిన దృశ్యం నీలం, కెంపు అతికినట్లుగా ఉందని చెప్పుతుంది. సీత కోరిన లేడి ఒడలెల్లను బంగారం, పొడలెల్లను రత్నసమితి బోలిన మెరుపులతో ఉన్నదని మొల్ల వివరిస్తుంది. ఆ లేడి అందానికి ముగ్ధురాలైన సీత కూడ సామాన్య స్త్రీవలె దాన్ని తెచ్చివ్వమని రాముణ్ణి వేడుకుంటుంది. రావణుని బందీ అవుతుంది.

స్త్రీకి జీవితంలో మాతృత్వం మహనీయమైన సంఘటన. కౌశల్య, కైకేయిలు గర్భవతులైన తర్వాత వారి శారీరక మార్పులను రెండు సీసపద్యాల్లో వివరిస్తుంది. ఈ వివరణలు పామర స్త్రీల జానపద సాహిత్యంలో కూడ కన్పిస్తుంటాయి. పండితులైనా, పామరులైనా స్త్రీల ఆలోచనా విధానం ఒకటే అని స్పష్టమవుతుంది.

మొల్ల తన రామాయణంలో సీతను, ధీరను, పతివ్రతగానే గాకుండ పాకశాస్త్ర ప్రవీణురాలిగా కూడ చిత్రించింది. అరణ్యకాండలో రాముడు సీతను స్మరించుకుంటూ "నీ చేతి కందములాది భోజనములు మధురభోజనము లగును" అని అంటాడు. విరహ బాధతో కృషించి పోయినప్పుడు అతనికి "కూరలు నోటికి రుచించలేదని" స్త్రీ సహజమైన మనస్సుతో మొల్ల ఆవేదన చెందుతుంది.

ప్రకృతిని స్త్రీకి ప్రతిరూపంగా ప్రాచీనులు భావించారు. రాముడు కూడ విరహబాధతో ప్రకృతిలోని పువ్వుల్లోనూ, చెట్లలోనూ, లేళ్లలోనూ సీతను చూచుకుంటాడు పరితపిస్తాడు. రామాయణ కథను అతి సంగ్రహంగ కథనం చేసిన మొల్ల తన కాలం నాటి ప్రబంధ పోకడలననుసరించి పురవర్ణన, విరహవర్ణన సూర్యాస్తమయ సూర్యోదయ వర్ణన, వర్షర్తువు వర్ణనలతో తాను కూడ ఇతర పండిత మన్యులతో సమానురాలనని నిరూపించుకుంది.

❀ ❀ ❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆంధ్ర కవయిత్రులు - కవితా దృక్పథం

- డా॥. డి. ఉదయకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

## ప్రాచీనాంధ్ర సారస్వతంలో స్త్రీ :

రామాయణంలో "ఏ దేశంలోనైనా భార్య దొరుకుతుంది గానీ సోదరుడు లభించడని రాముడనటమూ" ఉంది. ఊర్మిళ నిద్రకూడా ఆనాటి స్త్రీ స్థితిని తెలుపుతుంది. అదేవిధంగా ద్రౌపది పాత్ర ఆమె ఇష్టంతో ప్రమేయవమే లేని పరిస్థితి. తరువాత ప్రబంధయుగాన్ని తీసుకుంటే స్త్రీ వర్ణన శృంగారభూయిష్టమైంది. "శ్రీకాళహస్తీశ్వర శతకం'లో ధూర్జటి "సంసారం మోక్ష సాధనానికి అడ్డంకి అని, సంకెల" అని అంటాడు. 'సుమతీశతకం'లో కూడా "అంగన నమ్మరాదు" అనే మాటలు మనం చదివాం. ఇంకా కొంతమంది కవులలో స్త్రీకి సముచిత స్థానాన్నిచ్చారనిపించదు. ఆనాటి సామాజిక నేపథ్యాన్ని అనుసరించి, కావ్యాల్లో స్త్రీ స్థితిగతులు ఉండిఉండవచ్చు. ఆ సమయంలో వచ్చిన కావ్యాల్లో స్త్రీ వర్ణనలు ఆ విధంఆ ఉండి ఉండవచ్చు.

ప్రబంధ యుగము తరువాత పన్నెండవ వతాబ్దంలో అంటే ప్రబంధ నాయికల వర్ణనలు శృంగార భూయిష్టమై, కావ్యాలలో రసడోలికలూగిస్తున్న తరుణమది ఆ సమయంలోని ప్రదానంగా కవయిత్రులను సంస్కృత, ఆంధ్ర కవయిత్రులని వర్గీకరించవచ్చు. అటువంటి నేపథ్యంలో పన్నెండవ శతాబ్దంలో చానమ్మ, ప్రోలమ్మలు (13వ శతాబ్దం) చాటువులను చెప్పిన తొలి తెలుగు కవయిత్రులుగా మనకు కనిపిస్తారు. తరువాత తాళ్ళపాక తిమ్మక్క మొల్ల (15వ శ.) చిన్నాదేవి, మోహనాంగి, బాలపాపాంబ అనామిక వేశ్య, మరొక మొల్ల (16వ శ.) ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ, (18వ శ.) సిద్ధిపాని, అనామిక వారకాంతలు. 19వ శతాబ్దంలో కూడా కవయిత్రులున్నారు. వారు దార్ల సుందరమ్మ, మతుకుల పల్లి జానకమ్మ, అనామిక వారకాంత, బలభద్రదాశి మొదలైనవారు ఆంధ్ర కవయిత్రులుగా కనిపిస్తారు. తరువాత శతక కవయిత్రులు, యక్షగాన కవయిత్రులు కూడా కనిపిస్తారు.

ప్రబంధయుగంలో కవులు ప్రధానంగా కావ్యాలు రాస్తున్న తరుణంలో, అందునా స్త్రీకి సముచితమైన గౌరవాదారాలు తక్కువగా ఉన్న, ఆ నేపథ్యంలోంచి ఒక స్త్రీ కవయిత్రిగా కావడమనేది చాలా గొప్ప విషయం. ఆనాటి సామాజిక పరిస్తితులలో కవయిత్రులు పుట్టుకు రావడం, వారి కావ్యాలకు ఆదరణ లభించడమనేది, ఆనాటికది సాధారణమైన విషయం కాదు.

## కవయిత్రుల కవితా దృక్పథం :

ఆనాడు మతం, భక్తి సమాజంలో ప్రధానమైన అంవాలుగా ఉండేవి. ప్రాచీనాంధ్ర కవయిత్రులందరూ దాదాపుగా తీసుకున్న వస్తువు భక్తి ప్రధానమైందే. హిందూ మత ప్రవర్తకమైనదే. కవిత్వానికి సబంధించి ప్రముఖంగా భక్తి &ప్రకటనే కన్పిస్తుంది. ఒక్కొక్క కవయిత్రిలో ఒక్కొక్క భావన, భక్తి ప్రభావం కన్పిస్తాయి. అయితే కవయిత్రులు స్వభావ చిత్రణే వారి కవితా దృక్పథంగా చెప్పుకోవాలి. ఆనాటి సామాజిక నేపథ్యం, స్త్రీ సహజ స్వభావం వారి కవిత్వంపై ప్రభావాన్ని చూపాయి. ప్రాచీనాంధ్ర కవయిత్రులందరు స్త్రీ స్వభావ చిత్రణలో బాహ్య ప్రవృత్తుల్ని, అంత:ప్రవృత్తుల్ని స్పష్టంగా గుర్తించి, రచనలు సాగించారు. వారి మనస్సులోని భావాల అభివ్యక్తీకరణే వారి కవితా దృక్పథంగా చెప్పుకోవచ్చు. కవయిత్రుల అనుభూతుల వ్యక్తీకరణను కూడా వారి కవితా దృక్పథంగా మనం చెప్పుకోవచ్చు. కొన్ని అనుభూతులు స్త్రీకి మాత్రమే సొంతమై ఉంటాయి. ఆది పురుషుని అనుభవానికి, అనుభూతులకు అందవు. ఉదాహరణకు స్త్రీ సహజమైన సిగ్గు, ఇటువంటి భావ వ్యక్తీకరణను స్త్రీ చేసినట్టు పురుషుడు చెయ్యలేడు.

వీరిలో తాళ్ళపాక తిమ్మక్క, ఆదుకూరి మొల్ల, ముద్దు పళని, తరిగొండ వెంగమాంబ మొదలైన కవయిత్రులను ప్రధానంగా తీసుకుని వారి కవితా దృక్పథాన్ని చర్చిస్తారు.

**తాళ్ళపాక తిమ్మక్క :**

దేశికవిత్వంలో రచనలు చేసినది పదకవితాపితా మహుడైన అన్నమయ్య ధర్మపత్ని తిమ్మక్క ప్రాచీన కవయిత్రులు స్త్రీ స్వభావాలకు అనుగుణమైన కథల్నే ఎన్నుకున్నారని చెప్పుకోవచ్చు. కవుల రచనల్లో కంటే కవయిత్రుల రచనల్లో స్త్రీ స్వభావ చిత్రణ మనకు స్పష్టంగా కన్పిస్తుంది. యవ్వనంలో ఉన్న స్త్రీలలో కొన్ని కలలు, కొన్ని ఊహలూ ఉంటాయి. అవన్నీ వివాహం పైన వచ్చే ఊహలే. తిమ్మక్క "సుభద్రా కళ్యాణం"లోని వస్తువును ఎన్నుకోవడానికి బహుశా కారణం అదే కావచ్చు. "కళ్యాణ దృశ్యం" స్త్రీలో ఒక చెరగని ముద్ర, చెదరని నిజం. స్త్రీ జీవిత పునాది భావాలపై ఏర్పడినదే. ఈ కళ్యాణం అనే ప్రక్రియ.

భారత కథాభాగంలోనిదే 'సుభద్రాకళ్యాణం' 'భారతం'లో కానీ 'సుభద్రా కళ్యాణం'లో కానీ సుభద్రార్జునుల వివాహం బహురమ్యం. సుభద్రార్జునుల వివాహానంతరం ధర్మరాజు, ద్రౌపదికి సుభద్రార్జునుల కార్యాన్ని జరిపించమని అప్పగిస్తాడు. ఆ సమయంలో ద్రౌపది అనుభవించిన బాధను తిమ్మక్క వర్ణించిన తీరు అద్భుతం. ఒక స్త్రీ పడే మానసిక వేదనను సహజంగా, తాను స్త్రీ గనుక వర్ణించగలిగింది. ద్రౌపది మానసిక స్థితి వర్ణనిది. ఆ సమయంలో రకరకాలు ఆలోచనలు ద్రౌపదీ దేవిని ముసురుకుంటున్నాయట. మనసు మూగబోతున్న దట. పళ్ళు బిగించి పాంచాలి కార్యానికన్నీ ఏర్పట్లు చేసిందట. ద్రౌపదీ దేవిలో చెలరేగిన బడబాగ్నిని ఈ పద్యం ద్వారా వ్యక్తం చేవారు కవయిత్రి.

"ఏమి వస్తువులైన నియవచ్చుగాని
ప్రాణేశునిచ్చి మఱి బ్రతుకంగరాదు
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని"
......................................
...................................... (సు.క.52)

స్త్రీకి సిగ్గే అందం, ఆభరణం. రకరకాలైన సన్నివేశాల్లో సిగ్గు ప్రకటితమైంది సుభద్రాకళ్యాణంలో. సిగ్గు స్త్రీ సహజసిద్ధమైన ఒక చర్య. శ్రీకృష్ణుడు సుబద్రను మునివేషధారియైన అర్జునునికి సేవ చెయ్యడానికి పంపడం జరుగుతుంది. ఆ సమయంలో కాషాయ వస్త్రాలను ధరించిన అర్జునుడు అకస్మాత్తుగా సుబద్ర చెయ్యి పట్టుకోవడం జరుగుతుంది. ఈ హఠాత్పరిణామా నికి సుభద్ర జలదరించి సిగ్గుతో పారిపోవడం జరుగు తుంది. స్త్రీలు పడే సిగ్గు, బిడియాలను చాలా చక్కగా వర్ణించింది తిమ్మక్క.

యౌవనంలో కనిపించే ఆంగిక విన్యాసాన్ని సుభద్ర పాత్రద్వారా చూపించారు తిమ్మక్క. కృష్ణుడు సుభద్రను రమ్మని కబురు పెట్టినపుడు సుభద్ర నడిచివచ్చే తీరును అత్యద్భుతంగా వర్ణించారు కవయిత్రి. ఈ అందమైన వర్ణనలు కథాముఖంగా చేసినా, తాను స్త్రీ సహజమైన భావాలను అనుభవించి, తరువాత గావించిన రచన గనుక తన మనస్సులోని భావాలను సుబద్రపాత్రలో ప్రవేశపెట్టి తన కవితాదీక్పథాన్ని చాటారు తిమ్మక్క.

ద్రౌపది పడే ఆవేదవనను, సవతిని చూసి ఆమె మనస్సు రగిలిపోయే తీరును ఈ కావ్యంలో మనం గమనించవచ్చు. లలిత శృంగారాత్మకంగా దేశీయత వెల్లి విరిసేట్లు, ఆనాటి ఆచార వ్యవహారాలను ప్రతిబింబచే టట్లు, లోక సహజాలైన స్వభావాలు ఈ కావ్యంలో ప్రకటిత మైనాయి.

**మొల్ల :**

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారన్నట్లు శారదాదేవీ విమల దరహాసరేఖయే మొల్ల రామాయణం. రామా యణ, భారతాలు రెండూ ఆదర్శగ్రంథాలే. రామాయణ సంగ్రహ కావ్యాల్లో మొల్ల రామాయణమే విశిష్టమై కీర్తిని గడించింది. ఈ అద్భుతమైన రచనను సైతం నిరాకరిం చడం. శూద్రకుల సంజాత రచన వెనుక ఆమె కవిత్వం నిషిద్ధమనడం జరిగాయి. కానీ మొల్ల రామాయణానికున్న ప్రవస్తి, ప్రాచుర్యాలు తక్కిన సంగ్రహరామాయణాలకు,

లేవన్నది నిజం. ఎన్నిమార్లు సుతిస్తే మాత్రం మాత్రం "తప్పుకల్గునే"? అని ప్రశ్నించింది మొల్ల. తనకన్నా ముందొచ్చిన రామాయణాలు సంస్కృత భూయిష్టమై, సామాన్య ప్రజలకు అర్థంకాని రీతిలో ఉన్నాయని చెప్పిన ధైర్యవంతురాలు మొల్ల. మొల్లం రామాయణం పద్య కవిత్వమైనప్పటికీ తేటతెలుగు మాటలతో సులబంగా అర్థమయ్యే రీతిలో ఉన్నది. కనుకనే అంతటి ఆదరణను పొందగలిగింది. సహజంగా ఈమె స్త్రీ కావడం వల్ల త్రిమూర్తుల దేవేరుల వర్ణనలోనిప్రత్యేకత ఈ రామాయణ పద్యంలో భాసించింది. అదేవిధంగా లక్ష్మీదేవి వర్ణన ఉదా॥.

"సామజయుగ్మ మింపలర జల్లని నీరు పసిండికుండలన్
వేమఱు సంచివంచి కడువేడుకతో సుభిషిక్త జేయగా
దామర పువ్వు గద్దియ ముదంబున నుండెడి లోక మాత మా
కాముని తల్లి సంపద లఖండముగా నిడు మాకు నెప్పుడున్"

ఇందులో 'కాముని తల్లి' అనే పదాన్ని వెయ్యడం మొల్ల ప్రత్యేకత. స్త్రీత్వాన్ని దాతృత్వమూ మాతృత్వాన్ని కూడా పై పదంలో మనం చూడవచ్చు.

సహజంగా భర్తను పొగడడం స్త్రీ స్వభావం. ఇక్కడ సీత రావణునితో ఈ విధంగా అంటుంది.

"నీ పరాక్రమం కేవలం భౌతికమూ, పాశవికమూ మాత్రమే. అందులోనూ నీవు నీచగుణరతుడవై సగము హీనసత్త్వుడవైనావు."

హనుమంతుడు. లంకలో సీతమ్మను వెదికి ఎక్కడా ఆమె జాడ కనిపించకపోతే "త్రంతు విదాత జందెములు" అంటాడు. ఇక్కడ మొల్ల స్వభావ పరిశీలనా నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. అలాగే సహజంగా స్త్రీలకుండే ఆభరణాలపై మక్కువ "నీతి చందాన ఇంద్రనీల మహిమ" అనే దానిలో స్పష్టమౌతుంది. ప్రకృతి రామణీయకం లోని, ప్రతి భాగంలోనూ ఆమె కవితా హృదయం గోచరిస్తుంది.

స్వభావ సిద్ధంగా వర్ణించడం మొల్లలోని ప్రత్యేకత అంత:పురాలలో ఉన్న సీతమ్మ అడవులలో వెళ్లూ ఉన్న ఆ స్థితిని వర్ణించిన తీరు స్త్రీ సహజమైన సౌకుమార్యాన్ని మొల్ల అనుభవించినది కనుక ఆ రాసిన తీరు సహజ సిద్ధంగా అత్యద్భుతంగా ఉన్నది. సీతాసాధ్వి శీల సంపదను మలచిన తీరులో మొల్ల మహనీయమైన కవితాశిల్పం మనకు గోచరిస్తుంది. సీతాదేవి ఔన్నత్యాన్ని చాటి చెప్పటడంలో మొల్ల కృతకృత్యురాలైంది.

**తరిగొండ వెంగమాంబ :**

వేంకటేశ్వరుని అనుగ్రహంతో జన్మించడం వలన 'వేంగమాంబ' అని నామకరణం జరిగింది. వెంగమాంబ కృతులు పద్దెనిమిది. వీటిలో నారసింహ విలాసకథ. రుక్మిణీనాటకం, గోపికానాటకం ద్విపద భాగవతంలో చివరి ఆరు స్కంధాలు అలభ్యం. తక్కినవి లభ్యాలే వాటిలో శివనాటకం, కృష్ణనాటకం శ్రీ భాగవతంలోని మొదటి ఆరుస్కంధాలు అముద్రితాలు మిగిలిన తరిగొండ నృసింహశతకం, విష్ణుపారిజాతం, రమాపరిణయం, చెంచునాటకం, శ్రీకృష్ణమంజరి, వేంకటాచల మహాత్మ్యం, అష్టాంగ యోగసారం, ముక్తికాంతా విలాసం, తత్త్వకీర్తనలు, వాసిష్ఠరామాయణం భాగవతంలో కొంత భాగం ముద్రితాలు. శతకాలు,యక్షగానాలు, కీర్తనలు, కావ్యాలు, పురాణాలు రాసిన బహుగ్రంతకర్త్రి వేంగమాంబ. వెంకగమాంబ తొలి తరానికి చెందిన కవయిత్రులలోనేగాక, అగ్రశ్రేణికి చెందిన కవయిత్రులలో కూడా స్థానాన్ని సంపాదించుకొన్న అద్వితీయ ప్రతిబా సంపన్నురాలు. ఆంధ్రవాఙ్మయ జగత్తులో విశిష్ట వ్యక్తిత్వంలో విలసిల్లు మమాకవులలో, కవయిత్రీమ తల్లుల్లో గననీయ సారస్వతమూర్తి.

భాగవత రచనకు ఆద్యుడు పోతనామాత్యుడైతే ద్విపద భాగవతానికి వేంకగాంబ గుర్తుకు రావడం సహజం. ఈమె దృక్పథం మొదటి నుండీ ఆధ్యాత్మికమే. బహిక జీవన పరిస్తితులు కూడా పారమార్థిక దృక్పథానికి దారితీశాయి. ఆమ కృతులన్నీ ఆమెకున్న వేదాంత

ధోరణిని, మోక్షకాంక్షను వెల్లడిస్తున్నాయి. ఆమె కవితా ప్రతిభ ఆమె కృతులలోని తాత్త్విక సందేశాన్ని తెల్పుతున్నది. నిజజీవితంలో ఛాందన సాంప్రదాయాలను ఎదిరించి నిలువగలిగిన కవయిత్రిగా వేంగమాంబను మనం చెప్పుకుంటున్నాం.

వేంగమాంబకు వెంకటాచలపతితో వివామం చెడింది. "కేశఖండనానంతరం మళ్ళీ వెంట్రుకలు మొలవకుండా ఉంటాయా?" అని ప్రశ్నించింది. "తలలు బోడులైతే తలపులు బోడులా" అన్నది. కానీ వేంకటేశ్వరుణ్ణే తన మనస్సులో భర్తగా ఊహించుకున్న స్త్రీమూర్తి వేంగమాంబ. ఆమెకు ఇహంతో పనిలేదు. ఆమె భర్త మరణించగానే వెంట్రుకలు తీయననడంలోని ఉద్దేశ్యాన్ని లౌకికంగా ఇక్కడ తీసుకోకూడదు. ఎందుకంటే ఆమె భర్తైన వెంకటాచలపతిని ఆమె భర్తగా అంగీకరించలేదు. ఇక్కడ ఆమె తాత్త్వికతనే మనం గుర్తించవలసి ఉంటుంది.

ఆమె వేదాంత రచనలలో ఆమె ఆత్మీయాంశ మనకు గోచరిస్తుంది. అక్కడక్కడ సుకుమారంగా చేసిన సంఘ విమర్శ కూడా ఆమె దృక్పథంలో నవ్యతా ప్రదర్శనకు ఆలంచనాలైనాయి. తాత్త్విక సందేశం అందిస్తూనే స్త్రీగా సాంఘికాచారాలను ఎదిరించే చొరవ ఈమె రచనలో కన్పిస్తుంది. స్వభావత: వేదాంతి కనుక ఆమె రచనలలో ఈ ధోరణి ప్రతిఫలించింది. యోగసాధనమొనర్చిన యోగినిగా ఈమె కనిపిస్తుంది. 'శివనాటకము' మొదలైన కృతులలో తన అద్వైత మతత్వాన్ని ప్రదర్శించింది. నిత్యజీవితంలో తాను ఆచరించి, ప్రబోధించిన వేదాంతం ఆమె కృతులన్నిటిలో ప్రతిబింబించింది. చిత్తశుద్ధిలేని కర్మాచరణాలను ఆమె తిరస్కరించింది.

వెంగమాంబ రచనలో అక్కడక్కడ నన్నయ, మొల్లల ప్రభావాలు కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. ఉత్తమమైన రాజయోగాన్ని "రాజయోగామీతసారం"లో వివరించారు కవయిత్రి. రాజయోగం సారాంవాన్నిందులో చెప్పారు వేంగమాంబ. యోగశాస్త్ర గ్రంథాల్లో తరిగొండ వెంకగమాంబ రచనలకొక ప్రత్యేకస్థానం ఉందని చెప్పవచ్చు.

తిరుమలలో రచించిన మొదటి కృతి "విష్ణుపారిజాతం" మనే యక్షగానం ఆమ్కొఉ స్వతస్సిద్ధమైన భక్తి ఇందులో ప్రకటితమైంది.

పదిహేడవ శతావబ్దిని 'యక్షగానవాఙ్మయం' వికాస దశగా 18వ శతాబ్దిని పరిణతిపొందిన దశగానూ పరిగణిస్తారు. తరిగొండ వెంకగమాంబను యక్షగాను కవుల్లో ప్రథమగణ్యగా పేర్కొనవచ్చు. తొమ్మిది యక్షగానాలను రచించింది. వెంగమాంబ. 'ద్విపద' ఈ కవయిత్రికి ప్రియమైన దేశిఛందస్సుగా చెప్పుకోవచ్చు. 'ద్విపద' వేంకగమాంబ, వాఙ్మయ జీవితంగా చెప్పుకోవచ్చు.

**ముద్దుపళని :**

ఈమె అసలు పేరు 'పళని' 'ముద్దు' అనేది బిరుద నామం. విద్వత్కవయిత్రి. భగవత్ కైంకర్యాన్ని, భాగవత కైంకర్యాన్ని సమానంగా చేపట్టిన భక్తురాలు. ఈమె రచించిన శృంగార ప్రబంధం 'రాధికాసాంత్వనం' ఈ గ్రంథానికే 'ఇళాదేవీయమనే' పేరుకూడా ఉంది.

ఇళా కృష్ణుల వివాహం, రాధావిరహం, అటు తర్వాత చిలుక రాయబారం, శ్రీకృష్ణుడు, రాధను అనునయించడం ఇందులోని ఇతివృత్తం.

సాంత్వనమంటే ఓదార్చడం. రాధ, ఇళకు, కృష్ణుడికి వివాహానంతరం, నిషేకానికి సిద్ధంచేసి, తను వెళ్ళిపోతుంది. తన ప్రియుడైన కృష్ణుణ్ణి ఇంకొక ఆడుదాని వశం చేసిన రాధ మనస్సు పడే ఆవేదన, ఆమె మానసిక స్థితి ఒక స్త్రీగా ముద్దుపళని సహజ సిద్ధంగా వర్ణించింది. తెల్లవారిన తరువాత వారి నిషేకం గదికి వెళ్ళి తలుపు తడుతుంది రాధ. ఇదిస్త్రీ ఆగ్రహావేశాలు, తొందరపాటును చెప్పకనే చెబుతున్నాయి. విధిలేక కృష్ణుణ్ణి, ఇళను అమ్మగారింటికి పంపింది రాధ. కానీ కృష్ణుని వియోగాన్ని భరించలేకపోయింది.

ఈ ప్రబంధంలో ఇళాకృష్ణుల శృంగార కేళీ విలాసాలు, అలాగే రాధాకృష్ణుల శృంగారం మోతాదుకు మించి

ఉన్నదనే చెప్పవచ్చు. ఈ కావ్యంలో పాత్రచిత్రణ, వారి మానసిక భావాలు వారి చర్యల ద్వారా వ్యక్తం చేయించింది కవయిత్రి. ఇళ పాత్రను అద్భుతంగా చిత్రీకరించడం వల్ల ఇళా దేవియం అనే పేరు ఈ కావ్యానికి మరో పేరైంది కవయిత్రి. వ్రేపల్లె వర్ణన, తంజావూరులోని భోగలాలసత్వాన్ని సైతం కావ్యంలో పెట్టింది. ఈ కావ్యంలో శృంగారం పాలు ఎక్కువైందనే విమర్శ ఉండనే ఉంది. ఒక కవయిత్రి అయి ఉండి ఇంతటి శృంగార కల్పితాలను పాత్రల మధ్య కల్పించడం ఆశ్చర్యమే. ఈ కావ్యాన్ని కవయిత్రి బాలకృష్ణునకే అంకితమిచ్చింది. స్త్రీ హృదయాభావాలను చాలా సున్నితంగా చిత్రించింది. తానొక స్త్రీ అయి ఉండి అంతటి శృంగార భావాలను వెలయించడం సాహిత్య లోకన్ని అబ్బురపరచింది.

కాని ఏది ఏమైనా ఈమె రచనా మాధుర్యం మెచ్చుకోదగింది. మధుర శృంగార భావాలను, రాధికా కృష్ణుల పవిత్రప్రణయాన్ని వర్ణించిన ముద్దుపళని విశిష్ట కవయిత్రి అని చెప్పక తప్పదు. రస మధువులున్న రసమయ కావ్య ప్రసూనమీకావ్యం.

పైన చెప్పుకున్నప్పటికీ ఈ కావ్యాన్ని లౌకిక దృష్టితో చూసే వీలు లేదు. ఎందుకంటే ఈ కావ్య నాయకుడు శ్రీకృష్ణుడు. కవయిత్రి వర్ణించింది లీలామానుష విగ్రహమైన పరమాత్ముడ్ని. కృష్ణుడు లౌకిక నాయకుడు కాదు. ఇక్కడ రాధాకృష్ణుల శృంగారాన్ని పారలౌకికదృష్టితోనే చూడవలసిన అవసరముంది. రాధాకృష్ణుల పవిత్ర ప్రణయానికి లౌకికతత్వాన్ని ఆపాదించడం సరికాదు. వీరి ప్రణయం పారలౌకికం. ఇక్కడ మళ్ళీ మధురభక్తి కూడా కనిపిస్తూ ఉంది. రాధ జీవిత్మ, కృష్ణుడు పరమాత్మ. జీవిత్మ, పరమాత్మకై పడే ఆరాటమే మధురభక్తి. కవయిత్రి సాక్షాత్తు భగవంతుని శృంగారాన్ని వర్ణించింది. అందునా ఆమె కృష్ణభక్తురాలు. కనుక ఈ ప్రబంధాన్ని పారలౌకిక శృంగార ప్రబందంగా భావించవచ్చు. ఈ విధంగా కవయిత్రుల భావ వ్యక్తీకరణమే వారి కవితా దృక్పథంగా చూడవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష, - జి. నాగయ్య
2. ఆంధ్ర విదుషీమణులు - ఆండ్ర శేషగిరిరావు
3. ప్రాచీనాంధ్ర కవయిత్రులు - స్త్రీ స్వభావ చిత్రణ, - ఆచార్య కె.సత్యోత్తమరావు
4. 20వ శతాబ్ది తెలుగు కవిత్వం - డా.కడియాల రామ్మోమన్‌రాయ్
5. మాతృశ్రీ తరిగొండ వెంకగమాంబ కృతులు పరిశీలనము (సిద్ధాంతగ్రంథం) - ఆచార్య కె.జె.కృష్ణమూర్తి.

# పాతివ్రత్య ధర్మానికి ప్రతీక - సీత

- **డా॥. వి. శ్రీదేవి,** కళాశాల అధ్యక్షులు, చేబ్రోలు ప్రభుత్వ కళాశాల, గుంటూరు జిల్లా.

సీత అనగా 'నాగటిచాలు'లో జనకునికి లభించిన పుత్రిక. కనుక ఆమె జన్మనిబట్టి కూడా సీతాదేవి పాత్ర - దివ్యమైనది. త్రేతాయుగంలో భగవంతుడు ఏకపత్నీ వ్రతుడు. ద్వాపరయుగంలో బహుపత్నీవ్రతుడు. కాని రాముడు క్షత్రియుడు, దశరాధాత్మజుడు! ధర్మమెరిగిన వాడు. జన ప్రియవాది. అట్లే - సీతాదేవి పతివ్రతా శిరోమణి. ఆమె పాతివ్రత్యమే - ఆమెకు రక్షణ కవచం. నేటికి ఉత్తమ, లేదా ఆదర్శదంపతులు ఎవరంటే - సీతారాములే! రాముడు ధర్మమూర్తి; సీత కూడా ధర్మ స్వరూపిణి.

రావణాసురుడు పుష్పకవిమానంలో పతివ్రత అయిన సీతను అపహరించి వస్తున్నప్పుడు సీత తెలియక ఒకరకమైన మూర్ఛలోపడి రావణుని తాకినది. అంతేగాని ఉద్దేశపూర్వకంగా మాత్రం కాదు. అందుచేత రాముడు లేనప్పుడు రావణాసురుడు ముని వేషధారణలో వచ్చి సీతను అపహరించాడు. సీతాదేవి అశోకవనంలో రెండవ జన్మమెత్తిన దానివలె విలపిస్తున్నది. మంచి ఆచారము, నడవడిక, సంప్రదాయము ఉన్న ఇంటిలో పుట్టి, నీచ కులము వానిని పెండ్లాడి, అక్కడ ఆ కులంలో తిరిగి జన్మించిన దానివలె, సీతాదేవి దు:ఖానుభవంతో ఉన్నది. అయినప్పటికీ రామ ధ్యానంతోనే ఉన్నదేతప్ప, వేరే ధ్యాస లేదు. ఇంతకన్నా పతివ్రతాధర్మం మరేముంటుంది. ఒంటరిగా ఉన్న సీతకు రాక్షసకాంతలు చేరువగా ఉన్నారు. వారు రావణుని వరించవలసినదిగా, సీతకు ఎంతగానో చెప్పారు. అయినప్పటికీ సీతాదేవి వినలేదు. పైగా తిరస్కరించింది.

ఒక ఉన్నత వంశంలో (జనకునికి) పుట్టి మరొక ఉన్నత వంశంలో (దశరథునికి) మెట్టినింటికి పోయిన నేను నీకు వశం కానని, రావణునితో పలికింది. కావున నేను నీకు పరస్త్రీని, నీకు ఉపయోగపడు భార్యను కాను. కనుక దేశ, కాల, పాత్రల పరిస్థితులకు అనుగుణమైన ధర్మం పాటించవలసినదిగా చెప్పింది. పరుల భార్యలను కామించినచో అతని ఆయుర్భాగ్యములు నశించును. సజ్జనులు చెప్పిన మాటలు విని నన్ను రాముని చెంతకు పంపుమని చెప్పినది. రావణాసురుడు సీత మాటలను పట్టించుకోలేదు. తన వినాశనమును తానే తెచ్చు కున్నాడు. సీత ధార్మిక స్వభావం కలది. అందుచేత - నీతి హీనుడైన రాజు పరిపాలించే రాష్ట్రాలు, నగరాలు నశిస్తాయి అన్నది. రత్నమయ వస్తువులతో కూడిన లంక త్వరలో నశిస్తున్నది అని సీతాదేవి చెప్పింది. నీ ఐశ్వర్యము లకు, ధనములకు, సౌధములకు నేను లొంగిపోను! ఆశపెట్టి వశం చేసుకోలేవు. రామునకు నేను తగిన 'ధర్మపత్నిని'. కావున నన్ను రామునితో కలుపుము. అప్పుడే నీవు జీవింతువు. లేదా రాముని చేతిలో మరణిస్తావు అని రావణుని కోరికను తిరస్కరించడమే కాక ధిక్కరించింది. పైగా సవాలు చేసినది. ఇంతటి సాహసము రావణా సురునితో సవాలు చేసే శక్తి సీతాదేవికి ఎలా వచ్చింది? కేవలం రామధ్యానం వల్ల. రాముడు ధర్మస్వరూపుడు మహా పరాక్రమశాలి. సీత అతని ధర్మపత్ని కావడం వల్లనే భయపడక రావణాసురుణ్ణి ఎదురించింది. కొందరు ఏకాంతంలో లౌల్యానికి గురవుతారు. సమూహంలో ఆర్భాటంగా ఉంటారు. ఇలాంటి వారిని ఆదర్శంగా జాతి జనులు పూజింపరు. ఆనాటి ధార్మిక నియమం - ఒక భర్తకు ఒకే సతి! అదే సీతాదేవికి రక్షణదుర్గం! అంతేగాని ఆమెకు ప్రత్యేకంగా రక్షకభటులుగాని, దుర్గములు కాని లేవు. ధర్మమే అన్ని విధాలుగా ఆమెకు రక్షణ. లేకుంటే రావణాసురుడిని ఎలా సవాలు చేయగలిగింది? ఎలా తిరస్కరించింది? ఏల ధిక్కరించింది? కారణం ధర్మమే

మూలం. ఆ తేజమే సీతకు శక్తి సామర్థ్యాల్ని అనుగ్రహించింది.

రావణాసురునితో సీతాదేవి సందర్భాన్నిబట్టి పరుషంగా కూడా మాట్లాడింది. "ఓరి రాక్షసాధమా! ధర్మపత్ని అయిన నన్ను ఇన్ని మాటలు అనినావు. అందువల్ల ఎనలేని పాపం నీకు చుట్టుకుంటుంది. అంతేకాదు, నీవు వక్రదృష్టితో నన్ను చూస్తున్నావు. నీకళ్ళు, నేల రాలిపోవుగాక! దుర్భాషలాడిన నాలుక చీలిపోవుగాక! ధర్మదీక్షలోనున్న నేను రాముని ఆజ్ఞ లేనందువల్ల నిన్ను శపించేశక్తి ఉండికూడా, మిన్నక ఉన్నాను. నీవు పరుల భార్యలను అపహరించే దుర్మార్గుడివి. నీ వినాశనమును నీవే కొని తెచ్చుకుంటున్నావు. అందుచేత రాముడు ఒంటరివాడు కావచ్చు. అరణ్యవాసం చేయవచ్చు. అతడే నా భర్త. పైగా తల్లిదండ్రులు చేసిన వివాహం కనుక మాది సంప్రదాయబద్ధమైన దాంపత్యం. రాముడు సత్యసంధుడు. నేను ఆయన భార్యను. కనుక 'రాక్షస ధర్మము దేవకాంతలపై ప్రయోగించవద్దు' అని సీతాదేవి సాహసంతోనే రావణుని ధిక్కరించింది. పైగా లక్ష్మీ స్వరూపురాలు. రావణుడు రాక్షసుడు కావున ఇరువురికి దాంపత్యం తగదు. ఇంక దేవకాంత అయిన సీతాదేవికి, రాక్షస దాంపత్యం అసలు తగదు. ఈ విషయాలన్నీ సీతాదేవియే కాక తక్కిన రాక్షస కాంతలు కూడా రావణుడికి విన్నవించారు. అయినప్పటికీ రావణుడు రజోగుణం కలవాడు కనుక సీతాదేవి తిరస్కారానికి గురై క్రోధాన్ని వ్యక్తం చేశాడు. కొద్దిరోజులలో సీతాదేవిని తనకు వశం చేయవలసిందిగా రాక్షస కాంతలతో చెప్పాడు. అయినప్పటికీ సీతాదేవి అంగీకరించలేదు. ఇక పదే పదే సీతాదేవిని వాల్మీకి అగ్నిదేవునితో పోలుస్తున్నాడు. "అగ్నిదేవుని భార్య స్వాహాదేవి; ఇంద్రుని భార్య శచీదేవి వారు ఎట్లు పతివ్రతలో సీతాదేవి కూడా అట్లే పతివ్రతగా ప్రసిద్ధి కెక్కింది! ఇక్కడ గమనించ వలసిన విషయం ఒక్కటి ఉన్నది. ఇదంతా ధర్మ సూక్ష్మం. 'భక్తి' సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్నప్పటికీ అదే 'వ్యక్తి'ని 'శక్తివంతం'గా చేస్తుంది. అందుచేత నిజానికి రావణుని చూచి విఘ్నేశ్వరుడే భయపడ్డాడు. హనుమంతుడు కూడా మొదట భయపడ్డాడు. సీతమాత్రం భయపడలేదు". ఓహో! సీతను మించిన సాధ్వీమణి త్రేతాయుగంలో కానరాదు. ప్రపంచానికే ఆదర్శమైన మహిళ సీతాదేవి.

అరణ్యంలో సీతారాములు చిత్రకూట పర్వతం మీద విహరించి విశ్రాంతిగా ఉన్నారు. కాకాసురుడు సీత చెంతకువచ్చి స్తనమధ్యమునందు పొడిచి వెళ్ళాడు. పదే పదే ఆ కాకి అలాగే పొడిచింది. రాముడు ఆమె తొడమీద పవళించి ఉన్నాడు. నిద్రకు భంగమని కాకిని అదలించిందే తప్ప భర్తను లేపలేదు. కాకి ఆగడములు ఎక్కువ కాగా, రాముడు లేవగా, జరిగిన సంఘటనను సీత రామునికి చెప్పింది. అంతటితో రాముడు కోపించి బ్రహ్మాస్త్రాన్ని కాకిపైకి వదిలాడు. అది పరుగెత్తి పారిపోయింది. ఇంద్రుని, తక్కిన దేవతలను వరుణదేవుణ్ణి అందరినీ ఆశ్రయించగా, తమవల్ల కాదన్నారు. మరల కాకి రాముని చెంతకు వచ్చి, పశ్చాత్తాప పడింది. కరుణామయుడైన రాముడు కాకిని కాపాడాడు. అయినప్పటికీ బ్రహ్మాస్త్రం వ్యర్థం కారాదు. కనుక కుడికన్నుని మాత్రం అదే బ్రహ్మాస్త్రంతో పొడిచి రాముడు కాకిని వదిలాడు. అంతట ఆ కాకి బ్రతుకు జీవుడా! అనుకుంటూ స్వస్థానానికి వెళ్ళింది. ఇప్పుడు "పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం" అనే సామెత లోక ప్రసిద్ధంగా ఉంది.

సీత కోసం రాముడు ఉగ్రుడు (కోపం) కానక్కర లేదు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించనక్కరలేదు. కుడికంటిని పొడవడానికి ఒక దర్భపుల్ల చాలు! మరి ఎందుకింత ఆవేశం! అమోఘమైన అస్త్ర ప్రయోగం! అనగా రామునికి సీతాదేవి పట్ల గల అనురాగం ప్రకటితమౌతున్నది! ప్రకటం కావడానికి సీతాదేవి సౌందర్యమే కాక, పాతివ్రత్య ధర్మం కూడా కారణము.

అటువంటి కాకి కోసం బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. ఇక పది తలలుగల రావణాసురుని ఎందుకు సంహరించడు? అనగా ఈ విషయానికి హనుమంతులవారు సీతతో చెప్పిన సమాధానం - గమనించదగినది!. హనుమంతులవారు సీతాదేవితో 'రామచంద్రునికి నీ జాడ

తెలియలేదు. నా ద్వారా నీ జాడ తెలుసుకున్న తర్వాత రామ, లక్ష్మణులు, వానర సముదాయంతో లంకను నశింపజేస్తారు. రావణుని రాముడు సంహరించడం తథ్యం. అంతేల నా భుజాలపై నిన్ను కూర్చొన బెట్టుకొని, రాముని చెంతకు చేర్చగలను' అన్నాడు. అప్పుడు సీతాదేవి చెప్పిన సమాధానం లోకోత్తరమైనది! మహిళా జాతి గర్వించదగినది! అంతేగాక భావి కాలాలకు ఆదర్శమైనది. సీత హనుమంతునితో ఇలా అన్నది. రాముడు వచ్చి రావణుని సంహరించి, నన్ను అయోధ్యకు తీసుకొని పోవటం ధర్మం. అంతేగాని నీవు భుజములపై తీసుకొని పోవుట యోగ్యం కాదు. అంతేగాదు పరపురుషుల స్పర్శ కలలో కూడా నాకు సమంజసం కాదు! అని అన్నది. ఒకానొక 'వీరవనిత' తప్ప ఇలా సమాధానం ఇవ్వదు. రాముని తప్ప మరొకరిని ఉద్దేశ పూర్వకంగా తాకను అన్నది. అందుచేత ఆనాటి ధర్మధేనువు మూడు పాదా లతో సాగిపోయింది అనడానికి సీత 'పాతివ్రత్యం' చక్కని ఉదాహరణ. ఆత్మీయుడైన హనుమంతుడితోనే అలాగే అనగలిగినది. ఇక రావణునితో పరుషంగా కూడా మాట్లా డింది. ప్రారంభంలో ధార్మిక ప్రవృత్తి కలవారికి ఇబ్బందులు తప్పవు. అవి కూడా 'కషణసంస్కారం' కొరకే ఇలాంటి పరీక్ష దాదాపు ఎంత సహిస్తే, అంత ఉంటుంది. మహా పతివ్రత అయిన సీతాదేవికి కూడా ఎన్నో బెదిరింపులు ఎదురైనవి. ఇంక సహింపరాని సమయంలో మాత్రమే ధార్మిక ఫలితం ఉంటుంది. సీతాదేవికి కూడా ఇలాగే అనిపించింది.

"కృతఘ్నులకు చేసిన ఉపకారము నిరుపయోగమై పోయినట్లు, ఇన్నాళ్ళుగా అతి జాగరూకరాలనై కాపాడు కొనుచు వచ్చిన నా పాత్రివ్రత్యమును, నా సహసమును, నా ఈ ధరణీశయనవ్రతానుచరణమును, నా ధర్మ ప్రవృత్తియు, ఈనాడు నాకేవిధముగాను ఉపకరింపక వ్యర్థమైపోయినాయి అని విచారించింది.

ఇలా పాతివ్రత్య పరీక్షలు ఎన్నో పూర్తి చేసిన తరువాత దైవం సీతాదేవిపట్ల అనుకూలంగా మారింది. వెంటనే సీతాదేవికి కొన్ని శుభశకునములు కనిపించాయి. ఎడమ కనురెప్ప అదురుట, ఎడమ భుజము అదురుట, ఎడమ తొడ కూడా కదులుట, వస్త్రము గాలికి ఎగురుట మున్నగునవి! అప్పుడు సీతాదేవి గాలికి, ఎండకి ఎండి పోయిన ఒక విత్తనం జడివానకు అంకురించినట్లు సంతోషించింది. అంతేగాక ఆమె ముఖము కూడా రాహు విముక్తమైన చంద్రబింబం వలె ప్రకాశించింది. ఇక్కడ నుండి సీతాదేవికి కష్టములు ఉండవని త్రిజటకు వచ్చిన స్వప్నం నిజమౌతుందని భావింపబడాలి. శింశుపము అనే చెట్టు కొమ్మపై ఆంజనేయులవారు కూర్చొని, అంతా గమనిస్తున్నాడు. సీతాదేవితో సంభాషించే ప్రయత్నం చేస్తున్నాడు. శిష్ట వ్యావహారిక భాషలోనే ఆమెతో సంభాషించడానికి సిద్ధంగా ఉన్నాడు. ధార్మికవాతావరణ మంటే ఇలా వుంటుంది.

ఆయన, సీతకు ఆత్మబంధువు అయిన రాముని ప్రశంసిస్తూ భయం లేకుండా చేస్తున్నాడు. రామకథనే సంక్షిప్తంగా చెప్పాడు. "ప్రధానంగా శ్రీరాముడు రాజ ధర్మాన్ని కాపాడేవాడు. అంతేగాక ధర్మాన్ని నూటికి నూరుపాళ్ళు పాటిస్తున్నాడు. అందుచేత అతనికి ధర్మ స్వరూపుడని పేరు". ఇలా అన్ని విధాలుగా రామకథను చెప్పి, సీతాదేవికి నమ్మకాన్ని కలిగించాడు. సీతాదేవి ఆంజనేయులను చూడగానే విలపించింది. "నిజానికి వానరమూర్తి కలలోకాక జాగ్రదవస్థలోనే, వాస్తవంగానే సీతకు కనిపించాడు. కలలో వానరుడు కనిపిస్తే అశు భం అని శాస్త్రం. మరి సీతకు ఆంజనేయులు కనిపించడం కలకాదు. వాస్తవమే"!. అంతేకాక కనిపించిన వానరమూర్తి సంభాషించడం కూడా జరిగింది. కావున ఈ వానరుడు నా ముందుకు వచ్చినది, పలికినది, జరగబోయేది వాస్తవమగునుగాను గాక, అసత్యం కాకుండుగాక అని సీతాదేవి దేవతలను ప్రార్థించింది. ధర్మ ఫలితం కోసం నిరీక్షిస్తున్నది.

నిజానికి ఏ మహిళ కూడా ఒంటరిగాను, రాక్షస కాంతల మధ్య నీరు, ఆహారాన్ని మాని మాసిన చీరతో ఉండనక్కరలేదు. "సీత మహాపతివ్రత కనుక రామున్నే అనగా దైవాన్నే ధ్యానిస్తున్నది. అందుచేత ఆమె

దృఢనిశ్చయం కూడా ధర్మబద్ధంగా ఉన్నది. "ఒక సీతకు ఒకే రాముడు" అన్నట్లు అట్టి రాక్షసుల్లో కూడా సీతాదేవి రాముని 'పతి'గా, దైవంగా, అంతేల సంరక్షకుడిగా ధ్యానిస్తున్నది. ఈ ధార్మిక తేజమే ఆమెకు గొప్ప శక్తి".

రావణాసురుడు రాక్షస కాంతలతో సీతాదేవిని తనకు వశం చేయుమని చెప్పాడు. సామ, దాన, బేధ, దండోపాయంతో చివరి ఉపాయాన్ని ప్రయోగించ వలసినదిగా హెచ్చరించాడు. అయినా రాక్షస కాంతలు ఎంత బెదిరించినా ఎన్ని ఉపాయాలు ప్రయోగించినా, సీత అన్నీ భరించిందే తప్ప రావణునికి వశం కాలేదు. అందువల్ల ధర్మం ధర్మమే! సీతాదేవి పాతివ్రత్య ధర్మాన్ని నూటికి నూరుపాళ్ళు పాటించి 'ధర్మపత్ని'గా ప్రసిద్ధికెక్కింది. అంత స్వచ్ఛమైన 'సతి' కావుననే రామునికి ధర్మపత్నిగా ఉండటానికి అర్హురాలు అయినది.

"సీతాదేవికి కనిపించిన ఆంజనేయుడు 'రామదూత' అన్న విశ్వాసం బలంగా ఏర్పడింది. అందుచేత సీతాదేవి ఆంజనేయుని, సముద్రలంఘనమును, ఆకాశగమనాన్ని, అతడి శక్తి సామర్థ్యాన్ని ప్రశంసిస్తూ, తక్కిన వానర సముదాయాన్ని ప్రశంసించింది. అప్పుడు ఆంజనేయుడు, వానరులు సీతాన్వేషణకోసం పలుదిక్కులకు పంపబడ్డారని చెప్పాడు. వారు నాకన్న బలవంతులు, నాకంటే తక్కువవారు ఎవరూ లేరు. నేనే ఇంత సాహసం చేశాను. తక్కిన వానరులు గురించి వారి బలప్రభావాల గురించి చెప్పనక్కరలేదన్నాడు. ఇదంతా విన్న సీతాదేవి పరమానందంతో భాష్పాలు రాల్చింది. గుర్తుగా ఒక 'ఉంగరము'ను, చూడామణిని ఆంజనేయులకు ఇస్తూ రాముని ఉత్సాహపరచాల్సినదిగా బోధించింది. ఇదంతటికీ కారణం ఆమెలోని దైవిక తేజమే! ధర్మమే దైవం. ధర్మపరాకాష్ఠ కూడా దైవానుగ్రహమే"!.

లోకంలో జనులు కష్టములు కోరుకోరు. సుఖాలను కోరుతారు. ఒక విచిత్రమైన సత్యం ఏమనగా భగవంతుడు సుఖములందు కాక, కష్టములందు పదేపదే గుర్తుకు వస్తాడు. అలా సీతాదేవి కూడా రామునివెంట అరణ్యానికి వచ్చింది. నారచీరలు ధరించింది. కందమూలాలను సేవించింది. రాక్షసుని చేత అపహరించబడటం, అశోక వనవాసం, రాక్షసుల బెదిరింపులు, రావణుని బెదిరింపులు, ఇన్నింటినీ కూడా సహించింది. కావున అనుక్షణం భగవంతుణ్ణి (రాముని) స్మరిస్తున్నది. ఇంతకన్నా 'తపము' మరేముంటుంది? అందుకే ఆంజనేయుని సందర్శనం దాదాపు ఆమె కష్టాలకు చివర ముహూర్తం అని భావించాలి. ప్రకృతి కూడా అనుకూలించింది. దూత అయిన హనుమంతుడు రాక్షసులను సంహరించాడు. లంకాదహనం చేశాడు. మరల సీతకు కనిపించాడు. ఆమెచేత సెలవు తీసుకొని కిష్కింధకు ఆకాశమార్గంలో బయలుదేరాడు. అతని కోసమే వేచియున్న వానరులందరు ఆంజనేయుల నాదమును విని సంతోషించారు. అంగదుడు కూడా హర్షించాడు.

ఇలా సీతాదేవి పాతివ్రత్య ధర్మానికి సజీవ ప్రతీక! రాముడు కూడా రాజధర్మానికి ప్రతీక! కావున త్రేతా యుగంనాటి పరిస్థితులను బట్టి, సీతాదేవి తన పతివ్రతా ధర్మాన్ని పరిస్థితులు ఎన్ని ఎదురైనా కాపాడుకుంది! యుగాల తరబడి ఆమె 'శీలవతి'గా ప్రశంసింపబడుతున్నది. సీత అబల! మరి పైన పేర్కొన్న దుష్ట శక్తులను ఎదుర్కోవడానికి ఆమెకు బలం ఎలా వచ్చింది అనగా ధర్మమే ఆమె బలం. అనగా పతివ్రతా ధర్మమే ఆమె బలం! అనగా 'మనోబలమే నిజమైన బలం' అని సీతాదేవి ఆచరించి, లోకానికి 'ఆదర్శ మహిళ'గా ఖ్యాతికెక్కింది.

**ఆధార గ్రంథాలు :**

1. జనప్రియ రామాయణము - పుట్టపర్తి నారాయణాచార్యులు
2. వాల్మీకి చరిత్ర - రఘునాథ రాయలు
3. రామాయణం (వచనం) - శ్రీకొంపెల్ల వేంకటరామశాస్త్రి

# అనాది నుండి ఆధునికం వరకు భారతీయ మహిళ

- డా॥. సి.పి. లక్ష్మీ ప్రసూన, ప్రిన్సిపాల్, శ్రీ వైకెఆర్ & కె ప్రభుత్వ కళాశాల, కోవూరు, నెల్లూరు జిల్లా.

భారతదేశం భిన్న సంస్కృతుల, విభిన్న వృత్తుల సమాహారం. అందుకే మనది రాష్ట్రాల యూనియన్ అని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే గొప్ప వసుధైక కుటుంబంగా నిలుస్తున్న దేశంగా మనం చెప్పుకుంటున్నాం. ఈ తరుణంలో భారతదేశంలో మహిళా ప్రస్థానం అనాది (ప్రాచీన) కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు ఎలా సాగుతోందో చర్చించే ప్రయత్నం చేయడం నా వ్యాసం ప్రధానోద్దేశ్యం.

"ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుంది" అని తెలుగు సాహిత్యంలో ఆధునిక పంథాకు దారి చూపిన సంఘసంస్కర్త మహాకవి గురజాడ అప్పారావుగారి మాటను మనం ఈనాడు గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఎందుకంటే కవులు కాలం కన్నా ముందుంటారు. వారు చెప్పినమాటలు అక్షర సత్యాలు. ఈ కోణంలో భారతీయ మహిళా ప్రస్తానాన్ని అంచనా వేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఒకప్పుడు 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అంటూ అనాదిగా సామాజిక కుటుంబపు పునాదిరాళ్ళలోనే ఉంచబడిన స్త్రీ నేడు రోదసిలోకి రాకెట్లు నడిపే చైతన్యస్థాయికి చేరుకొని, ఆకాశంలో సగభాగస్వామ్యాన్ని కోరుకుంటున్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం భారతదేశ జనాభా ప్రాతిపదికను ఒకసారి మనం గమనిస్తే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-2021) ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకు 1020 మంది మహిళలు ఉన్నారు. అంతేకాదు మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఈ సంఖ్య వెయ్యి మంది పురుషులకు 1037, పట్టణ ప్రాంతాలలో 985 ఉండటం చాలా ఆనందించదగ్గ విషయం. ఒకప్పుడు ఆడపిల్ల పుడితే పురిట్లోనే నలిమివేసే రోజులు మనం చూశాం. ఈ మార్పు భవిష్యత్ కాలంలో మంచి మార్పుకు నాందిగా మనం భావించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ప్రాచీన భారతదేశంలో మహిళలు జీవితపు అన్ని విభాగాలలో పురుషులతో సమాన హెూదా అనుభవించారని పరిశోధకుల అభిప్రాయం. అయితే దీనికి భిన్నమైన అభిప్రాయం వెలిబుచ్చిన వారూ ఉన్నారు. పతంజలి, కాత్యాయనుడు వంటి ప్రాచీన భారత వ్యాకరణకర్తల రచనల ప్రకారం, వేదకాలపు ఆరంభంలో మహిళలు చదువుకోనేవారని తెలుస్తోంది. ఆ సమయంలో మహిళలు యుక్తవయస్సులో పెళ్ళి చేసుకోనేవారని, వారు భర్తను ఎన్నుకొనే హక్కుని కలిగి ఉండేవారని ఋగ్వేద శ్లోకాలు తెలుపుతున్నాయి. ఋగ్వేదం, ఉపనిషత్తుల వంటి గ్రంథాలు అనేక మహిళల గురించి, ముఖ్యంగా గార్గి, మైత్రేయి వంటి, ఋషులు, ద్రష్టల గురించి తెలుపుతున్నాయి.

ప్రాచీన భారతంలో కొన్ని రాజ్యాలు నగరవధు ("పట్టణపు వధువు") వంటి సంప్రదాయాలను కలిగి ఉండేవి. మహిళలు నగరవధు శీర్షికని గెలుచుకోవడానికి పోటీపడుతుండేవారు. ఆమ్రపాలి నగరవధుకి మంచి ఉదాహరణ. అధ్యయనాల ప్రకారం వేదకాలపు ఆరంభంలో మహిళలు సమాన హెూదా, హక్కులను అనుభవించేవారు. తరువాత (సుమారుగా 500 బి.సి.) స్మృతులతో మహిళల హెూదా తగ్గడం మొదలయ్యింది బాబర్ వంటి ఇస్లాం రాజుల ఆక్రమణలు, మొఘల్ సామ్రాజ్యం తరువాత క్రైస్తవ మతం మొదలైనవి మహిళల స్వేచ్ఛను, హక్కులను హరించాయి.

జైన మతం వంటి విప్లవాత్మక ఉద్యమాలు మహిళలను మతపరమైన కార్యక్రమాలకి అనుమతించినప్పటికీ, మహిళలు ఎక్కువగా నిర్బంధాన్ని, ఆంక్షలనూ ఎదుర్కొ

న్నారు. బాల్యవివాహ సంప్రదాయం సుమారుగా ఆరవ శతాబ్దంలో ప్రారంభమయి ఉంటుందని భావిస్తున్నారు.

మధ్యయుగ సమాజంలో మహిళల స్థాయి ఇంకా దిగజారింది. కొన్ని వర్గాలలో సతీసహగమనం, బాల్య వివాహాలు, విధవా పునర్వివాహాల నిషేధం వంటివి భారతదేశంలోని కొన్ని వర్గాల సామాజిక జీవనంలో భాగ మయ్యాయి. భారత ఉపఖండంపై ముస్లిం ఆక్రమణ, భారతీయ సమాజంలో పరదా ఆచారాన్ని తెచ్చింది. రాజస్థాన్ రాజపుత్రులలో జౌహర్ ఆచారం ఉండేది. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో దేవదాసీలు లేదా ఆలయ స్త్రీలు లైంగికంగా వేధింపుకు గురయ్యేవారు. హిందూ క్షత్రియ రాజులలో బహుభార్యాత్వం విస్తృత వ్యాప్తిలో ఉండేది. చాలా ముస్లిం కుటుంబాలలో మహిళలు జెనానా ప్రాంతాలకి మాత్రమే పరిమత మయ్యేవారు.

ఈ పరిస్థితుల మధ్య కూడా కొంత మంది మహిళలు రాజకీయ, సాహిత్యం, విద్య, మత రంగాలలో రాణిం చారు. రజియా సుల్తానా ఢిల్లీని పరిపాలించిన ఏకైక మహిళా చక్రవర్తి. గోండు రాణి దుర్గావతి పదిహేనేళ్ళు పరిపాలన సాగించింది. ఆమె మొఘల్ చక్రవర్తి అక్బర్ సైన్యాధిపతి అసఫ్ ఖాన్‌తో జరిగిన 1564 యుద్ధంలో ప్రాణాలు కోల్పోయింది. అక్బర్ యొక్క గొప్ప మొఘల్ సైన్యాన్ని 1590లో చాంద్ బీబీ ఎదుర్కొని అహ్మద్ నగర్‌ను రక్షించింది. జహంగీర్ భార్య నూర్జహాన్ సార్వ భౌమ అధికారాన్ని ప్రతిభావంతంగా చెలాయించి మొఘల్ మకుటం వెనుక ఉన్న నిజమైన శక్తిగా గుర్తింపు పొందింది. మొఘల్ యువరాణులు జహనారా, జేబున్నీసాలు మంచి పేరున్న రచయిత్రులు. వీరు పరిపాలనను కూడా ప్రభావితం చేశారు. శివాజీ తల్లి జిజియాబాయి యోధు రాలిగాను, పాలకురాలిగానూ చాటుకున్న సమర్థత వలన సమర్ధురాలైన రాణిగా, మంచి తల్లిగా గణుతి కెక్కింది. దక్షిణ భారతంలో చాలామంది మహిళలు గ్రామాలు, పట్టణాలు, మండలాలను పాలించారు. అనేక సామాజిక, మత సంస్థలకు ఆద్యులయ్యారు.

భక్తి ఉద్యమం మహిళల హోదాని తిరిగి నిలపడానికి ప్రయత్నించి కొన్ని రకాల అణిచివేతలను అడ్డుకుంది. మీరాబాయి అనే ఒక మహిళా సాధు కవయిత్రి భక్తి ఉద్యమపు ముఖ్య వ్యక్తులలో ఒకరు. ఈ కాలపు ఇతర మహిళా సాధు-కవయిత్రులు అక్క మహాదేవి, రామి జనాభాయి, లాల్ దేడ్. భక్తి హిందూ మతానికి మాత్రమే పరిమితమైనది, మహానుభవ్, వర్కారి ఇంకా అనేక ఇతర అంశాలు హిందూ మతంలోని నియమ ఉద్యమాలు. ఇవి స్త్రీ, పురుషుల మధ్య ఉన్న సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని బహిరంగంగా చర్చించేవి.

భక్తి ఉద్యమం వెంటనే సిక్కుల మొదటి గురువు గురునానక్ కూడా స్త్రీ, పురుషుల మధ్య సమానత్వాన్ని గురించిన సందేశాన్ని బోధించారు. ఆయన స్త్రీలు కూడా మతపరమైన సమావేశాలు నిర్వహించడం లోను, గుడిలో కీర్తన లేదా భజనలు అని పిలువబడే గీతాలని పాడడం, నిర్వహించడం లోనుబీ మత నిర్వాహక కమిటీలలో సభ్యులవడం లోనుబీ యుద్ధరంగంలో సైన్యాన్ని నడపడం లోనుబీ పెళ్ళి, అమ్రిత్‌లలోనూ సమానత్వం ఉండాలని సూచించారు. ఇతర సిక్కు గురువులు కూడా మహిళా వివక్షకి వ్యతిరేకంగా ప్రబోధించారు.

ఇక సాహిత్యవిషయం వచ్చేసరికి సమాజంలో జరుగుతున్న వివక్షపై గొంతెత్తి నినదించారు. భారతీయ భాషలన్నింటిలోనూ మహిళాసాధికారిత లక్ష్యంగా గళాలు నినదిస్తున్నాయి. మన తెలుగు సాహిత్యం అందులో చాలా ముందుంది. "సాహిత్యం సామాజిక ప్రతిఫలనంగా ఉంటూ, తరతరాల సామాజిక జీవనాన్ని ప్రభావితం చేయగలుగుతుంది. రాజకీయ-ఆర్థిక చలన సూత్రాలకు అనుగుణంగా సామాజిక-సాంస్కృతిక జీవన పరిణామం చెందటమనేది చారిత్రక సత్యం. కాలానుగుణ సమాజ పరిణామం గల సాంస్కృతిక జీవనమే సాహిత్య చరిత్రలోని స్త్రీ పాత్రల స్వభావ పరిణామశీలంగా ప్రతిబింబిస్తుంది. తెలుగు సాహిత్యంలోని స్త్రీ పాత్రలు ఆయాకాలాలలోని సామాజిక సంస్కృతిలో భాగంగా

లింగవివక్షకు గురి అవుతూ, దాన్ని ఎదుర్కొనే క్రమంలో కాలానుగుణంగా పరిణామం చెంది చైతన్యం తెచ్చుకోవటాన్ని సాహిత్యం తెలియజేస్తుంది. సాహిత్యంలో స్త్రీలు తమకుతామే చైతన్యం తెచ్చుకొని నేటి మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు" అని డా॥ జంధ్యాల కనకదుర్గగారు అన్న మాటలు అక్షర సత్యాలు.

ప్రాచీన తెలుగుసాహిత్యాన్ని ఆధునిక దృష్టితో చూడాల్సిన అవసరం ఎంతైనా వుంది. మనం ఆ కోణంలో చూస్తేనే అవి మనకు కనిపిస్తాయి. క్రీ.శ. 14వ శతాబ్దానికి చెందిన మంచెన వ్రాసిన 'కేయూరబాహు చరిత్రం' అనే కావ్యంలో "నిపుణిక" అనే సామాన్య గృహిణి పాత్ర గర్భధారణ స్త్రీకి బాధాకరమని భావించి, భాగస్వామియైన భర్త ఆ గర్భ భారాన్ని మోయాలని తన గర్భాన్ని భర్తకు బదలాయించి, ఆమె స్వేచ్ఛగా జీవించాలంటుంది. స్త్రీకి పునరుత్పత్తి శక్తి ఆరాధనీయం కంటే కూడా బాధాకరమనే విషయాన్ని భర్త, సమాజం గుర్తించేటట్లుగా చేస్తుంది. క్రీ.శ. 15వ శతాబ్దానికి చెందిన పిల్లలమర్రి పినవీరభద్రుడు 'జైమినీభారతం'లో స్త్రీలు సతీసహగమనాన్ని అధిగమించే చైతన్యాన్ని తెచ్చుకోవటం, పితృస్వామ్య కుటుంబ సంస్కృతికిగాని, లైంగిక సంబంధాలకు గానీ లోబడకుండా యుద్ధవిద్యలు నేర్చుకొని, తన తోటి స్త్రీలకు కూడా నేర్పి, వారిని చైతన్యపరచి పురుషుల లైంగికతపై సవాల్ విసిరే ధీశాలిగా చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది. రాధికాస్వాంతనంలో పునరుత్పత్తి సామర్థ్యంగల స్త్రీగా బాలికలు ఎదగాలంటే ఎటువంటి ఆహారాన్ని తినాలో 'ఇళ' కు చెప్పిన వైద్యురాలిగా 'రాధ' పాత్ర వైజ్ఞానికంగా ఎదగడం అభినందించాల్సిన అంశం.

క్రీ.శ. 20వ శతాబ్దంలో స్త్రీలు తమ విద్యా స్వాతంత్ర్యాల పట్ల చైతన్యాన్ని తెచ్చుకొని, భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ఉద్యమ భాగస్వాములవటంగా వారి చైతన్యం విస్తరించింది. వీరేశలింగంగారు 'రాజశేఖర చరిత్రము' అనే నవలలో చదువుకున్న రుక్మిణి తన కుటుంబమంతా చిన్నాభిన్నమై దూరమైనప్పుడు, తన లైంగిక భద్రతకై పురుషవేషం ధరించి, సమాజంలో ఒంటరిగా సంచరించగల స్థాయికి చేరుకొని, తన కుటుంబ సమస్యలను తీర్చిన బాధ్యతాయుతమైన స్త్రీగా పరిణామం చెందటం అర్థమవుతుంది.

ఆధునిక మహిళలు ఏవిధంగా తమ ప్రాభవాన్ని నిలబెట్టుకున్నారో కొద్దిమంది నారీమణుల విజయాలను చూస్తే అర్థమవుతుంది.

- జాన్ ఇలియట్ డ్రింక్ వాటర్ బెతూనే 1849లో బెతూనే స్కూల్ ప్రారంభించింది, ఇది 1879లో బెతూనే కళాశాలగా వృద్ధి చెంది భారతదేశంలో మొదటి మహిళా కళాశాల అయింది.
- 1883: చంద్రముఖి బసు, కాదంబినీ గంగూలీ బ్రిటిషు సామ్రాజ్యపు మొదటి మహిళా పట్టభద్రులయ్యారు.
- కాదంబినీ గంగూలీ, ఆనందీ గోపాల్ జోషి భారతదేశమునుండి పాశ్చాత్యవైద్యంలో శిక్షణ పొందిన మొదటి మహిళలు.
- 1905: సుజన్నే ఆర్ డి టాటా కారు నడిపిన మొదటి భారతీయ మహిళ.
- 1916: 1916 జూన్ 2న సంఘసంస్కర్త దొండో కేశవ్ కార్వేగారి చేత కేవలం ఐదుమంది విద్యార్థులతో మొదటి మహిళా విశ్వవిద్యాలయం మహిళా విశ్వవిద్యాలయం స్థాపించబడింది.
- 1917: అన్నే బిసెంట్ భారత జాతీయ కాంగ్రెస్‌కు మొదటి మహిళా అధ్యక్షురాలయింది.
- 1919: ఆమె విలక్షణమైన సామజిక సేవకు గుర్తింపుగా పండిత రమాబాయి బ్రిటీష్ రాజ్ నుంచి కైజర్-ఇ-హింద్ పురస్కారం పొందిన మొదటి మహిళ.
- 1925: సరోజినీ నాయుడు భారత జాతీయ కాంగ్రెస్కి భారతదేశంలో పుట్టిన మొదటి మహిళా అధ్యక్షురాలు.

- 1927: ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ ఏర్పాటుచేయబడింది.
- 1944: భారతీయ విశ్వవిద్యాలయంనుంచి సైన్స్ డాక్టరేట్ అందుకున్న మొదటి మహిళ అసిమా చటర్జీ.
- 1947 ఆగస్టు 15 స్వతంత్రం తరువాత సరోజినీ నాయుడు యునైటెడ్ ప్రావిన్సులకి గవర్నర్ అయింది, ఈవిడ భారతదేశపు మొదటి మహిళ గవర్నరు.
- 1951: డెక్కన్ ఎయిర్వేస్ కు చెందినా ప్రేమ మాథుర్ భార్తదేశపు మొదటి మహిళా వాణిజ్య పైలట్.
- 1953: విజయలక్ష్మి పండిట్ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీకి మొదటి మహిళా (మొదటి భారతీయ) అధ్యక్షురాలు.
- 1959: అన్నా చండీ హైకోర్టుకి మొదటి మహిళా జడ్జ్ (కేరళ హై కోర్టు)
- 1963: సుచేత కృపలానీ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్య మంత్రి అయి, భారతదేశంలోని ఏరాష్ట్రంలోనైనా ఆస్థాయిని పొందిన మొదటి మహిళ అయ్యారు.
- 1966: కేప్టన్ దుర్గ బెనర్జీ ఒక రాష్ట్ర ఎయిర్లైన్స్, ఇండియన్ ఎయిర్లైన్స్ కి పైలట్ అయిన మొదటి భారతీయ మహిళ.
- 1966: కమలాదేవి చటోపాధ్యాయ వర్గ నాయ కత్వానికిగానూ రామన్ మెగాసెస్సే పురస్కారం గెలుచుకున్నారు.
- 1966: ఇందిరాగాంధీ భారతదేశపు మొదటి మహిళా ప్రధానమంత్రి.
- 1970: కమల్జిత్ సందు ఏషియన్ గేమ్స్ లో బంగారు పతకం గెలుచుకున్న మొదటి భారతీయ మహిళ.
- 1972: కిరణ్ బేడి ఇండియన్ పోలీస్ సర్వీస్ కి ఎన్నికయిన మొదటి మహిళా అభ్యర్థి
- 1979: మదర్ థెరిస్సా నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న మొదటి భారతీయ మహిళా పౌరురాలు.
- 1984: మే 23న బచేంద్ర పాల్ మౌంట్ ఎవరెస్టు అధిరోహించిన మొదటి మహిళ అయ్యారు.
- 1989: జస్టిస్ ఎం.ఫాతిమా బీవీ సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియాకి మొదటి మహిళా జడ్జ్ గా ఎన్నిక య్యారు.
- 1997: కల్పనా చావ్లా గగనంలోకి వెళ్ళిన మొదటి భారత జన్మిత మహిళ.
- 1992: ప్రియా ఝింగాన్ ఇండియన్ ఆర్మీలో చేరిన మొదటి మహిళా కాడేట్ (తరువాత 1993 మార్చి 6 నుంచి చేర్చుకోవడం మొదలుపెట్టారు)
- 1994: హరితా కౌర్ డియోల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో మొదటి మహిళా పైలట్, ఒంటరి పైలట్.
- 2000: కరణం మల్లీశ్వరి ఒలంపిక్ పతకం సాధించిన మొదటి మహిళ (2000 సిడ్నీ సమ్మర్ ఒలంపిక్స్ లో కాంస్య పతకం)
- 2002: లక్ష్మీ సెహగల్ భారతదేశ అధ్యక్ష పదవికి పోటీపడ్డ మొదటి మహిళ.
- 2004: పునీత అరోరా ఇండియన్ ఆర్మీలో అత్యధిక స్థాయి ల్యూటినేంట్ జనరల్ స్థాయిని అందుకున్న మొదటి మహిళ.
- 2007: ప్రతిభా పాటిల్ భారతదేశపు మొదటి మహిళా అధ్యక్షురాలు.
- 2009: మీరా కుమార్ ఇండియన్ పార్లమెంట్ దిగువసభ లోక్ సభకి మొదటి మహిళా స్పీకర్
- 2014:సుమిత్రా మహాజన్ లోక్ సభ స్పీకర్ గా ఎంపికైంది.

అయితే రాజకీయంగా మహిళల ప్రాధాన్యం ఇంకా పెరగాల్సి ఉంది. ప్రస్తుత భారతదేశ జనాభాలో సగభాగం కన్నా ఎక్కువగా మహిళలు ఉన్నారు. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా "ఆజాదికా అమృతోత్సవ్" జరుపుకుంటున్న సందర్భంలో మహిళా వివక్ష ఇంకా కొనసాగటం చాలా ఖండించాల్సిన విషయం.

అంతేకాకుండా ఇటీవలి కాలంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులకు సరైన శిక్షలు పడటం లేదు. మహిళా రక్షణకు ప్రభుత్వాలు ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా వుంది. స్వతంత్ర్యం వచ్చినప్పటినుండి ప్రధానిగా, రాష్ట్రపతిగా మహిళలకు ఒక్కో పర్యాయం మాత్రమే అవకాశం వచ్చింది.

మిగిలిన కాలమంతా పురుషులే ప్రధానులుగా, రాష్ట్రపతులుగా ఉన్నారు. అనాది కాలంలో సమాన భాగస్వామ్యం పొందిన విధంగానే ఇప్పుడూ మహిళలకు ప్రధాన స్థానం ఇవ్వాలని కోరుతున్నాను. అనాది నుండి ఆధునికం వరకు భారతీయ మహిళ సాధించిన విజయాలను మరోమారు గుర్తు చేసుకుంటూ, సెలవు.

## ఆధారగ్రంథాలు :

1. ఆధునిక భారతదేశ చరిత్ర - రొమిలా థాపర్ (అనువాదం- డా॥ కె.యస్. కామేశ్వరరావు)
2. సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగంటి సుజాతరెడ్డి
3. సాహిత్యం - సత్త్వదర్శిని - డా॥ జంధ్యాల కనకదుర్గ

❀ ❀ ❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ప్రకృతి వైద్యరంగంలో మహిళా రత్నాలు

– డా॥. టి. మోహనశ్రీ, ప్రిన్సిపాల్,శ్రీ కన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై.

ప్రకృతి వైద్యం ఒక మనిషి - ఒక గ్రంథం నుంచి వచ్చింది కాదు. కొన్ని వేల సంవత్సరముల నుంచి చేసిన కృషి, కొన్ని వేలమంది విజ్ఞాన ఖనుల మేధోమధనం. ఒక మనిషి జీవితం పైన సాగిన మహాయజ్ఞం.

ప్రకృతి వైద్యం మిగతా వైద్య శాస్త్రాల కంటే భిన్న మైంది. ప్రకృతిలోని ప్రతి మనిషిని ప్రత్యేకమైనదిగా పరిగణిస్తుంది. ఆరోగ్యం గురించి, దానిని కాపాడు కోవడాన్ని గురుంచి చెబుతుంది. మనలోని సమన్వయ లోపమే మన ఆరోగ్యానికి కారణం అవుతుంది. దానిని తిరిగి స్వాభావికంగా మలచుకుంటే అదే ఆరోగ్యం. వ్యాధులు రాకుండా చేసుకోవడమే ఆరోగ్యం. ఆరోగ్యమే మహాభాగ్యమంటుంది ప్రకృతి వైద్యం.

ప్రకృతి వైద్యం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను అందిస్తుంది. ఇది పక్రృతి పరంగా ఉన్న ఆహారాన్ని , ఏ మనిషిని తగిన ఆహారాన్న వాటిని సూచిస్తుంది. దుర లవాట్లను మాన్పిస్తుంది. మనం తినే ఆహారం ద్వారా వ్యాధులను నివారిస్తుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మందులుగా ఉపయోగపడేలా చేస్తుంది. ప్రకృతి వైద్యం సదా ఆరోగ్యవంతులుగా ఉండేటట్లుగా చేస్తుంది.

మన తెలుగువారు మన రాష్ట్రంలోనే కాక దేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రకృతి వైద్య చికిత్స ద్వారా ఎనలేని సేవలు చేస్తూ ఈ విధాన అభివృద్ధికి దోహదపడుతున్నారు.

జ్ఞానాంబ భారతదేశ ప్రథమ ప్రకృతి వైద్య మహిళ కావడం మన తెలుగు జాతికి గర్వకారణం. జ్ఞానాంబ ఆనాటి మద్రాసు రాష్ట్రంలో గుంటూరు జిల్లా వినుకొండ తాలూకా పెదకనిచర్ల గ్రామంలో ఓ సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆమె భారతదేశ ప్రకృతి వైద్య ధర్మవేత్త నారిశెట్టి హనుమయ్య సోదరి. 1919 ఆగష్టు నెలలో ప్రకృతి వైద్య ప్రచారము హనుమయ్య బెజవాడలో ప్రకృతి కార్యాలయ ట్రస్టు ఏర్పరచి ప్రకృతి పత్రికను ప్రారంభించారు. జ్ఞానాంబ సోదరుని ముద్రణా కార్యాలయంలో ప్రకృతి వైద్య ముద్రణా సాహిత్య వ్యాసాలు, పుస్తకాలకు సంబంధించిన అక్షరాల కూర్పు తప్పొప్పులను సరి చేయడం. ముద్రించే విషయాలను చూడటం వల్ల ఆమెకు ప్రకృతి వైద్యంపై అవగాహన సహజంగా కలిగింది.

ముద్రణలో అక్షరాలను సరిచూచే జ్ఞానాంబ చివరికి ప్రకృతి వైద్య గ్రంధాల అనువాదానికి శ్రీకారం చుట్టడం విశేషం. జ్ఞానాంబ ప్రకృతి వైద్య సాహిత్య ముద్రణా కార్యక్రమాలకు, ప్రకృతి చికిత్స ప్రచార ఉద్యమానికి పరిమితం కాకుండా ఆంగ్ల భాష నుంచి అనేక పుస్తకాలను తెలుగులోనికి అనువాదం చేసి ముద్రించారు. వర్ణ చికిత్స, వర్ణ వైద్యం, లక్షణ జల చికిత్స, కూనే మహర్షి బోధ, నిర్విచార భావిజీవితం, పచ్చి తిండి వలన లాభాలు, తెల్ల చక్కెర వలన విపత్తు, తేనేరు విషతుల్యం, ఔషధమొక ఊహాశాస్త్రం, ఆరోగ్య కామేచ్ఛ, ఆహార రసాయన శాస్త్రం, ఆరోగ్యం వంటివి.

జ్ఞానాంబ బెజవాడలోని మరియు ప్రముఖ ప్రకృతి వైద్యులు కొంతమందితో కలిసి ప్రకృతి వైద్య ప్రచారానికి సేవ చేసిన మహనీయురాలు. పేరుకు తగిన ప్రజ్ఞాశాలి, ఆదర్శ ప్రకృతి వైద్యురాలు జ్ఞానాంబ. డా॥జ్ఞానాంబ భారతదేశ ప్రథమ మహిళా వైద్యురాలుగా చరిత్రలో మిగిలిపోయింది. జ్ఞానాంబ రచనలు భావితరాల ప్రకృతి వైద్యులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడి భవిష్యత్తు కాలానికి దోహదపడతాయి.

డా॥బలిజేపల్లి విజయలక్ష్మిఆసియాలో ప్రభుత్వంచే

గుర్తించబడిన ప్రథమ ప్రకృతి వైద్య కళాశాల ప్రథమ ప్రిన్సిపల్. 1908.1931 లో తూర్పు గోదావరి జిల్లాలో డా॥ ద్రోణంరాజు శివరావు, మహాలక్ష్మి దంపతులకు జన్మించారు. భర్త వెంకట్రావుతో కలసి భీమవరం ప్రకృతి చికిత్సాశ్రమంలో 1947,48 లో ప్రకృతి వైద్య విద్యను గడించారు. ఉదయం 4గం॥ల నుండి రాత్రి 10గం॥ల వరకు రోగులకు చికిత్స చేస్తూ శిక్షణ పొందారు. అంతేకాక గురువుగారి నుండి యోగాసన ప్రవీణ బిరుదును, బంగారు పతకాన్ని పొందారు. 1970 లో డా॥వెంకట్రావు స్థాపించిన గాంధీ ప్రకృతి వైద్య కళాశాలను డా॥విజయలక్ష్మీ ప్రిన్సిపల్ గా నియమించబడి, కళాశాల అభివృద్ధికి చేసిన సేవలు అద్వితీయమైనదిగా చెప్పవచ్చు.

డా॥విజయలక్ష్మి రోగులకు సేవచేస్తూ ఎంతో అనుభవాన్ని, విజ్ఞానాన్ని పొంది వందలాది పరిశోధనా వ్యాసాలను వ్రాసి ప్రకృతి పత్రికలో ప్రచురించారు. విజయలక్ష్మి ఉపన్యాసాలను హైదరాబాద్ ఆకాశవాణి ద్వారా హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో కూడా ప్రసారం అయ్యాయి. డా॥విజయలక్ష్మి స్వానుభవంతో ప్రకృతి పాక శాస్త్రాన్ని 'ఆస్టియోపతి', 'ప్రార్దనావళి' పుస్తకాలను వ్రాసారు. కొన్ని పుస్తకాలను హిందీ నుండి తెలుగులోనికి అనువాదం చేశారు. ఆమె భర్త డా॥వెంకట్రామయ్య తెలుగులో వ్రాసిన గ్రంధాలను కన్నడ, మరాఠీ, హిందీ భాషల్లోనికి అనువదించారు. బేగంపేట ప్రకృతి చికిత్సాలయం నుంచి వెలువడే ప్రకృతి మాస పత్రికకూ ఆచార్య పుచ్చా వెంకట్రామయ్య మరణానంతరం ఏప్రిల్ 1984 నుండి ఆ పత్రికకు సంపాదకురాలిగా వ్యవహరించి పత్రికను సకాలంలో వేలాది పాఠకులకు అందించారు. అమీర్‌పేట ప్రకృతి చికిత్సాలయానికి 36 సంవత్సరాలు పాటు సుదీర్ఘంగా సేవలందించిన మరియు ప్రపంచంలోని మొట్ట మొదటి మహిళా ప్రకృతి వైద్యకళాశాల ప్రిన్సిపల్ గా 12 సంవత్సరాలు సేవలు చేసిన ఘనకీర్తి విజయలక్ష్మికే చెందుతుంది.

డా॥విజయలక్ష్మి ప్రకృతి వైద్య ఉద్యమ కార్యకర్తగా, సుప్రసిద్ధ మహిళా వైద్యురాలిగా పరిశోధకురాలిగా, పరిపాలనాదక్షురాలిగా, భర్తగారైన డా॥వెంకట్రావుకి అండగా ఉండి ప్రోత్సహించిన ధర్మపత్నిగా 40 సంవత్సరాలు ఎనలేని సేవచేసి 19-8-86 న స్వర్గస్తులైనారు. కీ.శే. డా॥విజయలక్ష్మి ప్రకృతి వైద్యాభివృద్ధికి చేసిన సేవలు అద్వితీయమైనవి. చిరస్మరణీయమైనది. మనదేశంలో ఆచరిస్తున్న దేశీయవైద్యవిధానాలైన ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధ, యోగ విధానాలలో ప్రకృతి వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇతర వైద్య విధానం వల్ల త్వరగా నయంగానీ వ్యాధుల ప్రకృతి వైద్యం ద్వారా తక్కువ ఖర్చుతో సులభంగా బాగుచేయటం సాధ్యమవుతుంది. మన దేశంతో ముఖ్యంగా ఆంధ్రపదేశ్‌లోనే ప్రప్రథంగా ప్రకృతి వైద్యం ప్రారంభ మగుట మనకు ఎంతో గర్వకారణం. అందు తమ వంతు సేవలందించిన మహిళలు నేటి వైద్య శాస్త్ర పరిశోధకులకు, విద్యార్థులకు ఆదర్శం కాగలరు.

హితేన సహితం సాహిత్యం అన్నది సత్యం. సాహిత్యం సామాన్యునికి, సంఘానికి ప్రయోజనకారి కావలెను. అందుకొరకే సదస్సులు, కార్యనిర్వహణలు మొదలగునవి. మరుగున పడకుండా విషయాలను మననం చేసుకోవడం, వారి సేవలను గుర్తించడం, రచనలలోని సారాంశాన్ని గ్రహించడం అందులోని అంతర్గత భాగాలే.

సాహిత్యంలో ప్రక్రియలు అవి రచనా వైవిధ్యాన్ని తెలుపుతుంది. జానపద సాహిత్యంలోనూ వివిధ కోణాలు, జానపద సాహిత్యంలోనూ ఇంటి వైద్యం, జానపద వైద్య విధానం మనకు విదితమే. నేటి మానసిక పరిస్థితులను మెరుగుపరచుటకు ప్రకృతి వైద్యం దోహదము కాగలదు."ఆరోగ్యం-మహాభాగ్యం " నానుడికి వైద్య సంబంధిత రచనలు ఆవశ్యము తోడ్పడగలదని ఆశిద్దాం.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ప్రకృతి వైద్య చికిత్సా విధానం - డా॥చిరువేరు కృష్ణమూర్తి.
2. ప్రకృతి వైద్య రంగంలో తెలుగు వారి కృషి ఆచార్య గజ్జల రామేశ్వరం.
3. ప్రకృతి - పత్రిక ఆగష్టు 1933, సంపుటి15, సంచిక1 మరియు డిసెంబరు 1976 సంపుటి54, సంచిక7,8
4. డా॥బి.విజయలక్ష్మి జీవిత చరిత్ర సాధనా కుటీర్, హైదరాబాద్.

# భారతంలో శకుంతల

**- డా॥. ఎ. బాలకృష్ణ** , తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కనిగిరి, ప్రకాశం జిల్లా.

మహిళ అనే పదానికి 285 దాకా పర్యాయపదాలున్నాయి. జీవితమంత విస్తృతి, పరిధి వున్న స్త్రీ గురించి సాహిత్యం క్రమానుగత పరిణామాలను అవగతం చేస్తుంది. మానవ సంబంధాల వ్యాఖ్యాన చరిత్రగా తెలుగులో లిఖిత సాహిత్య చరిత్ర 10వ శతాబ్ది నుండి భారతేతిహాస రచనతో ప్రారంభమైంది. భారతం అనగానే నాటి సామాజిక, రాజకీయ శక్తులతో సంఘర్షణ పడిన ద్రౌపది, తోటి వాళ్ళపట్ల, పురుషుల పట్ల, కుటుంబ విలువల పట్ల ప్రతిస్పందించే ధోరణిలో గాంధారి, కుంతి వంటి స్త్రీలు మనకు ప్రత్యక్షమవుతారు. కాగా వివాహ భద్రత లేని స్త్రీగా, తిరస్కరింపబడి, ఆకాశవాణిచే పతివ్రతగా కితాబు ఇవ్వబడి, దుష్యంతునిచే పరిగ్రహింపబడిన శకుంతల ఇతివృత్తాన్ని సామాజిక దృష్టితో వివరించడమే ఈ వ్యాసోద్దేశం.

నన్నయ శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో కౌరవ వంశ వివరణ సందర్భంలో దుష్యంతుని కథ వస్తుంది. దుష్యంతుడు బాహువీర్యంతో, ధర్మమార్గాన దేశాన్ని పరిపాలిస్తుంటాడు. వేటమీద వేడుకతో ఒకనాడు బయలుదేరుతాడు. అనేక మృగాలను చంపిన తరువాత కణ్వాశ్రమంలోకి అడుగు పెడతాడు. తపోశక్తి సంపన్నుడైన మునీంద్రునికి నమస్కరించి వెళదామనుకున్న దుష్యంతునికి శకుంతల కనబడుతుంది. శకుంతల దుష్యంతునికి సకల మర్యాదలు చేసి ఆదరిస్తుంది. ముని ఆశ్రమ వాతావరణం, ప్రకృతి రమణీయతతో సేదదీరిన రాజు శకుంతల అందచందాలకు ముగ్ధుడవుతాడు. శకుంతల స్త్రీ సహజమైన సిగ్గుకు లోనై, కణ్వుడు వచ్చేదాకా ఒక ముహూర్తం ఉండమని కోరుతుంది. ఆమె వినయానికి మృదుమధుర వచనాలకు సంతోషించిన రాజు, 'నీవెవ్వరి కూతురవిట్టి రూప లావణ్య విలాస విభ్రమ గుణ సుందరి విందుకేల వచ్చితి'వీవని ప్రశ్నిస్తాడు. ప్రజలు ధర్మ స్వరూపుడని కీర్తించే కణ్వ మహాముని ఆత్మజనని సమాధానం చెబుతుంది. ఆమెపట్ల కలిగిన అనురక్తి వలన శకుంతల జన్మవృత్తాంతాన్ని వివరించమని రాజు కోరతాడు. రాజర్షి, బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడు ఘోరమైన తపస్సు చేస్తున్నప్పుడు, ఇంద్రుడు దాన్ని భంగం చేయడానికి అప్సరసలలో గొప్పదైన మేనకను నియోగిస్తాడు. ఆమె దేవేశ్వరుని ఆజ్ఞను శిరసావహిస్తుంది. మేనక, విశ్వామిత్రుల శృంగార ఫలితంగా శకుంతల జన్మిస్తుంది. మేనక దేవలోకానికి, విశ్వామిత్రుడు తపోవనానికి వెళతారు. ముని ప్రభావాన శకుంత పక్షులు బిడ్డను రక్షిస్తుంటాయి. శిష్యులతో ప్రయాణిస్తున్న కణ్వుడు బాలికను చూసి, శకుంత రక్షిత అయిన కారణాన శకుంతల అని నామకరణం చేస్తాడు.

శకుంతల జన్మవృత్తాంతాన్ని విని దుష్యంతుడు చాలా సంతోషిస్తాడు. వల్కాలాజనాలు, వన్యఫలాశనాలు, కుటీర వాసాలు ఆమెకు తగినవి కావని తనకు భార్య అయి అశేష రాజ్యలక్ష్మి మహనీయ సౌఖ్యాలు పొందమని అభ్యర్థిస్తాడు. దుష్యంతుని మాటలకు సిగ్గుపడి నేల చూపులు చూస్తూ, తన తండ్రిగారు కరుణానిరతు ధర్మస్వరూపులని, వారు వచ్చిన వెంటనే, వారి అనుమతితో తన పాణీగ్రహణం చేయమని సమాధానం చెబుతుంది. తనకు భార్యగా వచ్చి, రాజ్య సుఖాలను పొందమని రాజు ప్రలోభ పెట్టినా శకుంతల నిగ్రహం కోల్పోలేదు. ఎటువంటి తొందరపాటుకు లోనవకపోవడం ఆమె వ్యక్తిత్వానికి నిదర్శనం. గాంధర్వ వివాహాన్ని ప్రతిపాదించిన రాజుతో 'తాను తండ్రిచాటు బిడ్డనని, వారి అనుమతితో పాణీగ్రహనం చేయమని కోరడం, ఆమె సుగుణాన్ని తెలుపుతుంది. శకుంతలను ఒప్పించేందుకు దుష్యంతుడు గాంధర్వం అతి రహస్యం, అమంత్రకం

అని వివరిస్తాడు. రాజు మాటలు నమ్మి శకుంతల వివాహానికి అంగీకరిస్తుంది. కానీ ఒక షరతు పెడుతుంది. తామిరువురికి జన్మించిన కుమారుడికి రాజ్యాభిషేకం చేయాలని వరం కోరుతుంది. రాజు ఆమె కోరిన వరాన్ని అంగీకరిస్తాడు. అభిమత సుఖాలను అనుభవించిన రాజు తిరిగి వెళ్ళిపోతూ, 'నిన్ను తోడ్కొని రా అనస్మత్ప్రధాన వర్గంబుల గణ్యమహామ్ముని పొలికిం బుత్తెంచెదన'ని శకుంతలను ఊరడిస్తాను.

వనం నుండి తిరిగి వచ్చిన కణ్వుడు లలిత శృంగార భావాలతో లజ్జావనతవదనా, అతి భీత చిత్తగా వున్న కూతురుని చూసి, తన దివ్య జ్ఞానంతో విషయాన్ని గ్రహిస్తాడు. క్షత్రియులకు గాంధర్వం సరైనదని చెప్పి, అంగీకరిస్తాడు. కొంత కాలానికి శకుంతలకు భరతుడు జన్మిస్తాడు. శకుంతలా భరతులు కణ్వాశ్రమంలోనే కొంతకాలం వుంటారు. ఎంతటి సాధ్వీమణులకైనా పుట్టింట్లో ఎక్కువకాలం వుండటం మంచిది కాదు. భర్తల దగ్గర ఉండటమే భార్యలకు ధర్మం. సతులకు పతులు రక్షకులు అని కణ్వుడు శకుంతలకు బోధపరుస్తాడు. వివాహం అయిన వెంటనే స్త్రీకి తండ్రి ఇంట్లో ఉండే అర్హత పోతుందని ఈ సంఘటన స్పష్టం చేస్తుంది.

కణ్వుడు తపోధనులైన తన శిష్యులను కొందరిని తోడిచ్చి, శకుంతలను దుష్యంతుని వద్దకు పంపిస్తాడు. భరతునితో సహా శకుంతల దుష్యంతుని వద్దకు వస్తుంది. సభలో ఉన్న రాజును చూస్తుంది. ఆశ్రమంలో తాను చూసిన రాజుకు, ఇప్పటి రాజుకు తారతమ్యం కనిపిస్తుంది. ఆనాటి దుష్యంతునిలో చూసిన ఆదరణ, అనుగ్రహం, కరుణలు కనబడక ఆశ్చర్యపోతుంది. మహారాజులు ఎన్నో కార్యాలలో నిమగ్నులై వుంటారు. కాబట్టి తనను గుర్తించక పోయి వుండవచ్చునని తనను తాను సమాధానపరచుకుంటుంది. తన పూర్వ కథను చెప్పి గుర్తు చేద్దామని ప్రయత్నిస్తుంది. దుష్యంతుడు తెలిసి కూడా, తెలియని వాడిలా మాట్లాడతాడు. ఎవరు నీవు? ఎందుకిలా అనుచితంగా మాట్లాడుతున్నావు? ఎక్కడి నుండి వచ్చావో అక్కడికే పొమ్మని కోరతాడు. ఆ పరుష వాక్యాలకు శకుంతల నివ్వెర పోతుంది. మాటలు రాక, చేష్టలుడిగి నిలుచుండి పోతుంది. వాస్తవం ఏదో కేవలం మన ఇద్దరికే తెలుసు. తెలిసి కూడా తెలియనట్లు చెప్పడం ధార్మికులకు తగదు. సభలోని వారికెవరికీ నిజానిజాలు తెలియవు. నీవు ధర్మాత్ముడవైతే అసత్యం చెప్పవు అని దుష్యంతుని అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించమని తెలివిగా చెబుతుంది. శాశ్వతమైనది కీర్తి కాబట్టి, తన యశస్సుకు కళంకం తెచ్చుకోవద్దని సూచిస్తుంది. ఇదివరకు వలెనే తనమీద అనుగ్రహం చూపమని ప్రాధేయపడుతుంది. అయినా రాజు ప్రవర్తనలో ఏమార్పూ రాదు. ఆఖరి ప్రయత్నంగా వివిధ ధర్మ శాస్త్రాలను ఉటంకిస్తుంది. ఎన్నెన్నో ఉపదేశాలు చేస్తుంది. గృహస్థ ధర్మాలను వివరిస్తుంది. ధర్మార్థ కామ సాధనలకి గృహనీతి విద్యకు ఉన్నత స్థిర గుణాలకు, సంతోషానికి భార్య ఆలవాలమైంది కనుక భర్తకు ఇతరాలైనవేవీ ప్రియం కావని నిశ్చయంగా చెబుతుంది.

ఎన్ని విధాలుగా చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా, వివరించినా రాజు నిజాన్ని అంగీకరించేట్లు కనబడడు. వేయి అశ్వమేధయాగాలకన్నా సత్యం శ్రేష్ఠమైందని, నిజాన్ని అంగీకరించేట్లు చేయడానికి ప్రయత్నిస్తుంది. కణ్వాశ్రమ సంభావిత సమయ స్థితి దయకావింపుము. కొడుకు జూడు కరుణా దృష్టిన్ అని కోరుకుంటుంది. 'బొంకు పలుకగా అంత ధర్మేతరనే' అని చివరి మాటగా చెబుతుంది. అయినా దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తాడు. నేను రాజును. నీవు మునిపల్లెలో ఉండేదానివి. ఈ కుమారుడు ఏమిటి? నేను ఇంతవరకు నిన్ను చూసి ఎరుగను అని నిర్దయగా మాట్లాడుతాడు. నిండు కొలువులో 'మానినులసత్యవచనుల నాన్' అని మొత్తం స్త్రీ జాతినే అసత్యవాదులని నిందిస్తాడు. ఆ మాట శకుంతలను తీవ్రంగా బాధిస్తుంది. తనకు న్యాయం లభ్యమవ్వడం కష్టమని భావించిన శకుంతల భారం దైవానికే వదిలేస్తుంది. తాను పుట్టినప్పుడే తల్లిదండ్రులచేత

విడువబడ్డానని, ప్రస్తుతం భర్తచేత కూడా తిరస్కరింపబడ్డానని విలపిస్తుంది.

అశరీరవాణి ఆ సమయంలో శకుంతల మహాపతివ్రత, సాధ్వి అని ప్రకటిస్తుంది. భరతుడు నీ కుమారుడు. అతనిని గ్రహించి, భరించమని సభాసదులందరూ వినేటట్లు చెబుతుంది. అప్పుడు రాజు వారి వివాహాన్ని వేరెవరూ ఎరుగని కారణంగానే ఆమె ఎవరో తెలిసినా, తెలియనట్లు ప్రవర్తించానని అంటాడు. విషయం అందరికీ తెలిశాక రాజు అనురాగంతో ఆలింగనం చేసుకొని, శకుంతలని ప్రేమపూర్వకంగా ఆదరిస్తాడు. యౌరాజ్యానికి భరతుని పట్టాభిషిక్తుణ్ణి చేస్తాడు. ఈ విధంగా శకుంతలకు చివరకు న్యాయం జరుగుతుంది.

శకుంతలోపాఖ్యానం ఎన్నో సామాజిక విషయాలను ప్రస్తావిస్తుంది. స్త్రీని సమాజం ఏ కారణం లేకుండా చిన్న చూపు చూస్తుంది. ఆమె నిస్సహాయురాలు. వివాహం పేరుతో ఆమె మోసానికి గురవుతూనే వుంది. ఆర్థిక, సామాజిక అసమానతలు వివాహానంతరం ఆమెకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. సాంఘికామోదం లేని పక్షంలో ఆ స్త్రీ, ఆమె సంతానం ఎన్నో రకాలుగా అవమానాలకు లోనవుతారు. శకుంతల లాంటి ఎందరో స్త్రీలు నిస్సహాయ స్థితిలో దైవాన్ని ప్రార్థించడం తప్ప, గత్యంతరం లేక విలపిస్తున్నారు. ఈనాటి స్త్రీవాద సాహిత్యం నేపథ్యంలో పరిశీలించిన వారికి శకుంతల కథ నాటి స్త్రీల సామాజిక స్థితిగతులను, వారి దీనావస్థను, నిరూపిస్తుంది. రాజలోకం స్త్రీల విషయంలో ధర్మబుద్ధితో ప్రవర్తించరని, వారి శృంగార కాంక్షల కోసం వివాహం చేసుకొని, ఆ తర్వాత వారిని అవమానించడం మహా పాపంగా భావించాలని శకుంతల కథ వివరిస్తుంది. రాజు తను ధర్మంగా ప్రవర్తిస్తు, పౌరులకు మార్గదర్శకంగా వుండాలి. అనాదిగా స్త్రీలు సమాజంలోని ద్వంద్వ ప్రమాణాల దృష్ట్యా అవమానాలకు గురవుతూనే వున్నారు. సాంఘికామోదం లేనప్పుడు ఆర్థిక అసమానతల వల్ల వారి వివాహాలకు భద్రత లభించదు. ఆ స్త్రీ, ఆమె సంతానం తిరస్కరింపబడతారు అని శకుంతల కథ స్పష్టం చేస్తుంది. శకుంతల పాతివ్రత్యానికి, సత్యానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచి అనాదిగా ప్రజలను సన్మార్గంవైపు నడిచేలా దారి చూపుతుంది.

## ఆధార గ్రంథాలు

1. తెలుగు పర్యాయపద నిఘంటువు - ఆచార్య జి.ఎన్. రెడ్డి
2. తెలుగునాట మహిళల ఉద్యమం (సంకలనం) - కాత్యాయనీ విద్మహే
3. తెలుగు సాహితీ వ్యాస మందారదామం - మండిగొండ నరేష్
4. వ్యాస భారతం - నన్నయ పరిష్కారం - జొన్నలగడ్డ మృత్యంజయరావు
5. మహాభారతం - మానవ స్వభావ చిత్రణం - అప్పజోడు వేంకటసుబ్బయ్య

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆంధ్ర మహాభారతం - శర్మిష్ఠ, దేవయాని

- డా॥. దేవినేని జ్యోతమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సాహిత్య రచన అనేది సమాజ శ్రేయస్సు కోరు కుంటుంది. సామాజిక ప్రయోజనం లేని రచన నిరర్థకం. ఏ సమాజానికైనా వ్యక్తి కేంద్రబిందువు కవి కూడా వ్యక్తిగా సమాజంలో భాగమే. స్త్రీని ఉద్దేశించి ప్రఖ్యాతకవి ఒకరు ఇలా అన్నారు.

"మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ
త్యాగంలో అనురాగంలో తరగని పెన్నిది మగువ"

స్త్రీకి మనదేశంలో విశిష్ట స్థానముంది. స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయం. సమాజంలో స్త్రీని దర్శించడం అనేది ఆధునిక సాహిత్యంలో ప్రధానాంశం.

పురాణ సాహిత్యమంతా స్త్రీలు ఇష్టపూర్వకంగా బానిసత్వాన్ని వరించే పద్ధతిని బోధించింది. పాతి వ్రత్యానికి, పవిత్రతకు, స్వామిభక్తికి నాటి స్త్రీ ప్రతీక అయింది. స్త్రీకి పతిసేవ తప్ప ఏ కోరికా ఉండరాదనేది పవిత్ర ధర్మమైంది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీలు చాలా వరకు తన సొంతమార్గాన్ని అన్వేషించే ప్రయత్నం చెయ్య లేదు. పురాణ సాహిత్యమంతా స్త్రీని పుట్టుబానిసగా బ్రతకాలని స్పష్టం చేసింది. భారతదేశం సంస్కృతీ సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం. ఇలాంటి భారతదేశంలో ఏ ఇంటి గడపలో ఐనా పూజించదగ్గవి రామాయణ, మహాభారత, భగవద్గీత గ్రంథాలు. ఇలాంటి పూజించదగ్గ రామాయణ గ్రంథంలోని సీతగూర్చి పరిశీలిస్తే "అగ్ని ప్రవేశం చేసి నీ శీలాన్ని నిరూపించుకోమని రాముడు సీతను నిలదీశాడు. కాని సీత 14 సంవత్సరాలు నేను లేకుండా నీవు ఉన్నావు కదా నీ శీలాన్ని కూడా ఋజువు చేసుకో అని నిలదీయలేదు. సీత అగ్నిప్రవేశం చేసింది, చంద్రమతి భర్తచే అమ్ముడుపోయింది గాంధారి భర్తకొరకు గుడ్డిగా జీవించింది. ఈ విధంగా ప్రాచీన కాలం నాటి సాహిత్యంలో స్త్రీకున్న స్థానం చాలా హీనమైంది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీ అంటే ఎంతో గొప్పగా పైకి చెప్పినా కాని ఆమె అంతరంగ వర్ణనకు తావివ్వలేదు.

తెలుగు సాహిత్యం పాశ్చాత్యులను సహితం. ఆకర్షించి ఆలోచింపజేసింది సి.పి.బ్రౌన్ దొరలాంటి పాశ్చాత్యుల ప్రభావం తెలుగు సాహిత్యాభివృద్ధిలో కన్పిస్తుంది. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం దాకా అనేక మార్పులు గమనించవచ్చు. తాళపత్రాల సాహిత్యం మరుగున పడిపోకుండా భద్రపరుస్తూనే సాహిత్య వికాసానికి తనవంతు కృషిచేసిన వారిలో ఎందరో కన్పి స్తారు. ఏదిఏమైనా తెలుగు సాహిత్యంలో రచనా వ్యాసంగంలో కవి పురుషుల ప్రస్తావన అధికంగా కన్పిస్తూ కవయిత్రుల ప్రస్తావన అక్కడక్కడ కన్పిస్తూ విన్పిస్తూ వస్తుంది. పురుషాధిక్యత ఈనాటిది కాదు. నానాటి నుంచే మహిళ పురుషాధిక్య ప్రభావానికి లోనై మదనపడుతూ నలుగుతూ వస్తుంది. నిరసన జ్వాలల్ని రగిలిస్తూ గళం విప్పి మాట్లాడింది. ప్రతి మాటకు అర్థాన్ని తెలుపుతూ కలం పట్టి కవిత్వం రాసింది. చదివేది, చదివించేది ఎదురుపడే సమస్యల వలయాలేనని తెలుపుతూ వచ్చింది. ప్రతి పురుషుని విజయం వెనుక స్త్రీ ప్రేరణగా నిలిచిన నిచ్చెన అని సాహితీ మహిళ నికచ్చిగా చెపుతూ వచ్చింది. మహిళ పురుషుని ఆధిక్యతను నిరసించడమే కాదు, అధిగమించేందుకు వేద శాస్త్రాలన్ని తిరగేసింది.

పురాణాలు పుక్కిట పట్టి మాట్లాడుతుంది. ప్రాచీన మహిళ భర్త కనుసన్నల్లోనే అణగారిపోయింది. ఆధునిక మహిళ కళ్ళెర్ర చేసి ప్రశ్నించడం నేర్చుకొంది. తన అభివృద్ధికి అవరోదాలనిపించే ప్రతి విషయాన్ని చైతన్యవంతంగా ఔచిత్యభరితంగా పరిష్కరించుకొనే ప్రయత్నంలో బల్ల చరిచి మాట్లాడడం అలవాటు చేసు కొంది. అంటే సార్వజనీన వయోజన ఓటుహక్కు ద్వారా రాజకీయ స్వేచ్ఛను పొందింది. చట్టసభల్లో ప్రవేశించి రాజకీయ పదవులనెన్నిటినో చాకచక్యంగా అనుభవిస్తు

న్నది. నేటిమహిళ అబల కాదు సబల అని నిరూపించు కొంటూ అంతరిక్ష ప్రయాణం వరకు ఎదిగిపోయింది. ఎన్నో విజయాలను సొంతం చేసుకొని స్త్రీ జాతి ఔన్నత్యాన్ని చాటుతూ ప్రయాణిస్తుంది.

ప్రాచీన సాహిత్యంలో ప్రబంధయుగానికి ముందు కవయిత్రులు లేరనికాదు. వారి చరిత్రను వెలికితీసి చెప్పకపోవటమే వారి వెనుకబాటుతనానికి ప్రధాన కారణమని చెప్పవలసి వస్తుంది. తాళ్ళపాక తిమ్మక్క ఆతుకూరి మొల్ల నుంచి కవయిత్రులు ఎందరో కనిపిస్తూ వారి వారి ప్రతిభా సామర్థ్యాల చేత రామాయణ కావ్యాలను రాశారు. తిమ్మ రామాయణం, మొల్ల రామా యణం లోక ప్రసిద్ధాలే. రాసిన వారు మహిళలే మహిమాన్వితమైన ఇతిహాస కావ్యమైన రామాయణ రచనలో కృతకృత్యులైన తాళ్ళపాక తిమ్మక్క, ఆతుకూరి మొల్ల వీరిరువురు ఆ తర్వాత కవయిత్రులకు మార్గ నిర్దేశకులయ్యారు. ముద్దుపళని, పసుపులేటి రంగాజమ్మ నేటి ముప్పాళ రంగనాయకమ్మ దాకా తెలుగు సాహిత్యంలో విప్లవాత్మకమైన రచనల ద్వారా స్త్రీ శక్తియుక్తులను చాటుతూ వచ్చారు. పురుషాధిక్య ప్రపంచాన్ని ఎదుర్కొంటూ వారికున్న స్థానమేమిటో ఉ ండవలసిన సమున్నత స్థానమేమిటో చెపుతూ వచ్చారు. సమసమాజ నిర్మాణంలోస్త్రీల భాగస్వామ్యాన్ని ఎలుగెత్తి చాటారు. వీరి కృషి ప్రయత్నాలే స్త్రీవాద ఉద్యమానికి బాటలు వేశాయి. స్త్రీవాద ఉద్యమం 20వ శతాబ్దంలో 1980 తర్వాత బలపడినా అంతకుముందు అనగా జాతియోద్యమంలో స్త్రీల పాత్ర బహుముఖంగా కన్పి స్తుంది. భారత జాతీయోద్యమానికి స్త్రీవాద రచయిత్రులు కలం పట్టి గేయాలు వ్యాసాలు రాశారు. నాటకాల్లో నటించారు. భారతీయుల్ని చైతన్యీకరణ గావించుటలో స్వాతంత్ర్యోద్యమం మహెూజ్వలంగా పురోగమించుటలో సరోజనీ, మాగంటి అన్నపూర్ణ, ఉన్నవ లక్ష్మీభాయ్, దుర్గాబాయ్, దువ్వూరి సుబ్బమ్మ, మల్లాది సుబ్బమ్మ ఇత్యాది స్త్రీమూర్తులంతా సాహిత్యపరంగా విశేషమైన ప్రజ్ఞావంతులుగా రాణిస్తూ వారి వారి రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా జాతీయోద్యమానికి దోహదపడిన వారే. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య సంక్షేమ శ్రేయోరాజ్య లక్ష్య సాధన కోసం పనిచేసిన వారు లేకపోలేదు. ఆ తర్వాత వచ్చిన సాహిత్య పోకడల్లో స్త్రీకి జరిగిన అన్యాయాలను ఎండగడుతూ కథలు, నవలలు ఉధృతంగా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఓల్గా గారి స్వేచ్ఛ నవల స్త్రీ స్వేచ్ఛను తేటతెల్లం చేస్తుంది. మీకున్న హక్కులన్ని మాకున్నాయ్ మా హక్కుల్ని కాలరాస్తే కాళికాంబకు బలిస్తామ్ అంటూ స్త్రీవాద ఉద్యమం బలోపేతమయ్యింది. డా.మహజబీన్ వంటి మైనారిటీ మహిళలు కూడా వారి వారి బావ ప్రకటనా స్వాతంత్ర్యాన్ని అభివ్యక్తం చేస్తూ ఆకురాలు కాలం వంటి కవితా సంకలనాలు వెలువరించారు. తాటిపండ్ల రజనీ, విమల, లత, కొండేపూడి నిర్మల, చిల్లర భవానీదేవి, భార్గవీరావ్, మృణాళిని, శరత్ జ్యోష్నారాణి వంటి ఎందరో స్త్రీవాద రచయిత్రులు వారి వారి వాదాలను వినిపిస్తూ తెలుగు సాహిత్యంలో మహిళ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ వారి ఉనికిని తెలియపరుస్తూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

**శర్మిష్ఠ :**

శర్మిష్ఠ, దేవయానికి ప్రాణ స్నేహితురాలు. వృష పర్వుడనే రాక్షసరాజు కూతురు. వేయిమంది కన్యకలతో కలిసి శర్మిష్ఠ దేవయానిని తీసుకొని ఒక సరోవరంలో స్నానం చెయ్యడానికి వెళ్ళింది. కన్యలందరు సరోవరం ఒడ్డుమీద తమ చీరలను ఉంచి స్నానం చెయ్యడం మొదలు పెట్టారు. ఇంతలో సుడిగాలి వచ్చి ఒడ్డుమీద వున్న బట్టలన్నీ కలిసిపోయాయి. దీన్ని గుర్తించిన చెలికత్తెలు ఒడ్డుమీదకు వచ్చి ఎవరి దుస్తులు వారు వెతకడం ప్రారంభించారు. శర్మిష్ఠ తొందరలో దేవయాని చీరను కట్టుకొన్నది. దేవయానికి శర్మిష్ఠ చీర మిగిలింది. ఆ చీరను కట్టుకోవడానికి దేవయానికి ఇష్టం లేదు. "లోకోత్తర చరిత్రుడైన శుక్రాచార్యుని కుమార్తెను, నీకు పూజ్యరాలిని, భూసురకన్యను, నేను నీవు విడిచిన బట్టలను కట్టుకోవచ్చునా చెప్పు? అని దేవయాని

గద్దించింది. ఇందుకు శర్మిష్ఠ ఆశ్చర్యశకితురాలైంది. 'మా నాన్న గారి దగ్గర మీ నాన్నగారు పని చేస్తారు. వారు మా తండ్రిని దీవించి వారికి హితం చేకూరుస్తుంటారు. వారిద్దరి మధ్య తేడాలు లేవు. మనిద్దరి మధ్య తేడా లెందుకు? మీ నాన్న గొప్పతనం గురించి నీ గొప్పతనం గురించి ప్రత్యేకించి నాకు వేరుగా చెప్పాలా! నేను కట్టుకున్న చీర నీకు కట్టుకోవడానికి అంత పనికిరాదా! అని అభిమానంతో శర్మిష్ఠ పలికింది.

దేవయాని తనపట్టు వీడలేదు. శర్మిష్ఠ కూడా రోషంతోనే ఉంది. కట్టిన చీర విప్పటం క్షత్రియ స్త్రీకి అవమానమని శర్మిష్ఠ అనుకొన్నది. ఒకరు విప్పిన చీరను కట్టుకోవడం బ్రాహ్మణ స్త్రీకి తగదని దేవయాని అనుకొన్నది. ఇద్దరి మధ్య మాటలు పెరిగాయి. దేవయానిని పక్కనే ఉన్న పాడుబడ్డ బావిలోకి తోసేసి శర్మిష్ఠ వేయిమంది కన్యకలతో ఇంటికి తిరిగి వెళ్ళి పోయింది.

ఈ విషయం 'ఘూర్ణిక' అనే చెలికత్తె ద్వారా శుక్రా చార్యునికి తెలుస్తుంది. శుక్రాచార్యుడు కోపంతోవున్న దేవయాని దగ్గరకు వచ్చాడు. క్రోధం వల్ల కలిగే అనర్థాలను కుమార్తెకు బోధించి శర్మిష్ట రాజకుమార్తె చిన్నపిల్ల. దానితో నీకు పంతమెందుకు? ఇంటికి పోదాం రా అని శుక్రాచార్యుడు దేవయానిని బుజ్జగించాడు. దేవయాని వృషపర్వనగరంలోకి నేనింక రాను. ఎక్కడికైనా వెళతాను అని బెదిరించి శుక్రాచార్యునికి దేవయాని అంటే ప్రాణం కనుక నీతో నేనుకూడా వస్తానని బుజ్జగించి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ విషయం గూఢచారుల ద్వారా వృషపర్వునికి తెలుస్తుంది. వృషపర్వుడు శుక్రాచార్యుని వద్దకు వచ్చి నమస్కరించి శుక్రాచార్యుల మృత సంజీవని విద్యా ప్రభావంతో దేవతలకు ఎంతో మేలు జరిగిందని ప్రశంసించి దేవయాని మనసుకు ఏది ఇష్టమైతే దానిని తప్పక ఇస్తానని వృషపర్వుడు మాట ఇచ్చాడు. ఇది విన్న దేవయాని సంతోషించింది. వేయి మంది కన్యకలతో కూడిన శర్మిష్ఠ తనకు దాసిగా ఉండాలని కోరింది. దీనికి వృషపర్వుడు అంగీకరించాడు. శుక్రుడు సంతోషించాడు. శర్మిష్ఠ వేయి మంది చెలికత్తెలతో ప్రతిరోజూ దేవయానిని సేవిస్తుండేది. ఒకరోజు అందరూ కలిసి ఉద్యానవనానికి వెళ్లారు. ఆ సమయంలో యయాతి సమీప అరణ్యంలోకి వేటకోసం వచ్చి ఆవనంలో ప్రవేశించాడు. దేవయాని ప్రక్కనే 'అతిశయ రూప లావణ్య గుణసుందరి'వైన శర్మిష్ఠను ఆమె చెలికత్తెలను చూసి వారిని పరిచయం చేసుకున్నాడు.

దేవయాని యయాతి మహారాజు వివాహానంతరం సహస్రకన్యాపరివృత్తయైన శర్మిష్ఠను అరణంగా అందించాడు. వీరందరికీ అన్నపాన భూషణాది సౌకర్యాలను యయాతి కల్పించాలనీ, శర్మిష్ఠతో కలిసి శయనించటం పరిహరించాలనీ ఆజ్ఞాపించాడు. యయాతిదేవయానినీ, శర్మిష్ఠనూ, కన్యా సహస్రాన్నీ వెంట తీసుకొని నిజనగరానికి వెళ్ళాడు. దేవయాని అనుమతితో శర్మిష్ఠను అశోక వన సమీపంలోని ఒక గృహంలో నివాసముంచాడు.

దేవయాని అహంకారవతి కనుక యయాతికి సంసార జీవితంలో ఆత్మతృప్తిలేదు. మృతి చెందుతున్న మానసిక గార్హస్థ్య ధర్మం యయాతిలో మరలా పునర్జీవింపచేసిన శక్తి శర్మిష్ఠ. శర్మిష్ఠ యౌవనవతి, సౌందర్యవతి. దేవయాని ఏ విధంగా యయాతిని కోరి వరించి సాధించుకొన్నదో అట్లాగేతానూ ఆ మహారాజును పొందాలని ఆశపడుతూ వుండేది. ఒక రోజు యయాతి అశోకవన విహారానికి వచ్చాడు. ఒంటరిగా వున్న శర్మిష్ఠను చూశాడు. ఆమె యందు అనురాగాన్ని పెంచుకొన్నాడు. శర్మిష్ఠ రాజుకు నమస్కరించి ఇలా అంది.

"నీలగళోపమాన। కమనీయగుణోన్నతి జెప్ప జాలు న
న్నేలిన దేవయానికి నరేశ్వర! భర్తవు గాన నాకునుం
బోలగ భర్తవీవ: యిది భూనుత ధర్మంపథంబు, నిక్కువం
బాలును దాసియున్ సుతుడు నన్నవి వాయని
ధర్మముల్ మహిన్ (ఆది.3.174)

ఆ దేవయానిని పరిగ్రహించినపుడే ఆమెతో అరణంగా వచ్చిన నేను కూడా నీకు పరిగ్రహయోగ్యురాలినే కాబట్టి నీవు కరుణించి నన్ను కూడా నీ సతిగా స్వీకరించు మని

ప్రార్థించింది. ఆ సమయంలో యయాతి శుక్రాచార్యుడు విధించిన నియమాన్ని శర్మిష్ఠకు చెప్పడం, శర్మిష్ఠ ఒక ఆపద్ధర్మాన్ని గుర్తు చేసియయాతికి అనుకూలవతి అయ్యింది. వీరిద్దరికి కొడుకు పుట్టాడు. దేవయానికి ఈ విషయం తెలిసి శర్మిష్ఠ దగ్గరకు వచ్చి సంతానం గురించి అడుగుతుంది. శర్మిష్ఠ ఒక మహాముని వరం వల్ల పుత్రుడు జన్మించాడని చెపుతుంది. ఆ తర్వాత యయాతి వల్ల శర్మిష్ఠ ముగ్గురు కొడుకులకు జన్మనివ్వడం జరిగింది. వీరే ద్రుహ్యుడు (ద్రుహ్యి), అనువు, పూరుడు.

ఒక రోజు ఆ ముగ్గురు కొడుకులు ఆడుకొనే సమయంలో దేవయాని అక్కడికి వచ్చింది. యయాతి ప్రతిరూపాలుగా వున్న ఆ కుమారులను చూచి యయాతిని ప్రశ్నించగా సమాధానం లేదు. ఆ బిడ్డలనే అడుగగా వారు యయాతి, శర్మిష్ఠలు మా తల్లిదండ్రులని చెప్పారు. ఇది విన్న దేవయాని యయాతి శర్మిష్ఠల మీద కోపంతో ఏడుస్తూ శుక్రాచార్యుని ఆశ్రమానికి వెళ్ళింది. తండ్రిపాదాల మీద పడి ఏడ్చి జరిగిందంతా చెప్పింది. యయాతి కూడా దేవయాని వెంట శుక్రాచార్యుని ఆశ్రమానికి వచ్చాడు. శుక్రాచార్యుడు యయాతి మాటలను వినడానికి కూడా సమయమివ్వలేదు. తనకిష్టమైన కూతురికి అపకారం చేశాడనే కోపంతో జరాభారపీడితుడు కావాలని శాపమిచ్చాడు. యయాతి వినయంతో జరిగిందంతా చెప్పాడు. కాని నాకు దేవయాని అంటే అభిమానమే మీ శాపం వల్ల కలిగే జరాభారం నాకేకాదు, మీ కుమార్తెకు కూడా దు:ఖదాయకమే. కనుక ఈ శాపాన్ని మీరు ఉపసంహరించుకోవాలి అని ప్రార్థించాడు. శుక్రుడు కరిగిపోయి శాపాన్ని ఉపసంహరించుకొన్నాడు.

దేవయాని వివాహ ధర్మాన్ని భౌతికధర్మంగా గ్రహించి అహంకారంతో సంసారాన్ని నాశనం చేసుకున్నది. దేవయాని స్వార్థపరురాలు. పరమార్థం ఆమెకు తెలియదు. ఇలాంటి ప్రవృత్తి గల ఇల్లాలు గార్హస్థ్య ధర్మానికి వినాశకారి అవుతుంది. శర్మిష్ఠ భర్తమీద ప్రేమ, అనురాగం గల యువతిగా, గార్హస్థ్య ధర్మానికి ప్రాణం పోసి, విలువనిచ్చే యువతిగా కన్పిస్తుంది. యయాతి దేవయాని వల్ల యజమానిగా మృతప్రాయుడయ్యాడు, శర్మిష్ఠ వల్ల మరల యజమానిగా పునరుజ్జీవితుడైనాడు. గృహిణీక్యం దేవయాని వల్ల ప్రాణ చైతన్యాన్ని కోల్పోయింది. శర్మిష్ఠ వల్ల పంచప్రాణాలతో పల్లవించింది.

**దేవయాని :**

దేవయాని శుక్రాచార్యుని కూతురు. దేవయాని వృషపర్వుని పట్టణంలో తండ్రి శుక్రాచార్యుని దగ్గర వుంటుంది. కచుడు బృహస్పతి కుమారుడు. శుక్రాచార్యుడు కచునికి గురువు. మృత సంజీవని విద్యను అభ్యసిస్తున్నారు. కచుడు తండ్రిదగ్గర శిష్యుడైనందున ప్రియమైన మాటలతో పూలు, పండ్లు తెచ్చిచ్చి ఆమెను సంతోషపెట్టి ఆమె అభిమానాన్ని పొందారు. దీన్ని రాక్షసులు సహించలేక దేవతలకు గురువైన బృహస్పతితో తమకు గల వైరాన్ని గుర్తుచేసుకొని హెూమధేనువులను కాస్తూ ఒంటరిగా వున్న అతన్ని చంపి ఒకపెద్ద చెట్టు బోదెకు బంధించి వెళ్ళిపోయారు. సూర్యాస్తమైంది. వరోమధేనువులు ఇంటికొచ్చాయి. కచుడు మాత్రం రాలేదు. దేవయాని బాధపడుతూ తండ్రి వద్దకు వెళ్ళి ఇలా అంటుంది. కచుడు తిరిగి రాలేదు. అడవిలో క్రూరమృగాల వల్ల, రాక్షసుల వల్ల, సరాల వల్ల, ఇబ్బంది పడ్డాడేమోనని తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది.

శుక్రాచార్యుడు తనదివ్య దృష్టితో గుర్తించి రాక్షసులచేత చంపబడిన కచుడుని మృతసంజీవని విద్యతో బ్రతికిస్తాడు. దీనితో దేవయాని సంతోషిస్తుంది. కొన్ని రోజుల తర్వాత మళ్లీ పూలు తెచ్చేందుకై అడవికి వెళ్ళిన కచుడుని చంపారు. అంతటితో ఆగక రాక్షసులు కచుని రూపురేఖలు లేకుండా కాల్చి బూడిదను చేసి మద్యంతో కలిపి శుక్రుడు తాగేటట్లు చేశారు. శుక్రుడు మద్యం మైకంలో వుండగా దేవయాని కచుని జాడ తెలియక ఏడుస్తుంది. ఈనాడు కూడా కచుడు రాకుండా ఆలస్యం చేశాడు. రాక్షసుల చేత చంపబడినవాడయ్యాడు కాబోలు! అని చింతిస్తుంది. శుక్రాచార్యుడు ఆమెను చూసి ఇలా అంటాడు. సంజీవని విద్య గోప్పతనం తెలియక రాక్షసులు విర్రవీగుతున్నారు. కచుడు ఉత్తమ స్థితిని

పొందుతాడు. దీనికి బాధపడడమెందుకంటాడు. అప్పుడు దేవయాని ఇలా అంటుంది "మతిలోకోత్తరుడు, బృహస్పతి సుతుడునీ శిష్యుడు. బ్రహ్మ చర్యాశ్రమ సంపన్నుడైన ఆ కచుడు అకారణంగా రాక్షసుల చేత సంహరింపబడితే నేను అతని కొరకు శోకించకుండా ఎట్లా ఉండేది? ధర్మచ్యుతిని సహించని మీరు ఈ అధర్మాన్ని ఎట్లా సహిస్తారు? కచుడు కనపడితే తప్ప నేను ఆహారం ముట్టను అని దేవయాని ఏడుస్తుంది. యోగదృష్టితో లోకాలన్ని చూశాడు. కచుడు కనిపించలేదు. చివరికి భస్మమై తన ఉదరంలోనే వున్న కచుడిని చూశాడు. తనకు తెలిసిన మృత సంజీవని విద్యచే బ్రతికించాడు. సంజీవని విద్యను నేర్చుకొన్న తర్వాత శుక్రాచార్యుని అనుమతితో దేవలోకానికి ప్రయాణమయ్యాడు. ఆ సమయంలో కచున్ని చూచి దేవయాని దు:ఖంతో ఇలా అన్నది.

"నీవును బ్రహ్మచారివి వినీతుడ, వేనును గన్యకన్, మహీ
దేవకులావతంస! రవితేజ! వివాహము నీకు నాకు మున్
భావజశక్తి నైనయది, పన్నుగ నన్ను బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రు దయ, జేయుము నాకు బ్రియంబు నావుడున్
(ఆది - 3, 129)

దేవయాని మాటలకు కచుడు, విషాద చిత్తుడై 'గురువులకు శిష్యులు పుత్రులు. లోక ధర్మపథంలో ఇది అనుసరించవలసిన పరమార్థం. నీవు నాకు గురు పుత్రివి. అంటే నాకు సహోదరివి. లోకనింద్యమైన ఈ తనూ సంగమాన్ని నీవు బావించటం తప్పు. నన్ను పెళ్ళి చేసుకోమని కోరడం ధర్మంకాదు. అన్నాడు. ఎన్నో రకాలుగా దేవయాని కచున్ని బ్రతిమిలాడింది. కానీ కచుడు తాను ధర్మం తప్పను అన్నాడు. దేవయాని కోపించి "నా తండ్రి వల్ల నీవు పొందిన మృత సంజీవని విద్య నీకు పనిచేయకుండు గాక" అని శాపమిచ్చింది.

కచుడు సోదరీ మృత సంజీవనీ విద్య నాకు పని చేయకున్ననూ, నా వలన ఉపదేశం పొందిన వారికి పనిచేస్తుంది. నీవు ధర్మం తప్పి నన్ను వివాహమాడమని కోరావు. కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు వివాహ మాడకుండుగాక" అని ప్రతిశాపం ఇచ్చాడు. కచుడు దేవలోకానికి వెళ్ళి తన తండ్రికి మృత సంజీవనని ఉప దేశించాడు. తర్వాత కాలంలో జరిగిన అనేక సంఘటనల వల్ల దేవయాని క్షత్రియుడైన యయాతికి బార్య అయింది.

ఈ కథాగమనాన్ని బట్టి చూస్తే స్త్రీ అహంకారిగా మారితే వచ్చే అనర్థాలు ఎలాంటివో దేవయాని పాత్ర ద్వారా తెలుస్తుంది. తాను సుఖాన్ని పొందకపోగా తన చెలికత్తె అరణపు దాసి శర్మిష్ఠ మనోభావాలను తెలుసుకోకుండా ఒక రాజు కూతురు పట్ల అసూయ ద్వేషాలను ద్యోతకం చేస్తున్నది.

దేవయాని పాత్ర ఒక అసూయ పాత్రగా ఓర్వలేని నిరంకుశ పాత్రగా మాత్రమే మిగిలిపోయింది. ఐతే శర్మిష్ఠ మాత్రం ప్రకృతి సిద్ధమైన తన మనోభావాల కనుగుణ్యంగా యయాతి రాజుకు దగ్గరై మాతృత్వాన్ని పొందడం అనేది ఆమెలోని సహజ భావనను ఎవరు అడ్డుకోలేకపోయారు. అందువల్ల తన కాంక్షను, వాంఛను నెరవేర్చుకోగలిగింది. స్త్రీ తన సహజత్వానికి భంగం వాటిల్లిందని పైకి అన్పించినా, అప్పటి పరిస్థితులకు అనుగుణ్యంగా ఒక రాజు పుత్రిక శిరోమణిగా యయాతి మహారాజు మనసును గెలిచి, మాతృత్వాన్ని పొంది నేటి సమాజానికి సందేశాత్మక పాత్రగా దర్శనమిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమదాంధ్ర మహాభారతం - ఆదిపర్వం - తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు
2. తెలుగు సాహిత్య సమీక్ష - డా.జి.నాగయ్య
3. మహాభారతం - సమకాలీనత - డా.వైరాగ్యం ప్రభాకర్
4. పౌర్ణమి - డా.కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి

# విశ్వనాథ నవలల్లో యోగినీ స్త్రీలు - పరిశీలన

**- ఆతుకూరి వేంకటేశ్వర్లు(యోగి),** సహాయక ఆచార్యులు, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

In India the woman was the manifestation of God and that her whole life was given upto the thought that she was a mother (భారతదేశంలోని స్త్రీ సాక్షాత్తు భగవంతుని ప్రతిరూపమే. ఆమె జీవితమంతా కూడా మాతృదనం అన్నదానికోసం త్యాగం చేయబడింది) ... అంటూ విశ్వవిఖ్యాత వేదాంతి స్వామి వివేకానంద, భారత స్త్రీ గురించి తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

భారతీయ జీవన విధానంలో స్త్రీకి సమున్నత స్థానం ఉంది. అనిర్వచనీయమైన గౌరవ స్థానం ఉంది. ఇంతటి మహోన్నతమైన స్త్రీని భారతీయ అర్షవాఙ్మయం ఎలా చిత్రించిందో తెలుసుకుందాం.

## ఆర్ష వాఙ్మయంలో స్త్రీలు :

భారతీయులది ఆర్షధర్మం. అంటే ఋషులు ఏర్పరచిన ధర్మం. ఈ ధర్మం పునాదిగా వాఙ్మయం ఏర్ప డింది. ఇందులో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు ముఖ్యమైనవి. ఈ వాఙ్మయాన్ని పరిశీలిస్తే స్త్రీకి ఆకాలంలో ఉన్న గౌరవారాధనలు ఎలా ఉండేవో తెలుస్తుంది.

వేదకాలంలో స్త్రీలకు పురుషునితో సమానంగా గౌరవ హోదా ఉండేది. జ్ఞాన, పుణ్య సముపార్జనలో, ఆచార వ్యవహారాలలో, యుద్ధ పరిపాలనా రంగాల్లో మహిళ పురుషునితో సమానంగా దర్శనమిస్తుంది.

"సురీయోదేవీ, యుషసగ్ం యోచ మానామరీయ
వయోషా యభ్యేతు పశ్చాత్...." అని కృష్ణ యజుర్వేద మంత్రం. మనుష్యుడు స్త్రీని అనుసరించి ఎలా నడుస్తాడో, సూర్యుడు కూడా ఉషాదేవిని అనుసరించి నడుస్తున్నాడని ఈ మంత్రార్థం. అంటే మనిషి జీవితం స్త్రీ ప్రమేయంతోనే నడుస్తుందని అర్థం. దీనిని బట్టి వేదకాలంలోనే స్త్రీకి సమున్నత గౌరవం లభించింది.

వేదకాలంలో స్త్రీలు బ్రహ్మవాదినులుగా కూడా ఉండేవారు. సాధారణంగా వివాహం చేసుకోకుండా జీవితాంతం విద్యాధ్యయనంలో గడిపినవారిని బ్రహ్మ వాదిని అంటారు.

వేదాంతాలైన ఉపనిషత్తులలో కూడా స్త్రీలకు ప్రథమ స్థానాన్ని ఇవ్వటం జరిగింది. తైత్తిరీయోపనిషత్ "మాతృ దేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ...." అని ప్రకటించి ప్రథమపూజను అందు కోవలసినది మాతృమూర్తియే అని చెప్పింది. మను ధర్మశాస్త్రంలోను "యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః" అని చెప్పబడింది. ఎక్కడైతే మహిళలు గౌరవం పొందుతారో అక్కడ దేవతలు ఆనందంతో నిలుస్తారు అనటం విశేషం.

పురాణేతిహాసాలలోను మహిళకు గౌరవస్థానం లభించింది. రామాయణంలో సీతకు మూడు భాషలు తెలుసు. రావణుడు కూడ సీతను "పండితురాలా" అని అనేకమార్లు సంబోధించాడు. శబరి పురుషులతో సమానంగా బ్రహ్మ విద్యనభ్యసించింది. భారతంలోని "విదురనీతి"లో విదురుడు స్త్రీలను సంరక్షించాలని స్పష్టంగా చెప్పాడు. మహిళలు "గృహానికి వెలుగు నిచ్చేవారు, గృహలక్ష్మిగా ప్రకాశించేవారు" అని అన్నాడు. భారతకాలంలో స్త్రీలను మిక్కిలిగా గౌరవించినట్లు గ్రహించవచ్చు. సావిత్రి, శకుంతల, తపతి వంటివారి చరిత్రలను పరిశీలిస్తే స్పష్టమౌతుంది.

భారతకాలంలో వివాహం చేసుకునే విషయంలోను స్త్రీకి స్వేచ్ఛ ఉన్నట్లు తెలుస్తుంది. "స్వయంవరం" అనేది అటువంటిదే. ఆ రోజులలో సంతానం కోసం "నియోగ పద్ధతి"ని అనుసరించేవారు. ఆనాడు బహుభర్తృత్వం కూడా ఉంది. ద్రౌపది అందుకుదాహరణ.

మహాభారత కాలం తరువాత మధ్యయుగం నాటికి స్త్రీ తన ప్రాభవాన్ని కోల్పోయినట్లుగా కనిపిస్తుంది. విదేశీయులరాక, భారతీయ సంస్కృతిపై జరిగినదండ యాత్రలు, ఫలితంగా వచ్చిన సాంస్కృతిక పరిణామంతో స్త్రీల పరిస్థితులలోఎంతో మార్పు వచ్చింది. అరబ్బులు, అఫ్ఘనులు, పఠానులు, మొగలులు చేసిన దాడులతో భారతీయ సాంస్కృతిక జీవన విధానం కొంత మారి పోయింది. సంస్కృతికి ప్రతిరూపాలైన స్త్రీలను, దేశాన్ని రక్షించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో స్త్రీలకు ఉండే స్వేచ్ఛ తగ్గిపోయింది. కొన్ని నిబంధనలు, ఆచారాలు ఏర్పడ్డాయి. అవి కఠినంగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా మధ్య యుగంలో స్త్రీలు కొంత నలిగిపోయారు.

మధ్యయుగంలో మహిళలు కోల్పోయిన స్వేచ్ఛను ఆధునిక యుగంలో సంస్కర్తల కృషిఫలితంగా తిరిగి పొందారు. గురజాడ, కందుకూరి వంటి తెలుగు రచ యితల సాహిత్యంలో పరిణితి చెందిన స్త్రీలు కనిపిస్తారు.

## భారతీయ మహిళలు - యోగం :

అన్ని రంగాలలో ప్రవేశించి ప్రతిభను, సాధికారతను సాధించిన మహిళలు 'యోగం'లో నిష్ణాతలుగా కనిపిస్తారు. క్రీ.పూ.7,8 శతాబ్దాల క్రిందటి ఉపనిషత్ సాహిత్యంలో గార్గి, మైత్రేయి వంటి బ్రహ్మవాదినులు, ఉన్నట్లు తెలుస్తుంది. వీరు యోగినీమణులు. అరవైనాలుగు మంది యోగినులు ఉన్నట్లుగా ప్రాచీన దేవాలయ శిల్పాలను బట్టి తెలుస్తుంది.

యోగ సాధన ద్వారా లభించే అణిమాది అష్టసిద్ధు లను సాధించిన భారతీయ మహిళలు భారతీయ సాహిత్యంలో కనిపిస్తారు. దుష్టరాక్షస సంహారం చేసిన శక్తిస్వరూపాలగా కనిపించే స్త్రీ శక్తులందరూ యోగినులే.

## విశ్వనాథ సాహిత్యం :

తెలుగులో శతాధిక గ్రంథకర్త కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తమ నవలల్లో యోగినీ స్త్రీల పాత్రలను ఉదాత్తంగా చిత్రించారు. ఈ యోగినీలు జీవిత పర మార్థాన్ని తెలియచెప్పిన ఆదర్శమూర్తులు.

సనాతన భారతీయ ధర్మం ప్రకారం మనిషి భోగజీవిగా మిగిలిపోకూడదు. భోగాలు రోగాలకు కారణమౌతాయి. భోగాలు శ్రుతిమించితే మనిషి జీవితం పశుప్రాయంగా మారుతుంది. మనిషిని పశువుగా మారకుండా పశు పతిత్వం వైపు మరలేటట్లుగా చేసిన మహోన్నత వ్యక్తిత్వం గల స్త్రీలు విశ్వనాథవారి నవలల్లో కనిపిస్తారు. ఆ స్త్రీలలోను యోగినీమణులు ఉండటం విశేషం.

## విశ్వనాథ నవలల్లో యోగినీ స్త్రీలు :

విశ్వనాథవారి నవలల్లో వేయిపడగలు నవల సుప్రసిద్ధం. వేయిపడగలు కలిగిన ఆదిశేషువు కాలానికి ప్రతీక. పాశ్చాత్యుల రాకతో మనదేశ సంస్కృతిలో పెద్ద మార్పులు వచ్చాయి. కాల ప్రభావానికి లోనై మన ధార్మిక జీవనం అస్తవ్యస్తమైపోయింది. ఇలా పతనమైపోతున్న సంస్కృతికి జీవంపోసే పాత్రను వేయిపడగలలో విశ్వనాథ సృష్టించారు. అదే గిరిక పాత్ర.

## గిరిక :

గిరిక భోగపు స్త్రీ ఐన రత్నగిరి కూతురు. ఆమె భోగపు సానిగా జీవితాన్ని గడపాలి. కాని, గిరిక శరీర సుఖాలను తృణప్రాయంగా భావించి, మనస్సు పరమేశ్వరుని మీదు నిలుపుతుంది. తన హావభావాలతో, సరస సంగీత నాట్యాలతో పురుషులను మెప్పించి జీవించాల్సిన వృత్తిలో ఉన్న గిరిక, వాటివైపు కన్నెత్తి కూడా చూడలేదు.

వేణుగోపాల స్వామి ఉత్సవాలలో గిరిక ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నది. భగవద్భక్తిలో మునిగితేలింది. కృష్ణవిగ్రహాన్ని తన గదిలో ఉంచుకొని పూజించింది. స్వామికి తన సర్వస్వాన్ని సమర్పించింది. రాత్రి నిద్ర పోయేవరకు స్వామినే ధ్యానించింది. "స్వామి లేనిది, నాతో మాటాడనది, నేను జీవించను"(వేయి పడగలు) అంటూ గిరిక మధుర భక్తురాలుగా పరిణితి చెందింది. ఇది భక్తియోగం. ఈ యోగినీ లక్షణం విశిష్టం.

రామేశ్వరమనే దుష్టుడు గిరికను చూసి "పిల్లా! ఎచటికి వెళ్ళుచున్నావని" పలకరిస్తాడు. అతని మాటలోని, చూపులోని వక్రబుద్ధికి తన దేహం మైలపడిపోయిందని గిరిక భావించింది. ఇంటికి చేరాక అలంకారాలన్నీ తీసివేసి స్నానం చేసి స్వామిని ధ్యానిస్తుంది. ఈ సంఘటన గిరిక యొక్క పవిత్రమైన మనస్సుకు, సాధనాశీలతకు నిదర్శనం.

## చందవోలు రాణి :

విశిష్టమైన యోగినీ స్త్రీ మూర్తులు విశ్వనాథవారి నవలల్లో కనిపిస్తారు. భోగం వారి కుటుంబంలో పుట్టి మహాయోగినిగా మారిన మరో స్త్రీమూర్తి "చందవోలు రాణి". ఈమె మహా సౌందర్యవతి. ఈమెను పొందాలని ఎందరో ధనవంతులు, రాజరికపు పెద్దలు, కోరుకుంటారు. ఈమె తల్లికి మణిమాణిక్యాలను ఇవ్వజూపుతారు. తల్లి అడిగినప్పటికి రాణి సానిగా మారటానికి ఒప్పుకోలేదు. ఆమె జీవితాంతం యోగినిగానే జీవించింది. రాజును వివాహం చేసుకున్నప్పటికి, శరీర సంబంధ బంధాలు లేకుండా యోగసాధన, తపస్సులోనే కాలం గడిపింది. యోగినిగానే శివైక్యం చెందింది.

విశ్వనాథవారు యోగినీ స్త్రీమూర్తుల పాత్రల ద్వారా సమాజానికి గొప్ప సందేశం ఇచ్చారు. స్త్రీ ఒక భోగ్య వస్తువు కాదు. ఆమె వ్యక్తిత్వం కలది. ప్రాచీన కాలంలో స్త్రీలు వేదాధ్యయనం, యజ్ఞయాగాదులు ఆచరించి తరించారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభంజనంలో పడి స్త్రీలు తమ ఔన్నత్యాన్ని కోల్పోయారు. కనుక, భారతనారి యొక్క దివ్యత్వాన్ని ప్రపంచానికి చాటాలని విశ్వనాథ భావించి, ఇటువంటి యోగినీ స్త్రీమూర్తుల పాత్రలను సృష్టించారు.

## గణాచారి :

విశ్వనాథ సృష్టించిన మరొక అద్భుత యోగినీ స్త్రీ పాత్ర గణాచారి. ఈమె అసలు పేరు నాగమ్మ. ఈమెకు వివాహం చేయాలని ప్రయత్నం మొదలుపెట్టినప్పుడల్లా స్మృతి తప్పి పడిపోతూ ఉండేది. అందువల్ల ఆమె తల్లిదండ్రులు నాగమ్మను నాగేశ్వర స్వామికిచ్చివేశారు. అలా ఆమె గణాచారిగా మారింది.

గణాచారి విభూతి కుంకుమలను ధరించేది. సాత్త్వికమైన ఆహారాన్నే స్వీకరించేది. తనవదిన రంగమ్మ మతం మార్చుకొని గణాచారిని వెక్కిరించటం మొదలు పెట్టింది. రంగమ్మ ఆధునిక స్త్రీలాగ మారి ఆచార వ్యవహారాలను కించపరుస్తూ గణాచారిని నిందించింది. ఇలా జరిగిన సందర్భాలలో గణాచారి తన శక్తులను చూపించింది. కాదు, ఆమె ఆరాధించే నాగేశ్వరస్వామే చూపించాడు. వేపచెట్టు ఎక్కిన రంగమ్మ కొడుకు క్రిందపడి కాలు విరుగుతుంది. ఇటువంటి నిదర్శనాలు ఎన్నో జరిగాయి.

గణాచారి భవిష్యవాణిని వినిపించేది. ఈమె వాణిలో ప్రధానంగా ఎవరు మరణించబోతున్నారో వారిని గురించి చెప్పేది. ఇలా తాను ఆరాధించే లయకారుడైన శివుని తత్త్వాన్ని అలవరచుకుంది.

విశ్వనాథవారు గణాచారి అనే ఈ యోగినీ స్త్రీపాత్ర ద్వారా "స్వధర్మేనిధనం శ్రేయః పరధర్మో భయావహః" అనే శ్రీకృష్ణ సందేశాన్ని లోకానికిచ్చారు. భారతీయ సంస్కృతి ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలనే నాలుగు కాళ్ళ మండపం వంటిదని, దాని నీడన జీవించిన వారికి సుఖసంతోషాలతోపాటు ముక్తి కూడా లభిస్తుందని, ఈ విశిష్ట సంస్కృతిని మరచిపోయిననాడు సమాజం పతనమౌతుందని చెప్పారు. భారతీయ ధర్మంలో లేని ఆదర్శం పరమతాలలోలేదని, క్రొత్తగా వచ్చిన పరాయివారు మన సంస్కృతిని వెక్కిరించటం బాధాకరమని తెలిపారు విశ్వనాథ.

గణాచారి నాగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పాకలో నివసిస్తూ, ధర్మారావనే సజ్జనుడు పంపించే భోజనాన్ని స్వీకరిస్తూ శివధ్యానంలో గడుపుతూ శివైక్యం చెందుతుంది. వ్యవసాయదారుల కుటుంబంలో జన్మించిన ఈమె మహాయోగినిగా జీవించింది.

## ముగింపు :

విశ్వనాథవారి ఈ యోగినీ మూర్తులను చూస్తే మన తెలుగునేలపై అవతరించిన యోగినీ స్త్రీలు గుర్తుకొస్తారు. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ తల్లి, నీలంపాటి అమ్మవారు, ఆదోని లక్ష్మమ్మలు యోగినీ స్త్రీలుగా ప్రసిద్ధులు. తొలుత సమాజం వీరిని ఆక్షేపించింది. అవమానించింది. వారి మహిమ తెలిశాక వారిని ఆరాధించింది. ఈ యోగినీ స్త్రీలెవ్వరూ భౌతిక సుఖాలకోసం పరితపించినవారు కారు. ఐహిక వాంఛలను విడనాడి, ఆముష్మికానందం కోసం తపస్సు చేశారు. దేవతలుగా ఆరాధింపబడుతున్నారు. ఇది భారతీయ సంస్కృతి స్త్రీలకిచ్చిన గౌరవం. విశ్వనాథ తన నవలల్లో స్త్రీమూర్తుల లోని దైవత్వాన్ని వెలికితీసి దేహం దేవాలయం వంటిదని రుజువుచేశారు. మహిళలను కామినులుగా కాకుండా మోక్షగామినులుగా చూడాలని విశ్వనాథ సందేశమిచ్చారు. ఇందుకు నిలువు టద్దాలే ఆయన స్త్రీ పాత్రలు.

## ఆధార గ్రంథములు :

1. కమల, ఆర్ - విశ్వనాథ వారి నాటకములు : ఒక పరిశీలన - తెలుగు అకాడమి, హైదరాబాదు - 1991.
2. కోదండ రామాచార్యులు, కె - వేయిపడగలు : భాగవత తత్త్వము - శ్రీమతి కె. జానకీ, ఖమ్మం - 1995
3. వెంకటరెడ్డి, కసిరెడ్డి - భారతీయ మహిళ - హైదరాబాదు - 1998
4. వేంకట రాజగోపాలచార్యులు, తిరుమల - విశ్వనాథ శబరి : విజ్ఞాన వ్యాఖ్య - శ్రీనివాసభారతి, భీమవరం - 2011.
5. సత్యనారాయణ, విశ్వనాథ - చందవోలు రాణి - శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ-2013
6. సత్యనారాయణ, విశ్వనాథ - వేయిపడగలు - శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ-2013
7. Swami Vivekananda - My India : India Eternal, Ramakrishna Matham, Hyderabad - 1990.

# ఆత్మచరితము : విశేషాంశాలు (తెలుగులో తొలి మహిళా ఆత్మకథ )

– డా॥. శిరీష ఈడ్పుగంటి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, శ్రీవేంకటేశ్వర కళాశాల, న్యూఢిల్లీ.

## స్వీయచరిత్ర :

ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన తెలుగులోకి వచ్చిన వచన సాహితీ ప్రక్రియల్లో స్వీయచరిత్ర ఒకటి. స్వీయ చరిత్ర అంటే స్వీయకథనం. ఆత్మచరిత్ర లేదా ఆత్మకథ అని కూడా పిలుస్తున్నాం. ఒకవ్యక్తి తన జీవితం గూర్చి తానే స్వయంగా రాసుకున్న చరిత్రను ఆత్మకథ లేదా స్వీయచరిత్ర అంటాం. స్వయంగా రాసుకున్న లేదా రాయించుకున్న వారి జీవితవిశేషాలను బాహ్యప్రపంచంతో పంచుకోవడం ఈప్రక్రియ యొక్క ఉద్దేశ్యం అవుతుంది. ఎవరైనా సరే వారివారి జీవితాలలో జరిగిన అనుభవాలను, సంఘటనలను తెలుపుతూ, వారి జ్ఞాపకాలను భావి తరాలకు అందించడానికి చేసే ప్రయత్నమే స్వీయచరిత్ర. ఆటోబయోగ్రఫీ అనే ఆంగ్లపదానికి సమానపదంగా తెలుగులో స్వీయచరిత్ర అని వాడుతున్నాం.

'స్వీయచరిత్ర స్వరూప స్వభావాలను బట్టి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. స్వీయచరిత్రాత్మకం: స్మృతులు, జ్ఞాపకాలు, జీవితఘట్టాలు, యాత్రా వృత్తాంతాలు, దినచర్యలు, లేఖలు... ఇవన్నీ స్వీయ చరిత్రాత్మక సాహిత్యం కిందకి వస్తాయి. 2. పూర్తిగా స్వీయచరిత్ర : ఆత్మకథ, స్వీయచరిత్రం పేరుతో జననం, బాల్యం, జీవితంలో వివిధ సన్నివేశాలు, వృత్తి, ఉద్యోగం, వివిధ రంగాలలో చేసిన కృషి మొదలైనవి వర్ణితమవుతూ జీవిత గాథాత్మకంగా సాగితే అది నిర్దిష్టమైన ఆకృతిని ఏర్పరుచుకొని స్వీయచరిత్రగా పరిగణించబడుతుంది.' (రమాపతిరావు, అక్కిరాజు. 1984:10) ఈ విభజన ప్రకారం చూస్తే ప్రస్తుత రచన స్వీయచరిత్రాత్మకం విభాగం క్రిందకి వస్తుంది. రచయిత్రి ఈ రచనలో కేవలం ఆమె జీవితంలోని కొన్ని ఘట్టాలను మాత్రమే పేర్కొంటూ ఆత్మచరితము రాసినట్లు కనిపిస్తుంది. తెలుగులో తొలి మహిళా ఆత్మకథ ఏడిదము సత్యవతిగారి ఆత్మ చరితము రచనలోని విశేషాంశాలను చర్చించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

## తొలి తెలుగు మహిళా ఆత్మకథ :

భారతీయ భాషలలో స్త్రీలు స్వీయచరిత్రలు రాయడం సుమారుగా పంతొమ్మిదో శతాబ్దపు మధ్యభాగం నుండి మొదలైంది. తెలుగులో స్త్రీల స్వీయచరిత్రలు అరుదుగానే కనిపిస్తాయి. తెలుగులో వచ్చిన స్త్రీల స్వీయచరిత్రలలో మొట్టమొదటిది ఏడిదము సత్యవతిగారి ఆత్మచరితము. ఇది 1934లో మొదటి ముద్రణ వచ్చింది. ఇదే తొలి తెలుగు మహిళా ఆత్మకథ. అంతేగాకుండా "ఆధునిక స్వీయచరిత్ర తెలుగులో వీరేశలింగం రాసిన రెండు సంపుటాలతో (1911లో మొదటిసంపుటం, 1915లో రెండవది) ప్రారంభమైనట్లుగా చెప్పుకోవచ్చు. 1915 - 1946ల మధ్య స్వీయచరిత్రలు రాసి ప్రచురించినవారు ప్రధానంగా అయిదుగురే ఉన్నారు. అందువల్ల సత్యవతి గారి ఆత్మచరితము రచనకు తెలుగులో వచ్చిన తొలి స్వీయచరిత్రల్లో కూడా స్థానం వుంది. (సత్యవతి, ఏడిదము. 1934 :7,8

## రచయిత్రి (సత్యవతి) :

ఈమె సున్నిత మనస్కురాలు. ఆరోజుల్లో సమాజంలో జరుగుతున్న సాంఘిక దురాచారాలను చూసి ఎంతగానో బాధపడేవారు. మనసులో ఉన్న ఈ బాధంతా ఆత్మకథ రూపంలో వెలువరించారని ఈ రచనను బట్టి తెలుస్తుంది. ఇదే విషయం సత్యవతిగారు కూడా ఈ రచనలోని 'తొలిపలుకు' లో ప్రస్తావించారు. సంఘంలో స్త్రీలకు జరుగుతున్న దురాచారాలను నిర్మూలించుటకై ఈ రచన చేసినట్లు పేర్కొన్నారు. ఈమె తన జీవిత విశేషాలను ఆత్మకథగా రాయాలని ఈ రచన చేయడం మొదలు

పెట్టలేదు. కేవలం ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలను (శిరోముండనాది పరాభవము - భర్త చనిపోయిన ఆడవాళ్ళకు గుండు చేయించడం... మొదలైనవి) నిర్మూలించాలని రచన చేసినట్లుగా తెలుస్తుంది.

అంతేగాకుండా సత్యవతిగారి పుట్టుక, వివాహం మొదలైన సంఘటనల తేదీలుగాని, సమయాలుగాని ఈ రచనలో ఎక్కడా కనిపించవు. ఈమె వీటికి ప్రాధాన్యతను ఇవ్వలేదు. కేవలం ఆమె జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను మాత్రమే ఈ రచనలో పేర్కొన్నారు. ఈ రచనంతా కూడా ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలను రూపుమాపుటయే ప్రధాన కర్తవ్యంగా కనిపిస్తుంది.

## ప్రస్తుత రచన - విశేషాంశాలు :

**వర్ణనలు :**

ఈ రచనలోని వర్ణనలు, పాత్రలు, సంభాషణలు మొదలైనవన్నీ నవలను తలపించేవిధంగా ఉన్నాయి. ఆమె బాల్యం నందు జరిగిన కొన్ని సంఘటనలను వర్ణించిన తీరు పాఠకులకు ఆసక్తిని కలిగించేవిధంగా ఉంది. దీనికి గల కారణం ఒకటి ఆమెకు చిన్ననాటి నుండి పుస్తక పఠనం అలవాటు ఉంది. మరొకటి బాల్యంలో సీత, సావిత్రి, చంద్రమతి ... వంటి పతివ్రతల కథలను చదువుటలో ఎక్కువ ఉత్సాహం చూపించడం కావచ్చు. ఉదాహరణకు దేవాలయ దర్శనం, శైశవం మందు శపథం మొదలైన ఘట్టాల వర్ణన. "యుద్యాన వనములో మాలతి, మందారము, పారిజాతము మున్నగు పలురకముల పూలచెట్లు చక్కగా పుష్పించి, తమ పరిమళమును మందమారుతమున కందజేయుచున్నవి. ఆ వనములో నొక పొదరింటిదరిని యువకుడాగి, కూర్చుండి, నన్ను కూడ గూర్చుండ నియమించెను. నేనా వన సౌందర్యమును జూచుచు ఆనందమున మునిగితిని". (సత్యవతి, ఏడిదము. 1934 : 28, 29)

**సంభాషణలు :**

సత్యవతిగారి బాల్యంలో జరిగిన కొన్ని సంఘటనలలోని సంభాషణలు చదువుతుంటే ఒకవిధమైన కుతూహలం కలుగుతుంది. సత్యవతిగారికి ఆమె భర్త సీతారామయ్యగారికి మధ్య జరిగిన కొన్ని సంఘటనలను ఈ రచనలో పేర్కొన్నారు. వారిరువురు బాల్యంలో మొట్టమొదటసారి కలిసినపుడు జరిగిన సంభాషణలు ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నాయి.

ఉదాహరణకు :

"యువ - నీ పేరు?
నేను - సత్యవతి
యువ - ఏమి చదువుకొనుచున్నావు?
నేను - నాల్గవ తరగతి
యువ - నీకు సంగీతము వచ్చునా?
నేను - రాదు"

(సత్యవతి, ఏడిదము. 1934 : 29)

ఈవిధంగా వారిరువురి మధ్య సంభాషణ జరుగుతుంది. ఈ సంభాషణలు నాటక సంభాషణలను తలపించే విధంగా ఉంటాయి.

**వివాహం :**

ఈ రచనలో (1934కు ముందు) ఒకరకమైన వివాహ పద్ధతి కనిపిస్తుంది. రచయిత్రి మాటలలో చెప్పాలంటే " నా జననీజనకులు నాయొద్ద బంధువుల కుమారులలో కొందరి పేరులు చెప్పి వీరిలో నెవరిని పెండ్లి చేసు కొందువని నన్నడిగినారు. మీ యిష్టమంటిని. తల్లీ! నీ యిష్టమైన వారిని తెలుపుమని బ్రతిమాలిరి. వారడిగిన పేరులలో నా మనోహరుని పేరు గూడ నుండెను. కావున నేనాతని బేర్కొంటిని. చివరకు మా కోరిక ప్రకారమే సంబంధము కుదిరినది." (సత్యవతి, ఏడిదము. 1934 : 32) అని ఈ రచనలో తెలిపారు. ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుచేసుకోవచ్చు. ఒకప్పుడు రాజుల కాలంలో స్వయంవరాలుండేవి. సీత, దమయంతి... మొదలైన వారికి స్వయంవరాలు జరిగాయి. వీటన్నింటి గూర్చి రచయిత్రి బాల్యంలోనే ఎన్నో గ్రంథాలలో చదివారు. ఇది ఒకరకమైన వివాహపద్ధతి. నేటి కాలంలో పెళ్లిచూపులు,

అమ్మాయి అబ్బాయి కలిసి మాట్లాడుకోవడం, ఫోటోలు చూసి పెళ్లిళ్ళు కుదుర్చుకోవడం, ఫేస్‌బుక్‌ల ద్వారా, బంధువులు, మ్యారేజ్ బ్యూరోల ద్వారా, బ్రోకర్ల ద్వారా, మొదలైన వివిధ పద్ధతుల ద్వారా వివాహాలు జరుగుతున్నాయి. - ఇది నేటి కాలం.

రచయిత్రి కాలంలో అంటే 1934 కు ముందు బంధువులలో పెళ్ళికాని కొంతమంది అబ్బాయిల పేర్లు చెప్పి వారిలోంచి ఒక పేరును ఎంచుకోమనడం కనిపిస్తుంది. - ఇది మరొక రకమైన వివాహ పద్ధతి. ఈ రచనలోని పై సంఘటన ద్వారా ఆరోజులలోని వివాహ పద్ధతిని గూర్చి తెలుసుకోవచ్చును.

## నిరుద్యోగ సమస్య :

సత్యవతిగారి భర్త సీతారామయ్యగారికి బి.ఏ. పాసైన చాలాకాలం వరకు ఉద్యోగం దొరకలేదు. ఆ రోజుల లోను, ప్రస్తుత రోజులలోను నిరుద్యోగ సమస్య కనిపిస్తూనే ఉంది. కొంతకాలం తర్వాత సీతారామయ్యగారికి పోలీస్‌శాఖలో ఉద్యోగం వస్తుంది. ఆ ఉద్యోగంలో ఆయనకు పై అధికారుల నుండి ఎదురయిన కష్టనష్టాలను గూర్చి సత్యవతిగారు రచనలో పేర్కొంటారు. పోలీసు వ్యవస్థ ఏవిధంగా ఉన్నదీ, అధికారులు ఏవిధంగా కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తారో వివరించారు. ఇటువంటి సమస్యలు ఆరోజుల్లోనే కాదు నేటికాలంలో కూడా కనిపిస్తుంటాయి.

### ప్రతివ్రతల ప్రభావం :

సీత, సావిత్రి, దమయంతి వంటి పతివ్రతల ప్రభావం రచయిత్రి పై కనిపిస్తుంది. పతివ్రతల లక్షణాలను రచయిత్రి పాటించాలనుకుంటుంది. దానికి నిదర్శనమే ఈ ఘట్టం. సత్యవతిగారి భర్త సీతారామయ్యగారు బమినిగాం మన్యప్రదేశానికి ఉద్యోగ నిమిత్తం ఒక్కరే వెళతారు. ఆ సమయంలో సత్యవతిగారిని పుట్టింట్లో వదిలి వెళతారు. అప్పుడు ఆమె మనసు భర్త గూర్చి పలు విధాలుగా పరితపిస్తుంది. భర్తకు వంట చేసుకోవడం రాదు. ఒంటరిగా ఏమి కష్టాలు పడుతున్నారో అని మదనపడుతుంది. సీతాదేవి రామునితో వనవాసం వెళ్ళి అక్కడ కష్టాలలో పాలుపంచుకున్నట్లుగా భర్త పడుతున్న కష్టాలలో తాను కూడా పాలుపంచుకోవాలనుకుంటుంది. బాల్యంలో చదివిన పుస్తక పఠన ప్రభావం సత్యవతిగారి పై ఇక్కడ కనిపిస్తుంది. "లోకమున భర్తతో పాటు భార్య కూడ కష్టసుఖములయందు పాల్గొనుట సతీధర్మము. కాని సుఖముగ నున్నప్పుడు భర్తను గౌరవించుటయు, కష్టకాలమున విడనాడుటయు ధర్మము కాదు. సర్వదా భర్తృసహచరీత్వమే భారతనారీమణులకు పరమధర్మమని నా ఆశయము". (సత్యవతి, ఏడిదము. 1934 : 35)

వివాహానంతరం భర్త దగ్గరకు వెళ్ళేటప్పుడు సత్యవతి గారిని భర్త దగ్గరకు పంపేటప్పుడు తోడుగా ఒక ముసలావిడను కూడా పంపుతారు. అక్కడ ఇంటిపనులలో సత్యవతిగారికి సహాయంగా ఉంటుందని పంపుతారు. " మా బంధువులలో నొక ముసలమ్మను నాతో పంపవలెనని తలచి, మా నాయనగారు నన్ను, మా అమ్మను, మాతాతగారి గ్రామమగు నిందుపల్లికిం బంపిరి." (సత్యవతి, ఏడిదము. 1934 : 36) ఈ ఘట్టం చూస్తే ఒకప్పుడు రాజుల కాలంలో వివాహానంతరం రాణి కూడా ఒకరిద్దరు చెలికత్తెలు రాజ్యానికి వచ్చేవారు. వారు రాణిగారికి సపర్యలు, రాణిగారి యొక్క సొంతపనులు చేసేవారు. పై ఘట్టం ఈ సంప్రదాయాన్ని తలపిస్తుంది.

### భర్త దగ్గరకు వెళ్ళే ప్రయాణం :

ఈమె భర్త దగ్గరకు వెళ్ళే ప్రయాణం తీర్థయాత్రలకు వెళ్ళే ప్రయాణాన్ని తలపిస్తుంది. వెనుకటి రోజులలో తీర్థయాత్రలు అంటే కొన్ని నెలలపాటుగాని లేదా సంవత్సరాల పాటుగాని చేసేవారు. అదేవిధంగా సత్యవతిగారు కూడా కొన్ని నెలల పాటు ప్రయాణం చేసి భర్త ఉండే ప్రాంతానికి వెళ్ళడం జరుగుతుంది. ఆ రోజులలోని ప్రయాణాలు, వారికి ఎదురయిన ఇబ్బందులను తదితర విషయాలన్నింటిని ఇందులో వివరిస్తారు.

### భర్త చనిపోయినప్పుడు :

ఈ రచనలో మరొక ఘట్టం భర్త చనిపోయినపుడు

సత్యవతిగారి మనసు ఏవిధంగా తల్లడిల్లిందో తెలియ జేస్తుంది. ఆమెలోని మనోవ్యథ ఆమె మాటలలో "యీ దీనురాలిని కరుణింపవా? అయ్యో ! ఆనాడు సావిత్రికి యముడు దర్శనమిచ్చి భర్తను పునర్జీవితుని జేయలేదా? నీ కాపాటి చేతకాదా? తండ్రీ! నాకే దైవమును కనుపడని కారణమేమీ? బ్రహ్మ విష్ణు మహేశ్వరులారా! మీర లనేకమంది పతివ్రతల దీనాలాపముల నాలకించి వారిని రక్షించితి మని గ్రంథముల వ్రాయించుకొంటిరే! నన్నేల రక్షింపరాదు. నా జీవితేశ్వరుని జీవముల నివ్వలేరా?" (సత్యవతి, ఏడిదము. 1934 : 47) అని రచనలో కనిపిస్తుంది. సావిత్రికి యముడు దర్శనమిచ్చి భర్త ప్రాణాలు కాపాడినట్లుగా తన భర్త ప్రాణాలు కాపాడమని భగవంతునితో మొరపెట్టుకుంటుంది. ఎంతోమంది సాధ్వీమణుల వృత్తాంతాలను బాల్యంలో చదువుట కారణంగా వారి ప్రభావం సత్యవతిగారి పై కనిపిస్తుంది.

**సతీసహగమనం :**

దీన్ని ఒక ఆచారంగా రచనలో పేర్కొన్నారు. భర్త చని పోయినపుడు భర్త ఎడబాటు తట్టుకోలేని స్త్రీలు సతీ సహగమనం చేయడం మేలని, ఈమె కూడా సతీసహ గమనాన్ని కోరుకుంది. ఆ రోజులలో ఈ దురాచారాన్ని ఆచారంగా భావించే వారిలో సత్యవతిగారు కూడా ఉన్నారని తెలుస్తుంది. ఆరోజులలో ఆడవాళ్ళు భర్త చనిపోయిన తర్వాత వారికి జీవితం లేదనుకునేవారు. ఇది అప్పటి స్త్రీల మానసిక పరిస్థితి. దీనినిబట్టి వారు ఈ దురాచారాన్ని ఆచారంగా అంగీకరించేవారని తెలుస్తుంది. ఇటువంటి పరిస్థితులకు కారణం స్త్రీకి చదువు లేకపోవడం, అలాగే కొద్దోగొప్పో చదువుకున్నా ఆ విజ్ఞానం కేవలం ఇంటిధర్మాలు నేరవేర్చడం, పిల్లల్ని పెంచడం, పెద్దవారితో ఎలా మెలగాలో తెలుసుకోవడం, పతివ్రతా ధర్మాలు, ఆరోగ్యం, నీతిసూత్రాలు మొదలైన వాటిని తెలుసుకునేందుకు ఉపయోగపడే చదువు మాత్రమే అప్పట్లో స్త్రీలకి ఉండేది.

**హేతువాదం- హరికథకుల అజ్ఞానం :**

భగవంతుని పై మొట్టమొదట్లో నమ్మకం ఉండేది. తర్వాత ఆమెలో హేతువాది కనిపిస్తుంది. కొంతమంది హరికథకులు కథ చెప్పడానికి ముందు గణపతి ప్రార్ధన చేసి తరువాత స్త్రీ నిందలు చేస్తారు. కలియుగంలో పతివ్రతలు లేరని వీరి అభిప్రాయం. స్త్రీలనే గాని పురుషులను నిందించరు'. వీటన్నింటిని సత్యవతిగారు ఖండించారు.

**అనాథలకే అవస్థలా?**

భర్త పోయిన ఆడవాళ్ళపట్ల చేయు విపరీత చర్యలను ఖండించారు. "భర్త పోయిన వెంటనే, కేశఖండనము సేయించుట, సైనుగుడ్డ కట్టించి ముసుగు వేసి మూలను కూర్చుండబెట్టుట, రాత్రులయందు తిండిని మాన్పించి పిండియో రొట్టెయో పెట్టుట". అన్నింటి కంటే ముఖ్య మైనది. "శిరోముండనము చేయించుటయంత అక్రమ మైన పని వేరొకటిలేదు. ఏలయన, స్త్రీలకు పరపురుష స్పర్శము నిషిద్ధము కదా! అట్టి యెడ నందరును చేరి, యిది భర్తృ వియోగ దు:ఖమున హృదయము పగిలి యేడ్చుచుండ, పైగా, దీన్ని మంగలివాని కప్పగించుటెంత విరుద్ధము. వాడు పరపురుషుడు కాదా? వానిని స్పృశించుటెంతయు అపసవ్యము కాదా? ఇంకను ప్రాణాపాయము కలిగిన నితరుని ముట్టుకొనిన దోషము కాదు కాని విధవ లూరక పరపురుషుని ముట్టుకొనుట మరింత దోషము కాదా? లేక యీ శిరోజములు తీసివైచిన పునర్భవములు కాకుండునా?... (సత్యవతి, ఏడిదము. 1934 : 53) మొదలైన విషయాలను ప్రశ్నిస్తూ, భర్త పోయిన ఆడవాళ్ళు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు.

**మరికొన్ని అంశాలు :**

బాల్య వివాహాలు, పునర్వివాహాలు, దాంపత్య ధర్మాలు మొదలైన విషయాలను ఈ రచనలో చర్చించారు. తల్లిదండ్రులకు అన్నం పెట్టని పిల్లలు వారు చనిపోయిన తరువాత తమను ఇతరులు మంచివారను కొనవలెనని శ్రాద్ధంనాడు రకరకాల వంటలు చేయడం... తదితర అంశాలన్నింటి గూర్చి ఈ రచనలో సత్యవతిగారు ప్రస్తావించారు.

సత్యవతిగారు ఆ రోజులలో జరిగే దుష్చర్యలు చూసి చలించిపోయి వాటన్నింటిని స్వవిషయాలతో పాటుగా ఆత్మకథ రూపంలో రాసి ఉండొచ్చు. అంతేగాకుండా ఈ రచనలో సత్యవతిగారి బాల్యం, వివాహం, సంసారం, కొంతకాలం తర్వాత భర్త మరణం, దాంతో సత్యవతిగారు తిరిగి పుట్టింటికి చేరడం మొదలైన సంఘటనలు కనిపిస్తాయి.

తదుపరి జీవితం అంటే భర్త చనిపోయిన తర్వాత ఆమె జీవితం గూర్చి గాని దానికి సంబంధించిన సంఘటనలు గూర్చి గాని ఈ రచనలో కనిపించవు. దీనికి కారణం భర్త చనిపోయేంత వరకు మాత్రమే ఆమె జీవితం అనుకుంది.

ఆ తరువాత తాను జీవించియున్నా అంటే శరీరం బతికి ఉన్నప్పటికీ తాను చనిపోయినట్లే అనుకుంది. తరువాత ఆమెకు జీవితం లేదనే భావన కలిగి ఉంది. భర్త చావుతోనే తన జీవితం కూడా ముగిసిపోయిందని భావించి యుండవచ్చు. అందుకే అంతవరకు మాత్రమే ఆమె జీవితంలో జరిగిన సంఘటనలు, మంచిచెడులు గూర్చి ఆత్మకథలో రాసి ఉండవచ్చు. ఆ తర్వాత విషయాలేమి ఆమె ఈ రచనలో పేర్కొనలేదు.

## ముగింపు :

మనిషి జీవితం కంటే ఆసక్తికరమైన అంశం మరొకటి ఉండదు. ప్రతిఒక్కరూ వారివారి జీవితాలలో వివిధరకాల సమస్యలను ఎదుర్కొంటుంటారు. వాటికి ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా స్పందిస్తారు. ఇదేవిధంగా సత్యవతిగారు కూడా వారికాలంలో (1934) జరిగిన సాంఘిక దురాచారాలకు స్పందించి, వాటి నిర్మూలనకై ఈ రచన చేసినట్లుగా తెలుస్తుంది. ఈ రచన కేవలం రచయిత్రి జీవితాన్ని మాత్రమే కాకుండా ఆనాటి సమాజ జీవితాన్ని, తదితర విషయా లను తెలియజేస్తుంది. రచయిత్రి ఈ రచన ద్వారా ఆ కాలంనాటి సామాజిక చరిత్రను భవిష్యత్ తరాలకు అందించారు. అప్పట్లో ఆత్మకథను రాయాలనే ఈ ఆలో చన రచయిత్రికి కలగడం మాత్రం విశేషం. అంతే గాకుండా సాహిత్యం ఆయాకాలాల నాటి సమాజాన్ని చిత్రిస్తుందనడానికి నిదర్శనం ఈ రచన ఆత్మ చరితము.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. రమాపతిరావు, అక్కిరాజు. ఏప్రిల్ 16, 1984. తెలుగులో స్వీయచరిత్రలు. యువభారతి ప్రచురణ. సికిందరాబాద్.
2. సత్యవతి, ఏడిదము. 1934. ఆత్మచరితము. (సంపా. వకుళాభరణం రాజగోపాల్) అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్. సికిందరాబాద్.

❀❀❀

# డా॥ వి. చంద్రశేఖరరావు కథలు - స్త్రీ చైతన్యం

- డా॥. కడియాల వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమాజంలోని స్థితిగతులను వస్తురూపంగా తీసుకొని కథలుగా అక్షరీకరించిన వారిలో డా॥ వి. చంద్రశేఖరరావు ఒకరు. ఈయన సుమారు 82కు పైగా కథలు రాశారు. ఈయన కథలు చదివాక రచయిత ఒక విధంగా స్త్రీ పక్షపాతి అని చెప్పవచ్చు. సమాజంలో స్త్రీల జీవన స్థితిగతులు ఈయన కథల్లో వెల్లడవుతాయి. స్త్రీలు ఏవిధంగా జీవిస్తున్నారు, ఎలాంటి సమస్యలకు గురవుతున్నారు, అదేవిధంగా స్వేచ్ఛ కలిగిన ఆధునిక మహిళలు ఏవిధంగా వున్నారో చంద్రశేఖరరావు కథల్లో చూడవచ్చు. చంద్రశేఖరరావు కథల్లోని స్త్రీ చైతన్యాన్ని చెప్పడం ఈ వ్యాసోద్దేశం.

భారతీయ పురాణాలన్నీ స్త్రీని యాంత్రిక వస్తువుగా భావించి ఇంటికే పరిమితం చేశాయి. స్త్రీకి స్వేచ్ఛనివ్వ లేదు. కాని కాలం మారేకొద్దీ స్త్రీలలో మార్పు మొదలైంది. ఆధునిక కాలంలో స్త్రీలు విద్యకు దగ్గరయ్యారు. పురుషాధిక్య సమాజం బిగించిన సంకెళ్ళను తెంపు కోవడానికి ప్రయత్నిస్తున్నారు. సమాజం స్త్రీలపట్ల నిర్మించుకున్న కట్టుబాట్లను ఆధునిక స్త్రీలు త్యజిస్తు న్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాలలోనూ స్త్రీలు అభివృద్ధి చెందుతున్నారు. పురుషాధిక్యంపై ఎదురు తిరుగుతున్నారు. స్వేచ్ఛగా మహిళలు తమ భావాలను వ్యక్తం చేస్తూ ఆర్థికస్వేచ్ఛను కలిగి వుంటున్నారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలపట్ల గౌరవం కలిగి కుటుంబం, సమాజాభివృద్ధికి దోహదపడుతున్నారు. ఆధునిక మహిళల్లో వున్న చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ఆర్థిక స్వేచ్ఛను డా॥ వి. చంద్రశేఖరరావు కథల్లో గమ నించవచ్చు.

చంద్రశేఖరరావు రాసిన 'జీవని' కథ విషాదాన్ని సంకేతిస్తుంది. కథలో లలిత పెళ్ళయిన చాలా సంవత్స రాల తర్వాత గర్భం దాలుస్తుంది. ఆమెకు 5 నెలలు నిండకముందే బిడ్డ ఎదుగుదల సరిగా లేదని అబార్షన్ చేయాలని డాక్టర్ సరళ చెబుతుంది. దీనికి ఆమె అంగీ కరించకుండా ఇంట్లో భర్తను, అత్త మామలను ఎది రిస్తుంది. "నా స్వప్న ప్రపంచం మీద ఇంత నిర్లజ్జగా దాడి చెయ్యడానికి వీళ్ళకేం అధికారం ఉంది?" అంటుంది లలిత. దీన్నిబట్టి పిల్లల్ని కనడంలో స్త్రీల అభిప్రాయాల్ని గౌరవించాలని, పిల్లల్ని కనడం స్త్రీ హక్కుగా ఉండాలని అర్థమౌతుంది. లలిత మానసిక వికలాంగురాలయిన జీవనికి జన్మనిస్తుంది. మానసిక వికలాంగురాలయిన జీవనిని తండ్రి అసహ్యించుకుంటాడు. జీవని తల్లి ప్రేమను పొందుతుంది. లలిత మాత్రం అధైర్య పడకుండా ఆత్మవిశ్వాసంతో జీవనిని సాధారణస్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. లలిత భర్త ఆ పాపను ఏదైనా ఇన్‌స్టిట్యూట్‌లో చేరుద్దామని అంటాడు. ఆ మాటలకు లలిత "ఇంకోసారి నా దగ్గర ఇలాంటి వాగుడు వాగితే నాలో రాక్షసిని చూస్తావు నువ్వు! ఇది నా ప్రాణం! నా సర్వస్వం! ఇది నా దగ్గరే వుంటుంది. నా సర్వశక్తుల్ని ధారబోసి దాన్ని పెంచుకుంటాను... నాకో ఉద్యోగం వుంది, నీ పోషణ, దయ నాకవసరం లేదు" అంటూ భర్తను కోపగించుకుంటుంది. తర్వాత లలిత జీవినిని స్కూల్లో చేర్పిస్తుంది. జీవని డ్రాయింగ్ వేయడం నేర్చుకుంటుంది. 'అమ్మ' అనే చిత్రానికి సోవియట్‌ల్యాండ్ చిల్డ్రన్స్ పెయింటింగ్ అవార్డు గెలుచుకుంటుంది. ఈ అవార్డు వచ్చినందుకు జీవనితో టి.వి. ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. నీ ప్రతిభకు కారణం ఎవరు? అని అడిగితే జీవని మాత్రం 'నాకు నాన్నలేరు, అమ్మే వుంది' అంటుంది.

పై కథలో మానసిక వికలాంగుల జీవితాలు విషాదభరితంగా వుంటాయని రచయిత చెప్పుకొచ్చాడు.

కథలో జీవనిపట్ల తల్లి బాధ్యతాయుతంగా వ్యవహరించడం హర్షించదగ్గ విషయం. బిడ్డను కాదనుకొన్న తన భర్తను ఎదిరించడం ద్వారా ఆమెలో ఉన్నత వ్యక్తిత్వం, చైతన్యం కలిగి వుండడం గమనార్హం.

'సిద్ధార్థా వగపెందుకు' అనే కథలో ఆధునిక భావజాలం కలిగిన స్త్రీవాద రచయిత్రి ఎలా వుంటుందో రచయిత మాలతి పాత్ర కేంద్రంగా చిత్రించాడు. కథలో మాలతి స్త్రీవాద రచయిత్రి. మాలతి గురించి మాలతి భర్త కొడుకుతో ఇలా అంటాడు. "మీ అమ్మ కొత్త తరం స్త్రీకి ప్రతినిధి. మమకారం, ప్రేమ, నాది అనే పాశం ఇవన్నీ స్త్రీలకు సమాజం తగిలించిన సంకెళ్ళని తన నమ్మకం. స్త్రీలే కాదు అసలు మనుషులెవరూ అంత ఎమోషనల్‌గా వుండనవసరం లేదని ఆమె వాదన" అంటాడు మాలతి భర్త. మాలతి భర్త అనారోగ్యంతో చనిపోతాడు. మాలతి తన కొడుకుని ప్రేమగా చూసుకునే క్రమంలో బిడ్డ నుండి తనకు వ్యతిరేకత ఎదురవుతుంది. అయినప్పటికీ వాస్తవిక జీవితం గడిపే మాలతి తన బిడ్డ ప్రేమను తిరిగి పొందుతుంది.

దీన్నిబట్టి హిందూ సమాజం స్త్రీని ఇంటికే పరిమితం చేసింది. స్త్రీకి కుటుంబమే లోకం. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా కుటుంబ సభ్యుల మీద ప్రేమాభిమానాలు చూపిస్తూ స్త్రీలు జీవించారు. కానీ కథలో ఆధునిక స్త్రీ అయిన మాలతి మనుషులు అంత ఎమోషనల్‌గా వుండనవసరం లేదన్న మాటలు బట్టి ఆధునిక మహిళలు కుటుంబంపై చూపే ప్రేమాభిమానాలతో పాటు ఈ మమకారాలు సమాజంపైకి విస్తృత పరుస్తున్నట్లు మాలతి పాత్ర కేంద్రంగా చెప్పవచ్చు. ఈవిధంగా మాలతి విశాల దృక్పథం గల రచయితగా చెప్పవచ్చు.

'బఫెల్లోస్ క్లబ్' కథలో మాలతి అన్యాయాన్ని ఎదిరించే చైతన్యవంతమైన మహిళ. దళిత సర్పంచ్ సుబ్బమ్మ తన బర్రెగొడ్డును అగ్రవర్ణస్థులు చంపారని బర్రెగొడ్డు కళేబరాన్ని పాఠశాలలో వదిలివేస్తుంది. బర్రెగొడ్డును ప్రక్కకు తోయడానికి విద్యార్థులు ఎవరూ రారు. ఎమ్మెల్యే వచ్చే టైము అవుతుందని ఎమ్డీవో ఆఫీసు స్టాపునంతా పిలిచి బర్రెను లాగివెయ్యండి అంటాడు. మాలతి మాత్రం కదలదు. ప్రశ్నించిన ఎమ్డీవోతో "ఇది నా డ్యూటీ కాదు, నేను చెయ్యను" అంటూ స్వేచ్ఛగా తన భావాన్ని వ్యక్తపరుస్తుంది మాలతి. అంతేకాకుండా "ముందు మీ డ్యూటీ చెయ్యండి, పంచనామా రాయించండి. ఒక ఎస్సీ మహిళా సర్పంచ్‌ను ఇంతమంది ముందు అవమానించి, కొట్టినందుకు కలెక్టరుకు రిపోర్టు ఇవ్వండి, ఆ తరువాత నా డ్యూటీ చేస్తాను" అంటుంది మాలతి.

పై మాటల్ని బట్టి ఆధునిక భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న స్త్రీగా మాలతి కనిపిస్తుంది. తప్పుచేస్తే ఎంతటి వారినైనా ప్రశ్నించగల చైతన్యం గల స్త్రీగా చెప్పవచ్చు. అధికారంలో వున్న దళిత స్త్రీపై జరిగిన దాడిని ఖండిస్తూ పైఅధికారులకు ఎందుకు ఫిర్యాదు చెయ్యలేదని అధికారిని అనడంలో ప్రశ్నించే ధోరణి మాలతిలో వుందని అర్థమవుతుంది. ఈవిధంగా మాలతి స్వేచ్ఛగల స్త్రీగా అన్యాయాన్ని ప్రశ్నించే స్త్రీగా కథలో తారస పడుతుంది.

"కొన్ని పక్షులు ఎగరగలవు" అనే కథలో జెన్ని స్వేచ్ఛా భావజాలం గల స్త్రీ. తన గురించి, తన ప్రియుడి గోరా గురించి జెన్ని ఈవిధంగా మాట్లాడుతుంది.

"ప్రపంచాన్ని ద్వేషంతోనూ, కోపంతోనూ కాక ప్రేమించే మనసుతో చూడడం అలవాటు చేసుకున్న నాకు ఎటు చూసినా స్నేహితులే. ప్రతి వలపులోనూ ఒయాసిస్సులే. ఒదిగి ఒదిగి సిగ్గులు చిందించే పాత తరపు స్త్రీని కాను నేను. ప్రపంచాన్ని జయించాలని కలలు కనే నేటి స్త్రీని. నీకు మగ స్నేహితులేమిటి? అని నొసలు విరుస్తాడు గోరా. అలా విరగబడి సముద్రంలా నవ్వొద్దు అంటాడు. అట్లా పూలు విరగగాసిన చెట్టులా ఎవడి భుజంపైనో వాలిపోవద్దు అంటాడు. ఇట్లాంటి శాసనాలంటేనే నాకసహ్యం! ఇది గోరాకి వివరించినా అర్థం కాలేదు. గొడవ పెట్టుకొని తనకు తానే దూరమైనాడు" అంటుంది. జెన్నీ.

పై మాటలు బట్టి జెన్ని సాంప్రదాయిక స్త్రీలాగా పురుషాధిక్య భావజాలం క్రింద అణిగి మణిగి జీవించే వ్యక్తి కాదని తెలుస్తుంది. అదేవిధంగా తాను ఏదైనా

సాధించాలనే పట్టుదల, దృఢ నిశ్చయం కలిగిన ఆధునిక స్త్రీ అని మనకు విశదమవుతుంది. పురుషాధిక్య భావజాలం, స్త్రీని అణచివేసే షరతుల్ని ఈమె ఖాతరు చెయ్యదని పై మాటల ద్వారా స్పష్టమవుతుంది. ఆధునిక స్త్రీలు జెన్నీలాగా పురుషస్వామ్య భావజాలాన్ని ఎదుర్కో వాలని జీవితాన్ని ఒక సవాలుగా తీసుకొని ఏదైనా సాధిం చాలనే పట్టుదల, కృషి వుండాలని రచయిత ఆకాంక్షిస్తు న్నట్లు చెప్పవచ్చు.

“మోహనా! మోహనా!” అనే కథలో మాలతి సామాజిక సేవకురాలు. కలిచేడు మారణకాండలో తల్లిదండ్రుల్ని పోగొట్టుకొని అనాథలైన పిల్లలకు ‘ఆశ’ అనే ఫౌండేషన్ ఏర్పరచి ఆ పిల్లల బాధ్యతను తీసుకుంటుంది. కథలో మోహనరావు అనే దళిత నాయకుడు దళిత ఉద్యమాన్ని ఎన్నికలకు ఉపనాటకంగా తయారుచేస్తున్నాడని ఆయన ఉపన్యాసాలు ఆల్కహాల్‌కన్నా ప్రమాదమైన మత్తు పదార్థాలని ధైర్యంగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన స్త్రీగా కథలో మాలతి పాత్ర దర్శనమిస్తుంది. కలిచేడు మారణకాండలో మృతవీరుల వర్ధంతి సందర్భంగా మోహహనరావు ఒక సంతాప సభను ఏర్పాటు చేస్తాడు. అప్పుడు మాలతి కోపంతో “మీ తల్లుల్ని విధవల్ని చేసి, మీ చెల్లెళ్ళని పట్టపగలు చెరచిన సంఘటన ఇట్లా మైకులు పెట్టి, టెంటులు వేసి కోలాహలంగా గుర్తు చేసుకోవాల్సిన సంఘటనా? మూడేళ్ళయింది, ఇంతవరకు కేసు ఎఫ్.ఐ.ఆర్. దశను దాటలేదు. ఈ కేసు కోర్టుదాకా వెళ్తుందనే ఆశలేదు. మీ ఉద్రేకం, ఆవేశం ఏమైంది?” అంటుంది మాలతి.

దీన్నిబట్టి దళితులకు జరిగిన అన్యాయాలకు సంతాపసభలు ఏర్పరచడం అవివేకం అనీ, దళితులకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటం చేయాలన్న ఆకాంక్ష గల స్త్రీగా మాలతి ఈ కథలో దర్శనమిస్తుంది. ఈవిధంగా మాలతి అన్యాయాన్ని ప్రశ్నించే స్త్రీగా, న్యాయంకోసం పోరాడుతున్న స్త్రీగా, సామాజిక సేవకు రాలిగా కథలో మాలతి పాత్ర చిత్రింపబడింది.

“ఆకాశంలో సగం” కథలో లలితకు బ్రెస్ట్ క్యాన్సర్. హాస్పిటల్‌లో వైద్యం చేయించుకొని ఇంటికి వచ్చిన తర్వాత భర్త సంసారానికి నీవు పనికిరావని అంటాడు. “భర్త, పిల్లలు వాళ్ళ అభివృద్ధితోనే స్త్రీ సుఖదుఃఖాలను కొలిచే పాతకాలపు విలువలను నేను కేర్ చేయను” అంటుంది. “వివాహ వ్యవస్థపై అట్టే నమ్మకం లేని వ్యక్తిని నేను. ఇద్దరిమధ్యా గౌరవం, మర్యాద సమానస్థాయి కల్పించలేని పెళ్ళిని కన్సిడర్ చెయ్యనవసరం లేదని నా వాదం” అనే మనస్తత్వం కలిగిన లలిత ఇల్లు వదలి బయటికొస్తుంది. “జీవించాలన్న తెగువే జీవితానికి సమాధానం” అంటూ ఎప్పుడో చిన్నప్పుడు నేర్చుకున్న డ్యాన్స్‌కు బాగా పదునుపెట్టి గొప్ప ఆర్టిస్టు అవుతుంది. దాంతో తృప్తి చెందక ఉద్యమంలో పోరాటబాటలో నడుస్తుంది లలిత.

దీన్నిబట్టి లలిత, భర్తే ప్రత్యక్ష దైవం, తన కుటుంబమే సర్వస్వం అనే పాతకాలపు విశ్వాసాలను పట్టించుకోని ఆధునిక మహిళగా స్త్రీ, పురుషుల మధ్య సమానత్వాన్ని కోరుకునేటటువంటి స్త్రీగా కథలో లలిత పాత్ర దర్శన మిస్తుంది.

ఈవిధంగా చంద్రశేఖరరావు కథల్లోని స్త్రీ పాత్రలు వ్యక్తిగత అభిప్రాయాలను గౌరవించుకుంటూ, పిల్లలు కనడం స్త్రీ హక్కుగా భావించిన స్త్రీలను, ఆర్థిక స్వేచ్ఛ కలిగిన స్త్రీలను కుటుంబ అభివృద్ధితోపాటు, సమాజాభి వృద్ధికి దోహదపడే ఆధునిక స్త్రీలను, అన్యాయాన్ని ఎదిరించి ప్రశ్నించే స్త్రీలను పురుషాధిక్య భావజాలాన్ని ఎదుర్కొని జీవితాన్ని ఒక సవాలుగా తీసుకొని జీవించే స్త్రీలను, సామాజిక సేవకులుగా స్త్రీలు మెలుగుతున్న విధానాన్ని, స్త్రీ, పురుష సమానత్వాన్ని కోరుకునే స్త్రీలను రచయిత తన కథలో అక్షరీకరించాడు.

## ఆధార గ్రంథాలు :

1. జీవని - జీవని, పుట. 1, 3, 4, 34.
2. చిట్ట చివరి రేడియో నాటకం, 73.
3. మాయా లాంతరు - పుట.144, 145.
4. లెనిన్ ప్లేస్ - పుట.27.

# మొల్ల రామాయణంలో సీత సాధికారత

– డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

తెలుగులో రామాయణం పేరు చెప్పగానే గుర్తుకొచ్చే కవయిత్రి 16 వ శతాబ్దికి చెందిన మొల్ల. ఎక్కువ కంద పద్యాలతో తేట తెలుగులో రాయబడ్డ కావ్యం మొల్ల రామాయణం. తను ఆ భగవంతుని సాయంతో తనకు సహజ పాండిత్యం అలవడిందని చెప్పింది. తను ఎలాంటి కీర్తి, ధనము ఆశించకుండా తన కావ్యాన్ని ఏ రాజుకు అంకితమివ్వలేదు.

రాజిత కీర్తియైన రఘురాము చరిత్రము మున్ గవీశ్వరుల్
తేజ మెలర్ప చెప్పిరని తెల్సియు గ్రమ్మర జెప్పనే లనన్
భూజన కల్పకం బనుచు, భుక్తికి ముక్తికి మూలమంచు, నా
రాజును దైవమైన రఘురాము నుతించిన దప్పు గల్గునే?

అంటూ మొల్ల తన రామాయణ రచనకు మూల కారణం చెప్పుకొన్నది. గోపవరంలోని శ్రీ కంఠమల్లేశ్వరుని వరంచేత కవిత్వం చెప్పడం నేర్చుకొన్న మొల్ల తేనెసోకనోరు తీయనయగురీతి, గూఢ శబ్దాలు లేకుండా రామాయణ కథను ధ్వనింపజేసి అందీఅందని, దాచీదాచని అందానికి ట్రాన్స్‌ఫరెంట్ భావాలు గప్పి మృదుమధుర రామాయణాన్నందించారు.

ఈనాటి సమాజంలో మహిళామణుల్ని పట్టి పీడిస్తున్న జాడ్యాల్లో లైంగిక వేధింపులు ప్రధాన సమస్యగా మారింది. ప్రతిచోట మహిళలు వేధింపులకు గురవడమే కాకుండా ఎక్కడో ఒకచోట అత్యాచారాలకు, హత్యలకు, ప్రేమోన్మాదానికి బలైపోతున్న వారిని రోజూ చూస్తూనే ఉన్నాం. అయితే ఈ లైంగిక వేధింపుల సమస్య పూర్వం నుండీ కనిపిస్తుంది. ఈ సమస్య ఈనాడు పుట్టింది కాకపోయినా కాలక్రమంలో కురులు విప్పిన కొరివి దయ్యంలా విజృంభించి నేడు తారాస్థాయికి చేరుకుంది. సమకాలీన సామాజిక పరిస్థితులు కావ్యాల్లో ప్రతిబింబిస్తాయని భావిస్తే నాటి లైంగిక వేధింపుల సమస్య మొల్ల రామాయణంలో ప్రతిధ్వనించిందని చెప్పవచ్చు. రావణబ్రహ్మను రాక్షసున్ని చేసిన రామాయణంలోని లైంగిక వేధింపుల ఘట్టాలు మొల్ల ప్రతిభకు సమకాలీన సమస్యల పట్ల స్పందనకు నిదర్శనాలు.

రావణుడు సీతనపహరించి అశోక వనంలో ఘోర రాక్షస మూకల మధ్య ఉంచే కథ మొల్ల రామయణం సుందరకాండలో ఉంది. సీతను లైంగికంగా లొంగదీసుకోవడానికి రావణుడు శతవిధాల ప్రయత్నిస్తాడు. పరమ పతివ్రతయైన సీతా మాతను హింసించిన విధం హృదయాన్ని కలచివేస్తుంది. మారు వేశాల్లో వచ్చి పలు విధాల దుర్మార్గాలకి పాల్పడుతూ తనను అంగీకరించమని ఫకీరు వేశాలేస్తాడు. ఓ సీత మన్మథుడు పూల బాణాలు నా మీద ప్రయోగించగా ఆకాశమార్గంలోని చంద్రుని అంతులేని కాంతివల్ల అమితమైన తాపాన్ని పొందాను నా కోర్కెను అంగీకరించమని అడుగుతాడు. కోయిల కూతలలో, తుమ్మెదల ఝుంకారం నాలో కోర్కెల తాపాన్ని కల్గిస్తున్నాయి. మౌనంగా ఉండకు నువ్వెప్పుడూ ఆ రామున్ని తలుచుకుంటూ కాలయాపన చేయడం నీకు తగదని నిలదీస్తాడు.

పర స్త్రీని లొంగదీసుకునే పద్ధతుల్లో భాగంగా తన గొప్పదనాన్ని ప్రదర్శించడం కూడా లైంగిక వేధింపులో భాగమే. కుబేరుడిచ్చిన పట్టుచీరలు, ఇంద్రుడు నిత్యం పంపే పారిజాతాలు, యముడు పంపే సుగంధ ద్రవ్యాలు, పాతాలం నుండి నాగరాజు పంపిన నగలున్నాయి. వాటిని ధరించి రామున్ని మరచి మోహమలర కామకేళీ సుఖంబులందు సంతోష పెట్టమంటాడు. నా

లంకా రాజ్యానికి ఏడు సముద్రాలు పెట్టని కోటల్లా ఉన్నాయి. ఇంద్రాది దేవతలు అనుచరులై నన్నెప్పుడూ సేవిస్తూ ఉంటారు. గంధర్వ సుర యక్ష గరుడకాంతలు నా చెరలో బందీలుగా ఉంటారు. నా ధాన్యాగారంలో నవవిధ నిధులుంటాయి. నేనెప్పుడూ పుష్పకవిమానమెక్కి సంతోషంగా అన్ని లోకాలు తిరగ గలను.

నాకె తక్కంగ గలదె యే నాట నైన ?
మద్భుజాశక్తి ప్రతిపోల్పనద్భుతంబు

సీత వాయుదేవుడు నా ఇంటిని ఊడుస్తాడు. వరణుడు కల్లాపి జల్లుతాడు, అగ్నివంటలు జేస్తాడు, వాయుదేవుడు తలకురులు సరిచేస్తాడు. శివుడు సర్వైశ్వర్యాలు సమర్పించగా కిన్నర, గంధర్వ, యక్ష, భుజగ, సిద్ధ కింపురుషాంగనల్ చేరి నన్నెప్పుడు కొలుస్తూ ఉంటారు. నాకు ఎదురేది తరుణి.

నన్ను మించిన వారు ముల్లోకాల్లో కూడా ఎక్కడ వెతికినా కానరారు.
ఎత్తితి శంకరాచల మహీనబలంబున బంతిలాగున
మొత్తితి సర్వదిక్పతుల మూగిన గర్వము విచ్చి పాఱగా
నొత్తితి శత్రుభూపతుల నుగ్రరణంబున భూమి ద్రెళ్లగా
మొత్తితి భోగకంఠము లమోఘజవంబున మేటికీర్తులన్"

ఇంతటి నా భుజశక్తికి దక్కని స్త్రీ ఉంటుందా. అందుకే సుమీ ఆ నరమానవున్ని మరచి నన్నేలుకో ఎల్లలులేని ఈ సుఖసంతోషాలననుభవించుమంటూ విచ్చి ప్రగల్భాలు పలుకుతాడు.

పరస్త్రీ, పరాయి భార్య అయిన సీతను ఆపహరించడమే రావణుడు చేసిన అతిపెద్ద లైంగిక నేరం. అపహరించిన సీతను లంకలోని అశోకవనంలో నిలువరించి వికృతరూపం దాల్చిన తన విరహాన్ని వెళ్ళగక్కుతుంటే సీత అనుభవించిన వేధన రోదనాశ్రు ప్రవాహంలా ఈ నాటికి ప్రవహిస్తూనే ఉంది.

'చేతో భవనిశితాంబక పాతంబుల జాలనొచ్చి'
మనోవ్యథనాభరిత రోదనతో, ఎరుపెక్కిన కన్నుల క్రోధనతో ఎప్పుడూ పతినే దైవంగా మదితలచే మగువను చెరపట్టిన వానితో మాట్లాడేకంటే, పాపముంటుందా? పరధారా పేక్షగల నీలాంటివాడి కాయువు నశించి నరకం పాలై పోతావు. నీతిబాహ్యమాటలతో తన్ను తానే పొగడుకునేవాడు మూరుడు. నీవు శౌర్యవంతునివైతే రామునితో యుద్ధంలో గెలిచి నీ వీర ప్రతాపం నిరూపించుకో. రామునితో పోరలేక మాయచేసి నన్ను దొంగిలించి తెచ్చిన ముచ్చిలివి. శ్రీరామచంద్రుడు చిన్నతనంలోనే తాటకిని సంహరించాడు. గాధేయుడు చేయుక్రతువుల రక్షణకై పెక్కు దైత్యులను వధించాడు. అఖిల రాజన్యులు వేలెత్తిచూపగలేని హరివిల్లు విరిచాడు. పాదధూళిచే రాయిని పడతిని చేసాడు. మాయామృగాన్ని సంహరించాడు. అలాంటి పరాక్రమవంతుడు రాజమాత్రుడే కాదు సాక్షాత్తు ఆదినారాయణుడు, అంతటి పరాక్రమశాలికి నీ అబ్ధి ఎంత, ఈ లంకెంత, రాక్షసులెంత, నీవెంత అంటూ రావణుని బోగలాలసతను గడ్డిపరకలా తీసి పారేసింది.

నన్ను వశపర్చుకోవడానికి నక్కజిత్తుల వీరాలాపములు ప్రేలే నిన్ను రాఘవుడు లోకం సాక్షిగా లంకకు వారధిగట్టి వచ్చి ఘోరయుద్ధంలో నీ దశమస్తకాలను తుంచి భూతాళికి ఆహారంగా వేస్తాడు.

ఆరూఢ ప్రతిమాన విక్రమ కళాహంకార తేజోనిధి
శ్రీరాము సుగుణాభిరాముదెగడ జేకొన్న నిన్నాజిలో

శరాఘాతంతో నిన్ను సంహరించి నన్ను తీసుకెళ్తాడని కరాఖండిగా చెప్పింది. ఈనాటి ఆధునిక సమాజంలో కూడా ఆడపడుచులను వేధించే రావణావతార రాక్షసులకు ఇదే గతి పడుతుందని అష్టదిక్కులు మారుమ్రోగేలా మొల్ల తన రాయణంలో ప్రతిధ్వనింపజేసింది.

తన కావ్యాన్ని ఎవరికి అంకితమివ్వని మొల్ల, కౄర ఘోర రాక్షసుల మధ్య నలిగిపోతూ సీత తమ అస్థిత్వాన్ని కోల్పోకుండా ధైర్యంగా నిలబడి, సమాజానికెదురీది వారి సాధికారాతను చాటుకున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. మహాకవయిత్రి ఆతుకూరి మొల్ల, నిడదవోలు మాలతి కథలు, వ్యాసాలు, తెలుగు తూలిక, 30 జూలై 2010.
2. మొల్ల రామాయణం, తెలుగు పరిశోధన, తెలుగు పుస్తకాలను ఉచితంగా అందించే తెలుగు గ్రంథాలయం.
3. రామాయణాన్ని తెలుగీకరించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల, పుట్టి నాగలక్ష్మి, నంచిక, తెలుగు సాహిత్య వేధిక, 23 మే 2021.
4. మొల్ల రామాయణం, ఆతుకూరి మొల్ల, సాహితీ బుక్స్, 1 జనవరి 2008.
5. మొల్ల రామాయణం - మానవీయ విలువలు, డా.రొట్ట గణపతిరావు,
6. మొల్ల రామాయణం - సుందరకాండ, రామా అండ్ కో., ఏలూరు.

❀❀❀

# మహిళా లోకానికే ఆదర్శం - 'సీతాదేవి'

- డా॥. కసుకుర్తి ఈశ్వరమ్మ, తెలుగు విభాగము, దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, నెల్లూరు.

వాల్మీకి విరచితమైన మహత్తర కావ్యము వివిధ ప్రపంచ భాషలలోనే కాక పలు భారతీయ భాషలలోకి అనువదింపబడి తమిళ, కన్నడ, మళయాళ, తెలుగు మొ॥ ద్రావిడ భాషలలోనికి అనేక మంది రచయితలు, రచయిత్రిల అనువాదములతో పండిత పామర జన రంజకముగా ప్రజల హృదయాలను హత్తుకొన్న ఇతిహాసగ్రంథము రామాయణము'.

ప్రపంచంలో ఉన్నటువంటి కావ్య మాణిక్యము లన్నింటికీ మకుటాయమానమై రచించిన నాటినుండి పండితులకు నిత్య పారాయణ గ్రంథంగా, పామరులకు నిత్య చింతన కథా కలితమై, భారతీయులకు చతుర్విథ పురుషార్థక సాధకమై వెలుగొందుచుచున్నది " రామాయణము".

సమస్త మానవాళికి నీతిధర్మ ప్రభోకమై యావత్ జాతిఅంతయూ శ్రద్ధాశక్తులతో చదవగలిగిన మరియు మననం చేయగలిగిన గ్రంథం రామాయణము తప్ప మరి ఏ ఇతర సారస్వతమునందు ప్రపంచములోనే లేదనుట ఏమాత్రమూ అతశయోక్తి కాదు.

చెప్పుమని రామభద్రుండు
చెప్పించిన పల్కు మీందంజెప్పెద నేనె
ఇప్పుడు నిహపర సాధన
మిప్పుణ్య చరిత్రం దప్పు లెంచకుడెందున్ .....

అంటూనే చదివే వారికి, వినేవారికి ఆనందము కలిగేలా రచించారు కవయిత్రీ రత్నం మొల్ల.

'రామో విగ్రహవాన్ ధర్మ' అంటూనే "సీతాయాచ్చరితం మహత్" అన్నారు వాల్మీకి. త్రేతాయుగమును పావనం చేసి ఆ పాతివ్రత్యమును తరతరములందు భారతీయ వనితలకు పంచిపెట్టిన పవిత్ర నారీమణి సీతాదేవి. రావణ పీడ భరించలేక ఇంద్రాది దేవతలు బ్రహ్మతో కలసి పరమేశ్వరున్ని ప్రార్థించగా "రాక్షస భయంకరి" అగు స్త్రీ ఉద్భవింపబోవుచున్నదని పరమేశ్వరుడు వారికి అభయ మిచ్చాడు. జనక మహారాజు యజ్ఞ భూమిని దున్ను నప్పుడు నాగేటిచాలులో లభ్యమైన, లోకకళ్యాణము కొరకు ఆవిర్భవించిన ఆది పరాశక్తి అపరాంశయే సీతదేవి. ఆమె పతిసేవా పరాయణత్వము, ధర్మైక దీక్ష, శీల విభవముతో భరత భూమిని పునీతం చేసిన నారీమణి, జనకమహారాజు కుమారైగా పుట్టింటి కీర్తిని, దశరధుని కోడలై మెట్టినింటి కీర్తిని ఇనుమడింపచేసిన వనిత జానకీమాత.

బాల్యప్రాయముననే శివధనస్సును అవలీలగా జరిపి తన బంతిని తీసుకొని తండ్రిని ఆశ్చర్యపరిచింది. సబల అయిన కుమార్తెకు సరియైన వరుణ్ని ఆశించి, స్వయం వరమును చాటించి, శివుని విల్లును త్రుంచిన శ్రీరామునికి సీతాదేవినిచ్చి వివాహం జరిపించాడు.

సీతారాములు ఒకరిని విడిచి మరొకరు లేరు. అదియే పవిత్ర ప్రేమకు పరాకాష్ట, భర్త ఆంతర్యమును తెలుసుకుని ఆదరించి, గౌరవించి ప్రేమించింది సీతాదేవి. రావణ ప్రలోభ సమయములలో కష్టములలో ఉండి రామునిపైనే తన అనురాగమును పదిలంగా ఉంచుకుంది. ఇది ఆమె నిర్మలమైన ప్రేమకు, నిష్కపట వర్తమానమునకు నిదర్శనము. భర్త సాన్నిధ్యంలో అడవి అయినా అయోధ్యగానే భావించి సంతృప్తిగా జీవించింది.

సీతాదేవికి అత్తమామలు అంటే ఎనలేని భక్తి, అభిమానం, గౌరవము, మరుదులు, తోటి కోడళ్ళు ఊర్మిళ, మాండివి, శ్రుతకీర్తులతో ఎంతో మన్ననగా మెలిగినది. రామాయణ కావ్యమునకు గుండెకాయ వంటిది సుందరకాండ. సీతామాత హృదయ సౌశీల్యము నకు పరాకాష్ట ఈ సుందరకాండ, జానకీమాతకు గల

కుశాగ్ర బుద్ధిని, నిశిత పరిశీలనను, సంభాషణా చాతుర్యమును, ధీరత్వమును, పాతివ్రత్యమును తేటతెల్లము చేసింది.

మొల్ల రామాయణమున సీత రావణుని ఎదిరించి తన ధైర్యసాహసములను నిరూపించిన తీరు అత్యంత అద్భుతము, హనుమ సీతాదేవిల మధ్య సంభాషణ అత్యంత ప్రసంశనీయము, మొల్ల తీర్చిదిద్దిన సీతమ్మలో సౌందర్యగుణం, శీలసంపద, విశిష్ట వ్యక్తిత్వం, తెలుగు దనం కావ్యానికి మరింత వన్నె చేకూర్చిందని చెప్పవచ్చు.

రామాయణ కావ్యలో మూర్తీభవించిన ధర్మానికి రామున్ని ప్రతీకగా తీసుకున్నట్లే, సీతాదేవి యొక్క చరిత్ర యావత్తూ మహత్తరమైనదని నిరూపించిడం జరిగింది. నాగేటిచాలువంటి సక్రమమైన నడవడిక కలిగినది సీతాదేవి. వివాహానంతరం ఆమె మెట్టినింటిలో మసలిన తీరు ప్రతి స్త్రీకి ఆదర్శనీయము.

పట్టభంగమైప్పుడు సీత నిరాశ నిస్పృహలకు లోనుకాక పతి పరాయణగా స్థితప్రజ్ఞయై అడవులకు వెళ్లింది. రాముడు సీతను తనతో అడవులకు రావద్దని చెప్పి నప్పుడు సీత ఎంతో ధైర్యంతో యుక్తాయుక్తంగా మాట్లాడి రామున్ని ఒప్పించింది. కష్టసుఖాలకు ఒకేవిధంగా ప్రేమించినది.

మాయా పరివ్రాజకుడైన రాననుడు సీతదేవిని అపహరించుకొని పోవుచున్నప్పుడు తన రక్షణకై దిక్కులనుద్దేసించి ఆర్తనాదం చేయుచూ సుగ్రీవాది కపివరులను చూచి తన ఆభరణములను చీర చెంగునకు కట్టి ఋష్యమూక పర్వతంమీద వేసింది. ఇది సీతాదేవి సమయస్ఫూర్తికి నిదర్శనము.

నవచరు లొకగిరిచేరువ
వనమునం జరియింపం జూచి వసుధాసుతయున్
దనచీరకొంగు తునకను
దనసొమ్ములు మూట గట్టి ధరవై వైచెన్.

అశోకవనమున సంకట పరిస్థితులు ఎదురైనప్పుడు పావన చరిత ప్రాణములను పణముగా పెట్టదలచినదే గాని వేరు ప్రవర్తన లేనిది. రావణున్ని ఎదిరించి ధైర్యసాహసాలను ప్రదర్శించిన తీరు ప్రసంశనీయము. శ్రీరాముని ఔన్నత్యమును, రావణుని అల్పత్వమును బేరీజు వేసి ఒక్కసారి అవగాహన చేసుకొని నీవెవరివో తెలుసుకొని ప్రవర్తించు జాగ్రత్త ! అని రావణున్ని ధైర్యముగా ఎదిరించి మాట్లాడి, తనకు పతియందున్న గౌరవప్రవత్తులు, భక్తివిస్వాసములను చాటింది. కులస్త్రీకి కావలసినది భర్త అనురాగమే తప్ప, నీకున్న ఐశ్వర్యము, అందము కాదు. రాముని బాణాగ్నిలో మిడతవై నశించు సమయం ఆసన్నమైనదని రావణున్ని అపహసించుటలో ఆమె ధైర్యము కనబడుచున్నది.

సుందరాకాండలో హనుమనుంతుడు సీతమ్మను సూర్యోదయమునకు పూర్వమే నిన్ను నీ పతిదేవుని వద్దకు చేర్పగలను అనగా నీవు అంతటి సత్యసంపన్నుడవే, కానీ అట్లు వచ్చుట లోకము హర్షింపని పని, ఆమెకు ఇష్టం లేదు. మరియు తాను అట్లు బయలుదేరి వెళ్ళినచో లోకమే కాదు, పతిదేవుడు కూడ మెచ్చుడని ఆమెకు తెలుసు. అందుకే తన పతిదేవుని శౌర్య ప్రతాపాలపై ఆమెకున్న విశ్వాసమును ప్రకటించింది.

సీతాదేవి ఆదర్శ సతీ ధర్మములను నెలకొల్పి ఆచంద్రార్క కీర్తికాంతయైనది. "పూర్వ సాహిత్యమును, వర్తమాన సాహిత్యమును పరిశీలించిన మరియొక సీతదేవి మనకు సాక్షాత్కరింపదు. నిశ్చయముగా నేనీ మాట వక్కాణింపగలను. అట్టి దివ్య సాధ్వి యొక మహా కవి లేఖిని నుండి ఒక్కసారి మాత్రమే ఉదయించును. శ్రీరామచంద్రమూర్తులు అనేక మంది ఉద్భవింపవచ్చును. సర్వకాలములలో సీతాదేవి మాత్రం ఒక్కరే. మహాసాధ్వి అని చెప్పవలసి వచ్చినప్పుడు సీతాదేవి పేరునే చెప్ప కొనవలెను. భారతనారి విశ్వచరిత్రలో మహూన్నత స్థానమును గడించుట కవసరములైన ఉత్తమ లక్షణముల నన్నింటిని సీతాదేవి అలవరచుకున్నది.

యుగయుగముల తరతరముల భారత చరిత్రలో

అందరి పూజలను అందుకొనగలిగిన మహాసాధ్వి జానకియే. దేవ మానవ రాక్షస కాంతలందరి అభినందనలను అందుకొనగలిగింది. ఈమె సకల మానవ హృదయ కమల నిత్యవాసిని. వేదాలు మరుగున పడవచ్చును. సంస్కృత భాషయే తెలమాటున చేరవచ్చును. ఈ భూమిపై అందరికి సీతాదేవి దివ్యనామము వినిపిస్తూనే ఉండును. ఈ జాతి మీద ఆ మహాసాధ్వి చరిత్రమునకు గల ప్రభావ ముద్ర అట్టిది. ఈ గడ్డ పై మహాసాధ్వి అయిన పరమ పావన చరిత్ర నిత్యము వినిపిస్తూనే ఉండును. భారతీయులందరు జానకీ వాత్సల్యామృత లహరిలో తేలియాడు బిడ్డలే, అన్న వివేకానందుని మాటలు విలువకట్టలేనివి.

ముల్లోకాలలో కొండలు, నదులు ఉన్నంత కాలము సీతాదేవి చరిత్ర మార్మోగుచునే ఉండును. ఆమె పేరునే ఈ లోకము నిత్యము స్మరించుచుండును. అందుకే ఆదర్శ సతి జీవితగాథయే ఒక “గీత”.

**ఆధార గ్రంథాలు :**

1. వాల్మీకి రామాయణం - టిటీడి ప్రచురణలు
2. భాస్కర రామాయణం - ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి
3. భాస్కర రామాయణంలో స్త్రీ పాత్రలు - సమీక్ష - శారదా పబ్లికేషన్స్

✿✿✿

# గుండెల్ని పిండేసే స్త్రీల వ్యథ 'తాయమ్మ కథ'

- డా॥. ఎం. హరికృష్ణ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం.

'తాయమ్మ కథ' రాసిన కరుణ అసలు పేరు పద్మ. కమ్యునిజానికి పురిటిగడ్డలా వుండే నకిరేకల్ మండలం లోని తాటికల్లు గ్రామం ఈమె స్వగ్రామం. తండ్రి పేరు పరమేశం, తల్లి తాయమ్మ.

కమ్యునిస్టు భావజాలంతో పెరిగిన పద్మ కమ్యూనిజం పట్ల ఆకర్షితులయ్యారు. డిగ్రీ చదవడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన ఆమె తన పరిధిని మరింత విస్తరించుకున్నారు. కరుణ తన సహచరులతో కలిసి వరకట్నం, మద్యనిషేధం తదితర అనేక సమస్యలమీద ప్రజలకు అవగాహన కల్పించడానికి నాటికలు, వీధినాటికలు వేసేవారు. క్రమంగా నక్సల్ ఉద్యమం ఆమెను ఆకర్షించడంతో ఆమె ప్రత్యక్ష ఉద్యమంలోకి ప్రవేశించారు.

ఉద్యమ సహచరుడుగా వున్న మంజీర (మఠం రవికుమార్) కరుణ జీవిత సహచరుడు. తాను రాసిన కథలన్నీ మంజీర ఆనందంకోసం రాశానంటారు కరుణ. " ఇందులో చాలా కథలు మంజీర నాతో సంతోషంగా మాట్లాడ్డం కోసం రాశాను. నేను కథో, కవితో, ఇంకేదైనా రాసిన రోజున తను చాలా సంతోషపడేవాడు"[1] అంటారు కరుణ.

"కరుణ కథలు పాఠకులనే కాకుండా విమర్శకులను సైతం మెప్పించి కంటతడి పెట్టించాయి"2 అంటారు ఆమెతో ముఖాముఖి నిర్వహించిన షఫేలా ఫ్రాంకిన్.

తాయమ్మ కథ రాయడానికి నేపథ్యం తన ఇల్లే అంటుంది కరుణ. తన తండ్రి కమ్యూనిస్టు అయినా తల్లి పట్ల చాలా చులకనభావంతో వుండేవారని, అది తనకు చాలా అసంతృప్తిని కలిగించేది. ఆ వ్యధలోనుంచి వచ్చినదే తాయమ్మ కథ అని అంటారు కరుణ.

'తాయమ్మ కథ'ను ఓ మినీనవలగా మనం చెప్పుకోవచ్చు. ఈ కథ మనసులను ఎంత కదిలిస్తుందంటే ఈ కథ రాశాక కరుణ 'తాయమ్మ' కరుణగా పేరు పొందింది.

కథలోకి వస్తే తాయమ్మ చిన్నతనంలోనే తండ్రి పోయాడు. తల్లి పెంచలేక పిల్లలులేని తన తమ్ముడికి దత్తతకు ఇచ్చింది కూతుర్ని. వారికి పిల్లలు పుట్టగానే తాయమ్మ ఆయింట్లో పూర్తిస్థాయి పనిమనిషిగా మారి పోయింది. ఇంటిపనీ, వంటపనీ, పిల్లల పనీ అన్నీ తాయమ్మ మీదే పడ్డాయి. జీతం బత్తెంలేని పూర్తిస్థాయి పనిమనిషిగా మారిపోయిందామె ఆ ఇంట్లో.

ఒకరోజు పేడకళ్లు ఏరుకుని వచ్చి దిబ్బలోపోసి ఇంట్లోకి వస్తుండగానే తల్లి కనిపించామెకు. ఆమెతో పాటు ఓ ముగ్గురు కొత్తోళ్లు కూడా మంచంమీద కూర్చొని వున్నారు. తల్లిని చూడగానే పుట్టెడు దు:ఖం తన్నుకొచ్చింది తాయమ్మకు. ఆ దు:ఖం పంచుకోకముందే మామ పిలిచాడు. వచ్చిన వాళ్లకు తాయమ్మను చూపించాడు. వాళ్లు ఆ రాత్రి కోడికూరతో భోజనం చేసి వెళ్లిపోయారు. వాళ్లు పెళ్లిచూపులకు వచ్చినోళ్లని తర్వాత అర్థం అయింది తాయమ్మకు.

తాయమ్మ తల్లి ముభావంగా వుంది. కూతుర్ని వాళ్లింటికి ఇవ్వడం ఆమెకు ఇష్టంలేదు. ఇది అతనికి రెండో పెళ్లి, పెద్దభార్యను ఇంట్లోంచి తన్ని తరిమేశారు. తాయమ్మ అక్కడ సుఖపడదని ఆమె తల్లిమనసు హెచ్చరిస్తోంది. కానీ చేసేదేముంది? మరో మంచి సంబంధం తెచ్చి చేసే స్తోమత ఆమెకు లేదు. తమ్ముడి దయతో కాలమీడుస్తోంది. ఈ పెళ్లి కూడా తమ్ముడి దయే.

తమ్ముడు అక్కకు నయానా, భయానా నచ్చజెప్పాడు. తనకూ పిల్లలున్నారని, ఇంతకన్నా పెద్ద సంబంధం తేలేనని తేల్చి చెప్పాడు. చివరికి ఆమె ఒప్పుకోక తప్పలేదు.

రాతిరంతా కూతురి పక్కన పడుకున్న ఆ తల్లి పక్కలు ఎగసెగసి పడుతున్నాయి.

"ఇట్లాంటోడు నా యిష్టమడుగుడేందో. పిల్లల్లేరు సాదుకుంటన్దెచ్చుకొని, పిల్లలు పుట్టంగనె ఆళ్ల పీతి గుడ్డలుతికించిన్రు. ఆళ్లను ఏడిస్తే ఆడించింది. అది యిపుడే పిల్లలతల్లైంది. కన్నసాకిరి చేయించుకున్నరు. సిన్నపోరని లేదాయె. చిత్కపోరని లేదాయె. ఇంటెడు పని చేయించుకుంటుండు. ఏవెర్గనట్టు 'తాయికేం లోటు రానిచ్చిన. సొంతబిడ్డ లెక్క సూసుకున్న' అంటుండు. తను గన్నబిడ్డే అయితే ఇంత కష్టం జేయించుకునునా. ఇట్ల ఎవనికో ఓనికి అంటగట్టునా.."3 అని ఏడ్చుకుంది. ఎంత ఏడ్చినా ఆ అమ్మది తీరని దు:ఖం.

పెళ్లంటే ఏమిటో తెలీకుండానే తాయమ్మకు పెళ్లయిపోయింది. ఇక తాయమ్మ కష్టాలు దేవుడికే ఎరుక. పెళ్లయ్యాక తాయమ్మ పని మూడురెట్లయింది. పొద్దున లేచినప్పటినుంచీ రాత్రి పడుకునేవరకూ పనే. కానీ తిండిమాత్రం రెండు పూటలే. సద్ద గట్క లేదా జొన్న గట్క. దాంట్లోకీ కూర సరిగా వుండదు. మజ్జిగతో సరి పెట్టుకోవలసిందే. తోడికోడలు తాయమ్మ అత్తకు అన్న కూతురు. ఆమెకు మాత్రం వరన్నం పెట్టేవాళ్లు. ఇంట్లో అందరూ సబ్బుతో స్నానం చేస్తే తాయమ్మ మాత్రం తౌడుతో స్నానం చేసేది. దీనికి తోడు మొగుడి పోరు. విపరీతమైన అనుమానం 'గోరుచుట్టుమీద రోకటి పోటులా'.

"మూడురోజులకోపాలి తానం జేయాలె. ఓనాడు తానం జేసొచ్చి చీరకట్టుకుంటుంటె సూస్తావుండు. ఏందో నిమ్మలంగ సూస్తుండని సిగ్గయింది. చీర కుచ్చిలు పోసి బొడ్లకు దోపుకొని అట్టనే ఒంటింట్లకు పొయ్యి పీటేసిన. ఒచ్చి కూసుండు. పల్లెం ముందలపెట్టి అన్నంబెట్టిన. కూరేద్దామని తిరగంగనే పులోదిగ మీద పడ్డడు. యాడపడ్తె ఆడ గుద్దుతుండు. లంజెశెకలు. ఏమిండడు సూడాలనే చీరకుచ్చిల్లు పోసి కిందకేలాడేసినవు. గోసిపొయ్యి లంజె. ఇంకోపాలిట్ల నా కండ్లకు కన్పినంచినవో బత్కవు బిడ్డ మల్ల" అన్నాడు.

వున్న కష్టాలు కాక ఇది మరో కష్టం తాయమ్మకు. మంచిచీర కట్టుకోవడానికి లేదు. తలదువ్వి జడేసు కోవడానికి లేదు. తలెత్తడానికి లేదు. కంటినిండా నిద్ర పోవడానికీ లేదు. అన్నింటికీ అవమానాలు, అవహేళనలే.. ఈ కథ చదువుతుంటే ఒక ఆడదాని జీవితం ఇంత భారంగా నడుస్తుందా? అనిపిస్తుంది. నిత్యం మనచుట్టూ వున్న మహిళలు ఎదుర్కొనే అవమానాలు, కష్టాలు మనసులోకి ఓసారి వచ్చి గుండె బరువవుతుంది.

తాయమ్మకు పనిలేకపోవడం వల్లే ఇలా తయారవు తోందనుకున్నారు భర్త, అత్త, బావ. దీంతో ఆమెకు పనికల్పించడానికి గానూ మిల్లు పెట్టించారు. అయితే ఇది తాయమ్మ పాలిట వరమైంది. కాస్త పక్కమనుషులతో కబుర్లు పంచుకోవడానికి వీలుచిక్కింది. ఈ విధ్వంస జీవితంలోంచే నలుగురు పిల్లలు పుట్టుకొచ్చారు తాయమ్మకు. ఓ కూతురు, ఇద్దరు కొడుకులు.

ఓ రోజు బావ జేబులోనుంచి మూడువందల రూపా యలు పోయాయి. అందరి కళ్లూ తాయమ్మ మీదే పడ్డాయి. తాయమ్మే దొంగని వారంతా కలిసి నిర్ధారిం చేశారు. ఆడబిడ్డ మొగుడు పెద్దగా నిలిచి పంచాయతీ చేశాడు. తాయమ్మను కాలే నూనెలోనుంచి డబ్బులు తీయమని వత్తిడిచేశారు. మొదటిసారి ధైర్యం చేసింది తాయమ్మ. తోడికోడలు కూడా తీస్తే తాను కూడా తీస్తానని, తనకేం అభ్యంతరం లేదని తేల్చిచెప్పింది. తాయమ్మ తప్పుచేసివుంటే అంత ధైర్యంగా మాట్లాడ దన్నాడు ఆడబిడ్డ మొగుడు మొదటిసారి ఆమెకు మద్దతు నిస్తూ. అదేం కాదు తనపెళ్లామే దొంగతనం చేసి వుంటుందని, కొడితే బయటపెడుతుందన్నాడు తాయమ్మ మొగుడు మాత్రం... ఆడబిడ్డ మొగుడు అడ్డం తిరగడంతో ఈ పంచాయతీ అంతటితో ముగిసింది.

తాయమ్మ మూడోసారి గర్భవతి అయింది. నిండు గర్భిణి. పుట్టింటికి తీసుకుపోవడానికి ఆమెతల్లి వచ్చింది. తాయమ్మ వెళితే ఇంటెడు చాకిరీచేసే బానిసెవరు? అందుకే అత్తింటివారు పంపమనేశారు. ఏవేవో సాకులు

చెప్పారు. పుట్టింటికి వెళితే కాస్త విశ్రాంతి దొరుకుతుందని తాయమ్మ ఆశ. నిద్రపోతున్న కూతుర్ని వదిలి అమ్మతో కలిసి అత్తింటివారికి చెప్పకుండానే పుట్టింటికి బయల్దేరింది. రోజులు గడిచాయి. అత్తింటివారు తిరిగి చూడలేదు తాయమ్మ ఇంటివైపు. ఏడాది గడిచాక చేసేదేమీలేక బిడ్డతో సహా కూతుర్ని అత్తింటికి బయల్దేరదీసింది తల్లి. ఇష్టం లేకున్నా తల్లితో కలిసి బయల్దేరింది తాయమ్మ.

దీనిమీదా పంచాయతీ జరిగింది. కులంవాళ్లు గడ్డిపెట్టడంతో మౌనం వహించారు అత్తింటి మనుషులు. ఇక నా యింటికి ఎప్పుడూ రావద్దు, నన్ను ఇబ్బంది పెట్టొద్దని చెప్పి, తిండి కూడా తినకుండా బయల్దేరి వెళ్లిపోయింది తాయమ్మ తల్లి.

తాయమ్మ మొగుడు ఊరికి సర్పంచయ్యాడు. పంచాయతీలు చెప్పడం, గొప్పలకు పోవడం, జల్సాలు చేయడం ద్వారా ఆస్తులు కరిగించడం మొదలెట్టాడు. ఎవరు భరిస్తారు? చిన్న చిన్న తగువులు పెట్టుకుని వేరు పడడానికి సిద్ధమయ్యారు బావ, తోడికోడలు. వేరు పడేటప్పుడు తాయమ్మ కూతురి పెళ్లి సంగతి ప్రస్తావనకు వచ్చింది. కూతుర్ని ఆడబిడ్డ కొడుక్కు ఇవ్వడానికి సిద్ధమయ్యాడు తాయమ్మ మొగుడు ఈశ్వరయ్య. తాయమ్మ అభిప్రాయం మాత్రం ఎవ్వరూ అడగలేదు.

కొన్నిరోజులయ్యాక చెరువుకింద పొలాన్ని ఈశ్వరయ్య అమ్ముతున్నాడని తాయమ్మకు తెలిసింది. తాయమ్మ భర్తను పొలమెందుకు అమ్ముతున్నావని, తర్వాత పిల్లల గతి ఏమిటని ప్రశ్నించిందామె. పిల్లలు నాకు పుట్టలేదన్నాడతను. తాయమ్మ తారాజువ్వలాగా ఎగిసి మొగుడిమీద తిరగబడింది. అడ్డు చెప్పినందుకు కోపంతో చావగొట్టి వెళ్ళిన వాడు తిరిగి మూడు రోజుల తరువాత వచ్చి చిన్నకూతుర్ని ఒళ్లో కూర్చో బెట్టుకున్నాడు. ఇంత జీవితంలో ఎప్పుడూ ఎరగని వింతను చూసి తాయమ్మ నివ్వెరపోయింది.

తాను రెండెకరాల కందిచేను కొంటున్నానని, దాని కోసం మిల్లు అమ్ముతానన్నాడు. మిల్లమ్మితే జీవితం ఎట్ల గడుస్తుందని ప్రశ్నించిందామె. అది తన మిల్లు అన్నాడతను. చాకిరీ చేసింది తానే అందామె. మాటామాటా పెరిగింది. అమ్మగారు పెట్టిన నగలు ఇవ్వమన్నాడు. ఇవ్వనంది తాయమ్మ. మళ్లీ చేయిచేసుకున్నాడు. లేవకుండా బాదాడు. నగలు తీసుకెళ్లిపోయాడు.

"బాడుకావ్ ఒక్కొక్కదాన్నే అమ్మేస్తుండు. ఇంక ఇప్పుడేవమ్ముతడో? నగలు పోతే పొయినయ్. ఈపాలి మిల్లు ముచ్చట దియనీయరాదు. నగలు ఇయాలగాక పోతే రేపన్న జేసుకుంటా. మిల్లమ్ముతే నోట్ల మన్నుబడ్డట్టే. ఈడెన్నడు కష్టం జేయాలె. ఎన్నడు బెట్టాలె"5 అని ఏడ్చుకుంది తాయమ్మ.

బిడ్డల భవిష్యత్తుకోసం కన్నకష్టాలన్నీ పడింది. రోజూ తిట్లూ, దెబ్బలే. ఓ రోజు ఇక తట్టుకోలేక బావిలో దూకడానికి వెళ్లింది. కానీ బిడ్డలు గుర్తుకొచ్చి వెనక్కు వచ్చేసింది.

కాలం గడించింది. ఈశ్వరయ్యకు సర్పంచి పదవి పోయింది. కాస్త మనిషి తగ్గాడు. భార్యను కొట్టడం మానేశాడు. మిగిలిన చర్యల్లో ఏ మార్పూ లేదు. తన భార్య తనను సరిగా చూడట్లేదని ఊళ్లో అందరి దగ్గరా కొత్త పాట మొదలెట్టాడు.

తాయమ్మకు కోపమొచ్చింది. తీవ్రంగా మందలించింది. దీంతో నేరుగా తన అక్క ఇంటికి చేరుకున్నాడు ఈశ్వరయ్య. తాయమ్మ మీద అక్కకు, బావకు, అల్లుడికి ఎక్కజెప్పాడు. తాయమ్మ కూతురు లచ్మి కూడా తాయమ్మ లాంటిదేనని దాన్ని జాగ్రత్తగా చేతులో పెట్టుకోవాలని చెప్పాడు కొడుక్కు ఈశ్వరయ్య బావ. కూతుర్ని అంతమాటంటున్నా మెదల్లేదు ఈశ్వరయ్య.

'నీ పెండ్లాన్ని జర చేతుల్లో బెట్టుకోరా...' హెచ్చరిస్తూ అన్నాడు ఆడబిడ్డ మొగుడు. 'చేతులుండక ఏడికిబోద్ది' అన్నాడు లచ్మిమొగుడు వెంకటేశం.

"తండ్రి ముందల బిడ్డగురించి అట్ల చెప్తున్నా ఆ తండ్రికి చీమకుట్టినట్లైనా లేదు. ఇక్కడ తండ్రి బిడ్డల సంబంధం ఎక్కడుంది. ఆడదాన్ని చేతుల బెట్టుకునే సంబంధాలే." అంటుంది రచయిత్రి ఈ సందర్భంగా. తాయమ్మ వ్యధ రచయిత్రిని కూడా ఏ స్థాయిలో తాకిందో ఈ వాక్యంతో తెలుస్తుంది మనకు.

మిల్లుచూసుకునే తాయమ్మకు ఇంత ధైర్యం వచ్చిందని వాళ్లందరూ కలిసి నిర్ధారించారు. మిల్లు అమ్మేస్తే తాయమ్మ పొగరు అణుగుతుందని, అణకువగా పడి వుంటుందని నిర్ధారించుకున్నారు. తాయమ్మ ధైర్యం వెనక అసలు రహస్యాన్ని కనిపెట్టినందుకు జబ్బలు చరుచుకున్నారు. కన్నబిడ్డల బంగారు భవిష్యత్తు కోసమే తాయమ్మ ఈ రకంగా కష్టపడుతోందన్న సత్యాన్ని మాత్రం వారు గుర్తించలేకపోయారు.

పిల్లలు కూడా పెద్దవాళ్లయ్యారు. మిల్లు పనిచేస్తూ కష్టపడి ఇద్దరు మగబిడ్డలనూ బాగా చదివించింది తాయమ్మ. కానీ తల్లి కష్టాలతో తమకేమీ సంబంధం లేదని నిర్ధారించేశారు వారిద్దరూ. ఇల్లుకారుతోందని, కప్పుకోడానికి డబ్బులివ్వమని అడిగిన తల్లికి 'డబ్బు లేమన్నా చెట్లకు కాస్తున్నాయా' అన్నారు కొడుకులు. తల్లి రక్తాన్ని పాలుగా మార్చి తాగించిందన్న వాస్తవాన్ని విస్మరించారు. పాలుతాగి తల్లి రొమ్మునే గుద్దిన కర్కోటకులు వాళ్లు. అంతేకదా. కట్టుకున్నవాడికి లేని బాధ్యత కన్నబిడ్డలకు ఎక్కడినుంచీ వస్తుంది!

"నా కొడుకులు మంచి సదువులు సదువు కుంటున్నరని కష్టంజేసి పంపుకుంట మురిస్తిగని. ఆళ్లు సదువుకొని జూసుకుంటరా? సూసుకోరా? అని సూసుకోక పోతి" అన్నది తాయమ్మ తన స్నేహితురాలు మారెమ్మతో..

అదేదో అన్నట్లు ఇంట్లో వాళ్లే ఇలా వుంటే బయటి వాళ్ల సంగతి చెప్పాలా..! తాయమ్మకు కూడుబెట్టే మిల్లంటే పక్కింటి సూరమ్మకు కంటకప్రాయమైంది. అర్ధరాత్రిదాకా మిల్లుచేసే చప్పుడుతో తమకు నిద్ర కరువైందని పంచాయతీ పెట్టిందామె. ఈ సాకుచూసి ఇల్లు, మిల్లు రెండూ అమ్మేశాడు తాయమ్మ మొగుడు. ఈ విషయాన్ని చెప్పడానికి ఆడబిడ్డ, ఆమె భర్త, అల్లుళ్లతో కలిసి ఇంటికి వచ్చాడు. తాయమ్మకు గుండె మండిపోయింది. భర్తమీద ఆగ్రహంతో తిరగబడింది.

"ఏందెలంజె మన్ను గుప్తున్నవ్. నీ పొగరన్చేటందుకేఏగీ పన్జేసింది అని నామొగడు సిగబట్టిండు. బలం కొద్దిగ గజ్జలల్ల క్కటి దన్నిన. పొరక దీసుకున్న ఎవజంపుడు జంపిన. ఎన్నాండ్ల బాధ! అల్లుడు, ఆడిబిడ్డ మొగడు యిద్దరు నామీదికొచ్చింద్రు. బాడుకావ్‌లను ఆళ్లను గూడా అందినకాడికి దంచిన. ఈ సందుజూసుకొని ఈ బాడుకావ్ ఉరికిండు. ఆళ్లిద్దరు ఎటోళ్లు అటురికింద్రు. పొరకాడ పడేసిన దు:ఖమాగుతలే. కడుపుల పేగులు కల్లం కల్లం అయితున్నయి." అంటుంది తాయమ్మ చివర్లో..

జీవితాంతం ఎన్ని ఆరళ్లు అనుభవించినా నోరెత్తలేదు తాయమ్మ. మేనమామ, తల్లి, భర్త, అత్త, బావ, ఆడబిడ్డ, ఆమె కుటుంబం పెట్టిన కష్టాలన్నీ భరించింది. కన్న బిడ్డలు చేసిన ద్రోహాన్ని కూడా క్షమించింది. కానీ ఈ కష్టాలన్నీ ఈదడానికి తన జీవితానికి ఆసరా అయిన మిల్లును అమ్మడాన్ని మాత్రం ఆమె జీర్ణించుకోలేక పోయింది. అపరకాళికగా మారింది. తనను బాధించిన వారిమీదకు సివంగిలా విరుచుకుపడింది. వాళ్లకు బుద్ధివస్తుందో రాదో తెలీదు కానీ తాయమ్మ మాత్రం స్వేచ్ఛాజీవిగా మారింది. తనలో పేరుకుపోయి వున్న అన్ని అవరోధాలనూ అడ్డు తొలగించుకుంది తాయమ్మ.

తాయమ్మ కథ కథ కాదు, ఎంతోమంది మహిళల జీవితాలు ఇలాగే వున్నాయని అంటుంది కరుణ. కరుణ చూసిన ప్రపంచంలోని మహిళలకు ఓ నమూనా తాయమ్మ. తాయమ్మలా తిరగబడకుండా జీవితాన్ని మోసివెళ్లిపోయిన ఎందరో మహిళలు మనకు కూడా కనిపిస్తూనే వుంటారు. కానీ మనం గుర్తించలేమంతే.. అలాంటి మహిళలకు మానసికంగా సహకారం అందిస్తే వారు ఆ వూబిలోంచి బయటపడి కొత్త జీవితాన్ని వెతుక్కునే వెసులు బాటు దొరుకుతుంది. ఈ దిశగా సమాజం చైతన్యవంతం కావలసి వుంది.

## ఆధార గ్రంథసూచి

1. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:3
2. విహంగ మహిళా సాహిత్య పత్రిక, 1-7-2021 సంచిక
3. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:28
4. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:29
5. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:45
6. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:51
7. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:26
8. తాయమ్మ కథ మరికొన్ని కథలు, విరసం ప్రచురణలు, జనవరి 2009, పుట:26

# స్వాతంత్ర్యం తెలుగు స్త్రీల పాత్రలు

**- డా॥. పి. ఎస్. మైథిలి,** సహాయాచార్యులు, తెలుగు విభాగం, శ్రీ కన్యకా పరమేశ్వరీ కళ మరియు విజ్ఞాన కళాశాల, చెన్నై.

వేదకాలం నుంచి ఆధునిక కాలం వరకు భారతీయ మహిళలు సమాజంలో ప్రాధాన్యతనుబాధ్యతను కలిగి ఉన్నారనటం అతిశయోక్తికాదు. భారతీయ సమాజం స్త్రీని దేవతగా,మాతృమూర్తిగా, సోదరీమణిగా, ముద్దుల తనయుగా, గృహిణిగా, అత్తింటి కోడలుగా తగిన ఆదరణను చూపి గౌరవించంది. స్త్రీలు త్యాగమూర్తిగా, వినయవతిగా, విద్యావతిగా, ఆధ్యాత్మశీలిగా, వీర వనితగా, నిలిచి ఆదరణ, ఆత్మీయతఅనురాగాలను సమాజానికి పంచి ప్రపంచ మహిళలకే ఆదర్శంగా నిలిచింది.

పురుషవేషం ధరించి ఓరుగల్లున పరిపాలించిన రాణీ రుద్రమదేవి స్త్రీ జాతికే గర్వకారణం. భారతావనికే మణిహారం. అంతటి శక్తిసామర్థ్యాలు కలిగిన భారతీయ మహిళలు స్వాతంత్ర్యోద్యమంలోనాల్గని తమలో దాగున్న శక్తి సామర్థ్యాలను సమాజంలో నిరూపించారు.

మహాత్మాగాంధీ పిలుపునందుకుని కులమతభేదాలు లేక స్వార్థాన్ని పక్కకు నెట్టి త్యాగశీలులై కొండంత హృదయంతో జాతీయోద్యమంలో ప్రధాన పాత్రన వహించి భరతమాత దాస్య శృంఖలాలనుపగలగొట్టిన ఘనత మహిళలకు దక్కింది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ" అన్న సత్యానినిరూపించారు భారత మహిళలు.

ఎండ కన్నెరుగని సంపన్న గృహిణులు, వీధి గడప తొక్కని గృహిణులు, రాజకీయ పరిజ్ఞానంలేని వనితలు, చదువు సంధ్యలు లేని మహిళలు, అక్షరం ముక్క నేర్వని ఆడువారుఎందరోస్వాతంత్ర్యోద్యమాన్ని జయప్రదం చేసారు.

పరాయి పాలకుల దుండగాలను చూసి సహించలేక, వారుపెట్టే బాదలు పడలేక, రుచేసే అవమానాలు భరించలేక, లాటీలతో చావుదెబ్బలతో చంపుతుంటే, అన్యయంగా ఉరి శిక్షలువిధిస్తుంటే చూసి సహించలేక, రైతు కూలీలను బండిటెద్దులుగా కట్టించి జట్టాలను , గుఱ్ఱపు బండ్లనుతోలించే నాయకుల ఆగడాలను చూసి సహనం నశించిపోగా ఆంగ్ల పాలకుల దౌర్జన్యాలతో యావత్భారత రక్తపుటేరులై పారుతుంటే గుండెలు చెదరిపోతుంటే గాంధీ పిలుపు వేణునాదంలా వినబడితే ఉత్సాహంతో వారు ముందుకు వచ్చారు. త్యాగ మూర్తులై, నిస్వార్థ సేవాపరులై , సాహసరూపులై సేవాతత్పరులై , మాతృదాస్య విమోచనకై కదలివచ్చారు. స్త్రీ శక్తిస్వరూపిణి, త్యాగమూర్తి, ఓర్పు సహనానికి ఆమే నిదర్శనంఅని నిరూపించుకున్నారు.

1957లో జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో (సిపాయిల తిరుగుబాటు) వీరవనిత యైన ఝాన్సీలక్ష్మీబాయి పాత్ర మిక్కిలి ప్రాధాన్యం వహించింది. పరాయి పాలకులపై తిరుగుబాటు చేసిన సంస్థానాధీశ్వరురాలు ఝాన్సీ మహారాణీ లక్ష్మీబాయి. భారతాదేశ చరిత్రలో మొదటిమహిళ. మొదట సంస్థానాధీశ్వరురాలు ఝాన్సీ రాజైన గంగాధరరావు మరణానంతరం అతనుచేసుకున్న దత్తత చెల్లదను బ్రిటీషువారు ఝాన్సీకోటను ఆక్రమించగా లక్ష్మీబాయి ఆ అన్యాయం సహించలేక నిప్పులు కురిపించింది. కత్తిసాములో, గుఱ్ఱపు స్వారీ మొదలగు యుద్ధ వాద్యలలో ఆరితేరిన గంగాధరరావు భార్య, ఝాన్సీ మహారాణీ, లక్ష్మీబాయి సైన్య సమీకరణ చేసుకొనిఆంగ్లేయులపై తిరుగుబాటు చేసింది. బాలుణ్ణి వీపున కట్టుకొని వీరోచితంగా పోరాడి ఆంగ్లేయులను గడగడలాడించిన వీర సాహస నారీమణి ఆమె. మందుగుండు సామానులు, మర ఫిరంఘులు, తుపాకులు లేకపోయినా పోరాటం జరిపి బ్రిటీషు

పాలకుల గుండెల్లోచిచ్చు రేపి చివరకు వీరస్వర్గం అలం కరించిన మహెూన్నతురాలు ఝాన్సీలక్ష్మీబాయి.

మొదటి ప్రపంచయుద్ధంలో జరిగిన కొన్ని సంఘ టనల వలన భారతీయులలో రాజకీయచైతన్యం మరింత కలిగింది. 1919లో జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన ఘోర హత్యాకాండ నాయకులతోపాటు యావత్ భారతీయు లను కదిలించి వేసింది. అసేతు హిమాచల ప్రజలు ఏకమై ఉద్యమాలలోపాల్గన్నారు. బ్రిటీషు పాలనను ఎదిరించి లాఠీ చార్జీలు చేసినా, తుపాకులతో కాల్చినా, జైలు శిక్షలు విధించినా సహించి పోరాటాలు సాగించారు.

ఈ భారత స్వాతంత్ర్యం పోరాటంలో ఎందరో మహిళలు ప్రాణాలకు తెగించి పోరాటంల పాల్గొన్నారు. ఇది అహింసా పునాదులపై ఆయుధాలు లేని శాంతి పోరాటం. ''ఐక్యమత్యమే బలంగా''జాతి సమైక్యతే పెట్టుబడిగా దేశభక్తి , త్యాగం , ధైర్యం, అహింస ఆయుధా లుగా సలిపిన మహెూన్నతపోరాటం.

స్త్రీలలో అట్టి చైతన్యం రావటానికి ఆ రోజులలో తెలుగు దేశంలో అనేక కారణాలు చోటుచేసుకున్నాయి. ఆంగ్ల పాలకుల దుండగాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు, కరువుకాటకాలు, ఆర్థిక ఇబ్బందులు, రాజా రామమోహన్‌రాయ్ వంటివారు సతీ సహగమనం వంటి దురాచారాలు దుయ్యబట్టడం, వీరేశ లింగం పంతులు గారు వితంతు వివాహాన్ని ప్రోత్సహించి, బాల్య వివాహం రద్దుకై పోరాడి స్త్రీల విద్యను ప్రోత్స హించుట, స్త్రీలకు ప్రత్యేక సంస్థల స్థాపన, గాంధీ మహాత్ముడు స్త్రీలకిచ్చిన ప్రత్యేకత, స్త్రీచైతన్యానికి చేసిన ఉపన్యాసాలు , సమాజంలో, దేశంలో స్త్రీల బాధ్యతను తెలియజెప్పే ప్రయత్నాలు, విద్యనేర్పమని ఆర్థికంగా నిలబడాలనే హితబోధ, స్త్రీలలో గాంధీ ప్రభావం వల్ల ఉద్యమాలపై కలిగిన ఆసక్తి, స్త్రీలకు ఉద్యమాలలో పాల్గనే నూతనావకాశాలు, ప్రతి ఇంటిలో భర్తో, తండ్రో, సోదరుడో, బంధువో ఉద్యమంలో పనిచేయడం, పై కారణాల వలన స్త్రీలలో నూతన చేతనత్వం అవకాశం ఏర్పడింది.

విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో నాయకులంతా జైళ్ళ పాలైనప్పుడు శ్రీమతి దుర్గాబాయి ,అవంతికా బాయి గోఖలే, రాజకుమారి అమృతాకౌర్, సరోజినీ నాయుడు, సుశీల నాయర్, లీలావతిమున్నీ, కమలాబాయి ఛటో పాధ్యాయ వంటినారీమణులు సత్యాగ్రహాలు నడిపించి పరాయి పాలకులనుగడగడలాడించి అందరిని ఆశ్చర్య చకితున్ని చేశారు.

గాధీంజీ పిలుపు నందుకుని ఉద్యమాలు నడి పించిన వారిలో మద్రాసులో కమలాబాయి చటోపాధ్యాయ, ముత్తు లక్ష్మీరెడ్డి, దుర్గాబాయి, అచంట రుక్మినమ్మ ధ్రాన పాత్ర వహిస్తారు.

ఆంధ్రదేశంలో జాతీయోద్యమం మరింత ఆధాన్యత వహించింది.

సరోజినీ దేవి వంటివారు మహాత్మాగాంధీ వెంట అనేక ప్రాంతాలు సందర్శించి ఉపన్యాసాలు చేశారు. మద్రాసులో రౌలత్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆవిడ చేసిన ఉపన్యాసాలు ఎందరో మహిళలనుఆకర్షించాయి.

ఆంధ్రదేశంలో మహాత్మాగాంధీ పర్యటనకు వచ్చి నప్పుడు విజయవాడ సభలో ఎన్నో తీర్మానాలు చేశారు. ప్రకాశం పంతులు, పట్టాభి, బులుసు సాంబమూర్తి, మొదలగు వారితో పని చేసిన దువ్వూరి సుబ్బమ్మగారి పాత్ర పేర్కొనదగినది. మద్యపాన వ్యతిరేకోద్యమంలో పొనకా కనకమ్మ మొదలగు స్త్రీల పాత్ర ఎన్నదగినవి.

ఆంధ్రదేశంలో స్త్రీలు ఉప్పు సత్యాగ్రహ కాలంలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టారు. ''స్వరాజ్య లక్ష్మీపూజ'' పేరిట ఇంటింటికి ఉగాదినాడు పూజలు జరిపి స్త్రీలకు పిలుపు నిచ్చుటలో ఉన్నవ లక్ష్మీబాయమ్మ , రుక్మిణీ లక్ష్మీపతి, మొదలగు స్రీల పాత్ర ప్రాధాన్యమైనది.

నెల్లూరు జిల్లాలో జరిగిన సత్యాగ్రహంలో పాల్గన్న మొదటి మహిళ పాతూరి బాల సరస్వతమ్మఆమె కుమార్తె మద్రాసులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో శ్రీమతి దుర్గాబాయమ్మ, ప్రకాశం పంతులుగారి సతీమణి ప్రధాన

పాత్ర వహిస్తారు. దొల్లంగిలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో 500 మంది స్త్రీలుప్రధాన పాత్ర వహిస్తారు.

1932 శాసనోల్లంఘనోద్యమంలో గుడివాడలో వల్లభనేని సీతామహాలక్ష్మి వహించగా, దిగుమర్తి జానకమ్మ, చుక్కమ్మ, వేదాంతం కమలాదేవి, కంభంపాటి మాణక్యాంబ, ఉద్దరాజు మాణిక్యంబ, పసల అంఝలక్ష్మి మొదలగువారు భీమవరంలో 144 సెక్షన్ ధిక్కరించి శాసనోల్లంఘనం చేసినందుకుసం॥ జైలు శిక్ష అనుభవించారు. కంభంపాటి మాణిక్యాంబగారు ఆరు నెలల పసిబిడ్డ నెత్తుకుని జైలుశిక్ష అనుభవించారు. పసల అంజలక్ష్మిగారు చంటి వానిని ఎత్తుకుని నిండు గర్భవతియైనా జైలు శిక్ష విధించారు. అక్కడే పురుడు పోసుకుని ఆడబిడ్డకు జన్మనిచ్చారు.

ఉద్యమకాలంలో స్త్రీలు తమ హక్కులను, అవకాశాలను, పోరాటం చేసి సాధించారు. అందులో ప్రధానమైనది ఓటింగ్ హక్కు . స్త్రీల ఓటింగ్ హక్కుకై కృషిచేసిన వారిలో కమలాదేవి చటోపాధ్యాయ, శ్రీమతి ముత్తు లక్ష్మి రెడ్డి, దుర్గాబాయి మొదలగువారు ప్రధానులు. అంతే కాకుండా స్త్రీలుకూడా శాసనసభల్లో నిలబడి ఎన్నికయ్యే హక్కు కూడా సంపాధించుకున్నారు. అందుకే శ్రీమతి ముత్తు లక్ష్మి రెడ్డి గారిని మద్రాసు ప్రభుత్వం శాసనసభకు నామినేట్ చేశారు.

భారతదేశ చరిత్రలో మొదటిసారిగా శాసనసభలో అడుగు పెట్టిన మహిళ శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డి గారు. స్త్రీల కొరకు పత్రికలు, సంస్థలు ప్రత్యేకంగా వెలువడ్డాయి. స్త్రీ విద్య ప్రోత్సాహించబడింది. ఎందరో మహిళల కృషి ఫలితంగా భారతదేశానికి బానిసత్వపు సంకెళ్ళు వదిలి స్వరాజ్యం సిద్ధించింది.

ప్రజాశక్తా రగిలింది
ప్రజలలో చైతన్యం చెలరేగింది
విజయ భేరి మ్రోగింది
త్రివర్ణ పతాకం ఎగిరింది

✿✿✿

# సంస్కృతి మాయాజాలంలో మహిళా చైతన్యం

- డా॥. పి. ఎ. సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (ఏ), రాజమహేంద్రవరం.

"ఆడది తిరిగి చెడింది మగాడు తిరగక చెడ్డాడు" "వనిత, విత్తం, పుస్తకం గతంగతః" లాంటి లోకోక్తులు పితృస్వామ్య సమాజాల్లో పురుడోసుకుని అత్యాధునిక దశకు చేరుకున్నామనుకునే నేటికి మనగలుతున్నాయి. మన వివేచన కళ్ళుగప్పి తిరుగాడగలుగుతున్నాయి.

విలువలు ఆడదానికే కాని మగాడికి కాదు అనుకునే; స్త్రీ అంటే మెదడు లేని జడపదార్ధంతో జమకట్టే సంస్కతితో మనమంతా మమేకం అయిపోతున్నాం. ఆడపిల్లను త్వరగా ఒక ఇంటిదాన్ని చేసి బరువు దించుకోవాలి అనే సమాజంలో ప్రస్తుతం మనం బతుకుతున్నాం. ఆడది చదువుకుని ఊళ్ళుఏలాలా? ఆడదానికి అణకువ అందం లాంటి నానుడులు చుట్టూ వినిపిస్తూనే ఉంటాయి.

దీనికంతటికీ కారణం స్త్రీ భోగవస్తువుగా చూడబడటమే కాదు ఆమె గుణశీలాలు మగాడి సామాజిక అంతస్తుకు కొలబద్దలుగా కూడా పరిగణించబడటం ఒక ప్రధాన కారణం. ఆడది, ఆస్తి ప్రధాన తగాదా కేంద్రాలుగా మార్చబడ్డాయి. ఈ దృక్కోణంలో ఈ రెండూ పర్యాయ పదాలయ్యాయి. ఆమెకు ఆస్తిహక్కు ఉండదు సరికదా ఆమె ఒక ఆస్తిగా చూడబడటం ఒక విచిత్రపరిణామమం ఆమే ఆస్తి అయినప్పుడు ఆమెకు ఇక ఆస్తి ఎందుకు అని ఆమెకు ఆస్తి హక్కు లేకుండా చేయడమే కాదు ఆమెను అనుత్పాదక శ్రమలోకితోసేసి ఆమె శ్రమను కరెన్సీతోతూచ లేని విధంగా వ్యవస్థను నిర్మించి ఆమెను ఇంటిపనికి, వెట్టి చాకిరీకి పరిమితం చేసింది మన సమాజం.

భగ్యేషుమాత, కార్యేషుదాసి, కరణేషు మంత్రి శయనేషు రంభ... లాంటి వచనాలు అత్యున్నత ప్రశంసలుగా ఈనాటికీ ఆధునికమహిళ చేత కూడా ఒప్పించబడటం విడ్డూరమేమీ కాదు.

హక్కులు, ఆస్తులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు దృష్ట్యా మహిళా చైతన్యాన్ని పితృస్వామ్య సంస్కృతి మసకబారుస్తున్న నేపథ్యంలో మరింత పరిశీలన విచక్షణ తెలివిడి అవసరమవుతాయి. దీనికిగాను ఏమరపాటుకు లోను చేసే సంకర్షాలను వెదకిపట్టుకుని చర్చించాల్సిన అవసరం ఉన్నది.

సంస్కృతి నిర్మిత విలువల్ని తిరగరాసుకోలేకపోవడం, పాతవిలువల వాటి స్థానంలో ఉమ్మడి శ్రేయస్సును ఉపబలకాలుగా ఉండే సరికొత్త విలువల్ని నిర్మించుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్ళకు సన్నద్ధం కావటంలో విఫలం అవ్వటంలాంటి ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయి.

వస్తువాహనాదుల్లోనే ఆధునికత కనిపిస్తుందికాని భావజాలంలో కనిపించకపోవటానికి చాలా కారణాలే కనపడతాయి. ఇంకా పురాణపాత్రలు ఆదర్శం అన్న వాఖ్యానాలను ప్రశ్నించడానికి అవసరమైన తెలివిడి చాలా చోట్ల మృగ్యకావటం గమనిస్తాం.

గుమ్మంలోంచి గెంటేసిన భర్త ఇంటిముందు చేసే మౌనపోరాటాలు కుటుంబ వ్యవస్థను పటిష్టంచేసే విలువలుగా ఇంకా కొనియాడబడటం, దానికి శకుంతల పాత్రను ఉటకించడం మనకు కొత్తకాదు. కుటుంబ వ్యవస్థను నిర్మించే విలువలు పేరుమీద ఆత్మగౌరవ విలువను తాకట్టు పెట్టమని చెప్పే ప్రలోభాలకు లోనుకావటం, కుటుంబ వ్యవస్థ నిర్మిత విలువలు ఆత్మ గౌరవ విలువ ప్రాతిపదికగా కూడా మరో కొత్త కుటుంబాన్ని నిర్మించుకోవచ్చుని తెలుసుకోలేక పోవడం లాంటి అంశాలు మనకు కొత్తగా అనిపించవు.

బహుభర్తృత్వానికి, పాతివ్రత్యానికి చుక్కెదురు అనుకునే సందర్భంలో కూడా పురాణపాత్రల మీద గౌరవంతో పాతివ్రత్య నిర్వచనాలను మార్చే ప్రయత్నం

చేయడం కూడా మనకు కనిపిస్తుంది. దీనికంతటికి విలువలు సార్వకాలికం సార్వజనీనం అనుకోవటం అంటే పోలిగమీ, మోనోగమీ వ్యవస్థలకు ఆయా ప్రత్యేక విలువలు ఉంటాయని తెలుసుకోలేకపోవటంగా మనం గమనించవచ్చు.

పరస్పర శ్రేయస్సు భూమికగా లేని ఎన్నో అనాచరాలు త్యాగాలు పేరిట గొప్పవిలువలుగా చాలామణి అవుతూ స్త్రీ స్వేచ్ఛకు, సాధికారతకు, ప్రతి బంధకాలుగా తయారవటం మనకు విదితమే!

ముసలి, చవట, చాదస్తపు, అనుమానపు ఈడుజోడు సరిపోనీ, భావసారూప్యం లేని భర్తలను పెళ్ళి పేరిట, సంప్రదాయం పడగ నీడలో భరించాల్సి రావటం తెగని శృంఖలంగా మనకు తెలుసు.

అంతేకాదు మహిళకు ఆర్థిక సాధికారత ఉన్నప్పటికీ అది పేరుకు మాత్రమే. నిర్ణయాధికారం స్త్రీలకు చాలా వరకు శూన్యం. ఆర్థికంగానే కాదు రాజకీయాలలో కూడా పేరుకే స్త్రీకి అధికారం ఉంటుంది. కాని నిజానికి దాన్ని చలాయించేది ఆమె భర్తే అవుతాడు.

దీనికంతటికీ కారణం స్వయం నిర్ణయాధికారం లేకపోవటమే. మరి ఇది ఎందుకు లోపించింది? అక్షరాస్యురాలైన మహిళ అయినప్పటికీ కీలుబొమ్మ అవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? మళ్ళీ దీనికి సమాధానం, సంస్కృతి మూలాల్లోనే ఉన్నది.

సంస్కృతి స్త్రీకి వినయమే ధనం, అణుకవే ఆభరణం అని అందంగా చెప్పి అణచివేయటం వల్ల అణిగి మణిగి ఉండకపోతే అపరాధం అన్న గిల్టీ ఫీలింగ్ లోకి వెళ్ళి పోయింది పితృస్వామ్య సంస్కృతి గయ్యాళి లేదా గొడ్రాలిముద్ర వేసి స్త్రీలోబడి ఉండాలన్న అగుపించని శాసనాన్ని స్థిరీకరించింది.

ఆమెకు పేరుకే డబ్బు, అధికారం అన్నది జగమెరిగిన సత్యం. ఈ దుస్థితిని అధిగమించాలంటే అక్షరం, అర్థికం, రాజకీయలేకాదు; స్వయం నిర్ణయాధికారం కూడా. ఆమెకు అత్యవసరం.

ప్రెంచి మహిళకు రాజకీయ స్వాతంత్ర్యం లేకపోయినా సామాజిక స్వాతంత్ర్యం ఉండేది. కాని మన మహిళకు రాజకీయస్వాతంత్ర్యం ఉన్నప్పటికీ దానిని ఆస్వాదించే సామాజిక భూమిక లేకుండాపోయింది. అసలు వ్యక్తిగత, కౌటుంబిక, సామాజిక సాంస్కృతిక స్వాతంత్ర్యాలు తరువాతే ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాలు సంప్రాప్తిస్తాయి. వ్యక్తిస్వేచ్ఛనుంచి రాజకీయస్వేచ్ఛ దాకా క్రమపరిణామ విధాన ప్రస్థానం సహజంగా జరిగితేనే ప్రతిదశలోను స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు అనుభవైక వేద్యం అవుతాయి. అలాకాకుండా సరైన పునాదిలేని భవంతులు కుప్పకూలిపోతాయి. మనదేశంలో మహిళాస్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సరైన భూమిక లేకపోవడం వల్లనే అన్నిస్థాయిలలోను స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు అభాసగా మిగిలపోతున్నాయి.

ఇంతకీ సరైన భూమిక అంటే ఏమిటి? ఉట్టికే గరలేనివాడు స్వర్గానికేగిరాడన్న చంధంగా వ్యక్తిగత స్థాయిలో స్వేచ్ఛలేనివాళ్ళు. అత్యున్నతస్థాయి అయిన రాజకీయ స్వేచ్ఛను ఎలా అనుభవించగలుగుతారు?

స్వేచ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని ఒక అవ లక్షణంగా, పైత్యంగా పాపంగా, వెర్రితలలు వేసినట్టుగా చూసే దృక్పధం ప్రాతిపదికగా రాజకీయ స్వేచ్ఛ ఆభాసకాక మరేం అవుతుంది? స్వేచ్ఛను విచ్చలి విడితనంగా, వినయాన్ని, అణిగిమణిగి ఉండటాన్ని సుగుణంగా భావించే జాతి బానిస కాక ఏమవుతుంది.

ఇనుప కచ్చడాలను, ఆటంకంగా కాకుండా అలం కారంగా భావిస్తూ వివేచనారహిత కోమాలోకి జారిపోయిన వాళ్ళను ఏ మేలుకొలుపులు తట్టి లేపగలవు? వ్యక్తిగత, కుటుంబం, సమాజస్థాయిలో స్వేచ్ఛలేని మన మహిళకు రాజకీయ స్వాతంత్ర్యం అనాయాసంగా రాజ్యాంగం ద్వారా సిద్ధించింది. వీళ్ళకు దీన్ని ఛాందస సంప్రదాయ మేధావులతో వాదించి ఒక్క కలంపోటుతో అంబేద్కర్ రాజ్యాంగంలో వ్రాసిపెట్టి సాధించిపెట్టాడు. కాబట్టి వ్యక్తిగత స్థాయిలోనే అస్వాద యోగ్యత లేని జాతి పతాక

స్థాయిలో వాటిని అనుభవించజాలదు.

ఇరవైయ్యో శతాబ్దపు తొలిదశకాల్లోనే ఫ్రాన్స్ మహిళా లోకంలో సామాజిక స్వాతంత్ర్యం ఫ్రెంచి మద్యంలా వీధివీధిన ఏరులై పారింది. అప్పటికి మనమహిళ సూర్యుడి ముఖం కూడా చూడలేదు. మన మహిళలాగే ఫ్రెంచి మహిళకూడా నలభైలలోనే రాజకీయస్వాతంత్ర్యం పొందింది. అయినా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రమాణాలలో అక్కడికీ ఇక్కడికీ ఎంతతేడా!

నేటికీ ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ తనకు నచ్చినోణ్ణి కట్టుకుని బతికే సామాజిక స్వాతంత్ర్యం దేశంలో మృగ్యం. స్వేచ్ఛకు ప్రతిబింబంలాంటి మన సినిమా వాళ్ళను కూడా సామాజిక స్వాతంత్ర్యలేమితో ప్రాణ భయం వెంటాడుతుండటం బహిరంగ రహస్యం.

మౌఢ్యమత్తుచల్లి సంస్కృతి మనమహిళను అచేతన స్థితిలోకి నెట్టివేసింది. ఆమె ఇంకా ఆటంకాన్ని అలంకార మనే భ్రమిస్తుంది. నిలువు దోపిడి అయిపోతూ అత్యున్నత త్యాగంగా మురిసిపోతుంది. సమిధలా ఆహుతి అయి పోవడం అదృష్టంగా భావిస్తుంది. పితృస్వామ్య అకృత్యాలకుష్టునున తలమీద మోయలేకమోస్తూ పూర్వజన్మ సుకృతం అనుకుంటూ నిరంతరం నిబంధ నాభ్యసపు కృతకత్వాన్ని సహజం అని గుడ్డిగా నమ్ము తుంది.

ఇప్పుడు చికిత్సకు చాలా దశాబ్దాలే పడుతుంది. స్వస్థతకు ఇంకాను... ఆర్థిక స్వేచ్ఛలాగే లైంగిక స్వేచ్ఛను చూసే ధృక్పధం ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. వేశ్యావాటికల్ని స్మశాన వాటికలుగా చూసే పరిస్థితి కూడా ఇప్పుడు సన్నగిల్లు తుంది. వ్యభిచారాన్ని, చట్టబద్ధం చేసిన దేశాలు ప్రగతి శీలమైనవిగా పరిగణించబడుతున్నాయి. (దీనిలో మానవ హక్కుల ఉల్లంఘన విపరీతంగా జరిగే అవకాశం ఉంది) కేరెక్టరు (శీలం) అంటే ఎక్కువమందితో లైంగిక సంబంధాలు పెట్టుకోకుండా ఉండటంగా ఇప్పటికీ ప్రధానంగా మధ్యతరగతి వర్గం నమ్ముతుంది. లైంగికంగా విశ్వసనీయత అనేది కూడా ఇనుపకచ్చడాల సంస్కృతి అవశేషమే అన్నది మేధావులు ఇప్పుడిప్పుడే గనిస్తున్నారు.

భారతీయ సమాజంలో సంస్కృతి అంటే కులం, మతం, వాటి వికృతరూపాలు తప్ప మరేమీ కాదన్నది తెలిసిందే ఈ రెండే జెండర్ రాజకీయాలు చేశాయనీ మనకు తెలుసు. భూమిమీద, ఆస్తిమీద ఆధిపత్యం కోసం పితృస్వామ్య వ్యవస్థ స్త్రీని ఆస్తిగా, చూసి, తమ వంశాన్ని కొనసాగించడానికి ఆమెచుట్టూ పవిత్రత, పాతివ్రత్యం అంటూ లైంగిక నిర్బంధాలు సృష్టించి 'ప్రతిలోమాన్ని' అణచివేస్తూ దానికి పాల్పడ్డ వాళ్ళకు భౌతిక దండన, మరణశిక్షలు అమలుచేస్తూ విలువలు, నైతిక భ్రష్టత్వం పేరిట మతం కట్టుబాట్లు, ఆచారాలు పేరిట కులం, ఆమెను, అట్టడుగు వర్గాల వాళ్ళను తొక్కిపట్టి ఉంచ గలిగాయి.

విధవపునర్వివాహం, ప్రేమవివాహాలకు చట్టబద్ధత ఉన్నా, సంప్రదాయం తీవ్రంగా వ్యతిరేకించడం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడి ఆటవిక న్యాయాన్ని ప్రదర్శించడం మనం చూస్తూనే ఉన్నాం. వయోజనుల పట్ల ఏ రూపంలో ఉన్న నిర్బంధాన్నైనా కొనసాగించడం మీద నాగరిక సమాజాల్లో విస్తృతమైన చర్చ జరగాలి. అప్పుడే మరింత ప్రగతిశీల సమాజవికాసం సాధ్యం అవుతుంది.

లైంగిక స్వేచ్ఛను విశృంఖలత్వంగా చిత్రించడం వెనుక ఉన్న పితృస్వామ్య సంస్కృతి వికృత రూపాలైన కులం మతం ఆధిపత్యాన్ని ప్రగతి శీల వాదులు ప్రశ్నిం చాలి. నిర్బంధం ఏ రూపంలో ఉన్నా ప్రశ్నించబడాల్సిందే.

**ఆధార గ్రంథాలు :**

1. పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు - తాపీధర్మారావు 2. ఇనుపకచ్చడాలు - తాపీధర్మారావు
3. విద్యామనోవిజ్ఞానశాస్త్రం - తెలుగు అకాడమీ ప్రచురణలు. 4. స్త్రీ వాద దృక్కోణంలో జెండర్ కులం - ఉమా చక్రవర్తి.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# 'రక్త స్పర్శ' కవుల కవిత్వం - స్త్రీ దృక్పథం

- భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

స్వేచ్ఛా సమానతల ప్రాతిపదికగా గల మానవ విలువలతో ఆవిర్భవించిన ఫ్రెంచి విప్లవ చైతన్య స్ఫూర్తితోనే స్త్రీవాదం కూడా రూపొందింది. మొట్టమొదట ఓటు హక్కుల కోసం బ్రిటన్ లోని మహిళలు సాగించిన పోరాటాల త్యాగాల ఫలితంగా వారికే కాకుండా మన భారతీయ మహిళలకు ఓటుహక్కు లభించింది. నాటి బ్రిటిష్ ఫెమినిష్టులు పురుషుల్లాగే తాము మానవులమే నంటూ ఓటుహక్కు, చదువుకునే హక్కు, పార్లమెంటు కెళ్ళే హక్కు, గర్భ నియంత్రణ హక్కు మొదలైన హక్కులను కోరి సాధించారు. దీనినే 'లిబరల్ ఫెమినిజం' అన్నారు.

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ శ్రమనీ, లైంగికతనీ, పునరుత్పత్తి శక్తిని ఒకానొక పద్ధతిలో అదుపు చేస్తున్న తీరు తెన్నులను పరిశీలించవలసిన ఆవశ్యకతను గుర్తించాలని భావించారు.

అంతర్జాతీయ మహిళా సంస్థ ఆవిర్భవించాక స్త్రీవాద ప్రభావం దేశ దేశాల్లోనూ బలపడసాగింది. పితృస్వామ్య వ్యవస్థలో పురుషాధిక్యతాహంకారాలను స్త్రీ ఏవిధంగా గురి అవుతుందో, అణగద్రొక్కబడుతోందో, ఆమె శ్రమ మూల్యం ఏ రకంగా దోపిడీ చేయబడుతుందోననే విషయాల మీద వివేచనాత్మకమైన చర్చలు సాగాయి. సాంఘిక, రాజకీయ, ఆర్థికరంగాల అన్నింటిలో స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించడానికి అలజడులు, ఆందోళనలు ఆరంభమై, ఉద్యమ స్థాయి అందుకున్నాయి. మహిళా దశాబ్ద సంవత్సరం (1975-85) ఈ స్త్రీవాదం ప్రపంచ దేశాల్లో మరింతగా ముందుకు సాగింది.

సంఘ సంస్కర్తగా స్త్రీ జనోద్ధరణకై పాటుపడిన కందుకూరి తన రచనలలో స్త్రీ సమస్యలను వివరించారు. కన్యాశుల్కం ఇతివృత్తంతో రాసిన బ్రహ్మవివాహం, రాజశేఖర చరిత్ర, హాస్య రచనలు మొదలైనవన్నీ నాటి స్త్రీల దుస్థితిని కళ్ళకు కట్టేటట్టు చేసినవే. ఆధునిక మానవేతిహాసంగా పేర్కొనబడ్తున్న గురజాడ కన్యాశుల్కం, ముత్యాల సరాలలోని ఖండికల్లో పూర్ణమ్మ, కన్యకలు నాటి సమాజంలో స్త్రీలకు జరిగే అన్యాయాన్నీ, అక్రమాన్నీ దురంతాల నెత్తి చూపేవే! కన్యాశుల్కం నే కాకుండా వరకట్నం స్త్రీల పాలిట శాపంగా ఎలా పరిణమించిందో రాయప్రోలు వారి 'స్నేహలత' వివరిస్తుంది. రాయప్రోలు వారి ఖండకావ్యాలల్లో చాలామంది స్త్రీలు పురుషుల స్వార్థానికి గురియైనవారే (కష్టమాల, రూప నవనీతం మొ॥) కాళ్ళకూరి నారాయణరావు గారు వర విక్రయం లో 'కమల' అనే పాత్రతో కట్నాలు తీసుకునే పురుషుల్ని తీవ్రంగా విమర్శించేస్తాడు.

"వెండి నాణెంబె పెనిమిటి వేక్యకటులె
కట్నములె భార్య తిప్పటి కర్కశులకు
వేశ్యవెలయా అనంబడి వెల గ్రహించి
కట్నముల చేత వెలమగల్ కారెవీరు?"

అంటూ తీవ్రంగా విమర్శించారు. ఈ విధంగా వివాహ వ్యవస్థలోని ఈ రెండు దురాచారాలను దుమ్మెత్తి పోస్తారు నాటి కవులు గురజాడ 'కన్యక'లో స్త్రీపై అత్యాచారానికి పాల్పడుతున్నా అధికార మదాంధతను తీవ్రంగా నిరసిస్తారు. తరువాత భావకవులు స్త్రీని పురుషుని ప్రాణధాత్రి, హృదయనేత్రిగా భావించి, తను ప్రణయారాధన భావాన్ని వ్యక్తం చేశారు. బాహ్య సౌందర్యానికి కాక అంతర సౌందర్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

చలం వివాహ వ్యవస్థలో నుండే అస్తవ్యస్థతను తీవ్రంగా నిరసిస్తాడు. వివాహం పవిత్ర ప్రణయంతో పెనవేసుకున్నది కాక, కేవలం ఒక సాంఘిక ముద్రగా రూపుదాల్చిందని, ప్రణయోపాసన లేని యీ వ్యవస్థ

వ్యర్థమని నిరూపిస్తూ నిరసిస్తాడు. ఇటువంటి వివాహ వ్యవస్థ వల్ల సౌందర్య సౌశీల్య సమాజ వ్యక్తిత్వాలున్న స్త్రీని ఏవిధంగా ఆమెకు సరితూగని పురుషుడు వివాహం పేరుతో ఆమెను బానిసను గావిస్తున్నాడనీ, ఆనందానికేమాత్రం ఆస్కారం లేకుండా యాంత్రికంగా తయారైన వ్యవస్థను రూపుమాపవలసిందనీ, సెక్సులో స్వేచ్ఛను కోరతాడు. ఈ దృష్టిలో సమాజంలో స్త్రీ పరిస్థితిని విమర్శిస్తూ, స్త్రీ, వివాహం, సావిత్రి, మైదానం వంటి రచనలు చేశాడు చలం. పై రచనలన్నింటిలోనూ స్పష్టంగా స్త్రీవాద భావాలు కనిపిస్తాయి. అయితే అంతర్జాతీయ మహిళా సంస్థ స్థాపనానంతరం 1975 - 85 సంవత్సరాలను మహిళా దశాబ్దంగా ప్రకటించిన తర్వాత కలిగిన చైతన్య స్ఫూర్తితో, జాతీయ అంతర్జాతీయ స్త్రీవాద ప్రభావంతో వచ్చిన సాహిత్యాన్నే స్త్రీవాద సాహిత్యంగా పరిగణిస్తున్నాము" పుట.31

తెలుగు సాహిత్యంలో అత్యాధునిక కవితా వికాసంలో ఖమ్మం జిల్లా నుంచి రక్తస్పర్శ కవులు 1985లో సాహిత్య లోకానికి పరిచయం అయ్యారు. ఈ కవులు అఫ్సర్, ప్రసేన్, సీతారాం. వీరిని ఖమ్మం కవిత్రయం అని కూడా పిలుస్తారు. అయితే ఈ ముగ్గురు కవులు రచన దృక్పథం అంతా కూడా సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలకు ప్రభావితులై రచనలు రాయడం జరిగింది. ఈ ముగ్గురు కవుల దృక్పథాలు, విభిన్నమైన భావజాలంతో సాహిత్యంలో కృషి చేస్తున్నారు. ఏ కవి కూడా వర్గానికి, మతానికి, ప్రాంతానికి అతీతం కాకుండా సామాజిక నేపథ్యంలో కవిత్వాలు రాశారని చెప్పవచ్చు. రక్తస్పర్శ కవుల కవిత్వంలో మహిళల జీవన పరిస్థితిని, సమస్యలను, స్వేచ్ఛను మొదలైన అనేక మహిళా దృక్పథాలతో స్త్రీవాద కోణంలో తమ రచనలలో ప్రతిపాదించారు. స్త్రీ పడే వేదనను, మానసిక క్షోభను స్త్రీలపై పురుషాధిక్యతను మొదలైన అంశాలను రక్తస్పర్శ కవులు రచనలో ప్రస్తావించారు.

అఫ్సర్ రాసిన 'రక్తస్పర్శ' కవితా సంపుటిలో ఒక మాతృమూర్తి ఆర్తనాదం 'ఆకాశంలో సంగం' కవితా సంపుటిలో ఆవిష్కరించారు.

"నువ్వు ఏకాంతం గోడమీద
చూపులు నాటుకుంటూనే వుంటావు
వాళ్ళు నీకు మెత్తటి హత్తిళ్ళలో
సున్నితంగా జాగ్రత్తగా తెచ్చిస్తారు.
నువ్వు రక్తం పంచి
చిక్కి శల్యమైన నీ దేహంలోనే
చాలీ చాలని చోటిచ్చి
పెంచి పోషించుకున్న
నీ కలల బిడ్డ మృతరూపాన్ని!" (పుట.19)

ఈ కవితలో కవి సైనికుడి మరణించిన తర్వాత ఆ తల్లి ఆవేదనను ఈ కవితలో ప్రకటిస్తాడు. నవమాసాలు మోసి కని పెంచి పెద్దచేసిన కొడుకు సైన్యంలో చేరి దేశంకోసం ప్రాణాలు అర్పించిన తీరును ఆ తల్లి మాతృ హృదయం ఎంతలా బాధపడుతుందో కవి వివరించాడు. ఎవరి స్వార్థం ఎవరికోసం ఈ యుద్ధభూమి, శాంతియుత లేని సమాజం ఎందుకు? మానవ విలువలు లేని సమాజం కోసం కన్న పేగు బంధం ఎందుకు తెగిపడుతున్నాయి? తెగిపడ్డా ప్రాణాల తర్వాత సమాజంలో మార్పు వచ్చిందా? స్వార్థపు రాజకీయాలవల్ల ఎంతో సైనికుల ప్రాణాలు పోగొట్టుకోవడం జరుగుతుంది. చివరికి శాంతికోసం మూడు రంగుల జెండాను పెట్టెలో భద్రంగా తన కొడుకు శవాన్ని కానుకగా సమర్పిస్తారని ఆ తల్లి గోడమీద తన చూపును ఏకాంతంగా నాటుకుంటుందని మాతృమూర్తి ఆర్తనాదాన్ని కవి ఈ కవిత్వంలో చెబుతున్నాడు. కొడుకు లేని తల్లి మనోవేదనను మానవతా దృష్టితో కవి చెప్పారు.

స్వాతంత్ర్య భారతదేశంలో ఎన్నో అన్యాయాలు, అత్యాచారాలు, దోపిడి వ్యవస్థ మొదలైన అనేక విషయాలను సామాజిక నేపథ్యంలో కవి చర్చిస్తాడు. పసిపిల్లలపై అత్యాచారం గురించి కవి అంటున్నాడు-

"అంతు పట్టని దారులలో
పసికందుల నెత్తుటి శరీరాలు నిమురుకుంటూ
ఆవురావురుమంటున్న శరీరానికి
కొరుక్కు తింటున్న ఎముకలకు
సౌందర్యం సరిహద్దుల్లోంచి
నిశ్చేతనా లోకాల్లోకి రమ్మని వచ్చిన పిలుపులను
అన్నింటినీ ధైర్యంగా ఓడించి
ముందుకు అడుగు కదిపిన ఈ విషాద సముద్రుడికి
ఎక్కడో తారసపడుతుందా తీరం అప్యాయంగా"

(పుట.63)

"స్వాతంత్ర్యం - పైజ్ కవిత" ఖండికలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళవుతున్నా పసికందులపై, ఆడపిల్లలపై ఈనాటికీ కూడా అత్యాచారాలు రూపు మాపలేకపోతున్నారు. గాంధీజీ కలలు కన్న భారతదేశం వచ్చిందా నిజానికి? ప్రతి ఆడపిల్ల అర్థరాత్రి స్వేచ్ఛగా తిరిగే రోజుందా? కలలు కన్న ప్రజాస్వామ్యంలో స్త్రీలపై లైంగిక దాడి అనేకంగా రోజూ జరుగుతూనే ఉన్నాయి. ఈ సమాజంలో స్త్రీ అభ్యున్నతి ఎలా జరుగుతుంది? స్త్రీలపై పురుష సమాజం దాడి చేస్తూ అత్యాచారాలు చేస్తుంటే సమాజంలో స్త్రీలకు చోటెక్కడుంది. పసి హృదయాలను వదలని ఈ పాడు సమాజంలో స్త్రీ ఒంటరిగా తిరుగుతుందా? అంటూ కవి ఈ సమకాలీన సమాజంలో స్త్రీల జీవన స్థితిని వివరించారు. స్వాతంత్ర్య భారతదేశంలో స్వేచ్ఛాయుత ప్రపంచంలో స్త్రీ ఒంటరిగా తిరగలేని నిస్సహాయ స్థితిని కవి చెబుతున్నాడు.

రక్తస్పర్శ కవులలో రెండవ కవి 'ప్రసేన్'. ఇతని రచనలన్నీ కూడా సామాజిక, రాజకీయ పరిణామాల దృష్ట్యా ప్రభావితం అంశాలనే ప్రతిపాదించారు. కవిత్వంలో ప్రతి వస్తువును తనదైన విమర్శనాత్మకమైన ధోరణితో చర్చిస్తాడు. సొంత అనుభవాల ద్వారా, సామాజిక పరిశీలన ద్వారా, సమకాలీనత పట్ల తనలో కలిగిన భావ సంచలనం ప్రసేన్ కవిత్వం. అందుకే అతను ఒకచోట ఇలా అంటాడు -

"భలే అదృష్టం నా కులం పేరు చెబితే
లంజతనం గుర్తొస్తుంది
భోగం వేషాలు! భోగందానా! భోగం మేళం!
హింసను నవ్వులాటగా మార్చేంత హింసించాయా మాటలు
ఎంతైనా నీది ఊరు... నాది భోగం వాడ..."

(పుట.23)

అని గొప్ప ఆత్మగౌరవాన్ని వ్యక్తం చేస్తాడు. చెప్పాలనుకున్న విషయాన్ని భయపడకుండా బహిర్గతం చేయగల కవి ప్రసేన్.

స్త్రీ సమస్యల పట్ల, స్త్రీవాదం పట్ల సానుభూతితో ప్రసేన్ కవితలు రాశాడు. గుక్కపట్టిన నవ్వు, చెవుల సంతకం, కన్న కొడుకు కన్ఫెషన్, ఆమె, తల్లి రాయని వీలునామా కవితలు స్త్రీ దృక్పథాలతో కూడినవి.

"చెవుల సంతకం" కవితలో ప్రసేన్ ఇరుకింటి ఇల్లాలి ఆత్మవేదనను రాశారు. ఇరుకిరుకు ఇళ్లల్లో, భార్య భర్తల కలయిక ఎన్ని విషాదాల్ని మోస్తుందో ఈ కవితలో చెప్పారు.

"పైన ఆపైన అతనూ సమాజమూ
కరకు శబ్దము చప్పుడు
చప్పుడే కదా అశ్వశక్తి
శబ్దమే కదా భావప్రాప్తి
మంచాలు విరగడమే ఘనకార్యమైన చోట
ఆడతనమంతా గుర్రపు గిట్టల కిందే
సుఖమంటే అభావమే ముఖభావమే
పైన మాత్రం లోకం పట్టనట్టు
అతనూ మనువూ వాత్స్యాయనుడూ
నాకిక్కడ సామూహిక అత్యాచారం
నేనెక్కడో... బయటెక్కడో
కనిపించని సమాజం చెవులు మూస్తూ"

(పుట.112)

పెళ్ళి అయిన తర్వాత స్త్రీ పడే మనోవేదనను కవి వివరించాడు. తెల్లారి అందరి ముఖాలు చూడాలంటే సిగ్గుపడుతూ, ఏమాత్రం పట్టింపు లేని మొగుడి ఆకలికి

బలయ్యే ఒక మధ్యతరగతి ఇల్లాలి బాధను వ్యక్తపరిచాడు కవి. తనపై సామూహిక అత్యాచారం జరుగుతుందని ఈ కవితలో స్త్రీ అంటుంది. తనకంటూ స్థానం లేదని తనపై పురుషాధిక్యతను ఎత్తి చూపిస్తుంది.ఈ కవితలో కవి చెప్పినట్టు స్త్రీలకు పెళ్ళిచేసి తమపై సామూహిక అత్యాచారం జరుగుతుందని ఈ కవితా సారాంశం. సమాజంలో పురుషాధిక్యత వల్ల స్త్రీ ఎన్నో మానసిక వేదనలకు గురి అవుతుంది అని కవి అంటున్నారు.

'అమ్మ చీరె' కవితలో కూడా మాతృహృదయాన్ని వర్ణించాడు కవి.

"బడికి వెళ్తున్నప్పుడు ఎన్నిమార్లు తన కొంగుతో
మా ముఖాల్ని తుడిచిందో
ఎన్ని రుతు స్రావాలు స్కలనాలు చీకటి రహస్యాలు
ప్రసవ వేదనలు గర్భస్రావాలు
దయతో మూట కట్టుకుందో అమ్మ చీరె" (పుట.45)

ఈ కవితలో తల్లి మాతృతనానికి నిదర్శనంగా చెప్పాడు కవి. ప్రతి తల్లి తమ పిల్లల్ని బడికి పంపినప్పుడు తన కొంగుతో పిల్లలను తుడుస్తుంది. అలాగే గర్భ స్రావాలు, ప్రసవ వేదనలు చూసిందో ఆ తల్లి అంటూ అమ్మచీర గొప్పతనాన్ని వివరించారు కవి.

'ఎవరికి వర్తిస్తే వారికి' భావవ్యాకరణం కవితా సంపుటితో 'నా బట్టా! ముట్టుకో' అనే కవితలో స్త్రీ నెలసరి సమయంలో బాధల్ని వివరించాడు. ఈ కవిత ప్రసేన్ అమ్మాయిల్ని బడిలోపలికి రానివ్వకూడదని వాష్‌రూమ్ లోకి తీసుకెళ్ళి లోదుస్తులు విప్పించారని వార్త విని రాసిన కవిత.

"బడి పీరియడ్‌లకీ బాడీ పిరియడ్లకూ
తేడా తెలియని అజ్ఞానాన్ని
ఆమెకు ప్రసాదించిన మనం కదా అంటరానివాళ్ళం
పాపం ఆ పిచ్చి టీచర్నేమీ అనకండి
ఆమెకూ ఆ మూడు రోజులున్నాయి.
ఆమెకూ
అంటు ముట్టు మైలలున్నాయి" (పుట.74)

మనిషి జ్ఞానం అంతరిక్షం అంచులను తాకుతున్నా స్త్రీల విషయంలో మార్పు రాని సంకుచిత్వాన్ని, ఎదగలేక పోతున్న ఈ తరాన్ని చూసి కవి జాలిపడుతున్నాడు. పిల్లలు నిజంగా ఆ వయస్సులో బడి పిరియడ్స్‌కి, బాడీ పిరియడ్స్‌కీ తేడా తెలియని అమాయకపు తనాన్ని, టీచర్ కూడా అన్నీ తెలిసి తనకు కూడా మూడురోజులు ఉన్నా యని సంగతి తెలియని దుస్థితి వివక్షతను కవి స్త్రీలపట్ల అన్యాయాలను తన కవితలో సామాజికుడిలాగా వివరించాడు.

ప్రసేన్ స్త్రీల పట్ల గౌరవం, స్నేహం, ప్రేమ, దయ, కరుణ నిండిన మానవతా విలువలు కలిగిన వ్యక్తిగా గుర్తించవచ్చు.

రక్తస్పర్శ కవులలో మరొక కవి 'సీతారాం'. సాహిత్యంలో సీతారాం ని మృత్యువు కవిగా పిలుస్తారు. ఈ కవి కూడా సామాజిక నేపథ్యంలో రాసిన రచనలు. సీతారాం కవి స్త్రీల సమస్యలను, స్త్రీ పురుషాధిక్య ప్రపంచంలో తను పడే బాధల్ని కూడా తన కవితలో ప్రస్తావించారు.

పురుషాహంకారంలో స్త్రీలు బలహీన స్థానాన్ని చెప్పే కవిత "ఓ రైలు ప్రయాణికుడి సందేహానికి"

పొత్తిళ్ళలో పువ్వులాంటి పాప
లేత చిరునవ్వు కాసేపు
లేత ఏడుపు కొంచెం సేపు
నవ్వుకి ఆకలి లేదు
పాప ఏడ్చిందంటే ఆకలికి పిలుపు నిచ్చిందనే
ఎదురుగా ప్రయాణీకులు పులుల్లా
ఇంతమందిలో పాలు పట్టటమెట్లా?
పులులు చూస్తున్న కొద్దీ
ఆమె వస్తువుగా మారుతుంది
పోనీ నువ్వు
పాలు నిండిన వక్షాలనే అనుకున్నావా?
అవి
పసికందుల
అన్నం ముద్దలూ కావచ్చు." (పుట.286)

మానవుడు ఎంత ప్రగతి సాధించినప్పటికీ ఎంత సమాజం ముందుకెళ్ళినపటికీ స్త్రీని వస్తువుగానే చూస్తున్న నిజాన్ని మర్చిపోయి అది ఒక స్త్రీ శరీరంగా కేవలం మాంసపు ముద్దలా చూస్తున్న కళ్ళను పులులుగా వర్ణించారు కవి. ప్రతీ స్త్రీకి ప్రయాణంలో, జన సంద్రంలో ఎదురయ్యే సమస్య ఇది. తన బిడ్డకి పాలు ఇవ్వాలంటే ఆమెను చూసి పురుష సమాజం కామంతో నిండివుంటారు. అందుకే కవి ఈ కవితలో స్త్రీల వక్షోజాలు కావు అవి పసి బిడ్డల ఆకలి తీర్చే అన్నం ముద్దలు అని కవి మానవీయ దృష్టితో చెప్పాడు. సమాజం దినదినాభివృద్ధి చెందుతున్నా మానవుడిలో మాత్రం ఎటువంటి మార్పు రావటం లేదని కవి చెబుతున్నాడు.

స్త్రీలపై, సంతానం కోసం జరిగే ఒత్తిళ్ళు చాలానే ఉంటాయి. సంతానం కలగటంలో స్త్రీ పురుషులు ఇద్దరి భాగస్వామ్యంతోనే ఉంటుంది. కాని మనిషి అజ్ఞానంతోనో, దురహంకారంతోనో స్త్రీదే తప్పని నిర్ణయిస్తాడు. అలాంటి దురహంకారానికి ప్రశ్నే ఈ కవిత.

"నీ అగ్రహారం ఉరగావేశానికి కారణమయ్యే మాటను
నువ్వూ నీ పురలింగమూ, పుంసత్వమూ
నిర్వీర్య వీర్యమూ సిగ్గుతో చితికిపోయే మరల
నీకు కలగపోతేనేం కొడుకు దానిక్కలగరా" (పుట.96)

'రెండు పాత్రలు - ఒక కత్తి' కవితా ఖండికలో సహజంగా ప్రతి పురుషుడు కొడుకుని ఆశిస్తాడు. ఆడపిల్ల పుడితే స్త్రీదే తప్పని నిందిస్తాడు. ఈ విధంగా స్త్రీల పట్ల జరిగే అమానుష వివక్ష వర్తన గర్హనీయం. స్త్రీ బాధల వ్యధలను గుర్తించే హృదయం కొరవడటమే స్త్రీల కన్నీళ్ళకు కారణం.

సమాజ హితానికి వ్యతిరేకమైన అంశాలను నిర్మొహమాటంగా నిరసించాడు. స్త్రీని మార్కెట్ వస్తువును చేసిన పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల ఉన్న తీవ్ర వ్యతిరేకతను 'సూపర్ మోడల్' కవితలో వివరించారు.

ఈ విధంగా సీతారాం రచనల్లో స్త్రీల దృక్పథాలతో రచనలు చేశాడు. స్త్రీల పట్ల సానుభూతి గౌరవం మొదలైన అనేక అంశాలలో స్త్రీని స్త్రీగా చూశాడు కవి సీతారాం.

రక్తస్పర్శ కవులు సాహిత్య రంగంలో అడుగు పెట్టినప్పటినుండి నూతనమైన దృక్పథాలతో ముందుకు వచ్చారు. వారి రచనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, ప్రపంచీకరణ నేపథ్యాలతో కూడిన అంశాలను నైతిక బాధ్యతలతో కవులు రాయడం జరిగింది. స్త్రీ దృక్పథం వారి రచనల్లో అడుగడుగునా కనిపిస్తుంది. స్త్రీల సమస్యలపై ప్రతిస్పందిస్తూ సామాజిక చైతన్యానికి నాంది పలికారు. స్త్రీలపై జరుగుతున్న దయనీయమైన సమస్యలపై, స్త్రీలపై పురుషాధిక్య ప్రపంచం స్త్రీ నెలా చూస్తుందో వీళ్ళ కవిత్వంలో ప్రతిఫలింపజేశారు. ఉద్యమాల గని ఖమ్మం జిల్లా నించి వచ్చిన కవులు ఈ రక్తస్పర్శ కవులు.

## ఆధార గ్రంథాలు :

1. శాంతి.జి, వచన కవిత్వంలో కవిత్వ కవిత, ఫ్రెండ్స్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 1987
2. వెంకటేశ్వరరావు.దార్ల, సాహితీమూర్తులు-స్ఫూర్తులు (సాహిత్య వ్యాసాలు), సొసైటి అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాద్, 2015
3. వెంకటేశ్వర్లు.పగిడిపల్లి, సీతారాం సాహిత్యం, కేతన్ చంద్ర చేతన్ చంద్ర పబ్లికేషన్స్, ఖమ్మం, 2019.
4. సంపాదకవర్గం, సిక్షిపూర్తి, స్పృహ సాహితీ సంస్థ, హైదరాబాద్, 2021.
5. అఫ్సర్ - అఫ్సర్ కవిత్వం.

# దళిత స్త్రీ వాదం

**- డా॥. సి. హెచ్. శ్యామలకుమార్,** తెలుగు అధ్యాపకులు, శ్రీ వైకెఆర్ & కె ప్రభుత్వ కళాశాల, కోవూరు, నెల్లూరు జిల్లా.

ఆధునిక ఆంధ్రసాహిత్యంలో దళితసాహిత్యం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. దళిత సాహిత్యం, దళిత కవి అనే పదాలు వినపడగానే అందరికీ గుర్తొచ్చేకవి గుర్రం జాషువా. ఇంకా అని ప్రశ్నించుకుంటే, కుసుమధర్మన్న, బోయి భీమన్న లాంటి అనేక పేర్లు వినబడతాయి. అలాగే స్త్రీవాద సాహిత్యాన్ని ప్రస్థావించగానే కొండేపూడి నిర్మల, విమల ఇత్యాదులు గుర్తుకు వస్తారు. మరి దళిత సమస్యపై కవిత్వం రాసిన దళిత కవయిత్రులు ఎవరు అనే ప్రశ్నకు సమాధానం తొందరగా దొరకదు. అందువల్ల వారి కవిత్వం గురించి రేఖామాత్రంగా ప్రస్తావించడం ఈ వ్యాసం ప్రధానోద్ధేశ్యం. దళిత స్త్రీలలో చదువుకున్న వాళ్ళు తక్కువ. అందులోనూ కవిత్వం పట్ల అవగాహన, ఆసక్తి ఉన్న స్త్రీలు మరీ తక్కువ. అందువల్ల వారి కలాలనుండి కవిత్వం జాలువారటం అంత తొందరగా జరుగలేదని చెప్పాలి. దళిత సమస్యపై స్పందించిన దళిత కవయిత్రులలో ముందుగా పేర్కొనదగినవారు "తెరెసా దేవదానం". ఈమె "క్రైస్తవ గీతమాలిక", "భారతగీతావళి", "ఆంధ్రతుఫాను", "అస్పృశ్యలెవరు?", "తప్పెవరిది?" మొదలగు రచనలు చేసినట్లు తెలుస్తోంది. ఈ రచనలలో "అస్పృశ్యులెవరు?", "తప్పెవరిది?" గేయ సంపుటాలను కలిపి ముద్రించారు. ఈ పుస్తకానికి మోదుకూరి జాన్సన్ ముందుమాట రాస్తూ ఈమెను "పంచమస్వరం"గా కీర్తించాడు. ఉపాధ్యాయురాలైన ఈమె అస్పృశ్యులెవరు? గేయసంపుటిలో దళితుల్ని మాలమాదిగలుగా విడదీసిన సమాజాన్ని నిలదీసింది. దళితులను ఐక్యంగా ఉంచాలంటూ హితవు పలికింది.

"మాలమాదిగలు ఏకం కాగా
మార్గములెన్నో సరళమగునుగా
మంచి ఏమిటో ఎంచి చూడుమా
మనలో భేదము లేదని చాటుమా"

"తప్పెవరిది?" గేయ సంపుటిలో దళితులు అస్పృశ్యులుగా మారటానికి కారణాలు అన్వేషించింది. దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, దళితులు పడుతున్న శ్రమను గుర్తుకు చేసింది.

"అంటరానివాడను ఎగతాళి పదమేల
అంటరానితనము పెకిలించి వేయవే
కళ్ళమంతా తిరుగుతాడు, కాళ్ళతోటి తొక్కుతాడు
మురికి చెమట కార్చుకుంటూ బస్తాలు నింపుతాడు"

పద్య గద్యాలలో కవిత్వం చెప్పగల మరొక ప్రతిభావంతురాలు కొలకలూరి స్వరూపరాణి. ఈమె గంగావతరణ, శివతాండవం, చంద్రగ్రహణం, "ప్రబోధము" మొదలగు రచనలు చేశారు. ఇందులో ప్రబోధములో హరిజనులు అనే పేరు మాకెందుకండి. మిగిలిన జాతులు దయ్యపు బిడ్డలా? అనే భావన కలిగేటట్లు నిలదీసింది.

"పేదవారికి హరిజనులనే
బిరుదు ఒకటి తగిలించారు
వారి శ్రమను దోపిడీ చేస్తూనే
ఊరివెలుపల ఉంచేశారు
నాకు తెలియక అడుగుతాను
మనుషులందరూ హరిజనలు కారా?"

అంటూ హరిజనులకు, ఇతర జనులకు తేడా ఎక్కుడుందని నిలదీసింది. చావుపుట్టుకలు అందరికీ ఒక్కటే కాదా? అని ప్రశ్నించింది.

ఈ విధంగా తెరెసా దేవదానం, కొలకలూరి స్వరూపరాణి మొదలగు తొలితరం దళిత కవయిత్రులు దళిత సమస్యల పట్ల తమ స్పందనను వ్యక్తపరిచారే తప్ప, ధిక్కార స్వరం ప్రదర్శించినట్లు కనిపించదు. అయితే ఆధునిక కాలంలో కవిత్వం రాస్తున్న దళిత కవయిత్రులు

తమ ఆవేదనను తీవ్రస్థాయిలో ప్రదర్శించారు. దళిత దృక్పథంతో కవిత్వం రాసిన దళిత కవయిత్రులలో ముందుగా చెప్పుకోవలసిన కవయిత్రి చల్లపల్లి స్వరూప రాణి. ఎందుకంటే ఆమె చరిత్ర శాఖలో పీహెచ్.డి. చేసి, విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ, రచనా వ్యాసంగాన్ని కొన సాగిస్తున్నారు. ఆమె హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యా లయంలో పరిశోధన విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే "మంకెన పూవు" (పదునెక్కినపాట) కవితను రాశారు. అందులో దళిత స్త్రీ ఇంట్లో పురుషాహంకారానికి, బయట కుల హంకారానికి గురై అనుభవించే అగచాట్లకు అక్షరరూపం ఇచ్చింది.

"నేను ముళ్ళకంపలో చిక్కుకొని
అల్లాడుతున్న పాలపిట్టను
ఎటుకదిలినా ముళ్ళన్నీ గుచ్చుకునేది నాకే
ఇవి ఈనాటి ముళ్ళుకావు
తరాల నుండి నా చుట్టూ పేర్చిన
బానిస సంకెళ్ళు
..........................
.......................
అసలు నా జీవితాన్ని నేనుగా జీవించిందెప్పుడు?
ఇంట్లో పురుషహంకారం
ఒక చెంప చెళ్ళుమనిపిస్తే
వీధిలో కులాధిపత్యం
రెండో చెంప పగలగొడుతుంది"

స్త్రీవాద కవిత్వం అగ్రవర్ణాల సమస్యల్నే ఎత్తి చూపిస్తూ, దళిత స్త్రీ సాధక బాధకాల్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన చెందుతూ "మాయమ్మ" (పదునెక్కినపాట) కవితలో

"అమ్మా! మనూల్లో రావిచెట్టుకింద రచ్చబండలాగే
అక్కడ ప్రెస్ క్లబ్బులనీ
రవీంద్రభారతిలనీ
వ్యహారాలు మాట్లాడటానికుంటాయిలే
అక్కడి బాబ్డ్‌హైర్ ఉద్యమాల్లో
పట్టచీరల పోరాటాల్లో
స్లీవ్‌లెస్ స్పీచ్‌ల్లో
నీ అద్దేపల్లి అరవయ్యో నంబరుకోక
బిక్కమొహం వేలాడేస్తుంది
ఈ దేశంలో స్త్రీలపై అణచివేత నశించాలనీ
మహిళలకు లైంగిక స్వేచ్ఛ కావాలనీ
..................................
చివర్లో పాపం
దళిత స్త్రీని కూడా పైకి తీసుకెళ్ళాలని ముగిస్తారు"

దీనినిబట్టి స్త్రీవాదుల ఎజెండాలో దళిత స్త్రీకి ఎంత ప్రాధాన్యత ఉందో పై పంక్తుల్లో కవయిత్రి ముఖ్యంగా వ్యక్తపరిచింది.

దళిత స్త్రీ అనేదాన్ని, ఆవేశాన్నీ, ఆక్రోశాన్నీ, ఆరాటాన్నీ, పోరాటాన్నీ, అవమానాన్నీ, శ్రమదోపిడీని జి. విజయలక్ష్మి "పనిపిల్ల" కవితలో శక్తిమంతంగా ఆవిష్కరించింది.

"కళ్ళు తెరచినప్పటి నుండి
కన్నీళ్ళే కళ్ళలో నింపుకున్నదాన్ని
అమ్మా అమ్మాకి బదులు దొర, దొరసానీ అని ఏడ్చిందాన్ని
కడుపునిండా తిన్నది కలలోనే
కులమే నా రంగు
కటిక దరిద్రమే నా కొంగు
కిందమెట్టే నా బతుకు"

అంటూ ఆకలి, దారిద్ర్యం, కులవివక్ష ఎదుర్కొంటున్న దళిత స్త్రీలు పనిమనుషులగా నలిగిపోతున్న వైనాన్ని వ్యక్తపరిచారు.

దళిత స్త్రీ సమాజంలో ఎన్ని రకాలుగా దోచు కోబడుతుందో తెలియబరుస్తూ సమాజాన్ని ప్రశ్నిస్తున్న కవయిత్రి దరిశె శశినిర్మల. "నిండా చెడిందాన్ని నేనే" అనే కవితలో

"నా ఇంటోణ్ణి
ఒరే దిబ్బాయ్ అన్నావు సరే
నా పిల్లదాన్ని
నీ బిడ్డ చెయ్యి బట్టుకున్నప్పుడైనా
నోరు తెరిచావా

నీవు ఎంత జెప్పు
నేను తక్కువదాన్నే
నీవు ఎక్కువ దానివే
నువ్వు నాకు చేసిందీ లేదు
.....................
చివరకు నిండా చెడిందాన్ని నేనే
చేతులు బిగించాల్సింది నేనే" అంటూ అగ్రకుల స్త్రీల అహంకారాన్ని నిలదీసింది.

కళ్ళముందు జరుగుతున్న అన్నిరకాల మరణకాండకు నేనే సాక్ష్యాన్నంటూ కలం, గళం విప్పిన కవయిత్రి మద్దూరి విజయశ్రీ. ఈమె 'ఆలీసమ్మశాపం' కవితలో పురాణ కాలం నుంచి ఈనాటి వరకు దళిత స్త్రీ ఎదుర్కొంటున్న అవమానాలను కళ్ళకు కట్టినట్టు వర్ణించింది.

"మొన్న శ్రీరాముడి ఆనతి మేరకు
ముక్కు చెవులు కోయించుకున్నాను
.................................
శతాబ్దాల సందేహాన్నై, సంక్షోభాన్నై
అవును ఆలీశమ్మనే మాట్లాడుతున్నాను"

అంటూ స్త్రీలను కూడా మనుషులుగా గుర్తించమని ఆవేదన చెందింది.

దళిత స్త్రీలపై అగ్రకుల భూస్వాములు చేస్తున్న ఆగడాలకు తెరదించవలసిన సమయం వచ్చిందని హెచ్చరించిన కవయిత్రి కర్రి విజయకుమారి. ఈమె "గవిని దాటేరా" (మేమే) (దళిత సాహిత్య తత్త్వం) అనే కవితలో

"ఊరుదాటి ఊరు గవిని దాటి
కాలు లేపి, కంచు కడియాన్ని చూపి
వాడి గడప మీదకి పోదామే" అంటూ తొలి దళిత స్త్రీలను యుద్ధోన్ముఖులను చేసింది. ఇన్ని జరిగినా ఉండడం వేరు అని చెప్పుతూ

"కళ్ళాపికి బదులు వాడి కళ్ళంలో కాలు మడుద్దాం
బొడ్లో లిక్కిదీసి గొంతు కొయ్యకనే
వాడి తోలు వొల్చి
ఓ తరంగం తప్పెట వాయిద్దాం"

అంటూ భూస్వాముల ఆగడాలకు చరమగీతం పాడటానికి దళిత స్త్రీలను ప్రోత్సహించింది.

వర్రె రాణి తన కవిత్వంఓల దళితుల సామాజికంగా, ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా దోపిడీ అయిన తీరును "పదును" కవితలో వివరించింది.

"బావులు చెరువుల తవ్విన నా దోసిట్లో
నీళ్ళకు బదులు నా కన్నీళ్ళే రాలి పడ్డాయి
...........................
ఇంకా ఇట్టాగే కూర్చుంటే లాభం లేదు
నా కొడవలికి పదును పెడతా!" - అంటూ దళితుల్ని ఈ దుస్థితికి తెచ్చిన కుల వ్యవస్థను తుంచెయ్యడానికి కొడవలికి పదును పెడుతున్నానని నిర్భయంగా చాటింది.

తన కవిత్వానికి "ఎజెండా" పెట్టుకుంది జల్లి ఇందిర. అవరోధాలనే కంచెలు దాటటానికి అణచివేతనం, హక్కుల సాధనకు తన ఎజెండాలో అనేక అంశాలు పెట్టుకుంది. దళిత స్త్రీ అజెండా (చిత్తరువు) కవితలో

"కుంచెల మీద కుంచెలు వేసే
రైతుల మీద తిరుగుబాటు అంటే
పక్కా భూమి కోసం తిరుగుబాటు చేయమని
భూమికోసం
ఆకాశంలో సగం తిరుగుబాటు" అంటూ దళిత స్త్రీ విముక్తికోసం తిరుగుబాటు చేయమని పిలుపునిచ్చింది.

కులాన్ని కుళ్ళిన పుండుతో పోలుస్తూ డబ్లూ. ఎమ్. సీతాలక్ష్మి రాసిన "పుండు" కవితలో పుండును అగ్రవర్ణ సమాజానికి ప్రతీకగా చెప్పింది.

"దుపంల్ని చీపురు కట్టతో ఊడ్చి
రోడ్డుకవతల పారబోయడమే
ఇప్పటి నాపని
ఈ పుండుని పగల కోసి
మందేసి కట్టు కట్టడమే
ఇప్పుడు నా కర్తవ్యం"

ఈ విధంగా కవిత్వరంగంలోకి ఇప్పుడిప్పుడే అడుగు పెడుతున్న దళితస్త్రీలు తాము ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను కవిత్వంలో వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తున్నారు. వీరిని తగిన విధంగా ప్రోత్సహిస్తే ఇంకా విశేషంగా వారి నుండి రచనలు వస్తాయి. వీరి రచనలలో చాలా వరకు ముద్రణకు నోచుకోవడం లేదు. వారిని సంప్రదించి, వారి రచనలను పరిశీలిస్తే మరిన్ని అంశాలు వెలుగులోకి వస్తాయి.

## ఆధార గ్రంథాలు

1. ఆనందరావు, డా. కల్లూరి, 1994 హరిజనాభ్యుదయం - ఆధునికాంధ్ర కవిత్వం, చింతపల్లి చైతన్య సాహితీ స్రవంతి ప్రచురణలు
2. బాలస్వామి, తాడిపర్తి, 1997, చిత్తరువు సంకలనం, విజయవాడ, ఆంధ్రు జె స్ర్టూం సోషల్ యాక్షన్ ప్రచురణలు
3. లక్ష్మీనరసయ్య. జి. 1996, పదునెక్కిన పాట (సంకలనం), విజయవాడ, దళిత సాన ప్రచురణలు
4. విజయానందరాజు. డా. వై తెలుగు సాహిత్యం - హరిజన రచయితల సేవ. పి.హెచ్.డి సిద్ధాంతవ్యాసం
5. శాంసన్. డా. పిల్లి. 2000 దళిత సాహిత్య చరిత్ర, గుంటూరు. స్వీయ ప్రచురణ.
6. శ్యామల. గోగుల, 2003, నల్లపొద్దు (సంకలనం) హైదరాబాద్, హైదరాబాద్ బుక్ ట్రస్ట్
7. సంజీవరావు. డా. కె. (శిఖామణి) 1998, దళిత సాహిత్య తత్వం, హైదరాబాద్, లిటరరీ నర్మజ్ ప్రచురణ

❀❀❀

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విరచిత శ్రీ వెంకటాచల మాహత్మ్యం - ఎఱుకలసాని పాత్ర

- డా॥. కొయ్యా శ్రీనివాసులు, విభాగాధిపతి ,తెలుగు విభాగం, యస్.టి.యస్.యన్ ప్రభుత్వ కళాశాల, కదిరి.

తరిగొండ వెంగమాంబ (క్రీ.శ.730-1817) తెలుగునాట ప్రసిద్ధి వహించిన తెలుగు కవయిత్రి ఈమె రచించిన గ్రంధాలలో 'శ్రీ వేంకటాచల మహత్మ్యం' అత్యంత ప్రసిద్ధి గాంచిన పద్యకావ్యం. ఈ కావ్యానికి మూలం "శ్రీ వేంకటాచల మహత్మ్యం గ్రంధం" అనే సంస్కృత రచన. ఇది వరాహ, భవిష్యోత్తర, బ్రంహ్మాండ, భాగవత, పురాణ భాగాలతో సంకలనం చేయబడిన 157 అధ్యాయాల, 10771 శ్లోకాల అతిపెద్ద గ్రంధం. ఈ గ్రంధంలోని వరాహ పురాణం, భవిష్యోత్తర పురాణం, పద్మ పురాణం అనే మూడు పురాణ భాగాలను మూలంగా స్వీకరించి, ప్రాచీన కవుల శైలిలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా శ్రీ వేంకటాచల మాహత్మ్యాన్ని రచించింది.

కవయిత్రి విన్నపము :- తన కృతి వేంకటాచల మాహత్మ్యం అవతారికలో పండిత, పాఠక మహాశయులకు ఇలా విన్నవించుకొంది.

సీ॥ పండితాగ్రణులార! ప్రజలార! యిపుడు నా
బాల భాషకసహస్యపడక వినుజడి!
తల్లిదండ్రులు చిన్నపల్లల పల్కులా
హ్లాదంబుగా విందు రావిధమున
మీరు నాతప్పొప్పులేరీతిగానైన
గేలిచేయక చిత్తగింపవలయు:
నాంధ్ర గీర్వాణ మహాకృతు లుండజగా
నిపుడీ కృతిని విననేల? యనక

తే॥ భక్షములు మెక్కి యావలజ బచ్చడియును
నంజుకొనిన విధంబుగా నా ప్రబంధ
మాలకింతురుగాకనే యాశచేత
నేనుజ జెప్పెద మీరు మన్నించి వినుజడి!
వే॥మా॥ ప్రథమాశ్వాసం 19వ పద్యం

ఈ విధంగా తరిగొండ వేంగమాంబ గారు పండితులను, పాఠకోత్తములను తన కావ్యంలోని తప్పొప్పులను ఏ రీతిగానైన గేలిచేయకుండా తనను మన్నించాలని వేంగమాంబ వినమ్రంగా వేడుకుంటూ ఇంకా ఇలా అన్నది.

సీ॥ నా చిన్న నాజట నోనామాలనైన నా
చార్యుల చెంత నేజ జదువలేదు
పరజగ ఛందస్సులోజ పది పద్యములనైన
నిక్కంబుగా నేను నేర్వలేదు
లలిజ గావ్య నాటకాలంకార శాస్త్రముల్
వీనులనైననే వినజగలేదు
పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్
శోధించి వరుసగాజ జూడలేదు;

తే॥ చేరి తరిగొండపుర నారసింహదేవుజ
డానతిచ్చిన రీతిగా నేనిమిత్త
మాత్రమై పల్కుదును; స్వసామర్థ్యమిప్పు
డరసి చూచినజగాని నాయందు లేదు.
శ్రీ వే.మా. ప్రథమాశ్వాసం 21వ పద్యం

ఈ విధంగా తరిగొండ వెంగమాంబ సాహిత్యంలో మెలకువలు రహస్యాలు తెలియకనే, అలంకార వ్యాకరణాది శాస్త్రాలు చదవకనే కేవలం తన ఇష్టదైవం తరిగొండ నృసింహస్వామి దయవల్లనే తనకు కవిత్వం చెప్పడం వచ్చిందని ఎంతో వినమ్రంగా విన్నవించుకుంది. దీనిని బట్టి వెంగమాంబ గురుముఖమున విద్యను అభ్యసించలేదని తెలియుచున్నది. ఈమె 'శ్రీ వేంకటాచల మాహత్మ్యం' అనే పద్యకావ్యం మాత్రమేగాకుండా

విష్ణు పారిజాతం (యక్షగానం),

రమాపరిణయం (ద్విపద కావ్యం),

చెంచునాటకం (యక్షగానం),

శ్రీ వేంకటేశ్వర కృష్ణమంజరి (మంజరీ ద్విపదలో రచించిన సుందర స్తుతి)

శ్రీ రుక్మిణీ నాటకం (యక్షగానం),

గోపికా నాటకం (యక్షగానం)

శ్రీ భాగవతం (ద్విపద కావ్యం),

అష్టాంగ యోగసారం (పద్యకృతి)

జల క్రీడా విలాసం (యక్షగానం),

ముక్తి కాండా విలాసం (యక్షగానం)

తత్వ్త కీర్తనలు (ఆధ్యాత్మిక గేయాలు)

వాశిష్ఠ రామాయణం (ద్విపద కావ్యం)

మొ॥ కృతులేగాక ఆశువుగా చెప్పిన పద్యాలు, శ్లోకాలు, పాటలు మొదలయినవి ఎన్నోకలవు. ఈ రచనలన్నీ ఇలవేల్పైన తరిగొండ లక్ష్మీ నృసింహునకు, ఇష్టదైవమైన తిరుపతి వేంకటేశ్వరునకు అభేద భావనతో అంకితం కావింపబడ్డాయి.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 'ఎఱుకలసాని' పాత్రను వేంకటాచల మాహత్మ్యం కావ్యంలో ప్రవేశపెట్టి పాత్రోచిత భాషగా సోది భాషను ప్రయోగించి, నాట కీయతను రమణీయతను కలిగించింది.

ఈ ఎఱుకలసాని కథ వేంకటేశ్వర మాహత్మ్యంలోని ఐదవ ఆశ్వాసం లోనిది. శ్రీనివాసుడే స్వయంగా ఎఱుకల సాని వేషం ధరించి తాను వలచిన పద్మావతి ఇంటికి వచ్చి 'ఎఱుక' చెప్పిన గాథ ఇది ఈ ఎఱుకలసాని వృత్తాంతాన్ని వేంగమాంబ గారు భక్తి భావమధురంగా, మనోజ్ఞంగా చక్కని తేటతెనుగు నుడికారంతో, చక్కని వర్ణనలతో ఎఱుకలసాని పాత్రను రచించింది తెలుగు కావ్యాలో బహుశా ప్రప్రథమంగా ఎఱుకలసాని పాత్రను ప్రవేశపెట్టి పాత్రోచిత భాషతో ఎఱుక చెప్పించడం ఇదే మొదటిదిగా చెప్పుకోవచ్చు.

## శ్రీనివాసుడు 'ఎఱుకలసాని'గా మారిన విధం :

పద్మావతి తండ్రి ఆకాశరాజు తల్లి ధరణీదేవి. పద్మావతి చెలికత్తెలతో పుష్పవనానికి విహారానికి వెళ్ళగా శ్రీనివాసుడు వేటకు వెళ్ళి పుష్పవనానికి చేరి పద్మావతిని చూచి మోహించాడు. పద్మావతి కూడ శ్రీనివాసుని ప్రేమించింది.

పద్మావతి తల్లి ధరణీదేవితో మాట్లాడి, తనకూ పద్మావతికీ వివాహం జరిపించుమని తన తల్లి వకుళ మాలికను శ్రీనివాసుడు నారాయణ వరపురానికి, పంపాడు, వకుళ! అక్కడ తగువిధంగా మాట్లాడగలదో లేదో? మగవారు చేయవలసిన పెండ్లిపనులు ఒక స్త్రీ చేత జరుగవేమో? అని శ్రీనివాసుడు సందేహించాడు. అంతేగాకుండా శ్రీనివాసుని గురించి పద్మావతి తల్లి తండ్రులకు తెలియదు. అందువల్ల వారు పద్మావతిని ఈయమని చెప్పవచ్చు ఇలా ఇయ్యమని చెపితే తరువాత అక్కడకు వెళ్ళడం కుదరదు. కనుక మొదటి ప్రయత్నమే చక్కగా కుదరాలని శ్రీనివాసుడు సర్వజ్ఞుడైనా, మానవుని వలె ఆలోచించి, పద్మావతిని చూడవలెననే కోరకతో ఆమెపై మోహాన్ని ఆపుకోలేక, తాను ఒక 'ఎఱుకత'గా మారాడు.

### ఎఱుకత వేషం :

శ్రీనివాసుడు ఎఱుకత రూపంతో చినిగిన చీర కట్టుకొని ఒక పాతరవిక తొడుగుకొని, ఒక ముసలి అవ్వవలె వంగి లేస్తూ నవ్వుతూ కొండదిగివచ్చాడు. అప్పుడు శ్రీనివాసుడు ఎఱుకత వేషములో ఇలా ఉ న్నాడు.

సీ॥ దంతపు సొమ్ములు, తగుబండి గురిగింజ
దండజలొప్పుగ మెడనిండ మెఱయ
నీరజోద్భవు నేజడు నెలల బాలునిజ జేసి
యాదరింపుచుజ బ్రక్క నంటగట్టి
సంకుటుంగరాములు పొంకంబుగా వెల్గు
తనచేత నొక్క బెత్తంబుజ బట్టి

మునుకొని నవధాన్యములు నించి యొక బుట్టి
శిరమునందిడుకొని శ్రీఘ్రముగను
తే॥ పోయి నారాయణాఖ్య సత్పురము జేరి
చెలజగి యాయూరి యమ్మలక్కలను జూచి
యెఱుక! యెఱుకో! యనుచు నెలుజగెత్తి పలుక
విని పురస్త్రీలు దాని బల్వింతగాను
శ్రీ వే.మా. ప్రథమాశ్వాసం 7వ పద్యం

అక్కడి స్త్రీలు ఆ ఎఱుకతను వింతగా చూసి 'ఓ ముసలిదానా! మాకు గద్దె చెప్పు' అని అడిగారు. అక్కడకు వచ్చిన పద్మావతి చెలికత్తెలు, తమ కోరికను చెప్పగలిగితే ఎఱుకతకు పట్టుబట్టలు ఇప్పిస్తామని చెప్పి, ఆమె గద్దె ఎటువంటిదో చెప్పుమని అడిగారు.

ఎఱుకలసాని గద్దె వివరాలు :- నా ఎఱుకయే ప్రజలందరికీ జీవనం. నా ఎఱుక శుభప్రదం, శాశ్వతము. ఎఱుకయే సకల ప్రపంచము. నేను ఎఱుకను నా ఎఱుక పంచభూతములను పుట్టించేది. నా ఎఱుక జాగ్రత్, స్వప్న, సుషుప్తులు అవే మూడు అవస్థలకూ మెదట, చివర, ఉ ండేది. నా ఎఱుక బ్రహ్మాండ భాండములన్నింటిలో నిండి, కుండలినిని అంటియుంటుంది. నా ఎఱుక ఆపోజ్యోతితో కలసి, తనలో తానే నిలిచి, ఆనందించి వెలిగేది. ఇటువంటి ఎఱుకను ఎవ్వరూ ఎరుగరు. నా ఎఱుక నిజమైనది తెలిసికొనగల వారికే నేను ఎఱుకను చెపుతాను. మీకు చెప్పను. అని ఎఱుకత, రాచచెలులకు తన ఎఱుకను గూర్చి చెప్పింది.

**ఎఱుకతకు ఆహ్వానము :**

చెలికత్తెలు ఎఱుకలసాని విషయం పద్మావతి తల్లి ధరణీదేవికి చెప్పారు. ధరణీదేవి ఎఱుకతను తీసుకొని రండని చెప్పింది. చెలికత్తెలు ఎఱుకతను అంత:పురానికి రమ్మని పించారు. అప్పుడు ఎఱుకత తన పిల్లవాడు ఏడుస్తున్నాడని. అక్కడి అమ్మలక్కలకు సోదె చెప్పకపోతే తన కడుపు ఎట్లా నిండుతుందనే వారిని ప్రశ్నించి ఇలా చెప్పింది.

సీ॥ భాగ్యవంతులు వారు, బలుపేదరాలనే
నటుగాన నెటువత్తు నటకు నిపుడు
నా బొక్కినోరును, నరసిన వెండ్రుకల్
గొప్ప కడుపు, పెద్ద దొప్ప చెవులు
గూని వీపును, బండి గురిగింజ దండలు
దంతపు సొమ్ములు వింతగాను
గనుజగొని, మణుల బంగారు సొమ్ములు వెట్టి
యున్నవారందు నవ్వుదురు గనుక
తే॥ నాకు సిగ్గగు, మీ రాచనగరి కేను
వచ్చుటకుజ గార్యమేమి? నావలెనె పేద
తెఱవలైనట్టి వారికే నెఱుకజ జెప్పి
పొట్ట సాకుచునుండెద భూమి మీజద

అప్పుడు వారు తమ్మ అమ్మగార్కి నిజముగా సోదె చెబితే, రత్నభూషణాలు, పట్టు వస్త్రమూ ఇస్తుందని అందుకు తాము పూచీ వహిస్తామని చెప్పి రాచ చెలులు సొదెకత్తెను రాజాంత:పురానికి తీసుకొని వెళ్ళారు. అక్కడ ధరణీదేవి ఎఱుకతను బంగారు పీటపై కూర్చుండ బెట్టి గౌరవించింది. సోదెలసాని నవ్వుతూ తాను పేదరాలినని చెప్పి, భాగ్యవతియైన ధరణీదేవిని తనకు అన్నము పెట్టి తాంబూలము ఇమ్మని తన పిల్లవానికి పాలను ఇమ్మని అడిగింది. ధరణీదేవి పాలు అన్నం తెచ్చి ఇచ్చింది. ఎఱుకత బిడ్డకు పాలుఇచ్చి, తాను అన్నం తిని తాంబూలమును ఇమ్మని అడిగింది. ధరణీదేవి ఎఱుకలసానికి తాంబూలమిచ్చి ఆమె వృత్తాంతాన్ని గూర్చి అడిగింది. మీది ఏ దేశం, మీ ఇల్లు ఎక్కడ ఉంటాయి? మీ ఊరు ఏమిటి? మా ఊరు ఎందుకు వచ్చావు? అని ధరణీదేవి అడుగగా, ఎఱుకత నవ్వుతూ ఇలా చెప్పింది.

**ఎఱుకత వృత్తాంతము :**

తల్లీ ! మా వంటి వారికి ఇల్లూ, వాకిలీ ఉంటుందా? అక్కడక్కడ గుడిసెలు వేసుకొని కొన్ని రోజులు అక్కడ ఉండిపోతాము మాకు దేశము ఏమిటి? మీ ఊరి స్త్రీలకు సోదె చెపుదామని వచ్చాను.

సీ॥ ఎఱుక వారల కెల్ల గుఱికట్టుగా నిల్వ
నొక్క చోటున్నది నిక్కముగను
నది యేడనన్న నాల్గాఱును బదియుజ బం
డెంద్రుజ బదాఱును రెండునైన
శృంగపంక్తులచేత నింగి కెగురు చుండు
నాఱుకొండలకు మీజదైన కొండ
వేయు శృంగము లొప్ప వీక్షింపజదగు కొండ
మూడ్రేఱులను గూడి మొనయు కొండ

తే॥ నాల్గు ద్రోవలకును నట్టడిమి కొండ
పాము తనలోన నుండజగా బ్రబలు కొండ
కురువలినిజ దనలో నిల్చి మెఱయు కొండ
తొంటి మా పెద్దలున్నట్టి దొడ్డకొండ

అంటూ ఆ కొండమీదే మా కాపురం ఎప్పుడూ ఉంటుంది. బ్రతుకు తెరువు కోసం లోకులకు సోదెలు చెపుతూ, బ్రతుకుతాము. నీవు సోదెనడుగు! ముంతెడు ముత్యములు తెప్పించు అని సోదెకత్తె ధరణీదేవికి తన వృత్తాంతాన్ని చెప్పింది.

ఎఱుకత ధరణీదేవిని పసిడి గద్దెపై కూర్చుండమని చెప్పి తన చేతి బెత్తము చివరను ధరణీదేవి చేతికిచ్చి విఘ్నేశ్వరుడు, వీరభద్రుడు, కొల్లాపుర లక్ష్మి మొ॥ దేవతలను పిల్చి తనకు వాక్కును ప్రసాదించమని ప్రార్థించింది. ధరణీదేవిని దిక్కులు చూడకుండ తన వైపే చూడమని సోదెను ప్రారంభించింది.

**ఎఱుకత సోదె :**

“అవ్వో! యవ్వ! నీవు తలంచిన తలంపు మేలౌతుం దంట! దేవుళ్ళు బలుకుతుండారు. తలంచిన తలంపేమంటివా? చెప్పే వినవే! దైతమ్మ! బిడ్డంటే కడుపు సూపుడు, తోడజబుట్టంటే భుజంబు సూపుదు అట్లా తోడజబుట్టుకడుగలేదు, ఇట్లా బిడ్డ కడుగుతుండావే! దుండి! ఆ బిడ్డ ఆడ బిడ్డో, మగ బిడ్డో అంటడుగ తుండావె! కొడకా! యిది ఆడ బిడ్డంటే చెవి సూపుదు, మగ బిడ్డంటే గడ్డంబు సూపుదు, ఇదిగో అట్లా మొగ బిడ్డ కడుగలేదు, ఇట్లా ఆడ బిడ్డ కడుగుతుండావే దుండమ్మా! ఆవో! యవ్వ! ఇప్పుడు మీ యాడ బిడ్డ కొక్క చింతపుట్టి వుండాది. ఆ చింతయేమంటే చెప్పే వినవే దుండి!”

నిన్న నీ కూతురు, పుష్పవనములో గుఱ్ఱం ఎక్కి వచ్చిన ఒక నల్లనయ్యను చూసి ప్రేమించింది. ఆ నల్లనయ్య ఈ మూల ఉన్నాడు. ఇక్కడి నుంచి వాయువ్య భాగంలో పడగలతో మెరుస్తున్న కొండ మీద, ఆ నల్లనయ్య ఉన్నాడు. అతడు బొల్లినామాలు పెట్టుకొని బొల్లి పిట్టమీద ఎక్కి, దోపిడికారై అన్ని దిక్కులా తిరుగుతాడు. వాడు నిజంగా శ్రీమన్నారాయణుడే కానీ, మానవుడు కాడు. అతడు నీ కూతురును పెండ్లాడవలెనని అంటున్నాడు. నీ కూతురు కూడా అతణ్ణి పెండ్లి చేసుకోవాలని అంటున్నది. అతనికి నీ కూతురునిచ్చి పెండ్లిచేస్తే నీ కూతురు సుఖంగా ఉంటుంది. లేకపోతే నీ కూతురుకు పెద్ద కష్టం వస్తుంది.

ఆ నల్లనయ్య ఒక మదగజాన్ని బెదరించి తరుముతూ వచ్చి, నీ కూతురు వున్న పుష్పవనానికి చేరి, తన కుల గోత్రాలను, తన కోరికనూ, నీ ముద్దుల చిన్నారి పద్మావతికి చెప్పాడు. నీ కూతురు అతని మాటలు విని కఠినంగా మాట్లాడి అతడు ఎక్కివచ్చిన గుఱ్ఱం మీద రాళ్ళు రువ్వించింది. అప్పుడు అతడు ఎక్కివచ్చిన గుఱ్ఱం నేలపై పడింది. అతడు నీ కుమార్తెను మన్నించి వెంకటాద్రికి చేరాడు. అప్పటినుండి ముద్దరాలైన నీ కుమార్తెకు గొప్ప కామ మూర్ఛ తాకింది. విరహ తాప జ్వరంతో నీ కూతురు వేగిపోతోంది.

ఆ జ్వరాన్ని పోగొట్టడానికి వేరే మందు లేదు. ఆ పద్మనేత్రుడయిన శ్రీనివాసుని ముఖాన్ని నీ కూతురికి ఇక్కడ చూపించు. ఆ విధంగా చూపించినప్పుడే నీ కూతురికి వచ్చిన తాప జ్వరం చల్లారుతుంది. అని ఎఱుకత సోదె చెప్పింది.

ఆ మాటలు విన్న ధరణీదేవి ఎఱుకత మాటలు మాయగా కనిపిస్తున్నాయనీ, మానవకాంతలను నారా

యణుడు పెండ్లాడిన విషయం భూమి మీద ఎక్కడా లేదనీ, ఆమె మాటలు బూటకములనీ, అసత్యముగా చిత్రముగా కనబడుతున్నాయని చెప్పింది.

అప్పుడు ఎఱుకలసాని ధరణీదేవితో ఇలా చెప్పింది. 'నామాటదప్పదవ్వో!యవ్వా!' అని ఇంక కొద్దిసేపటేలో ఇక్కడికి పెండ్లిపెత్తనము చేయడానికి, ఆ శ్రీనివాసుడు పంపించిన ఒక స్త్రీ వస్తుంది. అప్పుడు నా మాటలలో నిజము నీకు తెలుస్తుంది. నీకు ఇప్పుడు ఎంత చెప్పినా తెలియదు. నీకు నిజము తెలిశాక, నన్ను పిలిపించి బహుమానము ఇప్పించవలసింది. ఇప్పుడు నాకు ఏమి ఇయ్యవద్దు. నాకు ఇప్పుడు సెలవు ఇయ్యి నీ కుమార్తె పెండ్లికి నా బిడ్డతో వస్తాను. ఓ ధరణీదేవి! 'నేను చెప్పిన మాట నిజమో! అబద్ధమో! నీ ముద్దుల కూతురునడుగు.'

**వచనం :**

"అవ్వో! యవ్వ కడుపు కూటి కొరకు దబ్బఱాడితినని సంశయించినావు. విధి కల్లగాదు, కైలాటకము గాదు, తరకటము, బురకటము గాదు, తబ్బిబ్బు గాదు, తసుకు గాదు, బుసుకు గాదు, తాటోటు గాదు, ఆడంబరము గాదు. నా మాట నా గద్దె బుట్ట తోడె! నా బుడతని తోడె! నిజమౌనిదియని నమ్మజెప్పి, దిగ్గున లేచిపోయి పరమపురుషుడైన శ్రీనివాసుండు నిజరూపంబున వేంకటాద్రి జేరె"

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ గారు ఎఱుకత వృత్తాంతాన్ని భక్తి భావమధురంగా, మనోజ్ఞంగా చక్కని తేటతెనుగు నుడికారంతో, చక్కని వర్ణనలతో, సరస సంభాషణా చాతుర్యంతో నాటకీయంగా వ్రాసి రక్తి కట్టించింది ఎఱుకత చెలులతోనూ, ధరణీదేవి తోనూ పలికిన పలుకులు మంచి రసవంతంగా తీయని పలుకుల మేళవింపుతో హాయిగా సాగాయి.

ప్రసన్నంగా సహజ సుందర సరళ పదాల పొందికతో వేగంగా కథను చెప్పడంలో వెంగమాంబ గారిది అందె వేసిన చేయి. అతి తేలిక పదాలతో వ్యావహారిక ప్రజాభాషను, పాత్రోచిత భాషను ఎఱుకత స్వీయంగా మన కళ్ళముందు మాట్లాడినట్లుగా వెంగమాంబ కవిత్వీకరించింది.

తిక్కన చిత్రించిన 'ద్రౌపది' లాగా, పెద్దన చిత్రించిన 'వరూధిని' లాగా, గురజాడ చిత్రించిన 'మధురవాణి' లాగా వెంగమాంబ వెంకటాచల మహత్మ్యం గ్రంథంలో కార్యసాధనకై శ్రీనివాసుడు 'ఎఱుకతగా' మారిన పాత్ర పాఠకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఔచిత్యమునందును, భావ మార్ధవము నందును, భక్తి వైరాగ్యములందును, ప్రాచీన కవులెవ్వరికినీ తీసిపోని ఉత్తమ కవయిత్రి తరిగొండ వెంగమాంబ.

## ఆధార గ్రంథాలు :

1. తరిగొండ వెంగమాంబ - వికీపీడియా
2. శ్రీ వేంకటాచల మహత్మ్యం - తిరుమల, తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
3. పీఠిక శ్రీ వే.మా. - ఆచార్య కె.జె.క్రిష్ణమూర్తి
4. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి.నాగయ్య (రెండవ సంపుటం)

# 'వెండిమేఘం' నవల - ముస్లిం స్త్రీ సామాజిక జీవనం

- డా॥. లింగాల మంగమ్మ, పోస్ట్ డాక్టోరల్ ఫెలో ఫర్ ఉమెన్, యు.జి.సి., తెలుగు విభాగం,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆధునిక సాహితీ ప్రక్రియలలో నవలా ప్రక్రియ బహుళ ప్రజాదరణ పొందడమేకాకుండా సమకాలీన సామాజిక సమస్యల్నీ, ఆర్థిక రాజకీయ పరిస్థితుల్ని చిత్రించడంలో ప్రముఖపాత్ర వహిస్తుంది. రచయిత సమాజంలోని వ్యక్తి. సంఘ సమస్యలకు, సమాజ పతనానికి రచయిత స్పందించడం పరిపాటి. అప్రమత్తుడైన రచయిత సామాజిక సమస్యలకు, దేశ ఆర్థిక రాజకీయ పరిస్థితులకు స్పందించి రచనలు చేస్తారు. అలా రచయిత స్పందించి రాసిన నవల వెండిమేఘం.

వెండిమేఘం రచయిత సలీం. సలీంగారి పూర్తిపేరు సయ్యద్‌సలీం. ఈయన 1.6.1956న జన్మించారు. తల్లిదండ్రులు జాఫర్, అన్వర్‌బీ. ఈయన స్వగ్రామం ఒంగోలు జిల్లాలోని త్రోవగుంట. మొదట కవితల రూపంలో ప్రారంభమైన సలీం సాహితీ జీవితం తర్వాత కథలు, నవలలు రాయడం వరకు సాగింది. మొదటగా 'లేచివస్తున్నాం' అనే కవితా సంపుటిని తన మిత్రులతో కలిసి సలీం ప్రచురించారు. సలీంగారు ఇప్పటి వరకు దాదాపు 80కిపైగా కవితలు రాసి ప్రచురించారు. ఈయన వివిధ పత్రికలకు రాసిపంపిన కవితలన్నీ 1999లో ఒక సంపుటిగా తీసుకురావడం జరిగింది. అవి 1.నీలోకి చూసిన జ్ఞాపకం (1999). 2. ఆకురాలే దృశ్యం (2005). ఆ తర్వాత కథలు, నవలలు వైపు దృష్టి సారించారు. సాహితీ జీవితంలో సలీంగారి ఎక్కువగా మానవత్వ దృక్పథంతోనే రచనలు రాశారు.

సలీంగారు రాసిన మొదటికథ 'మనిషి'. ఈ కథ 1980లో ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమైంది. ఇప్పటి వరకు దాదాపు 150కి పైగా కథలు రాశారు. ఈ కథలు వివిధ ప్రముఖ దినపత్రికలలో ప్రచురితం అయ్యాయి. ఈ కథలన్నీ కథాసంపుటాలుగా వెలువడ్డాయి. అవి 1. స్వాతి చినుకులు (1996), 2.నిశ్శబ్ద సంగీతం (1999), 3.రూపాయిచెట్టు (2004), 4. చదరపు ఏనుగు (2006), 5. రాణిగారి కథలు మొదలైనవి. సలీంగారు ఇప్పటి వరకు వివిధ సామాజిక, సంఘ సంస్కరణ మార్పులను ఉద్ధేశించి మొత్తం 6 నవలలు రాశారు. అవి 1.జీవన భృతులు (2001), 2.వెండిమేఘం (2004), 3.కాంచనమృగం (2006), 4.కాలుతున్న పూలతోట -2006 (కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం), 5.పడగనీడ, 6.జీవనస్మృతులు.

ఈయన రాసిన 'వెండిమేఘం' నవలకు తెలుగు విశ్వవిద్యాలయం 2004లో సాహితీ పురస్కారం ఇచ్చి గౌరవించింది. తెలుగు నవలా సాహిత్యంలో ముస్లింల సాంస్కృతిక జీవన నేపథ్యాన్ని విస్తారంగా చర్చించిన మొదటి నవల వెండిమేఘం. ఈ నవల హిందీ, ఒరియా, ఆంగ్ల భాషల్లోకి అనువాదమైంది. వెండిమేఘం నవలలోని స్త్రీ సామాజిక జీవనాన్ని పరిశీలించి వివరించడం ఈ పత్ర ఉద్దేశం.

## ముస్లిం స్త్రీ సామాజిక జీవనం :

వెండిమేఘం సరైన సమయాల్లో సరైన దృక్పథంలో ఎక్కడా రాజీపడకుండా రాసిన చక్కని నవల. ప్రకాశం జిల్లాలోని వెనుకబడ్డ తీవ్రగుంట గ్రామంలో ముస్లింవాడ బ్యాక్‌గ్రౌండ్, ముస్లిం అమ్మాయి అన్వర్ జీవితం ఈ నవలలో ప్రధాన వస్తువు. వెండిమేఘం నవలలో అన్వర్, కుల్సుంబి మొదలైన స్త్రీలు మనకు దర్శనమిస్తారు. అన్వర్‌ది వివాహ సమయానికి ఏమీ తెలియని వయసు. నిద్రలోనే 'షాదీ కబూల్‌హై' అనిపించారు. అత్త కుల్సుంబి అన్వర్‌ని అక్కున చేర్చుకుని సొంత బిడ్డకన్నా ఎక్కువ

ప్రేమగా చూసుకున్నది. అన్వర్ అక్క కొడుకుకోసం, తన కొడుకు జిలానీకోసం అనుమానపు మూర్ఖపు భర్త కొట్టినా, తిట్టినా భరించింది. మౌనం అంగీకారమే కాదు పోరాటం కూడా.

వెండిమేఘం నవలలో ప్రబోధాత్మకంగా, సందేశాత్మకంగా చిత్రించబడిన స్త్రీ అన్వర్. అన్వర్ అనేక విషయాల్లో ముస్లిం కమ్యూనిటీలో వ్యాన్‌గార్డెన్‌లాగా తీర్చిదిద్దబడింది. తీవ్రగుంట గ్రామంలో పిల్లల్ని చదువులకు పంపిన స్త్రీ, మెట్రిక్యులేషన్ వరకు చదివిన మొట్టమొదటి స్త్రీ అన్వర్. పొగాకు కంపెనీలో పనికి పెళ్లి వ్యవసాయంచేసి, ఆడపిల్లలకోసం స్కూల్ పెట్టిన మొదటి స్త్రీ కూడా అన్వరే. అపురూప సౌందర్యం, సహనం, తెలివితేటలు, ఆత్మ విశ్వాసం, పాతివ్రత్యం మొదలైన సకల గుణాలు మూర్తీభవించిన ఉత్తమ స్త్రీ అన్వర్. ఆమెపై నిందలు వేసినా, ఇతరులతో సంబంధాలు అంటగట్టి ప్రచారం చేసినా పట్టించుకోకుండా ఉండగల స్థితప్రజ్ఞురాలు. మునుషులకుండే రాగద్వేషాలకు అతీతంగా అన్వర్ పాత్రను రచయిత తీర్చిదిద్దారు.

ముస్లింల సంప్రదాయం ప్రకారం భర్తచనిపోయిన అన్వర్‌లాంటి స్త్రీలు మళ్ళీ పెళ్లి చేసుకోవడం సహజమే. అందుకు సిద్ధపడిన నజీర్ ప్రేమ వివాహం అనేక మలుపులు తిరుగుతుంది. నజీర్ చిన్నతనం నుండి అన్వర్‌ని ప్రేమిస్తాడు. ఆమె భర్త చనిపోయాక అన్వర్‌ని పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడతాడు. అయితే అన్వర్ మరో అమ్మాయి జమీలాని నజీర్‌కిచ్చి వివాహం జరిపిస్తుంది. అన్వర్ నజీర్ని తిరస్కరించేందుకు బలమైన కారణమంటూ ఏమీ కనపడదు. అందువల్లే స్త్రీ అయిన అన్వర్ పవిత్రమూర్తిగా దర్శనమిస్తుంది.

స్త్రీకి విద్యావసరాన్ని అన్వర్ ఇలా గ్రహిస్తుంది. భర్తయినంత మాత్రాన అతడు తిట్టే తిట్లన్నీ భార్య భరించాలా! అని మొదటిసారిగా అన్వర్ భర్తకు ఎదురు తిరుగుతుంది. బానిసనుకాను మీరేమన్నా పనివుండడానికి అని అడుగుతుంది. భార్యయినంత మాత్రానా తప్పులేక పోయినా భర్త పెట్టే బాధలు భరించాలా? తమ అమ్మ, అమ్మమ్మ, వాళ్ళ అత్తగారు అందరూ మగవాడి అడుగులకు మడుగులు ఒత్తవలసిందేనా, మగవాడి దౌర్జన్యానికి తలవంచవలసిందేనా? కొడితే భరించి తిడితే సహించి, కోరితే శరీరాన్నర్పించి, ఆకలైతే అన్నంపెట్టడం. దీనికి అంతంలేదా, ఎందుకిలా జరుగుతుందని అన్వర్ ఆలోచిస్తుంది. ముస్లిం స్త్రీలు మాత్రమే ఇలాంటి హింసకు గురవుతున్నారా? లేక ఏ మతానికి చెందిన స్త్రీలయినా ఇలాగే వివక్షకు లోనవుతున్నారా? మొదలైన విషయాలు తెలుసుకోవాలంటే స్త్రీకి చదువు చాలా అవసరమని అన్వర్ భావిస్తుంది. స్త్రీకి చదువు ఆయుధం కావచ్చున్న ఆలోచన వచ్చిన క్షణంనుండీ అన్వర్‌లో చదువుకోవాలన్న బలమైన కోరిక ప్రారంభమవుతుంది. అది తన చదువు గురించే కాదు, ప్రపంచంలో వున్న కోటానుకోట్ల స్త్రీల గురించని చెప్పవచ్చు. స్త్రీలుపడే బాధల్ని, కష్టాల్ని అర్థం చేసుకోవాలి. వాటినుండి విముక్తి పొందాలంటే మొట్టమొదట సమస్యను అన్ని కోణాలనుండి అర్థం చేసుకోవాలని అన్వర్ ఆలోచించడం చదువుకున్న స్త్రీలలో కూడా కనిపించదు.

డిగ్రీలు చదివి ఉద్యోగాలు చేసి తీసుకొచ్చే జీతం అంతా భర్త చేతుల్లోపోసి, తిరిగి భర్తలపైనే ఆధారపడి జీవించే మహిళలున్న సమాజం మనది. అటువంటి స్త్రీలలో అన్వర్‌కు వచ్చిన ఆలోచనలు ఎంతోమంది స్త్రీలకు మార్గదర్శకం. ప్రతి స్త్రీ అన్వర్‌లా ఆలోచించాలి. ఇలా ఆలోచించిననాడే స్త్రీకి విముక్తి లభిస్తుంది. అన్వర్ సంప్రదాయ ముస్లిం కుటుంబం నుండి వచ్చింది. వారు మాట్లాడే భాష ఉర్దు. ఉర్దు మాట్లాడే ముస్లిం కుటుంబాలలో తెలుగు ఉచ్చారణ ఉండదు. కానీ అన్వర్ తెలుగులో స్పష్టమైన, అర్థవంతమైన పదాలను వాడడం కూడా మనకు ఈ నవలలో కనిపిస్తుంది.

నజీర్‌తో కలిసి ఆడుకున్న భార్యాభర్తల ఆట అన్వర్ బాల్యంలో జరిగిన ముఖ్యమైన సంఘటన. భార్యాభర్తల ఆట ఆడుకుంటున్న అన్వర్ ఇలా నజీర్‌తో అంటుంది. భర్త భార్యను కొడతాడు కదా నీవు కూడా నన్ను కొట్టినట్లు

నటించమంటుంది. ఈ ఆటల్లో కూడా ముఖ్యంగా భర్త కొట్టేవాడూ, భార్య కొట్టించుకునేది అనే భావనవుంది. పిల్లలు సరదాగా ఆడుకునే ఆటల్లో కూడా స్త్రీ పురుషునికి లొంగివుండాలన్న ఆలోచనలతో, భావాలతో చిన్నారి మనసులు నిండివుంటాయని చెప్పడానికి రచయిత ఈ ఉదాహరణ ఇచ్చారు. తన చిన్నాటి సంఘటనలు, నజీర్ తనమీద చూపిన ప్రేమ నిజజీవితంలో చేదుమందు తాగుతున్న అన్వర్‌కి మధ్యమధ్యలో తీపిగుళికలు తింటున్న అనుభూతులను కలిగిస్తాయి.

ఎంతటి కష్టం వచ్చినా కన్నీళ్ళు పెట్టుకోకూడదనీ, జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలనీ, ఎట్టి విపత్కర పరిస్థితి ఎదురైనా నిర్భయంగా పోరాడాలనీ తన ప్రతి ఓటమి తన గెలుపుకు సోపానం కావాలనీ బలంగా నిలబడడానికి అన్వర్ ప్రయత్నిస్తూ ఉంటుంది. బాషా సైదాబీ నిఖా విషయమై అన్వర్‌తో కుల్సుంబి ఇలా అంటుంది. అన్వర్ బాషా తలాక్ ఇస్తే ఎలా బతకాలని ఆలోచిస్తున్నావా? ఇలాంటి దుర్మార్గుడితో కాపురం చేసేకంటే తలాక్ మంచిది. మనశ్శాంతిగా బతకొచ్చు. అన్వర్ తన అత్త మాటలు వింటుంది. అయితే ఏ ఆసరాలేని ఒక ముస్లిం స్త్రీ తలాక్ తర్వాత ఎలా బతుకుతుంది? పిల్లలను ఎలా పోషిస్తుంది? ఎవరిపైన ఆధార పడుతుంది? ఇన్ని ప్రశ్నలు ఏ ఆధారంలేని స్త్రీలో ఉదయించడం సహజం. ఇస్లాంలో స్త్రీకి కూడా ఆస్తిహక్కు ఉందంటారు. కానీ తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను మోసం చేస్తున్నారు. ఎంతమంది ఆస్తిని కొడుకులతో సమానంగా వాటాలు వేసి ఆడ పిల్లలకు ఇస్తున్నారు. ఇలా చేస్తే విధి వంచితలైన స్త్రీలకు కష్టకాలంలో ఎలా బతకాలన్న సమస్యరాదు. ఎన్ని ఎత్తుపల్లాలు ఎదురైనా ధైర్యంగా ముందుకే అడుగువేయ గలుగుతారు.

బాషా చనిపోయిన తర్వాత సంసారాన్ని నెట్టుకు రావడంలో అన్వర్ మంచి నిర్ణయం తీసుకుంటుంది. ముస్లిం అయినంత మాత్రాన పనికి వెళ్ళకూడదనే నియమాన్ని చూసి తనూ ఒక మగవాడికి ఎందులోనూ తీసిపోననే విధంగా పొగాకు కంపెనీలో పనికి వెళ్తుంది. తను పైకి రావడానికి, తనేకాకుండా తనతోటి స్త్రీలు కూడా తమ కాళ్ళపై తాము నిలబడడానికి, వారికి ఆధారం చూపి, స్త్రీ అనుకుంటే సాధించలేనిది లేదని వ్యవసాయం కూడా చేసి నిరూపిస్తుంది ఈ నవలలో అన్వర్.

కొత్తగా పనిలోకి వెళ్ళడం ప్రారంభించిన అన్వర్ మగవాళ్ళ చూపులు, వారి మాటలు, చేష్టలు చూసి భయపడినా ఆదెమ్మను చూసి ఆమె మాటల్లో గడుసు దనం, ఆమె నోటికి మగవాళ్ళుసైతం భయపడడం చూసిన తర్వాత అన్వర్‌లో మార్పు వచ్చింది. ఒక స్త్రీ పదిమంది మధ్యకు వచ్చి పని చేస్తున్నప్పుడు సంఘాన్ని మగవారి మాటలను లెక్కచేస్తే ఆ స్త్రీ బతకలేదని గ్రహిస్తుంది. చదవుకోడానికి పంతులుగారి దగ్గరకు వెళ్లినప్పుడు పంతులుగారి భార్య విసిరేమాటలు, అన్వర్ తాగిన మంచినీళ్ళ గ్లాసుపై నీళ్ళు చిలకరించి ఆగ్లాసుని తీసుకున్న వైనం గమనించిన అన్వర్ తనకు కావాల్సింది చదువు ఎవరెన్ని మాటలన్నా పరవాలేదని తీర్మానించు కుంటుంది. అలాగే వ్యవసాయంలో సహాయం చేస్తానని వెంకటరెడ్డి భరోసా ఇస్తాడు. కానీ వెంకటరెడ్డి భార్య నీకూ అన్వర్‌కు సంబంధం ఉందని ఊరంతా గుప్పుమంటుంది. అందుచేత అన్వర్‌ని ఇంటికి రావద్దని హెచ్చరించినప్పుడు, ఊరుఊరంతా తనకు వెంకటరెడ్డికి అక్రమ సంబంధం అంట్టగట్టినా అన్వర్ తను చేస్తున్న పనిలో వెనకడుగు వేయలేదు. సంఘంలో స్త్రీ ఒంటరిగా బతకాలంటే ఇలాంటివి ఎన్నో ఎదుర్కోవాలి. స్త్రీకి మానసిక స్వేచ్ఛ, సొంతంత్ర్యం తప్పని సరిగా ఉండాలి. అప్పుడే సమ సమాజ మార్పుకి అవకాశం కలగుతుంది.

ముస్లింలవాడకి బ్రాహ్మణపంతులు రాఘవయ్య బడి పిల్లలతో వచ్చి అన్వర్ కొడుక్కి అక్షరాభ్యాసం చేయించడం గొప్ప చిత్రీకరణ. అన్వర్ చేసిన ఇలాంటి సంఘటన మిగిలిన ఇస్లాం పిల్లలకు స్ఫూర్తినిచ్చి వాళ్ళని విద్యా ధికుల్ని చేయాలని రాఘవయ్యచేత అనిపించడం గొప్ప భావన. సందర్భానుసారంగా ఇస్లాంతో ముడిపడివున్న

అనేక చారిత్రక, సాంఘిక విషయాలను రచయిత సందర్భానుసారంగా ప్రస్తావించారు.

ఈ నవలలోని జిలానీ అన్వర్ కొడుకు. ఆమె అతనికి ఒక రాచబాటను నిర్మించింది. రాచబాటను వేయడానికి ముళ్ళవంటి కష్టాలను అన్వర్ అనుభవించింది. తన బిడ్డ జిలానీకి అతని పిల్లలకు ఆదర్శంగా నిలిచింది. ఆ బాటలో నడిచేవారికి కష్టాలు, కన్నీళ్ళనేవి లేకుండా చేసింది అన్వర్.

స్త్రీ ప్రగతిబాటలో నడవాలంటే ఆమెకు భర్త, అత్త, బిడ్డ ఎవరో ఒకరి సహకారం తప్పనిసరిగా ఉండాలను కునే రోజుల్లో వాటన్నికన్నా ముందుగా స్త్రీకి ఆర్థిక స్వాలంబనం అవసరమని అత్త కుల్సుంబి పాత్రద్వారా తెలుస్తుంది. ఈ నవలలో అన్వర్‌లోని పట్టుదలకీ, కృషికీ ఆద్యంతం వెన్నుదన్నుగా నిలబడిన స్త్రీ అత్త కుల్సుంబి. సమాజంలో ముస్లిం స్త్రీలు పరదాల మాటున మగ్గి పోవడం, భర్తలు పెట్టే హింసలకు బలవ్వడం తెలిసిన పాత తరానికి చెందిన కుల్సుంబిలో ఎన్నో అభ్యుదయ భావాలుండడం గొప్ప విషయం. కోడలి భుజం తట్టి ముందుకు నడపడానికి దారి చూపిన స్త్రీ కుల్సుంబి. కుల్సుంబి ఆత్మగౌరవం కల్గిన స్త్రీ. స్త్రీలకు ఆస్తిపై హక్కు ఉండడం, చదువు ఈ రెండే ధైర్యాన్ని ఇస్తాయని నమ్ము తుంది కుల్సుంబి. ఈమె పాత్ర పాఠకులకు గుర్తుండి పోయే ఆదర్శవంతమైన పాత్ర.

కుల్సుంబి ధైర్యానికి మూలకారణం- భర్త మరణిం చినా, కన్న కొడుకు ఆదరించకపోయినా ధైర్యంగా బతకడానికి ఆమెకు కొద్దపాటి పొలం, ఇల్లు ఉన్నాయి. ఆమె ఎంతో కొంత ఆర్థికంగా బలమైంది. రేపు ఎలా అన్న భయం ఆమెకులేదు. అన్వర్‌కు ధైర్యం నూరి పోసింది. గేదెలను కొందాం, వాటితో వ్యాపారం చేద్దాం, పాలు-పిడకలు అమ్మి దర్జాగా బతుకుదాం. ఇవన్నీ జరగకపోయినా పర్వాలేదు. నేను కట్టెలుకొట్టి తెస్తాను, వాటిని అమ్మి ఎలాగైనా నిన్నూ, నీ బిడ్డలనూ పోషించ గలను అంటుంది. స్త్రీకి చదువు అవసరం నిజమే. ఆదెమ్మ పొగాకు కంపెనీలో, వ్యవసాయ పనుల్లో అన్వర్‌కి అత్యంత సహాయకారిగా నిలిచిన ఆదెమ్మ, అన్నింటా బాసిసగా నిలిచిన స్త్రీ పోరాట శక్తికి ప్రతిరూపం.

**ముగింపు :**

ముస్లిములైనా, ముస్లిమేతరులైనా స్త్రీల జీవితం దాదాపు ఒకే విధంగా ఉంటుంది. బహుజన, దళిత, గిరిజన స్త్రీల సమస్యలన్నీ ముస్లిం స్త్రీలకూ ఉన్నాయి. అదనంగా ఇంకొన్ని ప్రత్యేకమైన సమస్యలూ ఉన్నాయి. సమాజంలోని ముస్లిం స్త్రీల స్థితిగతులను, సుఖదుఖా లను కన్నీళ్ళను, బాధలను, అణచివేతలనూ అన్నిటినీ మన నవలా రచయిత(త్రు)లు తమ రచనల్లో పొందు పర్చారు. తల్లిగా, భార్యగా, చెల్లిగా, ప్రేయసిగా, సహచరిగా ఎన్నో పాత్రలను స్త్రీ పోషిస్తుంది. మానవ జీవితంలో స్త్రీ పాత్ర ఎంతో ప్రధానమైంది. అటువంటి ఎంతో ముఖ్యమైన, మన జీవితాల్లో సగభాగమైన స్త్రీ మీద ఆర్థిక పరిస్థితులు, మగ ఆధిపత్యం మొదటినుంచీ మన వ్యవస్థలో దరిద్రంగా భయంకరంగా, ప్రమాదకరంగా పెత్తనం చెలాయిస్తున్నాయి. పేదరికంతోబాటుగా భర్తలు, అత్తలు ఇతర కుటుంబ సభ్యులు పెట్టే హింసలు, వాళ్ళు చెలాయించే అధికారం, ఏ మాత్రం స్వేచ్ఛ భద్రత లేకపోవడంలాంటివన్నీ స్త్రీలందరికీ కామన్‌గానే ఉన్నాయి.

నిజానికి ముస్లిం స్త్రీలవన్నీ రాజీ బతుకులే. సాధారణ వర్గాలలోని స్త్రీలకన్నా ముస్లిం స్త్రీలే ఎక్కువగా అణచి వేతకు గురవుతున్నారు. మతపరమైన కట్టుబాట్లు, చైతన్యరాహిత్యం, పురుషాధిక్యత, చదువు లేకపోవడం, కుటుంబపరమైన అణచివేత అన్నీ కలిసి ముస్లిం స్త్రీలను చీకటి గుహల్లోకి, పరదాల చాటున మగ్గిపోవడానికి గురిచేశాయి. ముస్లింల ఛాందస్సాలు, సాంప్రదాయక కట్టడులు, వాటిని సమర్థించే ఆలోచనలు అన్నీ అపోహ పడడానికి అవకాశం ఉంది. ముస్లింల సాహిత్యంలో రాజకీయ, ఆర్థికకోణం కంటే సాంస్కృతిక, మతకోణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముస్లిం స్త్రీలకు తలాక్,

బురఖా, ఎక్కువ మంది పిల్లల్ని కనడం, చదువులేకపోవడం, ఉద్యోగాలు పనులు చేసుకోవడానికి బయటకు పంపకపోవడం, హిందూత్వమతోన్మాదం, ఇస్లాంమతోన్మాదం లాంటివి సమస్యలు ముస్లింలను ప్రత్యేకంగా అణచివేస్తున్నాయి.

సాధారణ కుటుంబంలో పుట్టి, అడుగడుగునా అవమానాలు, అవరోధాలు ఎదురైనా అన్నిటినీ అధిగమించి, అసాధారణ మహిళగా, స్వయంసిద్ధిగా అన్వర్ ఎదుగుతుంది. మూర్తీభవించిన వ్యక్తిత్వంలో, స్ఫూర్తి ప్రదాయకమైన స్త్రీ అన్వర్. స్త్రీ ఉనికిని, స్త్రీ గమ్యాన్ని, స్త్రీ గమనాన్ని ఎవరెస్టు శిఖరం అంచులవరకు తీసుకెళ్లగల వ్యక్తిత్వంగల స్త్రీ అన్వర్. కోడలుగా అన్వర్ పడిన బాధలు, వాటిని ఆమె ఎదుర్కొన్న పరిస్థితులు, వాటిని అధిగమించడంలో ఆమె ప్రదర్శించిన నేర్పు సమాజంలో ప్రతి ఒక్కరికి ఆదర్శవంతం. ప్రతి విషయంలో కోడలికి ధైర్యంచెప్తూ, ఆమె భుజంతట్టి కోడలిని ముందుకు నడిపించడానికి ఎల్లప్పుడూ సహకరించిన ఆదర్శవంతమైన వాత్సల్యమూర్తి కుల్సుంబి. ఆర్థిక స్వాతంత్ర్యం స్త్రీ స్వేచ్ఛకు పునాదని నమ్ముతుంది కుల్సుంబి. అంతేగాక బురఖా త్యజించి గ్రేడింగ్ కెళ్లిన అన్వర్ తరపున మత పెద్దలతో మాట్లాడుతుంది కుల్సుంబి. కోడల్ని రెండో వివాహం చేసుకోమనడం, స్త్రీవిద్యను ప్రోత్సహించడం కుల్సుంబి ఔనత్యం. ఇన్ని గొప్ప లక్షణాలతో కుల్సుంబి ఆదర్శవంతురాలుగా కనబడుతుంది. వీరిరువురూ సమాజంలోని స్త్రీజాతికి ఆదర్శం. కుల్సుంబి ఆలోచనల్ని అన్వర్ మనవరాలు కుల్సుం ద్వారా నిర్భయంగా, బాహాటంగా వ్యక్తీకరింపజేసి, ఆమెను న్యాయవాదిగా, ముస్లిం పర్సనల్ చట్టాల్లో రావాల్సిన మార్పుల్ని సూచించడం ముదావహం. ఇలా వెండిమేఘం నవలలో మూర్తీభవించిన స్త్రీమూర్తుల సామాజిక జీవనం మనకు దర్శనమిస్తుంది.

ఇలాంటి నవలలు మరెన్నో రావాలనీ సమాజంలో మంచి మార్పును తీసుకురావాలని, వీటిపై విస్తృతంగా పరిశోధనలు జరగాలని ఆశిద్దాం.

**ఉపయుక్తగ్రంథసూచి :**

1. ఆనందరామం,సి.తెలుగు నవలల్లో కుటుంబ జీవనం.విజయవాడ : నవజ్యోతి పబ్లికేషన్స్,1979.
2. దక్షిణామూర్తి,పి. తెలుగు నవల. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1975.
3. నాగభూషణశర్మ,మొదలి. తెలుగు నవలా వికాసము. సికింద్రాబాద్:ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, 1971.
4. మంగమ్మ,లింగాల.పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నవలలు - పరిశీలన.హైదరాబాదు: చాందిని సాహితీ పబ్లికేషన్స్,2016.
5. మూర్తి,డి.బి.ఎస్.ఆర్.సిహెచ్. సమాజ పరిణామంలో స్త్రీ. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 1984.
6. రామానుజరావు,దేవులపల్లి. తెలుగు నవల నూరు సంవత్సరాలు.హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,1976.
7. రామమోహన్‌రాయ్, కడియాల.మన తెలుగు నవల.హైదరాబాదు: అజో-విభొ-కందాళం ఫౌండేషన్,2012.
8. రంగాచార్యులు, మాడభూషి. తెలుగు నవల- ఆధునిక స్త్రీ. హైదరాబాదు: నవోదయ బుక్‌హౌస్, 2001.
9. వెంకటసుబ్బయ్య,వల్లంపాటి.నవలాశిల్పం.హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లికేషన్స్,1989.
10. సలీం.వెండిమేఘం.విజయవాడ:శ్రీవిజయలక్ష్మి పబ్లికేషన్స్,2006.
11. సంజీవమ్మ,పి.తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం.కడప : అరసం ప్రచురణ,1985.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# నాగప్పగారి సుందర్రాజు కథల్లో మహిళ - లైంగిక వివక్ష - అత్యాచారాలు

**- డా॥. మల్లెల నాగరాజు,** తెలుగు అధ్యాపకులు, తెలుగు అధ్యయనశాఖ, ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల, నాగార్జున సాగర్, విజపురి సౌత్.

భారతీయ సమాజం అపార రుగ్మతలతో కొట్టు మిట్టాడుతోంది. సమాజంలో బాల్యవివాహాలు, సతీసహ గమనం, నిర్భంద వైధవ్యం, వరశుల్కం, నిరక్షరాస్యత, పేదరికం వంటి అరాచకాలు రాజ్యమేలాయి. భారతదేశం పరాయి పాలనలో ఉంది. దళితులు బానిసలుగా, వంశ పారంపర్య పాలేర్లుగా భూస్వాముల దోపిడీకి గురయ్యారు. దళితులు అస్పృశ్యత కారణంగా సవర్ణుల నుండి దాడులకు గురవుతూ తినడానికి తిండిలేక కటిక పేదరికాన్ని అనుభవించారు. ఈ సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు, మూఢనమ్మకాలు రూపుమాపబడి నప్పుడే సిద్ధించిన స్వాతంత్ర్యానికి సార్థకత ఉంటుందని అభిప్రాయపడిన సంఘసంస్కర్తలు, సంఘసంస్కర ణోద్యమాలను సాగించారు. ఈ క్రమంలోనే జాతీయో ద్యమం కూడా సాగింది.

ఈ రెండు ఉద్యమాల నడుమ దళితులు కొంత ఊరట చెందారు. అక్షరాస్యత సాధించడం, దేవాలయ ప్రవేశం, సహపంక్తి భోజనాలు వంటివి సాగాయి. క్రైస్తవం నీడలో కూడా దళితులు కొంత ఊరట చెందారు. అప్పటి నుండి దళితులు తమ గమనాన్ని మార్చుకునే ప్రయత్నం చేశారు. ఈ దారిలోనే "దళిత మహిళలు" కూడా ప్రయత్నం సాగించారు. సమాజం సాగించే ఉద్యమాల్లో భాగస్వామ్యం కావడం, అస్పృశ్యతను వ్యతిరేకించడం, మహిళల మీద సాగే దాడులను నిరసించడం, ఎదురు దాడులకు దిగడం, యస్సీ, యస్టీ అట్రాసిటీ చట్టాన్ని వినియోగించు కోవడం, ముఖ్యంగా 'దళిత మహిళలు' కులాంతర వివాహాలు చేసుకోవడం మానవ హక్కుల సాధనకోసం కృషి చేయడంలాంటి అంశాల్ని ప్రధానంగా చేస్తూ నాగప్పగారి సుందర్రాజుగారు 1997 ఫిబ్రవరిలో 'మాది గోడు' కథల సంపుటిని పాఠకలోకం ముందుకు తీసు కొచ్చాడు. ఈ సంపుటిలో పది కథలున్నాయి. అందులో 'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యెద', 'మద్దికెర మార్తమ్మ కత ఎంతమందికి తెలుసప్పా?' ఈ రెండు కథలను వివరించడమే ఈ వ్యాసోద్దేశం.

ఈ రెండు కథలలో దళిత మహిళ లైంగిక వివక్షకు, అత్యాచారాలకు గురైన విధానాన్ని కథకుడు తెలిపాడు. భారతీయ సమాజంలో పితృస్వామిక వ్యవస్థ ఉంది. ఈ పితృస్వామిక వ్యవస్థలో భాగంగా సమాజంలోనూ, కుటుంబంలోనూ పురుషుడికన్నా స్త్రీ తక్కువగా చూడ బడుతోంది. అలాగే సమాజంలో పురుషుడి నుండి స్త్రీ నిత్యం అనుమానం, లైంగిక వివక్షలకు గురవుతోంది. అస్పృశ్యత కారణంగా దళిత మహిళలు అనుభవించే ప్రధాన సమస్య దళిత మహిళలు స్వకులంతోపాటు అగ్రవర్ణాలకు చెందిన పురుషుల చేతుల్లో కూడా అత్యా చారాలకు, హత్యలకు గురవుతున్నారు. దళిత మహిళలు తమ పేదరికం కారణంగా సవర్ణుల ఇళ్ళలోనూ, పొలాల్లోనూ పని చేయడం మూలంగా పురుషుల కామా నికి బలికావడం దళిత మహిళల పాలిట శాపాలుగా మారాయి. ఇప్పుడు పైన తెలిపిన రెండు కథల్లోని దళిత మహిళల జీవితాన్ని చిత్రించిన తీరును పరిశీలిద్దాం.

మాదిగ బోడెక్కను బసివినిరాలిగా చేసిన కథ 'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యెద'. బోడెక్క మాదిగ కందారప్ప బిడ్డ. పదేళ్ళ ప్రాయం కలది. బోడెక్కను బసివిని చేయాలని గ్రామ పెద్దలు నిర్ణయిస్తారు. కందారప్ప తన కూతురుకు ఇంకా పదేళ్ళు కూడా రాలేదని, గ్రామ పంచాయతీలో చెబుతాడు. అయినా పెద్దిరెడ్డి నిరాకరిస్తాడు. కందారప్పకు ఖర్చులకింద రెండువేల రూపాయలు ఇచ్చి మొలకల పున్నమి తర్వాత

ఆరెద్దుల కారైపోయిన మూడురోజులకు ఈ కార్యం జరపడానికి నిశ్చయిస్తారు. ఆరోజున బోడెక్కను ఊరి బయటకు ఒక పాడుబడిన బావి దగ్గరకు తీసుకెళ్ళి బసివినులందరూ కలసి ఈమెకు తెల్ల వస్త్రాలు ధరింపజేసి వేపమండలు కట్టి బసివిని చేసి ఊరేగింపుగా ఇంటికి తీసుకెళతారు. బోడెక్క ఏడుస్తుండగా "వూరుకోమ్మే... వూరుకుండు. అమ్మ కార్యమప్పుడు యేడ్వకూడదు. వులిగమ్మవ్వకి కోప్మొస్తే జీవితాంతంము ఇట్లే యేడుసుకుంట బతుకమని పొప్మ పెడతాదట" అని ఒక ముసలి బసివితో అంటుంది. ఆ తర్వాత గ్రామంలో ప్రజలు దేవరపోతును నరుకుతారు. ఆ దున్నపోతు మాంసాన్ని మాలమాదిగలు అందరూ పంచుకుంటారు. ఆ రాత్రికి బోడెక్కను ఈ కార్యక్రమానికి ముహూర్తం కట్టిన కర్నముస్వామి కుంకుమగట్టిన గురవయ్య పూజారప్పలు ఒకరు తర్వాత ఒకరు అనుభవిస్తారు.

రాయలసీమలో ఆదోని ప్రాంతంలో సాగిన బసివినిల వ్యవస్థను వివరించిన కథ. మాదిగలు తమ ఆచారం ప్రకారం తమ ఇళ్ళలో సంప్రదాయంగా వస్తున్న ఆచారం ప్రకారం తమ కుమార్తెలను బసివినులుగా వదలడం ఈ తంతుకు గ్రామస్థులందరూ చందాలు వేయడం జరిగేది. ఈ ప్రయత్నంలో దళిత మహిళలు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని నాగరికత పెరుగుతున్న ఈ సమాజంలో ఇలాంటి ఆచారాలను వ్యతిరేకించాలనే అంతరార్థం దాగిన కథ.

ఈ కథలో బోడెక్క నిరక్షరాస్యురాలు. తల్లిదండ్రుల చాటుబిడ్డ, అమాయకురాలు. పదేళ్ళప్రాయం కలది. వంశ ఆచారం ప్రకారం ఈమె బసివిని కావాల్సి వచ్చింది. ఆ గ్రామంలో పెద్దల తీర్పు ప్రకారం పదేళ్ళ ప్రాయంలోనే బసివినిగా కావాల్సి వచ్చింది. గ్రామ పెద్దల తీర్పుకు తల వంచాల్సి వచ్చింది. ఈ మహిళ వ్యక్తిగతంగా ఒక పేదవాడిని వివాహం చేసుకొని రోజూ కూలికైనా వెళ్ళి జీవించాలని భావించింది. తాను బసివినిగా వెళ్ళనని చెప్పింది. తనను బసివినిగా చేస్తుంటే కుమిలి కుమిలి ఏడ్చింది. ఇంకా పుష్పవతి కాకనే పెద్దిరెడ్డి మాట ప్రకారం బసివిని చేశారు. ఆ రాత్రి పూజారప్ప, కర్నముస్వామి, గురవయ్య ఈ ముగ్గురూ ఈమె శోభనంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఊరందరికీ భార్య అవుతుంది. ఇలా బలవంతంగా బజారు మనిషిగా మారిన పాత్ర. ఇష్టంలేని పనిని కష్టంగా చేయాల్సి వచ్చింది. ఇక్కడ ఈ మహిళ లైంగికంగా వేధించబడింది.

మద్దికెర మార్తమ్మను ముగ్గురు సవర్ణులు అత్యాచారం చేసిన కథ 'మద్దికెర మార్తమ్మ ఎంతమందికి తెలుసప్పా?'. ఈ కథ మద్దికేరలో మాదిగ ఎర్రన్న కుటుంబం చుట్టూ సాగుతుంది. ఎర్రన్నకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ఎర్రన్న వైశ్యుల వడ్ల మిషన్‌లో పని చేస్తుంటాడు. అలా పని చేస్తుండగా ఒకసారి ప్రమాదవశాత్తు కాలు విరుగుతుంది. అయినా ఆ వడ్లమిషన్ యజమానులు ఆర్థిక సహాయం చేయరు. అయినా ఆ మిషన్‌లోనే ఎర్రన్న నమ్మకంగా పని చేస్తుంటాడు. ఎర్రన్న కొడుకులు వివాహాలు చేసుకొని పక్కూరిలో వేరే కాపురం పెడతారు. ఎర్రన్న భార్య పుట్టిల్లు చేరుకుంటుంది. ఎర్రన్న తన కూతురు మార్తమ్మతో కలసి మాదిగ్గేరిలో తన ఇంట్లో ఉండేవాడు. ఈ క్రమంలో వర్షానికి ఎర్రన్న ఇల్లు కూలిపోతుంది. దాంతో తమ మకాంను వడ్లమిషన్‌లోకి మార్చుతాడు. మార్తమ్మ చాలా అందంగా ఉంటుంది. దాంతో వడ్లమిషన్‌కు వచ్చే మగవాళ్ళంతా మార్తమ్మను చూస్తుంటారు. ఆమెను అనుభవించాలని శతవిధాల ప్రయత్నిస్తుంటారు. డబ్బులిస్తామని, చీరలు కొనిపెడతామని ఏవేవో ఆశలు చూపుతుంటారు. కానీ, మార్తమ్మ లొంగలేదు. ఒకరోజు ఎర్రన్నను వడ్లమిషన్ యజమాని పిలుస్తున్నాడని బయటికి పంపించేసి వడ్లమిషన్ గేటువేస్తారు. తర్వాత ఆ ముగ్గురు మార్తమ్మను మిషన్ వరిపొట్టులో పడేసి, ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేసి హత్య చేస్తారు. ఆ తర్వాత శివారెడ్డి వడ్లమిషన్ యజమాని దగ్గరకు వెళ్ళి "సెట్టీ.. సెట్టీ.. ఎర్రన్న బిడ్డ

మిజిన్నులో వురేసుకొని సచ్చి పొయ్యేద ఏమయ్యేదో యేమికతో" అని చెబుతాడు. రాందాసు, ఖాజాలు కూడా ఒక్కొక్కరు ఒక వీధికి పోయి మార్తమ్మ చనిపోయిందని చెబుతారు. ఆ తర్వాత ఈ ముగ్గురు అత్యాచారం చేసి చంపారని తెలిసి గ్రామంలో పెద్ద ఉద్యమాలు జరుగుతాయి. కానీ, ఎలాంటి కేసులు నిలబడవు.

దళిత ఉద్యమాలు బలంగా సాగుతున్న కాలంలోనే దళిత మహిళల మీద అత్యాచారాలు, హత్యలు జరిగాయి. గ్రామాల్లో దళిత మహిళలపట్ల ఉన్న వివక్ష కనిపిస్తుంది. దళిత మహిళలను చులకనగా చూడటం, అత్యాచారాలు, హత్యలు చేయటం ఇలాంటి వాటిని మహిళలు సంఘంలో ధైర్యంగా ఎదుర్కోవాలని తెలుపుతుందీ కథ.

ఈ కథలో మార్తమ్మ కథా నాయకురాలు. సంస్కారవంతమైంది. మాదిగ ఎర్రన్న కూతురు. అందంగా ఉంటుంది. "గుంగ్రాయి అట్లా మగుము, గురిగి వువ్వులట్లా కండ్లు తమేటు పొండ్లు అట్లా పెదవులు, కడ్డితో గేసినట్లు కనుబొమ్మలు, ముడివిప్పి జెడేస్తే పిరుదులు దాటి పిక్కల్ని తగిలేతట్లు ఉండాయి యెంటికలు". ఇంత అందంగా ఉంటుంది. అయినా సంప్రదాయ పద్ధతిలో ఉంటుంది. కానీ ఈమెకు తన అన్నల సహకారం లేదు. తల్లి సహకారం లేదు. అవిటి తండ్రి నీడలో జీవిస్తుంది. శివారెడ్డి, బోయ రాందాసు, ముస్లీం ఖాజాలు ఈమెపై కన్నేస్తారు. ఈ ముగ్గురూ మిషన్ వరిపొట్టు దిబ్బలోకి తీసుకెళ్ళి అత్యాచారం చేస్తారు.ల

నేటి సమాజంలో ఆచారాలు, మూఢనమ్మకాల మాటున సమాజంలో పని చేసే స్థలంలోను, ఉద్యోగంలోను మహిళలను హీనంగా చూస్తూ వారిపై లైంగిక వివక్ష, అత్యాచారాలు చేయడం ఇంకా సాగుతూనే ఉన్నాయి.

## ఆధార గ్రంథాలు

1. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణా మూర్తి
2. ఆది భారతీయుల చరిత్ర - కె.లక్ష్మీ నారాయణ
3. వర్ణ వివక్ష కథలు, దళిత కథలు - 5 - కొలకలూరి ఇనాక్, కె.లక్ష్మీ నారాయణ
4. మాదిగోడు - నాగప్పగారి సుందర్రాజు
5. దళిత కథలు-2 - దళిత స్త్రీ సమస్యల కథలు - ఆచార్య కొలకలూరి ఇనాక్, కె.లక్ష్మీ నారాయణ

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కృష్ణరాయబారంలో ద్రౌపది పలుకులు

- డా॥. మల్లెబోగు మాదన్న , తెలుగు శాఖాధ్యక్షులు, ఎస్.జి.ఎస్. ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

పాండవులు అరణ్య అజ్ఞాత వాసాలను ముగించుకొని తిరిగి వచ్చి, తమ రాజ్యభాగం తమకు ఇమ్మని ద్రుపద మహారాజు పురోహితుడై బ్రాహ్మణుని ధృతరాష్ట్రుని వద్దకు రాయబారిగా పంపారు. కౌరవులు అందుకు అంగీకరించ లేదు. ధృతరాష్ట్రుడు సంజయుడిని పాండవుల వద్దకు రాయబారిగా పంపించి, వారిని మంచిమాటలతో బుజ్జగించడానికి ప్రయత్నించాడు. ధర్మరాజు అప్పుడు సంజయుని మాటలను కాదన్నాడు. దానితో ధృతరాష్ట్రుని ప్రయత్నం వ్యర్థమైంది. అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుడిని ధృతరాష్ట్రుని వద్దకు రాయబారిగా పంపాడు. రాయబారానికి వెళ్ళేముందు పాండవులు ఐదుగురూ, ద్రౌపదీ అభిప్రాయాలను శ్రీకృష్ణుడు అడిగాడు. అందుకు ధర్మరాజు పగ మంచిది కాదనీ, యుద్ధంలో ఎవరు జయిస్తారో నిశ్చయంగా తెలియదనీ, తమకు అయిదు ఊళ్ళు ఇస్తే చాలు సంధికి సిద్ధమనీ, ఏ విధంగానైనా సంధి కుదర్చమన్నాడు. అన్నదమ్ములైన మేము ఇతరులు తలెత్తి చూసేటట్లు పోట్లాడుకోవడం మంచిదికాదు. పెద్దవారు చెప్పినట్లు రాజ్యము పంచుకొని అనుభవించడం మంచిది. కాబట్టి ఏ విధంగానైనా సంధి కుదర్చమన్నాడు భీముడు. ముందుగానే ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు రాజ్యం పంచి ఇవ్వడానికి అంగీకరించరనే అభిప్రాయం ఉండకూడదు. మేము గాండీవమూ, అస్త్రాలు కదలించకుండానే రాజ్యంలో మాకు సగభాగం వారు ఇచ్చేలా సంధి కుదర్చమని అర్జునుడు కోరాడు. కౌరవులు దుర్మార్గంగా ఉంటే తాము కూడా అలాగే ఉండవలసిన పనిలేదనీ, కృష్ణుడు వెళితే కౌరవులు తప్పక కృష్ణుని మాటలు ఆదరిస్తారనీ, కృష్ణుని మాటను కాదనడానికి కౌరవులు భయపడతారనీ, నకులుడు కృష్ణునితో అన్నాడు. దుర్యోధనుడు సగభాగం ఇవ్వడం జరిగే పనికాదు. అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తిచేసిన తరువాత రాజ్యంలో సగం ఇస్తానని దుర్యోధనుడే చెప్పాడు. ఇప్పుడు ఇయ్యకుండా ఉండడానికి వీలుకాదు. రాజ్యభాగం పంచి ఇవ్వడం ఇష్టం కాకపోతే, యుద్ధానికి రమ్మని దుర్యోధనుడికి చెప్పమని సహదేవుడు చెప్పాడు. దుర్యోధనుడికి హితబోధ చేయడం వ్యర్థం. ప్రయోజనం ఉండదు. ఉత్సాహం ఉరకలు వేసే ఈ వీరులందరికీ యుద్ధమే ఇష్టంగా కనిపిస్తోంది అని సాత్యకి అన్నాడు. పాండవులు యుద్ధనీతిని అనుసరించి మాట్లాడారు. ద్రౌపది హృదయనీతిని పాటించి ఎలా మాట్లాడతుందో చూద్దాం.

"ధర్మనందను పలుకులు దనకు హృదయ
తాప మొనరింప మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్య బలికె
గసలి శౌరితో దగ్గదకంఠి యగుచు"

(తి.తి.దే. ఉ.5వ సంపుటం, పుట:338)

ధర్మరాజు మాటలు ద్రౌపదికి మనస్తాపం కల్గించాయి. ఆమె ముఖం చిన్నబుచ్చుకొని, కోపంతో వణకుతున్న కంఠస్వరంతో కృష్ణుడితో కౌరవులు చెప్పడానికి వీలులేనన్ని అవమానాలు చేసి, మమ్మల్ని అడవులకు వెళ్ళగొట్టించి సంజయుడిచేత రాయబారం పంపిస్తారా? ఈ ఊరడింపుకే ధర్మరాజు సంతోషపడ్డాడు. పాండవులు ఐదుగురికీ దుర్యోధనుడు తనంత తానుగా ఐదూళ్ళు ఇస్తాడా? ఆ మాత్రం కూడా ఇవ్వకుండా అతడు తన సోదరులను నిర్దయతో బాధించకపోవచ్చు. ధర్మరాజు దుర్యోధనాదు లయిన సోదరులపై ఉన్న ప్రేమవల్ల, తాను వాళ్లవల్ల పడిన అవమానాలనూ, బాధలనూ సహిస్తాడు. అది మంచిదే. కానీ ధర్మరాజు, రాజ్యం పాలులేకుండా సంధికి అంగీకరిస్తే, లోకులు పాండవులను తెలివితక్కువవారనీ,

యుద్ధం చేయడానాకి అసమర్థులనీ, సిగ్గులేనివారనీ నిందిస్తారు.

కృష్ణా! పాండవులు తమ గౌరవం నాశనమయ్యేటట్లుగా, తమను తక్కువగా ఆరోపించుకోడం ఎందుకు? సంధివల్ల కౌరవులకే లాభం. పాండవులనూ, కౌరవులనూ పోల్చిచూస్తే, పాండవులు పగతీర్చుకోలేరా; అదీగాక యుద్ధంలో కౌరవులను సంహరింపదలిస్తే, అందులో సందేహించవలసింది ఏముంది? తమకు వచ్చిన ఏ ఆపదనైనా పాండవులు సహించి ఊరుకోడానికి, కౌరవులు బ్రాహ్మణులు ఏమీకారు కదా? దుర్యోధనుడి మనస్సులో జంకు గొంకులు లేవు. నీ మాట ప్రకారం అతడు నడుచుకుంటాడా? నీ మాటల వల్ల అతనికి దురభిమానం పెరుగుతుంది. ఒకవేళ యుద్ధం వచ్చే పరిస్థితే వస్తే, ఈ పాండవులు యుద్ధానికి సిద్ధపడతారా? లేక తిరిగి అరణ్యవాసానికి వెళ్ళుతారో ఏమో?

"ఏ నిటువంటి నా వలవ: దింకను నీవును రాజు దమ్ములుం
గా నుచితంబు చూచి మన కార్యము మీసు
జనత్వముం జెడం
గా నొకభంగి సేయక తగం గురువర్గము తోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుడు నేర్పు లేర్పడన్"

(తి.తి.దే.ఉ.5వ సంపుటం, పుట:343)

అన్నా! నేను ఇలాగ అన్నానని అనుకోవద్దు. నీవూ, మన రాజుగారూ, ఆయన తమ్ములూ, ఏది ఉచితమో బాగా ఆలోచించి, మన పనీ, మీ మంచితనమూ, ఏ మాత్రమూ చెడిపోకుండా, కౌరవులతో సంధి మీకు ఇష్టం అయినట్లు మీ నైపుణ్యాన్ని అంత ఉపయోగించి కావలసినట్లు చేసుకోండి. నేను అల్లరిపాలు కావటం, దానికి తగిన చెడ్డ ఫలితాలను పొందటం, నా భర్తలు దాన్ని చూచి కూడా మాట్లాడకపోవడం, అనే కారణాల వల్ల చెప్పిందే మళ్ళీ చెపుతూ, మాటలు మనసులో దాచుకోలేక, పరుషంగా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాను. ఉచితానుచితాలు నాకు తెలియడంలేదు. కోపంతో పిచ్చెక్కిన వ్యక్తికి, వివేకం తిరిగి వస్తుందా? చెప్పు.

నేను దేవతల వరం వల్ల పుట్టాను. భరత వంశాన్ని మెట్టి, పాండురాజుకు కోడలినయ్యాను. లోకవంద్యులయిన భర్తలను పొందాను. రాజనీతిలోనూ, పరాక్రమంలోనూ సుస్థిరులయిన ఐదుగురు పుత్రులను కన్నాను. సోదరుల అండదండలు పొందాను. ఇన్ని విధాలుగా నేను ప్రశస్తి పొందాను. నీవు సుభద్ర కంటె కూడా నన్ను ఆదరంతో ప్రేమగా గౌరవిస్తావు. ఇలాంటి నన్ను ఒక నీచుడు, రాజసూయం చివరిలో చేసే అవబృథస్నానంతో పవిత్రమైన నా జడను పట్టుకొని, ఈ పాండవులు అయిదుగురూ చూస్తుండగానే, ద్యూత సభకు ఈడ్చుకొని వెళ్ళాడు. కులకాంతను ఇలా అవమానపరచవచ్చా? ఏకవస్త్రగా ఉన్న నన్ను జూదం ఆడే సభకు ఈడ్చి తెచ్చిన దుశ్శాసనుడిని చూస్తూ, నా భర్తలు కొయ్యబారిపోయి, బొమ్మలుగా ఉన్న సమయంలో, ఆపదలో ఉన్న నన్ను నీవు రక్షిస్తావనే విశ్వాసంతో, నా మనస్సు నిన్ను స్మరించింది. అది గుర్తుతెచ్చుకో.

"అరయమి జేసి కోడ లన కప్పుడు దాసిగ జేసి: నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవగ వీరలతోన యేను జె
చ్చెర జని కోటరంబు దగ జేయుదునో? యటుగాక పాడిమై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ? నిశ్చయింపుమా!

(తి.తి.దే.ఉ.5వ సంపుటం, పుట:348)

ధృతరాష్ట్రుడు ముందు వెనుకలు ఆలోచించక పోవడం వల్ల జూదం సమయంలో నన్ను కోడలని భావింపక, దాసీని చేశాడు. నా భర్తలు ఆ మహానుభావుడి దగ్గరకు వెడితే, నేను వారితో కౌరవు నివాసానికి వెళ్ళి అక్కడ కోడరికంచేయాలో? లేక దాస్యం చేయాలో నీవే నిర్ణయించు అని చెప్పి ద్రౌపది దృఢంగ ఉన్న తన కేశపాశం ముడి విప్పింది. నల్లత్రాచులా నిగనిగలాడుతున్న ఆ కేశపాశాన్ని కుడిచేతిలో పట్టుకొని, దాన్ని చూడటం వల్ల పొంగిపోతున్న బాధనూ, కోపాన్నీ ఆపుకోలేక, కన్నీటితో దిగ్గున లేచి, కృష్ణునితో ఈ విధంగా చెప్పింది.

అన్నా ఈ తల వెంట్రుకలు దుశ్శాసనుడి చేతివేళ్ళలో చిక్కుకొని సగము తెగిపోగా మిగిలినవి. కౌరవ సభలో సంధిమాటల సందర్భంలో వీటిని తప్పకుండా గుర్తు చేసుకో.

"ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యాచేయి
దౌలుతగా బోరిలో దుస్ససేను
తన వింత లింతలు దునియలై చెదరి రూ
పఱియున్న గని యుడుకాఱుగాక!
యలుపాల బొనుపడునట్టి చిచ్చే యిది:
పెనుగద పట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ
మను నొక విల్లెప్పుడును వహించు
కఱ్ఱి విక్రమంబు గాల్పనే యిట్లు బ
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగు గన్నార
గాన బడయమైతిమేని గృష్ణ!
(తి.తి.దే.ఉ.5వ సంపుటం, పుట:351)

ఈ వెంద్రుకలు పట్టుకొని ఈడ్చిన ఆ దుశ్శాసనుడి చేయి యుద్ధంలో మొదట తెగిపడాలి. ఆ తరువాత అతని శరీరమూ ఇంతింత ముక్కలై చెల్లాచెదరై నాశనమయి పోవాలి. అది చూచిన తరువాతనే, ఈ అవమాన దు:ఖం ఉపశమిస్తుంది. అంతేకాని ఇది చిన్న చిన్న ప్రతిక్రియలచే చల్లారే తాపం కాదు. ఈ విధంగా అవమానాలు పడిన ధర్మరాజూ, నేనూ, దుర్యోధనుని శవాన్ని కళ్ళారా చూడక పోతే, భీముని బాహుబలమూ, గాండీవాన్ని ఎప్పుడూ ధరించే అర్జునుడి పరాక్రమమూ తగులబెట్టడానికా?

"నెట్టన యిట్టియల్క మది నిల్పితి రక్కెస తాల్మి జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము దీనికి నాఱు టెన్నడుం
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తో
బుట్టువు తీవ్ర తేజమున బొల్చిన భర్తలు గల్గ నచ్చుతా!
(తి.తి.దే.ఉ.5వ సంపుటం, పుట:352)

ఓ కృష్ణా! విధిలేక నిప్పును ఒడిలో పెట్టుకున్నట్లు, ఇంతకాలమూ ఇంత కోపాన్ని రాక్షసమైన ఓర్పుతో మనసులో దాచుకున్నాను. దుష్టులను శిక్షించటానికి పూనుకొని లోకాను రక్షించే సోదరుడవు నీవూ, తీవ్ర పరాక్రమంతో ప్రకాశించే భర్తలూ నాకు ఉన్నప్పటికీ కూడా, ఈ నా పరాభవాన్ని ఎప్పటికీ ఆరిపోయేటట్లు లేదు.

వాక్చాతుర్యం మహిళలకు ఎంత ముఖ్యమో అన్న అంశాలను ద్రౌపది పలుకులలో తెలుసుకోవచ్చు. కర్ర విరగకుండా పాము చావకుండా తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పింది. ధర్మరాజుతో పాటు తక్కిన వారి అభిప్రాయాలు ఆమె మనసుకు బాధ కలిగించినా ఏ మాత్రం వారి మనస్సు నొప్పించకుండా యుద్ధానికి ప్రేరణ ఇచ్చే మాటలు మాట్లాడింది. యుద్ధం జరిగితే ఆ ఇంటికి కోడలిగా వెళతానని సంధి జరిగితే ఆ ఇంటికి దాసిగా ఉండవలసి వస్తుందని, తనకు జరిగిన అవమానాలన్నీ పూసగుచ్చినట్లు చూపించి ఏది మంచిదో ఏది చెడ్డదో తమరే నిర్ణయించాలనీ అన్నమీదే భారాన్ని మోపిన రాజనీతి మాటకారి, నిపుణురాలు మన ద్రౌపది.

**ఆధారగ్రంథం :**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వం, 5వ సంపుటి, (తి.తి.దే.తిరుపతి.)

# శివారెడ్డి కవిత్వంలో స్త్రీ

- డా॥. మోకా ప్రతాప్, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

ఆధునిక కవిత్వ ప్రక్రియల్లో సింహభాగం వచన కవిత్వానిదే. అభ్యుదయ కవుల నుండి ముస్లింవాద కవుల వరకు, వివిధ భావజాలాలు కలిగిన కవులందరికి వచన కవిత్వమే వాహిక అయింది. ఈ ప్రక్రియలో శిల్ప చాతుర్యాన్ని, శైలి విన్యాసాన్ని ప్రదర్శించిన కవులెందరో దీపస్తంభాలుగా నిలిచారు. విప్లవ కవితారంగంలోను, వచన కవితా ప్రక్రియలోను ప్రమాణ, పరిమాణ, ప్రభావాల రీత్యా శివారెడ్డి కవిత్వం ఉన్నత స్థానాన్ని ఆక్రమిస్తుంది. తెలుగు కవితా శిల్పానికి శివారెడ్డి ఒక ఎస్సెట్. కవిత్వానికి శివారెడ్డి కంట్రిబ్యూషన్ కవిత్వ రచన మాత్రమే కాదు. అనేకమంది కవుల్ని తయారు చేయటమూ, ఎందరికో కవిత్వ స్పృహను కలిగించడమూ, కవిత్వ వాతావరణం చైతన్యవంతంగా అల్లటం కూడా. వీరు దాదాపు 16 కవితా సంపుటాలు వెలువరించారు. వీరి మోహనా మోహనా కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. పక్కకు ఒత్తిగిల్లి కవితా సంపుటి సరస్వతి సమ్మాన్ అవార్డు లభించింది.

ఈయన నేత్ర ధనస్సు కవితాసంపుటిలో 1978 సం॥లోనే ఈ దేశపు సగటు స్త్రీ ఆవేదనను తన ఆవేదనగా భావించి 'ఆమె ఆనవాళ్లు' అనే స్త్రీ ఇతివృత్త కవిత రాశారు. ఇందులో పురుషుడి దాష్టికానికి స్త్రీ నిస్సహాయతే కారణమని చెబుతూ-

"ఆమె ఎవరైతేనేం ఆ కన్నీళ్లునావే
ఆమె ఎవరైతేనేం ఆ ఆవేదన నాదే
ఆమె ఎవరైతేనేం ఈ దేశంలో పుట్టింది
ఆమె ఎవరైతేనేం ఈ భూమ్మీద పడ్డది
ప్రపంచం నరాల్లో లయిస్తున్నవాణ్ణి
ఆమె నాకళ్ళలో మలుపు తిరుగుతుంది
ఆమె అర్ధరాత్రిని వెంటేసుకుపోతోంది
ఆమె చితుల్ని వంటి నిండా పేర్చుకు బతుకుంది
ఆమె వంటి నిండా మనిషి కాట్లు
ఆమె గుండె నిండా ఆకలి గునపం తూట్లు
ఆమె ఆనవాళ్ళు నా అక్షరాల్నిండా ప్రత్యక్షం"

అని ఆర్ద్రంగా చిత్రించారు శివారెడ్డి. దాంపత్య జీవితంలోని యాంత్రికంగా చూడడాన్ని నిరసించారు. పురుష క్రౌర్యానికి బలైన స్త్రీ జీవితం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ బాల్యంలో తండ్రి, వయస్సులో భర్త వృద్ధాప్యంలో కొడుకుపై ఆధారపడేటట్లు చేసి పరాధీనత వస్తువుగా చేశారన్నారు. మరొక ప్రక్క మాతృ వాత్సల్యం ఆమెను కట్టిపడేస్తుందన్నారు.

భారమితి కవితా సంపుటిలోని 'ముఖేముఖే విషాదం' అనే కవితలో దాంపత్య జీవితంలోని విషాదాన్ని గూర్చి-

"ముఖేముఖే విషాదంలో
మొగుడూ పెళ్ళాం రెండు విషాదాలు
రెండు కలవని సముద్రాలు
దేని చుట్టూ అదే తిరిగే రెండుగోళాలు
ఈ దు:ఖ వ్యవస్థలో
మొగుడు పెళ్ళాం పొంతనలేని
రెండు శోకమయ శ్లోక చరణాలు
పరస్పర నిందారోపణల మధ్య
పరస్పర అపనమ్మకాల మధ్య
పరస్పర మృగయా వినోదాల మధ్య
గుడ్లు పిగులుతూనే వుంటాయి
ఎర్రముక్కల సూర్యోదయాలవుతూనే వుంటాయి."

అని బలీయంగా చెప్పాడు. భార్యభర్తలు రెండు కలవని సముద్రాలని దేని చుట్టూ అదే తిరిగే రెండు గోళాలని, పొంతనలేని రెండు శ్లోకమయ చరణాలని మూడు పోలికల్ని చెప్పారు. పరస్పరంనిందలు వేసు

కోవడం. అపనమ్మకాలతో వుండడం, మృగయా వినోదాలను పైస్థితికి కారణాలేమోనన్నట్లు పేర్కొంటాడు. ఒకరి అంతరంగాన్ని మరొకరు తెలుసుకోలేకపోవడానికి 'సముద్రం' అనోన్యత లోపించడానికి భ్రమణమే తప్ప పరిభ్రమణం లేని 'గోళాలు' భావైక్యత లోపానికి పొంతన లేని శ్లోక చరణాలని ప్రతీకల్ని వాడారు. ఆధిపత్యం, సమానత్వం అనే పరస్పర విరుద్ధ లక్ష్యాలతో సాగే నిశ్శబ్ద వ్యూహంలో భార్యభర్తలు సమాంతర రేఖలే. ఎంతటి విషాద స్థితిలోనైనా సంసారిక జీవితమూ, సంతోనోత్పత్తి యాంత్రికంగా జరిగిపోతూనే ఉంటాయంటాడు. 'ముఖే ముఖే సరస్వతి' అనే వాక్యానికి కవి చేసిన చమత్కారం ఈ కవితా శీర్షిక.

అజేయం కవితా సంపుటిలో 'ఆమె' అనే కవిత బిక్షుకి వర్ణనతో ప్రారంభమౌతుంది. చూపులేని వ్యాధిగ్రస్తురాలైన ఆమె ఆఫీసు గోడ పక్కన 'బోగన్ విల్లా చెట్ల చిల్లుల పడ్డ నీడలో కూర్చున్నది 'చిల్లులు పడ్డనీడ' ఆమె దైన్యాన్ని వ్యక్తపరిచే ఉచితమైన ఉత్ప్రేక్ష. రైల్వే సిగ్నల్ రెక్క పైకి లేచి పడినంత యాంత్రికంగానే ఆమె చేయి లేచి పడుతుందట. ఆమెను వర్ణిస్తూనే

"ఆమె ఒక్క చేతిని మాత్రమే బహిర్గతం చేసి
జీవితమే సాంచీ స్థూపమైనట్టు
నాకామె చరిత్ర ఎందుకు గత జీవితమెందుకు
ఏ స్త్రీ జీవితమైనా స్థలాలు వేరైనా భిన్నంగా ఎందుకుంటుంది
సౌశీల్యాల సంగతీ పవిత్రతల సంగతి అనవసరమిప్పుడు
ప్రవర్తనల సంగతీ పెంపకాల సంగతీ, ఆజమాయిషీల సంగతి
ఆర్ద్రతల సంగతీ, మూడు దశల్లో ముగ్గరాదుకోవటాల సంగతి కూడా అనవసరమిప్పుడు
ఇంత ప్రాణాన్ని ఒకింత గౌరవంగా
అన్ని న్యూనతల కతీతంగా నిలువుకోవటమెలా అన్నదే ప్రశ్న
బహు ప్రశ్నల ఉరితాళ్ళ మధ్య సమాధానాలు
శవప్రాయాలు మాత్రమే"

అని పేర్కొంటాడు. ఏ స్త్రీ జీవితమైనా ప్రాంతాల మారినంత మాత్రాన బిన్నంగా ఎందుకుంటుందని పేర్కొంటాడు. ఏ స్త్రీ జీవితమైనా ఒకే విధంగా వుంటుందని కవి బావన. మూడు దశలో ముగ్గరాదుకోవడం సంగతి కూడా ఇప్పుడు అనవసరమన్నారు. అవి ఆమెను నూన్యత మంచి తప్పించలేవని, అవి పరిష్కార మార్గాలు కావంటాడు. ఆదుకోవలసిన, ఆధారపడవలసిన స్థితిలో శాశ్వతంగా ఉంచడానికే కదా ఈ నియమాలూ ధర్మాలూ అన్నారు. ఎప్పుడైతే మన తల్లుల్నీ, పెళ్లాల్నీ, పిల్లల్ని అవమానించటం మొదలుపెట్టామో అప్పుడే వారిని ఒక ముద్ద అడుక్కునే మాంసంగా ముద్దగా చేసి పారేశాం. సగం ప్రపంచం చీకటి సగం ప్రపంచం నిర్జీవంగా వేళ్ళాడే పసుపుముద్దగా తయారుచేశాం. ఏ స్వాతంత్ర్యమూ లేని స్త్రీ జీవితాంతం పురుషుడి దయా, దాక్షిణ్యాలపైన ఆధారపడుతున్నది. ప్రతి అవసరానికి పురుషుడిని అడుక్కుంటూనే వున్నది. అడుక్కుంటున్నట్లుండదు. అదొక నిత్యకర్మలోనే ధార్మిక వర్తనలానే అనే భిక్షుకురాలిని ఉద్దేశించి కవి చెప్పిన మాటలు ప్రతి స్త్రీకి వర్తిస్తాయి. పరాధీనతలో భిక్షకత్తెకు సగటు స్త్రీ ఏమీ భేదం లేదన్నదే కవి ఈ కవితలో చెప్పిన ప్రధానాంశం. సంప్రదాయం, ఆచారాలు పాతివ్రత్యం, ఐదోతనం అనే చట్రంలో స్త్రీ బంధించబడడాన్ని నిరసిస్తూ కవి చేసిన చక్కటి వ్యక్తీకరణ. ఈ కవితకు సమగ్ర రూపం.

నా కలల అంచున కవితా సంపుటిలో 'స్త్రీ మూర్తులం దరికీ" అనే కవితలో హిందూ, ఇస్లాం, క్రైస్తవం ఏ మతమైనా స్త్రీని ఆ ముసుగులోనే బంధించాలనే చూస్తుందని చెప్పే సందర్భంలో-

"ఆమె కాజాబి కావచ్చు
కామేశ్వరి కావచ్చు
లేదు, మరో మరియమ్మ కావచ్చు
సంఘం చట్రంలో ఇరుక్కుని

ఇనపపుల్లల సందున సీసం కాయయతే
ఒక పురాతన విలువ మేకు చుట్టూ
ప్రదక్షిణలు చేస్తే పర్వాలేదు"

అని చెప్పాడు స్త్రీని మతాల పేరుతో, ఆచార సాంప్రదాయాల పేరుతో కాలం చెల్లిన వాటితోనే బంధించాలని ఈ సమాజం నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటుందన్నాడు. ఆ విధంగా పశుప్రాయంగా జీవించాలనే దుర్నీతిని ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్లకు నేరస్థులుగా పరగణిస్తుందన్నాడు. స్త్రీ ఒంటరిగా స్వయం ప్రతిపత్తితో బతకగూడదని చెప్పే కుటిల నీతిని బహిర్గతం చేశాడు. స్త్రీలందరు వారిని స్వేచ్ఛతో వాళ్ళు బతకాలని చెబుతూ-

"ఆడాళ్ళూ మగాళ్ళూ ఆమె గురించే మాట్లాడేవాళ్ళే
ఆమె గురించి పట్టించుకునే వాళ్ళే కానీ,
వాళ్ళు చెప్పినట్టే వినాలి వాళ్ళు గీసిన గిరిలో నిలవాలి
వాళ్ళ ఆదర్శాల రాగిచెంబుల్లో చక్కగా ఇరుక్కుని కూచోవాలి
ఉద్ధరిణో, రాగి చెంబో, శిరోమండనమో, ముసుగో
ఏదైతేనేమిటి - ఒక హద్దు, ఒక నిబంధన, ఒక ఆజ్ఞ
హద్దుల్ని నిబంధనల్ని ఆదుపాజ్ఞల్ని బద్దలుకొట్టే వాళ్ళకి జై
సాహసంతో జీవితాన్ని తమ ఇష్టమొచ్చినట్లు మలచుకొనే వాళ్ళకు జై
పురూరవుల్ని నిలేసి అన్ని విలువల వలువల్ని ఆవల బెట్టి పరమ దిగంబరంగా రమ్మన్న
ఊర్వసులందరికి
ప్రపంచానికి ముగుదాడేసి తమ వెంట నడిపించుకు
పోతున్న స్త్రీములందరికీ జై"

హర్షధ్వానాలు ప్రకటించాడు. స్త్రీలందరూ సాహసంతో జీవితాన్ని ఇష్టమొచ్చినట్లు మలచుకునే వారికి 'జై' అని సంఘీభావాన్ని ప్రకటించాడు కవి. పాత సంప్రదాయాలకు కులాలకు మతాలకు అతీతంగా సమసమాజ నిర్మాణానికి స్త్రీ మూర్తులందరు కృషి చేయాలన్నాడు. ఆ బాటలో పయనించిన వారందరికి జయజయ ధ్వానాలు చేశాడు.

మోహనా మోహనా కవితా సంపుటి 'అమ్మా! అమ్మా!' అనే ఈ దేశంలో ఎంతమంది వున్నా స్త్రీ మాత్రం ఒంటరిగానే మిగిలిపోతుందని చెప్పే సందర్భంలో-

"ఎందరున్నా ఏకాకిగా మిగిలిపోతున్న ఈ దేశం ఆడది ఆమె
అందరి జన్మలకూ అభివృద్ధికీ కారణభూతమైన ఆమె
ఆమెగానే మిగిలిపోతుంది
అందరి అవసరాలు తీర్చుతూ ఎవ్వరికీ చెందని
ఆదిమతల్లి యుగలయుగాల పవిత్రాదాసి
లోతు తెలియని శారీరక శ్రమల మానసిక సంక్షోభాల
సంకీర్ణ మహాదీవి
నా మొత్తం శరీరాన్ని రెండు చేతులుగా మార్చి నమస్కరిస్తున్నాను తల్లీ
సమస్త ప్రపంచాన్నీ నీ అరచేతుల్లోకి తీసుకుని చాచి
ఒక్క లెంపకొట్టు తల్లీ
అఖిల పురుష ప్రపంచాన్ని నీలో తన వికృతపుట కారాన్ని దర్శించనీ - దర్శించనీ"

అని స్త్రీ శ్రమ దోపిడినీ బలీయంగా ఆవిష్కరించాడు. సృష్టికి మూలమైన స్త్రీమూర్తిని ఒంటరిగా వదిలేయడం అహేతుకమన్నాడు. మానవజాతి పరిణామ వికాసంలో ఆమెది అమోఘమైన పాత్ర. కొవ్వొత్తి వలె తాను కరిగి పోతూ అందరి అవసరాలు తీరుస్తుందన్నాడు. ఆదిమయుగం నేటి కంప్యూటర్ యుగం వరకు ఆమెను ఇంకా కించపరచడం అన్యాయమన్నారు. స్త్రీని ఏకాకిగా, శాశ్వత దాసిగా మార్చుతున్న అనుత్పాదక శ్రమ, ఆధి పత్యాలు శివారెడ్డి కవితా వస్తువులు కావడాన్ని పరిశీలిస్తే వీరికి స్త్రీ జాతి పట్ల అపారమైన గౌరవం వ్యక్తమౌతుంది.

అజేయం కవితా సంపుటిలో 'ఒక ఆడ ఒక మగ' కవితలో స్త్రీని గూర్చి రాశారు. పరస్పర స్పర్శతో అన్ని అవమానాలు, కోపతాపాలు కరిగిపోతాయి. కేవలం భార్యా భర్తలుగా కాక కొంత సేపైన ఒక ఆడ ఒక మగగా ఉండగలగడమే ఎన్ని లోపాలున్నా వివాహవ్యవస్థ కొనసాగడాన్ని ఇది ప్రధాన కారణమేమోనని చెబుతూ-

"అప్పుడు నేనొక పురుషుణ్ణీ, ఆమె ఒక స్త్రీ అంతే
నిజం కూడా అంతేనేమో
సారభూతంలో ఒక మగా ఒక ఆడే కదా మూలం
మన నీతులూ, విలువలూ, ధర్మాలూ, కట్టడూలు
ఏకపత్నీవ్రతులూ, పాతివ్రత్యాలూ - అన్నీ
ఈ మూలసారం మీద బాగా పేరుకుపోయిన దుమ్ము
తెల్లార గట్ట నాపక్కలో దూరి
నన్నల్లుకుని నాగుండె మీద చేయవేసిం
తర్వాత - నేనేమిటి? అన్ని జాడ్యాల్ని
వదిలించుకుని నిర్మలంగా ఆమె ముందు కరిగిన శిశువుని
ఆమేమిటి? పగటి విషాద విసాన్నంతా కడిగేసుకుని
చనుబాలలా నాలోకి ప్రవేశిస్తున్న అనాది ఆదిమశక్తి"

అని పేర్కొన్నాడు. బలవంతంగానైనా వివాహవ్యవస్థను విచ్ఛిన్నం కాకుండా నిలబెట్టడానికే ఈ వ్యవస్థ ధర్మాలూ, గృహిణీ ధర్మాలూ వున్నాయి. కాని అవి కేవలం స్త్రీపైన పురుషుని ఆధిపత్యానికి ఆయుధాలుగా పర్యవసించాయి. ఆ విలువల నిరర్ధకతతో అవి కేవలం మనుషులు చేసుకొన్న ఏర్పాటేనని స్పష్టమౌతుంది. పగలు ఎన్ని భార్యాభర్తలు మధ్య ఎన్ని గొడవలు రాత్రికి ఒకటౌతారనే విషయాన్ని ఈ కవితలో వ్యక్తం చేశాడు దాంపత్య జీవితంలోని అనుకూల పార్శ్వాన్ని చూపించింది ఈ కవిత.

పురుషుడి చేతిలో ప్రేమ పేరుతో మోసపోయిన సగటు యువతి స్వగతాన్ని చిత్రించాడు. అజేయం కవితా సంపుటిలో 'కమల కుమారి స్వగతం' అనే కవితలో తెల్లనివన్నీ పాలనీ నల్లనివన్నీ నమ్మే రోజుల్లో అమ్మాయి మోసపోవడాన్ని గూర్చి-

"పొద్దుటిపూట ఆకు మీద కదిలే మంచు బిందువులో వింతవింత
లోకాన్ని చూసిమైమరిచి కరిగిపోయే రోజుల్లో
ఒక పిట్ట ఆకాశంలో గిరికీలు కొడితే
వింతగా వినోదంగా ఆహ్లాదంగా ఆశ్చర్యంలో మునిగి పోయిన రోజుల్లో
ఒక చెట్టు పూలకనులు విప్పితేనో కొత్త చిగురు గొంతెత్తితేనో
పట్టలేని ఆనందంతో పరవశించి పోయే రోజుల్లో"

అని చెప్పారు. స్త్రీ యౌవనారంభంలో అంతటా అందాన్ని, ఆనందాన్నే చూస్తుంది. పరవశించే భవిష్యత్తు గూర్చి కలలో తేలిపోయే దశలో లోకం తెలియుని అమాయికతను ఆసరాగా చేసుకుని సమీపించి ప్రేమ పేరుతో ఆశలు రేకెత్తిస్తుంది. తోకకు దారం కట్టి తూనీగతో ఆడినట్టు ఆడుతుంది. కనీసం ఉత్తరం ముక్కయినా ఆధారం లేకుండా కపట ప్రేమికుడి చేతిలో మోసపోయిన యువతి ఆత్మఘోష ఈ కవిత. నీతిగా కన్పించే దుర్నీతికి కుటుంబంలో అసమాన సంబంధాల స్త్రీకి ఒక హద్దు, ఒక నిబంధన, ఒక ఆజ్ఞగా మారటానికి వ్యవస్థలోని అంతరాలే కారణమన్న భావన కన్పిస్తుంది. శివారెడ్డి ఈ విధంగా అనేకచోట తారతమ్యాలకు గురవుతున్న స్త్రీలనే వస్తువులుగా చేసుకుని కవితలు రాశారు. ఇంకా ఈయన అనేక కవితల్లో స్త్రీల గూర్చి రాశారు.

'ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తారు' అన్న గురజాడ గొప్ప దార్శనికుడు. ఆ వరుసలో శ్రీశ్రీని శివారెడ్డిని చెప్పుకోవచ్చు. ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయిన శివారెడ్డి తన కవిత్వాన్ని విస్తృతపరిచాడు. స్త్రీల గురించి "నైనైతే మనస్ఫూర్తిగా స్త్రీవాద ధోరణి ఆహ్వానిస్తున్నాను' అన్నాడు.

**BHAVAVEENA** *Spl. Issue*
**Vol. 19, Issue. 3, March 2022**
**ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# మాలతీ చందూర్ నవలల్లోని - మహిళల పాత్రలు

- **డా॥. ఎం. ప్రభావతి,** తెలుగు అధ్యాపకురాలు, యస్.వియస్.డిగ్రీ కళాశాల, నగరి.

“యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః” అన్నారు పెద్దలు. ఆడవాళ్ళకు గౌరవం ఉన్నచోట దేవతలు విహరిస్తారు అని దీని అర్థం. వేద కాలం నాడు మహిళకే అగ్రస్థానం.అన్ని విషయాలలో ఆమె మాటే వేదం.ఆనాడు పురుషులతో సమంగా చదువుకున్న వారూ ఉన్నారు. శాస్త్ర విషయాలు వాదించి నెగ్గినవారూ ఉన్నారు. కానీ మధ్యలో కొన్ని మూఢ నమ్మకాలు,చాదస్తాలు వారిస్థానాన్ని కిందికి దించాయి.ఆడవారికి చదువుకోవడం తగదన్నారు. ఇంకా ఎన్నో నిర్బంధాలు. ఆడవాళ్ళు అంటే ఇంట్లో వంట చేయడం వరకే అని హద్దులు గీచారు. దీని ఫలితంగా ఆడవాళ్ళు వంటింటికే పరిమితమైయ్యారు. అనేకమైన దురాచారాలకు బలిపశువులయ్యారు. అయితే క్రమంగా మళ్ళీ ఆడవాళ్ళు అన్నిట్లో రాణిస్తున్నారు. ఆంక్షల సంకెళ్ళు తెంచుకొని అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారు. ఒకప్పుడు కేవలం మగవాళ్ళే చేయదగ్గ పనులన్నింటినీ ఈనాడు

ఆడవాళ్ళు చేస్తున్నారు. ఎన్నో రంగాలలో ఆడవాళ్ళు మరింత ముందుకు సాగుతున్నారు.

ముఖ్యంగా మన భారతదేశంలో స్త్రీలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది.”ఇంటికి వెలుగు ఇల్లాలు,ఆడవాళ్ళను గౌరవించడం మన సంప్రదాయం” అనే నానుడులు అనాది కాలం నుండి వస్తున్నాయి. సమాజంలో, కుటుంబంలో ఎన్ని సమస్యలు వచ్చినా అధైర్యపడకుండా, భయపడకుండా,ఆలోచించి చైతన్యవంతంగా, చాక చక్యంగా, అన్ని సమస్యలను సున్నితంగా పరిష్కరించే నైపుణ్యం కలిగిన వారే మహిళలు. కానీ సమాజంలో మహిళలు వివిధ రకాల సమస్యలతో సతమతమవు తున్నారు. అంతే కాకుండా సమాజంలోని కట్టుబాట్లు మహిళల పట్ల చిన్న చూపుతో అణగదొక్కడానికే ప్రయత్నిస్తాయి. స్త్రీ విముక్తి కోసం, మహిళల అభ్యున్నతి కోసం ఎంతో మంది రచయిత్రులు, రచయితలు మహిళల్లో చైతన్యాన్ని కలిగించడానికి నవలలు, రచించారు.

ఒకప్పుడు మహిళలు ఇంటికి మాత్రమే పరిమితం. వారు బయటికి వచ్చి చదువుకోవడం,ఉద్యోగానికి వెళ్ళటం అనేది ఉండేది కాదు. అందుకే మహిళలు స్వతంత్రు లుగా, ఆర్థికంగా, స్థిరపడాలి, అని ఎంతోమంది కవులు, కవయిత్రులు నవలలు, నాటకాలు, కథలు రచించారు. కుటుంబ సమాజ పరిధిలో స్త్రీలు ఎదుర్కొనే హింస, అనిచివేత, అసమానత్వం మొదలైన వాటిని నవలా రచయితలు తమ రచనల ద్వారా బహిర్గతం చేశారు. వాటికి విరుద్ధమైన స్త్రీ-పురుష సమసమాజ నిర్మాణాన్నీ ఆకాంక్షించారు. మహిళలు సాంప్రదాయానికి కట్టుబడి, తమ కాళ్ల మీద తాము నిలబడగల స్వతంత్రతను, ఆత్మ స్థైర్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందించే విధంగా తమ రచన లను కొనసాగించారు. మహిళల జీవితంలోని విభిన్న కోణాలను,వాళ్ళ సామాజిక సాంస్కృతిక సమస్యలను నిశితంగా పరిశీలించి వాటిని తమ రచనలలో మాలతీ చందూర్ గారు సజీవంగా చిత్రించారు. పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న రోజులలో స్త్రీ స్థితిగతులు ప్రశ్నార్థకంగా ఉండేవి,స్త్రీలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించలేని పరిస్థితి. ఆ సమయంలో స్త్రీల పరిస్థితిని అర్థం చేసుకుని వారికి స్వేచ్ఛ కావాలని ఎందరో సంఘ సంస్కర్తలు పోరాటం చేసారు.

శైలిలో, వస్తువులో,శిల్పంలో, వైవిధ్యంలో, నిర్వ హణలో ప్రతిభావంతులైన నవలా రచయితలు ఎందరో ఉన్నారు. అప్పటి నుంచి నేటి వరకు కూడా ఆయా ప్రాంతాలకు తగిన విధంగా ప్రజల స్థితిగతులను, ప్రాంతీ

యతకు తగిన విధంగా తమ రచనల్లో వ్యక్తపరిచారు. ప్రాంతీయ సమస్యలు అంటే ముఖ్యంగా మహిళలపై చూపుతున్న ప్రభావం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారు పడుతున్న బాధలు మరియు వివిధ రంగాలలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వారిపై చూపుతున్న వివక్షతను నవలల ద్వారా రచయితలు కళ్లకు కట్టించారు.

ముఖ్యంగా సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న విషయాలలో కుటుంబ సమస్యలు, మహిళలపై జరుగుతున్న లైంగిక హింస, మహిళా సామాజిక సమస్యలు, పురుషాధిపత్యం, ఆర్థిక సమస్యలు, కుటుంబంలో జరిగే వేధింపులు, లింగ వివక్షత, దురాచారాలు, వంటి సమస్యలన్నింటినీ నవలా రచయితలు తమ రచనలల్లో తెలియపరిచారు. పురుషులు అధికారంతో మహిళ ప్రత్యేకంగా ఆలోచించి చెప్పినా, చులకన భావం, చిన్నచూపు ప్రదర్శిస్తారు.ఆచారాలు, కట్టుబాట్లు,సంప్రదాయాల పేరుతో మహిళలను నిత్యం హింసకు గురి చేస్తున్నారు. దాంతో మహిళలు తన అస్తిత్వాన్ని కోల్పోతున్నారు. అలాంటి దురాచారాలను సాహసించి ఎదిరించినా సంఘర్షణకు గురవుతున్నారు.

మహిళలు మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని అవసరమైతే లైంగికంగా, మానసికంగా హింసించే వారిపై చర్యలు తీసుకునే సాహసాన్ని కలిగి ఉండాలి. అప్పుడే తమను తాము రక్షించుకోగలరు. సమాజంలోను కుటుంబంలోను మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వివక్షత.ఆడా, మగా అనే వివక్షత పుట్టినప్పటినుండి ఏర్పడుతుంది.సృష్టికి మూలం స్త్రీ.ఒక తల్లిగా, భార్యగా, చెల్లిగా మహిళలు అవసరం. కానీ బిడ్డగా మాత్రం స్త్రీ భారమే. మాటల్లోనూ, పాటల్లోనూ, చదువులోనూ, తిండి విషయంలో అన్నింటిలోనూ ఆడ పిల్లల పట్ల తల్లిదండ్రులే వివక్షత చూపిస్తారు. ఈ విధంగా ఇంటిలోని వారే ఆడపిల్ల పట్ల వివక్షత చూపుతుంటే ఇక సమాజంలో మార్పు ఎలా ఉంటుంది. ఇలా విద్యా, వ్యాపార, రాజకీయ, రంగాల్లో ఎక్కువగా స్త్రీలు వివక్షతను ఎదుర్కొంటున్నారు.

మహిళలపై ఒక కుటుంబంలోనే కాదు, పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ, ఉద్యోగం చేసే స్థలాలల్లోనూ ఏదో రకంగా, అవమానాలకు, దౌర్జన్యాలకు, మరియు లైంగికంగా వేధింపులకు గురవుతున్నారనే విషయాలను రచయితలు తమ రచనలు (కథా, నవల, నాటకం) ద్వారా తెలియపరుస్తూ వాటిని నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలి అని సచూచించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న రకరకాల సమస్యల్ని, వాటి పరిష్కార మార్గాలను, మహిళలు చైతన్యవంతంగా సమస్యల్ని అధిగమించే తీరుతెన్నులను భిన్న కోణాల్లో శ్రీమతి మాలతీచందూర్ గారు నవలల్లో చిత్రించారు.

సరస్వతి ప్రియ పుత్రిక, విద్వత్ శిఖామణి, బహుగ్రంథ కర్త, కాలమిస్ట్, అనువాద, కథా, నవలా రచయిత్రి ,మంచి మనస్వి, ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు అనేక పురస్కారాలు, అవార్డులు అందుకున్న మహిళా శిరోమణి. తెలుగు సాహిత్యంలోనూ, తెలుగింటి ఆడపడుచుల హృదయాల్లోనూ, సుస్థిరమైన స్థానాన్ని పొందిన మహిళా రచయిత్రి శ్రీమతి మాలతీ చందూర్ గారు. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఎందరో మహిళా రచయితలు రచనలు చేశారు.అలాంటి రచయిత్రులలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందిన రచయిత్రిగా, తెలుగు భాషకు, తెలుగు మహిళలకు పట్టాభిషేకం చేశారు. శ్రీమతి మాలతీ చందూర్ గారు.వీరు రచయిత్రిగా తెలుగు పాఠకులను, అభిమానులను మెప్పించే విధంగా వాళ్ల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించి ఆంధ్రదేశపు ఆడపడుచులను చైతన్య పరిచిన అగ్రగణ్యురాలు.ఈ రచయిత్రి పేరు నిజానికి మాలతి.కానీ అశేష పాఠక లోకానికి,సాహితీ ప్రపంచానికి మాలతీచందూర్ అనే పేరుతోనే పరిచయం అయ్యారు.

మాలతీ చందూర్ గారు కృష్ణా జిల్లాలోని నూజివీడు లో 1930 లో శ్రీమతి జ్ఞానాంబ, వెంకటేశ్వర్ల దంపతులకు ఆరుగురి సంతానంలో చిట్టచివరి సంతానంగా జన్మిం చారు. వీరి కలం ప్రమదావనంతో పరిచయమై తెలుగు సాహిత్య అభిమానులకు, పాఠకులకు అనేక రచనలు అందించింది.పాత కెరటాలు,జాబులు- జవాబులు, వంటలు - పిండివంటలు, అందాలు- అలంకారాలు, మహిళలకు మధుర జీవనం వంటివి మరియు శీర్షికా రచయిత్రిగా అనేక శీర్షికలతో తెలుగువారి ముందుకు వచ్చారు. ఈ విధంగా విభిన్న అంశాల శీర్షిక రచయితగా, తెలుగు లోకంలో ఎంతగా పరిచయమయ్యారో అలాగే ఒక కథా, నవలా రచయితగా కూడా పరిచయం అయ్యారు.

శ్రీమతి మాలతీ చందూర్ గారు 1955 నుండి దాదాపు 45 వరకు నవలలు రచించారు.అలాగే తమిళం నుండి కొన్ని నవలలను తెలుగులోకి కూడా అనువదించారు.వీరి రచనలు అన్ని సామాజిక స్పృహ కలిగినవే. సమాజంలోని స్త్రీల దయనీయ పరిస్థితి, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలను ఇతివృత్తంగా స్వీకరించి సాధారణమైన అంశాలను కూడా అసాధారణ ప్రతిభతో రాయడం మాత్రమే కాకుండా, విషయం చిన్నదే అయినా అందులో అనేకమైన కొత్త విషయాలను చెప్పడం వీరి రచనల్లోని ప్రత్యేకత. ముఖ్యంగా శ్రీమతి మాలతీ చందూర్ గారి నవలల్లోని మహిళల పాత్రలన్నీ పురుషా హంకారాన్ని ఎదిరించిన మహిళలు, పురుషాధిపత్యానికి బలయిన మహిళలు, సమస్యలను ఎదుర్కొని ధైర్యంగా నిలిచిన మహిళలు,ఆ సమస్యలను ఎదుర్కొనలేక ఆత్మహత్య చేసుకుని చనిపోయిన మహిళల పాత్రలు కూడా మనకు కనబడతాయి.

పురుషాధిపత్యానికి బలైన మహిళలు :-భారతదేశంలో కుటుంబ వ్యవస్థకు ఒక ప్రత్యేక స్థానం,గౌరవం ఉంది. తల్లిదండ్రుల ప్రేమ, మాతృత్వం, ఆడవాళ్లపై విధించే ఆంక్షలు,కట్టుబాట్లు ఇవన్నీ అతి సహజమైన అంశాలుగా మనకు కనిపిస్తాయి.కుటుంబానికి వివాహం పునాది వంటిది. కుటుంబం బండి వంటిది అయితే భార్యాభర్త లిద్దరూ రెండు చక్రాల వంటివారు వారిరువురి మధ్య పరస్పర సహకారం, ప్రేమాభిమానాలు, కుటుంబానికి మూలస్థంభాలు వంటివి. కానీ కుటుంబంలో పురుషు లకు ప్రాధాన్యం పెరిగింది. స్త్రీలు అంటే చులకన భావం అనేది ఏర్పడింది.ఈ విధంగా పురుషుల అహంకారానికి, దౌర్జన్యానికి బలైనవారు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్న మహిళల పాత్రలు కొన్ని మనం గమనించ వచ్చు.

**రాజలక్ష్మి :**

క్షణికం అనే నవలలోని ముఖ్యమైన పాత్ర రాజ్యలక్ష్మి. రాజ్యలక్ష్మికి తల్లిదండ్రుల చిన్న వయసులోనే చనిపోవడం వల్ల అన్నా వదినల దగ్గర పెరుగుతుంది.రాజ్యలక్ష్మి ఎక్కువగా చదువుకోలేదు.బి.ఏ చదివిన రమణారావుతో ఆమెకు పెళ్లి అవుతుంది. వీరిది ఉమ్మడి కుటుంబం. అత్తమామలు, విదవ ఆడపడుచు సుబ్బులు, రాజ్యలక్ష్మి దంపతులు అంతా కలిసి ఒకె ఇంట్లో ఉంటారు. విధవరాలైన సబ్బులకి ఆ ఊరిలోనే ఉంటున్న వీర్రాజుతో సంబంధం ఉంటుంది.సుబ్బులు కోసం రోజు వీర్రాజు రాత్రులల్లో ఇంటికి వచ్చేవాడు.

అలాగే ఒక రోజు అర్ధరాత్రి సబ్బులు కోసం వచ్చిన వీర్రాజును చూసి ఇంట్లో వాళ్ళందరూ దొంగ అనుకుని వెతుకుతుంటే, వీర్రాజు రాజ్యలక్ష్మి గదిలోకి వెళ్లి దాక్కుంటాడు. దురదృష్టవశాత్తు వీర్రాజు రాజ్యలక్ష్మి గదిలో కనిపించేసరికి ఇంటిలోని వారందరూ రాజ్యలక్ష్మిని తప్పు పట్టి ఆమెను నిందిస్తారు. వీర్రాజు సుబ్బులు కోసమే వచ్చానని ఎంత చెప్పినా పట్టించుకోకుండా రాజ్యలక్ష్మిని ఇంట్లో నుంచి బయటకి గెంటేస్తారు. సుబ్బులు నిర్వాకం తన తల్లికి తెలిసినప్పటికీ తన కూతురిని ఎక్కడ తప్పు పడతారో అని కోడలు కూడా తన కూతురు లాంటిదే అనే విషయాన్ని మరిచి రాజ్యలక్ష్మి పై నిందలు మోపి ఆవిడని బయటకు పంపడానికి కారకురాలు అవుతుంది.

నిరక్షరాస్యత, లోకం తీరు తెలియని అమయకురాలయిన రాజ్యలక్ష్మి తాను చేయ్యని తప్పుకు తనను తాను శిక్షించుకుంటుంది. ఏ కుటుంబం అయితే తను సర్వస్వమని భావించిందో ఆ కుటుంబమే ఆమె జీవితం అర్థాంతరంగా ముగిసిపోవడానికి కారణమవుతుంది.

పురుషాధిపత్యాన్ని ఎదిరించిన మహిళలు :- కుటుంబంలో కీలకపాత్ర వహించే మహిళ పురుషుని చే హింసించబడుతుంది. పురుషుడు బరువు బాధ్యతలను పట్టించుకోకుండా, మహిళ మాత్రం తన బాధ్యతలను నిరంతరం నిర్వర్తిస్తూనే ఉంటుంది.కుటుంబ పరిమితికి కట్టుబడి మహిళలు తాము అనుభవిస్తున్న బాధను, బయటకు చెప్పుకోలేక నాలుగు గోడల మధ్యే తమ బాధలను దాచేస్తున్నారు. మహిళల్లో ఎక్కువ శాతం మంది పరిస్థితి ఇలానే ఉంటుంది. కొందరు మాత్రమే తమకు జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా బయటకు తెలియ జేయగలగుతున్నారు. శ్రీమతి మాలతీ చందూర్ గారి నవలల్లోని స్త్రీ పాత్రలు పురుషాధిపత్యాన్ని ధైర్యంగా ఎదిరించి తమ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడం కనిపిస్తాయి.

**కమల :**

''జయ-లక్ష్మి'' నవలలోని పాత్ర కమల.తండ్రి దుర్మార్గుడు, ప్రతిదానికి తిడుతూ ఎన్నో ఆంక్షలు విధిస్తూ ఉంటాడు.తన మేనమామ అండతో స్కూల్ ఫైనల్ పాసై, ట్రైనింగ్ పూర్తి చేసి టీచర్ గా పనిచేస్తూ ఉంటుంది. కమల దురదృష్టం వాళ్ళ మేనమామ యాక్సిడెంట్లో చనిపోతారు. మామ చనిపోయిన తర్వాత తండ్రి దౌర్జన్యాలు చేస్తూ ఉంటాడు. మగవారితో ఎవరితో మాట్లాడకూడదు, మాట్లాడితే అనుమానంగా చూసి మానసికంగా హింసిస్తూ ఉంటాడు. తండ్రి మూడో పెళ్లి వాడికి ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించినపుడు కమల చాలా బాధపడుతుంది. తన తల్లి సహాయంతో విజిలెన్స్ హోమ్లో చేరి ఆ గండం నుండి బయట పడుతుంది. తరువాత కొంత కాలానికి ఆ హోమ్ లోనే పనిచేసే షణ్ముఖం అనే అతన్ని అందరి అంగీకారంతో కమల పెళ్లి చేసుకుని సంతోషంగా జీవితాన్ని కొనసాగిస్తుంది.తండ్రి దౌర్జన్యాలను, పురుషాహంకారాన్ని ధైర్యంగా ఎదిరించిన కమల ఆత్మరక్షణతో పాటు తన భవిష్యత్తును తానే నిర్ణయించుకుంటుంది. ఈ నవలలోని కమల పాత్ర మహిళలందరికీ ఆదర్శంగా నిలుస్తుంది.

సమస్యలను అధిగమించిన మహిళల పాత్రలు :- స్త్రీ పుట్టినపట్టి నుండి చనిపోయే వరకు ఇంటా, బయట, శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతూ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఉంటుంది. మహిళలు సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొని పరిష్కారం చేసుకోలేక వాటి నుంచి దూరంగా పారిపోవడము లేక ఆత్మహత్య చేసుకొని చనిపోవడము జరుగుతూ ఉంటుంది. కానీ కొంతమంది స్త్రీలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని వాటికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కునే వారు లేకపోలేదు. సమస్యలకు తాత్కాలిక సమాధానాలు కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను ఎన్నుకొని జీవించిన మహిళలు ఉన్నారు. ప్రతి స్త్రీకి చదువు అవసరం.

అక్షరజ్ఞానం ఉన్నట్లయితే ఎటువంటి సమస్యనైనా పరిష్కారం చేసుకోవచ్చని మాలతీ చందూర్ గారు తన నవలల ద్వారా సాహితీ ప్రపంచానికి, మహిళల చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు.

**వసంత :**

వసంత ''రాగరక్తిమ''అనే నవలలోని కథానాయిక. వసంత వాళ్ళ తల్లిదండ్రులు లలిత, శాస్త్రి గారికి మొత్తం ఆరుగురు సంతానం. అనసూయ, రామారావు దంపతులకు పిల్లలు లేకపోతే వసంతను పెంచుకుంటూ ఉంటారు. రామారావు దంపతులు వసంతను పట్టణంలో బాగా చదివిస్తారు. వసంత తల్లి ఎప్పుడైనా చూడడానికి వచ్చినపుడు ఆడ, మగ పిల్లల మధ్య భేదం చూపుతుంటే తట్టుకోలేక పోయి తన తల్లికి నచ్చచెప్పాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. వసంత అనసూయ దంపతుల దగ్గర బాగా

చదువుకొని ఎం.ఎ పూర్తి చేసి లెక్చర్ గా పని చేస్తూ ఉంటుంది. అనసూయ స్నేహితురాలు ఫ్యామిలీ డాక్టర్ జానకీబాయి మేనల్లుడైన ప్రభాకర్‌తో వసంతకు పెళ్లి చేయడానికి నిర్ణయం తీసుకుంటారు. ఆ సమయంలోనే వసంత తండ్రి శాస్త్రి గుండెపోటుతో మరణించడం వల్ల కుటుంబ బాధ్యతలు నిర్వర్తించవలసిన పెద్దకొడుకు పెళ్లి చేసుకొని, వేరే కాపురం పెట్టి, తల్లిని, తమ్ముడులను, చెల్లెల బాధ్యతలను పట్టించుకోవడం మానేస్తాడు. లెక్చర్ గా పని చేస్తున్నటువంటి వసంత ఆ కుటుంబాన్ని పోషించే బాధ్యతలు తీసుకొని తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వృద్ధిలోకి రాగానే తిరిగి అనసూయ, రామారావు దంపతులు దగ్గరికి చేరుకుంటుంది. తన కోసమే వేచి ఉన్న ప్రభాకరముతో వసంత పెళ్లి జరుగుతుంది. వసంత విద్యావంతురాలు కాబట్టి సమస్యలకు భయపడి పారిపోకుండా, వాటిని ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధిస్తుంది. తల్లిదండ్రులు విద్యావంతులైతే వారి పిల్లలు సంస్కారవంతులుగా ఉంటారు అనడానికి వసంత పాత్ర నిదర్శనం. కుటుంబంలోని మహిళా విద్యావంతురాలైనట్లయితే కుటుంబాన్ని ఎలా వృద్ధిలోకి తెస్తుందో ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

**ముగింపు :**

శ్రీమతి మాలతీచందూర్ గారి నవలలోని మహిళల పాత్రలు కుటుంబ జీవితానికి ప్రాధాన్యత ఇస్తూ, కుటుంబ పరిధికి కట్టుబడి జీవించేవిగా ఉంటాయి. అయితే ఆ పాత్రలు తమకంటూ సంఘంలో గౌరవ స్థానాన్ని సంపాదించుకోవడం కనిపిస్తుంది. అలాగే సంప్రదాయం పేరుతో తరతరాలుగా వస్తున్న కుటుంబ వ్యవస్థ స్త్రీల అభివృద్ధికి అడ్డంకిగా నిలవడం,ఆ అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొని నిలబడిన కొన్ని మహిళ పాత్రలను మనం గమనించవచ్చు.మరి కొన్ని పాత్రలు ఆ సమస్యలను అడ్డంకులను ఎదుర్కొనే ధైర్యం లేక ఆత్మహత్య చేసుకోవడం కూడా మనం చూడవచ్చు.అలాగే ఈవిడ నవలల్లోని స్త్రీ పాత్రలు స్వతంత్ర భావాలు, పోరాటపటిమ, స్పష్టమైన వ్యక్తిత్వం, సమాజంలోనూ, కుటుంబంలోనూ తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుని విజయం వైపు పయనించిన మహిళ పాత్రలు ఉన్నాయి. వీరి రచనల ద్వారా ఎంతో మంది మహిళలు తమ జీవితంలోని లోటుపాట్లను సరిదిద్దుకోగలిగారు. ప్రతిరంగంలోనూ పురుషులతో పాటు సమానంగా ముందుకు వెళ్తున్నారు. పురుషాధిక్యతకు అణిచివేయబడుతున్న మహిళలకు సహాయం అందించడం ద్వారా ప్రతి మహిళ ప్రగతి సాధిస్తుందని శ్రీమతి మాలతి గారి అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమతి మాలతీచందూర్ - నవలలు.
2. ఆనందలక్ష్మి - తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రణ.
3. మొదలి నాగభూషణ శర్మ - తెలుగు నవలా వికాసం.
4. బొడ్డపాటి వెంకట కుటుంబరావు - ఆంధ్ర నవలా పరిణామము.
5. కోడూరి శ్రీరామమూర్తి - స్వాతంత్ర్యానంతర యుగంలో తెలుగు నవల.

# వంటింటి సూర్యోదయాలలో స్త్రీల వెతలు

- డా॥. మురెడి శ్యామల, తెలుగు అధ్యాపకురాలు, పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), వడ్డేపల్లి, హనుమకొండ, తెలంగాణ.

స్త్రీ వాద కవిత్వం ప్రారంభమై, స్త్రీవాద దృష్టికోణం అలవడ్డాక తెలుగు సాహిత్యంలో వస్తువైవిధ్యం పెరిగింది. స్త్రీలు, స్త్రీలు పనిచేసే ప్రాంతాలు, స్త్రీల పనులు సాహిత్య వస్తువులయ్యాయి. ఆధునిక యుగంలో స్త్రీ పురుష అసమానతలు, లైంగిక వివక్షను జీవితంలో నలువైపుల నియంత్రిస్తున్న తీరును స్వీయానుభవం నుండి అర్థం చేసుకున్న కవయిత్రులు వాటిని విమర్శకు పెట్టి, కొత్త జీవిత సంబంధాలను నిర్మించుకోవాలని అకాంక్షిస్తున్నారు. అలా అకాంక్షించిన రచయిత్రుల్లో ఒకరు మందరపు హైమవతి. కలం ఎపుడు స్వేచ్ఛనే కోరుతుంది. అయినా కొన్ని సామాజిక, రాజకీయ ఒత్తిడులు ఆ స్వేచ్ఛకు అడ్డుపడతాయి. ఒక రచయిత దానిని ఎలా తట్టుకొని నిలబడతాడనేది ఆ రచయిత వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంటుంది. అది ఆ రచయిత రచన నాణ్యతను నిర్ణయిస్తుంది. కవి నిజాయితీగా, నిర్భయంగా తన భావాన్ని కవితల రూపంలో చెబుతాడు. నేను కూడా అలాగే రాసాను, రాస్తాను అంటుంది రచయిత్రి/ కవయిత్రి మందరపు హైమవతి.

ఈమె 1956 సం॥ ఫిబ్రవరి 18వ తేదీన విజయవాడలో జన్మించింది. భాషా ప్రవీణ చదివి, తెలుగు పండింతురాలిగా పని చేసింది. తండ్రి ప్రోత్సాహంతో 12వ ఏట నుండే కవితలు రాయడం మొదలు పెట్టి, ప్రకృతి గురించి, అమ్మ గురించి రాసింది. పెద్దయినాకొలది ఒక స్త్రీగా తన కవితా వస్తువు మారింది. సమాజంలోని స్త్రీలపై జరిగే దోపిడిని, అరాచకత్వాన్ని, వివక్షను, పరిష్కారం కాని అనేక సమస్యలను చర్చకు పెట్టే విధంగా రచనలు చేసింది.

ముఖ్యంగా స్త్రీల కోరికలను, కలలను, వేదనలను కవితల్లో చిత్రించింది. ఈమె కవితలు, తన వ్యక్తిత్వానికి దర్పణాలు. ఏ ఒత్తిడికి తల ఒగ్గదు. తన పరిశీలనా శక్తి, అనుభూతి, జీవిత దృక్పథం కొంత వేరుగా ఉంటుంది.

మందరపు హైమావతి మొత్తం మూడు కవితా సంపుటాలను వెలువరించింది. నిషిద్ధాక్షరి, వాన చినుకులు, నీలిగోరింట, రాతిచెయ్యి ప్రస్తుత కవిత నీలి గోరింటలోనిది. రచయిత్రి కవితల్లో నీలి కవితలే రాస్తాను, ద్విపాత్రాభినయం, నిషిద్ధాక్షరి, సంతకాలు చేద్దాం రండి, జాగ్రత్త! జాగ్రత్త!!, దు:ఖవనం, నిరవహతి పలు సర్పపరిష్వంగం మొదలైన కవితలు ప్రసిద్ధమయి, విశ్వవిద్యాలయాలలో పాఠ్యాంశాలుగా కూడా ఉన్నాయి. రచయిత్రికి అనేక పురస్కారాలు లభించాయి. గుమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, శ్రీశ్రీ పురస్కారం, సినారె అవార్డు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉగాది పురస్కారం, మరెన్నో సన్మానాలు, ప్రశంసాపత్రాలు లభించాయి.

సమాజంలోని సమకాలీన సమస్యలను చర్చకు పెడుతూ విశాలాంధ్ర పత్రికలో నాలుగు సంవత్సరాల పాటు 'వాన చినుకులు' పేర ఒక కాలంను, ప్రభలో రెండు సంవత్సరాలపాటు 'హరివిల్లు' అనే కాలంను, విశాలాంధ్రలో ప్రతి ఆదివారం 'వర్తమాన కాలం' అనే కాలంను రాసింది.

వంటిళ్లలో స్త్రీలు పడే బాధలు బయటకు కనబడకుండా, వినబడకుండా పితృస్వామ్య సమాజం వంటింటి చుట్టూ ఒక పరిధిని ఏర్పరిచింది. నేటి స్త్రీ కొంత వరకు భిన్న రంగాలలో నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ఆమె ప్రతిభ ఎలాంటిదైనా కాని, ఆమె ఎలాంటి సామాజిక హోదాలో ఉన్నా కాని 'వంట' తన కర్తవ్యం అన్న విషయం ఆమెను మరువకుండా చేస్తుంది. వంట పనిలో పడి మగ్గిపోతున్న స్త్రీల జీవితాలను, మందరపు హైమవతి

వంటింటి సూర్యోదయాలు కవితలో చిత్రించింది. ఈ కవితలోని సంఘటనలన్ని మనం నిత్య జీవితంలో ఎదుర్కొనేవే.

"ప్రొద్దున్నే లేవగానే / పొగలు కక్కే కాఫీ తాగుతూ
పేపరు చదవాలని నా చిరకాల వాంఛ
కలల శాలువా కప్పుకొని / నిద్రా దేవత కౌగిలిలో
ఇంటిల్లిపాది పరవశిస్తున్న వేళ / నేను మాత్రం కళ్ళు నలుముకొంటూ
కాలు పెడుతాను వంటింట్లోకి / నా సుందర సూర్యోదయాలన్నీ / వంటింటి ఆకాశంలోనే

అంటూ ప్రొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఆడవారి జీవితాలు వంటింటింకి ఎలా అంకిత మవుతాయో, అక్కడ స్త్రీలు ఎదుర్కొనే అనుభవాలు, వారికి ఉన్న చిన్న చిన్న కోరికలను కూడా తీర్చుకోలేని విధం మనకీ కవితలో కనిపిస్తుంది.

వంట పనులలో పడి మగ్గిపోతున్న స్త్రీల జీవితాలను, చైతన్యవంతం కావాలన్న వారి కోరికలను, సమాజంలో గుర్తింపు పొందాలన్న స్త్రీల ఆకాంక్షలను చిత్రిస్తుంది. ఈ కవిత.

కవయిత్రి లింగవివక్షను ప్రస్తావిస్తూ

"ఇల్లు పట్టించు కోని వాళ్ళు...
సంఘ సేవకులుగా కీర్తింపబడుతున్న వేళ / .....
వంటింటి చెరసాలలోనే మగ్గిపోతూ
నిగమశర్మ అక్కలా మిగిలిపోతున్నారు..."

అంటూ తన ఆవేదనను, ఆక్రోశాన్ని వెలిబచ్చుతుంది.

వంట పని వలన స్త్రీల ప్రతిభ, భావుకత మరుగున పడుతున్నాయి. పూర్తిగా వంటింటికే పరిమితమవు తున్నారు. అందువలన వాళ్ళు మాట్లాడే మాటలు వంటింటి ముచ్చట్లుగానే మిగిలిపోతున్నాయి.

ఈ కవితలోని మరో అంశం పనికి తగిన గుర్తింపు లేకపోవడం.

"నా శాయశక్తులా సమయమంతా వెచ్చించి/ వంట చేసి వడ్డించినా
చేస్తావుగానీ మా అమ్మ చేతి వంటను మరిపించలే'
వనే అభిప్రాయ ప్రకటనతో నేనొక దిగులు పిట్టను"

అంటూ కవయిత్రి తన మనోవేదనను తెలియ జేస్తుంది.

చిన్న చిన్న పొరపాట్లు జరగడం మానవ సహజం. వంటల్లో ఎపుడైనా అలాంటివి జరిగితే కుటుంబ సభ్యుల నుండి ఎదురయ్యే అవమానాలు, ఛీత్కారాలు స్త్రీని మానసిక క్షోభకు గురిచేస్తున్నాయి.

నేటి తరం స్త్రీలు తమ బాధలకు కారణాలను గుర్తించగలుగుతున్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం కలలు కంటున్నారు. వారి ఆలోచనలు చైతన్యవంతమవుతూ 'వంటింటి తనం' వలన తాము కోల్పోతున్న సృజనాత్మక ప్రతిభను వెలికి తీసుకుంటూ విభిన్న రంగాలలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వంటింటి చాకిరీలో ఆరోగ్యాన్ని కోల్పోతున్న స్త్రీలు వంటింటి మీద నిరసన వ్యక్తం చేయాలంటూ కవయిత్రి ఈ కవితలో పూర్ణమ్మ, బుచ్చమ్మల బ్రతుకు కన్నీటి చిత్రాలు చిత్రించి నందుకు, గాక సామూహిక వంటశాలలు నిర్మించాలని "ఒక చిన్న మాట రాసిన గుఱజాడ చేతిపై ఒక చిన్న ముద్దు పెట్టాలని నా కోరిక" అంటూ తన ఆకాంక్షను తెలియజేస్తుంది.

ఈ కవితలో స్త్రీలు వంటింటి పరిధిని దాటి సామాజిక జీవితంలోనికి రావాలని ప్రయత్నిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ స్త్రీల కోరికలను, కలలను, వేదనలను తన కవితల్లో చిత్రించింది కవయిత్రి.

ఈ కవిత విమర్శలాగా పెద్దగా సాగినా, ఉపమానా లను పదే పదే ప్రయోగించిన, కవయిత్రి వంటచాకిరి మీద నిరసన వ్యక్తం చేసిన విధానం బాగుంది.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రామభద్రాంబ జీవితం - సాహిత్యం

- యస్. విద్యాసాగర్, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు, కర్నూలు జిల్లా.

విజయనగర సామ్రాజ్యం అష్టదిగ్గజకవిపండితులతో సాహితీ స్వర్ణయుగం విలసిల్లిన తరువాత దక్షిణ భారత దేశంలో మళ్ళీ ఆస్థాయిని అందుకున్నది ఒక్క నాయక రాజుల కాలంలోనే అని చెప్పక తప్పదు. అయితే విజయ నగర సామ్రాజ్యంలోని అష్టదిగ్గజాల్లో మహిళా మణులు లేరు, కానీ తంజావూరు నాయకరాజుల కాలంలో మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేశారని, వారి కాలంలో వచ్చిన సాహితీ గ్రంథాలను, గ్రంథ కర్తలను చూస్తే మనకు అవగతమవుతుంది. రఘునాథనాయకుడు తంజావూరు నాయకరాజులలో సుప్రసిద్ధులు. ఆయన ఆస్థానంలో ప్రముఖ కవయిత్రిగా పేరుగాంచిన ఒక మహోన్నత వ్యక్తి రామభద్రాంబ.

ఈమె తంజావూరు రఘునాథనాయకున్ని తన పతిగా భావించి, రచనలు చేసింది. ఈమె వివరాలు సాహితీ లోకంలో అంతగా కనిపించవు. కానీ ఈమె గురించి సాహితీ జగత్తులో వారకాంత అని ప్రచారం కోకొల్లలుగా చేసినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. అయినా సాహితీకోణంలో ఈమెను అంచనావేసే ప్రయత్నం చేయడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

"రాజగోపాల విలాసము" రాసిన చెంగల్వ కాళయ, రామభద్రాంబ గురువు అని సాహితీ లోకంలో ప్రతీతి. ఈమె అష్టభాషా ప్రవీణురాలిగా సాహిత్యకారులతో కీర్తించబడింది. తాను రాసిన రఘునాథాభ్యుదయంలో ఈమె గురించిన వివరాలు ఒక గద్యలో వ్యక్తీకరించింది.

"ఇతి శ్రీరామభద్ర కరుణా కటాక్ష లబద్ధసారస్వత ప్రవర్ధమాన
శతలేఖినీ సమయలేఖినీ యాష్టభాషా కల్పిత చతుర్విథ కవితాను
ప్రాణిత సాహిత్య సామ్రాజ్య పదపీఠారూఢ రామభద్రాంబా
విరచితే రఘునాథాభ్యుదయే మహాకావ్యే ద్వాదశస్సర్గస్సమాప్తః"

"శ్రీరామచంద్రమూర్తి కరుణా కటాక్షమున రామ భద్రమ్మ కవిత్వము చెప్పనేర్చినది. ఆమె శతలేఖినీ విద్యయందును, సమయ లేఖినీ విద్యయందును చదురాలు. సంస్కృతము, ఆంధ్రము, ఆరు ప్రాకృతములు - ఈ ఎనిమిది భాషలందును చతుర్విద (గర్భ, బంధ, చిత్ర, ఆశు) కవిత్వము చెప్పగల ప్రజ్ఞాధురీణ అగుటచే ఆమె సాహిత్య సామ్రాజ్య పదపీఠారూఢ". ఈ గద్యవల్లనే ఆమె సంస్కృతాంధ్రాది అష్టవిధ భాషల యందు అభిజ్ఞురాలని తెలుస్తోంది. ఈమె సంస్కృత భాషా వైదుష్యానికి రఘునాథాభ్యుదయం ఒక ప్రబల నిదర్శనం.

విజయనగర కాలంలోని గంగాదేవి ఆమె భర్త వీరవిక్రమాలను, విద్యావినోదాలను కీర్తిస్తూ రాసిన "వీరకపంరాయ చరిత్రము" రాసిన విధంగానే రామ భద్రాంబ కూడా రఘునాథనాయకుని గురించి, ఆయన పరాక్రమాలను గురించి సంస్కృతంలో ఎంతో అద్భుతంగా వర్ణిస్తూ ఈ కావ్యాన్ని తీర్చిదిద్దింది. ఈ కావ్యం గురించి ప్రముఖ సాహితీ పరిశోధకులు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు "ఇందులో తొమ్మిదివందల శ్లోకములు కలవు. తృతీయ, దశమైకాదశ సర్గాంతములలో శార్దూల, మాలిని వృత్తములు, ద్వాదశమున స్రగ్దరయు గలవు. తక్కిన భాగములయందెల్ల రఘువంశమువలె నొకే వృత్తము వాడబడినది" అని ఈ కావ్యంలోని శ్లోకాల గురించి, వాటి సంక్యను గురించి, అందులో వాడబడిన వృత్తపద్యాల గురించి వివరించారు.

ప్రథమ సర్గలో రామభద్రాంబ రఘునాథనాయకుల కవితా శక్తిని, స్త్రీ విద్యాప్రియత్వాన్ని చాలా అద్భుతంగా

వర్ణించింది. ఇందులో రఘునాథనాయకుడు క్షణానికి నూరు సమస్యలు పూర్తిచేయగల సమర్థుడుగా, లోకంలో విభిన్నమైన మనస్థత్వాలు కలిగిన వ్యక్తులగురించి తెలుసుకొని, వారిని అంచనా వేయగల సమర్థుడిగా కీర్తించింది. చెప్పుకోవడానికి కొంత అతిశయోక్తి అనిపించినా, తాను అత్యంత ఆరాధించే నాయకున్ని, కావ్య నాయకునిగా చేర్చడం వల్ల అక్కడక్కడ మనకు అతిశయోక్తి అనిపిస్తుంది. అందుకే

"చింతా సమస్యా శతమేకదైవ
తత్కీర్తి వార్తానహి వర్ణనీయా
అశేష లోకాశయవృత్త భేద
ప్రస్తార విద్యా ప్రథితస్య యస్య
అన్త:పురాన్తర్హరిణేక్షణాసు
త్రిహాయణీ నామపి దీప్య మానాన్
విలోక్యవిద్యావిభవా నజస్రం
వశం వదాం యస్య వదంతి వాణీమ్"

అని వర్ణించింది. రఘునాథనాయకుని వంశవృక్ష వివరణం, ఆ తరువాత రఘునాథనాయకుడు యువ రాజుగా ఉంటూ సాధించిన పరాక్రమాలను, రాచకార్యాలను ఈ కావ్యంలో వరుస క్రమంలో వివరించింది. పెనుగొండ రాజధానిగా విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్న వేంకటపతిరాయలు గోల్కొండ నవాబులతో చేసిన యుద్ధంలో రఘునాథరాయలు విజయనగర సామ్రాజ్యం పక్కన నిలిచి, వారి విజయంలో కీలకంగా వ్యవహరించాడని, తుండీర మండలాధిపతి అయిన కృష్ణప్ప నాయకున్ని వేంకటపతి రాయల చెరనుండి విడిపించి, కృష్ణప్ప నాయకుని సోదరిని వివాహం చేసుకున్నాడని ఈ కావ్యంలో వర్ణించింది. మరోవైపు చంద్రగిరిలో రాజద్రోహి అయిన జగ్గరాయలను జయించి, అసలు రాజైన రామరాయలను సింహాసనంపై తిరిగి కూర్చోబెట్టిన ఘనత కూడా రఘునాథనాయకునికి దక్కుతుందని రామభద్రాంబ తన కావ్యాంలో పేర్కొంది.

రఘునాథాభ్యుదయం కావ్యంలో ఏకాదశ, ద్వాదశ సర్గలలో రామభద్రాంబ తన రాజైనటువంటి రఘునాథనాయకుని విద్యా వినోదాలను గురించి వివరంగా వర్ణించింది.

"సుగంధి చూడార్పిత సూనమాలికా
వలీమిలిందారవ వన్ది నిస్వన:
విశామధీశో విజయోత్తరం తత:
ప్రమోదమానో భవనం సమాసదత్"

అంతేకాకుండా

"మహీభుజాం తన్మణిజాలకాంతికే
సహస్రధా మూర్తి యతీవ శారదా
అశేష విద్యావిభవాభి లక్షితా:
సహర్ష మేక్ష్యంతి సరోజలోచనా:

అంటూ, ఆ సభలో ఎంతోమంది సరస్వతీ కటాక్షం కలిగిన అశేష విద్యావిభవాభిలక్షితలు అయి, ఆ భవనము నందు ఉన్న విదుషీమణులు, ఆ రాజుని సహర్షముగా సమీక్షణ చేసారంటూ, రఘునాథనాయకుని కొలువులో చాలామంది విదుషీమణిరాళ్ళు ఉన్నారన్న విషయాన్ని ఈ గ్రంథం ద్వారా తేటతెల్లం చేసింది. కొలువులో ఉన్న విదుషీమణులతో రఘునాథనాయకుడు విద్యావినోదాలపై సదస్సు జరిపాడంటూ అక్కడ కొలువులో జరిగిన విషయాలన్నింటినీ పూసగుచ్చినట్లు వర్ణించింది.

ఒక్క సాహిత్యం మాత్రమేకాదు, సంగీతంలోకూడా రఘునాథనాయకుని ఆస్థానంలోని విద్వాంసురాళ్ళు దిట్టలని పేర్కొనింది. అంతేకాకుండా వారు వాడే సంగీత సాధనాలైన "వీణ, హృత్కవిలలు, రావణహస్తము" మొదలైన వాటితో వారు మృదుమధుర గాణం చేశారంటూ వర్ణించింది. సంగీత సాహిత్యాలో ఈ విదుషీమణుల పాండిత్యాన్ని పరీక్షించి రఘునాథరాయలు వీరికి కనకాభిషేకం చేశాడని ఈ కావ్యంలో అక్షరీకృతం చేసింది. ఈ వర్ణనలను బట్టి రఘునాథరాయల ఆస్థానంలో సంగీత సాహిత్యాలలో అపర సరస్వతులు అనదగినవారు అనేకమంది ఉన్నారని, వారు రాజు ప్రశంసల్ని, సన్మానాల్ని

అందుకొన్నారని రామభద్రాంబ కావ్యాన్ని బట్టి మనం అవలోకించుకోవచ్చు.

అయితే రామభద్రాంబ కేవలం సంస్కృత భాషలో రాసిన రఘునాథాభ్యుదయం ఒక్కటేనా, ఇంకేభాషలోనూ రచనలు చేయలేదా అంటే, చేసినట్లుగా చెప్పే కొన్ని పద్యాలు మనకు కనిపిస్తాయి. అయితే పూర్తిస్థాయి రచనలు ఇంకా లభ్యం కావాల్సి ఉంది. నాయక రాజుల కాలంలో తెలుగు భాషలో గొప్ప కవయిత్రి అయిన కృష్ణాజీతో సమానంగా రామభద్రాంబ కూడా కవిత్వం చెప్పగలదు అని రఘునాథనాయకుడు చెంగళ్వకాళకవిని ఉద్దేశించి అన్నట్లుగా చెప్పిన పద్యం సాహితీ క్షేత్రంలో మనకు కనిపిస్తుంది.

"అయ్యదినముల రామభద్రాంబవారు
నేడు కృష్ణాజి కవితచే నేర్పు మెఱ సి
కవిత సేయుట లెల్ల మీ ఘనతకాదె
కవివినుతచర్య! చెంగల్వ కాళనార్య!"

అని చెప్పడాన్ని బట్టి చూస్తే, తెలుగు భాషలో కూడా ఈమె అసామాన్యంగా కవిత్వం చెప్పగల దిట్ట అని రాజు ఆమె గురువును ప్రశంసించడాన్ని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

అంతేకాకుండా రఘునాథనాయకుడి కుమారుడైన విజయరాఘవనాయకుడు "రఘునాథాభ్యుదయం" యక్షగానంలో తన తండ్రి కాలంలో జరిగిన విద్యా వినోదాలు, కవయిత్రులు చేసిన సమస్యా పూరణాలు మొదలగు వాటిని వివరించాడు. దీన్ని బట్టి చూస్తే రఘునాథనాయకుని కాలంలో సాహిత్యంలో స్త్రీల ప్రాధాన్యత కనిపిస్తుండగా, రామభద్రాంభ రాసిన రఘునాథాభ్యుదయం సంస్కృత కావ్యంలో చెప్పిన ఉదాహరణలు దీనికి ఆధారంగా నిలుస్తున్నాయి.

"వేశ్యాంగన అనియు, ఈమె రఘునాథరాయల యుంపుడుకత్తె అనియు ప్రతీతి కలదు. తన కావ్యమున రఘునాథుని ఐదుగురు భార్యల పేర్కొని తన్ను పేర్కొనక పోవుటచేతను, పై శ్లోకమున రఘునాథుడు తన నాథుడని చెప్పుట చేతను ఈమె ఆయన ఉపస్త్రీ కానగునని ఊహింపవచ్చును. ఉపస్త్రీ ఐనను విద్వాంసురాలగుటచే ఈమెను అతి గౌరవభావముతో ఆనాటివారు చూచినట్లు కన్పట్టుచున్నది. రఘునాథరాయల కుమారుడు విజయరాఘవనాయకుడు ఈమెను 'రామభద్రమ్మవారు' అని గౌరవపూర్వకముగా పేర్కొనినాడు." అని శ్రీ కురుగంటి సీతారామయ్యగారు అన్న మాటలు రామ భద్రాంబ సాహితీ పటిమను మనకు కళ్ళముందు నిలుపు తుంది. వారాంగనగా ఆనాటి సమాజం ఆమెను భావించినా, సాహితీపటిమతో అందరి ఆదరాభిమానా లను ఆమె సొంతం చేసుకొందని చెప్పడానికి, దక్షిణాంధ్ర యుగ సాహిత్యంలో అమేయ సాహిత్య శక్తి సంపన్నురాలన డానికి ఎలాంటి సందేహం లేదు. సాహితీ విద్వత్తు వల్ల ప్రకాశించే నిత్య శోభితురాలు రామభద్రాంబ అని ఈ సందర్భంగా భావిస్తున్నాను. రంగస్థల పద్యనాటకాలకు నెలవైన రాయలసీమలో 1926 నుండే శ్రీ సాధన పత్రికలో ఆధునిక స్పృహతో, సమకాలీన సమాజ పరిస్థితులకు అద్దంపట్టే రీతిలో నాటికలు, ఏకాంకికలు వెలువడినాయి. అప్పటికి రాయలసీమలో వెలువడిన ఇతర పత్రికలలోనూ నాటికలు ప్రచురించి ఉండవచ్చు. కానీ ప్రస్తుతానికి లభిస్తున్నంతలో సాధన పత్రికలో ప్రచురించిన ఈ నాటికలు, ఏకాంకికలు, సంభాషణలు ఆధునిక సాహిత్య ప్రక్రియలలో సీమ భాగస్వామ్యాన్ని తెలియజేస్తాయి. అవి ఆనాటి రాయలసీమలోని సామాజిక ఇతివృత్త చిత్రణలను ఏ విధంగా ప్రతిబింబిస్తాయో వివరించడం నా పత్రం యొక్క ప్రధానోద్దేశ్యం.

నాటకం కంటే నాటిక చిన్నది. నాటిక కంటే ఏకాంకిక చిన్నది. నాటిక, ఏకాంకికలను ఒకే అర్థంలో నేడు సంబోధిస్తున్నా, వీటిమధ్య తేడాఉంది. నాటిక- రెండు మొదలు ఐదు రంగాలుగా, గంట కాలానికి తక్కువ కాకుండా ప్రదర్శితమవుతుంది. ఏక నాయకుడు, ఏక వస్తువుతో కూడి ఉంటుంది. స్థల, కాలైక్యం విధిగా

పాటించనక్కరలేదు. ఏకాంకికను ఆంగ్లంలో 'వన్ యాక్ట్ ప్లే' అంటారు. ఒక రంగంతో ఇరవై నుండి నలభై అయిదు నిమిషాలలోపు ప్రదర్శితమవుతుంది. ఏక నాయక, ఏక వస్తువు, స్థల కాలైక్యాలతో కూడి ఉంటుంది. సంక్షిప్తత ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. సమకాలీన సమాజంలోని పరిస్థితులను వైవిధ్యంగా పాఠకులకు అందించే ప్రయత్నంలో నాటికలు, ఏకాంకికల కన్నా తక్కువ నిడివిగల, ప్రదర్శనకు వీలుకాని సంభాషణా రచనలను కూడా ఒక ప్రత్యేక ప్రక్రియగా పరిగణించవచ్చు. రచయితలు వ్రాసే ప్రతి నాటిక, ఏకాంకిక ప్రదర్శనా నుగుణమైనవని చెప్పలేం. అందరూ ప్రదర్శనీయం కావాలని వ్రాస్తారు. కానీ ఆయా ప్రాధాన్యాలనుబట్టి, ప్రదర్శనానుకూలతనుబట్టి, కొన్నే వేదికపైకి వస్తాయి. వేదికలమీద ప్రదర్శించనంత మాత్రాన అవి నిష్ప్రయో జనాలని అనుకోరాదు. సాహిత్యపరంగా వాటి విలువ వాటికి ఉంటుంది.

1929 నుండి తెలుగు నాటికల ఇతివృత్తంలో, సంవిధానంలో కొత్త ప్రయోగాలు జరిగాయి. 1930లో పి.వి. రాజమన్నార్ 'తప్పెవరిది' నాటికతో తెలుగు నాటికా సాహిత్యం నూతన అధ్యాయం ప్రారంభమైంది. భమిడిపాటి 'బాగు... బాగు, 'కచటతప', చలం వారి 'భానుమతి, సావిత్రి, సీత అగ్నిప్రవేశం', ముద్దుకృష్ణ వారి 'అనార్కలి, అశోకం, టీ కప్పులో తుఫాను', చింతా దీక్షితుల వారి 'శర్మిష్ఠ, తుదిపలుకు', శ్రీపాదవారి 'కలంపోటు', నోరి నరసింహశాస్త్రి వారి 'స్వయంవరం', బుచ్చిబాబు వారి 'తిష్యరక్షిత', జి.వి. కృష్ణారావు వారి 'బిక్షాపాత్ర', పాలగుమ్మి వారి 'ఖూనీ', నార్ల వెంకటేశ్వర రావువారి 'కొత్తగడ్డ' (1947) మొదలైన నాటికలు తెలుగు నాటికా సాహిత్యానికి దిశానిర్దేశం చేశాయి.

నాటికలను దృశ్య రూప నాటికలు, శ్రవ్య రూప నాటికలని రెండు రకాలుగా విభజించవచ్చు. దృశ్యరూప నాటికలలో ఆయా పాత్రల హావభావాలను కళ్లేదుట చూడటానికి, సంభాషణలను నేరుగా వినటానికి వీలుంటుంది. శ్రవ్య రూప నాటికలు కేవలం వినడానికి మాత్రమే వీలుంటుంది. వీటినే 'రేడియో నాటికలు' అని కూడా అంటారు. ఆయా పాత్రల మాటలను మాత్రమే విని విషయాన్ని అర్థం చేసుకోగలం. నృత్యానికి అనుగుణ మైన నాటికలు ఉన్నాయి. దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా వెలువడనప్పటికీ- సమకాలీన సమాజం గురించి నాటికలు, ఏకాంకిల కంటే తక్కువ నిడివిగల సంభాషణా రచనలు పత్రికలలో ప్రచురితమవుతుంటాయి. వీటిని చదవటం ద్వారా మాత్రమే తెలుసుకోగలం. వస్తుపరంగా నాటికలను సామాజిక, రాజకీయ, పౌరాణిక తదితరాలుగా విభజించవచ్చు. సమకాలీన సమాజంలో జరిగే పరిణామాల గురించి, ప్రజలకు అవసరమైన అంశాల గురించి అందరికీ అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా నాటికలు, ఏకాంకికలు వెలువడడం ఒక సామాజిక అవసరం అయింది. 1920ల నుండి ఆంగ్ల సాహిత్య ప్రభావంతో- తెలుగు సాహిత్యంలో నాటిక, ఏకాంకిక ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. తొలి దశలో ప్రభుత్వ పథకాల ప్రచారంలో, పాఠశాలల్లో జరిగే ఉత్సవాల సందర్భాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో చిన్న నాటికలను ప్రదర్శించేవారు. 1930ల నుండి సాహిత్యంలో ఒక ప్రక్రియగా నాటిక, ఏకాంకికలు నిలదొక్కుకున్నాయి. 1912లో ద్వితీయ ముద్రణ పొందిన 'డ్రామాస్ ఇన్ సివిక్' అనే సంపుటంలో సర్వారాయుడు రచించిన 'గ్రామ కచేరి' అనే ఏకాంకిక- లభ్యమవుతున్న వాటిలో తొలి తెలుగు స్వతంత్ర ఏకాంకికగా చెప్పవచ్చు. 1920 నుండి భారతి, శారద, 1926 నుండి శ్రీ సాధన తదితర పత్రికలు నాటికల ప్రచురణకు కృషి చేశాయి. 1928లో ఇబ్సన్ నాటకోత్సవాల ప్రభావంతో ప్రపంచ నాటక చరిత్రలో నూతన శకం ప్రారంభమైంది. సమకాలీన, ఆర్థిక, సామాజిక పరిస్థితులను నాటికలలో ప్రతిబింబింప చేయడంలో ఇబ్సన్ ప్రభావం ఉంది. తెలుగు నాటికా సాహిత్యం కూడా ఆ ప్రభావానికి లోనైంది.

'స్వాతంత్ర్య పోరాట వీరుల విజయం- ఓట్ల నాటకం'

1926 అక్టోబనరు 23న 'ఓట్ల నాటకం' అనే నాటిక శ్రీసాధన పత్రికలో ప్రచురితమైంది. మద్రాసు శాసనసభకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో- 'శ్రీమతి అనంతపురి' అనే స్త్రీ, పోటీలోఉన్న ఐదుగురు అభ్యర్థులలో ఎవరిని వరించినదన్న ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది. ఎన్నికలలో అభ్యర్థులైన కేశవ పిళ్లై, తోపుదుర్తి నారాయణ రెడ్డి, చిన్నపొలమడ ఓబిరెడ్డి, చీమలవాగుపల్లి బత్తిని నారాయణరెడ్డి, గార్లదిన్నె రామేశ్వరరావు తమ అభ్యర్థన లను, ఆలోచనలను అనంతపురి స్త్రీకి తెలియ జేసి, శాసనసభకు ఎంపికయ్యేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతారు. అంతిమంగా అనంతపురి దేశ ప్రయోజ నాల దృష్ట్యా స్వరాజ్య పార్టీ అభ్యర్థులైన ఓబిరెడ్డి, బత్తిని నారాయణరెడ్డిలకు విజయం వరింపజేస్తుంది. ఈతూరికి నాటకం ముగిసినది, ఇంకా మూడేండ్ల వరకు నిశ్చింతంగా నుండగలను. ఈ రెడ్డి యువకులు నా భక్తులనియే నమ్మెదను, చూచెదను గాక' అని అనంతపురి అనడంతో నాటిక ముగుస్తుంది. పూర్వరంగం, ఉత్తరరంగం రెండు భాగాలుగా ఈనాటిక ఉంది. ఆనాటి ఎన్నికల నేపథ్యంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న స్వరాజ్య పార్టీ అభ్యర్థుల గెలుపును ఈ నాటిక సూచిస్తుంది.

'స్త్రీలను చైతన్యపరచిన - స్త్రీ విద్య'

1926 నవంబరు 20న ప్రచురించిన 'స్త్రీవిద్య' అనే సంభాషణాత్మక సన్నివేశాన్ని కదిరి వాసి వి.ఖండేరావు వ్రాశాడు. కమల, విమల, శకుంతల, సుమాల్య మొదలగు తదితర పాత్రల ద్వారా సంభాషణ నడు స్తుంది. సాంప్రదాయ భావజాలం గల అవ్వకు- కమల అనే మనవరాలు ఉంటుంది. అవ్వ ప్రభావంతో చదువు విషయంలో కమల శ్రద్ధ వహించక అనాసక్తిగా పాఠశాలకు వెడుతుంటుంది. స్నేహితురాలైన విమల చదువు గొప్పతనాన్ని గురించి కమలకు చెబుతూ 'విద్య ఉద్యోగములు చేయుటకేగాదు, మానవజన్మ ఎత్తి నందుకు జ్ఞానమార్జించుట మనకు విధిగాయున్నది. అట్టి జ్ఞానము ముఖ్యంగా స్త్రీలకే ఆవశ్యము. వారు గదా బిడ్డలను బాల్యమునుండి పెంచెదరు. ఇప్పుడు మన దేశంలో బాలురు బడికు వెళ్ళు సమయమున వారికి జ్ఞానరీతి యందు ఎలాంటి శోధన లేనందున దేశము క్షీణించుచున్నది. తల్లి జ్ఞానవంతురాలైన ఖండితముగా బిడ్డలు గొప్పవారగుదురు' అని తెలియజేస్తుంది. మరో స్నేహితురాలైన శకుంతల ప్రవేశించి ఐరోపా ఖండంలో స్త్రీలు విద్యావంతులవుట వలన జరుగుతున్న ప్రయోజనా లను తెలియజేస్తుంది. దగ్గరలోనే శకుంతలకు పెళ్ళిచేసే ప్రయత్నం తల్లిదండ్రులు చేస్తుండడంవలన విద్యకు దూరమవుతానేమోనని ఆమె చింతిస్తుంది. స్త్రీలు చదువు కొనేందుకు తోడ్పాటు తక్కువగా ఉందని, ఆడపిల్లలకు బాల్యవివాహాల కారణంగా చదువుకోవడం సాధ్యంకాదని తన అభిప్రాయాలను చెబుతుంది.

ఈ మాటలను విన్న కమల 'అందుకే మన కెందుకే ఈ చదువంతా' అని విమలను ఎత్తిపొడుస్తుంది. మరో స్నేహితురాలు సుమాల్య వీరిని కలుస్తుంది. స్త్రీ విద్యపట్ల వ్యతిరేకంగా మాట్లాడుతున్న కమలకు కనువిప్పు కలిగేలా తెలియజేయమని విమల సుమాల్యను కోరుతుంది. ఈ సందర్భంలో సుమాల్య విద్య ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ 'లోకంలో స్థూల దేహమును పెంచుటకు ఆహారం ఏవిధంగా ఆవశ్యకమో ఆ రీతిగానే జ్ఞానదేహమును వృద్ధిపరచుటకు విద్యయను ఆహారం అత్యంత ఆవశ్యకము. సాధారణంగా చదువుకున్నవారు తమ విద్యకు తగిన బుద్ధియు, సత్ప్రవర్తనము గలవారయి, ఏదో యొక విధమున గౌరవముతో జీవనం చేయుదురు. ఉద్యోగములలో స్త్రీలు చేరనంత మాత్రాన ఫల నిమిత్తమున నాటిన ఫలవృక్షములు నీడనిచ్చుట మొద లగు ఇతర పనులకు ఉపయోగించులాగున, తెలివి తేటలకేర్పడిన చదువు సహితము ఇతరా కార్యములకు కూడా నుపయోగించును. జ్ఞానాభివృద్ధికి హేతుభూతమైన విద్య పురుషులకెట్లో స్త్రీలకునట్లే పరమ ప్రయోజనకర మైనదిగా నుండుననుటకు సందేహము వలదు. స్త్రీ విద్య దేశంలో ననాది సిద్ధముగా నున్నది. గానీ ఈ నడుమ

కొత్తగా నెక్కడినుండియో వచ్చినదిగాదు. స్త్రీ రత్నములు విద్యలేక సానవట్టని పాతమాణిక్యములవలె ప్రకాశరహితమై యున్నారు. పురుషులతో పాటు స్త్రీలును విద్యగరిచిరేని 'బుద్ధిశ్చాపి చతుర్గుణా' యను సూక్తి సార్థకము చేయకుందురా. వేదములలోను, పురాణాల యందును చదువుకున్న పొలతులు ఎన్నో ప్రయోజనకర మైన పనులు చేశారు.

తల్లుల గుణశీలములు సులభముగా బిడ్డలకు వచ్చునని శాస్త్రజ్ఞులు వక్కాణింతురు. అందువలన స్త్రీలు కూడా సకల విద్యలనభ్యసించి సద్గుణ సంపద నార్జింపవలయును. ఏలయన మగబిడ్డ లెపుడును తమ జననీ జనకుల యొద్దనే యుండదగినవారు. ఆడబిడ్డ లన్నవో ఎప్పుడైననూ వేరొక ఇల్లు చేరవలసినవారేగానీ పుట్టినింటనే కలకాలం ఉండ తగినవారుకారు. కావున పెంచినవారికి అపఖ్యాతి రాకుండుటకై వారి నత్తవారింటికి పంపుకాలము రాకమునుపే ప్రియపుత్రికల నుత్తమ గుణములు గలవారిగాను, తెలివిగలవారినిగాను చేసి మరీ పంపవలెను. మొదట సుగుణములను బోధించి జ్ఞానవంతసుంద్రుగా చేయక సంసార సాగరము నీదుటకై తమ పుత్రికలను పురుషుల గహములకు పంపు తల్లిదండ్రులు ఈత నేర్వనివారిని మహాసముద్రమున ద్రోచి వారు కొట్టుకొనుచుండగా కన్నుల గాంచుచూ పిదప పశ్చాత్తాపులైయ్యునూ, ఏమియూ చేయనేరక నింద పొందువారివలనే తామునూ పిమ్మట నపకీర్తిపాలై పారములేని దుఃఖాంబుధిని ఈదవలసివారగుదు'రని ఆడపిల్లలను తప్పక చదివించాలని సుమాల్య తెలియ జేస్తుంది. ఇదంతా విన్నతరువాత విమల, కమలను ఇప్పుడేమంటావని అడగగా 'నేనేమని చెపుదూ, మాట లాడుటకు సిగ్గుచున్న'దని విమల తెలపడంతో నాటిక ముగుస్తుంది. ఈ నాటిక స్త్రీ విద్య ఆవశ్యకత మూలాలను తెలియజేస్తుంది. యువతులు సంప్రదాయ భావాల నుండి, ఆటంకాలనుండి బయటపడి విద్యను అభ్యసిస్తే కుటుంబానికి, సమాజానికి మేలు జరుగుతుందని తెలియజేస్తుంది. 1926 నాటికే స్త్రీ విద్య అవసరాన్ని నాటిక ద్వారా తెలియజేసి వారి అభ్యున్నతిని కోరుకున్న ఖండేరావు అభినందనీయుడు.

కల్లు సారాయిలను పారద్రోలాలనే 'కల్లుపెంట'

1931 జూలై 25న పప్పూరు రామాచార్యులు వ్రాసిన 'కల్లుపెంట' నాటిక ప్రచురితమైంది. 1929-31లో ఇల్లూరు, తరిమెల పరిసర ప్రాంతాలలోని యాభై గ్రామాలలో జాతీయో ద్యమంలో భాగంగా సారాయి, కల్లు వ్యతిరేక పోరాటాలు కొనసాగాయి. పప్పూరి రామా చార్యులు ఈ ఉద్యమాలలో ప్రధానపాత్ర పోషించారు. ఆ అనుభవంతోటే గ్రామాలలో కల్లు సారాయిల త్రాగుడు మాన్పించడం కోసం చైతన్యం తీసుకురావటానికి పప్పూరి రామాచార్యులే ఈనాటికను వ్రాశారు. మూడు అంకాలుగా ఈ నాటిక ఉంది. ఆ నాటికలో గాంధీ సిద్ధాంతాలకు ప్రభావితుడైన రామారావు కల్లు వ్యతిరేక ప్రచారంచేస్తూ, దానిని రూపు మాపేందుకు గ్రామాలలో పర్యటిస్తాడు. అనంతపురం పరిసరాలలోని ఒక గ్రామానికి వెళ్తాడు. ఆ గ్రామంలో సుబ్బరాయ శాస్త్రి వద్ద ఆశ్రయం పొందుతాడు. ఆ గ్రామంలో కల్లంగడిని నెట్టికల్లు నడుపుతుంటాడు. అందుకుగాను ఆ గ్రామానికి రెడ్డి అయిన రంగారెడ్డికి సంవత్సరానికి నూట యాభై రూపాయలు నెట్టికల్లు చెల్లించే విధంగా ఒప్పందం ఉంటుంది. రంగారెడ్డి తన కొడుకుకి పుట్టువెంట్రుకలు తీయించేందుకు విదురాశ్వార్థం వెడుతున్న సందర్భంగా, తనకివ్వవలసిన మొత్తంలో నెట్టికల్లును డెబ్బైఅయిదు రూపాయలు అడుగుతాడు. గత కొన్ని రోజులుగా ఊర్లో కల్లువ్యతిరేక ప్రచారం జరుగుతోందని, వ్యాపారం కష్టంగా ఉందని నెట్టికల్లు తెలియజేస్తాడు.

అదే సమయంలో- జానెడు పొట్టకు మీరాశించిన చెడుకొంపల లెక్కించండీ/ తానొక్కనికై పెక్కు వంశములు చరగూలుట సరియేమండీ/ మఱిపి కల్లు సారాయము లమ్మి మత్తుగొల్పి చంపుటకన్నా/ నిరుపేదల గుడిసెలకొక మాఱుగా నిపపెట్టరాదేమండీ!- అంటూ కల్లువ్యతిరేక

ప్రచారకులు పాట పాడుతూ వెళతారు. అది విని రంగారెడ్డి, రామారావును ఊరునుండి వెళ్ళగొట్టాలను కుంటాడు. అశ్వర్థం వెళ్లివచ్చిన తరువాతైనా ఆ డబ్బులు ఇవ్వమని నెట్టికల్లుతో రంగారెడ్డి చెప్పివెడతాడు. నెట్టికల్లు మనిషి పుల్లన్న- పోతిగాడికి కల్లుతాపి రామారావును తిట్టమంటాడు. అలా చేస్తే తమకివ్వాల్సిన అప్పు ఇవ్వనవ సరం లేదంటాడు. పోతిగాడు రామారావును తిట్టగా కల్లువ్యతిరేక ప్రచార సభ్యులైన భీముడు, ఆంజనేయులు వాడిని కొట్టేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు రామారావు 'నాయనలారా! ఒక్కరిని హింసించితిమా మన ఉద్య మము అంతలోనే నిలిచిపోవును, వీడి వెనుక ఎవరో ఇలా పంపివుంటా'రని శాంతింపజేస్తాడు. పోతిగాడు వాస్తవాలను తెలుసుకొని ఇక నుంచి కల్లుముట్టనని చెప్పి వెళ్తాడు. నెట్టికల్లు, పుల్లన్నలు పోతిగాడిని పిలిచి రామారావు విషయం అడగగా, మీరు చెప్పినట్లు చేయలేనని, రామారావువాళ్లు మంచోళ్ళని తప్పుకుంటాడు. నెట్టికల్లు, పుల్లన్నలు ఓబిగాణ్ణి పిలిచి పోలేరమ్మ పూనకం వచ్చినట్లు నటింపజేసి ఊరిదేవర చేయాలని సిద్దమవు తారు. మనుషులకు వ్యాధులు రాకుండా ఉండేదుకు, పంటలు పండేందుకు 'దేవర' తప్పకుండా చేయాలని గ్రామస్థులను రెచ్చగొడతారు. హింసాప్రవత్తి మానుకోవా లని, దేవర వలన ఖర్చులు తప్ప లాభంలేదని, దేవర సందర్భంగా చెరువులో జంతు కళేబరాలను కడుగుతారని అందువలన కలరా, అంటువ్యాధులు వ్యాపిస్తాయని కల్లు వ్యతిరేక ప్రచారకులు దేవరను వ్యతిరేకిస్తారు.

దేవరవల్ల లబ్ధిపొందాలనుకునే నెట్టికల్లు, పుల్లన్న, వ్యాపారంచేసే శెట్టి మొదలగువారు దేవరను చేసేందుకు ముందుండి నడిపిస్తారు. జాతర సమయంలో కలరా పురుగులు వ్యాపించి కోనేరులో కలవకుండా రామారావు అతని మనుషులు దగ్గరుండి జాగ్రత్తలు తీసుకుంటారు. జాతరలో కల్లు, సారా, కోడిపందేలు విపరీతంగా సాగు తాయి. ఎన్నో మూగజీవాలను బలి ఇస్తారు. జాతర ద్వారా కల్లు అమ్ముకొని లాభం పొందిన నెట్టికల్లును పుల్లన్న తనకు రావలసిన వాటా అడుగుతాడు. తన వాటా ఇవ్వక పోతే రామారావు దగ్గరకు చేరుతానని చెబుతాడు. అప్పటికే ఊరంతా కలరా సోకుతుంది. పట్టణం నుండి డాక్టరును పిలిపించి కలరా బారినుండి రామారావు బృందం ప్రజలను కాపాడుతారు. కలరా కారణంగా రంగారెడ్డి కొడుకు మరణిస్తాడు. ప్రజలందరూ రామారావు సేవలను గుర్తించి ఆయన మార్గాన్ని కొనియాడుతారు. ఊళ్లో కలరా సోకడానికి కారణం రామారావే, చెరువులో ఏదో మందు కలిపాడని నెట్టికల్లు మనుషులు ప్రచారం చేస్తారు. డాక్టరు ఇచ్చిన మందులను చెరువులో కలిపామని, లేకుంటే అందరికి కలరా సోకేదని రామారావు వివరిస్తాడు. అంతలోనే పుల్లన్న ప్రక్క ఊరైన సిద్ధంపల్లె నుండి కల్లు పిపాయి తెస్తుండగా దొంగకల్లు తాగేవాడు వెంటపడి ఆ పిపాయిలో గొట్టంపెట్టి పీలుస్తుండగా అందులోకే వాంతిచేసుకున్నాడని, ఆ కల్లు తాగినవారం దరికి కలరా సోకిందని తెలియజేస్తాడు. ఈ విధంగా సిద్ధంవారిపల్లిలోని కలరా తమ గ్రామంలోకి వ్యాపించిం దని వివరిస్తాడు. ప్రజలంతా నెట్టికల్లు ఇంటిని కాల్చివేయడానికి సిద్ధమవుతారు. నెట్టికల్లును అని ఏమి లాభం, మనం కల్లు తాగకపోతే సరిపోతుందని రామరావు వారిని వారించి ఇకనైనా మానండని అంటాడు. అందరూ కలిసి కల్లుతాగమని ప్రమాణం చేస్తారు. రామారావును ఊరిలోనుంచి వెళ్లగొట్టి కల్లు అమ్మకం సాగించాలని నెట్టికల్లు అనుకొంటాడు. రామారావు వైపు ఉన్న పుల్లన్నకు యాభైరూపాయలిచ్చి, కల్లు ఉచితంగా పోస్తానని లోబరుచకుంటాడు. ఓబిగాడు కల్లు తాగుతుంటే అడ్డుకొని కల్లు ముంత పగులగొట్టి, వాడి చెంపకు రామారావు కొట్టాడని దొంగ సాక్ష్యం చెప్పించేందుకు సిద్ధం చేస్తాడు.

అధికారులకు నెట్టికల్లు డబ్బులిచ్చి అక్రమకేసు బనాయింపజేస్తాడు. పోలీసులు రామారావును కచేరికి తీసుకువెళతారు. రామారావు అనుచరులు ఆంజి నేయులు, భీమలు జైలుకు వస్తామని సిద్ధమవగా రామారావు వారిని వారించి గ్రామంలో కల్లు తాగకుండా

చూసుకోమంటాడు. గ్రామరెడ్డి అయిన రంగారెడ్డి మాదిగల నందరిని పిలిపించి కల్లు తాగాలని, లేకపోతే సర్కారుకు నష్టం వస్తుందని తెలియజేస్తాడు. మాదిగలు కల్లుతాగమని చెబితే తనకివ్వాల్సిన అప్పులు కట్టండని రెడ్డి ఒత్తిడి చేస్తాడు. లభిస్తున్నంతలో 'కల్లుపెంట నాటకం'లోని ఇతివృత్తమిది. పప్పూరు రామాచార్యులు ఉద్యమకాలంలో ఎదురైన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ నాటికను రాశారు. పప్పూరువారిపై ఉద్యమంలో ఇలాంటి కేసునే బనాయించారు. ఆ కేసు కోర్టులో వీగిపోయింది. ఈ నాటికలో కూడా కేసు వీగిపోయి ఉంటుంది. ఒక గ్రామం నేపథ్యంగా కొనసాగిన సారా కల్లు వ్యతిరేకోద్యమం ఈ నాటికలో చిత్రితమైంది. గ్రామంలోని పెత్తందార్లు, కల్లంగడి యజమానుల దౌర్జన్యాలు, దోపిడీల స్వరూపాన్ని ఈ నాటిక తెలియ జేస్తుంది. అలాంటి సంక్లిష్ట పరిస్థితులలోను గాంధీ సిద్ధాంత అనుయాయులు శాంతియుతంగా అహింసా మార్గాన ప్రజలను చైతన్యవంతులను చేయడం గమనించాలి. ప్రజలు తిరగబడి వారిని ఎదుర్కొనే సామర్థ్యాలుఉన్నప్పటికీ, గాంధీయమార్గంలో పోరాడాలనే ఈ నాటిక నిర్దేశం చేస్తుంది. మద్యనిషేధ ఉద్యమంలో భాగంగా ఈనాటిక గ్రామాలలో ప్రదర్శితమై ప్రజలు చైతన్యవంతులు కావాలని పప్పూరు రామాచార్యులు కోరుకున్నారు.

ఆరోగ్యమే మాహా భాగ్యమనే 'ఆరోగ్య నాటకం'

1936 జనవరి 11న ఆరోగ్య నాటకం అను మూడు రంగాల నాటిక ప్రచురితమైంది. ఆధునిక వ్యవహారిక భాషలో అందరికి అర్థమయ్యేలా, ప్రదర్శనాయోగ్యమైన నాటిక ఇది. ఈ నాటికలో సూత్రధారుడు ప్రవేశించి చేసిన నాంది ప్రస్తావనలో ఆరోగ్య దేవతలుగా భావించే పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం పాత్రలు ధరించిన పిల్లలు నరుడితో తమ ప్రాధాన్యం గురించి వివరిస్తున్నట్లు ఉంది. నాటిక మొదటి రంగంలో మద్యపానానికి అలవాటైన శోభనరావు పుట్టెడు రోగాల పాలై మంచం పడతాడు. అతని భార్య లీలమ్మ, పిల్లల ఒత్తిడికి తలొగ్గి శోభనరావు మద్యానికి దూరమై మామూలు మనిషిగా మారుతాడు. నాటిక రెండవ రంగంలో జిల్లా బోర్డు ప్రెసిడెంట్గా శోభనరావు ఎన్నికవుతాడు. ఆ సందర్భంలో 'నాభార్య లీలకు నేను కృతజ్ఞుడను. ఆ సాధ్వీ పట్టుపట్టకపోతే నా పనేమయి యుండెడో, లీల నా దురభ్యాసాలన్నింటిని వదలగొట్టింది. నా పిల్లలను మంచి మార్గంలో పెట్టింది. మమ్మలినందరిని ఆరోగ్యవంతులను చేసింది. మా ఇల్లు, ఊర్లో వారందరికినీ ఆదర్శ ప్రాయయ్యేట్లుగా చేసింది. పొదుపుగా సంసారం చేసి నా అప్పులన్నీ తీర్చింది. సంసారం బాగుచేయవలెనన్న, పాడుచేయవలెనన్నా ఆడదాని చేతిలోనే ఉంది' అని వివరిస్తాడు. జిల్లా వ్యాప్తంగా విస్తరించిన కలరా, ప్లేగు, స్ఫోటక, చలి జ్వరాల వ్యాధుల గురించి శోభనరావు జిల్లా హెల్త్ ఆఫీసర్ జగదీశ్వరరావును వివరాలను అడిగి తెలుసుకుంటాడు. ఆ అధికారి బాధ్యతా రాహిత్యాన్ని నిలదీస్తాడు. ప్రజలను పట్టిపీడిస్తున్న ఈ వ్యాధులగురించి కాకుండా సంబంధంలేని 'టూబర్క్యులాసిస్' వ్యాధి గురించి కరపత్రం వేయటం, అందులోను ప్రజలకు అర్థంకాని ఇంగీషు భాషలో వేయడాన్ని మందలిస్తాడు. తెలుగు అనువాదం చేసిన మరో కరపత్రం ప్రజలకు అర్థమయ్యే వ్యవహారిక భాషలోకాక గ్రాంథిక భాషలో వేయటాన్ని శోభనరావు ఎత్తిచూపుతాడు.

శోభనరావు, అతని భార్య లీలమ్మ పల్లెల్లో పర్యటన చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలలో పాల్గొంటూ స్వచ్ఛంద సేవకులను తయారుచేసి ఒక ఉద్యమంలా నడుపు తున్నారని పత్రికల ద్వారా నారపరెడ్డి తెలుసుకుంటాడు. నారపరెడ్డి తాను నివసిస్తున్న గ్రామంలోకి శోభనరావు వస్తాడేమోనని ముందుగా తమ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రజలతో కలిసి చేపట్టుతున్నట్లు తెలియజేస్తూ నాటిక ముగుస్తుంది. నాటక లక్షణాల ప్రభావం నాందిప్రస్తావనలో కొంత కనిపిస్తుంది. నాటక

లక్షణాల నుండి విడివడి నాటికగా నిలదొక్కుకునే ప్రయత్నం ఈ నాటికలో కనిపిస్తుంది. కష్టకాలంలో కుటుంబాన్ని నిలబెట్టడంలో స్త్రీల పాత్రను, ప్రజలతో అర్థమయ్యేలా వ్యవహారికభాషలో కరపత్రాలు రావాలనే వ్యవహారిక భాషా స్పృహను, బాధ్యతలు అదమరచి పనిచేసే అధికారుల బాధ్యతారాహిత్యాన్ని, నాయకులు మాటలద్వారా కాకుండా ఆచరణలద్వారా ముందుకు నడవాలని ఈ నాటిక తెలియజేస్తుంది. 1936 ఫిబ్రవరి 22న ప్రచురితమైన 'గంగా భాగీరథి' నాటికను చిలుకూరు నారాయణరావు రాశారు. నాటకాలు వేసే సమయంలో ఎదురయ్యే పరిస్థితులను, రసాభాసా లను ఇందులో వివరించారు. ఈ విధంగా రాయలసీమ లోని ఆనాటి రాజకీయ పరిస్థితులను, స్త్రీవిద్య ఆవశ్యతకతను, మద్యపాన నిషేధ ఉద్యమాన్ని, ఆరోగ్య ప్రాధాన్యతల గురించి వివరించే నాటికలు వెలువడి నాయి. ప్రదర్శనానుగుణ్యంగా రాసిన ఈ నాటికలు తరువాతి కాలంలో సీమలో నాటికా సాహిత్య వికాసానికి దిశానిర్దేశం చేశాయనిపిస్తుంది.

## ఆధార గ్రంథాలు

1. శ్రీసాధన పత్రిక - పప్పూరి రామాచార్యులు
2. శ్రీసాధన పత్రిక వ్యాసాలు - డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి
3. ఆధునిక తెలుగు నాటకం - డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు

❀❀❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ప్రాచీన సాహిత్యంలో మొల్ల

- డా॥. పి. చైతన్య, తెలుగు లెక్చరర్, ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్.

ఆంధ్ర వ్మాయంన 11 వ శతాబ్దంలో మొదలైన కావ్యరచన పరంపర నేటికీ కొనసాగుతూ వచ్చింది. మరి అప్పటి కాలంలో కవయిత్రుల సంఖ్య చాలా తక్కువగా కనబడుతుంది. పురుషాధిక్య సమాజం ఎక్కువగా ఉన్న ఆ సమయంలో స్త్రీలు వంటింటికి మాత్రమే పరిమిత మైన కాలమది. ఆ సమయంలో వచ్చినటువంటి కవయిత్రి మొల్ల. ఈమె 16వ శతాబ్దంలో జన్మించినటు వంటి స్త్రీ. ఈమె యొక్క తండ్రి ఆతుకూరి కేసర శెట్టిగా తెలియ వస్తుంది. ఈమె యొక్క గ్రామం గోపవరంగా తెలుస్తుంది. ఈమె తండ్రి శివ భక్తుడు అని ఆతుకూరి మొల్ల చెప్పుకొచ్చింది. తన తండ్రి గూర్చి ఈ విధంగా చెప్పింది.

గురులింగ జంగమర్చన
పరుడును శివ భక్తి పరతుడు బాంధవ హితుడ
గురుడాతుకూరి కేసయ
వరపుత్ర ని మొల్లయనగ వరలినదానన్

ఈ విధంగా తన యొక్క జన్మ వృత్తాంతాన్ని చెప్పు కుంది. ఈమె జన్మించిన సమయంలో స్త్రీలను తక్కువగా చూసేవారు. సమాజాన్ని ఎదిరించి తనకు తానుగా నిలబడింది. ఈనాటి తరానికి ఆదర్శంగా నిలిచినటువంటి కవయిత్రి. మొల్ల అనగా మల్లెకన్న సువాసనభరితంగా ఉండేటువంటి ఒక పుష్పం.

ఈ పుష్పం శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైంది. అందుకే తన తండ్రి ఈ పేరును పెట్టుకున్నాడేమో. ఈమె కవిత్వం ఆ శ్రీకంఠ మల్లేశ్వర వరము చేత అబ్బినది అని చెప్పుకుంది. పోతన భాగవతంల పలికెడిది భాగవత మట నన్ను పలికించెడివాడు రామభద్రుండట అని పోతన ఏవిధంగానైతే భాగవతాన్ని రామచంద్రుడు రాయమని చెప్పాడో ఆ విధంగానే తనను కూడా ఆ శ్రీరామచంద్రుడే రామాయణాన్ని రాయమని చెప్పాడని చెప్పుకుంది.

చెప్పుమని రామచంద్రుడు
సెప్పించిన పలుకు మీద జెప్పదనే నే
ల్లప్పుడు నిహ పర సాధన
మీ పుణ్య చరిత్ర తప్పులేంచకుడు కవుల్... అని చెప్పుకుంది. తన కవిత్వంలో తప్పులను ఇతర కవులు ఎత్తి చూపకుండా ముందుగానే చెప్పుకుంది. మొల్ల రామాయణంను చంపు పద్ధతిలో ఒక్క రీతిగా రచించినది. ఇది శ్రీ గౌరీశ్వర వర ప్రసాద లబ్ద గురుజంగ మార్చిన వినోద

సూరి జన వినుత కవితాచమత్కారాతుకూరి కేసన సెట్టి
తనయ మొల్ల నామదేయ విరచితుండైన శ్రీ రామాయణం
తనకు ఏమి వ్యాకరణ శాస్త్రములు రావని చెప్పుకుంది.
తాను ఏమి చదువుకోలేదని పేర్కొంది.
దేశీయ పదములు దెనుగుల్ సంస్కృతుల్, సంధులు ప్రాజ్ఞుల శబ్దవితతి
శయ్యలు రీతులు జాటు ప్రబంధములు... చందో లక్షణముల్

తనకు సంధులు, వృత్తులు, బహు వర్ణములు విభక్తులు ధాతువులు ఏవి కూడా రావని నాకు శ్రీకంఠ మల్లేశ్వరుని దయతో రామాయణం రాశానని చెప్పుకుంది. మొల్ల రామాయణం మల్లెపువ్వంత పరిమాణము, మల్లెపువ్వ0తా పరిమళము అని ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి గారు పేర్కొన్నారు.

మొల్ల రామాయణ అవతారికలో ఇష్ట దేవత స్తుతి గావించింది.

ఉ. శ్రీమహిమాభిరాముడు, వశిష్ట మహాముని పూజితుండు సు
త్రామ వధూ కళాభరణ రక్షకుడాశ్రిత పోషకుండు దూ
ర్యామల సన్నిభాగుండు మహాగుణశాలి దయాపరుండు, శ్రీ
రాముడు ప్రోచు భక్తతతి రంజిల్లునట్లుగా నెల్ల కాలమున్

ఈ పద్యంలో శ్రీరామున్ని పొగిడింది. లక్ష్మి సంపదలతో తులతూగేవాడు, వశిష్ట మహాముని చేత పుజించబడే వాడు, అశ్రితులచేత పోషించబడేవాడు. దయా గుణములు కలిగినవాడుగా చెప్పుకున్నది. తరువాత వినాయకుడిని, ముగ్గురమ్మల్ని కూడా పూజించింది. తరువాత తన ముందరి కవులు అయిన తిక్కన, శ్రీనాథుడు రంగ నాథులను కూడా పేర్కొన్నది.

తొల్లేటి ఇప్పటి సత్కవి
వల్లభూలను రసికవినుత వాగ్విభధ కళా
ముల్లుల గవితా రచనల
బల్లి దులైనట్టి ఘనుల భక్తిగా దలిచెన్

గతకాలంలోని మంచి కవులను,సహృదయంతో పొగిడింది. కవిత్వం ఎలా ఉండాలో కూడా చెప్పుకుంది.

తేనేసోక నోరు తీయ నాగు రీతి / దొడ్డ నర్తన ఇల్లు దోచుకుండా
గూడ శబ్దములను గూర్చిన కావ్యము / మూగ చెవిటి వారి ముచ్చటగును

తేనే తగిలిన వెంటనే నోటికి తియ్యగా ఉండేటట్లు కవిత్వము ఉండాలి కానీ గూడార్థంలతో అర్థం కాని విధంగా కావ్యము ఉండరాదు అని, అలా ఉంటే మూగవాడు, ఒక చెవిటివాడు మాట్లాడినట్లు ఉంటుందని చెప్పింది. అలాగే కవిత్వములో చిన్నచిన్న సామెతలు అర్థవంతంగా అర్థమయ్యే విధంగా ఉండాలి అని కూడా మొల్ల తన రామాయణంలో చెప్పుకుంది. కవిత్వంలో ధ్వని ప్రధానమైన తేట తెలుగు మాటలతో ఉండవలెనని సంస్కృత పదములతో ఉండకూడదని మొల్ల తెలిపినది.

కందువమాటలు, సామెతలు అందముగా గూర్చి చెప్పనిది వెనుగునకున్
బొందే రుచి వీనుల విందై మరి కానుపించు విభజనుల మదికిన్

ఎంతటి లోతైన అర్థాన్ని ఐనా చిన్న చిన్న సామెతలతో అందంగా భావాన్ని ఇనుమడింప చేయవచ్చని తన కవిత్వంలో చెప్పుకుంది. తనకి ఏమీ తెలియదు అని చెపుతూనే తన రామాయణం ఒక గొప్ప మహాకావ్యంగా రచించినటువంటి ధీశాలి మొల్ల.

## ఆధార గ్రంథాలు

1. పీఠిక రామాయణం ఆతుకూరి మొల్లచే విరచితము వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ చెన్నపురి 1952
2. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి

✿✿✿

# ప్రసిద్ధ పౌరాణిక నాటకాలలో "మహిళ"

- డా॥. చుక్కా యశోద, తెలుగు శాఖాధిపతి, శాతవాహన కళాశాల, విజయవాడ.

భారతీయ వాఙ్మయంలో వేదాలు మొదటివి. వేదం అందరికీ తెలియకపోవుటవల్ల పురాణేతిహాసాలను మహర్షులు లోకానికి అనుగ్రహించారు. వాటి పరిమాణం పెద్దది కావటం వల్ల సారాన్ని మహాకవులు కావ్యరూపంలో అందించారు.

రామాయణ, భారత, భాగవతాలు పురాణేతిహాసాలలో తలమానికాలు. వీటి కథల ఆధారంగానే అధిక సంఖ్యలో కావ్య నాటకాలు వెలువడి వాఙ్మయం సుసంపన్నమైంది. నాటకం సాహిత్య ప్రక్రియలలోకెల్లా ఉత్తమోత్తమమైందని భారతీయ లాక్షణికులంటారు.

'పురాణేతిహాసాదులలోని కథను స్వీకరించి నాటకాలు రచిస్తే అవి పౌరాణికాలవుతాయి' (తెలుగు నాటక వికాసం - పుట-1) అని డా॥పి.యస్.ఆర్. అప్పారావుగారు పేర్కొన్నారు. పురాణ శబ్దానికి 'ప్రాచీనకాలానికి చెందినది' అని (పురాణ విమర్శ - పుట 8,9), ఇతిహాసం అంటే 'ఈ విధంగా జరిగింది' అని (పురాణ విమర్శ - పుట-5) అర్థాలు చెప్పబడ్డాయి. కనుక పురాణానికి, ఇతిహాసానికి పదాలలో అర్థపరంగా భేదం లేదు అనేది తేటతెల్లం. పురాణేతిహాసాలకు మాతా పుత్రికల వంటి సంబంధం ఉందని ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు తన ప్రథమాంధ్ర మహాపురాణంలో తెలియజేశారు. కాబట్టి పురాణ ఇతిహాస కథా వృత్తాంతాలే పౌరాణిక నాటకాలుగా చలామణి అవుతున్నాయి.

**పౌరాణిక నాటకాలు - మహిళా పాత్రలు :**

కవి ప్రతిభను ప్రదర్శించే ముఖ్యమైన లక్షణాలలో పాత్రలు ముఖ్యంగా మహిళా పాత్రలు సజీవంగా చిత్రించటం ప్రధానం. కవులందరూ మహాకవులు కావాలంటే వారి కావ్యాల్లోని మహిళా పాత్రల్లో తన ప్రతిభను కనపర్చగలగాలి. ఆ పాత్రలు మన కళ్ళముందు చిత్రాల్లాగా నిరంతరం మెదులుతుండాలి. పాత్రకి పాత్రకి మధ్య తప్పనిసరిగా వైవిధ్యం ఉంటే అలాంటి పాత్రలు నిత్యనూతనంగా కలకాలం ప్రేక్షకుల గుండెల్లో శాశ్వతంగా ఉంటాయి.

పౌరాణిక నాటక కర్తల అద్భుత సృష్టిలోని మహిళా పాత్రలన్నీ సజీవాలే. వరుసగా ఆయా ప్రసిద్ధ పౌరాణిక నాటకాలలోని మహిళా పాత్రలను నాటక కర్తలు ఏవిధంగా చిత్రించినారో, వారి ప్రతిభ ఎట్టిదో ఈ పరిశోధనా వ్యాసం ద్వారా తెలియజేయటం ముఖ్యోద్దేశం.

**బలిజేపల్లివారి 'సత్యహరిశ్చంద్రీయము' - చంద్రమతి :**

భర్తమాట జవదాటని ఇల్లాలు. పరమసాధ్వి. ఎల్లప్పుడూ భర్తకు చేదోడు వాదోడుగా ఉండి భర్తకు ధైర్యం చెబుతూ సత్యస్థిరునిగా నిలబెట్టగలిగిన ఘనత ఆమెదే. హరిశ్చంద్రుని కీర్తిప్రతిష్టలు దశదిశలా వ్యాపించటానికి అనుకూలవతియైన భార్య చంద్రమతి.

క్రూరమృగాలనుండి ప్రజలను కాపాడటానికి హరిశ్చంద్రుడు వేటకు బయలుదేరినప్పుడు తానూ వెంట వెళ్ళింది. ఎల్లప్పుడూ భర్త సుఖాన్నే కోరుకునే ఇల్లాలు.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రునకు రాజ్యాన్ని ధార పోయటానికి సందేహించుచున్న సమయంలో 'ఈ రాజ్యం, బంధాలు' శాశ్వతం కాదని హితబోధ చేస్తుంది.

తన కుమారుని క్షేమం కన్నా తన వెంట అడవులకు వచ్చిన నక్షత్రకుని క్షేమమే కోరింది. ఎప్పుడూ మనసా వాచా కర్మణా భర్తను నిందించింది కాదు. భర్తను ఎట్లైనా ఋణవిముక్తుని చేయాలని భావించి మనస్సులో కాశీ విశ్వనాధుని ధ్యానించి హరిశ్చంద్రునితో "నన్ను అమ్మికొని విశ్వామిత్రుని ఋణం తీర్చ"మంటుంది.

సత్యాన్ని కాపాడటం కోసం తన భర్త చేసిన ఏ పనికీ ఆటంకం కలిగించలేదు. ఉత్తమ ఇల్లాలిగానే కాక

ఉత్తమ తల్లిగా కూడా బలిజేపల్లివారి చేతిలో తీర్చిదిద్ద బడిన మహిళా పాత్ర చంద్రమతి.

తన కుమారుని శవాన్ని శ్మశానానికి తీసుకొనివెళ్ళి దహించే సమయంలో భర్తచేత తిరస్కరించబడింది. చక్రవర్తి భార్య అయి ఉండి కాటిసుంకం చెల్లించలేని నీచస్థితిలో ప్రస్తుతం ఉన్నందుకు చింతించింది. చివరికి తన భర్తే 'కాటికాపరి' అని తెలుసుకొని దు:ఖించింది.

శిశుహత్యా నేరం ఆరోపించబడిన చంద్రమతిని వధించుటకు హరిశ్చంద్రుడు వెనుకాడు తున్నప్పుడు "నాథా! మీరింక నాకై చింతింపవలదు... ఎక్కడనో నీచపు చావు చావకుండగ జీవితేశ్వరులగు మీచేతనే చావగల్గినందులకు నేను పూజ్యురాలనే. మీరింక నిష్క ళంక చిత్తమున మీ సత్య నిరూఢి వేల్పులెల్లం ప్రశంసింప నాతలద్రుంచి మీ స్వామి ఆజ్ఞ నెరవేర్చుడు. ప్రాణపతీ! ఈ నా కడసారి వందన మందుకొనుడు" (సత్యహరిశ్చంద్రీ యము - పుట - 106) అని తన భర్తతో పలికింది. చంద్రమతి గొప్పతనం ప్రతి పదంలో వెల్లడవుతుంది. తన కొరకు తన భర్త వెనుకంజ వేయునేమో నన్న భయంతో ఆమె వధ్యశిలపై తలవంచింది.

ఇన్ని కష్టాలకు కారణమైన నిత్య సత్యవ్రతుడైన హరిశ్చంద్రునే ఆమె జన్మ జన్మలకూ భర్తగా చేయమని, తనకు ఏ మోక్షమూ అక్కరలేదని పరమేశ్వరుని ప్రార్థించింది. సత్యానికై పాటుపడుతున్న తన భర్త కంటే మోక్షం ఎక్కువకాదని భావించింది. చివరికి పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై 'నీకేమి కావలయునో కోరు కొమ్మ' నగా ఈమె మొదట తన బిడ్డను బ్రతికించమని కోరలేదు. కాశీ రాజు పుత్రుని బ్రతికించమని కోరింది. ఈ కారణంగా ఈమె స్వార్థపరురాలు కాదని, పరుల మేలు కోరే గుణం కలదని అంతకు మించి త్యాగగుణం కలదని తెలుస్తుంది. తన అసమాన పాండితీ ప్రజ్ఞతో ఏ నాటక కర్తా చిత్రించలేని విధంగా బలిజేపల్లివారు చంద్రమతి పాత్రను తీర్చిదిద్దారు.

**విశ్వనాథవారి 'నర్తనశాల' - ద్రౌపది :**

ద్రోణుడివల్ల పరాభవం పొందిన ద్రుపద మహారాజు ద్రోణుడికి ఆ గౌరవం అర్జునుని వల్ల కలిగిందని భావించి అర్జునుని వివాహమాడగల కుమార్తెను పొందటానికి ఒక యాగం చేసి యజ్ఞగుండం నుంచి ఒక కుమారుని, ఒక కుమార్తెను పొందాడు. ఆమె వాస్తవ నామం కృష్ణ. కారణజన్మురాలు కనుక యాజ్ఞసేని. తండ్రి నుంచి "ద్రౌపది" అనే వ్యవహారం కలిగి రూఢమయ్యింది. పూర్వజన్మలో ఆమె చేసిన తపస్సు వల్ల పాండవులను ఐదుగురిని భర్తలుగా పొందింది. ఇరవై మూడు సంవత్సరాలు ఇంద్రప్రస్థంలో పట్టమహిషిగా వైభవాన్నను భవించింది. రాజసూయం తర్వాత పాండవులతోపాటు ఆమెకు కూడా కష్టాలు ప్రారంభమయ్యాయి. కష్టాలకు అంతులేకపోయినప్పటికీ ఆమెకు జరిగిన మూడు పరాభవాలు మాత్రం భారత యుద్ధాంతం వరకు ఆమెకు మనశ్శల్యాలయ్యాయి. ఆ పరాభవాలివి...

1) దుశ్శాసనుడు సభలోనికి కొప్పు పట్టి తెచ్చి వస్త్రా పహరణానికి ప్రయత్నించటం.
2) అరణ్యవాసంలో సైంధవుడు దుర్భాషలాడి ఆమెను ఎత్తుకుపోవటం.
3) అజ్ఞాతవాసంలో కీచకునివల్ల కలిగింది.

ఈ మూడవ పరాభవానికి నర్తనశాలలో భీముడు చేసిన ప్రతీకారమే 'నర్తనశాల' నాటకానికి ప్రధానేతి వృత్తం.

విశ్వనాథవారు పోషించిన ద్రౌపది పాత్రచిత్రణలో పాత్రల సంభాషణ, స్వగతం, ఇతర పాత్రలచేత ఈ పాత్రను వర్ణించటం మొదలైన అన్ని పాత్రీకరణ పద్ధతులు ఈ నాటకంలో కనిపిస్తాయి.

**తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగం' - కుంతి :**

మహాభారతంలో ఉద్యోగపర్వంలో చివర కుంతి పాత్ర ప్రవేశం వర్ణించబడింది. కుంతి వీరమాత. తన కొడుకులు క్షత్రియ ధర్మాన్ని వదలి రాజ్యం యాచించటం కుంతికి ఇష్టం లేనట్లుగా భారతంలో స్పష్టంగా చెప్పబడింది. చెళ్ళపిళ్ళవారు కర్ణుడి వద్దకు కుంతి వెళ్ళిన ఘట్టాన్ని

మాత్రమే గ్రహించారు. ద్రౌపదికున్నట్లే ఈమెకు కూడా కౌరవులపై ప్రతీకారం తీర్చుకోవాలనే నిశ్చయం కనిపిస్తుంది.

చతుర్థాంకం ప్రారంభంలో కుంతి మాటల్లో పరాభవ ప్రతీకారమే ముఖ్యమనిపిస్తుంది. అది తన మాటగా చెప్పకుండా ద్రౌపది మాట వినండని చెప్పటం ఒక చమత్కారం. తల్లి మాటకంటే భార్య మాటకు చెల్లుబాటు ఎక్కువ ఉండటం సమాజంలో సాధారణంగా కనిపించే విషయం. ప్రతీకారం తీర్చుకోకపోతే తనకు తగిన కుమారులు కాదని హెచ్చరించటం కూడా ఆమె యుద్ధంవైపు మొగ్గు చూపినట్లేనని స్పష్టంగా చెప్పబడింది.

కేవలం నీతిబోధ చేయటమే కాక కార్య సహాయం కూడా చేసింది. అర్జునుడు తప్పమిగిలిన పాండవులకు కర్ణుడివల్ల హాని జరగకుండా కర్ణుడి నుండి అభయం పొందింది. కర్ణుడి దగ్గరకు ఈమె రాయబారం అందువల్ల సఫలమైంది.

కుంతి పాత్ర స్వల్పమే అయినా పాండవుల ప్రాణ రక్షణకు ఆమె మూలాధారంగా భారతం ప్రకారంగానే ఈ నాటకంలోనూ చిత్రించబడింది.

**ముగింపు :**

తెలుగు పౌరాణిక నాటకాలలోని విశేష ప్రాముఖ్యమున్న మహిళా పాత్రలను ఈ వ్యాసంలో సమీక్షించటం జరిగింది.

విభిన్నాలైన దృక్పథాలతో వివిధ రకాలుగా పురాణేతిహాసాల్లోని ఇతివృత్తాలను తమ ప్రతిభా పాటవాలతో పౌరాణిక నాటకాలుగా మలచి తెలుగు సాహితీమతల్లికి కంఠహారములొనర్చి, తెలుగువారికి గర్వకారణాలైన ఈ పౌరాణిక నాటక కవులు అందరూ ధన్యజీవులు. వీరు చిత్రించిన మహిళా పాత్రలు జాతిజనుల గుండెల్లో హృద్యంగా నిలచి నేటి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1) తెలుగు నాటక వికాసం - పోణంగి శ్రీరామ అప్పారావు
2) నర్తనశాల - విశ్వనాథ సత్యనారాయణ
3) పాండవోద్యోగము - తిరుపతి వేంకటేశ్వర కవులు
4) పురాణ విమర్శ - ఆచార్య బలదేవోపాధ్యాయ
5) సత్యహరిశ్చంద్రీయము - బలిజేపల్లి లక్ష్మీకాంతం

# భాగవతంలోని స్త్రీ పాత్రలు - విశ్లేషణ

**- డా॥. ఇ. వాసు,** తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

భారతీయ సంస్కృతికి ఆకరములు అనదగిన కావ్యాలు మహాభారత, రామాయణ, భాగవతాది కావ్యములు. ఈ కావ్యములోని ప్రతి ఘట్టం, ప్రతిపాత్ర ద్వారా నిజజీవితమునకు ఉపయోగపడే అనేక అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చును. చతుర్విధ పురుషార్థాలను ఆచరించడానికి ఈ కావ్యాలు దిశానిర్ధేశం చేస్తున్నా యనడంలో సందేశం లేదు. హిందువులకు పరమ పవిత్రమైన గ్రంథంగా భావించబడే 'భాగవతం' పోతనచే తెలుగులో నవ విధ భక్తులకు ప్రాధాన్యం ఇచ్చి చక్కగా అనువదించబడిన గొప్ప కావ్యం ముఖ్యంగా ఈ కావ్యము లలోని ప్రతి పాత్ర సజీవంగా నిలిచిపోయేటట్లు, ప్రతి పాత్ర ద్వారా ప్రస్తుత సమాజంలో మనము ఎలా జీవించాలో చక్కగా వర్ణించారు. ప్రతి కావ్యంలో అనేక దేవ మానవ, రాక్షస పాత్రలు ఉన్నాయి.. ఈ కావ్యాలలోని ఈ వ్యాసంలో ప్రముఖమైన పాత్రలు అందరికి తెలుస్తాయి. చిన్న పాత్రలు తెలియదు కాబట్టి భాగవతం లోని చిన్న స్త్రీ పాత్రలు వారి ప్రాధాన్యతను గురించి పరిశీలిద్దాం.

## భాగవతంలోని స్త్రీ పాత్రలు :

### శకుంతల :

మేనక విశ్వామిత్రుల పుత్రి భాగవతం నవ మస్కంధంలో పూరు వంశంలో జన్మించిన గొప్పవీరులు కీర్తిమంతుల గురించి పరీక్షిత్తుకు శుకమహర్షి తెలుపు సందర్భంలో శకుంతల పాత్ర ఉంది.

కణ్వమహాముని శకుంతలను పోషించాడు. ఒకనాడు దుష్యంతుడు వేట నిమిత్తం అడవికి వెళ్ళి జంతువులను వేటాడుతూ దైవఘటన వలన కణ్వమహాముని తపోవనా నికి వెళ్ళాడు. అక్కడ శకుంతలను చూడగానే ఇద్దరు ఒకరినొకరు చూడడం ఇష్టపడటం గాంధర్వ పద్ధతిలో వివాహం చేసుకోవడం, తర్వాత శకుంతలకు సంతానం కలగడం, ఆమె తన కుమారునితో దుష్యంతుని దగ్గరకు వెళ్ళడంతో అతను గుర్తించకపోవడం తర్వాత ఆకాశవాణి ద్వారా గుర్తించి ఆదరించడం జరిగింది. భారతంలో కూడా శకుంతల పాత్ర చెప్పబడింది. ఏలాంటి మార్పులు లేవు.

ప్రస్తుత కాలంలో కూడా ఉన్నత స్థానాల్లో ఉన్నవారి వలన శకుంతలలాగా మోసపోతున్న స్త్రీలు ఎందరో ఉన్నారు. అలా మోసపోయిన వారిలో కొందరు ధైర్యంగా తమ సమస్యలను ఎత్తి చూపి పరిష్కరించుకోవడానికి ఈ పాత్ర నిదర్శనం.

### లక్షణ :

దుర్యోధనుని కుమార్తె, భాగవతం దశమ స్కంధం ఉత్తరభాగంలో లక్షణ పాత్ర ఉంది. లక్షణను వివాహ సమయంలో శ్రీకృష్ణుని కుమారుడు సాంబుడు ఎత్తుకు పోయాడు. దాన్ని కౌరవులు అడ్డుకొని బంధించారు. ద్వారకలో సాంబుడుపట్టుబడిన విషయం నారదుని ద్వారా తెలుసుకొని యాదవవీరులు ఉగ్రసేన మహారాజు అనుమతితో కౌరవులపై యుద్ధానికి బయలుదేరగా బలరాముడు వారిని వారించి, తానే స్వయంగా హస్తినా పురానికి వెళ్ళి వారిని కుశల ప్రశ్నలతో మాట్లాడి బంధువుల క్షేమం కోరి మన్నించమని అడగగా, దుర్యోధనుడు యాదవులను దూషిస్తూ మాట్లాడిన పరుష వాక్కులు బలరామునికి ఆగ్రహం తెప్పించాయి. బల రాముడు ఆగ్రహంతో నాగలిపైకెత్తి నాగలి చివరి భాగంతో హస్తినాపురాన్ని పెకలించి గంగలో కలపడానికి ఉ ద్యుక్తుడైనాడు. ఆ సమయంలో హస్తినాపురం సముద్రంలో పడవలాగా అయింది. కౌరవులందరూ బలరాముని శరణువేడి సాంబునికి లక్షణకు వివాహం జరిపించి సకల మర్యాదలతో వీరిని సాగనంపారు.

ఈ పాత్రల ద్వారా మనకు ఆవేశంతో చేసే పనులు సత్ఫలితాలు ఇవ్వవని, అనాలోచిత నిర్ణయాలు సబబు కాదని, సామరస్యంగా చేసే ఏ పని అయినా మంచి ఫలితాలు ఇస్తాయని బోధకమవుతుంది.

**మాయావతి :**

పూర్వజన్మలో రతిదేవి, భాగవతం దశమస్కంధం ఉత్తర భాగంలో 'ప్రద్యుమ్మకుమార చరిత్ర' సందర్భంలో మాయావతి ఉంది.

నన్మధుడు గతజన్మలో శివుని కంటి మంట కారణంగా దహనమయ్యాడు. తర్వాత రతిదేవి మాయావతి పేరుతో జన్మించించి. మన్మధుడు తిరిగి కృష్ణునికి రుక్మిణి యందు ప్రద్యుమునిగా జన్మించాడు. నారదుని ద్వారా మాయావతి నిజం తెలుసుకొని గతంలో జరిగిన విషయాలు తెలిసి అతని పుట్టుక గురించి తెలుసుకున్నది. ఆమె నిరీక్షిస్తున్న విషయం ప్రద్యుమ్మునికి తెలిసింది. తర్వాత ప్రద్యుమ్నుడు యామావతిని స్వీకరించి ద్వారక లోని తల్లిదండ్రులు రుక్మిణి, శ్రీకృష్ణుల వద్దకు చేరారు.

**యోగమయ :**

భాగవతం దశమస్కంధం పూర్వభాగంలో శ్రీకృష్ణుని జనన సందర్భంలో యోగమయ ఉంది.దేవకి గర్భంలోని ఏడవ గర్భమైన శేషుని తీసుకొని రోహిణి గర్భంలో ప్రవేశపెట్టింది. తర్వాత యశోద గర్భంలోనే బిడ్డగా జన్మించింది. ఈమె సంపదలకు నివాసమైన కామదాయని ఈమెకు దుర్గ, భద్రకాళి. విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాని, శారద, అంబిక అను పద్నాలుగు పేర్లున్నాయి.

**రేణుక :**

రేణువు కుమార్తె జమదగ్ని భార్య, భాగవతం నవమస్కంధంలో పరశురామ చరిత్ర సందర్భంలో రేణుక పాత్ర ఉంది. రేణుక ఒక రోజు గంగానదిలో స్నానం చేస్తూ చిత్రడా రధుడనే గంధర్వరాజును ప్రేమతో చూపింది అది చూసిన జమదగ్ని ఆమెను చంపమని కుమారులను ఆదేసించారు. నలుగురు కుమారులలో మొదటి ముగ్గురు ఆ పనిచేయలేదు. చివరివాడైన పరశురాముడు భయపడకుండా తండ్రి ఆనతి మేరకు తల్లిని చంపాడు. జమదగ్ని ఆమెను చంపమని కుమారులను ఆదేశించాడు. నలుగురు కుమారులలో మొదటి ముగ్గురు ఆ పనిచేయలేదు. చివరివాడైన పరశురాముడు భయపడకుండా తండ్రి ఆనతి మేరకు తల్లిని చంపాడు. జమదగ్ని సంతోషించాడు. ఆ విషయాన్ని గుర్తించిన పరశురాముడు తల్లిని బ్రతికించమని ప్రార్థించి తండ్రిని ఒప్పించి బ్రతికించుకున్నాడు.

**రేవతి :**

రైవతుని కుమార్తె బలరాముని భార్య భాగవతం నవమస్కంధంలో ఈ పాత్ర కలదు.

రైవతుడు కుమార్తె రేవతిని బ్రహ్మకా చూపెట్టి తగిన వరుణ్ణి అడగాలనే తలంపుతో బ్రహ్మలోకానికి వెళ్ళాడు. ఆసమయంలో బ్రహ్మ కొలువులో గంధర్వలు, కిన్నడులూ ఆడుతూ పాడుతూ ఉండడం వల్ల దర్శనానికి తగిన సమయం కాదని కొంత సేపు నిలుచుండి పోయాడు. తర్వాత దర్శనానికి వీలు కలగడంతో రైవతుడు బ్రహ్మకు నమస్కరించి రేవతిని చూపించి ఈమెకు ఎవరు భర్త అవుతారని అడగగా బ్రహ్మ పక పక నవ్వి రాజుతో ఇలా అన్నాడు. భూలోకాని వెళ్ళి, భూభారాన్ని పోగొట్టడానికి దేవదేవుడైన శ్రీహరి బలరాముని అవతారం ఎత్తాడు. ఆ పురుషోత్తమునకు ఇచ్చి వివాహం చేయమన్నాడు. రైవతుడు బ్రహ్మకు నమస్కరించి భూలోకానికి వచ్చి బలరాముడికి రేవతినిచ్చి వివాహం చేశాడు.

**శ్రుతదేవ :**

భాగవతం నవమస్కంధంలో యదు వంశ చరిత్ర తెలుపు సందర్భంలో శ్రుతదేవ పాత్ర ఉంది.

శ్రుత దేవ దేవమీడుడు (శూరుడు), మారిషల రెండవ కుమార్తె కుంతి చెల్లెలు శ్రుత కీర్తి, శ్రుత శ్రవన, రాజాధిదేవి చెల్లెళ్ళు కరూదేశం రాజైన వృద్ధశర్మను వివాహం చేసు

కున్నది. వీరికి మునిశాపం వలన దంత వక్త్రుడనే రాక్షసుడు జన్మించాడు.

**కృతి ద్యుతి :**

చిత్రకేతుని కోటిమంది భార్యలలో పెద్దది. భాగవతం షష్ఠమస్కంధంలో చిత్రకేతూ పాఖ్యానం సందర్భంలో కృతద్యుతి పాత్ర ఉంది.

చిత్రకేతునికి సంతానం లేకపోవడంతో బాగా చింతా క్రాంతుడై ఉండగా అంగిరసుడు విషయం గ్రహించి పుత్రకామేష్ఠి యోగం చేయించాడు. ఆ యజ్ఞ శేషాన్ని పెద్ద భార్యకృతద్యుతికి అనుగ్రహించి " నీకు కుమారుడు జన్మిస్తాడు. అతని వల్ల నీవు సుఖ:దుఖాలు అనుభవిస్తావు" అని పలికాడు. కృతద్యుతి గర్భం ధరించి నవమాసాలు నిండిన తర్వాత కుమారుణ్ణి కన్నది. చిత్రకేతుడు తన కుమారుని మీద వ్యామోహంతో పెద్ద భార్య కృతద్యుతి యందు బద్ధానురాగుడై ఉన్నాడు. ఇది మితగా భార్యలు సహించలేకపోయారు. వారు ఆ బాలునికి విషమిచ్చి చంపేశారు. అప్పుడు కృతద్యుతి రాజు చిత్రకేతుడు మిక్కిలి దుంఖించారు. అంగిరసుడు వారిని వాదార్చి బాలకుని శవంలోకి అతని ఆత్మను ప్రవేశించమని ఆదేశించాడు. ఆ ఆత్మ ఇందుకు అంగీకరించలేదు. అప్పుడు కృతద్యుతి, చిత్రకేతుడు, బంధువులు శోకాన్ని వదిలిపెట్టారు.

**ప్రమ దోత్తమ :**

నవ ద్వారపురంలోని పురంజనుని భార్య, భాగవతం చతుర్థస్కందంలో పురంజనోపాఖ్యానం సందర్భంలో ప్రమదోత్తమ పాత్ర ఉంది.

పురంజోనుడు తన భార్య ప్రమదోత్తమను స్మరిస్తూ మరణించాడు. అందువల్ల మరుజన్మలో పురంజనుడే విదర్భరాజు ఇంట్లో ప్రమదోత్తమగా జన్మించింది. 'నులయకేతుడు' అను 'పాంధ్యరాజు'ను వివాహం చేసు కున్నది. వీరికి ఏడుగురు కుమారులు, ధృతవ్రత అనే కుమార్తె జన్మించారు.

**కుబ్జ :**

కంసుని దాసి, మధురా నగరంలోని ఒకానొక గూని స్త్రీ. ఈమెకు త్రివక్ర అని కూడా పేరు. భాగవతం దశమస్కంధం పూర్వభాగంలో శ్రీకృష్ణుడు బలరామునితో కలిసి మధురరాజు వీధిలో వెళుతున్న సందర్భంలోను కంసుని చంపిన శ్రీకృష్ణుడు ఉద్ధవునితో కలసి కుబ్జ గృహానికి వచ్చు సందర్భంలోను, దశమస్కంధం ఉత్తర భాగంలో శ్రీకృష్ణుని సంతానం గురించి తెలుపు సందర్భంలో ఈ పాత్ర కనిపిస్తుంది. కుబ్జ కంసునికి సుగంధ ద్రవ్యాలను సిద్ధం చేస్తుండేది. మధుర రాజ వీధిలో వెళుతున్న బలరామకృష్ణులు కుబ్జను చూసి, ఈలేపనాలు మా కివ్వు అనగా ఆమె తిరస్కరించి నేను కంసుని దాసిని ఆ లేపనాలు అతని కోసమే అని పలికింది. బలరామకృష్ణుల చూపులు, పలుకులు మనసును కరిగించగా ఆమె ప్రేమతో వారికి లేపనాలు ఇచ్చింది. ఆమె కృష్ణుని తన ఇంటికి ఆహ్వానించగా నాపని పూర్తయిన తర్వాత వస్తాను అని చెప్పి ముందుకు సాగాడు. కృష్ణుడు కంసుని చంపిన తర్వాత ఆమె ఇంటికి పోయి ఆమె కోర్కెను తీర్చి సంతృప్తి పరిచాడు. ఈమెకు కృష్ణుని వలన ఉపశ్లోకుడు అను పుత్రుడు జన్మించాడు.

**ముగింపు :**

సాధారణంగా ఏ కావ్యాలలోనైనా ప్రధానపాత్రలే గుర్తుకు వస్తాయి. చిన్న, చిన్న పాత్రలు గురించి అంత ప్రాధాన్యతను ఇవ్వరు. కాబట్టి భాగవతం లాంటి ప్రముఖ కావ్యంలో ఉన్న ప్రతి పాత్ర సజీవంగా చిత్రించబడింది. ముఖ్యంగా పైన పేర్కొన్న 'స్త్రీ' పాత్రలలోను అనేక నిజజీవిత సంఘటనలు, సమాజంలో ఉన్నటువంటి అనేక సామాజిక సమస్యలు చక్కగా చిత్రించబడ్డాయనడంలో సందేహంలేదు. స్త్రీలు ఎలా జీవించాలో కూడా చక్కగా తెలుసుకోవచ్చు.

# నన్నయ అరణ్య పర్వం - దమయంతి వ్యక్తిత్వం

- డా॥. ఈతకోట ఈశ్వర రావు, అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రగడ. ప్రాచీన తెలుగు సాహిత్యంలో కవిత్రయంగా స్థిరమైనస్థానం పొందారు. వీరు రచించిన ఆంధ్రమహాభారతం పద్దెనిమిది పర్వాల ప్రాచీన/ ఇతిహాసకావ్యం. నన్నయ ఆది, సభా, అరణ్య పర్వంలో సగం వరకు రచిస్తే, పదిహేను పర్వాలను తిక్కనసోమ యాజి రచించారు. అరణ్య పర్వంలో మిగిలిన సగ భాగాన్ని ఎఱ్ఱన్న పూర్తి చేసారు. నన్నయభట్టు రెండున్నర పర్వాల్లోని మొత్తం పదమూడున్నర ఆశ్వాసాల్లో ఎంతో మంది స్త్రీమూర్తుల ప్రస్తావన ఉంది.

అవతారికలో "శ్రీవాణిగిరిజా శ్చిరాయ దధతో..." అనే పద్యంలో లక్ష్మి, సరస్వతి, పార్వతి స్త్రీ దేవతామూర్తులను ప్రస్తుతించారు. ఉదంకుని కథలో ఉదంకుడు గురువు పైలుడి భార్య, శిష్యుడు ఉదంకునితో గురుదక్షిణగా పౌష్యమహారాణి కుండలాలను కోరుతుంది. పౌష్య మహారాణి వద్దకు పోయి అక్కడ ఆమె కనిపించక తిరిగి మహారాజు "వద్దకు వచ్చి "మహారాజా ! నాకు ఆమెకనిపించ లేదు. కనుక మీరు వెళ్ళి తెచ్చి ఇవ్వండి. "అని పలికిన ఉదంకునితో పౌష్యమహారాజు ఆమె మహాత్మా ! ఆమె మహా పతివ్రత, చాలా పవిత్రురాలు, ఆమె కనిపించాలంటే శుచి పాటించాలి." అని చెప్తాడు. ఆ మహత్కార్యానికి పూనుకున్న ఉదంకునికి ఎన్నో ఆటంకాలు ఎదురౌతాయి. నాగలోకం వెల్లాల్సివస్తుంది. అక్కడ ఉదంకునికి ఇద్దరు స్త్రీలు దాత, విధాతలు నలుపు,తెలుపు దారాలు వడుకుతూ దర్శనమిస్తారు. గురుపత్నికి ఉదంకుడు గురుదక్షిణ సమర్పిస్తాడు. అతనికి తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తానని పైలుడు మాట ఇస్తాడు. ఇలా మొదటి ఆశ్వాసంలో ఐదుగురు స్త్రీమూర్తుల ప్రస్తావన కనిపిస్తుంది. తరువాత ఆశ్వాసాల్లో, ఉపాఖ్యానాల్లో భాగంగా భృగుమహర్షి భార్య పులోమ, సుకన్య, ప్రమద్వర, వినతా, కద్రువ, పాల సముద్రం చిలికే సమయంలో ఉద్భవించిన లక్ష్మిదేవి, జనమేజయని సర్పయాగం నుండి నాగులను రక్షించే క్రతువులో భాగంగా ఆస్తికుడికి జన్మనిచ్చిన జరత్కారువు, గిరిక, అద్రిక అనే అప్సర, దక్షునికి ఏభై మంది కుమార్తెలు లలో అదితి, దితి, దను... పురూరవుని భార్య ఊర్వశి, నహుషుని భార్య ప్రియంవద, దేవయాని, శర్మిష్ట, సరస్వతినది, శకుంతల, తపతి, గంగాదేవి, కాశీరాజు కుమార్తెలు అయిన అంబ, అంబిక, అంబాలికల, ఉతథ్యుని భార్య మమత, ప్రద్వేషిణి, సుదేష్ణ, అంబాలిక దాసీ, గాంధారి, కుంతీ, మాద్రి, దమయంతి, ఋతుమతి, జలపద, ఘృతాచి, హిడింబ, శిఖండి, శక్తి భార్య, పరాశరుడు తల్లి అయిన అదృశ్యవంతి, కల్మాష పాదుని భార్య మదయంతి, జటిల అను ఋషి కన్య, దాక్షాయిని అనే కన్య, మహా పతివ్రతైన మౌద్గల్య ముని భార్య 'ఇంద్రసేన' మరు జన్మలో కాశీరాజు కూమార్తెగా జన్మించి, ద్రుపదుని ఇంట యజ్ఞసేనిగా పెరిగి పెద్దదైన ద్రౌపది, విశకర్మ సృష్టించిన తిలోత్తమ అనే సుందరి, ఉలూచి అనే నాగకన్య, చిత్రంగద, సుభద్ర, మొదలగు మహిళామణులెందరో కవిత్రయంలో మొదటివారైన నన్నయ భారతంలో తారసపడతారు. కథనుసరంచి ఆయా మహిళా మణులు, వారి గుణగణాలు, వ్యక్తిత్వం మకుటాయమానంగా నిలుస్తాయి. అటువంటి వారిలో ఒక మకుటాయమానమైన మహిళామణి దమయంతి.

## దమయంతి :

వన/అరణ్య పర్వం ద్వితీయాశ్వసంలో దమయంతి గురించిన కథ బృహదశ్వుడు అనే ముని ధర్మరాజుకు చెప్తాడు. విదర్భ దేశాన్ని పరిపాలించే భీముడనే అనే

రాజుకు చాలాకాలం సంతానం కలగదు. అతనికి దమనుడు అనే ముని ఇచ్చిన వరము వలన దమయంతి అనే కూతురు, దముడు, దమనుడు, దాంతుడు అనే కుమారులు కలుగుతారు. 'కన్యారత్న మగు దమయంతి దా నత్యంతకాంతి రూపాభిజాత్య విమల గుణ సమృద్ధి వెలుఁగుచు సురసిద్ధ సాధ్యకన్యలట్టి సఖులు నూర్వురొలసి తన్నుఁ గొలుచుచుండఁగ మహి నొప్పు చుండె నధిక విభవయుక్తితోడ'. దమయంతి సౌందర్యం గురించి విన్న నిషధదేశాన్ని పరిపాలిస్తున్న నలమహారాజు దమయంతిపై మనస్సు పడుతాడు. ఇరువురి నడుమ ప్రేమ పుడుతుంది. వారి ప్రేమకు హంస రాయభారిగా ఉంటుంది. నలుడు సౌందర్యవంతుడు, సంపన్నుడు, అని అతని గుణగణాలు, సౌర్య ప్రతాపాలను తెలిపిన హంసతో, దమయంతి ఇలా పలుకుతుంది. 'ఆ రాజు గుణములు నా కెఱింగించి నట్టులు నన్నుఁనా రాజునకు నెఱిగించి కరుణ నాయందు'...అంటుంది.ఆ హంస నడిపే రాయభారంతో ఇరువురికి ఒకరిపై ఒకరికి అనురాగం అధికమవుతింది. నల దమయంతుల ప్రణయ విషయం దమయంతి చెలికత్తెల ద్వారా తెలుసుకున్న భీమ మహారాజు కుమార్తె కొరకు స్వయంవరం ప్రకటిస్తాడు. స్వయంవరానికి వచ్చిన అనేక మంది రాజులను, దిక్పాలకులు ఎందరో వస్తారు. దమయంతి మనసా వాచ కర్మేణ తాను మనసు పడిన నలమహారాజును వరిస్తుంది. నలదమయంతులకు వైభవోపేతంగా వివాహం జరుగుతుంది. సంతోషంగా వారి వైవాహిక జీవితం కొనసాగుతుంది. దమయంతి దంపతులకు, కూతురు ఇంద్రసేన, కొడుకు ఇంద్రసేనుడు, పుడతారు. ఆనందగా సాగిపోతున్న వారి జీవితంలోకి కలి ప్రవేశించి, వారి కుటుంబ జీవితాన్ని ధ్వంసం చేస్తాడు. పుష్కరుడుతో జూదంలో సమస్తం పోయే వరకు ఆడుతున్న నలుడిని నిలవరించే సందర్భంలో " ఓడేకొద్ది గెలవాలని పంతం పెరుగుతుంది. ఏమీ చెయ్యలేము" అని దమయంతి దుఃఖితరాలవుతుంది. జరిగే దుస్థితిని ముందుగానే గ్రహించి కుమార్తెను, కుమారుడును సారథిని తోడిచ్చి విదర్భలో ఉన్న తండ్రి వద్దకు పంపుతుంది. జూదంలో సర్వం కోల్పోయి, చివరికి పై వస్త్రాన్ని కూడా పోగొట్టుకున్న నలునికి తన కొంగును పైవస్త్రంగా కప్పి తన భర్త వెంట అడవులకు వెళుతుంది.

అడవుల్లో నిర్దాక్షణ్యంగా ఒంటరిగా విడిచిపెట్టిపోయిన తన పతినే తలచుతూ, అతన్ని అన్వేషిస్తూ దారీతెన్నూ లేకుండా ప్రయాణిస్తున్న దమయంతికి మునులు కనిపిస్తారు. వారితో తన గోడంతా వెళ్లబుచ్చుకుంటుంది. వారిచ్చే అభయంతో దమయంతి పిచ్చిదానిలా భర్తను వెతుక్కుంటూ ఆ అడవిలో తిరుగుతూ, బాటుసారుల వెంట బయలుదేరి ఛేదిదేశ రాజధాని సుబాహుపురం చేరుతుంది. ఒళ్ళంతా దుమ్ముతో వీధిలో వెళుతున్న దమయంతిని రాజమాత చూసి దాసీలను పంపి దమయంతిని అంతఃపురానికి పిలిపించి తన వివరాలు అడడగుతుంది. దమయంతి తన గతాన్ని చెప్పుకుని విచారిస్తుంది. రాజమాత నా దగ్గర సైరంధ్రి [దాసీరిగా ఉండు. నీకు ఏ లోటూ రాకుండా నేను చూస్తాను. నీ భర్తను వెతికిస్తాను అన్న రాజమాతతో. దమయంతి అంగీకరిస్తూ "అలాగే ఉంటాను, కానీ నేను సైరంధ్రిగా ఎవరి ఎంగిలీ తినను, పరులకు కాళ్ళుపట్టను, పరపురుషులతో మాట్లాడను. కేవలం నా భర్తను వెతుకుతూ వెళ్ళే బ్రాహ్మణులతో మాత్రం మాట్లాడు తాను" అంటుంది. రాజమాత అంగీకరించి తన కుమార్తె సునంద వద్దకు పంపుతుంది. దమయంతి అక్కడే ఉంటుంది.

అడవులపాలైన నలుడు కర్కోటకుడు అనే పాము కాటువల్ల వికృతరూపంతో, ఋతుపర్ణుడనే రాజువద్ద బాహుకుడు అనే పేరుతో రథసారథిగా చేరుతాడు, అతని వంటశాలలో రుచికరమైన వంటలు వండే వాడిగా కూడా కొనసాగుతాడు. విదర్భదేశ రాజు భీముడు తన అల్లుడు, కూతురు ఆచూకి తెలుసుకుని రమ్మని నలువైపులా బ్రాహ్మణులను పంపుతాడు. ఛేదిదేశం చేరిన విప్రుడొకడు, దమయంతి నుదుటన ఉన్న పుట్టుమచ్చని చూసి ఆమెను

గుర్తిస్తాడు. అతనితో దమయంతి తన పుట్టిల్లు చేరుతుంది. దమయంతి పుట్టిల్లు చేరి భర్తృవియోగంతో అనుక్షణం చింతపడుతుంది. కూతురు వేదనను చూడలేక తన అల్లుని వెదకమని పంపే విప్రులతో దమయంతి నా భర్త ఇప్పుడు రాజ్యభ్రష్టుడు కనుక, మారు వేషంలో ఉంటాడు కాబట్టి తనకు రోషంకలిగించేలా పరుషంగా మాట్లాడండి. ఆమాటలకు ఎవరైతే స్పందిస్తారో వారిని గురించి నాకు చెప్పండి అని తెలివిగా పలుకుతుంది. పర్ణాదుడు అనే విప్రుడు ద్వారా తన భర్త జాడ గ్రహించిన దమయంతి తల్లి అనుమతితో ద్వితీయ స్వయంవరం ప్రకటిస్తుంది. కురూపంలో బాహుకుడుగా ఉన్న నలుడు దమయంతి ద్వితీయ స్వయంవరానికి ఋతుపర్ణునితో పయనమవుతాడు. మార్గ మధ్యలో ఋతుపర్ణుని అక్షహృదయ విద్య మహిమవలన నలునిలో నుండి కలి వెలుపలికి వచ్చి క్షమాపన కోరుతాడు. ఋతుపర్ణునితో కురూపంలో బాహుకుడుగా ఉన్న నలుడుని చూచి దమయంతి అది నలుని రథం అని గుర్తుపట్టి, తన దాసి కేశినితో "వచ్చింది ఋతుపర్ణ మహారాజు అతని సారథి వార్ష్ణేయుడు. వారు నాకు తెలుసు, కాని వారి వెంట ఉన్న కురూపి ఎవరు? అతనిని చూసి నా మనస పరవశించి పోతుంది. అతని వివరాలు తెలుసుకుని రా" అని పంపుతుంది. దాసి సేకరించి చెప్పిన అనేక విషయాలు విని దమయంతి సంతోషపడి తన తల్లితో చెప్తుంది. తల్లిదండ్రుల అనుమతితో నలుని కలుసుకుని, భర్త పిల్లలతో తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందకుని సంతోష హృదయరాలవుతుంది.

## దమయంతి వ్యక్తిత్వం - చిత్రణ :

యుక్తవయస్సుకు వచ్చిన దమయంతి వయసు ప్రభావంచేత సహజంగానే నలుడిపై అనురాగం పెంచుకుంటుంది. తన ప్రమేయంలేకుండా తనవద్దకు వచ్చిన రాయభారి హంసతో తన వివరాలు తెలపమని తిరిగి పంపిస్తుంది. ఇంద్రాది దేవతలు స్వయంవరానికి వచ్చి తమని వరించమని కోరితే పూజ్యభావంతో తిరస్కరించి, తాను మనసుపడిన నలుని వరిస్తుంది. కలి ప్రేరేపితుడై పంతంతో జూదమాడిన తన భర్తను'ఎంత యోటువడిన నంతియ జూదంబు ఎనందుఉ దగులు,.. అంటూ నిలువరిస్తుంది. సమస్తాన్ని కోల్పోయిన తమ స్థితిని పసికట్టి ఒక తల్లిగా తన పిల్లల క్షేమాన్ని కోరుకుంటుంది. నాతో అడవుల్లో ఏ పాట్లు పడతావు క్షేమంగా ఉండు అనిపలికిన తన భర్తతో అధికదుఃఖరోగార్తున కౌషధంబును రుచిరంబుగ భార్యయచూవెయెందు, నొనర భార్యాస మేతుడైయున్నవాని కెంతలయ్యును నాపద లెఱుకపడవు. అలసి నెడ, డస్సి నెడ, కలి దప్పియు నైన యెడల గడుకొని ధరణీ

తలనాథ! పురుషునకు ని మ్ముల భార్యయ పాచు జిత్తమున దుఃఖంబుల్ అని పతి ప్రత్యక్షదైవమని భారత స్త్రీ ధర్మాన్ని చాటుతుంది. అడవుల్లో విడిచి వెల్లిన భర్తనే స్మరిస్తూ తిరుగుతుంది. ఒంటరైన తనను కిరాతుడు తాకడానికి ప్రయత్నిస్తే శపించి భస్మం చేస్తుంది. తప్పిపోయిన తన భర్తను కలుసుకోవటానికి అంకుటిత దీక్షతో ఎదురుచూస్తుంది. విదర్భ చేరిన తన భర్తను కలుసుకొనుటకు తొందర పడకుండా తన తల్లితో సందియ మేల? సర్వగుణసంపద జూడగ బాహుకుండు భూఎ వందితుఉడైన నైషధు డవశ్యము దా నగుబీ నా ఎ మనంబు నా నందముఉ బొందుచున్నది ఘనంబుగబీ వాఉ డిట వచ్చువాఉడొ? యేఎ నందుల కేఉగుదాననొ? రయంబున నాపని నిశ్చయింపుమా!' అని అడుగుటలో తల్లిదండ్రులకు ఎలా పిల్లలు లోబడి జీవించాలో లో దమయంతి వ్యక్తిత్వం ద్వారా అర్థం అవుతుంది. దమయంతి తల్లి భీమరాజు అనుమతితో బాహుకుడిని దమయంతి వద్దకు రప్పిస్తుంది. దమయంతి నలుని చూసి, "అయ్యా నిస్పహాయంగా ఉన్న నన్ను నా భర్త నట్టడవిలో నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్ళాడు. అలా సంతానవతినైన నన్ను విడిచి పెట్టడం ధర్మమా? అలా చేయడానికి నేనేమి అపకారం చేసాను? అగ్ని సాక్షిగా విడువను అని నాకు ప్రమాణం చేసిన భర్త అలా చేయవచ్చా?" అని

దుఃఖించింది. దమయంతి "నాథా నేను మీకోసం గాలిస్తూ పంపిన విప్రులలో అయోధ్యకు వెళ్ళిన విప్రుడు మిమ్ములను గుర్తించాడు. మిమ్మలిని రప్పించుటకే ఇలా చేసాను. మీరుకాక, ఇంకెవరు నూరు యోజనాలు దూరం ఒక్క రోజులో ప్రయాణించగలరు? నాలో ఎటువంటి పాపపు తలపు లేదు అని మీ పాదములు అంటి నమస్కరించి ప్రమాణం చేస్తున్నాను" అని దమయంతి నలుని పాదాలకు నమస్కరించింది. వెంటనే ఆకాశం నుండి వాయుదేవుడు "నలచక్రవర్తీ! ఈమె పవిత్రురాలు, పతివ్రత. నేను, సూర్యుడు, చంద్రుడు ఈమె సౌశీల్యం కాపాడుతున్నాము" అని పలికటం ద్వారా దమయంతి వ్యక్తిత్వం ఎంత గొప్పదో తెలుస్తుంది. నలుడు కర్కోటకుని స్మరించాడు వెంటనే ఒక వస్త్రం వచ్చింది. అది ధరించగానే నలునికి ఇంద్రతేజస్సుతో సమానమైన మనోహరమైన పూర్వరూపం వచ్చింది. నలుడు దమయంతిని పరిగ్రహిస్తాడు.

**దమయంతి నలునితో తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందుట :**

నలుడు విదర్భలో ఒక మాసం ఉండి, తన రాజధానికి వెళ్ళి పుష్కరుని కలిసాడు. నలుడు పుష్కరునితో "పుష్కరా!జూదమాడటం నీకు ప్రియం కదా. నేను నా భార్య దమయంతిని ఫణంగా పెడతాను, నీవు నీ సర్వస్వం పెట్టి నాతో ఆడతావా? లేదా నాతో యుద్ధం చెయ్యి, ఎవరు గెలిస్తే వారిదే రాజ్యం. నీకేది ఇష్టమో నిర్ణయించుకో" అన్నాడు. పుష్కరుడు జూదప్రియుడు పైగా ఒకసారి జూదమాడి గెలిచాడు కనుక అతడు నలునితో "నేను జూదమే ఆడతాను" అన్నాడు. నలుడు పుష్కరునితో జూదమాడి రాజ్యాన్ని గెలుచుకున్నాడు. పుష్కరునితో "పుష్కరా, నేను ఇదివరకు నీతో జూద మాడినపుడు నన్ను కలి ఆవహించి ఉన్నాడు. కనుక ఓడి పోయాను, నీబలం వలన కాదు. నీవు నా పిన తండ్రి కుమారుడివి కనుక, నిన్ను ఏమి చేయను వెళ్ళు" అని చెప్పి పంపాడు. ఇంకా బృహదశ్వుడు నలచరిత్ర విన్నవారికి కలిదోషములు ఉండవని నాగుడైన కర్కోటకుని, దమయంతిని, నలుని, రాజర్షియైన ఋతుపర్ణుని తలచిన వారికి కలిబాధింపదని ఈ శ్లోకము చెప్పాడు "కర్కోటకస్య నాగస్య దమయంత్యాః నలస్యచ ఋతు పర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనం".

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీ మదాంధ్ర మహాభారతము-4వ సంపుటం అరణ్యపర్వం భాగం-1 -తిరమల తిరుపతి దేవసానం.తిరుపతి.
2. అంతర్జాల సమాచారం.

# ఓల్గా రాజకీయ కథలు - స్త్రీవాదం

- డా॥. కె. సుజాత, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, పి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు.

ఓల్గా రాసిన రాజకీయ కథలు పరిపూర్ణంగా స్త్రీవాదం ప్రతిఫలించిన కథలు. పేరు వినగానే ఈ కథలు రాజకీయానికి సంబంధించిన కథలు అనుకుంటాము. కానీ ఇవి రాజకీయానికి సంబంధించిన కథలు కావు. స్త్రీలపై తరతరాలుగా జరిగిన రాజకీయ, సామాజిక కుట్రలను బట్టబయలు చేసిన కథలు. సీత జడ, కళ్ళు, ముక్కుపుడక, రాతి గుండెలు, నోర్ముయ్ మొదలగు కథలన్నీ స్త్రీల శరీరాల చుట్టూ అల్లబడిన భావజాలం. సమాజం స్త్రీల విషయంలో చేసిన కుట్రలను, కుళ్ళును బహిర్గతం చేస్తాయి. స్త్రీలను స్త్రీలుగా తయారు చేయడానికి ఎంత పకడ్బందీగా జండర్ విధానం సమాజంలో తయారయిందో తెలిపే కథలే ఈ రాజకీయ కథలు.

**సీతజడ :**

సీతజడ అనే కథలో స్త్రీల జుట్టు విషయంలో సమాజం విధించే ఆంక్షల గురించి చెప్తూ ఒక స్త్రీ, జుట్టు పెంచాలా వద్దా అనే విషయాన్ని నిర్ణయించేది సాంఘికశక్తులేనని చెప్తారు రచయిత్రి. సీత అనే అమ్మాయికి పొడుగాటి పట్టుకుచ్చులాంటి అందమైన జుట్టు ఉండేది. సీత పదో తరగతికి వచ్చేసరికి రెండు జడలమీద ఇంట్లో తీవ్ర వ్యతిరేకత మొదలయింది. సీతకి ముప్పయ్యేళ్ళ వయ సప్పుడు భర్త మరణిస్తే వాళ్ళ నాయనమ్మ జుట్టు తీసేయాలని పెద్ద యుద్ధమే చేసింది. సీత అన్నలు అందుకు ఒప్పుకోకపోవడంతో సీతకి జుట్టు మిగిలింది, కానీ దాని పోషణ పూర్తిగా పోయింది. సీత జడకి నూనె పెట్టుకోవడం కూడా ఆమె వదినలు సహించేవారు కాదు. ఇంకెన్నాళ్ళు వాలుజడ వయ్యారం, ముడేసుకోరాదూ అని నిష్టురమాడేవారు. చిన్నతనంలో సీత పెద్ద జడతో విసిగి పోయి గుండు చేయించుకోవాలనుకుంటే తల్లి ఒప్పుకోదు. స్త్రీల జడ విషయంలో ఇంతమంది పెత్తనాలు, నియమాలు, ఆంక్షలు ఎందుకొచ్చాయి? ఆడదాని జుట్టునింత గట్టిగా పట్టుకున్న సమాజం ఆడదాన్ని ఇంకెంత గట్టిగా పట్టుకుంటుంది అని ప్రశ్నిస్తారు రచయిత్రి ఈ కథ ద్వారా.

**కళ్ళు :**

ఆడవాళ్ళకి కళ్ళున్నా చాలా విషయాలు చూడలేరని ఈ సమాజం చూడనివ్వదని తెలియచేసిన కథ కళ్ళు అనే కథ. వీధిలో నడిచేటప్పుడు 'అలా దిక్కులు చూస్తావేం, తలొంచుకు నడువు, నేలమీద చూడు' అని మొట్టికాయలు వేస్తుంది తల్లి. ఆడవాళ్ళు కొన్నిటిని మాత్రమే చూస్తే చాలని జీర్ణించుకుపోయిన తల్లి ఆమె. ఆడవాళ్ళ కళ్ళ వెంట నీళ్ళు ఊరికూరకే రావాలని నమ్మే ఆమె 'రాతిగుండె కంటి వెంట చుక్కనీరు రాలేదు' అని పక్కింటామెని తిడుతుంది. చాలా విషయాలను కళ్ళు మూసుకుని, నోరు మూసుకుని చూసీ చూడనట్లుగా ఉండేవిధంగా ఆడవాళ్ళను తయారు చేసిన సమాజం కుట్రను ఈ కథలో బహిర్గతం చేశారు రచయిత్రి.

**రాతిగుండెలు :**

బ్రెస్ట్‌కాన్సర్ పేషెంటు సుశీల బాధపడవద్దని తనను ఓదార్చుతున్న డాక్టర్ హేమతో 'డాక్టర్ మీకు తెలుసా నేను ఎన్నోసార్లు నా రొమ్ములను కత్తిరించుకోవాలను కున్నాను. బహుశా అందుకే నాకీ కాన్సర్ వచ్చిందేమో'. అని అడుగుతూ మీ గుండెలమీద మీకెప్పుడూకోపం రాదా అని ప్రశ్నిస్తుంది. ఆమె అలా ప్రశ్నించడం వెనుక ఆమె పడిన ఆవేదన అర్థం అవుతుంది. అలా అడగడం సమాజంలోని ఒకానొక నీచప్రవృత్తిని కొరడాతో చెళ్ళున కొట్టినట్లనిపిస్తుంది. డాక్టర్ హేమతో తన మనోభావాలు పంచుకుంటూ చిన్నప్పటినుండి తనకెదురైన చేదు

అనుభవాలు చెప్తుంది. క్లాసులో తనని తడిమిన మాస్టారి చేయి అతని మాటలు, అతని వెకిలి చేష్టలు, ఇంట్లో శంకరం మామయ్య వెకిలి చేష్టలు, ఇలాంటివే మనసుని కలచివేసిన మరికొన్ని సంఘటనలతో మగాళ్ళని ఆకర్షించే తన గుండెల్ని తిట్టుకుంటూ ఎన్నోసార్లు ఏడుస్తుంది. ఇంట్లో, వీధిలో, బస్సుల్లో, స్కూల్లో ఇలా ప్రతిచోటా ఇలాంటి చేదు అనుభవాలతో ఆమె గుండెలు రాతి బండలైపోయాయి. చివరకు ఆమెలో రగిలిన ద్వేషం, కోపం పాలనుకూడా ఇంకించివేయగా తన పిల్లలకి పాలివ్వలేని దుస్థితికి ఆమెలో ఇంకిన పాలన్నీ కన్నీళ్ళయి ప్రవహిస్తాయి. తనకొచ్చిన రొమ్ముకాన్సర్‌కి తాను భయ పడడంలేదని మహా అయితే రొమ్ము తీసేస్తారు అంతేనని, అయితే సమాజంలో పెరిగిపోతున్న లైంగికవేధింపులనే కాన్సర్‌ని ఎలా నశింపచేయాలని ప్రశ్నిస్తారు రచయిత్రి సుశీల పాత్ర ద్వారా.

## అయోని :

లైంగిక అత్యాచారానికి గురైన పదేళ్ళ చిన్నారి బల వంతాన వేశ్యాగృహానికి అమ్మివేయబడుతుంది. శరీరంకూడా ఎదగక ముందే రోగాలపుట్టగా మారిపోయిన ఆ చిన్నారి ఒకరోజు లవకుశలోని అయోనిజపైనే అనుమానమా అనే పాట విని తను కూడా ఆయోనిగా పుట్టిఉంటే బాగుండేదని అదుండబట్టే ఈ నరకకూపంలోకి తీసుకురాబడిందని, దానివల్లే తనవంటి చిన్న చిన్న పాపలు ఈ నరకకూపంలోకి తీసుకురాబడుతున్నారని, అలా తీసుకువచ్చే తాచుపాముల్ని పొడిచి పొడిచి చంపమని, ఈ వ్యాపారాన్ని ఆపమని చెప్పే ఓ చిన్నారి ఆవేదనే ఈ కథ. ఈ కథ చదివి కూడా చలించని మానవ హృదయం ఉంటే అది కేవలం బండరాయి మాత్రమే. ఈ లైంగికవ్యాపారానికి బలైపోతున్న చిన్నారి పాపలందరికి రక్తపు కన్నీళ్ళతో ఈ కథ అంకితం అంటారు రచయిత్రి.

## నోర్ముయ్ :

'ఆడపిల్లకంత నోరు పనికిరాదు, నోర్ముయ్' వంటి మాటలు చిన్నప్పటినుండి వినివిని విసుగెత్తిన జానకికి ఆడపిల్లలకి నోరు ఎందుకుండకూడదో అర్థమయ్యేది కాదు, గానీ పెద్దవాళ్ళు చిన్నపిల్లలను నోరుముయ్య మంటారని, చిన్నపిల్లల్లో కూడా ఆడపిల్లలని ఈ మాట ఎక్కువ అంటారని అర్థం చేసుకుంది. బీదవాళ్ళని, తక్కువ కులంవాళ్ళని, ఆడవాళ్ళని నోరుముయ్యమని అంటారని గ్రహించిన జానకి అతి తక్కువ మాట్లాడడం ప్రయత్న పూర్వకంగా అలవరచుకుంటుంది. అలా క్రమంగా నోరువిప్పకుండా పనులు చేయడం అలవరచుకున్న జానకి క్రమంగా తన తలకాయలో మాటలు పుట్టడం తగ్గిపోయిందనీ, తను మాట్లాడే శక్తిని క్రమంగా కోల్పో యిందని గ్రహించలేకపోతుంది.

పెళ్ళయిన తర్వాత భర్త ముంగిలా మాట్లాడవేం అని కసురుకుంటుంటే ఎప్పుడో మాట్లాడడం మర్చిపోయిన జానకి మాటలు నేర్చుకోవడానికి పెద్ద యుద్ధమే చేస్తుంది. అయితే జానకి అతనికి కావలసినంతవరకు, అతను ఆశించినంతవరకు మాట్లాడితే బాగానే ఉండేవాడేమో గానీ అంతకు మించి మరికొన్ని విషయాలు అడగడం మొదలు పెట్టే సరికి మళ్ళీ అతనికి చిరాకు మొదలై నోర్ముయ్ ఆడదానికంత నోరు పనికిరాదు, నోరు మూసుకుపడి ఉండమంటాడు. ఆ మాటకి కళ్ళనుండి నీళ్ళు కారేలా నవ్వుతుంది జానకి. స్త్రీల మాటల్ని, ఊహల్ని, ప్రతి కదలికను సమాజం ఏవిధంగా పరిశీలిస్తూ ఉం టుందో, విమర్శిస్తూంటుందో ఈ కథలు చెప్తాయి.

## కేసు :

బిడ్డ సంరక్షణ భార్యాభర్తలిద్దరిదీ కావాలని చెప్పే ఈ కథలో బిడ్డ సంరక్షణ కాస్త చూడమని భార్య భర్తనడిగితే అసలు నువ్వే నాకు ఒద్దు పొమ్మంటాడు భర్త. ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త భార్య ఇచ్చే సుఖం, చేసే చాకిరి, అందించే జీతం పెంచే కొడుకు అన్నీ తీసుకుని అట్లా తీసుకోవడమే ప్రేమ అని, అదే ఆమెకు భద్రత అని నమ్మించి ఎప్పుడూ తీసుకోవడమే తప్ప ఇవ్వడం తెలీని అతను కొంచం ఇవ్వమంటే - అతని ఇంటి పేర చలామణి అయ్యే బిడ్డకి కొంత సమయాన్ని కేటాయించ

మంటే పశువులా కుమ్మే అతను తనకెందుకు అను కుంటుంది భార్య. మగవాళ్ళ/భర్తల మంచితనం భార్యల విధేయత మీద ఆధారపడి ఉంటుందనుకున్న భార్య.

ఈ కథలో పిల్లల్ని పెంచడం కోసం తల్లికి ఆరునెలలు మెటర్నిటీ శెలవు తర్వాత పిల్లల్ని పెంచే బాధ్యత తండ్రి తీసుకోవాలని అందుకుగాను రెండేళ్ళపాటు అతనికి పని గంటలు తగ్గించి రోజుకి నాలుగ్గంటలు మాత్రమే పనిగంటలు ఉండేలా చూడాలని పిటిషన్ వేస్తుంది రమ్య. సమాజంలో మౌలికంగా మార్పురాకుండా చట్టాలవల్ల ఆలోచనల్లో మార్పులు వస్తాయనుకోవడం అవివేకం. మగవాళ్ళు కూడా ఇంటి పనుల్లో భాగం పంచు కోవాలన్న ఆలోచన అందరిలోనూ రావాలి. ఆ మార్పు సమాజానికి చాలా అవసరం. అయితే ఆ మార్పు చట్టాల వల్ల సాధ్యం కాదని గ్రహించాలి.

అయితే ఈ కథలో రమ్య వేసిన పిటిషన్ ప్రకారం తల్లికి ఆర్నెల్లపాటు మెటర్నిటీ శెలవు ఆ తర్వాత రెండేళ్ళ పాటు బిడ్డ సంరక్షణ తండ్రిది అనడం అర్థంలేనితనం. బిడ్డకు సంబంధించిన లేదా ఇంటికి సంబంధించిన పనులు భార్యాభర్తలిద్దరూ లేదా కుటుంబసభ్యులందరూ ఎవరివీలునిబట్టి వారు సమానంగా పంచుకుని పని చేసుకోవాలి తప్ప నేను కష్టపడి కన్నాను, ఆర్నెల్లు పెంచాను కాబట్టి రెండేళ్ళు నువ్వు పెంచు అని వాదిం చడంలో అర్థంలేదు. అంతే కాకుండా తల్లిపాలు బిడ్డకి ఎంతో అవసరం కనుక ఆ పనిగంటల తగ్గింపు తండ్రికంటే తల్లికే నిజానికి అవసరం. ఏదేమైనా మగవాళ్ళు ఇంటి పనుల్లో పాలుపంచుకోవాలనే విషయం బలంగా చెప్తుంది ఈ కథ.

## ఒక రాజకీయ కథ :

అన్నింటికి యూనియన్లు ఉంటాయి కానీ గృహిణికి గృహ జీవితంలో రకరకాలుగా దోపిడీకి గురయ్యే స్త్రీలకు యూనియన్లు ఉండవు, రక్షణ ఉండదు. యూనిటీ ఉ ండదని చెప్పే కథ ఒక రాజకీయ కథ. ఆడవాళ్ళు వాళ్ళ కష్టాలో ఒంటరిగానే ఎందుకు నిలబడ్డారో, ఆడవాళ్ళం దరూ ఒకటిగా ఎందుకు లేరో తల్లులుగా, భార్యలుగా, కోడళ్ళుగా, కూతుళ్ళుగా ఎందుకు విడిపోయారో ఆలో చింప చేస్తూ స్త్రీల జీవిత గమ్యం - తోటి స్త్రీలందరితోటి చేయి కలపడంలోనే ఉండి అనే చక్కని సత్యాన్ని బోధించే కథ ఈ ఒక రాజకీయ కథ.

## ఆర్తి :

పరుగెత్తితే తప్పు, పెద్దగా నవ్వితే తప్పు చిన్నప్పటి నుండి ఆడపిల్లల్ని ఇలాంటి ఎన్నో ఆంక్షల మధ్య పెంచి ఉత్సాహాన్నంతా చంపేసి బొమ్మల్లా ఎలా తయారు చేస్తారో తెలిపే కథే ఆర్తి. ఎంతో హుషారయిన ఒక అమ్మాయి ఆ విధంగా బొమ్మ కాలేక పెళ్ళయి అమ్మ అయిన తర్వాత కూడా అంతే హుషారుగా ఉండడం చూసి ఆమె హుషారును సహించలేని ఆమె భర్త వేధిం చడం ఎక్కువయితే ఆ వేధింపుని తట్టుకోలేక అతన్నుండి వేరవుతుంది. అయితే అప్పుడు కూడా ఆమెను వేధించ డానికి అతను ఎన్నుకున్న అస్త్రం పిల్లల్ని ఆమె నుండి వేరు చేయడం. కని పెంచిన తల్లికి బిడ్డలపై హక్కు లేదనడంతో ఆమె తట్టుకోలేకపోతుంది.

తన రక్తం తన ఊపిరి, తన ప్రాణమైన పిల్లలు, తన శరీరం చీల్చుకు బయటపడ్డ పిల్లలు తన పిల్లలు కాక ఇదిగో చూడండని రోజుల పిల్లవాడిని ఒడిలో పడుకో బెడితే ఛీ ఛీ నాకు చీదర తీసెయ్ అన్న అతనికి పిల్లవాడు ఉచ్చపోస్తే చీదరించుకుని ఉయ్యాలలో పారేసి వెళ్ళి పోయిన అతని పిల్లలెలా అయ్యారో ఆమెకి అర్థం కాదు.

ఆ పిల్లలు ఆమె పిల్లలు కావాలంటే అతనితో కలిసి ఉండాలనే ఆంక్ష, నిర్బంధం ఏంటో అర్థంకాక, తన మాతృత్వం, తన స్వతంత్ర్యాన్ని హరించడం సహించలేక పోయిన ఆమె బిడ్డను సంరక్షించుకోవడం నా సహజ స్వభావం, నా హక్కు, ఆ హక్కును నాకు ఎవరూ ఇవ్వా ల్సిన పనిలేదు, మాతృత్వాన్ని ఇచ్చిన ప్రకృతే ఆ హక్కును కూడా నాకిచ్చిందని నా హక్కు కోసం పోరాడి జయిస్తాను అని ఆమె అనుకోవడంతో కథ ముగుస్తుంది. సమాజంలో

సగభాగమైన స్త్రీల విషయంలో చక్కని అవగాహన ఇస్తూ, ఆలోచింపచేసే ఈ రాజకీయ కథలు ప్రతి ఒక్కరూ చదవాల్సిన కథలు. బాలల సంక్షేమ కమిటి, జెజె బోర్డు, జిల్లా బాలల రక్షణ విభాగం బాలికల సదనాలు చిల్డ్రన్ హెూమ్స్ కుటుంబ హింస నుండి మహిళల రక్షణ చట్టం లైంగిక వేధింపుల నుండి బాలల రక్షన చట్టం బాల్య వివాహాల నిరోధక చట్టం మానవ (మహిళలు/బాలికల అక్రమ రవాణా నిషేధ చట్టం బాలకార్మిక నిషేధ చట్టం, నిర్భయ చట్టం ఆడపిల్లల చదువు అవనికి వెలుగు వివాహాల తప్పనిసరి నమోదు చట్టాన్ని గురించి తెలుసుకుందాం, వివాహాల నమోదుకు సహకరిద్దాం, బాల్య వివాహాలు, అక్రమ వివాహాలకు అడ్డుకట్ట వేద్దాం.

❀ ❀ ❀

# తెలుగు సినిమా పాటల్లో స్త్రీ

**- డా॥. చింతల రాకేశ్ భవాని,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్, రంగారెడ్డిజిల్లా.

సాహిత్యంలో సినిమా పాటది ఒక ప్రత్యేక స్థానం. ఇతర సాహిత్యాల్లా ప్రశాంతంగా కూర్చుని చదువుకొని ఆనందించి ఆస్వాదించేది కాదు ఇది. "సద్యః పర నిర్వృతి" కలిగాలి. విన్న వెంటనే భావం స్ఫురించి ఆనందోదయం కావాలి. అర్థం కాకుంటే వెనక్కి మళ్ళీ మళ్లీ చదువుకునే అవకాశమే లేదు మరి. ఇది ఒకరకంగా లిఖించబడ్డ అలిఖిత సాహిత్యం కిందే లెక్క. పండిత పామరులు ఇద్దరికీ ఒక్కతీరుగా ఒక్కసారిగా అర్థం కావాలి, రసాస్వాదన జరగాలి. అర్థం చేసుకోవడానికి ప్రయత్నం అంటూ ఏమీ ఉండదు. విన్నంతనే అర్థం అయిపోవాలి. లేకుంటే ఆ సాహిత్యం, ఆ పాట విఫలం అయినట్లే. ఇది సినిమా పాట ప్రత్యేకత.

స్త్రీ లేకుండా సాహిత్యం ఉండదు. సినిమా పాట కూడా ఇందుకు మినహాయింపు కాదు. ప్రకృతి స్వరూపిణి, శక్తి స్వరూపిణి అయిన స్త్రీని ఏవిధంగానైతే వర్ణించి ఇతర సాహిత్యం పరిపుష్టం అయ్యిందో అలానే సినిమా పాట కూడా అయ్యింది. అటువంటి ఒకపాట-

మగువా మగువా లోకానికి తెలుసా నీ విలువా
మగువా మగువా నీ సహనానికి సరిహద్దులు కలవా

'వకీల్ సాబ్'(2021) సినిమాలో రామజోగయ్య శాస్త్రి రాసిన పాట ఇది.

నీ కాటుక కనులు విప్పారకపోతే ఈ భూమికి తెలవారదుగా
నీ గాజుల చేయి కదలాడకపోతే ఏ మనుగడ కొనసాగదుగా

అంటూ ప్రతిపదంలో స్త్రీమూర్తి గొప్పతనాన్ని తెలియజేస్తూ సాగే ఒక మంచిపాట ఇది. మళ్ళీ మళ్ళీ వినాలనిపించే పాట.

అయితే తెలుగు సినిమా పాటలలో ప్రణయగీతాలు అధికం. సందర్భాసందర్భ సందర్భాలలో అవసరంగా వచ్చేటువంటి గీతాలు అవి. వాటిల్లోని ప్రియురాలు ప్రేక్షకుల్ని మురిపించి మైమరపిస్తుంది. సింహభాగం సినిమా గీతాలు ఇవే అయినా మబ్బుల్లో మెరుపులాగా అక్కడ అక్కడ హృదయాలను తాకేలా స్త్రీని ఉన్నతంగా అభివర్ణించే గీతాలు కూడా ఉన్నాయి. వేలాది సినిమా పాటలలో అటువంటివి కోకొల్లలుగా కనిపించినా మొత్తంలో చూస్తే మాత్రం కొన్నే అవి. తల్లిగా, భార్యగా, సోదరిగా, ప్రియురాలిగా, శ్రేయోభిలాషిగా మనిషి జీవితంలో స్త్రీ పాత్రని, ప్రాముఖ్యతని గుర్తుచేస్తాయి. వీటూరి, డా. సి. నారాయణరెడ్డి, వేటూరి సుందర రామ్మూర్తి, సిరివెన్నెల సీతారామశాస్త్రి, రామజోగయ్యశాస్త్రి తదితర కవులంతా మహిళను సినిమా పాటలలో అత్యున్నతంగా వర్ణించారు.

'20వ శతాబ్దం'(1990) సినిమాలో తొలిదేవత అమ్మ, 'మాతృదేవోభవ' అనే భారతీయ సంప్రదాయంతో అమ్మను మించి దైవమున్నదా అని పాటను ప్రారంభిం చారు డాక్టర్ సి.నారాయణరెడ్డి. అమ్మ ఔన్నత్యాన్ని కీర్తిస్తూ వారు-

జగమే పలికే శాశ్వత సత్యమిదే
అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కతే

అవతార పురుషుడైనా ఓ అమ్మకు కొడుకే అని పాటని కొనసాగించారు. ఎంత పెద్దవాళ్ళైనా, గొప్పవాళ్ళైనా బిడ్డలు తల్లి ముందు పసివాళ్లే అని చెప్తూ-

నింగికి నిచ్చెనలేసే మొనగాడినే
ఐనా నీ ముంగిట అదే అదే పసివాడినే అంటూ

పాటను ముగించారు. తల్లి గొప్పతనాన్ని చాటిచెప్పే గొప్పపాటలలో ఇది ఒకటి.

'అమ్మ రాజీనామా'(1991) సినిమాలో సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన ఒక గొప్పపాట -

ఎవరు రాయగలరూ - అమ్మా అను మాట కన్న కమ్మని కావ్యం
ఎవరు పాడగలరూ - అమ్మ అను రాగం కన్న తీయని రాగం

పుట్టిన ప్రతి మనిషికి మొట్టమొదట వచ్చే మాట, నచ్చే మాట 'అమ్మ', నచ్చే మనిషి 'అమ్మ'. పిల్లలు నిద్ర లేవగానే పిలిచే పిలుపు 'అమ్మ'. వాళ్ళకేది కావలసి వచ్చినా గుర్తుకొచ్చే మనిషి 'అమ్మ'. అందుకనే చంద్రబోస్ 'నాని'(2004) సినిమాలో-

పెదవే పలికిన మాటల్లోనే తియ్యని మాటే అమ్మ
కదిలే దేవత అమ్మ కంటికి వెలుగమ్మ అని రాశాడు. మనిషికి అమ్మ అంటే అంత ఇష్టం. అందరినీ కనే అంత గొప్ప అమ్మని కూడా కనగలిగేది మరొక అమ్మ మాత్రమే అంటూ సీతారామశాస్త్రి 'అమ్మ రాజీనామా'(1991) సినిమాలో-

అమ్మేగా చిరునామ ఎంతటి ఘన చరితకి
అమ్మేగా కనగలదు అంత గొప్ప అమ్మని అని ప్రశంసించాడు. ఆ సినిమాలోనే దాసరి నారాయణరావు సృష్టికర్త ఒక బ్రహ్మ అతనిని సృష్టించినదొక అమ్మ అని కీర్తించాడు.

2001లో వచ్చిన 'లిటిల్ హార్ట్స్' సినిమాలో గీత రచయిత కులశేఖర్

ఆ దివిలో దేవతలే పంపిన దీవెన అమ్మేరా
ఈ ఇలపై కాలిడినా అమృత వాహిని అమ్మేరా
మమతల సన్నిధి అమ్మేరా..
మనుజుల పెన్నిధి అమ్మేరా.. అని అమ్మ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పాడు.

'అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి'(2003) సినిమాలో గీతరచయిత పెద్దాడ మూర్తి తల్లితోని ఉండే అనుబంధంలోని గొప్పతనాన్ని వర్ణిస్తూ-

నీవే నీవే నీవే నేనంటా - నీవే లేక నేనే లేనంటా
వరమల్లే అందిందేమో ఈ బంధం
వెలలేని సంతోషాలే నీ సొంతం అని రాశాడు.

తల్లి తరువాత పురుషుడి జీవితంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన స్త్రీ భార్య. బ్రతుకు కడదాక తోడు వచ్చేది, కష్టసుఖాలలో తోడూనీడ అయ్యేది భార్య మాత్రమే. ఆమెను అత్యున్నతంగా కీర్తించిన గొప్ప సినిమా పాటలు చాలా ఉన్నాయి. వీటూరి 'దేవత'(1964) సినిమా కోసం రచించిన పాట పల్లవిలోని రెండు పాదాల్లో ఇల్లాలి గొప్పతనాన్ని మహాద్భుతంగా తెలియజేశాడు -

ఆలయాన వెలసిన ఆ దేవుని రీతీ
ఇల్లాలే ఈ జగతికి జీవన జ్యోతీ

భార్య గొప్పతనాన్ని చెప్పడానికి ఇంతకంటే గొప్ప మాటలు అవసరం లేదేమో. తల్లి జగత్తుకు సాక్షాత్తు దైవం అయితే ఇల్లాలు ఆ జగత్తును వెలిగించే జ్యోతి. తనకు బదులుగా దేవుడు సృష్టించిన మూర్తి అంటాడు వీటూరి-

సతియే గృహసీమను గాచే దేవతగా
సృష్టించెను ఆ దేవుడు తనకు మారుగా

తల్లి జన్మనిస్తే భార్య జీవితాన్నిస్తుంది, ఆనందాన్నిస్తుంది. తల్లినే మరిపిస్తుంది. అందుకే వీటూరి -

పతి దేవుని మురిపించే వలపుల వీణా - జీవితమే పండించే నవ్వుల వానా
కష్టసుఖాలలో తోడు నీడగా - తల్లిని మరపించే ఇల్లాలి ఆదరణ
మగువేగా మగవానికి మధుర భావన అని రాశాడు.

"కార్యేషుదాసీ కరణేషు మంత్రీ / భోజ్యేషు మాతా శయనేషు రంభా" అని స్త్రీ ప్రాధాన్యతను తెలియజేసే శ్లోకం ఒకటి ఉంది. ఈ అర్థాన్ని ఆసరాగా చేసుకుని సిరివెన్నెల సీతారామశాస్త్రి 'పవిత్రబంధం'(1996) సినిమాలో -

అపురూపమైనదమ్మ ఆడజన్మ - ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా

మగవాని బ్రతుకులో సగపాలు తనదిగా - జీవితం అంకితం చేయగా... అని రాశారు. పురుషుని క్షేమం కోరుకునేవాళ్లలో భార్యను మించినవాళ్ళు ఎవరూ లేరన్నారు. అది వాస్తవం కూడా.

మగని మంచి కోసం పడే ఆర్తిలో - సతిని మించగలరా
మరే అప్పులు

భర్తకోసమే తాను అని నమ్మి అతనికోసం తన సర్వస్వాన్నీ త్యాగం చేస్తుంది. నిస్వార్థత్యాగానికి నిలువెత్తు రూపమే భార్య. అందుకే

ఏ స్వార్థము లేని త్యాగం - భార్యగా రూపమే పొందగా

అని రాశారు సీతారామశాస్త్రి

కాలం కలిసిరాక కష్టాలు కమ్ముకొస్తే విడువకుండా వెన్నుదన్నై నిలిచేది భార్య. భర్తకు దొరికిన అపురూపమైన వరం భార్య. కనుక

కలిసి రాని కాలం వెలే వేసినా - విడిచి పోని బంధం...
తనై ఉండదా

సహధర్మచారిణి సరిలేని వరమని అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి.

'కుంకుమతిలకం'(1983) సినిమాలో మైలవరపు గోపి బిడ్డను ప్రేమించే, లాలించే తల్లిలా భార్య కూడా భర్తను పాలించగలదని చెప్పారు.

ఆలనగా పాలనగా అలసిన వేళల అమ్మవుగా
లాలించు ఇల్లాలిగా.. దేవీ.. పాలించు నా రాణిగా

ఇదే భావం 'సొగ్గాడి పెళ్ళాం'(1996) సినిమాలోని పాటలో కూడా కనిపిస్తుంది.

కన్ను కాచే రెప్ప నీవే
ఆకలైన వేళ అమ్మ లాలింపువే
కన్ను చెమ్మగిల్లు వేళ చెల్లెమ్మవే

గురజాడ అప్పారావు కాసులు కవితలో చెప్పిన "నీ నెనరు కలుగక యున్న, పేదను, కలిగినను నా పదవి వేల్పుల రేని కెక్కడ?", "ప్రేమ కలుగక బ్రతుకు చీకటి" అన్న భావాలు 'కుంకుమతిలకం'(1983) సినిమాలోని పాటలో ద్యోతకమయ్యాయి.

నీ చిరునవ్వే.. తోడై ఉంటే.. నే గెలిచేను లోకాలన్నీ
అరఘడియైనా నీ ఎడబాటు.. వెన్నెల కూడా చీకటి
నాకు

భార్యాభర్తల మధ్య ఉండాల్సిన ప్రేమగురించి మహోన్నతంగా చెప్పిన కవిత 'కాసులు'. దాదాపు వందేళ్ళ కిందనే "మగడు వేల్పన పాత మాటది, ప్రాణమిత్రుడ నీకు" అని చెప్పిన కవిత అది. ఆ భావం ఈ పాటలో కూడా అందంగా వ్యక్తమయ్యింది.

నేనంటే నీ మంగళ సూత్రం.. నువ్వంటే నా ఆరో
ప్రాణం

భార్యంటే భర్తలో సగభాగం అని భారతీయ సంప్రదాయం. ఈ భావన కూడా సినిమాపాటల్లో చాలా చోట్ల కనిపిస్తుంది. సొగ్గాడి పెళ్ళాం(1996) సినిమాలోని పాటలో-

తోడు నీడ వీడలేని ఇల్లాలిని - జన్మ జన్మనందు
నేను నీదానిని
ఈ జగమంతటా నిను తిలకించనీ - నీ సగభాగమై
నను తరియించనీ అని వినిపిస్తుంది.

తెలుగు సినిమా పాటల్లో చెల్లెలు గురించి పాటలు అరుదుగా వచ్చాయి. అయినా సోదరబంధాన్ని అందంగా చెప్పే పాటలు కొన్ని ఉన్నాయి. 'చిట్టి చెల్లెలు'(1970) సినిమాలో దాశరథి చెల్లెలిని అందాల వసిపాప అన్నయ్యకు కనుపాప అని వర్ణించాడు. చెల్లెలు గురించి వచ్చిన సినిమా పాటలలోనే గొప్ప పాట 'ఒరేయ్ రిక్షా'(1995) సినిమాలో గద్దర్ రాసిన పాట-

మల్లెతీగకు పందిరివోలె మస్క సీకటిలో వెన్నెలవోలె
నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా
తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మా

ఈ పాటలో -

నచ్చినోనికే ఇస్తానమ్మా చెల్లెమ్మా

నా కన్నీళ్ళతో కాళ్లు కడుగుతా చెల్లెమ్మా అని అన్న తన చెల్లెలిపై ప్రేమను కురిపిస్తాడు.

స్త్రీని ప్రణయమూర్తిగా వర్ణిస్తూ తెలుగు సినిమాలలో అనేక పాటలు వచ్చాయి. వాటిని గురించి సామాన్య సినిమా ప్రేక్షకుడికి కూడా కొంత అవగాహన ఉండడం సాధారణ విషయమే. వాటిని గురించి కాకుండా మురళీ కృష్ణ (1964) సినిమాలో ఆత్రేయ రాసిన

ఎక్కడ ఉన్నా ఏమైనా - మనమెవరికి వారై వేరైనా

నీ సుఖమే నేను కోరుకున్నా - నిను వీడి అందుకే వెళుతున్నా అనే పాటను ఈనాటి యువత కోసం ప్రత్యేకంగా గుర్తుచేసుకోవాలి. ఎందుకంటే ఈనాడు ప్రతివాళ్లు ఎవరినో ఒకరిని ప్రేమించామని అనుకుంటున్నారు. వారు తమని ప్రేమించకుంటే వారిపై పగ పెంచుకుంటున్నారు, ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నారు. బహుశా ఆత్రేయ 50 ఏళ్ల తర్వాత మనిషి స్వభావాన్ని ఊహించి ముందుగానే ఇలా చెప్పాడేమో అనిపిస్తుంది.

తను ప్రేమించిన అమ్మాయి తనను ప్రేమించలేదని యువకుడు -

గుండెను గుడిగా చేశానూ - నువ్వుండ లేననీ వెళ్లావూ

అనుకున్నాడు. మరిప్పుడు ఏం చేయాలి?

వలచుట తెలిసిన నా మనసునకు - మరచుట మాత్రం తెలియనిదా అని మరచిపోవాలని అనుకున్నాడు.

మనసిచ్చినదే నిజమైతే - మన్నించుటయే ఋజువు కదా!

నీ సుఖమే నేను కోరుకున్నా - నిను వీడి అందుకే వెళుతున్నా అని కూడా అంటున్నాడు. అంతేనా? ఇంకా, తను ఎక్కడ ఉన్నా

కలకాలం చల్లగా ఉండాలనీ - దీవిస్తున్నా నా దేవిని అని దీవిస్తున్నాడు. ఇది నిజంగా ప్రేమించినవాడి స్వభావం. ఇదీ నిజమైన ప్రేమ. ఈనాటి యువకులు తమ ప్రేమని నిరాకరించిన అమ్మాయిల పట్ల ఇంత ఉన్నతమైన ఆలోచనలను కలిగి ఉండాలని ఆశిద్దాం.

❀ ❀ ❀

# స్త్రీల పట్ల స్త్రీ వాద కవిత్వ దృక్పథం

**- డా॥. బి. భవాని,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, మేడ్చల్ జిల్లా, తెలంగాణ.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు, గుంటూరు & వై.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కాలేజి, కోవూరు, నెల్లూరు జిల్లా తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 3 & 4, 2022 తేదీలలో నిర్వహించబడుతున్న అంతర్జాల జాతీయ వెబినార్‌కు సమర్పిస్తున్న పత్ర సమర్పణ ఇది. వ్యాసం పేరు స్త్రీల పట్ల స్త్రీవాద కవిత్వ దృక్పథం.

## నిర్వచనము :

సాంఘిక, ఆర్థిక, రాజకీయ అణచివేతల నుండి స్త్రీని విముక్తురాలిని చేయడానికి ప్రయత్నించే ఉద్యమమే స్త్రీవాద ఉద్యమం. పాశ్చాత్య దృక్పథ ప్రభావంతో ఏర్పడిన ఉద్యమమే అయినా "....ఏ ఆలోచనగానీ, సిద్ధాంతంగానీ జాతీయమైన లేదా భౌగోళికమైన సరిహద్దులకు పరిమితమై...." ఆగిపోనందున, స్త్రీల అణచివేత ప్రపంచ మంతటా ఉన్నందున ఇది ప్రచారంలోకి వచ్చింది. "సమాజంలోను, కుటుంబంలోను పనిలోనూ స్త్రీలు గురవుతున్న అణచివేత, దోపిడికి సంబంధించిన అవ గాహన కలిగి ఉండి ఈ పరిస్థితి మార్చాలని స్త్రీలు, పురుషులు చేసే చైతన్యవంతమైన కార్యక్రమమే ఫెమినిజమని" చెప్పుకుంటే ఈ చైతన్యంతో స్త్రీవాదులు రాసిన కవిత్వంలో స్త్రీల పట్ల వారికున్న దృక్పథాన్ని పరిశీలించడం నా వ్యాసం లక్ష్యం. అందుకు 'నీలి మేఘాలు' పుస్తకంలోని కొన్ని కవితలను పరిశీలనకు స్వీకరించాను.

## విషయ వివరణ :

నిర్దిష్టమైన ఆలోచనా విధానం కలిగిన ఒక సామాజిక చైతన్య దృక్పథమే స్త్రీ వాదమని అనుకుంటే వారు పెట్టుబడిదారీ సమాజం నుండి కుటుంబ చాకిరీ నుండి, అసమాన శ్రమ విభజన నుండి, ఇంటా బయటా జరిగే అణచివేతల నుండి విముక్తులు కావాలని స్త్రీవాదులు గుర్తించారు. వారు కవిత్వాన్ని, కథలను, నవలలను వ్యాసాలను మొత్తంగా సాహిత్యాన్ని ఒక ఆయుధంగా మలచుకొని, సమాజానికి అందించి ఆలోచింపచేసే చైతన్యాన్ని కలిగించారు. సమాజంలో అసమానతలకు గురవుతున్న స్త్రీల దృష్టికోణాన్ని ఆవిష్కరించారు.

ఈ నేపథ్యంలో వచనకవితా ప్రక్రియలో వెలువడిన 'నీలిమేఘాలు" (1993) పుస్తకం స్త్రీవాద కవితా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. సామాజిక జీవితానికి సంబంధించిన స్త్రీల సమస్యల చిత్రీకరణ స్త్రీవాద కవిత్వం ద్వారా అంచనా వేయగలం.

స్త్రీ చైతన్యవంతంగా ఆలోచిస్తే, ఆ ఆలోచనను సైతం అణచివేయడానికి ప్రయత్నం జరుగుతుందని కొండెపూడి నిర్మల 'స్లీపింగ్ పార్టనర్' కవితలో "తమ అంచనాలని మించి మన బతుకు ప్రతిపాదనలు, మారడం భరించ లేరు" అని నిలదీస్తారు. గృహహింస అనేది తరతరాలుగా నడుస్తూనే ఉన్నాయని "నడిచే గాయాలు" కవితలో ఆర్థిక అసమానతలను వెల్లడించారు.

ఆడవాళ్ళు తమ స్వేచ్ఛనీ, అనుభూతుల్ని కేవలం జ్ఞాపకాల్లో మాత్రమే మిగుల్చుకోవాలని శాసించే సమాజపు తీరుని కె. వరలక్ష్మి 'ఆ ఇంట్లోనే' అనే కవితలో రెక్కలు కత్తిరించి మరీ గూటికి తరలించబడిన, నిస్సహాయపు 'తూనీగనని' స్త్రీల ఆవేదనని అనుభవించి రాసారు.

సమాజంలో స్త్రీలు ఏ అనుభూతికీ నోచుకోకుండా నిర్జీవంగా శవాలుగా బ్రతుకుతున్నారని, కనీసం 'సమాధి లోనైనా మరణించ'నీయని, ఇంకా 'నరమేధ కాష్టంలో రగిలే చిరురవ్వలు' కవిత్వంలో 'ఇక్కడ మనుష లుండరు, మనిషి మాస్క్ వేసుకున్న, మానవ మృగాలు తప్ప' అంటూ పురుషాధిక్య ప్రపంచ రాక్షస కృత్యాలకు బలవుతున్న పసికూనల స్థితిని కళ్లముందు ఆవిష్కరింప చేస్తారు కవయిత్రి శీలాలోలిత.

మెహందీ శిథిలాల మధ్య నలిగిపోతున్న జీవితాలు ఎన్నో ఉన్నాయనీ, వారి 'కలల తగలబడుతున్న' దృశ్యాలు కన్నీటి చుక్కల 'మధ్య ఇంకిపోతున్నాయనే' "సరిహద్దు రేఖలు" కవిత్వంలో మహజబీన్, బ్రతకడానికి నానా చావు చస్తున్న రంపపు కోతను ఓల్గా 'మెహందీ స్త్రీల విజ్ఞప్తి' లోను మనకు అవగాహన కలిగిస్తారు.

లైంగిక వివక్ష, పురుషాధిక్యత మీద స్త్రీవాదులకు స్పష్టమైన అవగాహన ఉంది. వెట్టిచాకిరి, ఇంటి చాకిరితో స్త్రీల ఆశలు, ఆశయాలు జారిపోయి, వారు అంతరంగ ఆవేదనను అనుభవిస్తున్నారని ఓల్గా 'ఆకలేమిగిలింది' మరియు 'సూపర్ ఉమెన్ కాలేను' కవితలలో తీర్మా నిస్తారు.

స్త్రీలపై జరిగే ప్రతి అమానుషానికి, అణచివేతకూ వారు సిగ్గుతో అవమానంతో ఎందుకు తలదించుకోవాలని ప్రశ్నిస్తూ, లైంగిక హింసను అధికారంగా భావిస్తున్న మగ మృగాల అనాగరికతను విమల 'దిగంబరుల ఊరేగింపు' కవితలో ఎండగట్టారు.

శరీరంపై మనస్సుపై, దుస్తులపై, స్వేచ్ఛపై అన్నిటిపై పురుషాధిక్య సమాజం ఏర్పరచిన మూసల్లోంచి స్త్రీలు బయటకు రాలేకపోతున్నారని 'శరీరం' అనే కవితలో వసంత కన్నాబిరాన్ అభిప్రాయపడ్డారు.

'కాలాన్ని పట్టాలుగా చేసుకుని, రైలు బండిలా దాన్నది గమిస్తూ ఉంటుంది', అని పనిమనిషి జీవన చిత్రాన్ని 'ఆమె' అనే కవితలో కె. వరలక్ష్మి మన కళ్ళముందు సజీవంగా నిలిపే ప్రయత్నం చేసారు.

'అందమైన దోపిడికి, పవిత్రమైన హింసకూ, న్యాయమైన దాస్యానికీ' బలవుతున్న స్త్రీలు' పంచారి నిర్మలకు వారసులు కావాలని ఓల్గా 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' అనే కవితలో అమానవీయ హింసలో కూరుకు పోయిన స్త్రీలకు ప్రచండ పోరాట ఘోషకు పిడికిలెత్తమని పిలుపునిస్తూ, 'తెగబడిన మా కలల ప్రపంచం'లో విమల స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని మేలుకొలిపే దిశగా సాగింది.

## ముగింపు :

ఈ పుస్తకంలో స్త్రీ వాదులు ఎన్నో సమస్యలను మన కళ్ళముందుకు తెచ్చారు. స్త్రీ మనోభావాలకు ప్రతీకలు ఈ కవితలు. పితృస్వామ్య విలువలను ఎదిరిస్తూ, స్త్రీలను కించ పరిచే భావాలను నిలదీస్తూ, లైంగిక వివక్షను విమర్శిస్తూ, స్త్రీ, పురుష సంబంధాలను విశ్లేషిస్తూ, స్త్రీల అణచివేతల మీద పోరాటం చేస్తూ, "స్త్రీల శరీరాలమీదా, హక్కుల మీదా, ఆరోగ్యాల మీదా, జరుగుతున్న దురాక్రమణను దోపిడిని ప్రశిస్తున్న"[3] కవితలే మనకు ఇందులో దర్శనమిస్తాయి. నా పరిధికి లోబడి కొన్నింటిని మాత్రమే పరిశీలించాను. తమ భావాలు, తమ అనుభవాలు తెలిసి చెపుతున్న కవితలు స్త్రీ సమస్యలను వివిధ కోణాల నుంచి చర్చిస్తున్నాయి. స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం లభించినప్పుడే ఆమె పరిస్థితిలో మార్పు కలుగుతుంది.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ప్రాచీన సాహిత్యము - ధీర వనితలు

- డా॥. కొసిరెడ్డి భవాని, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళాకళాశాల, స్వయంప్రతిపత్తి, గుంటూరు.

ఈ చరాచర జగత్తునకు మూలము స్త్రీ అనునది నిస్సందేహము స్త్రీ శక్తి స్వరూపిణి, అనురాగమూర్తి, సకల కళాభిరామ, సౌందర్యానికి ప్రతీక, ఆకలిని తీర్చే అన్నపూర్ణ, గృహమును సంరక్షించే రక్షణాధికారి, ఇంటిని సిరి సంపదలతో నింపే గృహలక్ష్మి ఈ విధంగా మనం స్త్రీ ప్రత్యేకతను వివరించవలెనన్న విధాతకైనా సాధ్య పడదేమో ఆమె ప్రతికదిలికలోనూ ఏదో ఒక ప్రత్యేకతను మనం గమనించవచ్చును. స్త్రీ లేని జగత్తు ఊహకు అసాధ్యము అయినప్పటికి స్త్రీ ఈనాటికీ అబలగానే చిత్రీకరించ బడుచున్నది. ఛాందసభావాలతో స్త్రీ ని వంటింటికి పరిమితం చేసేవారున్నారు.ముగ్ధగా వర్ణించు వారు వున్నారు. " ఆకాశంలో సగం అవనిలో సగం" అని వాటాలు యిస్తూనే అప్రసంగం ఆపి యిల్లు చేరేసరికి ఆసగం సున్నాగా మారుస్తున్న మహానుభావులూవున్నారు. ఆ పదలో భయం అనేది ఆలోచనను హరింపచేస్తుంది. కానీస్త్రీలు అలాంటి ఆపదలు ఎదుర్కొనే సమయంలో దృఢచిత్తంతో సమస్యలకు ఎదురు నిలబడిన ధీరోదాత్త వనితలను మన ప్రాచీనసాహిత్యంలో మనం గమనించ వచ్చును. "నస్త్రీ స్వాతంత్ర్యమర్హసీ" అను మను ధర్మ వాక్యాన్ని సమర్థించిన కవులున్నారు రాజకుమార్తెలకు స్వయంవరాధికారాన్ని యివ్వడం ఆనాటి సమాజంలో స్త్రీలకు గల ప్రాధాన్యతను మనం గమనించవచ్చును. తల్లిపేరు ను తమపేరుతో చేర్చుకోవడం భార్యపేరును తమ పేర్లతో జతపరచుకున్నట్లుగా ప్రాచీన సాహిత్యంలో కవులు వర్ణించియున్నారు.

హిందూ ధర్మానికి ప్రతీకలుగా చెప్పుకొనుచున్న రామా యణ భారత భాగవతాదులను మనం క్షుణ్ణంగా పరిశీలించినపుడు రాముని పాదదాసిగా చిత్రీకరించిన సీత లవకుశ జననం తరువాత రాముడు పిలిచినా తిరస్కరించడం అర్జునుడు మత్స్య యంత్ర ఛేదనంతో గెలిచిన ద్రౌపదిని కుంతీదేవి పంచపాండవ పత్నిగా మార్చినా ద్రౌపది మిన్నకున్నది కానీ ధర్మరాజు తనను జూదంలో ఓడినప్పుడు నిండుకౌరవసభలో ఆమెసంధించిన ప్రశ్నకు సమాధానం దొరకలేదు. "నా భర్త తన్నోడి నన్నోడినా నన్నోడి తన్నోడెనా"అన్నప్రశ్న కురువృద్ధులందరికీ ప్రహేళికగా మారినది. భాగవతంలో రుక్మిణీదేవి తన అన్న అభిమతానికి విరుద్ధంగా తన ప్రేమ సందేశాన్ని శ్రీకృష్ణుడికి ఒక పేద బ్రాహ్మణుడిద్వారా పంపించడం. పారిజాతాపహరణ కావ్యంలో సత్యభామ తనను సవతి యైన రుక్మిణి కన్నా శ్రీకృష్ణుడు తక్కువ చేసినందుకు భర్తను కాలితో తన్నడం ఆముక్తమాల్యదలో గోదాదేవి తానుధరించిన పూలమాలను విష్ణుమూర్తికి అర్పించి సాక్షాత్తు శ్రీరంగేశునే భర్తగా కోరుకోవడం. అర్జునుడు తిరస్కరించి నందుకు ఊర్వశి శాపమివ్వడం. తెంపరి తనంతో ప్రవరుని మీద పడి తనను పరి గ్రహించమని కోరిన వరూధిని, దృఢచిత్తంతో పరమశివుని భర్తగా కోరిన పార్వతి తపస్సు చేసి శివుని శరీరంలో సగభాగంగా విలీనమవ్వడం ఈ విధంగా పరిశీలించి చూసిన ప్రాచీన కవులు వారి సాహిత్యంలో వనితల ధీరతను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించిన ఘట్టము లనేకములు.

రామాయణంలోని సీతపాత్రను కవయిత్రి మొల్ల చిత్రీకరించిన విధానమును పరిశీలించెదము.సీత యనగా భారతీయ మహిళకొక ఆదర్శవంతమైన సాధ్వీమణి పరమ పాతివ్రత్య భవ్యచరిత స్వప్న సుప్త్యాదులందుకూడా రాముని తప్ప పరపురుషుని ఊహించని ఉత్తమ యిల్లాలు ఆమె తన పతిభక్తిని ఎలా ప్రదర్శించినదో అందలి ధీరత్వమును మొల్లరామాయణము సుందరకాండము నందలి ఈ పద్యములను గమనించవచ్చును.

సీతను బంధించిన రావణాసురుడు ఆమెను అశోక వనము నందుంచి ప్రతిదినము రాముని చులకన చేసి తన దర్పమును ప్రదర్శించెడివాడు.

"జగ తీశుడు మానవుడట
నగరే భుజశక్తి చేత నాకెదురన్నన్
నగధరుడో నగధన్వుడో
నగభేదియొ కొంతకొంతనాతోబోరన్"

అని యనగా అందుకు సీత రావణుని గడ్డిపోచతో సమానముగా భావించి ఈ విధముగా ధీటుగా సమాధన మిచ్చినది.

" వీరా లాపము లాడనేల వినుమీ విశ్వప్రకాశంబుగా
బారా వారముగట్టి రాఘవుడు కోపస్ఫూర్తి దీపింపగా
ఘోరాజిన్ నినుడాసి లావు కలిమిన్ గోటీర యుక్తంబుగా
గ్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తులు పెట్టు భూతాళికిన్"

అని రాముని యొక్కశక్తి తెలిసిన యిల్లాలిగా ముందు జరగబోవు రామరావణసంహారమును సూచన చేసినట్లుగా హెచ్చరించినది. ఈ పద్యమునందు మనము సీతమాటల లోని రౌద్రమును గమనింపవచ్చును.

భాగవతమును పరిశీలించిన యెడల రుక్మిణీదేవి తన పుట్టినింటిలో కృష్ణుని మదిలో నిలుపుకొని మనసావాచా కర్మణా వలచినది.కానీ ఆమెకొక సంకట స్థితి ఏర్పడినది. తన అన్నయైన రుక్మి కృష్ణ విరోధి. తండ్రిని సైతం ధిక్కరించి రుక్మిణిని శిశుపాలునకిచ్చి వివాహము చేయ నిశ్చయింపగా రుక్మిణి చూపిన తెగువ తనమును పోతనా మాత్యుడు ఒక అద్భుతఘట్టముగా సాక్షాత్కరింపచేశాడు. రుక్మిణీదేవి అగ్నిద్యోతనుడను బ్రాహ్మణుని రాయబారిగా కృష్ణుని వద్దకు పంపి తన సందేశమునిట్లు వివరించినది.

"అంకిలి సెప్పలేదు చతురంగ బలంబుల తోడనెల్లియో
పంకజ నాభ నీవు శిశుపాల జరాసుతులన్ జయించి, నా
వంకకువచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువసేసి, కృష్ణ! పురుషోత్తమ! చేకొనిపొమ్ము"

ఒక తండ్రిచాటు బిడ్డ, అన్నమాటుచెల్లెలు అంతఃపురము దాటి రాని రాచకన్య యింతటి ధైర్యమును ప్రదర్శించుట విశేషము. అదియును సాక్షాత్తు శ్రీ కృష్ణునికే తనను రాక్షస వివాహము చేసికొని తీసికొని వెళ్ళ వలసినదిగా సూచన చేసినది. ఈ పద్యము ను చిత్రీకరించిన పోతన గారి గొప్పతనమును అభినందించవలసినదే.

మహాభారత విషయమునకొస్తే స్త్రీ పాత్రల యొక్క ధీరత మనకు ప్రస్ఫుటముగా కన్పిస్తుంది. ఆదిపర్వము నందు నన్నయగారు చిత్రించిన అంబపాత్రను పరిశీలించి నట్లయితే కాశీరాజు కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికలను కాశీరాజును యుద్ధములో ఓడించి తన తమ్ముడైన విచిత్రవీర్యునకిచ్చి వివాహము చేయుటకు భీష్ముడు హస్తినాపురమునకు తీసికొనివస్తాడు. వారిలో పెద్దదైన అంబ తన మనసునందు సాళ్వరాజున్నాడని విచిత్రవీర్యునిపై తనకు మనసు లేదని నన్ను సాళ్వరాజు వద్దకే పంపించుమని ధైర్యంగా భీష్ముని అడిగినది. భీష్ముడు ఆమెను తిప్పి పంపగా సాళ్వుడామెను తిరస్క రిస్తాడు అప్పుడుకూడా ఆమె అధైర్యపడక భీష్ముని వివాహ మాడుమని కోరగా భీష్ముడు తాను బ్రహ్మచర్య ప్రతిజ్ఞ చేశానని తిరస్కరిస్తాడు.

అప్పుడామె తనస్థితికి భీష్ముడే కారణమని అతనిపై పగబట్టి తపస్సుచేసి భీష్ముని చావుకు కారణభూతురాలిగా అయ్యేటట్లు వరము పొందినది. నన్నయగారీవిధముగా అంబ పాత్రను ధీరోదత్తంగా తీర్చిదిద్దారు.

మహాభారతము నందు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న పాత్ర ద్రౌపది. తిక్కనగారు ద్రౌపది పాత్రచిత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు మనకు కన్పించుచున్నది. ద్రౌపది ఎన్నో అవమానములను దిగ మింగి మొక్కవోని ధైర్యంతో, స్థిరమైన చిత్తముతో వాటిని ఎదుర్కొనగలిగినది. సభాపర్వములో ఆమెకు జరిగిన అవమానమును మనసులోనే అణుచుకొన్నది. అరణ్యవాసం ముగించుకొని అజ్ఞాతవాసంలో ఆమె విరాట రాజు కొలువులో సుధేష్ణాదేవి వద్ద సైరంధ్రిగా కాలం

వెళ్ళుచున్న సమయంలో కీచకుని దృష్టి ఆమె పై పడింది. కామాంధతతో ఆమెను వెంబడించినపుడు ధైర్యాన్ని కోల్పోకుండా కీచకుని హెచ్చరిస్తూ చెప్పిన ఈపద్యం తిక్కన నాటకీయతకు దర్పణంగా సాహితీలోకం కొనియాడినది.

"దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతు
ల్గీర్వాణాకృతులేవురిప్డు నినుదోర్లీలన్ వెసన్‌గిట్టి గం
ధర్వుల్ మానము ప్రాణముగొనుట తథ్యంబెమ్మెయి కీచకా"

ఈ పద్యము ఈనాటి మహిళలకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా వున్నదని చెప్పక తప్పదు. ఉద్యోగ పర్వములో శ్రీకృష్ణుని కౌరవుల వద్దకు రాయబారిగా పంపించే సందర్భములో కృష్ణుడు అందరి వద్ద అభిప్రాయసేకరణ చేశాడు ఆసందర్భములో ద్రౌపది అభిప్రాయమును అడుగగా ఆమె హావ భావములను చేష్టలను వర్ణించిన పద్యమిది.

"ద్రోవది బంధురంబయిన కొమ్ముడి గ్రమ్మన విడ్చివెండ్రుకల్
దావలచేతబూని యసితచ్ఛవిబొల్చు మహాభుజంగమో
నావిలసిల్లి వ్రేలగ మనంబున బొంగు విషాద రోషముల్
గావగలేక బాష్పములు గ్రమ్మగ దిగ్గనలేచి యార్తియై"

ఇందు ద్రౌపది యొక్క ఆవేశమును ఆక్రందనను మనము గమనింపవచ్చును. ఇంతటితో ఆగక తన అవమానాగ్నిని నిద్దురలేపి " ఇవి దుస్సేసేను వ్రేళ్ళ దవిలి సగము ద్రెవ్వినవి"అనియు ఈ వెంట్రుకలు వట్టి యూడ్చిన యాచేయి.

దొలుతగా బోరిలో దుస్ససేను
తనువులింతలై చెదరవలయునని
---------------------
బన్నములు వడిన ధర్మనందనుడు
నేను రారాజు పీనుంగు గన్నార
గాన బడయమైతిమేని "------"పెనుగద పట్టి తిరుగు భీమసేనుని బాహుబలము, గాండీవమును ఎక్కుపెట్టు కఱ్ఱి విక్రమంబు కాల్పనే " అని తన ఆవేదనను శ్రీకృష్ణుని వద్ద తెలియపరచినది. ఈ ఘట్టము నందు ద్రౌపది యొక్క రౌద్ర స్వరూపమును తిక్కనగారు కళ్ళకు కట్టినట్లుగా వర్ణించినారు.

శ్రీనాథుడు రచించిన హరవిలాసము తృతీయా శ్వాసము నందలి పార్వతి తపస్సును మనం పరిశీలించిన యెడల " ఈప్సితార్థంబునకు బాఱు హృదయరుచియు, నిమ్నమునకోడిగిలు నీరునిలుపరాదు " అన్నట్లుగా సుకుమారమైన దేహము కలిగిన పార్వతి ఈప్సితార్థంబు కొరకు మనోధైర్యంతో నిశ్చల చిత్తముతో ఎంత దృఢంగా మారినదో మనము గమనింపచ్చును.

"ముత్యాల మొలనూలి మురువు సూపెడునెట్టి
జఘనంబుపై మౌంజి సవదరించె ------
----- గంతగా వైచె బులి తోలుకళవసంబు
బరమ కళ్యాణి గిరిసార్వభౌమ తనయ "------- అను సీసపద్యము నందు పార్వతి తపస్సుకొరకు ఎంతటి కఠోరదీక్షను పూనినదో తన వేషము నెట్లు మార్చినదో శ్రీనాథుడు సాక్షాత్కరింప చేశాడు. ఇంతియేకాక ఆమె శరీర సౌకుమార్యమును సూచిస్తూ

"హంస తూలిక పాన్పుపై నలరుమొగ్గ
యెత్తునును మేను గల్గునీలోత్పలాక్షి
బాహువల్లి తలాడగా బవ్వళించె
శైలపాషాణ పట్టికా స్థండిలమున

ఈ పద్యము నందు తపస్సుకొరకు పార్వతి ఎట్టి నియమములను పాటించినదో తెలియ వచ్చుచున్నది. పూలవత్తిడిని తట్టుకొనలేని ఆమె శరీరము గులకరాళ్ళపై మోచేతిని తలగడగా చేసికొని పండుకొనినదని పేర్కొన్నాడు. అంతటితో ఆగక శిశిరంబునందు నీటనిలబడి. మండువేసవిలో చుట్టు అగ్నులు పెట్టికొని కఠోర తపమును చేసినది. ఇచ్చట పార్వతి తపస్సులో మనో నిశ్చయం సంకల్పబలం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి.

శివుడు ప్రత్యక్ష మయ్యేవరకు తొణకలేదు బెణకలేదు. శివుడు ఆమెను పరీక్షింపదలచి బ్రహ్మచారి వేషమునవచ్చి ఆమె తపస్సు తానే స్వయముగా మెచ్చి యిట్లనినాడు.

"అరుదగు నీ తపమునకు నమ్ముడుపోయితి నేలు కొమ్మునీ
వరవుడ నంచు శూలి ప్రియవాక్యము లందగ గారవింపగా
ధరణి ధరేంద్ర నందన యుదగ్రతపో మహనీయ వేదనా
భర మఖిలంబు వీడ్కొలిపి భావమునం బరి తోషమందుచున్"

ఈ పద్యమునందు పార్వతి తపోధాటికి పరమశివుడే తాను అమ్ముడు పోయినట్లుగా ఒప్పుకున్నాడు. దానితో ఆమె తపోవేదన తీరిపోయినది. అంతేకాదు శివునిలో సగభాగాన్ని ఆక్రమించి శివుని అర్ధనారీశ్వరునిగా మార్చి వేసినది.

హరవిలాసము సప్తమాశ్వాసమునందు ఇంద్ర కీలాద్రిపై అర్జునుడు తపస్సుచేసి పాశుపతాస్త్రమును సంపాదించగా దేవేంద్రుడు పుత్రుని విజయమునకు సంతోషించి అమరావతికి ఆహ్వానించెను. అచ్చట ఊర్వశి తారసపడి తన అనురాగమును వ్యక్తపరచగా అర్జునుడు ఆమెను తిరస్కరించెను. క్రోధముతో ఆమె

"వేసాల బోకురమ్మీ
పూసెజ్జకు బ్రొద్దువోయె " ..... అనగా అర్జునుడామెను త్రోసివేసెను. దానితో ఆమె తన అందమును తృణీకరించిన అర్జునుని "ఒక సంవత్సరకాలము నపుంసకుడవు కమ్మని " శపించెను ఈ ఘట్టము నందు ఊర్వశి యొక్క ఆత్మాభిమానమును మనముచూడవచ్చును.స్త్రీ తాను తలచిన పనికోసం ఎంతటిసాహసానికైనా వెనుకాడబోదని గ్రహింపవచ్చును. హరవిలాసమునందు శ్రీనాథుడు మహిళల ధీరతనిట్లు ప్రదర్శింపచేశాడు.

పారిజాతాపహరణ కావ్యమునందు నందితిమ్మన సత్యభామ పాత్రచిత్రణ యెడల ప్రత్యేకశ్రద్ధ కనబరచి నాడు. ఈకావ్యరచనా నేపథ్యమున ఒక కథ కూడా వినవచ్చుచున్నది. గజపతుల ఆడపడుచు అయిన అన్నపూర్ణాదేవి వెంట అరణపుకవిగా నందితిమ్మన కృష్ణ రాయల ఆస్థానమునకు వచ్చినాడు. ఒకనాడు శ్రీకృష్ణ దేవరాయలు అంతఃపురమునకు వచ్చిన సమయమునకు అన్నపూర్ణాదేవి కృష్ణరాయల తలగడవైపు కాళ్ళుపెట్టి నిద్రించుట చూచి రాయలవారు అలిగి వెళ్ళిపోయారని ఆసమయాన్ని సమర్థించడంకోసమే నందితిమ్మన పారి జాతాపహరాణాన్ని రచించాడనే కథప్రచారంలో వుంది.

సత్యభామ శ్రీకృష్ణుని ప్రాణప్రదంగా ప్రేమించింది. తన సొత్తుగా భావించేది తనుగీచిన గీత దాటగూడదను కొనేది. ఒకనాడు నారదుడు దేవలోకమునుండి ఒక పారిజాత పుష్పమును తెచ్చి రుక్మిణిదేవి మందిరము నందున్న శ్రీకృష్ణునికి సమర్పించెను. అంతటి తో ఆగక ఆ పుష్పము యొక్క మహత్యమును అతిశయోక్తిలో వర్ణించెను. ఆ పుష్పమును శ్రీకృష్ణుడు రుక్మిణీదేవికి యివ్వడం చూచిన సత్యభామ చెలికత్తె సత్యభామ వద్దకు వెళ్ళి ఆమెకు వున్నవి లేనివి చిలవలు పలవలుగా చెప్పి మనసుగాయపరచినది. ఆ సందర్భమున సత్యభామ హావభావములను నందితిమ్మన వర్ణించినతీరు అద్వితీయము.

"అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుం బలె నేయి వోయభ
గ్గన దరికొన్న భీషణ హుతాశన కీల యనంగ లేచిహె
చ్చిన కనుదోయి కెంపు తన చెక్కుల గుంకుమ పత్రభంగసం
జనిత నవీనకాంతి వెదచల్లగ గద్గద ఖిన్నకంఠియై"

అలావున్న సత్యభామను సాంత్వన పరచడానికి శ్రీకృష్ణుడు ఎంతగానో ప్రయత్నించాడు అయిననూ సత్య చలించలేదు చివరకు కృష్ణుడు ఆమెపాదముల వద్ద చేరగా ఆమె వామపాదము శ్రీకృష్ణుని శిరము తాకినది ఈ ఘట్టము తెలుగు సాహిత్యమునందు ఒకప్రత్యేకతను సంతరించుకొనినది.

దేవత లందరి తో పూజ లందుకొను మన్మధుని తండ్రియైన దేవదేవుని శిరస్సును వామపాదముతో తొలగ ద్రోచినట్లు వర్ణించినాడు.ఈ ఘట్టము సృష్టించుటలో కవి సాహసమును మనము కొనియాడక తప్పదు. ఆపని సత్యభామాదేవి చేత చేయించడంలో అర్థము శ్రీకృష్ణ దేవరాయలవారికి అన్నపూర్ణాదేవి పైనున్న అలుక

పోగొట్టుటకే అను అంశము దాగియున్నట్లుగా ఈ కావ్య పరమార్థముగా గ్రహించవలయును.

ఆముక్తమాల్యదలో గోదాదేవి సాక్షాత్తూ శ్రీమహా విష్ణువునే భర్తగా కోరినది. విష్ణుమూర్తి కొరకు కట్టిన తులసి మాలలను తానుముందుగా ధరించిన తరువాతనే భగవంతునికి సమర్పించేది. ఒక మానవకన్య అప్పటికే భూలోకంలో అర్చామూర్తిగా వున్న శ్రీరంగేశుని వివాహ మాడాలనుకోవడం ఈ కావ్యమునందలి విశేషంగా చెప్పవచ్చును. శ్రీరంగనాథుడు కూడా ఆమె అందము నకు ముగ్ధుడై తండ్రివద్దనున్న గోదాదేవి ముగ్ధభక్తి మరియు వియోగచ్యుత ధైర్యాన్ని చక్కగా చిత్రీకరించాడు.

మనుచరిత్రములో అల్లసానిపెద్దన వరూధిని పాత్ర చిత్రణలో కొంత తెంపరితనమును ప్రదర్శింపచేశాడు. ప్రవరాఖ్యుడు సిద్ధుడు పూసిన లేపనముతో హిమవత్ప ర్వతమునకు వెళ్ళి అచట సౌందర్యారాధనలో మైమరచి పోయాడు. యిల్లుచేరే దారి తెలియక అటూయిటూ తిరుగుతూ వుండగా పరిమళ భరితమైన సువాసనలు వెదజల్లు ప్రదేశమును చేరి జనాన్వితమైన ప్రదేశముగా ఎంచి అచట విద్యుల్లతావిగ్రహయైన వరూధినిని చూచాడు. ఆమె అందమును చూచి తనను చూచి ఆమె పడిన తొట్రుపాటు ను చూచి ఆశ్చర్య చకితుడయ్యాడు. ఆమె ఒక్కవుదుటున లేచినపుడు ఆమె లేతనడుము అల్లాడిపోవడంచూచి ఆమెను

"ఎవ్వతవీవు భీతహరిణేక్షణ ఒంటి చరించెదోటలే
కివ్వనభూమి భూసురుడ నే ప్రవరాఖ్యుడ త్రోవతప్పితిన్ "

అని అంటాడు. అందులకామె కొంత జాణతనమును ప్రదర్శించి ఈ విధముగా గడుసుగా సమాధానము చెప్పినది.

"ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర ఏ
కాంతము నందు నున్న జవరాంద్ర నెపంబిడి పల్కరించులా
గింతియకాక నీవెరుగవే మును వచ్చిన త్రోవచొప్పునీ
కింత భయంబు లేకడుగ నెల్లదిమైతిమే మాటలేటికిన్"

నువ్వు త్రోవ తప్పావని చెబుతున్నావు వచ్చిన త్రోవ ఆమాత్రం తెలుపకోలేవా అని "ఇంతలుకన్నులుండ" అంతపెద్దకళ్ళున్నాయికదా దారినన్నే ఎందుకు అడుగు తున్నావు ఏకాంతమునందున్న ఆడవారిని ఏదో ఒక సాకుతో పలుకరిస్తున్నావు అని అతనని ఉక్కిరి బిక్కిరి చేసినది. ఇచ్చట వరూధిని తెగువ మనము గమ నించవచ్చును.

ఈ విధంగా మనంతెలుగు సాహిత్యమును పరిశీ లించిన మగువలు సందర్భోచితముగా ధీరతను ప్రదర్శించినట్లుగా మనం గమనించవచ్చును. సత్య వంతుని ప్రాణములకొరకు యమధర్మరాజునే ఎదు రించిన సావిత్రి పాత్ర కడుప్రశంసనీయము. అర్జునుని వివాహమాడాలని సుభద్ర కొంత తేకువ ప్రదర్శించినది. మరల అదేబాటలో ఆమె మేనకోడలు శశిరేఖ అభిమన్యుని వివాహమాడడం. బాణాసురుని కుమార్తె అయిన ఉష శ్రీకృష్ణుని మనుమడైన అనిరుద్ధుని వివాహమాడడం దమయింతిని ఇంద్రాగ్ని వరుణులు వరించినా ఆమెధైర్యంగా నలునే వరించడం వంటి అనేక సంఘటనలు మనం ప్రాచీన తెలుగుసాహిత్యంలో గమ నించవచ్చును.

## ఆధార గ్రంథాలు :

1. మహాభారతము - నన్నయ
2. మహాభారతము - తిక్కన
3. భాగవతము - పోతన
4. రామాయణము - మొల్ల
5. హరవిలాసము - శ్రీనాథుడు
6. మనుచరిత్ర - అల్లసానిపెద్దన
7. ఆముక్తమాల్యద - శ్రీకృష్ణదేవరాయలు
8. పారిజాతాపహరణము - నందితిమ్మన

# పరిపూర్ణతకు స్త్రీకారం - సాహితీ వివేచన

- డా॥. పి. విజయకుమార్, తెలుగుశాఖాధ్యక్షులు, ఎస్.ఎమ్.ఎల్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు.

మహిలో మహిమాన్వితమైనది మహిళ. 'స్త్రీ' అన్నది కేవలం ఏకాక్షర పదమే అయినా సత్త్వ, తమో, రజో గుణాల సమాహారరూపం స్త్రీ. "ప్రపంచ చరిత్ర పురుడు పోసుకొనేది ఆమె గర్భంలోనే. సమాజానికి మార్గదర్శకులు పెరిగేది ఆమె పొత్తిళ్లలోనే. సాంకేతికతకు పరుగులు నేర్పే శాస్త్రవేత్తలు నడకలు నేర్చేది ఆమె చేతుల్లోనే. దేశాలను నడిపించే నాయకులు, ఎదిగేది ఆమె కంటిచలువలోనే. మన జీవితం ఆమె ఆశీర్వాదమే. మన సంతోషం ఆమె ఆత్మీయతే, మన భవిష్యత్తు ఆమె అనుబంధమే మన సంపద ఆమె ప్రేమే. కార్మికుల నుంచి కర్షకుల దాకా, సైనికుల నుంచి నిపుణుల దాకా నీ నుంచి నాదాకా అంతా ఆమె పేగు తెంచుకుని పుట్టిన బిడ్డలమే; ఎంత చేసినా ఆమె రుణం తీర్చుకోలేని మనుషులమే.

"వేదమూలం ఇదం బ్రహ్మం
భార్యామూలం ఇదం గృహం
కృషిమూలం ఇదం ధాన్యం
ధన మూలం ఇదం జగత్"

బ్రహ్మ సృష్టిలో అద్భుతమైన శక్తిస్వరూపిణి మహిళ. హరిశ్చంద్రుడు తన భార్య చంద్రమతితో "నీవే కదా నాకు నిఖిలేప్సితంబుల కవగతంబు లొనర్చు కల్పతరువు / నీవే కదా నాకు నిత్యసత్య యశంబు దరిజేర్చుచుండెడు ధైర్యలక్ష్మీ / నీవే కదా ఘోర దావానలము నుండి మమ్ము రక్షించిన మానవతివి / నీవే కదా మౌని ఋణబాధ తొలగించి పరువునిల్పిన యట్టి భవ్యమతివి / నీవేనా నిదానంబు, నీవెకాదె నాకులవిభూషణంబగు నలిన నయన/ అమరునె నాకు వేయిజన్మలకునైన నిన్నువంటి సతీమతి నెలతమిన్న" అని అంటాడు. భర్తకు నిజంగా వెన్నంటి ఉండి ధైర్యాన్నిచ్చే శక్తిస్వరూపిణి మహిళ. కరుణతో లాలించినా, కర్తవ్యదీక్షతో పాలించినా, తల్లిగా దీవించినా, ధర్మపత్నిగా నడిపించినా ఆమెకు ఆమే సాటి. విశ్వమంతా వ్యాపించి, నిర్వహించే పరమచైతన్యాన్ని స్త్రీ శక్తిగా, జగదాంబగా కొలుచుకునే సంప్రదాయం మనది. అడుగడుగునా ఆమెకు నీరాజనాలుపట్టే సంస్కృతి మనది. ఆమె ఆత్మవిశ్వాసానికి ఓటమి ఓడిపోవాల్సిందే... కష్టాలు తలవంచాల్సిందే, సమస్యలు సమసిపోవాల్సిందే. అమృతం పంచే అమ్మగా, ఆనందానిచ్చే అర్థాంగిగా, అనురాగం పంచే చెల్లిగా, అనుబంధమై నిలిచే కూతురుగా, పాలించే రాణిగా, అవనికే ఆధారం ఆమె. పాత్రలు మారినా, ప్రాంతాలు వేరైనా, ఆమెలేనిదే జీవితం లేదు. మనిషి మనుగడే లేదు. ఇదీ సృష్టిలో మహిళ స్థానం; సుస్థిర ప్రస్థానం. తన కడుపు కాలుతున్నా... కన్నబిడ్డ కడుపు నింపాలని చూస్తుంది అమ్మ. కుటుంబభారం మోయలేని భర్త ఇబ్బందులను చూసి తను కూడా పని చేస్తూ వేడినీళ్లకు చన్నీళ్లు తోడు అంటుంది భార్య. విధివశాత్తు అమ్మ ఖాయిలా పడినా; అమ్మకే అమ్మ అవుతుంది కూతురు. అవకాశం వస్తే పురుషులకు దీటుగా సరిహద్దుల్లోనూ రక్షణ నిలుస్తుంది ధీరవనిత. అందుకే అపురూపమైనదమ్మ ఆడజన్మ అంటారు.

కాలగమనంలో కన్నీళ్ళు ఎదురైనా కనురెప్పలచాటున దాచుకుంది. కుటుంబ ఉన్నతికి, సమాజప్రగతికి సాయం అందించింది. చైతన్యకెరటమై, కుటుంబమకుటమై, ఇంటికి దీపమై, ఆర్థికకాంతియై, ఆనందాలకు నిలయమై, ఎనలేని కృషిచేసి గెలుపుబాటలో పయనిస్తుంది. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితం. కానీ నేడు మహిళ మారింది. అన్ని రంగాలలో రాణిస్తుంది. స్వేదం చిందిస్తోంది. ఆత్మవిశ్వాసమే ఆసరాగా, ఆకాశానికి నిచ్చెన లేని బాటగా, అవకాశాలే ఆలంబనగా, ప్రగతిపథంలో దశదిశలా దూసుకెళ్తున్నారు. ఎందరో మహిళామణులు

మేం అబలలం కాదు సబలలం అంటూ ఉపాధిలో సగమై, కుటుంబపోషణలో భాగమై, మహిళా సాధికార స్వప్నమై మహిళలు వర్ధిల్లుతున్నారు. తన శ్వాసను వదురుకునైనా సరే, బిడ్డకు శ్వాస అందించాలని కోరుకునే ప్రాణి, ఈ భూమి మీద కేవలం స్త్రీ మాత్రమే.

సమస్యల సవాళ్లు విసిరినా, సమాజం ఎగతాళి చేసినా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, జీవితంలో ఎదురు దెబ్బలు తగిలినా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా, ఒడిదుడుకులు తడబడేలా చేసినా మందలో ఒకరిగా కాకుండా వందలో ఒకరిలా పేరు తెచ్చుకున్నారు. సమసమాజ నిర్మాణంలో పునాదిగా సృష్టికే ప్రతిసృష్టిగా 'స్త్రీ'ని భావించాలి.

"ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యానాం శతం పితా
సహస్రంతు పితౄన్ మాతాగౌరవేణాతిరిచ్చతే"

అని మనుధర్మశాస్త్రంలో చెప్పబడింది. "పదిమంది ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు, వందమంది ఆచార్యుల కంటే తండ్రి, వెయ్యిమంది తండ్రుల కంటే తల్లిపూజనీయురాలని మనుధర్మశాస్త్రం స్పష్టం చేసింది. అందం, అభినయం అణకువ ఒకనాటి మహిళా నిర్వచన మైతే; పరిణతి, పరిపక్వత, పరాక్రమం నేటి మహిళ సొంతంగా భావించాలి. స్త్రీ లేకపోతే జననం లేదు, గమనం లేదు, సృష్టిలో జీవం లేదు; సృష్టే లేదు అని చెప్పవచ్చు..

## తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం నేపథ్యం :

తెలుగు సాహిత్యంలోని ఆధునిక ప్రక్రియల్లో మొట్ట మొదటి ఆధునిక నాటకం అయిన ' కన్యాశుల్కం'లోనూ, మొదటి నవల అయిన 'రాజశేఖర చరిత్ర'లోనూ, మొదటి కథానిక అయిన 'దిద్దుబాటు'లోనూ స్త్రీల సమస్యలను ప్రధానంగా చర్చించటం మనం గమనించవచ్చు. శ్రీవీరేశలింగం రచనలన్నింటిలోనూ స్త్రీ సమస్యల పట్ల సంస్కరణ ధోరణి కనబడుతుంది.

'రాజశేఖర చరిత్ర'లో ' సత్యరాజా పూర్వదేశయాత్రలు' నవలలో మొదటి భాగమైన 'ఆడ మళయాళం'లో మన సంఘంలో స్త్రీలపై జరిపే కార్యాలన్నింటినీ అక్కడ "ఆడుమళయాళ దేశం సంఘంలో" పురుషులు గురయి నట్లు వర్ణించి మన సమాజంలోని అమానుష పరిస్థితులను విప్పిచెప్పారు. 'సత్యవతి చరిత్ర' అనే సాంఘిక నవలలో వీరేశలింగం స్త్రీ జీవితంలో చదువు ద్వారా కొత్త విలువ లను ప్రవేశపెట్టారు. స్త్రీవిద్యకున్న విలువను వివరిం చారు. అయితే ఆయన స్త్రీవిద్యను కుటుంబ నిర్వహణకు, భర్తను సుఖపెట్టటానికే పరిమితం చేశారనీ, స్త్రీల జీవిత విధానంలో మార్పును ఆశించినంతగా వారి జీవిత ధ్యేయాలలో మార్పును ఆశించలేదని కొందరు విమర్శకుల అభిప్రాయం .

"స్త్రీల సమస్యల్ని సామాజిక దృక్పథంతో పరిశీలించి కవిత్వం, నాటకం, కథలు గురజాడ అప్పారావుగారు రాశారు. కన్యాశుల్కం నాటకం ఈ సమాజంపై ఆయన చేసిన స్త్రీవాద విమర్శ చేయటానికి ఆయన ఎంచుకున్న పాత్ర మధురవాణి. ఆయన ఉదారవాద భావాలు ప్రచారం అవుతున్న కాలంలో జీవించినా ఆయన రచనల్లో సామాజిక విమర్శలో సోషలిస్టు భావాలే కనిపిస్తాయి. ఆయన వితంతు వివాహాన్ని ఆదర్శంగా పెట్టుకోలేదు. అసలు స్త్రీకి సతీత్వం, మాతృత్వం ఆదర్శాలుగా ఆయన నమ్మలేదు. వాటివల్ల స్త్రీవికాసం సాధించగలదని ఆయన అనుకోలేదు. అందువల్లే మధురవాణి సూటిగా ఉత్పత్తిలో పాత్ర కోసం తహతహ లాడింది కానీ భార్యకావాలనో, తల్లి కావాలనో కోరుకోలేదు". అయితే తర్వాత గురజాడ కవిత్వం ప్రేరణలో అభ్యుదయ కవిత్వం వచ్చింది. కానీ కన్యాశుల్క ప్రభావంతో స్త్రీ దృక్పథంతో రచనలు రాలేదు.

గురజాడ తర్వాత విప్లవభావాలతో తన సాహిత్యాన్ని నింపిన రచయిత చలం. స్త్రీని ఒక వ్యక్తిగా గుర్తించి ఆమెకు శరీరం ఉందని దానికి వ్యాయామం కావాలని చెప్పినవాడు చలం. ఆయన సమాజంలో స్త్రీ స్థానాన్నీ, హోదానూ నిర్ణయించే అంశాలైన లైంగికత్వం మాతృత్వం, శ్రమ - ఈ మూడింటిని గురించీ కొత్త భావాలతో రచనలు చేశాడు. స్త్రీల లైంగికత్వం గురించీ, ఆరోగ్యం గురించీ,

పిల్లల్ని కనాలో వద్దో ఎంచుకునే స్వేచ్ఛ స్త్రీకి ఉండాలనే విషయాన్ని గురించీ విపులంగా రాశాడు. స్త్రీలు తమ శరీరాల మీదా, జీవితాలమీదా అధికారం సంపాదించాలనే అపుడే వారి విముక్తి సాధ్యమని చెప్పాడు. చదువుకుని ఉద్యోగం చేస్తున్నంతమాత్రాన స్వేచ్ఛరాదనీ, ఆ చదువునీ, డబ్బునీ తమ వికాసంకోసం, సమాజం కోసం వినియోగించుకోగలిగినపుడే నిజమైన స్వేచ్ఛ దొరుకుతుందని చెబుతాడు. స్త్రీలు పిల్లల్ని కనడం స్వంత విషయం కాదనీ, ఆ సమాజానికి ఆ పిల్లలు అవసరం అనీ, పిల్లల్ని కనటం ద్వారా స్త్రీలు సమాజానికి సేవ చేస్తున్నారు. కనుక స్త్రీల ఆరోగ్యం గురించీ, ఆ సమయంలో ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశాడు చలం. స్త్రీల గురించి చలంకంటే ఎక్కువగా విప్లవాత్మక ఆలోచన చేశాక రచయిత మరొకరు లేదనడం అత్యుక్తికాదు.

కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో తెలుగు కవిత్వమే కాక నవలలూ వచ్చాయి. ప్రత్యేకంగా మహిళలను వాళ్ళ సమస్యల మీద సమీకరించి చైతన్య వంతుల్ని చేసే మహిళా ఉద్యమాన్ని తనరచనలో ప్రతిఫలింపజేసిన రచయిత శ్రీ ఉప్పల లక్ష్మణరావు, స్వామ్యవాద సమాజ స్థాపన విజయవంతమవ్వాలంటే మధ్యతరగతి ప్రజలు, మేధావుల్లోనేగాక స్త్రీపురుషుల ఆర్థిక, సామాజిక, వైవాహిక సంబంధాలలో విప్లవాత్మక మార్పులు రావాలని వీరి అభిప్రాయం.

కొడవటిగంటి కుటుంబరావు గురజాడలోని సామాజిక పరిశీలనాదృష్టి నుంచి సంయమనాన్ని చలంలోని విప్లవ భావాలనుండీ ప్రేరణ పొందిన రచయిత. ఈయన స్త్రీ స్వేచ్ఛను గురించి ఎన్నోకథలు, నవలలు రాశారు. "ఈనాడు అమలులో ఉన్న పురుషస్వామ్యంలో స్త్రీకి పురుషుడితో సమానత్వం అసాధ్యం అనీ, ఇప్పుడు వారి మధ్య ఉండే అసమానత కేవలం వ్యక్తిగతమైందికాక సామాజికమైనదనీ, వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ గొప్ప మార్పులకు గురయితేనే స్త్రీపురుషుల సమానత్వం సాధ్యం అవుతుందని కొడవటిగంటి కుటుంబరావు అభిప్రాయం. వివాహ వ్యవస్థలోని అనారోగ్య పరిస్థితులనూ, స్త్రీపురుషుల మధ్య ఉన్న అసమానత్వాన్ని వైరుధ్యాన్నీ, వైమనస్యాన్నీ తన రచనల్లో చిత్రించారు. ఈయన స్త్రీపాత్రలు స్వేచ్ఛకోసం వివాహాన్ని తిరస్కరిస్తాయి. గురజాడ మధురవాణి స్వేచ్ఛకంటే సాంఘిక భద్రతకే ప్రాధాన్యతనిస్తే, కొడవటిగంటి కుటుంబరావు, కస్తూరి, సుందరం సాంఘిక భద్రతకంటే స్వేచ్ఛకే ప్రాధాన్యమిస్తారు.

స్త్రీ స్వేచ్ఛకోసం, స్త్రీ వ్యక్తిత్వంకోసం ఆరాటపడిన రచయిత్రి పి. శ్రీదేవి, ఉన్నత విద్యనభ్యసించి తమకాళ్ళ మీద తాము నిలబడుతూ తమ జీవితాలు తాము నడుపుకోవాలనే కొత్తతరం స్త్రీలు 'కాలాతీత వ్యక్తులు' నవలలో కనబడతారు. భావదాస్యం, ఆర్థిక దాస్యం మనిషిని కృంగదీస్తాయనీ, వాటికి లోను కాకుండా బ్రతికే ఇందిర తన జీవితంలో పెళ్ళి ఒక భాగం మాత్రమేననీ, అది తన వ్యక్తిత్వాన్ని చంపితే దానినుండి బయటపడతాననే అభిప్రాయంతో ఉంటుంది.

1960లలో, ఆ తరువాత వచ్చిన రచయిత్రులంతా తమ నవలల్లో ప్రేమలతో, పెళ్ళిళ్ళతో, స్వార్థాలతో, అపార్థాలతో త్యాగాలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో స్త్రీకోసం వేదనపడి, స్త్రీకోసం తర్కిస్తూ రచనలు చేసింది రంగనాయకమ్మ. ఈమె స్త్రీలల సమస్యల్ని విభిన్న కోణాలనుండి పరిశీలించారు. ఈమె స్త్రీ పాత్రన్నింటిలో స్వతంత్ర వ్యక్తిత్వంకోసం ఆరాటం కనిపిస్తుంది. ఈమె 'జానకి విముక్తి' నవలలో మారని భర్తలు గల స్త్రీలు ఏం చెయ్యాలో చెప్పారు. సమాజంలోని అనేక సమస్యలతో పాటు స్త్రీల సమస్యను కూడా కమ్యూనిస్టు సిద్ధాంతం పరిష్కరిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

1975లో 'అంతర్జాతీయ మహిళా సంవత్సరం' జరుపుకున్నారు. ఆసందర్భంగా స్త్రీల సమస్యల గురించీ, సమాజంలో స్త్రీలస్థానం గురించీ ఎంతో చర్చ జరిగింది.

ఆ ప్రభావం తెలుగు సాహిత్యంపై ఆలస్యంగానైనా బలంగా పడింది. 1980వ దశాబ్దం నుండి చలం, కొడవటిగంటి కుటుంబరావు అందించిన రాడికల్ భావాలకు ఇప్పటి పరిస్థితుల్లో కొనసాగించటానికి స్త్రీవాదులు తమ కవితలతో, కథలతో నవలలతో సాహిత్య రంగంలో ప్రవేశించారు.

ఈనాటి స్త్రీవాదులు సాహిత్యం ద్వారా స్త్రీల ఆణిచివేత గురించీ, జెండర్, అసమానత స్త్రీల లైంగికత్వం గురించి రాడికల్ భావాలను అందిస్తున్నారు. స్త్రీవాద కవిత్వంలో కొండేపూడి నిర్మల, ఘంటసాల నిర్మల, రజని, జయప్రభ, విమల, సావిత్రి, ఈశ్వరి, కె. వరలక్ష్మి మొదలైన కవయిత్రులు, స్త్రీల శరీరాన్ని, లైంగికత్వాన్ని, సంతానోత్పత్తి శక్తినీ, శ్రమనీ ఈసమాజం ఎలా దోచుకుంటున్నదో శక్తివంతంగా చెప్పారు. ఈదోపిడీ విధానం మీద స్త్రీల తిరుగుబాటును బలంగా వినిపించాయి.

ఒంటరి వంటిళ్ళను కూలగొట్టమనీ, మానవోన్నతులమై చేసే మార్జాల దాంపత్యాలను అసహ్యించుకోమనీ, పితృస్వామ్యం గుర్తయిన పైటను తగలెయ్యమనీ, అంగాంగ ప్రదర్శనల అందాల పోటీలను బహిష్కరించమనీ, మాతృత్వం పేరుతో స్త్రీలు పరాయీకరణకు గురవుతున్న తీరును తిరస్కరించమనీ, కవయిత్రులు ప్రకటిస్తూ ఉన్నారు. స్త్రీపురుష సంబంధాలలో ఉండాల్సిన ప్రేమ నశించి అదొక దోపిడీ సంబంధంగా మారిపోయిన తీరును స్త్రీవాద కవిత్వం ఎంతో ఆర్తిగా ప్రతిధ్వనించింది.

## స్త్రీవాద కవిత్వం :

భారతదేశంలో స్త్రీల స్థితిగతులు గురించి స్పందించటం, ఆలోచించటం సంస్కరణోద్యమ కాలంలోనే మొదలైనా, సంస్కరణోద్యమ కార్యక్రమంలో స్త్రీకి పురుషుడితో సమానత్వం ముఖ్యాంశం కాదు. సంస్కరణోద్యమం కుటుంబంలో స్త్రీ జీవితాన్ని కొంచెం సుఖవంతం చేయాలని ప్రయత్నించిందే కాని మొత్తం సమాజంలో స్త్రీల స్థితిగతులలో మార్పును, అభివృద్ధిని కోరి అది పని చేయలేదు. అయితే సంస్కరణోద్యమ స్త్రీ విద్యకు ప్రాధాన్యాన్నివ్వటం, స్త్రీలకోసం నిర్వహించిన వివిధ పత్రికలు స్త్రీల హక్కుల గురించిన చైతన్యాన్ని అభివృద్ధి చేయటం, జాతీయోద్యమంలో స్త్రీల సమానత్వం రాజకీయ సమస్యగా ముందుకు రావటం, స్వాతంత్ర్యానంతర కాలంలో చదువుకొని వివిధ స్థాయిలలో ఉద్యోగాలు చేసే స్త్రీల సంఖ్య కొద్దికొద్దిగా పెరగటం, ఆ స్త్రీలకు కుటుంబంలోనూ, బయటా తాము జీవిస్తున్న పరిస్థితుల గురించి విశ్లేషించుకోవటానికి కావలసిన ప్రపంచ జ్ఞానం అందుబాటులోకి రావటం మొదలైన పరిస్థితులన్ని కలిసి దేశంలోని వివిధ ప్రాంతాలలో అభివృద్ధి చెందుతున్న ప్రజా ఉద్యమాల, పౌరహక్కుల ఉద్యమాల నేపథ్యంలో 1975 నాటికి స్వయం ప్రతిపత్తి మహిళా ఉద్యమ నిర్మాణానికి అనుకూలమైన వాతావరణాన్ని సమకూర్చాయన్నది మాత్రం చారిత్రక వాస్తవం. దానికి తోడు 1975 నుంచి కొనసాగిన 'అంతర్జాతీయ మహిళా దశాబ్ది' మహిళా జనజీవిత అధ్యయనానికి కల్పించిన చారిత్రక అవకాశం మహిళా ఉద్యమచైతన్యాన్ని మరింత విస్తృతం చేసింది. ఆంధ్ర ప్రదేశంలో 1940లో సాగిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో స్త్రీలు పురుషులతో పాటు కలిసి పనిచేసిన సంప్రదాయం ఇచ్చిన స్ఫూర్తి నుంచి, 1970ల తర్వాత నక్సల్బరి పోరాట ప్రభావంతో ప్రారంభమైన శ్రీకాకుళ రైతాంగ పోరాటానికి కొనసాగింపుగా ఉధృతమైన ఉత్తర తెలంగాణా భూవిముక్తి పోరాటాలలో స్త్రీలు భాగస్వాములై పడిన కష్టాలు, సాధించిన విజయాలు అన్నీ కలిసి అందించిన అవగాహన నుంచి 'మహిళా విముక్తి వాదం' మరింత బలాన్ని పుంజుకొంది. ఈ మహిళా విముక్తి వాదంతో ప్రభావితులై కొన్ని ఆలోచనలు రెక్క విప్పుకోగా అటు పాతతరంలో వాళ్ళు ఇటు కొత్తవాళ్ళు కూడా స్త్రీ జనజీవితాన్ని వస్తువుగా చేసుకొని వచన కవిత్వం రాశారు.

స్త్రీవాద మహిళా విముక్తి వాదాలు స్త్రీ పురుష సమానతను కాంక్షించే మానవీయ ఉద్యమాలుగా సాహిత్యానికి వస్తువుకాగలిగినంత విస్తృతమైనవి. లోతైనవి

కూడ. అందువల్లనే తెలుగు సాహిత్యంలో దాదాపు అభ్యుదయోద్యమంతో పాటు పుట్టి అన్నిరకాల ధోరణు లకు ప్రాతినిధ్యం వహిస్తూ విస్తరించిన వచన కవిత్వానికి ఈ స్త్రీవాద మహిళా విముక్తి వాద ధోరణులు మంచి వస్తువు కాగలిగాయి. అయితే వచనా కవితా రూపంలో మహిళల గురించి వచ్చిన కవిత్వమంతా గానీ, మహిళలు రాసిన మొత్తం కవిత్వం కానీ స్త్రీవాద కవిత్వమో, మహిళా విముక్తివాద కవిత్వమో అనుకోకూడదు. ఫెమినిజానికి జీవ లక్షణమైన విమర్శనాత్మక విశ్లేషణ దృక్కోణం నుంచి గానీ, మహిళా విముక్తి వాద లక్షణమైన సమూలమైన మార్పును కోరే ప్రాపంచిక దృక్పథం నుంచి గానీ స్త్రీల జీవితాలను చూసి చిత్రించిన కవిత్వం మాత్రమే ఈ వ్యాస పరిధిలోకి వచ్చింది.

స్త్రీల జీవితంలో వ్యక్తిగతమైందంటూ ఏది లేదని, స్త్రీలు తమ జీవితానుభావాలను, మనసులలోని వేదన లను వెళ్ళబోసుకోవటం ద్వారా తమ జీవితాలపై అధికారం చలాయిస్తున్న శక్తుల స్వరూప స్వభావాలను తెలుసుకొనే వీలుంటుందని, ఇన్నాళ్ళు స్త్రీ అంటే ఏమిటో పురుషుడే చెబుతూ వచ్చాడని, తానేమిటో తన అనుభవం ఏమిటో తన అనుభూతి ఏమిటో స్త్రీలే చెప్పుకోవటం అవసరమని, పితృస్వామ్య సమాజం కల్పించిన మిత్ నుంచి స్త్రీ విముక్తి కావటానికి అదొక మార్గమని చెప్పే స్త్రీవాద స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుంటే స్త్రీవాద మహిళా విముక్తివాద కవిత్వాన్ని స్త్రీలు మాత్రమే రాయాలి. మహిళల్లో కవిత్వం రాసేవాళ్ళే తక్కువ. అందులోనూ ఈరకమైన చైతన్యంతో రాసేవాళ్ళ సంఖ్య వ్రేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. జయప్రభ, కొండేపూడి నిర్మల, ఘంటసాల నిర్మల, పాటిబండ్ల రజని, రావులపల్లి సునీత, మందరపు హైమావతి, బి. పద్మావతి, ఈశ్వరి, విమలా ఇట్లా మరి కొంతమంది కూడా ఉంటారు. అయితే వీళ్ళు రాసిన కవిత్వమంతా స్త్రీవాద దృక్పథంతో స్త్రీజన జీవితాల చుట్టు తానే అల్లుకొని ఉంటుందను కోనక్కర్లేదు. స్త్రీలుగా మాత్రమే కాకుండా మనుషులుగా వాళ్ళు సమాజంలోని అనేకానేక విషయాల పట్ల స్పందిస్తూ కవిత్వం రాయవచ్చు. అలా రాశారు కూడా. జయప్రభ 'మన అధినాయక జయహే, కన్నీళ్ళు తప్ప వేరే సాక్ష్యాలు లేవు' లాంటి కవితలు రాసినా, కొండేపూడి నిర్మల 'మాటల బండి,' లాంటి కవితలు రాసినా, విమల 'అడవి ఉప్పొంగిన రాత్రి' కన్నతల్లి లాంటి కవితలు రాసినా సమకాలీన సామాజిక రాజకీయ జీవితం పట్ల మానవులుగా స్పందించటం వల్లనే రాశారు. వాటిని పురుషుల రచనలకు అమ్రేడితాలని అంటే అనవచ్చు. వివిధ సందర్భాలలో ఆడవాళ్ళ మనోభావాలు ఎలా ఉంటాయో చెప్పటానికి రాసిన కవితలని అంటే అనవచ్చు. పరిపూర్ణతకి పరమార్థం స్త్రీ అనే మనం భావించాలి. పరిపూర్ణతకు సాకారమే స్త్రీకారం.

❀❀❀

# ఆధునిక కవిత్వంలో మహిళ - డా. అద్దేపల్లి రచనల్లో ఆవేదన

- డా॥. టేకుమళ్ళ వెంకటప్పయ్య

మహిళలు ఆకాశంలో సగమన్నారు. స్త్రీ-పురుషులు సమానమేనని రాజ్యాంగమూ చెబుతోంది. సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులూ తరచూ చెబుతుంటారు. స్త్రీ-పురుష సమానత్వం విషయంలో భారతదేశం 21 పాయింట్లు దిగజారి 108 స్థానానికి పడిపోయింది. పొరుగు దేశాలైన చైనా, బంగ్లాదేశ్ కూడా భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయి. ఈ అసమానత్వాన్ని ప్రశ్నిస్తూ కవులు, రచయితలు తరచూ వాపోవడం సహజమే! డా.అద్దేపల్లి రామమోహనరావు కూడా అలాంటి మహిళాభ్యుదయం ఆశించిన కవి. ఆయన రచనల్లో ఆయన వీక్షించిన మహిళ స్థితిగతులు ఒక్కసారి అవలోకన చేసుకుందాం.

ఒక్కో కవికి ఒక్కో ఉచ్చాటన ఉంటుంది. ఆ ఉచ్చాటనల్లో నెత్తురుడికే మంటలుంటాయి. ఆకాశన్నంటే అంతర్జ్వాలలుంటాయి. కాలపు చీకటికోణాల్లో కన్నీటిని మూటగడుతూ బ్రతుకు బండని మొయ్యలేక పడుతూ లేస్తూ పోతున్న అసంఖ్యాక దౌర్భాగ్యుల దుస్సహ దీర్ఘ నిస్స్వాశాలుంటాయి. పుట్టెడు దుర్విధిని భుజాలమీద మోస్తున్న నోరులేని అమాయకుల శాపాలుంటాయి. సమాజ బాధామయ వాతావరణం గుండెల్లో రాజుకోగా... రాజుకోగా..బ్రతుకుల వైఫల్యభావన పట్టరాని విద్యుత్తుగా నిలబడితే ఆ మహాజ్వాలను తన “అంతర్జ్వాల” గా పలికి డా.అద్దేపల్లి రామమోహనరావు జ్వాలకవి అయ్యాడు. తను జీవిస్తున్న కాలాన్ని రచనల్లో ప్రతిబింబింపజేయడం “అంతర్జ్వాల”తోనే ప్రారంభమయింది. డా.అద్దేపల్లి 1965-66 సంవత్సరాల్లో రచించి, 1970వ సం.లో “అంతర్జ్వాల” అనే కవితా సంపుట ఒక సామాజిక అభ్యుదయంగా వెలువరించారు. ఈ కవితలన్నీ మనిషి-సమాజం చుట్టూ తిరుగుతాయి. అన్యాయాలపై తిరగబడ్డాయి. కుహనా పీఠాధిపతులపై విరుచుకు పడ్డాయి. స్త్రీ అంగడిబొమ్మైందని ఆవేదన వ్యక్తం చేశాయి. డా.అద్దేపల్లిని విమర్శకులు “ప్రజాకవి” అని గొప్ప మానవతావాది గాను పేర్కొన్నారు. సాటి మనిషి పట్ల ప్రేమ, కరుణ, సానుభూతి ఉన్నదే మానవతావాదం. మానవాళికి జరిగే అన్యాయాలను అక్రమాలను ఎదిరించి నిలబడడం, వాళ్ళ సౌఖ్యంకోసం అహరహమూ తపించడం, త్యాగం చెయ్యడం ఈ దృక్పథం ఉన్న వ్యక్తుల్లో సాక్షాత్కారమౌతుంది. “అంతర్జ్వాల”లో ఆయనకు నేటి మహిళ పట్ల గల ఆవేదన, నిజమైన ప్రేమ, కరుణ, సానుభూతి బహిర్గతమవుతాయి.

“అంతర్జ్వాల”లో నేటి నవనాగరిక సమాజంలో స్త్రీమూర్తి పరిస్థితి ఏమిటో మనకు సాక్షాత్కరింపజేసిన డా.అద్దేపల్లి దృక్పథాన్ని పరిశీలిస్తే ఆయన “దీన్ని నేను ఒక ప్రత్యేక కోణంలో చూశాను. ఆ జ్వాలలో ‘నా స్త్రీమూర్తి’ కనిపించింది. స్వార్థం విరబోసుకున్న తలతో ఎలా నర్తిస్తోందో మనం గమనించగలం. సమాజం ఇంతగా వైజ్ఞానిక పాదాన్ని రోదశిలో మోపుతున్నా - మనస్సు మరీ పాతాళంలోకి దిగబడిపోతుందేమో అనిపిస్తుంది. ఎదిగిన పురుషుని వెనుక వున్న స్త్రీని నిరాదరంగా విస్మరించిన సన్నివేశాలే ఎక్కువగా తారసపడుతున్నాయి” అంటారు డా.అద్దేపల్లి.

ఒక స్త్రీని చెడిపోయిందనే ముద్రవేయడం చాలా తేలిక. అలా ముద్రవేయబడ్డ స్త్రీ జీవితం వెనుక ఎన్ని విషాదబాధామయ గాథలు ఉంటాయో ఎవరికీ తెలీదు. ఏ అరాచకం ఆమెను జుట్టుపట్టి నడిరోడ్డుకీడ్చిందో ఎవరికి తెలుసు? “ఆకలేస్తోంది..సహాయం చెయ్యమని యాచించితే ఆ నిరుపేద కన్యల ఆకలిని తీర్చకపోగా తమ ఆకలిని తీర్చుకుంటున్న బడా పెద్దమనుష్యులను

తన "కవితాజ్వాల" అనే కవితలో ఉతికి ఆరేసి ఎండ గట్టాడు డా.అద్దేపల్లి.

"స్తనాల భయంకర ఘాతాలతో సంస్కృతి నురుగులు కక్కుతూ
జఘనాల మధ్య ఊపిరి సలపక
నాగరికత గిలగిలా కొట్టుకుంటూ
ప్రతిరోజూ తెల్లని తెరమీద
కొన్ని కోట్లమంది జనం ముందు
ఆడదాని అభిమానం అనే చీర అమాంతం వొలిచి వేయబడుతుంటే
దిసమొలగా నిలబడ్డ తమని తాము
సిగ్గులేక సంతోషంగా చూస్తూ
తమ పురోగతి భవిష్యత్తు గోతిలో కుక్కి
భారత స్త్రీలింకా మొగవాడి అరికాలికిందికి పోతుంటే"

నేటి సినీరంగ పరిస్థితిని చూపుతున్నాడు. కోట్లమంది అభిమానుల కోసం తమ అభిమానాన్ని వదిలేసి దిసమొలతో నిలబడుతూ, ఏడవలేక సిగ్గుతో దిన దినం చచ్చిపోతూ నవ్వేస్తున్నారట. వెండి తెరపై ఆడదాని అభిమానం అనే చీర అమాంతం ఒలిచివేయబడుతుంటే.. ఇటు సెన్సారు వారు కానీ అటు ప్రేక్షకులు గానీ వినోదిస్తున్నారేగానీ "ఇదేమి సంస్కృతి?" అని అడిగే నాధుడే లేడు.

"సమాజంలో కొన్ని తోడేళ్ళు
డబ్బుపెట్టి పెద్దమనుషులనే బిరుదు కొనుక్కుని
దాన్ని గుండె మీద వేళ్ళాడేసుకుని ఝొమ్మువిరిచి నడుస్తూ
తమసహాయ మర్ధించి చెయ్యిజాచిన
అసహాయలైన నిరుపేద కన్యకల
చర్మాన్ని రక్కి, శీలాన్ని పీల్చి
పిప్పిని బజార్లో ఉమ్మేసి
"చెడిపోయిం"దనే పేరుపెట్టి
నలుగురికీ చూపి నవ్వేస్తుంటే
జవసత్వాలు నీరుగారుతున్న
నాజాతి వెన్నెముకలో వేడి పుట్టించడానికి
ఆడదాని స్తనజఘనాల చీకటిమరుగున
మరుగుతున్న అనంత సమస్యలను చూపించడానికి
నానాటికి పాలిపోతున్న కనుపాపల్లో
కాంతిరేఖలు రగిలించడానికి
ఇక్కడ ఈ కవితాజ్వాల వెలిగిస్తున్నాను
ఈ జ్వాల చేతబట్టి ప్రతిమనిషి ముందూ నిలుస్తాను
జ్వాలతో చెయ్యికాలి రక్తంలో మంటలు లేచినా అలాగే నిలుస్తాను"

- అంటూ ఈ దుస్థితి మారడానికి కంకణం కట్టి నిలబడ్డాడు కవి.

"ఆ మంటల కాంతుల్లో
కొన్నికళ్ళలోనైనా కొత్తరేఖలు వెలుగుతై అని ఆశ!
ఆమంటల వేడిలో
కొన్ని మనసులైనా కరుగుతై అని ఆశ!"

మనదేశపు సంస్కృతి, పురాణాలు, ఇతిహాసాలు స్త్రీమూర్తిని ఎవరెస్టు శిఖరమంత ఎత్తులో నిలిపాయి. మరి అదే స్త్రీని ఆ శిఖరం మీదనుండి లోతైన లోయల్లోకి విసిరేస్తున్న ఈనాటి దుర్భర నగ్న సత్యం. ఈ కుసంస్కృతిని ఎండగట్టాలనీ, తుడిచిపెట్టాలని ఆశాభావంతో కవిత ముగిస్తాడు కవి

"కందుకూరికి బాష్పాంజలి" అన్న కవితలో స్త్రీమూర్తి విషయంలో ఎంత వేదన ఎగసి నింగిని తాకిందో మనకు చూపిస్తాడు కవి.

"అనాథల ఆకాశంలాంటి నుదిటిమీద
నెత్తురులో సూర్యోదయ తిలకాన్ని"

రచించిన వీరేశలింగం మనకు దర్శనమిస్తాడు.

"చీకటితో కళ్ళకి కాటుకపెట్టుకుంటూ
బానిసత్వపు మడిబట్టలు ఒంటినిండా చుట్టుకునే
ఆడవాళ్ళనబడే వంట మనుష్యులకి..
విప్లవసాహిత్య దీపాన్ని" చూపించిన అభ్యుదయ శీలి మనకు కనిపిస్తాడు.

ఈ కవితలో ప్రతి పదమూ చీకటిలో మ్రగ్గుతున్న స్త్రీలకు దర్పణం పడుతుంది. అలాంటి అభ్యుదయ భావాలు మనలో కలగాలని కందుకూరిని మళ్ళీ ఆహ్వానిస్తాడు కవి. అలాగే "నటరాజు నర్తించని సంధ్య" అనే కవితలో వేశ్యల ఆత్మఘోష గురించి కవిపడ్డ ఆవేదన వ్యక్తమౌతుంది.

"రేయంతా పశువాంఛకు బలియై
బ్రతుకులోని చీకటి పాటలను మ్రోగించి
వాంఛ చచ్చిన నరాలు
మొద్దు నిద్దరలో నరక స్వప్నాలను కంటున్న
వెలయాలి ఆత్మఘోష"

వెలయాలికి రేయీ పగలూ రెండూ నరకమే! నిశాచరులకు చీకటి పాటలంటే ఇష్టం. వెలయాలు కామశిలను కన్నీటితో నిరంతరం తడుపుతూనే ఉంటుంది. తెల్లవారుఝామున ఎప్పుడో కలతనిద్ర. ఆ నిద్రలో కలలు. అవి కూడా నరకతుల్యాలే!

"దిక్కుమాలి దీనంగా ఘోషించే
స్త్రీమూర్తి ముఖం నిండా బురదబురదగా
పులుముకుని
జీవితపు బాటమీద క్షణక్షణానికీ
జాలిలేని ఈటెలు
భయం నింపే బాణాలూ
తేనెపూసిన కత్తులూ
ఆశల్ని దహింపజేసే దారుణ శతఘ్నులూ
దుస్తుల వెనుక దాచుకున్న అమానుష అణ్వస్త్రాలు
ఎదురుకాగా.."

ఒక స్త్రీ ఎలా విలువల్లేని భయంకర సమాజంలో విలవిల్లాడిందో మనకు కనిపిస్తుంది. ఇలా తన సునిశిత చక్షువులతో స్త్రీమూర్తుల్లోని ఎన్నో చీకటి కోణాలను దర్శించగలిగారు డా.అద్దేపల్లి. తన అక్షరాలనే ఆయుధాలుగా మార్చాడు. కవికి ఎప్పుడూ సంఘాన్ని జాగృతం చేయడమే కర్తవ్యంగా ఉండాలంటాడు డా.అద్దేపల్లి. ఇది తప్పు-ఇది ఒప్పు అని చెప్పగలగాలి. తెలుసుకుంటే వారి మార్గం సుగమం అవుతుంది. అలాంటి మేలుకొలుపులు పలికే ఒక వైతాళికుడు కావాలి. ఆ మేలుకొలుపు సుమార్గాన్ని నిర్దేశించగలగాలి. అలాంటి ఎన్నో జ్వాలలు ఆయన హృదయకుహరాలలో నిలిచి విలపిస్తూ అంతర్జ్వాల అంత నిండి ఉన్నాయి.

ఆధునిక సంస్కృతి

"బ్యూటీ క్లినిక్కులో చర్మం మార్చుకుని
ఎడ్వర్టైజుమెంట్లలో బట్టలు విప్పుకొని
చిన్న తెరలమీద పరుగులు పెట్టి
పెద్ద తెరలమీద నురుగులు కక్కి
వాణిజ్య హర్మ్యాల ముంగిట్లో మూర్ఛపోయింది
ఇది రాళ్ళు కలిపే అన్నం
బూతు కాటేసిన నీతి
కామం పడగెత్తిన ప్రేమ
మృత్యుకెరటాల జీవితం
నీడలు కలసిన వెలుతురు మింగి
అరగని సంధ్యలో ఉదయం కోసం వేదన
చిరిగిపోయిన నువ్వు, చీలికలైన హృదయం
ఇది
వాసన తెగిపోయిన బతుకుపువ్వు"

ఈ కవిత డా.అద్దేపల్లి 1995 సం.లో రచించిన "మెరుపుపువ్వు" దీర్ఘ కవిత అనే ఒక ప్రతీక కావ్యం లోనిది. దీనిలో సముద్రం ప్రతీక. మనిషి నిరంతరం చైతన్యంగా ఉండాలి అనే విషయం దీనిలో చెప్పబడింది. ఇందులో సామాజిక విమర్శ ఉంది. అప్పుడప్పుడే మనదేశంలోకి చొరబడుతున్న ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) ప్రభావం కనిపిస్తూ ఉంటుంది. అంతా కూడా సమాజానికి సంబంధించి, ఆత్మకతకు సంబంధించిన ఒక ప్రతీకాత్మక మైన దీర్ఘ కవిత.1990 సం.నుండి సామ్రాజ్యవాదం భారతదేశానికి ఒక సవాలుగా నిలబడింది. మన దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితులను శాసించడమే కాకుండా, మనం ఏ గొప్ప సాంస్కృతిక విలువల్ని మనవిగా

చెప్పుకుంటామో, అవన్నీ ఊడ్చుకుపోయే పరిస్థితి నెలకొన్నది. ఆ నేపథ్యం ఈ దీర్ఘ కవితలో కనిపిస్తుంది.

మనదైన సంస్కృతి ఒకటి ఉన్నదని, దాన్ని అనుసరించాలి కాని పాశ్చాత్య భావదాస్యంలో పడి పోకూడదని మనం ప్రయత్నించలేదు. పైగా, వలస పాలకులు అనుగ్రహ దృష్టితో మనకి నేర్పిన కొత్త సంస్కరణలలో ఏవి మనకి పనికి వచ్చేవో, ఏవి పనికి రానివో తెలీక, చాప కింద నీరులా మన ఆలోచనల్ని మార్చేస్తూంటే, అమాయకంగా ఆధునికత పేరుతో అవన్నీ మనకి అవసరమని మనం నమ్మి, వాటినీ, ఆ సంస్కరణలు తెచ్చిన వాళ్లనీ ఆరాధనాబుద్ధితో పూజిస్తున్నామో మనకి ఇప్పటికీ బోధపడడం లేదు. సహజ సుందరమైన అందాలను, ఆయుర్వేద సౌందర్య సాధనాలను వదిలేసి, మధ్య తరగతి మహిళలు సైతం బ్యూటీ క్లినిక్కులలోకి దూరుతున్నారు. ఎడ్వర్టైజుమెంట్ల పేరుతో, విషయం ఏదైనా సరే స్త్రీని అర్ధనగ్నంగా ఆవిష్కరిస్తున్నారు. ఇక బుల్లి తెర, వెండితెరలపై స్త్రీ ప్రదర్శిస్తున్న విధానానికి అడ్డుకట్టలు లేవు. అందుకే ఆ కుసంస్కృతిని అందంగా "వాసన తెగిన పువ్వు" అని అంటున్నాడు కవి.

"అనంత సమస్యా పరపీడిత భయంకర వర్తమానంలో నుండి సాంఘిక దురన్యాయాలకి ప్రత్యక్ష సాక్షి అవుతూ, అంధకారమయ భయంకర భవిష్యత్తుని దర్శించి, స్థంభించి, దిమ్మెక్కి, దౌష్ట్యాలకి, దురధికారాలకు వ్యతిరేకంగా గొంతెత్తి చేసిన ఆక్రోశం "అంతర్జ్వాల" లో అడుగడుగునా దర్శనమిస్తుంది. వైయక్తిక జీవితాన్ని సామాజిక జీవితంతో ముడేసి వాటి పరస్పర సంబంధాన్ని సమర్ధవంతంగా నిర్వహించిన దీర్ఘ కవిత "మెరుపు పువ్వు".డా.అద్దేపల్లి తన దారి పట్ల ధ్యాస,విశ్వాసమూ కలిగి ఉన్న కవి. కవిత్వాన్ని పాజిటివ్ గా తీసుకున్న కవి.అలాగే మెరుపు పువ్వు లో "ఒకనాడు తీరైన కట్టూ బొట్టుతో భారతీయతను ప్రతిబింబించే వాతావరణం నేడు లేదు. బ్యూటీ క్లినిక్కులలోను, వాణిజ్య ప్రకటనలలోను బట్టలు విప్పుకున్న సంస్కృతి, బుల్లితెర, వెండితెరల మధ్య ఆయాస పడుతోంది. అసలు సిసలు ప్రేమలు లేవు. అన్నీ కల్తీ! మృత్యుకెరటాల జీవితమైపోయింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పూర్తిగా మంట గలిశాయి" అని ఆవేదనా బావుటా ఎగురవేసిన కవి డా.అద్దేపల్లి.

**ఆధార గ్రంథాలు :**

1. అంతర్జ్వాల - డా.అద్దేపల్లి రామమోహనరావు
2. మెరుపు పువ్వు - డా.అద్దేపల్లి రామమోహనరావు

❀❀❀

# తెలంగాణ తొలి తరం కథల్లో మహిళా చైతన్యం

- డా॥. తత్త్వాది ప్రమోద కుమార్, సహాయ ఆచార్యులు, ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల , కరీంనగర్.

ఒక కథ మొదలుకొని వందల సంఖ్యలో కథలు రాసిన రచయితలు తెలంగాణలో ఉన్నారు. ఈ ప్రాంతంలో కథా సాహిత్య నిర్మాణంలో కాలిడిన రచయితలు వారి కథల వివరాలను "దస్త్రమ్" ద్వారా సంగిశెట్టి శ్రీనివాస్ ప్రకటించారు. ఆ పుస్తక సమాచారం ప్రకారం 814 కథలు 250కు పైగా కథా రచయితల గూర్చి తెలియ వస్తుంది. ఇంకా దొరకని కథలు ఎన్నో ఉంటాయి. తొలి రోజుల్లో సాహిత్య సృష్టి, పరిశోధనా దృష్టి, పత్రికల నిర్వహణ, సాంస్కృతిక రాజకీయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రతి వ్యక్తి కథను రచించారు. అయినప్పటికీ ఆనాడు ఉన్నట్టి పరిమితులు, పరిస్థితుల దృష్ట్యా ఈ కథా సాహిత్యంలో విశేషాలు పూర్తి స్థాయిలో లోకానికి బహిర్గతం కాలేకపోయాయి.

భండారు అచ్చమాంబ మొదలుకొని నేటి వరకు ఈ ప్రాంతంలో ఐదారు వేల సంఖ్యను మించిన కథలు వెలువడ్డాయి. దాదాపు 250 పైగా కథా రచయితలు ఉన్నారు. వీరందరు సమకాలీన సామాజిక పరిస్థితులను, తెలంగాణ గ్రామీణ సంఘర్షణను తమ కథల్లో సృష్టించారు. తెలంగాణ కథ అన్ని ఉద్యమాలను తనలో లీనం చేసుకొంది. రజాకారు పోరాటాలు, భూపోరాటాలు, మధ్యతరగతి బతుకు వెతలతో పాటు మహిళాభ్యుదయ సంఘటనలను చిత్రించింది.

మాడపాటి హనుమంతరావు, నందగిరి వెంకటరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఎల్లాప్రెగడ సీతాకుమారి, నందగిరి ఇందిరాదేవి, కాలోజి నారాయణరావు, పొట్లపల్లి రామారావు, బూర్గుల రంగనాథరావు, పి.వి. నరసింహారావు, జి.రాములు, గూడూరు సీతారాం, వట్టికోట ఆళ్వారుస్వామి, సురమౌళి, యశోదారెడ్డి మొదలైన రచయితలు విభిన్నమైన కథలను రచించి తెలంగాణ తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేసారు.

రజాకార్లను, వారి వ్యవస్థను వినాశపరచడానికి వారిని ఎదిరించడానికి ఎందరో అజ్ఞాతంగా ఉద్యమాలు నిర్వహించారు. పోలీసులపై, రజాకార్లపై దాడి చేసే వారిని ఆపత్కాలంలో స్థానికులే ఆదుకొన్నారు గ్రామాల లోని స్త్రీలు, పురుషులు అందరూ సహాయం చేస్తుండేవారు వారిని ఆపదల నుంచి తప్పించి కాపాడుకోవడానికి ప్రజలు తమ మానప్రాణాలను పణంగా పెట్టారు. ప్రత్యక్షంగా పోరాటాల్లో పాల్గొనకపోయినా అవసరమైన సందర్భాల్లో తమ చాకచక్యాన్ని, ధీరత్వాన్ని ప్రదర్శించిన సామాన్యప్రజలను మహిళలను కథకులు తమ కథల్లో వర్ణించారు.

నాగరికత అంతగా తెలియని పల్లెటూరు ముసలవ్వ ఒక కాంగ్రెస్ వాలంటీర్ను తన గడుసుతనంతో కాపాడిన వైనాన్ని పి.వి.నరసింహారావు "గొల్లరామవ్వ"కథలో గమనించవచ్చు.

పోరాటాన్ని అణచివేడయంలో భాగంగా పోరాట యోధులను దొంగచాటుగా నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్న ఇద్దరు పోలీసులను చంపి, తప్పించుకోబోయి కాంగ్రెస్ వాలంటీర్ గొల్ల రామవ్వ ఇంట్లో చేరుతాడు. ఆనాటి రాజకీయ పరిస్థితులను, రజాకార్ల దుర్మార్గాలను తెలిసిన రామవ్వ ఆ కాంగ్రెస్ యువకుడిని చూసి భయపడుతుంది. ఆ యువకుడు రజాకార్ కాదు కాంగ్రెస్ వాలంటీర్ అని తెలిసిన తర్వాత అతడిని రక్షించడానికి ప్రయత్నిస్తుంది. శరీరగాయాలకు పరిచర్యలు చేస్తుంది. ఆహారం తినిపిస్తుంది. పడుకొమ్మనిచెప్పి రామవ్వ, ఆమె మనుమరాలు కావలి కాస్తుంటారు. తప్పించుకొన్న యువకుడిని వెదుకుతూ పోలీసులు ఇల్లు సోదా చేయడానికి గొల్ల రామవ్వ ఇంటికి వస్తారు. పోలీసులు రాక తెలుసుకొన్న ముసలవ్వ ఆ యువడికి గొల్ల వేషం వేయిస్తుంది.

మంచంలో పడుకొమ్మని అతడి పక్కలో పడుచు మనుమ రాలు మల్లమ్మను పడుకొమ్మని హుకుం జారీ చేస్తుంది. పోలీసులకు అనుమానం రీతిలో గడుసుతనంతో వ్యవహరిస్తుంది. పోలీసుల ప్రశ్నలకు చాకచక్యంగా జవాబులు చెప్పి పోలీసులను పంపించేస్తుంది. అవ్వ గడుసుతనాన్ని సమయస్ఫూర్తిని గమనించిన యువకుడు "అవ్వా! నీవు సామాన్యురాలవు కావు సాక్షాత్ భారత మాతవే" అన్నాడు.

పై కథ ద్వారా ఆనాటి రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు చేసే వీరులను పాడుకోవడానికి స్త్రీలు ఏ మాత్రం సంకోచించలేదని పైగా ధీర్య సాహసాలను సమయ స్ఫూర్తిని ప్రదర్శించారని తెలుస్తుంది. ఉద్యమవీరులను కాపాడుకోవడానికి, వారిని పరపురుషులనే భేదం చూడకుండా గొల్ల రామవ్వ మనుమరాలు పక్కలోనే పడుకోనిచ్చిందంటే, ఉద్యమకారుల పట్ల, ఉద్యమ సంఘర్షణ పట్ల ప్రజలకు గౌరవం, భక్తి విశ్వాసాలు ఉన్నతస్థాయిలో ఉండేవని తెలుస్తుంది.

సమాజ ముఖ చిత్రణలో కుటుంబ జీవనానిదే ప్రాముఖ్యత. కుటుంబ జీవనమే . సమాజానికి ప్రాతిపదిక, కుటుంబంలోని వ్యక్తుల సంబంధ బాంధవ్యాలు, వారి నడుమ కొనసాగే ప్రేమానుబంధాలు ఆయా వర్గాల సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. శ్రీమంతులు ఆడంబర జీవన విధానాన్ని అవలంబించగా సామాన్యులు నిరాడంబరమైన జీవితాన్ని కొనసాగిస్తుంటారు. ఈ రెండు వర్గాల జీవన విధానాలను తెలంగాణ కథకులు తమ కథల్లో వ్యక్తీకరించారు. చాలామంది రచయితలు గ్రామీణ ప్రాంతాల సామాన్య, మధ్యతరగతి కుటుంబ జీవన విషయాలనే కథలుగా మలచారు.

సంసార చక్రం సజావుగా పయనించడానికి భార్యా భర్తల అనురాగ, విశ్వాసాలే మూలాధారం. ఏ పరిస్థితులలోనైనా వారి మధ్య అపోహలు, అపార్థాలు ఏర్పడితే వారి మనస్సుల్లో చెలరేగే సంఘర్షణ కొల మానానికి అందదు. భర్త పరస్త్రీ సంబంధాన్ని కలిగి ఉన్నాడన్న విషయం తెలిసిన భార్య పొందే ఆవేదనను తెలంగాణ తొలి కథల ద్వారా గమనించవచ్చు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య కొనసాగే ఆత్మీయత వల్ల కుటుంబ జీవనం ఆరోగ్యకరంగా ఉంటుందని, లేకపోతే కుటుంబాలు నిట్టనిలువునా చీలిపోతాయని ఈ కథలు నిరూపిస్తున్నాయి.

మాడపాటి హనుమంతరావు "హృదయశల్యము" కథ. కాకతీయ రుద్రమదేవి కాలం నాటిది. యమునా, ప్రతాపుల అనే దంపతులు గ్రామాంతరం నుండి స్వగ్రామానికి ప్రయాణమవుతారు. చీకట్లు ముసురుకొనే సమయంలో నట్టడవిలోనే ప్రయాణం కొనసాగుతుంది. యమున పల్లకిలో బయలదేరగా ప్రతాపుడు గుర్రంపై అనుసరిస్తాడు. గుర్రం బడలికతో ప్రతాపుడు వెనుకబడి పోతాడు. దొంకలగుంపు పల్లకిని నుంచి యున నగలను దొంగిలించబోగా అశ్వారూఢులైన ముగ్గురు వ్యక్తులు వచ్చి దొంగల గుంపునుచెదరగొడతారు. ఆ ముగ్గురిలో మీసం మొలక గూడలేని వ్యక్తి యమునను అక్కున చేర్చుకొని ఓదారుస్తాడు. ఇంతలోనే అక్కడకు భర్త ప్రతాపుడు చేరుకొని విషయాన్ని తెలుసుకొంటాడు. యమునను కాపాడిన వ్యక్తులకు కృతజ్ఞతలు తెలుపుతాడు. ఆయుధ పాణులైన ఆ వ్యక్తులు యమునాప్రతాపుల చిరునామా తెలుసుకొని వెళ్ళిపోతారు. దంపతులు క్షేమంగా ఇంటికి చేరుకొంటారు. క్రమక్రమంగా ప్రతాపునిలో యమున యందు అనురాగ భేదమేర్పడుతుంది. పరపురుషుని కౌగిలిలో ఒదిగిందనే భావనతో ఆమెను నిరాదరిస్తాడు. భర్త ప్రవర్తనకు యమున కుమిలిపోతుంది. అదే సమయంలో అడవిలో కాపాడిన ఆ వ్యక్తి మళ్ళీ ఇంటికి రావడం జరుగుతుంది. ప్రతాపుడు ఆ వ్యక్తిని అన్నివిధాలా గౌరవిస్తాడు. యమున తన భర్త అనురాగ జీవనానికి తనను దూరం చేసిన ఆ వ్యక్తిని నిందిస్తుంది. వారి ముగ్గురు నడుమ సంభాషణలు కొనసాగుతుండగా రాజభటుడు వచ్చి, రాచరిక పద్ధతిలో యమునా ప్రతాపు లింట అతిధియైన వ్యక్తితో సంభాషిస్తాడు. ఆ వ్యక్తి ఎవరో

కాదు పురుషవేషధారియైన రుద్రమదేవి అని తెలుసుకొంటారు. ఈ సంఘటనతో ప్రతాపుని మనసు నిర్మలమవుతుంది.

రాణి రుద్రమదేవి పాత్ర ప్రవేశం వలన ఈ కథ చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకొన్నది. నిజానికి ఇది సామాజిక కథయే. స్త్రీ చైతన్య శక్తిని, భార్యాభర్తల మనస్తత్వాన్ని ఈ కథ వ్యక్తీకరిస్తుంది. అప్పుడప్పుడే ప్రబలుతున్న స్త్రీ చైతన్య శక్తికి పురుషసమాజం మరింత సహకారమందించాలే తప్ప వారిని అనుమానాలతో అడ్డుకోకూడదనే సందేశాన్ని రచయిత అంతర్లీనంగా వ్యక్తీకరించారు. ''హృదయశల్యము''లో మగవాళ్ళు ఆడవాళ్ళను అకారణంగా అనుమానించటాన్ని శీలాన్ని శంకించటాన్ని వస్తువుగా మాడపాటి తీసుకున్నాడు. అప్పుడే స్త్రీలు కడపదాటి బయటి ప్రపంచంలోకి వస్తున్నారు. ఉద్యమాల్లో మగవాళ్ళతో కలిసి పని చేస్తున్నారు. అప్పుడు మగవాళ్ళు నిష్కారణంగా ఆడవాళ్లను శంకించడం భావ్యం కాదనే సందేశాన్ని అందిస్తూ మాడపాటి ఈ కథను వ్రాసాడు'' అని ముదిగంటి సుజాతారెడ్డి పేర్కొన్నారు.

అందుగుల తిరుమలరావు "నిష్ఫలం" కథ కాకతీయ వంశజుడైన రెండవ ప్రతాపరుద్రుని కాలం నాటిది. మాడపాటి వారి 'హృదయ శల్యము' వలె ఇది కూడా చారిత్రక నేపథ్యంతో కూడిన కల్పిత కథ. సాంసారిక జీవితంలో దంపతుల సాహచర్యం అత్యంత ప్రభావాన్ని చూపుతుందని, దంపతుల మధ్య పరస్పర గౌరవ, ఆదర మర్యాదలకుభంగం ఏర్పడినప్పుడు తీవ్రమైన మానసిక సంఘర్షణతో నలిగిపోతారని, సాంసారిక జీవితం విచ్ఛిన్నమవుతుందని ఈ కథ ద్వారా రచయిత తెలియజెప్పారు.

కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తి వచ్చిన మాలిక్ కాపుర్ను తరిమికొట్టిన బాలనాయుడిని చక్రవర్తితో సహా అందరు అభినందిస్తారు. బాలనాయుడి శౌర్య పరాక్రమాదులను ప్రతి ఒక్కరు ప్రశంసిస్తారు. విజయం తర్వాత వారం రోజుల సెలవు తీసుకొని ఇంటికి వస్తాడు. తన సాహసం, శౌర్యం మొదలైన వాటి గురించి భార్య లక్ష్మి ఆసక్తిని ప్రదర్శించి తన గొప్పతనాన్ని గుర్తిస్తుందని అనేక రీతులుగా బాలనాయుడు భావించాడు. ఇంట్లో భార్య ఉండదు. పుట్టింటికి వెళ్ళిన భార్యను రమ్మని కబురు పంపగా ఆ మరునాడు ఇల్లు చేరుకొంటుంది. భర్త సాహసం గూర్చి ఆసక్తి కనబర్చదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఆమె పెరిగిన వాతావరణం గౌరవ మర్యాదలను ఇచ్చి పుచ్చుకోవడాన్ని నేర్పలేదు. ఆ ఫలితమే ఇప్పటి వ్యవహారం ఆమె వ్యవహార లక్షణాలు బాలనాయుడిని అమితంగా బాధించాయి. కలత చెందాడు. తన ఖర్మానికై పరితపించాడు. రెండురోజుల సెలవు ముగియకుండానే ఉద్యోగవిధుల్లో చేరడానికి ప్రయాణమవుతారు. సాంసారిక జీవితంలో స్త్రీశక్తిలో ఉండే అద్భుతమైన ప్రభావాన్ని, దానికి గల పటిష్టతను ఈ కథ తెలియజేస్తుంది. ఈ కథలో "నాయకుని ప్రేమ, నాయిక అభిమానం కాల్పనిక రీతిలో చిత్రింపబడినాయి." అని ముదిగంటి సుజాతారెడ్డిగారు పేర్కొన్నారు.

తాను ప్రేమించిన వ్యక్తి మనసులోని అపోహలను తొలగించి, ఆ మనిషి అభిమానాన్ని చూరగొని వివాహ మాడిన కథ ఎల్లాప్రగడ సీతాకుమారి 'ఈ రాధేనా?'. స్వయంశక్తిత్వాన్ని, వ్యక్తిత్వ నిర్ణయాన్ని, స్త్రీ చైతన్యానికి సంకేతంగా ఈ కథను సీతాకుమారి రచించారు.

రాజారావు కథా రచయిత. రెసిడెన్సీ చమన్లో కూర్చొని కథ రాయడానికి సంసిద్ధుడవుతాడు. ఆ సమయంలో, అపరిచితురాలైన స్త్రీ వచ్చి సహాయాన్ని కోరుతుంది. తనకు ముసలివాడితో పెళ్ళి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారని, ఆ పెళ్ళి ముహూర్తం బాలీవరకు తోడుగా ఉండమని అపరిచిత స్త్రీ రాజారావును అభ్యర్థిస్తుంది. అబలను దుకోవాలనే ఉద్దేశంతో అమ్మాయి కోరిక మేరకు షాదునగర్లో దింపుతాడు. ఆమె అభ్యర్థనపై మూడు రోజులపాటు రాజారావు అక్కడే ఉంటాడు. ఆ అమ్మాయి రాజారావు స్వప్నాల్లో తిలకిస్తున్నంత చక్కనిది కాదు. "అసలు నాకు మన తెలుగు పిల్లలంటేనే తృప్తి.... ఏదో సందర్భంపడితే జర్మనీ నుంచే..'' అని అభిప్రాయం

రాజారావులో బతీయంగా ఉంది. కాని మూడురోజుల పాటు రాధతో సహచర జీవనం వల్ల రాజారావు ఆలోచనల్లో మార్పు కనబడసాగింది. రాధ నడకలో, మాటల వ్యవహారంలో, వంట నైపుణ్యంలో, సహజ స్నిగ్ధసౌందర్యంతో రాజారావు ఆకర్షితుడైనాడు. రాధను వివాహం చేసుకోవడానికి ఆమె అంగీకారాన్ని అర్థించాడు. రాధ తన తల్లిదండ్రుల అనుమతితో మోహం చేసుకోవడా నికి సిద్ధమని అంటూ షాదునగర్ నుంచి తిరుగు ప్రయాణమైనారు. వారు కాచిగూడా స్టేషన్లో రైలు దిగగానే రాజారావు తండ్రి, తమ్ముడు, మేనమామ, మేనమామ కొడుకు వచ్చారు. మేనమామ పూలహారాలతో, రాధా, రాజారావులను ఇవ్వానించారు. రాజారావు ఆశ్చర్య పోతాడు. "ఏమిటిది? తన మేనమామ కూతురేనా? ఈ రాధ? ఈరాధనేనా చిన్నప్పటి నుంచీ ఎంతమంది చెప్పినా చేసుకోనని కూచున్నది!! రాధ చేసిన పన్నాగమంతా అందరికీ తెల్సిందేనా!! రాధ ఎంత మేధావి....." అంటూ విధాతకు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు..

తాను కోరుకున్న రాజారావు మనసులోని అపోహలను తొలగించి, అతని మనసులో అభిమానాన్ని నిలువరించు కొని, అతడితోనే వివాహం జరిపించుకొన్న రాధ స్త్రీ అభ్యుదయ చైతన్యశక్తికి ప్రతీక. స్త్రీ స్వయంశక్తితో తన నిర్ణయాలకు స్థిరరూపం కల్పించుకొంటుందని.. వైవాహిక జీవితంలో ఆచరణకు వీలుకాని ఆదర్శాల కంటే జీవితగమనానికి అవసరమైన ఆవరణ శీలత ఉంటే సరిపోతుందని ఈ కథ నిరూపిస్తుంది. ఈ కథ స్త్రీ అభ్యుదయ చైతన్యాన్ని ప్రకటించింది.

అనాటి సమాజంలో అధికశాతం ప్రజలు ముఖ్యంగా స్త్రీలు విద్యా గంధం లేనివారే. కింది కులాలలోనే కాకుండా బ్రాహ్మణ కుటుంబాలు సంపన్నుల కుటుంబాల్లోని స్త్రీలలో కూడా విద్యా చైతన్యం లేదు. దీనికి తోడు తరతరాల మూఢత్వం, పేదరికం మొదలైన కారణాలవల్ల స్త్రీలు వివక్షకు గురి అయ్యారు. పురుషాధి పత్య భావ ప్రభావ కారణంగా స్త్రీలకు స్వయం నిర్ణయ శక్తి లేదు. తత్ఫలితంగా వివాహాది ముఖ్య విషయాల్లో పురుషుల నిర్ణయమే శిరోధార్యమై అతిబాల్య - వృద్ధ వివాహాలు జరిగేవి. జీవితం గూర్చి ఊహామాత్రంగా నైనా ఆలోచన రాక పూర్వమే బాలికలు వితంతువులై జీవిత మంతా దుర్భరంగా కొనసాగించేవారు. కుటుంబ సభ్యుల నుంచి, సమాజం నుంచి వివక్షకు గురై మానసిక క్షోభను పొందేవారి కథలు అనేకం. షబ్నవీసు వెంకట రామ నరసింహారావు 'బాలికా విలాపము'' ఆనాటి వైధవ్య బాలికల కష్టాలకు దర్పణంలా ఉంది.

ఒకానొక దేశభక్తుడు దేశ సంచారం చేస్తూ త్రిలింగ దేశానికి చేరుకొంటాడు. ఒకరోజు రాత్రివేళ ప్రయాణం చేయవీలు లేక ఓ చెట్టు కింద విశ్రమిస్తాడు. అర్ధరాత్రివేళ ఆర్తనాదాలు కనిపిస్తాయి. శ్రద్ధగా చెవి పెట్టి ఆరధ్వనులను ఆలకిస్తాడు. విధి వంచితులైన స్త్రీలు దుష్ట సంప్రదాయా లుగా పరిణమించిన కన్యాశుల్కం, బాలికా వివాహం, తత్పర్యవసానంగా ఏర్పడిన బాల వితంతువులు దురవస్థలను గూర్చి ఆక్రందించి, సమీప నదిలో ప్రాణత్యాగం చేయడానికి నిశ్చయించుకొంటారు. దేశ భక్తుడు వారిని కాపాడ దలచి వారి వద్దకు చేరుకొంటాడు. నలుగురు బాలికలను చూసి ఆశ్చర్యపోతాడు. ఆందోళన చెందుతాడు. వారి ఆత్మహత్యా నివారణకు ప్రయత్నించిన దేశభక్తునికి వారు తమ దురవస్థలను గూర్చి ఎకరువు పెడతారు. ఆ నలుగురు ఏ కోదరులే. ఆ నలుగురు బాల వితంతువులే. బాలికల తండ్రి కన్యాశుల్కాలకు ఆశపడి పాప పుణ్యాలెరుగని అమాయకులైన ఆ బాలికలకు వృద్ధులతో వివాహాలు జరిపించాడు. శ్వాసకోశ రోగపీడితుడైన వృద్ధునికి పెద్దకూతురుతో పెళ్ళిచేయగా వెళ్ళివేడుకలైనా పూర్తికాకముందే ముసలివాడు మరణిస్తాడు. ఆమె అప్పటినుంచి వితంతువే రెండవ కూతురును ఒక ధనికునికి నాలుగవ భార్యగా ఇచ్చి వివాహం చేస్తాడు. ఆ ధనికుడు తన పిల్లల సంరక్షణార్థమే వివాహం చేసుకొంటాడు. రెండు నెలల్లోనే ఆ ముసలిభర్త మరణించాడు. మూడవ బిడ్డను రోగగ్రస్థుడికి ఇచ్చి పెళ్ళి

చేయగా కొద్దిరోజుల్లోనే ఆ బిడ్డ విధవరాలవుతుంది. కడుపిసిబిడ్డ అయిన నాలుగవ బిడ్డను బాలారిష్టాలు దాటని పిల్లవాడికి ఇచ్చి పెళ్ళి చేస్తాడు. స్ఫోటకం వల్ల ఆ బాలుడు మరణిస్తాడు. ఇక కడుపసిబిడ్డ గూడా విధవయే. డాంబికమైన పేరు ప్రతిష్టలకోసం, ప్రలోభాలకు లొంగి పోవడమే ఈ అనర్థాలకు మూలకారణం. "…. కట్నముల నిమిత్తము, తమ వేడుకల నిమిత్తము, తమ వైభవముల నిమిత్తము తమ డాంబికముల నిమిత్తము మమ్ము మూలదయ్యములఉ జేయుట భూరి సంభావనాభిలాషులుగు వారి ప్రోత్సాహపు మాటల దాటలేక మా నెత్తురు కండ్లజూచుట, వృద్ధులగు తమ తల్లిదండ్రుల కండ్ల యెదుట ముచ్చటలు దీర్చుకొనుటకు మమ్ము వికలాంగులకును, అప్రయోజకులకును, మూఢులకును, బలిమిని బలినిచ్చి యురిదీయుట - ఇట్టివి మా దేశమునకు శిష్టాచారములైనవి"8 అని ఆ స్త్రీ నాటి సమాజంలో జరుగుతున్న బాల్య వివాహ వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. బాల వైద్యక ఆ స్త్రీలు చావును ఆశ్రయించబోగా దేశభక్తుడు వారి చర్యల అనుభవించలేక వారించబోతాడు. ఇంతలో తెల్లవారడంతో స్త్రీలు తమ ప్రయత్నం మానుకొంటారు.

బాల్య స్త్రీ - వృద్ధ పురుష వివాహాల వల్ల జరిగే అనర్థాలను, బాలవైక్యం కానీ పల్ల వాటి సమాజం ప్రవర్తించే తీరును రచయిత ఎండగట్టారు. ఈ కథ నాటి సమాజ వికృతత్వాన్ని విమూఢత్వాన్ని వ్యక్తీకరిస్తుంది.

శ్రీమంతుల్లో భార్య గతించిన కొందరు ముసలితనంతో తమ సంరక్షణార్థమై పోషణార్థమై ఆడపిల్లల తల్లి దండ్రులకు డబ్బుల ఆశజూపి పడుచు స్త్రీలను వివాహం చేసుకొనేవారు. వీరు శారీరక పటుత్వంతో పాటు మానసిక పటుత్వం కూడా లేనివారు కావడంతో తమ ధర్మపత్నినే అనుమానించే వారు, ఇంటికి పనిపడి వచ్చిన వ్యక్తులను అనుమానించడమే కాకుండా అవమానించే వారు. అలాంటి పురుషపుంగవుని చేతిలోబాధ పడే స్త్రీ జీవితాన్ని గూర్చి "వారం రోజుల అవస్థ" కథలో బోయనేపల్లి రంగారావు వివరించారు. తల్లిదండ్రుల నిస్సహాయత్వం, వారి ఆస్తిని కాజేయాలనుకునే బంధువుల దురుద్దేశం, మధ్యవర్తుల స్వార్థ ప్రలోభాల వల్ల కూడా బాల్య వివాహాలు జరుగుతుండేవి. సురవరం ప్రతాపరెడ్డి ఇదే విషయాన్ని "వింతవిడాకులు" కథ ద్వారా వివరించారు.

పురుషుల కంటే స్త్రీలలోనే తార్కికశక్తి ఎక్కువగా ఉంటుందని, వారిలో స్వల్ప చైతన్యం కలిగిస్తే చాలు జటిలమైన సమస్యలకు కూడా సులభంగా పరిష్కారం చూపగలిగే. శక్తి సామర్థ్యాలు స్త్రీలకు ఉంటాయని మహిళల ఆత్మశక్తిని ఈ కథలు వెల్లడిస్తున్నాయి.

పైన పేర్కొన్న కథలను పరిశీలించగా కథకులు వాస్తవ పరిస్థితులను కథలుగా రూపొందించారు. ఆనాటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షను ఎత్తి చూపారు. ఆ వివక్షకు కారణమైన పరిస్థితులను, వ్యక్తులను, సమాజాన్ని కథల ద్వారా విమర్శించారు. మహిళాభ్యుదయాన్ని కాంక్షించి, ఈ కథల ద్వారా స్త్రీలలో చైతన్యం కలిగించడానికి ప్రయత్నించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. మల్లయ్య కాలువ, తొమ్మిది పదుల తెలంగాణకథలు - 2008
2. మల్లయ్య కాలువ, సదానంద్ శారద, చంద్ర తెలంగాణ కథలు, విశాలాంధ్ర పబ్లికేషన్స్ - 2005
3. సుజాతా రెడ్డి ముదిగంటి, తెలంగాణ తొలితరంకథలు,రోహణమ్ పబ్లికేషన్స్, హైదరబాద్- 2002
4. సుజాతా రెడ్డి ముదిగంటి, శ్రీనివాస్ సంగిశెట్టి తొలినాటి కథలు, హైదరబాద్ - 2002
5. శ్రీనివాస్ సంగిశెట్టి, దస్త్రం కవిలె ప్రచురణలు, హైదరబాద్ - 2004

# 'వాణిశ్రీ' నవల - స్త్రీ పాత్రలు

- డా॥. కటుకం శారద, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు డిగ్రీ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

'సమాజంలో అసహాయులుగా ఉన్న వారిలో చైతన్యం, బెదిరి వున్న వాళ్లకు ధైర్యం, వ్యక్తిత్వం కోల్పోయిన వాళ్లకు వ్యక్తిత్వం ఇవ్వటం రచయిత తన రచనల ద్వారా చేసే ఉత్తమమైన పని' అన్నారు కొడవటిగంటి కుటుంబరావుగారు. ఈ విధమైన వ్యక్తిత్వాన్ని అందిస్తాయి రేగులపాటి కిషన్‌రావుగారి రచనలు. వీరు సమాజంలోని అనేక సమస్యలను, సామాజిక వైరుధ్యాలను తన రచనల ద్వారా ఆవిష్కరించినారు. సాహిత్యం ద్వారా వ్యక్తిలో, సంఘంలో మార్పు జరగాలన్నది రచయిత అభిమతంగా కనిపిస్తున్నది. అందుకే తెలుగు సాహిత్యంలో ఉన్న విభిన్నమైన ప్రక్రియలలో రచనలు చేపట్టి కథలు, నవలలు, కవితలు విమర్శలు, వ్యాసాలు వంటివి రాసినారు.

నేను ఈ సదస్సు పత్ర సమర్పణకు గాను ఎంచుకున్న అంశం రేగులపాటి కిషన్‌రావు గారు రచించిన 'వాణిశ్రీ' నవలలో స్త్రీ పాత్రలు. వీరు ఈ నవలను 1978 లో రచించినారు. నవలలో మూడు తరాలకు చెందిన మూడు జంట పాత్రలు కనిపిస్తాయి. వారు అన్నపూర్ణ విష్ణుశర్మ, శారద నాగేశ్వరశర్మ, వాణిశ్రీ భాస్కర్ దంపతులు. మొదటగా కనిపించే అన్నపూర్ణ, శారద ఇద్దరూ భర్తల అడుగు జాడల్లో నడిచి పతియే ప్రత్యక్ష దైవం అని నమ్మి కొలిచిన వారు కావడం విశేషం. అన్నపూర్ణ పితృస్వామ్య భావజాలంతో పెరిగిన స్త్రీ. అందువల్ల పతియే ప్రత్యక్షదైవం అన్నట్లు భర్త అడుగుజాడల్లో నడిచింది. విష్ణుశర్మతో పెళ్ళయి వస్తున్న సమయంలో పాము ఎదురుకావడం, అది అపశకునంగా భావించి జ్యోతిష్కుల మాట ప్రకారం భర్తతోపాటు పాముపుట్టకు పూజ చేసింది. భర్తకు తన సహాయ సహకారాలు సంపూర్ణంగా అందించిందే కాని ఏ రోజు ఎదురు చెప్పలేదు.

మొదటిసారి గర్భం దాల్చినప్పుడు మంచి సంతానం కలగాలని సగటు స్త్రీగా భర్తతో పాటు పూజలు చేసిందే కాని తన ఆరోగ్యాన్ని గురించి పట్టించుకోలేదు. పుట్టిన బిడ్డ అనారోగ్యంతో చనిపోయినా ఆవేదన పడిందే కాని భర్తను పల్లెత్తు మాట అనలేదు. తాము చేసిన పూజల్లో లోపం కారణంగానే బిడ్డ చనిపోయినాడని భర్త చెప్పిన మాటలను నమ్మి భర్తతోపాటు 80 రోజులు వెంకటేశ్వర స్వామికి పూజ చేసింది. రెండవసారి గర్భం దాల్చినప్పుడు కూడా జాతక చక్రవర్తి రఘురామయ్య చెప్పినట్లుగా భర్తతోపాటు వేములవాడ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించి పూజలు చేసి తరించింది. కాని తగిన మందులు వాడి, గర్భస్థ శిశువు పోషణకు తగిన ఆహారం తీసుకోకపోవడం వల్ల బిడ్డ పుట్టకుండానే కడుపులోనే చనిపోయింది. మూడవసారి గర్భ దాల్చినప్పుడు కూడా పాముపుట్టకు పూజ చేసి బిడ్డ ఆరోగ్యంతో పుట్టగానే నాగేశ్వరశర్మ అని పేరుపెట్టుకొని సంతోషించింది. కాని తాను రోజు పూజ చేసే పాము కాటుకు గురియై చనిపోయింది. దైవభక్తితోపాటు పతిభక్తి కలిగి జీవించిందే కాని తన గురించి, శరీరం తత్వం గురించి స్వీయ నిర్ణయం తీసుకోవడం వంటివి ఆమెలో కనిపించవు.

నవలలో రెండవ స్త్రీ పాత్ర శారద. ఈమె నాగేశ్వరశర్మ భార్య. అనుకూలవతి ఐన భార్య. భర్తను అనురాగంతో సేవించింది. శారద కడుపుతో ఉండగానే కలరా సోకి భర్త చనిపోయినాడు. భర్త పోయిన బాధను దిగమింగి కొడుకు తోడిదే లోకంగా బతికింది. కొడుకును అల్లారు ముద్దుగా పెంచుకున్నది. అతన్ని ప్రయోజకున్ని

చేయాలని అనుక్షణం తాపత్రయ పడింది. తండ్రిలేని కారణంగా అల్లారు ముద్దుగా పెరిగిన భాస్కర్ చెడు అలవాట్లకు బానిస అవుతాడు. కొడుకును అదుపులో పెట్టలేక సతమయ్యే పాత్రగా శారద నిస్సహాయతను ప్రదర్శిస్తుంది. ఎన్నో విధాలుగా నచ్చచెప్పే ప్రయత్నం చేస్తుంది. కళ్లముందే కొడుకు వ్యసనాలను అలవరుచుకోవడం చూసి ఎంతో ఆవేదన చెందుతుంది. మామ విష్ణుశర్మను కన్నతండ్రి కంటే ఎక్కువగా ఆదరించింది. ఆమెలో సభ్యత, సంస్కారం, కొన్ని ఆధునిక భావాలు కనిపిస్తాయి.

వరుసకు మరిది ఐన భుజంగం ఆమెపై కన్నువేసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాధాకృష్ణుల విగ్రహాన్ని తెచ్చి శారద చేతిలో పెట్టి ఇక ఇప్పటి నుండి మనిద్దరం రాధాకృష్ణుల వలె ఉందామని తన మనసులోని దురాలోచనను బయటపెడుతాడు. ఆమె అతని దురుద్దేశాన్ని గమనించి ధైర్యంగా ఆ విగ్రహాన్ని అతనిపైకి విసరి, తలుపులు వేసు కోబోతుంది. అతడు తన పశుబలంతో ఆమెను బలాత్కరించినాడు. అదే విధంగా మరో నరమృగం ప్రకాశం కూడా శారదను లొంగదీసుకునే ప్రయత్నం చేసినాడు. ఆమె అతన్ని యుక్తితో ఎదిరించాలని ముందుగా తీయగా మాట్లాడి, అతనికి లొంగిపోతుంది. చివరకు అతన్ని గడ్డపారతో పొడిచి చంపాలని ప్రయత్నించి, విఫలమై అతడి చేతిలోనే చనిపోతుంది.

సమాజంలో భర్త చనిపోయిన స్త్రీలంటే ప్రతి మగవాడికి చులకనభావమే.అయ్యో పాపం ! భర్త చనిపోయి బాధలో ఉండి కుటుంబ భారాన్ని ఒక్కతే మోస్తుంది అనే భావన కాని, దయ కాని మగవాడిలో కనిపించకపోవడం నిజంగా బాధాకరమే.రేపు తాను చనిపోతే తన భార్యకు కూడా ఇదే గతి పడుతుందనే కనీస జ్ఞానం ఉండదు.

నవలలో మరో ముఖ్యమైన పాత్ర వాణిశ్రీ. కొంత చదువుకున్నది. ఆమెలో అభ్యుదయ భావాలు ఎక్కువగా ఉన్నాయి. పేదరికంలో పెరిగింది. చిన్నతనంలోనే తల్లిని అటు తర్వాత తండ్రిని కోల్పోయింది. సవతి తల్లి పెంపకంలో ఎన్నో కష్టాలను అనుభవించింది. ఆమె వాణిశ్రీని ఒక వయసు మళ్ళినవాడికి ఇచ్చి పెళ్లి చేసి కొంత డబ్బును అతని నుండి పొందాలని పథకం వేసింది. వాణిశ్రీ పేరు మీద రెండువేల అప్పు ఉన్నదని, ఆమెను ఎవరు పెళ్లి చేసుకున్నా ఆ అప్పు తీర్చాలనేది ఆమె పథకం. వాణిశ్రీ స్నేహితురాలి సహాయంతో ఆ గండం నుండి గట్టెక్కిన ధైర్యవంతురాలు.

వ్యసనపరుడైన భాస్కర్‌కు పెళ్లి చేయాలని విష్ణుశర్మ ప్రయత్నించినప్పుడు తెలిసిన వాళ్లెవరూ అతనికి పిల్లనివ్వడానికి ముందుకు రారు. అటువంటి సమయంలో పెళ్లిళ్ల గౌరయ్య ద్వారా వాణిశ్రీ సంబంధం కుదురుతుంది. ఆమెతో పెళ్లి జరగాలంటే ఆమె పేరు మీదున్న రెండువేల అప్పు తీర్చడానికి కూడా విష్ణుశర్మ సిద్ధపడుతాడు. అంటే ఒకరకంగా కన్యాశుల్కం చెల్లించి మనుమడి పెళ్లి జరిపిస్తాడు. అంటే మగవాడు ఎలాంటి వాడైనా అవసరమైతే ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి జరిపించవచ్చునన్నమాట. పేదరికంలో పుట్టిన అమ్మాయి సద్గుణాలరాశి ఐనా వరకట్నం ఇచ్చుకోక పోతే పెళ్లిళ్లు కాని పరిస్థితులు సమాజంలో నెలకొని ఉన్నాయి. పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు తమ బిడ్డలకు కోరినంత కట్నం ఇచ్చి పెళ్లిళ్లు చేయలేక కుమిలి పోవడం వరకట్న దుస్థితికి అద్దం పడుతుంది. వాణిశ్రీ తనకు పెళ్లయి సవతి తల్లి పెడుతున్న బాధల నుండి విముక్తి లభిస్తే చాలును అనుకొని పెళ్లికి సిద్ధమయింది. లేకపోతే సవతి తల్లి చెప్పిన అప్పుల గురించి ఆమె నిలదీసేదే అని చెప్పవచ్చును.

స్త్రీని అదుపులో పెట్టడానికి మగవాడికి ఒక ఆయుధం ఆమె దేహం. భాస్కర్ పెళ్లి విజయవాడకు చెందిన వాణిశ్రీతో నిశ్చయం అయింది. అందుకే పెళ్లి జరిపించడానికి ముందే విష్ణుశర్మ ఇంటికి వస్తుంది. ఐతే పెళ్లికి కావలసిన వస్తువుల కోసం బంధువులంతా బయటకు వెళ్లిన సమయంలో భాస్కర్ ఆమెను బలవంతంగా

అనుభవిస్తాడు. ఆమె అతన్ని క్షమించి, పెళ్లికి సిద్ధమవుతుంది. వాణిశ్రీ పెళ్లైన తర్వాత భర్తకు అనురాగాన్ని పంచి ఒక బిడ్డకు తల్లి అయ్యి జీవితాన్ని పండించుకున్న అనురాగమయి అని చెప్పవచ్చు.

విష్ణుశర్మ గుండె జబ్బుతో బాధపడినప్పుడు అతన్ని హరికథలు చెప్పడం మానుకొని ఇంటివద్దనే ఉండి విశ్రాంతి తీసుకోమని కోరుతుంది. జానకి రామయ్య జాతకాన్ని అబద్ధం చేసి నిండు నూరేళ్లు బతుకుతారని చెప్పి అతనిలో మృత్యు భయాన్ని పోగొడుతుంది. అతనికి కూతురులేని లోటును తీర్చింది. వ్యసనాలను మానుకోమని చెప్పిన విష్ణుశర్మను భాస్కర్ నోటికి వచ్చినట్టు తిట్టి అతని మనసు గాయపరిచినాడు. అతడు మనోవ్యధతో చనిపోవడం వల్ల ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయామని వాణిశ్రీ ఎంతో బాధపడుతుంది.

వాణిశ్రీకి బిడ్డ పుట్టినప్పుడు కూడా భర్త ఇంటిపట్టున లేకపోవడం, ఆ రోజు కూడా తాగి ఇంటికి రావడం చూసి ఒక తాగుబోతుకు భార్య అయినందుకు ఆవేదన చెందుతుంది. ఈ విషయాన్ని స్నేహితురాలికి తెలిపి కొంత ఉపశమనం పొందుతుంది. భర్తగా కుటుంబం గడవడానికి కావలసిన ధనం సంపాదించవలసింది పోయి భార్య దాచుకున్న సొమ్మును సైతం దొంగిలించినాడు. కుటుంబ అవసరాలు తీర్చాల్సిందిపోయి ఇంట్లోనే దొంగతనం చేయడం సిగ్గుచేటని భర్త తీరుకు చెడామడా తిట్టి పోసింది. దాంతో రోషం పొంగుకు వచ్చి పొలం కాగితాలు తాకట్టు పెట్టి డబ్బును తెచ్చి భార్య చేతిలో పోసినాడు. కష్టపడకుండా పెద్దలు సంపాదించిన పొలం తాకట్టు పెట్టడం సరికాదని చెప్పిన భార్యపై చేయి చేసుకుంటాడు. అవసరమైతే తాకట్టు పెట్టుకుంటాను, అమ్ముకుంటాను అడగడానికి నీకు అధికారం లేదని, మగవాడి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే ఆడదానికి అహం పనికిరాదని నీచంగా మాట్లాడుతాడు.'తిట్టినా కొట్టినా పడి ఉండడానికి భార్య బానిస కాదని, హక్కుల కోసం పోరాడినట్టుగానే బాధ్యతలను కూడా పంచుకోవాలని భర్తకు హితవు పలుకుతుంది. చివరకు ఇంట్లో నుండి వెళ్లిపోయి స్నేహితురాలు వద్ద ఉంటుంది. కొంతకాలానికి మత్తుపానీయాలు సేవించనని, జూదం ఆడనని, పర స్త్రీలను కోరనని రాసి ఇస్తేనే వస్తానని చెప్పి అతన్ని ఒప్పించింది. అతన్ని మార్చుకునేందుకు అవసరమైన అన్ని మార్గాలో ప్రయత్నం చేసింది.

వాణిశ్రీ కూతురు రజని విరేచనాలు, జ్వరంతో బాధపడుతుంది. ఐనా భాస్కర్ తనకేమి పట్టనట్టుగా ఉంటాడు. మందులు కొని తెమ్మంటే తన వద్ద డబ్బులేదని అంటాడు. చివరకు తన వేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని అమ్మి రజనికి వైద్యం చేయించింది. ఇంటికి తిరిగి వచ్చే సరికి విస్కీ తాగుతూ ఉంటాడు. మందులకు లేని డబ్బు తాగడానికి ఎక్కడిదని నిలదీసింది. అతడు పేకాటలో సంపాదించానని, జ్యోతిష్కుడు లాట్రి యోగం ఉందని చెపితే లాట్రి టికెట్టు కొన్నానని అంటాడు. పేకాటలో సంపాదించిన సొమ్ముతో తాగుతున్నానని కావాలంటే నువ్వుకూడా తాగు స్వర్గం కనిపిస్తుందని, చిరిగిన చీరను విప్పెయ్యి కొత్త చీరను కొని పెడతానని అంటాడు. ఆ మాటలు విన్న అభిమానవంతురాలైన వాణిశ్రీ 'నీ కుళ్లు సంపాదనతో నా ఒళ్లు కాపాడుకోవాలని లేదని చీరలు లేక మానంపోయే పరిస్థితే వస్తే అగ్నికి ఆహుతి అవుతాను' అని ధైర్యంగా పలికి భర్త కోపానికి గురి అవుతుంది.

వాణిశ్రీ చేయించిన వైద్యం సరిపోక రజని చనిపోతుంది. కన్న బిడ్డను పోగొట్టుకున్న ఆమె తల్లడిల్లింది. ఆమెను స్నేహుతురాలు మాలతి ఓదార్చింది. కాని భాస్కర్ భార్య బిడ్డను పోగొట్టుకొని బాధలో ఉన్నప్పుడు సైతం పట్టించుకోకుండా ఆ రాత్రికి ఒక స్త్రీని పది రూపాయలు ఇచ్చి తీసుకొని వస్తాడు. అతని దిగజారుడు తనాన్ని చూసి అసహ్యంచుకున్నది, భరించలేకపోయింది, అడ్డు తగిలింది. ఆ పది రూపాయలు తానే ఇస్తానని చెప్పి ఆమెను వెళ్లిపొమ్మని చెప్పుతుంది. కాని ఆమె మాటలను వినిపించుకోకుండా ఇంట్లోకి తీసుకొని వెళ్లుతాడు. భర్త

ప్రవర్తనకు నిర్ఘాంతపోయి తేరుకున్న వాణిశ్రీ తన మెడలోని తాళిని అతడి మీదకు విసిరికొట్టింది. భాస్కర్ కోపంతో 'పవిత్రమైన మంగళ సూత్రాన్ని విసిరికొట్టి హిందూ సంస్కృతికి అన్యాయం చేసావని' ఆమెపై చేయి చేసుకొనపోతాడు. ఆమె అతన్ని దూరంగా నెట్టివేసి 'నేనిప్పుడు నీభార్యను కాను, నా మీద నీకు ఎలాంటి అధికారం లేదు' అని ధైర్యంగా మాట్లాడుతుంది. కోర్టుకు వెళ్లి విడాకులు తీసుకుంటాను అని చెప్పి ఇంట్లో నుండి వెళ్లిపోయి స్నేహితురాలు మాలతి దగ్గర ఉంటుంది.

స్నేహితురాలు దగ్గర ఉన్నప్పుడు కూడా భాస్కర్ పాత స్నేహితుడు జగ్గారావు ఆమెను పొందాలని ప్రయత్నించి పుడు చాకచక్యంగా తప్పించుకున్నది. అతడు ఆమెను బెదిరిస్తూ రాసిన ఉత్తరాన్ని సత్యంకు చూపించి తగిన బుద్ధి చెప్పింది. రచయిత, న్యాయవాది ఐన మాలతి సోదరుడు సత్యం రాసిన నవలలు చదివి సమాజాన్ని ఆకలింపు చేసుకున్నది. అతడు రాసిన నవలలను ఫేర్ చేసి అతని పట్ల అభిమానాన్ని పెంచుకున్నది. అతని రచనల్లో స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ రాసిన విధానాన్ని గమనించి అతని పట్ల ప్రేమను పెంచుకొని పెళ్లి చేసుకున్నది. వారి అనురాగానికి గుర్తుగా పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వాణిశ్రీ తగిన సమయంలో సరియైన నిర్ణయం తీసుకొని జీవితాన్ని చక్కదిద్దుకున్నది.

భాస్కర్ భార్య దూరమైన తర్వాత దొంగతనాలు చేసి, పోలీసులకు పట్టుబడటం, విచ్చలవిడితనానికి అలవాటు పడినాడు. భార్య ఉన్నప్పుడు కొంత అదుపులో ఉండే వాడు. కొంతకాలానికి వాణిశ్రీ ఇంటికే దొంగతనానికి వస్తాడు. ఆమె విలాసవంతమైన జీవితానికి అసూయ చెందుతాడు. డబ్బు కోసం బిడ్డను చంపుతానని కత్తితో బెదిరించినాడు. ఈ ఒక్కసారికి భాస్కర్‌ను వదిలివేసినా తిరిగి ప్రతిసారి ఇలాంటి బెదిరింపులు ఉంటాయని ఊహించిన వాణిశ్రీ అతన్ని వదలకూడదని భావించి అదే కత్తితో అతన్ని పొడిచింది.

ఈ నవలలో వాణిశ్రీ అభ్యుదయ భావాలు కలిగి నరక ప్రాయమైన జీవితాన్నుండి విముక్తి పొందింది. వ్యసనపరుడైన భర్తను మంచి మాటలతో మార్చుకోవాలని అడుగడుగునా ప్రయత్నించింది. భర్త సంపాదనపై ఆధారపడకుండా చిన్నప్పుడు నేర్చుకున్న కుట్లు, అల్లికలు వంటివి చేసి సంపాదించి బిడ్డను పోషించుకున్నది. భర్త ప్రవర్తనను, అతని వ్యసనాలను మాన్పించేందుకు అనుక్షణం ప్రయత్నం చేసింది. అతని ఆగడాలను, తిట్లను సహనంతో భరించింది. ఎన్నోమార్లు అతనితో దెబ్బలు తిన్నది. చివరకు అతనితో తెగతెంపులు చేసుకొని కొత్త జీవితాన్ని నిర్మించుకున్నది.

అందరు ఆడపిల్లలలాగే వాణిశ్రీ కూడా తన భర్త తనతో అన్యోన్యంగా, ఆత్మీయంగా మెలగాలని ఆశించిన సగటు స్త్రీ. కాని వ్యసనపరుడైన భర్తలోని అహంకారం, అధికారం చలాయించటం ఆమెలోని స్త్రీ సహజమైన ప్రేమను హరించి వేసినవి. భర్త వ్యసనాలను సహనంతో భరించింది. అతని తిట్లను సహించింది. కొట్టడాన్ని కూడా భరించింది. కాని ఒక వేశ్యను పది రూపాయలిచ్చి తన కళ్లముందే ఇంటికి తేవడం వల్ల ఇక సహించలేక పోయింది. నచ్చ చెప్పింది. ఎదురు తిరిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో అతని నుండి విడిపోయి కొత్త జీవితాన్ని ఏర్పాటు చేసుకుంది.

స్త్రీ కూడా ఒక మనిషే. మర బొమ్మ కాదు. ఆమెకు మనసు ఉంటుందని ప్రతి మగవాడు గ్రహించాలి. జీవితం అంటే కష్టసుఖాలు ఉంటాయి. వాటిని సమదృష్టితో చూడటం అలవరచుకోవాలి. స్త్రీని గౌరవించాలి. వారికి ఉన్న హక్కులను వారు పొందునట్లు ప్రతి మగవాడు సహకరించాలి. జీవిత రథం సక్రమంగా, సాఫీగా సాగా లంటే భార్యాభర్తలు బాధ్యతలను సమంగా పంచుకోవాలి.

వాణిశ్రీలో అభ్యుదయ భావాలు, సునిశితమైన దృష్టి, ఆలోచనా విధానం, సమాజాన్ని ఆకలింపు చేసుకునే ఓర్పు, నేర్పు, తప్పును ఎత్తి చూపే ధైర్యం, తెగువ, సమస్యను సానుకూలంగా పరిష్కరించడానికి ప్రయత్నిం చడం, తగిన సమయంలో నిర్ణయం తీసుకోవడం వంటివి ఆమెను ఆధునిక మహిళగా నిరూపించినాయి.

**ఆధారగ్రంథాలు :**

1. వాణిశ్రీ నవల- రేగులపాటి కిషన్‌రావు, విజయలక్ష్మి ప్రచురణలు, కరీంనగర్, 1978.
2. పేకమేడలు నవల- రంగనాయకమ్మ, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1975.
3. చలం సాహిత్యంలో స్త్రీ- వెన్నవరం ఈదారెడ్డి, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు, 2005
4. తెలుగు నవల -ఆధునిక స్త్రీ, మాడభూషి రంగాచార్యులు, శ్రీ బాలాజి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు, 2001

# స్త్రీవాద దృక్కోణంలో ఆడియో గీతాలు

- పి. అనిల్ కుమార్, తెలుగు లెక్చరర్, ఎస్.ఆర్. ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కరీంనగర్.

పరిచయం:వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యచరిత్రలోని విభిన్న ప్రక్రియలలో ఎన్నో దృక్పథాలు వెలుగు చూసాయి. సమాజంలో వస్తువు ఏదైనా, ప్రక్రియ ఏదైనా పాఠకులకు చేరవేయడమే ఆశయంగా కవులు స్పందించి రచనలు చేసిన ప్రక్రియలల్లో పాట ఒకటి. ఈ ప్రక్రియలోకి చేరని వస్తువు అంటూ లేదు, ఏ గేయమైనా అది ఉత్పన్నమైన కాలంలో సమకాలీన సమాజాన్ని ప్రతిభింబిస్తుంది. అలాంటిది సమస్యలున్న కాలంలో పుడితే ఆ సమస్యకు పరిష్కారంగా గేయం అవతరిస్తుంది.వర్తమాన ప్రపంచంలో ఆడియో, వీడియోల ద్వారా తెలుగు గీతాలు ఎక్కువగా ప్రచారం జరుగుతున్నాయి. అయితే ఈనాటి సాహిత్య, సామాజిక ప్రపంచంలో ఈ గీతాలు వివిధ రకాలుగా వెలువడుతున్నాయి. ఇలా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేటి కాలంలో కూడా అనేక సామాజికాంశాలను స్పృశిస్తూ కవులు, గాయకులు రాసిన ఇ పాటలు ఆడియో క్యాసెట్లుగా, సి.డి. లుగా విడుదల అవుతున్నాయి. రచయితలు రాసి జానపద బాణీలో వచ్చిన సినిమేతర పాటలను ఆల్బం గా చేసిన గీతాలను ఎంచుకున్నాను.

స్త్రీవాద ఉద్యమకాలంలో స్పందించి స్త్రీలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను వస్తువుగా స్వీకరించి, వారిని జాగృతం చేసే దృక్పథంలో స్త్రీల గాయాలు చూసి చలించిపోయి గుండెల్లోంచి పుట్టిన పాటలను సేకరించి వాటిలోని సామాజిక దృక్పథాన్ని విశ్లేషిస్తున్నాను.

1. పొత్తి కడుపులున్న నెత్తురు గుడ్డుపైన రాజ్యం నూరిన కత్తులు సిద్ధం
2. అమ్మా నన్నూ అమ్మకే ఓయమ్మా..
3. ఆడి దాన్నిజూత్తే గాడిదైపోతారు యెల్లక్కా వీళ్ళ మీద మన్నువొయ్య
4. నన్ను గన్నాతల్లి సిన్ననాడే అమ్ముకున్నది
5. రాబందుల రాజ్యంలో కామాందుల చేతుల్లో బలియైన ఆడపడుచులెందరో
6. చెల్లమ్మా కన్నీల్లింకా ఎన్నాల్లుండవులే చెదిరిన నీ కళల ఫలాలు

ఈ పాటలయొక్క పూర్తి వివరాలు వ్యాసం చివరలో పొందు పరిచాను.

శిశువుగా గర్భంలో పడిన నాటి నుండి చనిపోయి కాలి బూడిదయ్యే వరకు ప్రతి చోట ఆమెకు అవ మానాలు, ఛీత్కారాలే మిగిలినాయి. కూతురుగా తన ప్రస్థానం మొదలుపెట్టి అక్కగా, చెల్లిగా, భార్యగా తల్లిగా, అమ్మమ్మ, నానమ్మ మొదలైన దశలో ప్రతి చోట మగవాడికి అండగా నిలబడి అబలగా మారిపోయి జీవితాన్నే దుర్భరం చేసుకున్నవారు, చేసుకుంటున్నవారు చాలా మంది ఉన్నారు. ఇలాంటి మహిళల దీన గాథలు వినాలంటే ఒక్కింత ధైర్యం కావాలి.స్త్రీగా పుట్టిన నుండే తన హక్కుల కోసం పోరాడవల్సిన అవసరం మన సమాజంలో ఉంది. పోరాడలేని మహిళ ఎక్కడో వంటింటి లోను, నాలుగుగోడల మధ్య నలిగిపోయి జీవితాన్ని గడుపుతున్నారు. ఈ సమాజ అసమానతలను చీల్చుకుని బయటపడిన మహిళలు అనేక ఉన్నత పదవులను పొందుతున్నారు. ఉదాహరణకు: ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, నేటి కాలంలో కిరణ్ బేడీ, సుష్మా స్వరాజ్, మీరాకుమార్, సుచేతా కృపాలానీ, అంగ్ సాన్ సూకీ, చందా కొచ్చార్, పూనం మాలకొండయ్య, సునీతా విలియమ్స్, కల్పనాచావ్లా మొదలైన వారు ఉన్నత శిఖరాలను చేరుకొని మహిళల అభ్యున్నతిని చాటి చెప్పారు.

గడపదాటి అడుగుపెట్టలేని అమ్మాయిలు నేడు, అంతరిక్షంలో కాలు మోపుతున్నా కూడా ఇంకా బాల్య

వివాహాలు, వరకట్న చావులు, అత్తింటి కష్టాలు, కుటుంబ సభ్యుల వేధింపులు, పరువు హత్యలు, అనేకం నేటి సమాజంలో జరుగుతున్నాయి.

## స్త్రీ అణిచివేత :

మానవ సమాజం అభివృద్ధి మొత్తం సంతానోత్పత్తి పైనే ఆధారపడి ఉంటుంది. పాత తరం గతించి పోవడం, కొత్తతరం పుట్టుకరావడ0 నేటికి జరుగుతుంది. ఆదిమానవుని కాలంలో లేని పద్ధతులు కట్టు బాట్లు, సంప్రదాయాలు, ఆచారాలు రాను రాను సమాజంలో చక్కగా నాటకుపోయాయి.

"పొత్తి కడుపులున్న గుడ్డుపైన రాజ్యం నూరిన కత్తులు సిద్ధం
అమ్మచీకటి గర్భగుడిలోనే జరిగేను నెత్తుటి యుద్ధం"
అనే పాటలో
"నెలలన్న నిండక ముందే తల కురులన్న వోయక ముందే...
ఆయుస్సు వోసే అమ్మచేతులే అశువులు దీస్తున్న యెందుకో"

(రచన :యోచన:పల్లెగానం M-గానం :శంకర్ బాబు, కందుకూరి)

గర్భంలోని శిశువుకు నెలలు నిండకముందే ఆడ శిశువని తెలుసుకొని గర్భంలోనే చిదిమేస్తున్నారు. సమాజంలో ఆడ శిశువులపై ఒకింత అయిష్టత కనిపిస్తుంది. మగశిశువులు పుడితే వారి వంశం నిలబడుతుందనే అపోహలో ఆడ శిశువులను పుడమిపై పడనివ్వడం లేదు. ఒకవేళ పుడమిపై పడినా సరే అనేక రకాలుగా ఆడ పిల్లలపై ఒత్తిడులు ఉంటాయి.

"పుడమిలోన పురిటి" ప్రాచీన కాలంలో సంతానం కలిగే సమయంలో పురిటినొప్పులు బాధించేవి, నేడు ఇలాంటి పురిటినొప్పులు లేకుండానే సిజేరియన్స్ ద్వారా పది నిముషాల్లోనే కాన్పు జరుగుతుంది. రోజు రోజుకి ఇలాంటి కాన్పులు చాలా వరకు జరుగుతున్నాయి.

"ఆడ దానిగవడ్డ కష్టాలు అమ్మ గుండెకు మానని గాయాలు...
అందుకే అమ్మనాన్నలు ఆడపిల్లలంటే బయపడుతున్నరు
ఎత్తుకొనివెంచే నాన్న చేతులే యమపాశమై వెంటాడుతున్నవి"(పైదే)

కన్నవారికి ఎదిగిన బిడ్డలు ఇంట్లో ఉంటే కంటిమీద కునుకే రాదు, కాబట్టి ఆడపిల్ల అంటేనే అందరూ ఉలికి పడతారు. మగవారితో పోల్చితే ఆడవారిని కాపాడడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ఆడ పిల్లలను కన్న తల్లిదండ్రులు సమాజంలో అత్యంత హీనంగా పరిగణించబడుతారు. అంతే కాకుండా కూతురు అత్తింటి వారినుండి వచ్చే కష్టాలను తలచుకొని ఆడ పిల్లలను ఆదిలోనే చంపివేస్తారు.

"స్త్రీలపై జరిగేటి ఘోరాలు బడి పిల్లలపై అత్య ...
గోసె గొంతులు రక్షణేలేని జీవితాలని పురిటిలోనే శిక్షలేస్తున్నరు"(పైదే)

స్త్రీలపై అనేక అఘాయిత్యాలు, ఘోరాలు జరుగుతున్నాయి. బడి పిల్లలు ప్రేమ పేరుతో చంపి వేయబడే యువతులు, వేట కొడవళ్లకు బలైన వనితలు ఎందరో ఉన్నారు. భూమిపైన రక్షణ లేదని గర్భంలోనే శిక్షిస్తున్నారంటూ సమాజంలోని ఆడవారి దీన స్థితిని తెలియజేశారు గేయ రచయిత.

ప్రస్తుత సమాజంలో ఆడపిల్లను అమ్మడాలు, సాని కొంపలో దూర్చి సొమ్ము చేసుకోవడాలు కూడా కనిపిస్తూనే ఉన్నాయి.అందులోనూ మగ శిశువుల కంటే ఆడ శిశువులను ఎక్కువగా అమ్ముకుంటున్నారు. వారసుడు కావాలనే కారణంగా ఆడ శిశువులను గర్భంలోనే చంపుతున్నారు. గర్భం నుండి తప్పించుకొని బయటపడితే పుట్టగానే అమ్మేస్తున్నారు.అధిక సంతానంతో, పేదరికంతో పసి కందులను ఎక్కువగా అమ్ముకుంటున్నారు.

"అమ్మా నన్నూ అమ్మకే"అనే గీతంలో తనను అమ్మ వద్దని ఒక పసికందు చెప్పడం కనిపిస్తుంది. తనను అమ్మవద్దని ప్రాధేయపడుతుంది.

"నవమాసాలు నన్ను మోసినవమ్మా ...
నిన్నువిడిచి ఉండలేనమ్మా వోయమ్మా
నన్ను దూరంజెయ్యబోకమ్మా"
(సీతారాములు. భీమారం-2008)

తొమ్మిది నెలలు నన్ను మోసి, పురిటి నొప్పులు భరించి, తల్లిదండ్రిడబ్బుకోసం తనను అమ్మి వేసి, ప్రేమానురాగాలను ముందే దూరం చేస్తున్నారు అంటూ పసికందు గొంతుతో రచయిత స్వరం వినిపిస్తుంది.

"ఉగ్గుపాలు తాగలేదమ్మా వుయ్యాలాలూగ లేదమ్మా...
తింటనే వోయమ్మా నీ వేలుబట్టి తిరుగుతుంటనే"
(పైదే)

పుట్టినతరువాత ఉగ్గుపాలు కూడా తాగలేదు. ఉయ్యాలలు కూడా ఊగనే లేదు. పాలబువ్వ తినలేదు లేదు, జోల పాటలు వినలేదు. నన్ను కొన్నవారు ఎన్నో కష్టాలు పెడతారు అవి తెలియకుండా అమ్మేస్తారా?. వారు నా చిట్టి చేతులతో వెట్టి పనులు చేయిస్తారు అంటూవలపోస్తుంది.మీరు పొలం పనుల్లో ఉంటే సద్ది తెచ్చి పెడతాను, మీ కష్టాల్లో పాలు పంచుకుంటాను. మీరు కనిపెంచిన రుణం ఉంచుకోను, నన్ను మాత్రం అమ్మకండి అంటూ తల్లిదండ్రులతో మొరపెట్టుకోవడం ఈ గేయంలో కనిపిస్తుంది.

ఆడపిల్ల పుట్టడమంటేనే తల్లిదండ్రులు మరియు పుట్టిన ఆడపిల్ల సైతం భయపడే రోజులు నేడు దాపురించాయి. పుట్టకముందు గర్భంలో పుట్టిన తర్వాత సమాజంలో ఒక్కో సందర్భంలో ఒక్కోరకమైన సమస్యలను కల్గిస్తారు. ఆడపిల్ల వయసుకు రాగానే, ఈడుకొచ్చిన పిల్లాడి నుండి చనిపోయే దశలోని ముసలి వారి వరకు అందరూ ఆశగా చూసే వారే, వారిని అవస్థలు పెట్టేవారే. మనిషి మానవత్వాన్ని మరిచిపోయి తనలో వికృత చేష్టలను నింపుకొని తనచుట్టు వారిని అనేక కష్టాలకు గురి చేస్తున్నాడు. ముఖ్యంగా ఆడపిల్లల పాలిట యమ కింకరులుగా మారిపోయి శారీరకంగా, మానసికంగా హింసించడమే కాకుండా చంపివేసే ధోరణి కూడా కనిపిస్తుంది.

స్త్రీ సామాజిక జీవితం:భారతదేశంలో ఆడపిల్లలుగా పుట్టిన నుండి చాలా మంది అనేక సమస్యలను ఎదుర్కొం టున్నారు. పురుషాధిక్య సమాజం స్త్రీని వంటింటి కుందేలు గానో, అంగడి సరుకుగానో, పిల్లలని కనే యంత్రంగానో పరిగణిస్తుందని స్త్రీ వాద రచయితలు ప్రపంచానికి చూపడంలో విజయం సాధించారు. నేటికి ఆడపిల్లలపై సమాజ దృష్టి మారలేదు, గర్భస్థ శిశువు నుండి చనిపోయే వరకు కష్టాలు, కన్నీళ్ళ మయంగా ఆమె జీవితం గడిచిపోతుంది.

"ఆడి దాన్ని జూత్తే గాడిదైపోతారు యెల్లక్కా
వీళ్ళ మీద మన్ను వొయ్య....
మల్లక్కవీళ్ళ మీద దుమ్ముపడ"
(రచన : లక్ష్మణ్. ఆవుదుర్తిగానం:ఏ.రమాదేవి-పల్లె వయ్యారాలు-2006)

ఈ పాట మొత్తం తెలంగాణ మాండలికంలో, జానపద బాణీలో రాయడం గమనించవచ్చు. ఆధునిక సమాజంలో స్త్రీలలో చైతన్యం పెల్లుబుకుతోంది ఇలా చైతన్య ధిక్కార స్వరాన్ని ప్రదర్శిస్తున్నా ఆడపిల్ల గడప దాటి వెళ్ళినప్పుడు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల్ని తన తోటి ప్రయాణికులకు చెబుతుంది. "ఇంటినుంచి బయటకు వచ్చిన స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజం వారిని కించపరిచి, అవమానించి, అణిచివేసే విధానాలు కవితా వస్తువులయ్యాయి" (మంజులత. ఏ. తెలుగులో కవిత్వోద్యమాలు 2004-198). అన్న రచయిత్రి వాక్యాలు ఈ పాటకు చక్కగా సరిపోతాయి. జాతరకు వెళ్లిన ఆడపడుచు తిరిగి ఇంటికి చేరుకునేంత వరకు ఆటోలో, బస్సులో, నిత్యావసర వస్తువులు కొనుక్కునే దగ్గర ఏ విధంగా లైంగికంగా వేదించబడుతుందో చెబుతూ ఇలా వేదించే వాళ్ళకి అక్కా చెల్లెళ్ళు కుటుంబ సభ్యులు లేరా అని గుర్తు చేస్తూ వాళ్ళని తిడుతుంది. స్త్రీలు బయటి

సమాజంలో నిత్యం వికృతమైన చూపుల ద్వారా లైంగిక, శారీరక వేధింపులకు గురవుతున్నారు.

సీటి సీరే గట్టి సీటిరైకె దొడిగి కమ్మల్ బుట్టాల్ వెట్టి
బొట్టు కాటుక వెట్టి సమ్మక్క జాతర వోదామని నేను...
వాడు యెనుకకుదిరిగి జూసి జోకులేయ్యవట్టే
మల్లక్కా వాని సెల్లెలెక్క లేనా (పైదే)

దీంట్లో సమాజంలో అట్టడుగు వర్గాల (ఆటో డ్రైవర్, బస్సు డ్రైవర్, పూలమ్మేవాడు, పాను టేల అతను) వారినుండి మొదలు దైవకార్యాలు నిర్వహించే (సోన్నాయి ఊదే వాడు)వాళ్ల వరకు వీళ్ళందరి వల్ల కూడా స్త్రీకి ఎక్కడా రక్షణ లేదు అంటే అడుగడుగున స్త్రీకి అభద్రత ఉంది అని కవి బాధపడుతున్నాడు. ఈడని కాదు, ఆడని కాదు, ఏడ చూసినా ఎక్కడోక దగ్గర స్త్రీ లైంగికంగా వేధింపులకు గురవుతూనే ఉంది.

నన్ను గన్నాతల్లి సిన్ననాడే అమ్ముకున్నది
నన్ను గొన్నా తల్లి సాని కొంపకు చేర వేసింది
చెట్టు తీగకు పుట్టిన పిందే భారం అయ్యిందా
కంచె సేనును మేసిన వైనం ఋజువును చేసిందా
(గానం:స్వర్ణ)

వేశ్యలను దూరంనుంచి సానుభూతితో చూడడం కాక, వేశ్య ఆత్మ గీతాన్ని ఆవాహన చేసుకుని ఆర్తిగా ఆవిష్క రించడం ఈ గీత రచయితకే చెల్లింది. భారత దేశంలో పేదలు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తారు. పూట గడవనివారు గంపెడు పిల్లలను కంటారు. మగ సంతానం కావాలని ఆడ పిల్లలను ఎక్కువగా కంటూ సాకలేక పుట్టగానే అమ్ముకునే వారు కొందరైతే, గర్భంలోనే చంపివేసేవారు మరికొందరు. ఇలా అమ్మినవారు ఆడపిల్లలను గురించి మరిచి పోగా, కొన్నవారు మాత్రం వారిని వేశ్యా వాటికలకు పంపించి జీవితాంతం నరకం చూపిస్తారు. ఈ గేయంలో అమ్ముడు పోయిన మహిళల మానసిక వ్యధ కనిపిస్తుంది.

చెట్టుకు తీగ భారం అవుతుందా? అంటూ కంచే చేనును మేసినట్లు అంటూ తనలోని బాధను వెలి బుచ్చడం కనిపిస్తుంది. కన్నతల్లి మనస్సు వెన్నతో పోల్చుతారు. కాని కన్నతల్లి అమ్మడాన్ని పరోక్షంగా ప్రశ్నిం చడం కనిపిస్తుంది. కన్నబంధమే తెంచుకుని అమ్మడం కరంగా కనిపిస్తుంది. ఆడపిల్లను కొనుకున్న వారు అమ్మా, నాన్నను తలపించేవిధంగా పెంచి పెద్దచేసి, పుష్పవతి కాగానే సాని కొంపకు అమ్ముతారు. పద్నాలుగు సంవత్స రాలకే నన్ను ఆ రొంపిలోకి దింపి జీవితాంతం నరక మయం చేసారని వాపోతుంది. జీవితకాలం ఒకేతోడుతో గడపాల్సిన నన్ను గంటకు ఒక మగవాడితో గడిపే విధంగా మార్చిన సమాజ చిత్రణ ఈ పాటలో కనిపిస్తుంది.

రాజకీయపు రాక్షస రాజులు రోజూ వస్తుంటే...
గంతలు గట్టిన న్యాయ దేవతకు పతితగ
జూపారే నన్ను సమిదను జేసారే. (పైదే)

ఈ గేయంలో గోళ్ళతో రక్కడం, మొదలైన వికృత చేష్టలను చిత్రించడం జరిగింది. ఆడదంటే శారీరక సుఖాన్ని అందించే యంత్రంగానే చూడడం పరిపాటి అయ్యింది. శృంగార సమయంలోను పురుషులు కటువుగా ప్రవర్తించడం, డబ్బులు పోసి కొనుకున్నవారిపై దాడులు చేయడం రోజు పత్రికల్లో మనం చూస్తూనే ఉన్నాము. ఆడ పిల్ల పుడితేనే భారంగా భావించే కుటుంబాలు పుట్టిన వెంటనే చంపేయడమో, లేక అమ్మేయడమో చేస్తారు. ఇలా అమ్మేసిన ఒక స్త్రీ కన్నీటి గాధను గీత రచయిత వేశ్యలను దూరంనుంచి సానుభూతితో చూడడం కాక వేశ్యల ఆవేధనను ఆవహింప చేసుకుని ఆర్తిగా ఆవిష్క రించడం ఈ గీత రచయితకే చెల్లింది.

"రాబందుల రాజ్యంలో కామాందుల చేతుల్లో
బలియైన ఆడపడుచులెందరో
ఈ మానవమృగాలను పాతాళం తొక్కేటి కాలాలు
యెపుడు రానున్నయో"
(రచన, గానం: నరసింహ.నీల-మనతెలుగు)

అనే పాటలో ప్రతి మనిషికి భూమిపై జీవించే హక్కు ఉంది, కాని చిన్న చిన్న సుఖాలకోసం మనిషిని మనిషే

దోచుకొని, చంపుకుంటున్నారు. ఇలాంటి కాలాలు ఎప్పుడు మాయం అవుతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తారు పాట రచయిత నీల నరసింహం. ఇలాంటి స్వభావం గలవారిని పాతాళంలో తొక్కాలని సూచిస్తారు.

ఒంటరిగా ఆడ పిల్ల వెళ్లలేని పరిస్థితి...
మదమెక్కిన మానవత్వము మరిచిపోయేనా. (పైదే)

'అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా నడిచినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు' అన్నారు. మహాత్మాగాంధీ. కానీ నేడు పట్టపగలే ఆడపిల్ల ధైర్యంగా రోడ్డుపైనే నడవలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రోజురోజుకి మనిషిలో మానవత్వం తగ్గిపోయి ఆడపిల్లలపై అరాచకత్వాలు చేస్తున్నారు. దిశ, మొ.. మహిళలకుజరిగిన సంఘటనలు ప్రతిరోజు కూడా ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.

"ఆడదంటే మగాడికి అలుసై పోయింది రా...
రాత రాసే ఆ బ్రహ్మను కన్నది ఓ అమ్మేరా" (పైదే)

మహిళంటే అందరూ చులకనగా మాట్లాడుతారు. విద్య, వైద్యం, వివాహం అన్ని రంగాలలో మహిళలను అణచి వేయడానికి అందరూ చూస్తారు. అయినా మహిళలు పోరాడుతూ తమను తాము నిరూపించు కుంటూ తమకంటూ ఒక గొప్పనైన స్థానంలో ముందుకు సాగుతుంటే, సాధింపులు, వేధింపులునిరంతరం చేస్తున్నారు. పుట్టిన నాటినుండి సాధింపులు, కట్టి పడేయడాలు, పాఠశాల,కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో దాడులు, పని చేసే చోట లైంగిక వేధింపులు వివాహం తరువాత భర్త అత్తింటి వారి సాధింపులు ఇలా చనిపోయే వరకు నిరంతరం ఎవరో ఒకరి చేతిలో హింసలు అనుభ విస్తూనే ఉంటారు మహిళలు.

"చెల్లమ్మా కన్నీళ్లింకా ఎన్నాల్లుండవులే
చెదిరిన నీ కళల ఫలాలు నీరమై పండునులే...
నేడే శివంగివై గర్జించగలే"
(జనజాగృతి గుండె చప్పుళ్లు సామాజిక గీతాలు-
గానం: వి.అనిల్)

ఈ పాటలో పురుష సమాజంచే అణిచివేయబడ్డ రీతిని చెబుతూ, స్త్రీలను జాగ్రత్త పరుస్తూ, కర్తవ్యాన్ని బోధిస్తాడు. ఇక్కడ కొంతమంది మగవాళ్ళు జంతువులలాగా స్త్రీలను ఇంటా బయట వేధించడం పాత్రల స్వభావంగా చూడ వచ్చు. పల్లవిలో అభాగ్యుల చేతిలో అన్యాయమైన ఎంతో మంది స్త్రీలకు కనువిప్పు కలిగించేలా సమాన హక్కుల కోసం మీరు కలలుకనే సమసమాజం రావాలంటే సివంగివలే గర్జించక తప్పదని స్త్రీలను చైతన్యవంతులను చేయడం చూడవచ్చు.

"అబల కాదు స్త్రీ ఆది శక్తి అని అనాది నుంచి నానుడి లేదా
రాణీ రుద్రమ ఝాన్సీలక్ష్మి రాజ్యమేలిరని నువ్వినలేదా?
వందలు వేలా మేధావులలో ఇందిరమ్మ లేదా భారత
ప్రధాని కాలేదా?" (పైదే)

పురాణ కావ్యాల్లో స్త్రీని అబలగా చిత్రించిన విషయం అందరికి తెలిసిందే. మొదటి చరణంలో "అబల కాదు స్త్రీ ఆది శక్తి" అని అనాది నుంచి నానుడి లేదా రాణి రుద్రమ, ఝాన్సీలక్ష్మీ రాజ్యమేలిరని నువ్వినలేదా? "వందలు వేలా మేధావులలో ఇందిరమ్మ లేదా భారత ప్రధాని కాలేదా?" అని నానుడిని నిజం చేయమంటూ రాజ్య పాలనలో సైతం వెనుకాడబోమని చరిత్రలో ఒక వెలుగు వెలిగిన రాణి రుద్రమను, ఝాన్సీ లక్ష్మీ బాయిలను గుర్తుకు తెచ్చుకుని "వేల మేధావులలో ఇందిరమ్మ భారత ప్రధాని కాలేదా"అని కుమ్మరి మొల్లను, నాయిక నాగమ్మను మథర్ థెరిస్సాను, కల్పనా చావ్లా, మేడం క్యూరి, మేధా పాట్కర్, మేడారం సమ్మక్క లను స్ఫూర్తిగావించి ముందడుగు వేయాలని చెప్పాడు. పురాణ కాలపు స్త్రీలకు చదువు శాస్త్రాలు అందనివ్వ కుండా పురుష సమాజం అడ్డుగోడలు వేసింది. అప్పుడు బయటి సమాజం అవగాహన లేక వంటింట్లోనే మగ్గే వారు. కానీ నేటి ఆధునిక కాలంలో

"చదువుకున్న మన మహిళలందరూ సంగతులన్ని పసిగడుతారు...

సానియా మీర్జా కరణం మల్లేశ్వరి కిరణ్ బేడిలాగా
ఎంతో కీర్తి తెచ్చు కదా" (పైదే)

భయాన్ని వీడి హక్కుల కోసం కదం తొక్కమని సానియా మీర్జాను, కరణం మల్లేశ్వరిని, కిరణ్ బేడీల కీర్తిని చెబుతాడు. చివరి చరణంలో పల్లవిలో స్త్రీలు అణచివేయబడ్డ వైనం తక్షణం జాగృతం కావాలని చెబుతున్నాడు. పాటకు ప్రాణం పల్లవి అన్న నానుడి నిజంచేసేలాగా ఉంది. ఈ పాట మధ్య చరణాల్లో స్ఫూర్తి దాయకమైన మహిళా మూర్తులను గుర్తు చేయడం మకుటాయ మానంగా నిలిచింది. భూత కాలంలో జరిగిన సంఘటనలను ఆధారంగా చేసుకొని భవిష్యత్ కాలంలో వీరు ఆశించే ఫలితాలని కాంక్షిస్తూ వర్తమాన కాలంలో మీరు జాగృతంగా ఉండాలని ఈ మూడు కాలాలను అనుసంధానం చేస్తూ రాసిన పాట ఇది.

**ముగింపు :**

ఈ విదంగా ఆడియో గీతాలలో సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తూ, ఆ సమస్యలను అదిగమిస్తూ అన్ని రంగాల్లో ఇంటా బయట తన ప్రతిభను చాటాలని, సమస్యలకు తలొగ్గకుండా శివంగిలా గర్జించి తమ శక్తిని చాటాలని తెలియ జేస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. చెన్నకేశవ రెడ్డి, జి. ఆధునికాంధ్ర గేయ కవిత్వం, 2015- హైదరాబాద్, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక.
2. మృణాళిని, సి. తెలుగులో కవిత్వోద్యమాలు, 2016- హైదరాబాద్, తెలుగు అకాడమి.
3. సుందరం, ఆర్వీయస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం-2015. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్.

**ఉపకరించిన వెబ్ సైట్లు :**

1. https://www.youtube.com/watch?v=QzOr_Ijylec (పొత్తి కడుపుల)
2. https://www.youtube.com/watch?v=jGmn5Y2sGjQ (అమ్మో నన్ను అమ్మకే)
3. https://www.youtube.com/watch?v=VygOR4GhROw (అడిదాన్ని)
4. https://www.youtube.com/watch?v=9b9RZ5MA7sY (నన్ను కన్నా తల్లి)
5. https://www.youtube.com/watch?v=U8lV6PKSSpU (రాబందుల రాజ్యంలో)

❀ ❀ ❀

# విశ్వభారతి నవల - భారతి పాత్ర ప్రస్థానం

**- యస్. గంగాధర రెడ్డి**, పరిశోధక విద్యార్థి (ఎస్.ఆర్.ఎఫ్), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు సాహిత్యంలో కడప జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. తొలి తెలుగు శాసనం లభించినది ఈ ప్రాంతంలోనే. ఈ కడప కడుపున ఎంతోమంది సాహితీమూర్తులైన నాచనసోముని మొదలుకొని నేటి ఆధునిక కవుల దాకా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సామాజికంగా, ఆధ్యాత్మికంగా సమాజానికి మార్గ నిర్దేశం చేసిన కవులలో డా॥ ఆవుల రామచంద్రయ్య ఒకరు. వీరు వృత్తిరీత్యా వైద్యులుగా ప్రసిద్ధులు. ప్రవృత్తిరీత్యా సాహితీకారులు. అంతేగాక కవి, అనువాదకుడు, వ్యాసకర్త, కథారచయిత డా॥ ఆవుల రామచంద్రయ్య రచనలలో (బఠానీలు, ఓం నమః శివాయ, ఓం నమో వేంకటేశాయ, ప్రేమభక్తి, బుద్ధం శరణం గచ్ఛామీ, తిరుక్కురల్ తెలుగు అనువాదం) విశ్వభారతి ఒకటి.

భారతి సంపూర్ణ జీవిత చిత్రణయే ఈ విశ్వభారతి నవల. ఈ నవల చదువుతున్నంతసేపు ఒక సినిమాటిక్ లాగా సగటు పాఠకున్ని ఊహల పల్లకిలో ఊరేగిస్తూ ఆశల సౌధంలోకి నడిపిస్తుంది. ఇందులో ప్రధానపాత్ర భారతి. ఈ పాత్రను అల్లుకొని సతీష్ శైలజ వినూత్నన్, వివేక్ మొదలగు పాత్రలు వీరిలో కొందరు బంధుగణం మరికొందరు ఆమె జీవితంలో తారసపడే వ్యక్తులు, అనుబంధాలు, ఆప్యాయతలు, మమకారాలు కలగలసిన ఈ నవల సామాన్య పాఠకున్ని చక్కగా ఆకట్టుకుంది.

భారతి విద్యావంతురాలు, సంస్కారవతి, గుణవతి, సంఘసంస్కర్త. కడప ప్రాంతానికి చెందిన రాజగోపాలుని కూతురు భారతి. వివాహం నిశ్చయమై వరుడికి అనారోగ్యకారణంగా భారతి వివాహం రద్దు కావటంతో ఈ నవల ప్రారంభమవుతుంది. తల్లితండ్రులకు ధైర్యం చెప్పి బెంగుళూరుకు ఉద్యోగానికి పయనమవుతుంది. తన స్నేహితురాలు శైలజ అన్న సతీష్‌తో పరిచయం ప్రేమగామారి వారిద్దరికి పెళ్ళి జరుగుతుంది.

సతీష్ అమ్మా నాన్నలది చెన్నైలో పెద్ద చీరల వ్యాపారం. వీరిది ఉన్నతమైన కుటుంబం. ఇటువంటి కుటుంబంలోకి కోడలుగా అడుగుపెట్టిన భారతి ఆ ఇంటి సభ్యులతో గౌరవంగా కలసిమెలసి జీవిస్తూ ఉన్నత సంస్కారంతో, గొప్ప వ్యక్తిత్వం గల మహిళగా మెలుగుతూ ఉంటుంది.

భారతి జీవితమంతా ఆటుపోటులతో సాగుతుంది. అయినా స్థిరచిత్తంతో స్వాభావికమైన మానవతా దృక్పథంతో ఎన్నో మంచికార్యాలు నిర్వర్తిస్తుంది. పెళ్ళయి భర్త, ఇద్దరు కొడుకులు, తమ్ముడు రాజేష్‌తో కలసి జీవితం సాఫీగా జరుగుతున్న క్రమంలో హఠాత్తుగా విమాన ప్రమాదం తల్లితండ్రుల మరణానికి కారణ మవుతుంది. అయితే అత్తమామల ఆదరణ, భర్త ప్రేమ, ఆ బాధను తొందరగానే దూరం చేస్తుంది. అందుకే మెట్టినింటి ప్రేమాభిమానాలు ఎక్కువైతే పుట్టింటిని కూడా భార్య మరిచిపోతుందని పెద్దలంటారు.

సమాజంలో తన కళ్ళముందు ఏం అన్యాయం జరిగినా బాధ్యతగా ముందుండి బాధితులైన వారికి తగిన సాయాన్ని అందించి బాధ్యులైన వారికి తగిన శిక్ష పడేలా చేయగల తత్వాన్ని భారతి పాత్ర ద్వారా చిత్రించాడు రచయిత. నవలలో వస్తువు స్వభావాన్ని బట్టి రచయిత పాత్రను నిర్మిస్తాడు. ఇందులో కొన్ని పాత్రలు చివరి వరకు ఉంటాయి. మరికొన్ని మధ్యలోనే ఆగిపోతాయి. ఈ నవలలో భారతి పాత్ర చివరి వరకు ఉంటుంది. పతనమై పోతున్న మానవ సంబంధాలలో మార్పు తీసుకురావటాన్ని భారతి పాత్ర ద్వారా రచయిత ఆవిష్కరించాడు.

## సంస్కర్త - మానవతావాదిగా భారతి

### స్నేహితురాలి జీవితాన్ని సరిదిద్దటం

ఉన్నత విద్యలు చదివి, విద్యావంతుడై కులాంతర వివాహ చేసుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన నందగోపాల్ తాగుడుకు బానిసవు తాడు అంతేగాక పిల్లలు పుట్టలేదని భార్య హేమలతను హింసిస్తుంటాడు. ఈ విషయం తెలిసిన భారతి వారిద్దరికి తన కుటుంబ సభ్యులచేత సలహాలు, మంచిమాటలు చెప్పించి వారి జీవితంలో మార్పు తీసుకురావటం భారతి మొదటి కార్యక్రమం.

### భార్య మోసం చేసిన భర్తకు ఆర్థిక సాయం అందించటం

సమాజంలో భార్యలను హింసించే మగవాళ్ళతోపాటు భర్తలను బాధపెట్టి వారి సుఖం చూసుకొనే ఆడవాళ్ళు లేకపోలేదు. డ్రైవర్, భాషా భార్య ముంతాజ్ తన స్వార్థం కోసం భర్తకు తలాక్ చెప్పి దుబాయ్ షేట్‌ను పెళ్ళి చేసు కుంటుంది. భాషా చేసేదేమీలేక భారతికి విన్నవించుకోగా "దరిద్రపు ముండ - పోతే పోయిందిలే - మీ మేనత్త కూతురిందిగా ఆమెను పెళ్ళి చేసుకో - నేనింకా వారం రోజులుంటా - పోయి ఆమెని కట్టుకొనిరా! నాకు చూపించు" అంటూ పదివేల రూపాయలు ఇచ్చి పంపించింది" భారతి (భారతి చెప్పినట్టుగా బాష మేనత్త కూతురిని పెళ్ళి చేసుకొని కనిపించాడు). అంతేగాక భార్య బాధితుని పక్షాన నిలబడి అతనికి కొత్త జీవితానికి దారి కల్పించింది.

### అనారోగ్యంగా ఉన్న తండ్రిని పట్టించుకోని కొడుకులకు బుద్ధి చెప్పటం

విశ్వనాథయ్య తమ్ముడు జయరామ్ గుండె నొప్పితో హాస్పిటల్ చేరతాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తండ్రిని చూడటానికి కొడుకులు 3 రోజులు ఆలస్యంగా వస్తారు. హాస్పిటల్ బిల్ కట్టడానికి కొడుకు లిద్దరూ వాదులాడు కుంటున్న సమయంలో "యేం కొడుకులండి మీరు! మీ తండ్రి అలా ప్రాణాపాయ స్థితిలో ఉంటే మీరిద్దరు యిలా ఒకరిమీద ఒకరు తీసుకుంటారా! ఆ మాత్రం డబ్బులే లేవా మీ దగ్గర! అంత బాగా సంపాదిస్తున్నారు. ఒక ఐదులక్షలు ఖర్చు పెట్టలేరా. మీరు ఖర్చు పెట్టకపోతే నేను పెట్టుతాను. ఈ ఖర్చుల క్రింద మీ షాపు, ఇల్లు రాయించుకుంటాను నా పేర" అంటూ చెడామడ వాయించింది భారతి." ఆమె మాటలకు కొడుకులిద్దరూ నోరు మూసుకొని డబ్బు కట్టి వచ్చారు. తల్లితండ్రుల మీద దయలేని పుత్రులున్నంతకాలం అమ్మానాన్నల పరిస్థితి ఇలాగే ఉంటుంది.

### పేద స్త్రీకి అండగా నిలబడటం

ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందంటారు పెద్దలు. కాని వరుసగా మూడుసార్లు కూతురు పుట్టిందని రాఘవన్ తన భార్య అలివేలుకు డబ్బు చెందేలాగా, భార్యా పిల్లల సంరక్షణార్థం విడాకుల నోటీసు పంపిస్తాడు. అప్పుడు "భారతి అలాంటి మొగుడు నీకెందుకు విడాకులిచ్చెయ్... నీ బ్రతుకు నీవు హాయిగా బ్రతుకు" అని ధైర్యం చెప్పి నీకు జీవితంలో నేను తోడుంటానని మాట ఇస్తుంది భారతి.

### కోడలిని విధవను చేయాలని చూసిన అత్తలో మార్పు తేవడం

సునంద భర్త చనిపోతే అత్తగారు ఆమెను విధవను చేయాలని పట్టుబడుతుంది. ఇది హిందూ సంప్ర దాయంలో ఒక ఆచారం. దీనివల్ల ఆ స్త్రీ అలంకరణ చేసుకోగూడదు. కుంకుమ ధరించకూడదు. సమాజంలో తిరగకూడదు. సైన్సు టెక్నాలజి పెరిగిన, విదేశాలకు వచ్చినా కూడా ఈ చాదస్తపుటాచారాలు అంతరించలేదు.

సునంద బాధను విన్న భారతి ఆమె ఇంటికి వెళ్ళి వారి అత్తతో "సునంద వయసు పాతికేళ్ళు దాటి ఉం టాయి. అమ్మాయి యిలా ఉంటే, ఆఫీసు కెలావెళ్తుంది. ఉద్యోగమెలా చేస్తుంది, పాపను యెవరు సాకుతారు, సంసారమెలా గడుస్తుంది. తోటి ఆడదానిని మీరే యిలా శిక్షిస్తే యెలా? సునందను పదిమందితో కలవనివ్వండి.

ఆడది, ఆడదానిలా అలంకరించుకోవాలి గదా! సంఘంలో ఎలా తిరుగుతుంది. కోడలయినా, కూతురయినా సునందే కదా! మీరు పెద్దవారు కాస్త ఆలోచించండి" అంటూ భారతి వారిలో మార్పు తెచ్చి సునంద జీవితానికి ఊపిరి పోసింది.

**కబ్జాకు గురైన తన భూమితో పాటు ఇతర భూములను కాపాడటం**

భారతి భూమితోపాటు ఆ ప్రాంతంలో చాలామంది భూములను కడపలో కాసుల కృష్ణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకుంటాడు. ఇతనికి రాజకీయ నాయకుల అండ ఉందనే ధైర్యంతో భూకబ్జాలు చేస్తుం టాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే భారతి భూమి కోల్పోయిన వారందరిని సంఘటితం చేసి పాత రికార్డు లన్నీ తిరగేసి హైకోర్టు లాయర్ సాయంతో చట్టప్రకారం తన భూమిని, ఇతర వ్యక్తుల భూములను కృష్ణారెడ్డి నుండి కాపాడుతుంది.

**యాక్సిడెంట్‌కు గురైన యువకునికి ఆర్థిక సాయం చేయుట**

భారతి ఆఫీస్‌కు వెళ్ళే దారిలో ఎదురుగా ఇద్దరు యువకులు మోటార్ బైక్ వెళ్తుండగా ఒక టెంపో వాహనం హఠాత్తుగా వచ్చి వారిని గుద్దేసి వేగంగా వెళ్ళిపోయింది. ఒక వ్యక్తి భారతితో నన్ను కాపడక్కా! నేను బ్రతకాలక్కా నా చెల్లెలికి పెళ్ళి చేయాలక్కా అని చెబుతూ తెలివిలేకుండా పడిపోయాడు. ఇంకో యువకుడు కాళ్ళు విరిగి పడిపోతే వారిద్దరిని తొందరగా ఆస్పత్రికి చేరుస్తుంది భారతి. వారిలో ఒకరు చనిపోగా అతనికి ఆర్థిక సాయంగా ఇరవైవేల రూపాయలు అందిస్తుంది. అంతేగాక పోలీస్ రిపోర్టు ఇచ్చి టెంపో వాహనాన్ని ఎలాగయినా వదలద్దని వారి తల్లితండ్రులకు చెబుతుంది.

పైన వివరించిన అంశాల ద్వారా భారతిని ధైర్యవంతురాలుగా, సంస్కర్తగా, పోరాట మహిళగా, సమాజం పట్ల బాధ్యతగల పౌరురాలిగా, హేతువాదిగా రచయిత చిత్రించిన తీరు ముదావహం. అంతేగాక భారతి కూచిపూడి నృత్యకారిణి కూడా. రచయితకు సంగీతం, నాట్యంపై ఆసక్తి వలన భారతి పాత్రకు నాట్యాన్ని అన్వయించి కూచిపూడి నాట్యవృత్తాంతాన్ని ఈ నవలలో చక్కగా పరిచయం చేస్తాడు.

కాలం గడిచే కొద్దీ భారతి కొడుకులు పెరిగి పెద్దవారవు తారు. ఒకరు డాక్టర్, మరొకరు ఇంజనీర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తారు. ఇంకోవైపు భారతి అత్తమామలు చనిపోవటంతో వ్యాపారాన్ని చూసుకోవటానికి ఇద్దరు కొడుకులకు ఉద్యోగాన్ని మాన్పించి వ్యాపారంలో బాధ్యతలు అప్పగిస్తుంది. కాలక్రమేణా వ్యాపారం పెద్దదవుతూ సమాజంలో గొప్ప వ్యక్తులుగా (విఐపి) గా భారతి, సతీష్‌లు గుర్తింపు చెందుతారు.

సమాజంలో తన కళ్ల ముందు జరిగే అన్యాయాలను ప్రతిఘటించి పోరాడే భారతికి కుటుంబంలోనే సమస్య లను పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. పెద్ద కొడుకు విశాల్ బ్రహ్మణ యువతి స్వరూపను ప్రేమించా నని చెప్పగానే ఇంట్లో ఎవరికి ఇష్టం లేకపోయినా తల్లి మనసు వారిద్దరికి వివాహం జరిపిస్తుంది. కోడలు ప్రవర్తన, (శుచి శుభ్రతలేమి, పెద్దవారికి గౌరవం ఇవ్వకపోవటం మొదలైనవి) వల్ల భార్య భర్తల మధ్య స్వల్ప ఎడబాటు ఏర్పడుతుంది. కాని కొద్ది కాలంలోనే సమస్యలు పోయి ఇద్దరు ఒక్కటవుతారు. స్వరూప పుట్టింటి సమస్యలను కూడా భారతి పరిష్కరించి వారికి అండగా ఉంటుంది.

చివరగా ఈ నవలలో భారతి మనవడు విశ్వ చిన్న తనంలో అల్లరి చిల్లరిగా తిరుగుతుంటాడు. స్కూళ్లు మార్పించినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోగా బడిలో అందరిముందు తిట్టిందని అమృత అనే టీచర్‌ను కత్తితో పొడిచి చంపేస్తాడు. అక్కడి నుండి పారిపోయి ముంబయి చేరతాడు. అక్కడ ఒక స్వీట్‌షాప్‌లో పనిచేస్తూ అనుకోకుండా సినిమాలో హీరోగా అవకాశం రావటం ద్వారా ఎన్నో విజయాలు సాధించి గొప్ప హీరోగా సంఘంలో గుర్తింపబడతాడు. కాని కుటుంబ సభ్యులు భారతి, మనవడు ఎక్కడున్నాడని బాధపడుతుంటారు.

అనూహ్యంగా హీరోగా మారిన విశ్వను చూసి భారతి ఆనందిస్తుంది. తన మనవడివలన ప్రాణ నష్టం జరిగిన అమృత కుటుంబానికి ఆర్థిక సాయం ఎంత అందించిన ఆమె కొడుకు డానియెల్ మాత్రం విశ్వను చంపాలని చూస్తుంటాడు. దురదృష్టవశాత్తు చెన్నైకొచ్చిన విశ్వను కత్తితో పొడుస్తాడు. అదృష్టంకొద్దీ ప్రాణాపాయం తప్పినందువలన డానియెల్‌ను క్షమించి వదిలేస్తారు. అప్పటికీ విశ్వకు ఎన్నో అభిమాన సంఘాలు వెలిశాయి. మనవడికి పెళ్ళి సంబంధాన్ని నిర్ణయించి అతని విజయాలను తలుచుకుంటూ భారతి శాశ్వతంగా నిద్రపోతుంది.

## ముగింపు

నాలుగు తరాల కుటుంబ జీవిత చిత్రణ విశ్వభారతి నవల ప్రధానాంశం. గ్లోబలైజేషన్ వల్ల మానవ సంబంధాల్లో వస్తున్న మార్పులు, పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాలు నేడు చిన్న కుటుంబాలుగా మారుతున్న క్రమంలో రచయిత ఈ నవలలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థను నిర్మించిన తీరు నేటి భావిభారత పౌరులు కుటుంబ వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తుంది. అంతేగాక రచయిత వైద్యుడు కావటం వల్ల బ్లడ్ క్యాన్సర్ వ్యాధి, చిన్నపిల్లల ఆరోగ్యం, బిడ్డల జనన విషయం మొదలైన అంశాలకు సంబంధించిన వైద్య సమాచారాన్ని అందించటంలో రచయిత సఫలీకృతుడయ్యాడు.

విశ్వభారతి నవలలో మూడు రాష్ట్రాల కలయిక, శ్రావణ మాసం, హిందూ సంప్రదాయాలు, కులాంతర వివాహాలు, చెన్నూరు బిరియాని ప్రస్తావన, రాహుకాలం, ముహూర్తం చూసి బిడ్డకు ఆపరేషన్ చేయడం మొదలగునవి అంశాలను రచయిత ప్రస్తావిస్తాడు. దీనిని బట్టి రచయితకు నవలా నిర్మాణంపై అవగాహన ఉన్న వ్యక్తిగా చెప్పవచ్చు. ఈ నవలలో ఒకవైపు సంఘసేవ చేస్తూ మరోవైపు కుటుంబ జీవితంలో భార్యగా, తల్లిగా, ఉద్యోగస్థురాలిగా, నాన్నమ్మగా, ఇలా అన్ని స్థాయిలలో రచయిత ఒక సమాజానికి రోల్‌మోడల్‌గా భారతి పాత్రను చిత్రించాడు.

## ఆధార గ్రంథాలు

1. విశ్వభారతి నవల - డా॥ ఆవుల రామచంద్రయ్య

# డా॥ వి.చంద్రశేకరరావు కథలు - దళిత మహిళ జీవిత చిత్రణ

**- పి. ఇందిర,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రాచీన కాలంలో మాతృస్వామ్య వ్యవస్థలో స్త్రీని ఆరాధించారు. ఆ కాలంలో స్త్రీ, పురుషులు ఇరువురు కలసి ఆహారం సేకరించుకొని జీవనం సాగించారు. తరువాత వారిరువురు అడవులను చదునుచేసి గింజలువేసి, పంటలు పండించడం మొదలు పెట్టారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి మొదలైనప్పటి నుండి ఉత్పత్తి శక్తులపైన స్త్రీ ఆధిపత్యం కోల్పోవడం, పురుషాధిపత్యం మొదలయినది. మాతృస్వామ్య వ్యవస్థ నుండి పితృ స్వామ్య వ్యవస్థ ఏర్పడింది. స్త్రీలను పనిచేసే యంత్రాలుగా చూసే ధోరణి పురుషులలో నెలకొని వుంది. స్త్రీకి స్వేచ్ఛ లేదు. బానిసలుగా మారిపోయారు. ఆధునిక కాలంలో స్త్రీలు బానిసత్వం, అణచివేత నుండి తమ ఆత్మగౌరవ పోరాటం సాగించారు. స్త్రీలు తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొని తన్ను తాను విద్యావంతురాలు చేసు కోవడానికి కష్టపడ్డారు. తమపై పెత్తనం చేస్తున్న పురుషాధిక్య సమాజానికి స్త్రీలు విద్యనొక సాధనంగా చేసుకున్నారు. స్త్రీలు చదువుకొని సమాజంలో ఉన్నతమైన స్థానంలో స్థిరపడి ఉత్పత్తి శక్తులపైన స్త్రీకి ఆధిపత్యం పొంది పురుషాధిక్య సమాజంపై వ్యతిరేకతను ప్రకటించారు.

అగ్రవర్ణ స్త్రీలపై పురుషాధిక్యత వుంటే దళితస్త్రీలు మాత్రం పురుషాధిక్యతతో పాటు కుల వివక్షకు కూడా గురవుతున్నారు. దళిత స్త్రీలు కుటుంబం నుండి మరియు సామాజిక హింస నుండి తమను తాము రక్షించుకోవడానికి తమపై జరుగుతున్న భౌతిక, మానసిక దాడుల నుండి బ్రతికి బయటపడడానికి దళిత స్త్రీలు నిరంతరం అగ్రకుల సమాజంపై యుద్ధం చేస్తూనే వున్నారు. అయినా దళితస్త్రీలు అగ్రకుల పురుషాధిక్యంతో నలిగి పోతున్నారు. అగ్రవర్ణస్తుల దాడులకు గురవు తున్నారు. ఇలాంటి పరిస్థితులను డా॥ వి. చంద్రశేఖరరావు కథల్లో కనిపిస్తాయి. దళితులు జీవన స్థితిగతులను కళ్ళారా చూసిన చంద్రశేఖరరావు దళిత స్త్రీల అణచివేతలను, దళిత స్త్రీలపై జరిగే దాడులను తన కథల్లో చిత్రీకరిం చాడు.

ఆధునిక దళిత మహిళలు అంటరానితనాన్ని, అస్పృశ్యతను, పురుషాధిక్యతను రూపుమార్చే దిశగా ప్రయాణం సాగిస్తున్నారు. విద్య వీరికి దగ్గరై అందరితో సమానంగా ఉద్యోగావకాశాలను, అధికారాలను కూడా పొందుతున్నారు. అయినా వీరిపై అగ్రవర్ణ సమాజం వివక్షను చూపుతుంది. ఇటువంటి ధోరణిని చంద్రశేఖర రావు 'బఫెలోస్ క్లబ్' కథద్వారా తెలియపరచాడు. కథలో సుబ్బమ్మ దళితురాలు. సర్పంచ్ అయిన సుబ్బమ్మను అగ్రవర్ణస్తులు గౌరవించరు. సుబ్బమ్మ "పంచాయితీ ఆఫీసుకెళితే కుర్చీలో కూర్చోకూడదు. నేలపైనే. పేరుపెట్టి కూడా పిలవరు. 'ఒసే' అనో, కోపమొస్తే 'లంజ' అనో పిలుస్తారు. వేలిముద్రల మిషన్‌లా ఏమి జరుగుతుందో చెప్పరు. వచ్చిన గ్రాంటంతా జేబుల్లో వేసుకుంటారు. సంవత్సరమైంది మాదిగపల్లెకు ఒక్క బోరింగ్ వేయించుకోలేకపోయాను" అని వాపోతుంది సుబ్బమ్మ.

దీన్నిబట్టి రిజర్వేషన్ ద్వారా పదవులు పొందిన సుబ్బమ్మ లాంటి దళితులు అధికారాన్ని అగ్రవర్ణాలు ఏ విధంగా కొల్లగొడుతున్నారో తెలుస్తుంది. అదే విధంగా పదవులు పొందిన సుబ్బమ్మ లాంటి దళితులు ముదిగ పల్లెకు ఒక బోరింగ్ కూడా వేయించుకోలేకపోతినే అన్న సుబ్బమ్మకు మిగిలిన ఆవేదన లాంటి ఆవేదనలే పదవులు పొందిన దళితులకు మిగులుతుందని రచయిత అభిప్రాయం. పదవులు పొందిన దళితు లందరూ సుబ్బమ్మలాగా అగ్రవర్ణాల దగ్గర అవమానాలకు

గురవుతున్నారని కూడా రచయిత వారి స్థితిని ఈ సమాజానికి ఎరుకపరచాడు.

'మాయా లాంతరు' కథలో మాలతి దళితురాలు. అగ్రవర్ణస్తుల పెత్తనాన్ని అంతం చేయాలంటే దళితులలో మార్పు రావాలని, దళితులందరూ ఏకం అవ్వాలని దళితులలో చైతన్యం నింపిన స్త్రీ. అగ్రవర్ణస్తులపై పోరాట మనస్తత్వం గల స్త్రీ. అందుకే దళితులందరిని "గుట్కా వద్దన్నా, సారాయి వద్దన్నా" అంటూ స్టేజిపై పాటలు పాడుతూ దళితుల్లోని చెడు వ్యసనాలను దూరం చేసే దిశగా దళితులను ప్రోత్సహిస్తుంది మాలతి. మాలతి అగ్రవర్ణ సమాజంపై కోపంతో 'మనకు బ్రతుకులేదవ్వా! తిరగబడితేనే కొడుకులు మాటవినేది" అంటుంది. దీన్నిబట్టి మాలతి దళితులందరిని చెడు వ్యసనాలను మాన్పించి దళితులు ఏకమై అగ్రవర్ణ పెత్తనంపై తిరుగుబడాలని దళితులలో చైతన్యం నింపిన స్త్రీ. అలాంటి చైతన్యవంతురాలయిన మాలతిని చూసి అగ్రవర్ణస్తులు ఓర్వలేకపోతారు. ఆమెను చంపేస్తారు. కథలో మాలతి దళితుల్లో చైతన్యం నింపిన చైతన్య వంతురాలు. అలాంటి స్త్రీలను అగ్రవర్ణ సమాజం బ్రతకనివ్వదని ఈ కథ తెలుపుతుంది.

అలాగే రచయిత సినీ వ్యామోహంలో దళిత స్త్రీల మానసిక ప్రవర్తన ఎలా వుంటుందో మోహిని పాత్ర కేంద్రంగా చిత్రించాడు. కథలో మోహిని నటి. మాలతి అనే ఒక ఉద్యమ నాయకురాలి మరణం గురించి తీస్తున్న సినిమాలో మాలతి పాత్రగా మోహిని నటిస్తుంది. సినిమా డైరెక్టర్ మనోహర్, స్క్రిప్టురైటర్ నిరంజన్. ఆదర్శంగా తీయవలసిన మాలతి పాత్రను కొన్ని రొమాంటిక్ సంఘటనలు సృష్టించి తీస్తారు. సినీరంగంలో నిలదొక్కు కోవడానికి ప్రేమించిన దళితులైన నిరంజన్‌ను వదులు కోవడానికి సిద్ధపడుతుంది మోహిని. ఒకరోజు మోహిని నిరంజన్‌తో "మన పరిచయం, స్నేహం దాదాపు ముగిసినట్టే. నీకు అప్పుడే చెప్పాను మామూలు హౌస్‌వైఫ్ జీవితం నాకు నచ్చదని. అన్నీ చెరిపేసుకో. నాకో కెరీర్ కావాలి. దానికో మనోహర్ కావాలి" అంటుంది మోహిని.

ప్రపంచీకరణలో సమాజం డబ్బుమయం అయింది. ఏ పని చేసినా శ్రమకు మించిన ఆదాయాన్ని ఆశించేవాళ్ళే ఎక్కువ. కథలో దళిత ఉద్యమాలను ఆ ఉద్యమాలలో పోరాడి ప్రాణాలను పోగొట్టుకున్న ఆదర్శవంతమైన మాలతి గురించిన సినిమాను డైరెక్టర్ డబ్బుకోసం రొమాంటిక్ సంఘటనలు సృష్టించడం విచారకరం. ఒక దళితురాలైన మోహిని కూడా సినిమారంగంలో స్థిరపడ డానికి దళిత ఉద్యమకారిణి మాలతిని అసభ్యకరంగా చిత్రించడానికి ఒప్పుకోవడం అనేది శోచనీయం. అంతే కాకుండా సినిమారంగంలో ఎదగడానికి మోహినిలాంటి దళితస్త్రీలు ప్రేమించిన వాడిని కూడా వదులుకోవడానికి సిద్ధపడుతున్నట్లు తెలుస్తుంది. నిరంజన్ లాంటి దళిత రైటర్ల అండకన్నా మనోహర్ లాంటి అగ్రవర్గాలను ఆశ్రయించే అవకాశవాదిగా కథలో మోహిని పాత్ర సృష్టించబడింది. ఈ విధంగా మోహినిలాంటి దళితస్త్రీలు సినీరంగంలో నిలదొక్కుకోవడానికి తమ అస్థిత్వాన్ని వదిలి ప్రవర్తిస్తున్నారని ఈ కథ తెలుపుతుంది.

"పూర్ణమాణిక్యం ప్రేమకథలు" అనే కథలో మేరీ పూర్ణ, సత్యసుందరం ప్రేమికులు. పూర్ణ దళిత కులానికి చెందినది. సత్యసుందరం అగ్రకులస్తుడు. వీరి పెళ్ళికి సత్యసుందరం కొన్ని షరతులతో ఒప్పుకుంటాడు. దాన్ని సత్యసుందరం అంగీకరించి మేరీ పూర్ణకు చెబుతాడు. "మా నాన్న మనపెళ్ళికి ఒప్పుకున్నాడు. పెళ్ళి తిరుపతిలో చేద్దాం అన్నాడు. కాకపోతే ఒక కండీషన్ చెప్పాడు. బంధువులకు నిన్ను మా కులపు అమ్మాయిలా పరిచయం చేస్తానన్నాడు. నీపేరు కూడా 'మేరీపూర్ణ' అని కాకుండా 'లక్ష్మీపూర్ణ' అని కార్డులో ప్రింట్ చేద్దామన్నాడని" సత్య సుందరం అంటాడు. మేరీపూర్ణ ఆధునిక భావజాలం కలిగినది. సత్యసుందరం చెప్పిన మాటలకు తన ఆత్మగౌరవం దెబ్బతింది. దాంతో రెక్కలున్న పక్షిలా సుందరం జ్ఞాపకాల్ని తనలోంచి పూర్తిగా తుడిచేసుకొని సుందరంతో విడిపోతుంది మేరీ పూర్ణ.

దీన్నిబట్టి సత్యసుందరం మేరీ పూర్ణను ప్రేమించినప్పటికీ, తన తండ్రిపెట్టిన షరతులను అంగీకరించడం శోచనీయం. ఇక్కడ సత్యసుందరం మేరీ పూర్ణ సాంస్కృతిక మూలాల్ని, ఆమె సాంఘిక స్థితిని అంగీకరించి ప్రేమించినట్లు కనబడదు. సత్యసుందరం లాంటి పైకులంలోని వ్యక్తులు దళిత స్త్రీల అందాన్ని, చదువును, తెలివితేటల్ని మాత్రమే ప్రేమిస్తున్నారని తెలుస్తుంది. ఇలాంటి అగ్రకుల ప్రేమికుల మనస్తత్వాలపట్ల దళితులు అప్రమత్తంగా వుండాలని రచయిత అభిప్రాయంగా చెప్పవచ్చు. అంతేకాకుండా సత్యసుందరం లాంటి అగ్రకుల ప్రేమికుల ప్రేమలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవిధంగా వుంటున్నాయి. కాబట్టి మేరీ పూర్ణ అతని జ్ఞాపకాలన్నింటిని వదిలించుకొని వెళ్ళిన ఆత్మగౌరవం గల స్త్రీగా కథలో మేరీపూర్ణ పాత్ర దర్శనమిస్తుంది.

'బోధివృక్షం ఒక మేడ' కథలో మోహిని దళితురాలు. ఆధునిక భావజాలం కలిగిన ఉద్యమ నాయకురాలు. సుందర రామయ్య స్థాపించిన ఒక కమ్యూనిస్టు పార్టీలో ఈమె సభ్యురాలు. సుందరరామయ్య సరైన రాజకీయ నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల పార్టీ బలహీనమైందని, నాయకులు తమ వ్యక్తిగత విషయాల్లో కూడా క్రమశిక్షణ పాటించకపోవడంతో పార్టీపై ప్రజల ఆధరణ కోల్పోయిందని పార్టీ దుస్థితికిగల కారణాలను ధైర్యంగా చెబుతుంది. మోహిని ప్రేమికుడు మనోహరం అగ్రకులస్థుడు. మనోహరం నిరంతరం మోహినితో "దళిత యువతిని నిన్ను చేసుకోబోవడం ద్వారా ఎంత త్యాగం చేస్తున్నానో చూడు అని కొన్ని వందలసార్లు తూట్లు పొడిచాడు మనోహర్" అంటుంది. దీన్నిబట్టి రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనం కోసం దళితస్త్రీలను ప్రేమిస్తున్నారని విషయం తేటతెల్లమవుతుంది. సుందరరామయ్య మరణంతో అతని పార్టీ మేడను అతని కుమారుడు నిరంజన్ కూలగొడుతుంటే మోహిని ఈ మేడ ఒక చరిత్ర పోనీ ఈమేడను నాకిచ్చెయి అంటుంది. దళితస్త్రీలకు జరిగిన అవమానాలకు పరిహారంగా ఈ మేడపై దళిత జెండాను ఎగరవేస్తాను అంటుంది మోహిని. వామపక్ష ఉద్యమం కూలిపోయిన తరుణంలో ఆ స్థానంలో దళితులకు జరిగిన అవమానాలకు పరిహారంగా దళిత జెండా ఎగరేయాలన్న ఆకాంక్షగల స్త్రీగా కథలో మోహిని పాత్ర దర్శనమిస్తుంది. ఈ విధంగా మోహిని ఉద్యమ కారిణిగా, దళితుల్లో చైతన్యం నింపే దళిత స్త్రీ మోహిని కథలో తారసపడుతుంది.

విద్యాలయాలలో దళితులు కులవివక్షకు గురవుతున్నట్లు, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు చదువుకుంటున్న దళిత విద్యార్థినులపై అత్యాచారాలకు పాల్పడుతున్న వైనాన్ని చంద్రశేఖరరావు 'నలుపు' కథ ద్వారా తెలియపరచాడు.

'నలుపు' కథలో లక్ష్మి దళిత విద్యార్థి. వెల్ఫేర్ హాస్టల్‌లో వుంటూ చదువుకుంటుంది. చదువుకునే లక్ష్మిపట్ల రమేష్ అనే ఇంగ్లీష్ లెక్చరర్ వ్యామోహం పెంచుకుంటాడు. తిరస్కరించిన లక్ష్మిపై అత్యాచారానికి పాల్పడుతాడు రమేష్ అనే లెక్చరర్. కళాశాల గోడలపై లక్ష్మిపై అసభ్యకరమైన రాతలు రాయిస్తాడు. ఎన్ని అవమానాలు ఎదురైనా లక్ష్మి అన్నింటిని దిగమింగుకొని కళాశాలలో ఫస్ట్‌క్లాసులో పాసవుతుంది. చివరగా లక్ష్మి ప్రతిభను మెచ్చుకుంటారు. కాలేజీడే ఫంక్షన్‌లో కళాశాల ఆమెను సత్కరిస్తుంది. ఈ సత్కారానికి రమేష్ వక్తగా వుండడం గమనిస్తుంది లక్ష్మి. సత్కారం పొందిన తర్వాత లక్ష్మి రమేష్‌వైపు కోపంగా చూస్తూ "హాండ్‌బేగ్ లోంచి సెగలు సెగలు ఉన్న సల్ఫ్యూరిక్ ఏసిడ్ బయటకి తీసి.... బాటిల్ రమేష్ ముఖంపై విసిరాను. వాడి అరుపులు వినిపిస్తూనే వున్నాయి" నాకు అంటుంది లక్ష్మి.

అనాథగా దళితులు సామాజికాభివృద్ధికి నోచుకోలేదు. సమాజం నుండి వెలివేయబడి అజ్ఞానంలోకి నెట్టివేయబడ్డారు. ఆధునిక సమాజంలో దళితులు విద్యకు దగ్గరయ్యారు. కానీ వారిపట్ల వివక్ష కొనసాగుతుంది. విద్యాసంస్థలు మొదలుకొని అన్నిచోట్లా వీరు వివక్షతకు దోపిడీకి గురవుతున్నారు. కథలో విద్యా

బుద్ధులు నేర్పాల్సిన గురువే ఒక దళిత విద్యార్థిపై అఘాయిత్యానికి పాల్పడడాన్ని రచయిత ఎత్తిచూపాడు. ఇలాంటి పరిణామాలు సమాజానికి మంచివికాదని, వాటిపట్ల జాగురూకతతో వ్యవహరించాలని రచయిత భావన.

'మేరి' కథలో మేరి ఒక కాలేజీ ఎదురుగా వున్న హోటల్‌లో పనిచేస్తుంది. కాలేజీలో ఎలక్షన్లు ప్రారంభమవుతాయి. ఎలక్షన్లలో ఆనందమూర్తి, రాఘవ రావు పోటిచేస్తారు. రాఘవరావు ఉద్యమంలో వున్నవాడు. పొలిటికల్ పార్టీలతో కనెక్షన్స్ వున్నవాడు. అంతేకాకుండా మేరీతో బాగా పరిచయం వున్నవాడు. ఆనందమూర్తి కాలేజీలో కొత్తగా చేరినవాడు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని ఆనందమూర్తి ఎన్నికల ప్రచారంలో "సమతా, సెక్యులరిజం అభ్యుదయం గురించి మాట్లాడే వాళ్ళకు మేరితో పని ఏమిటి? నీతి, జాతి లేని బజారు స్త్రీతో కాబోయే సెక్రటరీ రాఘవరావుకు వున్న సంబంధం ఏమిటి? ప్రొలిటేరియన్ సంబంధమా? సోదరీ సోదర సంబంధమా? ఇంకేదయినా సంబంధమా? చౌకబారు స్త్రీలతో సరసాలాట మాత్రమే తెలిసిన సెక్రటరీ రేపు వందలాది సోదర విద్యార్థులను ఎలా గౌరవించగలడు? ఫ్రెండ్స్ ఒకసారి ఆలోచించండి. కాలేజీ సమస్యల్ని కాలేజీలో పరిష్కరించుకోవడమా? టీస్టాల్‌లో పరిష్కరించుకోవడమా? తేల్చుకొని ఓటేయండి!" అంటాడు. దాంతో విద్యార్థులు ఆలోచనలో పడతారు. ఎలక్షన్లలో ఆనందమూర్తి గెలుస్తాడు. ఓడిపోయిన రాఘవరావు కొందరు గూండాలను పెట్టి ఆనందమూర్తిపై దాడి చేయిస్తాడు. రౌడీల నుండి తప్పించుకునే క్రమంలో ఆనందమూర్తి మేరి హోటల్‌లో దాక్కుంటాడు. ఆనంద మూర్తి గురించి మేరిని రౌడీలు అడుగగా "ఆయన్ని వదిలేయండి! నోట్లో నాలుకలేని ఎర్రిబాగులోడు" అంటుంది. రౌడీలు ఒప్పుకోకపోతే మేరీ వారికి వెయ్యి రూపాయలు ఇచ్చి వారికి తన శరీరాన్ని అర్పించి ఆనంద మూర్తిని కాపాడుతుంది.

కథలో ఎన్నికల పోరాటంలో ఓట్లకోసం మేరిని పతితను చేశాడు ఆనందమూర్తి. ఒక ప్రాణం కాపాడటం కోసం పతిత అయ్యింది మేరీ. మేరీ ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన సామాన్య మహిళగా, ఆదర్శస్త్రీగా కథలో దర్శనిస్తుంది. ఎదుటివారు అపకారం చేసినా వారు ఆపదలో వున్నప్పుడు సహాయం చేయాలనే మానవతా దృక్పథాన్ని మేరీ పాత్ర కేంద్రంగా రచయిత చిత్రీకరించాడు.

తరతరాలుగా దళితులు అంటరానివారిగా, అస్పృశ్యులుగా ముద్రవేయబడి ఊరికి బయట జీవిస్తున్నారు. దళితస్త్రీలు అంటరానివారిగా చూస్తూ అగ్రవర్ణ పురుషాధిక్యం వారిపై పెత్తనాన్ని చూపిస్తుంది. ఆధునికకాలంలో దళితుల్లో చైతన్యం వచ్చినా అగ్రవర్ణస్తుల దాడులకు దళిత మహిళలు బలవుతూనే వున్నారు. అధికారంలో వున్న దళిత స్త్రీలను అగ్రవర్ణ సమాజం గౌరవించని స్థితిని, దళిత మహిళలు చైతన్యవంతమై దళిత ఉద్యమాలలో పాల్గొంటూ దళితుల్ని చైతన్యం పరిచే దళిత ఉద్యమకారులను అగ్రవర్ణస్తులు బ్రతకనివ్వని స్థితిని, విద్యాలయాల్లో కులవివక్షను దళిత మహిళలపై అత్యాచారాలను, దళిత స్త్రీల అస్థిత్వాన్ని ప్రేమించని అగ్రవర్ణ పురుషాధిక్యతను, దళిత స్త్రీల వ్యక్తిత్వాలు చంద్రశేఖర రావు కథలో చోటుచేసుకున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. మాయాలాంతరు - పుట. 141, 106, 110, 223
2. ముగింపుకుముందు - పుట. 30.
3. చిట్టచివరి రేడియో నాటకం - పుట. 102.
4. జీవని - పుట. 20, 23.

# "ఆశల అంచులో" నాటిక - స్త్రీ పాత్రల ఉద్బోధ"

**- ఓబిలి వెంకటయ్య,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, యోగివేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

నిజమని నమ్మించేది నాటకం, అలా నమ్మించేటట్లు చెయ్యడం నటన ఇదీ నాటకం అంటే సర్వత్రా వ్యాపించి వున్న భావం. నిజమే! నిజంకాని దానిని నిజం అని నమ్మించడంతోనో నాటకం ప్రారంభమౌతుంది. నటుడు తాను కాని రాజు పాత్ర ధరిస్తే ఇతను నిజంగా రాజులా వున్నాడన్న భావంతో ప్రారంభమై, ఈయన రాజే అనే భ్రమలాంటి నిజం ప్రేక్షకులకు కలిగి ఆయన చేసే పనుల్లో లీనమై ఆయనతో భావైక్యతను సాధించడం నాటకంలో జరుగుతుంది. ఒకరు తానుకాని మరొకరిని అనుకరించడం, ఆ అనుకరణలో తాను అవతలి వ్యక్తినేనని నమ్మించే ప్రయత్నం చేయడం నాటక లక్షణం.

సమకాలీన సాంఘిక సమస్యలు భారతీయ నాటక కర్తలను మొదటి నుంచీ ప్రభావితం చేస్తూనే వున్నాయి. 'నీల్ దర్పణ్', 'కన్యాశుల్కం' వంటి నాటకాలే యిందుకు నిదర్శనం. అయితే సాంఘిక నాటకాలు ఒక ఉద్యమంగా, రచనా విధానంగా మారడం 20 వ శతాబ్దం మూడవ దశకం నుంచి ప్రారంభమయింది. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోషియేషన్ (ఇప్టా) ఆవిర్భావంతో సాంఘిక నాటకాలు ఒక ప్రముఖ నాటక విధానంగా స్థిరపడి పోయాయి. పౌరాణిక, కాల్పనిక యుగాల్లో వచ్చిన నాటకాలకంటే భిన్నంగా నాటక రచన సాగింది.

సమకాలీన సాంఘిక సమస్యలు నాటకాలకు ఇతివృత్తాలయ్యాయి. పెరుగుతున్న యాంత్రిక జీవనంతో పెనవేసుకుపోయిన సామాజిక, కౌటుంబిక సమస్యలను ఇతివృత్తాలుగా చేసుకుని నాటకాలు రాయడం 19వ శతాబ్దం 3వ దశకం నుండి వచ్చిన ప్రధానమైన మార్పు. ఆ కాలం నుండి ఆంధ్రదేశం, అందులోని రాయలసీమ ప్రాంతం నుండి వెలువడ్డ నాటకాలు, నాటికలు ఇందుకు భిన్నమేమికాదు. సాంఘిక సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని అనేక మంది రచయితలు తమదైన శైలిలో రచనలు చేశారు. ఆ విధంగా నాటిక, నాటకాలు రాసిన వారు జింకా సుబ్రమణ్యం గారు.

జింకా సుబ్రమణ్యం గారు కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో 1952 వ సంవత్సరంలో జింకా వెంకట సుబ్బయ్య, రామసుబ్బమ్మలకు 5 మంది సంతానంలో 2వ సంతానంగా జన్మించారు. ఈయన హైస్కూలు చదువు ప్రొద్దుటూరు మునిసిపల్ హైస్కూల్, కసెట్టి హైస్కూల్ లో సాగింది. ఇంటర్మీడియట్ గుంటూరు హిందూ కాలేజి, బి.ఎ చిత్తూరు ప్రభుత్వకళాశాలో సాగింది. ఎం.ఎ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో చదివారు. ఈయన 1993 నుండి లెక్చరర్‌గా శ్రీమతి పఠాన్ పామీరాఖాన్ డిగ్రీ కాలేజి (ప్రొద్దుటూరు)లో పనిచేశారు.

సుబ్రమణ్యం గారు కళాశాల రోజుల నుండి సాహిత్యంపై మక్కువ ఎక్కువ పెంచుకున్నారు. నాటి నుండే చిన్న చిన్న రచనలు చేయడం ప్రారంభించారు. ఈయనకు అనేక బిరుదులు, సాహిత్య అవార్డులు వచ్చాయి. 1984లో డా॥ సి.నారాయణ రెడ్డి "యువ సాహితీరత్న" అనే బిరుదును పొందారు. హైదరాబాద్ మనోరంజని సంస్థవారు 'సాహిత్యరత్న' అనే బిరుదును ప్రదానం చేశారు. చౌడేశ్వరి సంస్థ వారు 'నందనందన' కవితాపురస్కారం, ఉగాది పురస్కారం మొదలైనవి 30 వరకు లభించాయి. వీరి రచనలు వివిధ పత్రికలలో కవితలు, రేడియోలో దాదాపు 80 పైగా కార్యక్రమాలు దూరదర్శన్‌లో వెలువడ్డాయి. అంతేగాక సాహిత్య కార్యక్రమాలు పలుమార్లు ప్రసారం అయ్యాయి. మరియు "సాగించు నీ పయనం" అనే కవితా సంపుటిని రాశారు.

జింకా సుబ్రమణ్యం గారు 'మనిషికి మనిషి' అనే రేడియో నాటికల రూపక సంకలనం వెలువరించారు. ఇందులో 3 నాటికలు ఉన్నాయి.

1. మనిషికి మనిషి (స్త్రీ పాత్ర లేని నాటిక)
2. ఆశల అంచులో(పురుషపాత్ర లేనినాటిక)
3. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామము(భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రసారమైన రేడియో రూపకము)

**'ఆశల అంచులో' నాటికలో స్త్రీల ఉద్బోధనలు :**

'ఆశల అంచులో' నాటిక కేవలం ఐదు స్త్రీల పాత్రలు ఉన్న నాటకం. దుర్గ, దుర్గ కూతురు పద్మ, లలిత (సాధారణ మద్యతరగతి గృహిణి), సరళ లలిత కుమార్తె, రంగమ్మ దుర్గ ఇంట్లో పనిమనిషి.

దుర్గ, లలిత లు ఒకే కాలేజిలో చదువుకున్నారు. తర్వాత ఎప్పుడు ఒకరినొకరు చూసుకోలేదు ఒకే పట్టణంలో ఉన్నా కూడా. అయితే వీరిని మనం గమనిస్తే ఒకే కాలేజిలో చదివినా ఒకరి జీవనం విధానానికి మరోకరి జీవన విధానానికి పొంతన ఉండదు. దుర్గ ఆడంబరాలకు పోయి ఉన్న దానికంటే ఎక్కువ ఖర్చు చేసి చివరకు తన మొగుడి యొక్క పతనానికి కారణం అవుతుంది. లలిత సాధారణంగా జీవిస్తూ తన భర్త సంపాదనకు తను కూడా అంతో ఇంతో సంపాదించి సహకారం అందించాలనే మనస్తత్వం గల మద్య తరగతి గృహిణిగా మనకు కనిపిస్తుంది.అలాగే తన ఇంటిలోని వారందరూ సన్మార్గంలో నడవడానికి దిక్సూచిలా ఉందనే చెప్పుకోవాలి.

దుర్గ ఇంటి కాలింగ్ బెల్ మోగడంతో నాటిక ప్రారంభమౌతుంది. బజర్ శబ్దం రాగాలనే దుర్గ ఇంటిలోని పనిమనిషి రంగమ్మ వచ్చి ఎవరు కావాలి అని లలితను అడుగుతుంది. మీ అమ్మగారిని పిలుస్తావా అని లలిత సమాధానం.తర్వాత దుర్గ వచ్చి లలితను చూసి 'నువ్వు లలితవి కదూ!' ఎప్పుడో కాలేజ్ ఫేర్‌వెల్‌లో విడిపోయాము, దాదాపు ఇరవై ఏళ్లు అయ్యింది నిన్ను చూసి ఇంతకీ ఏమిటీ ఆకస్మిక దర్శనం అని అంటోంది. నేషనల్ సేవింగ్స్ వారి మహిళా ఏజెన్సీ తీసుకుని అందులో కొందరిని సభ్యులుగా చేర్పిస్తున్నానని లలిత అంటుంది.

ఇల్లిల్లూ తిరిగే ఖర్మేమిటే నీకు అయినా పెండ్లి చేసుకున్నది సుఖపడడానికే కదూ! నీలాంటి వాళ్లు వుండబట్టే మగమహారాజులు బాధ్యతలు భార్యలకు ఒదిలేసి తిరుగుతున్నారని మగవారిపట్ల వ్యతిరేక భావాన్ని దుర్గ వ్యక్తం చేస్తుంది. ఆ మాటలతో ఏకభవించనీ లలిత 'బాధ్యతలు ఒక్క మగవారికేనా! మనవి మాత్రం కాదా! సంసారమనేది జోడెద్దుల కాడివంటిది. దాంపత్యమనే నూరేళ్లపంట పండాలంటే కాడిమోస్తున్న ఆ జోడెద్దులు రెండూ కలసి మెలసి ముందుకు సాగాలి' అని లలిత దుర్గ యొక్క బాధ్యతల్ని గుర్తు చేస్తుంది.ఒక్క దుర్గ యొక్క బాధ్యతల్నే కాదుసమాజంలోని ప్రతి గృహిణి యొక్క బాధ్యతల్ని లలిత పాత్ర ద్వారా గుర్తు చేశారు రచయిత. నేషనల్ సేవింగ్ స్కీంలో చేరమన్న లలితతో దుర్గ నాకు ఇలాంటి పొదుపులు, మదుపులు నచ్చవనీ, నచ్చిన వస్తువులను డబ్బులు పారేసి అలా కొనడం అలవాటు అని, మా వారితో చెప్పి స్కీంలో చేర్పిస్తే నీకు ఎంత వస్తుందో అంత ఇప్పిస్తాను అని తన యొక్క అహంకారాన్ని మరోసారి చాటుకుంది.

రచయిత దుర్గ యొక్క ఆడంబరాన్ని వాళ్ల ఆయనకు చేసిన ఫోన్లోనే కళ్లకు కట్టినట్లు చిత్రించారు. అతను టి.వి, ఫ్రిజ్ ఇన్‌స్టాల్‌మెంట్ కట్టడం కోసం ఇచ్చిన 2 వేల రూపాయలను ప్రియా టెక్స్‌టైల్స్ ప్రొప్రయిటర్ ఫోన్‌చేసి కొత్త స్టాకు వచ్చింది అనగానే వెళ్లి తన భర్త ఇచ్చిన 2 వేలు ఖర్చు చేస్తుంది.అంతటితో ఆగకుండా టి.వి, ఫ్రిజ్ వాయిదా తీర్చడానికి డబ్బుకోసం వెంకయ్యను నేరుగా ఆఫీసుకు పంపుతుంది. ఇచ్చిన రెండు వేలే కాక ఇంకో రెండు వేలు అప్పుచేసి దాన్ని త్వరగా ఇచ్చేయాలండీ లేదంటే మాట వస్తుందని అనడం కొసమెరుపు. ఈ మాటలన్నీ వింటున్న లలిత " చిన్న చిన్న నీటి బొట్లే సముద్రమవుతుంది. ఒక కొండ పేర్చడానికి ఎన్నో యుగాలవుతుంది.కానీ దాన్ని కూల్చడానికి ఐదు నిమిషాలు చాలు. బరువు బాధ్యతలు తెలుసుకోకుండా మితిమీరిన ఖర్చులతో, ఎటు వెళుతున్నవో నీవు తెలుసు

కొని తిరిగి రావాలనుకొంటే అప్పుడు ఆ మార్గం మూసుకుపోతుందనీ, ఇపుడు ఎలా బతుకుతున్నామో కాదే కావలసింది ఎప్పుడూ ఇలాగే బతుకు గడుపు కోవడంలోనే వుందే గొప్పతనమంతా! అని చెప్తుంది.

ఒకవైపు ఆడంబర, నిరాడంబర జీవితానికి మధ్య వున్న తారతమ్యాన్ని చూపిస్తూనే సమయం కుదిరి నప్పుడల్లా మధ్య మధ్యలో సామెతల్ని జోడించడం రచయిత ప్రత్యేకతగా చెప్పుకోవాలి. దుర్గ పాత్రతోనే మంచం ఉన్నంతవరకే కాళ్లు చాపుకోవడం నీ గ్రహపాటు. మంచాన్నే మార్చివేయడం నాకలవాటు అని అంటుంది.

దుర్గ కుతూరు పద్మకి, లత మరది సుధీత్‌కి ప్రేమకథ కుదిర్చి కథను అక్కడక్కడే అల్లడం రచయితకే చెల్లించదని చెప్పుకోవాలి.పద్మ తన ప్రేమ విషయం తల్లి దుర్గకి చెప్పగానే''డబ్బున్న వాడేనా''అని అడుగుతుంది. మనం అబ్బాయి ఇంటికి వెళ్లడం ఏమిటి? వాళ్లనే రమ్మనలేకపోయావా! అని మరోసారి తన తలపొగరును బయటపెట్టుకుంది. ఆడపెళ్లివారం మనం వెళ్లడమే బాగుంటుందనీ పద్మ అనగానే మీ శ్రీవారి రేటు ఎంతో కనుక్కో అని అహంకారం చూపిస్తుంది. ఆ విధంగా అనడంతో సంబంధం చెడగొడతావని పద్మ అనగానే 'గుడ్డువచ్చి పిల్లనెక్కిరించినట్లుంది నీ వరస'' అని అంటుంది.

దుర్గ సుధీత్ కోసం రామారావు గారి ఇంటికొచ్చి నప్పుడు స్కీం లో సభ్యులు చేర్పించడానికి బయటవెళ్లి వచ్చిన లలితను చూసి మేము వెళ్లాక నీ పొదుపు ఉపన్యాసం ప్రారంభించవే అని అంటుంది. లలిత రామారావు గారి భార్య అని తెలిసినా కూడా ''ఏమే పొదుపు ఉద్యమకారిణి.. వియ్యపురాలి హెూదాలో కట్న కానుకలు ఏం అడుగుతావో నీ యిష్టం'' అని తన యొక్క ఆడంబరాన్ని మరోసారి చూపిస్తుంది. మాటలు అసలు అదుపులో ఉండవు. తనంతట తానే లలిత వారి ఇల్లు అద్దె ఇల్లు అని నిర్ణయిస్తుంది. సుధీత్ రాసిన ఉత్తరం చూసి చదవబోయిన లలితతో పెళ్లికోసం కట్న కానుకల కోరికలను రాసివుంటాడని అవకాశం ఉన్న ప్రతిచోట తన డంభాన్ని ప్రదర్శించును. ఆ ఉత్తరంలో దుర్గ భర్తని పోలీసు ఆఫీసరు అయిన సుధీత్తే అరెస్టు చేశాడని తెలియడంతో ఎందుకు అని అడుగును.అతని దుస్థితికి కారణం పద్మగారి ఆడంబరపు ఖర్చులు. ఆ ఖర్చులు తీర్చడానికి ఆయన లంచగొండిగా మారాడని తెలుస్తుంది.''కడవ లాంటి మగవారి జీవితానికి కుదురు లాంటిది ఆడది ఆ కుదురే సరిగా లేకపోతే కడవకు కన్నం పడవచ్చు, పాల వంటి జీవితమే నేలపాలు కావచ్చు'' అని లలిత పాత్ర ద్వారా మనకు చెప్పిస్తాడు రచయిత. మరియు ''ఆడంబరాలకు లోనైన ఆడదాని బ్రతుకు అధోగతి పాలే!'' అనే జీవిత సత్యంను కూడా రచయిత మనకు తెలియజేశారు.

లలిత పాత్ర ద్వారానే ''మనిషికి తృప్తి అనేది ఎక్కడో లేదే దుర్గా! మనసులోనే వుంది. నీవనుకొన్నట్లు నీ అంతస్తు పెంచేది ఆడంబరాలు కాదే. అనుకూలమైన నీ నడవడి. ఆకాశన్నందుకోవాలని, నేల విడిచిసాము చేస్తే,చతికిల పడతావు. అలా అయింది నీ పరిస్థితి. ఇప్పటికైనా ఆకాశం లాంటి ఆశల అంచులందుకోవాలనే నీ ప్రయత్నం మానివేసి ముందు నీ కాళ్లు భూమి మీద ఆనివున్నాయా లేదో చూసుకో!'' అని చక్కని సందేశాన్ని సమాజానికి చెప్తుంది.

తన భర్త అరెస్టుతో కనువిప్పి కలిగిన దుర్గ పాత్రతోనే ''ఆడంబరాల మత్తులో నేనేమిటో నా పరిస్థితి ఏమిటో తెలియక అలా గుడ్డిగా ప్రవర్తించాను. ధనమదం నా కళ్లకు పొరలు కమ్మేసింది. ఢాంభికాల వల్ల దెబ్బతిన్నది. నా జీవితమే కాదు, నా కూతురు జీవితం కూడా నీ మరది అన్నట్లు నాభర్త పతనానికి నేనే బాధ్యురాలిని. ఎవరైనా తల్లిదండ్రుల పోలిక బిడ్డలకు వస్తే ఎంతో సంతోషిస్తారు. కానీ నేనిప్పుడు కోరుకొనేది నా స్వభావం నాబిడ్డలకే కాదు మరే ఆడదానికి రాకూడదని కోరుకుంటున్నాను.'' అద్భుతమైన సందేశాన్ని మనకందిస్తుంది.

చివరగా లలిత పాత్రతో‘‘ బాధపడకు దుర్గా! అయిందేదో అయింది. ఆలస్యంగానైనా నీలో మార్పు వచ్చింది. మాకు అదే పదివేలు. కోరికలనే వరదలకు పొదుపనే ఆనకట్టలు వేస్తే జీవిత సీమలను సస్య శ్యామలం చేసుకోవచ్చు. వరదల ఉధృతానికి ఆనకట్ట వేయకపోతే అవి ఉప్పెనలై పొంగి పంట పొలాలను నాశనం చేస్తాయి. అలాగే కోరికల ఉధృతానికి పొదుపు అనే అదుపు లేకపోతే జీవితానిన్నే నాశనంచేస్తాయి’’ అని ముగింపు పలుకును...

చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా చక్కగా చెప్పడం రచయిత యొక్క ప్రత్యేకతగా చెప్పకోవాలి. స్త్రీ పాత్రలు అయిన దుర్గ, లలిత ద్వారా గృహిణి యొక్క ఆవశ్యకతను, ఇల్లు సక్రమంగా నడవాలంటే ఇల్లాలే ముఖ్యమంటారు. ‘‘ఆశల అంచులో’’ అనే నాటికలో....

ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వ డిగ్రీ కాలేజి చేబ్రోలు, వైకెఆర్ & కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోవూరు వారికి ధన్యవాదములు....

**ఆధార గ్రంథాలు :**

1. మనిషికి మనిషి(రేడియో నాటికల రూపక సంకలనం)- జింకా సుబ్రమణ్యం
2. నాటకశిల్పం- మొదలి నాగభూషణశర్మ

❀ ❀ ❀

# ఓల్గా రాజకీయ కథలు - స్త్రీ

**- షేక్ షానాజ్ బేగం,** తెలుగు అధ్యాపకురాలు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు, ప్రకాశం జిల్లా.

ఓల్గాగా ప్రసిద్ధి పొందిన పోపూరి లలితకుమారి ప్రముఖ స్త్రీవాద రచయిత్రి. ఓల్గా 1950 నవంబర్ 5 గుంటూరు జిల్లా చుండూరు మండలం యడవల్లి గ్రామములో వెంకట సుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఏం.ఏ చేసిన ఈమె తెనాలిలోని వి.ఎస్.ఆర్. కళాశాలలో తెలుగు అధ్యపకురాలిగా పనిచేశారు. సాహితీ లోకంలో ఓల్గాకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. ఈమె జీవితాంతం మహిళల హక్కులు, వాటి సాధన దిశగా సాహిత్యాన్ని ఒకే ఆయుధంగా మలచుకొని కథలు నవలలు వ్రాసారు. ఈమె అస్మిత సంస్థ ద్వారా తమ సాహితీ వ్యవసాయాన్ని కొనసాగించారు. మహిళల కొరకు కలం పట్టి తన రచనల ద్వారా సమాజాన్ని, స్త్రీలను జాగృతం చేయడమే తన జీవితాశయంగా కృషి చేస్తున్నారు ఓల్గా .

## ఓల్గా రచనలు :

రాజకీయ కథలు, స్వేచ్ఛ, సహజ, ప్రయోగం, మానవి, కన్నీటి కెరటాల వెన్నెల గులాబీలు, ఆకాశంలో సగం, పలికించకూ మౌన మృదంగాలు, అలజడి మా జీవితం, జీవితం కన్నీటి కెరటాల వెన్నెల, అక్షర యుద్ధాలు, అతడు-ఆమె మనం, నవల మాలతీయం, సరిహద్దులు లేని సంధ్యలు అనే రచనలు చేశారు. ఇంకా ఆంగ్లం నుండి అనేక అనువాదాలు చేసారు. ఈమె రాసిన స్వేచ్ఛ నవలకు అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తోడు అనే కథకు ఉత్తమ నంది అవార్డు ఇచ్చి సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ స్త్రీ రచయిత అవార్డునిచ్చి గౌరవించింది. 2015లో ఈమె రాసిన విముక్త కథల సంపుటికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

## ఓల్గా రాజకీయ కథలు - నేపథ్యం :

ఓల్గా వ్రాసిన ప్రతి రచన ఆలోచనాత్మకంగా ఉంటుంది, ముఖ్యంగా రాజకీయకథలు అంటే రాజకీయాలకు సంబంధించిన కథలు కావు, కాదు. స్త్రీల సమస్యలను, స్త్రీల అవయవాలను, స్త్రీల శరీరాలను పురుష పుంగవులు చూసే విధానం, సాటి ఆడవారు కూడా స్త్రీలను తక్కువగా చేసి చూపించడం కనిపిస్తుంది. కుటుంబంలో సమాజంలో స్త్రీ పురుషాధిక్యానికి ఎలా బలి అవుతున్నది. అలా బలైన స్త్రీలను సమాజం ఎన్ని రకాలుగా వక్రీకరిస్తారో రాజకీయ కథలోని ఒక్కొక్క కథను విశ్లేషిస్తూ చూస్తే అర్థమవుతుంది. కొందరు సంప్రదాయ వాదులు, స్త్రీవాద రచనలలో సామాజిక స్పృహ కంటే శరీర స్పృహ ఎక్కువగా ఉందని, ఒక రకంగా చెప్పాలంటే ఇవి నీలి కవితలని విమర్శించారు. స్త్రీలశరీరాల గురించి ఇవాళ వస్తున్న రచనలు సామాజిక స్పృహతో వస్తున్నవే. స్త్రీల అణచివేత దోపిడీలతో నిండిన సమాజంలో జరుగుతున్న అకృత్యాలు అన్యాయాలతో నిండిన సమాజాన్ని గురించి ఈ రచనలు ఏ కోవకు చెందినవో సమాజానికి చెప్పాలిసిన బాధ్యత స్త్రీలుగా మనపైనే వుంది. మంచి సాహిత్య విమర్శకులు కరువైన ఈ రోజుల్లో స్త్రీవాద దృక్పథం గురించి ఈ రచనలన్నింటిని విశ్లేషించే వారు అసలు కనిపించడం లేదు. స్త్రీల శరీరాల చుట్టూ ఉన్న రాజకీయాలను గురించి ఈ రాజకీయ కథలలో చూస్తాం. ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు కవులు రాసిన వివిధ కవితా సంకలనాలను పరిశీలిస్తే ఎన్నో కవితల్లో స్త్రీని, స్త్రీల శరీరాన్ని హీనంగా చూడడం కనిపిస్తుంది. శతాబ్దాలుగా అణచివేతకు గురైన స్త్రీల శరీరం తమ శక్తులను కోల్పోయి కుంచించుకొనిపోయి, తనకు తానై, పరాయిదై తనను తానే తక్కువ చేసుకొని

నిందించుకునే స్థితికి చేరుకునే క్రమం, స్త్రీల బాధలను చదువుతుంటే గుండె చెరువవుతుంది. తోటి స్త్రీల అనువభావాలను గుర్తు చేసుకొని వాటిని స్త్రీవాద దృక్పథం నుండి విశ్లేషించుకోవడం మొదలుపెడితేనే స్త్రీల శరీరాలు ఎలా మలచబడ్డాయో అర్థం అవుతుంది. స్త్రీలను స్త్రీలుగా తయారు చేయడానికి ఎంత పకడ్బందీగా జెండర్ పరంగా స్త్రీలపై ఎన్ని ఆంక్షలు విధించారో మనకు తెలుస్తుంది అని ఓల్గా ముందుమాటలో ప్రస్తావించారు.

**సీతజడ :**

ఈ కథలో సీత ఇలా అనుకుంటుంది, ఇన్నాళ్ళుగా ఈ జుట్టు నా ఇష్టంతో పెరిగిందా, ఇష్టప్రకారంగా పెరిగిందా సీత మనసులో ప్రశ్న. ఈ జుట్టును పోషించు కోవడంలోనూ, నిర్లక్ష్యంలోనూ ఎంతమంది పెత్తనం చేశారు ఆడదాని జుట్టు మీద ఇన్ని ఆంక్షలు నియమాలు, పెత్తనాలు ఎందుకొచ్చాయి. ఆడదాని జుట్టు మీద అమ్మమ్మ, అత్తయ్య, భార్త, వదినలు, ఆడపడుచులు, స్నేహితులు సమాజంలో ప్రతి ఒక్కరూ సీత జడ మీద చర్చలు సలహాలు సూచనలు ఇచ్చి ఇచ్చి సీతకు జడ మీద తప్ప ఇంకేం ఆలోచన లేకుండా చేసి, సీత జీవితాన్ని అస్తవ్యస్తం చేసి, ఒక బొమ్మగా చేసి నువ్వు ఆడదానివి, ఆడదానివి అంటూ చదువుసంధ్యలకు దూరం చేసి సంసారమనే ఊబిలోకి దింపి సమాజంలో ప్రతి ఒక్కరు తెలియకుండానే సీతకు అన్యాయం చేశారు. సీత జీవితం ప్రశ్నార్థకంగా మిగిలిపోయేటట్లు మార్చి వేసింది సీత జడ. చిన్ననాటి నుండే ఇలాంటి ఆలోచనలను రుద్ది ఆడపిల్లల అభివృద్ధికి మార్గం చూపే వాళ్ళే కరువైయ్యారు. సాంకేతికంగా ఇంత అభివృద్ధి పొందిన సమాజంలో ఇప్పటికీ కూడా జడలను గురించి ఆలోచించే వారు ఇంకా ఉన్నారంటే నమ్మక తప్పదు.

**కళ్ళు కథ :**

తరతరాలుగా స్త్రీలు ఎదుర్కుంటున్న సమస్య కళ్ళు. ఈ సమస్య ఎదుర్కోని ఆడవాళ్ళు బహుశా వుండవేమో! కళ్ళు కథలో తల్లి, వదినలు బజారుకు వెళ్ళినా, ఎక్కడకు వెళ్ళినా నేల మీదనే చూపులుండాలని, తామేమి చూడ కూడదని ఎవరికీ ఏ సహాయం చేయకూడదనే విషయాన్ని కళ్యాణి పాత్ర ద్వారా ఓల్గా గారు సృష్టించిన తీరు అమోఘం. ఇంకా బొట్టు కాటుకలు లేని ఆడవారిని చూడడానికి ఇష్టపడని తీరు. అంటే సౌభాగ్యవతి అంటేనే బొట్టులు మెళ్ళో పసుపుతాడులు ఉంటేనే వారికి మర్యాద లేకుంటే అవి అనాగరికతకు చిహ్నాలుగా భావించడం ఎంత మాత్రం సబబు. బొట్టూ తాడు లేకపోతే ఆడవారికి విలువలేదా? అనే ప్రశ్నలు ఇప్పటికీ ప్రశ్నార్థకాలే?

కథలో ఆడవాళ్ళు మాత్రమే ఏడవాలి మగవాళ్ళు తిట్టడమే తప్ప ఏడ్వడం ఉండదు. నిజజీవితంలో కూడా ఏడుపు ఆడదాని జన్మహక్కని, సమాజం ఏనాడో శాసిం చింది. మగవాళ్ళు ఏడ్వకూడదని శాసించారు, పాటిస్తు న్నారు. ఆడవాళ్ళు మాట్లాడకూడదు నోరుమూసుకొని ఉండాలి. దీనిని బట్టే సమాజంలో ఆడా మగకు ఉండే బేధాన్ని ఈ కథ తెలియజేస్తుంది. అమ్మకు ఏమి కనిపించవు. కనిపించినా అమ్మ వాటిని పట్టించుకోదు. ఆడవాళ్ళ కళ్ళు ఇలా ఎందుకుంటాయో అనడంలో సమాజం స్త్రీల కళ్ళపై సమాజం ఎన్ని ఆంక్షలు విధించిందో నిత్య జీవితంలో సమస్యలు ఎదుర్కునే వారికి మాత్రమే తెలుస్తుంది. తరాలు మారినా అంతరాలు మారని ఈ సమాజంలో మార్పు రావాలనేదే రచయిత్రి ఉద్దేశ్యం.

**ముక్కు పుడక :**

పెళ్లి చూపులు స్త్రీ జీవితంలో ముఖ్య ఘట్టం. ఆడదానికి తమ అవయవాల పట్ల స్వేచ్ఛా స్వాతంత్రాలు ఉండవని మగాడికి నచ్చినట్లు ఉండాలనే తెలియజేసే కథే ముక్కుపుడక. రమకు చిన్నప్పుడు ముక్కు కుట్టించడంలో రమ అటు ఇటు కదలడం వలన ముక్కు మీద మచ్చ పడింది. ఎదిగిన తర్వాత రమను చూడడానికి వచ్చిన వాళ్ళంతా ముక్కు మీద మచ్చను సాకుగా చూపి సంబంధాలు కుదిరేవి కావు. తండ్రి రమకు ముక్కు మీద మచ్చ పోవడానికి ఆపరేషన్ చేయించాడు. తర్వాత

రమకు ఒక సంబంధం కుదురుతుంది కానీ పెళ్లి కొడుకు ముక్కు కుట్టించుకోమన్నాడు. నాగరికత పెరిగింది అని అనుకుంటున్నా, ఎప్పటికప్పుడు స్త్రీల పెళ్లిచూపులలో మార్పు పెద్దగా రాలేదని చెప్పాలి. ఇప్పటికీ అమ్మాయిని చూడడానికి వచ్చేవారు కాలి కొనగోటి నుండి తల వెంట్రుకల వరకు పరిశీలిస్తారంటే కొందరికి నమ్మశక్యం కాదు, ఆడపిల్లకు ఏ అవయవలోపం ఉండకూడదు. ముక్కు వంకర, మూతివంకర, రంగు లేదు, కాళ్ళు, చేతులు సరిగా లేవని పేర్లు పెట్టి అమ్మాయి నచ్చలేదు అనే వారు మన చుట్టు పక్కల ఇంకా ఉన్నారంటే, అతిశయోక్తి లేదు. ఇలాంటివి ఇంకా జరగకూడదు. పురుష రాజకీయాలకు స్త్రీలు తలవంచవల్సిన అవసరం లేదని రమ తిరుగుబాటును రచయిత్రి సూచిస్తారు.

**నోర్మూయ్ కథ :**

నోర్మూయ్, నోర్మూయ్, నీకెందుకు ఆడపిల్లవి, అనవసరంగా మాట్లాడకు అనే అనిపించుకోని స్త్రీజాతి బహుశా ఉండదేమో! ఈ కథలో జానకి పాత్రద్వారా ఆడపిల్లలకు పోగొట్టుకున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను తెలియజేశారు రచయిత్రి. ఈ కథలో జానకి చాలా చురుకైనది తెలివికలదీ, చిన్నప్పటినుండి తన భావాలను తండ్రితో, తల్లితో, అమ్మమ్మ, తాతతో, అత్త మామలతో పంచుకోవాలనుకుంది. అందరూ నోర్మూయ్ నీకెందుకే అన్నీ విషయాలు అంటూ నోరు మూయించారు. జానకి పెరిగి పెద్దదయ్యేసరికి ఆడవాళ్ళు మౌనంగా ఉండాలని నేర్చుకుంది. ఈ ప్రయత్నంలో తన ఆలోచనలను, ఊహాశక్తిని కోల్పోయింది. వివాహమైన తర్వాత జానకి మౌనంగా ఉంటుందని భర్త విసుక్కున్నాడు. భర్తను సంతోషంగా ఉంచాలని జానకి మాటలు నేర్చుకుంది. మాట్లాడడం మొదలు పెట్టింది. చివరికి భర్త కూడా విసుక్కొని నోర్మూయ్ అనేశాడు. జానకి మనస్సులో అలజడి ఈ మాట చెవుల ద్వారా విన్నప్పటికినీ తలకాయలో పుట్టింది, రక్తంలో ఇంకింది. సమాజంలో ఆడజన్మ ఎత్తాకా మాట్లాడినా తప్పే, మాట్లాడకపోయినా తప్పే. తరతరాలుగా స్త్రీలు నోరుమూసుకొని పడిఉండమని చెప్పే హక్కు ఎవరిచ్చారు. స్త్రీలకు హృదయం లేదా? తమ భావాలను ఇతరులతో పంచుకోవాలనుకోవడం తప్పుగా, స్త్రీని ఒక బొమ్మను చేసి ఆడించి ఎదురు తిరిగితే బరితెగించింది అని ముద్ర వేసి హింసించే రాజకీయ భావాలకు రూపం ఇచ్చింది సమాజమే కదా !

**వెన్నెముక :**

ఆడపిల్ల స్వతంత్రంగా బాగా చదువుకొని, మంచి ఉద్యోగాన్ని సంపాదించుకొని తమ కాళ్ళపై తాము నిలబడాలనే ఓల్గా వెన్నెముక కథలో తెలిపారు. ఒక హాస్టల్‌లో ఉన్నత విద్యను అభ్యసించుకునే పది మంది ఆడపిల్ల మనస్తత్వ విశ్లేషణ, కులాంతర వివాహాలు చేసుకోవడం తప్పు కాదని తల్లిదండ్రులు కాదన్న తాము జీవితంలో స్థిరపడాలంటే బలమైన వెన్నెముక కావాలని చెప్పారు. ఈ విషయంలో ఏ కొన్ని సామాజిక వర్గాలలో తప్ప తల్లితండ్రుల ఆలోచన విధానంలోనూ చది వించడంలోనూ ముందుకు వచ్చి, తమ పిల్లల మనస్సుకు నచ్చిన వారిని ఇచ్చి కట్టబెడుతున్నారు. చదివించడం లోనూ, ఉద్యోగాలు సంపాదించుకునే దిశలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అయితే సమాజంలో పూర్తిగా మార్పు రావలనేదే అందరి ఉద్దేశ్యంతోనే ఓల్గా ఈ కథను రచించారు.

**రాతి గుండెలు :**

స్త్రీలు వయస్సుకు వస్తున్న సమయంలో దాదాపుగా ఎప్పుడూ ఎదుర్కొనే సమస్య మగవారి భయంకరమైన చూపులు చేష్టలు. అటువంటి చేష్టలకు విసుగెత్తిన సుశీల తన పిల్లలకు పాలు ఇవ్వడానికి కూడా ఇష్టపడక పాలు రాకుండా చేసుకొని క్యాన్సర్ బారిన పడి పిల్లలకు పాలివ్వక పోవడం వల్ల బ్రెస్ట్ కాన్సర్ వ్యాధికి గురి అయ్యానేమో అనే అపోహతో డాక్టర్ గారితో తన భావాలను పంచుకుంటుంది సుశీల. సుశీలను స్కూల్‌లో మాస్టరు దగ్గరి నుండి ఆమె వక్షోజాలపై దాడి ప్రారంభమైనది. ఇంట్లో మామయ్య, ప్రాణస్నేహితురాలి ఇంట్లో

వాళ్ళ బాబాయి, బిడ్డకు పాలిస్తుంటే బావ గారి వెకిలిచూపులు, వీటన్నిటినీ చూసిన సుశీల గుండె బండబారిపోయింది. తన పిల్లలకు పాలు రాకుండా చేసింది, సుశీలను ఇలా మార్చింది ఎవరు? సమాజంలోని మగాళ్లు కాదా? ఒక్క సుశీలే కాదు ఎంతో మంది ఇటువంటి అసహ్యకరంగా ముట్టుకోవడాలు ఉచ్చనీచాలు లేకుండా చేసే వికృత చేష్టలకు ఎంతమంది ఆడవారి గుండెలు రాతి గుండెలుగా మారిపోతున్నాయో లెక్కలోనికి రావు.

**అయోని కథ :**

సభ్య సమాజం తలదించుకునే హృదయవిదారకర మైన కథ. నిత్యం పసిపిల్లలపై జరిగే అత్యాచారాలకు గురిఅయ్యేవారిలో ఒక పసిపిల్ల యొక్క మనోవేదనే ఈ అయోని కథ. పది సంవత్సరాల వయస్సున్న పసిదానికి శరీర భాగాలే తెలీదు. ఒకరోజు ఇద్దరు కామాంధులు పిల్లను అపహరిస్తారు. దున్నపోతులాంటి ఒకడు తన యోనిని చీల్చాడు, రక్తం వరదలై పారి స్పృహతప్పి పడిపోతుంది ఆ పాప. అందుకు ఒప్పుకోకుంటే అన్నం పెట్టకుండా హింసిస్తారు. నాకు అన్నం పెట్టింది నా యోనినా అని ప్రశ్నించడంలోనే సమాజంలో పసిపిల్లలపై జరిగే అకృత్యాలు అర్థమవుతున్నాయి. ఆకలి, చీకటి, భయం, వారంలో మూడు రోజుల పాటు వచ్చిపోయే వాళ్లకు అడ్డూఅదుపు లేదు. ఆ పాప తనకు యోని ఉండబట్టేకదా కుటుంబానికి, దూరమై భయంకరమైన భాదను అనుభవించవలసి వచ్చిందని అనుకుంటుంది. మగపిల్లలకు రెండుకాళ్ళ మధ్య వేళా అవయవం విషం పూసిన కత్తిలా, ఖడ్గమృగపు కొమ్ములా మార్చగలదని తెలిసాక మగవాళ్ళంటేనే అసహ్యం కలిగింది. నేను అయోనిగా పుట్టి ఉంటే ఈ నరకం తప్పేదే కదా అని బాధపడ్తుంది. ఇది హైదరాబాదులో జరిగిన కథను ఆధారం చేసుకొని ఓల్గా గారు రాశారు. సమాజం ఎటు వైపుకు వెళుతుంది. ఇటువంటి నిజ జీవిత కథలు ఎన్నో ఎన్నెన్నో జరుగుతూనే ఉన్నాయి, కొన్ని వెలుగులోనికి రావడం లేదు. 2018లో జరిగిన కథువాలో ఆసిఫాపై కూడా ఇలానే దాడి జరిగింది. నేటి సమాజంలో వావి వరసలు, వయస్సుతో సంబంధం లేకుండా అత్యాచారా లకు పాల్పడుతున్నారు. వారి అవసరాలు తీరాక వేశ్యగృహాల్లో అమ్మివేయడమో, లేక చంపడమో చేస్తు న్నారు. అలాంటి బాధకు గురి అయిన బాలిక అయోనిగా మారాలని ఆమె పడే వేదన వర్ణనాతీతం అని చెప్తూ పసిమొగ్గలపై చేసే క్రూరమైన దాడిని ఓల్గా గారు పురుషులను ఉద్దేశించి మృగాలుగా మారవద్దని, వారు పడే చిత్రహింసను ఈ ఆయోని కథ ద్వారా ఖండించారు.

**రాజకీయ కథ :**

మధుసూదన్ 50 వేలు కట్నం తీసుకొని పెళ్లి చేసుకొని ఆఫీసులో అనుకోకుండా ప్రమాదం జరిగితే భార్య సేవలు చేస్తుంది. మామూలు మనిషి అవుతాడు. కొన్నాళ్ళకు ఆమెకు అండం గర్భనాళంలో పడడం వలన ఆపరేషన్ చేసిన డాక్టర్ ఆమె జీవితంలో తల్లి కాలేదని చెప్పగానే మధుసూదన్ తనకు పిల్లలు కావాలని ఆమెను ఇంటిలో నుండి గెంటివేస్తుంటే తల్లిదండ్రులు కూడా మౌనం వహించి ధైర్యాన్ని ఇవ్వకుండా ఒంటరిని చేస్తారు. ఇదేమి రాక్షస న్యాయం ఇందులో ఆమె తప్పుందా. ఇది ఎక్కడి రాజనీతి. భర్త కుంటి, గుడ్డి ,మూగ, చెవిటి వాడైనా స్త్రీలు చూడాలి కానీ అనుకోకుండా ఏదైనా స్త్రీలకు ప్రమాదం జరిగితే ఆమెను చూసే వారెవరూ ఉండరా? కేవలం స్త్రీ బిడ్డల్ని కనే యంత్రమా? బిడ్డల్ని కనలేని స్త్రీని అందరూ చులకనగా చూడవలసిన అవసరం లేదని అటువంటి ఆడవారిపై సమాజం చూపే చిన్నచూపును ఈ రాజకీయ కథ ద్వారా రచయిత్రి తెలియజేశారు.

**కేసు కథ :**

సమాజంలో పిల్లల పెంపకం విషయంలో స్త్రీ పురుషులిద్దరకు భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలో పనిచేసే వారికి మెటర్నిటీ లీవును పెంచాలని, పనిగంటలు తగ్గించాలని రమ్య కోర్టులో కేసు వేస్తే సంచలనం కలిగింది. రమ్య భర్త సుధాకర్ కేసును విత్

డ్రా చేసుకోమని, అందరూ ఎగతాళి చేస్తున్నారని బుజ్జగిస్తాడు. రమ్య తగ్గదు. అంతే సుధకర్‌లోని పురుషాహంకారము పైకి లేచింది రమ్య జుట్టు పట్టుకొని ఈడ్చి ఈడ్చి కొట్టాడు. చెంపలు చెళ్ళుమనిపించాడు. ఏమే బిడ్డల్ని పురుషులు పెంచాలా? పిల్లల పీతిగుడ్డలు ఉతకమంటావా? అని ప్రశ్నిస్తాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త కిరాతకంగా మారడం చూసి అవాక్కవుతుంది. బిడ్డల పెంపకం స్త్రీల బాధ్యత అని పురుష సమాజం ఏనాడో ముద్రవేసింది. ఉద్యోగాలు చేయాలి, కుటుంబం కోసం ఖర్చు పెట్టాలి, కానీ పని విభజన మాత్రం ఏమి జరగడం లేదు. నిజమే కదా ఇప్పటికే ఉద్యోగం చేసి అలసివచ్చినా స్త్రీ వంటింట్లోకి పరిగెత్తవలిసిందే. పిల్లల పనులు, ఇంటాబయటా ఎక్కడైనా పనులు చేయవల్సింది స్త్రీలే అని ముద్ర వేసి, పని చేయడం ఆడవారి జన్మహక్కని చిత్రించింది ఈ సమాజం.

**ఆర్తి కథ :**

సమాజంలో స్త్రీ పురుషులిద్దరూ సమానం కాదని, చిన్నప్పటి నుండి తాను తల్లి అయ్యి భర్త పెట్టె హింసలను తట్టుకోలేక స్వతంత్ర్యంగా బ్రతకాలని వచ్చిన స్త్రీకి పిల్లలను దూరం చేస్తాడు భర్త. కోర్టుకు వెళ్ళినా ఆ పిల్లలు తండ్రికే తప్ప తల్లికి హక్కు లేదని వివక్షను చూపే కథే ఈ ఆర్తి కథ. సీతకు ఆడపిల్లగా పుట్టినందుకు చాలా సంతోషించేది. స్త్రీకి సహజంగా వచ్చే రుతుక్రమం ప్రారంభం అయితే సిగ్గుపడాలి అని అత్త చెప్తుంది అలా సిగ్గు పడడం సీతకు రాలేదు. సీత అన్నను లయోలా కాలేజిలో చదివిస్తున్నారు. ఆడపిల్లకు చదువు వద్దని అత్త వారించినా సీత పట్టుపట్టి పీయూసీ వరకు చదివి కాలేజీలో ఉద్యోగం తెచ్చుకొని పెళ్లి చేసుకుంది. బిడ్డ పుట్టిన తర్వాత వారిని ఆడిస్తూ నవ్వుతూంటే సీత భర్త తట్టుకోలేక పోయాడు, మాటలలో హింస కాస్త చేతల్లోకి మారేసరికి సీత పుట్టింటికి వెళితే ఆదరించలేదు. స్నేహితురాలి సహకారంతో బ్రతుకుతుంటే చూసి ఓర్వలేని అతను పిల్లలను తీసుకొని వెళ్ళిపోతాడు. సీత పిల్లల కోసం లాయర్‌ను ఆశ్రయిస్తే ఆ బిడ్డలపై ఆమె భర్తకు తప్ప ఆమెకు హక్కు రాదని, ఆమె కేవలం క్షేత్రమని అందులో పంట బిడ్డలని, అది అతని భర్తదేనని చెప్తాడు. నవమాసలు మోసి రక్తమాంశాలను పంచిన తల్లికి పిల్లలపై హక్కు లేదు. అందరూ పిల్లలకోసం రాజీ పడమంటే మనసు ఒప్పుకోలేదు. నేను కన్నపిల్లలతో నా సంబంధం ఎంతవరకు ఉండాలో ఎలా ఉండకూడదో చెప్పడానికి వీళ్లెవరు, తల్లీపిల్లల సంబంధాలను నాశనం చేస్తుంటే నేనేమీ చేయలేనా, దీనంతటికి మూలం ఎవరు? అని ప్రశ్నించుకోవడంలోనే సమాధానం దొరుకుతుంది. సమాజపు ఆంక్షలు మగవారికి అనుకూలంగా చేసుకున్న చట్టాలు, ధర్మాలు, దానికి బలి అయ్యే తల్లుల వేదనలను ఈ కథలో రచించారు ఓల్గా.

**ముగింపు :**

సమాజం స్త్రీల పట్ల చూపే వివక్ష, స్త్రీలు ఇలా ఉండాలి అని ఏనాడో మనుధర్మశాస్త్రంలో 'న స్త్రీ స్వాతంత్ర్యం అర్హతి అని చెప్పి ఆనాటీ నుండి నేటి వరకు ఆడవారిపై జాతి పరంగా, లింగపరంగా ఎన్నెన్ని కష్టాలు, ఎదురౌతున్నాయో చెప్పలేము జుట్టుపై, ముక్కుపై, హృదయం పై, ఆలోచనలు లేకుండా రాతిగుండెలు కలిగి నాతి బ్రతకాలని, పురుష సమాజం ఎంతటి వికృతచేష్టలు చేసినా నోరు మూసుకొని బ్రతకాలని నవ్వకూడదని, ఆడకూడదని, పాడరాదని స్వాతంత్ర్యంగా జీవించరాదని పిల్లల పెంపకం దగ్గర నుండి, చాకిరీ కోసం, పిల్లలను కనే ఒక యంత్రంగానే చూడాలే తప్ప ఆమె ఎటువంటి ప్రత్యేక భావాలు ఉండకూడదని, పై కథల ద్వారా ఇంకా పసిపిల్లలపై జరిగే అరాచకాలు, స్వతంత్రంగా జీవించే హక్కు లేదని ఈ సమాజం చిత్రీకరించిన తీరును ఓల్గా తన రాజకీయ కథల ద్వారా చిత్రించిన విధానం అత్యద్భుతం, ఆలోచనాత్మకం.

**ఆధార గ్రంథాలు :**

1. రాజకీయకథాలు ఓల్గా, 2. తొలివెలుగులు ఓల్గా

# చిల్లర దేవుళ్ళు నవలలో మహిళ

**- యస్. రజిత,** సహాయ ఆచార్యులు, పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అ), హనుమకొండ, తెలంగాణ.

"ఆధునిక మహిళలు భారత దేశ చరిత్ర తిరగ రాస్తారు" ఇది గురజాడ వారికి స్త్రీల పై ఉన్న అభి ప్రాయం. ఈ సృష్టిలో అత్యంత శక్తివంతురాలు స్త్రీ. 'స్త్రీ' అబల అనే మాట అర్థరహితం. స్త్రీ తన హక్కులను సాధించడానికి వ్యక్తిత్వ పోరాటం చేస్తున్నది. రైతుల జీవన విధానంలో స్త్రీలు అత్యంత శక్తివంతులు. ఆధునిక మహిళ తన శరీరం మీద, మనసు మీద, ఆలోచనల మీద పోరాటం చేస్తూనే ఉన్నది.

చిల్లర దేవుళ్ళు నవలను వ్రాసినది డా॥ దాశరథి రంగాచార్య. రంగాచార్య గారు తెలంగాణ ప్రజల జీవితాన్ని తన రచనలలో ప్రతిబింబింపచేసారు. ఈ చిల్లరదేవుళ్లు నవలలో 1938 కి పూర్వం తెలంగాణాలోని ప్రజల జీవితాన్ని చూపించారు. ఈ నవలా రచనను 13.10.1964 న ప్రారంభించి 10.11.1964 నాడు ముగించారు. ఈ నవల ప్రగతి వారపత్రికలో 21.3.1969 నుండి 13.12.1969 వరకు సీరియల్‌గా ప్రచురింపబడినది.

ఈ నవలలో కనపడే మహిళా పాత్రలు వనజ, మంజరి, తాయారు, మంగమ్మ, సీత లక్ష్మీ. 'ఆడపిల్లగా పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడం మేలు' అనే మాట వనజకు సరిగా సరిపోతుంది. వనజ 'ఆడపాప' అంటే తెలంగాణ దొరల ఇండ్లలో ఉండే దాసీలు. వనజ పాత్ర ద్వారా దొరల ఇండ్లలలో జరిగే అమానుషాలను మన కండ్లకు కట్టినట్లు చూపిస్తారు దాశరథిగారు. ఈ ఆడపాపలకు మనసు అనేది ఉండకూడదని, ఎవరు కోరినా వారి దగ్గరకు వెళ్లి ఒక యంత్రం లా వ్యవహరించాలి. అలాంటి ఆటబొమ్మలా జీవిస్తున్న వనజకు సారంగపాణి పలుకులు ఎంత అప్యాయతను ఇస్తాయి. వనజకు సారంగపాణిని చూడగానే అవ్యక్తమైన అనుభూతిని పొందుతుంది. ఆమెకు భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధం గుర్తుకు వస్తుంది. సారంగపాణి అంటే వనజకు ప్రేమ ఏర్పడింది. కాని తాను ఆడపాప, అంటే సుమారు వేశ్య లాంటిది తన జీవితం వేశ్య తాను వద్దనుకున్న డబ్బు అవసరం లేకున్నా తనను అమ్ము కోవలసిన పని లేదు. కాని ఈ ఆడపాప జీవితం మాత్రం తన ఇష్టాయిష్టాలతో పని లేకుండా అవసరం ఉన్నా లేకున్నా కోరిక కలిగిన వారికి, గడికి వచ్చిన వారికి తన శరీరాన్ని అర్పించాల్సిందే. ఆడపాప జీవితం "గుండె లేని జీవితం" సారంగపాణి వచ్చేవరకు వనజ అలాగే జీవించింది. కాని సారంగపాణిని చూడగానే అనేక మార్పులకు లోనయింది. జీవితాన్ని పంచుకోవాలని ఆశపడింది. కాని "దైవం లాంటి వాడికి కుళ్లిన పండు లాంటి తనను ఎలా అర్పిస్తుంది. అందుకే శారీరకమైన వాంఛలతో పని లేకుండా సారంగపాణిని అన్నలా భావించింది.

మంజరి ఉన్నత వర్గమునకు చెందిన స్త్రీ. మంజరి దొర కుమార్తె. సారంగపాణి పాటలు, సంగీతం వింటూ అతనిపై ప్రేమను పెంచుకుంటుంది. మంజరి సంగీతం నేర్చుకోవాలని తన తండ్రి దగ్గర పట్టుపడుతుంది. మంజరి రామారెడ్డి గారి గారాల పట్టి. కూతురు ఏది అడిగినా కాదనడు. కాని రామారెడ్డి గారికి మంజరికి సంగీతం నేర్పించాలంటే వయసుస్సులో ఉన్న స్త్రీ ఎక్కడ సారంగపాణిపై వ్యామోహం ను పెంచుకుంటుందేమో నని, అటు సారంగపాణి కూడా ఎక్కడ తన కుమార్తెపై ప్రేమను పెంచుకుంటాడో అని, వనజను సారంగపాణికి ఇచ్చి వివాహం చేసినట్లయితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావించి ఈ విషయాన్ని అందరికి చెప్పడంతో మంజరి వనజపై ద్వేషంను పెంచుకొని చివరకు మనో వ్యాకులతకు గురయి అనారోగ్యంనకు

గురవుతుంది. చివరకు అనుమానాలు అన్ని దూరమయి సారంగపాణి తన భావే అని తెలుసుకుంటుంది.

తాయారు కరణం కుమార్తె. అంగవైకల్యం కలది. తాయారు సారంగపాణి పై కోరికను పెంచుకొంటుంది. సారంగపాణి ఆమె కోరికను తిరస్కరిస్తాడు. సారంగపాణి చే తిరస్కరించబడిన తాయారుకు అహం దెబ్బతింటుంది. 'తోక తొక్కిన పాములా' కస్సుమంటూ సారంగపాణిని ఆ ఊళ్లో ఉండనీయను అంటుంది. తాయారు చివరకు ఆ ఊరికి వచ్చిన లక్ష్మణ పెరుమాళ్ళును వివాహం చేసుకొని ఆ ఇంట్లోంచి తన తండ్రి అయిన కరణాన్ని వెళ్లగొడుతుంది.

మంగమ్మ కరణం వెంకట్రావు భార్య. వారిద్దరికి బాల్యంలోనే వివాహం అవుతుంది. కరణంకు అడది అంటే ఆట వస్తువు అని అతని భావం. ఆడదానికి హృదయం ఉంటుందని అతనికి తెలియదు. వెంకట్రావు చూపించిన నరకంతో మంగమ్మ అక్కడ ఉండలేక తల్లిగారింటికి వెళ్లింది. వెంట్రావు జీతగాడు వీరి గాడి భార్య అయిన పుల్లితో సంబంధం పెట్టుకుంటాడు. ఆ వ్యవహారం మంగమ్మ కంటపడి పిచ్చిదై ఆ ఊర్లోనే తిరుగుతుంటుంది.

సీత నారయ్య కూతురు. సాధు స్వభావి. సారంగ పాణిని మామయ్యలా భావిస్తుంది. సారంగపాణి ఊరు వదిలి వెళ్లిపోతున్నప్పుడు బాధపడుతుంది. బీక్య భార్య లంబాడీ పిల్ల లక్ష్మీ తన శీలాన్ని కాపాడుకోవడానికి ఆమీన్‌ను చంపడానికి ప్రయత్నిస్తుంది. పోరాడి పోరాడి చివరకు తన ప్రాణాలను కోల్పోతుంది.

విభిన్న వ్యక్తిత్వం గల స్త్రీలు మనకు చిల్లర దేవుళ్ళు నవలలో కన్పిస్తారు. వనజ తాను చేసే ఆడపాప పని తప్పని తెలిసిన భూస్వామ్య వ్యవస్థలో ఆమె పావుగా మారింది. ఆమె సారంగపాణిని ప్రేమించిన అతడు అందరి లాగా తనను విలాసవస్తువుగా భావించక పోవడంతో సారంగపాణిని మనసు గల వ్యక్తిగా భావించి పాణి పై ఉన్న ప్రేమను సోదర ప్రేమగా మార్చుకున్నది. మంజరి స్త్రీకి సహజంగా ఉండే అసూయ, ద్వేషాలతో వనజను అపార్థం చేసుకొంటుంది. చివరకు నిజంను గ్రహిస్తుంది. తాయారు సారంగపాణి చే నిరాకరించబడి ఆమెకున్న స్త్రీ లౌక్యముతో స్త్రీ లోలుడైన వైష్ణవాచార్యుల చేత తన కోరికను తీర్చుకుంటుంది. మంగమ్మ బలహీన మనస్కురాలు అనుకోని సంఘటనలు ఆమెను పిచ్చిదాన్ని చేస్తాయి. లక్ష్మీ తన మానాన్ని కాపాడుకోవడానికి ఎంతకైనా తెగించి చివరకు ఆమీన్ ను చంపడానికి ప్రయత్నిస్తుంది.

తల్లిగా, చెల్లిగా, ఆలిగా అనేక బాధ్యతలను నిర్వ హిస్తున్న స్త్రీ యొక్క జీవితం ఏ కాలంలో అయినా బాధలకు గురవుతూనే ఉన్నది. ఈ చిల్లర దేవుళ్ళు నవలలో కూడా అలాంటి స్త్రీలు మనకు కన్పిస్తారు. ఈ నవల ద్వారా స్త్రీ జీవితం ఏలాంటి క్షోభకు గురయినదో మనకు కళ్లకు కట్టినట్లుగా వివరించారు దాశరథిగారు.

"స్త్రీని బాధిస్తే వీడదు జన్మ జన్మలకు తన శాపం".

**ఆధార గ్రంథాలు :**

1) విశిష్ట తెలుగు మహిళలు - డా॥ దామెర వెంకట సుబ్బారావు.

2) చిల్లర దేవుళ్ళు - దాశరథి రంగాచార్య

❀❀❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ద్రౌపది జీవితంలోని ప్రధాన ఘట్టాలు - ఎదుర్కొన్న తీరు

- కే. హరీష్ కుమార్, పరిశోధక విద్యార్థి,తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

వేదాలవిజ్ఞానం సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలనిభావించి త్రికాలజ్ఞులైన మహర్షులు సరళమైనభాషలో శైలిలో ఇతిహాసాలను, పురాణాలను రచించి మనకు అందించారు. ఇతిహాసగ్రంధాలు భారత దేశ గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. శ్రీమద్రామాయణం మరియు మహాభారత గ్రంథాల్లో భక్తి జ్ఞాన వైరాగ్యాలు సదాచారాలు, నీతినియమాలు, ధర్మం, అహింస సత్యం వంటి ప్రబోధాలు చెప్పబడ్డాయి. అవి ప్రజానీకాన్ని సన్మార్గంలో నడిపిస్తున్నాయనవచ్చు. భారతం పంచమవేదంగా ఖ్యాతిగాంచింది, అందులో సందర్భాను సారంగా సకలశాస్త్ర విషయాలు దర్శనమిస్తున్నాయి. మహాభారతం మానవకోటికి వేదాంతాన్ని ఆయాఘట్టాల ద్వారా ప్రస్ఫుటం చేస్తున్నది. ఇందులో నీతి ప్రబోధాత్మక మైన సంగతులు ఉపాఖ్యానాల్లో ప్రస్తావించబడ్డాయి. ముఖ్యంగా పాఠకుల హృదయాలలో ఇది రాజనీతిని రంగరించి పోస్తున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇహ పరాలను రెండింటిని కలబోసి సంస్కృతంలో వ్యాసమహర్షి లోకానికి అందించిన మధుర రచన శ్రీమహాభారతం.

సంస్కృతభాషలో అవతరించిన భారతం కాలక్రమేణా దేశభాషలలోకి అనువదించబడింది. ప్రాంతీయ భాషలలో వెలువడిన భారత అనువాదాల్లో తెలుగు 'కవిత్రయం' వారి ఆంధ్రమహాభారతానికి ఒక ప్రత్యేకత ఉంది. కవిత్రయ భారతం కేవలం అనువాదం కాదు. కృష్ణద్వైపాయనుడు మూల భారతంలో ఏపరమార్థాన్ని అందించాడో, ఆపరమార్థాన్ని చెక్కుచెదరకుండా పుణికి పుచ్చుకొని అవతరించిన స్వతంత్ర రచన ఆంధ్రమహాభారతం. తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి' అనే నానుడి పుట్టుకకు కవిత్రయం వారి ప్రతిభయే మూలహేతువు.

ఆంధ్రావళికి ఇలాంటి ఆదికావ్యాన్ని ప్రసాదించిన మహాకవులు ముగ్గురూ త్రిమూర్తుల వంటివారు. ఈ ముగ్గురు సారస్వతమూర్తులు వేర్వేరు కాలాల్లో తెలుగునేలలోని వేర్వేరు ప్రాంతాల్లో తమరచన కొన సాగినప్పటికీ, భారతం స్వరూపంలోనూ సందేశంలోనూ ఏకవాక్యతతో విలసిల్లుతూ ఉంది. ఇది ఆంధ్రావనికి దైవికంగా సిద్ధించిన అదృష్ట విశేషంగా పేర్కొనవచ్చు.

మహాభారతం ప్రజలు ఎలాజీవించాలో, పాలకులు ఎలా ఉండాలో సోదాహరణంగా వివరిస్తుంది. ఇందులో కొన్ని విమర్శకులు విమర్శించే ప్రధానపాత్రల్లో ముఖ్యమైనది ద్రౌపదిపాత్ర. ద్రౌపదిపై వెలువడిన రచనలపై ఎన్నోవిమర్శలు, ప్రశంసలు, పరిశోధనలూ జరిగాయి. వివిధ రచనాకారులు వారివారి దృక్పథాల్లో ద్రౌపది పాత్రను చిత్రించిన విధంగానే, పరిశోధకులూ వినూత్నంగా ద్రౌపది ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. ముఖ్యంగా భారతంలో ఆసాంతం అంటే ఆదిపర్వం మొదలుకొని మహాప్రస్థానికపర్వం వరకు కొనసాగిన ద్రౌపదిజీవితంలో మూడుఘట్టాలు ప్రధానమైనవిగా చెప్పవచ్చు. అవి

1. ద్రౌపది స్వయంవరం
2. ద్రౌపది వస్త్రాపహరణం
3. ద్రౌపది అరణ్య మరియు అజ్ఞాతవాసకాలం

ద్రౌపది వివాహాన్ని చర్చించే ముందు ఆమె జనన ప్రాధాన్యం ముందుగా చెప్పుకోవాల్సి ఉంది. ద్రుపద మహారాజు కోరిక మేరకు ఉపయాజుడు, యాజుడు యజ్ఞంచేశారు. ఆ యజ్ఞం నుండి ముందుగా దృష్టద్యుమ్నుడు పుట్టాడు. ఆ తర్వాత అదే యజ్ఞగుండం నుండి ఒకకన్యక పుట్టింది. ఆమె నేత్రాలు నల్లగా

విశాలంగా ఉన్నాయి. ఉంగరాలు తిరిగిన నల్లనిజుట్టు ఎత్తైన ఎఱ్ఱనిగోర్లు, మానుష రూపాన్ని ధరించిన సాక్షాత్తు దేవకాంతలా ఉంది. దివ్య రూపంగల ఆమెను దేవతలు, రాక్షసులు, యక్షులూ కూడా కోరుతున్నారని వ్యాసమహర్షి తెలిపాడు.

అప్పుడు అశరీరవాణి ఇలా పలికింది! 'ఈమె పేరు కృష్ణ. స్త్రీలందరిలో శ్రేష్ఠమైన ఈమె క్షత్రియులందరిని నాశనంచేస్తుందని, తగినవేళలో ఆమె దైవకార్యాన్ని పూర్తిచేస్తుందని, ఈమెకారణంగానే కౌరవులకు తీవ్రభయం కలుగుతుందని' పలికింది.

## ద్రౌపదిస్వయంవరం :

అలా ద్రుపదుని ఇంట పెరుగుతున్న ద్రౌపదికి ఒకానొకరోజు ద్రుపదుడు స్వయంవరాన్ని ఏర్పాటుచేశాడు. స్వయంవరమండపంలో రాజసమూహం ప్రకాశిస్తూ ఉండగా పుష్పమాలికను పట్టుకొని ద్రౌపది స్వయంవర రంగానికి వచ్చింది. దుష్టద్యుమ్నుడు రాజులందరిని పేరుపేరునా ద్రౌపదికి పరిచయంచేస్తూ ఎవడు లక్ష్యాన్ని చేదిస్తాడో వానిని నీవు వరించాలన్నాడు. అప్పుడు రాజులు ఒకరినొకరు స్పర్థతో చూసుకుంటూ, మన్మధునికి వశు లైనాదే ద్రౌపది అంటూ ఒక్కసారిగా సింహాసనాల నుండి పైకిలేచారు, మత్స్యయంత్రాన్ని చేధించలేక ఎందరో రాజులు విఫలులయ్యారు. అప్పుడు కర్ణుడు లేచి వెళ్ళాడు. కర్ణుని చూచిన వెంటనే ద్రౌపది గట్టిగా నేను సూతుని వరించను అంది. అప్పుడు కర్ణుడు కోపంతో నవ్వుతూ వెనుదిరిగి వెళ్ళాడు. ఆతర్వాత బ్రాహ్మణ యువకుని వేషంలో ఉన్న అర్జునుడు వెళ్లి మత్స్య యంత్రాన్ని చేదిస్తాడు, దానితో సభయావత్తు కరతాళధ్వనులు చేస్తుంది. అప్పుడు ద్రౌపది రాజులందరి సమక్షంలో అర్జునుని మెడలో ఆకళ్యాణమాల వేసింది. ఆతర్వాత అక్కడ ఉన్న బ్రాహ్మణుల ఆశీర్వాదాలు, ప్రశంసలూ పొందుతూ అర్జునుని వెంట ద్రౌపది వస్తుండగా రంగం నుండి నిష్క్రమించారు.

మత్స్యయంత్రాన్నిచేదించి, ఎదిరించిన రాజులను ఓడించిన భీమార్జునులు ద్రౌపదిని తీసుకొని తల్లి దగ్గరికి వెళ్లి 'అమ్మాభిక్షతెచ్చాము' అంటారు. అప్పుడు కుంతీ కొడుకులను చూడకుండానే 'అందరూ కలిసి భుజిం చండి' అనిచెప్పింది. అప్పుడు అందరూ కలిసి ద్రౌపదిని వివాహం చేసుకున్నారు. ద్రౌపది ఇలా ఐదుగురిని వివాహం చేసుకోవడం వెనుక ఆమెకు ఒక పూర్వజన్మ వృత్తాంతం ఉన్నది.

ఒకానొక తపోవనంలో ఒకఋషికి సౌందర్యవతైన కూతురుండేది. ఆమెకు ఎన్ని సంవత్సరాలైనా పెళ్లికాలేదు. ఆమె తన వివాహం కోసం తపస్సు చేయటం, ఆమె తపస్సుకు మెచ్చి శివుడు వరమిచ్చిన రీతిని నన్నయ ఇలాతెలిపాడు.

సీ తానొక్కమునికన్యదనకర్మవశమున
బతిబడయంనోపక యుపేత
దౌర్భాగ్యయైఘోరతపమొనరించిన
దానికిశివుడుప్రత్యక్షమయ్యుజి
వేడుమువరమన్నవేడ్కతోబతిదానజి
మనియేనుమారులియ్యబలవేడేజి
నట్లేనినీకుదేహంతరంబునబతు
లగుదురేవులుపరమార్థమనియుజి
ఆ హరుడుకరుణనిచ్చెనదియిప్డుపాంచాలా
పతికిగృష్ణయనగబంకజాక్షి
యుద్దవిల్లెపెరుగుచున్నదితత్స్వయం
వారముసేయుచున్నవాడువాడు.

(ఆ.మ.భా.తి.తి.దే)

అప్పుడు ఆమె తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్ష మయ్యాడు. సర్వగుణాలతో కూడిన భర్త కావాలని ఆమె ఈశ్వరునితో ఐదుసార్లుపలికింది. అప్పుడు శివుడు ఐదుగురు భర్తలు లభిస్తారని ఆశీర్వదించాడు. ఇలా గత జన్మలో ద్రౌపది కోరుకున్న విధంగా ఆమెకు పంచ పాండవులు లభించారని భారతం తెలుపుతున్నది.

అలా పాండవులతో కలిసి వైవాహిక జీవనం సాగిస్తున్న ద్రౌపది జీవితంలో ఊహించని సంఘటన చోటు చేసుకున్నది. అదేవస్త్రాపహరణం. ఈసంఘటన కూడా కురుక్షేత్రానికి ప్రధానమైన కారణంగా చెప్పవచ్చు.

మయుడు కట్టిన మాయాభవనాన్ని చూడడానికి వచ్చి భంగపాటు పాలైన దుర్యోధనుని మనసెరిగిన శకుని మస్తిష్కంలో నుండి వచ్చిందే మాయాజూద పన్నాగం. ఈజూద క్రీడకు పుత్రమమకారంతో తండ్రి ధృతరాష్ట్రుడు కూడా తలొగ్గకతప్పలేదు.

అందులో సర్వం పోగొట్టుకున్న ధర్మరాజు చివరికి తమ పంచాంగిని కూడా జూదంలో పనంగా పెట్టి ఓడి పోయారు. అప్పుడు ద్రౌపదిని సభమందిరానికి తోడ్కొని రమ్మని ప్రాతిగామిని పంపుతాడు సుయోధనుడు. అలావెళ్లిన ప్రాతిగామి ద్రౌపదితో ఇలా అన్నాడు.

**ద్రౌపదివస్త్రాపహరణంఘట్టం :**

ధర్మరాజు జూదమాడి కౌరవులకు తనసంపదలను, రాజ్యాన్ని, తమ్ములను, తనను నిన్నూ ఓడిపోయాడు. పద్మాక్షి! కౌరవ శ్రేష్టుడైన దుర్యోధనుని పనిమీద నిన్ను వేగమే తోడుకొని పోవటానికి వచ్చాను. కౌరవేశ్వరుడి దగ్గరికిరా' అనిఅనగా ద్రౌపది అతనితో ఇలా అన్నది.

తే. మున్నుదన్నోటువడిమఱినన్నునోటు
వడియెనోనన్నుమున్నోటువడివిభుండు
గ్రన్నఉదన్నోటువడియెనోయన్న! నాకు !
నెఱుఉగఉజెప్పుముదీనినీవెఱుఉగుదేని.

(ఆ.మ.భా 2-2-209.)

నాభర్త మొదట తన్నోడి తరువాత నన్నోడెనా? లేక ముందే నన్నోడి తరువాత తానోడెనా? అన్నా! నీకు తెలిస్తే ఈసంగతి నాకు చెప్పు అని పదునైన ప్రశ్న ద్రౌపది వేసింది. సాధారణంగా అంతఃపురకాంతలు ఇంతవాడి వున్న మాటలు వాడేసాహసం చేయరు కానీ ద్రౌపది అగ్నిలో నుండి ఉద్భవించిన ధీరవనిత కాబట్టి ద్రౌపది నుండి ఈమాటలు ఊహింపదగినవే. ఆవెంటనే ప్రాతిగామితో ద్రౌపది అన్నమాటలు విన్న దుర్యోధనుడు దుశ్శాసనున్ని పంపి తీసుకురమ్మన్నాడు. ఆదుశ్శాసనుడు రాజసూయ యాగం చివర బ్రాహ్మణుల మంత్రాలచేత పవిత్రమైన నీటిదారలతో పావనాలైన తలవెంట్రుకలను పట్టి అందరూ భయపడి చూస్తుండగా సభకు ఈడ్చుకొని వచ్చాడు. అప్పుడు ద్రౌపది సభలోని పెద్దలను ఉద్దేశించి.

చ. 'ఇది యుచితంబుగాదనకయిక్కురు ముఖ్యులు
సూచుచుండదు
ర్మదుడయివీడు నన్నునవమానితజేసెడి
సర్వధర్మసం
విదులననున్న యీభారతవీరుల వంశము
నేడధర్మసం
పదనతినింద్యమయ్యె'నని భామిని గృష్ణుదలంచి
భీతయై.

(ఆ.మ.భా.సభాపర్వం)

'ఈవిధంగా నన్ను జుట్టు పట్టి ఈడ్చు కొనిరావడం ఉచితం కాదని భావించక, ఈ కురువంశ ప్రముఖులంతా చూస్తుండగా, క్రొవ్విన ఈదుశ్శాసనుడు నన్నవమానిస్తు న్నాడు. అన్ని ధర్మాలు పూర్తిగా తెలిసినవాళ్లని పేరుపొందిన ఈ భరతవీరుల వంశం ఈనాడు అధర్మం పెరగటంచేత ఎంతో నిందించదగినది అయిందని' కోపించిన ద్రౌపది భయపడి శ్రీకృష్ణునిస్మరించింది. ఆ వస్త్రాపహరణం జరగబోతుండగా శ్రీకృష్ణమాయచేత రక్షింపబడింది. అలా ద్రౌపది జీవితంలో ఆరోజు ఒక చీకటిరోజుగా మిగిలింది. ఆతర్వాత జరిగిన పరిణామాల చేత పదమూడు సంవత్స రాలు అరణ్యవాసం మరియు అజ్ఞాతవాసం అనుభ వించాల్సి వచ్చింది. ద్రౌపది పాండవుల వెంట అరణ్య వాసానికి వెళ్లిన తీరుతెన్నులు విదురుడు దృతరాష్ట్రునికి ఇలా తెలిపాడు.

చ. తడసినఏకవస్త్రపరిదానముతోడవిముక్తకేశియై
తొడరుచుదుఃఖ భావమున ద్రోపదివోయెమహా
పాపంబునం
బడిననిజేశమిత్ర సుతబంధు జనంబులశోక
వేదనం

గడుకొనియిట్లయేగుదురు కౌరవభామినుల
వ్విధంబునన్.

(ఆ.మ.భా.సభాపర్వం)

పద్నాలుగు సంవత్సరాల తర్వాత కౌరవ పత్ను లందరూ తనలాగా జుట్టు విరబోసుకొని దుఃఖసాగరంలో మునుగుతారని భావి సూచనను తెలియజేస్తూ ద్రౌపది అలా వెళ్ళిందంటాడు.

## ద్రౌపదిఅరణ్య మరియు అజ్ఞాతవాస కాలం :

అరణ్యవాసంలో ద్రౌపదికి సూర్యునికి పట్టిన గ్రహణంలాగా సైంధవుని (జయద్రధుడు) రూపంలో ఊహించని సమస్య ఏర్పడింది. పాండవులు ఐదుగురు నలుదిక్కులకు వేటకువెళ్లిన సమయంలో సైంధవుడు పాండవులు నివసిస్తున్న కుటీరం దగ్గరికి వచ్చి కుశల ప్రశ్నలువేసాడు. ద్రౌపది కూడా కుశల ప్రశ్నలు వేసింది. ఓజయద్రధా! నీవు ఇప్పుడు పాండవులకు అతిథివి కావున దయచేసీ ఉచితాసనాన్ని స్వీకరించి రుచికరమైన లేడి మాంసాలతో విందుభోజనం ఆరగించుము పాండవులు వేటకు వెళ్లి తిరిగి వచ్చాక నీకు తగిన మర్యాదలు చేయ గలరు అని చెప్పింది. కానీ ఆ జయద్రధుడు తన హృదయం మన్మధుడి బాణాల చేత తూట్లుపడిందని నన్నువరించు అని ధనంలేని దరిద్రుల దగ్గర ఏమి సుఖం పొందుతావని, తాను సింధూరాజునని నన్నుయేలు కొనుము అని పలికాడు. ఆమాటలకు ద్రౌపది హృదయం కంపించింది. మీరు నాకు సోదర సమానుడని ఇలాంటి మాటలు నాకు తగవని పలికింది. అందుకు సైంధవుడు "రాజులకు ఇలాంటి పట్టింపులు ఉండవని అసలు ఆడవారు ఒకరికి మాత్రమే సొత్తు అనటానికి ఏదైనా హద్దు ఉన్నదా? లేదు కదా' అన్నాడు.

ఆమాటలకు ద్రౌపది కోపకంపితురాలై ఈవిధంగా చెప్పింది.

చ: ప్రకటితశౌర్యసారులనభగ్నపరాక్రమనిర్జితాహిత
ప్రకరుల ఉబాండునందనుల ఉబాండు
యశస్కులనాత్మలో దలం
పకనను ధిక్కరించెదున్నృపాలకు లాధమ!
నీదుగర్వదు
ర్వికసనమింత ఉబోదుతుది వ్రేఉగగుఉదక్కు
ముదుప్రలాపముల్.

(ఆ.మ.భా 3.6.174)

రాజుల వంశంలో జన్మించిన ఓనీచుడా, జయద్రధా! పాండవులు గొప్ప పరాక్రమవంతులైన సంగతి ప్రపంచా నికి ఇదివరకే రుజువైన విషయం, మొక్కవోని శౌర్యంతో పాండవులు శత్రుసమూహాలను నిర్జించి ఉన్నారు. నిష్కళంక యశస్సును ఆర్జించిన పాండవులను లెక్క చేయక నీవు నన్ను అవమానిస్తున్నావు. ఇక నీఅహంకార పూరితమైన ప్రేలాపన కట్టిపెట్టుము. ఇంతటితో ఆగకపోతే చివరకు దుర్భరమైన ఫలితాన్ని చవిచూడవలసి వస్తుందని పలికింది.

ఆ తర్వాత సైంధవుడు ఆమాటలు లెక్కచేయక బలవంతంగా ద్రౌపదిని ఎత్తుకొనిపోతున్న అతనితో యుద్ధంచేసి చివరికి సైంధవునికి శిరోముండనంచేయించి, ఇప్పటి నుండి వీడు పాండవదాసుడిని ప్రకటించి వదిలి వేశారు. ఇక విరాటపర్వంలో కూడా సరిగ్గా ఇటువంటి సంఘటనే ఎదురైంది. అప్పుడు కూడా ద్రౌపది ఎదుటి వాడిని లెక్కచేసేది కాదు. ఆసందర్భంలోనే కీచకుడు (సింహబలుడు) తనపట్ల వ్యవహరించిన తీరును ధైర్యంగా వీరవనితలా ఎదుర్కొంది. అరణ్యవాసం పూర్తి చేసుకుని అజ్ఞాతవాసం చేయాలని విరాటుని కొలువులో సైరంధ్రిగా సుధేష్ణదేవి దగ్గర తలదాచుకున్న సందర్భంలో సుధేష్ణదేవి సోదరుడైన మరియు విరాటరాజ్యానికి అనధికారరాజైన సింహబలుడు (కీచకుడు) ద్రౌపదిసౌందర్యానికి ముగ్ధుడై ఆమెను లొంగదీసుకోవాలని చేయని ప్రయత్నంలేదు. అప్పుడు ద్రౌపది 'వీడు నీచుడు కాబట్టి భయపెట్టితేగాని తొలగిపోడని' భావించి గట్టిగా ఇలా చెప్పింది.

శా. దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక
ప్రతాపస్ఫుర

ధ్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్మత్పతు
ల్గీర్వాణాకృతులేవురిప్డునినుదోర్లీలన్వెసన్గిట్టిగం
ధర్వుల్మానము ప్రాణముంగొనుట తథ్యం
బెమ్మెయింగీచకా!

(ఆ.మ.భా.విరాట పర్వం)

ఒరీ!కీచకా! వారించడానికి వీలులేని భుజబల పరాక్రమం కలిగి, గర్విష్టులైన శత్రువులను అవలీలగా వధించి కీర్తిగాంచిన ఐదుగురు గంధర్వులు నాభర్తలు. వారు ఇప్పుడే అవలీలగా నీమానప్రాణాలు హరిస్తారు సుమా! అనిహెచ్చరించింది. ఆస్థితిలో కీచకున్ని భయ పెట్టడానికి, ఆమెకు ఉన్న కోపాన్ని వెలిబుచ్చడానికి తిక్కనగారు గంభీరమైన శైలిని మరియు శార్దూల వృత్తాన్ని ఎంచుకున్నాడు. ఇందులో ద్రౌపది, ఓరీకీచకా! అని సంబోదించింది. అదే ఇంతకు ముందు సైంధవున్ని నాకు సోదరుడవని చెప్పింది. ఇక్కడ అన్నలాంటివాడవని చెప్పేసమయం దాటిపోయింది. కనుక ద్రౌపది ఇటువంటి పరుషమైన పదాలను ఉపయోగించవలసి వచ్చింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో భీమసేనుడు కీచకున్ని అత్యంత దారుణంగా హతమార్చి ద్రౌపదికి శాంతి చేకూర్చాడు.

ఇలా భారతంలో ద్రౌపది ద్రుపదరాజు కూతురుగా పుట్టి, పాండవులకు భార్యయైన, కురుక్షేత్ర అనంతరం ధర్మరాజుకు పట్టపురాణియై వెలుగొంది, చివరికి మేరుపర్వత సమీపంలో మహాప్రస్థానం చేస్తూ అసువులు బాసింది. బతికినంత కాలం కష్టాలు లెక్క చేయకుండా చైతన్య శీలిగా బతికిన ధీశాలి ద్రౌపది అని నిరూపించడ మైనది.

## ఆధార గ్రంథాలు

1. ఆంధ్ర మహాభారతం ఆది పర్వం - తి.తి.దే.ప్రచురణలు
2. ఆంధ్ర మహాభారతం సభా పర్వం - తి.తి.దే.ప్రచురణలు
3. ఆంధ్ర మహాభారతం అరణ్య పర్వం - తి.తి.దే.ప్రచురణలు
4. మహాభారతం - పిలాక గణపతి శాస్త్రి
5. ద్రౌపది నవల - ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

❀ ❀ ❀

# మహాభారతంలో సహనం కలిగిన స్త్రీమూర్తులు

- డా॥. బి. మేరికుమారి, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, జె.యం.జె. మహిళా కళాశాల, తెనాలి.

**సత్యవతి :**

ఈమె దాశరాజు కూతురు. పడవ నడిపేది. పరాశరుడు అనే ముని వల్ల వ్యాసుడు పుడతాడు. పిల్లవాడు 12 ఏళ్ళ ప్రాయంతో పుట్టి, నువ్వు ఎప్పుడు కోరుకున్నా నేను అప్పుడు ప్రత్యక్షమౌతానని చెప్పి వెళ్ళిపోయాడు. తరువాత శంతనుడు గంగా తీరానికి వెళ్ళినపుడు ఈమె కన్పిస్తుంది. ఈమెను మోహించి ఆమెతో వివాహం జరిపించమని ఆమె తండ్రిని అడుగుతాడు. అందుకు దాశరాజు నీ మొదటి భార్యకు పిల్లవాడు వున్నాడు. ఇప్పుడు నా కూతురుని ఇచ్చి పెళ్ళి జరిపిస్తే నా కూతురుకు పుట్టే పిల్లలకు రాజ్యాధికారం ఉండదు కదా అంటాడు. ఈ విషయం తెలుసుకున్న గాంగేయుడు దాశరాజుతో మాట్లాడి సత్యవతికి, శంత నుడికి పెళ్ళి జరిపిస్తాడు. తర్వాత ఈమెకు చిత్రవీర్యుడు, విచిత్ర వీర్యుడు అనే ఇద్దరు కుమారులు పుడతారు. వీరిద్దరు చనిపోతారు. తర్వాత తన వంశం నిలబడదని గాంగేయుడిని వివాహం చేసుకోమంటుంది. అతను చేసుకోను అని చెప్పటంతో, అతనికి తన గతం చెప్పి వ్యాసుడిని పిలిపించి, వ్యాసుడు ద్వారా వంశాన్ని నిలబెట్టిస్తుంది. వ్యాసునికి ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు అనే ముగ్గురు కొడుకులు పడతారు. ఈవిధంగా ఆరిపోతున్న వంశాన్ని నిలబెట్టిన వనితగా గుర్తించవచ్చు. తనకు వచ్చిన కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న స్త్రీగా తెలుసుకోవచ్చు.

**కుంతి :**

మహాభారతంలో కుంతి అసలు పేరు పృధ. కుంతి భోజుడనే రాజు కూతురు. కనుక ఈమెకు కుంతీదేవి అనే పేరు వచ్చింది. ఆమె పాండవుల తల్లి. పాండురాజు భార్య, వసుదేవుని చెల్లెలు, శ్రీకృష్ణుని మేనత్త, యాదవుల ఆడబిడ్డ. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. కుంతి చిన్ననాడే చాలా బుద్ధిమంతురాలు అనిపించుకుంది. ఆమెను చూస్తే పెద్దలకు ముద్దు వచ్చేది. తండ్రి ఆజ్ఞ ప్రకారం ఇంటికి వచ్చిన అతిథికి పాదాభివందనం చేసేవారు. అలాగే ఆకస్మికంగా దుర్వాసుడనే ఋషి వచ్చాడు. ఆయనను చూస్తే అందరికి భయమే. ఆయనకు కోపం ముక్కుమీద. ఆయన శపిస్తే తిరుగలేదు. అలాంటి దుర్వాసునికి ఓర్పుతో సేవచేసి ఓర్పులో భూదేవి వంటిది అని అనిపించుకున్నది. ఆమె చేసిన పరిచర్యకు ముని సంతోషపడి నీకు ఏమి కావాలో అడుగు ఇస్తాను అన్నాడు. నాకు కావలసినది ఏమున్నది మీరు ప్రసన్నులయ్యారు అదే పదివేలు అని అన్నది. నీవు పసిదానవు నీకు తెలియదు. అడుగలేకున్నావు నీకు ఒక మంత్రాన్ని ఇస్తాను తీసుకో. నీవు ఏ దేవుడిని పిలిస్తే ఆ దేవుడు నీ దగ్గరకు వస్తాడు. నీకు వరాన్ని ప్రసాదిస్తాడు అని చెప్తాడు. కుంతి మారు మాటాడకుండ మంత్రంను స్వీకరించింది.

ఒకనాడు ప్రొద్దుపొడుపున స్వామీ! సహజ కుండలాలతో వజ్ర కవచంతో మిరమిట్లు గొలిపే తేజస్సుతో నీలాగే చూడ ముచ్చటగా ఉండే కుమారుని నాకు ప్రసాదిస్తారు? అంటూ అప్రయత్నంగా దుర్వాసుడు ఇచ్చిన మంత్రం జపించింది. సూర్యభగవానుడు ప్రత్యక్షమయ్యాడు. ఇంతపని జరుగుతుందని నేను అనుకోలేదు. 'అయ్యా'! నేను కన్యను, నేను గర్భవతినైతే తల్లిదండ్రులు, చుట్టుప్రక్కల నున్న వారు నన్ను చూసి నవ్వుతారు. నేను బ్రతకలేను నన్ను రక్షించు అంటుంది అప్పుడు సూర్యుడు కమలాక్షి ! నీ కన్యత్వం చెడదు. నీకు లోకోపవాదం రాదు నేను వరమిస్తున్నాను. అన్నాడు. ఇటువంటి బిడ్డ లోకంలో ఎవరికైనా జన్మించాడా? నాకు జన్మించాడు. ఇది భాగ్యం అనుకోవాలా, అని లోలోపల కుమిలిపోయింది. లోకోపవాదం భయం ఆమెను దావాగ్నిలా చుట్టు ముట్టింది ఆమె మనసులో మెరిసిన ఊహలో ఆ బాలుడిని బుట్టలో పెట్టి అశ్వనది ప్రవాహములో

వదిలింది. నీవుఎక్కడ వున్నా నీ చెవిపోగులు తళతళలాడే నీ ముఖ వర్చసు చూసి నిన్ను గుర్తు పడతాను అని అంటూ బావురమని చెప్పింది. బావురుమని ఏడ్చింది.

కుంతికి పాండురాజుతో పెళ్ళి అయిన దగ్గర నుండి కష్టాలు మొదలయ్యాయి. ఆమెకు పుట్టిన ముగ్గురు కుమారులు కూడ మంత్ర ప్రభావంతో పుట్టినవారు భర్త పాండురాజు చనిపోయాక భీష్మని ఆజ్ఞ ప్రకారము పంచ పాండవులను తీసుకుని హస్తినా పురానికి వచ్చింది. కౌరవులు, పాండువులను రకరకాల కష్టాలకు గురి చేసినప్పుడు ఓర్పుతో సహించింది. అర్జునుడు ద్రౌపదిని తీసుకొని వచ్చినప్పుడు పండులాగా భావించి అందరు పంచుకోండి అని చెప్పింది. కొడుకులతోపాటు అరణ్య వాసానికి వెళతాను అని ధృతరాష్ట్రుని అడిగినప్పుడు నీవు మా దగ్గరే ఉంటానని మాట ఇచ్చావు అంటాడు. యుద్ధంలో తన కొడుకుల కోసం, చిన్నప్పుడు వదిలిపెట్టిన కర్ణుడు తన కొడుకేనని తెల్సుకుని అతని దగ్గరకు వెళ్ళి ప్రాణ దానం చెయ్యమని బ్రతిమిలాడుతుంది. పాండవులకు, కౌరవులకు కురుక్షేత్రం జరుగుతుంది అని అనుకున్నప్పుడు మీరు రాకుమారులు, ఒక రాజ పుత్రులు, మీ కర్తవ్యాన్ని మీరు నిర్వహించండి అని కుమారులకు ధైర్యం చెప్తుంది. ఈ విధంగా చరిత్రలో కుంతు అంటే సహనానికి ప్రతీక అని ఐదుగురు పిల్లలకు తల్లి అని, ప్రజలు మెచ్చుకునే రాకుమారులకు తల్లి అయిందని కీర్తిస్తారు.

**ద్రౌపది :**

ద్రౌపది ద్రుపద మహారాజు పుత్రిక. పాండవుల భార్య, దృష్టద్యుమ్నుడు సోదరి ద్రౌపదికి వివాహం చేయటానికి పాండవులు చనిపోయారని ద్రపదుడు స్వయంవరం ఏర్పాటు చేశాడు. ఆ స్వయంవరంలో పాండవులలో మధ్యముడైన అర్జునుడు దక్కించుకొని ఇంటికి వచ్చి తల్లి అయిన కుంతితో చెప్పగా ఆమె పంచుకోమని చెప్తుంది. ఆవిధంగా ద్రౌపదికి ఐదుగురు భర్తలు అయ్యారు. వివాహము చేసుకున్నప్పటి నుండి కష్టాలను అనుభవిస్తూనే ఉంది ధర్మరాజు మాయా జూదంలో ఓడిపోయినపుడు ద్రౌపదిని, అతని తమ్ముళ్ళను కూడా జూదంలో పెట్టి ఓడిపోయాడు. అందువల్ల దుర్యోధనుడు ద్రౌపదిని బానిస అని అంతపురంలో ఉన్న ఆమెను తీసుకొని రమ్మంటాడు. ఆ సమయంలో నేను రాకూడదు అని చెప్పినా వినిపించుకోకుండా జుట్టుపట్టుకొని లాక్కొస్తాడు దుశ్శాసనుడు. దుర్యోధనుడు వచ్చి ఆమెను తన తొడల మీద కూర్చోమంటాడు. ఆమె భర్తల ముందే ఆమె వస్త్రాన్ని లాగేయగ శ్రీకృష్ణుడు ఆమెను కాపాడినాడు. భర్తలతోపాటు ఆమె అరణ్యా వాసం, అజ్ఞాతవాసం చేసింది. ఈ అజ్ఞాతవాసంలో విరాట రాజు భార్యకు దాసీగా పనిచేసింది.

విరాటరాజు బావమర్ది కీచకుడు కన్ను శైరంధ్రి మీద పడడంతో భీముడు అతన్ని చంపి ద్రౌపదిని రక్షించాడు. వనవాసం పూర్తి అయ్యాక, సంధి విషయంలో వెనుకకు తగ్గవద్దని ధర్మాన్నే కోరుకుంటున్నానని శ్రీకృష్ణునితో చెప్తుంది. యుద్ధంలో దుశ్శాసనుని రక్తంతో తన యొక్క వెంట్రుకలను శుద్ధి చేసుకుంటుంది. అశ్వత్థామ తన పుత్రులను చంపినపుడు, భర్తలతో అతనిని చంపి పగతీర్చు కొమ్మని చెప్తుంది. అశ్వత్థామ ఓడిపోయి తలపై ఉన్న చూడామణి కోసి ఇవ్వటంతో ఆమె కోపం చల్లారుతుంది. యుద్ధం అయిపోయాక ధర్మరాజుని పట్టాభిషేకానికి ఒప్పించే బాధ్యత ద్రౌపది తీసుకోవలసి వచ్చింది తర్వాత కొంతకాలం హస్తినాపురానికి పట్టమహిషిగా జీవించింది. చరిత్రలో ఎవ్వరికి జరగని అవమానాలు అవహేళనలు అన్ని అధిగమించి చివరి గమ్యానికి చేరుకుంది. ఈమెకు కూడా ఓర్పు ఎక్కువ, తనకున్న ధర్మ సంకటాలు అన్ని శ్రీకృష్ణుడిని, వ్యాసుడిని అడిగి తీర్చుకునేది. ఇంతటి ఓర్పు కలిగి స్త్రీ మూర్తులు భారతంలో ఇద్దరే ఇద్దరూ వారు ఒకరు కుంతీదేవి, మరొక ఆమె ద్రౌపది. వీరిద్దరి మధ్య తెలియని బంధం కన్పిస్తుంది. ఒకామె ఐదుగురు పుత్రులకు తల్లిగా పేరు తెచ్చుకున్నది. మరొక ఆమె ఐదుగురు భర్తలకు భార్యగా జీవన యాగం పూర్తి చేస్తుంది.

**ఆధార గ్రంధాలు :** మహాభారతం

# కాలువ మల్లయ్య గలుమ కథలో స్త్రీ పాత్రల విశ్లేషణ

- ఎ. నిరోష, అతిథి అధ్యాపకురాలు, ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కరీంనగర్.

తెలంగాణ కథా సాహిత్యంలో కాలువ మల్లయ్య అగ్రగణ్యులు. వీరి కథల్లో స్త్రీల జీవితంలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. కాలువ మల్లయ్య కథల్లోని స్త్రీ పాత్రల జీవితాల్లో కష్టాలు, కన్నీళ్లు, చైతన్య భావాలు కనిపిస్తాయి. వీరి కథల్ని స్త్రీవాద దృక్పథంతో పరిశీలించి నట్లయితే తెలంగాణ భూస్వామ్య వ్యవస్థ నుండి నేటి వరకు గల జీవితాల్లోని సమస్యల్ని కథా వస్తువులుగా స్వీకరించారని చెప్పవచ్చు. ఇవి తెలంగాణ లోని మూడు తరాల స్త్రీల జీవితాల్ని ఆకలింపు చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో శ్రామిక, పీడిత వర్గాలలోని స్త్రీలు చదువు వల్ల ప్రభావితులై తరతరాలుగా వస్తున్న పరాధీన భావజాలం నుండి విముక్తి పొందినట్లు చూపించారు. తద్వార స్త్రీలు స్వావలంబన దిశగా అడుగులేస్తున్నట్లు, సామాజిక పరిణామాల్ని చిత్రించారు. అంతేకాకుండా ఆధునిక కాలంలో స్త్రీ కోరు కుంటున్న స్వేచ్ఛ, మగవాళ్లతో సమానంగా గుర్తింప బడాలని ఆకాంక్షను ఆయా కథల్లో కళ్లకు కట్టినట్లు వెల్లడించారు. మహిళా చైతన్యానికి దోహదపడే విధంగా కథలు రాసి కాలువ మల్లయ్య స్త్రీ జాతి పట్ల తనకున్న గౌరవాన్ని నిరూపించుకున్నారు.

కాలువ మల్లయ్య రాసిన ''గలుమ'' కథలో పురుషాధిక్య సమాజంలో వివిధ దశలలో స్త్రీలు పడుతున్న బాదలను, అగచాట్లను చక్కగా చూపించారు. ఈ కథలోని రాజమ్మ పాత్ర లాంటి ఎంతో మంది స్త్రీలు ఇంకా అలాంటి బాధలను అనుభవిస్తున్నారు. సంపాదన కోసం భర్తలు విదేశాలకు వెళ్తే కుటుంబ భారాన్ని మోసే స్త్రీల కష్టం వర్ణనాతీతం. విదేశాల నుండి డబ్బు పంపించడం భర్త బాధ్యత కాని స్వదేశంలో ఆమె మాత్రం పిల్లలను పెంచడంలో, అప్పులు తీర్చడంలో, బంధువులకు కానుకలు పెట్టడంలో, పంపిన డబ్బు లెక్కలు చెప్పడంలో ఇలా అనేక విధాలుగా తలామునకలవుతుంది. పండుగ పబ్బాలు, పిల్లలకు ఆరోగ్యం బాగా లేనప్పుడు ఒంటరిగా ఆమె పడే బాధ సమాజంలో ఎవ్వరికి కనిపించవు. కానీ భర్త డబ్బులు పంపిస్తే తిని కూర్చోవడం మాత్రమే అందరికి కనిపిస్తుంది. ఇలాంటి ఒంటరి బ్రతుకులో ఇరుగు పొరుగు వారి సహాయం కోరితే దానికి సమాజం పెట్టే పేరే వేరు. గలుమ కథలో మల్శీశ్వరి అన్నట్టు "విదేశాలకు వెళ్లి ఎంతో కష్టపడి డబ్బు సంపాదించి వచ్చాడన్న పేరొచ్చింది రాజమ్మ భర్తకు మరి రాజమ్మకు ఏమి మిగిలింది"? (ఆంధ్రజ్యోతి 12 మార్చి 1995-కాలువ మల్లయ్య కథలు)

ఇప్పటికి రాజమ్మ లాంటి స్త్రీలు ఎందలో ఎన్నో కష్టాలు పడుతూ కుటుంబ భారాన్ని మోస్తున్నారు. కాని వారు పడే కష్టాలను గుర్తించక పోగా సమాజం "భర్త కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని డబ్బులు పంపిస్తే తింటు తిరుగుతుందని" వక్ర దృష్టితో చూస్తుంది.

ఈ కథలోని మరో పాత్ర నర్సమ్మ. ఆమె భర్త అన్నల్లో కలిసిపోయాడు. కాని నర్సమ్మ మాత్రం పోలీసుల వళ్ల, ఇరుగు పొరుగు వాళ్ల వల్ల నరకయాతన అనుభవించింది. ఆమెను, ఆమె పిల్లలను అందరు దేశ ద్రోహులుగా చూస్తుంటే తట్టుకోలేక పోయింది. పోలీసులు భర్త ఎక్కడో చెప్పమని ప్రశ్నల వర్షం కురిపించేవారు. ఇంకోపక్క ఆర్థిక దుస్థితి. ఇన్ని బాధలను ఆమె తట్టుకొని జీవచ్ఛవంలా బ్రతికింది. కాని, "అతనికి పోరాటంలో మరణించిన వ్యక్తిగా గత చరిత్రనైనా మిగిలింది, ఎన్నో వేదనల కోర్చుకొని సంసారాన్ని మోసుకొస్తున్న నర్సమ్మకు ఏం మిగిలింది"? (ఆంధ్రజ్యోతి 12 మార్చి 1995).

మల్లీశ్వరి అమ్మ పాత్ర ద్వారా కాలువ మల్లయ్య గారు కుటుంబంలోని స్త్రీకి గల స్థానం ఎలా ఉందో కళ్లకు

కట్టినట్లుగా చూపించారు. స్త్రీ అంటే కేవలం ఇంటి పనులు, వంట పనులు చేయడం, పిల్లల పెంపకం మాత్రమే. కుటుంబ నిర్ణయాల్లో తనకు స్థానం గాని, తన అభిప్రాయాలకు గౌరవం గాని లేవు. చివరికి నవ మాసాలు మోసి తన ఊపిరితో అల్లుకున్న బంధమైన తన బిడ్డ భవిష్యత్తుకు సంబంధించిన విషయాలలో కూడా తనకు అధికారం లేదు. ఇవన్నింటికి కారణం స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం అని చెప్పవచ్చు. "గవ్వ కూడా రాని గానుగెద్దు లాంటి చాకిరి" స్త్రీది. ఈ కథలో ప్రధాన పాత్ర మల్లీశ్వరి. ఈ పాత్ర ఆధునిక అభ్యుదయ భావాజాలం కలిగిన స్త్రీ. ఆమె బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలని కళలు కంటుంది. కాని తండ్రి మాత్రం కూతురు బాగా చదివితే తనకు అంతకంటే ఉన్నత చదువులు చదివిన భర్తను తేవాలనే ఉద్ధేశంతో ఆమెకు వివాహం జరిపిస్తాడు.

"పెళ్లంటే పెద్ద శిక్ష - మగడంటే స్వేచ్ఛా భక్షకుడు" (సావిత్రి బందిపోట్లు) అన్నట్లుగానే మల్లీశ్వరి చదువు కున్నప్పటికి తన భర్త తనని ఉద్యోగానికి వెల్లనివ్వలేదు. ఈ కథలో కాలువ మల్లయ్య సమాజంలో వివిధ దశలలో స్త్రీ అభిప్రాయాలను, భావాలను ఎలా అణిచి వేస్తున్నారో చూపించారు. ఎన్ని చట్టాలు వచ్చిన, ఎన్ని ఉన్నత చదువులు చదివిన, ఏ స్థాయిలో ఉన్నా ఈ సమాజంలో పురుషాధిక్యం మాత్రం మారడం లేదు. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో పుత్రునిపై ఆధారపడాల్సిందేనని మను సిద్ధాంతం ఇంకా అను సరించబడుతూనే ఉంది. అంటే స్త్రీ వ్యక్తిత్వానికి చోటే లేదా? ఆమె ఎప్పుడు ఎవరో ఒకరి మీద ఆధార పడాల్సిందేనా? తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు లేదా? అని ఈ కథ చదువుతున్నప్పుడు అనిపిస్తుంది.

కాలువ మల్లయ్య ఈ కథలో పేరుకు తగ్గట్టుగానే "గలుమ"ల దగ్గరే తరతరాలుగా ఆడవాళ్ల నిరీక్షణను చూపించాడు. తండ్రి కోసం, భర్త కోసం, పిల్లల కోసం స్త్రీ నిరీక్షిస్తూ............. నిరీక్షిస్తూ ........... కన్నులు కాయలు కాసే వారకు ఎదురు చూస్తూనే ఉంటుంది. స్త్రీ బాధ ఆ ఒక్క "గలుమ" కి మాత్రమే తెలుసు. తెలిసినా ఏం లాభం అది మాట్లాడలేదు, పైగా తీర్చలేదు కదా. ఇందులోని ముగింపు నాకు నచ్చింది. మల్లీశ్వరి తన భర్తతో తన కూతురి చదువు గురించి మాట్లాడుతుంది. తన భర్త మాత్రం కూతురు చదువుకుంటే "చదువు పెరిగితే అంతకు తగ్గ వరుడు దొరకడం కష్టం, కట్నం కూడా భారీగా ఇవ్వాల్సిందే" అంటాడు. కాని మల్లీశ్వరి మాత్రం తన తల్లిలా కాక తన భర్తతో వాదించి తన కూతుర్ని చదివించడానికి ఒప్పిస్తుంది. ఆకాశంలో సగమైన స్త్రీకి ఇంట్లో సమాన స్థానం ఇస్తే చాలు. తనను దేవతలా కొలవడం కాదు సాటి మనిషిలా గౌరవిస్తే చాలు అని కోరుకుంటుంది.

## ఆధార గ్రంథాలు

1. గలుమ, కాలువ మల్లయ్య, ఆంధ్రజ్యోతి, 12 మార్చి 1995
2. కాలువ మల్లయ్య కథలు - తెలంగాణా జన జీవితం, ప్రొఫెసర్ బన్న ఐలయ్య
3. తొమ్మది పదుల తెలంగాణ కథ, డా॥ కాలువ మల్లయ్య
4. విప్లవ సాహిత్యం ఒక పాయ మాత్రమే, కాలువ మల్లయ్య సాహితా వ్యాసం
5. ప్రస్తుత తెలుగు కథ - ఒక జీవన కఠోర వాస్తవం, వి.ప్రతిమ, ఈ మాట

# కోటి నదులు నవల – త్రివేణి పాత్ర చిత్రణ

– ఎం. పవన్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, నెట్ (ఎస్.ఆర్.ఎఫ్), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

సృష్టికి మూలం స్త్రీ. స్త్రీ లేకపోతే సృష్టే లేదు. స్త్రీ లేకపోతే మానవ జీవన మనుగడే లేదు. ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది. ఎవరు ఔనన్నా ఎవరు కాదన్నా ఇది నగ్న సత్యం అనే మాటలు ప్రతిరోజూ ప్రతి నోటి వెంటా వింటూనే ఉంటాం. అయితే నాటి నుండి నేటి వరకు స్త్రీ జీవన విధానంలో ఎటువంటి మార్పులు కానరావు. స్త్రీకి ఒరిగింది అంటూ ఏమీ లేదు. ఎంతోమందికవులు, రచయితలు, కవయిత్రులు, రచయిత్రులు వస్తువుగా స్త్రీనే తీసుకోవడం కనిపిస్తుంది. అయితే నాటి ప్రాచీన సాహిత్యంలో స్త్రీ యొక్క అంగాంగ వర్ణననే కనిపిస్తుంది. దీనివలన స్త్రీ యొక్క విలువ పెరగక పోగా దిగజారడం జరుగుతుంది.కాని ఆధునిక సాహిత్యంలో అలా కాదు. స్త్రీ సమస్యనే వస్తువుగా స్వీకరించి, స్త్రీ అభ్యున్నతికి పాటుపడినవారు ఎంతోమంది ఉన్నారు. స్త్రీని ఆధారంగా చేసుకొని తెలుగులో అనేక సాహిత్య ప్రక్రియలు తన మనుగడను కొనసాగిస్తూ వస్తున్నాయి. స్త్రీ సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, ఒక తల్లిగా, ఒక చెల్లిగా, ఒక భార్యగానే ఇంటికి పరిమితమై స్వేచ్ఛను కోల్పోతూ ఉంది. ఎంత పెద్ద ఉద్యోగం చేసినా ఎన్ని లక్షలు సంపాదించిన స్త్రీ పరిస్థితి అలాగనే ఉంది. ఈ విషయం ప్రతి ఒక్కరూ గమనించాలి. నాటి కాలంలో స్త్రీ బాల్య వివాహాలు, సతీసహగమనం, దేవదాసిని అనే పేర్లతో నలిగిపోతూ వచ్చింది. కాని నేటి ఆధునిక కాలంలో స్త్రీ అత్యాచారాల పేరుతో దహించబడుతూనే ఉంది. కాలం మారినా స్త్రీ పరిస్థితి మటుకు మారలేదు. ఈ విషయాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని స్త్రీ విముక్తి కోసం ఎంతోమంది రచయితలు రచయిత్రులు తమ వంతు కృషిని చేస్తూనే ఉన్నారు. కోటి నదులు నవలలోని త్రివేణి అలా కాదు. ఈమె పడిన కష్టం భిన్నమైనది. ఈమె తను ప్రేమించిన వ్యక్తిని ఎలా వివాహం చేసుకుంది, ఆమె ఏయే కష్టాలు అనుభవించింది అనే విషయాలను రచయిత కాళీపాకం లింగన్న అద్భుతంగా వివరించాడు.

ఏ స్త్రీకైనా సకల సౌకర్యాలు అనుభవించాలని, తన స్థాయిని పెంచుకోవాలని, తనకు నచ్చిన వ్యక్తిని భర్తగా పొందాలని, పిల్లా పాపలతో, సుఖసంతోషాలు అనుభవిస్తూ జీవనం కొనసాగించాలనే ఆశలు ఉంటాయి. కాని కోటి నదులు నవలలోని త్రివేణి ఆ లక్షణాలు కలిగిన స్త్రీ కాదు. వీటన్నింటికి భిన్నంగా కనిపిస్తూనే ఉంటుది. సాధారణ కోరికలు గల స్త్రీలా మాత్రమే కనిపిస్తుంది. సినిమా చూడాలనే ఆశా లేదు, ఫోటో దిగాలనే కోరికా లేదు. స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకోవాలనే ఆరాటము లేదు. కోటి నదులు నవలా రచయిత కాళీపాకం లింగన్న త్రివేణి పాత్రను అలా తీర్చిదిద్దలేదు. సాధారణ లక్షణాలు కలిగిన స్త్రీగానే చిత్రీకరించాడు.

కథానాయకుడు విశ్వం త్రివేణిని ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకు వెల్దాం వస్తావా అని అడిగినప్పుడు త్రివేణి 'దేనికైనా పెద్దల్ని సంప్రదించాలిగా' అని బదులిస్తుంది. అంటే దీనిని బట్టి త్రివేణి సంస్కారం ఎటువంటిదో మనం అంచాన వేయవచ్చు.

అరగంట తర్వాత త్రివేణి ఒంటరితనం గుర్తించి విశ్వం ఆమెను సమీపించాడు. ఏమిటి అన్నట్టు తలపైకెత్తి అతని కనుల్లోకి చూసింది.

ఒక మాట... ఒకే మాట తడబడ్డాడు
ఏమిటో చెప్పండి
నీవు నాకు నచ్చావు
నేను నీకు నచ్చానా

అని అడిగితే, నాకు ఇంటి పెద్దలు, వారి ఇష్టా ఇష్టాలు కూడా ముఖ్యమే అని వాదిస్తుంది. దీనినిబట్టి మనకు

అర్థమయ్యేది ఏమిటంటే తన మనస్సులో విశ్వం మీద ఇష్టం ఉన్నా, పద్ధతిగల కుటుంబం నుంచి రావటం వల్ల తన అభిప్రాయాన్ని కుటుంబ అభిప్రాయానికి అనుకూలంగా మలచుకుందని గమనించవచ్చు.

త్రివేణి అమ్మ మానసమ్మకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవటం వలన త్రివేణి తన అన్న బాధ్యతను తన భుజాలపై వేసుకొని మానసమ్మని పట్నంలోని హాస్పిటల్‌కు తీసుకువచ్చి డాక్టర్‌కి చూపిస్తుంది. ఇలాంటి సంఘటనలు నేటి ఆధునిక కాలంలో కూడా జరుగుతున్నాయని మనం గమనించవచ్చు.

మానసమ్మకు డాక్టరు వైద్యం చేసి ఇంటికి పంపిస్తాడు. త్రివేణి హృదయంలో డాక్టర్‌పై ఎనలేని గౌరవభావం స్థానం ఏర్పడినవి. డాక్టర్‌ను తన అన్నలా స్వీకరించింది. వైద్యం చేసేవారిని ప్రాణాలు రక్షించేవారిని ఎవరైనా దేవునిలా పూజిస్తారు. కాని ఇక్కడ త్రివేణి డాక్టర్‌ను అన్నలా కొలిచింది. దీనినిబట్టి త్రివేణి సంస్కారం ఎటువంటిదో మనకు అర్థమవుతుంది.

తెలిగింటి ఆడపడుచు ప్రవర్తనా విధానాలు ఎలా ఉంటాయో త్రివేణి ప్రవర్తనా విధానం కూడా అలానే ఉంటుంది. అలా అనడానికి కారణం ఇంటికి బంధువులు వచ్చినప్పుడు వారికి చేసిన సేవయే దానికి నిదర్శనం. త్రివేణి ట్రేతో ప్రత్యక్షమవుతుంది. కప్పులు పరిచి నలుగురికి కాఫీలందించింది. తానూ ఒక కప్పు కాఫీ తీసుకొని వారికి బోరుకొట్టకుండా వారితో సరదాగా మాట్లాడుతుంది.

త్రివేణి అందంగా అలంకరించికుని ఉన్నది. అలంకరణ ఆమె సహజ సౌందర్యాన్ని ద్విగణీకృతం చేసింది. పల్లువరుస ప్రవాహపు నురుగులా ఉన్నది. చిరునవ్వులు - సెలయేటి అలలపై మెరుపుల్లా ఉన్నవి. లేత నీలిరంగు చీర - పూలు కట్టిన అంచులు - ఒక జీవనది కిరువైపులా విరగబూచిన విరుల తరువుల్లా ఉన్నవి. కుంకుమ పూల రవిక -నొసటి తిలకం మొత్తానికి కుందనపు బొమ్మలా ఉన్నది.

అతిథులను ఇంటికి పిలిచి యోగక్షేమాలు అడగడం, వారికి తగిన సౌకర్యాలు చేయడం మర్యాద తెలిసిన ప్రతి వ్యక్తి చేసే పని అది. కాని ఈ నవలలో త్రివేణి కుటుంబ సభ్యులు అలా కాదు. పదే పదే ప్రశ్నలు వేసి విసిగించారు. కుల, మత ప్రస్థావనలతో విశ్వంను ఇబ్బంది పెట్టారు. అంతలో చాలు చాలు నాన్న ఇక నేను వినలేను. త్రివేణి జలపాతంలా ముందుకొచ్చింది. విశ్వం కులంలేనివాడు కావచ్చు, గుణం ఉన్నవాడు. గోత్రం లేకున్నా హృదయయున్నవాడు. మతం లేకున్నా మనసున్నవాడు. అతని తల్లిదండ్రులు ఎవరైనా కావచ్చు, అతన్ని నేను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుంటాను. అని కరాఖండిగా చెప్పింది. త్రివేణి మాటలు గమనిస్తే, ఈమె ధైర్యం నేటి ఆధునిక కాలపు ఆడపిల్లలకు ఆదర్శంగా ఉంటుంది. మనం ప్రతిరోజూ గమనిస్తూనే ఉంటాం, తల్లిదండ్రులకు చెప్పలేక ఇష్టపడిన వాడికి చెప్పలేక ప్రాణాలు తీసుకునే వారు చాలా మంది ఉన్నారు. కాని త్రివేణి అలా చేయలేదు. తన మనస్సులోని అభిప్రాయాల్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది.

త్రివేణి అమ్మానాన్నలు విశ్వంను కలవద్దన్నారు. త్రివేణి అలకపూనింది. వద్దు తల్లీ - కులం గోత్రం లేనివాడితో పెళ్ళిని నలుగురు మెచ్చరు. త్రివేణి మనసు మార్చుకోవే అని బ్రతిమాలారు. అయితే త్రివేణి నన్ను అడ్డుకోవడానికి మీకు హక్కు లేదు అని ప్రశ్నించింది. ఇక్కడ త్రివేణి తన హక్కులే అడుగుతుంది కాని తన తల్లిదండ్రులను ఎదిరించిందని అనడానికి వీలు లేదు.

అవమానించబడ్డ ప్రియుడిని ఓదార్చడానికి త్రివేణి పెద్దలు వద్దన్నా త్రివేణి వెళ్ళడానికి నిశ్చయించుకుంటుంది. ఎందుకంటే విశ్వం తమ కుటుంబ సభ్యులచే అవమానించబడటం వలన దానికి క్షమాపన కోరటానికి. ఇందులో త్రివేణి పాత్ర తోటి మనుషులకు ఆదర్శప్రాయమైనదిగా చెప్పవచ్చు.

విశ్వం మీద తప్పుడు ఆరోపనలు మోపబడ్డాయి. త్రివేణి మాత్రం ఆరోపనలను నమ్మదు. కాని తెలుసుకోవాలనే ఆరాటం మాత్రం కనిపిస్తుంది. అందుకే విశ్వంను

ప్రశ్నిస్తుంది. తన జీవిత విశేషాలను చెప్పమని వేడు కుంటుంది. అంతేకాని ప్రియుడిని పదే పదే అవ మానించాలనే ఆలోచన మాత్రం ఆమెకు లేదు.

ఆవేశంతో రగిలిపోతున్న విశ్వాన్ని శాంతపరిచింది త్రివేణి. నన్ను నమ్మండి. మన జీవితాలు ఒడుదుడుకులు లేకుండా సాఫీగా జరిగి పోతాయనే నమ్మకం మాత్రం నాకు ఉంది. నేను కాపురాన్ని చక్కదిద్దుకోగలను. నాకొక అవకాశం ఇవ్వండి. మీ హృదయంలో నాకిచ్చిన స్థానాన్ని చెదరనివ్వకండి. మా తల్లిదండ్రుల కంటే మీరే నాకు ముఖ్యమని విశ్వంను బ్రతిమాలుతుంది. ఇక్కడ త్రివేణి తనను తాను తక్కువ చేసుకొని మాట్లాడిందని మనం ఊహించకూడదు. పరిస్థితులకు తగినట్లు నడుచుకుందని మనం గ్రహించాలి.

ఇన్ని అనర్థాలకు కారకులు పెద్దలు. వారి బుద్ధులు ఊరికే ఉండవు. హద్దులు అదుపులు లేనివారు. పెద్దరికం అనే ముసుగు పైన వేసుకొని పెత్తనం చెలాయిస్తారే తప్ప కాసింత అయినా ఇంకిత జ్ఞానం లేదువారికి. యువతరరం చెడటానికి పెద్దలే కారణం. వారి మార్గానికి అడ్డు తగిలి వారిని పెడమార్గాలు పట్టిస్తున్నదెవరు. ఇన్ని ఆత్మ హత్యలకు కారకులెవరు అని త్రివేణి నాటి తల్లిదండ్రుల జీవన విధానాన్ని తప్పు పడుతుంది.

త్రివేణి విశ్వం ఇంటిదగ్గర నుంచి తన ఇంటికి వస్తుంది. ఎక్కడ నుంచి వస్తున్నావే ఇంత దాకా ఎక్కడ ఉన్నావ్ అని తల్లిదండ్రులు నిలదీస్తారు... మీకు తెలిసి కూడా నన్ను ఎందుకు అడుగుతున్నారు అని సమాధానం ఇస్తుంది. ఇంటి గౌరవమేంగాను. దీన్ని మక్కెలిరగదన్ని మూలపడేస్తే అర్థమవుతుందని తండ్రి అంటాడు. అప్పుడు త్రివేణి నాన్నగారూ, నన్ను మీరేమీ చేయలేరు. చట్టరీత్యా నాకు మైనారిటీ తీరిపోయింది. నా జీవితం నా ఇష్ట ప్రకారం నడుపుకునే హక్కు ప్రభుత్వం నాకు కల్పించింది. నేను విశ్వాన్ని పెళ్ళి చేసుకుంటాను అని తండ్రిని ప్రశ్నించినపుడు త్రివేణి ఎంత చైతన్యవంతురాలు అయిందో గమనించవచ్చు. తల్లిదండ్రుల చాటుబిడ్డగా పెరిగిన త్రివేణి తల్లిదండ్రులనే ప్రశ్నించిందంటే ఈ మార్పు నేటి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా చెప్పవచ్చు.

మార్పు ప్రతి మనిషికి ముఖ్యం. ముఖ్యంగా స్త్రీకి. స్త్రీ జీవితంలో మార్పు ఎంత త్వరగా వస్తే అంత త్వరగా అభివృద్ధిస్థాయికి చేరుకుంటుంది. అది జరగాలి అంటే ప్రతి స్త్రీ విద్యావంతురాలు కావాలి. తన జీవితాన్ని తానే నిర్దేశించుకునే స్థాయికి చేరుకోవాలి. ఒకరికి ఆదర్శ వంతురాలిగా ఉండాలి. సమాజంలోని మనుషులను ప్రశ్నించే విధంగా ఉండాలి. కష్టాలు వస్తే వాటిని పరిష్కరించుకునే స్థాయికి ప్రతి స్త్రీ ఎదగాలి అని రచయిత కాళీపాకం లింగన్న కోటి నదులు నవలలో స్పష్టంగా వివరిస్తాడు. ఈ నవల నేటి ఆడపిల్లలకు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉంటుందని ముక్తకంఠంతో చెప్పవచ్చు.

## ఆధార గ్రంథం

1. కోటి నదులు నవల - కాళీపాకం లింగన్న

# 'చిత్రభారతం'లో 'రంభ' పాత్ర చిత్రణ

- డా॥. రెంభట్ల వేంకటరాయశర్మ, పద్యకవి, రచయిత, నాటకకర్త, జ్యోతిశ్శాస్త్రవేత్త, విశాఖపట్నం.

సృష్టి మనుగడకు మూలం స్త్రీ. భావవ్యక్తీకరణకు ప్రాతిపదికైన సాహిత్యంలో అందులోనూ తెలుగు ప్రాచీనసాహిత్యంలో స్త్రీ పాత్రలను విభిన్నంగా కవులు చిత్రించారు. నన్నయ్య భారతంతో ఆంధ్రసాహిత్యం ప్రారంభమయి తదనంతర కాలంలో ప్రక్రియా వైవిధ్యంతో, ఎప్పటికప్పుడు వినూత్నంగా, నిరంత రాయంగా విరాజిల్లుతోంది. అటువంటి ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ప్రబంధయుగానికి (క్రీ.శ.16వ శతాబ్దం) స్వర్ణయుగమని పేరు. ఈ యుగంలోనే వెలుగుచూసిన చరిగొండ ధర్మన్న చిత్రభారతప్రబంధంలో రంభ పాత్రచిత్రణను ఈ పరిశోధన పత్రంలో పరిచయం చేసి వివరిస్తున్నాను.

## చరిగొండ ధర్మన - పరిచయం :

ప్రబంధయుగంలో ప్రఖ్యాతమైన కవి చరిగొండ ధర్మన్న (క్రీ. శ.16 వ శతాబ్దం పూర్వార్థం). తన ఎనిమిది ఆశ్వాసాల చిత్రభారత ప్రబంధాన్ని చిత్తాపుఖాను (1504) మంత్రి అయిన, ఎన్ములపల్లి పెద్దామాత్యుడికి అంకితం ఇచ్చాడు. చిత్తాపుఖాను ఆంధ్రవీరుడనీ, ఏకశిలానగర దుర్గమును క్రీ.శ.1504 ప్రాంతమున మహమ్మదీయుల నుండి జయించి పాలించెననియు వరంగల్లు కోటలో దొరికిన ఒక శాసనమును బట్టి తెలియుచున్నది. (తెలుగు సాహిత్య సమీక్ష, భాగం2, ప్రబంధయుగము, పుట. 267) ధర్మనకు 'శతలేఖినీ సురత్రాణ' అనే బిరుదు ఉంది.

## చిత్రభారతప్రబంధం - సంక్షిప్తపరిచయం :

చిత్రభారతయుద్ధం యాదవ, పాండవులకు 18 రోజులు జరుగుతుంది. ఈ యుద్ధంలో కౌరవులు పాండవుల పక్షాన పోరాడారు. కృష్ణుడు తన చక్రంతో ధర్మరాజును తప్ప మిగిలిన వాళ్ళందర్నీ సంహరిస్తాడు. ధర్మరాజు ధర్మబుద్ధికి సంతోషించి తిరిగి అందరిని బ్రతికిస్తాడు. ఈ రచనకు మూలం బ్రహ్మాండపురాణం. ఇది గయోపాఖ్యానకథకు ఛాయారూపం.

### కథా సంగ్రహం :

తుల్యుడనే ముని శాపం వలన రంభ గుర్రంగా మారి చతుర్ధనుడు అనే మహారాజు దగ్గర ఉంటుంది. చతుర్ధనుడు ఆ గుర్రం ఎక్కగానే అది ఆకాశమార్గమంలో వెళ్తున్నప్పుడు గుర్రపు నోటి నురుగు అర్ఘ్యమిస్తున్న శ్రీకృష్ణుడి దోసిలిలో పడుతుంది. కృష్ణుడు కోపించి, ఆ అపచారం చేసిన రాజును ముప్పై రోజులలో చంపుతానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ వార్తను నారదుడి ద్వారా చతుర్ధనుడు విని భయంతో తనని కాపాడమని బ్రహ్మను, శివుణ్ణి, ఇంద్రుణ్ణి ప్రార్థిస్తాడు. వాళ్ళు కృష్ణుని బారినుండి అతనిని కాపాడలేమని చెబుతారు. ఈ సందర్భంలో ధర్మన - శివుడిచేత బాణాసుర వృత్తాంతాన్ని, ఇంద్రుడిచేత పారి జాతాపహరణ కథను చెప్పించాడు. చివరకు చతుర్ధనుడి శత్రువెవరో తెలిసుకోకుండా అర్జునుడు అతనికి అభయమిస్తాడు. ఆ తర్వాత నిజం తెలిసినా అర్జునుడు తన ప్రతిజ్ఞను విడిచిపెట్టకుండా కృష్ణుడితో యుద్ధానికే సిద్ధపడతాడు.

పౌరాణిక కావ్యేతిహాసాలలో, అరణ్యాలలో ముక్కు మూసుకుని తపస్సు చేసుకుంటున్న మునుల తపస్సును భంగంచేయటానికి నియమించబడేవారు అప్సరసలు. ఈ అప్సరసలలో ఎక్కువ మంది మునుల కోపాలకు బలై శాపాలకు గురైన వారే తరచుగా కనిపిస్తున్నారు. పురాణకథల ప్రకారం క్షీరసాగరమధనంలో అప్సరసలు పుట్టారు. వీరి సంఖ్య 31. అందులో రంభ మొదట పేర్కొనదగింది. చిత్రభారత ప్రబంధంలో రెండవ ఆశ్వాసంలో రంభపాత్ర ప్రారంభమవుతుంది. తుల్యుడు అనే ముని తపస్సును భంగం చేయడానికి దేవేంద్రుడు

పంపగా, రంభ, మన్మథుడి సహాయంతో భూలోకం వస్తుంది.

కం. ధరణీ తలమున యోగీ
శ్వరుడొక్కడు తుల్యుడనగ సంతతనిష్ఠా
పరుడై తపమొనరింపగ
దరుణీ, భువనంబులెల్ల దల్లడమందెన్.
(2-91)

దేవేంద్రుడు రంభతో అంటున్న సందర్భమిది. "భూలోకంలో తుల్యుడనే యోగీశ్వరుడొకడు, పరమ నిష్ఠతో తపస్సు చేస్తున్నాడు. ఆ తపస్సుకు లోకాలన్నీ తల్లడిల్లిపోతున్నాయి. కాబట్టి 3 లోకాలను, నన్ను నువ్వే కాపాడాలి. ఆ తుల్యుడి తపస్సును నువ్వే ఎలాగైనా మానిపించాలి" అని అడుగుతాడు. ఆ మాట విని రంభ, ముందు కొన్ని బీరాలను మాట్లాడుతుంది. ఆ తర్వాత "దేవేంద్రా! నువ్వు చెప్పావు కాబట్టి నేను భూలోకం వెళ్లి, ఆ మునిని, ఆ తుల్యుని భుజంగతుల్యుగా మార్చి, అతడి మనసులో నామీద అనురాగం పెంపొందింప చేస్తాను. తద్వారా ఆ తపస్సుకు భంగం కలిగిస్తాను" అని చెప్పి భూలోకం వస్తుంది. రంభ భూలోకం వచ్చేటప్పటికీ ఇక్కడ వసంత కాలం నడుస్తోంది. వసంతకాలం తపస్సు చేసుకోవడానికి అనువైన సమయమయినట్లే, మన్మథుని వీరవిహారానికి తగిన సమయంగా ప్రబంధాలలో వర్ణించ బడింది.

## కార్యసాధనలో రంభ మనస్థితి :

రంభ భూలోకానికి వచ్చింది గాని, మనసులో పరిపరి విధాలుగా ఆలోచిస్తూనే భయపడుతూ ఉంది. కార్య నిర్వహణలో లోటుపాట్లను బేరీజు వేసుకునే ప్రతి ఒక్కరి మనసు చిత్రణ ఇలాగే ఉంటుంది. స్త్రీ సహజమైన మానసిక పరిస్థితిని ఒక పద్యంలో వివరించాడు. "దేవేంద్రుడు ఇంతటి పనిచేయడానికి నన్ను నియ మించాడు. ఈ కార్యాన్ని నేను ఎలాగైనా పూర్తి చేసి, నా హృదయంలో సంతోషిస్తాను. ఈ కార్యంలో మునివరుణ్ణి మోసం చేయడానికి అతని ముందు నిలబడితే, ఆ విషయాన్ని గ్రహించి, ఆయన కోప్పడతాడేమో! వెళ్లడం మానేస్తే దేవేంద్రుడు కోపిస్తాడేమో" (చి.భా.2వ ఆశ్వా.117.) అని రంభ ఆలోచించి, కొంతమంది పరిచారికలు వెంటరాగా ముని ఆశ్రమానికి వెళుతుంది.

## ప్రబంధసంప్రదాయంలో రంభ వర్ణన :

తుల్యుడి తపస్సును భంగం చేయడానికి చెలులతో విహారం చేస్తూ, రంభ చాలా ప్రయత్నాలను చేస్తుంది. ఈ ప్రయత్నాలను ధర్మన 2వ ఆశ్వాసం నుండి 3వ ఆశ్వాసంలో 84 పద్యం వరకు సుదీర్ఘంగా వర్ణించాడు. ఆమె తన చెలికత్తెలతో జలకమాడే సందర్భంలో కళ్ళూ, కాళ్ళూ, చేతులూ, ముఖమూ అన్నీ పద్మాల్లా ఉన్న ఆ "తరుణులు పద్మినులెయనుట తథ్యంబయ్యెన్" (3-15) అని చమత్కరించాడు. రంభ, ఆమె చెలికత్తెలు మన్మథుడి పట్టపుటేనుగుల్లా ఉన్నారని చెప్తూ వాళ్ళస్తన మండలాలు కుంభయుగ్మాల్లా, ఊరువులు తొండాల్లా పలువరుసకాంతి ఏనుగు దంతాల కాంతిలా, చెక్కుల వెంట జారుతున్న కస్తూరి బొట్లు మదజలంలా ఉన్నాయని, వాళ్ళు మందగమనంతో ఉన్నారని వర్ణించాడు (2-158).

రంభ అవయవాలన్నింటిని దేశాలతో పోలుస్తూ, ఆ దేశాలన్నింటికి సార్వభౌముడిగా మన్మథుణ్ణి వర్ణించాడు (3-55). రంభ, ఆమె చెలికత్తెలు వన విహారం సాగిస్తుంటే, అందులో ఒకామె మాధవీపుష్పంలో వున్న తుమ్మెదని చూసి, అది నేరేడుపండనుకుని పట్టుకోబోతే, చేతిమీద కుట్టగా ఉలిక్కిపడిందని వర్ణిం చాడు (2-151). తుల్యుడికి తపోభంగం కలిగించటానికి వచ్చిన రంభ తనలో పొంగిపొరలే శృంగార రసాన్ని నీరుగా భావించి, ఆ మునికి అభిషేకం చేసింది. తన చిరునవ్వు వెన్నెలకు వస్త్రంగా ఇచ్చింది. తేనెలొలికే మాటల్ని పుష్పాలుగా పూజ చేసింది. వాలుచూపుల్ని నీరాజనం చేసింది. అమృతరసం ఉట్టిపడే అధరబింబాన్ని నైవేద్యంగా పెట్టిందని చమత్కరించాడు (3-78).

**తుల్యముని తపోభంగప్రయత్నం - రంభ శాపవృత్తాంతం :**

తుల్యముని తపస్సును భగ్నం చేయడానికి రంభ సపరివారంగా తరలివచ్చింది. తన నేర్పులన్నిటిని ప్రదర్శించింది. ఆత్మాధీనుడైన ముని హావభావ విచేష్ట లకు లొంగడని తెలిసి నోటికి పనిచెప్పింది.

శా. "నీవీమోక్షముగోరి యోగములనెంతే డస్సి
డెందంబులో
నీవెంటం గొనిరాని మీది యమృతంబేలా
విచారింప నా
నీవీమోక్షము జేసి యోగముల నెంతే
నెమ్మదిండాయ నీ
వే వెంటన్ జనకుండ కల్గు నమృతంబిచ్చోట
నా మోవిపై. (3-82)

"నీవు మోక్షాన్ని వాంఛించి యోగసాధనతో అలసి, సొలసి దేవలోకంలోని అమృతంకోసం నానా యాతనలు పడుతున్నావు. అదంతా వృథా ప్రయాస. నాయొక్క నీవీమోక్షము (చీరపోకముడిని విప్పడం) చేసినచో ఏయాతన లేకుండా నాపెదవిపై ఉన్న అమృతాన్ని పొందగలవు" అంది. రంభాద్యప్సరసలకు ఇలాంటి మాటలు వెన్నతో పెట్టిన విద్య. వరూధిని కూడా ఇలాగే ప్రవరుణ్ణి మభ్యపెట్టడానికి ప్రయత్నించింది. నీవీమోక్షం, యోగం, అమృతం, అనే పదాలు పద్యమంతా నిండి శ్లేషతో చక్కని చమత్కారాన్ని కలిగిస్తున్నాయి.

మన్మధుడి ప్రోత్సాహంతో రంభ చూపించిన వలపులకు తుల్యుడు మాత్రం చలించలేదు సరికదా రంభను భూలోకంలో గుఱ్ఱంగా మారమని ఇలా శపించాడు.

ఉ. ఓసి దురాత్మురాల! వినయోక్తులచే నను వెఱ్ఱి
జేయు పే
రాసలు మాను నిప్పు చెదలంటగ నేర్చునె? బల్మి
బై బడం
గా సమకట్టి చేరితివిగాన దురంగమై చరింపుము నీ
వై సొబగెల్ల బొల్లువడ మర్త్యుని మోచి
ధరాతలంబునన్! (3-89)

తనకు ఎటువంటి సంబంధమూ, తన తప్పూలేని రంభ, దేవేంద్రుడు పంపించగా వచ్చి, భూలోకంలో గుఱ్ఱంగా మారమని శపించబడింది. ఇలా శపించగానే రంభ మొదట నిర్ఘాంతపోయి, ఆ తర్వాత సొమ్మసిల్లి పడిపోతుంది. కొంతసేపటికి లేచి తనంతట తానుగా బలం కూడదీసుకుని, రాజర్షి అయిన తుల్యుడి పాదాల మీద పడి, భోరున ఏడుస్తూ "ముని పుంగవుడా, నువ్వు తలుచుకుంటే నీ ముందు బ్రహ్మాది దేవతలకు దేవేంద్రుడి వంటి వాళ్ళకే తరం కాదు అలాంటిది, ఒక అబలను అయిన నేనెంత. కాబట్టి దయతో నా మీద కృప చూపించు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లుగా, నామీద కోపించి గుఱ్ఱం అవ్వమని శపించారు. గుఱ్ఱంగా మారితే నేను నానా దేశాలు తిరిగే కష్టపడాలి. నన్ను కరుణతో రక్షించు" అని ఇంకా చాలా రకాలుగా వేడుకుంటుంది.

ఒక సుకుమారమైన స్త్రీ గుఱ్ఱంగా మారితే, తన శరీరంలోని వివిధ అవయవాలు గుఱ్ఱంగా మారినప్పుడు పడే బాధను ఇక్కడ కళ్ళకు కట్టినట్లుగా వివరించి బాధపడుతుంది రంభ. "నలకూబరుడంతటివాణ్ణి భర్తగా పొంది ఎల్లవేళలా అతని రక్షణలో ఉండే నాకు నేడు గుఱ్ఱం రూపు దాపురించబోతోంది! అయ్యో దైవమా ఎంత పని చేసావు అని విలపిస్తుంది. ఎంతకాలం నేను ఈ గుఱ్ఱం ఆకారంలో ఉండాలి" అని అడుగుతుంది. అప్పటికి ఆ మునికి రంభ మీద దయకలిగి, శాప విమోచనాన్ని చెబుతాడు. "కుండిన నగరాన్ని పరిపాలిస్తున్న చతుర్థనుడు అనే రాజుకు, పద్నాలుగు లోకాలను చూపించినప్పుడు నీకు శాపవిమోచనం కలుగుతుంది" అని చెప్పాడు.

ఆ తరువాత ఒక చిత్రమైన సన్నివేశాన్ని వర్ణిస్తున్న పద్యం ఇది. 'సాంబ్రాణి తేజి' అంటే ఉత్తమజాతి అశ్వం.

అతిలోక సుందరి, సుకుమారి, సొగసుల నెరజాణ అయిన ఒక అప్సర స్త్రీ, గుఱ్ఱంగా మారుతూ ఉంటే చూస్తున్న దేవతలు ఆమె పడే అవస్థని ఊహించుకొంటూ, అయ్యో పాపం అనుకొంటున్న సందర్భం.

సీ. ప్రియుని కెమ్మోవి చుంబింప నోపని లేమ -
కఠిన ఖలీన మేగతి వహించు?
హారంబు బరువని యలయు లతాతన్వి -
వాగెల నెట్టి కైవడి ధరించు?
జడసోకు లోర్వగా జాలని తరళాక్షి - కడువంక
పల్ల మే కరణి బూను?
నొడ్డాణమును దాల్ప నోపని సతి పొట్ట - బట్టెడ
బిగి నెటువలె సహించు?
తే.గీ. మిగుల మెత్తని నడుపుల మెలగు నింతి -
మనసు కంటెను జవమున మసలు నెట్టు?
లనుచు దేవతలద్భుత మంది చూడ -
రాజకులనాథ సాంబ్రాణి తేజ యయ్యె!
(3-111)

ఒక అప్సరస గుఱ్ఱంగా మారుతోంది. అది ఉత్తమజాతి అశ్వమే. సర్వాలంకారభూషితం కూడానూ. అయినా అవి స్త్రీలు ధరించే అలంకారాలు కావు కదా, గుఱ్ఱానివాయెను! అంచేత పాపం ఆ అప్సర వాటిని ఎలా భరిస్తోందో కదా అని దేవతలందరూ ఆశ్చర్యపడుతున్నారు. ప్రియుని పెదవుల తాకిడినే సహించలేనంత లేత పెదవులు ఆ అప్సరవి. ఇప్పుడా పెదాలకు గుఱ్ఱపు కళ్లెం తగిలించ బడింది! అసలే ఆమెది తీగలాంటి మేను. మెడలో హారాన్ని కూడా మోయలేనంతటి సుకుమారమైన ఆ శరీరం వాగెలను, అంటే పగ్గాన్ని ఎలా ధరిస్తుంది! వెనక ఊగే జడ తాకిడులు కూడా ఓర్వలేని ఆ తరళాక్షి వంపైన పల్లము (అంటే కూర్చునేందుకు గుఱ్ఱంపై వేసే జీను) ఎలా మోస్తుంది! ఒడ్డాణాన్ని సైతం భరించలేని ఆమె పొట్ట పట్టెడ బిగింపుని ఎలా సహిస్తుంది! అతి మెల్లగా సుకుమారంగా నడిచే ఆమె ఇప్పుడు మనోవేగంతో ఎలా పరిగెత్తగలదు! ఇలా అనుకొంటూ దేవతలు అద్భుతంతో చూస్తూ ఉండగా, ఆమె సాంబ్రాణి తేజిగా మారి పోయింది. ఒక అందమైన ఆడది గుఱ్ఱంగా మారిపోయే సన్నివేశం కాని, దాన్ని ఇలా వర్ణించే పద్యం కాని బహుశా ప్రపంచ సాహిత్యంలో మరెక్కడా లేదేమో!

కుండిన రాజ్యం దగ్గరలో ఉన్న అరణ్యాన్ని చేరి అశ్వరూపాన్ని పొందుతుంది రంభ. వేటనుండి వస్తూ అడవిలో ఆ ఉత్తమాశ్వాన్ని చూసి చతుర్ధనుడు రాజ్యానికి పట్టుకువస్తాడు. ఒక శుభముహూర్తం చూసి దానిని అధిరోహిస్తాడు. అది ఆకాశానికి ఎగిరి, స్వర్గ వైకుంఠ కైలాసాది సకల లోకాలనూ చూపించి తిరిగి అతని రాజ్యానికి తీసుకువస్తుంది. అలా వచ్చే తోవలో ఒక చోట శ్రీకృష్ణుడు అర్ఘ్యం ఇస్తూ ఉంటే, ఈ గుఱ్ఱపు నోటి నురుగు కాస్తా జారి, గాలివాటుకి వచ్చి కృష్ణుని చేతిలో పడుతుంది. ఆ తర్వాత కథ పైన మనం చెప్పుకున్నదే. ఎక్కడి తుల్య మహర్షి తపస్సు, ఎక్కడి పాండవ యాదవ యుద్ధం! ఈ రాజును 14 లోకాలు తిప్పి తీసుకోవచ్చాక, శాపవిమోచనం పొంది ఆ గుర్రం తిరిగి రంభగా మారి స్వర్గాన్ని చేరు కుంటుంది.(5-31).

తాను రచించినది పురాణ కథ అని ధర్మన్న చెప్పు కొన్నా, యిది ప్రబంధ బంధురమైన రచన. కొత్త కొత్త వర్ణనలు, అద్భుత రసపోషణ, ధారాధుర్యమయిన పద్య రచన ఈ కావ్యంలో మనకి కనిపిస్తాయి. రంభ గుఱ్ఱంగా మారిన తర్వాత ఆ అశ్వాన్ని ప్రబంధంతో పోలుస్తూ చెప్పే పద్యంలో తన కావ్య గుణాలను అన్యాపదేశంగా ఇతను పేర్కొన్నాడని భావించవచ్చు.

కం. పదముల చొప్పును వడి యొ
ప్పిదము నలంకారలక్ష్మి పేర్మియు ధారా
స్పద భావము గల్గి శుభ
ప్రదమై హయ మమరె సత్ప్రబంధము రీతిన్.
(3-160)

పదముల అందము (గుఱ్ఱానికి కాళ్ళు, ప్రబంధానికి మాటలు), చక్కగా ఒప్పారే వడి (వడి అంటే వేగము, తెలుగు పద్యంలో యతి అని రెండు అర్థాలు), అలంకార

శోభ, గొప్ప ధారతో కూడిన స్వభావము (అశ్వగతికి ప్రత్యేకించి ధార అని పేరు) కలిగిన శుభ్రప్రదమైన ఉత్తమాశ్వం సత్ప్రబంధంలా అనిపించడంలో ఆశ్చర్య మేముంది! ఇది చిత్రభారతంలో రంభ పాత్ర చిత్రణ.

**ఉపయుక్తగ్రంథసూచి :**

1. అన్నపూర్ణ, దశిగి, చిత్రభారతము-చరిగొండ ధర్మన (సమీక్ష), కావ్యసమీక్షలు, విశాఖపట్నం, ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్ ప్రచురణలు, 1983.
2. ధర్మన్న, చరిగొండ, నరసయ్య సంగనభట్ల (సంపా), చిత్రభారతము, హైదరాబాద్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు, 2013.
3. నాగయ్య, జి., తెలుగు సాహిత్య సమీక్ష (భాగం-2) తిరుపతి నవ్య పరిశోధక ప్రచురణలు, 1983.

# రామాయణంలో స్త్రీ పాత్రలు - సుమిత్ర, సీత, త్రిజట

- జి. యమ్. మల్లేశ్వరి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

స్త్రీకి మన భాషలో వందల సంఖ్యలో పర్యాయ పదాలున్నాయి. అవి ఆమె నిర్వహించే విభిన్న పాత్రలకు ప్రతిరూపాలు. పత్ని, ఇల్లాలు, భార్య, జాయ, దార, సతి..... ఇలా ఎన్నో. వీటిలో ఒక్కో మాటను ఒక్కో ప్రత్యేక సందర్భంలో ప్రస్తావిస్తారు.

- అగ్నిసాక్షిగా వివాహం జరిగి యజ్ఞయాగాదులలో సహధర్మచారిణిగా వ్యవహరించే స్త్రీని 'పత్ని' అంటారు. ఆవిడే ధర్మపత్ని.
- ఆలు అంటే ఇంటి ఆలు. ఇంటికి యజమానురాలు అని ఆమే 'ఇల్లాలు'
- భర్త దేశాంతరం వెళ్ళినపుడు అతడి స్థానంలో కుటుంబ భారం వహించేది భార్య.
- బిడ్డలకు జన్మనిచ్చిన ఇల్లాలికి 'జాయ' అని అర్థం.
- అన్ని వేళలలో భర్తతో కలిసి మెలిసి అన్యోన్యంగాజీవించేది దార.
- సత్వగుణంతో శోభించేది 'సతి'

ఏ పాత్రకు అదే ప్రత్యేకం. ఒక్కో పాత్రకు ఒక్కో సంబోధన. స్త్రీగా, గృహిణిగా, తల్లిగా, ఇల్లాలుగా, ప్రియరాలిగా, నాయికగా, నాయకురాలుగా ఎన్నో పాత్రలు పోషిస్తూ ఇంటికి దీపమై, కంటికి వెలుగై ఈ సృష్టికే శోభను చేకూరుస్తుంది. మహిళ లేకుంటే సృష్టే లేదు. అందం, ఆకర్షణ, సమర్థత, దక్షత తెలివితేటలు, ఓర్పు స్త్రీ సహజ లక్షణాలు. కనుకనే ఆమె రూపం అపురూపం. లావణ్యానికి ప్రతిరూపం. అందానికున్న పర్యాయపదాలన్నీ ఆమెకే సొంతం. సరిగ్గా అర్థం చేసుకుంటే ఆమె స్వరూపం విశ్వరూపం.

భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలుగా ఉన్న వేదాలు స్త్రీకి ఎంతో ప్రాధాన్యతనిచ్చాయి. ప్రాచీన సాహిత్యంలో రామాయణంలోని మహిళా పాత్రలని తీసుకుంటే ఎన్నో ఉత్తమ లక్షణాలు కనిపిస్తాయి.

**సుమిత్ర :**

వాల్మీకి సృష్టించిన మహోన్నతమైన పాత్రలో సుమిత్ర ఒకటి. ఈమె దశరథ మహారాజుకు రెండవ భార్య. పేరుకు తగినట్లే సౌమ్యురాలు. లక్ష్మణ, శతృఘ్నులకు తల్లి. భ్రాతృ సేవా పరాయణుడైన లక్ష్మణుడు తల్లి పేర సౌమిత్రిగా వర్ధిల్లాడు. త్యాగమంటే ఈ జాతికి నేర్పిన ఉత్తమురాలైన తల్లి. అటు పట్టపురాని కౌసల్యలాగా కాకపోయినా, కైకేయిలా భర్త ప్రేమను అమితంగా పొందలేకపోయినా వ్యధ చెందలేదు. సీతారాములు వనవాసానికి బయలు దేరినపుడు వారికి తోడుగా వెళ్ళమని లక్ష్మణుని ఆదేశించింది. 'వనవాసం కోసమే నీవు పుట్టావు. సీతారాములను జాగ్రత్తగా కాపాడు. ఇకపై రాముడే నీకు దశరథుడు. నన్ను సీతలో చూసుకో అని చెప్పింది. ఆ క్షణాన ఆమెలో కైకకున్న స్వార్థమూ లేదు, కౌసల్యకున్న మమకార దుఃఖమూలేదు. పుత్ర వియోగంతో బాధపడుతున్న కౌసల్యను ఓదార్చింది. తన దుఃఖాన్ని లోలోన అణచుకుంది. ఒక ఆదర్శవంతుడైన సోదరుడంటే ఇలా ఉండాలని ప్రపంచానికి సౌమిత్రి ద్వారా సందేశం అందించింది.

**సీత :**

లోకమంతా అనుకుంటున్నట్లు వాల్మీకి తన కావ్యాన్ని రామాయణంగా చెప్పలేదు. మహనీయమైన సీతమ్మ కథతో లోకానికి మేలు చేకూర్చాలని వాల్మీకి భావించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ తన రామాయణ కల్పవృక్ష కావ్యంలో సీతమ్మలోని ధీరత్వాన్ని అత్యద్భుతంగా వర్ణించాడు. సీతమ్మతల్లి రామచంద్రుడి పరాక్రమానికి చిహ్నంగా కూర్చుందని చెప్పారే కానీ,

రావణాసురుడు తీసుకువచ్చిన అబలగా బాధపడు తున్నట్లు రాయలేదు. రాముడు అరణ్యవాసానికి వెళ్తున్నప్పుడు సీతతో 'నీవు అరణ్యంలో ఉండలేవు' అని వారించగా అందుకామె 'స్త్రీకి భర్త ఎచట ఉంటే అచటే సుఖం. నీవు అరణ్యవాసం చేస్తూ ఉంటే నేను రాజ ప్రసాదంలో సుఖంగా ఎలా ఉంటాను?' అంటుంది. అవకాశం ఉన్నా భర్త వెంట నడవడం సీత తత్వం. సీతాదేవి జ్ఞాన సంపన్నురాలు జరుగుతున్న విషయాలను ఆమె నిశితంగా పరిశీలించగల శక్తియుక్తురాలు. ఆమె విచక్షణా బుద్ధి అడుగడుగునా వ్యక్తమవుతూనే ఉంటుంది. అంతటి విచక్షణ కలిగి ఉన్నా కూడా మాయ లేడిని చూసి ఆకర్షితురాలవడంలో స్త్రీకి గల సహజ స్వభావం కనిపిస్తుంది. రాముడు శీల పరీక్ష పెట్టినపుడు 'నీవు నాకు ఏడాది నాకు దూరంగా ఉన్నావు. నీవు కూడా నీ శీలాన్ని నిరూపించుకోవలసింది' అని గట్టిగా శ్రీరాముడిని కూడా మంటల్లో దూకమని పట్టుబట్టి ఉ ంటే ఈనాటి భారతీయ స్త్రీలకు ఇంత దుస్థితి ఉండేది కాదేమో!

అసాధారణ పాతివ్రత్యం, త్యాగనిరతి, సహనశీలత్వం ధర్మ పరాయణత్వం వంటి సుగుణాలన్నీ ఏకస్థానంలో ఏ స్త్రీలోనూ కనిపించవని చెప్పవచ్చు. సర్వకాల సర్వావస్థల్లోనూ, కష్టసుఖాల్లోనూ భార్యాభర్తలు ఏకమై ఉండి జీవన యాత్ర సాగించడం అనేది దాంపత్య ధర్మం. దానికి నిదర్శనం సీతారాముల చరిత్ర అని చెప్పవచ్చు.

**త్రిజట :**

ఈమె విభీషణుని కూతురు. అశోకవనంలో సీతకు కావలిగాసిన రాక్షష వనిత. 'త్రిజటస్వప్నం' రామాయణ గాథలో ప్రసిద్ధమైన ఘట్టము. రాముడు సముద్రం దాటి వచ్చినట్లు రావణాసురుడు యుద్ధంలో చనిపోయినట్లు కలగంటుంది. ఆ వృత్తాంతం సీతతో చెప్పి ఓదారుస్తుంది. ఈమె సీతను ఎంతో గౌరవంగా చూస్తూ, రాముడు ఆమెకోసం వస్తాడని ధైర్యం చెబుతూ ఉంటుంది. ఒక రాక్షస స్త్రీ అయి ఉండి కూడా ఎంతో ఆదరణతో ప్రవర్తించిన విధానం వలన స్త్రీకి గల సహజ సున్నిత స్వభావం ఈ పాత్రలో మనకు కనబడుతుంది.

ఈ రకంగా రామాయణంలో సీత తర్వాత కౌసల్య, సుమిత్ర, కైకేయి, మండోదరి, తార, అహల్య, ఊర్మిళ, శబరి, త్రిజట, శూర్పణక వంటి స్త్రీ పాత్రలెన్నో ఉన్నాయి. వీరందరూ ఒక్కో మనస్తత్వానికి ప్రతీకలు.

**ముగింపు :**

స్త్రీకి గౌరవ వాచకం ఇల్లాలైతే, ఇల్లాలికి గౌరవ వాచకం అమ్మ. అటువంటి మాతృమూర్తులైన మహిళలు అనేక దశల్లో సమాజానికి చుక్కానిగా నిలిచి, మన ఆచార వ్యవహారాలకు ఆధార భూమికలయ్యారు. తరతరాలుగా మగవాడి విజయానికి వెన్నెముకలుగా నిలిచిన మహిళ, సప్తపదిలో భర్త చిటికెనవేలు పట్టుకుని ఒద్దికగా నడిచిన మహిళ ఈ ఆధునిక యుగంలో ప్రపంచాన్నే తన చూపుడు వేలితో శాసించడం అనేది ఈ యుగం ప్రత్యేకత అని చెప్పవచ్చు. ఆధునిక మహిళ సాధించిన అమోఘ విజయం. అటువంటి ఆమె ఆంతర్యం అగాథం. ఆమె లేకుంటే అంతా శూన్యం. ఆమె సృష్టికి ఒక కానుక. ఆమె ఒ మధుర భావన. ఆమె శక్తి స్వరూపిణి. ప్రేరణా ఆమే... లాలనా ఆమే... తల్లిగా, తోబుట్టువుగా, తోడుగా, నీడగా ఆమె పాత్ర అనితరసాధ్యం. పైన చెప్పుకున్న సుమిత్ర, సీత, త్రిజటలు వారి పాత్రలకు న్యాయాన్ని చేకూర్చి వారి స్థానాలను చరిత్రలో సుస్థిరం చేసుకున్నారు. ఏ యుగమైనా, ఆనాడు, ఈనాడు ఏనాడైనా మహిళా మణు లందరికీ శతకోటి వందనాలు.

❀ ❀ ❀

# చీకటి ముడులు నవల - స్త్రీ జీవితం

- గంటెపోగు రత్నకుమారి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో వచనకావ్యంగా ప్రసిద్ధి చెందిన సాహిత్య ప్రక్రియ నవల. నాటకం, నవల, కథానిక, విమర్శ వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలు ప్రపంచ నలుమూలల నుండి ప్రాంతీయ స్థాయి వరకు వ్యాపించాయి. అలా రాయలసీమ ప్రాంతం అక్కడి సామాజిక అసమానతలు, కరువు, సమకాలీన వాస్తవిక జీవితాలను గురించి కరువు కాటకాలను ఎదుర్కోలేక రైతులు, సామాన్య ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులను గురించి రాయలసీమ ప్రాంతానికి చెందిన రచయితలు వారి రచనల ద్వారా మన ముందుకు తీసుకొని రావడం జరిగింది. అలాంటి వారిలో చిత్తూరు జిల్లాకు చెందిన డా॥ వి.ఆర్. రాసాని గారు రాయలసీమ ప్రాంతం గురించి అనేక రచనలు రాశారు. మెరవణి, పయనం, మావూరి కతలు, శ్రీకృష్ణదేవరాయల కథలు వంటి కథా సంపుటాలను, చీకటిరాజ్యం, మట్టిబతుకులు, చీకటి ముడులు, బతుకాట, ముద్ర, వలస, పరస, ఏడో గ్రహం మొదలైన నవలలను రచించారు. వీటిలో "చీకటి ముడులు" నవలలో కథానాయకుడు కుశాలన్న భార్య దేవకి. ఆమె కూతురు గౌరి వారు ఉంటున్న ప్రాంతంలో కరువు సంభవించడం వల్ల బ్రతుకు తెరువు కోసం పనులకు వెళ్ళిన చోట కామాంధులైన యజమానుల చేతుల్లో వారి జీవితాలు ఏ విధంగా బలైపోయాయో "చీకటి ముడులు" నవల ద్వారా స్త్రీ జీవితాన్ని తెలియజేశారు.

చిత్తూరు జిల్లాలోని పులిచర్ల దగ్గర్లో ఉన్న బండారోళ్ళ పల్లెలో దేవకి తన భర్త కుశాలన్న తాగుడుకు బానిస కావడం వల్ల పేదరికంతో కుటుంబ బాధ్యత ఆమెపై పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో ఆమె పేదరికాన్ని ఆసరాగా తీసుకొని కూలిపని కోసం వెళ్ళిన చోట అక్కడి యజమాని మంగరాజు ఆమెపై మోజుపడి కోరిక తీర్చుకుంటాడు. బ్రతుకు తెరువుకు పని కల్పించిన యజమాని కోరికను కాదంటే పనికి వెళ్ళకుండా చేస్తాడేమో అనే భయం, ఏ పని లేకపోతే ఇంట్లో పిల్లలు పస్తులుండాల్సి వస్తుందనే బాధతో ఇలాంటి పరిస్థితి ఏ మనిషికి రాకూడదు అనుకొని బాధపడుతూ అతనిపై ఎదురు తిరుగకుండా మౌనంగా ఉండి అతనికి లొంగిపోతుంది.

కొన్ని రోజుల తరువాత దేవకి ఆవుకు గడ్డి కోసుకొని రావడానికి కసిరెడ్డిగారిపల్లెకు వెళ్తుంది. అక్కడ సద్దచేన్లోకి గడ్డి కోసం వెళ్ళి సద్దకర్రల మధ్యలో ఉన్న గరిక, ఉట్లా గడ్డి, బదనిక వంటి గడ్డి కోసుకొని ఒకచోట పెట్టుకొని ఆ గడ్డిమోపు ఎత్తడం కోసం ఆ ఊర్లో తనకు మామ వరుస అయ్యే మొగరాల మద్దయ్యను గడ్డిమోపు ఎత్తమని సాయం అడుగుతుంది. గడ్డిమోపు ఆమె తలపై పెట్టే క్రమంలో ఆమె పైట జారిపోవడం చూసిన మద్దయ్య ఆమెపై కోరికతో లొంగదీసుకుంటాడు.

కొంత కాలానికి దేవకి వాళ్ళు ఉంటున్న ఊర్లో వర్షాలు పడక కరువు సంభవించడం మంగరాజు పొలంలో పనులు లేకపోవడం, తన భర్త కుశాలన్న కుటుంబాన్ని పట్టించుకోక పోవడం వల్ల వేరే దారి లేక పక్క ఊర్లో కనకమ్మ అనే మహిళ ఏ దిక్కులేని ఆడపిల్లలకు ఆశ్రయం ఇచ్చి వారితో వ్యభిచారం చేయిస్తూ ఉంటుంది. దేవకి కూడ భర్తకు తెలియకుండా ఆ కంపెనికి వెళ్ళి అక్కడ తన ఒళ్లు అమ్ముకొని వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకుంటుంది.

అలా తన యజమాని మంగరాజు, మామ వరుస అయిన మద్దయ్య ఏ క్షణాన దేవకిని లొంగదీసుకున్నారో అప్పటి నుండి ఆమె జీవితం పతనమై పోయింది. కష్టపడకుండా కరువు కాలంలో డబ్బు సంపాదించుకోవడం కోసం కొత్త దారిని వెతుక్కుంది దేవకి. అలా డబ్బులకు ఇబ్బంది వచ్చి సంసారం గడవని పరిస్థితిలో

తన శరీరాన్ని అమ్ముకుంటూ పడక సుఖం కోసం వచ్చిన వారి దగ్గరి నుండి తనకు కావాల్సిన డబ్బులు తీసుకునేది.

ఒకరోజు దేవకి భర్త కుశాలన్న పనికోసం కమ్మపల్లెకు వెళ్లి చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో ఆమె కూతురు గౌరిని కావాలనే పక్కింటికి రాగులు విసురుకొని రమ్మని పంపించి ఆ ఊర్లో వడ్డీల బుడ్డయ్య అనే వ్యక్తిని ఇంటిలోపలికి పిలిపించుకుంటుంది. వాళ్ళు ఇద్దరు ఇంట్లో ఉండగా భర్త వస్తే చూసి చెప్పమని, కొంత దూరంలో ఇలాంటి అక్రమ సంబంధాలకు డబ్బులు తీసుకొని వారికి సహాయం చేసే ఇంద్రమ్మ అనే ఆమెను ఉంచుతుంది. కొంతసేపటికి భర్త కుశాలన్న బాగా తాగి ఇంటి వెనుక దారి నుండి వస్తాడు. ఎంతసేపటికి తలుపు తీయకపొయ్యేసరికి కుశాలన్నకు అనుమానం వస్తుంది. అప్పటికే తన భార్య గురించి బయట మాట్లాడుకోవడం విన్న కుశాలన్న కోపం కట్టలు తెంచుకొని దేవకిని నోటికి వచ్చిన బూతులు తిడుతూ ఆమెను జుట్టుపట్టుకొని బయటికి గెంటేస్తాడు. ఆ గొడవ చూస్తున్న చుట్టపక్కల వాళ్ళు దేవకిని అస్యహించుకుంటూ బంగారం లాంటి పిల్లలను పెట్టుకొని, పెళ్ళికావాల్సిన ఆడపిల్లను ఇంట్లో ఉంచుకొని ఈ వయస్సులో ఇలాంటి పనులు చేయడానికి సిగ్గు లేదా అంటూ తిట్టడం మొదలు పెట్టారు. ఇలాంటి దాన్ని ఊర్లో లేకుండా తరిమేయాలి అని మాట్లాడు కుంటున్నారు. మరికొందరు కరువుకాలం, పనులు ఏమీ లేకపోవడం మొగుడేమో రోజు చేసిన కష్టం మొత్తం తాగడానికే సరిపోతుంటే ఇంట్లో పిల్లలను పోషించు కోవడానికి ఇలాంటి పని చేసిందని మాట్లాడుకున్నారు.

విషయం తెలిసిన కూతురు గౌరి అక్కడికి వచ్చి తల్లిని ఎందుకు ఇంతపని చేసావమ్మ అంటూ నిలదీస్తూ ఏడుస్తుంది. నేను ఇలా దిగజారిపోయింది, ఇన్ని అవమానాలు భరిస్తుంది మీ కోసమేనని, మిమ్మల్ని పస్తులు ఉంచలేక ఇలాంటి పనులు చెయ్యాల్సి వచ్చిందని గొంతు చించుకొని అరవాలనుకుంది దేవకి. కానీ ఆ మాటలు ఎవరూ నమ్మరు అనుకొని ఏడుస్తూ మౌనంగా ఉండిపోయింది. అక్కడ ఉన్న జనం అందరు ఎవరి ఇళ్లకు వారు వెళ్ళిపోయారు. ఆమె భర్త కూడా ఏడుస్తున్న కూతురు గౌరిని ఇంట్లోకి తీసుకెళ్ళి తలపులు వేసుకుంటాడు. దేవకి మాత్రం ఇంట్లోకి వెళ్ళలేక ఏడుస్తూ బయటే ఉండిపోతుంది.

డబ్బు ఉన్నవాళ్లు కామంతో కొత్త రుచుల కోసం తప్పులు చేస్తుంటే చూస్తూ ఊరుకున్న జనం బ్రతుకు తెరువు కోసం తన వారిని బతికించుకోవడం కోసం పేదవారు తప్పు చేస్తే కాకుల్లా పొడుచుకు తింటున్నారు అని అనుకొని ఎంతసేపైనా తన భర్త తలుపు తెరవక పోయ్యేసరికి అక్కడి నుండి పుడిచెర్లలో ఉన్న కనకమ్మ కంపెనీలో ఆ రాత్రి తలదాచుకొని మరుసటిరోజు ఎవరికి కనిపించకుండా వెళ్ళిపోయింది. ఎక్కడికి వెళ్లిందో ఎలా వెళ్లిందో ఎవరికీ ఆమె ఆచూకీ తెలియదు. కొత్తగా కంపెనీ ప్రారంభించిందనీ కొందరు, వ్యభిచార వృత్తిలో బొంబాయికి వెళ్లిందని రకరకాలుగా అనుకున్నారు. అలా ఆరోజు రాత్రి ఇంటిని వదిలి వెళ్ళిన దేవకి వెలుగులేని చీకటి బ్రతుకులోకి వెళ్ళిపోతుంది. అలా 'చీకటి ముడులు' నవలలో దేవకి పాత్ర ముగుస్తుంది.

అలా దేవకి వెళ్ళిపోయాక కుశాలన్న కూతురు గౌరితో పాటు కల్లూరు దగ్గర దేవళంమిట్ట సమీపంలో రోడ్డుపని చేయడానికి వెళ్ళినప్పుడు అక్కడ రోడ్డుపని చేయించే నాయుడయ్య అనే వ్యక్తి అక్కడ పని చేయడానికి వచ్చిన ఆడవాళ్ళపై మోజుపడి వేణమ్మ అనే మహిళ ద్వారా వాళ్ళతో క్యారియర్ తోట దగ్గరకు తెప్పించుకొని తన కోరికను తీర్చుకొని వేణమ్మకు కానుకలు ఇస్తుంటాడు. అలాగే ఒకరోజు గౌరిని కూడా క్యారియర్ ఇచ్చి నాయుడయ్యకు తీసుకెళ్ళమని చెప్పి పంపిస్తుంది. అక్కడ నాయుడయ్య గౌరిని చెరపబోతాడు. గౌరి గట్టిగా అరుస్తూ వ్వా నాన్నను పిలుస్తుంది. అరుపులు విని ఎవరైన వస్తే తన బండారం బయటపడుతుందని అనుకొని గౌరిని వదిలేస్తాడు. అప్పుడే అక్కడికి వచ్చిన గౌరి తండ్రి కుశాలన్న ఏం జరిగిందని ఎంత అడిగినా గౌరి చెప్పలేదు. వెంటనే

అక్కడి నుండి ఇంటికి వెళ్ళిపోతారు. ఇంటికి వెళ్ళిన తరువాత గౌరి తన తండ్రికి జరిగిన విషయం మొత్తం చెబుతుంది. పెళ్ళి కావాల్సిన ఆడపిల్లని అలా బయట పనులకు తీసుకొని వెళ్ళడం తప్పని తెలుసుకొని గౌరిని ఇంటి దగ్గరే వదిలిపెట్టి రోజు తాను ఒక్కడే పనులకు వెళ్ళేవాడు.

ఒక రోజు గౌరి వంట కోసం కట్టెపుల్లలు ఏరుకోవడానికి బయటకు వెళ్ళుతుంది. గౌరి ఒంటరిగా ఉండడం గమనించిన మంగరాజు తన తల్లిని లొంగదీసుకున్న విధంగానే గౌరిని కూడా పట్టుకోవడానికి వెళ్ళతాడు. గౌరి తనను ఏమి చేయవద్దని బ్రతిమాలుతున్న వినకుండా ఆమెను వెంబడిస్తాడు మంగరాజు. గౌరి అతనికి లొంగ కుండా వెనక్కి అడుగులు వేస్తూ అక్కడే ఉన్న బావిలో కాలుజారి పడిపోయి చనిపోతుంది. ఇలా కుటుంబ పేదరికం, దారిద్ర్యం, కరువుల వల్ల కుటుంబాన్ని పోషించుకోవడం కోసం ఎందరో ఆడ వాళ్ళు వ్యభిచార వృత్తిలో చేరి వారి జీవితాలను చీకటి మయం చేసు కుంటున్నారు. ఇలాంటి స్త్రీల పరిస్థితి గురించి రాయల సీమ ప్రాంత కరువు గురించి డా॥ వి.ఆర్. రాసాని గారు 'చీకటి ముడులు' నవలలో చిత్రించడం జరిగింది. దేవకి లాంటి ఆడవాళ్ళు ఎందరికో పనులకు వెళ్ళిన చోట, ఉద్యోగాలు చేసే ఆఫీసుల్లో చుట్టుపక్కల ఉండే వారిలో మంగరాజు, మొగరాల మద్దయ్య, వడ్డీల బుడ్డయ్య లాంటి కామాంధులు లేకపోలేదు. అలాంటి వారు ప్రతీ ఆడవాళ్ళల్లో తన తల్లిని, కూతురిని చేసుకొని స్త్రీల పట్ల గౌరవం చూపే విధంగా సమాజంలో మార్పు రావాలి. అలాంటి మార్పు వచ్చే విధంగా డా॥ వి.ఆర్. రాసాని లాంటి ఎందరో రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో మార్పు తీసుకొని రావాలని కోరుకుంటు న్నాను.

## ఆధార గ్రంథాలు

1. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. చీకటి ముడులు - డా॥ వి.ఆర్. రాసాని

# ఇంద్రగంటి జానకీబాల కథలలో మగువ

- దొరపురెడ్డి కనకమహాలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు, ఎస్.సి.ఐ.ఎమ్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, తణుకు.

'మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ' ఈ వాక్యం అక్షర సత్యం. మగువ లేనిది మనుగడ లేదు. ప్రతి వ్యక్తి జీవితంలోనూ తల్లిగా, చెల్లిగా, చెలిమిగా, ప్రియురాలిగా, భార్యగా, కుమార్తెగా భిన్న రూపాలను స్త్రీ పోషిస్తుంది. స్త్రీని దేవతగా పూజించే భారతదేశం మనది. అయితే, ప్రస్తుత కాలాన్ని మనం పరిగణనలోకి తీసు కుంటే, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు, అవహేళనలు సభ్య సమాజానికి సవాలు విసిరేలా ఉన్నాయి. స్త్రీలను దేవతలుగా పూజించకపోయినా, కనీసం ఒక సాటి మనిషిగా గౌరవిస్తే చాలు అనిపిస్తుంది. అయితే, స్త్రీ లందరూ చాలా మంచి వాళ్ళు అనీ, తప్పంతా మగవారిదే అనడం కూడా భావ్యంకాదు. "స్త్రీకి శత్రువు స్త్రీయే" అనే నానుడి కూడా ఉంది. అది కూడా ఒక రకంగా నిజమే అనిపిస్తుంది. ఒక తల్లిగా, తన కూతురు అత్తగారింట్లో సుఖంగా ఉండాలని కోరుకుంటుంది. అయితే అత్తగారి హోదాలో, తన ఇంటికి వచ్చిన కోడలుని సాధిస్తుంది. మరి తన కోడలుగా వచ్చిన అమ్మాయి కూడా మరొకరికి కూతురే అన్న విషయం మరచి పోతుంది. ఒక ఇల్లు, ఆ ఇంటిలోని వారు సంతోషంగా ఉండాలంటే అది ఆ ఇంటి ఇల్లాలి చేతుల్లోనే ఉంటుంది అనవచ్చు.

ఇంద్రగంటి జానకీబాల గారు అనేక కథలు, నవలలు రాశారు. ఈమె కథలు వాస్తవానికి చాలా దగ్గరగా ఉంటాయి. అద్భుత కల్పనలు కానీ, హఠాత్పరిణామాలు కానీ ఈమె కథలలో మనకు కనిపించవు. సహజంగా, మన చుట్టూ ఉన్న మనం రోజూ చూస్తూ ఉండే మనుషులే కథలలో పాత్రలుగా దర్శనమిస్తారు. ఈమె కథల్లో ఉన్న స్త్రీ పాత్రల గురించి తీసుకుంటే వారందరూ పూర్తిగా మంచితనం మాత్రమే మూర్తీభవించినవారూ కాదు, అలాగని అందరూ చెడ్డవారూ కాదు. అన్ని రకాల మనస్తత్వాల వారూ ఈమె రచనలలో మనకు కనిపిస్తారు.

పెట్టుబడి అనే కథలో పాపాయమ్మ అనే స్త్రీ తను పనిచేసే ఇంటావిడ శకుంతల దగ్గర గున్నమ్మ గురించి బాధపడుతూ ఆమె పడుతున్న కష్టాలను గురించి ఏకరవు పెడుతుంది. గున్నమ్మ భర్త ఆమెను సరిగా చూడడని, అతనికి ఆమె మీద అనుమానం అనీ లేనిపోనివన్నీ శకుంతలకు చెబుతుంది. శకుంతల భర్త ఆఫీసులో పాపాయమ్మ పది సంవత్సరాలుగా స్వీపర్‌గా పనిచేస్తోంది. అక్కడ ఆఫీసులో నీళ్ళు మోయడానికి మనిషి కావాలని, ఆ పని తన చెల్లెలు వరుసైన గున్నమ్మకి ఇప్పించమని శకుంతల దగ్గర ప్రాధేయపడుతుంది. శకుంతల తన భర్తతో చెప్పి గున్నమ్మకి ఆఫీసులో నీళ్ళు మోసే ఉద్యోగం ఇప్పిస్తుంది. దాంతో గున్నమ్మ కూడా చాలా సంతోష స్తుంది. వారానికి 45 రూపాయలు జీతం రాగానే చాలా సంతోషపడుతుంది. గున్నమ్మ సంపాదించే డబ్బులో కొంత మొత్తం పాపాయమ్మ లాక్కుపోతుంది. సరేలే అసలు ఈ పని రావడానికి కారణం పాపాయమ్మే కదా అని తనకు తాను సర్ది చెప్పుకుంటుంది. ఈ విషయాలేమీ తన భర్త లింగయ్యకు చెప్పలేదు గున్నమ్మ. జీతం వచ్చిన సంతోషంతో ఆ రోజు సంతోషంగా గడిపేస్తారు ఆ భార్యా భర్తలు. అయితే అలా నాలుగు వారాలు గడిచినా ప్రతి వారము కూడా పాపాయమ్మ డబ్బు గురించి వచ్చే టప్పటికి ఊరికినే పాపాయమ్మకు డబ్బు ఇవ్వడం బాధనిపిస్తుంది. దానితో నేను ఇక నీకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు అని పాపాయమ్మ తో గొడవ పెట్టుకుని డబ్బు ఇవ్వడం మానేస్తుంది.

తన ఉద్యోగాన్ని శకుంతలతో లేనిపోనివి చెప్పి తీయించేస్తుందేమోనని భయపడి, శకుంతల దగ్గరకు వెళ్లి అసలు విషయం చెప్పగా ఉద్యోగం వేయడం, తీయడం అంత సులభమేమీ కాదు అని చెప్పగా సంతోషంతో ఇంటికి వెళుతుంది గున్నమ్మ. అయితే

పాపాయమ్మ, గున్నమ్మ భర్తతో గున్నమ్మ ప్రవర్తన సరిగా లేదని, ఆఫీసులో అందరితోనూ ఇక ఇకలూ, పకపకలూ, నువ్వు మంచివాడివి కాబట్టి నీకు చెబుతున్నాను, డబ్బు కంటే పరువు ముఖ్యమని తనని ఉద్యోగానికి పంపించడం మంచిది కాదని, లేనిపోనివన్నీ కల్పించి గున్నమ్మ భర్తకు చెబుతుంది. దానితో ఆమె భర్త, గున్నమ్మ ఇంటికి రాగానే గొడవ పెట్టుకుని, బాగా కొడతాడు. శకుంతలకు చెప్పి ఉద్యోగం పోకుండా కాపాడు కున్నానని గున్నమ్మ అనుకుంది. కానీ డబ్బులు ఇవ్వడం లేదని పాపాయమ్మ తన భర్తకు తన మీద అనుమానం కలిగేలా చెబుతుందని మాత్రం ఊహించలేకపోయింది. డబ్బు కోసం తన సంసారాన్ని పాడు చేసుకోవడం ఇష్టం లేక, గున్నమ్మ చివరికి తన ఉపాధిని కోల్పోయింది.

ప్రయాణం అనే కథలో ప్రధాన పాత్రలు రెండూ స్త్రీ పాత్రలే. మొదటి పాత్ర కమలిని, రెండవ పాత్ర నాన్సీ, ఇద్దరూ భర్త చేతిలో మోసపోయిన వారే. కమలిని రైలు ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం మొదలు పెట్టడంతో కథ మొదలవుతుంది. తోటి ప్రయాణికురాలు నాన్సీ కథను ముందుగా తెలుసుకుందాం. ఈమె తన కథను కమలినికి చెబుతూ ఇవాళ తనకు చాలా ఆనందంగా ఉందని దానికి కారణం తనకు ఇవాళ విడాకులు మంజూరు అయ్యాయి అని చెబుతుంది. నాన్సీ, విలియమ్స్ ప్రేమించి వివాహం చేసుకున్నారు. పెళ్లి అయిన తర్వాత అతని నిజస్వరూపం బయట పడుతుంది. విలియం విపరీతమైన డబ్బు మనిషి. అతనికి నాన్సీ మీద కంటే, ఆమె జీతం డబ్బు మీద ప్రేమ ఎక్కువ. ప్రతి పైసా పైన ఆరా తీసేవాడు. దానితో వారిద్దరి మధ్యా ఘర్షణ మొదలైంది. అంతే కాకుండా తర్వాత కొట్టడం కూడా మొదలు పెట్టాడు. నాన్సీ తన తల్లిదండ్రులకు చెప్పినా, నాన్సీదే తప్పు అనే వారు. పైగా ప్రేమ వివాహం కాబట్టి భరించాలి అనేవారు. కానీ నాన్సీ తమ్ముడు మాత్రం ఆమెకి అండగా నిలిచి ఆమెకు ధైర్యాన్నిచ్చాడు. విడాకులు వచ్చేవరకూ ఆదుకున్నాడు. ఈకథ విన్నాక కమలిని నాన్సీని మీది చిన్న వయసే కదా మళ్ళీ వివాహం చేసుకోండి అన్నది. ఆ మాటలకు నాన్సీ నవ్వేస్తూ, ఇదేమైనా ఖాళీ అయిన సీట్లను భర్తీ చేయడమా అంటుంది.

కమలిని తన పరిస్థితిని గుర్తుకు తెచ్చుకుంటుంది. ఆమెకు శంకర్‌తో వివాహం అవుతుంది. వారిది నాన్సీలా ప్రేమ వివాహం కాదు, పెద్దలు కుదిర్చిన వివాహం. కొన్నాళ్ళ తరువాత ఆమె భర్త మరో పెళ్లి చేసుకుని, ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. ముందు నుంచి శంకర్‌కి ఆడవాళ్ళ వ్యామోహం ఎక్కువ. ఆయినా కమలిని భరించి ఊరుకుంది. కానీ ఎప్పుడైతే భర్త తెగించి మరొక ఆమెను పెళ్లి చేసుకున్నాడో ఆమెకు విరక్తి వచ్చి బయటకు వచ్చేసి శంకర్ స్నేహితుడైన రవి ఇంటికి వెళ్లి కొన్ని రోజులు ఉందామనుకుంది. రవికి, అతని భార్య రమకు తనంటే చాలా అభిమానం అని భావించింది. కమలినిని ఇంటికి తీసుకు వెళ్లడానికి రైల్వేస్టేషన్‌కి రవి వచ్చాడు. వచ్చిన దగ్గర నుండి అతని ప్రవర్తనలో చాలా తేడా గమనించింది.

ఇంటికి వెళ్ళాక తెలిసింది రమ ఇంట్లో లేదని. ఇంటి వెళ్ళాక, రవి చాలా అనుచితంగా మాట్లాడి తనంటే చాలా ఇష్టం అని రమ అంటే తనకు ప్రేమ లేదని చెప్పాడు. అతని ప్రవర్తన, మాటతీరు కమలినికి నచ్చలేదు. మగవాళు అందరూ ఇలాగే ఉంటారు అని భావించి, రవిని నిలదీసి అడిగింది. అయితే రవి, నీవు అలసిపోయి ఉన్నావు. రేపు మాట్లాడుకుందాం అంటూ వెళ్లిపోతాడు. వెళ్తూ వెళ్తూ తనంటే చాలా ఇష్టం అని మళ్లీ చెబుతాడు. ఆ మర్నాడు రమ వస్తుంది. వచ్చిన తర్వాత బాగానే ఉన్నా రాత్రి రవి, కమలిని గురించి విరుద్ధంగా చెప్పడంతో, రమ ప్రవర్తనలో మార్పు వస్తుంది. దానిని గమనించిన కమలిని మర్నాడే బయలుదేరి, తిరిగి రైల్వేస్టేషన్‌కి వస్తుంటే రమ కూడా కమలినితో వచ్చింది. ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితిలో ఏదో ఒక రైలు ఎక్కి కూర్చుంది. ఎక్కడికి వెళ్తున్నావు అడి అడిగే ధైర్యం రమకు కూడా లేదు. అయితే శంకర్‌కి టెలిగ్రాం ఇవ్వాల్సింది అని మాత్రం అంటుంది రమ. రైలు ఎక్కి కూర్చున్న తర్వాత నాన్సీ ఇచ్చిన

అడ్రస్‌కార్డు గుర్తుకు వచ్చి చూసుకుంది కమలిని. రైలు కదిలింది.

పెట్టుబడి అనే కథలో మనకు పాపాయమ్మ, గున్నమ్మ పాత్రలు నిత్యజీవితంలో ఎదురవుతూనేవుంటాయి. సానుభూతితో పాపాయమ్మ తనకు ఉద్యోగం ఇప్పిస్తుంది అని గున్నమ్మ అనుకుంది. కానీ చేసిన సహాయం నుండి ప్రతిఫలాన్ని ఎల్లపుడూ ఆశించింది పాపాయమ్మ. గున్నమ్మ ఎదురుతిరగగానే ఆమె జీవితాన్నే నాశనం చేయడానికి పూనుకుంది పాపాయమ్మ. అలాగే ప్రయాణం కథలో కమలినికి ఏం చేయాలో పాలుపోని స్థితిలో తన భర్త స్నేహితుడైన రవి ఇంటికి వెళ్ళింది. అయితే అతను కూడా ఇప్పటి తన పరిస్థితిని ఆసరాగా తీసుకుని, తనను లోబరుచుకోవడానికి ప్రయత్నించడం చూసి అవాక్కయింది. వెంటనే అక్కడి నుండి బయలు దేరింది. నాన్సీ ఈ కథలో కమలినికి మార్గదర్శకురాల యింది. మళ్ళీ పెళ్లి చేసుకోమని కమలిని, నాన్సీని అన్నప్పుడు ఆమె అన్న మాటలు నాన్సీ వ్యక్తిత్వాన్ని తెలియ జేస్తున్నాయి. ఏది ఏమైనా మన సమాజంలో నేటికీ కమలిని, నాన్సీ, పాపాయమ్మ, గున్నమ్మ పాత్రలు మనకళ్లెదురుగా తిరుగాడుతూనే వున్నాయి. మార్పు అనేది మనలో రావాలి కానీ, ఎదుటివారి నుండి మార్పును మనం ఆశించకూడదేమో అనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. జానికీ బాల కథలు - ఇంద్రగంటి జానకీ బాల

❀❀❀

# "అతడు - ఆమె"లో ఆమె పాత్ర

- డా॥. పసుపులేటి నాగమల్లిక, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం, తూ॥గో॥జిల్లా.

నాటి జాతీయోద్యమ కాలంలో ఉప్పల లక్ష్మణరావు గారు రాసిన నవల "అతడు-ఆమె". ఇందులో జీవితం లోని కష్టాలకు, సమస్యలకు భయపడే దుస్థితి నుండి ఆ సమస్యలకి పరిష్కార మార్గాన్ని అన్వేషించగల సంస్కార శక్తిని 'ఆమె' పాత్ర ద్వారా నిరూపించారు. "జీవితాన్ని గూర్చి నిర్లిప్తమైన సంస్కారిక దృష్టి పెరిగే కొద్దీ జన సామాన్యం జీవిత సమస్యలతో సరిగా పోరాడగలు తుందనే కొడవటి గంటి" వారి మాటని 'అతడు -ఆమె' నవల రుజువు చేస్తుంది. నేటి సమాజంలో ప్రధానంగా ఈ సంస్కార స్థితే కనుమరుగౌతున్నది. ఇంకా సమాజంలో స్త్రీ, పురుష వ్యత్యాసాలు అక్కడక్కడా కన్పిస్తూనే ఉన్నాయి. వారి మధ్య సరైన ఆలోచనా విధానాలు రావాల్సి ఉంది. ముఖ్యంగా ఈ నవలలో అటువంటి అంశాలు, స్త్రీలు పరిస్థితి ఆర్థికపరంగా, సంసారపరంగా, సమాజపరంగా ఎలా ఉందో వివరించబడింది.

అయితే ఈ నవల ప్రధానంగా రెండు విషయాలుపై రాయబడింది. ఒకటి నాటి జాతీయోద్యమం, రెండు స్త్రీ, పురుష సంబంధాలు. ప్రస్తుత వ్యాస ముఖ్య ఉద్దేశ్యం రెండవ అంశం ఆధారంగా 'ఆమె' పాత్రను వివరించడం. ఈ నవలలోని స్త్రీ, పురుష సంబంధాలంటే ఒక భార్య భర్తల సంబంధమే గాక సమాజంలోని అన్ని సంబంధాల్ని తండ్రి కూతుళ్ళు, అన్నాచెల్లెల్లు 'ఆడ-మగ స్నేహితులకూ ఉన్న సంబంధాలను గూర్చి చర్చ చేశారు. ఈ నవలలోని ప్రధాన పాత్రలైన శాంతం, శాస్త్రి ఇద్దరూ చదువుకున్న వారే అయినా శాస్త్రి చాలా విషయాల్లో శాంతను తనకంటే తక్కువగా చూస్తాడు. శాంత తన వ్యక్తిత్వంతో అతని ఆటలు సాగనివ్వదు. అయినా చిన్న చిన్న విషయాల్లో కూడా అతని స్వభావం బైటపడిపోతుంది. పేపర్ చదువుతూ ప్రకటనల పేజీ శాంత కిచ్చి వార్తలు తాను చదువుకుంటాడు. ప్రపంచ వార్తలు స్త్రీలకెందుకు? ఏ సినిమా బొమ్మలో లేక చీరల ప్రకటనలో చూసుకుంటే చాల్లే ఆడవాళ్ళు అన్న ఒక రకమైన పురుషాహంకారం అతనిలో కన్పిస్తుంది. ఈ స్థితి చాలా ఇండ్లలో నేటికీ కనబడుతూనే ఉంటుంది. చలం నవలలోని లైంగికత్వ విషయాలు గూర్చి తనతో సమానంగా శాంతం చర్చిండాన్ని నిరాకరిస్తాడు. ఇలాంటి విషయాల్లో అమాయికత్వం అజ్ఞానంగా ఉండటానికే స్త్రీని ఉంచడానికిష్టపడతారు పురుషులు అన్ని అంశాన్ని శాస్త్రి ద్వారా రచయిత తెలుపుతాడు.

ఈ నవలారంభంలోనే స్త్రీ, పురుష సంబంధాల్లో కీలక విషయాన్ని శాంత పాత్ర ద్వారా బయట పెడతారు. శాంతం ఇంట్లో పనిచేసే లక్ష్మీ కూతురు ఆదెమ్మను తాగుబోతు భర్త హింసింస్తుంటాడు. అంత హింసను భరించి ఎందుకతని వద్ద ఉంటున్నావని శాంత అడిగేస్తుంది. దానికి ఆదెమ్మ "కొడుతూ తిడుతూంటే ప్రేమ మోహం ఒక్కనాటికీ నిలవ్వు అమ్మా" అయితే ఆడ పీనుగులం ఎక్కడికి పోగలమమ్మా.

డబ్బులేక ఒకరి మీద ఆధారపడి తర్వాత తల్లి తండ్రులకీ, తోబుట్టువులకీ, మీలాంటి స్నేహితులకీ కూడా బరువై పోతాం. స్త్రీ జాతి బతుకే అంతయి పోయిందమ్మా. డబ్బు కోసం ఒకరి మీద ఆధారపడకుండా ఉన్నామో మన బతుకు మనం బతకొచ్చు" అంటుంది. ప్రేమ గురించి ప్రేమకు డబ్బుకు, ప్రేమకు భావైక్యతకు, ప్రేమకు అందానికీ ఉన్న సంబంధాలను గూర్చి ఆయా సన్నివేశాల్లో సందర్భాలనుసారంగా రచయిత శాంతం పాత్ర ద్వారా విశ్లేషిస్తాడు.

శాంతం పెంపుడు కూతురు సుభ జనార్ధనాన్ని ప్రేమిస్తోంది. సుభ పాత్రకి రచయిత వాస్తవికతను, మనో విశ్లేషణ శాస్త్రాన్ని ఆపాదిస్తూ ఆమెను రక్తమాంసాలున్న

మనిషిగా రచయిత మలిచిన తీరు అమోఘమైంది. వారద్దిర్ని అర్థం చేసుకున్న శాంతం కూడా వారి పెళ్ళికి అనుమతినిచ్చి కూచిపూడి వెళ్ళి, వేదాంతం వద్ద నృత్యం నేర్చుకుని ఇద్దరూ జంటగా ఉండమని పరస్పర శారీరక, మానసిక ప్రవృత్తులు అర్థం చేసుకుని వివాహ బంధంతో ఆనందంగా ఉండమని సలహా ఇస్తుంది. ఇక్కడ తనలోని అభ్యుదయ వాస్తవిక భావాల్ని వెల్లడిస్తుంది.

ఇలా అతడు - ఆమె నవలలో అపూర్వమైన పాత్ర శాంతం తానెంతో ప్రేమించిన శాస్త్రి స్వార్థపరుడిగా పదవీ కాంక్షాపరుడిగా మారిపోతుంటే బాధపడి అతని నుంచి దూరంగా వెళ్లిపోతుంది. అతనిలో మార్పు వచ్చాకే మళ్లీ అతనితో సహజీవనం సాగిస్తుంది. జాతీయోద్యమంలో స్వప్రయోజనాల కోసం చేరిన వారిని అసహ్యించు కుంటుంది. మహిళా కార్మికుల దయనీయ స్థితికి చలించిపోతుంది. అనాథలా తన ఇంటికి వచ్చిన సుభను కన్నకూతురిలా పెంచుతూ తనలోని మానవతా మూర్తిని బయట పెడుతుంది. పిల్లలను వ్యక్తిత్వం, బలం వున్నవారిగా పెంచి స్త్రీ అబల కాదు సబల అని నిరూపిస్తోంది. పిల్లల అభిప్రాయాల్ని శాస్త్రి కంట్రోలు చేయబోతే "శాస్త్రి దబాయింపులు నేను సహించను. ఈ ఇంట్లో మాత్రం ఎవరి అభిప్రాయాలు వాళ్ళదే. ఎవరి స్వేచ్ఛ వాళ్లదే. దానికిష్టం ఉంటే కమ్యూనిస్టుల్లో చేరుతుంది. హిందూ మహాసభల్లో చేరుతుంది. దాని స్వతంత్రం దానిది." అని గట్టిగా మాట్లాడి స్త్రీ స్వేచ్ఛకై పోరాడే తత్వాన్ని వెల్లడిస్తోంది ఆమె.

సుభతో కన్న కూతురు లక్ష్మీతో ఈమెకున్నది స్నేహబాంధవ్యం. పిల్లల స్నేహితులు ఆమెకు కూడా స్నేహితులు శాంతం మంచి ప్రజాతంత్రవాది. డెమొక్రాట్ అన్న పదం పూర్తి అర్థంలో శాంతంకు అన్వయిస్తోంది. ఒక పాత్ర ప్రజా తంత్ర స్వభావంతో రూపొందించమనేది తెలుగు సాహిత్యంలో అరుదైన విషయం. ఒక స్త్రీ పాత్రనలా చూపటం మరీ అరుదు శాంతం పాత్ర ఔన్నత్యాన్ని చెప్పటానికి లక్ష్మణరావు గారు కల్పించిన అత్యద్భుత సన్నివేశం ఒకటుంది. శాంతంను ఆమె కూతురు లక్ష్మి ఇలా అడుగుతుంది. "మరీ నాన్న ఇంతలా మారిపోతాడని నీకు ముందుగానే తెలిసుంటే నాన్నని పెళ్లి చేసుకునుందువే" అని శాంతం "ఆనాడు తెలిసుంటే చేసుకోక పోయుందునే " అంటుంది. లక్ష్మీ ఊరుకోకుండా "మరీనాడు తెలిసింది గదా నాన్న మారిపోయాడని మరిప్పుడూ నాన్నంటే నీకింకా ప్రేమేనా..? అనడిగితే చదివేవారి గుండెలు పట్టేస్తాయి గానీ శాంతం ఎంతో ప్రశాంతంగా గుండె నిబ్బరంతో "ఆ ప్రేమే కాని ప్రేమ ఎన్ని పాళ్లో ప్రణయం ఎన్ని పాళ్ళో స్పష్టంగా నాకే తెలిడం లేదంటే నమ్ము" అంటుంది. మనం దు:ఖం నిగ్రహించు కోలేం. శాంతం ఆ ప్రేమ పోతున్నదశలో ఆమె పడిన సంఘర్షణ వారి దాంపత్య జీవితపు జ్ఞాపకాలు వేరు. ఇప్పటి ప్రేమ రాహిత్య స్థితి, కూతురి ముందు అది చెప్పి ఒప్పుకున్న తీరూ అన్ని మన కళ్లముందు కదిలి మనసును కలిచివేస్తుంది. అపురూపమైన సన్నివేశంలో సున్నితమైన ఆమె పాత్రను మలిచారు అద్భుతమైన భావాల్తో రచయిత.

ఇలా అతడు -ఆమె నవలలో 'ఆమె' పాత్ర ద్వారా సందర్భాల్ని బట్టి, సన్నివేశాల్ని బట్టి స్త్రీ మనో హృదయము వేదనల్ని, ప్రేమ, ధీశక్తిల్ని, నిర్ణయాలు తీసుకునే ఆలోచనా శక్తిని ఎంతో హృద్యంగా రచయిత అభివర్ణించి కీర్తి గాంచారు. తెలుగు సాహిత్యంలో "ఆమె"ను ఉన్నత స్థానంలో నిలిపారు.

**ఆధార గ్రంథాలు :**

1. అతడు - ఆమె - డాక్టర్ ఉప్పల లక్ష్మణ రావు
2. తెలుగు నవల - అక్కిరాజు రమాపతిరావు
3. శత వసంత సాహిత మంజీరాలు - ప్రయాగ వేదవతి

# అరణ్యకృష్ణ కవిత్వంలో - ఆమె

- డా॥. సుంకర గోపాల్, తెలుగు శాఖాధిపతి, డి.ఆర్.జి. ప్రభుత్వ కళాశాల, తాడేపల్లిగూడెం.

పురాణాల్లోను ఇతిహాసాల్లోను 'స్త్రీ'లను ఎలా చూశారో కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. స్త్రీ హృదయాన్ని, ఆమె అసలు తత్వాన్ని పట్టుకునే ప్రయత్నం అక్కడ జరగ లేదు. అందాన్ని చూశారు. వాళ్ళకి కలువలు, పద్మాలు, తీగలు కనిపించాయి. చంద్రబింబాలు, సరస్సులు కనిపించాయి. 'స్త్రీవాదం' పేరుతో తమ బాధల్ని, అస్థిత్వాన్ని తామే రాసుకుని వెలుగులోకి తెచ్చుకునేవరకు 'ఆమె' గురించి, ఆ వేదన గురించి తెలుసుకొనే ప్రయత్నాలు జరగలేదు. వివక్షత గురించి, వెనుకబాటు తనం గురించి 1975-1985 దశాబ్దంలో ... గట్టిగా ప్రారంభమైనది.

స్త్రీల దుఃఖం గురించి, అమ్మ గురించి కవితలు వచ్చి వుండొచ్చు. కానీ వాటి వెనుక పితృస్వామ్య ఆలోచనలు వున్నాయి. ఒక స్త్రీ స్థానంలో నిలబడి...కనీసం దగ్గరగా కవిత్వం రాసిన కవులు ఉన్నారు. కె.శివారెడ్డి ఇలాంటి కవితలను 'ఆమె ఎవరైతే మాత్రం' అనే సంకలనంలో కొన్ని చూడవచ్చు. అలాంటి ప్రయత్నం చేసిన మరో కవి 'అరణ్యకృష్ణ'.

అరణ్యకృష్ణ 1994లో నెత్తురోడుతున్న పదచిత్రం, 2016లో కవిత్వంలో ఉన్నంతసేపూ... అనే రెండు కవితా సంపుటాలు వేశారు. ఈ రెండు సంకలనంలో 27 కవితలు 'ఆమె'కేంద్రంగా, చాలా దగ్గరగా సహానుభూతితో రాసినవి ఒక దగ్గరగా చేర్చి 'మనిద్దరం' అనే సంకలనం తెచ్చారు.

21వ శతాబ్దంలో సైతం మనకు రాతియుగపు ఆలోచనలు, ఆచరణలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రెండు లింగాలు ఒక్కటే అనే భావన రావడం కష్టంగా ఉంది. స్త్రీ కంటే పురుషుడు చాలా ఎక్కువ అనే భావన మగపిల్లల్లో చిన్నప్పటి నుండి పెరుగుతూనే ఉంది. అరణ్యకృష్ణ 'స్త్రీ కేంద్రక కవిత్వం' తెచ్చారు. పాలిచ్చిన రొమ్ముకే నిప్పు పెట్టగల సంస్కృతిని ప్రశ్నిస్తున్నారు.

"అమ్మైనా పెళ్ళామైనా ఆమె రక్తమాంసాల మరమనిషి
మరెవరిదో సుఖదుఃఖాల శీతోష్ణస్థితి
ఆమె హృదయ వాతావరణం
గుమ్మం దగ్గర కాళ్ళు తుడుచుకునే పట్టాని తొక్కినట్లు
అందరూ ఆమె స్వేచ్ఛని తొక్కుకుంటూ తిరుగుతారు
సంసార వధ్యశిల మీద పరాయీకరణ పాశంతో
ఆమె వ్యక్తిత్వం ఉరితీయబడుతుంది"

(సాలెగూడు, పుట-34)

ఎలాంటి వాక్యాలు ఇవి. సాలెగూళ్ళను తగలబెట్టే మాటలు. బందీ అయిన బాధిత సమూహపు గొంతుని కృష్ణ పలుకుతున్నాడు. చీకటి నీడలు, పీడకలలు ఎన్ని వున్నా ఆమె చిగురించడం గురించి కలగంటున్న కవి తపన ఇది.

స్త్రీ అంటే పెళ్ళి చేసుకొని, పిల్లల్ని కనడం, చేసుకున్న వాడికి, పుట్టినవాళ్ళకి సేవ చేసుకుంటూ ఉండడం, రుచికరమైన వంట, ఇల్లు శుభ్రంగా ఉంచడం, బట్టలు శుభ్రం చేయడం, అంట్లు తోముకోవడం... చీపురుకట్ట, అట్లకాడ, ××× సోపు ఇలాంటి వస్తువులతో ఆ పనులు చేసుకుంటూ ఉండడం. అయినా ఆమెను చాకిరి జంతువుగా చూడటం, మొగుడైనా, నాన్నైనా నియం తలుగా మారడం... ఇలాంటి పరిస్థితుల్ని 'అరణ్యకృష్ణ' ప్రశ్నిస్తున్నాడు.

వయసు ఎంతైనా ఫరవాలేదు, ఆడపిల్ల అయితే చాలు అన్నట్టు, ఈమధ్య జరుగుతున్న లైంగిక దాడులు సమసమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. బాబాయి, మామయ్య, తాతయ్యలు కూడా వావివరసలు మరిచి, ప్రవర్తించే రోజులొచ్చాయి. తోడేళ్ళను చూసి గొర్రెలు,

మేకలు వణికిపోయినట్టు..ఆడపిల్లల పరిస్థితి గురించి 'క్షమించండి, శీర్షిక లేదు' అనే పేరుతో రాసిన కవితలో -

"అవును ! మాంసవాంఛలో మగాడు రగులు తున్నప్పుడు
వాడు మావయ్య కాదు బాబాయి కాదు తాతయ్య కూడా కాదు
బహుశా కొన్నిసార్లు వాడు నాన్న కూడా కాకపోవచ్చు
కొమ్ములు కోరలు పంజాలు మొలిచినవాడు
- - - - - - - - - - - - - - - - -
పెద్దరికం మారణాంగాలతో వెంటపడుతున్నది
పసిపిల్లల చుట్టూ
కంచెలు వేసుకోవాల్సిన కాలం దాపురించింది"

(మనిద్దరం, పుట-76)

ఒక స్త్రీ వెంటపడి వేధించడం, ప్రలోభాలకి గురి చేయడం, ఏదోలా లొంగదీసుకోవడం లాంటి ఆలోచన లున్న మగాళ్ళని మనం చూస్తూనే ఉంటాం. ఒక్కోసారి తన సొంత భార్య కూడా అలసిపోయి ఉన్నా, తనకు మనసు బాలేకున్నా... కోరిక తీర్చుకోవడమే పరమావధిగా ఉండేవాళ్ళలో మనమూ ఉంటాం. ఈ నేపథ్యంలో కృష్ణ రాసిన గొప్ప కవిత 'ఆమె నిరాకరించినప్పుడు'. ఆమె భార్య కావొచ్చు, ప్రియురాలు కావొచ్చు, ఎవరైనా సరే... 'నో' అంటే...నువ్వామె దేహాన్ని తాకే హక్కు లేదు అంటూ.. కవి ఇలా అంటాడు

"ఆమె శరీరమంటే నీకు
యాంత్రికంగా ఎక్కి దిగే రైలు బండి కావొచ్చు
లోపలికి బైటకి యధేచ్ఛగా తిరిగే నీ ఇంటి గుమ్మంగా తోచొచ్చు
గొప్ప వేదాంతంగా నవరంధ్రాల తోలుసంచీ అని పించొచ్చు
లేదా
నీ ఇంట్లో తులసి కోటకి వంటింటికి పడగ్గదికి
కట్టేసుకున్న పెంపుడు జంతువులా అనిపించొచ్చు"

(మనిద్దరం, పుట-62)

అని చెబుతూ, కేవలం ఆడమనిషిని చర్మమాత్రంగా చూడటం, ఆమె శరీరం లోపల ఉన్న వ్యక్తిత్వ వ్యవస్థని పట్టించుకోకపోవడం, అక్కడున్న సంక్షోభాలను, సంరం భాలను, పుష్పించే తోటలను, కోటానుకోట్ల ఆలోచన కణాల అలజడిని గుర్తించకపోవడం ఎంత దారుణమో కవి వాపోతున్నాడు.

కానీ ఆమెలో ఉన్న వ్యక్తిత్వ వ్యవస్థని గుర్తించినపుడు శరీరంగా కాకుండా మనసుకు దగ్గరగా ఆమె కూడా జరిగినపుడు ఎలా ఉంటుందో కూడా ముగింపులో కవి చెబుతాడు.

"ఐనా స్పర్శలో
నీ గుండెలోపలెక్కడో దాక్కున్న జలపాతాలు
జలజలా రాలి పడాలే కానీ
ముకుళించుకున్న పలకరింపులు విచ్చుకొని
సువాసనలై తాకాలే కానీ
నిన్నో చెట్టుని చేసి
ఆమె సుడిగాలై చుట్టుముట్టెయ్యదూ !

ఈ సంపుటిలో కృష్ణ 'స్త్రీ' గా మారి రాసిన మరో గొప్ప కవిత 'రుధిర సత్యం'. స్త్రీ అంటే ఏమిటో ఒక సంపూర్ణ ఆవిష్కరణ ఇందులో చూడొచ్చు. నెలకోసారి 'స్త్రీ'లో జరిగే శారీరక మార్పుని కూడా కొందరు అర్థం చేసుకోరు. ప్రపంచీకరణ ప్రతిదీ వ్యాపారం చేసింది.

"ఆమె గర్భం నిండా రక్త సముద్రాలు
మనమంతా ఆ రక్త సముద్రంలోంచి
భూమ్మీదకి కొట్టుకొచ్చిన వాళ్ళమే"

ఇలా 'ఎత్తుగడ'తో కవిత ప్రారంభం అవుతుంది. ఒక స్త్రీ గర్భం నుండి రక్తం కాలువలై పారితే కానీ మనిషి విత్తనం మొలకెత్తదనే సత్యాన్ని కవి గుర్తుకు తెస్తాడు. మానవ బీజాన్ని మొలకెత్తించే రక్తక్షేత్రం ఆమె దేహం అంటాడు.

"మనిషంటే రక్తమనీ
రక్తమే మనిషి మొదటి అడుగుజాడనీ

ఆమె నెలకోసారి
తానే రక్తసముద్రికై వివరిస్తుంటుంది"
(మనిద్దరం, పుట-74)

స్త్రీ దేహం పునరుత్పత్తి ప్రక్రియకి ప్రయోగశాల. అసలు ఆమె గర్భద్వారాన్ని మించిన దైవత్వం లేదని కవి జ్ఞప్తికి తెస్తాడు. ఈ కవిత ముగింపులో స్త్రీలు ఋతుస్రావం సమయంలో ఉపయోగించే న్యాప్‌కిన్‌లను కూడా విలాస వస్తువుల జాబితాలో చేర్చడాన్ని తీవ్రంగా నిరసిస్తాడు కవి.

"కోర్కె పండిన తర్వాత
ఎండు గోరింటాకులా దులుపుకుంటాడు
ఆమె ఆకలినీ అవసరాన్ని అలంకరణల్తో కలగలిపి
శరీరాన్ని మళ్ళీ తడి గోరింటాకు చేస్తుంది
(మెహబూబ్‌కి మెహెంది, పుట-30)

నిన్ను మోహించానే తప్ప ప్రేమించిందెప్పుడు ?
అసలు నేను నీ కడుపులో పిండంగా కదలాడినపుడు తప్ప
మనిద్దరం సహజంగా ఏకమైందెప్పుడనీ
(పుట-29)

ఇలాంటి వాక్యాలులో అరణ్యకృష్ణ 'స్త్రీ' హృదయాన్ని గొప్పగా ఆవిష్కరించారు.

సమాజంలో 'స్త్రీ'లను చూసే చూపులో మార్పు రావాలని అతని అక్షరాల్లో అడుగడుగునా కనిపిస్తుంది. 'ఆమె' హృదయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో కృష్ణ మార్గం చూపుతున్నాడు. వ్యక్తిగత స్వేచ్ఛను, మానవత్వాన్ని, పురుషాహంకార భావజాలాన్ని వదులుకోవడం లాంటి భావాలు ఇందులో కనిపిస్తాయి. శైలీ, శిల్పాల దృష్ట్యా కూడా ఇవి గొప్ప కవితలు. 'ఆమె' అణచివేత గురించి అరణ్యకృష్ణ ఆవేదన ఇది. స్త్రీ పురుష సమానత్వం కోసం తపన పడుతున్నాడు. 'ఆమె'ను 'ఆమె' గా చూద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1. మనిద్దరం - అరణ్యకృష్ణ
2. నీలి మేఘాలు - స్త్రీవాద కవిత్వం
3. ఆమె ఎవరైతే మాత్రం - కె.శివారెడ్డి

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వేమన శతకం - స్త్రీ

**- డా॥. కలవకుంట ఈశ్వరబాబు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, చిత్తూరు జిల్లా.

తెలుగు ప్రజల మనస్సులో ఎప్పటికీ నిలిచి ఉండే మహాకవి వేమన. ప్రజాకవిగా, తిరుగుబాటు కవిగా, లోకకవిగా, సంఘసంస్కర్తగా పేరుగాంచిన వ్యక్తి వేమన.

"ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ అప్పారావు మన తెలుగులో మహాకవులు అన్నాడు శ్రీశ్రీ".

కులం, మతం, జాతి భేదాలను పట్టించుకోకుండా ఆచారసాంప్రదాయాల నడ్డివిరిచి, ప్రాంతీయ భేదాలను విస్మరించిన గొప్ప సంఘసంస్కరణాభిలాషి వేమన. వేమన కాలాన్ని గురించి పండిత లోకంలో ఏకాభిప్రాయం లేదు. 15 వ శతాబ్దం అని కొందరు, 16 వ శతాబ్దం అని కొందరు, సి.పి.బ్రౌన్, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వేమన కాలం 17వ శతాబ్దంగా నిర్ణయించారు. డాక్టర్ ఎస్.ఎం.సుభాని గారు వేమన కాలం 1450గా నిర్ధారించారు. భారత ప్రభుత్వం పలువురు పండితులను, పరిశోధకులను సంప్రదించి వేమన కాలం క్రీ.శ.1672 అని అధికార ముద్ర వేసింది.

వేమన ప్రాంతం విషయంలోనూ ఏకాభిప్రాయం లేదు. కడప ప్రాంతమని కొందరు, అనంతపురం జిల్లాలోని కటార్ల పల్లె అని కొందరు, చంద్రగిరి ప్రాంతమని మరికొందరి భావన. గోదావరి మండలం అని కొందరంటే కాదు దత్తమండలం అని మరి కొందరంటే, కొండవీటి వాడని ఇంకొందరి వాదన. స్థూలంగా రాయల సీమవాడని చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేమనను కడపజిల్లా వాసిగా గుర్తించింది. ఆయన పేరు మీదుగా కడపజిల్లాలో యోగివేమన విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసింది.

**వేమన శతకం**

వేమన ఒకచోట కూర్చొని పద్యాలు రాయలేదు. ఊరూరా తిరుగుతూ సంఘంలోని దురాచారాలను గూర్చి విమర్శిస్తూ పద్యాలు చెప్పుకుంటూ వెళ్ళగా అవి ప్రజల్లో నిలిచిపోయాయి. అలా ప్రజల్లో నిలిచిన పద్యాలను పరిశోధకులు సేకరించి వాటికి అక్షరరూపం కల్పించారు. వాటికే వేమన శతకం అని పేరు. అయితే సేకరణలో ఉన్నవన్నీ వేమన పద్యాలేనా అనే సందేహం కూడా ఉంది. వేమన పద్యాల సంఖ్య విషయంలో కూడా ఏకాభిప్రాయం లేదు. సాధారణంగా శతకం అంటే 100 లేదా 108 పద్యాలుంటాయి. కానీ వేమన శతకం విషయంలో సంఖ్యా నిమయం వర్తించదు. కొందరు 3000 పద్యాలంటే ఇంకొందరు 4035 పద్యాలంటే, మరొకరు 5000 పద్యాలన్నారు. వేమన పద్యాలలో అనేక కలుపు మొక్కలున్నాయని వాటిని ఏరివేస్తే వేమన పద్యాలు 2000 మించవని డాక్టర్ ఎన్.గోపి గారి అభిప్రాయం.

వేమన పద్యాలు 'ఆటవెలది' ఛందస్సులో ఉంటాయి. ఇందులో నాలుగు పాదాలుంటాయి. మొదటి మూడు పాదాల్లో మాత్రమే చెప్పదలుచుకున్న విషయం ఉంటుంది. నాలుగో పాదంలో "విశ్వదాభిరామ వినుర వేమ!" అనే మకుటం ఉంటుంది. వేమన పద్యాలు ముక్తకాలు.

**వేమన శతకం - స్త్రీ**

మనది పితృస్వామ్య వ్యవస్థ. పురుషాహంకార సమాజం స్త్రీని అన్ని విధాలా అణగదొక్కింది. స్త్రీకి విద్యను దూరం చేసింది. స్త్రీని కేవలం వంటింటికి మాత్రమే పరిమితం చేసింది. స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యం లేకుండా చూసి అనేక కట్టుబాట్ల పేరుతో బందీగా చేశారని చెప్పవచ్చు. స్వేచ్ఛలేకుండా చెప్పినట్లు విన్న స్త్రీని ఆదర్శ మహిళగాను, ప్రశ్నించిన స్త్రీని గయ్యాళి గంపగాను ముద్రవేసింది సమాజం. దేవదాసీ వ్యవస్థ, సతీ సహ

గమనం, బసివిని వ్యవస్థ, వేశ్యావ్యవస్థ, బాల్యవివాహాలు, వరశుల్కం, వరకట్నం ఇవన్నీ కూడా స్త్రీని అణగదొక్కడానికి చేపట్టిన చర్యలుగా చెప్పవచ్చు.

కులం, మతం, మూఢాచారాలు, సాంఘిక దురాచారాలు వంటి విషయాల్లో అభ్యుదయ భావాలను ప్రకటించిన వేమన తరతరాలుగా అణగదొక్కబడుతున్న స్త్రీజాతిపట్ల కూడా అంతే ఉదాత్తమైన భావాలను ప్రకటించి ఉంటాడని అనుకుంటాం. కానీ అలా అనుకుంటే అది అత్యాశే అవుతుంది. స్త్రీలపట్ల వేమనకు గల భావాలు సంప్రదాయ, సంకుచిత భావాలతో కూడుకున్నవిగా చెప్పవచ్చు. వేమనలాంటి అభ్యుదయవాది, సంఘసంస్కర్త స్త్రీల విషయంలో ప్రకటించిన భావాలను చూస్తే ఆశ్చర్యం, ఆవేదన కలుగుతాయి. వేమన కూడా స్త్రీజాతిని పురుషాధిక్య సమాజ దృష్టితోనే చూశాడని చెప్పవచ్చు.

స్త్రీల విషయంలో వేమనకు అభ్యుదయ భావాలు లేకున్నా తల్లి విషయంలో మాత్రం అతను వెల్లడించి అభిప్రాయాలు గొప్పవచే చెప్పవచ్చు.

తల్లినెరంగు వాడు దైవంబు నెరుగును
మన్ను నెరుగువాడు మిన్నునెరుగు
మిన్ను మన్నెరిగిన తన్ను తానెరుగురా
విశ్వదాభిరామ వినురవేమ.

తల్లి గొప్పతనం తెలుసుకున్న వాడు మాత్రమే దేవుని గొప్పతనాన్ని తెలుసుకున్నవాడవుతాడని వేమన తల్లిని భగవంతునితో సమానంగా పోల్చాడు. దీనిద్వారా వేమనకు తల్లి అంటే ఎంత ప్రేమో తెలుస్తుంది.

తల్లి ఏడ్వవినక తన యాలు వగచిన
జాలి పడెడువాడు జడుడు సుమ్ము
తారతమ్య మెరుగ నేరని పశువు సుమ్ము
విశ్వదాభిరామ వినురవేమ.

తల్లి బాధతో దు:ఖిస్తుంటే ఏమాత్రం పట్టించుకోకుండా భార్య ఏదైనా చిన్న కారణంతో బాధ పడుతుంటే అయ్యో అని బాధపడేవాడు మూర్ఖుడని, తల్లీ పెళ్ళాల మధ్య తేడాను గుర్తించలేని జంతువులాంటివాడని వేమన భావన.

క్రింది పద్యంలో కూడా తల్లిపైన బిడ్డలు దయకలిగి ఉండాలంటాడు వేమన.

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టదా? గిట్టదా?
విశ్వదాభిరామ వినురవేమ.

భర్త మాటలకు అడ్డు చెప్పి భార్యల పట్ల వేమన తీవ్రవ్యతిరేక భావనతో ఉన్నాడు. ఈ విషయంలో వేమన ఆలోచనలు సాంప్రదాయవాదుల్ని తలపిస్తాయి. భార్య, భర్తమాటకు అడ్డుచెప్పరాదు అనే వాదన సాంప్రదాయ ఆలోచనలకు సంబంధించినది. ఇది పురుషాధిక్య సమాజ భావన కూడా. దాదాపుగా వేమన కూడా ఇదే భావన కలిగి ఉన్నాడు.

ఆలు మగని మాటకడ్డంబు వచ్చెనా
ఆలు గాదది నుదట వ్రాలుగాని
అట్టి యాలు విడిచి యడవి నుండుట మేలు
విశ్వదాభిరామ వినురవేమ.

భర్త మాటకు అడ్డం వచ్చే భార్య భార్యనే కాదు. భర్త మాటకు ఎదురు చెప్పే భార్య పూర్వజన్మలో చేసుకున్న పాపం వల్ల దొరుకుతుంది. అటువంటి భార్యని వదిలి పెట్టి భర్త అడవి బాటపట్టాలని వేమన భావన. అంటే భర్త తప్పు చెప్పినా అన్యాయంగా మాట్లాడినా అడ్డు చెప్పరాదనడం ఫ్యూడల్ మనస్తత్వాన్ని తెలియజేస్తోంది.

స్త్రీ, పురుషులు అబద్ధాలు చెప్పే విషయంలో కూడా వేమన పక్షపాత వైఖరితో పురుషుల పక్షం వహించినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

ఆడదాని బొంకు గోడ బెట్టినయట్లు
పురుషవరుని బొంకు పూరి తడికె
స్త్రీలు నేర్పులు భువి ఇకురాయి తపము
విశ్వదాభిరామ వినురవేమ.

ఇందులో స్త్రీ, పురుషుల్ని సంబోధించే విషయంలో కూడా వేమన వ్యత్యాసం చూపాడు. స్త్రీని ఆడదని, మగవాడిని పురుషవరుడని సంబోధించడం పై పద్యంలో మనం గమనించవచ్చు. అబద్ధం ఆడితే అతికినట్లుండాలి అనేమాట వాడుకలో ఉంది. ఈ మాటను స్త్రీకి ఆపాదించాడు వేమన. స్త్రీలు అబద్ధం చెబితే గోడ కట్టినట్లు పకడ్బందీగా ఏలాంటి అనుమానం లేకుండా నమ్మే విధంగా ఉంటుంది. అదే పురుషుడు అబద్ధం ఆడితే గడ్డితో కట్టిన తడికలాగా ఉంటుంది. తడిక అవతల ఏముందో సులభంగా తెలిసిపోతుందట. అంటే పురుషునికి అబద్ధం ఆడడం కూడా తెలియదట. నిజానికి అబద్ధం ఆడడమనేది పూర్తిగా వ్యక్తిగతమైనది. అంతేగానీ దీనికి స్త్రీ పురుష భేదానికి ఏలాంటి సంబంధం లేదు.

జాలలోన నుండి స్త్రీల వీధుల వంక
జూడనీయరాదు సుమ్ము వినక
చూతురేని యట్లు చేటులు మూడురా
విశ్వదాభిరామ వినురవేమ.

స్త్రీలను ఇంట్లోని కిటికీల గుండాల వీధుల్లోకి చూడనివ్వరాదు. అలా చూస్తే చేటు కలుగుతుందట. అంటే అందమైన పురుషులు కనిపిస్తే స్త్రీలు వారితో లేచిపోయే అవకాశం ఉందని వేమన స్త్రీలను నిందించాడు. కానీ ఇది హేతుబద్ధమైనదికాదు.

ఋతువుననుసరించి స్థితి కాలమున నొప్పు
గతిని బట్టి మనుజు మతియు నొప్పు
స్వేచ్ఛ బట్టి ఉవిద చెల్లాటములు నొప్పు
విశ్వదాభిరామ వినురవేమ.

ఋతువును బట్టి వాతావరణం, మనిషి ఆర్థిక స్థితిని బట్టి అతని బుద్ధి సహజంగా ఉంటుంది. అలాగే స్వేచ్ఛను బట్టి స్త్రీ ప్రవర్తన ఉంటుంది. స్త్రీకి స్వేచ్ఛ ఉంటే వారు విచ్చలవాడిగా తిరిగి చెడిపోతారట. కావున స్త్రీకి స్వేచ్ఛ ఉండకూడదట. ఇది పూర్తిగా పురుషాధిక్య భావనతో చెప్పిన అభిప్రాయంగా చెప్పవచ్చు. స్వేచ్ఛను బట్టి చెడిపోడం అనేది వ్యక్తిగతమైనది. దానికి స్త్రీ, పురుషులనే తేడా లేదు.

ఈ విధంగా వేమన స్త్రీల విషయంలో తన భావాలను సాంప్రదాయ ఆలోచనలతో, పురుషాధిక్య భావనతో చెప్పినట్లుగా తెలుస్తున్నది.

## ఆధార గ్రంథాలు

1. వేమన - రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
2. మన వేమన - ఆరుద్ర
3. ప్రజాకవి వేమన - ఎన్.గోపి
4. వేమన కవితాతత్త్వం - పి.వి.అరుణాచలం (సం)
5. వేమన పద్యములు - బి.వి.ఎన్.శాస్త్రి
6. వేమన పద్యరత్నాకరము - భాగవతుల సుబ్రమణ్యం

# రామాయణంలో మహిళల పాత్ర

- డా॥. ఆర్. అరుణాదేవి

హిందూ జాతిని తీర్చిదిద్ది ప్రపంచానికే మహత్తర సందేశాన్ని అందించిన రామాయణంలో ఉన్నది సీతాచరిత్రమే.

"కావ్యం రామాయణ కృత్స్నం - సీతాయశ్చరితం మహత్"

అని వాల్మీకి అన్నారు. (4-7)

కాబట్టి రామాయణంను సీతాచరిత్రం అనవచ్చు. రామాయణంలో మహిళలు అనగానే మనకు గుర్తుకు వచ్చే మొదటి మహిళ సీత. కథంతా ఆమె చుట్టూనే తిరిగింది.

రామాయణ కథాకాలం, ప్రాదుర్భావ కాలం కూడా ఒక్కటే. అందువల్ల ఆనాటి మహిళ ఆ యుగధర్మానికి ప్రతిబింబంగా కన్పిస్తుంది. ఈ యుగంలో ఏకపత్నీత్వ మున్నది. బహుభార్యత్వమున్నది. దశరథాదులు బహుభార్యత్వానికి ప్రతీకలుగా కన్పిస్తే, శ్రీరామాదులు ఏకపత్నీత్వానికి గుర్తులుగా చరిత్రలో నిలిచారు. మహిళలపై దౌర్జన్యాలు జరిపిన రావణాదులున్నారు. ఈ యుగంలో మహిళల్ని రక్షించిన శ్రీరాములూ ఉన్నారు. తప్పు చేసిన శూర్పణఖాదుల్ని శిక్షించక తప్పలేదు.

మహిళల్లో కొందరు తమున్నది అధర్మ పక్షంలో అయినా ధర్మానికే విజయం సిద్ధిస్తుందని ఆశించారు. అలాంటి వారిలో మండోదరి, త్రిజటను స్మరించుకోవచ్చు. వ్యక్తిగత స్వార్థాన్ని పెంచే ప్రయత్నంలో మంథర సఫలీకృతురాలైనా, అది అరణ్యంలోని ఆశ్రమాల్ని, మునుల్ని, మహాపురుషుల్ని రక్షించే విధంగా హితకారక మైంది.

ఇలా అనేక అంశాల్ని కథాగమనంలో పొదివికొన్న కారణంగా, అపూర్వ రచనా రామణీయకత వల్ల రామాయణం శాశ్వత కాలాల పాటు నిలిచేటట్లుగా ఉంటుందని రామాయణాంతరగ్రత సాక్ష్యమే తెలియ జేస్తుంది.

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చమహీతలే।
తావద్ రామాయణ కథా - లోకేషు ప్రచరిష్యతి॥
(వాల్మీకి రామాయణం బాలకాండ)

ఈ లోకంలో ఎంత వరకు కొండలు, నదీనదాలు, భూమండలం నిలిచి ఉంటుందో అంతవరకు రామా యణ కథ సజీవంగా ఉంటుంది. ఇది బ్రహ్మ వాక్కు.

మండోదరి వంటి హితైషిణి మాటలు రావణుడు విని ఉంటే, సీత మాయలేడి పై భ్రమపడకుంటే, శూర్పణఖ రామలక్ష్మణులపై మోహం పెంచుకోకుండా ఉంటే, కైక తన రెండు వరాలు దశరథుణ్ణి అడగకుండా ఉంటే.... ఇలా ఎన్నో ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలను ఆ మహిళల జీవితాల్ని పరామర్శించి తెలుసుకుందాం !

## మహితమైన దారిలో మండోదరి పాత్ర

మండోదరి రావణాసురుని భార్య, మయాసరుడనే వారి కుమార్తె. తల్లి హేమద అనే అప్సరస. సౌందర్య వతుల్లో సౌందర్యవతి. రావణుడు సీతను లంకకు తీసుకొని రావడం ఆమెకు నచ్చలేదు. భర్త నడవడిక కారణంగా రాక్షస వంశానికే ముప్పు వచ్చేట్లు ఉన్నదని ఆమె భావించింది.

పరసతిని నీతో తీసుకురావడం తప్పు. ఇంత యుద్ధం జరిగింది. ఇంద్రజిత్తు మరణించాడు. ఇప్పటికైనా సీతను రాముడి దగ్గరకు చేర్చు. నీ తప్పు ఒప్పుకో! నీవు బ్రతుకు తావు. నీ వారలమైన మేము అందరం బ్రతుకుతాం అని వేడుకొంది.

రాముణ్ణి నీవు మానవ మాత్రుడనుకొంటున్నావు. యుద్ధ రంగంలో ఆయన ముందు దేవదానవులెవ్వరూ

నిలవరు. ఆయన ముల్లోకాలకు రక్షకుడే కాదు, ఒక్క బాణం దెబ్బతో మూడు లోకాలను భస్మం చేస్తాడు. ఆయన ధాటికి గురైన ఖరదూషణాదుల్ని గుర్తించు కోవాల్సింది. మారీచ సుబాహులైనా జ్ఞాపకం రావల్సింది. ఇప్పటికీ మించిపోయింది లేదు. రక్షిస్తాడు. సంధి సంప్రదింపులకు దిగుమంటుంది.

అయినా రావణుడు వినడు! ఆమె మాటలను పట్టించుకోకుండా పెడచెవిన పెడతాడు. భర్త చేసిన పొరపాటును భార్య సరిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. ఇది ఈ యుగధర్మం. భర్త వినినీ వినకపోనీ, తన అభిప్రాయాల్ని ప్రకటించడానికి ఈ యుగంలో ఏ మహిళ వెనుకంజ వేయలేదు. దేవతలతోనే ఊడిగం చేయించు కుంటున్న భర్త, ఎన్నో విజయాలు సాధించినవాడైనా అతని అధార్మిక ప్రవర్తనను సరిచేయాలని మండోదరి నిరసిస్తూనే ఉంది.

రాముణ్ని జయించడానికి హోమం చేస్తున్న రావణాసురుని ఏకాగ్రత భంగం చేయడానికి అంగదుడు మండోదరి జుట్టుపట్టుకుని రావణుని ఎదురుగా తెస్తాడు. రావణుడు నిజంగానే హోమాన్ని వదిలిపెట్టి భార్యను రక్షించుకుంటాడు.

దుర్మార్గులైన పురుషుల కారణంగా సన్మార్గలైన వారి భార్యలు కూడా అవమానాలు పాలవుతారనడికి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుంది ఈ లోకంలో !

రాముని చేతిలో రావణుడు మరణించాడు. మండోదరి హృదయవిదారకంగా విలపిస్తుంది. ఒక్క బలహీనత కారణంగా తానూ, తన రాజ్యం, కుమారులు, బంధువర్గం సర్వం నాశనం చేసుకున్నావు కదా! అని రోదిస్తుంది. సీత కారణంగా నీ కళ్ళపై పొరలు క్రమ్ముకు పోవడం దురదృష్టం అంటుంది. విధి లిఖితం అంటుంది. చావు మూడిన వాడికి హితోక్తులు రుచించవు కదా!

**రామాయణంలో మరపురాని మహోన్నత మహిళామూర్తి - ఊర్మిళ**

ఈ లోకానికి ఈమె నిద్ర గురించి మాత్రమే తెలుసు. ఈమె లక్ష్మణుని భార్య, జనక మహారాజు తమ్ముని కుమార్తె. సీతారాముల కళ్యాణంతో పాటు ఊర్మిళా లక్ష్మణుల వివాహం జరిగింది.

పితృవాక్య పరిపాలన నిమిత్తం రాముడు, సీత అడవికి వెళ్తున్నప్పుడు లక్ష్మణుడు వారి వెంబడి వనవాసానికి సిద్ధమయ్యాడు. ఊర్మిళ కూడా అడిగింది. కానీ లక్ష్మణుడు తాను సీతారాముల సేవార్థమే, రక్షణార్థమే ఈ నిర్ణయం తీసుకున్నానని అంటాడు. అందుకే పద్నాలుగు సంవత్సరాలు ఒక తపస్సులాగా నిద్రాయోగంలో ఉన్నది ఊర్మిళ. భర్త మాట జవదాటక పద్నాలుగు సంవత్సరాలు అయోధ్యలోనే ఉన్నది. అలా భర్తను సేవార్థం అర్పించిన, త్యాగం చేసిన ఊర్మిళ నిద్రాయోగ ముద్రితురాలయింది.

**రామాయణం - రమణుల పాత్ర**

రామ అంటే రాముడు. రామ అంటే రమణి (స్త్రీ) కూడా. రమణులు లేని రామాయణం లేదు. భారతీయ మహిళా జీవనానికి సందేశాలందించిన పాత్రలు ఎన్నో ఉన్నాయి.

సీత సాధుశీలి, సాధ్వి, ధర్మాధర్మాలు తెలిసినది. తన అభిప్రాయాన్ని ప్రకటించడంలో వెనుకంజ వేయనిది. రావణుడు భయపెట్టినా లొంగనిది. రాముడే తన పతి, రాముడే రక్షకుడన్న ఆత్మవిశ్వాసంతో జీవించింది. లోకంలో రావణునిలాంటి వారెవరైనా తనలాంటి సీతల్ని అపహరించినప్పుడు వారిని శిక్షించి లోకం నిష్కంటకం చేయాలని ఆశించింది. మట్టి నుండి పుట్టింది. స్వర్ణం లాంటి జీవిత సందేశమందించింది. చివరికి మట్టిలోనే కలసిపోయింది. అందుకే సీత పరమపునీత లోకమాత అయ్యింది.

ఇది సృష్టి చదరంగం. ఈ చదరంగంలోని పావులే స్త్రీపురుషులు. రామాయణంలోని స్త్రీలూ అంతే. ఇంకా సుమిత్ర, త్రిజట, అనసూయ, అరుంధతి, శబరి, కైక, మంధర, శూర్పణఖ, అహల్య, శృతకీర్తి, మాండవి.... ఇలా వారందరినీ గూర్చి రామాయణంలో ఆయా సందర్భాల్లో

కన్పించే వారి ప్రత్యేక వ్యక్తిత్వాలున్నాయి. ఆ వ్యక్తిత్వాలను సరిగ్గా గుర్తించాలంటే మన హృదయం తెరవాలి. వారి ఆవేదన అర్థం కావాలి. రామాయణంలోని ఏ పాత్ర విషయంలోనైనా మనం ఈ పద్ధతే అనుసరించాలి.

"సర్వే భవన్తు సుఖినః సర్వేసన్తు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యన్తు - మాకశ్చిత్ దుఃఖభాగ్భవేత్"
ఓం శాంతిః శాంతిః శాంతిః
గరుడ పురాణం (35-51)

**ఆధార గ్రంథాలు :**

1. వాల్మీకి రామాయణం
2. www.wikipedia.org
3. శ్రీరామాయణం - తెలుగు పుస్తకాలు

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్ర చిత్రణ పరిశోధన పరిధి - పరిమితి

- బలిజేపల్లి విజయలక్ష్మి, ఇన్స్పెక్టర్, సుబేదారి, హన్మకొండ జిల్లా, తెలంగాణ.

భారతాన్ని గురించి లోకంలో ఒక నానుడి ఉంది. లోకంలో ఉన్నదంతా భారతంలో ఉంది. భారతంలో ఉన్నదంతా లోకంలో ఉందని నిజమే, భారతం ఇతిహాసం, అందులోనూ పద్దెనిమిది పర్వాల గ్రంథం. అందువల్ల మానవ జీవితంలోని అనేక పార్శ్వాలు ఈ మహాభాతరత గ్రంథంలో చిత్రింపబడినాయి. ఇందులో ఇంకో ప్రధానాంశం కూడా ఉంది. ఈ గ్రంథాన్ని 'జయ' అనే పేరుతో వ్యాసమహర్షి రాశారు.

భారతీయ కుటుంబ జీవనంలో స్త్రీలకు ప్రత్యేకస్థానం ఉంది. పుట్టినప్పటి నుండ మరణించేదాక పురుషులు ఒకే కుటంబ జీవనంలో కొనసాగుతారు. స్త్రీలు అలా కాదు, వారికి పుట్టింటి జీవితం, మెట్టింటి జీవితం - రెండు జీవితాలు ఉంటాయి. ఈ రెండు కుటుంబ జీవనాలకు స్త్రీ జీవితం ఒక వారధి. కాబట్టి కుటుంబ జీవనంలో పురుషుల కన్నా స్త్రీలకే బరువు బాధ్యతలు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే భారతంలోని స్త్రీ పాత్రలను పరిశీలిస్తున్నాను. అయితే మహాభారతంలో 136 స్త్రీ పాత్రలున్నాయి. ఈ పాత్రలన్నింటిని కూడా పరిశీలించడం సాధ్యం కాదు. అందువల్ల కుటుంబధర్మాన్ని, సృష్టిధర్మాన్ని సామాజిక ధర్మాన్ని నిర్వర్తించి, సామాజిక విలువలను పరిరక్షించడంలో జీవితాన్ని గంధపు చెక్కలా అరగ దీసుకున్న త్యాగశీల పాత్రలను, సహజాతాలను కుటుంబ - సామాజిక జీవిత నేపథ్యంలో అదుపులో పెట్టుకోకుండా జీవితాలను ఛిద్రం చేసుకున్న పాత్రలను - ఇలా ప్రధానమైన కొన్ని పాత్రలనే దృష్టిలో పెట్టుకొని కూడా కొంత పరిమితిని - పరిధిని ఏర్పరచుకొనడం జరిగింది. ముఖ్యంగా ఈ నాటి సమజానికి ఆనాటి సామాజిక వ్యవస్థఖు ప్రతిఫలనాలుగా రూపొందిన ఈ స్త్రీపాత్రలు ఏమైన దోహదం చేస్తాయా అన్న ఆలోచన కేంద్రంగా కూడా ఈ పాత్రలను విశ్లేషించడం కోసం ప్రయత్నించాను.

కవిత్రయం రాసిన ఆంధ్ర మహాభారతంలో కూడా అనేక పాత్రలున్నాయి. ఇది ఇతిహాసం కాబట్టి సమగ్రమైన సామాజిక జీవితాన్ని చిత్రించింది. ఈ జీవిత చిత్రణలో శాశ్వతత్వాన్ని పొందిన స్త్రీల పాత్రలు పరిమితంగానే ఉన్నాయి. వాటిల్లో కుంతి, ద్రౌపది, శకుంతల, దమయంతి, సావిత్రి, సీత పాత్రలు ముఖ్యమైనవి. కుంతి, ద్రౌపది పాత్రలు తప్ప మిగిలిని పాత్రలు భారతంలోని ఉపాఖ్యానాల్లో వస్తాయి. ముందుగా కుంతి పాత్రను పరిశీలిద్దాం.

కుంతి జీవితంలోని అనేక అంశాలు ఈ నాటి సమాజానికి దశ-దిశను నిర్దేశిస్తాయి. పెళ్ళి కాకుండానే తల్లి అయిన కన్యల దీనస్థితికి కుంత ఒక ఉదాహరణ. కాబట్టే కరుణశ్రీలాంటి వారు భారతంలోని ఈ అంశాన్ని తీసుకొని కరుణరసాత్మకంగా "కుంతి కుమారి" ఖండ కావ్యాన్ని వ్రాసారు. భర్త చనిపోయిన స్త్రీ అధైర్యపడకుండా కోడిపెట్ట పిల్లల్నిపోషించినట్లు తన పిల్లల్ని పెంచి పెద్ద చేసి వంశాభివృద్ధికై ఎవరైన అష్టకష్టాలు పడితే, "కుంతి పాండవులను పెంచినట్లు ఆవిడ తన పిల్లల్ని పెంచింది" అంటారు.

ద్రౌపది పాత్ర అటు మాతృస్వామ్యవ్యవస్థకు ఇటు పితృస్వామ్య వ్యవస్థకు వంతెన వంటిది. ద్రౌపది మాతృస్వామ్య వ్యవస్థ అవశేషరూపం. ఒక్క భర్తతోనే కాపురాలు చేయలేక విడాకులను సిద్ధపడటమో, ఆత్మహత్యలకు పాల్పడటమో చేస్తున్న స్త్రీలు ద్రౌపది ఐదుగురు భర్తలతో ఎలా కాపురం చేయగలిగింది. వాళ్ళ కష్టసుఖాల్లో అనునిత్యం పాలుపంచుకుంటూ వారిలో ఈర్ష్యా ద్వేషాలు పొడసూపకుండా ప్రేమానురాగాలు పరిమళించే

విధంగా ఎలా నడచుకో గలిగింది, ఇత్యాది అనేక సందేహా లకు ద్రౌపది పాత్ర సమాధానం చెబుతుంది.

ప్రపంచంలో సాధారణంగా అత్తలు కోడళ్ళను గానీ, కోడళ్ళు అత్తలను గానీ మెచ్చుకొనడం అరుదు. కుంతి తన కోడలైన ద్రౌపదిని గురించి శ్రీకృష్ణునికి చెబుతూ ద్రౌపది అనుభవించిన కష్టాలు అవమానాలు లోకంలో ఎవ్వరూ అనుభవించి ఉండరు. అని చెప్పంది. అంతే కాదు ధర్మరాజు మాటకు తలవొగ్గి అందరూ సంధి వచనాలు వల్లిస్తుంటే పాండు పుత్రులకు తమ కర్తవ్యం ఏంటో తెలియక పోతే ద్రౌపదిని అడిగి తెలుసుకొని, ఆ ప్రకారంగా నడచుకొమ్మని వాళ్ళకు చెప్పు అంటూ తన మేనల్లుడైన శ్రీ కృష్ణునితో అన్నది. ఈ రెండు మాటలు చాలు ద్రౌపది వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి. కుంతి వ్యక్తత్వాన్ని అర్థం చేసుకోడానికి. అదే విధంగా తన అత్త అయిన కుంతిని గురించి చెబుతూ ద్రౌపది పృథ్వీ సమానం అన్నది. అంటే ఆమెలోభూదేవి అంత సహనం ఉన్నాయి కాబట్టే పసితనంలోనే తండ్రిని కోల్పోయిన పాండవులను అష్టకష్టాలు పడి ఎన్నో అవమానాలను భరించి పెంచి పెద్ద చేసి వీర మాతగా ఖ్యాతిని పొందిందిన్నమాట.

ఇలా చెప్పుకుంటూ పోతే అత్తా కోడళ్ళు ఇద్దరూ ఒకరిని మించిన మరొకరు సుగుణాల రాశులుగా కన్పిస్తారు. వంశాభివృద్ధిలోగృహస్థాశ్రమ ధర్మ నిర్వహణలో ఎన్న కష్టాలు వచ్చినా అవమానాలు కలిగిన. మొక్కవోని ధైర్యంతోసంయమనంతో అవసరమైతే జ్వలనంతో సందర్భానప్పి బట్టి, అవసరాన్ని, సమయాన్ని బట్టి నడుచుకొని, అటు పుట్టింటికి ఇటు మెట్టనింటికి కీర్తి తెచ్చిన ధీరవనితలు కుంతి-ద్రౌపది. ఈనాటి సమజానికి వీరు స్ఫూర్తిదాతలు. ఎందుకంటే చిన్న చిన్న కష్టాలకే కుంగిపోతూ, చీటికి మాటికి ఆత్మహత్యలతో విలువైన బతుకును కన్నీటి ధారలకు బలిచేసే నేటి యువతులు, గృహిణులు వీర జీవత గాథను చదివితే వారికష్ట నిష్టూరాలతో పోల్చుకుంటే తమవి అల్పమైనవి అన్న సత్యాన్ని తెలుసుకొన బతుకుపై తప్పక ఆశలు పెట్టు కుంటారని చెప్పవచ్చును.

ఇక శకుంతల, దమయంత,సావిత్రి, సీత పాత్రలు మహాభారత కథలో అంతర్భాగంగా వచ్చే ఉపఖ్యానాల్లో కనిపిస్తాయి. "శకుంతల" తండ్రలేని సమయంలో వేటకై అడవికి వచ్చ తనను చూస మోహితుడైన దుష్యంతుని మాటలు నమ్మి, గంధర్వ వివాహం చేసుకొని ఇబ్బం దులు కొని తెచ్చుకొన్నది. దుష్యంతుడుతన అవసరం తీరగానే రాజధానికి వెళ్ళి, రాజలాంఛనాలతో తీసుకెళ్తానన చెప్పి, వెళ్ళిన వాడుమళ్ళీ తిరిగ రాలేదు. దుష్యంతునితో కొన్నాళ్ళపాటు దాంపత్య జీవితాన్న అనుభవించినందుకు శకుంతల గర్భణ అయ్యింది. మగపిల్లవానికి జన్మ నచ్చింది. అయినా దుష్యంతుడు వచ్చి శకుంతలను తీసుకువెళ్ళలేదు. పెళ్ళి అయన స్త్రీ పుట్టింటిలో ఎక్కువ కాలం వుండటం భావ్యం కాదని కణ్వమహర్షి దుష్యంతున దగ్గరకు శకుంతలను పంపితే, అతడు నీవెవరో నాకు తెలియదు అన్నాడు. కాబట్టి ఈనాటికి ఆధునిక దుష్యం తులు ఎందరో మనకు కనిపిస్తూనే ఉన్నారు. అంటే ఆనాడి కాలం నుండి స్త్రీలు పురుషుల మాటలు నమ్మి శకంతల లాగా మోసపోతూనే ఉన్నారు. ప్రేమ అనే పేరుతో పెద్దలకు తెలియకుండా, క్షణికావేశాలకులోనై బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు. కాబట్టిఇలాంటి వారికి శకుంతల ఎప్పటికీ "తస్మాత్ జాగ్రత్త! పురుషులను నమ్మి మోసపోయి అవమానాల పాలు కాకండి పెద్దల సమక్షంలో ప్రేమైనా పెళ్ళైనా అంటూ ఒక హెచ్చరికగా నిలిచిందని చెప్పవచ్చును.

ఒకతల్లిగా తనకొడుకు ఉనికి కోసం శకుంతల ఒక విధంగా ధర్మపోరాటమే చేసింది. ఈ తరం యువతలుకు శకుంతల కథ కనువిప్పుగా దోహద పడుతుందని చెప్పవచ్చును.

దమయంతి విషయానికివస్తే, తాను మనసిచ్చిన వాణ్ణి పెండ్లి చేసుకోవడంలోనూ, పెళ్ళి అయిన తరువాత విధి వక్రించడం మూలంగా కలిగిన పరిస్థితులకు తట్టుకోలేక,

ఆత్మను న్యూనతభావంతో తప్పించుకు తిరుగున్న భర్తను తన దగ్గరకు రప్పించుకొనడంలోనూ, ఆమె ప్రదర్శించిన చతురత, ధర్మమార్గం, విజ్ఞత నేటి తరానికి ఎంతైనా ఆదర్శమే. ప్రేమించినవాడు దక్కడం లేదని బాధపడటం కాన్న, దక్కించుకోవడంలో ఆనందం ఉంది. హంస తామర ఆకుమీద నలుని బొమ్మని చిత్రించింది. దమయంతి కిచ్చి నీకు తగిన వరుడితడే అని చెప్పింది. అప్పటి నుండి దమయంతి తన మనస్సును అతనిపై లగ్నం చేసింది. తన స్వయంవరంలో నలుని తప్పక వరించాలని త్రికరణశుద్ధిగా నిశ్చయించుకున్నది. అయితే నలుడు ఇంద్ర, వరుణ, అగ్ని, యముల దూతగా వారి విరహవేదనను దమయంతితో పలికి, వారి నల్గురులో ఎవరైనా సరే పెళ్ళిచేసుకొని సుఖపడమని అంటే, దమయంతి అందుకు అంగీకరించలేదు. వచ్చినవాడు నలుడే అన్న ధర్మసందేహం ఆమెను ఒకవైపు వేధిస్తున్నా, గంభీరంగా చాకచక్యంగా ప్రవర్తించింది. నలుని జన్మనామాలు తెలుసుకోవాలని విఫల ప్రయత్నం చేసింది. చివరకు తల్లిదండ్రుల అనుమతితో పెద్దల ఆశీస్సులతో నలుని పెండ్లి చేసుకొన్న ధీరవనిత దమయంతి.

జూదంలో ఓడిపోయి అడవిపాలైన నలుడు దమయంతితో పాటు కానలన్నీ తిరగాదు. అయితే ఒకరోజు ఒకచెట్టు నీడలో విశ్రమించిన నలదమ యంతులు కాసేపునిద్రకు ఉపక్రమించారు. అలసిపోయిన దమయంతి గాఢనిత్రలో ఉండగా మెల్కాంచిన నలుడు, తనవలననే ఆమెకు ఈ దుస్థితి కలిగిందని భావించి, ఆత్మన్యూనతాభావంతో, అడవిలో భార్యను వదలి, తాను నిర్ధాక్షిణ్యంగా వెడలిపోయాడు. ఒంటిరి అయిన దమయంతి నలునిలోని ఆత్మ న్యూనతా భావాన్ని మెల్లమెల్లగా తుడిచివేసింది. మారువేషంలో ఉన్న నలుని రప్పించడం కోసం తను ఎన్నో కష్ట నిష్టూరాలను భరించింది. తిరిగి తన స్వయంవరాన్ని ప్రకటిస్తే నలుడు వస్తాడని భావించి అందుకు సిద్దమైంది. చివరకు తాను అనుకున్నది సాధించి ఉత్తమ ఇల్లాలుగా చరిత్రలో నిలిచిపోయింది.

మోహకామాలకు అతీతమైంది ప్రేమ, ఆస్తులు, అంతస్థులు, కుల, మత, ప్రాంత, హోదాలకు అతీతమై నంది. ప్రేమ. ప్రేమ అంత స్వచ్ఛంగా ఉన్నప్పుడే అది మృత్యునైనా సరే జయిస్తుంది. ఈ సత్యాన్ని సావిత్రి ఉపాఖ్యానంలో సావిత్రి స్పష్టంచేస్తుంది.

సావిత్రి, సత్యవంతుని ప్రేమించింది. అతడు అల్పా యుస్సు గలవాడు. అతని తల్లదండ్రులు రాజ్యభ్రష్టులై. అంధులై అడవలో జీవిస్తున్నారు. పూలట గడవన పరిస్థితి, రెక్కాడితేకాని డొక్క నిండని స్థితి. పోయి, పోయి ఇలాంటి కుటుంబానికి కోడలగా వెళ్ళడానికి ఏ స్త్రీఅయన ఇష్ట పడుతుందా? సావిత్రి ఇష్టపడంది.

ఈ ప్రపంచలో ప్రేమ అనేక రకాలుగా ఉంటుంది. సృష్టిధర్మాన్ని నిర్వర్తించేద దాంపత్యం ప్రేమ, వంశాభి వృద్ధిని కాంక్షించేది వాత్సల్య ప్రేమ. సామాజిక ధర్మాన్ని నిర్వర్తించేది సఖ్యమైన ప్రేమ. సృష్టిలోని సర్వభూతాల పట్ల సమభావాన్ని కలిగి ఉండేది విశ్వప్రేమ. ఏ మనిషిలో అయితే ఈ నాలుగు రకాల ప్రేమ భావాలు న్నాయో ఆ మనిషే పరిపూర్ణమైన మనిషి, ప్రధానమన ఈ నాల్గురకాల ప్రేమ స్వరూపాలు వేరువేరుగా ఉండవచ్చుకానీ, స్వభావం మాత్రం ఒక్కటే. అదే త్యాగం. త్యాగం లేకుండా ప్రేమ అనే పదానికి అర్థమే ఉండదు. సావిత్రిలో మనకు ఈ నాలుగు రకాల ప్రేమ భావనలు ప్రస్ఫుటకంగా కన్పిస్తాయి. అంత:పురంలో అసూర్యం పశ్యగా పెరిగిన సావిత్రి అడవిలో సాధారణ జీవితాన్ని సాగిస్తున్న సత్యవంతున్ని పెళ్ళిచేసుకొని సర్వసౌఖ్యాలను త్యాగం చేసింది. సృష్టిధర్మమైన దాంపత్య జీవితం సఫలం కాకముందే యముడు తన భర్త ఆత్మను తీసకువెళు తుంటే, తన ప్రాణాన్ని కూడా లక్ష్యపెట్టకుండా యముని వెంబడించి భర్త ప్రాణాన్ని సం తాన ఫలాన్ని పొందింది. అంటే దాంపత్య - వాత్సల్య ప్రేమలో సఫలీకృతురాలైంది. నిరతంరం అత్తమామలకు, అతిథులకు సేవచేస్తూ సఖ్యప్రేమతో వర్ధిల్లింది. అయితే ప్రేమభావ ప్రకటనల్లో స్వరూప దృష్ట్యా కూడా ఒకదానినుండి మరొకటి

విస్తరిస్తుంది. దాంపత్య జీవితంలో భర్తను ప్రేమించే స్త్రీ భక్తకు సంబంధించిన తల్లిదండ్రుల పట్ల, బంధుజనాల పట్ల, సృష్టి క్రమంలో భార్యాభర్తలు భాగస్వాములు కావడం మూలంగా కలిగిన సంతానం పట్ల వాత్సల్య ప్రేమను కలిగి ఉంటుంది. కుటుంబ సభ్యులపట్ల ఉన్న ప్రేమే ఆ తరువాత, కుటుంబంతో పటిష్ఠంగా సంబంధాలు ఏర్పరుచుకున్న సామాజిక ప్రేమగా విస్తరిస్తుంది. సామాజిక ప్రేమ కులమత ప్రాంతీయ విభేదాల నుండి వేరుపడి స్వచ్ఛమైన భావనతో, మానవీయ విలువలతో కూడుకున్నది. అదే విశ్వప్రేమగా విస్తరిస్తుంది. అంటే ప్రేమ వ్యష్టి నుంచి సమష్టి దిశగా విస్తరిస్తుందన్నమాట. అప్పుడే అది నిజమైన ప్రేమ అవుతుంద. సృష్టి స్థితిలయయలు ప్రేమ, ద్వేషం అనే రెండు భావాల పర్యావసానాలనే చారిత్రక సత్యాన్ని మనం గుర్తించాలి. భారతంలో స్త్రీ పాత్రలు కూడా అవి చిన్నవైనా, పెద్దవైనా ఈ రెండు భావాలను కేంద్రంగా చేసుకొని సాగయని చెప్పవచ్చు. అంతేకాదు ఈ పాత్రలు సమాజానికి దిక్సూచికలుగా ఉంటూ భారతీయ సంస్కృతిని ప్రతి ఫలిస్తున్నాయి. ఆ సంస్కృతికి మూలస్కందాలై విరాజిల్లు తున్నాయి.

❀ ❀ ❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జాషువా రచనల్లో స్త్రీ

**- డా॥. ఎల్. కస్తూరి,** తెలుగు అధ్యాపకులు, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

'గవ్వకు సాటిరాని పలుగాకులు నన్ను ఏమనినా, నన్ను చేరిన కవితాశారద వదలిపోదు' అని ముక్త కంఠంతో తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు జాషువా. ఈయన 1895 సెప్టెంబరు 25వ తేదీన గుంటూరుజిల్లా వినుకొండలో తల్లి లింగమాంబ తండ్రి వీరయ్య దంపుతులకు జన్మించారు.

**రచనలు :**

గబ్బిలం, కాంధీశీకుడు, నేతాజీ, బాపూజీ, స్వయం వరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, పిరదౌసి, ముంతాజ్‌మహల్, క్రీస్తుచరిత్ర వంటివి ఖండక్యాలు. లఘు కావ్యాలు, పద్య గద్య, స్వీయ కావ్యాలను రచించారు.

**బిరుదులు :**

కవికోకిల, కవితా విశారదా, మధురశ్రీనాథ, నవయుగ కవిచక్రవర్తి వంటి బిరుదులందుకున్నారు. కళాప్రపూర్ణ, పద్మభూషణ్, పద్మశ్రీ వంటి పురస్కారాలను పొందారు. క్రీస్తు చరిత్ర రచన కేంద్ర సాహ్యి అకాడమీ అవార్డును పొందారు. గండపెండేరం తొడించుకొని పగటి దివిటీల మధ్య ఏనుగు అంబారిపై ఊరేగింపువంటి సత్కారాన్ని అందుకున్న ఆధునిక రచయితల్లో జాషువా అగ్రగామి.

గుర్రం జాషువా అంటరానితనం వ్యతిరేకత, సంఘ సంస్కరణ, దేశభక్తి ప్రధాన వస్తువులుగా తీసుకొని సాంఘీక దురాచాలపై తిరుగులేని సాహిత్య పోరాటం చేశారు.

అక్షరాన్ని ఆయుధంగాచేసి కవితను ఖడ్గంలా జులిపించి, సాహిత్యాన్ని సామాన్యుని ముంగిట అసమాన్యంగా చేసి, పద్యానికి పట్టాభిషేకం చేసిన గుర్రం జాషువా జీవితం సాఫీగా సాగలేదు. అంటరానితనంతో వెలికి గురై ఎన్నో ఆటుపోట్లను చవిచూసి వాటిని అధిగ మించడానికి నిత్యం కృషి చేస్తూ తన ఉనికిని చాటుకున్న ధీరశాలి.

'కులమతాలు గీచుకున్న గీతలజొచ్చి
పంజరానగట్టువడను నేను
నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు విశ్వనరుడు నేను' - అంటూ జాషువా చాటుకున్నారు. ఇక సమాజంలో స్త్రీ స్థానం గురించి చర్చిస్తే-

పూర్వం మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది. కాలక్రమంగా పితృస్వామ్య వ్యవస్థ రూపుదాల్చింది. పురుషాధిక్యం వల్ల స్త్రీలు అణచివేతకు గురవుతూ తన ఉనికిని చాటుకోలేకపోయారు. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. కానీ ప్రాచీన కవులు స్త్రీలను ఆట బొమ్మలుగా చేసి అంగాంగవర్ణనలు గావించారు. స్త్రీల వ్యక్తిత్వానికి విలువ లేకుండా పోయింది.

ఆధునిక కవులు పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో స్త్రీలకు ఒక సముచితమైన స్థానాన్ని కల్పించారు. స్త్రీల గౌరవానికి ఏమాత్రం భంగం కలగకుండా వారిలో దాగిన ప్రతిభాపాటవాల్ని వెలికితీసే విధంగా ప్రోత్సహిస్తూ రచనలు చేశారు. అలాంటి వారిలో జాషువా ఒకరు.

"స్త్రీని బానిసగా, నిష్ప్రయోజనంగా, పురుషాధిక్య భావనతో జాషువా చూడలేదు. అలా చూసేవారిని ఆర్థిక, సాంఘిక అసమానతలను చూసి బాధపడ్డాడు. జాషువాలో ఉన్న మాతృస్వామ్య భావాలే దీనికి కారణం.

అందుకే అనాథ, స్వప్న కథలలో స్త్రీలనే పాత్రలుగా చేసి భావకవితా స్త్రీ కన్నా భిన్నమైన స్త్రీలను సృష్టించాడు". అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు (జాషువా స్వప్నం - సందేశం).

జాషవా తన రచనల్లో స్త్రీలకు ఇచ్చిన విలువను పరిశీలిద్దాం.

మగ తెగయు నాడతెగనియును
తెగలున్నవి రెండు ఆడు తెగలేకున్నన్
మగ తెగకు పుట్టగతిలే
దగణ్యములు రెండు తెగల అనుబంధంబుల్
(ముసాఫరులు)

ఈ సృష్టిలో ఆడమగ అని రెండు తెగలున్నాయి. ఇందులో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అని లేవు. సృష్టిలో అందరూ సమానమే. ఆడతెగలేకపోతే మగతెగకు పుట్టుకలేదు. స్త్రీ పురుషులిద్దరూ సమానమేనని జాషువా తెలిపారు.

ఆడుదిలేకుండిన
రేడుజగంబులకు శోభయేలేదు నరుం
డూడిగపు యంత్రమనుకొని
చెడెను బంధించి వ్యర్థ జీవినొనర్చెదన్
(ముసాఫరులు)

ఆడవాళ్ళు మిక్కిలి తేజస్సును కలిగి ఉంటారు. వాళ్ళు లేకపోతే ఏడు లోకాలకు శోభ ఉండదు. పురుషులు మేము గొప్పవాళ్ళమని విర్రవీగుతున్నారు. ఈసృష్టికి మూలమైన స్త్రీని ఊడిగం చేసే యంత్రంలాగా చూడడం మంచి పద్ధతి కాదంటారు జాషువా.

'స్త్రీ కంటెం బురుషుడు శ్రేష్ఠుడనుచున్ సిద్ధాంతముల్ చేసితా
టాకుల్ కంఠములెత్తి స్త్రీ జగతి కన్యాయంబు గావించెనో' (వంచిత)

స్త్రీ కంటే పురుషుడు గొప్పవాడని తరతరాలుగా సిద్ధాంత కర్తలు తాటాకు గ్రంథాలపై రాస్తూ స్త్రీకి అన్యాయం చేస్తున్నారు. స్త్రీ పుట్టినప్పటి నుంచి అనేక కట్టుబాట్లతో పెరగడం వల్ల స్వాతంత్ర్యం లేకుండా పోయింది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను చవిచూడని స్త్రీల బానిసత్వాన్ని జాషువా నిరసించారు.

కాంతలను సృష్టిచేయని కారణమున
పెండ్లియాడిన భార్యల పిప్పిజేసి
తరుముచున్నవి పురుషభూతములుకొన్ని
స్త్రీత్వమిడి యట్టివారి శిక్షింపనోయి (కొత్తలోకం)

ప్రాచీన కవులు రాసిన కావ్యాల్లో స్త్రీల అంగాంగ వర్ణనల్ని చదివిన పురుషులు తమ భార్యలు అప్సరసలు లాగా ఉండాలని కోరుకొనేవారు. అంద విహీనమైన స్త్రీ భార్యగా వచ్చినప్పుడు చిత్రహింసలకు గురిచేస్తుంటారు. సౌందర్యం అంటే బాహ్య సౌందర్యం కాదు. ఆంతరంగిక సౌందర్యమని గుర్తించలేని పురుషుల్ని శిక్షించాలంటూ దేవుడ్ని ప్రార్థిస్తారు జాషువా.

"అనసూయాదులు మూటగట్టుకొనిరానాడు గంపంత చి
క్కని పుణ్యంబని వేదశాస్త్రములు వక్కాణింపగా నమ్మి..."
(వంచిత)

స్త్రీల ఎదుగుదలను నియంత్రించడానికి చిన్నతనం నుంచి ఆడపిల్లలకు పతివ్రతల కథల్ని నూరిపోస్తుంది సమాజం. ఆడపిల్లలు వంచినతల ఎత్తకూడదు. అణగి మణగి ఉండాలి. పతినే ప్రత్యక్ష దైవంగా భావించాలి. జీవితాంతం భర్త, అత్తమామలకు సేవ చేయాలి. భర్త మాట జవదాటకూడదు అంటూ సతీసావిత్రీ, అనసూయ వంటి పతివ్రతా శిరోమణులను గురించి పదేపదే చెప్పి సమాజం స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరుస్తుంది. స్త్రీలు ఆ విషయాన్ని గమనించక అన్నీ నిజాలని నమ్ముతున్నారు. ఎన్ని హింసలకు గురిచేసినా శాంతంగా భరిస్తున్నారు. సమాజంలోని దుర్మార్గపు ఆలోచనలకు తలవంచి అంతా తలరాత అని సరిపెట్టుకొని భారంగా జీవించనవసరం లేదు. మేల్కొనండి, విద్యావంతులు కండి అని జాషువా ప్రబోధించారు.

పిల్లలగాంచి పెంచి పృథివింబొదలించెడు మాతృ మూర్తివై
యల్లలులేని శాసనపుంటచ్చులకుం గురియై తపింతువే (వంచిత)

స్త్రీలు కుటుంబంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. అందరికీ అన్నీ సమకూరుస్తూ ఒక యంత్రంలాగా

పనిచేస్తుంది. తమ సంతానాన్ని ఉన్నతంగా తీర్చదిద్దడానికి కృషిచేస్తుంది. అలాంటి స్త్రీలకు సమానహోదా ఎందు కివ్వరు. దేశవిదేశీమహిళలు తమ సమానత్వానికి భంగం కలిగితే సహిస్తారా? వారిని చూసైనా మేలుకోండి అని జాషువా మహిళల్ని చైతన్యపరిచారు.

ఈ సమాజంలో పురుషులు స్త్రీ లను వంటిల్లో ఒక వస్తువుగా చూస్తున్నా మౌనంగా ఉంటున్నారు. సంసార మనే కూపంలోపడి 'బావిలో కప్పలాగా' బయటి ప్రపంచం గురించి తెలుసుకోకుండా బతుకుతున్నారని, గడపదాటని ఖైదీలాగా బంధీలైనారని, ఈ బంధనాల నుంచి బయట పడి వారి ఉనికిని కాపాడుకోమంటూ జాషువా హితబోధ చేశారు.

దయ్యంము పూనకంబయ్యె నాకని లేచి
నగ్నతాండవ మాడు భగ్న చిత్త
కృపలేని మగని ఊంపపుకోతబడలేక
యురిబోసుకొని దేహమూడ్చుతరిణి
అత్తమామల క్రూరమైన దాష్టికంబు
నోర్వక చిచ్చులోనురకురమణి
(వంచిత)

కుటుంబంలో భర్త, అత్తమామలు పెట్టే హింసను తట్టుకోలేక మానసికంగా బాధపడుతూ స్త్రీలు పిచ్చిగా ప్రవర్తిస్తే ఆమెకు దయ్యం పట్టిందని మానసిక క్షోభకు గురిచేస్తారు. వారి హింసనుంచి తప్పించుకోలేక ఎందరో స్త్రీలు నుయ్యోగొయ్యో వెతుక్కుంటున్నారు. ఇలా జరగడానికి కారణం మనశాస్త్రాలు, వాటిని ప్రోత్సహించే వ్యక్తులే అని సమాజపు కట్టుబాట్లను జాషువా విమర్శిం చారు.

ఈ విధమైన దుర్మార్గుల దుశ్చర్యల నుంచి బయట పడాలంటే స్త్రీలు విద్యావంతులై ఆర్థిక స్థిరత్వాన్ని ఏర్పరచుకోవాలి. అప్పుడే దేనినైనా ధైర్యంగా ఎదుర్కొని ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకొంఉటుంది. తనకు జరిగే అన్యాయాల్ని, దౌర్జన్యాలను ఎదుర్కోవాలంటే విద్య అవసరం. 'అబల విద్యాపూర్ణమై తోడురాకున్నన్ దేశము నిద్రమేలుకొనునే' అని జాషువా ప్రశ్నించారు.

స్త్రీలు శక్తిసామర్థ్యాలు లేని అవివేకులని భావించి వారిని అణచివేతకు గురిచేసి అబల అని సమాజం ముద్రవేసింది. పురుషాధిపత్యానికి, అహంకారానికి గురవుతూ ఇంకా ఎంతకాలం అబలగా ఉంటావు? మీ హక్కుల కోసం పోరాడి 'నేను అబలను కాదు సబల' అని నిరూపించుకోవాలని జాషువా పిలుపునిచ్చారు.

రష్యా దేశానికి చెందిన వాలెంటినా తెరిష్కోవా రాకెటు ప్రయాణం చేసి తన సత్తా చాటుకుంది. ఆమెను ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జాషువా తెల్పారు.

ప్రాచీన, ఆచార సాంప్రదాయాలకు కట్టుబడి స్త్రీ పురుషులు తమను తాము నయవంచకుల్ని చేసుకొంటే అనర్థాలు అధికమే తప్పా ఎలాంటి ప్రయోజనం లేదు. కనుక స్త్రీపురుషులు ఇరువురు కలిసికట్టుగా ఒకరినొకరు గౌరవించుకుంటూ, సమానంగా ఎదిగినపుడే ప్రగతిని సాధిస్తారు అన్న విషయాన్ని జాషువా ఈ విధంగా తెల్పారు.

'కాంత మగవారితో చేయిగలపకున్న
తలపనేల యనర్థంబుతప్పదనచు' (నేటి నెలత)
అని అన్నారు.

కాలక్రమంగా స్త్రీలలో మార్పులు వచ్చి అన్నీ రంగా లలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఈ విషయాన్ని జాషువా ఈ క్రింది పద్యం ద్వారా తెల్పారు.

గ్రహియించినది నేటి కామినీ తిలకంబు
బురఖాల కెరయైన బుద్ధిబలము
తెలిసికొన్నది నేటి కలికి ముద్దులగుమ్మ
యుబ్బించు గాథలందున్నకిటుకు
అర్థమైనది నేటి యంబుజతాస్యకు
లేలేత బుడత పెండ్లిండ్లనేగి
(నేటి నెలత)

స్త్రీలు మూఢ విశ్వాలు, పాతివ్రత్య మహిమల్లోని

ఆంతర్యాన్ని తెలుసుకొని మానసిక పరదాల నుంచి విముక్తులయ్యారు అని స్త్రీలలో వచ్చిన మార్పును జాషువా ప్రశంసించారు. స్త్రీలు సామాజిక కట్టుబాట్ల నుంచి, ఈ భావదాస్యాల నుంచి బయటపడాలనే ఆకాంక్షతో స్త్రీల అభ్యుదయానికి తనవంతు కృషిగా జాషువా తన రచనల ద్వారా అందిం చారు. జాషువాకి స్త్రీల పట్ల ఉన్న గౌరవం, ప్రేమ, జాలి, కరుణ ఏపాటిదో ఆయన కవితలే నిదర్శనం అని చెప్పవచ్చు.

**ఆధార గంథ్రాలు :**


1. శ్రీమతి హేమలతాలవణం - జాషువా రచనలు 1, 2, 3 సంపుటాలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
2. జాషువా కవిత్వము -అభ్యుదయ వేదిక, విజయవాడ.
3. కథానాయకుడు జాషువా - తెలుగు అకాడమి, హైదరాబాదు.


❀ ❀ ❀

# ప్రబంధ సాహిత్యం - మహిళ

**- తేలు వెంకటకుమారి,** పరిశోధకురాలు, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

## సంక్షిప్త పరిచయం :

ఆంధ్రదేశ చరిత్రలో వలెనె ఆంధ్ర సాహిత్య చరిత్రలో కూడా 16వ శతాబ్దము స్వర్ణయుగం. ప్రముఖ విజయ నగర చక్రవర్తియైన శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తి ప్రోత్సాహముతో ఈ యుగమును ఆముక్త మాల్యద ప్రబంధ కర్తయైన రాయల పేరున అనగా శ్రీకృష్ణ దేవరాయల యుగమని సాహితీవేత్తలు వర్ణించారు. ఇతని భువన విజయ సభాభవనము లలిత కళా సాహిత్య సాంస్కృతిక నిలయం. రాయల కాలము ప్రబంధములన్నీ శృంగార రస ప్రధానములే. శౌర్య ధైర్యాది గుణములు ఉదార భావం, సత్య నిష్టకం గుణములు కలవారిగా నాయక పాత్రలు తదనుగుణముగానే నాయిక పాత్రలు చిత్రించబడినవి.

## ప్రబంధము నిర్వచనం :

"పురాణేతిహాసాల నుండి ఒక ప్రసిద్ధ కథను స్వీకరించి వివిధ వర్ణలలో అలంకారాలతో పాత్ర చిత్రణలో రసభావ ప్రధానముగా కథను పెంచి రాయటమే ప్రబంధం."

**వ్యుత్పత్తి :**

1) "ప్రబద్యతే ఇతి ప్రబంధంః"

2) "ప్రకృష్టః బంధం ప్రబంధం" అనగా అష్టాదశ వర్ణనలను మిక్కిలి అతికినట్లు కూర్చటమే ప్రకృష్టమైన బంధం.

**ప్రబంధ లక్షణములు :**

1) ఇతివృత్తము పురాణేతిహాసాల నుండి గ్రహించినదై ఉండాలి.
2) ప్రబంధము అనువాదం కాకూడదు. స్వతంత్ర రచనయై ఉండాలి.
3) వస్త్వైక్యం ఉండాలి.
4) అష్టాదశ వర్ణనలుండాలి
5) శృంగార రస ప్రాధాన్యం
6) ఆలంకారికమైన శైలి
7) సజీవ పాత్ర చిత్రణ ఉండాలి. ఉదా:- సత్యభామ, వరూధిని, నిగమశర్మ.

## నంది తిమ్మన-పారిజాతాపహరణము-సత్యభామ

నంది తిమ్మన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల 'భువన విజయ' సభా భవనమందలి అష్టదిగ్గజ కవులలో ప్రసిద్ధులు. 16 వ శతాబ్దానికి చెందిన వారు. ఆంధ్ర భాష లో 'పారిజాతాపహరణము' అనే ప్రబంధాన్ని రచించి సాహితీ సమరాంగణ సార్వభౌముడయిన శ్రీకృష్ణ దేవ రాయలుకి అంకితం ఇచ్చాడు. ఈయన ఆర్వేల నియోగి బ్రాహ్మణుడు. తల్లి తిమ్మాంబ,తండ్రి సింగనామాత్యుడు. ఇతని గురువు అఘోర శివ గురువు, "ముక్కు తిమ్మనాచార్యుని ముద్దుపలుకు" అని ప్రశంశ పొందిన కవి.

సంస్కృతములోని 'హరివంశము'లోని కథను ఆధారంగా చేసుకొని తిమ్మన పారిజాతాపహరణాన్ని రచించారు. ఐదు ఆశ్వాసాల ప్రబంధం. పారిజాతాప హరణము 'మంచి కావ్యాలలో పంచదార చిలుక' వంటిదని ఆరుద్ర గారు అన్న మాట సత్యము. ఆంధ్రులు అల్లారు ముద్దుగా, అతి గారాభంగా చూసుకునే కావ్యనాయిక సత్యభామ. ఈమె రూపురేఖలను తొలిసారి ప్రస్ఫుటంగా చిత్రించిన కవి నంది తిమ్మన.

## సత్యభామ పారిజాతపుష్ప వృత్తాన్ని వినుట :

సత్యభామ చెలికత్తె వచ్చి సత్యభామతో కృష్ణుడు రుక్మిణి ఇంటిలో ఉండగా నారద మహర్షి అక్కడకు వచ్చి పారిజాత పుష్పాన్ని కృష్ణుడికి ఇచ్చాడనీ, దానిని కృష్ణుడు రుక్మిణి కిచ్చాడనీ, రుక్మిణి దాన్ని ధరించగానే ఆమెకు

అపూర్వ సౌంధర్యం కల్గిందని చెప్పింది. తాను కృష్ణుడు వింటుండగా, భర్తకు నచ్చిన వారిలో నా అంతట వారు లేరని విర్రవీగే సత్యభామ గర్వం ఇకముందు చెల్లదని నారదుడు అన్నాడని కూడా చెప్పింది.

**సత్యభామ సందేహము :**

సత్యభామ తనకు తుమ్మెదల గానాలూ, కోకిల ధ్వనులూ, పద్మ సరస్సుల నుండి వచ్చే పిల్లగాలులూ వెనుకటి వలె హాయిని కలిగింపక పోవడానికి కారణం ఏమిటా అని సందేహించినది.

**చెలికత్తె మాటలు విన్న సత్య పలుకులు :**

చెలికత్తె మాటలు విన్న సత్య దెబ్బతిన్న ఆడు త్రాచులా, సన్నగిల్లిన కంఠ స్వరంతో తన చెలికత్తెతో ఇలా అంది. ఓ చెలీ! ఏమిటి? నారదుడు అక్కడకు వచ్చి అలా అన్నాడా? కృష్ణుడు ఆ మాటలు విన్నాడా? రుక్మిణి ఏమి అంది. ఆ పుష్పం గొప్పదని చెప్పి నారదుడు కృష్ణునికి ఈయవచ్చు. దానిని కృష్ణుడు రుక్మిణిని కానుకగా అర్పించవచ్చు. కాని మాయావియైన నారదుడు అక్కడ నా పేరు ఎత్తడం ఎందుకు? కాని కృష్ణుడు అలా మాట్లాడ వద్దని అడ్డుపెట్ట వలదా ? అని పలికెను.

**కోపగృహంలో సత్య :**

సత్య కోపగృహంలో మాసిన చీర కట్టుకొని, ఆభరణా లను అన్నింటిని తీసివేసి, తలకు కట్టుకట్టి, మనస్సులో బాధపడుతూ చీకటింటిలో మంచంపై పడి బాధను అనుభవిస్తూ మౌనంగా ఉంది.

**కృష్ణుడు సత్యభామ ఇంటికి వచ్చుట - కృష్ణుడు సత్యను అనునయించుట :**

కృష్ణుడు కోపగృహంలో ప్రవేశించి, పరిచారిక చేతినుండి విసన కర్రను తీసుకొని, సత్యభామకు విసరాడు. పారిజాత పుష్ప పరిమళాలు సత్యకు ఆశ్చర్యాన్ని కల్గించాయి. వెంటనే ఆమె ముసుగును తీసి చూస్తే ఆమెకు విసురుతున్న కృష్ణుడు కనిపించాడు. నేను నిజంగా ఏదైనా తప్పు చేశానా? నేను నీకు శత్రువునా? నీవు నన్ను దయతో చూడకపోతే ఒక నిమిషం అయినా నేను జీవించలేను. సత్యా! తేనెలొలికేలా ఎందుకు మాట్లడటం లేదు అని అనునయించెను.

**సత్యభామ కృష్ణుని పలికిన నిష్ఠురములు :**

కృష్ణుడిని చూస్తూ ఇలా మాట్లాడింది. కృష్ణా ! ఈ ప్రియ వచనాలు నేర్పిన నిన్ను నమ్మినందుకు ఫలితం వెంటనే కల్గింది. పసుల కాపరికి మన్మథ రహస్య కార్యాలు తెలుస్తాయా? నిన్ను నమ్మను. లేని ప్రేమలను నీ మాటలలో నింపవద్దు.

**సత్యను కృష్ణుడు బుజ్జగించుట :**

ఏడుస్తున్న సత్యను కృష్ణుడు ఓదార్చి అనురాగమూ, మాధుర్యమూ వెల్లడి అయ్యేటట్లు ఆమెతో "సత్యా! ఒక పువ్వుకోసం నీకు ఎందుకు విచారం? నందనవనంలో ప్రవేశించి యుద్ధానికి దేవేంద్రుడు వచ్చినా అతణ్ణి జయించి పారిజాత వృక్షాన్ని తెచ్చి నీకిస్తాను. పెరటి చెట్టుగా దాన్ని క్రీడోద్యానంలో పాతిస్తా" నన్నాడు. సత్వభామ ఆ మాటలకు సంతోషించింది.

**ముగింపు :**

పారిజాత వృత్తాంతం ఆమెకు మానహానినీ, మగని కూర్మికి లోపాన్నీ కల్గించడం చేతనే, సత్యభామ దెబ్బతిన్న త్రాచులా నెయ్యిపోస్తే భగ్గున మండే అగ్ని జ్వాలలా విజృంభించిందని గ్రహించాలి. పారిజాత వృత్తాంతాన్ని విని ప్రాణాలు విడుస్తానని సత్యభామ అనటం ఆమె అభిమానవతి అని తెలుస్తుంది. సవతుల ఎదుట భర్త తన్ను అవమానించడం, నారదుడు ఆమెను ఎకసక్కెం చేయడం సత్యభామకు మిక్కిలి విచారాన్ని కల్గించడం వల్ల సత్యభామ గరువతనం వెల్లడయింది. కృష్ణుడిని ఈమె 'పసుల కాపరి' అని, 'ధూర్త గోపాలుడు' అంటుంది. ఈ మాటలలో ఆమెకు కృష్ణుడిపై గల అధికారం, ఆమె స్వాతిశయం వెల్లడి అవుతాయి. మానవ రహితమైన బ్రతుకు మానినికి వ్యర్థం అనడం ఆమె మానవతీత్వాన్ని తెలుపుతోంది.

**తెనాలి రామకృష్ణుడు**

తెనాలి రామకృష్ణుడు తెలుగు దేశంలో తెనాలి రామ లింగడుగా పరిచయమయ్యాడు. 'పాండురంగ మహాత్మ్యాన్ని' తెనాలి రామకృష్ణ కవి రచించాడు. దీని మూల గ్రంథం స్కంధ పురాణం నుండి స్వీకరించారు. శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన కవి. 16వ శతాబ్దానికి చెందినవారు. లక్ష్మాంబ, రామయ్య వీరి తల్లిదండ్రులు. పాండురంగ మహాత్మ్యాన్ని వీరూరి వేదాద్రికి అంకితం ఇచ్చాడు. పాండురంగ మహత్యంలోని ఉపఖ్యానం నిగమశర్మ అక్క. నిగమశర్మ అక్క పాత్ర పోషణలో రామకృష్ణుడు చూపిన నేర్పు ఎంతో విశిష్టమైనది.

**నిగమశర్మ అక్క :**

నిగమ శర్మ అక్కకు కవి పేరు పెట్టలేదు. ఈమె సభాపతి గారి పెద్దకూతురు. ధర్మార్థముల యందు జాగ్రత్త, తెలివి తేటలు, పనిపాటలలో నైపుణ్యము ఈమెకు వెన్నతో పెట్టిన విద్యలు. "నిగమశర్మ అక్క పాత్ర సృష్టి అసామాన్యమనీ ఈమె రామకృష్ణుడు అమృతంలో తన కలాన్ని అద్ది, తీర్చిదిద్దిన బంగారు బొమ్మ అనీ" రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారు నిజాన్ని చాటి చెప్పారు.

**పుట్టింటి వివరాలు :**

నిగమశర్మ ఈమె తమ్ముడు. నిగమశర్మ కూడా వేదశాస్త్రాలు నేర్చినా, అతని దృష్టి కామ పురుషార్థంపై మళ్ళింది. తాతముత్తాతలు కూడబెట్టిన ధనాన్ని ఖర్చు చేసాడు. అప్పుల వారి బాధపడలేక ఊరు విడిచి తిరిగేవాడు.

**పుట్టింటికి రాక :**

నిగమశర్మ ప్రవర్తన అక్క చెవిన పడింది. నిగమశర్మకు బుద్ధిచెప్పి, ఇంటినీ, తమ్ముని సరయిన మార్గంలో పెట్ట గలననే ధైర్యంతో ఆమె పిల్లలనూ భర్తను వెంటపెట్టుకొని పుట్టింటికి వచ్చింది.

**ఇంటిని చక్కబెట్టడం :**

అన్ని విధాలా ఇంటిని సరిదిద్దడానికి ప్రయత్నించింది. తొందర పాటు వల్ల నష్టం వస్తుందని ఆమె గ్రహించి, కొంతకాలం మౌనం వహించి, పరిస్థితులను అర్థం చేసు కొంది. తమ్ముని చేతిలో పడకుండా మిగిలి ఉన్న మూలధనాన్ని భద్రం చేసింది. వారి కష్టాలను చూసింది.

**మరదలి గూర్చివేదన :**

తన తమ్ముడి భార్య మరదలిని చూస్తే ఆమెకు దుఃఖం ఆగలేదు. మరదలిపై సానుభూతి చూపింది.

**తమ్ముని రాక :**

తమ్ముడు ఒక రోజు ఇంటికి వచ్చాడు. ఇంట్లో అక్కను చూసి భయపడి వెనుతిరగబోయాడు. నిగమ శర్మకు అక్క అంటే భయ గౌరవాలు ఉన్నాయి. తన తియ్యని మాటలతో తమ్ముని లోబరచుకుంది. ఆమె తియ్యని మాటలు తమ్మునికి పంజరాలయ్యాయి.

**తమ్మునికి సపర్యలు :**

తమ్ముని ముఖంలో ఆకలిని గమనించి క్షణంలో వంట చేస్తా తిందువుకాని అని తమ్మునికి చెప్పింది. తమ్మునికి తలంటించి, కొత్తబట్టలు ఇచ్చి చందనం పూసి చక్కగా సపర్యలు చేసింది.ఇప్పుడు అతడు అక్క చెప్పినది ఏదైనా వినడానికి సిద్ధంగా ఉన్నాడు.

**తమ్ముని మందలించుట :**

తమ్మునికి ఉపదేశం చేయడానికి అదే తగిన సమయం అని ఆమె గ్రహించింది. భార్యను, తల్లిదండ్రు లను, వంశ గౌరవాన్ని చూడటం లేదని నిందించింది.

**తమ్ముని బ్రతిమాలడం :**

కోపం మాని స్వరం మార్చి సామరస్యంగా తమ్మునకు హితవు బోధించింది. భారతంలో కర్ణుడి వలె నీవే ఈ ఇంటికి ఆధారము అని తమ్ముడిని పొగిడింది. నీవు యజ్ఞం చేస్తే ఆ వేదికపై కూర్చుంటానని గంపెడాశతో వేయిమందిలో చెప్పుకున్నానని సౌభ్రాత్రాన్ని చూపి కన్నీరు పెట్టుకోబోయింది. నా తమ్ముడవు బికారిగా ఉండరాదనే తాను చెప్పినట్లు నడుచుకోమనీ, దీనాతిదీనంగా తమ్ముని వేడుకొంది.

నిగమ శర్మ అక్క పాత్రను కవి తన ప్రజ్ఞా వైభవంతో, సాహిత్యంలో మరపురాని అమృతమూర్తిగా రూపుదిద్దాడు.

**ముగింపు :**

ఇందులోని పాత్ర లన్నింటిలో ప్రత్యేక వ్యక్తిత్వం కనబడుతుంది. సంసార సమస్యల నుండి సామాజిక, సామ్రాజ్య సమస్యల పరిష్కారానికి ఎంతో నేర్పు, చాకచక్యంతో పనిచేసి వ్యవహరించాలి. ఏదైనా ఒక సమస్య ఏర్పడినపుడు దాని మూలాలను తెలుసుకోవాలి. చెడిపోయినవాడు మారడానికి వాడు ఎందుకు చెడి పోయాడు, ఎవరు కారణం, ఎందుకు పుట్టింది దురా లోచన అని ఆలోచించాలి. ఏదైనా ఒక అలవాటు అయిన పనిని ఒక్కసారిగా మానమంటే అంత తేలికైన పని కాదు. అందుకే నిగమశర్మ అక్క తన తమ్ముని విషయంలో సమరస భావంతో సమస్యను పరిష్కరించింది. ఆమె తెలివి, తెగువ, నగవు, బిగువుల కల మాటలతో మందలించే తీరు నిగమశర్మ అక్కది.

గృహస్థ మార్గంగా మన పద్ధతిలో సమస్యకు పరిష్కారం ఎంచుకోవాలి. ఎంతమంది ఇళ్ళలో నిగమ శర్మలు లేరు. తల్లిదండ్రులు, భార్యలు వారిని మార్చలేక, ఏమీ చెయ్యలేక ఎంతో బాధపడుతున్నారు, వాళ్ళందరి కథలకి నిగమశర్మ పాత్ర ప్రతీక. అందుకే కావ్యం చాలా అవసరం.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రబంధ సాహిత్యం - జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష
2. ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్ర - డిగ్రీ 3rd సెమిస్టర్ స్పెషల్ తెలుగు
3. మనుచరిత్ర - దివాకర్ల వెంకట అవధాని
4. పారిజాతాపహరణం - నంది తిమ్మన
5. పాండురంగ మహత్మ్యం - తెనాలి రామకృష్ణుడు

**నిఘంటువులు :**

1. శబ్ధ రత్నాకరము - బహుజనపల్లి సీతారామాచార్యులు
2. సూర్యరాయాంధ్ర నిఘంటువు
3. తెలుగు పర్యాపద నిఘంటువు - ఆచార్య జి.ఎస్.రెడ్డి - ప్రగతి పబ్లిషర్స్-2016

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఐతిహాసిక నారీమణుల మాతృ సందేశం

**– వడ్డాది బాలగాయత్రీ,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వ కళా పరిషత్, విశాఖపట్నం.

## సంక్షిప్త పరిచయం (Abstract):

సంస్కృత సాహిత్యం మాతృక అయిన కూడా ఈ తెలుగు జాతి అస్తిత్వాన్ని నిలబెడుతూ ఆంధ్ర భాషా సంస్కృతులను సుసంపన్నం చేసిన ఎందరో కవులు, రచయితలు నాటి నుండి నేటి వరకు ఉన్నారు. వారు తమ రచనలలో స్త్రీలలో వివిధ కోణాలను స్పృశించారు. గృహిణిగా, ఆలిగా, జాయగా, శక్తి స్వరూపిణిగా మహిళ ప్రతిఘటనల మధ్య కూడా తనకు తాను నిరూపించు కుంటూ ఉన్నది. ప్రాచీనం నుండి ఆధునిక సాహిత్యం వరకు ప్రస్ఫుటంగాను, అంతర్లీనంగాను ఎన్నో స్త్రీ పాత్రలు పాఠకుల మనసులను, సమాజాన్ని ప్రభావితం చేస్తూ ఆదర్శవంతులుగా నిలిచారు. వారిలో నారీ రత్నాలు అయిన కుంతీ, సుమిత్ర, ద్రౌపది, జిజియాబాయి, వంటివారెందరో తమ పుత్రులను, పరస్త్రీలను మాతృ భావనతో చూసే విధంగా పెంచారు. వారు నేటి వనితలకు ఎంతో ఆదర్శం.

## ముఖ్యాంశాలు (Key Words) :

సహనశీలి కుంతీ, సహృదయ మాత సుమిత్ర, క్షమాశీల ద్రౌపది, వాత్సల్యమూర్తి యశోద, రాజమాత జిజియాబాయి నిగమశర్మ అక్క.

### ఉపోద్ఘాతం :

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" కన్నతల్లి, మాతృభూమి స్వర్గం కంటే మిన్న అని అన్నాడు రాముడు (శ్రీమద్రామాయణం - యుద్ధకాండ). ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పటిష్టమైన విలువలు గల కుటుంబం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంటుంది. అట్టి కుటుంబాన్ని పట్టి ఉంచి గృహన్ని స్వర్గసీమగా చేయగలిగే సామర్థ్యం అతివల సొంతం. స్త్రీలకు మనో ధైర్యం కూడా ఎక్కువగా ఉంటుందని మనో విశ్లేషకులు కూడా చెబుతున్నారు. వారిలో కుంతీ ప్రథమురాలు.

### సహనశీలి కుంతి :

కురువంశ పాండురాజుకు ధర్మపత్ని, మాద్రికి సపత్ని. తన పుత్రులను ధర్మ, భీమ, అర్జునులతోపాటుగా మాద్రి పుత్రులైన నకుల, సహదేవులను కూడా తన కన్నబిడ్డలు వలె సాకిన మాతృమూర్తి. ఆమె సహనం, క్షమాగుణం, సేవాతత్పరత, ఓర్పు, దైవభక్తి మొదలగు గుణాలు ఏ కోణం నుంచి చూసినా అబ్బురమనిపించక మానదు. సంస్కృత మూలాన్ని పరిశీలించినా, కవిత్రయం అను వాదం చదివినా కుంతీదేవి పడిన కష్టాలు మరెవరూ పడలేదనిపిస్తుంది. చిన్నతనంలోనే భర్త మరణం, తన ఇంటిలోనే పరాయిగా బ్రతకవలసి రావడం, తన ఎదుటే తన పిల్లలపై హత్యా ప్రయత్నం, వారికి అరణ్యవాసం, ఆపై కోడలికి అవమానం, ఆపై యుద్ధం ఇన్ని జరిగినా కూడా తట్టుకొని నిలబడింది. యుద్ధం తరువాత ధర్మరాజుకు రాజ్యాభిషేకం జరిగిన తరువాత కూడా రాజ్యంలో ఉండక గాంధారీ, దృష్టరాష్ట్రుల సేవ కోసం వారితోపాటే అరణ్యవాసానికి వెళ్లింది. తన పుత్రులను ధర్మపరాయణులుగా, శూరులుగా, వీరులుగా, సత్య వంతులుగా, శాస్త్ర విశారదులుగా ఎప్పటికప్పుడు వారిని తీర్చిదిద్దింది. కన్యగా తాను చేసిన తొందరపాటుకు జీవితాంతం పశ్చాత్తాపంతో మధన పడింది.

ఈనాటి తరానికి సందేశం కుంతీ రెండు విధాలుగా చాటింది. ఒకటి వయస్సులో తెలియక చిత్తచాంచల్యానికి గురై అనాలోచితంగా చేసే పని వల్ల భవిష్యత్తులో జరగబోయే విపరీత పరిమాణాలు గ్రహించలేకపోవడం, రెండవది గృహస్థాశ్రమంలో ఒడిదుడుకులను తట్టుకొని పిల్లలను ప్రజా ప్రయోజకులుగా తీర్చిదిద్దగలగడం. నేటి

సమాజంలో వ్యక్తుల అనాలోచిత నిర్ణయాల వల్ల కుటుంబ విచ్ఛత్తిని మనం గమనిస్తూనే ఉన్నాం. అతి వలుకు ఆత్మస్థైర్యం పెంపొందించే మహాభారతం చదవ దగినది.

**క్షమాశీల మాతా ద్రౌపది:**

కురువంశ పంచ పాండవులకు ఉల్లాలు, ఉప పాండవులకు తల్లి. ఈమె ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న ధైర్యశాలి. కురుక్షేత్ర యుద్ధం అంతా అయ్యాక అశ్వద్ధామ ఉప పాండవులను చంపుతాడు. తరువాత అర్జునుడు అతనిని పట్టి తెచ్చి ద్రౌపది ముందు నిలబెడతాడు. అతనిని సంహరిస్తానంటాడు. కానీ అప్పుడు ద్రౌపది చూపిన క్షమా గుణానికి ఆ హిమాలయ పర్వతం కూడా కరగవలసినదే. తనకు కలిగిన గర్భశోకం అశ్వద్ధామ తల్లి కృపికి కలగకూడదని కోరుకుంటుంది. అశ్వద్ధామను క్షమించి పంపివేస్తుంది.

తనపట్ల ఏమాత్రం చిన్న పొరపాటు జరిగినా తనవారికి కూడా హాని కలిగించడానికి వెనకాముందు ఆలోచించని స్థిమితం తప్పిన మనుషులున్న నేటి సమాజంలో ద్రౌపది క్షమాగుణాన్ని గూర్చి తెలుసుకోవాలి.

**వాత్సల్యమూర్తి యశోద :**

పరాయి బిడ్డను తన బిడ్డగా భావించి వాత్సల్యం పంచి పెంచిన యశోద గురించి లోకవిధితమే. నిజం తెలిసినా కూడా మాతృ భావనను నిలుపుకున్న వ్యక్తి. ఈమె వల్లే బహుశ: "కన్నతల్లి కంటే పెంచిన తల్లి గొప్పది" అన్న లోకోక్తి స్థిరపడినట్లుంది.

**సహృదయ మాత సుమిత్ర :**

దశరథుని పట్టపు రాణులలో ఒకరు. ఈమె వినయ శీలి, బుద్ధిమతి, అనసూయ. ఈమె కుమారుడు లక్ష్మణుడు. కైకేయి వరాలు వల్ల శ్రీరాముడు అరణ్య వాసానికి వెళ్లవలసి వచ్చినప్పుడు శ్రీరామునితో కూడా లక్ష్మణుని అడవికి పంపుతుంది సుమిత్ర.

"రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం
అయోధ్యా మటవిం విద్ధి గచ్ఛ తాత యథా సుఖం"
(శ్రీమద్రామాయణం అయోధ్యకాండ 40-9)

"రాముడుని దశరథుడు అనుకో, సీతను నన్నుకో, అడవినే అయోధ్య అనుకో, సుఖంగా వెళ్లిరా నాయనా" అన్న సుమిత్ర పాత్ర నేటి మహిళకు ఆదర్శనీయం. సవతి బిడ్డతో నా బిడ్డ ఎందుకు వెళ్లాలి అని అనుకోలేదు ఆమె. తన బిడ్డకు సోదరులతో మెలిగే తీరును నేర్పించింది. వదినను తల్లిగా కొలిచే మనస్తత్వాన్ని నేర్పించింది. అందుకే లక్ష్మణుడు కిష్కిందకాండలో సీత ఆభరణాలను రాముడు పోల్చమన్నప్పుడు పాదాలకు ఉన్న నూపురములు మాత్రమే నాకు తెలుసని అన్నాడు. (నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్).

నేటి తల్లులు సుమిత్ర నుండి ఈ విషయాన్ని నేర్చుకొని పిల్లలకు నేర్పవలసిన అవసరం ఉన్నది. మొల్ల రామాయణం, భాస్కర రంగనాథ రామాయణాలు, రామా యణ కల్పవృక్షం వంటివి ఎందరో రచించారు. నేటికీ మరెందరో రచించి తరిస్తున్నారు.

**నిగమశర్మ అక్క:**

పాండురంగ మాహాత్మ్యంలో ఈమె నిగమశర్మ అక్క గానే ప్రసిద్ధి. నామక: అక్క అయినా కూడా ఈమె మాత వలె తన సోదరుని తప్పులు సరి చేయడానికి ప్రయత్నించింది. తమ్ముడు పట్ల ఈమె చూపిన మాతృ ప్రేమ నేటి సోదరీ సహోదరులకు ఆదర్శం.

**రాజమాత జిజియాబాయి :**

చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఉజ్జ్వల తేజం శివాజీ. అతని తల్లి జిజియాబాయి. తన కుమారునికి ఉగ్గుపాలతో శౌర్యపరాక్రమాలను నేర్పిన వీరమాతగా ఆమె ప్రసిద్ధి. పరస్త్రీలను తల్లులుగా భావించి ఉదాత్త భావనలు తన స్వభావంగా కలిగి భారతీయ సంస్కృతిని తన జీవనశైలితో మిళితం చేసుకొని హిందూ రాష్ట్ర

నిర్మాతగా, ఈదేశ జాతికే పితృ స్థానాన్ని పొందగలిగే మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా ఛత్రపతి శివాజీని మలచింది జిజియాబాయి. కుమారుడిని తీర్చిదిద్దడంలో ఆ తల్లి స్థానం మరువలేనిది. నేటి సమాజంలో ప్రతీమాత ఒక జిజియాబాయి కావాలి.

**ఉపసంహారం (End - Notes) :**

శ్రీ తిరుమల రామంద్రుడు తన స్వీయ చరిత్ర అయిన 'హంపీ నుండి హరప్పా వరకు' రచనలో తన తల్లి చేసిన బోధను వివరిస్తారు. తన మనో వికారాలను గుర్తించి సున్నితంగా సవరించిన తల్లి నేర్పును ప్రస్తావిస్తారు. అలాగే అందరూ తప్పనిసరిగా చదవవలసిన నవలలో ఒకటైన వేయి పడగలులో స్త్రీల ఔనత్యాన్ని, ఔదర్యాన్ని విశ్వనాథ సత్యన్నారాయణ వారు చక్కగా ఉన్నతంగా చూపించారు.

పైవిధంగా చెప్పుకుంటూ వెళితే ఎంతోమంది మాతృమూర్తులు, స్త్రీమూర్తులు ఆంధ్ర సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. ఉదాత్త భావనలు గల సాహిత్యాన్ని చదవడం వల్ల మనో వికృతులు తగ్గి సరియైన మార్గాన్ని ఎంచుకొనే విచిక్షణా జ్ఞానాన్ని మానవులు పొందగలుగుతారు. రామాయణం, భారత, భాగవతాలలో ఉన్నవి కథలు మాత్రమే కావు, అవి వ్యక్తిత్వ నిర్మాణ ఘనులు. వాటిలో ప్రతీపాత్ర నుండి నేటి మానవులు చేయవలసిన పనులు, అలాగే చేయకూడని పనులు, అలాగే అసలు ఆలోచనకైనా రాని విషయాలు తెలుసుకోగలుగుతారు. ప్రాచీన, మధ్య, ఆధునిక ఆంధ్ర సాహిత్యాలలో ఎందరో కవులు, రచయితలు సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి నాటినుండి నేటివరకు తమవంతు కృషిని చేస్తూనే ఉన్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమద్రామాయణం - వాల్మీకి - సంస్కృత మూలం - బాలానందినీ వ్యాఖ్య - ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు - ఆర్ష విజ్ఞాన ట్రస్ట్ - హైదరాబాద్ -1990.
2. మహా భారతం - విశ్వ ప్రసాద్, కిరణ్ కుమారి, నారాయణ రెడ్డి - జె.పి. పబ్లికేషన్స్ - విజయవాడ - 2006.
3. సంస్కృత మహాభారతం - వ్యాసుడు.
4. శ్రీ శివ భారతం - డా॥ శ్రీ గడియారం వేంకట శేష శాస్త్రి - తృతీయాశ్వాసం - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ - తెలుగు దివ్వెలు - 2017.
5. పాండురంగ మాహాత్మ్యం - తెనాలి రామకృష్ణుడు.
6. హంపీ నుండి హరప్పా వరకు - ఆచార్య తిరుమల రామచంద్రుడు.
7. వేయి పడగలు - సమ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ.

# మహాభారతం - స్త్రీ పాత్ర చిత్రణ

- జక్కె పద్మ, తెలుగు అధ్యాపకురాలు, టిఎస్‌డబ్ల్యుఆర్‌డిసి, వరంగల్.

'వేదాలు' రాజు వంటివని, 'పురాణాలు' మిత్రుని వంటివని, 'కావ్యాలు' కాంత వంటివని మన పెద్దలు చెప్పినట్లే చరిత్ర వర్తమానానికి అనేక విషయాలను అందిస్తుంది.

మహాభారత, రామాయణ కావ్యాలు గమనించినట్లయితే కవి కవిత్వశైలి నుండి మొదలు ఆ కావ్యాల్లోని వివిధ పాత్రల నుండి వివిధ సందేశాలను నైతిక విలువలను గ్రహిస్తాము. ఈ విధంగా రామాయణంలో, మహాభారతంలో స్త్రీ పాత్రలను గమనించినట్లయితే స్త్రీ అమ్మగా, రాజమాతగా, భార్యగా, చెల్లెలుగా అనేక పాత్రలను పోషించారు. వారు పోషించిన సంస్కృతి తర్వాత తరాలైనటువంటి ఆధునికులకు ఎంతో ఆదర్శమని చెప్పవచ్చు.

ఉదా : మహాభారతంలోనీ పాత్రల ద్వారా అరణ్య పర్వంలో పేర్కొనబడిన సావిత్రపాఖ్యానంలో సావిత్రి మద్రదేశమును పరిపాలించే రాజు అశ్వపతి కూతురు. సావిత్రి సాళ్వదేశపు యువరాజు సత్యవంతున్ని తన పతిగా వరించలనుకొంటుంది, వివాహమాడిన నాటి నుండి సరిగ్గా ఒక సంవత్సరము వరకు అతడు మరణించునని తెలిసి కూడా అతనిని వివాహమాడి యమునితో పోరాడి, యముని అనుగ్రహం పొంది, వరములను పొంది భర్త ప్రాణాలను పొందిన మహిళ సతీసావిత్రి.

చ. "పతి విరహంబు దుస్సహము, భర్తృవినాకృత
యైన కాంత దూ
షిత యగు సర్వమంగళ విశేషములందును గాన
మత్ప్రియుం
డతులిత కీర్తిశాలి సుగుణాఢ్యుడు సాళ్వసు
తుండు లబ్ధజీ
వితుడుగ నిమ్ము ధర్మపదవీ పరిరక్షణ! పుణ్య
వీక్షణా !"

ధర్మమే నామముగా ధరించిన ఓ యమ ధర్మరాజ భర్త లేని స్త్రీ ఈ లోకంలో సమస్త శుభ కార్యముల నుండి పరిహరించబడుతుంది. ఎన్నో అవమానాలకు గురవుతుంది. కావున నా యందు దయతలచి ఎంతో కీర్తి వంతుడైన నా భర్త సత్యవంతుడు తిరిగి బ్రతికే వరాన్ని ప్రసాదించమని కోరుతుంది.

ఈ కథలో భార్యాభర్తల అనుబంధం గురించి స్త్రీ జీవిత పోరాటం దృశ్యరూపమవుతుంది. కేవలం భర్త ప్రాణాలే కాకుండా పుట్టినిల్లు, మెట్టినిల్లు వారి గురించి కూడా ఆలోచించి వరములను పొందిన స్త్రీ సావిత్రి.

అదే విధంగా సత్యవంతుడు తన మాతృమూర్తి హృదయాన్ని వివరించిన తీరు అందరినీ కంటతడి పెట్టిస్తుంది.

"సంధ్యప్రొద్దు నన్ను జనని యెన్నడు నిల్లు !
వెడలనీదు; నేడు విపిన భూమి
మధ్యరాత్రివేళ మసలుట కాయము ! యెట్టి పాటు
పడెనొ, యే నెఱుంగ"

అని సత్యవంతుడు అడవిలో ఆలస్యం అయిన క్రమంలో ఇంతకు ముందు నేను ఎప్పుడూ నా తల్లి దండ్రులను ఇంత సమయం ఎడబాయలేదు. నేను కనబడక నా తల్లిదండ్రులు ఎంతటి వేదనను అనుభవిస్తున్నారో అని మాతృహృదయాన్ని వర్ణించిన విధము ఆనాటి నుండి ఈ నాటి వరకు కూడా మాతృమూర్తి ప్రేమ ఎలాంటిదో తెలుపుతుంది.

ద్రౌపది పాత్రను గమనించినట్లయితే దుశ్శాసనుడు తనను నిండు సభలోనికి ఈడ్చుకు వచ్చిన సన్నివేశాన్ని తిక్కన చిత్రించిన విధము, ద్రౌపది కృష్ణుడికి వివరించే తీరులో ఆమెకు ఎంత రోషావేశము ఉందో తెలుస్తుంది.

సీ. "ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యా చేయి !
దొలుతగా బోరిలో దుస్ససేను
తను వింత వింతలు దూనియలై చెదరి !
పణియున్న గని యుడుకాఱుగాక !
యలుపాల బొనువడునట్టి చిచ్చేయిది !
పెనుగద వట్టిన భీమ సేను
బాహుబలంబును బాటించి గాండీవ ! మను
నొక విల్లెప్పుడును వహించు

ఆ. కట్టి విక్రమంబు గాల్పనే? యిట్లు బ ! న్నములు
వడిన ధర్మనందనుండు
నేను రాజ రాజు పినుంగు గన్నార ! గాన
బడయమైతిమేని గృష్ణ !

అనే ఈ పద్యంలో స్త్రీ అంటే కేవలం అవమానపడటం కాదు శత్రువులను సంహరించే వరకు పట్టువదలని సబలగా ఉంటుందని ఈ పద్యం ద్వారా తెలుస్తుంది.

**కుంతి :**

కుంతి పాత్రను గమనించినట్లయితే పాండవులు అడవులకే గునాడు మాతృహృదయం ఎంత తల్లడిల్లిందో ధర్మరాజు మాటల ద్వారా తెలుస్తుంది.

చ. "అడవికినేగువాడు మము నంపగ నెంతయు దవ్వు వచ్చిన
ప్పుడు దనమోము దైన్యమున బొందెడు నశ్రు లు జూచి చూచియ
ట్లొడబడి డించిపోవలసె నుమ్మలికమ్మున గొంతి యింతకుం
బడుగయి పాలలో బడిన బల్లి విధంబున నుండు కుండునే?" ఉద్యోగ ప.తృ - 135

పాండవులను అడవులకు పంపేటప్పుడు చాలా దూరం నడిచి, కన్నుల నిండ భాష్పాలు నిండిన మా తల్లిని చాలా కష్టంగా, హస్తినాలో విడిచిపెట్టవలసి వచ్చింది.

ఇప్పుడు ఆమె పాలలో పడిన బల్లివలె దు:ఖంతో శుష్కించిపోయి ఉంటుంది అని కుంతి మాతృ హృదయాన్ని ధర్మరాజు మాటల ద్వారా తెలిపే విధానం హృదయ విదారకం.

అలాగే రాజమాతయైన కుంతి ఎన్ని కష్టాలకు ఓర్చికొనియైన రాజులు క్షత్రియ ధర్మాన్ని ఎలా నిర్వర్తించాలో ఈ పద్యంలో చెప్పబడింది.

ఉ. "రాజుల కెందు నారయ పరాక్రమజీవన వృత్తి దక్క నొం
డొజ నిషిద్ధ మండ్రు మును; ఉత్తమసత్త్యులు వంశధర్మముల్
పూజిత భంగి జేయుదురు బుద్ధి విహీనులు వాని దక్కిని
స్తేజపు గూటి కియ్యకొని దీనత బొందుదు రంబుజోదరా ?"

**ఉద్యోగపర్వం - 14 చతుర్థాశ్వాసం**

అని రాజులు పరాక్రమంతో, గౌరవబుద్ధితో జీవించాలి, అంతేకాని తెలివిమాలిన వారి వలె పౌరుషహీనమై బ్రతుకరాదు అని యుద్ధం జరుగవలసిందే, ప్రతీకారం తీర్చుకోవలసిందే అన్నట్లుగా హితబోధ చేసి పాండవులకు చెప్పుమని కృష్ణుడికి చెప్తుతుంది.

**గాంధారి**

గాంధారి పాత్రను గమనించినట్లయితే భర్త దృతరాష్ట్రుడికి కన్నులు కనిపించవని, తాను చూడని లోకాన్ని నేను కూడ చూడనని నిర్ణయించుకొని కళ్ళకు గంతలు కట్టుకున్న ఇల్లాలు. ప్రశాంతమైన మనస్సు కలిగిన ఇల్లాలుగానే పేరు గాంచినది గాంధారి. విచక్షణతో కూడిన జ్ఞానం కలిగినది.

వ్యాసమహర్షి గాంధారితో మాతృధర్మాన్ని అవలంభించి పాండవులపైన ఉన్న రోషాన్ని పోగొట్టుకోమ్మా, నీవు విచక్షణ కలిగిన దానివే అంటూ ఈ పద్యంలో ఈ విధంగా చెప్పాడు.

సీ. "ఏ నసూయగ్రస్తగాను వీరల జెడ ! దలతునె?
యెట్టులుమ్మలిక జేసి

కలిగితి గాక యుక్కొంతేయు వర్గంబు ?
గొంతికెట్లట్ల నాకును భరింప
వలదె? దుర్యోధను తులువతనంబున ?
శకునియు గర్ణదుశ్శాసనులును
దుష్టాత్ములగుటను ద్రుంగె గౌరవకుల ? మడరి
పాండవులు గయ్యంబుపాడి

ఆ. జంపి రందఱ నది వుది నొంపజాల ।
దచ్యుతుడు సూడ గురుపతి ననిల సుతుడు
దగునె గదపోర నాభికి దిగువ నొంచి । చంప?
నత్తెఱ గుల్లంబు నొంపకున్నె?

స్త్రీ పర్వం - ప్రథమ.అ. - 154

అనే ఈ పద్యంలో గాంధారి చెప్పే మాటలు ఆమె మాతృ హృదయాన్ని, ధర్మనిరతిని కొనియాడుతున్నాయి. పాండవులు కుంతికి ఎంతో నాకూ అంతే కదా అని, ధుర్యోధనుడి, శకుని, దుశ్శాసనుడి దుర్మార్గంవలననే ఇంతటి వినాశనం జరిగినదని స్వయంగా గాంధారి అనటం ఆమె వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది.

అలాగే పుత్రులను (ఉప పాండవులను) పోగొట్టుకొని పుత్ర శోకంతో వచ్చిన ద్రౌపదిని ఓదార్చే తీరులో గాంధారి ఎంత గొప్ప వ్యక్తిత్వం కలదో అర్థమవుతుంది.

**మత్తకోకిల :**

"పుత్రి యిట్లగు నమ్మ? శోకము బొంది కుందుచు
నున్న నీ
గాత్ర మెుండొక కీడు పాటిలి కందు బాండు
తనూభౌవుల్
పుత్ర వర్గము గన్నచో నెద భూరితాపము బొందుడుం
బౌత్ర హీనత బడ్డ గొంతికి బాయనేర్చునె నెవ్వగల్"?

స్త్రీ పర్వం - ప్ర. 183

అనే ఈ పద్యంలో ద్రౌపదిని నీవు ఈ విధంగా కృంగిపోతే ఇంకా బాధ కలుగుతుంది, పాండవులకు మాత్రం బాధ కలగడం లేదా, కుంతికి బాధకలగటం లేదా అంటూ క్రింది పద్యంలో

"నిను నే నిట్టూరార్చెద ? నను నీ వూరార్పవలదె?
నా నీ తెఱుగుల్
విను మొక్క రూప మనకే ? మనగలదు విధాత
క్రూరుడై పఱుపగన్

అంటూ నేను నిన్నెట్లు ఓదారుస్తున్నానో నన్ను నీవు అట్లాగే ఓదార్చుము. ఇంకొక విషయం ఏమిటంటే నీ జీవితము నా జీవితము ఒకే విధంగా ఉన్నాయి. (నేను నీవు ఇద్దరము పుత్రశోకము అనుభవిస్తున్నాము అని ఇందులో ధ్వని) అంటూ ద్రౌపది భర్తల చేతిలో గాంధారి కుమారులు మరణించిన విషయం తెలిసీకూడా గాంధారి ద్రౌపదిని ఓదార్చే తీరు ఎవరికి సాధ్యం అవుతుంది.

**ముగింపు :**

సమాజం కోసం కవులు చరిత్రను అనేక పాత్రలను సృష్టించి మనకు కావ్యాలను అందించారు. కొన్ని కావ్యాల్లో స్త్రీలను అంగాంగ వర్ణన చేసినా కూడా అది లోకకళ్యాణం కోసమే అనేది మన అలంకారికులు చెప్పిన విషయాన్ని మనం గ్రహించాలి. ఈ కావ్యంలో చెప్పడిన ఈ స్త్రీ మూర్తులందరి పాత్రలు ఆదర్శనీయమైనవే అను మనకు తెలుస్తుంది.

**ఉపయుక్త గ్రంథసూచిక :**

1. టిటిడి మహాభారత పుస్తకాలు
2. శ్రీమదాంధ్ర సంపూర్ణ మహాభారతం - కీ॥శే॥ బొమ్మకంటి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

# వాల్మీకి రామాయణంలో మంథర

- ఏ. మృణాళిని, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం, హైదరాబాద్

సీత, సులోచన, అహల్య, కౌసల్య, కైకేయి, తార, త్రిజట, మాండవి, సుమిత్ర, శాంత, శ్రుతకీర్తి, ఊర్మిళ, శబరి రామాయణంలో ఇలా ఎన్నో స్త్రీ పాత్రలున్నాయి. ఈ పాత్రలన్నీ తమ విశిష్టతను చాటుతూ కథకు తోడ్ప డుతూ ముందుకు సాగడానికి ఉపయోగపడతాయి. అందులో ముఖ్యంగా మంథర పాత్ర రామాయణ కావ్యం లోని కథ మలుపులు తిరగడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

మంథర అనగా నికవ్వంయ రాతి అనగా నిగ్రహించేది. కవ్వంతో మజ్జిగ చిలికినట్లు చిలికేది.నిమంథరాతి గృహ్ణాతి ఇతి మంథరా అని వ్యుత్పత్త్యర్థం.తన దుర్బోధలచే ఇతరుల మనసులను పాడుచేసేది అని అర్థం.మంథర అన్న పాత్ర లేకపోతే మంథర కైకేయితో

యదా హి రామావవ ప్రథివీమవాప్స్యతి ప్రభూత రత్నాకరశైలపత్తనామ్
తదా గమిష్యస్యశుభం పరాభవం సహైవ దీనా భరతేన భామిని

అయోధ్య (8-38)

నినీవు దీనురాలవై భరతునితో సహ తీరని అవ మానముల పాలవుతావు అని హెచ్చరించింది. అలా హెచ్చరించిన మంథర మాటలు కైకేయి చెవిన పడకపోతే రాముడి వనవాసం ఉండేది కాదు.రావణుడితో యుద్ధం జరిగేది కాదు.అంటే మంథర పాత్ర లోక కళ్యాణానికి ఎంత దోహతపడిందో మనం అర్థం చేసుకోవొచ్చు.

## మంథర మాటలలోని సంబోధనలు

ఒక విషయాన్ని ఇతరులకి అర్థమయ్యేలా చెప్పాలంటే మనం ఎన్నో మార్గాలను ఎన్నుకోవొచ్చు. సామదాన భేద దండోపాయాలను ఉపయోగించవచ్చు. సున్నితంగా చెప్ప వచ్చు. అలా కాని పక్షంలో గట్టిగా మందలించి విషయాన్ని చేరవేయవచ్చు. అలా కైకేయికి

అక్షయ్యం సుమహద్దేవి ప్రవృత్తం త్వద్వినాశనమ్
రామం దశరథో రాజాయౌవరాజ్యేభిషేక్ష్యతి

అయోధ్య (7-20)

అంటూ "దశరథమహారాజు శ్రీరామున్ని యువరాజు పట్టాభిషిక్తున్ని చేయబోతున్నాడని అలా చేయడం వల్ల కైకేయికి గొప్ప ఆపద సంభవిస్తుందని" చెప్పే క్రమంలో కైకేయిని 'ఓ కైక్ణా', 'ఓ దేవి', 'ఓ భామిని' 'ఓ సుందరి', 'ఓ సౌందర్య రాశీ' అని సంభోదిస్తూనే కైకేయి

నమే పరం కించిదితస్త్వయా పున
ప్రియం ప్రియర్హే సువచనం వచ పరమ్

అయోధ్య (7-36)

'ఈశ్రీరామా పట్టాభిషేక శుభవార్త నాకు ఎంతో ప్రియ మైనదని' అని అన్న మాటలు విని కోపంతో ఊగిపోయిన మంథర కైకకు జరిగే విపత్తును చెప్పడానికి ఆమెకు అవగాహన కలిగించడానికి 'ఓ అమాయకురాలా', 'ఓ మూర్ఖురాలా', 'ఓ వెఱ్ఱి కైకేయి' అని తన సంబోధన లను సందర్భానుగుణంగా మార్చిన తీరును మనం గమనించవచ్చు.

## మంథర ఉద్బోదకు ఊతమిచ్చిన ఉదాహరణలు

వాల్మీకి రామాయణంలో మంథర తన మాటలు మరింత దృఢంగా కైకేయి మనసులో నాటుకునే విధంగా

శ్రూయతే హిద్రుమ కశ్చిత్ ఛేత్తవ్యో వనజీవిభి
సన్నికర్షాదిషీకాభి మోచిత పరమాద్భయాత్

అయోధ్య (8-30)

'అడవిలో కట్టెలు అమ్ముకొని జీవించేవాళ్ళు ఒక చెట్టును కొట్టాలనుకున్నప్పుడు,ఆ చెట్టు చుట్టూ ఏర్పడ్డ ముళ్ళ పొదలు ఆ చెట్టుకు రక్షణనిస్తాయి అలాగే ఏ విధంగానైతే లక్ష్మణుడి తోడు వల్ల రామునికి రక్షణ ఏర్పడిందో భరతుడు అయోధ్యలోనే ఉండి ఉంటే

శత్రుఘ్నుడి తోడు వల్ల భరతుడకి రక్షణ ఉండేదని' ఒక ఉదాహరణతో చెప్పింది.

భరతున్ని నువ్వే కాపాడాలని మంథర కైకతో చెప్పే సందర్భంలో కూడా

అభిద్రుతమివారణ్యే సింహేన గజయూథపమ్
ప్రచ్ఛాద్యమానం రామేణ భరతం త్రాతు మర్హసి
అయోధ్య (8-36)

అడవిలో సింహం భయానికి ఏనుగు ఏ విధంగానైతే పారిపోతుందో అలాగే రాముని చేత తిరస్కరింపబడే భరతున్ని నువ్వే కాపాడాలని చెప్పింది.

మరొక ఉదాహరణలో 'సమయం మించిపోయిన తరువాత ఏమీ చేయలేమని' మంథర కైకకు

గతోదకే సేతుబంధో న కళ్యాణి విధీయతే
ఉత్తిష్ఠ కురు కళ్యాణి రాజానమ్ అనుదర్శయ
అయోధ్య (9-54)

'నీరంతా వెళ్ళిపోయిన తరువాత అడ్డుకట్ట వేసి ప్రయోజనం లేదని' హెచ్చరించింది. తను చెప్పే ప్రతీ మాటకు సరైన ఉదాహరణలతో చక్కగా సమన్వయిం చింది.

**మంథరకు కైకచేత అందిన పొగడ్తల వర్షం**

ఇంత అనర్థదాయకంగా మాట్లాడిన మంథర మాటల వలలో చిక్కుకున్న కైకేయి మంథర తెలివితేటలను మెచ్చుకుంటూ మంథరను అనేక రకాలుగా పొగిడింది. నిరంతరం మంథర తన ప్రయోజనం కోసమే పాటు పడుతుందని మెచ్చుకుంది. అంతటితో ఆగక మంథరను అందంగా వర్ణిస్తుంది.

సంతి దుస్సంస్థితా కుబ్జా వక్రా పరమదారుణా
త్వం పద్మమివ వాతేన సఙంఙసన్నతా ప్రియదర్శనా
అయోధ్య (9-40)

ఈ లోకంలోని కుబ్జలలో అందరిలో వంకరితనమున్నా మంథర గాలికి వంగిన పద్మంలా ఉందని, ఎత్తు తక్కువగా ఉన్నా ముఖం చంద్రుడిలాగా నిర్మలంగా ప్రకాశిస్తుందని పొగిడింది. నడుముకు ధరించిన వడ్డాణం గజ్జెల సవ్వడి బాగుందని ఆడరాజహంసలా ఉందని మెచ్చుకుంది.

చంద్రమాహ్వయమానేన ముఖేనాప్రతిమాననా
గమిష్యసి గతిం ముఖ్యాం గర్వయంతీ ద్విషజ్జనమ్
అయోధ్య (9-51)

చంద్రునితో పోటీపడగల సాటిలేని ముఖసౌందర్యం చూసి మంథర శత్రువులు అవమానభారంతో తలలు వంచుకుంటారని పేర్కొన్నది.

**మంథర మాటల వల్ల కైకలో మార్పు**

మంథర మాటలు వినక ముందు కైకేయి మనస్సులో రాజ్యాధికారం రాముడిదైనా భరతుడిదైనా ఒక్కటే. రాముడు ధర్మజ్ఞుడు. ఇతరులు చేసిన మేలును మరువని వాడు. సత్యం పలికేవాడు. పవిత్రుడు అన్నిటికీ మించి దశరథుని పెద్ద కుమారుడు. కాబట్టి యువరాజు పదవికి అర్హుడు. ఇది కైకేయి భావన. మంథర విషపూరిత ఆలోచనల ప్రభావం వల్ల మనసు మారిన కైకేయి.

అహం హి నావాస్తరణాని న స్రజో
న చందనం నాంజనపానభోజనమ్
న కించిదిచ్ఛామి న చేహ జీవితం
న చేదితో గచ్ఛతి రాఘవో వనమ్ అయోధ్య (9-65)

రాముడు అయోధ్య నుండి అడవికి వెళ్ళకపోతే తాను పాన్పుపైన పడుకోదని,హారాల్ని వేసుకోదని, చందనాలను పూసుకోదని,కాటుక పెట్టుకోదని, అన్నపానాలను ముట్ట దని దేనిని కోరదని అంతేకాక తన జీవితాన్నే చాలిస్తానని తన మాటను మార్చేసి ఈ విధంగా సూచించింది.

**వివిధ శాస్త్రాలను గూర్చి తెలిసిన మంథర**

మంథర కైకకు ఉదాహరణలతో జరిగే విపత్తును తెలియజేస్తూనే తనకు తెలిసిన రాజధర్మాలను,జ్యోతిష్య శాస్త్ర పాండిత్యాన్ని అక్కడక్కడా ప్రయోగించింది. దశరథ మహారాజు పైకి ధర్మం మాట్లాడుతున్నా కైకేయికి అన్యాయం చేస్తున్నాడని నూరిపోసింది. దశరథుడు

భరతున్ని బంధువుల వద్దకు పంపించి కోసల రాజ్యానికి రామున్ని యువరాజుగా చేస్తున్నాడని, రాముడు యువ రాజైతే రాముని తరువాత రాముని సంతానానికే రాజయ్యే అవకాశం ఉంటుందని భరతునికి జరిగే నష్టాన్ని గురించి వివరించింది.

భవితా రాఘవో రాజా రాఘవస్యాను య సుత
రాజవంశాత్తు కైకేయి భరత పరిహాస్యతే
అయోధ్య (8-22)

'శ్రీరాముడు పునర్వసు నక్షత్రంలో, భరతుడు పుష్యమీ నక్షత్రంలో జన్మించారు. అందువల్ల జన్మక్రమాన్ని అనుసరించి శ్రీరాముడి తరువాత భరతుడు రాజ్యాధి కారానికి అర్హుడు. కాబట్టి రాముని వల్ల ప్రమాదం భరతునికే ఉందని' కైకేయిని తనకు తెలిసిన జ్ఞానంతో భయపెట్టింది.

## ముగింపు

ఈ విధంగా చెప్పుకుంటూపోతే ప్రతికూల దృక్పథంతో ఉన్న మంథర మాటలు సైతం ఆలోచన రేకెత్తించేలా ఉండడం కవి వాల్మీకి రచనలోని గొప్పతనం కాక మానదు. అగ్నిపురాణం, రంగనాథ రామాయణం, భాస్కర రామాయణాలు రాముడు చిన్నతనంలో మంథర కాలు విరగొట్టాడు. అందువల్ల అప్పటి కోపం ఇప్పుడు తీర్చు కుందని వాల్మీకి రామాయణంలో లేని కల్పనలు చేశాయి.

ఇలా చెడు కార్యానికి తలపెట్టిన మంథర మాటల్లో సైతం ఆణిముత్యాల్లాంటి ఉదాహరణలతో, సూక్తులతో మనందరం గ్రహించేటట్టుగా ఆ పాత్రను చిత్రించిన వాల్మీకి రామాయణం మనకు సదా మార్గదర్శనం, పఠనీయం.

## ఆధార గ్రంథాలు

1. వాల్మీకి రామాయణం
2. రంగనాథ రామాయణం
3. భాస్కర రామాయణం
4. వాగ్దేవి వరివస్య (భాషా సాహిత్యవ్యాసాలు) - ఆచార్య వెలుదండ నిత్యానందరావు

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రాయలసీమ కథలు – దళిత స్త్రీ పాత్రల విశ్లేషణ

– యం. భైరవేశ్వర, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

కార్యేషు దాసి కరణేశు మంత్రి
భోజ్యేషు మాత రూపేశు లక్ష్మి
శయనేషు రంభ

అని స్త్రీని అంతలా సంబోధించారంటే భారతీయ సమాజంలో స్త్రీకి ఉన్న స్థానం ఎటువంటిదో మనం అర్థం చేసుకోవచ్చు. నాటి రాజరికపు కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య ప్రభుత్వం వరకు స్త్రీ పరిస్థితిని గమనిస్తే ఎన్నో తారతమ్యాలు కనిపిస్తూనే ఉన్నాయి. శాతవాహనుల కాలంలో రాజుల ముందు తల్లుల పేర్లు ఉండటం గమనించవచ్చు. తర్వాత కాలంలో రాజ్యాలు ఏలిన రాణులును గమనించవచ్చు. అంటే మాతృస్వామ్య వ్యవస్థ అమలులో ఉండేదని అర్థమవుతుంది. యుద్ధంలో భర్తకు తోడుగా నిలిచి భర్త విజయానికి కారణమైన స్త్రీలను గమనించవచ్చు. అంటే స్త్రీ శక్తి సామర్థ్యాలు పురుషుని శక్తి సామర్థ్యాలకు ఏమాత్రం తీసిపోవని అర్థమవుతుంది. స్త్రీలవల్ల రాజ్యాలు కోల్పోయిన రాజుల పరిస్థితిని గమనించవచ్చు. అంటే మగాడి విజయానికే కాదు ఓటమికి కారణం స్త్రీనే అవుతుందని అర్థమవుతుంది. కాని నేటి ఆధునిక కాలంలో బాల్యవివాహాలు, సతీ సహగమనం, అత్యాచారాల వల్ల స్త్రీ పరిస్థితి దుర్భరంగా దిగజారిందని మనం గమనించాం. యత్ర నార్యంతు పూజ్యంతే తత్ర రమంతి దేవత' ఎక్కడ స్త్రీలు పూజించ బడతారో అక్కడ దేవతలు ప్రత్యక్షమై తిరుగుతూ ఉంటారు అని పెద్దలు చెబుతుంటారు. వీటన్నింటిని గమనిస్తే స్త్రీకి ఉన్న విలువ ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని కవులు, రచయితలు, రచయిత్రులు ఇప్పటికి తెలియజేస్తున్న స్త్రీ పరిస్థితి మారలేదని ఇక మారదని మనం అర్థం చేసుకోవాలి.

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగు సాహిత్యంలో అనేక సాహిత్య ప్రక్రియలు వెలుగులోకి వచ్చాయి. అందులో కథ ఒకటి. ఈ కథ ప్రస్తావన ఈనాటి ఆధునిక కాలంలో వచ్చింది కాదు.

అగ్నిపురాణం నుంచే 'కథ' ప్రస్తావన కనిపిస్తుంది. అటుతరువాత 1910 గురజాడవారు దిద్దుబాటు అనే కథను వ్రాశారు. అందులో గోపాలరావు భార్య కమలిని. తన భర్త గోపాలరావు స్త్రీలోలుడని తెలిసిన తరువాత కమలిని భర్తను చెడుమార్గంలో ప్రయాణించకుండా తన తెలివితేటలతో చక్కదిద్దుకుంటుంది. దిద్దుబాటు కంటే ముందే బండారు అచ్చమాంబ గారు వ్రాసిన స్త్రీ విద్య కథలో స్త్రీ ప్రస్తావన కనిపిస్తుంది.. ఇందులో స్త్రీ విద్య నేర్చుకోవడం తన కుటుంబాన్ని అక్షరాస్యుల్ని చేయడం కనిపిస్తుంది.

పురుషుల క్రూరత్వానికి చాలామంది స్త్రీలు తమ మానప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు మనం అనేకం సమాజంలో చూస్తూనే ఉన్నాం. పురుషులు స్త్రీల శీలాన్ని బలవంతంగా దోచుకుంటున్నారు. పురుషుల దుర్మార్గాలను, ఆగడాలను భరించలేక ఆత్మాభిమానాన్ని చంపుకొని బ్రతకలేక ప్రాణాలు పోగొట్టుకున్న స్త్రీలు ఎంతోమంది ఉన్నారు. అలాంటి ఇతివృత్తమే వేంపల్లి గంగాధర్ రచించిన 'మొలకల పున్నమి' అనే కథా సంపుటిలో శిలబండి కథలోని చిన్నమ్మి పాత్ర ఒకటి. కథానాయకుడు తండ్రి ఎక్కడ ఎక్కడ భూములు అన్ని లాకుంటాడు. ఆ విధంగా లాకున్న భూముల వల్ల డబ్బు బాగా సంపాదిస్తాడు. వచ్చిన డబ్బుతో అంకాలమ్మ జాతర జరిపిస్తాడు. జాతరలో మద్యంమత్తులో ఉన్న సమయంలో చిన్నమ్మి మీద కన్ను పడుతుంది. మొదట కొండారెడ్డి సహాయంతో అత్యాచారం చేస్తాడు. ఆ తరువాత కొండారెడ్డి అత్యాచారం చేయబోతుంటే మీదికి ఒక పెద్ద బండరాయి దొర్లించింది. ఆ రాయి కింద పడి కొండారెడ్డి ప్రాణాలు విడిచాడు. ఆ

విషయం ఊరిలో తెలుస్తుందని భయంతో చిన్నమ్మి ఆత్మహత్య చేసుకుంటుంది. కథానాయకుని ప్రేమించి నందువల్ల అతని తండ్రి, ఏమి అనలేదు. అంజిగాడు వచ్చి మీ నాన్న కొండారెడ్డితో కలిసి చిన్నమ్మి అత్యాచారం చేశారు అని చెబుతాడు. ఈ విషయం తెలుసుకున్న తరువాత కూడా కథానాయకుడు తన తండ్రిని ఏమి అనకుండా ఉంటాడు. పురుషుల కామవాంఛకు అభం శుభం తెలియని ఒక దళిత స్త్రీ బలవుతుంది.

సమాజంలో స్త్రీకి స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు పురుషులు. వారిని ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నారు. ఇంకా దళిత స్త్రీలను చాలా చిన్నచూపు చూస్తున్నారు. వారి అవసరాలు తీరిన తరువాత పట్టించు కోకుండా వదిలేస్తున్నారు.'' సుంకోజి దేవేంద్రాచారి వ్రాసిన అన్న గుడ్డ కథా సంపుటిలో 'గాలి' అనే కథలో రాజకీయ నాయకులు దళితులకు ఉన్న రిజర్వేషన్లు ఉప యోగించుకొని రాజకీయంలోకి దింపి వారిని ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు. ఈసారి ఎలక్షన్‌లో దళితులకు అవకాశం రావడంతో ఎర్రమ్మను నిలబెట్టాలనుకుంటారు. ఎర్రమ్మకు ఎలాంటి రాజకీయ అనుభవంలేదు కాని ఎర్రమ్మ తమ్ముడు నారాయణ, ఎమ్మెల్యే చెప్పిన మాటలు విని ఎలక్షన్‌లో నిలబడుతుంది. కనీసం డబ్బు పంచడానికి డబ్బులేకపోతే తమ్ముడు నారాయణ ఇస్తాడు. ఎలక్షన్‌లో గెలవడం వలన రోడ్డు కాంట్రాక్టులు వస్తాయని పూరిగుడిసెలో లేకుండా మిద్దెలో ఉండవచ్చు అని ఎర్రమ్మ ఆశపడుతుంది. అంతకు ముందు ఎర్రమ్మకు ఎటువంటిది ఉండేది కాదు. ఎలక్షన్‌లో గెలిచిన తరువాత ఎమ్మెల్యే ఎర్రమ్మకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చకుండా, పరిస్థితులు బాగుంటే నేనే కబురు పంపుతాను అని చెప్పి పంపించాడు. ఎలక్షన్‌లో ఎంపిటీసిగా నిలబడక ముందు ఆమెకు ఎలాంటి అప్పులు ఉండేవి కావు. తరువాత ముప్పై వేల రూపాయలు ఎర్రమ్మకు అప్పు మిగిలింది. భర్త సుబ్బయ్య వద్దు అని చెప్పిన వినకుండా ఎర్రమ్మ ఎమ్మెల్యే చెప్పిన మాటలు విని, ఈ పరిస్థితిని తెచ్చుకుంది. అప్పులు పెరిగే కొద్దీ ఎర్రమ్మకు గుబులు పుట్టుకుంది. భర్త చూస్తే వయస్సు అయిపోయే, అప్పులు తీర్చడానికి చివరకు ఎర్రమ్మ కొయ్యేటి పావడానికి సిద్ధపడింది. దాని కోసం ఇంకా అప్పు చేసి ఏజెంటు చేతిలో పెట్టింది. చివరకు ఎర్రమ్మ ఏజెంటు చేతిలోను, ఇటు రాజకీయ నాయకుల చేతిలోను మోసపోయింది.

ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన ఎన్ని మార్పులు తెచ్చిన పురుషులలో ఉండే దుర్మార్గపు ఆలోచనలు పోవడం లేదు. స్త్రీలను అతినీచాతి నీచంగా చూస్తున్నారు. వాళ్ళ మీద ఇంకా దాడులు చేస్తున్నారు. అటు ఇంటా ఇటు బయట ఎటు చూసిన స్త్రీలు సమాజంలోని పురుషుల వల్ల బాధింపబడుతూనే ఉన్నారు.

జి. వెంకటకృష్ణ గారు వ్రాసిన ''గరుడస్తంభం'' అనే కథా సంపుటిలోని 'పడిలేచిన కెరటం' అనే కథలో రెడ్లు, ఇతర కులాల వారు దళితులను చాలా చిన్నచూపు చూస్తున్నారు. గుడిపాడు అనే గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి ఉండేది. దళితులను దళితస్త్రీలను మిగతా కులాల వారు చాలా అసహ్యంగా చూసేవారు. రామాలయం నిర్మించినపుడు మిగతవాళ్ళ దగ్గర లాగానే దళితుల దగ్గర చందాలు తీసుకున్నారు. రామాలయం పూర్తి అయిన తరువాత ధ్వజస్తంభం నిలబెట్టే సమయంలో, అగ్రకులాల వారు మిగతా కులాల వారితో మాదిగలు కూడా అక్కడికి వచ్చారు. ధ్వజస్తంభాన్ని ఎవరు నిలబెట్టిన కూడ నిలబడలేదు. చివరకు మాదిగ కులానికి చెందిన అలివేలమ్మ చేతిలోని పళ్లాన్ని తీసుకొని పూజారి టెంకాయ కొట్టాడు. అప్పుడు ధ్వజస్తంభం నిలబడింది. కుంటెమ్మ అనే ఇంకొక దళితస్త్రీ ఊరిలో జరిగే సంఘటనలు రక్తి కట్టి పాట పాడుతు ఉంటుంది. డాకన్న చెల్లెలి కూతురు పిల్లలతో కలిసి ఆడుకుంటు రామాలయం అరుగు మీదకు వెళ్ళినప్పుడు చిన్నపిల్ల అని కూడ చూడకుండా ఆ బాలిక మూతిపళ్ళు రాలగొట్టారు. అలివేలమ్మ పుట్టిఇంట్లో ఎంత కష్టపడిందో అంతే

అభిమానాన్ని పొందింది. దుబ్బన్న కాంట్రాక్టులు అని రాజకీయాలని ఖద్దరు గుడ్డలు కట్టుకొని తిరుగుతూ, రాత్రి అయ్యేసరికి మందు తాగి అలివేలమ్మను చిత్రహింసలు పెడతాడు. అలివేలమ్మ దుబ్బన్న దెబ్బలు తట్టుకోలేక చివరకు ఇంటి నుంచి వెళ్ళిపోతుంది. కుంటెమ్మ కొడుకు, కోడలు సైకిల్లో ఊర్లోకి వస్తుంటే దుబ్బన్న అనుచరులు కొంతమంది కాపు కాచి కుంటెమ్మ కొడుకును కొట్టి, ఆమె కోడలను అత్యాచారం చేస్తారు. కొద్ది రోజులకు అలి వేలమ్మ తిరిగి ఇంటికి వస్తుంది. అది చూసిన భర్త ఏమి అనకుండా ఉంటాడు.

గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువ కులం తక్కువ కులం అనే భేదాభిప్రాయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి కారణం గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యులుగా ఉండడమే. వెంకటకృష్ణ గారు వ్రాసిన 'రాజకీయ దేవుడు' అనే ఇంకొక కథలో ఉన్నత కులంవారు మాల మాదిగల అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతారు. మాదిగ గేరిలో మాదిగ కులానికి చెందిన ఈశ్వరమ్మ బోయిగేరిలో బోయి కులానికి చెందిన మద్దమ్మా ఇద్దరు ఒకే చోట రాళ్ళు పని చేసుకుంటు ఉంటారు. కాని ఎప్పుడు వారు స్నేహం ఉన్నింది లేదు. కారణం కులాలు వేరు కావడంతో ఎవరి కొద్ది వారు పని చేసుకొని వెళతారు. ఈశ్వరమ్మ భర్త బాలరంగన్న సంఘం వాళ్ళ తరపున వినాయకుని విగ్రహం కాలనీలో నిలబెడితే మిగతా వర్గాల వారు దానిని వ్యతిరేకించారు. వినాయకుని నిమజ్జనం జరగకుండా, విగ్రహం ధ్వంసం చేసి స్త్రీ పురుషులు అనే తేడా లేకుండా అందరిని కొడతారు. పోలీసులు ఉండి కూడా వారిని ఏమి చేయలేక అక్కడ నుండి వెళ్ళిపోతారు.

రాయలసీమ ఫ్యాక్షన్ ఎక్కువగా ఉన్న ప్రాంతం. రెండు వర్గాల మధ్య జరిగిన ఫ్యాక్షన్ గొడవల వలన అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎంతోమంది స్త్రీలు పసుపు కుంకాలను పోగొట్టుకొని అనాథలయ్యారు. వేంపల్లి గంగాధర్ వ్రాసిన మొలకల పున్నమి అనే కథా సంపుటిలో డేగల రాజ్యం అనే కథలో మల్లారెడ్డి, చెంచురెడ్డి మధ్య జరిగిన వర్గపోరు మాల మాదిగలు బలవుతారు. ఈసారి ఎలక్షన్‌లో ఎస్సీలకు రిజర్వేషన్ రావడం వలన మాదిగోళ్ళ అంకన్నను ఎలక్షన్‌లో మల్లారెడ్డి నిలబెడతాడు. చెంచురెడ్డి మనుషుల చేతిలో అంకన్న హత్యకు గురవుతాడు. ఎలాగైనా సరే ఎలక్షన్‌లో గెలవాలని అంకన్న భార్య ఆదిలక్షుమ్మను మల్లారెడ్డి నిలబెడతాడు. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో భార్య ఉంటే ఆమె ఎలక్షన్‌లో నిలబెట్టి తన స్వార్థాన్ని చూసుకున్నాడు. ఎలక్షన్‌లో గెలిచిన తరువాత ఆమెను పట్టించుకోలేదు. రాజకీయ నాయకుల స్వార్థాలకు ఒక దళితస్త్రీ పసుపు కుంకాలను పోగొట్టుకున్న సంఘటన చాలా బాధాకరం.

ఈ కథలను గమనిస్తే అగ్రవర్ణ కులస్తులు దళిత పురుషులనే గాక దళితస్త్రీలను సైతం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, దోపిడికి గురి చేశారని అర్థమౌతుంది. యుగాలు మారిన, తరాలు మారిన, స్థాయి మారిన, ప్రాంతం మారిన, నేటి ఆధునిక కాలంలో చాలామంది స్త్రీలు అణచబడుతూనే ఉన్నారు. ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించాలి. స్త్రీ ఉద్ధరణకు పాటుపడాలి. ప్రతి ఒక్కరు తనవంతు కృషి చేయాలి అప్పుడే ప్రతి స్త్రీ సమాజంలో తలెత్తుకొని తిరగగలదు.

## ఆధార గ్రంథాలు :

1. శిలబండి - వేంపల్లి గంగాధర్
2. గాలి - సుంకోజి దేవేంద్రాచారి
3. పడి లేచిన కెరటం - జి. వెంకటకృష్ణ
4. రాజకీయ దేవుడు - జి. వెంకటకృష్ణ

# రాయలసీమ కథలు - స్త్రీ

- **యం. శోభారాణి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కథ ఒకటి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి వచ్చిన ప్రక్రియ కథ. తెలుగు సాహిత్యంలో మొదటికథ 'దిద్దు బాటు'. స్త్రీ సమస్య ప్రధానంగా వచ్చింది. దిద్దుబాటు కంటే ముందు అచ్చమాంబ 'స్త్రీ విద్య' అనే కథ స్త్రీల గురించి రాశారు. సంఘసంస్కరణోద్యమానికి ముందు స్త్రీలకు విద్య లేకపోవటంతో అప్పటి వరకు సమాజంలో ఉన్న బాల్యవివాహాలు, సతీ సహగమనం లాంటి దురాచారాల గురించి స్త్రీలకు అవగాహన లేదు. స్త్రీలకు విద్య అందుబాటులోకి రావటంతో స్వయంగా రచనలు చేసి తమ సమస్యలను వ్యక్తపరుస్తున్నారు. భారతీయ సమాజంలో ఎంతోకాలం నుండి స్త్రీ, పురుషుని తర్వాత స్థానాన్ని మాత్రమే పొందుతుంది. స్త్రీలను గౌరవించే కొన్ని మాటలు వినిపిస్తున్న, ఆచరణలో మాత్రం స్త్రీ స్థానం పురుషుడి తర్వాతదే. "యత్ర నార్యంతు పూజ్యంతే తత్ర రమంతి దేవతాః" అని చెప్పిన మను ధర్మమే 'నస్త్రీ స్వాతంత్ర్య మహీతి' అని కూడా చెప్పింది. పిల్లలను కనే యంత్రంలా, శారీరక మానసిక ఆనందాలను చేకూర్చే యంత్రాలా ఉండే స్త్రీ, నాగరిక సమాజంలో ఆదాయం చేకూర్చే మరమిషను అయ్యింది. కుటుంబం, ఆఫీసు, భవన నిర్మాణాల దగ్గర కూలిగా, పొలం పనుల వద్ద స్త్రీలు ఎన్నో సమస్యలు ఎదర్కొంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని మిగతా ప్రాంతాలతో పోల్చితే రాయలసీమ స్థితిగతులు భిన్నంగా ఉంటాయి. దానికి కారణం ఈ ప్రాంత భౌగోళికాంశాలే కాక, రాజకీయ, సాంఘిక, ఆర్థికాంశాలు కారణాలుగా చెప్పవచ్చు. మిగతా ప్రాంతాల్లోని స్త్రీలకు ఉండే సమస్యలతోపాటు, అదనపు సమస్యలున్నాయని చెప్పవచ్చు.

ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే మనిషికి విలువ ఇచ్చే సమాజంలో మనం ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీకి కూడా ఆర్థిక స్వేచ్ఛ ఎంతో అవసరమనే విషయాన్ని సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 'కొత్త దుప్పటి' కథా సంపుటిలో 'కొమ్ములు' కథలో వివరించారు. రాజకీయ పార్టీల గొడవల్లో చేరి, రామిరెడ్డి పొలమంతా అమ్మేస్తాడు. గొడవతో జైలుకు వెళ్ళి వచ్చి జామీను వ్యక్తిని కొనడానికి కావల్సిన డబ్బు కోసం భార్య లక్షుమ్మకు పుట్టినింటి వారు ఇచ్చిన గేదెను అమ్మటానికి ప్రయత్నిస్తాడు. అందుకు లక్షుమ్మ అంగీకరించక పోవటంతో బేరగాళ్ళు వెళ్ళిపోతారు. గేదె ఈనితే ఇంటి ఖర్చులకు, పిల్లల అవసరాలకు పనికొస్తుందని లక్షుమ్మ ఆలోచన. చిన్నపిల్లలైనా కూతురు, కొడుకును ఇంటి వద్ద వదిలి గేదెకు గడ్డి తెస్తుంది. మేతకు వెళ్ళిన గేదె ఇంటికి రాకపోవటంతో లక్షుమ్మకు భయం ఏర్పడుతుంది. రాత్రంతా వానతో ఇళ్ళు తడుస్తుంటే పిల్లలు తడవకుండా జాగ్రత్త పడుతూ, భర్తతో దెబ్బలు తిని గేదె గురించే ఆలోచిస్తుంది.చీకటి వదలక ముందే గేదెను వెతకడానికి వెళ్ళి, దూడను ప్రసవించిన గేదెను ఆ పరిసరాలను చూసి ఆమెలో కనువిప్పు కలుగుతుంది. రాత్రి వేరే జంతువుల బారి నుంచి తన బిడ్డను రక్షించుకోవటానికి గేదె చేసిన ప్రయత్నం బురద అడుగుల్లో కన్పిస్తుంది. నోరు లేని జంతువే బిడ్డను రక్షించుకుంది, నేను నా పిల్లలను రక్షించుకోవాలి. అలా చేయాలంటే గేదెను అమ్మకుండ భర్తను ఆపాలని నిర్ణయించుకొని, ఇంటిని వదిలి చెట్టుకింద జీవిస్తాను కాని గేదెను అమ్మటం కుదరదని తేల్చి చెప్తుంది. అంతే కాక ఆర్థిక స్వేచ్ఛ స్త్రీకి ఉంటేనే గేదె లాగా కొమ్ములు వచ్చినట్లు అని భావిస్తుంది.

సన్నపురెడ్డి మరో కథ 'వీరనారి'లో రాయలసీమ స్త్రీలకే ఉండేప్రత్యేక సమస్యను తెలుపుతుంది. కడప జిల్లాలోని పల్లెల్లో ఉండే ఫ్యాక్షనిజం వల్ల పెద్దిరెడ్డి దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్న ఈశ్వరమ్మ భర్త బాంబులు తెచ్చి దిబ్బలో

దాచాడు. ఆటవస్తువు అనుకొని వాటిని తీసిన ఈశ్వరమ్మ కొడుకు చేతులు ముంజేతుల వరకు బాంబు పేలటంతో దెబ్బతింటాయి. ఆ సంఘటనతో ఈశ్వరమ్మ భర్త, పిల్లవానితో పట్నం చేరి గుట్టుగా ఉంటుంది. ఒకవైపు కొడుకును రహస్యంగా ఊరి మనుష్యులు చూడకుండా ఆసుపత్రిలో చూపిస్తూ, మరోవైపు భర్తను ఇంటి నుండి బయటకు వెళ్ళకుండా కాపు చేస్తుంది. ఇలాంటి సమయంలో గడ్డం చేయించుకోవటానికి బయటకు వెళ్ళిన భర్త ఇంటికి రాకపోవడం, మరోవైపు గాంధీ రోడ్డు వద్ద బాంబు దాడిలో వ్యక్తి మరణం అనే మాట విని వీధి వెంట ఏడుస్తూ పరుగున వెళ్తుంది. అక్కడ చనిపోయింది తన భర్త కాదు. మరో వ్యక్తిని ఇంకో స్త్రీ ఏడ్పుతో అర్థమవుతుంది. ఇప్పటి వరకు తను మాత్రమే ఫ్యాక్షన్ బాధితురాలనుకుంటున్న ఈశ్వరమ్మకు నా లాంటి వారు చాలా మంది ఉన్నారని తెలుస్తుంది. అంతేగాక భర్త మరణించిన వెంటనే ఆమె, కొడుకును తీసుకొని వేరొక ప్రాంతానికి వెళ్ళిపోవటాన్ని స్వయంగా ఆమె తండ్రి తప్పుపట్టడం, భర్తను చంపిన వారిని చంపటానికి కొడుకును పంపి వీరనారి కాకుండా పిరికిపందల వెళ్ళిందనే మాటలతో రాయలసీమ స్త్రీలు ఫ్యాక్షనిజంతో ఎన్ని బాధలు అనుభవిస్తున్నారో తెలుస్తుంది.

పురుషుల వ్యసనాలకు స్త్రీలు కుటుంబ భారం మోయయటమే కాకుండా, మానసికంగా, శారీరకంగా ఎన్నో బాధలు అనుభవిస్తున్నారు. ఇలాంటి అంశంతో వేంపల్లి గంగాధర్ 'మొలకల పున్నమి' కథా సంపుటిలో 'పూలచేతులు' కథను రాశారు. జానకి, నాగయ్య దంపతులు. గుడికి కావలసిన సామాగ్రి తెచ్చి ఇస్తూ, గుడిలోని పనులు చేసా్తూ జీవనం సాగిస్తుంటారు. సంతోషంగా ఉన్న భార్య భర్తల మధ్య మద్యపానం దుఃఖాన్ని మిగులుస్తుంది. మద్యానికి అలవాటుపడిన నాగయ్య కల్తీ మద్యం తాగి చనిపోతాడు. అదే సమయంలో అప్పటి వరకు తల్లి కాలేదని బాధపడిన జానకి గర్భం దాలుస్తుంది. ఊరి వారి సహాయంతో గుడి ముందు పూలకొట్టు పెట్టుకొని కూతురు లక్ష్మిని పెంచుతుంది. పూలవ్యాపారం ద్వారా వచ్చిన డబ్బు మరికొంత అప్పు చేస ప్రక్క ఊరికే ఇచ్చి కూతురు పెళ్ళి చేస్తుంది. కొద్ది రోజులు లక్ష్మిని బాగా చూసుకున్న భర్త, తర్వాత బాగా మద్యం సేవించి ఇంటికి వచ్చి ఆమెను కొట్టడం చేస్తుంటాడు. ఆ విషయం తెలిసి బాధపడిన జానకి తన దగ్గరే ఉండమని కూతురిని అడిగితే బతికిన, చచ్చినా అత్తింట్లోనే అంటుంది. పూల ద్వారా వచ్చే డబ్బు మొత్తం అల్లుని చేతిలో పెట్టి లక్ష్మిని కొట్టవద్దని విన్నవిస్తుంది. కాని అతనిలో మార్పు రాక, ఆ బాధతో జానకి మరణిస్తుంది. భర్త తాగుడును, హింసను భరించలేక లక్ష్మి అతన్ని వదిలి, తల్లి పూలకొట్టు నడుపుకుంటు జీవనం సాగిస్తుంది.

పురుషుల పశుత్వానికి ఎంతోమంది స్త్రీల మాన ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనలు అనేకం. స్త్రీల శీలాన్ని బలవంతంగా చిదిమేసే క్రూరుల అకృత్యాన్ని భరించలేక ప్రాణాలు కోల్పోయినవారు. అనేకమంది ఉన్నారు అలాంటి ఇతివృత్తమే వేంపల్లి గంగాధర్ రచించిన 'మొలకలపున్నమి' కథా సంపుటిలో 'శిలబండి' కథలోని చిన్నమి పాత్ర. కథానాయకుని తండ్రి ఎక్కడి ఎక్కడి భూముల్ని దౌర్జన్యంగా లాక్కుంటూ డబ్బు బాగా సంపాదిస్తాడు. ఆ డబ్బుతో మొక్కుబడి ఉన్న అంకాళమ్మ జాతర చేస్తుంటాడు. జాతరలో కొండారెడ్డి సహాయంతో చిన్నమ్మిని అత్యాచారం చేస్తాడు. తర్వాత కొండారెడ్డి చిన్నమ్మిని బలవంతం చేయబోతే రాయితో గుద్ది చంపుతుంది. ఊర్లో ఏమంటారోనని ఆమె చనిపోతుంది. కథానాయకున్ని ప్రేమించటం వల్ల, అతని తండ్రి అత్యాచారం చేసిన అతన్ని ఏమి చేయదు. కొండారెడ్డిని మాత్రమే చంపుతుంది. ఇదంతా తెలిసి కూడా తండ్రిని ఏమి చేయలేని స్థితిలో కథానాయకుడు ఉంటాడు. పురుషుల పశుత్వానికి ఒక దళిత స్త్రీ బలవతుంది.

మగవారు ఎన్ని తప్పులు చేసిన సమాజం హర్షిస్తుంది. కాని స్త్రీలు తప్పు చేయకపోయిన, నింద వేస్తే అందులో నిజానిజాలు ఎంతో తెలుసుకోకుండానే కించపరుస్తారు.

అలాంటి స్త్రీ వ్యథలను తెలిపే కథ మహాసముద్రం దేవకి రచించిన 'మంటల ఒడిలో' కథా సంపుటిలోని 'నింద' కథ. నలుగురు సంతానంలో మల్లమ్మ పెద్దకూతురు కావటంతో మేనత్త కొడుకు మురగడుకు ఇచ్చి చిన్న వయస్సులో పెళ్ళి చేశారు. మురగడు అసలు రంగు తెలియని మల్లమ్మ ఇష్టంగానే బావను పెళ్ళి చేసు కుంటుంది. పెళ్ళయిన నెల రోజులకే మురగడు స్త్రీలోలుడని తెలిసి, కోపంతో పుట్టినిల్లు చేరుతుంది. కొడుకు అలాంటివాడని తెలిసినా, పెళ్ళి జరిగితే మార్పు వస్తుందని నమ్మి, పెళ్ళి చేసిన ఆదెమ్మ దంపతులు, మల్లమ్మను బతిమలాడి ఇంకెప్పుడు అలాంటి తప్పు జరగదని నచ్చచెప్పి మెట్టి నింటికి తెస్తారు. తల్లి ఉ పదేశంతో కొద్దిరోజులు బానే ఉన్న మురగడు చేను వద్ద నీలవేణితో కలిసి మల్లమ్మ కంట పడతాడు. దాంతో మల్లమ్మ మళ్ళీ పుట్టినిల్లు చేరుతుంది. తల్లిదండ్రులు, ఊరిపెద్దలు నచ్చచెప్పటంతో అత్తవారింటికి చేరిన మల్లమ్మను మురగడు చంపి, ఆత్మహత్యగా నిరూపిస్తాడు. నిజానికి మల్లమ్మతో సంబంధం ఉన్న పెరుమాలయ్య భార్య వియోగంతో ఊపిరి వదిలి నెలరోజులయ్యింది. కాని మురగడు ఎదుట మల్లమ్మ పెరుమాలయ్యతో కలిసి ఉండి, భర్తకు నిజం తెలియటంతో ఆత్మహత్య చేసు కుందని ప్రజలు భావిస్తారు.

మగపిల్లలు వంశ వారసులుగా భావించటం తర తరాల నుండి జరుగుతుంది. మగపిల్లలు పుడితేనే వంశం నిలుస్తుందని, ఆడపిల్లలు పుట్టినా అత్తవారింటికి వెళ్ళేవారనే చులకన భావం. సమాజంలో ఎప్పటి నుంచో ఉంది. అందువల్ల పుత్రోత్సాహం పుత్రుడు పుట్టినపుడు కాదు, వంశ గౌరవాన్ని నిలిపినప్పుడు అనే పద్యాలున్నాయి కాని మహిళ గురించి కన్పించవు. నాటి నుంచి నేటి వరకు నాగరికులు, అనాగరికులు, విద్యావంతులు, విద్యా విహీనుల్లోను ఆడపిల్ల పుట్టుక మీద చులకన భావం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది, ఆడ మగ పుట్టుకకు భార్య భర్తల ఎవరి ప్రమేయం ఉండదని తెలిసి కూడా మనుష్యుల్లో మార్పు రావటం లేదు. ఇప్పటికీ ఆడపిల్లలు పుడితే, భార్యలను పుట్టినింటికి పంపే భర్త, అత్త మామలు ఉన్నారు. ఈ విషయాన్నే శాంతి నారాయణ 'నాగలకట్ట సుద్దులు' కథా సంపుటిలో 'ఆడిదంటే అంత అలుసా' అనే కథలో తెలిజయేశారు. ఓబులేసు వ్యవసాయం చేసే వారికి ఇస్తే చెల్లి కష్టపడుతుందని పట్నంలో ఉద్యోగం చేసే వ్యక్తితో వివాహం చేస్తాడు. వరుసగా రెండు కాన్పుల్లో ఆడపిల్లలు పుట్టడంతో మూడవ కాన్పులో మగపిల్లాడు పుడితేనే మెట్టినింటికి రమ్మని ఆమె భర్త, అత్త మామలు ఆమెను ఇంటినుంచి వెళ్ళగొట్టారు.

ఈ విధంగా రాయలసీమలోని స్త్రీల ఆర్థిక స్వేచ్ఛ, ఫ్యాక్షనిజం వల్ల స్త్రీలు అనుభవించే బాధలు, మద్యపానం, అత్యాచారం, గృహహింసలతోపాటు, సాంప్ర దాయాల పేరుతో స్త్రీలను ఇబ్బందులకు గురిచేయటం, ఆడవారనే చులకన భావంతో కొడుకు పట్ల చూపే ప్రేమ కూతురిపై చూపకపోవటం, వితంతు స్త్రీలను అవమా నించటం లాంటి ఎన్నో అంశాలను రాయలసీమ రచ యితలు తమ కథల ద్వారా తెలియజేశారు.

## ఆధార గ్రంథాలు

1. గంగాధర్, వేంపల్లి - మొలకల పున్నమి కథా సంపుటి - 2015
2. దేవకి, మహాసముద్రం - మంటల ఒడిలో.... - 2008
3. నారాయణ, శాంతి - నాగులకట్ట సుద్దులు - 2004
4. వెంకటరామిరెడ్డి, సన్నపురెడ్డి - కొత్త దుప్పటి - 2008
5. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి - కథాశిల్పం - 2016
6. శివప్రసాద్, వల్లూరు (సంపాదకత్వం) - కథానిక - పాఠాలు - 2016

# స్త్రీవాదం - భాష, అభివ్యక్తి రీతులు

- యం. కోటిశ్వరులు, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై

ప్రపంచ భాషలలో తెలుగు సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉంది. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని శ్రీనాధుడు, కృష్ణదేవరాయలు చెపితే, తెలుగులోని కమ్మదనం, తియ్యదనానికి ఆకర్షితులై 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పాశ్చాత్య పండితులు ప్రశంసించారు. కాని ఉద్దండ పండితులు మాత్రం పదజాలానికి మడికట్టి మైలు పడకుండా నిలిపారు. భావజాలాన్ని సంప్రదాయానికి ముడివేసి జతకలిపారు. అందుకే ఏ దృక్పథంలో ప్రాచీన కావ్యంలోనైనా స్త్రీ పదాలన్నీ ఒకే మూసలో ఒదిగి పోయాయి. పురుష దృక్పథంలో ఇమిడి పోయాయి.

సమాజంలోగాని, సాహిత్యలోగాని ఏవైనా భావాలను వ్యక్తం చేయడానికి ఉపయోగించే భాషా పదజాలమంతా పురుషాధిక్యతకు, పితృస్వామ్య వ్యవస్థకు అనుకూలమైనట్లుగా కనిపిస్తుంది. ప్రచార సాధనాలు, వార్తాపత్రికలు, పాఠ్యాంశాలలోని భాష నుంచి పామరుల భాష వరకు అంతా పురుషాధిక్యతకు అనుకూలంగా సృష్టించిన పదజాలమేనని స్పష్టమైతుంది. ఏ సమాజంలోనైనా స్త్రీ-పురుషుల హెూదా పాత్రలు గురిచి కొన్ని నిర్థిష్టమైన విశ్వాసాలుంటాయి. ఆ విశ్వాసాలకు అనుగుణంగానే భాషాపదాలు కనిపించడం వల్ల భాషలో కూడా లింగ వివక్షత ఏర్పడిందని అభిప్రాయపడవలసి వస్తుంది. భాషా పదజాలంలో ఏర్పడిన ఈ లింగ వివక్షతను పరిశీలించినపుడు దానిలోని వ్యత్యాసం అర్థమవుతుంది.

పుంలింగాన్ని సూచించేపదాలు స్త్రీలకు కూడి వర్తిస్తున్నాయి. ఉదా - వైద్యుడు, విలేఖరి, సభాపతి మొదలైనవి. వైవాహిక బంధం ద్వారా కొత్తగ మెట్టినింట అడుగుపెట్టిన కోడలిని రాచి రంపాన పెడుతుంటే అటువంటి అత్త 'గయ్యాళి' అవుతుందని తెలుగు భాషలో ఆ పదాన్ని ఉపయోగిస్తున్నారు. కానీ అలాంటి ప్రవర్తన కలిగిన పురుషులున్నా వారెవరకీ అలాంటి పదాలను ఉపయోగించడానికి 'గయ్యాళి' లాంటి స్త్రీ లింగపదానికి సమానమైన పుంలింగ పదాలు వాడుకలో లేకపోవడం విచిత్రమేకాదు! వివక్షను స్పష్టం చేస్తుంది.

పదాల ఉత్పత్తిలోను పరుషలింగ పదాలనుండి స్త్రీలింగ పదాలను నిర్మించడంలోనూ, పదాల అర్థాలలో స్త్రీలకు వర్తించే పదాలకు తక్కువ ప్రాముఖ్యత కనిపించడం కూడా ఇటువంటిదే. ఉదా: దొర-దొరసాని, గణికుడు-గణిక.

అలాగే సెక్సువాలిటీ, సౌందర్యవర్ణన మొ॥ విషయాలకు సంబంధించిన పదాలు అధికశాతం స్త్రీలింగానికి మాత్రమే వర్తిస్తున్నాయి. ఉదా - వ్యభిచారిణి, పతిత, వేశ్య, పతివ్రత, హంసగమన, గొడ్రాలు, భామినీ, మధురాధరీ, ఘననితంనీ, అంగనా, సైరంధ్రీ మొదలైనవి.

ప్రాచీన సాహిత్యమంతా పురుష పుంగవుల అధీనంలోనే కొనసాగింది. అప్పుడప్పుడు ఏకవయిత్రి అయినా పురుషుల సానుభూతితోనో, ప్రోత్సాహంతోనో మాత్రమే కవిత్వాన్ని వెల్లడించగలిగింది తప్ప, స్వతంత్రంగా వ్యవహరించగలిగిన మొల్ల వంటి కవయిత్రులు అరుదనే చెప్పాలి. అలనాటి ముద్దుపళని నిర్భయంగా రాధికా స్వాంతనాన్ని రచిస్తే అటుతరువాత సంఘ సంస్కర్తగా మనం భావిస్తున్న కందుకూరి ఆమె కవిత్వం సంభోగ శృంగార వర్ణనలతో నిండి ఉందని తిరస్కరించాడు. అయితే శృంగార వర్ణనలు చేసిన కావ్యాలు ఆనాటికి కోకొల్లలుగా వెలువడినా అవన్నీ పురుషులు చేసినవే. ఒక స్త్రీగా ముద్దుపళని ఈవిధమైన వర్ణనలు చేయడం సంస్కరణవాదిగా పేరుగాంచి స్త్రీల ఉద్ధరణకు

పూనుకున్న కందుకూరే సహించలేకపోయాడు. ఇక సామాన్యుల సంగతి చెప్పనేల? దీనికి ప్రతిస్పందించిన నాగరత్నమ్మగారు ఒక స్త్రీగా అంతకంటే పచ్చి శృంగారాన్ని వెలువరించిన మగవాళ్ళ రచనల మాటేమిటని ప్రశ్నించి దానికి మేల్తరమైన ప్రతిని ప్రచురింప చేశారు.

పై నేపథ్యం నుంచి స్త్రీల రచనల మీద, ఆ రచనలోని భావజాలం, భావప్రకటనల మీద పురుష దృక్పథం ఎంత ప్రగాఢమైన విమర్శను గుప్పిస్తుందో స్త్రీవాదులు గమనించగలిగారు. ఇటువంటి సందర్భంలో భాష, దాని వాడుక గురించి మనం ప్రగాఢంగా నమ్మే కొన్ని విశ్వాసాలని మనలో లోతుగా పాతుకుపోయిన భావజాలాన్ని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భాష, భావజాలం, అభివ్యక్తీకరణ పురుషాధిక్య సమాజంలో పెద్ద ఆటంకంగా స్త్రీవాదులు గుర్తించి నాగరత్నంగారు చేసిన ప్రయత్నం చుంచి స్ఫూర్తిని పొంది ముఖ్యంగా స్త్రీవాద కవిత్వం ఒక స్పష్టమైన అవగాహనను ఏర్పరచుకుని నిస్సంకోచ భావవ్యక్తీకరణకు కొత్త పుంతలు తొక్కింది. సమర్త, బహిష్టు, స్త్రీ పురుషసంయోగం, గర్భవిచ్ఛిత్తి, ప్రసవవేదన మొదలగు విషయాలను వస్తువుగా స్వీకరించడంతో భావప్రకటనమీద, లైంగిక ప్రతీకల ప్రయోగంతో పదజాలం మీద ఏకకాలంలో తిరుగుబాటు ప్రారంభమయ్యింది.

అయితే స్త్రీవాద కవిత్వ నిర్మాణంలో భాషాపరమైన రెండు విధానాలు కనిపిస్తున్నాయి. పామరుల యాస భాషలో కవిత్వాన్ని చెప్పడం ద్వారా పామరులలో చైతన్యాన్ని కలిగించడానికి తోడ్పడేది ఒక విధానమైతే, పదజాలం, భావ ప్రకటనలలోని వివక్షలపై తిరుగుబాటు చేస్తూ సమాజాన్ని కదిలించేది రెండో పద్ధతి. స్త్రీవాద కవిత్వంలో మొదటి పద్ధతికి ప్రాధాన్యమిచ్చిన కవయిత్రులు చాలా తక్కువమందే కనిపిస్తున్నారు.

స్త్రీవాద కవిత్వంలో రెండవ పద్ధతికే ఎక్కువ ప్రాధాన్యత కనిపిస్తుంది. ప్రాచీనులు విశృంఖలంగా రాసిన రాతలను, అంగాంగ వర్ణనలతో సౌందర్యాన్ని దోపిడీ చేసిన రాతలని మహాకావ్యాలుగా పేర్కొన్న దౌర్జన్యాన్ని ప్రశ్నించాలన్న తిరుగుబాటు, శరీరాలనే వర్ణనలు చేస్తూ అశ్లీల, అసభ్యంగా ఉపయోగించిన పదజాలాలను సమూలంగా అంతం చెయ్యాలన్న ఆకాంక్ష బలీయంగా కనిపిస్తుంది.

ప్రాచీన చరిత్రంతా స్త్రీలను అలంకారాలకు బందీలను చేసింది. సుకుమారానికి పద బంధాలను సృష్టించి అందాలకు ఖరీదును కట్టింది. ఆ దళారీతనాన్ని ప్రశ్నిస్తున్న వైనం జయప్రభగారి 'ప్రతిచర్య'గా కవితలో కనిపిస్తుంది.

"అలంకారాలకు ఉరిత్రాళ్ళై చుట్టుముట్టిన గతాన్ని
సుకుమార పద బంధాలతో
అందాలకి ఖరీదు కట్టిన
దళారీతనాన్ని
చరిత్ర గోతుల్లోంచి తవ్వితీయండి!"

జీవితం అంతులేని పోరాటం. పోరాడగలవారే విజయం సాధిస్తారు. అనే చైతన్యంతో ప్రాచీన సాహిత్యంలో స్త్రీల చిత్రణపట్ల ఆక్షేపణ తెలుపుతూ పోరాటానికే సిద్ధపడుతున్నారు. అందుకే మనిషిగా ఎదగనివ్వని దేన్నైన ఎదుర్కోవాలని, అందులో భాష కూడా ఒకటని గుర్తించి తిరుగుబాటుకు ఎలా సిద్ధపడ్డారో తెలుస్తుంది.

"మనలని
మనిషిగా గుర్తించకుండా
అడ్డుపడే దేన్నైనా ఎదుర్కోవాల్సిందే
భాషను ఎదుర్కోవాలి!"

'ఆలయాన వెలసిన ఆదేవుని రీతి ఇల్లాలే ఈ జగతికి జీవన జ్యోతి' అంటూ సినిమా పాటలకే పరిమితమైన ఇల్లాలి గౌరవం నిజ జీవితంలో వారి మానానికి అడుగడుగునా సవాలే. ఎక్కడ సంభాషణలలోనైనా స్త్రీల పట్ల అవమానాల భాషే.

"మానానికి సంబంధించినదంతా
అవమానాల భాషే అయినచోట
మానభంగం అంటారో
అత్యాచారం అంటారో
లైంగికనేరం అంటారో
మరో చెండాలం అంటారో
మమ్మల్ని మరింతగా భూపతనం చేసే అర్థాలే"

స్త్రీలపై ఏ ఆరాచయం జరిగినా దాన్ని స్పష్టంచేయ డానికి ఒకోపేరుతో పదజాలాన్ని సృష్టించారు. మగవాడికి మానమే పోదన్నట్లు ఈ పదాలే ఉండవు. అందువల్లే కొండేపూడి నిర్మల 'బాధాశప్తని' కవితలో ఏ పదాలు సృష్టించినా దానిలోని అర్థాలు స్త్రీలను మరింతగా భూపతనం చేసేవేనని పదజాలంలోని అర్థాలను సైతం విమర్శించారు.

'శీలం' అనే చిన్నపదమే స్త్రీ జీవితానికి పెద్ద పరీక్ష అయిపోయింది. ఆ పరీక్షలకు పురాణలే ప్రామాణికాలు. ద్వర్థి కావ్యాలు రచించి గొప్ప కవులుగా ప్రసిద్ధి పొందితే నేడు ద్వంద్వార్థ పదాలు సృష్టించి ఆధునిక దుశ్శాసనులు పైటలాగడంలో ప్రావీణ్యతను చాటుకుంటున్నారు. వారి నామధేయాన్ని సార్థకం చేసుకుంటున్నారు. పాతివ్రత్య పరిక్షకు పురికొల్పాలన్నా, అసభ్యప్రవర్తనను కప్పి పుచ్చుకోవాలన్నా భాషాపదజాలాన్నే ఉపయోగించు కోవాల్సిన దౌర్భాగ్యస్థితి సృష్టిస్తున్నారు. ఈ పదాలోని ఆంతర్యం, ద్వంద్వార్థ పదాలలోని కుయుక్తిని 'ఈ దుబాసీ మరణించుగాక' కవితలో పాటిబండ్ల రజని వాస్వవికంగా చూపారు.

"వేలెడు వెధవంత ఒక్కమాట
ఆడదాన్ని అనసూయను చేసి
పాతివ్రత్యం పరీక్ష చేస్తుంది!
అచ్చం రెండర్థాలే తాగి బిసినపాట
దుశ్శాసనుడై హౌస్‌ఫుల్లాటలో పైటలాగుతుంది!"

పాండిత్యపు స్థాయిని తెల్పుకోడానికి వంటిపై పట్టుశాలువాను ప్రదర్శించినా తాను పఠించే క్యావనాయకి వర్ణనలో మాత్రం మనసులో గూడుకట్టుకున్న కామ మనస్తత్వం పెల్లుబికి భాషావాగ్దాటితో పాటు చురకత్తి లాంటి కామపుచూపులు కావ్యసభలో ముందుగా ప్రయాణించడానికి పోటీపడుతుంటాయి. మేకవన్నెపులి లాంటి వీరి మనస్తత్వాన్ని 'ఈ దుబాసీ మరణించుగాక' కవితలో పాటిబండ్ల రజని స్పష్టీకరించారు.

"పాండిత్యపు పట్టుశాలువా కప్పుకున్నా
ప్రబంధనాయకి వర్ణనకు కైపెక్కి
కాకి చూపుల కామపిశాచి భాష
కావ్యసభలో కన్నుగీటుతుంది"

సముద్రం ఒడ్డున అలలకు ఎక్కడో ఆ వెనుక అల్లంత దూరంలో కనపడని గాలిచేసిన అలజడి కారణం. అలాగే నేటి నీచ భావప్రకటనకు, ద్వంద్వార్థాల భాషా పద జాలానికి అలనాటి ప్రబంధ, క్షీణయుగాల ప్రభావం నేటికీ వెంటాడుతూనే ఉంది. భావప్రకటనను, భాషాపద జాలాన్ని స్త్రీల శరీరవర్ణనలో కనిపిస్తున్న తీరును దుయ్యబడుతూ పాటిబండ్ల రజని 'క్షుద్రానందం' కవితలో తీవ్ర ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు.

"భావ ప్రకటనా మాధ్యమ
భాషా స్నేహానికి వికృతాంగుళులు మొలిచి
దొంగరంగు లద్దుకుంటూ
నగ్న నఖ చిత్రాలావిష్కరిస్తుంటాయి
పురుష కూటముల చుట్టూ
ఆ భంగపాటు శబ్దాల
అంగాంగ విస్ఫోటాల
వాక్కాలుష్యపు కమురు కంపు
అలవాటుగానో, అక్కసుగానో
అంధగంధమైన వ్యాపించే ఉంటుంది
పంచనామాచేస్తున్న శవపు అవయవ శేషాల్లా
స్త్రీ శరీరశకలాలు, మానసిక మానభంగాలు
ఆగాలిలో కుక్కనాకిన మాంసఖండాలై
తడిదేరుతూనే ఉంటాయి"

'నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు, లోగుట్టు పెరుమాళ్ళ కెరుక' అన్నట్లు నేటి ప్రచార సాధనాలలోని స్త్రీలపట్ల ప్రమోగిస్తున్న నీచమైన ద్వంద్వ పదజాలాన్ని స్త్రీలే గుర్తించవలసిన దుస్థితి ఏర్పడింది. అందువల్లే ఎక్కడ అశ్లీలతపై పోరాడుతున్నా స్త్రీలే కనిపిస్తారు గాని పురుషులు కనబడకపోవడమే దానికి నిదర్శనం. ప్రచార సాధనాలపై ప్రతిస్పందనే జయప్రభ 'విశ్వకవితా ప్రపంచంలోకి' కవితలో తెల్పారు.

"ఇంట్లో రేడియో, టీవీల
గారడీలతోనే, మైమరచిపోయే
మీసహనానికి నాజోహార్లు
కానీ అవి
నాకు
గజ్జకురుపంత కంపరంగా అనిపిస్తాయి
కసాయిలోకానికి కాపలాకాసే
కుక్కల్లా కనిపిస్తాయి
ఎయిడ్స్ భయంకరమైనదంటే
నాకనుమానమే
తెలుగు సినిమాకంటేనా?" అని

కంప్యూటర్ యుగంలో సైతం ప్రచారసాధనాలు స్త్రీల జీవితాలకు అసభ్య భాషను ఉపయోగించడం జాతికి హితం కాదు. ఏ యుగంలో లేనట్లు నేడు ప్రసార మీడియా సాధనాలన్నీ అశ్లీలానికే ప్రాధాన్యమిస్తున్నాయి. ఆత్మవిశ్వాసంతో అన్నిరంగాల్లో అడుగుపెడుతున్న స్త్రీల పాలిట ఈ పరిణామం శాపమే.

"ప్రాథమిక పాఠాలు వల్లించాల్సిన
లేత కంఠనాళాల నుండి
ప్రవహిస్తున్న ఆ బూతుల దుర్గంధమేమిటి?"

సమాజంలో సక్రమంగా పెరిగి క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన పసిపిల్లలు సైతం పెడదోవ త్రొక్కడం వెనుక ప్రచార సాధనాలు, సమాజంలోని వక్ర సన్నివేశాలే కారణం. అందుకే శీలా సుభద్రాదేవి 'బాల్యాన్ని పారిపోనీకండి' కవితలో ఆ పరిస్థితిని ప్రశ్నించారు.

"మన బాధలు సామ్రాజ్యవాదతొత్తు వైఖరిగా
చూపబడతాయి
మన గొంతులు డీ అయిడలైజ్డ్‌గా వక్రీకరించబడ
తాయి - సాటి కవయిత్రుల పట్ల
వారు చూపిన జన్మజన్మల సంస్కారం అన్ని కోణాలా
ఆవిష్కృతమవుతుంది
చిత్రమేమిటంటే
ఇంత జరిగినా సరే ఒక చచ్చిపోని చిర్నవ్వు నన్ను
వెంటాడుతూనే ఉంది
ఎందుకంటే పైన చెప్పబడినవాటిల్లో ఏరూపేణా
అయినా అన్నీ వ్యక్తులకు
రుద్దబడిన గుణాలకు సంబంధించినవే తప్ప
తెగనరికిన అవయవఖండాలకు
వర్తించినవి కావు
చక్రస్తనీ, మధురాధరీ, కుచోన్నతే, ఘననితంబినీ,
అంగనా, లలనా, సైరంధ్రీ
కుక్కా, నక్కా అనిపిలవడం కంటే చాలా మేలు కదా!
పనికిరాని మురికిలోంచి చెత్తకుప్పలోంచి ఇంధనశక్తిని
పిండుకున్నట్లు
బరులు గీసిన 'పవిత్రపావుల' బుర్రల్లోంచి
ఇప్పుడిప్పుడే ఇంతకుమించి
ఆశించేదేమీ వుండకపోవచ్చు"

స్త్రీవాద కవిత్వంపై పదజాలం, ప్రతీకల ప్రయోగాలను కొన్ని విమర్శలు వెలువడ్డాయి. ఆ విమర్శలు కేవలం స్త్రీవాద కవిత్వానికే పరిమితం కాక స్త్రీవాద కవయిత్రుల వ్యక్తిగత గుణాలకు కూడా అన్వయించడం జరిగింది. దానికి ప్రతిస్పందనగా కొండేపూడి నిర్మల 'ఆశ్చర్యంలేదు' కవితలో మన బాధలన్నీ సామ్రాజ్యవాదుల తొత్తువైరిగా మారుతున్నాయని, సాటి కవయిత్రుల పట్ల వారు చూపిన సంస్కారం ఎలాంటిదో స్పష్టమవుతోందని వ్యంగ్యంగా పేర్కొంటూ వారు స్త్రీలపై ఉపయోగించిన పద జాలమంతా ఎలాంటిదో తెలిపి దానిలోని కుసంస్కారాన్ని బట్టబయలు చేశారు.

స్త్రీవాదం ప్రాచీన సాహిత్యంపైనే కాదు, సమకాలీన సాహిత్యంలో అయినా, సమాజంలో నైనా స్త్రీలను కించపరిచే భావజాలాన్ని, అభివ్యక్తీకరణ రీతిని ఏ రూపంలోనున్నా స్పష్టంగా వ్యతిరేకిస్తోంది. సమకాలీన దళితవాద సాహిత్యాన్ని కూడా కొన్ని సందర్భాలలో మెలకువలు పాటించమని కోరడమే దీనికి కారణం.

కర్నాటకలో దేవాలయ ప్రవేశం చేసిన హరిజనుడి చేత మలం తినిపించారన్న వార్త చదివి ప్రతిస్పందనగా శిఖామణి ఉద్రేకంతో...

'రేయ్! లంజాకొడకా
ఏం! సిగ్గుగా వుందా?
అసహ్యంగా ఉందా
వాణ్ణి కన్న నేరానికి
నిన్ను తూలనాడుతున్నాను తల్లీ!
మగవాడ్ని తిట్టడానికి కూ్కడా
అడదాన్ని అడ్డం పెట్టుకునే
దౌర్భాగ్యదేశం నాది!!"

అని 'వాడే అశుద్ధ మానవుడు' కవితను వెలువరించగా స్త్రీవాద కవయిత్రి ఆయన ప్రగతిశీల భావాలను మెచ్చుకున్నా స్త్రీలను కించపరచే పదజాలాన్ని ప్రయోగించడం భావ్యం కాదని హితవు పలకడం జరిగిందని స్వయంగా శిఖామణే చెప్పుకున్నారు.

'నిశానీ' కవితా సంపుటిలో భాష అశ్లీలంగా అభ్యంతరకరంగా స్త్రీలను కించపరిచే విధంగా ఉందనీ స్త్రీవాదులు అభ్యంతరం చెబుతూ 'అభాషయుజమానులదనీ' యుజమాని ఆయుధాలతో యుజమాని సౌధాన్ని కూలగొట్టగలమా? అనే వ్యాసం రాశారని దళిత సాహిత్య తత్త్వంలో తెలుస్తుంది. బూతులు భూస్వామ్య వ్యవస్థ నుంచి సృష్టించినవని, అటువంటి తిట్లను ఉపయోగించడం వలన ప్రయోజనం లేదని ఆ వ్యాసంలో స్త్రీవాదులు అభిప్రాయపడ్డారని దానికి సమాధానంగా ఎండ్లూరి సుధాకర్ 'ఐదోవాచకం' కవిత రాసారని పై గ్రంథంలో పేర్కొనబడింది.

"కండకావరం తిట్లకూ
కడుపుమండి రగిలిరాలిన మాటలకు తేడాల్లే వాతల్లులూ!
బాలెంతలు తుంపరలో నాట్లేస్తూ
తుమ్మ కొమ్మలకు వేలాడదీసిన బిడ్డలు హెూరెత్తి ఏడుస్తుంటే
చేపొచ్చిన పాలు బురదపాలైపోతుంటే
రవ్వంత తలెత్తినా
నడుము లాగుతూవుంటే లేచినిలబడినా
గట్టుమీద మోతుబరి ఆసామి చుట్టనోట్లో తిప్పుకుంటూ
నీయక్క..... లంజ.... అంటూ తిట్లగునపాలు గుండెల్లో దింపుతూవుంటే
అశ్లీల శబ్దాలకు పంచభూతాలు చెవులు మూసుకుంటాయి
ఎవరి మాటలు తల్లీ ఇవీ"

అంటూ భూస్వాములు నియంతృత్వంతో ప్రయోగించిన తిట్లకూ, దళితుల హృదయ మంటల్లోంచి వెలువడిన తిట్లకూ, వాటికి కారణమైన పరిస్థితులను వివరిస్తూ 'ఐదోవాచకం' కవితలో ఎండ్లూరి సుధాకర్ స్త్రీవాదులను ప్రశ్నించారు.

"ఓర్నా కొడుకుల్లారా!
తల్లి కులం చెల్లదని మీరంటుంటే
తుళ్ళి తుళ్ళి నవ్వాలనుందిరా!"

తల్లి కులం చెల్లదని, తండ్రిని బట్టే కులం నిర్ణయించాలని కోర్టు తీర్పువెలువడగా దానికి ప్రతిస్పందిస్తూ తల్లికులం చెల్లదన్నందుకు ఆక్రోశంతో తిడుతూ కవిత్వాన్ని చెప్పినా స్త్రీ పదజాలాన్ని ఉపయోగించక పోవడం స్త్రీలకు వర్తించని పదజాలాన్ని ప్రయోగించి తిట్టవచ్చని స్పష్టం చెయ్యడమే. దళితవాదులు తిట్టడానికి కూడా స్త్రీనే అడ్డు పెట్టుకోవలసివస్తుందని, స్త్రీలకు వర్తించని పదజాలమేదీ తిట్లలో లేదని పేర్కొంటే పాటిబండ్ల రజని అటువంటి పదజాలాన్ని ఉప

యోగించకుండా తన ఆవేదనను 'కులౌకికం' కవితలో వ్యక్తం చేశారు.

నేటి సమాజంలో విలువలు మారుతున్నాయి. కాని మారే విలువల కనుగుణంగా భావజాలంలో మార్పు కనిపించడంలేదు. నాటి నుండి నేటి వరకు సమాజంలో ద్వేషించినా దూషించినా ప్రతి తిట్టూ స్త్రీ పరమే చెయ్యాల్సిన దౌర్భాగ్యస్థితిలో భాషాపదజాలం అభివృద్ధి చెందడం దురదృష్టకర పరిణామం. కుళ్ళు కంపు కొట్టే భావాలతోను, వినాశకర విశృంఖలత్వం తోను ప్రతి బూతుకీ స్త్రీని అడ్డం పెట్టుకుంటూ స్త్రీ జాతినే నీచత్వానికి దిగజార్చారు. ఇటువంటి కుసంస్కారాన్ని విమర్శిస్తూ పాటిబండ్ల రజని 'క్షుద్రానందం' కవితలో పురుషులకు సిగ్గిల్లే చీము కూడా లేదని ఘాటుగా తెలిపారు.

"కసిదీరా తిట్టే ప్రతి బూతునీ
స్త్రీపరమే చేస్తున్నాడంటే
తన భంగపాటునీ, బట్ట చాటునీ
ఎంత ప్రదర్శించినా - సిగ్గిల్లే చీము
తనకు లేదనే - వాడి ఆత్మ గౌరవం పట్ల
ఎంత క్షుద్రానందమో!"

ఈ విధంగా స్త్రీవాద కవిత్వంలో స్త్రీలపట్ల వ్యక్త మవుతున్న భావజాలం మీద, ద్వంద్వార్థాలతో సహ కరిస్తున్న భాషా పదాలపట్ల ప్రసార మీడియా సాధనాలలో వ్యక్తమవుతున్న స్త్రీల వివక్ష, అశ్లీలతల మీద వివిధ సాహిత్యాలలో ప్రయోగిస్తున్న పదాల మీద అన్ని దృక్కోణాలనుండి పరిశీలించి వాటిని సమర్థవంతంగా విమర్శిస్తూ వాటిని సంస్కరింపచేసే ప్రయత్నాన్ని వారి రచనల ద్వారా వ్యక్తపరుస్తున్నారు.

## ఆధారగ్రంథాలు

1. సంప్రదాయ సాహిత్యం స్త్రీవాద దృక్పథం - కాత్యాయనీ విద్మహే.కె
2. వామనుడి మూడోపాదం - జయప్రభ
3. బాధాశప్త నది - నిర్మల కొండేపూడి
4. ఎర్రజాబిళ్ళ ఎరీనా - రజని పాటిబండ్ల
5. దళిత సాహిత్య తత్త్వం - శిఖామణి
6. తెగిన పేగు - సుభద్రాదేవి

❀ ❀ ❀

# ఆంధ్ర మహాభారతంలో గాంధారి

- కోష్టు గోవిందరావు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సుబల పుత్రికి కృష్ణున్ని శపించే అర్హత ఉందంటారా...? పాతివ్రత్యం పేరిట కళ్ళకు గంతలు కట్టుకుని బిడ్డల్ని గాలికి వదిలేసిన హస్తినాపురి పట్టపురాణికి పరుల్ని నిందించే అధికారం ఎలా వచ్చింది...? తన సంతానాన్ని నైతిక మార్గాన నడిపించలేని ధృతరాష్ట్ర దేవేరి నేటి తల్లులకు ఎలా ఆదర్శం కాగలదు...? కుమారుల అనైతిక ప్రవర్తన తెలిసి కూడా దండించలేని గాంధారి పాండు పుత్రుల్ని ఎందుకు నిందించింది...? వేదభూమిగా ప్రసిద్ధి చెందిన అఖండ భారతావనిలో పంచమ వేదంగా బాసిల్లే మహాభారతాన్ని చదివిన ప్రతీ పాఠకునికి గాంధారి పట్ల కలిగిన సందేహాలు ఇవి. భారతంలో కుంతి, ద్రౌపదిలతో సమానమైన ప్రతిపత్రి కలిగిన శక్తివంతమైన, ప్రభావవంతమైన పాత్రగా గాంధారీదేవి పట్ల అనేకమైన సందేహాల వలయాలు చుట్టుముట్టాయి. ఎందుకంటే గాంధారి ఉత్తమ చరిత్ర గల పరమ పతివ్రతామ తల్లిగా కీర్తి గడించిందే కానీ, ఒక మహారాణిగా, 101 మంది పిల్లల కన్నతల్లిగా ఆమె విఫలమైనదనే చెప్పవచ్చు. ఎందుకంటే ఈ అంధ దంపతులు పిల్లలపట్ల వల్లమాలిన ప్రేమ, సంపద పట్ల లోభం కనబరిచారే తప్ప, పిల్లల తప్పులను సరిదిద్దే ప్రయత్నం కానీ, వారిని మందలించే ప్రయత్నం కానీ చేయలేదు. ముఖ్యంగా ఈ దంపతుల లోని అసూయా ద్వేషాలే పిల్లలకు కూడా వచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

సనాతన భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలకు, వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమ వేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం పంచమ వేదంగానే కాక భారతీయ విజ్ఞానశాస్త్ర సర్వస్వంగా ప్రసిద్ధికెక్కింది. ఇందులో చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానంతో పాటు, అరిషడ్వార్గాలకు ప్రభావితులైన మానవులు ఏవిధంగా దుర్గతి పాలౌతారో ఆఖ్యాన ఉపాఖ్యాన సహితంగా తెలియజేసారు కృష్ణద్వైపానయ మహర్షి. పంచమ వేదంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాస భారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎర్రన ఆంధీకరించారు.

"యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తిన తత్ క్వచిత్"

ఇందులో ఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు అని సూత మహర్షి శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించారు. భారతం సకల కౌతుకాలకు జన్మస్థానం, వివేక తరువులు పెరిగిన ఉద్యానవనం, జ్ఞానసముద్రం, పరిపూర్ణమైన నవరస సుదాబ్ధి, సకల విద్యలకు మూలపీఠం, సకల శాస్త్రాలకు ఒరిపిడి రాయి, సకల ధర్మాలకు పుట్టినిల్లు, సజ్జనుల జిహ్వకు అలంకారం, శారదాదేవికి లావణ్య రత్న భాండాగారం అయినటువంటి మహాభారతంలో వేదార్థాలకే అందనటువంటి విశేషమైన ధర్మాలు, ప్రత్యేకమైన సాంప్రదాయాలు. అతి సూక్ష్మ ధర్మ స్వరూపాలను మనం గమనించవచ్చు. ఇందులోని పాత్రలు మానవులు నిజ జీవితంలో అనుభవిస్తున్న మానసిక సంఘర్షణలకు ప్రతిరూపాలు. ప్రతీ పాత్ర మానవ స్వభావానికి దగ్గంవుతూ అతన్ని ధర్మ పథాన నడిపించడానికి అతనిలో చైతన్య దీప్తాలను మేల్కొలుపుతుంది. అటువంటి పాత్రలలో విశిష్టమైనదీ, శక్తివంతమైనదీ అయిన పాత్ర గాంధారి.

పితృవాక్య పరిపాలనాదక్షతలో శ్రీరామచంద్రుని అంతటి కార్యశాలి గాంధారీ దేవి. శతపుత్ర సంతాన వరం పొందిన గాంధారికి కురువంశం నుండి వివాహ ప్రస్థానం

రాగానే సుబలుడు తక్షణమే అంగీకారం తెలియజేయడం గాంధర రాజబంధువుల్లో కలవరం రేగినప్పటికీ, భర్తగా దృతరాష్ట్రున్ని అంగీకరిస్తూ "నాకు బతి యిమ్మహేపతియ కానీ యెరుల నొల్ల" (ఆ.ప.-5-12 వచనం) అంటూ స్థిర నిశ్చయానికి వచ్చింది. వారసుల కోసం తపిస్తున్న కురు వంశానికి శతపుత్ర సంతానవతిగా వరం పొందిన గాంధారి ఎడారిలో నీటి చెలమలా కనిపించింది. ఈ వివాహం రాజకీయపరమైనదే అయినా గాంధారి మాత్రం మనస్ఫూర్తిగా అంగీకరించి, భర్త చూడలేని లోకం నాకు అవసరం లేదని జీవితాంతం తన కళ్ళకు గంతలు కట్టుకుని, తన లోకాన్నే చీకటి చేసుకున్న మహాపతివ్రత గాంధారి. అటువంటి నిష్కల్మషమైన చరిత్ర గల గాంధారి కురువంశంలో అడుగుపెట్టిన తరువాత అసూయాగ్రస్తు రాలుగా మారిందని చెప్పవచ్చు. ఆ అంధ దంపతులలోని ఈర్ష్య అసూయలే అంచెలంచెలుగా పెరిగి కురువంశానికి యమపాశాలై, యావత్ భారతావనిలో మరణదేవత విలయతాండవానికి సమస్తమైన రాజలోక నాశనానికి కారణభూతమయ్యాయి.

''యుదిష్టురు జన్మంబు విని మనస్థాపంబున
నుదరతాడనంబు జేసికోనిన, గర్భపాతం బగుడున"
(ఆ-ప-5-98)

గర్భాధారణ సమయంలో తల్లియొక్క మన:ప్రవృత్తులే పిల్లలలో కూడా అలవడతాయని చెప్పవచ్చు. తాను ముందు గర్భం ధరించినప్పటికీ, కుంతికి యుధిష్టరుడు జన్మించాడని తెలిసినాక అసూయతో మనస్థాపం చెందిన గాంధారి తన స్వహస్తాలతో తన గర్భాన్ని బాదుకుని, తన తప్పిదం వలన ఒక మాంసఖండానికి జన్మనిచ్చింది. అదేవిధంగా పాండురాజు మరణాంతరం పాండవులు హస్తినకు చేరిన తరువాత ధార్తరాష్ట్రుల దురాగతాలకు, దుశ్చర్యలకు అంతులేకుండా పోయింది. అయినప్పటికీ ఆ చూడలేని తల్లి చూసీచూడనట్లు ఉదాసీనంగా వ్యవహరించిందే కానీ, కుమారుల అనైతిక ప్రవర్తనను మాన్పలేకపోయింది. ముఖ్యంగా భీముడికి విషాన్నం పెట్టడం, పాములతో కరిపించడం, గంగమడుగులో పడ వేయడం మొదలైన అనేక దురాగతాలను వారణావతంలో లక్కాగృహాదహనం వంటి సకుటుంబ హత్యకు పాల్పడినప్పుడు కూడా ఆ అంధ దంపతులు వారించ లేదు. ద్రౌపదీ వస్త్రాపహారణ సమయంలో సభలో శిలాప్రతిమలా కూర్చున్న సుబల పుత్రి పాంచాల రాజకన్యకు రక్షణ కల్పించలేదు సరికదా తన కుమారుల కారుకూతలను ఒక ఆడదిగా ఏ విన్నదో ఆ గాంధారి మనస్తత్వానికే వదిలేయాలి.

"నీ తనూభవుడు దుర్వినయంబున జనియె నిట్టి
లెంగరి గలడే?" (ఉ-3-384)

కృష్ణరాయభార సమయంలో కురువృద్ధ గురువుద్దు లను కాదని దుర్యోధనుడు సభ నుంచి నిష్క్రమించి నప్పుడు దృతరాష్ట్రుడు గాంధారిని పిలిపించి పైమాటలు అన్నప్పుడు దానికి సమాధానంగా

"నీ పుత్రుడవినీతుడగుట యెఱిగి యెఱిగి వాని
వంశంబున నేలపాయె" (ఉ-తృ-386)

అని అంటుంది. ఈ రాజ దంపతులు తమ అసూయా లోభాలను వదిలి పిల్లల్ని దర్మమార్గాన నడిచేట్లు చేసుంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదేమో...! ఎందకంటే తల్లిదండ్రులిద్దరూ నీ కొడుకంటే నీ కొడుకని అంటున్నారే కానీ మన కొడుకని సగర్వంగా చెప్పకోలేని దుస్థితి కలిగింది ఆ రాజదంపతులకు. లక్కాగృహ దహనంలోనూ, కపట ద్యూతంలో పాండవుల సమస్తాన్ని అపహరించి, ద్రౌపతి వలువలూడ్చినప్పుడు కూడా కుమారుల దుష్కృత్యాలను ఖండించి, మందలించకపోగా వారిని మరి కాస్త ప్రోత్స హించారనే చెప్పవచ్చు. ప్రతీ విషయంలోనూ పాండవులకు అన్యాయం చేస్తూ, కురువంశ ప్రతిష్టను అధ:పాతాళానికి తొక్కుతున్న కుమారుల్ని ఏనాడు మందలించిన పాపాన పోలేదు ఆ గాంధారీదేవి.

18 రోజుల కురుక్షేత్ర మహాసంగ్రామం తరువాత కురువృద్ధుల, గురువుల, కుమారుల, పౌత్రుల, సకల

రాజసమూహాల శవాల గుట్టలు చూడటానికి వచ్చిన రాజదంపతులకు, ఎదురుగా పాండవులు ఉన్నారని తెలియగానే కోపంతో అగ్ని హోత్రంగా వెలుగుతున్న గాంధారిని, ఆమె మన:ప్రవృత్తిని గమనించిన వ్యాస మహర్షి ఆమెను కోపం, అసూయను విడిచిపెట్టమని కోరినప్పుడు "ఏ నసూయగ్రస్తగాను, వీరల జెడదలతునే?" (స్త్రీ -ప్రథమ - 154)

నేను అసూయ గ్రస్తురాలిని కాదని చెప్పుకున్న గాంధారి తన జీవనపర్యంతం ఈర్ష్య అసూయలకు ప్రతినిధిగా వెలుగొందింది. సంపదతో రాజభోగాలతో తన కుమారులు రాజులుగా ఉండాలని ఆశపడిందే గానీ అన్యాయం, అధర్మం, అక్రమాలతో స్నేహం చేసిన తన కుమారుల చెడు ప్రవర్తనను, వారి కారణం వలన జరిగిన మహాసంగ్రామాన్ని నిందించకపోగా, ఈ హత్యలకు కారకుడంటూ ధర్మజుని నిందించడం ఆమె యొక్క కుటిలనీతికి నిదర్శనమని చెప్పవచ్చు.

సుబల పుత్రికి కృష్ణున్ని శపించే అర్హత ఉందంటారా...? 18 రోజుల యుద్ధానంతరం యుద్ధభూమికి వచ్చిన గాంధారి తన పుత్రులు, మిత్రుల మరణంతో శోకాగ్నిలో మునిగి ఇంతటి విపరీత పరిణామానికి కారకుడు శ్రీకృష్ణుడే అని నిందిస్తూ

సీ. పూని పాతివ్రత్య పుణ్యఫలంబున । సంపాదితంబైన సారతపము
బలిమి సాధనముగాబలికెద నుత్తమ । జ్ఞాతుల దమలోని సంగరమున
బొలియ జేసితి గాన పొలియుదుర న్యోన్య । ఘాతుకులై భవద్ జ్ఞాతి జనులు
నీవును దప్పకనే డాదిగా ముప్ప । దారగు నిడైన యద్దినమున

తే. నరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపు । గుత్సితంపు దెఱంగున గూలువాడ
విట్లు మీ వధూజనములు నేడ్చువారు । పతుల సుతులను బంధుల బనవి పనవి

(స్త్రీ-ద్వి-161)

అంటూ ఘోరంగా శపించింది గాంధారి. కురు పాండవుల యొక్క కలహాలకు, కురుక్షేత్ర మహా సంగ్రామానికి కృష్ణున్ని బాధ్యునిగా చేస్తూ, కురు పాండవుల వలె యాదవులు కూడా అంతర్యుద్ధంలో మరణిస్తారని, ఇప్పటి నుండి సరిగా 36 సంవత్సరాల తరువాత నీవు కూడా (కృష్ణుడు) దిక్కులేని చావు చస్తావనీ, కురువంశంలోని స్త్రీలవలె యాదవ స్త్రీలు కూడా భర్తలు, కొడుకుల, బంధువులను తలుచుకుని కుమిలి కుమిలి ఏడుస్తారని శపించింది. ఇక్కడ కూడా గాంధారి ఈర్ష్య అసూయలను ప్రదర్శించిందనే చెప్పవచ్చు.

ఎందుకంటే తన జీవితంలో తన కుమారునికి ఒక్కసారి కూడా నీతులు చెప్పని తల్లి, లోభం, దురభిమానం, సంపద పట్ల వ్యామోహం వదిలి సోదరభావంతో మెలగమని ఏనాడూ బుద్ధులు చెప్పని తల్లి, కుమారుడు చేసిన ప్రతి అక్రమ కార్యాన్ని తెలిసి కూడా ఉదాసీనత దహించిన తల్లి, వారి వలన అన్యాయానికి, అక్రమానికి గురైై అడవుల పాలై అనేక కష్టనష్టాలు అనుభవించిన పాండవుల పట్ల కనీసం దయ చూపని తల్లి, సంధి కోసం శత విధాల ప్రయత్నించిన వాసుదేవుని శపించడం నిజంగా అన్యాయమైన మార్గమనే చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా కురుస్త్రీల వలె యాదవ స్త్రీలు కూడా విలపించాలని అనడం ఆమె యొక్క ఆడతనానికే అవమానం. గాంధారి అంతటి శాపాన్ని ఇచ్చినప్పటికీ కూడా కృష్ణుడు

"మీ యపరాధమున వచ్చినట్టి కీడునకు నింత నొవ్వంగ నను బల్కదగునె" (స్త్రీ-ద్వి-167)

అంటూ శాంతంగానే సమాధానపరిచాడు. ముఖ్యంగా ఆ దంపతుల యొక్క అపరాధాన్ని, వారి యొక్క వైఫల్యాన్ని గ్రహించేలా మాట్లాడుతూ దుర్యోధనుని ఘోరకృత్యాలు. దురభిమానాన్ని తేటతెల్లం చేయడం

జరిగింది. ఈ విధంగా ఒక తల్లిగా గాంధారి ఏ విధంగా వైఫల్యం చెందిందో తెలుసుకోవచ్చు. అదే విధంగా ఒక మహిళామూర్తిగా కూడా ఆమె వైఫల్యం చెందిందనే చెప్పవచ్చు. ముఖ్యంగా ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో పాంచాలికి కనీసం శిక్షణ కల్పించకపోగా, సభామద్యమున వివస్త్రను చేసి, శూలాల వంటి మాటలతో అవమానిస్తున్నప్పుడు కూడా కనీసం అడ్డు చెప్పని మహిళామూర్తి గాంధారీ దేవి అటువంటి గాంధారి మహిళా లోకానికే మాయనిమచ్చ.

పిల్లల పెంపకంలో ఘోరంగా విఫలం చెందిన గాంధారి తనకంటూ ఏమీ లేకుండా సర్వ కోల్పోయి అత్యంత దీనమైన పరిస్థితిని ఎదుర్కొంది. ముఖ్యంగా ఈర్ష్య అసూయ, దురభిమానమే కాకుండా చెడు సావాసాలు కూడా పతనానికి కారణం అయ్యాయి. మహా సంకట పరిస్థితుల్లో కూడా కురు సామ్రాజ్యాన్ని తన రాజనీతి చతురతుతో సత్యవతి కాపాడుకుంటే, గాంధారి మాత్రం కురువంశ వినాశనానికి పరోక్షంగానే కాక ప్రత్యక్షం గానూ కారకురాలయింది. ఈ దంపతుల యొక్క పిల్లల పట్ల అతిప్రేమ దురభిమానం, లోభం, వ్యామోహం మొదలైన దుర్గుణాలు వల్ల వారి కుమారులకే కాదు యావత్ భారతానికే సంకట పరిస్థితిని తీసుకువచ్చాయి. కానీ ధర్మం పట్ల కొంతవరకు విశ్వాసం ఉంచిన గాంధారి యుద్ధారంభానికి ముందు దుర్యోధనుడు వచ్చి ఆశీస్సు కోరగా

"ధర్మం చేతల ననూనమగునిద్ది జయమాతలకు నిట్లయిన సిద్ధమగు" (స్త్రీ-ద్వి-29)

అంటూ "యతోధర్మ! తతోజయ!" అన్న ఆర్యోక్తిని అనుసరించి ధర్మమే జయిస్తుందనీ ఆశీర్వదించి, ధర్మం పట్ల సంపూర్ణ విశ్వాసం ప్రకటించిన ధర్మమూర్తి, తన స్వధర్మాన్ని ప్రాణపథంగా నమ్మిన పతివ్రతామ తల్లి గాంధారి.

ఈ విధంగా గాంధారి పతివ్రతగా పేరు గాంచినప్పటికీ, ఒక తల్లిగా, ఒక మహారాణిగా, ఒక మహిళామూర్తిగా వైఫల్యం చెందిందనే చెప్పవచ్చు.

## ఆధార గ్రంథాలు :

1) శ్రీమదాంధ్ర మహాభారతం - కవిత్రయ విరచితం - టి.టి.డి. ముద్రితం

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# అడకత్తెర నవల - అన్నపూర్ణ పాత్ర చిత్రణ

- బి. రాజశేఖర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ముదిత అనగా స్త్రీ. ముదితల్ నేర్పగా రాని విద్య కలదే ముద్దర నేర్పించినన్ ఎక్కడైతే స్త్రీలు గౌరవింప బడతారో ఆ దేశం సస్యసామలంగా ఉంటుంది. అందుకే ఒక కవి స్త్రీ గురించి ఇలా రాసాడు. బ్రతుకు ముల్లబాట లోన్ జతగా స్నేహితురాల వస్తువి... కన్నీళ్ళు తుడుచు వేళ, తోడబుట్టిన చెల్లెలైతివి... పురిటినొప్పుల బాధ తెలియని పురుషజాతికి తల్లివైతివి... అని అన్నారు. కష్టంలో ముందుండి... సుఖంలో క్రిందుండి... విజయంలో వెనకుండి... ఎల్లపునె పక్కన ఉండేదే స్త్రీ. స్త్రీని పూర్వ కాలంలో అబల అనగా బలం లేనిది అనేవారు. పూర్వం స్త్రీలు ఇంటిపట్టున ఉండి ఇంటి పనులు చేసుకొనేవారు. ఆ విధంగా గృహిణి ప్తా నూరుశాతం వహించేదే. యుద్ధానికి వెళ్ళే పురుషులను ఆశీర్వదించే వారు. కానీ నేడు స్త్రీలు బయటకు వచ్చి పురుషులతో పోటీగా చదువుతూ, ఉద్యోగాలు చేస్తూ పురుషులకే పరిమితమైన విజయాల్ని సైతం దక్కించుకుంటున్నారు. పూర్తి ఆర్థిక స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ఆధునిక కాలంలో ఆడది అబల కాదు 'సబల' అనగా పురుషులతో సమాన స్థాయికి చేరుకోగలదు అని నిరూపించు కుంటున్నారు.

నేటి స్త్రీ ఉద్యోగాలవల్ల ఎంతో ఒత్తిడిని ఎదుర్కోం టుంది. అయితే స్త్రీ సాధికారత వల్ల గృహిణి పాత్ర మాత్రం కాస్త తక్కువైందని, పిల్లలకు తల్లి శిక్షణ కొరవడిందని, స్త్రీ, ఆర్థిక స్వేచ్ఛ, దుర్వినియోగం వల్ల కుటుంబ వ్యవస్థ కాస్త బలహీనపడిందని చెప్పవచ్చు.

అతకత్తెర నవలలోని అన్నపూర్ణ పాత్రను కొత్తగా పెళ్ళి జరిగిన అమ్మాయి అత్తారింట్లో ఎదుర్కొనే కష్టాలు, సమస్యలు గురించి రచయిత తెలిపిన విధానం గురించి తెలుసుకుందాం.

రమణరావు తన భార్యను అన్నపూర్ణను తీసుకుని రావడానికి సోమవారం అత్తవారింటికి వెళ్ళాడు. మరుసటి రోజు మంగళవారం అని అన్నపూర్ణను పంపమన్నారు. తరువాత రోజు అయిన బుధవారం నాడు సాయంత్రం ఆరుగంటలకు రమణారావుతో అన్నపూర్ణ, అత్తవారింటికి చేరింది. వెళ్ళగానే ఆడపడుచు కరుణ, ఎదురుగా వచ్చి వదినను, ఇంట్లోకి తీసుకువచ్చింది. "కులాసాగా ఉన్నారా అత్తయ్యా? కరుణా! బాగా చదువుతున్నావా అని పలకరించింది అన్నపూర్ణ.

"ఆ ఏదో ఉంటున్నాం. మీ వాళ్ళంతా బావున్నారా? అయితే మీ వాళ్ళు కాపురానికి తీసుకకువచ్చి పిల్లనప్పగించి వెళ్ళవలసిన విధానం తెలీదా? వారు మీ ఇంటికి వచ్చి తీసుకు వస్తేనే కాపురానికి వస్తావన్నమాట అన్నది అత్త జానకమ్మ.

వచ్చి రాగానే అత్తయ్య ఇలా మాట్లాడుతుంది అని అన్నపూర్ణ దిగాలుగా తన భర్తవైపు, కరుణవైపు చూసింది. ఆ రోజు గడిచిపోయింది. ఆ మరునాడు ఉదయం అన్నపూర్ణ తను తెచ్చిన సారెబట్టలు, ఇతర సామాన్లు, పంచదార చిలకలూ, కరుణకు, అత్తయ్యకు చూపిం చింది. కరుణ బాగా ఉన్నాయి వదిన అంది. కానీ అత్త ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది. నేను తెచ్చిన వస్తువులు ఏం బాగా లేవా? అత్తయ్యగారికి నచ్చినట్టు లేవు అని తన భర్తను అడిగింది. ఏం లేదు. చాలా బాగున్నాయి అని భర్త అనడంతో అన్నపూర్ణ కొద్దిగా సంతోషించింది. ఆ మరుసటి ఉదయం ముందుగానే వాళ్ళ అత్తయ్య నిద్రలేచి "రాణిగారికి మేలుకొలుపులు పాడాలంటే కరుణా" అన్నది. ఆ మాటలు గదిలో ఉన్న అన్నపూర్ణకు వినిపించాయి. అన్నపూర్ణ బిక్కముఖంతో పక్క మీద నుంచి లేచి భయపడుతూ బయటకి వచ్చింది.

ప్రతి ఇంటిలో కొత్తగా వచ్చిన కోడళ్ళు అత్తగారి మాటలకు ఎలా భయపడుతూ ఉంటారో రచయిత చాలా సహజంగా రచించాడు.

అత్తయ్య నీళ్ళను పట్టుకుంటూ పంపు దగ్గర ఉంది. అన్నపూర్ణ అక్కడికి వచ్చి అత్తయ్య నీళ్ళు నేను తెస్తాను. నేను క్రొత్తదాన్ని నాలుగు రోజులు చెబితే ఇంటి పనిలో మీకు సహాయపడతాను అన్నది అన్నపూర్ణ. నేటి కాలానికి నాకు ఒక కోడలు వచ్చింది. తన మాట వినీ ఒక ఆడపిల్ల వచ్చింది అని తన చాకిరిలో సగం బదలాయించవచ్చు. అంటే తన పనుల్లో సగం తనతో చేయించవచ్చు అను కుంది.

వెంకాయమ్మ అనే ఆమె వస్తూనే ఏమే జానకమ్మ మీ కోడలు కొంచెం పొడుగ్గా ఉంది అని అంది. ఆ మాటతో అన్నపూర్ణకు గుండె ఆగినంత పని అయ్యింది. అప్పుడు వాళ్ళు అత్తగారు మనిషే కాదు, బుద్ధులు కూడా సాగినయ్యి. అని అనగానే అన్నపూర్ణ అసలు నేను ఎక్కడా తప్పుగా ప్రవర్తించకున్నా అత్తయ్యగారు ఇలా మాట్లాడు తున్నారు అని తన మనసులో ఆవేదన చెందింది. సమాజంలో ఇలాంటి సంఘటనలు చాలా చూస్తూ ఉం టాం. మాములుగానే అత్త, కోడలుని అనడానికి ఏ సందర్భం దొరుకుతుందా అని ఎదురుచూస్తూ ఉంటారు.

అత్తగారు ఇలాంటి సూటిపోటి మాటలు మాట్లా డుతూ ఉంటే అన్నపూర్ణ చాలా విచారంగా కంటతడితో కూర్చుని ఉంది. అప్పుడు తన భర్త ఏమైంది అన్నపూర్ణ అని అడిగాడు. అప్పుడు అన్నపూర్ణ పొట్టిగా ఉన్నా కోడళ్ళు అన్ని పనులు చాలా చక్కగా గబగబా చేస్తారంట. నేను పొడుగ్గా ఉన్నానని, పొడుగ్గా ఉన్నవాళ్ళకు అహంకారం ఎక్కువగా ఉంటుందంట అని అత్తయ్యగారు అన్నారు. అప్పుడు తన భర్త "నువ్వు కాపురానికి వచ్చిన పదిరోజుల్లోనే అత్తాకోడళ్ళ మధ్య తగాదాలు ప్రారంభమయ్యాయి అన్నమాట. అని అన్నాడు రమణా రావు. తల్లి మీద చాడీలు చెప్తుంది అని అనుకున్నాడేమో అనుకుంది అన్నపూర్ణ. అయినా సమాజంలో ప్రతి కుటుంబంలో జరిగే ప్రధాన సమస్య. కొడుకు తన తల్లివైపు మరియు భార్యవైపు మాట్లాడాలో అర్థం గాక మౌనంగా ఉండిపోతున్నారు.

ఆ రాత్రి గడిచిపోయింది. మరుసటిరోజు ఉదయం లేవగానే అన్ని పనులు చకచకగా చేసి పొయ్యి మీద కాఫీ నీళ్ళు పెట్టింది. కాఫీనీళ్ళు కాగాయి, ఫిల్టరులో డికాషన్ మిగిలింది. కుంపట్లో బొగ్గులు మండి పోతున్నాయి. పాలవాడు రాలేదు... ఏం చేయాలో తోచలేదు. కొంచెం ఆలస్యంగా పాలవాడు వచ్చాడు. బొగ్గులు సరిగా లేక పాలగిన్నె వరగటంతో పాలు సగానికి పైగా పోయి, కుంపటి పూర్తిగా చల్లారిపోయి మాడువాసన వస్తుంది. ఇదంతా చూస్తున్న అత్తగారు "చూడమ్మా మహాతల్లి నువ్వు కాఫీ కాయలేదని నేనేమి అనను. పాలగిన్నె నిప్పుల పాలు అయ్యింది అని బిగ్గరగా అరిచింది. అత్తగారింట్లో చిన్న చిన్న తప్పులు చేసినా కోడళ్ళను చాలా ఘోరం జరిగిపోయింది అన్నట్లుగా అత్తలు భావిస్తారు.

మరోవారం రోజులు గడిచాయి. అత్తగారి మాటలు రోజురోజుకి ఎక్కువ అయిపోతున్నాయి. అన్నపూర్ణ కాపురానికి వచ్చిన తర్వాత అదే మొదటి ఒకటో తారిఖు. జీతం వచ్చిన రోజు. ఆఫీసు నుండి వస్తూ తన భార్యకు ఒక చీర, ఒక జాకెటు గుడ్డ తెచ్చాడు. ఇంట్లోకి వెళు తున్నాడు. వాళ్ళ అమ్మ, అన్నపూర్ణ ఏదో తిడుతున్నట్టుగా మాటలు వినిపించాయి. ఈ మంచి చీర నువ్వు ఉతకడం లోనే చిరిగిపోయింది అని అన్నపూర్ణను అత్త దూషిస్తు ఉంది. నేను ఉతకటంలో చీర చిరగలేదండి. ఎలుకలు కొరికినట్లు స్పష్టంగా కన్పిస్తుంది అని అన్నపూర్ణ చెప్పింది. అంటే నేను అబద్ధం ఆడుతున్నానా! నా కళ్ళు పోయాయా! అని ఇంకా గట్టిగా అరిచింది. అన్నపూర్ణ ఆ మాటలకు మనసు బరువెక్కి చేయని తప్పులకు కూడా నిందలు భరించాలి అని తనలో తాను బాధపడుతూ ఉంది. రచయిత అన్నపూర్ణ పాత్రను సమాజంలో ప్రతి కుటుంబంలో మరీ ముఖ్యంగా ఉమ్మడి కుటుంబంలో

జరిగే రోజువారి పనుల్లో అత్తా, కోడళ్ళ మధ్య జరిగే తగాదాలు చాలా కూలంకషంగా వివరించారు.

అన్నపూర్ణ కోసం తెచ్చిన చీరను తల్లికి ఇచ్చాడు. నా కోసం కొడుకు చీర తెచ్చాడు అని ఆమె మురిసిపోయింది. కరుణ నువ్వు కట్టుకునేది ఏడు గజాల చీర కదా! అమ్మా. ఇది ఆరుగజాల చీర కదా! అన్నయ్య వదినకే తెచ్చాడు... కరుణ అనడంతో ఒక్కసారిగా అన్నపూర్ణ గుండెల్లో రాయిపడింది.

అన్నపూర్ణ కాపురానికొచ్చి రెండు నెల్లయింది. ఈ రెండు నెలల్లో రెండు సంవత్సరాల అనుభవం వచ్చింది. ఇంటి పన్ల విషయంలో, అత్తగారి నిరాధరణను అర్థం చేసుకోవటంలో అంటే అన్నపూర్ణ కాపురానికి వచ్చిన అతి తక్కువ సమయంలోనే అత్తగారింట్లో ఉండే సమస్యలు, ప్రతికూల పరిస్థితులు, ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంతో చూసి దానికి తనే కారణమనే అత్తగారు, తనని అనడం లాంటివి మరియు ఇంటిపనులు అన్ని త్వరగానే అన్నపూర్ణ తెలుసుకుంది. చాలా కుటుంబాల్లో స్త్రీలు స్వేచ్ఛగా బ్రతకకుండా అత్తగారు పెట్టే మానసిక హింసను భరిస్తూ కాపురాలు కొనసాగిస్తున్నారని రచయిత అన్నపూర్ణ పాత్రను తదనుగుణంగా ఆవిష్కరించారు.

పనిమనిషి రాకపోవడంతో ఆ సాయంత్రం అంట్లు తోముతుంది. అన్నపూర్ణ తనకు సహాయపడుతూ ఉంది కరుణ. కరుణా! అని కూతురిని పిలిచి ఏమిటే చదువు కోకుండా అంట్లు తోముతున్నావు అని అన్నది. ఆ మాటలకు అన్నపూర్ణకు కంట నీరు ఆగట్లేదు. ఇంట్లో ఉన్న వ్యక్తులనే తనకు దూరం చేసే విధంగా అత్తగారు మాట్లాడే మాటలకు అన్నపూర్ణకు మనసులో బాధ కలుగుతూ కంటనీరు పెట్టుకుంది. అప్పుడు కరుణ అమ్మకు ప్రతిపూటకు కోపం వస్తుంది. అందుకు నేను బాధపడను. అమ్మ అన్న మాటలకు కుమిలిపోతున్నావు. అందుకు నేను విచారిస్తున్నాను అని అనడంతో అప్పుడు అన్నపూర్ణ కరుణా! ఆవిడ పెద్దది, కనిపెంచిన తల్లి, అత్తయ్యను అట్లా అంటే నాకు ఇంకా బాధగా ఉంటుంది. నాకు పని పాటలు చేతకావు కనుకనే నా చేత చెప్పి చేయిస్తున్నారు. అందులో ఏం తప్పుంది అని కళ్ళు తుడుచుకొని అన్నది అన్నపూర్ణ.

## ముగింపు

రచయిత అన్నపూర్ణ పాత్రను ఎంత అద్భుతంగా, సహజంగా ఆవిష్కరించారో చెప్పడానికి ఈ ఒక్క సంఘటన చాలు. అన్నపూర్ణ తన అత్త ప్రతిరోజూ సూటిపోటిమాటలతో తనను బాధపెడుతున్నప్పటికి అత్తను గౌరవించే మంచిమనస్సున్న అన్నపూర్ణ పాత్ర. సమాజంలో చాలామంది స్త్రీలలో ఉండే ఈ రకమైన వ్యక్తిత్వానికి అద్దం పట్టే విధంగా అన్నపూర్ణ పాత్రను రచయిత చిత్రించారు.

సమాజంలో అత్తలు, తమ కోడళ్ళను ఏవిధంగా ఇబ్బందులకు గురిచేసినా, వాళ్ళను మానసికంగా ఏ విధంగా బాధ పెడుతున్నా, వాటిన్నంటిని తట్టుకొని మనసులోనే దాచుకొని తమ పుట్టింట్లో కూడా చెప్పు కోకుండా తమ కష్టాలను తామే అనుభవిస్తూ జీవితాన్ని ఎలా కొనసాగిస్తున్నారో రచయిత చాలా సున్నితంగా అన్నపూర్ణ పాత్ర ద్వారా చెప్పడం జరిగింది. అదే విధంగా రచయిత ఈ అన్నపూర్ణ పాత్రను సమాజంలో ఎంతోమందికి అన్నపూర్ణ వ్యక్తిత్వం ఉన్న స్త్రీలకు అంకితం ఇచ్చాడు.

## ఆధార గ్రంథం

1. అడకత్తెర - హరికిషన్

# 'ఇంద్రగంటి' వారి 'జీవనరాజకీయం'లో ప్రతిబింబించే స్త్రీవాద దృక్పథం

- దాసరి రమేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

భారతదేశం ఎన్నో రకాల ఉద్యమాలకు, తిరుగు బాట్లకు అలవాలమయిన దేశం. ఎంతోమంది నియంతల పాలనను అణచివేసిన వీరులు ఈ దేశ పౌరులు. సంస్కృతిలో, ఆచారాలలో, కట్టుబాట్లలో ఉద్యమాల ద్వారా ఎంతోమార్పును తీసుకొచ్చి సంఘాన్ని సంస్కరించారు ఈ దేశ పౌరులు. ఈ ఉద్యమాలలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా పాలుపంచుకుని తమదైన ముద్రని వేశారు. కేవలం ఉద్యమాలలో పాలుపంచుకోవడమే కాకుండా కలం పట్టి తమ రచనల ద్వారా మహిళా లోకాన్ని, పురుష ప్రపంచాన్ని మేలుకొలిపారు. ఎంతోమందికి ఆదర్శప్రాయులయ్యారు. ఆనాటి నుండి ఈ నాటి వరకు సమాజంలో స్త్రీలు ఎన్నో రకాల సుడిగుండాలలో చిక్కుకుంటూ, అణగారిపోతున్నారు. అలాంటి వారిని ఉద్ధరించే ప్రయత్నంలో, తన కలాన్ని ప్రయోగించిన రచయిత్రి "ఇంద్రగంటి జానకిబాల గారు". వీరు రాసిన "జీవన రాజకీయం" అనే కథలు స్త్రీవాద తత్వాన్ని, సమాజ స్థితిగతులను, జీవితం అనే రాజకీయంలో స్త్రీలు ఏ విధంగా మోసపోతున్నారో, కొంచెం ఆలోచనాశక్తితో వాటిని ఎలా ఎదుర్కోవాలో రచయిత్రి తెలియజేశారు.

## జానకిబాల - రచనా ప్రస్థానం :

ఇంద్రగంటి జానకిబాల 1945లో జన్మించారు. ఈమె విజయవాడలోని ఏ.పి.యస్.ఆర్.టి.సిలో అకౌంటెంట్‌గా పనిచేశారు. రచనను ప్రవృత్తిగా స్వీకరించిన ఈమె ఆరు కథా సంపుటాలు, ఎనిమిది నవలలూ, ఒక కవితా సంపుటిని ప్రచురించారు. 'ఆత్మదృష్టి', 'అందరం ప్రేక్షకులమే' అనే కథా సంపుటాలూ, 'కనిపించేగతం' అనే నవలా ఈమెకు మంచి పేరుప్రఖ్యాతులను తెచ్చాయి. అంతేకాకుండా అనేక రేడియో నాటికలు కూడా రాశారు. అనేక పురస్కారాలను అందుకున్నారు.

## జీవన రాజకీయం - ఇతివృత్తం :

తార ఒక చదువుకున్న అమ్మాయి. తండ్రి రమేష్‌బాబు కృషివల్ల మంచి ఉద్యోగం దొరికింది. చిన్ననాటి నుండి ఆమె తల్లి ఆడపిల్ల ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చెప్తుండడం వల్ల చదువు, ఉద్యోగం, పెళ్ళి అన్నింటిలోనూ తన స్వంత అభీష్టాలు, కోరికలు లేకుండా వారు చెప్పినట్లు చేసుకుంటూ వచ్చింది. ఈమె భర్త మోహన్, ఉద్యోగం చేస్తున్న అమ్మాయి కాబట్టి జీతానికి ఆశపడి పెళ్ళి చేసుకున్నాడు. ఉద్యోగం చేయడం ఈమె వంతయితే జీతం రాళ్ళు తీసుకోవటం మోహన్ వంతు. అన్నింటిలో సర్దుకుపోయేది. ఆ నాటికి ఆమెకు అందులో తప్పేం కనపడలేదు.

అనుకోని పరిస్థితులలో ఆమెకు గర్భస్రావం జరిగిందని ఒక డాక్టరు చెప్పడంతో అబార్షన్ లీవు తీసుకుని జీతం కోసం దరఖాస్తు చేసుకోగా ఆ జీతాన్ని ఈమెకు మాటైనా చెప్పకుండా భర్త తీసుకుంటాడు. కొంతకాలం తర్వాత ఆమెకు గర్భం పోలేదని, 5వ నెల వచ్చిందని మరొక డాక్టర్ చెప్తారు. దాంతో ఆమె మరల మెటర్నిటీ లీవుకి అప్లై చేస్తుంది. ఆ సంస్థ వారు అబార్షన్ అయిన కొద్దికాలానికే పిల్లలు ఎలా పుడతారని, సంస్థను మోసం చేసి సెలవులు, జీతాన్ని వాడుకున్నారని ఆమెని ఉద్యోగంలోంచి తీసేస్తారు. ఉద్యోగం పోయిన నాటి నుండి ఆమె భర్త ఆమెను పుట్టింట్లో వదిలేసి వెళ్ళిపోతాడు. అప్పుడు ఆమె ఆలోచనల్లో వచ్చిన మార్పు, భర్త స్వభావాన్ని గూర్చిన అవగాహన, ఆఫీసులో వారు తనను అవమానించిన తీరు అంతా అర్థం చేసుకుంటుంది. ఆరేళ్ళ తరువాత తండ్రి రమేష్‌బాబు ప్రయత్నం వల్ల ఉద్యోగం తిరిగి వస్తుంది. ఈ విషయం తెలుసుకుని భర్త ఆమెను కాపురానికి తీసుకువెళ్ళటానికి వచ్చినప్పుడు ఆమె భర్తను

నిలదీసి, విడాకులకు సిద్ధమవ్వమని ధైర్యంగా చెప్తుంది. ఆమె తెగింపు, కోల్పోయిన వ్యక్తిత్వం తర్వాత జీవితానికి నాంది పలికించింది.

**జీవన రాజకీయం కథలో కనిపించే స్త్రీవాద చైతన్యం :**

జీవితం అనేది ఒక చదరంగం వంటిదని, మనుషులంతా అందులోని పావులు వంటి వారని పెద్దలు చెప్తుంటారు. జీవితంలో ఎన్నో రకాల మనస్తత్వాలను మనం చూస్తుంటాం. ఎన్నో రకాల స్వభావాలు, ఎన్నో రకాల కుట్రలు, కుతంత్రాలు, అంతా రాజకీయాలు చేస్తుంటారు. ఈ పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీలు ఎన్నో రకాల అవమానాలకు వివిధ స్థాయిలలో ఎదురవుతుంటాయి. పూర్వీకులు, కవులు తమ కావ్యాలలో పతివ్రత అంటే ఇలా ఉండాలని స్త్రీల చుట్టూ గిరిగీశారు. తరాలు మారినా గీతలు చెరగట్లేదు. వారికంటూ ప్రత్యేక ఆలోచన, వ్యక్తిత్వాలు లేవు. ఆడపిల్లగా పుట్టినప్పటి నుండి, మరణించేవరకు ఎన్నో హింసలు, అవమానాలు, మోసాలు చవిచూస్తారు. ఈ భావాలే తార జీవితంలో ఎదురయ్యాయి. ఆడపిల్లలకు చదువెందుకు? అనే రోజులు పోయి వారు కూడా ఉద్యోగాలు చేస్తున్న ఈ కాలంలో ఉద్యోగం చేసే స్త్రీలపై వివక్షతలు, హేళనలు, కామెంట్లు వస్తుంటాయి. తార పనిచేసే ఆఫీసులో కూర్మారావు, రామనాధం, రంగారావు, వంటివారు ఈమెను ఎప్పుడూ వేధించటం, కామెంట్లు చేయడం వంటివి చేసినా తార వాటిని పట్టించుకోక తల్లిదండ్రులు, భర్త చెప్పిన విధంగా నడుచుకుంటూ వచ్చింది. ఆడవాళ్ళు పడే కష్టాన్ని, శ్రమని ఎవరూ గుర్తించరు. గుర్తించకపోగా ఆమెను చూసి "ఆడవాళ్ళమై పుట్టినా బాగుండేది. హాయిగా నెలల తరబడి సెలవు మీద ఫుల్ జీతం తీసుకుంటూ ఇంట్లో విశ్రాంతి తీసుకోవచ్చు" అని కామెంట్లు చేయడం, ఉద్యోగం చేసే స్త్రీల పరిస్థితి ఎలా ఉంటుందో తెలుస్తుంది. తన భర్త మోహన్ స్వభావరీత్యా మంచివాడు కాడని తెలిసినా తనే సర్దుకుపోతూ వచ్చింది. కాని అనుకోని పరిస్థితుల వల్ల ఉద్యోగం కోల్పోయిన భార్యకు ఓదార్పుగా ఉండాల్సింది పోయి ఆమెను తిట్టి, పుట్టింట్లో వదలేసి వెళ్ళిపోయాడు. అన్నినాళ్ళు తన వ్యక్తిత్వాన్ని చంపుకుని అమ్మ, నాన్నలు చెప్పినట్లు నడుచుకోవటం తప్ప వేరే ఆలోచన లేని తార తనకు జరిగిన అవమానాలను గూర్చి ఆలోచించింది. స్వంతంగా నిర్ణయాలు తీసుకోగల మనస్సును సంపాదించుకుంది. తండ్రి కృషి వల్ల తిరిగి ఉద్యోగం వచ్చిందని తెలియగానే భర్త మోహన్ ఆమెను కాపురానికి రమ్మన్నప్పుడు అన్ని రోజులు తన మనస్సులో రగిలిన అగ్ని పర్వతాన్ని బద్దలైనట్లు తన అభిప్రాయాల్ని చెప్పింది. "విడాకులకి ప్రయత్నించండి - కాదంటే నేనే చేస్తాను" అని ఆమె భర్తతో అనే మాట తన కాళ్ళ మీద తను నిలబడగలననే ధైర్యం, తెగువ కనిపిస్తాయి. స్వార్ధపరుడైన భర్త, మోసం చేసే స్వభావం కలవాడు ఉన్నా ఒక్కటే లేకపోయినా ఒక్కటే. దానికన్నా స్వతంత్రంగా బ్రతకటం ఎంతో మేలు అనే భావన ఆమెలో కనిపిస్తుంది.

**సామాజిక ప్రయోజనం :**

రచయిత్రి ఇంద్రగంటి జానకిబాల గారు 'జీవన రాజకీయం' అనే కథ ద్వారా జీవితంలో ఎదురయ్యే రాజకీయాలను ఎలా ఎదుర్కొని నిలబడాలో తెలియజేశారు. ఎప్పుడూ ఒకరికి నచ్చే విధంగా జీవించటంలా కాకుండా స్వంతంగా ఆలోచించడం, వ్యక్తిత్వాన్ని విడిచిపెట్టకుండా ఉండటం వంటివి స్త్రీలు కలిగి ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఉద్యోగం చేసే స్త్రీలపై ఆనాడు, ఈనాడు ఎలాంటి వ్యంగ్యాస్త్రాలు ఈ సమాజం కురిపిస్తుందో తెలియజేశారు. ఎవరైనా సరే వ్యక్తిత్వాన్ని చంపుకుని బ్రతకాల్సిన అవసరం లేదు అని తెలియజేసే విధంగా రాసిన ఈ రచన తరువాత రచయిత్రులకు ప్రేరణగా నిలిచింది మరియు స్త్రీలను చైతన్యవంతం చేసింది.

**ఆధార గ్రంథాలు :** జీవన రాజకీయం - ఇంద్రగంటి జానకి బాల

# భారతీయ సంస్కృతిలో స్త్రీ

- ఎక్కలదేవి మోహనకృష్ణ భార్గవ, సంజయ్ నగర్ కాలనీ, జనగామ, తెలంగాణ.

"భారతీయ సనాతన హైందవ సంస్కృతిలో స్త్రీకి అత్యంత పవిత్రమైన పాత్ర ఉన్నది. వేద పురాణ ఇతిహాస సాహిత్యాలలో ప్రధాన స్థానం కల్పించబడినది. నేటి మహిళలు తమ హక్కుల సాధనకై పురుషులతో సమాన మైన స్థానాన్ని కల్పించాలని పోరాడుతున్నారు కానీ భారతీయ సంస్కృతిలో స్త్రీ పురుషుడికన్నా ఎంతో ఉన్నతమైనది. ఎంతో గౌరవించదగినది, పూజింపదగినది. మహిళను సాక్షాత్తు భూమాతగా, ప్రకృతి స్వరూపిణి గా, ఆదిశక్తి అంశగా కీర్తిస్తున్నాయి వేద పురాణేతిహాసాలు. ధరణిలో మహిళకు అందించగల గౌరవం ఇంతకన్నా ఏముంటుంది.

శ్లో॥ యాదేవీ సర్వ భూతేషు మాతృ రూపేన సంస్థితాః!
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః !!

తా : ఓ దేవీ భగవతీ..! సర్వభూతములయందు మాతృ రూపములో నివాసమైవున్నటువంటి నీకు సదా ప్రణమి ల్లుతున్నాను.. (చండీ సప్తశతి)

శ్లో॥ యా కుక్షి వివరే కృత్వా స్వయం రక్షతి సర్వతః !
నమామి జననీం దేవీం పరాం ప్రకృతి రూపిణీం!!
కృచ్ఛేణ మహతా దేవ్యా ధారితోహం యథోదరే !
త్వత్ప్రసాదా జ్జగద్దృష్టం మాతర్నిత్యం నమోస్తుతే!!
పృథివ్యా యాని తీర్థాని సాగరాదీని సర్వతః !
వసంతి యత్రతాం నౌమి మాతరం భూతిహేతవే!!

తా : ఏ తల్లి కడుపు నన్ను భరించి, రక్షించినదో ఆ తల్లికి, ప్రకృతి రూపిణి అయిన అమ్మకు నమస్క రిస్తున్నాను., మిగుల శ్రమలకు ఓర్చి నన్ను గర్భమున మోసినదానవు నీవు, నీ యనుగ్రహముచే నేను కండ్లు తెరచి లోకమును చూడగంటిని. అమ్మా.! నీకు నిత్యము నమస్కారం, భూమండలమున ఎన్ని తీర్థములున్నాయో, ఎన్ని సాగరములున్నాయో అన్నియూ నే తల్లియందున్నవో యట్టియమ్మకు నీ కైశ్వర్యకాముడనై నిత్యం నమస్క రిస్తున్నాను. (భవిష్యపురాణం)

స్త్రీని ప్రకృతి స్వరూపిణీగా, పరమాత్మ ఆదిశక్తి యొక్క అంశగా మన ధర్మశాస్త్రాలు పేర్కొంటున్నాయి.

శ్లో॥ దేవీం వాచ మజనయంత దేవాస్తాం విశ్వరూపాహ
పశవో వదంతి !
సానో మంద్రేష మూర్జం దుహానా ధేనుర్వాగ
స్మానుప సుష్టుతైతు !!

తా : దేవతల ద్వారా వాక్కు సృష్టింపబడినది. అట్టి వాక్కునే విశ్వమునందలి సకల విధములగు ప్రాణులు పలుకుతున్నారు అట్టి గంభీరమైన కామధేనువు వంటి ఆ వాక్కు ప్రాణులకు అన్నమును, బలమును, యశస్సును, ఉత్సాహమును ప్రసాదించునది అగుతున్నది. అట్టి వాక్కే వాగ్రూపిణీ అగు దేవీ భగవతీ మాకు సదా సన్నిహితమగు గాక..! (దేవీ భాగవతం)

ఈ సకల చరాచర సృష్టిని ఉత్పత్తి, స్థితి, లయము చేయునది బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కాగా ఈ ముగ్గురిని సృష్టించిన ఆద్యాశక్తి, సకల జగత్తును పోషించే సచ్చిదానంత స్వరూపమగు పరమాత్మ శక్తియే ఆదిపరాశక్తి.

శ్లో॥ నమో దేవి మహామాయే విశ్వోత్పత్తి కరే శివే !
నిర్గుణే సర్వభూతేశి మాతః శంకర కామదే !!

తా : ఓ దేవీ.! నీవు మహా మాయవు, సకల జగత్తుని సృష్టించుట నీ స్వభావము. సకల ప్రాణులకు ఆశ్రయం కల్పించుటకు భూమాతగా అవతరించావు. నీవే ప్రాణము, శక్తి, బుద్ధి, సంపద, కాంతి, క్షమా, శాంతి, శ్రద్ధా, మేధా, ధృతి, స్మృతి, గాయత్రి ప్రణవ స్వరూపిణివి. (దే.భా)

శ్లో॥ యాదేవీ సర్వభూతేషు శక్తి రూపేన సంస్థితాః !

సకల భూతాలలో, సకల ప్రాణులలో, సమస్త లోకాలలో జీవము, శక్తి అనుగ్రహించునది ఆ భగవతీయే.!

బ్రహ్మకు సృజనా శక్తిని, విష్ణువునకు పాలనా శక్తిని, శివునకు సంహార శక్తిని అనుగ్రహించి సృష్టి స్థితి లయ కారకులుగా అనుగ్రహించినది ఆ భగవతియే..! పరబ్రహ్మ, పరమాత్మా స్వరూపిణి అయిన ఆ భగవతిని ఆరాధించి, నిత్యోపాసన దేవిగా బ్రహ్మ విష్ణు మహేశ్వ రాదులు అనేక విధములైన ఆరాధనలతో శక్తిని పొందు తున్నారు. ఎల్లపుడూ వారు ఆ జగదంబనే స్మరిస్తారు, ధ్యానిస్తారు, పూజిస్తారు. (దే.భా)

శ్లో॥ ఆరాధ్యా పరమాశక్తిః సర్వైరపి సురాసురైః !
నాతః పరతరం కించి దధికం భువనత్రయే !!
సత్యం సత్యం పునః సత్యం వేద శాస్త్రార్థ నిర్ణయః!
పూజనీయా పరాశక్తి నిర్గుణా సగుణాథవా !!

తా : సమస్త దేవతలకు, రాక్షసులకు, మహర్షులకు, మానవులకు పరాశక్తిని ఆరాధించుటే మార్గం. ఈ సమస్త లోకాదులలో జగదంబను మించిన దైవమెవ్వరూ లేరు. నిర్గుణ రూపంలో సగుణ రూపంలో పూజింపదగినది కేవలం చిన్మయ స్వరూపిణి, పరమాత్మా స్వరూపిణి అయిన పరాశక్తిని మాత్రమే అని వేదములు, శాస్త్రములు నిశ్చయంగా నిర్ణయింపబడిన సత్యం, ఇదే ముమ్మాటికీ సత్యం.! (దే.భా)

"సర్వం ఖల్విద మేవాహం నాన్యదస్తి సనాతనం"

జగదంబ పలుకుతూ ఈ జగత్తునంతా వ్యాపించి ఉన్నది నేనే. నేను కాక వేరొక శాశ్వతమైన వస్తువు యేదీ లేనేలేదు.!

శ్లో॥ అహమేవాస పూర్వం తు నాన్యత్ కించిన్నగాధిప !
తదాత్మరూపం చిత్సంవిత్ పరబ్రహ్మైక నామకమ్!!

శ్లో॥ తచ్ఛక్తిః భూతః సర్వేషు భిన్నో బ్రహ్మాది మూర్తిభిః!
కర్తా భోక్తా చ సంహర్తా సకలః సజగన్మయః !!

జగదంబ పలుకుతూ ..! పూర్వము నేను మాత్రమే ఉన్నాను. వేరే ఇతర పదార్థమేదీయు లేదు. అట్టి సమయంలో జగత్తునంత వ్యాపించివున్న నా స్వరూపం చిత్, సంవిత్, జ్ఞాన విజ్ఞాన ఆనందమయ స్వరూపము, అద్వితీయ సచ్చిదానంద పరబ్రహ్మముగా ఉండెను. అట్టి స్వరూపము అప్రతర్క్యము, అనిర్దేశ్యము, అనౌపమ్యము, అనామయముగా అలరారుతుండెను. దాని నుండి ఒక అద్వితీయ శక్తి వెలువడినది ఆ శక్తిపేరే 'మాయా' . ఇట్టి మాయా శక్తి నుండి సకల చరాచర జగత్తు సృష్టించ బడినది. జగత్తునంతటిలో గల సామర్థ్యమే శక్తి అనబడు తుంది. ఆ శక్తియే పరబ్రహ్మ, పరమాత్మగా జగత్తును రక్షించును. ఆ పరబ్రహ్మమే దేవ, మనుష్య తిర్యక్, స్థావరాదులను, సమస్త ప్రపంచమును సృష్టించి, రక్షించి, పోశించి తనలోనే లయం చేస్కునే శక్తి అగుచున్నది.

శ్లో॥ సాధూనాం రక్షణం కార్యం హంతవ్యా
యేప్యసాధవః !
వేద సంరక్షణం కార్యమవతారై రనేకశః !!

జగదంబ పలుకుతూ..! సాధుసత్పురుషులను రక్షించుటకు, దుష్టులను శిక్షించుటకు, వేదములను రక్షించుటకు నా ద్వారా అనేక అవతారములు ఎత్తబడు చున్నవి. ఒక్కొక్క యుగములో అనేక అవతారములు ధరించబడుతున్నవి..

ఈశ్వరుడు, విరాట్టు, బ్రహ్మ, విష్ణు, రుద్రుడు, గౌరీ, సరస్వతీ, లక్ష్మీ స్వరూపములు నేనే..! సూర్య చంద్రాదులు, నక్షత్రాలు, గ్రహాలు సర్వం నేనే..! ఈ చరా చర జగత్తు నంతా విస్తరించింది నేనే, ఏ వస్తువైనా సరే, ఎక్కడ చూసినా సరే, ఏది విన్నా సరే అన్నిటిలో వ్యాపించివున్నది నేనే..! నేను కానిదంటూ మరొకటి వేరు లేనేలేదు.! (దేవీ భాగవతం)

దీని ద్వారా తెలియనది ఒకటే..! ఈ సమస్త జగత్తు, చరాచర జీవకోటి, బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు, మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ, సమస్త దేవతా గణాలు అండపిండ బ్రహ్మాండాలన్నీ ఆ దేవీ జగదంబ నుండి మాత్రమే ఉత్పన్నమైనవని దేవీ భాగవతం ద్వారా తెలుస్తున్నది.

సృష్టికి మూలం స్త్రీ శక్తి. సకల జీవకోటిని పోశించేది స్త్రీ శక్తి. అలాంటపుడు సమాజంలో స్త్రీ స్థానం గురించి

ప్రశ్న కూడా ప్రశ్నార్థకమే అవుతుంది. నేటి ఆధునిక జీవన విధానాలే స్త్రీ విలువని, గౌరవాలని తగ్గిస్తున్నాయని భావించవచ్చు.

శ్లో॥ పరపత్నీ తు యా స్త్రీ స్యాదసంబంధా చ యోనితః!
తాం బ్రూయాద్భవతీ త్యేవం సుభగే భగినీతి చ !!

మాతా, సోదరీ కాకుండా పరస్త్రీలను సుభగే.! భగినీ.! అని పిలవాలని మనస్మృతి తెలుపుతున్నది. అంటే పం స్త్రీలను మాతృ సమానురాలిగా, సోదర సమానురాలిగా సంభోదించాలని, గౌరవించాలని శాస్త్రాలు తెలుపు తున్నాయి. (మనుస్మృతి)

శ్లో॥ యత్ర నార్యస్తు పూజ్యం తే రమంతే తత్ర దేవతాః!
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః!!

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, పూజింపబడతారో అక్కడ దేవతలు సంతోషంగా దయామృతాన్ని వర్షింప జేస్తారు. ఎక్కడైతే స్త్రీలు బాధింపబడతారో అక్కడ కరువు కాటకాలు ఏర్పడతాయి, మహోపద్రవాలు వచ్చి సర్వనాశనమవుతారు. (మ. స్మృ)

శ్లో॥ శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులమ్ !
నశోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా !!

ఎవరిచేతనైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ ధనధాన్య సస్య సమృద్ధి అధికంగా కలుగుతుంది. ఎక్కడైతే స్త్రీలు నిరాదరణకు గురౌతారో అక్కడ సత్వర వినాశనం తప్పదని మనుస్మృతి తెలుపుతున్నది.

స్త్రీలను పూజించడం గౌరవించడం భారతీయ సాంప్ర దాయంలో ముఖ్యమైన భాగం. వేదాలు ధర్మశాస్త్రాలు ఇదే విషయాన్ని బలపరుస్తున్నాయి. ఉత్సవాలు, సంబరాలు, శుభకార్యాలు, వివాహ, ఉపనయనాది శుభకార్యాదులలో స్త్రీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది. తోబుట్టువులకు, బంధువర్గీయ మహిళలకు వస్త్రాలు ఆభరణాలు సమర్పించి పూజించడం జరుగుతుంది. స్త్రీలను గౌరవించి సంతోషపరచకుండా శుభకార్యలు జరగవనటంలో సందేహం లేదు.

"సమాజంలో స్త్రీ స్థానం"

శ్లో॥ స్త్రీయోషి దబలా యోషా నారీ సీమన్తినీ వధూః !
ప్రతీపదర్శినీ వామా వనితా మహిళా తథా !!

స్త్రీ, యోషిత, అబలా, నారీ, సీమంతినీ, వధువు, ప్రతీపదర్శినీ, వామా, వనితా, మహిళా ఇవి సంస్కృతం నుండి గ్రహింపబడిన స్త్రీలకు గల పేర్లని అమరకోశం తెలుపుతున్నది.

ఇవి మాత్రమే కాకుండా అంగనా, భీరూః, కామినీ, వామలోచనా, ప్రమదా, మానినీ, కాంతా, లలనా, నితంబినీ, సుందరీ, రమణీ, రమా, భామా, భామినీ, వరారోహ, వరవర్ణినీ, మత్తకాశినీ, రూపశీలా, మహిషీ, భోగినీ, భార్య, కుటుంబినీ, పురంధ్రీ, సతీ, సాధ్వీ, పుత్రి, పీవరీ, సుచరిత్రా, గౌరీ, కులపాలికా, కళ్యాణీ, నందనా, పత్నీ, సాభిసారికా, కాముకీ, సువాసినీ, ధీమతీ, ఆర్యాణీ, భగినీ, జనయిత్రీ, ఆత్మజ, మాతా, తరుణీ, యువతీ మొదలగు పేర్లు విశేషంగా స్త్రీలకు సంబోధనా నామాలుగా ఉన్నాయి. (అమరకోశం)

ధర్మార్థకామ్యమోక్షార్ది అయిన పురుషుడు వివాహ మాడి తన భార్యతో కూడి యజ్ఞయాగాదులు చేసి పితృఋణం, దేవ ఋణం, ఋషి ఋణాలనుండి ముక్తుడవుతాడు..

పురుషునకు భాగ్యాన్ని విశేష గౌరవాన్ని అమృతత్వాన్ని ప్రసాదించేది భార్య మాత్రమే.

"మూర్ధానాం పత్యునారోహ"

జీవికి శిరస్సు ఎంత ప్రధామైనదో పురుషునకు స్త్రీ కూడా శిరస్సువలే ప్రధానమైనది. శిరస్సు లేకుండా జీవించటం ఎంత అసాధ్యమో భార్య లేని పురుషుడు కుడా శిరస్సు లేనటువంటి వాడే.

"కార్యేషు దాసి ! కరణేషు మంత్రి ! భోజ్యేషు మాత ! శయనేషు రంభ ! క్షమయా ధరిత్రి !!"

దాసిగా సేవచేస్తూ కుటుంబాన్ని పోశిస్తుంది, మంత్రిగా మార్గనిర్దేశన చేస్తూ పాలిస్తున్నది, తల్లిగా కడుపునిండా అన్నం పెడుతున్నది, రంభగా భర్తకి సుఖాన్ని అందిస్తున్నది, ధరణిలా సహనశీలురాలై క్షమిస్తుంది.

తల్లిగా సేవచేసే లక్షణం వారికి జన్మతః వస్తుంది

కనుకనే ప్రతీ స్త్రీలో మాతృమూర్తిని చూడగలుగుతున్నాం. దేవ ఋషి పితృ ఋణాలు తీర్చవచ్చునుగాని, మాతృఋణం తీర్చలేనిది. చెడ్డ కొడుకు ఉండవచ్చు కాని చెడ్డ తల్లి ఉండదు. తల్లిని వదిలేసిన సంతానం ఉంటుంది గాని తల్లి వదిలేసిన సంతానం ఎవరు ఉండరు. ఇది ప్రకృతి సహజం. మోక్ష మార్గాన్ని చూపే గురువుకన్నా, మోక్ష స్వరూపమైన తండ్రికన్నా, జన్మనిచ్చిన తల్లి భుమి కన్నా విలువైనది, తల్లిని పూజించటం కంటే గొప్ప పూజంటు లేదు.

ఉపనయనంలో ముందుగా తల్లికే మాతృభిక్ష యాచించటం జరుగుతుంది. సన్యాసించిన వారు ఎవరికి నమస్కరించకూడదు కాని తల్లికి నమస్కరించాలి. తల్లిని గౌరవించకపోయినా హీనంగా చూసినా లేదా వృద్ధాప్యంలో వదిలేసిన రౌరవాది నరకాలు తప్పవని శాస్త్రాకర్తలు వాక్యానించారు.

"కలకంఠి కన్నీరొలికిన సిరియింటనుండనొల్లదు సుమతీ"

స్త్రీ కంట కన్నీరు వచ్చిన క్షణం గృహంలో లక్ష్మి నివసించదు..

"సగృహం గృహమిత్యాహుః గృహిణీ గృహముచ్యతే గృహంతు గృహీణీహీనం అరణ్యం సదృషం భవేత్"

స్త్రీ గృహంలో నివసిస్తుంది కనుకనే గృహము అనబడింది, స్త్రీ లేని గృహం అరణ్యంతో సమానం.

సమాజానికి స్త్రీ యొక్క విలువను తెలుపుతూ..

పరమేశ్వరుడు తన శరీరంలో అర్థ భాగాన్ని తన ధర్మపత్ని అయిన పార్వతికి ఇచ్చి 'అర్థనారీశ్వరుడు' అయ్యాడు. శ్రీమహావిష్ణువు మహాలక్ష్మిని తన వక్షస్థలంపై నిలుపుకొని లక్ష్మీనారాయణుడయ్యాడు. బ్రహ్మ సరస్వతిని తన వాక్కుపై నిలుపుకున్నాడు. పార్వతీదేవి శక్తిని, లక్ష్మీదేవి సంపదలను, సరస్వతీదేవి విద్యలను అనుగ్రహిస్తున్నారు.

శక్తి లేనిదే ప్రాణి లేదు, స్త్రీ లేనిదే సమాజం లేదు. ఈ విషయాన్ని గ్రహించినపుడు కచ్చితంగా స్త్రీ శక్తిని గౌరవించి తీరతారు.

ఉపయుక్త గ్రంథాలు : దేవీ భాగవతం, చండీ సప్తశతీ, మార్కండేయ పురాణం, విష్ణు పురాణం, శ్రీమద్భాగవతం, అమరకోశం, మనుస్మృతి, ధర్మసింధు, పరాశర స్మృతి, ఆపస్థంభ గృహ్య సూత్రాలు.

# ఆంధ్ర మహాభారతం ద్రౌపది

- కాకర్ల చిన్న ఓబులేసు

మనకున్న ప్రాచీన పురాణ ప్రబంధాలలో మన పూర్వ కవులు స్త్రీ పాత్రలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. అందులో కథానాయిక పాత్రల్ని ఎంతో ఉదాత్తంగా. ఔచిత్యంగా మలచారు.ఈ క్రమములో చూసినప్పుడు మన భాతర ఖండంలో పుట్టి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇతిహాసం మహాభారతం,ఇది విస్తారమైన కథ. ఎన్నో పాత్రలు మరెన్నో మలుపులు "వాహవ్వా మహాద్భుతం" అని పిస్తాయి. ఈ మహాభారతం లో స్త్రీల పాత్రలకు ఇచ్చిన గౌరవం చాల గొప్పది, వీటిలో సత్యవతి, గాంధారి, కుంతి, మాద్రి మొదలైన పాత్రలు. వీటన్నింకంటే విశేషంగా చెప్పుకోదగినది కథానాయిక ద్రౌపది పాత్ర. అటు సంస్కృతంలో వ్యాసుల వారు, ఇటు తెలుగులో కవిత్రం వారు ద్రౌపది పాత్రను అన్ని కోణాలోనూ మహోన్నతంగా మలచారని చెప్పవచ్చు.

## ద్రౌపది జననం

ద్రోణుడు తనను అవమాన పరిచాడన్న పగతో ద్రుపద మహారాజు యజ్ఞం చేసి ద్రోణున్ని చంపగలిగే వీరుడైన ధృష్టద్యుమ్నుడనే కుమారుణ్ణి. అర్జునిని వివాహమాడగల ద్రౌపది అనే కూతుర్ని యగ్నగుండం ద్వారా పొందాడు.

ద్రుపదుని కూరుతు కనుక 'ద్రౌపది' అని, నల్లని ఛాయతో పుట్టింది కనుక కృష్ణ అని, పాంచాల రాజపుత్రి కనుక పాంచాలి అని, ద్రుపదుడు యజ్ఞంచేసి యజ్ఞసేనుడయ్యుడు. కాబట్టి ఈమె యజ్ఞసేని అని పిలవబడుతుంది.

ఈమె పూర్వజన్మలో " నాలాయణి', 'ఇంద్రసేన' అనే పేర్లు కలిగి మౌద్గల్యుడనే మునికి భార్యగా ఉన్నది. తర్వాత కాశిరాజు కుమార్తె గా పుట్టి భర్తను పొందలేక ఈశ్వరుని గూర్చి తపస్సు చేసి, శివుడు ప్రత్యక్షమైన ప్పుడు.'పతిదానం' అని ఐదుసార్లుఅడిగినది. అపుడు శివుడు " నీకు మరుజన్మలో అయిదుగురు భర్తలు కలుగుతారు". అని వరమిచ్చాడు. తర్వాత ద్రుపద పుత్రికగా జన్మించి పంచపాండవులను వివాహమాడింది.[2]

## ద్రౌపది సహనం

మహాభారతంలో ద్రౌపది ఒక గొప్ప ఆదర్శ గృహిణిగా మనకు కనబడుతుంది. వస్త్రాపహరణ సమయంలో ఆమె చూపిన సహనం ఆదర్శప్రాయం. అంత గొప్ప పుట్టుక పుట్టి, లోకైక వీరులైన పాండవులకు ఇల్లాలై నిండు సభలో పరాభవం పాలౌతుంది. చరిత్రలో ఏ స్త్రీకి జరగని గొప్ప అవమానం అది. ధర్మానికి బద్ధులైన పతులు ఏమి చేయలేరని గ్రహించి తానే ధైర్యం వహించి సమస్యను భరిస్తుంది. అలాగే అరణ్య వాస కాలలో సైంధవుడు ద్రౌపదిని హీనంగా మాట్లాడుతాడు. కామ వికారంతో పై బడుతాడు. అప్పుడు కూడా ఎంతో సంయమనం పాటిస్తుంది. తర్వాత అజ్ఞాత వాస కాలంలో కీచకుడు ఎంతో బాధ పెట్టేలా ప్రవర్తించినా సహిస్తుంది. అవమానలను భరిస్తుంది. ఇన్ని రకాల అవమానను భరించినా చివరికి తానే విజయం సాధిస్తుంది. ఇదే విజయానికి సహనం కూడా ఒక మూలకారణం అని తెలియజేస్తుంది.

## ద్రౌపది పాతివ్రత్యం

పంచ మహాకన్యలు సీత, అహల్య, మండోదరి, తార, ద్రౌపది పేర్లను ప్రస్తావిస్తారు. వీరు లోకోత్తర సౌందర్య రాశులుగా కూడా పేరు పొందారు. ఒక మారు అరణ్యావాసంలో ఉన్నప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామతో సహా పాండవుల వద్దకు వస్తాడు ఆ సందర్భంలో సత్య భామ ద్రౌపది ని ఇలా అడుగుతుంది "నీవు అయిదుగురు భర్తలతో కాపురం చేస్తున్నావు. అందరూ నీ మీద అమితమైన అనుగారంతో ఉన్నారు. ఏమాయ చేశావో,

మందు పెట్టావో ఆ చిట్కా ఏమిటో నాకు కూడా చెప్పు" అని అడుగుతుంది. దీనికి ద్రౌపది చిరునవ్వుతో చెప్పిన సమాదానం నిత్య అనుసరనీయం ఆమె చెప్పిన సమాధానం ఈ క్రింది విధంగా ఉంది.

చ. తగియెడు వేళలందు నియతంబుగ మజ్జన
భోజన క్రియల్
తగ నొడగూర్తు భర్తలకు, ధాన్య ధనంబులు
రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పుడు, గృహ స్థల భాండ
విశోధనంబు లి
మ్ముగ నొకనాడు నేమర, ప్రమోదము సల్పుదు
బంధుకోటికిన్

"నా భర్తలకు స్వయంగా నేనే స్నానాలు, భోజనాలు చేయిస్తాను. ధనం ధాన్యం, అనవసరంగా ఖర్చుచేయను. ఇల్లు ఊడ్చడం కడగడం,అంట్లు తోమడం నిత్యం నేనే నిర్వర్తిస్తాను. భర్త తనపట్ల ప్రేమగా ఉండాలంటే భార్య పాటించాల్సిన గృహిణీ ధర్మాలు ఇవి. మన నడవడితో భర్తల మనసు గెలుచుకోవాలి కాని మందు మాకులు పెట్టి కాదు" అని సున్నితమైన మందలింపుతో చిరు దరహాసంతో సమాధానం చెప్పినది. ఏంతైనా మెత్తని పులి ధర్మరాజు భాగస్వామి కదా.

సంపన్నులైనంత మాత్రాన డాంబికాలకు పోగూడదు. స్త్రీలు తమ ఇంటిపని తామే చూసుకోవాలని ఆకాలంలోనే సామాజిక స్పృహతో తెలియజేసిన మహా ఇల్లాలు ద్రౌపది. ద్రౌపది ద్వారా అలా పలికించాడు ఎర్రన. ఇది గృహిణి యొక్క ధర్మం అంటె.

## అజ్ఞాత వాసం

"సేవలు చేస్తూ భర్త చెప్పినట్లు మూఢంగా ఉండడమే కాదు అవసరమైనప్పుడు ఘాటుగా సమాధానం కూడా ఇవ్వాలి. అని నిరూ పించినది ద్రౌపది. ఇక్కడ ద్రౌపది చమత్కారం చూడండి.

కామంధుడైన కీచకుడు ద్రౌపది ని వెన్నంటి తరుముతూ విరాటుని కొలువులోనికి వచ్చాడు. విరాట మహారాజు కీచకునికి నమస్కరించి "ఇది సమయం కాదు వెళ్లిపో" అన్నాడు. ద్రౌపది విలపిస్తూ అలాగే ఉండి పోయింది. మహారాజు కూడా ద్రౌపది ని ఓదార్చాడు కాసేపు సభంతా నిశ్శబ్దం అయినది. అప్పుడు ధర్మరాజు లేచి "సైరంధ్రీ ప్రభువులు నీ భంగపాటు కళ్లారా చూశారు. నీకు న్యాయం చేస్తారు ఇక వెళ్లు ఇంకా నిలబడ్డావే నాట్యకత్తెలా? " అని గద్దించాడు. అది విని ద్రౌపదికి వళ్లు మండింపోయింది. ఒక వైపు జరిగిన అవమానం మరొక వైపు భర్త గద్దింపు. అప్పుడు ఆమే ఈ విధంగా సమాధానం చెప్పింది.

అ.వె. నాదు వల్లభుండు నటుడింత నిక్కంబు
పెద్దవారి యట్లు పిన్నవారు
గాన పతుల విధమ కాక యే శైలూషి
గా ననంగరాదు కంకబట్ట !

"నీ వన్నది నిజమే నయ్యా కంకుభట్టు నా భర్త ఒక నాట్యగాడు. పెద్దల్ని పిల్లలు అనుసరిస్తారు కదా! అలాగే భర్త ఎలాంటి వాడో నేను కూడా అలా నాట్యగత్తనే" అంటూ ఆవేశంతో సమాధానం చెప్పి సభనుండి వెళ్లిపోయినది. ద్రౌపది యొక్క ఆత్మాభిమానం ఎలా ఉందో మనం పై ఘటన ద్వారా గ్రహించవచ్చు.

## తల్లిగా ద్రౌపది

ద్రౌపదికి ధర్మరాజు వలన ప్రతివింధ్యుడు. భీముని వలప శ్రుతసోముడు, అర్జునిని వలన శృతకీర్తి, నకులుని వలన శతానీకుడు, సహదేవుని వలన శృత సేనుడు అనే అయిదుగురు కుమారులు జన్మిస్తారు. వీళ్లను ద్రౌప దేయులు అని ఉపపాండవులు అని కూడా అంటారు.

కురుక్షేత్ర యుద్ధంలో అశ్వద్ధామ ఒక నాటి అర్ధరాత్రి సమయంలో శిబిరం లోనికి ప్రవేశించి, తన తండ్రి ద్రోణాచార్యుని చంపిన ద్రౌపది సోదరుడు దుష్ట్య దుమ్మునితోపాటు ద్రౌపది కుమారులను నరికి, పొడచి చంపేశాడు. ఆ దృశ్యాన్ని చూసిన ద్రౌపది కుప్పగూలి పోతుంది. ఒకవైపు తమ్ముడు మరొక వైపు తన కుమారులు చిత్రవధకు గురైనారని తల్లడిల్లుతుంది. ఆ

సమయంలో కూడా అమె వల్లించిన శాంతి వచనాలు స్త్రీ జాతికే గర్వకారణం.

ఉ. అక్కట పుత్రశోక జనితాకుల భార విషణ్ణ చిత్తనై
పొక్కుచు నున్న భంగి నినుబోర గిరీటి నిబద్ధు జేసి నే
డిక్కడి కీడ్చుతెచ్చుట సహింపనిదై భవదీయ మాత నే
డెక్కడ నెట్టి శోకమున నేడ్చుచు నేక్రియ బక్కుచున్నదో?

అయ్యా ! అశ్వద్ధామా నా బిడ్డల్ని నీవు అమానుషంగా వధించావు. అందుకు అర్జునుడు నిన్ను పట్టుకొని ఈడ్చుకుని నా ముందుకు తెచ్చాడు. ఇప్పుడు నిన్ను చంపవచ్చు కానీ, నాలాగే మీ తల్లి ఎంత బాధపడు తుందో! బిడ్డను పోగొట్టుకుంటే తల్లి బాధ ఏలా ఉం టుందో నాకు తెలుసయ్యా !నీవు చేసింది రాక్షసత్వం ఐనా గురుపుత్రుడవని నిను చంపకుండా వదిలేస్తున్నాం పో..” అంది.

ఇంత శోకంలో కూడా ద్రౌపది ధర్మాన్ని, సహనాన్ని అహింసను వదలలేదు. ఇది ఆమె యొక్క మహోన్న తత్వం. ద్రౌపది పాత్రలోని ఔచిత్యం, ఈ రకంగా పోతన కూడ ద్రౌపదిని పతాక స్థాయికి చేర్చాడు.

## మహాప్రస్థానం

కురుక్షేత్ర యుద్ధానంతరం ద్రౌపది రాజ్యం పొందిన తర్వాత కూడా ఎక్కడా ఆడంబరంగా ప్రవర్తించలేదు. తన గృహిణీ ధర్మాన్ని తాను నిర్వహిస్తు వచ్చినది. శ్రీకృష్ణుడు నిర్యాణం పొందిన తర్వాత తన భర్తలతో తాను మహా ప్రస్థానం అనుసరించింది. ఆ ప్రయాణంలో అందరికంటే ముందుగానే తానే సుమంగళీగా పడి పోయింది. కన్ను మూసింది మరణానంతరం లక్ష్మీ అంశయైన ఈమె లక్ష్మీదేవిలో లీనమైపోయినది.[6]

## ఆదర్శ మహిళ

ఆభిజాత్యం కలిగిన రాజకుమారిగా, అణుకువ కలిగిన ఇల్లాలుగా శాంతం సహనం ఉన్న తల్లిగా పరమాత్ముడైన శ్రీకృష్ణుడే ఆదరించిన సోదరిగా, అగ్రగణ్యమైన ఈ ఇతిహాసంలో ఔచిత్యం కలిగిన కథా నాయికగా, భారత సంస్కృతికి మూలమైన ఈ మహా భారతంలో ఒక ఆదర్శ మహిళగా స్థిరమైన కీర్తి సంపాదించు కొన్నది ద్రౌపది. ఈ స్త్రీ పాత్రను ఇంత ఉదాత్తంగా ఔచిత్యంగా ఆదర్శంగా మలచిన మన కవులు స్మరణీయులు. మన భారతీయ పురాణ ఇతిహాస ప్రబంధ కవులు స్త్రీపాత్రలకు కట్టబెట్టిన మహాగౌరవం ఇది.

నన్నయ ఆదిపర్వ నుండి 7-16-20
శ్రీమదాంధ్ర మహాభారతం, ఎర్రన 5-301 పద్యం, రవీంద్ర పబ్లికేషన్స్, 1967
శ్రీ మదాంధ్ర మహా భారతం, తిక్కన 2- 152 వ పద్యం, రామా & కో., పబ్లికేషన్స్. 1954
శ్రీ మదాంధ్ర మహా భాగవతం పోతన ప్రథమ స్కంధం
శ్రీ మదాంధ్ర మహా భారతం తిక్కన స్వర్గారోహపర్వం 1-58

**BHAVAVEENA** *Spl. Issue*
**Vol. 19, Issue. 3, March 2022**
**ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

**భావవీణ**

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సత్య నిరూపణలో మేటి మన శాకుంతల

**– బి. సైదారావు,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సీ॥ "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
ఆధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రమని
కనివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికులు ఇతిహాసమనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ
సముచ్చయంబని మహిగోనియాడు చుండ

తే॥ వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసుడాదిముని
పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండ జేసి
భారతంబు" (ఆది-1-32)

మహాభారతం చతుర్వేదార్థ రహస్యాలకు, అష్టాదశ పురాణాలకు, సకల శాస్త్రార్థాలకు ఆయువు పట్టు వంటిదని పైపద్యాన్ని ఆదికవి నన్నయ తెలియజేస్తూ ప్రథమంగా "ధర్మతత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని" అంటూ ఆ ధర్మానికి అగ్రతాంబూలం ఇవ్వడం జరిగింది. ఈ విధంగా ధర్మ సంస్థాపన, సత్య నిరూపణా సంఘటనలను తెలియజేస్తూ ధర్మం, సత్యం అవలంబించడం వలన వ్యక్తులు ఎంతటి ఉన్నతమైన స్థితికి వెళతారో, దాని మహిమ, వాటి ఆవశ్యకత తెలియజేస్తూ, మహాభారతంలో అనేకమైన అఖ్యానాలు, ఉపాఖ్యానాలను తెలియజేస్తూ, సత్య ప్రాశస్త్యాన్ని, ధర్మ సూక్ష్మాలను తెలియజేయడంలో కృత కృత్యులయ్యారు కవిత్రయం వారు. ఆఖ్యాన ఉపాఖ్యాన సహితమైన ఆంధ్ర మహాభారతంలో ప్రతీ కథలోనూ మానవాళికి అందించవలసిన జ్ఞానాన్ని నీతిని, ధర్మాన్ని, సత్యాన్ని భోదిస్తూ, ఏ విధమైన ప్రవర్తన వలన మనిషి అధ:పాతాళానికి జారుకుంటూ, నైతికంగా ఎలా జ్ఞాన హీనుడౌతున్నాడో తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ఉదంకోపాఖ్యానంలో ప్రకృతి స్వరూపాన్ని, అష్టవసువుల వృత్తాంతంలో లోభం, క్రోధం యొక్క ప్రభావాన్ని, ధర్మవ్యాదోపాఖ్యానంలో ధర్మ సూక్ష్మాల వివరణను, శాకుంతలోపాఖ్యానంలో సత్య ప్రాశస్త్యాన్ని, ఇలా అన్ని ఉపాఖ్యానాల్లోనూ వివిధ అంశాలను జోడిస్తూ విశ్వ జనీనమైన మహాభారతాన్ని అందించడం జరిగింది. ముఖ్యంగా సత్యం ప్రభావాన్ని, సత్యప్రాశస్త్యాన్ని, సత్య వాక్య పరిపాలనా మహిమను ఎన్నో ఉపాఖ్యానాల్లో తెలియజేసినా, అన్నింటిలోకీ మేలుబంతివంటిది శకుంతలోపాఖ్యానంగా చెప్పవచ్చు.

ఆదిముని కృష్ణద్వైపాయన మహర్షి మానవాళికి అందించిన సర్వవేదసారము, సకల శాస్త్రాల రహస్యము జయసహితము. ఈ జయము వైశంపాయన ముని వక్తగా భారతంగా వృద్ధి చెందితే, ఉగ్రశ్రీవసుడు అను సూత మహర్షి వక్తగా శౌనకాది ఋషుల సందేహ నివృత్తిపై చెప్పిన అఖ్యాన ఉపాఖ్యాన కథాసహితమై మహాభారతంగా ఉత్కృష్టరూపం దాల్చడం జరిగింది. ఈ మహాభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పర మేశ్వరుడు ఎర్రనల చేతిలో నవరస భరితమైన మహా కావ్యంగా రూపుదిద్దుకున్నప్పటికీ, భారతీయుల పంచమవేదమైన మహాభారతం నేటికీ ఆదర్శప్రాయమై వున్నది. మహాభారతంలోని పాత్రలు మానవుల్లోని మనోవైకల్యాలని గుర్తించి వారి యొక్క నైతిక ప్రవర్తనను క్రమబద్ధీకరించి, వారి సర్వతోముఖాభివృద్ధికి దోహద పడుతుంది. ముఖ్యంగా మానవుల యొక్క నైతిక విలువల్ని నిర్ణయిస్తూ, అందుకు సత్యం పట్ల, ధర్మం పట్ల మానవుడు ఉద్యుక్తుడయ్యేందుకు కావలసిన మనోధైర్యాన్నిస్తుంది. అటువంటి మనోధైర్యాన్నిచ్చే అనువైన కథల్లో దుష్యంతోపాఖ్యానాన్ని ప్రథమంగా చెప్పవచ్చు. ముఖ్యంగా కథలోని పాత్రల స్వరూప

స్వభావాలు వారిలోని మనోవైకల్యాలు, వారి మన: ప్రవృత్తులు, పరిస్థితుల ప్రభావాలకు ఏవిధంగా తలొంచి, మానవుడు భ్రష్టుడైపోతున్నాడో తెలియజేస్తూ సత్యవాక్య పరిపాలనా మహిమను, సత్యప్రాశస్త్యాన్ని శకుంతల చేత చెప్పించిన నన్నయ శకుంతలను ఒక ఆదర్శవంతమైన మహిళగా, నూతన జీవితాన్ని తీర్చిదిద్దుకునే నేర్పరిగా, నేటి మహిళలకు ఆదర్శవంతమైన వ్యక్తిగా తెలియజేస్తూ మహిళాభ్యుదయాన్ని కోరుకున్నారనే చెప్పవచ్చు.

విద్యాధ్యాయనంలో స్త్రీ, పురుషుల మధ్య ఎంతో వ్యత్యాసాన్ని గమనించవచ్చు. పురుషులు శాస్త్రాధ్యాయనం చేస్తేనే పండితులు అవుతారు, కానీ స్త్రీకి మాత్రం ఆ అవసరం లేదనే చెప్పవచ్చు. ఎందకంటే మహిళ జన్మత: జ్ఞాన స్వరూపిణి, సౌభాగ్యదాయిని, శక్తిప్రదాయిని అని చెప్పవచ్చు. అటువంటి ఆమెకు స్వతసిద్ధంగా జ్ఞానం అలవడుతుంది. అటువంటి జ్ఞాన స్వరూపిణులైన మహిళలు పండితులకు సైతం జ్ఞానబోధ చేసే సందర్భాలు మహాభారతంలో కోకొల్లలు. ఆ కోవలకి చెందిన వనితా రత్నం మన శకుంతల. మహాభారతంలో మొదటగా ధర్మమూర్తిగా, ధీరురాలిగా చెప్పబడిన ఆదర్శ వంతమైన మహిళగా చెప్పవచ్చు. దుష్యంతోపాఖ్యానంలో మొదటి నుండి చివరి వరకు ప్రతి సందర్భంలోనూ ధర్మాన్ని పాటిస్తూ సత్యవాక్య పరిపాలనలో మహోన్నత స్థానం పొందిన వనితా రత్నం శకుంతల. ఈ ఉపాఖ్యానంలో ఆమె యొక్క సంపూర్ణమైన మూర్తిమత్వాన్నీ, ధర్మనిష్టను సమగ్రంగా తెలియజేసారు నన్నయ భట్టారకుడు. శకుంతలచే పలికించిన ప్రతీ వాక్యం, ప్రతిమాట ధర్మ సంస్థాపనకు సోపానాలనే చెప్పవచ్చు. విశ్వామిత్ర మేనకల పుత్రికగా క్షత్రియకాంత అయి నప్పటికీ భయత్రాతగా, పోషణకర్తగా పెంచిన కణ్వ మహాముని యొక్క గారాల పట్టిగా, మునికన్యగా జీవితాన్ని ధర్మనిష్ఠతో గడిపిన శకుంతల ఏనాడూ ధర్మహానికి పూనుకోలేదు. దుష్యంతుడు కణ్వాశ్రమానికి వచ్చినప్పుడు అతిధి మర్యాదలలోనూ, కుశల ప్రశ్నలు వేయడంలోనూ, తన జన్మ వృత్తాంతం చెప్పినప్పుడు కూడా తనకు తానుగా చెప్పినట్లు కాకుండా తన తండ్రి మరొక మహర్షికి తెలియజేసినట్లు చెపుతూ తన యొక్క సత్యనిష్టను, ధర్మనిరతిని నిరూపించుకోవడంలో అగ్రగణ్యురాలు మన శకుంతల. దుష్యంతుడు శకుంతలతో వివాహ ప్రస్థావన తెచ్చినప్పుడు శకుంతల యొక్క సమాధానం నేటి యువతకులకు సర్వదా ఆచరణీయం.

క॥ కరుణా నిరతులు ధర్మ । స్వరూపులింతకు
మదీయ జనకులు సనుదెం
తెరు; వారు వచ్చినీకి । చ్చిరేని పాణిగ్రహణయు
సెయుము నన్నున్ (ఆది-4-56)

అంటూ తన తండ్రి యొక్క అనుమతి తీసుకోమని ఎంత ధర్మంగా మాట్లాడిందో అర్థం చేసుకోవచ్చు. ఈ పద్యంలో కూడా తాను పరోక్షంగా మోహానికి అంగీకరిస్తూ, తన తండ్రి కూడా అంగీకరిస్తారని తెలియజేసింది. తన తండ్రిని గూర్చి చెపుతూ కరుణానిరతులు మరియు ధర్మ స్వరూపులు అని చెప్పడంలో శకుంతలకు తన తండ్రి పట్ల గల గౌరవభావం, నమ్మకం వ్యక్తమవుతున్నాయి. కరుణా నిరతులు అని చెప్పడంలో కణ్వమహర్షి యొక్క మనస్తత్వం గ్రహించిన శకుంతల తాను అడిగితే మహర్షి కాదనరని, తన మనస్సును అర్థం చేసుకుంటారనే అర్థం బాసిస్తే, ధర్మనిరతులు అనడంలో వివాహ సమయంలో చూడాల్సిన పద్ధతులు, వధూవరుల యోగ్యతలు, వంశ చరిత్రలు చూడటం మొదలైన ధర్మ విషయాలు తెలిసిన వ్యక్తి అని శకుంతల తన తండ్రి కణ్వమహర్షి యొక్క ధర్మనిరతి, ధర్మజ్ఞతను తెలియజేస్తూ తన తండ్రి అనుమతితో తనను వివాహం చేసుకోమని దుష్యంతునికి తన పరోక్ష అంగీకారం తెలుపుతూ, తన తండ్రి యొక్క ప్రత్యక్ష అనుమతిని కోరమంటుంది. ఈ విధంగా శకుంతల కన్యగా తన అస్వతంత్రతను తెలియజేస్తూ, తన ధర్మాన్ని ఆచరించడంలో నిబద్ధతతో వ్యవహరించిందనే చెప్పవచ్చు. ఆ సమయంలో దుష్యంతుడు గాంధర్వ వివాహ పద్ధతులు తెలియజేస్తూ, క్షత్రియులకు గాంధర్వ

వివాహం ఆమోదయోగ్యమని చెప్పినప్పుడు, శకుంతల తాను కూడా అంగీకరిస్తూ, తనకు పుట్టబోయే బిడ్డకు రాజ్యాభిషేకము చేయవలసిందిగా ప్రయాణం చేయించుకుని తనకు, తన బిడ్డకు చక్కని భవిష్యత్ నిర్మించుకుని రాజనీతిని ప్రదర్శించిన వనిత శకుంతల.

శకుంతల గాంధర్వ వివహం తరువాత ఆమెలోని హావభావ ప్రదర్శన చూసిన కణ్వమహర్షి తన దివ్యదృష్టితో అంతా తెలుసుకుని ఆమె యొక్క నడవడికను, ధర్మ స్వభావానికి మెచ్చుకుని "నీ ధర్మచరితంబునకు మెచ్చితిని" అంటూ కణ్వమహర్షి చేత మెప్పు పొందిన శకుంతల నిజంగా ధర్మ స్వరూపిణి అని చెప్పవచ్చు. ఎందకంటే శకుంతల. ప్రతీఘట్టంలోనూ ఎంతో ధర్మంగాను, సత్యాన్ని నిలబెట్టడంలో శకుంతల తారా స్థాయికి చేరుకున్న నిర్మలచరిత. నేటి మహిళా లోకానికి సర్వకాల సర్వావస్థల యందు ఆదర్శ ప్రాయమైనది.

పుత్ర సమేతంగా దుష్యంతుని దగ్గరకు వెళ్ళిన శకుంతల దుష్యంతుని యొక్క తిరస్కార పూర్వక చూపులకు, భావాలకు హతాసురాలైన రాజులను, రాజరికాన్ని నిందించుకుని సత్య ప్రాశస్త్యాన్ని తెలియ జేస్తూ...

చ: నుతజల పూరితంబులగు నూతులు నూఱిటి కంటె సూనృత
వ్రత। యొక బావి మేలు; మఱిబావులు నూఱిటి కంటె నొక్కస
త్క్రతు వది మేలు; తత్క్రతు శతంబు కంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబు కంటె నొక్క సూన్యత వాక్యము మేలు సూడగన్ (ఆది-4-94)

చెప్పిన ఈ పద్యం తెలుగు సాహిత్యంలోనే అపూర్వ మైన జాతిరత్నం వంటిది. సత్య ప్రాశస్త్యం కోసం ఎన్నో ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు తెలియజేసినప్పటికీ ఇంతటి ప్రభావవంతమైన పద్యం మహాభారతంలోనే కాదు సమస్త తెలుగు సాహిత్యంలోనే అరుదు. అలాంటి పద్యాన్ని శకుంతల చేత చెప్పించిన నన్నయ నిజంగా ధన్యుడు. పై పద్యంలో సత్యవాక్యం ఎంతటి మహిమా న్వితమైనదో, దానికి ఎంతటి ఘనకార్యాలు కూడా సాటిరావని తెలియజేస్తూ, సత్యం ప్రభావాన్ని లోకానికి, లోకనిందలకు భయపడి దుష్యంతుని వలె ఏమీ తెలియనట్లు నటిస్తూ, ఉండటం మనం చూస్తూనే ఉంటాము. అలాంటి వారికి ఈ పద్యం సరైన ఔషదమనే చెప్పవచ్చు. ఈ పద్యం ద్వారా శకుంతల తాను చెప్ప దలచుకున్న అంశాన్ని ఎంత సౌమ్యంగా, ఎంత ధర్మ బద్ధంగా చెప్పిందో మనకు అర్థమౌతూనే ఉంది. పై పద్యాన్ని గమనించినట్లయితే సత్యం ఎంతటి మహోన్నత మైనదో, ఎంత పవిత్రమైనదో, దానికి సాటి లోకంలో మరే కార్యమూ సాటిరావని చెపుతూ, మంచినీటితో నిండిన నూతులు వంద కంటే ఒక బావి మేలు, అలాంటి బావులు వంద కంటే ఒక మంచి వ్రతం మేలు, అలాంటి వ్రతాలు వంద కంటే కూడా ఒక వంశోద్ధారకుడైన కొడుకు మేలు, అలాంటి కొడుకులు వందమంది కంటే కూడా ఒక సత్యవాక్యం మేలు సుమా అంటూ సత్యం యొక్క విశిష్టతనూ పవిత్రతనూ తెలియజేసింది. ఈ పద్యం ద్వారా శకుంతల యొక్క ధర్మబుద్ధి, రాజనీతి, కుశలత, కార్యనిర్వాహణా చతురత కూడా మన గమనించవచ్చు. పై వాక్యంలో దుష్యంతునికి "సూనృత వ్రత!" అన్న సంబోధన సాభిప్రాయం. మాట తప్పిన దుష్యంతుని ప్రవర్తనను ఎత్తి పొడిచేది. ఆగ్రహంలో కూడా శకుంతల ఔచిత్యం పాటించింది. గృహస్థాశ్రమ ధర్మంలో సంతానం కంటే కూడా సత్యం గొప్పదని, నూరుగురు కుమారుల కన్నా ఒక సత్యవాక్యం శ్రేష్ఠమైనదనీ తెలియజేస్తూ, ఒక త్రాసులో బాహాటంగా వేయి ఆశ్వమేధ యాగాల ఫలాన్నీ ఒక వైపునా, ఒక్క సత్యాన్ని మాత్రమే మరొక వైపు ఉంచి తూచగా సత్యం వైపు బరువు మొగ్గు చూపి, సత్యమే గొప్పదని నిరూపిస్తూ, సత్యం యొక్క పవిత్రతను తెలియజేసింది. సుతశతంబు అని చెప్పడంలో భావి భారత కథా ప్రస్థావనను నన్నయ తెలియజేసాడనే

చెప్పవచ్చు. ఎందుకంటే కురుపాండవుల మధ్య సత్యం లోపించి జరిగిన మహాయుద్ధాన్ని నన్నయ చూచాయగా తెలియజేస్తూ వందమంది పుత్రుల కంటే కూడా సత్యవాక్యమే గొప్పదని ఉద్ఘాటించడం జరిగింది.

ఆ విధంగా సత్యవాక్య మహిమను చెప్పిన తరువాత కూడా ఎలాంటి మనోవికారాన్ని పొందిన దుష్యంతున్ని చూసి, శకుంతల తన కర్మకు తానే నిందించుకుంటూ సభ నుండి నిష్క్రమిస్తున్న తరుణంలో దేవతా ప్రేరణమైన దివ్య ఆ శరీర వాణి శకుంతల ఉత్తమ చరిత్రను, పాతివ్రత్య మహిమను కొనియాడుతూ, శకుంతల దుష్యంతుల వివాహగాధను సభాసదుల ఎదుట బహిర్గతం చేయగానే, అప్పుడు దుష్యంతుడు నిజాన్ని అంగీకరించి శకుంతలను ఆదరించి పుత్ర కళత్ర పరిష్వంగంతో ఆనందభరితుడై, శకుంతలా సమేతుడై, సకల రాజభోగాలు అనుభవించాడు. భర్త నిరాధరణకు గురైనప్పటికీ సత్యాన్ని, ధర్మాన్ని ఆధారం చేసుకుని, నిర్మలమైన జీవితం గడిపిన శకుంతల సత్య సంస్థాపనలో సత్య శోధనలో అగ్రగణ్యురాలైన శకుంతల జీవితం నేటి మహిళా లోకానికి ఆదర్శవంతమైనది.

"యతో ధర్మ తతో జయ" అన్న ఆర్యోక్తిని అనుసరించి, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ ధర్మాన్ని, న్యాయాన్ని, సత్యాన్ని విడనాడక అనునిత్యం సౌమ్య భావంతో సాదు జీవనం గడిపిన శకుంతల ద్వారా నన్నయ భట్టు సత్యం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ, సత్య నిరూపణలో శకుంతల యొక్క విజయం ధర్మ విజయం గాను, సత్య విజయంగాను అభివర్ణించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1) శ్రీమదాంధ్ర మహాభారతం - కవిత్రయ విరచితం - తిరుమల తిరుపతి దేవస్థాము పరిష్కృత కృతి.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కంబరామాయణం - సీత సుందరకాండ

- **చక్రుతారి రమణ,** తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల సిద్ధిపేట.

శుక్లమాల్యాంబర ధరో లక్ష్మణేన సహాగతః
స్వపే చాద్యమయా దృష్టాసీతా శుక్లాంబరావృతా
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వత మాస్థితా
(సుందరకాండ)

తెల్లని వస్త్రములు కట్టుకొని సముద్ర మధ్యమున తెల్లని కొండమీద కూర్చుండి కనబడిందని. త్రిజట తన స్వప్న వృత్తాంతమును వాల్మీకి మహర్షి రామాయణంలో వివరించినట్లు, దుష్ట శిక్షణ కొరకు' రామకథ. వాల్మీకి రామాయణం నుండి క్రమేపి అనేక రామాయణాలు వెలుగు చూసాయి. ఎన్ని రామాయణాలు వచ్చినమ అనన్నీ సమాజంలో వుండే మంచి చెడులకు నిదర్శనాలు. రామాయణం అంటే రామ కథ అంటారు. కాని రామాయణం అంటే సీత కథనే. సీత కారణంగానే దుష్ట శిక్షణ శిష్టరక్షణ జరిగిందనడం నిజం సీతాదేవిని వాల్మీకి దీక్షతో దక్షతతో తీర్చి ప్రపంచానికి అందించాడు. సీత పరమ సాధ్వి, వాల్మీకి తన రామాయణంలో సీత సౌందర్య ప్రస్థావనను తీసుకురాలేదు. త్యాగమూర్తి గానే పరిచయం చేశాడు. కంబ రామా యణం, రంగనాథ రామాయణ మొల్ల రామాయణంలల్లో సీతాదేవి సౌందర్యాన్ని వర్ణించారు.

రామస్య దయితా భార్యానిత్యం ప్రాణ సమాహితా
జాతా దేవ మాయేన నిర్మితా సర్వ లక్షణ సంపన్న నారీణా
ముత్త మా వదూః సీతాప్యను గతా రామం శశినం రోహిణి యథా !
(వా.రా. బాలకాండ)

రామునికి ప్రియ భార్యగా, నిత్యం ప్రాణం ఎడబాయ కుండా జనక వంశమున జన్మించిందని, దేవమాయ వలె సృష్టించబడిందని, సర్వలక్షణ సంపన్నురాలలో ఉత్తము రాలగు సీతాదేవి రోహిణి చంద్రుని అను సరించినట్లు

తస్యభూయో విశేషణం మైథిలీ జనకాత్మజా
దేవతానిస్సమారూపే సీతా శ్రీరివరూపిణీ
వాల్మీకి రామాయణం

ఆమె తన ప్రాణ విభుడైన శ్రీరామచంద్రునికి అనుకూలవతి యైన సహ ధర్మ చారిణిగా చూపబడినది.

తమిళ చక్రవర్తి కంబకవి దక్షిణ భారత సాహిత్యము వెలుగు చూపడం కోసం, ఇప్పటికీ ఆబాల గోపాలం గుమి గూడి గాయకులు పాడుకునే విధంగా కంబరామాయణ గానం ఉన్నట్లు, కేరళ, కర్ణాట, ఆంధ్ర, ప్రాంతాలలోని శాసనాల ద్వారా తెలుస్తుంది. కంబకవి నేటి తంజావూరు జిల్లా మయూరం తాలూకాలోని తిరువళుందూరు గ్రామానికి చెందిన వాడు. కంబరామాయణం దక్షిణ దేశ భాషల లోనే కాకుండా భారతీయ దేశ భాషలలోనే మొట్ట మొదట రామాయణానువాదముగా తమిళంలో వచ్చింది. అలాగే తెలుగులో వచ్చిన మొట్టమొదటి అనువాద రామాయణం గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణం.

ఈ కంబరామాయణం గేయ రామాయణం భాగవతుల పరంపరంగా కొనసాగే ఈ గేయ రామాయణం ఇప్పటికి ప్రజల నాలుకలయందు నాట్య మాడుతుంది. కంబరామాయణంలోని సుందరకాండలో సీత ఒక స్త్రీ మూర్తిగా ఎన్ని కష్టాలు పడిందో ఎంత విలవిల లాడిందో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు కవి. హనుమంతుడు సీతాన్వేషణ కొరకు లంకాపురిని చేరి మూల మూలన వెదక నారంభించాడు. అందులో భాగంగా లంకానగరం యొక్క సౌభాగ్యము, సౌదాల కాంతి రత్నసమూహాల చేత నిర్మించబడ్డ పురవీధులు ఆరత్నాల కాంతిలో రాత్రిపూట కూడా పగలును తలపించే వెలుతురు

హనుమ సీత జాడ కనబడుట లేదే అని సూక్ష్మ రూపాన్ని దాల్చి వెదుకుతూ తల ఎత్తి పైకి చూడగా మధుపాలు జుమ్మని పైన ఆడే ఒక పుష్పవనం కన బడింది. ఇంత వరకు తాను ఆ తోటను చూచినట్లు లేదని హనుమకు అనిపించింది.చూపు ఆనినంత వరకు సీతమ్మను చూశాడు. దగ్గరలోనే శింశుపావృక్షం ఎక్కి చుట్టూ చూడగా, సీత యొక్క స్థితి కనబడింది.

బొట్టల వంటి పొట్టలతో కత్తులు కటారులుపట్టి ఆమె చుట్టూ మూగి బెదిరిస్తున్నారు. జానపద స్త్రీవలె లేచి వణకడం తిరగడం తన నాథుడు వస్తాడనే ఆశతో సొక్కిసోలటం పదే పదే దిక్కులు చూడడం ఇవన్నీ చేస్తున్నది.పులుల నడుమ చిక్కిన లేడివలె కనిపిస్తుంది.

వాల్మీకి రామాయణంలో
పీతేనైకే న సంవీతాం
క్లిష్టేనోత్తమ వాససా
స పంకా మనలంకారాం
వి పద్మా మివ పద్మినీ
సుందరకాండ

పచ్చని నలిగిన ఒక ఉత్తమ వస్త్రమును చుట్టుకున్నది అలంకారాలు లేకుండా బురదతో కూడిన పద్మములు లేని తామర తీగవలె కనబడుచున్నది.

మొల్ల రామాయణంలో
విడుద పెన్నిధి వేణి జడలుగా సవరించి మలిన
జీరాంబరం బొలియ గట్టి
భూమి రజంబు విభూతి పూత పూసి...

అని సీత తనకు తానుగా పడుతున్న బాధలు హనుమకు తెలియజేసింది. కానీ కంబ రామాయణంలో సీత ఒక స్త్రీ కష్టాలలో ఉన్నప్పుడు తనలో తాను ఆలోచించే విధానాన్ని కవి వ్యక్తపరిచాడు.

దశకంఠుడు తనను ఇక్కడికి తీసుకు వచ్చినట్లుగా తన వారికి తెలియ లేదేమో! తెలిసినా సముద్రాన్ని దాటి లంకను చేరడం ఎట్లా అని వెనుకంజ వేస్తున్నారేమో, మరిది లక్ష్మణుడు కూడా పట్టించుకోవడం లేదేమో, జటాయువు శ్రీరామచంద్రుని కలుసు కోకుండా మరణించి ఉంటాడేమో. ఇలా ఆలోచిస్తూ ఇక నా గురించి తెలిపే వారెవరూ లేరా ఈ జన్మలో రామున్ని చూడలేనేమో అని అత్యంత తాపం చెందుతూ, మోస గాండ్రయిన రాక్షసులు సీతను చంపి తిని వేసి ఉంటారని, నిరాశతో చేయవలసిన పనిని మానుకున్నారేమో, అయ్యో ఈ దైవాన్ని ఏమనాలి?తన తమ్ములు తల్లులు వచ్చి ఆయోద్యకు తీసుకొనిపోయినారేమో? అయ్యో తండ్రి కిచ్చిన మాట జవదాటడా గడువు తీరనిదే తిరిగి వెళ్ళడు కథా. అడవిలోనే ఉంటాడు. రాక్షసులతో యుద్ధం చేస్తున్నాడేమో ఏదైనా ముప్పు సంభవించిందేమో. అనుకుంటూ వాపోతుంది.

రావణుడు సీతను కోరి వచ్చినపుడు వాల్మీకి రామా యణంలో రావణున్ని ఏ మాటలతోను తూలనాడదు. కానీ కంబరామాయణంలో సీత చెవులు మూసుకొని నీళ్ళు నిండిన కన్నులతో ప్రాణాలను కూడా లెక్క పెట్టక ఈటెల పోటుల వంటి మాట లంటుంది.

ఓరీ తృణమా (గడ్డిపరకా) నీకారు కూతలకు కుల కాంతలు వింటే సహిస్తారా. పాతివ్రత్య గుణం కంటే కొండలు మెత్తవని తెలుసుకో నీ దుర్గుణాలు కీర్తిని తెచ్చి పెట్టగలవా నీ చదువు తెలివి తేటలు ఇంతటివేనా? క్షణ కాలం సంతోషానికి శాశ్వత కీర్తిని గంగలో కలుపుతావా? మేరు పర్వతాన్ని ఛేదించవలసివస్తే ఆకాశాన్ని చీల్చి దాట వలసి వస్తే పద్నాలుగు లోకాలను నాశనం చేయవలసి వస్తే నా నాథుని బాణమే ఆపని చేయగలదు. అన్నీ తెలిసిన బుద్ధి హీనుడా, నీతిమాలిన మాటలనుటకేనా నీకు పది నోర్లున్నవి, పది తలలున్నవి, ఇరవై చేతు లున్నవి.

జానకి కోపంతో పలికిన ఈ మాటలకు రావణుని పది నోరులు పిడుగులు వురిమినవి గిరులు చూర్ణమవునట్లు గర్జించినాడు ఆమెను ఒక్క పట్టున నిలువునా చీల్చి మ్రింగి వేయాలని అనుకున్నాడు. కాని అలాచేయలేడు.ఆమెను

బెదిరించి మింగరాని కోపంతో అక్కడి నుండి వెళ్ళి పోయినాడు. ఇన్ని రోజుల నుండి తపిస్తున్న తాను, తన చుట్టూ ఉన్న రాక్షసులు ఎప్పుడు నిద్ర ఎరుగని వారు. ఆ రోజు ఒళ్ళు తెలియకుండా నిద్రపోయారు. ఒంటరిగా నిద్ర లేకుండా భయపడ సాగింది ఇన్ని రోజులు తనకు తోడుగా ఈ రాక్షస వనితలున్నారే అని ధైర్యంగా ఉంది. కాని వారు ఆదమరచి నిద్రించే సరికి ఏ మాయా రూపంలో రావణుడు వస్తాడేమోనని భయపడ సాగింది. ఈరాత్రి ఎలా గడుస్తుంది. అని అనుకో సాగింది.

శింశుపా వృక్షం నుండి దిగివచ్చిన, హనుమను చూసి ఏమనాలో అర్థం కాని స్థితిలో ఉండి పోయింది. అమ్మా నేను శ్రీరాముని సేవకుడను సాహసించకు తల్లి అంటూ చేతులు జోడించాడు. మహిళ ఆపద సమయంలో కూడా ఎలా వుండాలో కంబరామాయణంలో సీతను చూసి తెలుసుకోవచ్చు. జానకీ దేవిని నమ్మించడానికి హనుమ పలు ప్రయత్నాలు చేయగా ఎవరయ్యా నీవు అన్నది. సీతాదేవి వృత్తాంతం ఆ శ్రీరామచంద్రుని ద్వారా తెలుసుకుని వచ్చితినని చెప్పి రాముడిచ్చిన ఉంగరాన్ని సీతకందచేశాడు.

ఆ సమయంలో సీత పొందిన స్థితిని దేనితో పోల్చి చెప్పినా తక్కువే. రామభద్రుని ముద్రిక స్పర్శతో ఆమె కన్నులనుండి అశ్రుదారలు దేహాన్ని తడుపుతుండగా కృపానిదీ రామదూత వైవచ్చి నా ప్రాణాలు నిల్పిన నీకు నేను చేయగలిగిన ప్రత్యుపకారము ఏమున్నది తల్లిదండ్రి వంటి పుణ్యాత్ముడవు నీవు దిక్కులేని నాకు దిగులు తీర్చినావు కపీంద్రా కలకాలం బ్రతుకు నాయనా అని ఆ అన్నదమ్ముల కుశల వివరము చెప్పవయ్యా అన్నది.

హనుమ నుండి శ్రీరాముని కుశల సమాచారము తెలుసు కొని నీవు! నిర్విఘ్నంగా వెంటనే వెళ్ళిపో నేను చెప్పే గుర్తులు శ్రీరామునికి చెప్పు అంటూ ఓ పుణ్యమూర్తీ ఈ మణి, కంటి పాపవంటిది. ఎప్పటినుండో పైట కొంగున దాచి ఉంచాను. దీనిని నా నాథునికి ఆనవాలుగా చూపు అని భక్తి సంబ్రమాలతో హనుమ చేతికిచ్చినది.

సుందరకాండలోని కొంతభాగాన్ని చూస్తేనే ఆధునిక సమాజంలోని మానవ మనుగడకు స్త్రీ మూర్తి సహన శీలతకు, ఆత్మస్థైర్యానికి, ధైర్యంతో ఎదుర్కొని నిల దొక్కు కొనుటకు నిలువుటద్దముగా, నిదర్శనంగా కంబ రామాయణం ఉందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. కంబరామాయణం - కళాప్రపూర్ణ డా. మరుపూరు కోదండ రామిరెడ్డి
2. సుందర కాండము - శ్రీ కొంపెల్లి వేంకట రామశాస్త్రి
3. మొల్ల రామాయణం - శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు
4. శ్రీమద్రామాయణం, సుందర కాండము - డా. గుండి వేంకటాచార్యులు
5. శ్రీమద్రామాయణం, బాల కాండము - డా. గుండి వేంకటాచార్యులు
6. సంపూర్ణ వాల్మీకి రామాయణం- శ్రీమాన్ రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు

# పాల్కూరి సోమనాథుని సాహిత్యంలో - స్త్రీ

- బూర్గుల స్వరూప, తెలుగు అధ్యాపకురాలు, మహబూబ్‌నగర్.

"తల్లి కల్గిన నేల తపసిగా నిల్చి తల్లి కల్గిన నేల తలజెడల్గట్టు" పాల్కూరి సోమనాతుని సాహిత్యంలో స్త్రీ పాత్రల గురించి అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆ కాలంలోని సామాజిక పరిస్థితులు తెలుసుకోవాలి. వీరి కాలంలో రాజకీయ వ్యవస్థలో ప్రదానమైనది భూస్వామ్య వ్యవస్థ. ఈ వ్యవస్థ వల్ల భూ స్వాములు స్త్రీని బానిసగా చూసే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులలో స్త్రీకి భర్త తప్ప మరో ప్రపంచం లేకుండా పోయింది. ఈ వ్యవస్థ నుండి బయట పడడానికి వీరశైవ మతంలో స్త్రీలకు అవకాశం కల్పించాలి. వీరి భక్తి ఉద్యమం సమాజంలో మనుషుల మధ్య అసమానతలను వ్యతిరేకించింది. కుల, అసమానతలను ప్రశ్నించింది. బ్రాహ్మణ ఆధిపత్యం నిరసించింది.

మోక్షం పొందడానికి భక్తి ఒక్కటే మార్గమని చాటి చెప్పింది. పురుషుడితోపాటు స్త్రీలు శివుడిని ఆరాధించ వచ్చు. మహిళలు అన్ని సమయాలలో పరిశుభ్రంగా శివరాధన చేయవచ్చు అని చెప్పింది. వీరశైవం వల్ల, ఈ ఉద్యమంలో స్త్రీలు కూడా భాగమయ్యారు. వీరశైవం కాకతీయుల కాలంలో సరిహద్దు రాష్ట్రమైన కర్నాటక రాష్ట్రం నుంచి తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించింది.ఆ తర్వాత ఇక్కడ సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని ప్రభావితం చేసింది. బసవేశ్వరుడికి సమకాలికుడిగా వీరశైవ మత వ్యాప్తికి కృషి చేశాడు సోమనాథుడు.ఈ మతం సాంస్కృతిక వాతావరణంలో జీవించి సోమన్న వీరశైవ మతతత్త్వంతో ప్రభావితుడై సాహిత్య రచనలు చేశారు. వీరి రచనలలో స్త్రీకి ఎవ్వరు ఇవ్వని ప్రాముఖ్యతను ఇస్తూ మహిళల పాత్రలను పవిత్రంగా చిత్రించారు.బసవ పురాణం, చతుర్వేద సారం, పండిత రాజ్య చరిత్రలో స్త్రీ పాత్రలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. సమాజంలో పురుషుడితోపాటు సమాన గౌరవం ఉండాలని, మహిళ పట్ల ఉన్న వివక్షతను సోమనాథుడు తన రచనలతో నిరసించారు. వీరి రచనలలో స్త్రీ పాత్రను ఈ క్రింది విధంగా చూడవచ్చు.

### కన్యగా స్త్రీ :

గోడగూచి అనే బాలిక యొక్క బాల్యము, ముగ్ధత, చిన్న పిల్ల, మనస్తత్వం కనిపిస్తుంది. ఈ బాలిక చూడ పాలు ఆరగించనందుకు బాధపడి శివుని ప్రాధేయ పడుతుంది. గోడగూచి అనే బాలికను అనుగ్రహించి శివుడు ఆరగించాడు.

తర్వాత పొరుగూరికి వెళ్లివచ్చిన ఆమె తండ్రి పాలు ఏవని అడుగుతాడు. ఆమె శివుడు తాగడానికి చెబుతుంది. కాని ఈ విషయాన్ని నమ్మకుండా మళ్లీ పాలు శివుడికి ఆరగింపు పెట్టు. తాగుతాడో లేదో చూస్తానని గోడగూచిని తండ్రి అడగడం జరుగుతుంది. మళ్లీ పాలు గోడగూచి శివునికి అరగింపు పెడుతుంది.అప్పుడు శివుడు ఆరగించకపోవడంతో బాలికను నిందిస్తాడు. శిక్షించడానికి జుట్టు పట్టుకోనగా ఆ బాలిక హా లింగ హాలింగ అని దాహరణగా నిలస్తుంది. కవి చిన్నపిల్లల మనస్తత్వం ఎలా ఉంటుందో చిత్రీకరించాడు. పిల్లలు పట్టిన పట్టును వదలరు. కావాలన్న దాన్ని పొందేదాకా ఊరుకోరు. ఈ లక్షణాలన్నీ మనకు గోడగూచి కథలో కనిపిస్తాయి.

### బెజ్జ మహాదేవి :

ఈమె ప్రస్తావన బసవ పురాణంలోని 3వ అశ్వాసంలో ఉంటుంది. ఈమె మహా శివభక్తురాలు. ఈమె శివున్ని తన కుమారునిగా భావించుకొని శివుడికి తల్లి లేకపోవడం వల్ల కలిగిన కష్టాలను ఈ విధంగా చెప్పింది. "తల్లి లేకుండిన తనయుడగున" అని తల్లి లేకపోవడం వలన

శివుడు తాపసిగా మారాడని, తల్లి ఉంటే అలా జరిగేది కాదని అంటుంది. బెంజ మహాదేవి శివున్ని తన కుమారుడిగా భావించి బాహ్యోపచారాలన్ని చేస్తుంది. వెన్నుతట్టింది. పాలిచ్చింది. అతని అల్లరి చేష్టలు అన్ని భరించింది. ఈ విధంగా ఆమె శివుడికి తల్లి చేసే సపర్యలన్నీ చేసింది. హఠాత్తుగా శివుడు పాలు తాగలేదు. దానితో ఎంతో బాధపడింది. చివరికి చనిపోవడానికి సిద్ధపడింది. దానితో శివుడు ప్రత్యక్షమై ఆమెను వరం కోరుకోమని అడుగగా నీకు తల్లిగా ఉండడం కంటే గొప్పవరం లేదని అంటుంది. దానికి శివుడు అనుగ్రహిస్తాడు.ఈ విధంగా తల్లిగా కుమారుడిపై స్త్రీ పడే ఆరాటాన్ని, ఆవేదనను ప్రేమను బెంజ మహాదేవి పాత్రలో చూపించారు కవి. ఈమె కుమారుని కోసం ప్రాణాన్ని కూడా వెనుకడుగు వేయలేదు. శివునికి తల్లిగా ఉండడం వల్ల ఈమె జీవితం ధన్యమైంది, చరితార్థమైంది. పై విధంగా సోమన సాహిత్యంలో స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం, సహృదయత, స్వాతంత్ర్యం ఉన్నట్లు కనిపిస్తుంది. వీరి కాలంలో వచ్చిన ఒక విప్లవాత్మకమైన మార్పు ఈనాటికి అవసరమని, అనుసరణీయమని నా అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రం
2. బెజ్జ మహాదేవ కథ - పాల్కూరి సోమనాథుడు
3. సాహితీ మంజీరా, తెలుగు అకాడమి

# మొల్ల రామాయణము - పాత్రల చిత్రణ

- డా॥. బి. మల్లికార్జున రాజు, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల, కడప జిల్లా.

తెలుగు సాహిత్య జగత్తులో ఆతుకూరి మొల్ల (16 శ॥) ప్రసిద్ధ కవయిత్రి. తొలి తెలుగు రామాయణ కవయిత్రి. ఆమెను ఆతుకూరు మొల్ల, కుమ్మరి మొల్ల అని కూడా సాహిత్యకారులు పిలుస్తారు. తండ్రి ఆతుకూరి కేసనసెట్టి.

సకల చరాచరాత్మకమైన భువనత్రయానికి శ్రీరామ చంద్రుడు త్రికాలారాధ్యమైన పరబ్రహ్మస్వరూపం. మధురంగా, మధురాక్షర సహితంగా కవితాకల్ప శాఖపై నుండి వాల్మీకి కవి కోకిలం "రామ రామ" అని గానం చేసిన అమృత నిష్యంది రసమయం. మానవ రూపంలో అవతరించిన ఆదర్శప్రాయమైన ధర్మం. అటువంటి శ్రీరామ చంద్రుని చరితను వాల్మీకి వివిధ రసమధు ధారా పరిప్లుతంగా చేసి మానవాళికి అందించిన ఆది కావ్యం శ్రీమద్రామాయణం. ఈ రామాయణాన్ని అనేక భాషల్లో అనేకమంది కవులు, కవయిత్రులు అనువదించారు. తెలుగులో రంగనాథ రామాయణం, భాస్కర రామాయణం, మొల్ల రామాయణం మొదలైన కావ్యాలు వెలిశాయి.

మొల్ల రచించిన గ్రంథం మొల్ల రామాయణం. ఆమె తన రామాయణ కావ్యాన్ని శ్రీరామచంద్రునికి అంకితమిచ్చింది. ఇందులో అవతారిక; బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, యుద్ధ కాండాలున్నాయి. యుద్ధ కాండంలో మూడు ఆశ్వాసాలున్నాయి.

తెలుగు కవిత్వం ధ్వని ప్రధానమై తేట తెలుగు మాటలతో ఉండాలని కఠిన సంస్కృత పదాలు ఒప్పవని మొల్ల తన కావ్యంలో చాటింది. వ్యంగ్యార్థ ప్రతిపాదకమైన శబ్దాలు, సామెతలు కూర్చి ఆంధ్రుల వీనుల విందుగా రామకథను కావ్యంగా గావించిన మహా తపస్విని మొల్ల కవయిత్రి.

## సీత పాత్ర చిత్రణ :

మొల్ల చిత్రించిన సీత పాత్ర అచ్చంగా తెలుగించి ఆడపడుచు పాత్ర. ఆమె సౌందర్యాన్ని, ఉదాత్త ధీరత్వాన్ని ఎంతో గొప్పగా చిత్రించింది. శ్రీరాముడు శివధ నుర్భంగము చేసే సమయంలో "ధనువు దునిమినంత ధరణీశ సూనులు" అనే పద్యంలో "సీత మేనువంచె" అన్న వాక్యము ద్వారా ఆమె మన కళ్ళముందు ప్రత్యక్షమవుతుంది. శ్రీరాముని వెంట అరణ్యమార్గంలో నడువలేక, అడుగులు పొక్కులెత్తి, కాలివేళ్ళు నేత్తురు గ్రమ్మి ఎర్రగా మారిపోయి, దేహము వాడిపోయి, మొహము కళావిహీనము అయి, దప్పిగొని ఎంతో కష్టాలు పడుతున్నప్పటికీ మనోధైర్యాన్ని కోల్పోనటువంటి సుకుమార సుందర మూర్తిగా మనకు సీత కనిపిస్తుంది.

ఆమె సౌందర్యము "బంగారు నీరువోసిన బొమ్మ వలెనుండు" నని శూర్పనఖ రావణునికి చెప్పిన మాటలలో సీత అపురూప లావణ్యవతి అని మనకు అర్థమవుతుంది.

రావణాసురుడు తనను అపహరించుకొని పోయే సమయంలో ఎంతో ఆక్రందన చేసింది. ఎవరూ కాపాడ వారు లేరని అర్థంచేసుకొని తన నగలను చీరకొంగు తునకలో కట్టి కిందికి జారవిడిచింది.

## కైక పాత్ర :

స్త్రీల పాత్రలను అబలలుగా, బేలలుగా చిత్రించడం ఈమెకు గిట్టదన్న విషయం కైక పాత్ర చిత్రణ ఘట్టంలో మంథర ప్రేరణ, కోపగృహ ప్రవేశం వదలి వేసింది. కార్యభారమంతా కైకపైనే వేసింది. "ఆ రాత్రి రాజశేఖరుని చిత్తంబు వచ్చునట్లుగా మెలగి యాతడు తన్ను మెచ్చుపెరింగి కైక యిట్లనియె" అన్న వచనంలో కైక దశరథుని ఆ రాత్రి తన అందంతో తృప్తిపరచింది. తెల్లవారగానే తన కోరికను బయట పెట్టింది.

ఆ॥ వసుమతీశ నాకు వరమిచ్చి తప్పుట
తగువుగాదు మీకుదలుపులోన
మరచినారదేమో; మన్నించి తొల్లింటి
యీవులీయ వలయు నీక్షణంబు (అయో.25)

ఆ వరాలను ఆ క్షణాన్నే ఇవ్వాలని షరతు పెట్టింది. "తగవుకాదు మీకు" అన్న పాదంలోని "మీకు" అన్న పదం దశరథునికి ఒక్కడికి మాత్రమే సంబంధించింది కాదు. వారి వంశానికంతటికి సంబంధించినది. రఘువంశ రాజులు సత్యవాక్పరిపాలకులని భావం. ఆ చిన్న పదంలో అంత పెద్ద భావాన్ని ధ్వనింప చేసింది కాబట్టే దశరథుడు మారు జవాబు చెప్పలేక పోయాడు. సుమంత్రుడు వచ్చి "స్వామి! రామచంద్రుడుని బట్టంబున గట్ట సుముహూర్తం బాసన్నంబయ్యెంగావున మిమ్ము నచ్చటికి విచ్చేయవనధరింపు"డని వశిష్ఠ మహాముని పంపెనని చెప్పగా విని కైక ఈవిధంగా పలికింది.

మ॥ అనిలోమున్ను నృపాలు చిత్తమునకేనహ్లాదముం గూర్చి నా
తనయుం బట్టముగట్టి రాఘవుని బద్నాల్గేండ్లు కాంతారమం
దును వర్తిల్లంగుబంపంగొన్న వరమున్ ద్రోయంగరాదెంతయున్
వనసీమన్ మునివృత్తినుండు మనుడే వైళంబయా రామునిన్ (అయో.28)

ఈ పద్యంలో కైక తాను రాణిగా అధికారాలు చెలాయించింది. "రాఘవ" పదాన్ని ప్రయోగించడం వలన దశరథుని వలే రాముడు కూడా వంశగౌరవాన్ని నిలుప వలసిన బాధ్యత ఉందని కైక భావన. కైక తన ప్రాణాలొడ్డి రణరంగంలో దశరథుడికి సహాయం చేసింది. కాబట్టి ఆమె కోరిన వరాలివ్వడం దశరథుడి ధర్మం. రాజాజ్ఞను నెరవేర్చవలసిన బాధ్యత మంత్రిది. ఈ పద్యంలో ఇంత గొప్ప భావము ఇమిడి ఉంది. అందువల్లనే సుమంత్రుడు మారుమాట్లాడకుండా వెళ్ళి వశిష్ఠుడు మొ॥న వారికి ఈ విషయాన్ని విన్నవించాడు. ఈవిధంగా రామాయణానికి కేంద్రమైన ఈ ఘట్టంలో కైక శీలాన్ని ప్రతిభావంతంగా చిత్రించింది. తన ధీరత్వాన్ని హృదయ రంజకంగా చిత్రించింది.

**గుహుని పాత్ర :**

మొల్ల రామాయణంలో గుహుని పాత్ర చిత్రణకు ఒక ప్రత్యేకతను కల్పించింది. ఈ ఘట్టం వాల్మీకి రామాయణంలో లేదు. విశ్వామిత్రునితో శ్రీరాముడు మిథిలానగరమునకు వెళ్ళే దారిలో గంగానదిని దాటవలసి వచ్చింది. అక్కడ పడవను నడిపే నావికుడు గుహుడు. శ్రీరాముడు గుహుని పడవను ఎక్కు సమయంలో గుహునికి అహల్యా శాపవిమోచనం గుర్తుకు వచ్చింది. అపుడు శ్రీరాముని పాదాలు, కాళ్ళు కడిగాడు. ఈ అంశం తెలుగు రామాయణంలో మరెక్కడా కనిపించదు.

సుడిగొని రామపాదములు సోకిన ధూళి వహించి రాయి యే
దొడనొక కాంతయయ్యెనట పనుగనాతని పాదరేణు వి
య్యెడ వడి నోడసోక నిదియేమగునోయని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపద కంజ యుగంబు భయమ్ము పెంపునన్ (అయో.32)

ఈ అంశం సంస్కృత ఆధ్యాత్మిక రామాయణంలో ఉంది. అందులో గుహుడు ఇలా అంటాడు.

క్షాళయామి తన పాదపంకజం - నాద దారుదృషదో; కిమంతరం
మానుషీకరణ చూర్ణ మస్తితే - పాదయోరితి కథా ప్రధీయసి
పాదాంబుజంతే విలయం హికృత్యా - పాశ్చాత్పరం తీర మహనయావిన
నోచేత్తరీ సద్యువతీ మలేన - స్యాచ్ఛేద్విబోవిద్దిథ కుటుంబ హాని (ఆధా.రా. బాల.6-3)

గుహుడు శ్రీరాముని భక్తుడు. శ్రీరామచంద్రుని దర్శించాలని ఎంతో కాలంగా వేచి ఉన్నాడు. ఆ

శుభతరుణం రానే వచ్చింది. తన ఆరాధ్య దైవాన్ని పడవలో గంగానదిని దాటించాలి. అంతకు ముందే అహల్య శాప విమోచనం గురించి విన్నాడు. ఇప్పుడు శ్రీరామచంద్రుడు తన పడవలో కాలు మోపితే తన పడవ కూడా స్త్రీగా మారితే - ఎలా? తన జీవనానికి ఆ పడవే ఆధారం కనుక తన భయాన్ని, ఇంకోవైపు సందేహం. ఇలా గుహుని మానసిక స్థితిని ఎంతో చక్కగా వర్ణించింది మొల్ల.

**ముగింపు :**

మొల్ల రామాయణం ప్రబంధయుగానికి సంబంధించిన రచన. ఈ యుగంలో సుదీర్ఘ కథనానికి అవకాశం ఉన్న పురాణేతిహాసాల రచన ఓనుకబడిందనే చెప్పాలి. ఆ పురాణేతిహాసం నుండి ఒక చిన్న కథను తీసుకొని వర్ణనలతో పెంచి రసోచితంగా తీర్చిదిద్దే ప్రపంధాలు వచ్చాయి. మరోప్రక్క స్థల మాహాత్మ్యాలను వర్ణించే శ్రీకాళహస్తి మాహాత్మ్యం, పాండురంగ మాహాత్మ్యం వంటి కావ్యాలు వచ్చాయి. వీటి నడుమ సుదీర్ఘమైన రామాయణ కథలను లఘుకావ్యంగా రచించిన అయ్యల రాజు రామభద్రుని రామాభ్యుదయం వచ్చింది. వల్ల రామాయణం వచ్చింది. ఈవిధంగా మొల్ల రామాయణం ప్రబంధ యుగంలో వచ్చిన ఒక విశేష కావ్యంగా పరిగణించవచ్చును.

మూలకథను సూటిగా చెప్తూ రసానుకూలమైన శైలిలోను, పాత్రోచితమైన సంభాషణలతోనూ, సందర్భానికి తగిన వర్ణనలతోనూ, లలితమైన భావాల తోనూ, చక్కని దేశీయ పదాలతోనూ, పఠితలకు ఆనందాన్ని కలిగించే కావ్యం మొల్ల రామాయణం. ఒక భక్తురాలైన స్త్రీ రచించిన కావ్యం అని అడుగడుగునా చదువరులకు అనిపించే విధంగా సుకుమారమైన రచనా సంవిధానంతో అలరారే కావ్యం మొల్ల రామాయణం.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర విదుషీమణులు, ఆంధ్ర శేషగిరిరావు, ఆంధ్రభూమి బుక్కు డిపో, విశాఖపట్నం, సెప్టెంబరు, 1995.
2. మొల్ల రామాయణము, ఆతుకూరి మొల్ల.
3. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం), డా॥ జి. నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, 1996.
4. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, (రెండవ సంపుటం), ఆరుద్ర, తెలుగు అకాడమి, హైద్రాబాద్, 2005.

# రాయలసీమ కథ - శ్రామిక మహిళ

**- తమ్మిశెట్టి వెంకటనారాయణ,** జిల్లా పరిషత్ హైస్కూల్, రాయచోటి, కడప జిల్లా.

నేటి రాయలసీమను ఒకప్పుడు దత్తమండలాలుగా పిలిచేవారు. దత్తమండలాలుగా ఉన్న ప్రాంతానికి సరిహద్దుల్లో మార్పు చేసి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో కలిపి రాయలసీమ అని నామకరణం చేయడం జరిగింది. ఈ నేపథ్యానికి చిలుకూరి నారాయణరావుతోపాటు మరికొంతమంది మేధావుల కృషి కూడా ఉంది. ఈ రాయలసీమగా పిలవబడుతున్న ప్రాంతం నాలుగు వందల సంవత్సరాల క్రితం వర్తక వ్యాపారాలలో కీలకప్రాంతంగా చరిత్రలో గుర్తించబడి, అమోఘ కీర్తి ప్రతిష్టలు సంపాదించుకుంది.

అంతేకాకుండా రాయలసీమకు ఒక ప్రత్యేకమైన సామాజిక, సాంస్కృతిక, సాహిత్యచరిత్ర (క్రీ.శ. 575 రేనాటి చోళల శాసనం - కలమల్ల శాసనం) ఉంది. భాషలో ప్రత్యేకమైన మాండలికం ఉంది. రాయలసీమ వాసుల భాష, యాస, మాటతీరు, స్వభావ, వ్యవహారాల్లో, ఆర్థిక అంశాలలో ఇతర ప్రాంతాలకన్న భిన్నంగా ఉండటానికి కారణం చారిత్రక భౌగోళిక సాంస్కృతిక పరిస్థితులు కావచ్చు. వీటిని ఆ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, ఆర్థికాంశాలు నిర్ధారిస్తాయి. ఇవి ప్రాంత ప్రాంతానికి భిన్నంగా ఉంటాయి.

రాయలసీమ ప్రాంత ప్రజల జీవన శైలిలో వ్యవహార సరళిలో మొరటుతనం అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. ఇక్కడ వ్యవసాయం కూడా వర్షాధారితమైనది. ఒక ప్రాంతపు ప్రజల జీవితం బండబారి మొరటుదేలినపుడు వాళ్ళ భాష, యాస, కరుకుదనం మొదలైనవన్నీ అట్లానే ఉంటాయి.

అయితే రాయలసీమ వాసులు మంచితనానికి మారుపేరు. నమ్మిన వ్యక్తుల కోసం ఎంతటి తెగింపుకైనా వెనుకాడరు. ఈ తెగింపు వీరి కుటుంబాలకోసం కంటే నమ్మిన వ్యక్తుల కోసమే ఎక్కువ చేస్తారు. ఈ తెగింపు ముఖ్యంగ అట్టడుగు కులాలుగా పేర్కొంటున్న (ముద్రబడిన) వారిలో మెండుగా ఉంటాయి. ఉన్నత వర్గం వారు వీరిని రాజకీయక్రీడల్లో పావులుగా వాడుకుంటున్నారు. ఈ విషయాన్ని వీరు గ్రహించలేక పోతున్నారు. అందుకుగల కారణం, ఆర్థికంగా, సామాజికంగా, కులపరంగా, ఆధిపత్యపరంగా అన్నింటిలో వెనుకబడి ఉండటం మరియు అవకాశాలు అంది పుచ్చుకునే అవకాశాలు, పలుకుబడి లేకపోవడమే.

వీరు చేసే తెగింపు, పట్టుదల వీరి కోసమో, వీరి కుటుంబాల కోసమో, వీరి కులవర్గం కోసమో, వీరి ఆత్మగౌరవం కోసం, సమసమాజం కోసం చేయడం లేదు. చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. వీరు నమ్మిన వ్యక్తుల కోసం ప్రాణాలకు సైతం తెగిస్తారు. నిజంగా వీరి హితాన్ని కోరేది ఎవరూ ఉండరు. అందరూ నటించేవాళ్ళే. సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం కావున వీరి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంఘిక మొదలగు స్థితిగతుల్ని కథ, నవల, నాటకం మొదలైన సాహిత్య ప్రక్రియల ద్వారా సమకాలిన సమాజం ముందుంచి దిశానిర్దేశాలు చేస్తూ సమాజాన్ని మేల్కొలిపి, చైతన్య వంతుల్ని చేస్తూంది. సాహిత్య ప్రక్రియలన్నింటిలోకెల్ల కథకు ఒక ప్రముఖమైన స్థానం ఉంది. కథ మనిషిని ఆలోచింపచేస్తుంది. తెలుగు సాహిత్యంలోని కథలు వివిధ అంశాలను వివిధ కోణాల్లో ప్రతిబింబింప చేసింది, చేస్తూ ఉన్నది. కథల్లో ఆ ప్రాంతప్రజల జీవన స్థితిగతుల్ని కూడా తెలియజేస్తుంది.

ముఖ్యంగా రాయలసీమ కథా సాహిత్యంలో శ్రామిక స్త్రీ కుటుంబాల స్థితి గురించి ప్రత్యేకంగా చెప్పవల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే చెప్పక తప్పదు. ఎందుకంటే జనాభలో సగం మంది స్త్రీలు అయితే ఆ స్త్రీలల్లో

తొంభైశాతం మంది శ్రామికస్త్రీలే ఉన్నారు. వీరి స్థితిగతులే దుర్భరంగా ఉండాయనటంలో సందేహం లేదు. అందులో దళిత, సంచార, మైనార్టీ స్త్రీల స్థితి గురించి ఆలోచిస్తే మనస్సు కలిచివేస్తుంది. ఆ స్థితిని భరించే ఆ స్త్రీల సంగతి ఎంత వేదనాపూరితంగా ఉంటుందో? ఆ స్త్రీల సంగతి ఏంటి? జీవచ్ఛావాల జీవితం అనక తప్పదని నా అభిప్రాయం.

రాయలసీమ సాహిత్యం రావడం కొద్దిగా ఆలస్యంగా వచ్చి ఉండవచ్చు కాని చాలా మంది కథా రచయితలు, రచయిత్రులు రాయలసీమలో గలరు. వారి ప్రస్థానం కంటే ముఖ్యంగా వారి రచనలు గురించి, అందులోని ఆర్ద్రత, చైతన్యం, అట్టడుగు ప్రజలపట్ల, ఈ ప్రాంతపు స్త్రీల స్థితిగతుల పట్ల వారి దృక్పథం ముఖ్యం. వారి దృష్టికోణం ఎలా ఉందో చెప్పవల్సిన ఆవశ్యకత ముఖ్యం.

రాయలసీమ కథల్ని కొన్నిటిని పరిశీలించినట్లయితే శ్రామికస్త్రీల స్థితి గురించి స్పందించి రాసినవి కొద్దిమంది మాత్రమే అనక తప్పదు. రాయలసీమలో కరువు, కక్షలు, హత్యలు, ఆత్మహత్యలు తరచూ చూస్తూ ఉంటూ ఉంటాం. వాటి దుష్ఫలితాలను అనుభవించేది, ఒడుదుడుకులను ఎదుర్కొనేది ఆ కుటుంబంలోని స్త్రీలే. ఇబ్బంది పడేది, అభం, శుభం తెలియని పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు.

ఒకవైపు రాయలసీమ ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకున్నపుడు రైతు ఆత్మహత్యలు, మరొకవైపు కక్షలకు పునాదివేసే అగ్రకుల రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో గానీ, ఫ్యాక్షన్ కోరల్లో ఇరుక్కుని హత్య చేయడం, హత్యకాబడడమో వీటి మధ్య పురుషుని/భర్త జీవితం ముగిస్తే, బాధలు, అవమానాలు, నిందలు, పురుషాధిక్య సమాజ విషపుదృష్టితో మాడిపోయేది స్త్రీలే.

"గాజుకళ్ళు" కథ సంకలనంలోని 'కాటేసిన కరువు' కథలో వరుస కరువులు రావడంతో వ్యవసాయిక సంక్షోభాన్ని దాని పర్యవసానం తత్ఫలితంగా గ్రామీణ స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన మార్పులూ స్త్రీలే కాదు పురుషులపై కూడా ప్రభావం అధికంగానే ఉంటుంది. కుటుంబ భారాన్ని మోయడానికి పనులకోసం పట్నం వలస పోయిన నాగప్ప, అక్కడ ఆకలి తీర్చుకునేందుకు దొంగతనం చేయడంవల్ల జైలు శిక్ష పడుతుంది. అనంతరం సొంత వూరికి వచ్చినపుడు అతనికి వూళ్ళో పిల్లల్లు, ముసలివారు తప్ప ఎవ్వరూ కనిపించరు. ఊల్లో కుటుంబాలు కరువు వల్ల వలసపోయిన దృశ్యాలను, దాని పర్యవసానాన్ని కళ్ళకు కట్టినట్లు రచయిత్రి జి. నిర్మాలారాణి చిత్రిస్తుంది. "రచయిత్రి ఒకానొక సందర్భంలో కన్నబిడ్డల దగ్గర కాపలాగా కన్నతల్లిదండ్రుల్ని పెట్టి వలసపోయారంటారు.

"ఒకప్పుడు పల్లెల్లో ఎంతో ప్రేమగా కన్నతల్లిదండ్రులు తన బిడ్డలకు, బతిమలాడి బతిమలాడి ఆప్యాయంగా కొసరి కొసరి గోరుముద్దలు తినిపించే స్థానం తల్లిది. కరువు వల్ల ఆకలి ఆకలి, తిండి తిండి అని ఏడిచే బిడ్డలతో, నన్ను చంపకు తినండిరా" (పుట 34, గాజు కళ్ళు) అంటూ పిల్లల్ని కొట్టి తాను ఏడ్చే నిస్సాయక స్థితిలో ఉన్న తల్లి కూడా కనిపిస్తుంది. దుడ్లు కాదు వంటినిండా రోగాలు కూడా వచ్చాయి. ఆ రోగాలాకు, రొచ్చులకే వచ్చి దుడ్లన్ని అయిపోయినాయి చూడు అనే తల్లి కూడా కని పిస్తుంది.

వాళ్ళ కోరిక తీర్చలేదని ఎట్లా వాతలు పెట్టినారో చూడమ్మా! వాళ్ళు మనషులు కాదమ్మా! రాక్షసులు. మనుషులను పీక్కుతినే దెయ్యాలు. గిరాకితో సరిగ్గా నడుచుకోలేదని యజమానురాలు చావగొడుతోంది, యాడికైనా పారిపోతా, ఇంత విషంతాగి సచ్చిపోదాం అనే వేదానభరితమైన ఓ చెల్లి వినిస్తాయి (మాటలు ఇంట్లోకి పోతున్న నాగప్ప చెవిలో పడ్డాయి). కన్న కూతుర్ని కడుపు నింపుకోవడం కోసం వ్యభిచార గృహానికి తరలించడం ఒక ఎత్తైతే, ఇచ్చిన 500 దుడ్లు కూటికి సరిపోయా, కూతురు పోనంటుంది అని కూతురు స్థానంలో తల్లి వెళ్ళడానికి సిద్ధమయ్యే సన్నివేశాలు కనిపిస్తాయి.

కరువు తీవ్రతను చెప్పడానికి ఇంతకన్నా మించిన ప్రమాణం ఉంటుందా? ఆకలి మనుష్యులచేత ఎంతటి

పనినైనా చేయిస్తుందనే కఠిన వాస్తవం. ఆర్థిక దుస్థితి, నైతిక విలువల విధ్వంసం, మనుష్యుల మధ్య సహజంగా ఉండే మానవీయ స్పర్శ సెంటిమెంట్లపై కూడా కరువు ప్రభావం ఎలా ఉంటుందో నిర్మలా రాణి ఈ కథలో ప్రతిబింబింపచేసింది. ఈ కథలో స్త్రీయొక్క శారీరక మానసిక వేదనకు కారణం, పక్షవాతంతో మంచంపట్టిన తండ్రి పోషణ, మరొక పక్క కుటుంబ బారాన్ని మోయడా నికి పడే తపన కనిపిస్తుంది.

ఆర్. శశికళ రాసిన “డ్రాపవుట్” కథ కూడా ఇంచు మించుగా ఈ కథనే పోలివుంది. ఈ కథలో పాఠశాల చదువు నుండే డ్రాపవుట్ కావడమే కాదు చక్కని జీవితం నుండే ఆడపిల్లలు డ్రాపవుట్ అవుతున్నట్లు కనిపిస్తుంది. ఈమె రాసిన మరొక కథ “అనంతగాయం” కథలో కూడా ఎయిడ్స్ వ్యాధివలన కుప్పకూలి పోతున్న స్త్రీ జీవితాలను గురించీ, స్త్రీల యొక్క సమస్యాత్మక, సంక్షోభిత జీవితా లనూ, మానవీయ విలువల విధ్వంసాన్ని తెలియ జేస్తున్నది. వీటికి కరువు మూలకారణంగా కనిపిస్తున్నది.

బత్తుల ప్రసాద్ గారు రాసిన “నెత్తురు మరకలు” కథ రాయలసీమ దళితుల స్థితిగతుల్ని తెలియజేస్తుంది. దళిత కుటుంబాలలోని దారిద్ర్యం కొట్టుమిట్టాడుతూ ఉన్నట్లు, ఆపైన కరువు వల్ల ఇంకా హీనంగా కనిపిస్తారు. ఒకవైపు శ్రమ దోపిడికి గురవుతున్నట్లూ, చిన్నపిల్లల కాళ్ళకు చెప్పులు కొనివ్వడానికి కూడా స్తోమతలేని తల్లులు, చినిగిపోయిన కుట్టు వేయడానికి కూడా పనికిరాని జాకెట్టుతో జీవనం సాగిస్తున్న దళితస్త్రీలు, వారి పిల్లలు ఎంత దయనీయ స్థితిలో ఉన్నారో రచయిత సూచించాడు. అంతేకాకుండా వయస్సు మళ్ళినప్పుడు కూడా కూలిపనులు చేసి కుటుంబానికి స్త్రీలు సాయ పడతారని చెప్పడం వంటి విషయాల్ని గమనిస్తే ఇక్కడి గ్రామీణ దళిత శ్రామికస్త్రీ స్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం అవుతున్నది.

కరువు నేపథ్యంలో చిలుకూరు దీవిన రాసిన ‘విషమ సంధ్య’ కథలో గీత చదువులో ఎంతో ముందున్ననూ, కరువు వల్ల పంటచేతికి రాక అప్పులు తీర్చలేక గీత తండ్రి ఆత్మహత్య చేసుకుంటే ఒక మోస్తరుగా జీవిస్తున్న గీత కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. చివరకు గీత వ్యయ సాయ కూలీగా జీవితాన్ని వెళ్లబుచ్చాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఈ కథను బట్టి కుటుంబంలో ఆర్థికంగా ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా వాటి దుష్ఫలితాలను అనుభవించే వారిలో ఆడపిల్లలు, స్త్రీలే అనుటకు ఈ కథే నిదర్శనం.

మైనం బొమ్మలు, ఆయమ్మిలేదు అనే కథల ద్వారా సీమలో బతుకుతెరువులేక, ఉన్న భూమికి కావల్సిన నీటిసౌకర్యం లేక దుర్భరమైన జీవితం గడుపుతున్న తాండా కుటుంబ స్థితిగతుల్ని వ్యక్తీకరించారు. అందులో ముఖ్యంగా సుగాలి తండాల్లోని, 16 సంవత్సరాల వయస్సు కూడా నిండని బాలికల్ని బొంబాయి, పూనా పట్టణ వ్యభిచార గృహాలకు అమ్ముకునే తల్లిదండ్రులు కనిపిస్తారు. భర్త తాగుడుకు బానిస కావడం, పొట్టకూటి కోసం అమ్ముకుంటున్న సందర్భంలో తొమ్మిది నెలలు మోసి పెంచిన తల్లి వేదనకు కొలమానం ఉండదు. కూతురు రోగం రొప్పులతో ఇల్లు చేరినపుడు గుండెలు బాదుకునేది కూడా (స్త్రీ) తల్లియే. ఈ విధంగా వేదనా భరితమైన గిరిజన మహిళ జీవన చిత్రణను ఈ కథల్లో సాక్షాత్కరింపచేశాడు రచయిత వేంపల్లి గంగాధర్.

పాలగిరి విశ్వప్రసాద్ గారు రాసిన ‘చెప్పుకింద పూలు’ కథలో ఉన్నతవర్గంలో ఉన్న ఒక పెద్దమనిషి ఇంట్లో జీతగాళ్ళుగా రంగి, అంకమ్మ, మొదలగు కుటుంబ సభ్యులందరూ చాకిరి చేస్తూ జీవనం సాగిస్తారు. ఒకానొక రోజు ఆ ఇంటిలో జీతగాని చెల్లి, యుక్తవస్సులో ఉన్న, పెళ్ళీడు ఉన్న రంగిపై కన్ను వేస్తాడు యజమాని. అందుకు ఆమె (రంగి) తిరస్కరించడంతో జీతగాని ఇంట్లో వారిలో వారే కుటుంబ తగాదాలు పెట్టి చివరకు రంగిని చిక్కుల్లో పడేస్తాడు. ఈ విధంగా అగ్రవర్ణాల వాళ్ళు దళిత శ్రామిక మహిళలపై మానసిక శారీరక దాడులు చేస్తున్నారు. అయిననూ వాటిని అనుభవిస్తూ

జీవనం సాగిస్తున్నారనే విషయాన్ని వ్యక్తీకరిస్తున్నాడు రచయిత. అంటే ఆత్మాభిమానం చంపుకొని, ముందు నుయ్యి, వెనుక గొయ్యి లా జీవనం సాగిస్తున్నారు శ్రామిక దళితస్త్రీలు.

'పొగబండి నేస్తం' కథ సంకలనంలోని "ఇది కథకాదు అనే పేరుతో రాయలసీమ కరువు నేపథ్యంగా వచ్చిన కథ. ఇందులో మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీకి జరిగిన అవమానాలు కనిపిస్తాయి. కరువు కాటకాల వల్ల పంట చేతికి రాక రైతు అప్పుతీర్చలేకపోవడం వల్ల అప్పులిచ్చిన భూస్వామి

అప్పు తీసుకునేది కాదు రా బాకీ తీర్చేకి రోసముండాల
మాట అనిపిచ్చుకోకూడదంటే పెండ్లాన్ని యాడన్న
పండపెట్టి బాకీ కట్టల్లారా నాకొడకా!

(పొగబండి నేస్తం, పుట 126)

అన్న మాటలకు రైతు నిస్సహాయ స్థితిలో ఆత్మమత్య చేసుకుంటాడు. అనంతరం భార్య, కూతురు భూస్వామి దౌర్జన్యానికి లొంగిపోయి అతని పడగనీడలోకి చేరుతారు. ఇలా ఇష్టా యిఅష్టాలతో సంబంధంలేకుండా, కరువు కాటకాలవల్ల, కుటుంబ ఆదరనను కోల్పోయి కుటుంబ భారాన్ని మోయడానికి, తన మాన ప్రాణాల్ని తాకట్టు పెట్టేదీ, ఆ బాధల్ని అనుభవించేదీ స్త్రీలే అనే విషయం స్పష్టంగా కనిపిస్తుంది. కరువుకాటుకు స్త్రీల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నట్లు, మనిషిలోని విలువలు పతనం అవుతున్నట్లు తెలుస్తున్నది. ఇక నిరుపేదస్త్రీల పౌరుషం, ఆత్మగౌరవం అన్ని కూడా ఆకలి, కరువు ముందు దిగ దులుపే అన్నది కఠోర సత్యం.

ఆచార్య పి. నరసింహారెడ్డి గారు రాసిన "అబల" కథలో తాగుబోతు భర్త గంగడు పెట్టే కష్టాల్ని భరించలేక భార్య ఎంకి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధబడుతుంది. చివరకు బిడ్డలు దిక్కులేనివారవుతారని తనకు తానుగా మనోధైర్యం తెచ్చికుని తన పని చేసుకుంటూ వ్యవసాయ పనులకు కలుపు పనులకు వెళ్ళి తన కిష్టమైన బట్టలు కొనుక్కోవడంతో పాటు, ఇంటిల్లిపాదికి కూడా అంటే ఇక్కడ స్వయం కృషితో తన భర్త బాధ్యతరాహిత్యంగా ఉన్నప్పటికీ తన కుటుంబ గౌరవం కోసం పట్టుదలగా పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నది స్త్రీ అనే విషయం నొక్కి వక్కానిస్తున్నాడు రచయిత.

పై విధంగా కరువు వచ్చిన, కర్మ వచ్చిన, భర్త బాధ్యతా రాహిత్యంగా ఉండిన, ప్రవర్తించిన బలైపోతున్నది స్త్రీ జీవితమే. భర్తను కోల్పోయిన స్త్రీలపట్ల సమాజం, సొంతబంధులు రాబంధులై ప్రవర్తించే తీరును చక్రవేణు రాసిన "కువైట్ సావిత్రమ్మ" కథ తెలియజేస్తుంది.

ముస్లింస్త్రీలు మామూలుగా స్త్రీలందరూ ఎదుర్కుం టున్న పురుషాధిపత్యంతో పాటుగా అధనంగా మతాచారా లను, మూఢవిశ్వాసాల బారాన్ని కూడా మోస్తున్నారు. ముస్లిం స్త్రీలు జీవితాలు హిందూ ఇతర మత స్త్రీ జీవితాల స్త్రీల కంటే దుర్భరంగా ఉంటాయనడానికి సత్యాగ్ని రాసిన పాచికలు కథ, సంపుటి, వేంపల్లి షరీఫ్ రాసిన ఫర్దా, తురకోని సేద్యం, ఇబ్రహీం, ఖలందర్ వంటి రచయితల కథా రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ఇందులో రజాక్ మియా సేద్యం (తురకోని సేద్యం) కథలో ముస్లిం శ్రామిక స్త్రీ జీవితం కనిపిస్తుంది.

రాయలసీమ కథా సాహిత్యంలోని శ్రామిక స్త్రీలు కనీసం ఆత్మగౌరవం, కనీస వసతి సౌకర్యాల్ని పొందే స్థాయిలో కూడా ఎనభైశాతం స్త్రీలు లేరనే చెప్పవచ్చు. వీళ్ళకు కూడా వారి వారి సామర్థ్యాలకు తగిన పని కల్పించి, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఇచ్చి, తగు విద్యా అవకాశాలు అందించినట్లయితే ఇల్లాలు చదువు ఇంటికి వెలుగులా అవుతారు. తద్వారా తమ గురించి తాము తెలుసుకొని, కుటుంబంపట్ల, సమాజంపట్ల, ప్రస్తుత పరిస్థితులపట్ల అవగాహణ కల్గి తమకు అంద వల్సిన, అవసరమగు సదుపాయాల్ని, హక్కుల్ని అడగగల్గే స్థాయికీ చేరతారు. తిరుగుబాటు ధోరణితో తమకు తామే ఒక శక్తిగా ఎదుగుతారు. చీకటిలో కూర్చొని చీకటిని నిందంచడం కంటే చిరుదీపం వెలిగిచాలనే ఆలోచన

వచ్చేందుకు అవకాశం ఉంటుంది. తమ హక్కులు సాధించుకొనే స్థాయికి వచ్చి, మోసపూరితమైన కుట్రల, కుతంత్రాల నుండి బయటపడతారు. అప్పుడే సామాన్య శ్రామికస్త్రీకి మేలు కల్గుతుంది.

## ఆధార గ్రంథాలు

1. సీమకథ అస్తిత్వం - శ్రీదేవి కిన్నెర
2. రాయలసీమ సాహిత్యం - శశిశ్రీ
3. డ్రాపవుట్ (కథ) - ఆర్. శశికళ
4. పాచికలు (కథాసంపుటి) - సత్యాగ్ని షేక్
5. వల్లంపాటి కథలు - వెంకటసుబ్బయ్య వల్లంపాటి
6. చెప్పు క్రింద పూలు (కథాసంపుటి) - విశ్వప్రసాద్ పాలగిరి
7. గాజుకళ్ళు (కథాసంపుటి) - జి. నిర్మలారాణి
8. జుమ్మా (కథల సంపుటి) - షరీఫ్ వేంపల్లి

❀❀❀

# విషాద మాధవి పద్యకావ్యం - స్త్రీ వాదం

- తంగి ఓగేశ్వరరావు, తెలుగు అధ్యాపకులు, వి.వి.గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప.

కరణం బాసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు ఫిబ్రవరి 1, 1936 న చిత్తూరు జిల్లా తలుపులపల్లెలో జన్మించారు. ఇతని తల్లిదండ్రులు కృష్ణమ్మ, కుమారస్వామి పిళ్ళై. ఉన్నత పాఠశాల విద్య మదనపల్లి, పలమనేరుల్లోనూ, పి.యూ.సి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి, భాషా ప్రవీణ ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పొందారు. చిత్తూరు జిల్లాలోని అనేక ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేసి 1994లో కలిచెర్ల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేశారు. పదవీవిరమణ అనంతరం మదనపల్లెలో స్థిరపడ్డారు. అచేతన స్థితిలో ఉన్న మదనపల్లె రచయితల సంఘంలో తిరిగి చైతన్యం నింపారు. తెలుగు సాహిత్యంలో పద్యం, నవల, కథ, వ్యాసం, నాటకం మొదలైన అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు. తెలుగులో ఇతని మొదటి రచన 'విషాద మాధవి'. ఇది పద్యకావ్యం.

మహాభారతంలోని ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నందు మాధవి, గాలవుల వృత్తాంతం ప్రస్తావించబడింది. శ్రీకృష్ణరాయబారం సందర్భంలో శ్రీకృష్ణుడు కురువంశ క్షేమంగా కలకాలం ఉండాలంటే పాండవుల రాజ్యభాగం వారికిమ్మని చెబుతాడు. అతని మాటలను దుర్యోధనుడు వినిపించుకోడు. అప్పుడు నారద మహర్షి

ఆ.వె. "ఇదియకాని చేయ నెద్ది యే ననుచు
నిర్బంధ వృత్తిఁ దలఁపు వట్టికొనిన
నట్టి వాని కెందు నలజడి వాటిల్లు
గాలవుండు గుఱియ కాఁడె మనకు ?"

అని దుర్యోధనునికి గాలవుని వృత్తాంతాన్ని వివరిస్తాడు.

మహాభారతంలో ఇది ఒక చిన్న కథ. సమస్త మానవ జాతి సిగ్గుతో తలవంచుకోవలసిన పెద్ద కథ. విశ్వామిత్రుడు తన శిష్యుడైన గాలవునితో ఒక చెవి నీలంగానూ, మిగతా శరీరమంతా తెల్లగానూ ఉండే ఎనిమిది వందల గుఱ్ఱాలను గురు దక్షిణగా ఇమ్మంటాడు. ఆ గుఱ్ఱాల కోసం గాలవుడు ప్రతిష్ఠాన పురాధీశ్వరుడైన యయాతిని ఆశ్రయిస్తాడు. ఆ రాజు 'నా దగ్గర అలాంటి గుఱ్ఱాలు లేవు. నా కుమార్తెను ఇస్తాను. అలాంటి గుఱ్ఱాలు ఎవరి వద్ద ఉంటే వాళ్ళకు ఈమె నిచ్చి గుఱ్ఱాలను తీసుకో' అని గాలవునిలో తన కుమార్తె అయిన మాధవిని పంపిస్తాడు. ప్రపంచంలో అయోధ్య రాజైన ఇక్ష్వాకుడు, కాశీరాజైన దివోదాసు మరియు భోజరాజు ఔశీనరుల వద్ద మాత్రమే ఇటువంటి గుఱ్ఱాలు ఉంటాయి. అది కూడా ఒక్కొక్కరి దగ్గర రెండు వందలు మాత్రమే ఉంటాయి. గాలవుడు ఒక్కొక్క రాజు దగ్గరకు వెళ్తాడు. వాళ్ళు తమ గుఱ్ఱాలకు ప్రతిఫలంగా మాధవి వలన ఒక్కొక్క కొడుకును పొంది గుఱ్ఱాలనూ, ఆమెనూ గాలవునికి ఇచ్చివేస్తారు. గాలవుడు వాటిని తీసుకెళ్ళి గురువుకు అర్పించి 'మిగతా రెండు వందల గుఱ్ఱాలకు బదులుగా మీరు కూడా ఈమె వలన ఒక కొడుకును పొంది చెల్లు చేసుకోండి' అని చెప్పి, మాధవిని గురువుకు అర్పించి వెళ్ళిపోతాడు. గురువు అలాగే చేసి ఆమెను వదిలివేస్తాడు. ఆమె ఒంటరిదై అడవికి వెళ్ళిపోతుంది. ఈవిధంగా చరిత్ర హీనురాలైపోయిన ఆమె మనోవేదననే రచయిత 'విషాద మాధవి' అనే పేరుతో పద్యకావ్యంగా రాశారు.

"ఒక స్త్రీని పురుషుడు ఈవిధంగా కూడా ఉపయోగించుకోవచ్చు నన్న ఊహ భారత కథా రచయితలకు - ప్రాయశః వేద వ్యాసుల వారికి రావడం ఆశ్యర్యంగానూ, జుగుస్సాకరంగానూ, తోచింది.'నా నృషిః కురుతే కావ్యం' అంటే ఇదేనా అనిపించింది. వేద వ్యాసుల వారు ఈ కథ వ్రాశారంటే అది అంత తేలికగా తీసివేయవలసిన విషయం

కాదు. ఆ కాలంలో స్త్రీలను ఈ విధంగా ఉపయోగించు కునే అలవాటు - లేదా అవకాశం-ఉండేదని బుజు వవుతూ ఉంది'' అని భావించి మాధవి యొక్క విషాద గాథను సమాజం ముందుంచాలిని తలచి ఈ 'విషాద మాధవి' అనే పద్య కావ్యాన్ని వ్రాసినట్లు పిళ్ళైగారు పేర్కొన్నారు.

పురుషాహంకారం వెర్రితలలు వేసిన ఈ కథను బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై గారు ఛందోబద్ధమైన కావ్యంగా మలిచారు. ఈ కావ్యంలో మాధవి తన దయనీయ గాథను తానే చెబుతుంది. మహారాజులు, మహార్షులు తన శరీరం మీద, మనసు మీద చేసిన గాయాలను తానే చూపు తుంది.

వేదకాలం నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభలలో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉండేది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞ యాగాది క్రతువులలో పాల్గొనేవారు. స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యాహక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20మంది మహిళా మేధావుల ప్రస్తావన ఋగ్వేదంలో కనిపిస్తుంది. ఆనాటి సమాజంలో బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలు ఉన్నట్లు ఆధారాలు లేవు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు జీవితాంతం వివాహం లేకుండా తమ జీవితాలను విద్యార్జనకే అంకితం చేశారు. ఋగ్వేదంలో చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉప నిషత్తులో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్త్విక చర్చల ప్రస్తావన ఉంది. ఈ విధంగా వేదకాలంలో అన్ని విషయాలలో పురుషునితో సమానంగా ఉన్న స్త్రీల స్థాయి భారత కాలానికి చాలా వరకు దిగ జారినట్లు, వారు పురుషాధిపత్యానికి తలొగ్గినట్లు భారతం లోని మాధవి వృత్తాంతం వల్ల తెలుస్తుంది.

గాలవుడు, విశ్వామిత్ర మహర్షి గురుదక్షిణగా కోరిన గుర్రాల కోసం యయాతి మహారాజును ఆశ్రయిస్తాడు. యయాతి మహారాజు కన్నకూతురని కూడా చూడకుండ మాధవిని గాలవునికి ఇచ్చివేస్తాడు. ఈ చర్యను బాల సుబ్రహ్మణ్యం పిళ్ళైగారు.

తే. ''ఇంటి యందున్న బొమ్మనా యిచ్చివేయ
కొట్టముందున్న పశువునా పట్టియీయ
పొలమునందున్న చెట్టునా ముట్టజెప్ప
కన్నకూతు నెట్లిచ్చును కన్నతండ్రి''

అని ప్రశ్నించారు. ఈ సందర్భంలో స్త్రీల సంక్షేమాన్ని కాంక్షించే సంఘసంస్కర్తగా కరణంవారు దర్శనమిస్తారు.

ప్రస్తుత సమాజంలో కూడా స్త్రీ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా తండ్రే ఆమె విద్యా, వివాహాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం చూస్తున్నాం. వివాహానికి ముందు తండ్రి చెప్పినట్లు, వివాహానంతరం భర్త చెప్పినట్లు నడుచుకోవడమే తప్ప సొంతగా ఆలోచించే అవకాశం స్త్రీకి లేకుండా చేసింది ఈ పురుషాధిపత్య సమాజం.

తే. ''మాన్యమంగళ మధుర సంసార కాంక్ష
వనితలెల్ల కలల్ కనవచ్చుగాక
స్త్రీల భాగ్యము పురుషాధీన మగుట
కలలు కల్లలై తుదకు దుఃఖమే మిగుల్చు''

అని పురుషాధిపత్య భావజాలంతో కూడిన సమాజంలో స్త్రీల కోరికలకు ఉన్న విలువను బాల సుబ్రహ్మణ్యం పిళ్ళైగారు మాధవి ముఖంగా వెల్లడించారు.

మాధవిని దానం ఇచ్చే సమయంలో మాధవి తండ్రి మాధవి అభిప్రాయమే కాదు ఆమె తల్లి అభిప్రాయం కూడా తీసుకోడు. మాధవి తల్లి కూతురుకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్ళార చూసి దుఃఖిస్తుందే కానీ 'ఇలా చేయడం నాకు ఇష్టం లేదు' అని చెప్పలేకపోతుంది. ఒక వేళ ఆమె అడ్డుపడినా ''పూరుషోద్ధతికి నడ్డమె యీ యబలా విలాపముల్'' అని బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు

పురుషాధిపత్య సమాజంలో స్త్రీ స్థానాన్ని, దుస్థితిని వెల్లడించారు.

మాధవిని దానంగా పొందిన గాలవుడు ఏమాత్రం సంకోచం లేకుండా ఆమెను ముగ్గురు రాజులు, మహర్షి విశ్వామిత్రునికి అర్పిస్తాడు. వారు మాధవి శీలాన్ని రెండు వందల గుర్రాలతో విలువకట్టారు. ప్రతి ఒక్కరూ తమ కోరిక తీరిన తరువాత ఆమెను వెళ్ళగొట్టారు. ఇది అతి ఘోరం. మనిషిని మనిషిగా వారు గౌరవించలేదు. కనీసం వారిలో కారుణ్య భావం కూడా కలగలేదు. పైగా ఈ నికృష్ట దౌర్భాగ్య విధానాన్ని "శాస్త్ర సమ్మతమని యార్య సమ్మతమని వెనుక ముందు సమర్థించుకొనిరి వారు".

ఆధునిక కాలంలో కూడా కొందరు ప్రబుద్ధులు సతీసహగమనం, వితంతు పునర్వివాహాల నిషేదం, బాల్యవివాహాలు, కన్యాశుల్కం శాస్త్ర సమ్మతమని ప్రచారం చేశారు. అనేక మంది స్త్రీలు ఈ దురాచారాల క్రింద నలిగిపోయారు. కొందరు అసువులు బాశారు. పురుషాధిపత్య సమాజంలో ఏ సంప్రదాయమైన అంతిమ లబ్దిదారులు పురుషులే. చివరిగా నష్టపోయేది స్త్రీలే. కన్యాశుల్కాన్ని శాస్త్ర సమ్మతమని ప్రచారం చేసిన వారే తరువాత కాలంలో దానికి విరుద్ధమైన వరకట్న దురాచారాన్ని కూడా శాస్త్ర సమ్మతమని సమర్థించారు. ఈ విధంగా మాధవి జీవితాన్ని ఆధారంగా చేసుకొని కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు పురుషాధిపత్యాన్ని సమర్థించే శాస్త్రాలు, సంప్రదాయాల వెనుక ఉన్న దుర్మార్గాన్ని బహిర్గతం చేశారు.

బ్రాహ్మణుల కోరికలను తీర్చవలసిన బాధ్యత క్షత్రియులదనే సంప్రదాయముండగా ఆ మహారాజులు బ్రాహ్మణుడైన గాలవుడికి అతను కోరిన గుర్రాలు ఇవ్వకుండా మాధవి ద్వారా పుత్రుడిని పొందిన తర్వాతే ఇస్తామని చెబుతారు. పోని వారు రాజులు, వంశాభివృద్ధి కోసం అలా చేసి ఉండవచ్చు. కాని సర్వాంగ పరిత్యాగి, తపోధనుడైన విశ్వామిత్రుడు కూడా సామాన్య రాజుల మాదిరిగానే మాధవి వల్ల సంతానం కోరుకోవడం ఆశ్చర్యంతో పాటు దిగ్భ్రాంతిని కలిగిస్తుంది.

తే. "ఏ కులంబైన నెవ్వరి యింతియైన
పుత్రవతియైన వావి నభోగ్యయైన
తిరిపెముగ వచ్చు నాడుది దొరకెనేని
బమ్మకైనను బుట్టును రిమ్మతెగులు"

అని పురుషాధిపత్య సమాజంలో పురుషులు స్త్రీని చూసే విధానాన్ని బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు వెల్లడించారు.

స్త్రీల పట్ల పురుషుల దృక్పథంలో ఇప్పటికీ పెద్ద మార్పు రాలేదు. ఇప్పటికీ స్త్రీలను శరీర వాంఛలు తీర్చే ఆటబొమ్మలుగా భావించే పురుషులు అనేక మంది మన చుట్టూ సమాజంలో కనిపిస్తున్నారు. దీని ప్రతిఫలమే స్త్రీలపై అత్యాచారాలు, గృహహింస, మహిళల అక్రమ రవాణా, వేశ్యారికం ఇత్యాది సామాజిక రుగ్మతలు. వీటి నిర్మూలనకు ఆధునిక ప్రభుత్వాలు అనేక చట్టాలు చేసినా తరుచుగా నిర్భయ, దిశ మొదలైన సంఘటనలు జరుగుతునే ఉన్నాయి. స్త్రీలు తమ మాన ప్రాణాలను కొల్పోతూనే ఉన్నారు. ఇలా పురుషాధిపత్య భావజాలం క్రింద శరీరక మానసిక హింసకు గురైన స్త్రీలకు ప్రతిబింబమే 'విషాధ మాధవి' కావ్యంలో మాధవి.

మాధవి అంగీకారంతో పని లేకుండా, కనీసం ఆమె అభిప్రాయం కూడా అడగకుండా ఆమె తండ్రి, రాజులు, మహర్షులు తమ తమ ఇష్టాలకు, అవసరాలకు తగినట్లు మాధవి జీవితంతో ఆడుకున్నారు. స్త్రీకి ఆత్మాభిమానం ఉంటుందనీ, దానిని కించపరిస్తే అవమానంగా భావిస్తుందనే స్పృహ లేకుండా వారు మాధవి మానంతో తమ కోరికలు తీర్చుకున్నారు.

ఉ. "ఏనొక యాడుదాన నని యెంచరొ యీ మగవారు నా మదిన్
మానము నాత్మ గౌరవము మచ్చుకు లేదని యెంచిరో ననున్
దానము చేసె తండ్రియను దాత యొకండు గృహీతలున్ క్రమం
బూని రమించుచున్ సుతల నొందిరి నేనొక యాట బొమ్మనే"

అని కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు పురుషాధిపత్యం క్రింద ఆటబొమ్మలా నలిగిపోయిన మాధవి జీవితాన్ని ప్రస్తుత సమాజం ముందుంచారు.

ప్రస్తుత సమాజంలో కూడా చదువు, వివాహం, సంతానం, పిల్లల విద్య మొదలైన విషయాలలో పురుషులు ఏ మాత్రం స్త్రీల అభిప్రాయాలకు విలువ నివ్వడం లేదు. కనీసం తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. బాగా చదివే విద్యార్థినీలను చదువు మధ్యలోనే వివాహం చేసేయడం వలన వారు తమ చదువు కొనసాగించే అవకాశం లేకుండా పోతుంది. వివాహ అనంతరం స్త్రీల విద్య భర్త దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతుంది. ఈ విధంగా అనేక మంది ప్రతిభావంతులైన బాలికలు నిస్సహాయ పరిస్థితులలో విద్యకు దూరమవుతున్నారు.

వివాహ విషయంలో కూడా స్త్రీ స్వేచ్ఛగా తన అభిప్రాయం వ్యక్తంజేసే అవకాశం చాలా కుటుంబాలలో లభించడం లేదు. తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు నిర్ణయించిన వ్యక్తి చేత మెడవంచి తాళి కట్టించుకోవడమే తప్ప స్త్రీకి తన అభిప్రాయం చెప్పే అవకాశం ఇవ్వడం లేదు ప్రస్తుత సమాజం. స్త్రీ ఎవరైన వ్యక్తిని ఇష్టపడి, ఆ విషయం ఇంట్లో తెలిసినప్పుడు వారు ఆమె అభిప్రాయాన్ని గౌరవించిన సంఘటనలు చాలా తక్కువ. తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు ఆమె అభిప్రాయానికి విలువ ఇవ్వక పోగా ఆ స్త్రీనిగానీ, ఆమె ఇష్టపడిన వ్యక్తినిగానీ చంపిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. మరికొన్ని సందర్భాలలో కుటుంబ పెద్దల అభిప్రాయానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్నప్పుడు వారితో మాట్లాడక పోవడం, వెలివేయడం, పరువుహత్యలకు పాల్పడడం మొదలైన దురాగతాలు మన సమాజంలో అనునిత్యం జరుగుతున్నాయి. పై రెండు సందర్భాలలోనూ సున్నిత మనస్కులైన స్త్రీలే ఎక్కువ మానసిక క్షోభకు గురవుతున్నారనడం నిర్వివాదం.

పిల్లలను కని, వారిని పెంచే విషయంలో ఇప్పటికీ స్త్రీల పరిస్థితి మాధవికి భిన్నంగా లేదు. మాధవికి పుత్రులు పుట్టగానే ఆ పుత్రులను ఆమె భర్తలు ఉంచుకొని ఆమెను కనికరం లేకుండా గెంటివేస్తారు. పిల్లలను కని, వారిని పెంచడం వరకే నేటి స్త్రీల బాధ్యత. ఎంతమంది పిల్లలని కనాలి, కొన్ని సందర్భాలలో మగపిల్లలని కనాలా లేక ఆడపిల్లల్నా అనేది కూడా పురుషులే నిర్ణయిస్తున్నారు. గర్భంలో ఆడపిల్ల ఉందని తెలుసుకొని గర్భ విచ్ఛిన్నం చేయడం కూడా చూస్తున్నాం. ఆడ పిల్లలు పుట్టారనే నెపంతో, పిల్లలు పుట్టలేదనే సాకుతో మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించే సంఘటనలు మన సమాజంలో కోకొల్లలు. ఈ విధంగా మానవ హక్కులు నిరాకరించబడి, ఆత్మాభిమానం కించపర్చబడి మానసిక క్షోభను అనుభవించే స్త్రీలకు ప్రతిబింబమే బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు తీర్చిదిద్దిన మాధవి.

మాధవి రాచకన్య. అంగబలం, అర్థబలం పుష్కలంగా ఉన్న మహారాజు కూతురు. అటువంటి మాధవియే

తే. "కాంత పరిచారికాగణ కల్ప్యమాన
మజ్జన పరిష్క్రియాహార మహిత శయన
గాన నాట్య సంభావిత నైన నేనె
పూరుషాహంక్రియా పరిభూతనైతి"

అని దుఃఖించడం మనసును కలించివేస్తుంది.

ప్రస్తుతం కూడా అనేక మంది విద్యావంతులైన స్త్రీలు మగవారి చేతిలో మోసపోవడం చూస్తున్నాం. ఒకప్పుడు ఇళ్ళకే పరిమితమైన స్త్రీలు ఇప్పుడిప్పుడే చదువుకోవడానికి, ఉద్యోగాలు చేయడానికి ముందుకు వస్తున్నారు. కాని ఇలా చదువు, ఉద్యోగం నిమిత్తం బయటకు వచ్చిన స్త్రీలు కూడా పురుషులు, యాజమాన్యం వల్ల ఇబ్బందులను ఎదుర్కోవడం దురదృష్టకరం. ఇటీవల పని చేసే స్థలంలో లైంగిక హింసకు గురైన స్త్రీలు 'మీటూ' అనే పేరుతో వారు పురుషుల వల్ల ఏ విధంగా ఇబ్బందులు పడ్డారో బహిర్గతం చేస్తూ ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమంలో భాగంగా వారు చెప్పిన విషయాలను విశ్లేషిస్తే మన సమాజంలోని విద్యావంతులు, ఉన్నత వర్గాల స్త్రీలు కూడా తమ జీవితంలో

ఏదో ఒక సమయంలో పురుషుల వల్ల శారీరక, మానసిక హింసకు గురవుతున్నారనే విషయం విభ్రాంతి కలిగిస్తుంది. కాని ఇప్పటికీ అధిక సంఖ్యలో మహిళలు తాము అనుభవించిన గృహహింసను, లైంగిక వేదింపులను తమలోనే అణచుకొని కుమిలిపోతున్నారేగాని బహిర్గతం చేయలేకపోతున్నారు. దీనికి కారణం పురుషాధిపత్య భావజాలాన్ని ప్రోత్సహించే సంప్రదాయాలే. అటువంటి సంప్రదాయాల క్రింద శారీరక, మానసిక హింస అనుభవించిన స్త్రీలకు దృష్టాంతంగా కరణంవారి మాధవి హృదయాలను ద్రవింపజేస్తుంది.

పురుషాధిపత్యం క్రింద దుర్భరంగా మారిన మాధవి జీవితాన్ని తలచుకొని ఆమెకు పుత్రులు కలిగారు కాబట్టి సరిపోయింది. ఒక వేళ ఆమెకు కూతుర్లే పుట్టుంటే

చ. "కొడుకుల గాంచకే నచట కూతులనే గనియున్న వారలే
వడువున నాదరంబులకు పాత్రము లయ్యెడు వారొ, రాజ్ఞికిం
బొడమిన నాకె యిట్టి పరిభూతిని గూర్చిన పూరుషోత్తముల్
పడుపుకు బుట్టినట్టి పసిపావల నేక్రియ నేర్చియుందురో"

అని కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు మాధవి ముఖంగానే ఆ కూతుర్ల పరిస్థితి ఏ విధంగా ఉండేదో వివరించారు.

నేటి కాలంలో కూడా స్త్రీలు చిన్నతనం నుండి తాము అనుభవించిన వివక్షతను గుర్తుకు తెచ్చుకొని, తమకు పుత్ర సంతానమే కావాలని కోరుకోవడం మనం గమనిస్తున్నాం. తనకు కూతురు పుడితే ఆమె కూడా తనకు లాగే ఇబ్బందులు పడుతుందనే స్త్రీల ఆలోచనే దీనికి కారణం. మన సమాజంలో చదువు, ఆహారం, అవకాశాలు ఇలా అనేక అంశాలలో స్త్రీల పట్ల వివక్ష నెలకొని ఉంది. చివరికి తల్లిదండ్రులు కూడా తమ సంతానంలో మగ పిల్లకు ఇచ్చినన్ని అవకాశాలు ఆడ పిల్లలకు ఇవ్వడంలేదు. ఆడ పిల్లను భారంగా భావిస్తున్నారు. తొందరగా పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించేయాలన్న ఆలోచనేగానీ, ఆమెను చదివించి, మంచి స్థితిలో నిలబెట్టాలన్న ఆలోచన ఎక్కువ మంది తల్లిదండ్రులలో కనిపించడం లేదు. మాధవి తనకు కూతుర్లు పుట్టకుండా కొడుకులు పుట్టడం వల్ల కొంత మేలు జరిగిందని భావించిందని రచయిత చెప్పడం వెనుక ఉద్దేశం అదే.

ఆధునిక సమాజంలో స్త్రీలు పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తూ కుటుంబ నిర్వాహణలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. కాని వారి సంపాదనపై కూడా పురుషుల నియంత్రణ కొనసాగుతుంది. స్త్రీలకు ఆస్తిహక్కు అనేది చట్టాలకే పరిమితమైంది. పుట్టింటి నుండి స్త్రీకి సంక్రమించిన ఆస్తి, ధనంపై కూడా భర్త ఆజమాయిషి కొనసాగుతుంది. అదనపు కట్నం కోసం అత్తవారింట గృహ హింసకు గురైన స్త్రీల సంఖ్య కోకొల్లలు. ఇలా తనపైన, తన ఆస్తి, సంపదపైన, పిల్లలపైన, కుటుంబంపైన స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి అప్పటి మాధవికే కాదు ఇప్పటి ఆధునిక స్త్రీకి కూడా వాస్తవంగా లభించడం లేదు. అందుకే కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు

తే. "పురుషాధిక్య పీడిత భువన మందు
ఆడదిగ పుట్టు కంటెను నడవిలోన
పుట్టియుం జెట్టునుంగాగ పుట్టుటొప్పు
దుర్భరావమానములకు దొరయకుండ"

అని పురుషాధిపత్య భావజాలంతో కూడిన సమాజంలో స్త్రీ జీవితం ఎంత దుర్భరమో వెల్లడించారు.

మాధవి జీవితాన్ని పరిశీలిస్తే మన సమాజంలోకి కన్యాశుల్క సంప్రదాయం ఎలా వచ్చిందనే విషయంపై కొంత స్పష్టత వస్తుంది. కన్యాశుల్క ప్రారంభ దశలో సంతానం లేని (కొన్ని సార్లు పుత్ర సంతానం లేనివారు కూడా) రాజులు, ధనవంతులు ఆడ పిల్లలు గల తల్లిదండ్రులకు కొంత ధనం చెల్లించి, వారి కుమార్తెను వివాహం చేసుకునేవారని మాధవి వృత్తాంతాన్ని బట్టి తెలుస్తుంది. ఇలా ప్రారంభమైన కన్యాశుల్కం 19వ శతాబ్ది

చివరినాటికి ఆడపిల్లల తల్లిదండ్రులు ధనాశతో ముక్కు పచ్చలారని తమ పిల్లలని కన్యాశుల్కం కోసం వృద్ధులకు అమ్ముకోవడం వరకు దారితీసింది. ఇలా కన్యాశుల్కం ఒక సాంఘిక రుగ్మతగా మారింది. కందుకూరి వీరేశ లింగం, గురజాడ అప్పారావు మొదలైన సంఘసంస్కర్తల కృషి ఫలితంగా ఈ దురాచారం మన సమాజం నుండి తొలగిపోయింది. ప్రస్తుతం కన్యాశుల్కానికి విరుద్ధమైన వరకట్న దురాచారం మన సమాజంలో పాతుకుపోయి ఆడపిల్లల తల్లిదండ్రులను కడగండ్లపాలు చేస్తుంది. ఈ విధంగా యుగం ఏదైనా ఈ పురుషాధిపత్య భావజాలాన్ని ప్రోత్సహించే సంప్రదాయాలు ఏదో ఒక రూపంలో స్త్రీ స్వేచ్ఛను నిరాకరిస్తూ, ఆమె జీవితం పురుషుల ఇష్టా యిష్టాలపై ఆధారపడి ఉండేటట్లు నియంత్రిస్తున్నాయి.

ఉ. ''ఇష్టము తోడనే పశువులీనును దూడల, నైజ కామనా
భీష్టము లేనిచో దరియనీయదు పోతును పెంటి, కాని నా
కిష్టము కష్టమో యడుగ డెవ్వడు, నల్వురతో పరుండి 'పా
పిష్ట' జనంబు గంటి పశులే నయమౌనను పోల్చి చూచినన్''

అని మాధవి తన జీవతం పశువుకంటే హీనంగా మారినందుకు దు:ఖిస్తుంది.

'నలుగురు కుమారులని కన్నాను. ఏ కుమారుడు కూడా నాన్న నా కన్న తల్లి ఎక్కడ ఉంది? ఎందుకు రాదు?

మీరైన తీసుకురండి అని తండ్రులనడగరు. ఏ కుమారుడైన నా వద్దకు ఎందుకు వస్తాడు? వాడు కూడా మగాడే కదా' అని మాధవి తన పుత్రశోకం వ్యక్తం చేస్తుంది. గొడ్డుగోదలకు, కొంపగోడుకు, వస్తువాహనములకు, వస్త్ర భూషణములకు ఈ లోకంలో విలువ ఉంది కాని ఒక స్త్రీ మాన ప్రాణములకు విలువ లేదని మాధవి పురుషాధి పత్య సమాజంలో స్త్రీ స్థానాన్ని వెల్లడిస్తుంది. పూర్వం పురుషాదిపత్యం వలన కష్టాలు పడ్డ సీత, ద్రౌపది, చంద్రమతి మొదలైన వారిని తలచుకొని

తే. ''ఈ యనాదరణంబులు నిట్టి కంట
గింపు లిట్టి బలాత్కృతులిట్టి హింస
లెంత కాల మెన్నియుగంబు లెన్ని కల్ప
ములు భరించుచు పడియుండ వలయు స్త్రీలు''

అని మాధవి నిస్సహాయంగా నిట్టూరుస్తుంది.

చ. ''మొదటి యుగాల నుండి తమ పుట్టువు లాఱడివోవ దుర్ణయా
స్పద పురుషోద్ధతిన్ నలిగి వందురి బాధలె కూడినీళ్ళుగా
హృదయ వచశ్శరీరములు నెందును పూరుష జాత్యధీనలై
బ్రదుకుల నీడ్చు స్త్రీజన వరాకుల కంకితమిత్తు నీ కథన్''

అని కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు చెప్పిన మాటలు స్త్రీల దైన్యత పట్ల వారికున్న సానుభూతి, స్త్రీ జనోద్ధరణ కాంక్షలను వెల్లడిస్తున్నాయి.

## ఉపయుక్త గ్రంథాలు :

1. కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై - విషాద మాధవి పద్యకావ్యం, అమర్ ప్రింటర్స్ అండ్ స్క్రీన్స్, మదనపల్లె, జనవరి 1999.
2. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, తిరుపతి, 2013.

# ఆంధ్ర మహాభారతం - స్త్రీ పర్వం (గాంధారి పాత్ర చిత్రణ)

- డా॥. గుంటుపల్లి గౌరి, తెలుగు లెక్చరర్, ఎస్.కె.బి.ఆర్. జి.డి.సి., మాచర్ల, గుంటూరు జిల్లా.

సర్వేత్ర సుఖినః సన్తు సర్వేసన్తు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యన్తు మాకశ్చిద్దుఃఖమాప్నుయాత్

అందరూ సుఖంగా ఉండాలి, అందరూ ఆరోగ్యంగా ఉండాలి అందరూ శుభానిన చూడాలి. ఏ ఒక్కనికీ దుఃఖం కలుగ కూడదు అనేది భారతీయుల భావన. ఈ భావాన్ని ప్రచారం చేయటానికే భారతీయ వేద, పురాణ, ఇతిహాస కావ్యాలు విశేషంగా కృషిచేశాయి. ఇతిహాసంగా ప్రసిద్ధిగన్న మహా గ్రంథం మహా భారతం. ఆసక్తికరమైన విషయం ఏమంటే మహాభారతం ప్రపంచంలోని గ్రంథాలన్నింటిలోకి గొప్పది. ఉదాహరణకు "ఇలియడ్," "ఒడెస్సీ," - అనేవి గ్రీకుల ప్రాచీన ప్రసిద్ధ వీరకావ్యాలు. మహాభారతం ఆరెండింటి కన్నా అనేక రెట్లు పెద్దది. ఈ పెద్దతనం ఒక్క పరిమాణంలోనేగాక, పాత్రచిత్రణ, భావాల వైవిధ్యంవంటి అంశాల్లో స్పష్టంగా తెలుస్తుంది.

ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మహామునులకు భారత కథనంతా చెప్పి చివర ఇలా అంటాడు- "యది హాస్తి తదన్యత్ర, యన్నే హాస్తినతత్ క్వచిత్" ఇందులో ఉన్నవే అన్నిచోట్లా ఉన్నాయి. ఇందులో లేనిది వేరే ఎచ్చటా లేదు అని ప్రచారం పొందిన మహాభారతానికి విశ్వ సాహిత్యంలోనే ప్రత్యేక స్థానం వుంది. లక్ష శ్లోకాలకు పైగా ఉన్న మహాకావ్యం మహాభారతానికి సమానమైన గ్రంథం ప్రపంచం మొత్తంమీద వేరే ఏ భాషలోనూ లేదు. ఇంత లౌకికమైన కథ, మానవ జీవితంతో పెనవేసుకు పోయిన పాత్ర చిత్రణ కూడా ఇంకే గ్రంథంలోను లేదు.

## సంస్కృత మహా భారతము :

భారతీయ విజ్ఞాన సర్వస్వం, పంచమ వేదంగా ప్రసిద్ధమై, వ్యాస మహర్షి సంస్కృత భాషలో రచించబడిన మహేతిహాసము మహాభారతము. వ్యాసునికి కృష్ణ ద్వైపాయనుడు, విష్ణుని సన్నిభుడు, బాదరాయణుడను నామములు కూడ ఉన్నాయి. వ్యాసుడు మొట్టమొదట "జయ" మను పేర 8800 శ్లోకములలో భారతమును రచించగా తర్వాత అది 24000 శ్లోకములకు పెరిగి భారత ఇతిహాసమైనది. వ్యాసుని శిష్యులైన నారద, దేవల, శుక, జైమిని, వైశంపాయనులు భారతమును చెప్పారు. దానిని విని వచ్చి, నైమిశారణ్యంలో సాగుతున్న సత్ర యాగములో, ఉగ్రశవసుడను సూతుడు శౌనకాది మహామునులకు 1,20,000 శ్లోకములతో చెప్పగా అది మహాభారతమైనది. మహాభారతము పంచమ వేదముగా ప్రసిద్ధి కెక్కినది. ఈ భారతము "భారతీయ సంస్కృతీ విజ్ఞాన సర్వస్వం "Encyclopedia of Indian Wisdom and Culture"గా ప్రశంసింపబడింది. మహాభారతము క్రీ.పూ. 1000 ప్రాంతములో వ్రాయబడి యుండునని చరిత్రకారుల అభిప్రాయం. సంస్కృత భారతము నూరు పర్వములుగా విభజింపబడినది. తెలుగు భారతము 18 పర్వముల విభాగమును పొందినది. వ్యాస మహర్షి "కౌరవ పాండవ వంశ చరిత్ర ప్రధానముగా గ్రహించి నాటి సమస్త రాజవంశాల చరిత్రను సంగ్రహించి రచించి నందున మహాభారతం ఇతిహాసమైనది. మహాభారత మందు విస్తృతమైన ఇతిహాసం ప్రపంచ భాషలలో దేనిలోను లేదు. మధుర కవిత్వానికి రామాయణాన్ని, రాజనీతిజ్ఞతకు మహాభారతం, చదవాలని ప్రసిద్ధ లోకోక్తి.

## ఆదికవి నన్నయ - భారతాంధ్రీకరణ :

తెలుగులో మహాభారత రచన క్రీ.శ. 11వ శతాబ్దములో ప్రారంభమైన తర్వాత 13వ శతాబ్దంలో తిక్కన, 14వ శతాబ్దములో ఎఱ్ఱన రచించుటతో పూర్తి అయినది. మహా భారతాన్ని రచించిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడలు "కవిత్రయము"గా ఆంధ్రసాహితీ జగత్తులో ఖ్యాతి గాంచారు. తూర్పు చాళుక్య వంశపు రాజు రాజరాజ

నరేంద్రుని ప్రేరణతో మహాకవినన్నయ మహాభారత రచనకు పూనుకొన్నట్లు భారతావతారికవల్ల తెలుస్తుంది. నన్నయ వేదవ్యాసుని దుర్భరతపోవిభవాధికునిగా, అంబురుహగర్భనిభునిగా, "గురుపద్య విద్యకు నాద్యుని" గా కొనియాడారు.

మహాభారత ప్రాశస్త్యము కొనియాడుతూ నన్నయ -

'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మ విదులు వేదాంతమనియు,
నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని, కవి వృషభులు మహాకావ్యమనియు,
లాక్షిణికులు సర్వలక్షణంబనియు, యైతిహాసికులి తిహాసమనియు,
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని, మహిగొనియాడుచుండ

వివిధ వేద తత్త్వ వేది, వేదవ్యాసు
డాదిముని, పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగు చుండ జేసే భారతంబు" అని వర్ణించాడు.

ఇతిహాసికు లితిహాసమని పొగడిన మహా భారతమును నన్నయ విశ్వశ్రేయోదాయకమైన మహాకావ్యముగా తీర్చిదిద్దాడని చెప్పవచ్చును.

మహాభారతానికి 4 వేదాల తరువాత అంతటి పవిత్రత, ప్రాముఖ్యతగల గ్రంథం అనే ప్రఖ్యాతి ఉన్నది. అందుకే దీనిని పంచమవేదం అన్నారు. మహాభారతంలో మొత్తం 18 పర్వాలున్నాయి. పండితులు దీనిని వేదాంతమని, కావ్యమని, ఇతిహాసమని, నీతి శాస్త్రమని ఎన్నో విధాలుగా ప్రశంసిస్తున్నారు. కాబట్టే వేదాల తరువాత స్థానాన్ని ఆక్రమించి పంచమవేదంగా ప్రసిద్ధి చెందింది. మహాభారతాన్ని ఎందరో కవులు ఎన్నో భాషల లోనికి అనువాదం చేసారు. మనకు తెలుగులో ముఖ్యమైన అనువాదం నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగట అనే కవిత్రయం వారు చేసిన అనువాదం. ఇది అతి శ్రేష్ఠమైనది. భారతానికి భారతదేశీయ భాషలలో వచ్చిన ప్రాచీన అనువాదాలలో నన్నయ అనువాదం విశిష్టత గలది. మహాభారత కథ ప్రపంచంలోని అన్ని భాషలలోనికి అనువదించబడింది. మహాభారతం ధర్మప్రబోధితం చేసినట్లు భారతీయులను మరే గ్రంథం చేయలేక పోయింది. అందుకే భారతదేశంలోని ప్రతి స్థలానికి ఏదో ఒక విధంగా భారత కథతో అవినాభావ సంబంధం కలుపబడింది. ప్రపంచాన్ని ధర్మోద్ధీపితం చేసి వెలుగు దివ్వెగా వెలుగుతున్న మహా భారతం భారతీయులకే కాదు మొత్తం ప్రపంచ ప్రజలకు ధర్మ ప్రేరకమే.

## గాంధారి పాత్ర పరిచయం :

గాంధార దేశపురాజు సుబలుడు. సుబలుడికి నలుగురు సంతానం. వారు 1) గాంధారి, 2) శకుని, 3) వృషకుడు, 4) అచలుడు. ఉలూకుడు శకుని కొడుకు. ఈ శకుని ధర్మరాజును జూదంలో వంచన చేస్తాడు. కురుక్షేత్ర యుద్ధంలో నకుల, సహదేవుల చేతిలో శకుని మరణిస్తాడు. సుబలుడి కూతురు మరియు శకునికి అక్క అయిన గాంధారి ధృతరాష్ట్రుడి భార్య కౌరవుల తల్లి, శివభక్తురాలు. ఈమెకు శివుడు వందమంది కొడుకులు పుడతారని వరమిస్తాడు. వారే కౌరవులు. ఈమె కూతురు దుస్సల. భర్త అంధుడని తానూ జీవితాంతం అంధురాలిగానే ఉండదల్చుకొని కళ్ళకు గంతలు కట్టుకుంటుంది. కురుక్షేత్ర యుద్ధం తరువాత వ్యాసుడి హితవచనాలు విని పాండవుల్ని తన కొడుకుల్లాగానే చూస్తుంది. తరువాత ఆమె అడవులకు పోయి దావానలంలో మరణించి కుబేర లోకం చేరుకుంటుంది.

## గాంధారి వ్యక్తిత్వం - సమకాలీనత :

పగ, ద్వేషం, ప్రతీకారం, ఈర్ష్యకు లోనైన కౌరవులు పోరుకు సిద్ధపడటం, తద్వారా కలిగిన పరిణామాలకు ఫలితంగా స్త్రీ పర్వంలో గాంధారి, కుంతి మొదలగు స్త్రీల మనఃప్రవృత్తుల చిత్రీకరణలో శోకరసం పెల్లుబికింది. ఆంధ్ర మహాభారతం 'స్త్రీ పర్వం'లో ప్రధాన పాత్ర వహించిన గాంధారి నేటి అత్యుత్తమ న్యాయ దేవతకు

ప్రతీక. భారత యుద్ధానంతరం యుద్ధ భూమిలో పడిఉన్న మానవ శరీరాలను చూసినపుడు కలిగే మనోవేదనను గురించి, ప్రతి వ్యక్తియొక్క చావుకు మూల కారణాన్ని విశ్లేషిస్తూ, కళ్ళకు కట్టినట్లు కవి 'స్త్రీ పర్వం'లో పేర్కొనటం ఒక భౌతిక వాస్తవికత. దైవం దృష్టిలో జీవులందరూ ఒకటి అని, వారు చేసిన చెడ్డపనులను బట్టి చెడు ఫలితాలను పొందక తప్పదని భావిస్తుంది గాంధారి. కురుక్షేత్ర యుద్ధానికి కారణం రాజ్యకాంక్ష అని దానికోసం కౌరవ పాండవులు కొట్టుకు చచ్చారని భారతరణాన్ని గురించిన అభిప్రాయం. కాని ఆ యుద్ధాన్ని స్త్రీల దృక్కోణం నుంచి చూసినపుడు దుర్యోధనుని 'దుర్మదం' కారణంగా యుద్ధం జరిగిందని, అన్నదమ్ముల మధ్య వారసత్వపు పోటీలో విజయం సాధించలేక వారి భార్యలపై లైంగిక హక్కును కలిగి ఉండాలను కోవడంగా భారత కథ అర్థమౌతుంది. దాని పట్ల ద్రౌపది నిరసన చూపించటమే కురుక్షేత్ర యుద్ధానికి కారణం అయింది.

కుటుంబానికే పరిమితమయినా స్త్రీలది కూడా స్పందించే హృదయం, సహజ జ్ఞానము కల మెదడు గల శరీర నిర్మాణము కలది మానవ జన్మయే కాబట్టి స్త్రీ, పురుష సంబంధాలలోని సంక్లిష్టతలకు స్త్రీలు సంఘర్షిస్తూ తమ స్పందనలను మౌనంగానూ, మాటల రూపంలోనూ, చేష్టల రూపంలోనూ వ్యక్తం చేస్తారని ఈ స్త్రీ పర్వంలోని గాంధారి, కుంతి మొదలగు పాత్రల ద్వారా తెలుస్తుంది. స్త్రీకి ఎంతటి సహన శక్తి ఉన్నా పైకి ఉబికి వచ్చే మాతృత్వ మమకారాలు బాధకు గురి చేస్తాయి. అయితే ఈ స్వార్థాన్ని అధిగమించి సాటి స్త్రీల బాధలను అవగాహన చేసుకొని మాతృత్వం కంటే మహిళా న్యాయమే గొప్పదని ఋజువు చేసింది గాంధారి పాత్ర. ఇది స్త్రీ పర్వంలోని భారత రహస్యాల నగిషీ కాంతులను దర్శించి, మహిళా జనజీవన అధ్యయన దృక్పథంతో చూడగలిగినపుడే అర్థమౌతుంది.

స్త్రీ పర్వంలో పుత్ర, పౌత్ర, భాతృ, భర్తల శవాలపై పడి శోకసంద్రంలో మునిగిన స్త్రీల గుండెలలోని బాధ గాంధారి పాత్ర ముఖంగా బయటపడింది. గాంధారి ఏకకాలంలోనే దుర్యోధనుని తల్లిగా, తోటి స్త్రీల పాలిట న్యాయదేవతగా రాణించగలిగింది. స్త్రీలు న్యాయమూర్తులైతే న్యాయమైన తీర్పు ఇవ్వటానికి క్రొత్త ఒరవడిని చూపించిన పాత్ర గాంధారి. రాజసూయ యాగానంతరం పాండవులపై అధిక్యతను సాధించలేని దుర్యోధనుడు ప్రతీకారంతో వారి భార్యయైన ద్రౌపది యొక్క 'లైంగికత'పై అధికారాన్ని పొందాలనుకుంటాడు. అందుకనే సభలోనికి ద్రౌపదిని తెప్పించి ఆమె భర్తల ఎదుటనే ఆమెను తన తొడపై కూర్చోమని చెపుతాడు. కులగురువులు, వృద్ధులు ఉన్న ఆ సభలో నిర్భయంగా ఆమె లైంగికతపై వేధింపు రూపమున అధికారాన్ని, ఆధిపత్యాన్ని దుర్యోధనుడు కోరుకోవటమే కారణంగా కురుక్షేత్ర యుద్ధం జరిగిందంటే ఆశ్చర్యం కాదు.

కురుక్షేత్ర యుద్ధం పైపైకి రాజ్యకాంక్షకు సంబంధించినదిగా కనపడుతుంది. ప్రజలేకాక పెద్దలైన వ్యాసుడు, సంజయుడు, దృతరాష్ట్రుడు కూడా పాండవులకు వారి రాజ్యాన్ని దుర్యోధనుడు ఇచ్చి ఉంటే యుద్ధం జరిగేది కాదని భావిస్తారు. దృతరాష్ట్రుడు కొడుకును అలా ఒప్పించగలిగితే కౌరవనాశనం తప్పేదని భావించడం పైకి కనపడే పితృస్వామ్య రాజకీయ విషయం. స్త్రీ దృక్కోణం నుంచి చూస్తే దుర్యోధనుని 'దుర్మదం' కారణంగా యుద్ధం జరిగిందని అర్థమవుతుంది. ఇటువంటి స్వభావం గలిగిన దుర్యోధనుణ్ణి అసూయలేని మనస్సుతో చూడగలిగింది గాంధారి. అందుకే కొడుకు యుద్ధానికి వెళుతూ వినయ విధేయతలు చూపించి దీవించమని వచ్చినపుడు 'ధర్మం ఏ తలనుండు అచ్చట జయం కలుగుతుందని' చెప్పిన ధర్మమూర్తి. మాతృ భావనను అధిగమించి-దుష్టాత్ముడైన దుర్యోధనుడు చచ్చిపోవడం బాధగా అనిపించలేదని, పాండవులు కౌరవులను చంపినందుకు కూడా బాధపడటం లేదని భీముడు దుర్యోధనుని నాభిక్రింద కొట్టి చంపటం, క్రూరాత్ముడైన దుశ్శాసనుని పచ్చి నెత్తురు త్రాగడం, యుద్ధ నీతికి

విరుద్ధంగా చంపినందుకు సమర్థించుకొనే ప్రయత్నంలో మహిళా న్యాయంకంటే కూడా పితృస్వామ్యానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చిన విషయాన్ని గుర్తించక తప్పదు.

నూరుగురు కొడుకులు ఒక్కసారిగా మరణించి నందుకు తల్లిగా తన మనస్సు తల్లిడిల్లుతున్న గాంధారికి భీముని మాటలలో స్ఫురించిన ద్రౌపది అవమానం గుర్తుకు రాగానే మాతృత్వం మాయమయి ధర్మదృష్టితో మహిళా న్యాయాన్ని ఆలోచింపచేసి ఆచావు 'సావదగు నన్నీచునకు' అని దుర్యోధనుణ్ణి గురించి గాంధారి భావించేటట్టు చేసింది. దుశ్శాసనుడు భీముని చేతిలో మరణించినపుడు కూడా గాంధారి తన రక్తం పంచుకు పుట్టిన కొడుకు చావుకోసం మాతృవేదన పడ్డ దానికంటే కూడా ద్రౌపది వస్త్రాపహరణ గుర్తుకు వచ్చి మహిళకు జరిగిన మానహాని ముందు మాతృభావన మటుమాయ మవుతుంది. అందుకే సాటి స్త్రీకి చిన్న దుఃఖం వచ్చినా దానినుండి వారిని బయట పడవేయగల శక్తి స్త్రీలకే ఉంటుందని చెప్పవచ్చు. పుత్రుల్ని కోల్పోయిన దుఃఖంలో ఉన్న ద్రౌపదితోనూ, మనవళ్ళన కోల్పోయిన కుంతి దుఃఖంలోను గాంధారి పాలుపంచుకొని మాతృవేదనను అనుభవించిన దానికన్నా మహిళా న్యాయానికే ప్రాధాన్యత నిచ్చి, మానవత్వానికి విలువనిచ్చిన వ్యక్తిగా కనబడు తుంది గాంధారి. "స్త్రీకి స్త్రీ శత్రువు" అన్న వ్యతిరేక నినాదాన్ని పునాదులతో సహా రూపుమాపిన ఒక ఉన్నత మైన స్త్రీ మూర్తిగా దర్శనమిస్తుంది.

దుర్నీతిపరుడైన దుర్యోధనుడు ద్రౌపది విషయంలో చేసిన అవినీతి పని ఆమె హృదయాన్ని తల్లడింప జేసింది. కొడుకుపైనున్న గ్రుడ్డి ప్రేమను తగ్గించుకొని అటువంటి కొడుకు బ్రతికి ఉండటం కంటే చావటం మేలని భావిం చింది. కొడుకు చావుకంటే కోడలి దుఃఖం ఆమెను ఎక్కువగా బాధపెడుతుంది. ఇక్కడ సాటి స్త్రీ దుఃఖాన్ని పంచుకోవటంతో పాటు గుడిపాటి వెంకటాచలంలాగా 'స్త్రీకి శరీరం ఉంది హృదయం ఉంది' - స్పందనలు సహజమని గ్రహించగలుగుతుంది. సైంధవుడు గాంధారి అల్లుడు 'దుస్సల' భర్త. సైంధవుడు అరణ్యంలో ద్రౌపదిని బలాత్కరించి, ఆమెను అపహరించిన నాడే అతను చచ్చిపోతే స్త్రీలు భవిష్యత్తులో అపహరణకు గురికాకుండా ఉంటారని ఆలోచనకు వచ్చింది. అల్లుని మరణ దుఃఖం గాని దుస్సల వైధవ్యంగాని బాధను కలిగించలేదు. దీనిని బట్టి స్త్రీలను బాధించినవాడు అల్లుడైనా, కొడుకైనా ఒకేరకంగా న్యాయనిర్ణయం చేసిన గాంధారి న్యాయదేవత. దీనిని బట్టి "మగజాతి చరిత్ర సమస్తం మహిళా వేదన పరాయణత్వం" అన్న భావన స్ఫురించక మానదు. ఒక్క గాంధారి పాత్ర పోషణ విషయంలోనే కాదు పూరాణేతి హాసాల కాలంలో సాహిత్యంలో స్త్రీశక్తి ఆవిష్కరణను రికార్డు చేయాలనుకున్న తిక్కన, ఎర్రన, పోతన, నాచన సోమనలకు గల హృదయ స్పృహ ప్రపంచ సాహిత్య చరిత్రలోని స్త్రీల సాధికారికతకు అగ్రతాంబూలం ఇచ్చిన ఘనత తెలుగు సంప్రదాయ సాహిత్య విమర్శకు దక్కగలిగింది. మరియు స్త్రీలు అబలలు కారు సబలలే అని వారి రచనల ద్వారా నిరూపించారు.

దుర్యోధన, దుశ్శాసన, సైంధవుడు, కీచకుడులాంటి వాళ్ళు ఈ సమాజంలో ఉన్నంతకాలం స్త్రీలపై, బాలిక లపై అత్యాచారాలు జరుగుతూనే ఉంటాయి. ఈ నాటికి నిత్యం మనకళ్ళముందు జరుగుతూనే ఉన్నాయి. గురజాడవారి కన్యకలాగా నేటికీ నిర్భయ, అక్షయ, అసిఫాలాంటి ముక్కుపచ్చలారని పసికందులు మరియు దిశాలాంటి యువతులు బలైపోతూనే ఉన్నారు, ఉంటారు కూడ.

మహాభారతంలోని స్త్రీ పర్వంలో గాంధారి ఒక న్యాయ మూర్తిగా దర్శనమిస్తుంది. నేడు స్త్రీలపై బాలికలపై జరుగుతున్న లైంగిక హింసకు, నేరాలకు తగిన శిక్ష వేయగలిగే హృదయం, చైతన్యం ఉన్న మహిళా న్యాయ వాదులు, న్యాయమూర్తులు (పురుష న్యాయవాదులు, పురుష న్యాయమూర్తులు కూడా) నేటి ఆధునిక కాలంలో రాగలిగితే ఈ అత్యాచారాలను చాలావరకు అరికట్టవచ్చు. స్త్రీల విషయంలో నేరాలకు పాల్పడ్డవాడు కొడుకైనా సరే

శిక్షకు గురిచేయగల హృదయం ప్రతి తల్లికీ, తండ్రికీ ఉండాలని కోరుకుంటున్నాను.

అలాగే ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి పాటిబండ్ల రజనీగారు అధ్యాపకులు విద్యార్థినులకు -

"కప్పల్ని కబళించే పాముల్ని గురించే కాక
కనుపాప' ల్నే కాటేసే రెప్పల విపరీతాన్ని కూడా
ఒప్పుల కుప్ప వయసప్పట్నుంచే హెచ్చరించండి"

అన్నారు.

అంతేగాక ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని, స్థితిగతుల్ని వాటిని ఎదుర్కొనే ధైర్యసాహసాలను నేర్పే పాఠ్యాంశాల్ని సిలబస్‌లో చేర్చాలనే అభిప్రాయాన్ని కూడా ఆమె వ్యక్తం చేశారు. కాబట్టి పెడత్రోవ పడుతున్న విద్యార్థులను సరియైన మార్గంలో నడిపించవలసిన బాధ్యత అధ్యాపకులపైన మరియు సమాజంపైన కూడ ఉందని మనవి చేసుకుంటూ విరమిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1) ఆంధ్రమహాభారతం
2) తెలుగు సాహిత్యం - మహిళా చైతన్య ప్రస్థానం.
3) తెలుగు సాహిత్య చరిత్ర
4) 'రెప్ప కాటేసిన పాప కథ' కవిత - పాటిబండ్ల రజని.

❀ ❀ ❀

# యోగి వేమన శతకంలో వర్ణించబడిన స్త్రీ

- డా॥. రత్నశేఖర్ కట్టెపోగు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్.

కవులు స్త్రీని తెలుగు సాహిత్యారంభం నుండి నేటివరకూ పలు విధాలుగా దర్శించారు. అందులో రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలు స్త్రీలోని ఉత్తమ గుణాల్ని కీర్తిస్తూ గౌరవించాలని, అభిమానించాలని పేర్కొన్నాయి. కానీ స్త్రీకి ఇవ్వవలసిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మాత్రం ఇవ్వడం జరగలేదు. ప్రాచీనాంధ్ర కావ్యసాహిత్యంలో స్త్రీ పతివ్రతగా, శీలవతిగా, గుణవతిగా చిత్రీకరించబడింది. ప్రబంధయుగంలోని కవులు స్త్రీని ఆటవస్తువుగా, అంగడిబొమ్మగా చిత్రించారు. నాటి కవులు రాజుల్ని ఆశ్రయించి వారి అభిరుచులకు అనుగుణంగా అడుగులకు మడుగులొత్తుతూ తమ కావ్యాల్ని కడురమణీయంగా రచించారు. రాజుల్ని సంతోషపెట్టడానికి స్త్రీని నఖశిఖపర్యంతం, అంగాంగ వర్ణనల్నిచేస్తూ కన్నుమిన్ను కానక సిగ్గూలజ్జాలేకుండా రచనలు కావిస్తూ ఆనంద డోలికలలో మునిగితేలారు.

కట్టమంచి ప్రబంధ సాహిత్యంలోని స్త్రీని వివరిస్తూ 'నాయిక వివాహానంతరం ఆమె చెలికత్తెలైనా తమ చెలిని శోభనపుగది తలుపులచెంత వదులుతారేమో కాని, కవిమాత్రం అరక్షణం కూడా ఆమెను వదలడానికి అంగీకరించ'డన్నారు. ఆయుగంలోని స్త్రీకి వ్యక్తిత్వం లేదు. స్వేచ్ఛాలేదు. అసలు కవులకే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేనప్పుడు వారు సృష్టించిన స్త్రీ పాత్రలకు వుంటుంది? ఒకసారి ఆలోచించాలి.

దక్షిణాంధ్ర యుగంలోని కవులు కామదృక్పథంతో స్త్రీ సౌందర్యాన్ని అతిగా వర్ణించారు. స్త్రీని కేవలం ఒక విలాస వస్తువుగా మాత్రమే పరిగణించారు. ఈ యుగంనాటి స్త్రీలకు శృంగార ప్రపంచంతప్ప మరో ప్రపంచంతో సంబంధంలేదన్నట్లు రచనలు గావించారు. వారు సమాజం గూర్చిగాని, సామాజిక స్థితుల్నిగూర్చిగాని పట్టించుకోకుండా స్త్రీ కేవలం అందానికి, ఆనందానికి మాత్రమే పరిమితమంటూ చిత్రించారు.

జీవితం సత్యానికి మౌనవ్యాఖ్యానం చేస్తుంది. కాని పాఠప్రవచనాలను తర్కవితర్కాలను చేయదు. జీవితానికి మొగమాటాలు లేవు. మెరమెచ్చులు లేవు. అది వరాన్ని ఎంత ఔదార్యంతో ఇస్తుందో శాపాన్ని అంత నిర్దాక్షిణ్యంగా ఇస్తుంది. ఆటుపోటులతో కూడుకున్న జీవితాన్ని ఆశ్రయించిన సాధకుడికి అటురక్తికీ, ఇటు విరక్తికీ అవకాశముంది. రక్తిలో పడి సాధకుడు పరమార్థాన్ని మర్చిపోతే జీవితం శపిస్తుంది. శాపగ్రస్తుడైన జీవి విరక్తిమార్గంలో పడతాడు. పరమార్థాన్ని అన్వేషిస్తాడు. వేమన్న జీవితం ఇదే మార్గాన్ని పట్టింది. యౌవనంలో అందిన ఐహిక భోగాలను అనుభవిస్తూ పోయాడు. జీవితానికి పరమార్థం కనబడలేదు. కాంచనం, వంచనం రక్తి మార్గంలో ముళ్లపొదల్లా కనిపించాయి. వేమన ఆ మార్గం వదిలిపెట్టాడు. రక్తిని వీడినప్పుడు భక్తిని పట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సాధకుని జీవితంలోని భక్తికి బలం విశ్వాసం.

వేమనను సమాజకవిగానూ, నాథ సంప్రదాయకవిగానూ కవులు విశ్లేషించడం జరిగింది. సమాజ కవులలో భక్తికవులనీ, తత్త్వకవులనీ రెండురకాల వారుంటారు. ఆ రెండు రకాలలోనూ వేమన ఇమడడం కష్టమని విమర్శకుల అభిప్రాయం. 'భక్తకవిగా, తత్త్వకవిగా కాక యోగిగా వేమన ప్రచారంలో ఉన్నాడు. భక్త తత్త్వకవుల లోని సమాజపరమైన గుణాలను, బలహీనతలను విశ్లేషించగలగటానికి గల కనీసపు దిశానిర్దేశం వేమన పద్యాలలో కనిపించడు. సమాజకవులుగా పేర్కొంటున్నా ఇతర భక్త, తత్త్వ కవుల రచనలతో సమానంగాకాక, అందుకు భిన్నమైన భావాలు వేమన పేరిట పద్యాలలో

కనిపిస్తాయి' అంటూ రంగనాథాచార్యులు పేర్కొంటే, 'యోగిగా ప్రసిద్ధిచెందిన వేమన కవిత్వంలోని తాత్త్వి కాంశాలు నాథసంప్రదాయానికి దగ్గరగా ఉన్నాయని' కొర్లపాటి ప్రతిపాదించారు.

వేమన ఒక సూత్రానికి, ఒక విశ్లేషణకు, ఒక తత్త్వానికి ఒదిగే కవి కాడు. అయితే అతనివాక్కు ప్రజల గుండెల్లో సరాసరి ప్రవేశించి నిలిచే శక్తికలది. వేమన గంటంపట్టి వ్రాసింది తక్కువ. ఆశువుగా, చాటువుగా చెప్పినవి ఎక్కువ. ఆయన ఎన్నుకొన్న ఛందోభేదం ఆటవెలది. కొన్ని కందపద్యాలు కూడా ఉన్నాయి. యోగిగా ఆయన ఆశువు చెపుతున్నప్పుడు కవిలాగా పద్యాన్ని పద్యంలా చదివేవాడా? లేక తత్త్వంలా హృద్యంగా ఒక బాణిలో పాడుతున్నట్లు పలికేవాడా? ప్రజలను ఆకట్టుకొనే పద్యరచనతోపాటు, పద్యగాన వైఖరికూడా వేమన కొకటి ఉండి ఉండాలి. కందపద్యాన్ని కందార్థంలాపాడే అలవాటు తత్త్వాలు ఆలపించే వారికుంది. వేమన భక్తి కవులకంటే తత్త్వకవులకే ఈ బాణిలో దగ్గరివాడుగా కనిపిస్తాడు. ఆటవెలది అపూర్వంగా ఆలపించటం వేమన్న వాక్కులో ప్రజాకర్షణమార్గం అయి ఉండాలి. వేమన పద్యాలలో గణభంగాలు, పాదభంగాలు దానివలననే ఏర్పడి ప్రజలలో ఒక పాట బాణీని కల్పించి ప్రజలచేత కూడా పద్యాలను పలికించి ఉంటాయి.

వేమన 17వ శతాబ్దంలో రాయలసీమలోని ఒకానొక పల్లెలో మోతుబరి రైతు కుటుంబంలో పుట్టాడు. చిన్న తనంలో గారాబంగా అల్లర చిల్లగా పెరగాడు. స్నేహితు లందరికీ నాయకుడు. ఒకచోట కాలునిలవని అస్థిర స్వభావం ఏర్పడింది. పొలం బాధ్యతలు పట్టలేదు. ఊరి దేవళాల్లో అయ్యవార్లు చెప్పే ఆధ్యాత్మిక విషయాలు, హరికథలు, తోలుబొమ్మలాటలు మొదలైనవి వేమనకు పురాణ పరిచయాన్ని కలిగించాయి. అన్ని మతాలవారితో అంటుకొని తిరగటం వల్ల ఆయా మతాలతో గాఢమైన పరిచయం కలిగింది.

ఆనాటి మతసంస్థల్లో పేరుకొనిపోయిన అవినీతి, దేవదాసి, బసివి సంప్రదాయం, పెచ్చు పెరిగిన వ్యభిచారం ఇవన్నీ వేమనమీద ప్రభావం చూపాయి. ఆ సమయంలోనే కుటుంబం ఆర్థికంగా చితికిపోవడమో, వివాహం జరిగి అన్నదమ్ములు వేరుపడటమో జరిగి వుంటుంది. అప్పటివరకు బాధ్యత లేకపోవడంవల్ల కట్టు బట్టలతో వీధిన పడుంటాడు. డబ్బులేని వేమనను వేశ్యలు తన్ని తగలేసుంటారు. భార్యదగ్గర చులకనై వుంటాడు. ఇవన్నీ వేమన జీవితంలో జరిగిన వాటికి కారణాలుగా భావించవచ్చు.

రసవాదులతో చేరి బంగారంచేసే విద్యను నేర్చు కుందామనుకున్నాడు. ఎవరికీ చెప్పకుండా ఊరువిడిచి దేశంమీద పడ్డాడు. ఎక్కడైనా ఉద్యోగం చేద్దామను కున్నాడు కానీ అది కుదరలేదు. రాజులను నమ్మరాదనే అభిప్రాయానికి వచ్చాడు. వేమనకు పద్యాలను అల్లే అలవాటు మొదటినుంచి ఉంది. వాటిని ఒకరిద్దరు అధికారులకు, కవులకు వినిపించి చూశాడు. వారతని పద్యాలను కవిత్వంగా గుర్తించలేదు. వాళ్ళకు కావలసిన కవిత్వం అదికాదని తెలుసుకున్నాడు. దేశదిమ్మరిగా ఊరూరు సంచారం మొదలుపెట్టాడు. కానీ ఉన్న ఊరు విడిచిన వానికి వేరేచోట బలంలేదని త్వరలోనే తెలుసు కున్నాడు. ఎంత భూమి తిరిగినా లాభంలేదని మళ్ళా ఊర్లోకొచ్చాడు. కుటుంబసభ్యులు అసహ్యించుకున్నారు. ఊళ్ళోవారందరూ ఎగతాళిచేశారు. అందరూ తనలోనే తప్పులెన్నగా వారికి తనను వేలెత్తిచూపే నైతికబలంలేదనే విషయం తెలుసుకుంటాడు. వారి పూర్వ జీవితాలను వడగట్టాడు. మాసినబట్టలతో, పెరిగిన గడ్డంతో ఉన్న అతన్ని లోకులు పిచ్చివానిగా జమకట్టారు. వెర్రివేమన అన్నారు.

నిజంగా వేమనకు ఈ ప్రపంచంమీద విరక్తి పుట్టింది. తాను ఇదివరకు కోరిచేసిన పనులను తానే ఖండించుకునే స్థితికి ఎదిగాడు. పశ్చాత్తాపం కలిగింది. కాని అప్పటికే చాలా ఆలస్యం జరిగింది. శాంతి కరువైంది. నీడపోయింది. గోసాయి గుంపులతో ఊరూరు తిరిగాడు. కాని వారి తప్పులను ఎత్తిచూపి వారికి కూడా దూరమయ్యాడు.

అడవులలో, కొండగుహలలో శాంతికి మార్గంచూపే వారికోసం వెతికాడు. దేశ సంచారంలో అతడికి అన్యాయాలు బాగా అర్థమయ్యాయి. అన్యాయాలకు గుర్రైనవాళ్ళు అతనికి శిష్యులయ్యారు. సహించలేనివారు రాళ్ళతోకొట్టి వెంటతరిమారు. లౌకిక స్పృహను విస్మరించి వైరాగ్యంతో దిగంబరాన్ని ధరించాడు. సమాజ రీతులకు అతని ప్రతిస్పందనలే ప్రజలకు ఉపదేశాలయ్యాయి. నగ్నవేమననుచూసి లోకులే సిగ్గుపడ్డారు. కాని వేమన దానిని ఎప్పుడో జయించాడు. ఎవరు విన్నా వినకపోయినా జ్ఞానమార్గాన్ని ఉపదేశించి దేశమంతా తిరిగి, రోష్టుపడి, ఉద్రేకపడి, అన్వేషించి ఎప్పుడో ఎక్కడో తనువు చాలించి ఉంటాడు.

మారిన పరిస్థితుల్లో పాత అలవాట్లకు కొత్తభావాలకు ఘర్షణ తప్పదు. గ్రామీణ వ్యవస్థలోని సంకుచిత భావాలను, మూఢనమ్మకాలను, దురలవాట్లను వ్యతి రేకించే ధోరణి నాడు బయల్దేరింది. అది తాత్త్విక అన్వేషణరూపంలో చిన్నకులాల్లోంచి వెలువడింది. మారిన పరిస్థితుల్లోని నిరాశను, కొత్తని ఎట్లా అర్థంచేసుకోవాలో తెలియని ప్రజల సందిగ్ధతని పద్యాలరూపంలో తెలియజేశాడు. వేమన ప్రతిఘటనలు వైవిధ్యంగా ఉం టాయి. గ్రామవ్యవస్థ, దురలవాట్లు, స్త్రీలను హీనంగాచూసే దుస్సంప్రదాయం అతడిని వదిలి పెట్టలేదు.

సమాజంలో స్త్రీలపట్ల పురుషులకుండే స్వాభావికమైన ఆధిపత్య అవగాహనతో వేమన స్త్రీలను పరిశీలించాడు. తన సంసారాన్ని త్యజించి, విరాగియై సంచరించాడు. స్త్రీలవల్ల వచ్చే బాధలను-

‘స్త్రీలు గలుగుచోట చెల్లాటములు గల్గు
స్త్రీలు లేనిచోట చిన్నబోవు
స్త్రీలు చేత నరులు చిక్కుచున్నారయా...’
‘స్త్రీలకును బెడుదురు స్త్రీల శ్రాద్ధంబులు
స్త్రీల యోగ్యమేమి చెప్పవచ్చు
స్త్రీల కిడుట కంటె శిలల కిడుటమేలు...’ అంటూ

స్త్రీల హృదయాలు శిలలవలె కఠినమైనవని వేమన ఆరోపించారు. పురుషులు కోరుకునే జీవితానికి, వారు తలపెట్టే పనులకు స్త్రీలు ప్రతికూలంగా స్పందిస్తే కొన్ని ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అయితే స్త్రీలు భావించే పనులు పురుషులకు అనుకూలంగా లేనట్లయితే అవి కార్యరూపం దాల్చే అవకాశమే లేదు. స్త్రీ చేయదలచిన పనులన్నీ పురుషుడి అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉండాలని పురుష ప్రధానమైన సమాజంలో కోరుకుంటారు. ఈ భావాలన్నింటికి వేమన ప్రాతినిధ్యం వహించినట్లు కనిపిస్తుంది. పురుషుడు ఆధ్యా త్మిక జీవితాన్ని వాంఛించినా, ఇతర కార్యాల్లో పాల్గొనాలని భావించినా స్త్రీ ఆటంకంగా మారడాన్ని సహించలేని సామాజిక విలువల్లోనే వేమన జీవించాడు. ఆ భావాలనే ప్రతిపాదించాడు. స్త్రీ, పురుషుడి జీవితంలో ప్రవేశించే తొలిరోజుల్లోనే తనకు అణకువగా ఉండేలా మలచు కోవాలని వేమన బోధించాడు.

వేమన భావాలు, ఆలోచనలు అతని కాలవే పునాదిగా లేచిన గోపురాలు, సమకాలంలో వేళ్ళూనలేని కవి ఎంత ప్రతిభావంతుడైనా కాల మారుతాల అఘాతా లకు తట్టుకోలేడు. స్వానుభవం వేమన్న కవిత్వానికి జీవధాతువయింది. శీలవతి, సుగుణవతి, సంస్కారవతి అయిన స్త్రీని వేమన పవిత్ర భావంతో చూశాడు. దుశ్శీలవతుల్ని, గయ్యాళుల్ని దుయ్యబట్టడంతో ఏమాత్రం వెనుకంజవేయలేదు. వేమన జీవితంలో దాంపత్య సుఖాల్ని అనుభవించలేక కసిని పెంచుకొని స్త్రీపై ద్వేషాన్ని అందమైన ఆటవెలది పద్యాల్లో పొందుపర్చాడని ఒక అపవాదం ఉంది. కానీ ఇది ఎంత మాత్రం నిజంకాదు. వేమనలో ఒక గొప్పతనం ఉంది. ఆయన సమాజంలోవున్న స్త్రీలందరినీ ద్వేషించలేదు, దుయ్యబట్టలేదు, తిట్టలేదు, తూలనాడలేదు. సహృదయ పాఠకులు ఈ విషయాన్ని పరిశీలనా దృష్టితో గమనించాలి. గొప్ప సంఘసంస్కర్తను పట్టుకొని స్త్రీ ద్వేషిగా ముద్ర

వేయడం సమంజసం కాదు. ఒక్క దృక్కోణం నుంచి మాత్రమే చూసి వేమనను స్త్రీ ద్వేషిగా అభివర్ణించారు.

వేమన సుగుణవంతురాలు భార్య వున్నప్పుడు గృహమే స్వర్గసీమగానూ ఆదర్శదాంపత్య సుఖాల్ని అందించు ఇల్లాలే ఇంటికి జ్యోతిగా భావిస్తూ-

'సుగుణవంతురాలు సుదతియై యుండిన
బుద్ధిమంతులగు(దు బుత్రులొప్ప
స్వర్గమేటికయ్య సంసారి కింకను'

మంచిగుణం కలిగిన భార్యా, చెప్పింది అర్థం చేసుకుని పాటించే కొడుకులూ ఉంటే ఇల్లే స్వర్గం అన్నాడు. సుగుణవంతురాలు అంటే కష్ట సుఖాలను సమంగా పంచుకుని చేదోడు వాదోడుగా ఉండేదని అర్థం చెప్పవచ్చు. అంటే ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఆహ్లాదకరంగా ఉండాలన్నాడు.

'గుణవతియగు యువతి గృహము చక్కగనుండు
చీకటింట దివ్వె చెలగురీతి
దేవియున్న యిల్లు దేవార్చన గృహంబు'

చీకట్లో దీపంలాగ బాధ్యత తెలిసిన ఇల్లాలి ఇల్లు ఊరికి ఆదర్శంగా ఉంటుంది. అట్లాంటి ఇల్లాలు దేవి. ఇల్లు ఆలయం. 'చీకటింట' అని వేమన అంటున్నాడు. ఇది గ్రామవ్యవస్థ విచ్ఛిన్నతను తెలియజేస్తుంది. వేర్పాటు ధోరణులు, ఉమ్మడి కుటుంబం చెదిరిపోవటం. అలాంటి సమయంలో ఎక్కడ ఓ యువతి ఉమ్మడి కుటుంబంలో సర్దుకుపోతుందో ఆమె గుణవతి, దేవి అవుతుందన్నారు.

'చదువులందు పాడి మొదవులందును స్త్రీల
పెదవులందు రాజ్యపదవులందు
ఆశ లుడిగినట్టి అయ్యలు ముక్తులు'

వేమన వ్యక్తిగత వ్యామోహాలు ప్రజలకు ఏవిధంగాను ఉపయోగపడవన్నాడు. పాండిత్య ప్రకర్షకోసంగాని, పేరు కోసంకాని చదివే శుష్క విద్యలు, సంపద పెంచుకోవడానికి సమకూర్చుకునే ఆలమందలు, స్త్రీ వ్యసనాలు, అధికార కాంక్షలు వంటి ఆశలుగలవాళ్ళు బంధితులేకాని ముక్తులు కారన్నారు. నలుగురికి ఉపయోగపడే చదువులు కావాలన్నాడు. ఒక్కడికే సంపద పెరగటంవల్ల ఇతరులకు కలిగే ప్రయోజనంలేదన్నాడు. స్త్రీ కుటుంబ వ్యవస్థ పరిధిలో సాగాలి. అధికారం ప్రజలకు సేవ చేయటానికి కాని స్వార్థ ప్రయోజనాలకు కాదన్నాడు.

ఇంటిలోని ఉత్తమ ఇల్లాలిని విడిచిపెట్టి వేశ్యలవెనుక తిరుగువాడు వెర్రివాడుతో సమానమని అంటూ-

'ఇంటియాలి విడిచి యిల జారకాంతల
వెంట( దిరుగువాడు వెర్రివాడు
పంటచేను విడిచి పరిగయేరినయట్లు'

జారకాంతల చుట్టూ తిరిగే సంప్రదాయం నాడు సమాజంలో ఉందని ఇందులో చెప్తున్నాడు. నాటి సమాజంలో అది గౌరవంగా భావించబడేది. విచ్చలవిడి శృంగారంలో కొట్టుమిట్టాడే జనులు వెర్రివాళ్లని సంబోధిస్తున్నాడు. వివాహం చేసుకున్నాక భార్యను మాత్రమే సుఖపెట్టాలని, భార్యను పంటచేనుగా తెలియజేశాడు. అలాకాకుండా పంటను వదిలేసి వేరేవాళ్ళు పంటను అనుభవించాక వదిలేసిన పరిగకోసం వెళ్లేవారి గురించి ఈ పద్యంలో తెలియజేశాడు. నాటి సమాజంలోని జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు ఈ పద్యంలో వివరించాడు.

సుగుణవంతురాలి పలుకులు మధురాతి మధురంగా ఉంటాయంటూ-

'పనసతొనల కన్న పంచదారకన్న
జుంటి తేనెకన్న జున్నుకన్న
చెరకు రసముకన్న చెలుల మాటలె తీపి' అన్నారు.

పనస తొనలు, పంచదార, జుంటితేనె, జున్ను చాలా తియ్యని పదార్థాలు. వాటిని తింటుంటే ఎవరికైనా తినాలనే ఆరాటం ఎక్కువగా కలుగుతుంది. ఎందుకంటే అవి మనసుకు ఆనందాన్ని కలిగిస్తాయి. అటువంటి పనస తొనలకంటే, పంచదారకంటే, తేనెకంటే, జున్నుకంటే, చెరుకు రసంకంటే ఇంట్లో ఇల్లాలిమాటలు తియ్యనైనవి.

కాబట్టి జారస్త్రీల దరిచేరకుండా ఇంట్లో భార్యలను సుఖంగా, సంతోషంగా చూసుకోవాలన్నారు.

ప్రాచీన కాలంనుంచి పెళ్ళికాని ఆడపిల్లలను దేవాలయాలలో సేవకొరకు మొక్కుబడిగా సమర్పించే వారు. వారు శాస్త్రబద్ధమైన నాట్యంచేసేవారు. రాజులు కూడా 'దేవాలయ కాంతల' పద్ధతిని పోషించి వారివలన వచ్చేరాబడిని సైన్యపు ఖర్చులకు వినియోగించేవారు. దేవుని పేరుమీద వదలివేయబడిన వారు పడుపుకత్తెల స్థాయికి దిగజార్చబడ్డారు. తెలుగుదేశంలో వారిని బసివి రాండ్రు, దేవదాసీలు అని వ్యవహరించేవారు. బసవని పేరుమీద వదిలిన వారిని బసివిరాండ్రనీ, వైష్ణవాలయా లకు సమర్పించబడిన వారిని దేవదాసీలని పిలిచేవారు. వేమన పద్యాల్లో వీరి ప్రస్తావన ఎక్కువ పద్యాల్లో కన్పిస్తుంది. వేమన పద్యాల్లో బసివిరాండ్ర ప్రసక్తి కని పిస్తుంది. బసివి సంప్రదాయాన్ని నిరసించాడు. కొద్దిమంది వేమనను వేశ్యాలోలుడుగా పేర్కొనడం ఆనాటి మతపరిస్థితులే కారణం కావచ్చు.

ఇంకా నాడు గురుదక్షణ పేరుతో గురువులు ప్రజల నుంచి అనేకరకాలైన పన్నులు వసూలు చేసేవారు. ప్రజలు భక్తితో ఇచ్చే కానుకలతో వారు తృప్తిపడేవారుకాదు. కట్టుబాట్లు తప్పినవారినుండి ధనం నిర్దయగా వసూలు చేసేవారు. ఇవ్వలేనివారి ముఖాన పేడనీరు చల్లి అవమానించేవారు. అప్పటికీ వాడు చెల్లించకపోతే వాడి పిల్లల్ని లాక్కునేవారు. ధనం ముట్టేదాకా వారితో వెట్టిచాకిరీ చేయించుకునేవారు. ఒక్కోకప్పుడు ధనానికి బదులుగా వాడి భార్యను లాక్కుపోయిన సంఘటనలు కూడా ఉండేవి. చివరి అస్త్రంగా శాపాలతో బెదిరించేవారు. ఎవరో కొందరు వివాహితులైనప్పటికీ గురువులందరూ బ్రహ్మచారులుగా ఉండేవారు. వీరి బ్రహ్మచర్యం నేతి బీరకాయవంటిది. వీరెప్పుడూ ఒకరిద్దరు స్త్రీలను వంటలక్కలుగా నియమించుకునేవారు. సామాన్యులకు విధించే కట్టుబాట్లు తమకు వర్తించనట్లుగా ప్రవర్తించేవారు. ప్రజలు గురువులను లోలోపల అసహ్యించుకునేవారు. ఈ విధానాన్ని వేమన చాలా పద్యాల్లో వ్యక్తంచేశాడు.

ఏ సాహిత్య ధోరణికైనా, ఏ కాలంలోనైనా సామాజిక ప్రయోజనం ఉండితీరాలి. సమాజంలో సగభాగమైన స్త్రీలను రెండవశ్రేణి పౌరులుగా తయారుచేసింది ఈ వ్యవస్థ. దీనికి ఎవరు ఎంతవరకు బాధ్యులనేది వేరే విషయం. అయితే స్త్రీలు చైతన్యవంతులై పురుషులతో సమానంగా నిలబడలేనంతకాలం సమాజ శరీరంలో సగభాగం చచ్చుబడినట్లే. తొలిదశలో ఈ విషయాన్ని గ్రహించిన సంస్కర్తలు స్త్రీల చైతన్యానికి పాటుబడ్డారు. సంస్కరణలద్వారా స్త్రీల పురోభివృద్ధిని కాంక్షించిన తదనంతరం స్త్రీలు తమంతతాముగా తమ సమస్యలను గుర్తించి, వాటిగురించి ఆలోచించి పరిష్కారాలకోసం ప్రయత్నంలో భాగంగానే స్త్రీవాదం ఆవిర్భవించింది. నిన్న మొన్నటిదాకా 'ఆడదానిగా పుట్టడంకన్నా అడవిలో మానై పుట్టడం మిన్న' అనుకొన్న స్త్రీ నేడు 'నేను స్త్రీనైనందుకు గర్విస్తున్నాను' అని చెప్పుకోగలుగుతుంది. ఇదంతా వేమనలాంటి సామాజిక కవులు ఏర్పరచిన మార్గంగా చెప్పుకోవచ్చు.

**ఉపకరించిన గ్రంథాలు :**

1. తెలుగులో భక్తికవిత్వం సామాజిక విశ్లేషణ - పిల్లలమర్రి రాములు
2. తెలుగు సాహిత్యం మరోచూపు - కె.కె. రంగనాథాచార్యులు
3. పేర్వారం సాహితీ నీరాజనం - రవ్వా శ్రీహరి (సంపా)
4. వేమన్నవాదం - ఎన్. గోపి
5. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు - జి.వి. సుబ్రహ్మణ్యం

**BHAVAVEENA** ***Spl. Issue***
**Vol. 19, Issue. 3, March 2022**
**ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

**భావవీణ**

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రామాయణకాలంలోని మహిళ

**– డా॥. దండెబోయిన పార్వతీదేవి,** తెలుగు అధ్యాపకురాలు, కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ), కర్నూలు.

నారీ జీవన విధానం జాతి నాగరికతను నిర్ణయిస్తుంది' అన్నది విజ్ఞుల అభిప్రాయం.ఒక జాతిపురోభివృద్ధి సమాజం స్త్రీకి ఇచ్చిన స్థానాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. సమాజంలోని స్త్రీల స్థితిగతులను బట్టే జాతి సంస్కృతి లోని ఔన్నత్యాన్ని ఆంతర్యాన్ని పూర్వాపరాలను అంచనా వేయవచ్చు.

వేదకాలం నుండి స్త్రీయొక్క ప్రాధాన్యాన్ని, ఔన్నత్యాన్ని సమాజం స్తుతిస్తూనే ఉంది. స్త్రీపురుష దృఢతర పవిత్ర బంధం సమాజ స్థిరీకరణకు మూలమని గుర్తించింది. కుటుంబ రథానికి స్త్రీపురుషులను రెండు చక్రాలుగా వర్ణించింది. ఋగ్వేదం పరబ్రహ్మను సైతం 'త్వంస్త్రీ, త్వంపుమాన్' అని సగం స్త్రీ, సగం పురుషుడుగా అభి వర్ణించడం విశేషం. స్త్రీ కుటుంబములోనే గాదు బయట కూడా నైతిక ఆధ్యాత్మిక శక్తిగా, సంఘ గమనాన్ని నిర్దేశించే వ్యక్తిగా, ధైర్యశాలిగా నిరూపించబడింది. అత్యంత నాగరికులమని చెప్పుకునే ఈ రోజుల్లో కూడా లేని స్త్రీపురుష సమానత్వం ప్రాచీనకాలం నాడే ఉండటం విశేషం.రామాయణ సమాజాన్ని గమనించినట్లయితే పురుషులతో పాటు స్త్రీలు ప్రముఖమైన పాత్ర పోషిం చటం కనిపిస్తుంది. స్త్రీ పురుషుల సమానత్వంకోసం పోరాటం చేస్తున్న ఈనాటి సమాజం రామాయణకాలం నాటి స్త్రీ చేతనత్వాన్ని, దానికి సమాజం యొక్క వత్తాసును ఆ ఆసరాను గమనిస్తే చాలా వాస్తవాలు మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

పరమ ఆదర్శకావ్యం రామాయణం. కుటుంబ వ్యవస్థను స్థిరీకరించి చూపిన కావ్యమిది. ప్రపంచానికి ధర్మాన్ని ప్రభోదించారు ఈ కావ్యంలోని రామాదులు. ఈ ధర్మస్థాపనకు కౌటుంబిక విలువలను కాపాడే దిశలో, మహిళల పాత్ర మనం విస్మరించదగ్గది కాదు.

విద్యాభ్యాస విషయానికొస్తే స్త్రీపురుషులిద్దరూ కలసిమెలసి వేదాధ్యయనం చేసినట్లు భారత భాగవత రామాయణాది గ్రంథాలు చెబుతున్నాయి. రామా యణంలో కుశనాభుడు తన బిడ్డలను సంగీత నృత్య విద్యలలో నిష్ణాతులుగా చేసినట్లు చెప్పబడింది. మంచి నేర్పుగల రాజనర్తకులు, గాయనీ గాయకులు రాజులను మునులను మెప్పించి కార్యాలు నడిపించిన సందర్భాలు సర్వసాధారణం.

వివాహ నిర్ణయంలో స్త్రీలకు పరిమిత స్వేచ్ఛయే కన బడుతుంది. సీత స్వయంవరం ద్వారా భర్తను ఎంచు కుంది. ఆ నాటి స్త్రీ స్వేచ్ఛను, మనోభావాలను వ్యక్తీకరించ గల ఆమె స్థిరసంకల్పాన్ని, పరిణితిని దర్శింపజేసింది. అసలు వివాహమే లేకుండా తాపసులైన స్వయంప్రభ (రామాయణం) లాంటి స్త్రీలు ఆ కాలంలో కనిపిస్తారు. రామాయణంలో కైకేయి భర్తృప్రేమలో స్వేచ్ఛా ప్రణయత్వమే కనబడుతుంది. దీర్ఘతముని భార్య ప్రద్వేషిణి సంతానవతి అయి కూడా భర్తపట్ల అయిష్టతను ప్రకటించింది. ఇష్టానిష్టాలను స్వేచ్ఛగా ప్రకటించగల వ్యక్తిత్వము ఆ నాటి స్త్రీలలో స్పష్టమౌతుంది.

తన సౌశీల్యంతో సాత్వికతతో కౌసల్య, సుమిత్ర, సీత వంటి స్త్రీమూర్తులు వన్నెకెక్కారు. అదే సమయంలో వీరు స్వాభిమాన పరిరక్షణలో వెనకడుగు వేయలేదు. తనను అడవులకు అనుమతించని రాముడితో సీత 'నీవు మహా వీరుడవని నమ్మి నాతండ్రి నన్ను నీకిచ్చి వివాహం చేశాడే గానీ నీవు ఇలా పురుషరూపంలో ఉన్న స్త్రీవని గ్రహించ లేకపోయాడు" అని కఠినంగా మాట్లాడుతుంది. ఒకసారి తనను రాముడు పరిత్యజిస్తే లోకం కోసం సహించింది. రెండవసారి స్వాభిమానంతో తల్లి గర్భంలో కలిసి పోయింది. వ్యక్తిత్వాన్ని నిరూపించింది.

ఇక అలంకారాల విషయానికొస్తే సర్వమంగళప్రదగా స్త్రీని ఆనాటి సమాజం అభిలషించినట్లు కనబడుతోంది. రామాయణంలో అరణ్యాలకెళుతున్న సీతకు సర్వాభరణాలు ఇవ్వమంటారు. ఆమెనే రాజ్యం ఏల మంటాడు వశిష్ఠుడు. ఆమెకున్న స్థానం ఇక్కడ వెల్ల డౌతోంది. పుట్టినింటి వారినుండి స్త్రీకి ఆర్థికపరమైన ఆసరా ఉండేదని తెలుస్తుంది. కౌసల్య పుట్టింటి ధనం చాలా ఉందని రామాయణం చెబుతుంది.

స్త్రీ ప్రాధాన్యతను ఉగ్గడిస్తూ రామాయణంలో దృష్టాం తాలు కనిపిస్తూ ఉన్నాయి. స్త్రీ పరాధీనతను, అస్వతంత్రతను, వ్యవస్థకు ఒక పనిముట్టుగా మారిన పరిస్థితిని ప్రతిబింబించే మరో కోణం కూడా ఇందులో కనిపించకపోదు. ఒకే కాలం ఒకేజాతి ఒకే సమాజం అయినా ఒక సాంప్రదాయానికి లేదా ఒక పద్ధతికి మంచి చెడు పర్యావసానాలు రెండూ తప్పక ఉంటాయన్న విషయం మనం క్కడ గమనించవలసి ఉంటుంది.

ఈదశలో మహిళ తానేమి కోల్పోయానో గుర్తించ గలిగింది. ఎలా తన ఉనికిని స్థాపించుకోవాలన్న తాపత్రయంలో పడింది. ఆలోచనాసరళిని మార్చు కోవడానికి ప్రయత్నించింది. నిరర్థకపు హద్దులు దాటి ఉన్నతికి ఎదగటానికి ప్రయత్నించింది. విశాల ప్రపంచంలో తానూ సగమున్నానన్న స్పృహను ఆత్మ గౌరవాన్ని ఆర్థిక స్థితిని పెంచుకోవడానికి, ప్రకటించటానికి ప్రయత్నించింది. ఇది విశేషమైన ప్రభావమే. ప్రపంచీకరణ దృక్పథం ఒకవైపు, ప్రబలమవుతున్న స్త్రీ వ్యక్తిత్వ పరిరక్షణ పోరాటము ఒకవైపు మహిళల ఆలోచనా స్వభావాన్ని, బ్రతుకును మలుపు తిప్పటం ప్రారంభించాయి. పరిపూర్ణ మహిళగా నేడు తమను తాము స్థాపించుకోవడంలో స్త్రీలు సఫలమవుతున్నారు. తారాజువ్వలా అన్ని రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా మహిళలు అభ్యుదయ పథంలో దూసుకుపోతున్నారు.

ఈతరం మహిళకు రామాయణకాలం నాటి మహిళకు చాలా వ్యత్యాసం వుంది.

రామాయణకావ్యంలో మనం పరిశీలించినట్లయితే నాలుగు సమాజాలు ప్రధానంగా కనిపిస్తాయి. అవి సురలు, నరులు వానరులు,రాక్షసులు అనే సమాజాలు. ఇవి గాక తాపసులు ఉన్న మున్యాశ్రమాలు కనిపిస్తాయి. వీటిలో నరులైన రామాదుల సమాజంలో నాగరికత కనిపిస్తుంది. రావణాదులైన రాక్షస సమాజంలోనూ నాగరికత కనిపిస్తుంది. వానరులది వారిదైన నాగరికతను చూస్తాము. ఈ సమాజాల నాగరికతను స్థాపనచేయటంలో మహిళలు విశేషంగా బాధ్యతను తీసుకున్నట్లు మనం గుర్తించవచ్చు. కౌసల్య సీతాదులు ఉదాత్తమైన సంస్కారాన్ని ప్రదర్శించారు. ఒక సమాజ స్థిరీకరణకు అభివృద్ధికి కొలమానం శిష్టమైన నాగరికత. ఆ నాగరికతకు నిదర్శనం ఉదాత్త సంస్కార ప్రతిఫలనము. దానికి తోడ్పాటునందించిన వారే కౌసల్య, సీతాది రామాయణ మహిళలు.కైకను మినహాయిస్తే మ్గింలిన వారందరూ వివేకవంతంగా విజ్ఞతతో ప్రవర్తిల్లారు. వారికి పెద్దపెద్ద చదువులు ఉన్నట్లు ప్రత్యేకంగా చెప్పబడకపోయినా వేదవిషయమైన చక్కటి విజ్ఞానంతో నిర్మాణం అయిన సంస్కారాన్ని వారి ప్రవర్తనలో చూస్తాం. తమను తాము విశ్లేషించుకోవడం వారు నైతికంగా భావించారు.

తమ కుటుంబ పటిష్టత ప్రధాన ధ్యేయంగా నడిచారు. సమాజ స్థిరీకరణ వారి బాధ్యతగా త్యాగాలు చేశారు. దేశప్రేమ వారి ముందున్న పెద్ద ఆశయం. కౌసల్య నిబ్బరం సుమిత్ర సహానుభూతి, కుటుంబక్షేమాభిలాష, ఊర్మిళ దీర్ఘతపస్సు సాధ్యం అయ్యేవి కావు. సహధర్మ చారినిగా లోకానికి ఆదర్శమయ్యే శీలనిర్మాణం సీతలో ద్యోతకమయ్యేదికాదు. సీతమ్మ నిబ్బరం కలది. విజ్ఞత నేర్చినది స్వతంత్ర భావాలు కలిగినది. స్వేచ్ఛగా ప్రశ్నించ గలది. అయినా వినమ్రత వివేకం ఆభరణాలుగా అటవీ భూముల్లో ఆనందంగా గడిపింది. అయోధ్యగా రామునికి భ్రమింపజేసింది, భర్తకు బ్రతుకు మార్గంలోనే కంటకా లను తొలగించేందుకు పూనుకొంది. భావి నిర్మాతకు భవిష్యత్తును ఆశాజనకంగా దర్శింపజేసింది. సహాను

భూతితో దాంపత్యంలోని గాఢతను తీవ్రసాధనతో లోకానికి ఎరుకచేసింది. ఆమె చిత్త సంస్కారం ఆ సామాజాలకే కాక తరతరాలకు అవసరమన్న సత్యానికి సీత ఆలంబనగా నిలిచింది.

రాక్షస సమాజంలోనూ నాగరికత లేకపోలేదు. అభేధ్య సుందర లంకా నిర్మాణం వారి జీవన విధానం గొప్పవి. అయితే మితిమీరిన దురహంకారము అనాగరికలుగా రాక్షసులను నిలిపింది. అయినప్పటికి తమలోగిళ్ళలోను మనసుల్లోను గొప్ప నైతికతను స్థాపించటానికి ప్రయత్నించిన మహిళలు మండోదరి త్రిజట సరమ మొదలైనవారు. గుణగణోత్తరుడా ఆ విభీషణుడు బ్రతికె... కలుషలోలత నీవిట్లు పొలయవలసె' అని నర్త మరణంలోనూ ఆయన దుర్గుణాలకు ఏడ్చింది మండోదరి. సీత బాధల్లో సహానుభూతికి పొందింది. పరస్త్రీ కాంక్ష పాపమని అది రాజ్య పతనానికి కారణమని భర్తను సరిదిద్దే ప్రయత్నం చేసింది. మానవత్వం మహోదాత్తత మూర్తీభవించిన మహిళగా తనకు తాను ఆవిష్కరించుకొంది. అసహాయస్థితిలో ఉన్న రాక్షసకాంత సరమ నీతికోసం తపించింది. నరమాంస భక్షకులైన రాక్షస కాంతల్లో త్రిజట సీత పరమ పవిత్రతను గుర్తించి గౌరవించటంలో ఆమె సద్గుణం సంస్కారవంతంగా కనిపిస్తుంది. సీతను చంపవద్దని రావణుని ఆపిన రాక్షస కాంత ధాన్యమాలిని నైజం రాక్షసత్వమే అయినా ఎక్కడో ఒక చిన్నమూలన ఉన్న మానవత్వపు ఛాయ గమనార్హము.

అలాగే వానర సమాజం పైరెండింటివలే నాగరికం కాకపోయినా వారిదైన జీవన సంస్కృతిలోనూ ధర్మాన్ని అనుసరించినవారు తార, రుమలు. స్వేచ్ఛా ప్రవృత్తి నియమబద్ధతలేని దంపతీ వ్యవస్థలో వారున్నప్పటకి తోటివారి ధర్మాశయాన్ని వారు ఆలోచించారు. ప్రత్యుపకార ధర్మాన్ని పాటించటంలో తార కనబరచిన వివేకం విజ్ఞత రామలక్ష్మణులకు సంతోషాన్నిచ్చింది. రామ కార్యాన్ని నెరవేర్చటంలో ఆమె నేర్పులో వానర సమాజ హితం కనబడుతుంది. కిష్కింధ క్షేమం కాంక్షించబడింది. సుగ్రీవుడికి ఇల్లాలు అయినప్పటికి కుమారుడి అభ్యుదయం పట్ల ఆమెకున్న కోరిక వెనుక తల్లి బాధ్యత గోచరమైతుంది. వీరేకాక రామాయణ కావ్యంలో ఇతర స్త్రీలు వారాంగనలు తాపసస్త్రీలు కనిపిస్తారు. ఋష్య శృంగుడు లాంటి వారిని దేశంలోకి రప్పించటంలో వారాంగనల సదాశయం ప్రశంసనీయం.తాపసకాంతల అసాధారణమైన నిశ్చలత్వం చాంచల్యానికి లోనుకాని మహిళమూర్తిమత్వానికి నిదర్శనం. శబరి మనఃపవిత్రత ముక్తి హేతువుగా నిలిచింది.

కాలక్రమంలో మాతృస్వామ్యవ్యవస్థ స్థానంలో పితృస్వామ్య వ్యవస్థ బలపడటం జరిగింది. సమూహాల నిర్ణయాలు పోయి సామాజిక కట్టుబాట్లు ఏర్పరచే ఒక వ్యవస్థ వచ్చింది. స్త్రీకి విధులు, పరిమితులు బలంగా విధించబడ్డాయి. ఈ దశలో స్త్రీకి సహజంగా ఉన్న శక్తిసామర్థ్యాలు, తెలివితేటలు నియంత్రించబడటం మొదలైంది. ఇక మొత్తం వ్యవస్థ ఏదైతే ఉందో అది పురుషుడిని ప్రధాన భూమికగా చేసుకొని సాగిందనే చెప్పాలి. దీందో స్త్రీల సామాజిక జీవన పరిణామ క్రమంలో ఎంతో వైవిధ్యం చోటుచేసుకుంది. చాలామటుకు స్త్రీ వంటింటికి పరిమితమైంది. అసమానతకు లోనైంది. అభద్రతకు గురౌతూ వచ్చింది.

ఇక సమాజంమీద అత్యంత ప్రభావశీలి అయిన కళారంగం స్త్రీని ఏ కోణంలో దిద్దటానికి ప్రయత్నిస్తోంది.

అనేది చాలా అవసరమైన చర్చ. ఇందులో ప్రత్యేకించి సినీరంగాన్ని దర్శిస్తే ఒకప్పటి విలువల ఆధారిత చలన చిత్రాల్లో స్త్రీ స్వాభిమాన ప్రతీకగా దృశ్యమానమయ్యేది. అలాంటి చాలా కొన్నింటిని మినహాయిస్తే ఇటీవల ఎక్కువ చిత్రాలలో వ్యాపార దృక్పథం బలంగా చోటు చేసుకుంది. మహిళ ఉగ్గడింపబడుతోందా లేకవ్యాపార దృష్టితో చూపబడుతోందా అర్థంకాని తికమక పరిస్థితి, ద్వదవైఖరి జనం మెదళ్ళలోకి చొప్పించబడుతోంది. గొప్ప ఉదాత్త లక్ష్యం, వజ్రసమమైన సంకల్పం, గుణసంపత్తి

కలిగిన స్త్రీని అతి పేలవంగా కొన్ని తావుల చౌకబారు తనంగా దృశ్యమానం చేయడానికి సంకో చించడం లేదు. ఇది తరతరాల జాతి సంస్కృతి న్నత్యాన్ని, పటిష్టతను దిగజార్చుకోవడమే అవుతుంది. తద్వారా స్త్రీ సమాజం అగౌరవపడటానికి ప్రత్యక్షంగా కారణభూత మౌతున్నది.

ఆదర్శాల పేరుతో అణచివేతకు స్త్రీని గురి చేయకుండా స్వేచ్ఛగా విజ్ఞానవంతంగా ఎదిగే అవకాశాన్ని కలిగించటానికి ప్రస్తుత సమకాలీన సాహిత్యం అనేక ప్రక్రియల్లో తనదైన ప్రయత్నంతో ముందుకు వెళ్తోంది. తన ముందున్న అవకాశాలను అందుకొని అన్ని రంగాల్లో మహిళ బలోపేతం అవుతున్న తరుణమిది. ఇప్పుడే సమాజం, సాహిత్యము మరియు కళారంగాలు ఎంతో బాధ్యతగా వ్యవహరించగలగాలి. శాస్త్రీయ దృష్టితో, అవగాహనతో సగటు మహిళను చైతన్యపరచ గలగాలి. అప్పుడే స్త్రీ కోల్పోబడిన తన వ్యక్తిత్వాన్ని తిరిగి అందు కోగలదు. పరిపూర్ణమైన స్త్రీగా విరాజిల్లగలదు.

నాటికి నేటికి జనాభాలోనే కాదు జాతి జవసత్వా లలోనూ స్త్రీ సగం అనే సత్యాన్ని చాటడానికి సాహిత్య ప్రక్రియలు ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు స్త్రీ పాత్రల స్వభావ పరిణామ క్రమంలో తెలుస్తోంది. అయితే వాటి ప్రతిఫలనం ఆయా కాలపరిస్థితులను బట్టి అనేక రూపాలుగా పర్యవసించడం గమనార్హం. నేటి మహిళ మాత్రం అవకాశాలను తానే సృష్టించుకొని స్వయంగా ప్రకాశించడానికి ప్రయత్నిస్తోంది.సాహిత్యం, సమాజం మనకందిస్తున్న అవలోకనం ద్వారా స్త్రీ కఠినమైన లోతుల నుండి పెకలించుకొని పైకి వచ్చి పారే సజల స్రవంతి లాంటి స్వభావం కలది. దానిని ప్రజాక్షేమ సస్యాలవైపు మళ్ళించుకోవడమే సమాజ లక్ష్యం, లక్షణము కావాలి.

✿✿✿

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# 'వొంతు' కథల సంపుటి - స్త్రీల సమస్యల చిత్రణ

- డా॥. పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

ఆంధ్రసాహిత్యంలో ఆధునికయుగం ఒక విప్లవాత్మక పరిణామం. భారతీయసాహిత్యంలో నూతన ప్రక్రియలు ప్రవేశించాయి. సాహిత్యం రూపంలోనూ, వస్తువులోనూ, శైలిలోనూ నూతన ఒరవడిని సంతరించుకుంది. వైవిధ్యభరితమైన వస్తువులతో నవల, నాటకం, కవిత్వం, కథ వంటి నూతన సాహితీపంథాలకు ఆధునికసాహిత్యం నిలయమైంది. ఆధునిక సాహిత్య యుగ ప్రారంభంలో నవల, నాటకాలకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ సుదీర్ఘకాలం సాహిత్యప్రవాహాన్ని మోసుకొచ్చింది ఒక కథానికని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. ఎన్నో నూతన సాహితీ పోకడలు వస్తున్నా, వెళ్తున్నా కథానికలు మాత్రం ఆదరణ తగ్గక రోజురోజుకు పెరుగుతున్నది. నేటి అత్యాధునిక సాహిత్యయుగంలో కథాప్రక్రియకు మాత్రం ప్రత్యేక స్థానమున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఆంధ్ర సాహిత్యంలో గురజాడ రచించిన 'దిద్దుబాటు'తో ప్రారంభ మైన కథాసాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించి ఆధునిక తెలుగు సాహిత్యపీఠంపై గౌరవస్థానాన్ని దక్కించుకుంది.

తెలుగు సాహిత్యంలో తొలికథ 1910 సంవత్సరంలో ప్రారంభమైతే చిత్తూరుజిల్లాలో 1940వ దశకంలో తొలికథ ప్రభవించింది. చిత్తూరు ప్రజల జీవన విధానాలను, ప్రజల ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను, స్థానిక సమస్యలను చిత్రిస్తూ ఎన్నో కథాసంకలనాలు, సంపుటాలు వెలువడ్డాయి. ప్రాంతీయతను ఆవిష్కరించడానికి 'చిత్తూరు కథ' సంకలనం కూడా వెలువడింది. మధురాంతకం రాజారాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, సుంకోజి దేవేంద్రాచారి లాంటి కథకులు చక్కని, చిక్కని కథలు రచించి చిత్తూరుకథా సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి ప్రయత్నించారు. చిత్తూరుప్రజల జీవితాలను చక్కగా చిత్రించారు. నేటి అత్యాధునిక సాహితీకాలంలో సమకాలీన సమస్యలను చిత్రిస్తూ ఎందరో యువకథకులు తమ ప్రతిభతో చక్కటి కథలు రాస్తున్నారు. అలాంటి యువకథకుల్లో జిల్లేళ్ళ బాలాజీ ఒకరు. 'సిక్కెంటిక', 'వొంతు' వంటి కథాసంపుటాలను అందించి తెలుగు కథా సాహిత్యానికి ఇతోధికంగా సాహితీ సేవలనందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లేళ్ళ బాలాజీ రచించిన 'వొంతు' కథా సంపుటిలోని స్త్రీలసమస్యలను విశ్లేషించడం నా పత్రోద్దేశం.

'వొంతు' కథాసంపుటం 2016వ సంవత్సరంలో ప్రథమ ముద్రణ వెలువడింది. ఈ కథాసంపుటంలో 'బూబూ', 'తోబుట్టువు', 'వొంతు', 'రాచబాట', 'ఎర్రతివాచీ', 'సమీరా... ఓ సమీరా' లాంటి పదిహేను కథలున్నాయి. ఈ కథలు సమాజంలోని సమకాలీన సమస్యలను, మానవ సంబంధాలను, కులవృత్తుల ప్రాధాన్యతలను, స్త్రీల సమస్యలను చక్కగా ఆవిష్కరించాయి. వీటిలో 'మానస', 'సమీరా ... ఓ సమీరా', 'దృష్టి', 'ముఖాముఖం', 'పరిరక్షణ', 'పంజా' కథల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కథకుడు బాలాజీ సహజంగా చిత్రీకరించాడు. స్త్రీ అనాదిగా పురుష భావజాలం చేత అణచివేయబడుతున్నది. మానసిక హింసకు గురౌతున్నది. కుటుంబంలోని తండ్రి, భర్త, కుమారుడు అనే తేడా లేకుండా స్త్రీలు అనేక మానసిక హింసలకు బలైపోతున్నారు. అలానే బయట సమాజంలో స్నేహం పేరుతో, ప్రేమపేరుతో మోసపోతున్నారు. శారీరక, మానసిక హింసలతో దుర్భరజీవితాలను అనుభవిస్తున్నారు. స్త్రీలను హింసించే వాళ్ళల్లో బుద్ధులు చెప్పే గురువులు కూడా చేరిపోయారు. గుడిలాంటి బడిలో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో గురువుల చేత శారీరక, మానసిక హింసలకు గురౌతున్నారు. ప్రస్తుతం 'వొంతు'

కథా సంపుటంలోని స్త్రీలసమస్యలను చిత్రించిన కథలను విశ్లేషిద్దాం.

'మానస' కథలో జిల్లేళ్ళ బాలాజీ ప్రయాణ సమయంలో అపరిచితుల వల్ల ఏర్పడే సమస్యలను చిత్రించారు. సాధారణంగా బస్సు ప్రయాణంలో గానీ, రైలు ప్రయాణంలో గానీ, విమాన ప్రయాణంలోగానీ కొందరు పురుషులు స్త్రీల మోహానికి గురై వాళ్ళతో స్నేహం చేయాలని ఆశిస్తుంటారు. కొందరు అదే అదనుగా చేసుకొని వారిని తమ వశం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. కొందరు చొరవ తీసుకుని మాయమాటలతో మంచివారిగా నటించి స్నేహం చేసి, తర్వాత వారిని మానసిక హింసలకు గురిచేసేవారూ ఉన్నారు. అందువల్ల కొందరు స్త్రీల సహప్రయాణికుల పట్ల అనుమానాలు పెంచుకుని మానసిక బాధలకు గురౌతుంటారు. 'మానస' కథలో కథకుడు అపరిచితులవల్ల ఒక ఒంటరి స్త్రీకి కలిగే అనుమానాలను, తద్వారా కలిగే భయాలను చక్కగా చిత్రించాడు.

'మానస' కథలో మానస ప్రధానపాత్ర. మానస ప్రయాణంలో తాను మానసికంగా, శారీరకంగా హింసకు గురికావడం మనకు 'మానస' కథలో కనిపిస్తుంది. మానస తిరుపతి నుండి హైదరాబాదుకు బస్సులో ప్రయాణం చేస్తూ ఉంది. మానస తన ప్రక్కన కూర్చున్న వ్యక్తి ప్రవర్తనకు లోలోపల భయపడుతుంది. ప్రతిక్షణం అతన్నే గమనిస్తూ ఉంది. పక్కనున్న ప్రయాణికుడు చిలిపినవ్వు నవ్వడంతో అతను ఏదో ఊహించుకుని నవ్వుతున్నాడని, అతనిలో పాడు ఆలోచనలు ఏవో పుట్టాయని మానసలో అలజడి ప్రారంభమైంది. మధ్యలో రైల్వేగేట్ పడటంతో ఆకలివేసింది. ఏమైనా కొనుక్కుని తినాలంటే మానసకు బిడియంగా ఉంది. అంతేకాకుండా పక్కన కూర్చున్న ప్రయాణికుడు తాను కొన్న జామపండ్లను తీసుకోమని ఇచ్చాడు. మానస తీసుకోలేదు. తనను తాకే నెపంతో కిటికీలో నుండి వంగి జామపండ్లను కొన్నాడు. దాంతో మానస అతనిని మగబుద్ధి పోనిచ్చుకున్నాడు కాదని తిట్టుకుంది. మరోవైపు మెల్లమెల్లగా చీకట్లు కమ్ము కున్నాయి. రాత్రి అవుతోంది. డ్రైవరు బస్సులో లైట్లు ఆర్పేసాడు. దాంతో మానసకు మరింత ఆందోళన పెరిగింది. విపరీతమైన భయంపట్టుకుంది. ఆ రాత్రంతా మానస శివరాత్రి జాగారం చెయ్యాలేమోనని బాధపడింది. చాలా సమయం వరకు నిద్రపోకుండా మేలుకునే గడిపింది. నిద్ర ఆపుకోలేక నిద్రలోకి జారుకుంది. గాఢనిద్రలో అతని భుజంపై తల ఆనించి నిద్రపోయింది. మెలుకువ రావడంతో తన పరిస్థితికి బాధపడింది. అతను నిద్రలో తన ఒంటిపైన చెయ్యి వేసాడేమోనని ఏదోదో ఊహించుకుని కలత చెందింది. కానీ అతను ఎలాంటి ఇబ్బందులు కల్గించేదని గ్రహించి బాధపడింది. కానీ ప్రయాణంలో జరిగే కొన్ని యదార్థ సంఘటనలు స్త్రీలను ఎంతగా హింసిస్తాయో ఈ కథ చక్కగా చిత్రించింది.

నేడు సినిమారంగంలో గానీ, దాని అనుబంధ రంగాలలో గానీ స్త్రీలు ఎందరో అవమానాలు ఎదుర్కొం టున్నారు. మానసిక, శారీరక హింసలకు గురౌతున్నారు. సినీరంగంలో అవకాశాలకోసం ఆత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్ని, చివరకు శీలాన్ని కూడా కోల్పోతున్నారు. అలాంటి అవకాశాల కోసం ప్రేమపేరుతో మోసపోయిన ఒక అమాయకురాలు ఇతివృత్తమే 'సమీరా ... ఓ సమీరా' కథ. సమీరా గొప్ప గాత్రమున్న గాయకురాలు. తమ గాత్రంతో మనసుల్ని రంజింపజేసే గాయని. సమీరా బలహీనతల్ని ఆసరాగా చేసుకుని విశాల్ అనే యాంకర్ తన ప్రమోషన్ కోసం సమీరా శీలాన్ని ఎరగా వేసిన నికృష్టుడు. విశాల్ సమీరాను ప్రేమించినట్లు నటించి తన ప్రమోషన్ కోసం తన పై అధికారులకు సమీరా శీలాన్ని అప్పజెప్పాడు. విహారానికి రమ్మని ఆహ్వానించి మత్తుపానీయాలు తాపించి పై అధికారులచేత మాన భంగం చేయించిన నీచుడు విశాల్. మత్తులో ఉన్న సమీరా శీలాన్ని కోల్పోయింది. స్పృహలోకి వచ్చిన సమీరా తనలాంటి అబలలు ప్రేమపేరుతో బలికాకూడదని విశాల్‌ను అంతంచేసి తాను ఆత్మత్యాగం చేసుకుం

టుంది. ఈ కథలో కళారంగంలో స్త్రీలు ఎదుర్కొంటున్న మానసిక వ్యథలను వివరిస్తూనే వారిలో తెగింపుగుణం అలవడాలని కథకుడు సూచించారు.

స్త్రీల సమస్యలను చిత్రించిన మరో కథ దృష్టి. నేటి సమాజంలో స్త్రీ బాల్యం నుండి వృద్ధాప్య వయస్సు వరకు ఏదో ఒక దశలో, ఏదో ఒక రూపంలో ఎవరివల్లో ఒకరి వల్ల మానసిక హింసలకు గురౌతూనే ఉంది. ఒక్కోసారి కుటుంబంలోని తండ్రో, తల్లో, అన్నో, తమ్ముడు వల్లో హింసకు గురౌతూనే ఉంది. అలా ఒక తండ్రి రాక్షస ప్రవర్తనను భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఒక ధీనురాలి వ్యథ ఈ దృష్టి కథ. దృష్టి కథలో లహరి ప్రధానపాత్ర. లహరి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువు తోంది. లహరి తండ్రి రాజ్‌కుమారు ఎస్సైగా పనిచేస్తు న్నాడు. స్ట్రిక్టు ఆఫీసర్‌గా పేరు తెచ్చుకున్నాడు. భార్య ఉద్యోగరీత్యా ఢిల్లీలో పనిచేస్తున్నది. కుమార్తెను పద్ధతిగా పెంచాలని భావించాడు. నేటితరం యువత ఛాటింగ్‌లు, డేటింగులని పెడద్రోవన పెడుతున్నారని, డ్రగ్స్ మత్తులో కూరుకుపోయి బంగారంలాంటి జీవితాల్ని నాశనం చేసు కుంటున్నారని, తన కూతురు అలా నాశనం కాకూడదని నిత్యం కూతురుని అనుమానిస్తుంటాడు. అప్పుడప్పుడు కూతురు సెల్‌ఫోన్‌ను కూడా పరిశీలించేవాడు. కూతురిపై నిఘాపెట్టి ప్రతిక్షణం గమనిస్తుండేవాడు. కూతురి ప్రతి కదలికను పరిశీలిస్తుండేవాడు. దాంతో కుమార్తె ఎంతో నొచ్చుకునేది, బాధపడేది. తండ్రి ప్రవర్తనపట్ల అసహ్యించుకునేది, కుంగిపోయేది.

ఒకరోజు కూతురు లహరికి పుస్తకం కావాలంటే బజారుకు తీసుకెళ్ళాడు. అక్కడ లహరి వాళ్ళ ప్రొఫసర్ చనువుకొద్ది చిరునవ్వు నవ్వి చేతులు ఊపడంతో సందేహదృష్టితో ఉన్న తండ్రి సదరు వ్యక్తిని చితకబాదాడు. రక్తం కారేలా కొట్టాడు. ఇంటికి తీసుకొచ్చి లహరిని చెంపమీదకొట్టాడు. తర్వాత మరింత రెచ్చిపోయి బెల్టుతో కొట్టగా లహరి నేలపై కూలిపోయింది. చివరకు తండ్రి తన పొరబాటును తెలుసుకుంటాడు. ప్రొఫసర్‌ను క్షమాపణలు అడుగుతాడు. కానీ తండ్రి ప్రవర్తనకు తీవ్రమనస్తాపానికి గురైన లహరి ఆత్మహత్య చేసుకుని ఉత్తరంలో ఇలా ఆవేదన చెందుతుంది "... మమ్మీ ఐ హేట్ డాడి. నాకు ఈ డాడీ వొద్దు. కన్నకూతుర్ని కూడా చూడకుండా డాడీ నన్ను ప్రతిక్షణమూ అనుమానంగా చూస్తుంటే, ఇన్నాళ్ళు మనసును రాయి చేసుకుని ఎలాగో బ్రతికాను. కానీ నాకిక బ్రతకాలని లేదు మమ్మీ. ఇవ్వాళ జరిగిన సంఘటన నన్నెంతో ఆవేదనకు గురిచేసింది. చదువు చెప్పే లెక్చరర్‌లకూ నాకూ ప్రేమను అంటగట్టి డాడి నన్ను దండించిన ఆ క్షణమే నేను చచ్చిపోయాను మమ్మీ. ఇక ప్రాణంతో ఈ లోకంలో ఉండటంలో అర్థం లేదు. అందుకే బలవంతంగా నా ప్రాణం తీసుకుంటు న్నాను .... సెలవ్".

ఇలా సమాజంలోని వారే కాకుండా కుటుంబంలోని వారు కూడా స్త్రీలహింసలకు కారణమౌతున్నారు. కుటుంబంలోని స్త్రీలను రక్షించాల్సిన వారే అనుమానా లతో, కట్టుబాట్ల ముసుగులో చిత్రహింసలకు గురి చేస్తున్నారు. కొందరు పురుషులు స్త్రీలను ఆనందాన్నిచ్చే వస్తువుగా భావించి పెళ్ళిపేరుతో మోసగిస్తున్నారు. జీవితాంతం తోడుండాల్సిన మగడు తన స్వార్థంకోసం అర్థాంతరంగా భార్యలను వదిలించుకుంటున్నారు. మరలా మరొక స్త్రీతో జీవితాన్ని పంచుకుని, వారిని కూడా స్వార్థం కోసం వదలిపెడుతున్నారు. ఇలా పురుషుని స్వార్థంకోసం బలైపోతున్న స్త్రీల జీవితాలను చిత్రించిన కథ 'ముఖాముఖం'. ముఖాముఖం కథలో ప్రధానపాత్ర గౌరీమనోహరి. సంగీత సామ్రాజ్యంలో పైపైకి ఎదుగుతున్న సమయంలో వివాహం చేసారు. పెళ్లయ్యాక భర్త సంగీత కచేరీలకు పంపేవాడు కాదు. దాంతో మనోహరి సంగీత జీవితానికి అడ్డుకట్టపడింది. తన కళల సౌధానికి బీటలు వారింది. పిల్లలు కలుగలేదని అత్తింటివారు గొడ్రాలని నిందించారు. వారసుడ్ని ఇవ్వలేదని భర్త వదిలించు కున్నాడు. తర్వాత పిల్లలకోసం మరొక స్త్రీని పెళ్లాడి పిల్లల్ని కన్నాడు. స్వార్థంతో ఆ భార్యను కూడా వదిలివేసాడు.

ఆ భార్య బిడ్డలు అనాథలుగా మిగిలారు. తర్వాత మరో స్త్రీతో జీవితాన్ని పంచుకుని ఆనందిస్తున్నాడు. స్వార్థపరులైన పురుషులు స్త్రీలజీవితాలను ఎలా నాశనం చేస్తున్నారో ఈ కథలో కథకుడు చక్కగా చిత్రించాడు.

'వొంతు' కథాసంపుటిలో స్త్రీల సమస్యలను చిత్రించిన మరో కథ 'పరిరక్షణ'. ప్రేమ పేరుతో మోసపోతున్న కుమార్తె జీవితాన్ని పరిరక్షించడానికి ప్రయత్నించిన తల్లి ప్రయత్నమే 'పరిరక్షణ'. 'పరిరక్షణ' కథలో ప్రధానపాత్ర అరుణమణి. అరుణమణికి ఒక్కగానొక్క కూతురు శృతి. శృతికి ఒక స్నేహితుడున్నాడని తెలుసుకుని అతని ప్రవర్తనను ఒక కంట కనిపెడుతుంటుంది. అతడు స్త్రీలను మోసం చేసేవాడని, స్త్రీల జీవితాలతో ఆడుకునే వాడని గ్రహించి కుమార్తెకు హితబోధ చేస్తుంది. తల్లి మాటలను అర్థం చేసుకున్న శృతి స్నేహాన్ని వదలిపెట్టి తన జీవితం నాశనం కాకుండా ముందుజాగ్రత్త పడుతుంది.

ఆధునికపు స్త్రీ ప్రతిరంగంలోనూ హింసకు గురౌతున్నదని వివరిస్తూ చివరకు విద్యారంగంలో కూడా మానసిక వ్యధలకు గురౌతున్నదని 'పంజా' కథలో జిల్లేళ్ళ బాలాజీ చక్కగా చిత్రించాడు. 'పంజా' కథలో ప్రధానపాత్ర స్రవంతి. స్రవంతికి పాఠాలు చెప్పే గురువే హింసకు గురి చేస్తున్నాడు. యూనివర్సిటీలో చదువుతున్న స్రవంతిని కెమిస్ట్రీ ప్రొఫసర్ తన నీచపు చేష్టలతో, నిగూఢమాటలతో వేధించిన మానవమృగం. మాటల్లో, చేతల్లో వెకిలితనాన్ని స్రవంతి భరించలేకపోయింది. స్నేహితులకు చెప్పుకోలేక కుమిలిపోయేది. చివరకు ధైర్యం చేసి నీచమైన, కీచకుడైన గురువుగారి బండారాన్ని గురుపత్నికి చేరవేసి మనసులోని భారాన్ని తగ్గించుకుంటుంది.

ఇలా సమాజంలో ప్రతి స్త్రీ వయసుతో సంబంధం లేకుండా, కాలంతో సంబంధం లేకుండా ప్రతిచోటా ప్రతి ఒక స్వార్థపరుడైన పురుషునికి బలై మానసిక హింసలకు గురై బంగారులాంటి జీవితాలను కోల్పోతున్నారు. తీవ్ర మానసిక క్షోభలకు గురైన స్త్రీలు అవమానాల్ని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిర్భయ, దిశ లాంటి నూతన చట్టాలు పుట్టుకొస్తున్నా, స్త్రీల పరిరక్షణ కొరవడుతూనే ఉందని చెప్పవచ్చు. సమాజంలోని ప్రతి పురుషుడు స్వార్థపరమైన, నీచమైన కోరికలు వదలి, పాశవికత గుణాన్ని మరచి స్త్రీలపట్ల గౌరవంగా ఆలోచించిన నాడే స్త్రీలకు పరిపూర్ణ సంరక్షణ, ఆనందదాయకమైన జీవితం లభించి, శాంతియుత సమాజం నిర్మాణమౌతుందని చెప్పవచ్చు.

## పరిశీలనా గ్రంథాలు :

1. 'వొంతు' కథలు - బాలాజీ జిల్లేళ్ల
2. 'సిక్కెంటిక' కథలు - బాలాజీ జిల్లేళ్ల
3. చిత్తూరు కథ - బాలసుబ్రమణ్యం, పేరూరు (సం.క)

❀❀❀

# భారతంలోని ద్రౌపది భూలోక లక్ష్మి

- యం. భీమయ్య, తెలుగు అధ్యాపకులు, శ్రీ ఎ.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో అత్యంత గొప్ప గ్రంధాలలో ఆంధ్ర మహాభారతం చాలా గొప్పది. దీనిని కవిత్రయం వారు ఆంధ్రీకరించారు. తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి అనే నానుడి ఉంది. నేటికి సమాజంలో ఆ గ్రంథానికి అంతటి ప్రాచుర్యం ఉంది. ఆంధ్రమహాభారతంలోని కొన్ని ప్రముఖమైన పురుష పాత్రలు, ప్రముఖమైన స్త్రీ పాత్రలు ఉన్నా, కథ విస్తృతం. శకుంతల, దేవయాని, కుంతి, గాంధారి, భానుమతి ధమయంతి మొదలగు ప్రధాన స్త్రీ పాత్రలు. వీటిలో ప్రధాన స్త్రీ పాత్రలలో ముఖ్యంగా ద్రౌపది మహా భారతంలో అత్యంత ప్రధాన, విశిష్టమైన పాత్ర. ఇతర మహిళ పాత్రల కన్నా భిన్నమైనది.అందరి స్త్రీ పాత్రల కన్నా బిన్నమైనది ద్రౌపది.

మహాభారతంలో ద్రౌపది అందరి కన్నా గొప్ప మహిళ అని చెప్పవచ్చు. ఈమెకు కృష్ణా అనేది మరొక పేరు. ఈ పేరు బహుశా ఆమె రంగు శ్యామలమైనదై ఉంటుంది. మహాభారత కథానాయకుని పేరు కృష్ణుడు. కనుక ఇది కృష్ణా (ద్రౌపది) కృష్ణుల గాథ అని కూడా చెప్పవచ్చు. ఇపుడు కేవలం కృష్ణ, ద్రౌపది ఎంత గొప్ప మహిళో దానిని మాత్రమే చెప్పదలచుకున్నాను. ద్రౌపదికి ఐదుగురు భర్తలున్నారనే భావనతో సామాన్యుల దృష్టి ఈమె విశిష్టత పైకి పోలేదు. ఏ స్త్రీకి ఎందరు భర్తలుండే వారో, ఎంత మంది ప్రేమికులుండే వారు అని కాకుండా ఆమె మిగతా గుణగణాలను పరిశీలించకపోవడం ఈ నాటి సమాజం పతనావస్థకు సంకేతం.

భారతంలోని ద్రౌపదికి అనేక సుగుణాలున్నాయి. ద్రౌపదికి భిన్నమైనది సావిత్రి. ఒకే ఒక గుణం పతివ్రత. ప్రజలకు బాగా గుర్తుండేది. భర్త మరణించాక యమధర్మ రాజు దగ్గరకు పోయి తన భర్త ప్రాణాలను తిరిగి తెచ్చుకొని తన భర్తను పునర్జీవింపచేసుకుంది. కానీ ఆ నాటి సమాజంలో సమానత్వ పునాదులపైనే నవ ప్రపంచం నిర్మించుకోవడానికి ప్రయత్నించే వ్యక్తికి హిందూ పురాణాలలో, భారత ఇతిహాసాలలో సావిత్రి గొప్ప పతివ్రత అయినప్పుడు అంత గొప్ప పత్నివ్రతుని పాత్ర కూడా వుండాలి కదా. ఆనాటి ఇతిహాసాలలో స్త్రీ, పురుష సమానత్వాన్ని చూపించలేదు. అసమానతలే కొనసాగాయి.

ఇక ద్రౌపదికి ఐదుగురు భర్తలు కాక కర్ణునిపై కూడా కాస్త ఆమె మనసు చలించేది అని ఆనాటి స్త్రీ ల పట్ల చులకన భావం వుండేది. ఈ గ్రంథం కృష్ణా కృష్ణల బంధం అని మహాభారతం చదివిన వారికి తెలుస్తుంది. వీటన్నిం టిని ప్రక్కన పెట్టి ఆమె దైర్యం, సాహసం, పోరాట పటిమ, అవమానాలను సహించిన విధం మెచ్చుకోదగ్గది. సత్వతమో, రజోగుణాలు ఈమెలో ఉన్నాయి. జ్ఞాన పరిణితిలో గాని, విషయ అవగాహనలో గాని, సాహసంలో గాని ఈ ప్రపంచంలో ఎక్కడ, ఏ స్త్రీ కూడా ద్రౌపది వంటి ఔనత్యం కల్గిన మహిళ కన్పించదు. అంతటి జ్ఞాన సంపన్నురాలు మహాభారతంలోని ద్రౌపది.

తన కాలంలో ఎంతటి మహాపురుషుడునైనా వాద ప్రతివాదనలో ద్రౌపదికి సాటి లేరు. అంతటి మేధా సంపన్నురాలు. కష్టాలను ఎలా ఎదుర్కోవాలో తన నేర్పును కనబర్చి నేటి మహిళలకు స్ఫూర్తి, ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని కల్పించింది. అలాగని ద్రౌపదికి చెందిన ప్రతీది ఉన్నతమైనదని చెప్పడం లేదు. దుర్యోధన, దుశ్శాసనుడు నిండు సభలో వస్త్ర అపహరణం చేయడానికి పూనుకున్నప్పుడు ఆమె చేసిన వాదం అద్భుతమైనది.

భీష్మ పితామహుడు అంతిమ సమయంలో (మరణ శయ్యపై) ఉన్నప్పుడు రాజనీతి శాస్త్రాన్ని బోధిస్తున్నాడు.

కౌరవ, పాండవులు ఆ భోదన వింటున్న సమయంలో ద్రౌపది పెద్దగా నవ్వింది. అంతటి ద్రౌపది.

అర్జునుడు కారణం అడిగినప్పుడు ఆమె సమాధానం మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. బ్రతుకంతా తాను చెబుతున్న నీతులకు పూర్తిగా భిన్నంగా గడిపి, ఇప్పుడు చావుబోతు నీతులు చెప్తున్నాడా అని అంటుంది. దీనిని బట్టి ఆమె ధైర్యం, శాస్త్ర పరిజ్ఞానం, దూరదృష్టి, ఆలోచనా ధోరణి తెలుస్తుంది.

ద్రౌపదికి రాజధర్బారు అయినా, యుద్ధ భూమియైన, అడవి అయినా, పర్ణశాల అయినా అంతా సమానమే. ఆమెకు మించిన సాహసి ఎవరు లేరు. అసలు ఈ కథలు వ్రాసింది మగ వారు అయినా ఆ పాత్రను ఉదార్తంగా తీర్చిదిద్ధిన ఘనత మన తెలుగు కవిత్రయము వారిది. జూదంలో ద్రౌపదిని ఓడినప్పుడు ఆమె రాజధర్బారులో ధర్మరాజుకి జూదంలో పణంగా పెట్టే హక్కు అతనికి ఎక్కడిది, స్వయంగా ముందే ఓడిపోయిన వ్యక్తి మరొకరిని పణంగా పెట్టే హక్కు ఉండదు. భారతీయ స్త్రీలకు నిజమైన ప్రతినిథి ద్రౌపదే కాని సావిత్రి కాదు. అసలు మహిళను ఏ రూపంలో చూడదలచుకున్నారు. జ్ఞాని గానా? కేవలం పతివ్రత గానా? ఈనాటి ఆధునిక పురుషుడు తన మనసులో పరస్పరం విరుద్ధ కోరికలు కల్గియుండే పరిస్థితిని అధిగమించాలి. ఏమంటే తన ఆడది తెలివైనదిగా, జ్ఞానిగా, చైతన్యవంతురాలిగా ఉండాలని ఒక వైపు చెప్తూ, మరి తన అధీనంలో, తన గుప్పెట్లో తనదిగానే ఉండాలని మరొక వైపు కోరటం విరమించుకోవాలి.

ఏ కోణంలో చూసినా, ఏ దృష్టితో చూసినా మచ్చ లేని పాత్ర భారతంలో ద్రౌపది. అటువంటి ఉత్తమోత్తమ పాత్రలో మచ్చ కనబడే వారికి దృష్టిలోపం ఉందనవలసి వస్తుంది. వేదవ్యాసుడు ద్రౌపది పాత్రను అపూర్వంగా చిత్రించగా కవిత్రయం (ముఖ్యంగా తిక్కన) ఈ పాత్రకు మరింత మెరుగులు దిద్దారు. ద్రౌపది ఐదుగురు భర్తలతో సంసారం చేస్తూ, ఆరవ వాడైన కర్ణునిపై తన మనసు నిండి ఉందని చెప్పడం న్యాయం కాదు. ఆమె పుట్టింది పవిత్రమైన అగ్నిహోత్రి నుండి, పెరిగింది రాజ వంశంలో, పొందినది వీరపురుషులని , వస్త్రాపహరణ విషయంలో చూపించినది పాతివ్రత్యమహిమ. ఇలాంటి కాంత అలా ఆలోచించింది అనటం న్యాయం కాదు. కుంతీ దేవి కూడా కోడలి గుణగణాలకు సంతోషించింది.

దుర్యోధనుడు రాజసూయాగానాంతరం మయసభ ప్రవేశంలో అవమానం జరగడం దానికి పాండవుల కంటే ద్రౌపది మీద దుర్యోధనుడికి ఎక్కువ మత్సరం కలిగింది. కారణం ఆనాడు స్వయం వర సమయంలో మత్స్య యంత్రం ఛేదించడానికి చేతకాకపోవడం. ఆమె నవ్వి నందుకు ప్రతీకారవాంఛ. ఈ భావన అసమర్థులు, అవివేకులు చేసే పని. స్త్రీల పట్ల పురుషులకు అంత తక్కువ భావం ఉండేది ఆనాడు. దీనికి ప్రతీకారంగా మాయాజూదంలో పాండవులు ఓడించడం, ద్రౌపదిని పణంగా పెట్టించడం కారణం అయింది.

ఏ యుగంబునందు నెట్టి దుష్కితవుండు
భార్య నుండి యొటు పడిన భర్త
గలడె యిది వివంగ గడునపూర్వంబయ్యె
నిట్లు సేయనొక్కొ నిందుకులుడు !
పోనీ ! ......
మున్ను దన్నోట పడి మఱి నన్నోట
బడతినయో

- అని బదులిచ్చింది. అభిమానవతి అయిన ద్రౌపది నిండు సభలో వస్త్రాపహరణం సహించలేకపోయింది. సతికి ప్రాణం కంటే మానం ఎక్కువ కదా, ఆ సమయంలో రక్షించవలసినది భర్త, ఒక్కరు కాదు ఐదుగురు కళ్ళ ఎదురుగా ఉన్న ఫలితం లేదు. ఆ సమయంలో కృష్ణుని ప్రార్ధించి తనను తాను రక్షించు కుంది. సభలో జరిగిన దంతయు గాంధారి భర్తకు చెప్పినప్పుడు ధృతరాష్ట్రుని శాంతి వచనాలకు అవసరం మేరకే మాట్లాడ గలిగిన మహిళ. అరణ్యవాసం, అజ్ఞాతవాసంలో కూడా భర్తలకు సహాయం చేయడం,

భర్త తోడుదే లోకమని, భర్త మనసెరిగి నడుచుకోవాలని సత్యతో ద్రౌపది చెప్తుంది.

ఒకప్పుడు పాండవుల కామ్యవనంలో ధౌమ్యుని దగ్గర వుంచి ద్రౌపదిని తలొక దిక్కుకి వెళ్లారు. సైంధవుడు అడవిలో ఒంటరిగా ఉన్న ఈ స్త్రీ ని చూసి మోహించి, నీ మగలు రాజ్యం కోల్పోయారు కనుక తన వెంట రమ్మని అడుగుతారు. అప్పుడు ద్రౌపది నీవు నాకు తోబుట్టువు అని తిరస్కరించి ధౌమ్యుని పిలిచింది.

తేలును గన్కొటియును దెగు
కాలమునకు జూలు దాల్చుగత బారుల యి
ల్లాల నయిన నాదెస దు
శ్శీలుడవైతివి వినాశచిహ్నముగాదె !

పరాయి స్త్రీని అవమానించిన నీకు కీడు కలుగు తుంది. ఆ సమయంలో సైంధవుని నుండి ద్రౌపదిని పాండవులు కాపాడుకున్నారు. సైంధవుడ్ని శిక్షించే సమయంలో ఇతను మన దుశ్శల భర్త ఆమెను పసుపు కుంకుమలతో ఉండనివ్వండి వదిలేయమని అంటుంది. అంతటి క్షమాగుణం ఉంది ద్రౌపదికి.

అజ్ఞాతవాసంలో విరాటుని కొలువులో పలు వేషాలతో సేవకులుగా తలదాచుకుంటారు పాండవులు. ద్రౌపది సైరంధ్రి వేషంలో ఉంటుంది. రాజుభార్య సుదేష్ణకు సపర్యలు చేస్తుంది. సుదేష్ణ సోదరుడు కీచకుడు. ఇతనిని సింహబలుడు అని కూడా అంటారు. ద్రౌపది మాట నేర్పరి తనం వలన సుదేష్ణ సేవకురాలిగా అంగీక రించింది. భారతంలో మహిళలు అందరికంటే మిన్నగా ద్రౌపదిని చెప్పుకోవచ్చు. ఈమె వ్యవహార దక్షత, సమయానుకూలంగా వ్యవహరించుట ద్రౌపదికి వున్న ప్రత్యేకత. అజ్ఞాతవాసం ఇంచుమించు కావొస్తుంది. ద్రౌపది ఒకనాడు సుదేష్ణాదేవి సమీపంలో తిరుగు తుండగా సుదేష్ణా దేవి తమ్ముడు సింహబలుడు చూస్తాడు. ఆ రాజ్యంలో విరాటుడు పేరుకు రాజు కానీ, అందరూ సింహబలునకు భయపడతారు.

ఒక రోజు సింహబలుడు సోదరిని చూడటానికి వచ్చి సైరంధ్రి రూప లావణ్యానికి ముగ్ధుడై ఆమెను మోహించి, తనను కావాలని కోరుతాడు. అప్పుడు ఆమె.

శా.. దుర్వారోధ్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప
స్ఫుర
ద్గర్వాంధ ప్రతి వీర నిర్మథన విద్యాపారగుల్
మత్పతుల్
గీర్వాణాకృతులేవురిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం
బెమ్మయిన్ గీచకా?

- మహాభారతం ఆరవ సంపుటి, విరాటపర్వం
2.55.85172

అని భయపెట్టింది. అంతటి ధైర్యం కల వనిత భారతంలో లేరని చెప్పాలి. ఆపదల నుండి ఎలా తప్పించుకోవాలో కడు నేర్పును చూపించింది.

ఒక రోజు సుధేష్ణా దేవి ద్రౌపదిని పిలిచి తమ తమ్ముని ఇంటికి వెళ్ళి మధిరారసమును తీసుకురమ్మని చెప్పగా ఈమె మనసు తల్లడిల్లింది. విచారించక నేర్పుతో తప్పించుకోవలనుకుంది. ఈ కీచకుని యొక్క మనసుని తెలుసుకొని భీమసేనుని యొక్క సహాయంతో నర్తన శాలకు రమ్మని కీచకుడిని సంహరింపచేస్తుంది. అలాగే అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తయ్యాక కౌరవ సభకు శ్రీ కృష్ణుని రాయబారిగా పంపించాలని అను కుంటారు పాండవులు. ఐదుగురికి ఐదు ఊళ్ళు ఇచ్చిన చాలు. సంధి జరిగేటట్లు చూడమని కృష్ణుడిని వేడు కుంటారు. ఆ సమయంలో ద్రౌపదికి మిక్కిలి కోపం కల్గింది. గతంలో జరిగిన అవమానాలను కృష్ణునితో ఏకరువు పెట్టింది ద్రౌపది. కృష్ణునితో పాండవులందరూ మాట్లాడిన తరువాత ద్రౌపది తన మనసులోని మాటలను చెపు తుంది. ఈ విధంగా

ఉ.. అంతలు సేసి పోనడచి యక్కట సంజయ చేత
జెప్పి వు

లైంతురె? యిట్టి యాఱట మదిం ప్రియమందె యుధిష్ఠిరుండు..

- 101 ఉద్యోగపర్వం 7వ సంపుటి (తిక్కన)

నానలేమియని యాడరె లోకము వారు కేశవా?

- 102 ఉద్యోగపర్వం 7వ సంపుటి (తిక్కన)

చ.. ఓటయొకెంతయేనియు సుయోధ చిత్తమందు లేదు

- 104 ఉద్యోగపర్వం 7వ సంపుటి (తిక్కన)

చ.. వరమున బుట్టితిన్ - యిన్నిట బ్రశస్తికి నెక్కిన దాననెంతయున్

- 106 ఉద్యోగపర్వం 7వ సంపుటి (తిక్కన)

కం.. ఇవి దుస్ససేను వ్రేళం దవిలి సగమ ద్రెవ్విపోయి దక్కినం యవి - అని కృష్ణునికి తన పరాభవాన్ని గుర్తు చేస్తుంది.

- 116 ఉద్యోగపర్వం 7వ సంపుటి (తిక్కన)

సీ.. ఈ వెంట్రుకలు బట్టి యిడ్చిన చేయి - 117 ఉ.ప

భంగపడిన హృదయం బలపడి పగ, ప్రతీకారం తీర్చుకోవాలి అని తహతహ లాడింది. ఆమె యుద్ధాన్ని కోరింది కానీ, సంధి ఇష్టంలేదు. ఎవ్వరు అంగీకరించినా, అంగీకరించకపోయినా మహాభారతంలోని మహిళల పాత్రల అన్నింటిలోకి ద్రౌపది మహోన్నతురాలు. ధైర్యం, సాహసం, సమయస్ఫూర్తి గల మహిళగా పేరు గాంచింది. ద్రౌపది లేని భారతాన్ని ఊహించలేం. ఆత్మాభిమానం, ఓర్పు ఇన్ని ఉత్తమ గుణాలు కల్గిన మహిళగా మహాభారతంలో ద్రౌపది ఆత్మ గౌరవానికి, ఆత్మాభిమానానికి ప్రతీక. పాండవుల కీర్తి ప్రతిష్టలకు కారకురాలు, అందుకే ద్రౌపదిని భూలోక లక్ష్మి అని చెప్పక తప్పదు.

## సంప్రదింపు గ్రంథాలు

1. శ్రీ మధాంధ్ర మహాభారతము విరాట, ఉద్యోగపర్వాలు - తిక్కన 6,7 సంపుటి.
2. తిరుమల తిరుపతి దేవస్థానం - తిరుపతి
3. ఆంధ్రమహాభారతము శ్రీ మల్లంపల్లి దుర్గామల్లికార్జున ప్రసాద్ శాస్త్రి
4. తెలుగు వైజ్ఞానిక పత్రిక - తెలుగు అకాడమి
5. ద్రౌపది - డా॥ కాటూరు ప్రభాకర రెడ్డి
6. కులాల సమస్య - డాక్టరు రామమనోహర్ లోహియా తెలుగు అకాడమి.
7. భారతం ఉపఖాన్య సంపుటి ఉషశ్రీ పురాణపండ.
8. తిరుమల తిరుపతి దేవస్థానం - తిరుపతి.

# నేలదిగిన వాన నవల - స్త్రీ పాత్రలు

- **డా॥. జి. పార్వతి,** సహ ఆచార్యులు, తెలుగుశాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.

కథ, కవిత్వం, వ్యాసం, యాత్రారచనలు చేసిన వేంపల్లి గంగాధర్ తొలినవల"నేలదిగిన వాన". వీరు కేంద్ర సాహిత్య అకాడమీ వారి తొలి యువపురస్కారాన్ని 2011 సంవత్సరంలో అందుకున్నారు.రాష్ట్రపతి భవన్‌లో విశిష్ట ఆతిధ్యం అందుకున్న తొలి భారతీయ సాహిత్య వేత్తగా వీరు గుర్తింపు పొందారు. 2011 సెప్టెంబర్ 8 వ తేది నుంచి 26 వరకు వీరు రాష్ట్రపతిభవన్‌లో విడిది చేశారు. నేలదిగినవాన నవలకు అంపశయ్య నవీన్ సహితీ పురస్కారం అందుకున్నారు. ఈ నవల 2009 ఫిబ్రవరి చతుర మాసపత్రికలో మొదటిసారిగా అచ్చైంది. అనేక సాహిత్య పురస్కారాలు వీరిని వరించాయి. వీరి కథలు అనే భారతీయ భాషలలోకి అనువదింపబడ్డాయి.

రాయలసీమ అంటేనే కరువుప్రాంతం రైతులకు వర్షం కరిస్తే తప్ప కాలువలాంటి నీటి వసతులు లేవు. ఇది రాయలసీమ కరువును చిత్రించిన నవల. కరువు వల్ల ప్రజలు పడే బాధలు, కష్టాలు ఏ విధంగా ఎదుర్కొంటున్నారో ఈ నవలలో చూడవచ్చు. వేంపల్లి గంగాధర్ రచించిన నేలదిగిన వాన నవల స్త్రీ పాత్రలు అనే అంశాన్ని ఎన్నుకొన్నాను.

"ఆడదై పుట్టడం కన్నా అడవిలో మానై పుట్టడం మేలు" అని "స్త్రీ బుద్ధి: నరకయాతన:" వంటి సూక్తులను బట్టి చూస్తే స్త్రీ జీవితం కష్టమని తెలుస్తుంది. నేలదిగిన వాన నవలలో స్త్రీ పాత్రలు ఏ విధంగా కష్టాలననుభవించారో ఈ నవలలో చిత్రించారు రచయిత.

**కాంచన :**

వెన్నెల పాటల కెరటం కాంచన. కాంచన గొంతు కాంచనమే బంగారాన్ని రాగంతో, స్వరంతో జతచేసి పల్లవింపచేసేది ఆమె పాట. అలాంటి మహత్తు ఆమె వెన్నెల పాటలలో కనిపించేది. రేణిగుంట దగ్గర ఉండే సుబ్రహ్మణ్యశాస్త్రి కుతూరు. భర్త సోమశేఖరం. వీరికి ఒక కూతురు ఉంది. ఈమె భర్త యాక్సిడెంట్‌లో చనిపోతే తల్లిదండ్రులు కడపకు తీసుకువస్తారు. కూతురుకోసం దిగులుతో మంచానపడి ఇద్దరూ చనిపోతారు. ఈమె ఒంటరిగా బిడ్డను కూలిపనికి పోయి పెంచుకుంటూ ఆ బిడ్డమీదే పంచప్రాణాలను పెట్టుకుని బ్రతుకుతుంది. పాపోడి ప్రియనేస్తం కాంచన. పాపోడి ఇంటికి తప్ప ఎక్కడికి వెళ్లేది కాదు. మగతోడు లేని కుటుంబం అని ఊర్లో వాళ్లు ఈమెను బాగా గౌరవించేవాళ్లు. ఈమె ఇంటిదగ్గర వేపచెట్టుకింద ఊయలలో బిడ్డను వేసి ఒక్కోరోజు ఒక్కో వెన్నెల పాటను వినిపించేది. ఈ పాటల్ని ఊర్లో వాళ్లు ఆసక్తిగా వినేవాళ్లు.

కాంచనపైన తాగినమత్తులో ఉన్న నీలకంఠం హత్యాచారం చేశాడు. పాపోడు విరిగతన్నాడు.ఉదయాన్నే రచ్చబండ దగ్గర పంచాయితీ జరిగింది. గ్రామ పెద్ద పాండరంగారెడ్డి వచ్చి కూర్చున్నాడు. కాంచన ఇంటికాడ్నే ఊయల కట్టే వేపచెట్టుకు రాత్రంతా కట్టేసి నీలకంఠాన్ని కూడా పంచాయితీకి తీసుకొచ్చారు. నీలకంఠం పెద్దిరెడ్డి కొడుకు. కాంచనను నీలకంఠం పెళ్లిచేసుకోవాలని పెద్దలు తీర్పు ఇచ్చారు. కాంచన నీలకంఠంను పెళ్లి చేసుకుని బిడ్డతో పెద్దిరెడ్డి ఇంటికి కోడలిగా పోయింది.

పెళ్లి అయిన తర్వాత నీలకంఠం మారలేదు. కాంచన అతడు పెట్టే గృహహింసను భరించలేకపోయింది. రోజు తాగివచ్చి నాలుగు గోడల మధ్య చితకబాదేవాడు. కాళ్లతో తన్నేవాడు.సిగరేట్లతో ఎక్కడంటే అక్కడ కాల్చేవాడు. అన్నింటిని భరించింది. ఒకరోజు పాపను గొంతు నలిపి చంపబోతుంటే తట్టుకోలేక అతన్ని గడ్డపారతో పొడిచి చంపేసింది.

కాంచనను పంచాయితీలో నిలబెట్టి అందరూ తప్పుపట్టారు. "కోడలంటే ఇష్టామా లేదా కొడుకంటే

ఇష్టమా అని పెద్దిరెడ్డిని అడిగినప్పుడు కోడలివైపే వెళతానంటాడు. నా కొడుకు చనిపోయినందుకు నాకు బాధలేదు. కాంచన ఇప్పటికి మా ఇంటి కోడలే'' అని చెప్పాడు పెద్దిరెడ్డి. కాంచన జీవితమంతా విషాదంతో నిండినట్లు చిత్రించాడు రచయిత.

**రాజమ్మవ్వ :**

రాజమ్మవ్వ చంద్రన్నతాత భార్యాభర్తలు, చంద్రన్న వేటలో మంచి నైపుణ్యం కలవాడు. తుపాకీ పట్టుకుని వేటకి వెళ్లి తన సంసారాన్ని కొనసాగిస్తుంటాడు. చంద్రన్నకు వయస్సు మీదపడి మంచాన పడ్డాడు. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం ఆస్తి అంతా పోగొట్టుకుని పాల వ్యాపారంతో బ్రతుకుతుంటారు. రాజమ్మవ్వ నాలు గావులు పెంచుకుని వయస్సు అయినాక జీవితాన్ని పోషించుకుంటుంది.

**పెద్దమ్మవ్వ :**

ఈమె పాటలు బాగా పాడుతుంది. గ్రామంలోని పెద్దలు రచ్చబండ దగ్గర కూర్చొని వర్షాల కోసం కప్పదేవర చేయాలని మాట్లాడుకుంటారు. పెద్దమ్మవ్వ వర్షాలు పడాలని వాన దేవుని మీద పాటను పాడుతూ రచ్చబండ దగ్గరకు వస్తుంది.

"వానదేవా ఓ వానదేవా
కప్పమ్మ నీళ్లాడే కాలమెండిపాయె
వానదేవా ఓ వానదేవా
ఇగనన్నా కురిపించు జగమేలు ఓ తండ్రి
వానదేవా ఓ వానదేవా!''

ఒక గొంగ్రు కప్పను తెచ్చి పసుపు కుంకుమ పూసి పసుపు గుడ్డలో కట్టి రోకలికి మధ్యలో కడతారు. రోకలిని అటువైపు కొందరు ఇటువైపు కొందరు పట్టుకుని ఇల్లిల్లూ తిరుగుతుంటే పెద్దమ్మవ్వ పాట మొదలు పెడుతుంది.

"పన్నెండు పరగణాలు వానదేవుడా
పంటలు పండాలి వాన దేవుడా''

వర్షాలు పడి పంటలు పండి ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని పెద్దమ్మవ్వ పాటల పాడుతూ పూనకం వచ్చినట్లు ఊగుతుంది. ఈ పాటలు తర్వాత రాజమ్మవ్వ అందుకుని పాడుతుంది. వర్షాలు పడి పంటలు పండాలని లేకపోతే అందరికిచావు తప్పదని వానదేవుని తిడుతూ కోపాన్ని ప్రదర్శించే పాత్ర పెద్దమ్మవ్వ.

**సుశీలమ్మ :**

మాధవరెడ్డి భార్య సుశీలమ్మ. ఈమె మూగ మనిషి. వీరికి ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు, ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. పెద్దోడు క్రిష్ణారెడ్డి. మాధవరెడ్డి ఆస్తులకు ఆశపడి సుశీలమ్మను పెళ్లిచేసుకున్నాడు. ఈమెకు మాటలు రాకపోయినా చేతులను తిప్పితిప్పి సైగలు చేస్తుంది.ఆ సైగలను ఇంట్లో అందరు అర్థం చేసు కుంటారు. ఈమె కొడుకు క్రిష్ణారెడ్డికి పాపోడు చెల్లెలు లక్ష్మితో పెళ్లిచేయాలని నిశ్చయించుకున్నారు. కోడిలిగా వచ్చిన లక్ష్మికి ఈమె సైగలు అర్థమవుతాయో లేదో అని పాపోడు అనుమానం. అనుకూలవతి అయిన ఇల్లాలు ఈమె కనిపిస్తుంది.

**సీతమ్మవ్వ :**

సీతమ్మవ్వ కాంచన ఇంటి పక్కన ఉంటుంది. కాంచనపైన నీలకంఠం హత్యాచారం చేసినప్పుడు గట్టిగా అరుస్తూ " ఆ పాయికారి నా కొడుకు..... బంగారమట్ట పిల్లలను చెర్సినాడు కదరా...............నాయనా'' అని రెండు చేతులతో నెత్తి కొట్టుకుంటూ ఏడ్చే నిస్సహాయ పాత్రగా సీతమ్మవ్వ కనిపిస్తుంది.

**పార్వతమ్మ :**

పార్వతమ్మ భర్త రామప్పనాయుడు.వీరికి ఇద్దరు కూతుర్లు. కరువుతో కుటుంబ పోషణ భారమై, అప్పులు ఇచ్చిన వాళ్ల బాధ ఎక్కువై, రోజు ఒకరు వచ్చి అప్పు కట్టమని అడగడంతో పొలంలో పురుగులకు కొట్టే మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకుంటాడు రామప్ప నాయుడు. ఈయన చనిపోవడానికి కారణం లేకపోలేదు. సాగునీటికోసం బావి త్రవ్వించాడు. మూడు బోర్లు వేయిం చాడు. కొన్ని నీళ్లు పడ్డాయి. అవి ఎండలకు ఎండి

పోయాయి. భూమిని సాగుచేయడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసినాడు. వర్షాలు పడక కరువు పరిస్థితుల్లో పంటలు పండలేదు. ఈయనకు గవర్నమెంట్ వాళ్లు రెండుసార్లు ఆదర్శరైతుగా సన్మానం చేశారు. పార్వతమ్మకు ఊపిరితిత్తుల వ్యాధి ఉందని తెలిసి తట్టుకోలేకపోయాడు. నాయుడు చనిపోయిన తర్వాత కుటుంబ భారం పార్వతమ్మ మీదపడింది. పార్వతమ్మ తిండి, నిద్రకు కరువైపోయింది. ఈమెకు వ్యాధి ఎక్కువై బాధపడేది. పార్వతమ్మకు ఒక ఆలోచన వచ్చింది. బ్యాంకు వాళ్లకి పొలంమీద తీసుకున్న లక్ష రూపాయల డబ్బు, ఊర్లో అప్పులోళ్లకు డబ్బు చల్లించాలంటే తన పెద్ద కుతూరు పూర్ణిమను పూనా సావిత్రిని పిలిపించి వ్యభిచారంలోకి పంపడానికి పూనుకుంది. ఇక్కడ తల్లడిల్లే తల్లి హృదయాన్ని గమనించవచ్చు.

**పూనాసావిత్రి :**

పూనా సావిత్రి అంటే ఖరీదైనా దేహ వ్యాపారానికి పెట్టింది పేరుగా చెప్పవచ్చు. ఊర్లో త్రాగడానికి కూడా మంచినీళ్లు లేని పరిస్థితి ఏర్పడుతుంది. పెన్నా ఎండి పోయింది. పినాకినీ ఎండిపోయింది. అలాంటి పరిస్థితుల్లో పూనా సావిత్రి చుట్టపక్క ఊర్లలోని అందమైన అమ్మాయిలను పూనా పంపించి అక్కడ వ్యభిచారం చేయించి డబ్బులు సంపాదించి లక్షాదికారిగా మారింది. పూనా సావిత్రి మాటల్లో " ఈనేలకు కరువు కొత్తకాదు వ్యభిచారం ఆడవాళ్లకి కొత్తకాదు. బతికి ఇక్కడ తన వాళ్లను బతికించుకునే పనిమేలు. అయినా అరిగిపోయేదుందా తరిగిపోయేదుందా.......?" అని లోకజ్ఞానమంతా తనకే తెలుసు అన్నట్లు ఉండేది. ఎక్కువగా అందమైన సుగాలి అమ్మాయిలకు ఎరవేసేది. సాగునీటి ఊసేలేని రాయచోటి, సుండుపల్లి, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె నుంచి ఎంతోమంది అమ్మాయిలను పూనాకు పంపించి వారికి చేతినిండా పనికల్పించేది. అటు పూనాలో పోలీసులకు చేరాల్సిన డబ్బులు చేర్చేది. ఎప్పుడంటే అప్పుడు అమ్మాయి వ్యాపారాన్ని సాగిస్తూ బాగా డబ్బులు కూడబెట్టింది పూనాసావిత్రి. మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారంలో ఎదగడానికి సుగాలి అమ్మాయిలను వాడుకుంది పూనా సావిత్రి. సావిత్రి వృత్తిలో తను ఎదగడమేకాక వారి అవసరాలను ఆసరాగా తీసుకుని అందమైన అమ్మాయిలను కూడా ఈ వృత్తిలోకి దింపింది. వీరు విధి చేతిలో చిక్కిన అబలలు కనిపిస్తారు.

**పూర్ణిమ :**

పార్వతమ్మ, రామప్పనాయుడిల పెద్దకూతురు. తండ్రి మరణంతో తల్లి విధిలేని పరిస్థితులలో పరిస్థితులలో పూర్ణిమను పూనాసావిత్రితో వ్యభిచార వృత్తిలోకి పంపింది. పూర్ణిమ తల్లికి రూ.40 వేలు అడ్వాన్సు ఒక సంవత్సరం లోగా బ్యాంకులో కట్టాల్సిన లక్షరూపాయలు ఇస్తానని చెప్పింది సావిత్రి. పూర్ణిమ సావిత్రితో పునాకు పోయింది. అక్కడ ఊరుకాని ఊరిలో తన మనస్సు, శరీరం తనది కాని లోకంలోకి తనతో పాటు అనేక మంది అమ్మాయిలు కరువు ప్రభావంతో ఈ ఊబిలో దిగుతున్నారు. పూర్ణిమ కన్న బంగారు కలలు కూడా ఈ ఊబిలోనే కలసి పోయాయి. ఈ నవలలో తన కుటుంబంకోసం త్యాగం చేసిన అమాయక పాత్రగా పూర్ణిమను రచయిత చిత్రించారు.

**ముగ్గురాళ్ల విజయమ్మ :**

గంగమ్మ దేవళం దగ్గరకు నీళ్లుండే రాతి బావి ఉంది. ఊరందరికి చుట్టుపక్కల పల్లెలకు ఈ రాతిబావే దిక్కు. ఒక పక్క వర్షాలు పడక కరువు ప్రభావం మరో ప్రక్క మండే ఎండలకు రాతి బావిలో నీళ్లు కూడా ఎండి పోతున్నాయి. ముగ్గురాళ్ల విజయమ్మ భర్తతో కొట్లాడి ఈ బావిలో దూకి చనిపోవాలనుకుంటుంది. ఈ బావి దగ్గరకు వచ్చి గట్టుమీద ఉండే గంగమ్మకు మొక్కి నా పిల్లలను నీవే కాపాడు తల్లీ! నేను నీ దగ్గరకే వస్తున్నా! అని బావిలోకి దూకుతుంది. బావిలో తామరతీగలు, తామరపూలు ఎక్కువగా ఉండడం వల్ల ఈమె మునిగి పోలేదు, చనిపోలేదు. తామరపూలు మీద లక్ష్మీదేవి కూర్చున్నట్లుగా కూర్చొని ఉంటుంది. ఈమె బావిలో దూకిందని తెలిసి ఊర్లో అందరు బావిదగ్గరకు వచ్చేసరికే లక్ష్మిదేవి మాదిరిగా కనిపిస్తుంది. ఈమెను గంగమ్మ తల్లే

కాపాడిందని నమ్ముతారు. ఈ రాతిబావి నీళ్లే ఊర్లో వాళ్లకి, చుట్టూప్రక్కల పల్లెలందరికి దిక్కు.తాగుబోతు భర్తతో విసిగిపోయి వెగలేక ఆత్మహత్యకు పూనకున్న పాత్రగా రచయిత తీర్చిదిద్దాడు.

**లక్ష్మి :**

రామిరెడ్డి, శాంతమ్మల కూతురు లక్ష్మి. ఈమె పాపోడి చెల్లెలు. ఈమెది ఆదర్శపాత్ర ఈమె అన్న కుటుంబం కోసం పడే కష్టాన్ని, బాధలను చూసి అర్థం చేసుకుంటుంది. ఇంటిపనుల్లో తల్లికి సహాయం చేసేది. ఊర్లోని చిన్న పిల్లలతో బొమ్మలాటలు ఆడేది. లక్ష్మి స్నేహితురాలు కాంచన కుతూరిని ఆడించేది.

లక్ష్మికి వీరబల్లి గ్రామంలో మాధవరెడ్డి కొడుకు క్రిష్ణారెడ్డితో పెళ్లి సంబంధం చూస్తారు ఇరువైపులా వారికి సంబంధం నచ్చుతుంది. కట్నాలు, లాంచనాలు గురించి మాధవరెడ్డి 2 లక్షలు డబ్బు, బంగారం మీఇష్టం అంటాడు. ఇప్పటికిప్పుడు రెండు లక్షలు అయితే ఎట్లా వస్తాయని లక్ష్మి అమ్మ, అన్న బాధపడతారు. ఇంట్లో వాళ్లు ఎలాగైనా ఆ డబ్బు సర్దాలని అవసరం అయితే భూమి, ఎద్దులు, బంగారం అన్ని అమ్మేసి పెళ్లి చేద్దామనుకుంటారు. కానీ లక్ష్మి మాత్రం " ఇంత కరువు కాలంలోనూ రూ.2 లక్షలు అడిగితే యాడ తెచ్చిస్తారట.ఈ పెళ్లి నేను చేసుకోను. వాళ్లు డబ్బు మనుషులు అయితే వాళ్లింటికి నేను కోడలుగా వెళ్లనన్నా" అని చెప్పింది. చిన్న పిల్లవు నీకేందుకు మా విషయాలు మేం పెళ్లిచేస్తాంచేసుకో అనింది లక్ష్మి వాళ్ల అమ్మ. లక్ష్మి అన్న ఆమెను ఓదార్చి మాధవరెడ్డి కదా! డబ్బు అడిగింది క్రిష్ణారెడ్డి మంచోడు నువ్వంటే ఇష్టం అన్నాడు అని ఆమె మనసు మారుస్తాడు వాళ్ల అన్న. వీరబల్లిలో క్రిష్ణారెడ్డి ఇంటి దగ్గర పెళ్లి జరుగుతుంది.

ఈ రోజుల్లో ఆడపిల్లలు పుట్టింటినుంచి సమస్తం తీసుకుని పోవాలనుకుంటారు. కానీ లక్ష్మి అందుకు భిన్నంగా పుట్టింటి గురించి ఆలోచించడం హర్షనీయం, ఆదర్శనీయం. ఇంట్లో వాళ్లు అన్ని బాధలు పడుతుంటే తను పెళ్లిచేసుకుని వెళ్లిపోవడం ఏ మాత్రం న్యాయం కాదని ఆలోచించడం లక్ష్మి విశాల హృదయాన్ని తెలుపుతుంది.

**కాంతమ్మ :**

రామిరెడ్డి భార్య కాంతమ్మ. వీరికి ఇద్దరు పిల్లలు, కొడుకు పాపోడు, కుతూరు లక్ష్మి. రామిరెడ్డి కరువు వల్ల పంటలు పండక అప్పులతో గన్నేరు కాయలు తిని ఆత్మహత్య చేసుకుంటాడు. ఈమె కొంత పొలం అమ్మి అప్పులు కడుతుంది. మరికొంత పొలం ఖాళీగా ఉంటుంది. ఈమె కూలి పనిచేసి పిల్లలను పెంచుతుంది. పాపోడు ఎద్దులను రూ.60వేలకు అమ్ముతాడు. కాంతమ్మకు ఎద్దుల మీద ఉండే ప్రేమ, వాత్సల్యం కనపడుతుంది. లక్ష్మి పెళ్లికి ఎద్దులు అమ్మగా వచ్చిన రూ.60 వేలు, తన నగలు అమ్మి కట్నం డబ్బులు సరిచేయమని కొడుకుతో చెబుతుంది. కుటుంబం పట్ల ప్రేమాభిమానం, పంచె సహృదయ మూర్తి కాంతమ్మలో కనపడుతుంది.

ఈ నవలలోని స్త్రీ పాత్రలు కరువు ప్రభావంతో ఇబ్బంది పడిన పాత్రలే. రాయలసీమలో కరువు ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో ఈ పాత్రల ద్వారా తెలుస్తుంది. కరువుకు బలైన పాత్రలు కొన్ని, భర్తతో విసిగి వేసారిని పాత్రలు పల్లెల్లో జరిగే అకృత్యాలను చూడలేని కొన్ని అమాయక పాత్రలు.పురుషుని వల్ల కలిగిన మానసిక సంక్షోభానికి గురై ఎదుర్కొన్న పాత్రలనేకం ఉన్నాయి. ఈ పాత్రలన్నింటిలోనూ సహజత్వం కళ్ళకు కట్టినట్లు కనపడుతోంది.

## ఆధార గ్రంథాలు :

1. నేలదిగిన వాన (నవల)- వేంపల్లి గంగాధర్
2. రాయలసీమ నవలల్లో కరువు కాటకాలు- పరిశీలన(సిద్ధాంతగ్రంథం) - బుంగ అనురాధ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పాలగుమ్మి కథల్లో స్త్రీ

- డా॥. నల్లపనేని విజయలక్ష్మి, తెలుగు ఆధ్యాపకురాలు, యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల.

పాలగుమ్మి పద్మరాజు 24-06-1915 న పశ్చిమ గోదావరి జిల్లా తిరుపతిపురంలో జన్మించాడు. ఎం.ఎస్సీ చదివిన ఆయన వృత్తి రీత్యా రసాయనశాస్త్ర అధ్యాపకుడు. ప్రవృత్తి రీత్యా రచయిత. సాహితీవేత్తలందరి లాగానే కవితా రచనతో సాహితీవ్యాసంగం ప్రారంభించిన ఆయన తరువాతి కాలంలో కవిత్వాన్ని పక్కన పెట్టాడు. కథ, నవల, నాటిక, వ్యాసాలలో విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. తెలుగు కథకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత వీరిదే.

తెలుగు భాషపై పాలగుమ్మికి గల అధికారం, విజ్ఞాన, మనస్తత్వ శాస్త్రాలతో ఆయనకు గల గాఢ పరిచయం ఆయన కథలలో వ్యక్తమవుతుంది. శిల్పం మీద ప్రత్యేక శ్రద్ధతో, పాత్రపోషణ-ముఖ్యంగా అంతరంగచిత్రణ - లక్ష్యంగా కథలు రాసిన రచయిత పాలగుమ్మి పద్మరాజు అంటారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'కథాశిల్పం' లో. ఆ మాటలు అక్షరసత్యాలు. సంప్రదాయం నిర్దేశించిన ఒకేరకం పాత్రలంటే పాలగుమ్మికి విసుగు. మానవత్వానికి, మనిషి వ్యక్తిత్వానికి మాత్రమే ఆయన ప్రాధాన్యమిచ్చాడు. అందువల్ల ఆయన కథల్లోని పాత్రలు విభిన్నంగానూ, సజీవంగానూ ఉంటాయి.

పాలగుమ్మి సృష్టించిన స్త్రీ పాత్రలు ప్రత్యేకమైన వ్యక్తిత్వం గలవి. నాగరికతను మేకప్‌గా వేసుకొని, హిపోక్రసీని దాచుకొని, లేని సంస్కారాన్ని ప్రదర్శించే పాత్రలు కావవి. ఆయా పాత్రలలోని మంచి, చెడులను ఆయన అత్యంత సహజంగా ప్రదర్శించడం వల్ల అంత తేలికగా వాటి వ్యక్తిత్వాలను మనం బేరీజు వేయలేం. ఆ పాత్రల సంస్కారాన్ని అర్థం చేసుకునే కొద్దీ త్రివిక్రమావతారం ధరించి శిఖరస్థానంలో నిలిచి మనల్ని ఆశ్చర్యపరుస్తాయి.

'నిత్య జీవితంలో - చెడ్డవాళ్లనీ, మోసగాళ్లనీ, దగాకోరుల్నీ, అవినీతిపరుల్నీ పూర్తిగా దూరంగా ఉంచడం జరగదు. ఒక్కొక్కప్పుడు వాళ్లను సహిస్తాం, క్షమిస్తాం. కొంతమందంటే ఇష్టం కూడా పెంచుకుంటాం.' అన్న పాలగుమ్మి తన కథల్లోనూ అటువంటి వ్యక్తులను పాత్రలుగా తీర్చిదిద్దాడు. ఆయన రచించిన 'పడవ ప్రయాణం'లోని రంగి పాత్ర ఇటువంటిదే.

చిన్న వయసులోనే పద్దాలుతో లేచిపోయింది రంగి. అతడు తనను పెళ్లి చేసుకోకపోయినా, తాగి తంతున్నా భరించింది. మరొక స్త్రీని ఉంచుకొని తనను చంపడానికి ప్రయత్నించినా క్షమించింది. పద్దాలు తన నానుపేటను తీసుకొని వెళ్లి ఉంచుకున్నదానికి ఇచ్చినా సహించింది. దొంగతనం చేసిన సొత్తును తీసుకెళ్లి దానికే పెడతాడని తెలిసినా అతడిని తప్పించి దెబ్బలు తినడం అలవాటు చేసుకొంది. 'ఆడు నా వోడు! ఎన్ని తిరుగుళ్లు తిరిగినా నావోడు. నా దగ్గరికే వొత్తాడు.' అన్న ఆమె నమ్మకం అచంచలమైనది. పద్దాలు ఎలాంటివాడో స్పష్టంగా తెలిసినా అతడి కోసం ఎలాంటి పని అయినా చేయడానికి సిద్ధంగా ఉండడం గమనించినపుడు ఆమె అనురాగం ఎంత స్వచ్ఛమైనదో తెలుస్తుంది. అతడు నిర్దుష్టంగా, నీతిగా నడుచుకోవాలనే పట్టింపును ఆమె ప్రదర్శించలేదు. అతని సుగుణాలతో, అవగుణాలతో అతన్ని అంగీకరించింది. తల్లి తన బిడ్డలను వారి అవగుణాలను పట్టించుకోకుండా ఎలా ప్రేమిస్తుందో అంత స్వచ్ఛంగానూ, అంత సహజంగానూ రంగి తన ప్రియుడు పద్దాలును ప్రేమించింది. అన్ కండీషనల్ ప్రేమకు నిదర్శనం రంగి పాత్ర.

'గాలివాన' కథలోని బిచ్చగత్తె పాత్రకు పేరు లేదు. జీవితంలోని ఏ దశా ఆమెకు సంతృప్తికరంగా గడవలేదు. అయినా ఆమెకు అసంతృప్తి లేదు. జీవితానుభవాలు ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగల ధైర్యాన్నిచ్చాయి. అది

లేదని, యిది లేదని సీకాకు పడితే లాభం ఉండదనీ, వున్నంతలో సుకంగా ఉండాలనే తెలివిడి నిచ్చాయి. తల్లిని చంపిన తాగుబోతు తండ్రి, ఇద్దరు పిల్లలకు తల్లిని చేసి, వారి బాగోగులను పట్టించుకోకుండా ఆమె సంపాదన లోంచి తాగి దొర్లాడే మొగుడు కాని మొగుడు, ఇద్దరు పిల్లల ఆకలి తీర్చవలసిన బాధ్యత - ఈ అంశాలేవీ ఆమెను కరకుబార్చలేదు. ఎంత బతిమాలినా కానీ కూడా దానం చేయని రావుగారికి రైలు దిగేటపుడు సాయం చేసింది. గాలివాన ఉధృతికి ప్రాణభయంతో అల్లాడిన రావుగారికి తన మాటలతో, శరీరపు వెచ్చదనంతో ధైర్యాన్ని, సాంత్వనను కలిగించింది. ఆ పనులను ఆమె మానవీయ స్పర్శతోనే చేసింది తప్ప ఏదో ఆశించి కాదు. పిల్లల ఆకలి తీర్చవలసిన బాధ్యత ఆమెను రావుగారి పర్సు తీసేలా చేసింది. ఆమె స్వచ్ఛమైన హృదయాన్ని, ఆమె అవసరాన్ని అర్థం చేసుకోవడం వల్లనే రావుగారు ఆమెను తప్పు పట్టలేకపోయారు. తనకు ఆత్మస్థైర్యాన్ని, శాంతిని, గాలివానకు తట్టుకోగల శక్తిని ఇచ్చిన ప్రేమమూర్తి కోసం చిన్నపిల్లవాడిలా దుఃఖించాడు. గతకాలపు స్మృతుల బరువుగానీ, రాబోయే రోజుల గురించిన ఆశలుగానీ, నిత్యమూ ధర్మాధర్మచింతతో బాధపడే అంతరాత్మగానీ, నాగరికులకు సహజమైన సంకీర్ణ మనస్తత్వంగానీ లేని స్థితప్రజ్ఞతతో బిచ్చగత్తె వ్యక్తిత్వం ఉదాత్తతను సంత రించుకుంది.

'మగపురుషుడు-ఆడ స్త్రీ' లోని రాధ స్త్రీ హృదయపు లోతుల్ని కొలవడం పురుషులకుసాధ్యం కాదని నిరూపించిన పాత్ర. ఆడవాళ్ల తెలివితేటల పట్ల చులకన భావం కలిగిన రామగోపాల్‌ను ప్రేమించిందామె. తన ప్రేమను వ్యక్తం చేయడానికి ప్రయత్నించింది. అతడు తన మీద వ్యామోహం ప్రదర్శిస్తే బెదిరిపోయింది. తనకు ఆమె పట్ల కలిగిన ప్రేమను అంగీకరించకుండా, ఆమె పన్నిన ఉచ్చులో చిక్కుకొని మోసపోయినవాడిగా తనను తాను భావించుకున్న మూర్ఖుడు రామగోపాల్. స్త్రీల మనసుల లోతులను అధ్యయనం చేశానని, వాళ్ల ఆయుధాలకు లొంగకుండా మగతనాన్ని నిలబెట్టు కున్నానని భావించాడతడు. ఆడదాని మీద అంతిమ విజయం సాధించానని పొంగిపోయిన రామగోపాల్‌కు కనువిప్పు కలిగించడం తన బాధ్యతగా భావించింది రాధ. తన ఇంటికి భోజనానికి పిలిచి పిల్లలకు అతడి పేరు పెట్టుకున్న విషయాన్ని చెప్పడం ద్వారా అతడిని తాను ఎంతగా ప్రేమించిందో తెలియజెప్పింది. అతడు అల్లరి పెట్టిన మరునాడు తన తండ్రి వద్దకు వచ్చి పెళ్లి చేసుకుంటానని అడుగుతాడని ఎదురు చూసిన సంగతిని చెప్పడం ద్వారా రామగోపాల్ తప్పును ఎత్తి చూపించింది. ఆవిధంగా జీవితంలో అతడు కోల్పోయిందేమిటో గ్రహించేలా చేసింది.

రాధ మొదట ఎంత నిష్కల్మషంగా రామగోపాల్‌ను ప్రేమించిందో అంతే నిష్కల్మషంగా అమాయకుడైన తన భర్తను ప్రేమించింది. రామగోపాల్ విషయం తన భర్త వద్ద దాచలేదు. రామగోపాల్ మూర్ఖత్వం పట్ల జాలి చూపి అతడిని దాని నుండి బయటపడవేయడానికి ప్రయత్నం చేయడం ద్వారా తన వ్యక్తిత్వానికి మరింత శోభను చేకూర్చుకున్నది.

'ఎదురు చూస్తున్న ముహూర్తం' లోని శాంతది సంక్లిష్ట మనస్తత్వం. తన అందానికి ముగ్ధుడయ్యేవాడు, తన అర్హతకు తగినవాడు, తనను మురిపించగలవాడు తనకు తారసపడాలని ఎదురు చూసింది. తన ఎదురు చూపులు ఫలించకుండానే వివాహం జరిగిపోయింది. ఆ తరువాత కూడా తనకేం కావాలో తెలియకుండానే ఏదో ఒక అద్భుతం జరగాలని ఆశిస్తూ వచ్చింది. మరిది వెంకటాన్ని, అతడు రాసిన కథలను అసహ్యించుకుంటున్నా ననుకుంటూనే వాటి పట్ల ఆకర్షితురాలైంది. ఆ కథల్లోని పాత్రలతో తనను పోల్చుకోవడం ప్రారంభించింది. వాస్తవికమైన అనురాగం పొందలేకపోతే దయాదాక్షిణ్యం లేని కఠినురాలిగా మారిపోతానేమోననే భయం, తాను ఎదురు చూసిన అద్భుతమేదో వెంకటం వల్ల జరుగు తుందనే ఆశ పెనవేసుకున్న మనసుతో లక్ష్మణరేఖను

దాటాలనుకుంది. వెంకటం విజ్ఞత వల్ల తన భయాల నుండి, ఆకర్షణ నుండి కూడా బయటపడింది.

తమకేమి కావాలో తమకే తెలియక తీవ్రమైన అసహనంతో జీవితాలను నరకం చేసుకునే అనేకమంది స్త్రీలకు ప్రతినిధిగా శాంత కనిపిస్తుంది.

భర్త మరణం వల్ల కంటే తనకు సుఖాన్నందించే అనేకానేక శరీరాలలో ఒక శరీరంగా భర్త భావించడం వల్ల కలిగిన దుఃఖంతో అలమటించిన పాత్ర మిసెస్ రాజా (కొలవరాని దూరం). ప్రేమించి పెళ్లాడిన భర్త కాముకుడని, అనేకమంది స్త్రీలతో అతడికి శారీరక సంబంధం ఉందని, అతడు తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని గ్రహించినా నిలదీయడానికి ఆమె ప్రయత్నించలేదు. చంటిపిల్లలుంటే సరదా పోతుందని చెప్పి పిల్లలను కననీయకపోవడం వెనుక తన శరీరసౌష్టవం సడలకూడదనే కోరిక ఉందనే గ్రహింపు కలిగినా ప్రశ్నించలేదు. ప్రతిసారీ మనసుకు తగిలే గాయాలను అతడు చెప్పే మాయ మాటలతో, చూపే అబద్ధపు ప్రేమతో మాన్పుకోవడానికి ప్రయత్నం చేసింది. చివరికి ఎప్పుడో మానేసిన డిగ్రీని పూర్తి చేయడం ద్వారా తన జీవితానికి ఆలంబన వెదుక్కోవాలనుకుంది.

ఈ కథలోని మిసెస్ రాజా పాత్ర ద్వారా స్త్రీలలో ఉండే సహనగుణాన్ని, కాస్తంత ప్రేమ చూపగానే కరిగిపోయి అన్నీ మరిచిపోయి పరిపూర్ణమైన ప్రేమను అందించే గుణాన్ని ఎత్తిచూపించారు పాలగుమ్మి. అదే సమయంలో తన భర్త దృష్టిలో తనకు ఎటువంటి ప్రత్యేకమైన స్థానం లేదని, అతనికి సుఖాన్నందించిన అనేకానేక శరీరాల్లో తానూ ఒక శరీరం మాత్రమేనని అర్థమైన క్షణాన ఆమెలో కలిగిన దుఃఖాన్ని ప్రతిభావంతంగా చిత్రించాడు పాలగుమ్మి. స్త్రీ దేనినైనా భరించగలుగుతుంది, క్షమించగలుగుతుంది గాని పురుషుడు తనను కేవలం శారీరక సుఖాన్నందించే వస్తువుగా చూడడాన్ని భరించలేదని మిసెస్ రాజా పాత్ర ద్వారా స్పష్టమౌతుంది.

కన్నబిడ్డ ప్రేమ కోసం ఆరాటపడి ప్రాణాలు విడిచిన తల్లి సావిత్రి (పంచవటీ దహనం). ఆమె పెళ్లి కాకుండానే ఒక బిడ్డకు తల్లై సమాజ భయానికి లొంగి ఆ బిడ్డను అనాథ శరణాలయంలో వదిలిన అభాగ్యురాలు. రూపసి కాకపోవడం వల్ల, పెళ్లికి ముందే తల్లి కావడం వల్ల దరిద్రుడు, కంటి చూపు సవ్యంగా లేనివాడు అయిన మోహనరంగాన్ని ఆమె వివాహం చేసుకోవలసి వచ్చింది. పెళ్లి జరిగిన రోజే జరిగిన ప్రమాదంలో తల్లిదండ్రులను పోగొట్టుకుంది. కాళ్లు విరగడంతో తోపుడు కుర్చీకే పరిమితమైంది. శరణాలయంలో పెరుగుతున్న తన బిడ్డకు దగ్గర కావడం కోసం తన పెద్ద ఇంటిని అమ్ముకొని శరణాలయంలోనే నివాసం ఏర్పరచుకున్నది. లక్షలు ఖర్చు పెట్టి దానిని వృద్ధిలోనికి తెచ్చింది. తన తెలివితేటలతో ఎమ్.ఎల్.ఏ అయింది. బిడ్డకు దగ్గరవ్వాలని ప్రయత్నించే కొద్దీ అతడు దూరమౌతుంటే అంతులేని క్షోభను అనుభవించింది. బిడ్డ దూరం అయ్యాడనే బాధతో ఎమ్.ఎల్.ఏ పదవితో సహా అన్నింటినీ త్యజించింది. చివరికి బిడ్డకు తన జీవిత వాస్తవాలను తెలిపి ఆత్మహత్య చేసుకున్నది. జీవితంలోని అనేక విషాదాలను ధైర్యంగా ఎదుర్కొన్న ఆమె బిడ్డ తిరస్కారాన్ని మాత్రం భరించ లేకపోయిన విధాన్ని వర్ణించిన పాలగుమ్మి మాతృత్వం స్త్రీకి ఎలా బలహీనతగా మారుతుందో చక్కగా చిత్రించారు.

ఉద్వేగాన్ని నియంత్రించుకోలేక ఏడవడం ద్వారా దుఃఖ భారాన్ని దించుకునే ప్రయత్నం చేసే శేషప్ప (ఉద్వేగాలు), మోసపోయి గర్భవతి అయిన సుబ్బి అమాయకత్వానికి జాలిపడి ఆదరించి, అందుకు కారణం తన కొడుకు అని తెలియగానే అమెను నంగనాచిగా భావించి ఇంటి నుండి తరిమివేసిన రంగమ్మ (సుబ్బి), అందరూ తననే చూడాలని, తన అందాన్ని పొగడాలనే కోరిక, భర్త మీద అనుమానం, మిగిలిన లోకమంతా అపవిత్రమనీ, తాను మాత్రమే పవిత్రమనీ భావించే అహంకారాలతో సతమతమయ్యే మిసెస్ రావు (టెలిఫోన్),

తాను శీలం లేని ఆడదే అయినా మానవత్వంతో, తలలో నాలుకలా మెలిగే స్వభావంతో అందరి అభిమానాన్ని సంపాదించుకున్న పుల్లి (పుల్లి) - ఇలా ప్రతి పాత్రనూ విలక్షణంగా మన ముందుంచుతాడు పాలగుమ్మి.

పాలగుమ్మి పద్మరాజు స్త్రీ పాత్రలను అత్యంత సహజంగా, ఇతర రచయితల కంటె భిన్నంగా చిత్రించాడు. ఆయన సృష్టించిన ఈ స్త్రీ పాత్ర లన్నింటిలో దుఃఖం, సహనం, గొప్ప ప్రేమ పెనవేసుకున్న సంక్లిష్ట మనస్తత్వం వ్యక్తమౌతుంది. ఈ పాత్రలు కేవలం సద్గుణాలతో నిండినవిగానో, కేవలం దుర్గుణాలతో కూడినవిగానో లేకపోవడం గమనించవచ్చు. దాదాపుగా అన్ని పాత్రల్లోనూ మంచీ చెడుల కలయిక ఉంటుంది. తర్కానికి అందని వైరుధ్యం ఉంటుంది. వాటిని నిసర్గ సౌందర్యంతో, సజీవంగా మన ముందు నిలిపి వాటి లోతుల్ని చూడమంటాడు. అందుకే ఆయన ప్రపంచ స్థాయి కథకుడు.

**ఆధార గ్రంథాలు :**

1. పాలగుమ్మి పద్మరాజు రచనలు (కథలు), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ
2. కథాశిల్పం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
3. తెలుగు సాహిత్య చరిత్ర, డాక్టర్ ద్వా.నా. శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

❀❀❀

# జ్ఞాన తులసి "కౌసల్య"

- డా॥. శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ, తెలుగు లెక్చరర్, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు, రాజమహేంద్రవరం.

"కౌసల్యా సుప్రజారామా! పూర్వా సంధ్యా ప్రవర్తతే ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యం దైవమాహ్నికమ్!" నేటికీ ఉదయం శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంతో పల్లెలు, పట్టణాలు నిద్రలేస్తాయి. కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి సుప్రభాతంలోని మొదటి మాట కౌసల్యను స్తుతించడంతో మొదలయ్యింది. త్రేతాయుగంలో విశ్వామిత్రుడు, శ్రీరాముని మేలుకొలుపుతూ పరోక్షంగా కౌసల్యను అభినందిస్తూ పలికిన శ్రీరాముని మేలుకొలుపు అది. యుగాలు మారినా ప్రాతఃస్మరణీయురాలైనది పుణ్యవనిత కౌసల్య. ఇంతటి ప్రత్యేక అదృష్టం చేసుకున్నది కౌసల్య. అదితి తన కుమారుడైన ఇంద్రునితో కలిసి ఎంత కాంతితో వెలుగులు చిమ్మిందో, అంత కాంతితోను ఉజ్వలతేజస్సుతోను కౌసల్య రామునితో కూడి ప్రకాశించింది. జీవితంలో అతి ప్రధానంగా చేయవలసిన ఉత్తమ పురుషార్థం ధర్మం. ఆ ధర్మమే ఆమె కుమారుడు రామునిగ రూపుదాల్చి అవతరించింది.

దశరధుని ముగ్గురు భార్యలలో పెద్ద భార్య కోసల రాజపుత్రి కౌసల్య. దశరధునితో సింహాసనం అధిష్టించి, పట్టాభిషిక్త అయిన గౌరవం కౌసల్యది. ఆమె సుగుణాల పెన్నిధి. ఔదార్యం, ఓర్పు, సౌశీల్యం, పవిత్రత ఆమె సొత్తు. తులసీదాసు రచించిన రామచరితా మానస్‌లోని కొన్ని ఘట్టాలతో డా॥ రామడుగు వేంకటేశ్వర శర్మ గారు వ్రాసిన జ్ఞాన తులసి కావ్యంలోని కొన్ని అంశాలను చూద్దాం...

బాలరాముని, కౌసల్య పెంచే విధానాన్ని వివరిస్తూ

"లాల పోసెను పెరుగ నీలాల కాంతి
కాటుకిడె కనులందాల గనులుకాగ
అలికమందిడె దిష్టిబొట్టందముగను
పాలబుగ్గల బాబుకు పాలుపట్టి
లాలిపాటల కమ్మగ జోలపాడి
కుదురుకొన స్వర్ణజోల జోకొట్టి వేడ్క
చిట్టి రాముని బజ్జుండపెట్టె తల్లి"

కౌసల్య మానస సరోవరము నకు అందమునిచ్చు అరవిందము శ్రీరామ చంద్రుడు. ఒక నాటి ప్రభాత సమయాన కౌసల్య, శ్రీరామునికి శరీరపు నీలికాంతి పెరుగునట్లుగా స్నానము చేయించి, కళ్ళకు మరింత శోభ కలుగునట్లుగా కాటుక దిద్ది, బుగ్గన దిష్టి చుక్క పెట్టి, పాలు పట్టి బంగారు ఊయలలో పరుండబెట్టింది. బాల రాముని పెంచే విధానాన్ని చెబుతూ చెప్పే పైపంక్తులు చదివిన మరుక్షణం పాఠకులకు కరుణశ్రీ కవితా ఖండికలోని "ఒత్తుగా పూల గుత్తులు ఎత్తుపెట్టి, మెత్తగా పక్కదిద్ది, ఒత్తుకోకుండా చేత్తో ఒత్తి చూసి, భాష్పములతో తాను తడిపిన పక్కమీద చిట్టిబాబును బజ్జుండబెట్టె తల్లి" అనే అంశం గుర్తుకురాక మానదు.

శ్రీమద్రామాయణ భువన ప్రాంగణంలో వెలసిన తులసికోట కౌసల్యమాత. కౌసల్య స్త్రీ జాతికి ఆదర్శ నారీమణి. బుజ్జబాబును బజ్జోపెట్టిన కౌసల్య, తాను కూడా త్వరగా స్నానము చేసి కులదైవమును అర్చించింది. దేవునికి నివేదించుటకు శుచిగా, రుచిగా తయారుచేసిన పదార్థములను గిన్నెలలో ఉంచి వంటపనికి వెళ్ళింది. అర్థాంతరన్యాసలంకారముతో ఉన్న ఈ పద్యంలో భారతీయ హిందూ మహిళాధర్మం పొదగబడింది.

"తానము చేసి ఇష్టకుల దైవతమున్ విధియుక్తమౌ అను
ష్ఠాన సమర్చనాదికము సల్పగ కోసల రాజపుత్రి తో
డ్తోన సముత్సుకత్వము కడుంగడు జూపెను - కొమ్మలే
గదా!

మానిత సాంప్రదాయిక సమంచిత రీతికి
పట్టుకొమ్మతౌ!"

భారతీయ హిందూ మహిళ ఉదయమే లేచి, అనుష్ఠాన పూజలతో కులదైవాన్ని అర్చించి. జీవనారంభం చేస్తుంది. సమాజంలో చక్కటి మహిళా సంప్రదాయం వర్థిల్లాలని అభిలషించడం ఇందులో తెలుస్తోంది. స్త్రీలకు సమాన హక్కులు, స్త్రీవాద సాహిత్యం అని చెప్పడంకన్నా, తమ రచనల ద్వారా ఆయా అంశాలను సౌకుమార్యంగా చెప్పగల తెలివితేటలు గలవారే ఎక్కువగా సమాజం మీద ప్రభావం చూపిస్తారు. కౌసల్య తరతరాలుగా వస్తున్న సాంప్రదాయానికి పట్టుగొమ్మ! కౌసల్య సమాజంలో మహిళలకు గల స్థానాన్ని గుర్తుచేసి, చెప్పింది. నాటికీ, నేటికీ భారతీయ మహిళా ఒక సాంప్రదాయ భూమికను నిర్వర్తిస్తోంది. పుట్టుక నుండి, కట్టుబొట్టుల నుండి, అనేక అంశాలలో ఒక సంస్కార జీవన విధానానికి కౌసల్య పట్టుగొమ్మ.

వంటపనిలో మునిగి ఉంది కౌసల్యామాత. ఇంతలో రాముడు ఇల్లంతా గంతులు వేస్తూ, కేరింతలు కొడుతూ, బోసి నవ్వులతో, అత్త, తాత వంటి చిలుక పలుకులు పలుకుతూ ఆ ప్రసాదమును చూసి, చేతులలోకి తీసుకొని బుగ్గల నిండా పులుముకుని అమ్మా! అంటూ పిలిచాడు. పిలుపు వినబడిన కౌసల్య బంగారు ఊయల వైపు వెళ్తూ నైవేద్యపు పాయసం బుగ్గలకు, నోటికి పులుముకుంటున్న బాలరాముని చూసి ఉయ్యాల లోంచి ఇక్కడకు ఎలా వచ్చాడని శయ్యామందిరంలోకి పోయి చూడగా

"ఆ లీలన్ కనుగొంచు వేగమున శయ్యామందిరం బేగ, ఉ
య్యాలన్ నోటన్ వ్రేలు వేసుకొని నిద్రాసక్తుడై మాతృనే
త్రాలం దోచెను మఱ్ఱియాకు సొగసుల్ సాగన్ బరున్నట్టి ఆ
బాలుండైన ముకుందుడై దశరథ ప్రాణం బనూనంబుగన్"

బంగారు ఊయల వైపు వెళ్తుండగా, నిద్రాసక్తుడై మఱ్ఱి ఆకుపై పడుకుని, నోటిలో వ్రేలు పెట్టుకుని ఉన్న ముకుందుడు

"కరార విందేన పదార విందం ముఖార విందేన వినివేశయంతం
వటస్య పత్రస్య పుటేశయానం బాలం ముకుందం మనసా స్మరామి"

అనే దృశ్యం ప్రత్యక్షమయ్యింది. జన్మ ధన్యమయ్యింది. మనస్సు అయోమయంలో పడింది.

"కలయో వైష్ణవ మాయయో ఇచట వైకల్యం బిదే మొక్కొ?కే
వలమున్ రెండుగ నాదు తండ్రి కనుపింపన్ జాలునే? భ్రాంతిడో
లలటే? అంచు తలంచు తల్లి కని ఆ రాముండు చిర్నవ్వుతో
డలసద్దివ్య మహాద్భుతంబగు అఖండంబైన రూపంబుఁనే
ర్పొలయున్ జూపెను జన్మ ధన్యత మెయిన్ పొంగార కౌసల్యయున్."

ఇందులోని భావ సౌందర్యం చూస్తే, భాగవత కాలానికి ముందే, కౌసల్య మాతకు విశ్వరూప సందర్శన జ్ఞాన ఫలితం దక్కినట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఆ దివ్య సందర్భాను భూతిని ఎటువంటి మాయ కప్పకుండా ఉండే విధంగా వరమియ్యమని శ్రీరాముని కోరింది. ఆ జగదభిరాముడే తన వరాల రాముడనే దైవరహస్యం తెలుసుకుని కౌసల్య జ్ఞానతులసిగా మనకందరికీ దర్శనమిస్తుంది. ఇది కల్పన అంటే నమ్మలేనంత, నమ్మటానికి మనసొప్పనంత మధుర సన్నివేశం.

భగవంతుని విశ్వరూప సందర్శన సౌభాగ్యాన్నదుకున్న కౌసల్య ఇక్కడ జ్ఞానతులసి. జ్ఞానానికి దైవ సాక్షాత్కారమే అంత్యఫలం. తల్లులు కన్నబిడ్డలను శ్రద్ధతో పెంచాలని, పిల్లలు దైవ సమానులని, పిల్లలను శిశుపోషణా మందిరా

లకు అప్పజెప్పి, తల్లి బాధ్యత నుండి తప్పించు కోకూడదనే లౌకికపరమైన జ్ఞానబోధకూడా కౌసల్య పాత్ర ద్వారా జరిగింది. మాతాశిశు సంబంధం ఈ కథనం ద్వారా ఆర్ద్రంగా కనిపించడం ఇందులోని నూతనత్వం.

రామునిలో సకల చరాచర జీవరాశిని దర్శించి, పులకించిన శరీరంతో, నోట మాట రాక కన్నులు మూసుకొని, చేతులు జోడించి పరమాత్మను నా కుమారునిగా తలచానా? ఇది యుక్తమా? నాకంత అర్హత యున్నదా? అనుకుంటూండగానే రాముడు బాలరూపంలోకి వచ్చేశాడు.

"ఆమె నోదార్చి హరి రహస్యముగ నుంచు
మనియె 'దీనిని నీదు మాయాప్రవృత్తి
కప్ప కుండును గాక! నన్నెప్పుడేని'
అనుచు వినమిత మస్తయై అంజలించె
జ్ఞాన తులసియె గాదె! కౌసల్య చూడ"

విషయాన్ని రహస్యముగా ఉంచమని రాముడు చెప్పగానే, కౌసల్య "నీమాయ చేత ఈ విషయమును కప్పకుందువు గాక!" అని తలవంచి నమస్కరించిన కౌసల్యమాత జ్ఞానతులసి.

రామునికి పదునాలుగేండ్రు వనవాసం తప్పదని తెలిసినపుడు మనసులో బాధ కలిగినా, విషమ పరిస్థితికి సమాధానపడి, సర్దుకుపోయి, కుమారుని క్షేమాన్ని, పునరాగమనాన్ని మనస్ఫూర్తిగా మంగళాశాసనం ప్రవచించింది కౌసల్య.

యన్మంగళం సహస్రాక్ష సర్వ దేవ నమస్కృతే
వృతనాశే సమభవత్ తత్తే భవతు మంగళమ్.
యన్మంగళం సుపర్ణస్య వినతా కల్పయత్పురా
అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్.
అమృతో త్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్యయత్
అదితిర్మంగళం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్.
త్రీన్విక్రమాన్ ప్రక్రమితో విష్ణోరమిత తేజసః
యదాసీ న్మంగళం రామ తత్తే భవతు మంగళమ్
ఋతవ స్సాగరా ద్వీపా వేదో లోకాదిశశ్చతే
మంగళాని మహాబాహో దిశంతు తవ సర్వదా

కౌసల్య నోటి నుండి వెలువడ్డ ఈ మంగళ శ్లోకాలు పరమ పవిత్రంగా ఎంచబడి, నేటికీ ఆలయంలో ఉత్సవమూర్తులను ఊరేగింపుకు తీసుకుని వెళ్ళే సమయంలో భక్తితో పఠింపబడుతున్నాయి. అంతేకాదు, తమ పిల్లలు కార్యార్థమై బయటకు వెళ్ళే సందర్భంలో ఇంట్లో ఈ శ్లోకాలు వాళ్ళకి వినబడేటట్లు చదివితే సమస్త సన్మంగళాలు వారికి కలుగుతాయని పెద్దల ఉవాచ. వనవాసం చేయవలసినవచ్చిన కుమారునికి ఎలుగెత్తి మంగళాశాసనం పలికింది. నిరాశా నిస్పృహలకు లోనుగాక, పరిస్థితిని ఎదుర్కొని ధైర్యంగా నిలదొక్కు కుంది. పుత్రుని ఎడబాటును ఓర్పుతో సహించింది. రాముని పునరాగమనానికి కళ్ళలో ఒత్తులు వేసుకుని మరీ ఎదురుచూసింది. వనవాస కాలపరిమితి గతించగానే రాముడు అయోధ్యకు తిరిగివస్తాడు. కౌసల్య ఆశ ఫలించింది. రాముని పట్టాభిషేక మహోత్సవం కళ్ళారా చూసి పరమానందభరితురాలయ్యింది.

కౌసల్య స్వభావం, శీలం, ప్రవర్తన, జీవితం అన్నీ కూడా ముఖ్యంగా సత్త్వగుణ ప్రభావితాలు. కౌసల్యలోని సంయమన శక్తి మెచ్చుకొనదగినది. కౌసల్య స్వయంగా ధర్మశీలి. ఇతరులలోని ధర్మపరాయణత్వాన్ని ఆమె సహజంగా మెచ్చుకొనగలదు. విలువలను అంచనా వేసేటప్పుడు, నిర్ణయాలను తీసుకొనేటప్పుడు, కౌసల్య తన వ్యక్తిగత హృదయస్పందనలకు తావివ్వదు. వాటి ప్రభావాలకు లోనుగాదు. అంతేకాదు తాను చేసిన పొరపాట్లను కప్పిపుచ్చడానికి ప్రయత్నించదు. ధైర్యంగా ఒప్పుకుంటుంది. ఇన్నిమంచి గుణాలు కలబోసికొని యున్నందువల్ల కౌసల్యను లోకమంతా ప్రేమిస్తుంది. గౌరవిస్తుంది. కౌసల్య లోకారాధ్య. అమితమైన శోకంలో క్రుగ్గినపుడు, మాతృవాత్సల్యంతో ఒడలు మరచినప్పుడు, అప్పుడప్పుడు కొన్ని ఘడియలు మాత్రం ఉద్రిక్తురాలై

ప్రసంగించవచ్చు. కాని వాటివల్ల ఆమె ప్రసన్నత్వగుణానికి భంగం వాటిల్లదు సరికదా ఆమె సౌహార్ద్రత చిక్కబడుతుంది; అందరికీ ఆహ్లాదం కలిగిస్తుంది. అందువల్లనే మూర్తీభవించిన జ్ఞానతులసి కౌసల్య.

అందుకే ఏ కార్యక్రమానికైనా ముగింపు సందర్భంగా మళ్ళీ కౌసల్యనే మన హైందవ జాతి స్మరిస్తుంది.

"మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం!!"

**ఆధార గ్రంథాలు :**

1) జ్ఞాన తులసి - డాక్టర్ రామడుగు వేంకటేశ్వర శర్మ
2) రామాయణంలోని మహిళలు - చెళ్ళపిళ్ళ సీతారామమూర్తి
3) వాల్మీకి రామాయణం - గోరఖ్‌పూర్ గీతా ప్రెస్
4) రామాయణం (వచనం) - ఉషశ్రీ
5) సామవేదం షణ్ముఖశర్మ గారి అంతర్జాల ఉపన్యాసాలు
6) చాగంటి కోటేశ్వరరావు గారి అంతర్జాల ఉపన్యాసాలు

# ధీరనాయిక రుక్మిణి

- డా॥. జి. వెంకటలక్ష్మి
సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా.

- గంజి శశిధర్
సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
హయత్ నగర్, రంగారెడ్డి జిల్లా.

భాగవతంలో 'రుక్మిణీ కళ్యాణా'నికి ప్రముఖమైన ప్రాధాన్యత ఉంది. పెళ్లికాని ఆడపిల్లలు చదివితే మంచి వరుడు లభిస్తాడని పెద్దల ఉవాచ. ఈ ఘట్టంలోని రుక్మిణి యొక్క పాత్ర - స్వభావం, ఈ కథ విశేషాలు వివరించడమే మా పత్రసమర్పణ యొక్క ముఖ్య ఉద్దేశం.

విదర్భలోని కుండిననగరానికి ప్రభువు భీష్మకుడు. ఇతనికి రుక్మి, రుక్మరథుడు, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అనే ఐదుగురు మగపిల్లలు, రుక్మిణి అనే ఆడపిల్ల ఉన్నారు.

రుక్మిణీదేవి దినదినప్రవర్ధమాన అయి ఎదుగుతున్నప్పుడు ఆ కాలానికే శ్రీకృష్ణుని వృద్ధిని కూడా సహోక్తి అలంకారంలో హృద్యంగా వర్ణించారు పోతనగారు.

దేవకీసుతు కోర్కి తీగెలు వీడంగ
వెలదికి మైదీగె వీడ దొడగె
గమలనాభుని చిత్తకమలంబు వికసింప
గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూప
బాలతికి జనుదోయి పొడవు సూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ
జలజాక్షి మధ్యంబు సన్నమయ్యె
హరికి బ్రేమబంధ మధికంబుగా గేశ
బంధ మధిక మగుచు బాలకమరె
బద్మనయను వలన బ్రమదంబు నిండార
నెలత యౌవనంబు నిండి యుండె.!
(పోతన, భాగవతం, దశమ. పూర్వ. 1692)

కృష్ణుడికి రుక్మిణిని పెండ్లాడాలనే కోరికలు విప్పారేలా, ఆమె మేను కోమలంగా పెరుగుతున్నది. కమలనాభుని మనస్సు వికసించేలా, ఆ కాంతామణి ముఖపద్మం వికసించింది. మాధవునికి మదనతాపం కలిగేలా, ఆ మగువకు చనుగవ ఘనమయింది. శౌరికి ధైర్యం సన్నగిల్లేలా, ఆ జలజాక్షికి నడుము సన్నబడింది. హరికి ప్రేమ పెరిగి పొంగేలా, ఆ ఎలనాగ శిరోజాలు చక్కగా వృద్ధి చెందాయి. అలా కృష్ణుడికి సంతోషం కలిగించేలా, రుక్మిణికి నిండు యౌవనం తొణకిసలాడుతోంది. ఈ విధంగా వేర్వేరు స్థలాలలో ఉన్న ఇద్దరు వ్యక్తుల లక్షణాలు ఏకకాలంలో వృద్ధి పొందుతున్నట్లు వర్ణింపబడటం వలన ఇది సహోక్తి అలంకారం.

రుక్మిణి యొక్క గుణగణాలను పోతనగారు చెప్తూ ఆత్మోన్నతి, గాంభీర్యం, సకలసంపదలను కలిగించేది, సుజనులను, చుట్టాలను ఆదరించేది, పుణ్యసంచారిణి, దారిద్ర్యపరిహారిణి, కళ్యాణవేషభూషణధారిణి, రమణీ శిరోమణిగా అభివర్ణించారు. ఇటువంటి కన్యకను పెళ్లి చేసుకోడానికి ఏ వరుడైనా పరితపిస్తాడు.

వరుడికి ఉండవల్సిన లక్షణాలను అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుడు చెప్తూ- లోకుల మనస్సులను రంజింపచేసేవాడు, వంశము, విద్య, చక్కదనము, జవ్వనము, మంచితనము, సంపద, బలము, దానము, పరాక్రమము, కారుణ్యము ఉండే వరుడే వరుడు అన్నాడు. ఇటువంటి లక్షణాలు గల అబ్బాయి దొరికితే అమ్మాయి అదృష్టవంతురాలు. ఈ లక్షణాలన్నీ శ్రీకృష్ణునిలో ఉన్నాయి.

భీష్మకుని ఇంటికి వచ్చే అతిథులవల్ల శ్రీకృష్ణుని శుభలక్షణాలు, సద్గుణాలు అన్నీ విని రుక్మిణి తన మనసులో కృష్ణుని పెండ్లాడవలెనని నిశ్చయించుకుంది. తన అన్న రుక్మి శిశుపాలునికి ఇచ్చి వివాహం చేయాలనే తలపు తెలుసుకోగానే ఆత్మబంధువుగా తలచే విప్రుడు అగ్నిద్యోతనుని శ్రీ కృష్ణుడి దగ్గరకు రాయబారిగా సందేశాన్ని పంపింది. యుద్ధం లేకుండ, ఎవరికీ నష్టం కలుగకుండ రాక్షసపద్ధతిలో తనను తీసుకెళ్ళమని ఉపాయం చెప్పింది.

రాయబారం అనంతరం అచ్యుతుడు శీఘ్రంగా వెళ్లే శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం' అనే నాలుగు అశ్వాలను పూన్చిన రథంపై విప్రుడు వెంటరాగా కుండిన నగరానికి ప్రయాణమయ్యాడు.

విషయం తెలుసుకున్న బలరాముడు ఒకవేళ యుద్ధం సంభవిస్తే తమ్ముడికి సహాయం చేయాలనే తలపుతో అసంఖ్యాక సైన్యంతో కుండిన నగరానికి బయలుదేరాడు.

వీరి రాక తెలియని రుక్మిణి పరిపరి ఆలోచనలు చేస్తూ అంతఃపురంలో ఉండిపోయింది.

ఘనుడా భూసురు డేగెనో ? నడుమ మార్గశ్రాంతుడై
చిక్కెనో ?
విని కృష్ణుం డది తప్పుగా దలచెనో ? విచ్చేసెనో ?
యీశ్వరుం
డనుకూలింప దలంచునో తలపడో ? యార్యామహా
దేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱగదో ? నా భాగ్య
మెట్లున్నదో ?

(పోతన, భాగవతం, దశమ. పూర్వ. 1727)

బ్రాహ్మణుడు వెళ్ళాడో? లేడో? నందనందనుడు సందేశం విన్నాడా? విని తప్పుగా అనుకున్నాడా? వస్తాడా? రాడా? - ఇలా పలు ఆలోచనలతో తల్లడిల్లిపోయింది. చివరికి దైవం మీద భారం వేసి గౌరీదేవి తనను కాపాడాలి అనుకుంది. ఇలా ఆలోచిస్తున్న సమయంలోనే ఆమెకు అనేక శుభశకునాలు కన్పించాయి. ఎడమకన్ను ఎడమ భుజం అదిరాయి. ఇంతలో అగ్నిద్యోతనుడు వచ్చి, శ్రీకృష్ణుని రాకను రుక్మిణికి తెలియజేసి మానసికానందం కలిగించాడు.

పెండ్లినాటి ఉదయం రుక్మిణి గౌరీ ఆలయానికి బయలుదేరింది. శ్రద్ధగా, వినయంతో పార్వతీ పరమేశ్వరులను పూజించి, భర్తృసమేతలైన బ్రాహ్మణ పత్నులకు ఉప్పు, అప్పములు, తాంబూలాలు మంగళసూత్రాలు, చెఱకుగడలను ఇచ్చి పూజించింది. ముకుందుని రాక కోసం చూస్తూ వీరమోహినిలాగా కాలినడకతో గుడివెలుపలికి వచ్చింది. ఈమెకోసం చూస్తున్న కృష్ణుడు మెల్లని నడకతో ఆమెను సమీపించి, శత్రుసమూహం చూస్తుండగానే రథం ఎక్కించుకొని పాంచజన్యం పూరించాడు.

యాదవవీరులకి - శిశుపాలుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు, సాల్వుడు, విదూరకుడు, పౌండ్రక వాసుదేవుడు మొదలైనవారికి మధ్య జరిగిన యుద్ధంలో యాదవులకి విజయం దక్కింది. శిశుపాలున్ని ఓదార్చుతూ "బొందిలో ప్రాణాలుంటే భార్య దొరక్కపోదు. పెండ్లాము మాట దేవుడెరుగు, బతకడమే పదివేలు" అని అతని మిత్రులు చెప్పారు.

రుక్మిణి అన్న రుక్మి కృష్ణుడికి ఎదురొడ్డి పోరాటానికి నిలిచి పరాజయం పాలైనాడు. అతన్ని చంపడానికి వెళ్లగా, రుక్మిణి అడ్డం వచ్చి ఈ శుభసమయంలో మా తల్లిదండ్రులకు పుత్రశోకం కలిగించవద్దని చెప్పింది. కృష్ణుడు కత్తితో గడ్డం, మీసం, తల పాయలుగా గొరిగి కురూపిని చేసి బంధించాడు.

బలరాముడు వచ్చి అతని కట్లను విప్పివేశాడు. అన్నకు జరిగిన అవమానానికి రుక్మిణి దుఃఖిస్తుండగా బలరాముడు ఆమెకు ఆత్మజ్ఞానాన్ని బోధించి, ఆమె పరితాపాన్ని పోగొట్టాడు.

తోడంబుట్టినవానిభంగమునకున్ దు:ఖించి మాకృష్ణు నె
గ్గాడం జూడకు మమ్మ పూర్వభవకర్మాధీన మై ప్రాణులన్
గీడున్ మేలును జెందు లేడొకడు శిక్షింపంగ రక్షింప నీ

తోడంబుట్టువు కర్మ శేషపరిభూతుం డయ్యె నే డియ్యెడన్.

(పోతన, భాగవతం, దశమ. పూర్వ. 1775)

రుక్మిణీ! నీ అన్నకు జరిగిన అవమానానికి దు:ఖించి మాకృష్ణుని నిందించకు. పూర్వజన్మలలో చేసిన కర్మలను బట్టి ప్రాణులు మంచీచెడులను పొందుతారు. శిక్షించే వాడు రక్షించేవాడు అంటూ ఎవరూ లేరు. పూర్వజన్మ కర్మశేషంచేత నేడు నీ అన్న అవమానింపబడ్డాడు. ద్వారకకు విచ్చేసిన తర్వాత రుక్మిణీశ్రీకృష్ణుల వివాహం జరిగింది.

ఈ ఘట్టం ద్వారా వధూవరుల గుణగణాలు ఎలా ఉండాలో తెలుస్తాయి. బంధువుల పట్ల ఎలా ప్రవర్తిం చాలో తెలుస్తుంది. రుక్మిణి యొక్క దృఢమైన మనస్తత్వం వ్యక్తమౌతుంది. ఆత్మ యొక్క స్వభావం, మాయచే కప్పబడిన ప్రపంచపోకడలు వ్యక్తమౌతాయి.

❀❀❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# మట్టి మొగ్గలు కథా సంపుటి - స్త్రీ జీవన చిత్రణ

- డి. విశ్వనాథ్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు కూడా సాహిత్యంలో స్త్రీకి ఉన్నతమైన స్థానం కల్పించారు. వేదకాలం నుండి సాహిత్యంలో స్త్రీ తన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంది. అదే విధంగా తెలుగులో ఎన్ని ప్రక్రియలు ఉన్నప్పటికీ సూటిగా తక్కువ సమయంలోనే చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పే శక్తి కథకు ఉంది. అన్ని ప్రక్రియలోకెల్ల కథ అంటే ఇష్టపడని వారుండరు. కథ ప్రక్రియలో ఎంతో హితాన్ని బోధిస్తూ సృజనాత్మక రూపాలలో కథలు రావడం జరిగింది.

కథ స్వరూప స్వభావాలను కొంతమేర విశ్లేషణ చేసినట్లయితే కథ్ ధాతువు నుంచి కథ పుట్టింది. దీనికి సంభాషించు, చెప్పుట అనే అర్థాలున్నాయి. అగ్ని పురాణంలో కథ ప్రస్తావన ఉందని, సంస్కృతంలో ఇతివృత్త భేదాన్ని బట్టి కథా ఆఖ్యాయికా, ఖండ కథా అనే భేదాలున్నాయని చెప్తారు.

“జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యతో కళ్ళకు కట్టించి, హృదయాన్ని ఒకానొక మహత్తరమైన అనుభూతితో నిండించి పదే పదే చదవాలనిపించే కథను గొప్ప కథ అని చెప్పవచ్చు” అని పోరంకి దక్షిణమూర్తి అంటారు.

“ఒక కథ చదివిన తర్వాత మనసు చలించాలి. మళ్ళీ చదివింప జెయ్యాలి. ఈ కథ బాగుంది అని పది మందికి చెప్పించగలగాలి. మరో పదేళ్ళో ఇరవై ఏళ్ళో పోయిం తర్వాత చదివినా అదే అనుభూతి, స్పందన కలగాలి. అప్పుడే అది గొప్ప కథ అవుతుంది” అని అన్నారు వాకాటి పాండురంగారావు.

అత్యంత పాఠక ఆధరణ కలిగిన కథలలో స్త్రీల జీవన విధానాన్ని ఎంతోమంది కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. అందులో రాయలసీమ ప్రాంతం చెప్పగానే కరువు కాటకాలతో నిత్యం జీవన ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు అవి వ్యవసాయ రంగంలో చాలా స్పష్టంగా కన్పిస్తాయి. ఈ ప్రాంతంలో కరువు సంభవించినపుడు తినేదానికి కనీసం తిండి కూడ లేక పస్తులున్న పిల్లలకు ఏ విధంగా కడుపు నింపాలో తెలియక స్త్రీలు పడే కష్టాలను చాలా చక్కగా వివరించారు. ‘మట్టిమొగ్గలు’ అనే కథా సంపుటిలో సడ్లపల్లె చిదంబరరెడ్డి ‘విధ్వంస దృశ్యం’ అనే కథలో కరువు సంభవించినపుడు స్త్రీలు పడిన కష్టాలు ఈ కథలో చాలా చక్కగా వివరించారు. ఆ సంవత్సరంలో కరువు విలయ తాండవం సృష్టించింది. అయితే వారు కన్నబిడ్డల్ల పెంచుకున్న పశువులను ఏ విధంగా వాటిని కసాయి వారికి అమ్మాల్సి వచ్చిందో ఆ పశువులను కసాయి వాళ్లు తోలుకుపోతుంటే ఆ స్త్రీలు పడ్డ మానసిక బాధను చక్కగా వివరించారు.

‘ఎక్కడో వంట ఇంట్లో పనిలో ఉన్న అమ్మ బర్రె అరుపుని పసిగట్టి బయటికొచ్చాక చూస్తే అది మా ఎనుమే.!!

దాని కళ్ళలో తన ఇంటికొచ్చాననే ఆశ, పగ్గాలతో ఇతర పసరాలతో బిగదీశారన్న దైన్యం, ఆకలీ దాహాల్తో అలమటిస్తున్నాననే అర్థింపులు... గమనించి నాకు ఏడుపొచ్చింది.

వాటిని సాగించే వార్రైతే పెద్ద యమకింకరుల్లాగా పొడవాటి వారల చెలకోలతో బలం కొద్ది బాదుతున్నాడు. దెబ్బ పడిన చోటంతా చర్మం వాతలు తేలుతూ ఉంది. అయిన ఆ దెబ్బల్ని భరిస్తూనే ఇతర బర్రెల్ని తనతోపాటు లాక్కొని గడప దాకా వచ్చింది. అప్పుడు ఆ స్త్రీ వారే! పాపి నా కొడకల్లారా! మీ చేతుల్లో పురుగులు పడా! మూగజీవాల్ని ఎందుకు చంపుతార్రా? కొంచెం ఆగండిరా అది నీళ్లకు దప్పిగొన్నట్లుంది, తాగనివ్వండి’ అని శపిస్తున్నట్లు అరుస్తూ పరిగెత్తినట్లు లోపలికి వెళ్ళింది.

'ఉడుము కన్నీళ్లు వేటగానికి ముద్దా!'

వారు మాత్రం ఆ స్త్రీ మాటల్ని ఏ మాత్రం ఖాతరు చేయలేదు. మరో ఇద్దరు పరిగెత్తుకొచ్చి పచ్చిక మేసే జింక పిల్లను అమాంతం అడవి కుక్కలు చుట్టు ముట్టినట్లు ఎనుము గొడ్డు ఒళ్లంతా బాదుతూ రోడ్డు పైకి మరల్చారు. దాని దాహం తీర్చేందుకు ఆ స్త్రీ పడిన ఆరాటం ఆమె దైన్య స్థితిని అంత కూడా ఈ కథలో వివరించారు.

నేను సాంబశివుడు... మాట్లాడుతున్నా! కథలో ఒక దివ్యాంగుడి తల్లి అతని కోసం పడే ఆర్ధ్రత ఇందులో స్త్రీ యొక్క త్యాగబుద్ధి అమ్మతనం అన్ని కలగలపి ఇందులో కన్పిస్తుంది. ఉదయం నేను నిద్ర మేల్కొని చాపపై నుండి లేవక ముందే నా వైపు నడిచి వచ్చే పాదాల సవ్వడే నన్ను అమ్మ పిలుపై పలకరించేది.

అమ్మ నా చేయి పట్టుకొని బచ్చలి దాకా తీసుకు పోవాల్సిన అవసరమే ఉండేది కాదు. ఇంట్లో నా పాదా లకు సోకే మట్టి, నునుపైన బండ్ల స్పర్శ వాకిలుకు ఎదురుగా వచ్చినప్పుడు నా ముఖ చర్మంపై పడే వెలుగు రేఖలు ప్రతిదినం నన్ను ఏ వైపుకు ఎన్ని అడుగులు వేయాల? ఏ వైపుగా తిరగాలి? అనే తత్వాన్ని నా శరీరం తనకు తాను అవాటు చేసుకుంది.

ఎవరో అమ్మనడిగారు 'ఏమ్మా సుబ్బమ్మా! మీ అబ్బాయి సాంబశివుడికి కళ్ళు కనిపించినట్లున్నాయి? పుట్టుకతోనా? లేక మధ్యలో పోయాయా?' అని.

'లేదొదినా వీడు పుట్టినప్పుడు గోపాలకృష్ణుడిలా ఎంత బాగా ఉండేవాడనుకొన్నావు! ఆరు నెలల బిడ్డగా ఉన్న ప్పుడు అన్నం తినిపిస్త ఆరుబయట వసారాలో కూర్చొనున్నాను. ఇంట్లో పిల్లి దూరి పాత్రల్ని దొర్లించిన చప్పుడైతే లోపలికి వెళ్లి కొంత ఆలస్యం చేశాను.

అంతలో వీడు గట్టిగా గుక్క తిప్పుకోకుండా ఏడ్వడం మొదలు పెట్టాడు. బయటికి పరిగెత్తుకొచ్చాను. వీని చుట్టూ కోళ్ల మంద, అక్కడ పడి ఉన్న మెత్కుల్నీ, మూతికి అంటుకున్న వాటిని తింటూ రెప్పలార్చే కళ్లను చూసి ఈగలనుకొని ముక్కుతో కుక్కినట్లున్నాయి! రెండు కళ్లనీ చేతుల్లో రుద్దుకుంటూ ఒకటే ఏడ్పు, నాకైతే కాళ్లు చేతులు ఆడలేదు. పాలిచ్చి ఓదార్చి ఎవరో చెబితే చనుబాలు రెండు దారలు పిండినాను. అయినా కంట గుడ్లు చింత నిప్పుల్లా ఎర్రగానే ఉన్నాయి. అని మాతృ హృదయాన్ని చాటుతూ ఎంతో బాధపడుతుంది.

అదే విధంగా సాంబశివుడు వీధిలో నడుచుకుంటు పోతూ ఉంటే కుక్క కరవడంతో తన తల్లి తల్లడిల్లి పోతుంది. అతను చూపులేని వాడవడంతో అతని భవిష్యత్తుకి ప్రతి క్షణం ఆలోచిస్తూ బాధపడుతూ ఉండేది ఆ తల్లి.

ఇదే కథలో జయ పాత్ర కూడ చాలా చక్కగా వివ రించారు. సాంబశివుడిని వివాహం చేసుకున్నది జయ. ఆమె అతనిని చాలా బాగా చూసుకునేది. అతనికి కళ్ళు కనబడకపోయిన ఆయనకు ఓపికతో సపర్యలు అన్ని చేసేది. ఆమెకు అన్నం కూరలు సరిగా చేయడం రాకపోతే భర్త కోసం చుట్టుపక్కల వారిని అడిగి నేర్చుకొని సాంబశివుడికి కూరలు చాలా రుచిగా చేసి వడ్డించేది.

జయ ప్రతి విషయంలోనూ తన భర్తకు చేదోడు వాదోడుగా ఉండేది. ఆ ఊరిలో ఆమెను అందరూ ఎగతాలి చేసిన కూడా ఆమె పట్టించుకోకుండా తన భర్తకు సేవలు చేసేది. ఆ విధంగా భర్తను దైవంగా భావిస్తూ అతనికి ఎంతో ఓర్పుతో సేవలు చేసేది ఈ జయమ్మ. ఈ విధంగా ఈ కథలో ఒక తల్లి తన కళ్ళు లేని బిడ్డ భవిష్యత్ కోసం తపన పడే అతని జీవితం ఎలా సాగుతుందో అని మదనపడుతూ బాధపడేది. దాంతో పాటు జయ పాత్రలో కళ్ళులేని భర్త కోసం ప్రతి క్షణం కూడ అతని కోసం ఆయన ఆలోచనలకు అనుగుణంగా మలుచుకుంటూ భర్తను దైవంగా భావించి తన జీవితాన్ని భర్త కోసమే త్యాగం చేసిన జయమ్మ పాత్ర ద్వారా స్త్రీ యొక్క సహజ ప్రేమను వాత్సల్యాన్ని సడ్లపల్లె చిదంబర రెడ్డి గారు ఇందులో చాలా చక్కగా వివరించడం జరిగింది.

మీరే చెప్పండి కథలో తల్లి అనారోగ్యపాలై పోవడంతో చదువు మానేసి వ్యవసాయ కూలీ పనులకు వెళ్ళి ఏ

విధంగా ఆ పనులు చేతగాక కష్టాలు పడుతుందో చాలా చక్కగా వివరించారు.

'ఆరోజు పనులకు వంగిన ఐదుమందిలోను ఒకరు కొత్త అనిపించింది. చీరకుచ్చిళ్ళు ఎగగట్టుకోవడమే కాదు బురదలో కాళ్లు కదిపే తీరు, పైర్లు చేతికందుకొని ఒకటొక్కటిగా విడదీస్తూ బురదలో నాటటే పద్ధతి' మిగిలిన వారికి భిన్నంగా ఉంది.

ఎవరీమె? పనికి కొత్తలాగుందే? అని నేను అడగ బోయే లోపలే ఆమె పేరు వసంత అని, అంతకుముందు మా పనులకు వచ్చే పలాన కూతురు అని ఆమెకు పక్షపాతం సోకితే చదువు మాని కూలికి రావాల్సి వచ్చిందని చెప్పారు. తల్లి అనారోగ్యం చదువు మానడం వంటి మాటలు విని ఆమె మీద జాలి కలిగింది. అక్కడున్న వారి అందరికి తక్షణం నాట్ల పని నుండి ఆమెను బయటకు రమ్మన్నారు. దుక్కి కాలువల్లో గట్లు తెగకుండ చూడ్డం అటు పక్కగా ఉన్న పొద్దు తిరుగుడు పంట మీదికి పక్షులు వాలకుండ తోలడం వంటి తేలికపాటు పనులు చేస్తుండేది.

అప్పటి నుండి ప్రతినిత్యం పనికిపోయేది. వినయంగా, బిడియంగా ఎవరూ చెప్పాల్సిన అవసరం లేకుండా తనపని తాను చేసేది వసంత. మధ్యాహ్నం అన్నం తినేటప్పుడు అందరూపిచ్చాపాటిగా మాట్లాడుతూ నవ్వులు పంచుకొంటుంటే వసంత మాత్రం తన చదువు గురించి ఆలోచన చేస్తూ పరధ్యానంగా చెట్టు నీడలో ఎడంగా కూర్చునేది వసంత. ఒకరోజు ఎమిటమ్మాయ్ చలాకీగా ఉండాల్సింది పోయి ఇద్దరి పనులు కూడా ఒంటి చేత్తో చెయ్యాలి కానీ అలా కాక ఏదో కల్పోయినట్టు ఈ నైరాశ్యం ఏమిటి అని అక్కడున్న వాళ్ళు అడిగే సరికి అప్పుడు ఆమె ఏమి మాట్లాడక మౌనంగా తన పనిలో తానుంది. కానీ తన మనసులో పేదరికంతో తల్లి అనారోగ్యం పాలై చదువు మాని ఇలా కూలీపనులకు వచ్చి తనలో తాను బాధపడుతుంది.

ఆ విధంగా రాయలసీమ ప్రాంతంలో వచ్చే కరువు కాటకాలకు స్త్రీలు ఎంతో కష్టపడి జీవనాన్ని ఏ విధంగా సాగిస్తున్నారో తెలుసుకున్నప్పుడు మనసు బరువెక్కు తుంది. గొడ్లను అన్నింటిని కరువు వచ్చినపుడు తెగ నమ్మడం, చదువు మానేసి కూలి పనులకు వెళ్ళడం ఇలా ఎన్నో రకాలుగా కూడ రాయలసీమ ప్రాంతంలో వాళ్ళు పడుతున్న బాధల్ని ఆర్థిని అన్నింటిని కూడ కళ్ళకు కట్టించారు సడ్లపల్లె చిదంబర రెడ్డి. మట్టి మొగ్గలు అనే కథా సంపుటిలో ఈ విధంగా స్త్రీలు పడే కష్టాలను మనం తెలుసుకోవచ్చు.

## ఆధార గ్రంథాలు

1. మట్టి మొగ్గలు (మనిషి కథలు) - సడ్లపల్లె చిదంబర రెడ్డి
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి

❀ ❀ ❀

# పోతన భాగవతంలోని ధీరోదాత్త ప్రజ్ఞా స్త్రీమూర్తుల వ్యక్తిత్వములు - విశ్లేషణ

**- కె. మాధవి,** తెలుగు అధ్యాపకురాలు, అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), కాకినాడ, కడప.

శ్రీమద్రామాయణ భారత భాగవత పురాణేతి హాసములు భారతదేశం మానవాళికి అందించిన అపూర్వ నిధులు. భూమి మీద మానవులు ఉన్నంత కాలం జీవన గమనానికి కరదీపికలై ధర్మ పథాన్ని నిర్దేశిస్తూ, ఆశ్రయించిన వారికి కల్పవృక్షములై కామితార్థములను ప్రసాదిస్తూ ఉన్నాయి. చరిత్ర కందనంత ప్రాచీన కాలములోనే వేదముల పరమార్థాన్ని అరచేతిలో వెన్నముద్ద రీతిగా అందించటానికి అవతరించిన ఈ మహేతిహాసములు ప్రపంచ వాఙ్మయ చరిత్రలోనే 'నభూతో నభవిష్యతి'. ఎన్నో భాషలలోనికి అనువాదాలు, వ్యాఖ్యానాలతో మహోన్నతంగా అలరారుతున్నాయి. యుగాలు గతించినా, తరాలు మారినా ఎప్పటికీ మారని శాశ్వత సత్యములను, సర్వ కాలీన సర్వ జనీన ధర్మములను బోధిస్తూ నేటికీ నిత్య నూతనంగా విరాజిల్లుతూనే ఉన్నాయి.

శ్రీమద్భాగవతం సంస్కృతంలో మహర్షి బాదరాయణుడు రచించిన అష్టాదశ పురాణములో ఒకటిగా ప్రసిద్ధి పొందింది. భారతకథానంతరము జరిగిన పరిణామాలతో ప్రారంభమై శ్రీకృష్ణ భగవానుని దివ్య లీలా విలాసముల వర్ణనములతో భక్త జనులకు ఉపాధేయముగా ఎన్నో పుణ్య చరిత్రలకు ఆలవాలమైనది భాగవతము. ఒకప్పటి ఆర్యావర్తములో వాస్తవముగా సంభవించిన సంఘటనలనే వ్యాసుడు పురాణ రూపములో ప్రవచించాడు. దానినే శ్రీ శుక మహర్షి పరీక్షిత్తునకు వినిపించాడు. ఆ సంస్కృత భాగవతమును క్రీ.శ. 15 వ శతాబ్దికి చెందిన కవి, సహజపండితుడు అయిన పోతన ఆంధ్రీకరించాడు. పోతన భాగవతంలోని స్త్రీల పరిస్థితులు, వ్యక్తిత్వం ఎటువంటివో అంచనా వేయటమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

భాగవతములోని స్త్రీలు - వారు పాత్రలు కారు. వ్యక్తులు. కవి యొక్క ఊహాలోకము నుండి, లేఖిని ద్వారా జాలువారిన కల్పనాజనితమూర్తులు కారు. ఒకప్పుడు ఈ నేలపై సజీవముగా నడయాడిన మూర్తులు. కాబట్టి వారి యొక్క ప్రవర్తనలు, మాటలు వారి నిజమైన వ్యక్తిత్వాన్ని మనకు వాస్తవముగా అందిస్తాయి. కాబట్టి పోతన భాగవతములోని స్త్రీ అంటే ఈ భారతావనిలో ఒకప్పుడు నడయాడిన స్త్రీ అని అర్థము చేసుకోవచ్చు. అయితే, మహా భారత కాలమును, ఆధునిక కాలములను పోల్చి చూస్తే సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులలో పూర్తి భిన్నమైన మార్పులు వచ్చాయి. అయినా వ్యక్తుల ప్రవర్తనలను బట్టి, ఆ కాలము నాటి నేపథ్యాన్ని ఆధారంగా చేసుకొని, ఏ కాలములోనైనా వారి యొక్క సహజ స్వభావములను విశ్లేషించవచ్చు.

ఉదాహరణకు భాగవతంలో ద్రౌపదిని తీసుకుందాం. ద్రౌపది ఉన్నతమైన వ్యక్తిత్వంతో స్త్రీ జాతికే వన్నె తెచ్చే గుణ సంపదలతో అసమాన ధీరగా, వివేకవంతురాలిగా కనిపిస్తుంది. అశ్వత్థామ తన కుమారుల తలలు నరికి చంపాడని విని ద్రౌపది శోకార్తయై నేలకూలిపోయింది. ఇందుకు ప్రతీకారంగా అర్జునుడు అశ్వత్థామను త్రాళ్ళతో కట్టి పశువు వలె ఈడ్చుకొని వచ్చి ద్రౌపది ముందు పడవేసి చంపటానికి సిద్ధపడుతుండగా ద్రౌపది ఆపింది. ఆ సమయంలో ద్రౌపది చూపించిన కరుణ, పాటించిన సంయమనం అనితర సాధ్యం. ఐదుగురు కొడుకులను

పోగొట్టుకున్న దు:ఖంతో కూడిన ఆగ్రహావేశాలను అశ్వత్థామపై చూపించలేదు. పైగా మెల్లగా మృదువుగా అతనితో సంభాషించింది. "భూసురుడవు, బుద్ధి దయా భాసురుడవు... శిశుమారణ మాసుర కృత్యము ధర్మమగునే తండ్రీ!" అని సూటిగా ప్రశ్నించింది.

"ఉద్రేకంబున రారు శస్త్ర ధరులై, యుద్ధావనిన్ లేరు, కిం
చిద్ద్రోహము నీకుఁ జేయరు, బలోత్సేకంబుతోఁ జీకటిన్
భద్రాకారులఁ బిన్న పాపల రణప్రౌఢ క్రియా హీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా! నీ చేతులెట్లాడెనో?"
- శ్రీమహా భాగవతము, 1-162

అని నిద్రపోతున్న వారిని, పిల్లలను చంపటానికి నీకు చేతులెట్లు వచ్చాయి? అని మృదు తీవ్ర స్వరముతో అడిగింది. ఇలా అడగటానికి ఎంతో గుండె దిటవు ఉండాలి. భీముడు అశ్వత్థామను చంపుతానన్నప్పుడు ద్రౌపది అశ్వత్థామ తల్లియైన కృపిని తలచుకొంది. "ద్రోణునితోపాటు సహగమనం చేయకుండా పుత్ర ప్రేమతో ఇంటిలోనే ఉండిపోయిన ద్రోణపత్ని కృపి నేడు పుత్రశోకంతో ఎంత ద:ఖిస్తుందో కదా!" అని మాతృప్రేమ అంటే ఏమిటో తెలియజెప్పింది. తన వలె పిల్లలను పోగొట్టుకొని మరొక తల్లి తనలాగా బాధ పడకూడదని భావించిన 'సుస్వభావ' ద్రౌపది. అయితే స్త్రీ సహజమైన మాతృ స్వభావాన్నే ద్రౌపది ప్రదర్శించింది. ఇందులో విశేషమేమీ లేదు అని కూడా అనుకోవచ్చు కదా. ఇక్కడ చెప్పుకోదగిన మరో విశేషం ఉంది. అదేమిటంటే నిజానికి అశ్వత్థామ చిన్న పిల్లలను చంపేటంత క్రూరుడు కాడు. భారత కథ మొత్తాన్ని సరిగ్గా పరిశీలిస్తే ఈ విషయం బోధ పడుతుంది. అశ్వత్థామ అప్పుడు చేసిన క్రూర చర్య అతని సహజ స్వభావము కాదు. యుద్ధములో తొడలు విరిగి పడి దీనావస్థలో అవసాన దశలో ఉన్న దుర్యోధనుని చూసిన ద:ఖోద్రేకములో అతడు చేసిన పని అది. అది కూడా పాండవులను చంపటమే అతని లక్ష్యం కానీ ఉపపాండవులను చంపటం కాదు. చీకటిలో తెలియక పాండవులు అనుకొని వారి కుమారులను చంపాడు. అశ్వత్థామ కూడా తాను చేసిన నిందార్హమైన పనికి క్రుంగిపోతున్నాడు. "ఇట్లర్జునుండు దెచ్చి చూపిన బాలవధ జనిత లజ్జా పరాఙ్ముఖుండైన కృపి కొడుకు"ను చూచి ద్రౌపది అతనికి నమస్కరించి ద్రౌపది అతనితో మాట్లాడింది అని పోతన వర్ణించాడు. ఈ పరిస్థితులను అక్కడ ఉన్న మహామహులెవరూ గుర్తించలేదు. ఒకవేళ గుర్తించినా, దానిని అంగీకరించే స్థితిలో లేరు. కానీ ఒక్క ద్రౌపది మాత్రమే వివేకంతో ఆలోచించింది. వ్యక్తుల సాధారణా సాధారణ ప్రవర్తనలను, వ్యక్తిత్వాలను, న్యాయాన్యాయాలను, ఒక నిర్ణయాన్ని తీసుకొని అమలు పరచిన తర్వాత జరిగే పరిణామాలను ఆవేశ పూరితము కాని స్థిరబుద్ధితో ఆలోచించగలిగిన ప్రజ్ఞావంతురాలు ద్రౌపది.

కుంతీదేవి శ్రీకృష్ణుని పరమాత్మునిగా తెలుసుకున్న గొప్ప జ్ఞానిగా కనబడుతుంది. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరమనే అస్త్రము బారి నుండి ఉత్తరా గర్భమును సంరక్షించిన శ్రీకృష్ణుని అనేక విధాలుగా స్తుతించింది.

"జవనిక మఱువున నాట్యంబు సలుపు నటుని చందంబున మాయా యవనికాంతరాళంబున నిలువంబడి నీ మహిమచేఁ

బరమహంసలు వివృత రాగద్వేషులు నిర్మలాత్ములు నయిన మునులకు సదృశ్యమానుండవయి పరిచ్ఛిన్నుండవు గాని నీవు మూఢదృక్కులు గుటుంబపతులు నగు మాకు నెట్లు దర్శనీయుండ వయ్యెదు? శ్రీకృష్ణ! వాసుదేవ!" అని శ్రీకృష్ణుని పరమాత్మ తత్వాన్ని స్తుతించి ప్రార్థించింది.

భాగవతములో ఇంకా గాంధారి, సురుచి, సునీతి, సుకన్య, రేణుక మొదలగు స్త్రీమూర్తులు తమ ప్రత్యేకమైన వ్యక్తిత్వములతో ప్రసిద్ధి పొందారు. ద్రౌపది, కుంతి, దేవహూతి వంటి వివేకమతులే కాక దితి వంటి వివేక హీనులు కూడా ఉన్నారు. కశ్యపుని భార్యయైన దితి సంతాన వాంఛతో మదనాతురయై సాయం సంధ్యా సమయమని, నిషిద్ధ సమయమున సంగమము తగదని

కశ్యపుడు చెప్పినా వినిపించుకోకుండా అతనిని అంగీకరింపచేసి, హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులనే లోకకంటకులకు తల్లియైన అపకీర్తిని కూడా మూటకట్టుకుంది. వివేక హీనులైన స్త్రీల వల్ల లోకానికి జరిగే అనర్థాలకు ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుంది. దితికి పూర్తి భిన్నమైన చరిత్ర దేవహూతిది. కర్దముడనే మహా తపస్వికి భార్యయై, నారాయణాంశయైన కపిలాచార్యుని కుమారునిగా పొంది ఆయన వల్ల వివిధ వేదాంత విషయాలను, తత్త్వ జ్ఞానమును పొంది ధన్యురాలైంది దేవహూతి. దితి కేవలము సంతానమును కోరుకొనగా దేవహూతి మాత్రము "తత్త్వ సంహిత నాకు దవిలి తెలుపు సుతుని కృప సేసి నను గావు సుజన వినుత!" అని వివేకముతో సత్సంతానమును కోరుకొని, పొంది తరించింది.

భాగవతంలోని సప్తమ స్కంధములోని ప్రహ్లాద చరిత్రలో ధర్మరాజు యొక్క కోరికపై నారదుడు స్త్రీ ధర్మములను వివరిస్తాడు.

"నిలయము పాటించి నిర్మల దేహయై శృంగార మేప్రొద్దుఁ జేయవలయు
సత్యప్రియాలాప చతురయై ప్రాణేశు చిత్తంబు ప్రేమ రంజింపవలయు
దాక్షిణ్య సంతోష ధర్మ మేధాదుల దైవతమని ప్రియుఁ దలపవలయు
నాథుఁడే పద్ధతి నడచు నా పద్ధతి నడచి సద్బంధుల నడపవలయు
మార్దవమునఁ బతికి మజ్జన భోజన శయన పాన రతులు జరపవలయు
విభుఁడు పతితుఁడైన వెలఁది పాతివ్రత్య మహిమఁ బుణ్యుఁ జేసి మనుపవలయు"

- శ్రీమహా భాగవతము, 7 - 416

ఇక్కడ చెప్పిన స్త్రీ ధర్మములు కొన్ని విడ్డూరముగా కనిపిస్తాయి. నాథుడే పద్ధతి నడిస్తే ఆ పద్ధతిలోనే స్త్రీ నడవాలి. నిరంతరం భర్తను కనిపెట్టుకుని ఉండి పొద్దు తిరుగుడు పువ్వులాగా భర్తకు అనుగుణంగా తన చర్యలను తీర్చుకుంటూ ఉండాలి. ఇంకా విపరీతమే మంటే 'భర్త పతితుడైతే భార్య తన పాతివ్రత్య మహిమతో అతనిని మంచి మార్గములో పెట్టి రక్షించాలనటం. అయితే భాగవతంలో ఇటువంటివి బోధనల రూపంలోనే ఉన్నాయి గానీ, వీటికి ఉదాహరణలుగా నిలిచి తమ జీవితములను 'ధన్యము చేసుకొన్న' మహిళామణులెవరూ కన్పించరని చెప్పవచ్చు. ఇంకా భాగవతములో చెప్పిన స్త్రీ ధర్మాలు ఇన్నీ అన్నీ కావు.

"తరుణి తన ప్రాణ వల్లభు, హరి భావముగా భజించి యతఁడును దానున్
సిరి కైవడి వర్తించును హరి లోకము నందు సంతతానందమునన్"

- శ్రీమహా భాగవతము, 7 - 417

స్త్రీ తన పతిని విష్ణునిగా భావించి సేవించాలి. అలా చేస్తే అనంతర కాలంలో వైకుంఠంలో వారు లక్ష్మీ నారాయణులై నిరంతరానందముతో వెలుగొందుతారు.

"ఉపవాసంబులు వ్రతములు, దపములు వేయేల? భర్త దైవత మని ని
ష్కల్మషతఁ గొల్చిన సాధ్వికి నృపవర! దుర్లభము లేదు నిఖిల జగములన్"

- శ్రీమహా భాగవతము, 7- 418

ఈ ధర్మములు శాశ్వత ధర్మములు కాలేకపోయాయి. కాల పరీక్షకు నిలబడలేక కాలప్రవాహంలో కొట్టుకొని పోయాయని చెప్పవచ్చు. ఇందుకు ఆధునిక కాలంలో ఏర్పడిన అవగాహన, చైతన్యములు కారణములు. ఇందులో స్త్రీల కంటె పురుషుల పాత్రయే అధికం. ఏ పురుషులైతే స్త్రీలను అణచివేసి వారి దీనస్థితికి కారణమయ్యారో, ఆ పురుషులే వారిలో చైతన్యాన్ని తీసుకొని రావటానికి, వారిని ఉన్నత స్థితిలో నిలపటానికి ప్రథమ కారణమవటం ఒక వింత.

పూర్వ కాలములో స్త్రీలు ఎదుర్కొన్న భయంకర పరిస్థితులు ప్రస్తుత కాలములో లేకపోయినా, నేటికీ మహిళల పట్ల వివక్ష కొంత కొనసాగుతోందన్నది కాదనలేని

సత్యం. భగవంతుని సృష్టిలో అపూర్వమైనది మానవజాతి. అందులో స్త్రీ పురుషులిరువురూ సమానులే. సమానంగానే భూమి మీద జన్మించారు, అయినా ఎందుకో నేటికీ పురుషులు స్త్రీలను తమ కంటె తక్కువ వారని అనుకుంటారు. స్త్రీలను తమ పని వారని అనుకుంటారు, వారి చేత పనులు చేయించుకోవటం తమ హక్కుగా భావిస్తారు. కుల, మత, వర్గ, జాతి పరమైన అహంకారాల వంటిదే ఈ పురుషాహంకార స్వభావమని భావించవచ్చు. తెలివితేటలలో, ఆలోచనలలో ఇద్దరూ సమానులే అయినా మగవారు మాత్రం దానిని అంగీకరించరు. తమ కంటె హెూదాలో, అధికార పదవిలో ఎక్కువ స్థాయిలో ఆడవారు ఉండటాన్ని చాలామంది మగవాళ్ళు సహించలేరు. “స్త్రీ బుద్ధి: ప్రళయంకరీ” అని ఒక దిక్కుమాలిన స్టేట్‌మెంట్ ఇచ్చి పారేసి, ఆడవాళ్ళ వలన పురాణాలలో, చరిత్రలో జరిగిన అనర్థాలను పదుల సంఖ్యలో చెప్పే మగవారు అవి కాకుండా మిగిలినవన్నీ పురుషుల బుద్ధి వల్లనే జరిగాయని మాత్రం అసలు ఒప్పుకోరు. స్త్రీలపై తమ ఆధిపత్యాన్ని నిరూపించటానికి భౌతికంగా దాడులు చేయటమే సరియైన మార్గమని చాలామంది మగవాళ్ళు నమ్ముతారు. కానీ స్త్రీలను పురుషులు తమ బానిసలుగా భావించకూడదు. అలాగని వారిని పైనుంచి క్రిందికి దిగి వచ్చిన దేవతామూర్తులనీ, స్త్రీలే సమస్త విశ్వానికీ సర్వస్వమనీ నిత్యమూ కీర్తిస్తూ ఉండవలసిన అగత్యము కూడా లేదు. మహిళలను మహిళలుగా, తమ సాటి వ్యక్తులుగా గుర్తించి వారి పనులను వారిని చేసుకోనిస్తే చాలు. అప్పుడు ఈ భువి స్వర్గమై విలసిల్లుతుంది.

మంగళం మహత్.

# "తొలి కథకురాలు - భండారు అచ్చమాంబ"

– పట్రు గాయత్రి, పరిశోధక విద్యార్థిని,తెలుగు విభాగం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

భారతదేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనవుతూ వచ్చింది.ప్రాచీన కాలంలో పురుషులతో సమాన స్థాయి కలిగి ఉన్న భారతీయ మహిళలు మధ్యయుగంలో అధమ స్థాయికి అణిచివేయబడటం, అనేకమంది సంఘసంస్కర్తలు తిరిగి వారికి సమాన హక్కుల కల్పన కోసం కృషి చేయడం ఇలా భారతదేశంలో మహిళల మహిళల చరిత్ర అనేక సంఘటనలు సమాహారంగా ఉంది స్త్రీ విద్య, బాల్యవివాహాలు, సతీసహగమనం, పునర్వివాహాల నిషేధం, వంటివి భారతదేశంలో సామాజిక జీవనంలో భాగమయ్యాయి.ఈ పరిస్థితుల మధ్య కూడా కొంత మంది మహిళలు సాహిత్యం, విద్యా,రాజకీయ రంగాలలో రాణించారు. పురుషులతో సమానంగా స్త్రీకి అన్నింటిలోనూ సమాన హక్కులు కల్పించాలని స్త్రీ విద్యను ప్రోత్సహించాలని కొంతమంది రచనలు చేశారు. ప్రాచీన సాహిత్యంలో వెలుగులోకి వచ్చిన కవయిత్రుల సంఖ్య తక్కువగానే కనపడుతున్న ఆధునిక కాలంలో ఎక్కువగా ఉందని చెప్పుకోవచ్చు. అందులో భాగంగా మహిళలు పురుషులతో సమానంగా సాహిత్య రచనలు చేసినవారిలో స్త్రీ విద్యావ్యాప్తికి ఎంతో కృషి చేసిన సాహిత్యంలో ధ్రువతార ''భండారు అచ్చమాంబ'' గురించి ఈ వ్యాసంలో వివరించదలచాను. భండారు అచ్చమాంబ తెలుగులో తొలి కథను. తొలి స్త్రీ చరిత్రను,స్త్రీవాద దృక్పథంతో కూడా స్త్రీల కోసం సంఘాలు నిర్మించడం, వివిధ రంగాల్లో ప్రసిద్ధులైన భారత స్త్రీల చరిత్రలో అనేక భాషల నుంచి సేకరించి వాటిని అనువాదం చేసి 1903లో ''అబలా సచ్చరిత్ర రత్నమాల'' అనే పుస్తకాన్ని రాసిన ఈ పుస్తకం రావడానికి గల కారణాన్ని వివరించింది 1. స్త్రీలు అబలలని, బుద్ధిహీనులని, వివేకం లేనివారని, అన్ని దుర్గుణాలకు నివాస స్థలాలని, కొందరు నిందించే వారు. స్త్రీలలో అత్యంత ధైర్యవంతులు, అసామాన్య విద్యా విభూషితలు జ్ఞానవతులు, రాజ్య కార్య దురంధరత్వం కలవారు. స్వదేశీ అభిమానులు అన్ని మంచి గుణాల విభూషితలు పూర్వము ఉండిరని ఇప్పుడు కూడా ఉన్నారని అలాంటి సమాజాన్ని స్థాపించుట ఆమె మొదటి ఉద్దేశం అని చెప్పారు. 2. స్త్రీలకి విద్య నేర్పిన, స్వాతంత్రం ఇచ్చిన చెడిపోతారని భర్తలను అవమానిస్తున్నారని కుటుంబ సుఖాన్ని నాశనం చేస్తారు అని, కొందరు మేధావులు మాట్లాడేవారు. ఈ ఆరోపణలు అన్నీ అర్థం లేనివని స్త్రీ విద్య ప్రతీకారం అనుకూలం అవుతుందే కానీ ,దురాచార ప్రవృత్తి అనుకూలం కాదని స్త్రీ విద్య స్వాతంత్రం వల్ల మన దేశానికి లాభమే కానీ నష్టం వాటిల్లదని స్త్రీ విద్య అత్యంత ఆవశ్యకం అని భండారు అచ్చమాంబ రెండో ఉద్దేశ్యం.

అచ్చమాంబ ఈ మాటలు రాసింది 1900 సంవత్సరంలో దాదాపు నూట పది సంవత్సరాల క్రితం ఆమె స్త్రీల కోసం ఆలోచించిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అప్పటి వరకు ఎవరూ పూనుకోని స్త్రీల చరిత్ర రచనకు శ్రీకారం చుట్టి చరిత్ర రాయడానికి హేతువుగా చాలా స్పష్టంగా అబలా సచ్చరిత్ర రత్నమాల లో ప్రకటించింది.

మనదేశంలో స్త్రీవాద చరిత్రకారులలో మొదటి స్థానం ఎవరిది అనే ప్రశ్నకు సమాధానం భండారు అచ్చమాంబ అని చెప్పుట లో అతిశయోక్తి లేదు. స్పష్టమైన ఆలోచన ధోరణి, ఒక రాజకీయ కారణంతో తొలి స్త్రీల చరిత్ర రచనకు పూనుకొన్న అచ్చమాంబ చదువుకున్నది అంతంత మాత్రమే 10 సంవత్సరాల వయసు వరకు అక్షరం ముక్క రాని అచ్చమాంబ తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి మొదటి స్త్రీవాద చరిత్రకారిణిగా ఘనత దక్కింది.

1902-1903 మధ్య కాలంలో అచ్చమాంబ ఎన్నో వ్యాసాలు కథలను రాసింది. వాటన్నింటినీ హిందూ సుందరి, సరస్వతి, సావిత్రి ,తెలుగు జననా పత్రికలలో ప్రచురించబడ్డాయి. స్త్రీ విద్య కోసం అచ్చమాంబ పడిన తాపత్రయం ఎక్కువనే చెప్పుకోవచ్చు. స్త్రీ విద్య అనే అంశంపై ఎన్నో వ్యాసాలు రాసింది. ఏ ఊరు వెళ్లినా అక్కడ మహిళలను కలిసి సమావేశం నిర్వహించి స్త్రీ విద్య ప్రాముఖ్యతను గురించి ఉపన్యాసాలు చేసేది,స్త్రీ విద్య కోసం సంఘాల ఏర్పాటు చేసింది.

**అచ్చమాంబ జననం, బాల్యం :**

భండారు అచ్చమాంబ 1874లో కొమర్రాజు వెంకట అప్పయ్య, గంగ మాంబ దంపతులకు కృష్ణా జిల్లాలోని నందిగామ లో జన్మించింది. విజ్ఞాన చంద్రికా మండలి నడిపిన కొమర్రాజు లక్ష్మణరావు ఈమె సోదరుడు. అచ్చమాంబ తాత అమ్మమ్మలు నందిగామలో నివసించె వారు. ఆమె తాతగారు ఆ ప్రాంతంలోని జమీందారు పని మీద నందిగామ లో నివసించే సమయంలో అచ్చమాంబ జన్మించింది. ఆమె తాత గారి సొంత గ్రామం కంచెల. ఆమె తండ్రి తరపు తాత నానమ్మ గ్రామం పెనుగంచిప్రోలు అచ్చమాంబ పెనుగంచిప్రోలు గురించి అబలా సచ్చరిత్ర రత్నమాల లో వివరంగా రాసింది. పెనుగంచిప్రోలు పూర్వం పెద్ద పట్టణంగా విలసిల్లినదని అక్కడ భూమిని తవ్వినపుడు శిలాశాసనాలు, గుళ్ళ రాళ్లు, మెడల స్తంభాలు ,దూలాలు బయటపడ్డాయని రాసింది.

ఈమె తండ్రి మునగాల సంస్థానంలో 1880 వరకు దివాన్ గిరిగా పనిచేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి ఇతరులకు సహాయం చేయాలని మంచి అలవాటు అచ్చమాంబ తన తండ్రి నుండి అలవర్చు కుంది. ఆమె బాధని తనలోనే దాచుకోవడం చిన్నప్పటి నుంచే అలవాటు ఉందా అనేట్టు బాల్యంలో జరిగిన ఈ ఉదాహరణ చెబుతుంది. అచ్చమాంబకి ఆరు రేళ్ళ వయస్సు లో ఒక రోజు తేలు కుట్టింది. తేలు కుట్టినపుడు నొప్పి ఎంత ఎక్కువగా ఉంటుందో అందరికీ తెలుసు అచ్చమాంబ మాత్రం తన దుఃఖాన్ని లోపలే అణుచుకుని ఎవరికీ చెప్పలేదు. లోలోపలే బాధపడుతున్నప్పుడు ఇంట్లో వార్తె కనిపెట్టి అడిగితే లు కుట్టిందని చెప్పింది. ఇలాంటి సహనశీలి కలవారు ఎంతమంది ఉంటారు అలాంటి వారిని అప్పటి కాలంలో ఈ దుర్గుణాలు కలవారని ఎంచుచుండిరి. కానీ ఇలాంటి సామర్థ్యం వల్లనే సంసార బాధని ,పుత్ర వియోగాన్ని సహించ గలిగిందని హిందూ సుందరి సంచికలో బాలాంత్రపు శేషమ్మ గారు అచ్చమాంబ మీద రాసిన సంపాదకీయంలో పేర్కొన్నారు.

అచ్చమాంబ ఆరు సంవత్సరాల వయసులో తండ్రి చనిపోగా తల్లి గంగమ్మ మునగాలలో బ్రతికే అవకాశం లేక పిల్లలను తీసుకొని వెళ్ళాలని నిర్ణయించుకుంది. గంగమ్మ సవతి అన్న భండారు మాధవరావు అప్పటి నైజాం రాజ్యంలోని దేవరకొండ గ్రామం లో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి అప్పటికే వివాహమై భార్య చనిపోయింది.కూతురు మీనాక్షితో దేవరకొండలో ఉంటున్న మాధవరావు దగ్గరికి గంగమ్మ చేరింది. పదేళు కూడా నిండని అచ్చమాంబ ని భార్య చనిపోయి, కూతురు ఉన్న మాధవరావు కి ఇచ్చి పెళ్లి చేసింది. కొమర్రాజు అచ్చమాంబ, బండారు అచ్చమాంబ గా మారింది .

వివాహం తరువాత మాధవరావుకు దేవరకొండ నుంచి మహారాష్ట్రలోని నాగపూర్ కు బదిలీ అవ్వటంతో నైజాం రాజ్యం నుండి నాగపూర్ కి భర్తతో కలిసి వెళ్ళింది తల్లి సోదరుడు కూడా ఆమెతో పాటే పయనమయ్యారు. అప్పటి నుంచి నాగపూర్ నివాసస్థలం అయింది. అప్పు డప్పుడు ఆంధ్రదేశానికి రావటం, సమావేశాలలో పాల్గొనటం చేసేది. అచ్చమాంబ ను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించ లేదు. ఆమెకి పన్నెండు ఏళ్ళు వయసు వచ్చేవరకు అక్షర జ్ఞానమే లేదు. చిన్న వయసు లోనే తండ్రి చనిపోవటంతో ఉన్న ఊరుని వదిలి రావటం, అతి చిన్న వయసులో వివాహం జరగటం వల్ల చదువుకు దూరం చేశాయి. నిజానికి ఆమెకు చదువు పట్ల ఆసక్తి

ఎక్కువగా ఉండేది. తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించక పోయినా అచ్చమాంబ లో ఉన్న విద్యాభిలాషే ఆమె ను చదువుకు దగ్గర చేసింది.

మగపిల్లవాడు అయినందున కొమర్రాజు లక్ష్మణరావు విద్య ఎక్కువగా అందుబాటులోకి వచ్చింది ఉపాధ్యాయుని ఇంటికి పిలిపించి మరీ అతను చదువుకునే లాగా ప్రోత్సాహాన్ని ఇచ్చింది తల్లి గంగమ్మ. అచ్చమాంబ ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను శ్రద్ధగా గమనిస్తూ తనంతట తాను ప్రేరణ పొందినదే కానీ ఎవ్వరి ప్రోత్సాహం ఆమెకు లేదు. అచ్చమాంబ, లక్ష్మణరావుకు మించిన తెలివితేటలు ప్రదర్శించేది. కొన్ని రోజులు గడిచినప్పటికీ తెలుగు హిందీ భాషలు నేర్చుకుంది. తరువాత సంస్కృతం, మరాఠీ ,గుజరాతీ, భాషలను కూడా నేర్చుకో కలిగింది. ఆమె ఎంత బుద్ధి సూక్ష్మము కలది అయినను ఇంగ్లీష్ భాషను నేర్చుకున లేకపోయెను. తమ్ముడు ధనవంతుడు అయినందున ఎం.ఏ పట్టా పొందాడని అచ్చమాంబ హిందూ సుందరి సంపాద కీయంలో రాసింది. అచ్చమాంబ సోదరునితో కలిసి చదువుకునే అవకాశం లేకుండా పోయింది. భర్త ఉద్యోగం రిత్యా ఆమె అతనితోపాటు తిరుగుతూ ఉంటే లక్ష్మణ రావు నాగపూర్ లోనే ఉంటూ విద్యను కొనసాగించి ఎం.ఏ పాస్ అయ్యాడు. ఈ విషయాలను గురించి తన అబలా సచ్చరిత్ర రత్నమాలలో విధంగా పేర్కొంది.

మహిళలు నైసర్గిక మూరులని చెప్పుట కంటే నేటి వరకు స్త్రీలకు బాల్యము నుండి విద్య నేర్పించకపోవటం వల్ల వారు తెలివిలేని వారిగా కనిపించే వారని చెప్ప వచ్చును. బాలుర కంటే బాలికలే ఎప్పుడూ బుద్ధిహీనులుగా ఉండరు. బాల్యం నుండి ఆడపిల్ల ఎట్టి బుద్ధి వైభవము కలిగినదైనా తల్లిదండ్రులు దానికి ఎంత మాత్రం విద్య నేర్పక జ్ఞానాభివృద్ధికి తగిన ఉపాయములు చేయకపోతే తెలివి లేని వారుగానే ఉందురని చిన్న తనంలోనే బాలుర చిన్నతనంలోనే మందబుద్ధి అయిన వారికి ఐదు సంవత్సరాలు రాగానే విద్య నేర్పి వారి చేత మాంద్యమును విద్యచేత పోగొట్టి విద్యాభివృద్ధి కొరకు శాస్త్రాలు చదివిస్తారు. కాబట్టి మిక్కిలి ప్రజ్ఞ కలవారుగా ప్రసిద్ధులు అవుతారని తెలియజేసేను. తల్లిదండ్రుల పక్షపాతం వలనే పురుష జాతి లోని, స్త్రీ జాతిలోనూ తెలివి గురించి చర్చ పడినదే కానీ స్త్రీల స్వాభావిక మూర?త్వం వల్ల కాదు. కావున స్త్రీలకు పక్షపాతం అయినా పురుషులు విశేష విద్య నేర్పినచో స్త్రీలను అసామాన్య బుద్ధి చాతుర్యం కలవారుగా చూపి పురుషులకే అనేక విషయాలలో సహాయం చేసి అర్థాంగి అన్న పేరుని సార్థకం చేస్తారని చెప్పుటలో సందేహం లేదు.

"అబలా సచ్చరిత్ర రత్నమాల" గ్రంథం రాస్తూ ఆమె ప్రకటించిన పై విషయాలు ఎంత పురోగామి దృక్పథంతో ఉన్నాయో అర్థమవుతుంది. స్త్రీల వెనుకబాటుతనానికి వారి అజ్ఞానానికి మూల కారణం వారికి జ్ఞానాన్ని అందివ్వక పోవడమేనని, తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల కనబరిచే వివక్షే దీనికి కారణం అని చాలా స్పష్టంగా తెలియజేసింది. తాను విద్య కు దూరమై తన తమ్ముడు ఉన్నత విద్య చదువుకోగలగటం వెనుక ఉన్న కుటుంబం వివక్షతను ఇంత సూటిగా విశ్లేషించిన అచ్చమాంబ బతికిన కాలాన్ని లెక్కలోకి తీసుకుంటే 19వ శతాబ్దంలో ఆమె రచనలు ఎంత తీక్షణమైన ఓ గమనించవచ్చు. ఆడపిల్లను వివక్షతతో పెంచవద్దని, వారికి విద్య చెప్పించాలని, బాల్యవివాహాలు చేయవద్దని, బ్రతికినంత కాలం రాస్తూనో, చెబుతూనోఉంది. ఆనాడు అచ్చమాంబ అభ్యుదయ విధంగా ఆలోచించి ,స్త్రీ విద్య గురించి గళమెత్తిన ఈనాటికీ అదే పరిస్థితులు కొనసాగడం వందేళ్ల గడిచిన మహిళల నిరక్షరాస్యత నిర్విరామంగా కొనసాగటం విషాదం.

అచ్చమాంబ తాను ఉండే నాగాపూర్ ప్రాంతంలో హిందీ మరాఠి భాషలు మాట్లాడే స్త్రీలతో కలిసి మరాఠి లో ఉండే భక్తి సాహిత్యం చదివేది. చుట్టూ ఉండే మహిళలను ఇంటికి పిలిచి వివిధ భక్తి కథల్ని వారికి చదివి వినిపించేది. తెలుగు పట్ల మక్కువ వల్ల తెలుగు

రాయటం నేర్చుకుంది. తెలుగు మాట్లాడని ప్రాంతంలో ఉంటేనే చక్కటి వచనంలో 12 కథలను రాసిందంటే ఆమె పట్టుదల ఎలాంటిదో అర్థం అవుతుంది. హిందూ సుందరి పత్రికలో తరచూ వ్యాసాలు పంపిస్తుండేది ఆ వ్యాసాలను స్త్రీ విద్య గురించి, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు గురించి చర్చించేది. అచ్చమాంబ కథలు సావిత్రి ,సుజనా, తెలుగు, హిందూ సుందరి పత్రికల్లో ప్రచురింపబడేవి. అచ్చమాంబ చదువు నేర్చుకోవటం సాంప్రదాయ భావాలు ఉండే మాధవరావుకు నచ్చేది కాదు .ఆమె చదువుకోరాదని అభ్యంతరం పెట్టేవాడు. చదువుకుంటే స్త్రీలు చెడిపోతారని అతని అభిప్రాయం. అతని ఇంట్లో లేనప్పుడు క్యాంపులకు వెళ్ళినప్పుడు పుస్తకాలు చదివేది.మాధవరావుకు ధార్మిక విషయాల పట్ల ఉండే ఆసక్తి వల్ల ఆర్య సమాజానికి సంబంధించిన అనేక పుస్తకాలు ఇంట్లో ఉండేవి. వాటన్నింటినీ చదివి ధర్మం, తత్వం గురించి తెలుసుకునేది. మరాఠీ భాష నేర్చుకోవడం వల్ల మరాఠీ గ్రంథాలను చదివేది. ముఖ్యంగా మరాఠీ లో ముఖ్య గ్రంథమైన ఒక స్త్రీ రాసిన "ఆనందీబాయి చరిత్రము" అచ్చమాంబ మీద చాలా ప్రభావం చూపింది. ఈ గ్రంథం చదివిన తరువాత అచ్చమాంబ రచనల్లో చాలా మార్పు కనిపిస్తుంది స్త్రీ విద్య , స్త్రీ స్వాతంత్ర్యాలను గురించి ఆలోచించేది. ఈ పుస్తక ప్రభావం అబలా సచ్చరిత్ర రత్నమాలలో ప్రస్ఫుటంగా కనబడుతుంది.

తమ చదువును వ్యతిరేకించిన భర్త మాధవరావును కష్టపెట్టకుండా అతని పరోక్షంలో పుస్తకాలను చదవడం కొనసాగించిన భర్తతో సామరస్యంగా ఉండి, అతని వ్యతిరేకతను సహనంతో ఎదుర్కొని తన ప్రవర్తనతో భర్త మనసుని మార్చుకొని ఈ మార్పు వల్లనే ఆమె చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. అటు ప్రాచీన స్త్రీ ధర్మమును, ఇటు ఆధునిక పాశ్చాత్య విద్యా సంస్కారమును ఈ రెండింటిని అత్యద్భుతంగా ప్రదర్శించి ఆదర్శ మహిళ అయ్యిందని సావిత్రి పత్రికను నడిపిన పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ ప్రశంసించెను.

**సాహితీ వ్యాసంగం :**

అచ్చమాంబ రచనా వ్యాసంగం ఎప్పుడు చేపట్టిందో తెలిపే స్పష్టమైన ఆధారాలేవీ లేవు. తన 24వ ఏట నుంచి రచనలు ప్రారంభించినట్టు కొన్ని రచనల వల్ల అర్థమవుతుంది. 1898- 99 మధ్య మొదలు పెట్టినట్లు కనిపిస్తోంది. దాదాపు ఆరు సంవత్సరాల పాటు వివిధ ప్రక్రియల్లో కథలు., వ్యాసాలు, ఒక శతకం కూడా రాసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె రాసిన 10 కథలు మాత్రమే లభ్యమవుతున్నాయి.

"అబలా సచ్చరిత్ర రత్నమాల" పుస్తకం రాయటం వెనుక ఎంతో విషాద చరిత్ర ఉంది అచ్చమాంబకు అత్యంత ఇష్టమైన వ్యక్తి మాధవరావు మొదటి భార్య కూతురు మీనాక్షి భర్త చనిపోవటం, అలాగే అచ్చమాంబ పుత్రుడు చనిపోవటం వల్ల ఆమెను శోక సముద్రంలో ముంచేసింది వాటినుంచి బయటపడటానికి రచనా వ్యాసంగాన్ని ఎన్నుకుంది.ఆమె రాసిన వ్యాసాలు ఏవి పుస్తకరూపంలో రాలేదు. స్త్రీ చరిత్ర రాయడానికి సంకల్పించింది నిజానికి అచ్చమాంబ కి ముందు స్త్రీల చరిత్రను ఎవరూ రాసిన దాఖలాలు లేవు.

చరిత్ర రచన చాలా కష్టతరమైన పని అలాంటిది స్త్రీలలో మొదటిగా చరిత్ర రచన చేసిన ఘనత అచ్చమాంబకే ప్రథమ గౌరవం దక్కుతుంది. ప్రయాణ సౌకర్యాలు సరిగా లేని 19వ శతాబ్దంలో స్త్రీల గురించిన సమాచారాన్ని సేకరించి మేధావుల నుంచి సేకరించిన మొత్తం సమాచారంతో మూడు భాగాలుగా స్త్రీల చరిత్రను రాయాలనేదే అచ్చమాంబ సంకల్పం.

**మొదటి భాగం :**

ఇందులో హిందూ దేశంలో పుట్టిన ఇతిహాస స్త్రీల చరిత్ర ఉండేను. ఇతిహాస కాలం అనగా వెయ్యి సంవత్సరాల నుండి నేటి వరకు జరిగిన కాలం. ఈ భాగంలో పద్మావతి మొదలుకొని అర్వాచీన స్త్రీల ఆనందీబాయి వరకు స్త్రీల చరిత్ర కలవు.

**రెండవ భాగం :**

ఇందులో వైదిక, పౌరాణిక, బౌద్ధ స్త్రీల యొక్క చరిత్ర

కలవు. వైదిక స్త్రీలంటే వేదం అందు వర్ణింపబడిన గార్గి,మైత్రేయి మొదలైన స్త్రీలు పౌరాణిక స్త్రీలంటే పురాణాలలో వర్ణింపబడిన వారు పార్వతి, సీత, తార, దమయంతి, ద్రౌపతి మొదలైనవారు.

**మూడవ భాగం :**

ఇందులో పర దేశంలోని స్త్రీల చరిత్ర కలదు. అచ్చమాంబ ఎంతో ప్రణాళికతో అబలా సచ్చరిత్ర రత్న మాల మూడు భాగాలుగా రాయటానికి సంకల్పించుకుని దానికి అవసరం అయినా సమాచారాన్ని చాలా కష్టపడి సేకరించింది. మొదటి భాగం 1901లో పుస్తకరూపంలో ప్రచురించింది. రెండో భాగం సావిత్రి పత్రిక లో ప్రచురించింది. రెండో భాగం రాసినప్పుడు వేదాలు, పురాణాల నుండి సమాచారం సేకరించడం కష్టమైంది ఋగ్వేద సంహిత కోసం వెతకడం మొదలు పెట్టింది చివరికి హైదరాబాద్ నుండి ఋక్ సంహితను బోలెడు డబ్బు ఖర్చుపెట్టి తెప్పించుకున్నది. రెండో భాగం రాస్తున్న అప్పుడే తెలుగు ప్రజల దురదృష్టం వల్ల ఆమె మరణం పాలైంది.

అబలా సచ్చరిత్ర రత్నమాల మొదటి భాగంలో ఆమె 34 మంది చారిత్రిక స్త్రీల చరిత్రలను రాసింది.వీరందరూ భారతదేశంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు. ఎన్ని కష్టాలు పడి వీరి చరిత్రను రాసిందో తెలుగు దేశంలో నివాసం లేని సమయంలో కూడా చరిత్ర సేకరణ అంచనా వేయలేం. ఈ పుస్తకం మొదట ''వీరమతి''చరిత్రతో ప్రారంభిస్తూ పురుషులు వలె స్త్రీలు కూడా ధైర్యంతో అన్ని పనులు నిర్వహించుటకు స్త్రీకి విద్య వలన స్త్రీ విద్యా ప్రాముఖ్యత తెలియజేస్తూ చరిత్ర రచన అనేక అంశాలను తెలియపరుస్తూ ముందుకు సాగింది.

బెంగాలీ కవయిత్రి ''తోరుదత్తు'' చరిత్రను కూడా చాలా రమ్యంగా రాసిన అచ్చమాంబ మధ్య మధ్య తన అభిప్రాయాలను తెలియజేస్తూ తోరుదత్తు ని తండ్రి పెంచిన విధాన్ని రాస్తూ పుత్రికలను పుత్రుని వలె సమానంగా చూడవలెనని వివాహ సమయంలో కన్యాదానం నందు తండ్రి నాచే పుత్రుని వలె పెంచ బడిన కన్య అని చెప్పుట సాధారణమే కదా! పుత్రుని తో సమానం కూతురని మనువు వ్రాశాడని చెబుతూ శాస్త్రాల్లో ఇలా ఉన్నా మన దేశంలో బాలుర కంటే బాలికని చులకనగా చూసే సంప్రదాయం బాధాకరం అని తెలియజేసెను.

ప్రాచీన కాలంలో ఆర్యుల కంటే అనార్యులులే జ్యోతిష్యశాస్త్ర ముందు విశేష పాండిత్యం కలిగి ఉండేవారని చెబుతూ ''ఖానా'' అనే జ్యోతిష్య పండితులు రాలి చరిత్రను అచ్చమాంబ రాసింది. ఆమె జ్యోతిష్యంలో వరాహమిహిరుడు కన్నా ఎక్కువ ప్రతిభ ప్రదర్శించింది. కేవలం స్త్రీగా పుట్టినందువల్ల తన అసమాన ప్రజ్ఞను సహించలేని తనం వల్ల ప్రాణాలు కోల్పోయింది. సమాజంలో స్త్రీల పట్ల చూపే చులకన భావాలను, వివక్షాపూరిత దృక్పథాలను అచ్చమాంబ తీవ్రంగా ఖండించిన తీరు ప్రశంసనీయం. 'ఖానా' చరిత్రలో స్త్రీలు తెలివి లేని తనాన్ని గురించి మేధస్సు గురించి వర్ణించిన 'తరిగొండ వేంగమాంబ' జీవితచరిత్రలో పాండిత్యం గురించి బాలవితంతువు వెంగమాంబ జీవితాంతం తన జుట్టును తీయలేదని పరమేశ్వరుడు ఇచ్చిన మనుజులే తీయవలెనని వాదించేదట. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్యను అందవిహీనం చేసి, తెల్లబట్టలు కట్టి, జుట్టు కత్తిరించడం, అన్యాయం అని ఈ దురాచారం సహగమనం కంటే క్రూరమని విమర్శిస్తుంది. అచ్చమాంబ స్త్రీల పక్షపాతి పురుషుల కంటే స్త్రీలు దేనిలోనూ తక్కువ కాదని ఎక్కడ వీలు దొరికితే అక్కడ చెబుతూ ఉండేది. అచ్చమాంబ మీద అమితమైన ప్రభావాన్ని చూపిన డాక్టర్ 'ఆనందీబాయిజోషి' జీవిత చరిత్రను ఎంతో ఉద్వేగంతో రచించినట్టు తెలుస్తోంది. అచ్చమాంబ లాగే ఆనందీ బాయి కూడా చిన్న వయసులో చనిపోయింది. భర్త సహకారంతో అమెరికా వెళ్లాలని కుటుంబంలోని వారు ఒప్పుకోకపోతే అందుకు కారణం కుటుంబంలోని వారికి వివరించి చివరికి అమెరికా వెళ్లి వైద్యవిద్యను పూర్తిచేసి రావటం అపూర్వమైన విషయం.

ఝాన్సీ లక్ష్మీబాయి చరిత్ర ను తొలిసారిగా తెలుగు లోకి రాసిన ఘనత అచ్చమాంబ కే దక్కుతుంది. లక్ష్మీబాయి వీరత్వం గాని ధైర్యసాహసాలు గురించి,అలాగే గణిత శాస్త్ర పండితురాలు భాస్కరాచార్యులు కూతురు లీలావతి గురించి రాసింది. ఆదిశంకరుడి సమకాలికరాలు అసమాన ప్రతిభావంతురాలు అయినా సరసవాణి చరిత్రను అందరూ తప్పక చదవాలి. స్త్రీలతో గొప్పవారు వాదన చెయ్యరు అని గొప్పలు పోయిన ఆదిశంకరుడు సరసవాణి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక నాలుగు నెలలు గడువు తీసుకొని మరికొంత విద్యను అభ్యసించి వచ్చి ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పిన ఘనత సరసవాణి కథలో ఉంది. అచ్చమాంబ అబలా సచ్చరిత్ర రత్నమాల మొదటి భాగంలో ఆమె పొందుపరిచిన అనేక భాషలకు సంబంధించి ఉత్తరప్రదేశ్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ వరకు, మహారాష్ట్ర నుంచి ఒరిస్సా వరకు స్త్రీల చరిత్రను ఈ పుస్తకంలో పొందుపరిచింది. వాణిజ్య సౌకర్యాలు లేని కాలంలోనే ఇంతమంది స్త్రీల చరిత్ర ను తన అబలా సచ్చరిత్ర రత్నమాల పుస్తకంలో సేకరించి పొందుపరచ బడిన ఘనత ఒక్క అచ్చమాంబ గారికే దక్కుతుందని చెప్పుకోవచ్చు.

**తొలి కథకురాలు :**

అచ్చమాంబ రచనా కాలం కేవలం ఆరు సంవత్సరాలు 1898 నుంచి 1904 వరకు ఆమె దాదాపు 12 కథలను, అనేక వ్యాసాలను, ఒక శతకం రాసింది. 1898 సంవత్సరంలో అచ్చమాంబ మొదటి రచన తెలుగు పత్రికలో అచ్చు అయినట్లు రాయసం వెంకట శివుడు తెలిపారు.

1998వ సంవత్సరంలో ఆగష్టు మాసంలో జననా పత్రికలో అచ్చమాంబ గారు 'మహారాణి స్వర్గమయి' గారి చరిత్ర రాశారు. తరువాత డిసెంబరు సంచికలో, నెల పత్రికలోనూ, జోనుకుమారి గురించి రాశారు ఇంగ్లీష్ పుస్తకాలను అనువాదం చేసి మెల్ల మెల్లగా చిన్న సొంత కథలను రాయటం ప్రారంభించారు. 1898 జూలై నెల పత్రికల్లో 'ప్రేమ పరీక్షణ', సెప్టెంబరు సంచికలో 'ఎరువు సొమ్ము బరువు చేటు' అను ప్రసిద్ధమైన కథలను రాశారు. ఆ రోజుల్లో స్త్రీ విద్యా అభివృద్ధికి తెలుగు జననా పత్రికను నడిపిన రాయసం వెంకట శివుడు ప్రకారం అచ్చమాంబ తొలి కథను 1898లో రాసింది. అంతకుముందు ఇంగ్లీష్ నుండి అనేక రచనల్ని తెలుగులోకి అనువాదం చేసింది అచ్చమాంబ. ఈమె రాసిన పై రెండు కథలు ఇప్పటికీ అందుబాటులో లేవని రాయసం వెంకట శివుడు కొమ ర్రాజు గురించి రాసిన వ్యాసంలో ఈ అంశాన్ని గురించి పేర్కొన్నారు.

ఇప్పటి వరకు 1902లో ఆమె రాసిన హిందూ సుందరి పత్రిక ప్రచురించిన ధనత్రయోదశి కథనే ఆధునిక తెలుగు సాహిత్యం లో మొదటగా చెప్పు కోవాల్సింది ఉంటుంది. ధన త్రయోదశి కథలో ఇతివృత్తం కథానాయకుడు బట్టల దుకాణంలో పని చేస్తూ ఉం టాడు. నెలకు పది రూపాయల జీతంతో పూట గడవని పరిస్థితి.దీపావళి రోజు దీపాలు పెట్టుకోవడానికి కూడా గతిలేని ఆ పేదరికాన్ని ఆసరాగా తీసుకుని బట్టల కొట్టు లోని పెద్ద గుమస్తా విజయలక్ష్మి భర్తను ప్రలోభ పెట్టి సినిమా పెట్టెలోంచి దొంగతనం చేద్దామని 100 రూపా యలు తీసి అతనికి ఇస్తాడు. ఆ డబ్బుతో ఇంటికి వచ్చిన అతన్ని దిగులుగా ఉండటం చూచి విజయలక్ష్మి విషయం అడిగి తెలుసుకొని 100 నోటును వెనక్కి పంపిస్తుంది. ఇదంతా తామాడిన నాటకమని యజమాని జీతం పెంచుతాడు. ఇది ధన త్రయోదశి లోని టూకీగా ఉన్న కథ. తెలుగులో తొలి కథగా ప్రచారం ఉన్న గురజాడ దిద్దుబాటు కథలో కథాంశం భర్తను సంస్క రించడమే. గురజాడ ఈ కథను 1910లో రాశాడు. అంటే అచ్చమాంబ కంటే తొమ్మిది సంవత్సరాల తరువాత వచ్చిన గురజాడ కథను ప్రథమ కథగా సాహిత్య చరిత్ర కారులు ప్రచారం చేయడం వెనక పనిచేసింది మాత్రం పితృస్వామ్య, పురుషాధిక్య, భావజాలం. దిద్దుబాటు కథ ఆదర్శ పూరితంగా, ఆశ్చర్యంగానూ, అచ్చమాంబ కథ

గంభీరంగా, వాస్తవంగా ఉంటుంది. అచ్చమాంబ ప్రధాన సమస్యను పరిచయం చేయటంలోనూ, దానికి అనుగుణంగా వాతావరణం సన్నివేశాలు చిత్రించడంలో, వర్ణనలలో ఈ కథలో చెప్పుకోదగ్గ ప్రతిభ చూపించారు.

ఇక తెలుగులో మొదటి కథలు అనే సమస్య రాదు. ఆ కథలకన్న భండారు అచ్చమాంబ 1901- 1904 సంవత్సరంలో రచించిన కథలు మంచి సందేశంతో వ్యక్తిత్వ నిర్మాణం చేసేవిగా సంఘ సంస్కరణ భావాలను చిత్రిస్తూ గొప్పగా ఉన్నాయి. కాబట్టి అచ్చమాంబ కథలు అన్ని తెలుగులో తొలి కథలుగా చెప్పడం అన్ని రకాల సమర్థనీయంగా ఉంది.

అచ్చమాంబ కథని తొలి కథగా పరిగణలోకి తీసుకోక పోవడానికి రెండు కారణాలు. 1.గ్రాంథిక భాషలో ఉంది. 2 ఆధునిక కథకు ఉండాల్సిన లక్షణాలు లేవని. గురజాడ 'దిద్దుబాటు' సరళ భాషలోనూ, ఆధునిక కథా లక్షణాలు ఉండటం చేత కథగా విమర్శకులు సమర్థిస్తున్నారు.

ఒక స్త్రీని నూతన సాహిత్య ప్రక్రియకు ఆద్యురాలిగా అంగీకరించకపోయినా, స్త్రీలు ఎంత సాహిత్యాన్ని సృష్టించారని కానీ, ఎంత బాగా రాశారని గానీ, అసలు వాళ్ళు ఏం రాశారో, ఎందుకు రాశారో,ఎందుకు రాయలేక పోయారో, చూడాలని, పితృస్వామిక సామాజిక అధికారిక సంబంధాలలో అణచివేతకు గురైన వర్గం స్త్రీల సాహిత్య ప్రత్యేకతను గురించి పరిశీలించి విలువ కట్టాలని ఆమె పేర్కొన్నారు.

అచ్చమాంబ రాసిన 12 కథలు, స్త్రీవిద్యా, సమాజ ఉద్ధరణ, మహిళల అభ్యున్నతి ,బాల్యవివాహాల వ్యతిరేకత ఈ కథలన్నీ ఆధునిక భావాలతో ఉంటాయి. 1. గుణవతి యగు స్త్రీ, 2. లలితా శారదులు, 3. జానకమ్మ, 4.దంపతుల ప్రథమ కలహము, 5. సత్పుత్రా దానము, 6. స్త్రీవిద్య, 7.ధన త్రయోదశి, 8.భార్యాభర్తల సంవాదం, 9. అద్దమును సత్యవతియును, 10. బీద కుటుంబం, 11. ప్రేమ పరీక్షణము, 12. ఎరువుసొమ్ము. ఈ కథలన్నీ ముఖ్యంగా స్త్రీలను ని ఉద్దేశించి అచ్చమాంబ గారు రాశారు.

అచ్చమాంబ కథలను ఒకేసారి చదవడం కష్టంగా ఉంటుంది ఆమె రాసే కాలం నాటికి అదే భాష వాడుకలో ఉంది. అప్పటి రచనలు చాలా వరకు గ్రాంథిక భాషలోనే ఉన్నాయి. కొన్ని పదాలు అర్థం కాకపోవచ్చు కానీ, కథలో ఏమి చెప్పదలచుకుంది అనేది తేలికగా అర్థం అవుతుంది. ఒక్కో కథలో ఒక్కో అంశం గురించి చర్చిస్తుంది. అచ్చమాంబ కథలలో భాషను పక్కనబెడితే ఆమె వ్యక్తం చేసిన ఆధునిక భావాలను మనస్ఫూర్తిగా ఆహ్వానించాలి. 20వ శతాబ్దం తొలి దశకంలోనే అంతవరకూ ఎవరూ చేయని ప్రయత్నాలు స్త్రీల చరిత్ర రాయడం, కథ రాయడం, ఆమె ఆధునిక భావాలను స్పష్టంగా వ్యక్తం చేస్తాయి.

అచ్చమాంబ హిందూ సుందరి పత్రికలో కథలే కాదు ,వ్యాసాలు కూడా రాసి ప్రచురింపబడేవి. 1903వ సంవత్సరం ఏప్రిల్ సంచికలో 'గృహిణి ధర్మాలు' మే సంచికలో 'ఆనందము' జూన్ సంచికలో 'విద్యావంతులకు యువతులకు ఒక విన్నపము' జులై నెలలో అచ్చమాంబ బందరులో ఇచ్చిన ప్రసంగ వ్యాసం ఆగస్టు సంచికలో 'భార్యాభర్తల సంవాదము' ప్రచురించారు. ఈ ఒక్క సంవత్సరంలోనే అచ్చమాంబ వివిధ ప్రక్రియల్లో చాలా సమర్థవంతంగా రచనలు చేసింది. 1902 ఆగస్టు నెల హిందూ సుందరి పత్రికలో 'సత్పుత్ర దానము' అనే కథను, 'స్త్రీ విద్య యొక్క ప్రభావము' అనే చిన్న వ్యాసం రాసింది. 'స్త్రీ విద్య యొక్క ప్రభావం'అనే వ్యాసంలో అచ్చమాంబ రాసిన వ్యాసాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. లండన్ నగరంలో స్త్రీలు పురుషులతో సమాన హక్కులు కలిగి ఉన్నారని, రాష్ట్ర మందు పదివేల మంది ప్రజలు ఉందురు. అక్కడ రాజకీయ, విద్యా వ్యవస్థ స్త్రీలు, పురుషులు కలిసే ఏర్పాటు చేసే వారిని విద్యాశాఖలో స్త్రీలే గురువులుగా ఉండే వారిని అక్కడ ఒక్కరు కూడా చదువుకోని వారు లేరని హిందూ సుందరి పత్రికలో రాసింది.

స్త్రీలు ఐక్యమత్యంగా ఉండాలని, సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని, తరచూ అచ్చమాంబ రాసేది. తొలి కథ రాసిన అచ్చమాంబే తొలి స్త్రీ సమాజం కూడా స్థాపించింది. తెలుగుదేశంలో అప్పటివరకు స్త్రీల కోసం ఒక సమాజం స్థాపించాలనే ఆలోచన కూడా లేదు. అలాంటి చోట అచ్చమాంబ మొట్టమొదటి స్త్రీ సమాజం ఏర్పాటు చేసింది. అదే బందరు స్త్రీ సమాజం. 74 సంవత్సరాల నుంచి నిర్విరామంగా ఈ సమాజం నడుస్తోంది.

అచ్చమాంబ ఆంధ్రదేశానికి దూరంగా నివసించిన తన రచనల ద్వారా తెలుగు నేల నలుమూలల ప్రాచుర్యం పొందింది. అనేక కార్యక్రమాలలో పాల్గొనేది.సభలు, సమావేశాల్లో, ఉపన్యాసాలు ఇచ్చేది. ఈమె స్థాపించిన బందరు సమాజం ఎన్నో కార్యక్రమాలను నిర్వహించేది. అచ్చమాంబ 'అబలా సచ్చరిత్ర రత్నమాల' రాయడానికి ప్రేరణ ఇచ్చిన వాడు సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు పుట్టిన ఇద్దరు పిల్లలు చనిపోవడంతో దుఃఖంలో ఉన్న ఆమెను ఓదార్చి గ్రంథ రచన వైపు మళ్ళించాడు.ఆమె దుఃఖంలో కుసించి పోకుండా నాగోజి భట్టు చరిత్రను వివరిస్తాడు. అతనికి కూడా పుత్రులు చనిపోవడంతో తన మనస్సును సమాధానపరచుకొని గ్రంధ రచనకు పూను కున్నాడని ఉదాహరణగా వివరిస్తాడు. ఆమె కూడా నాగోజి భట్టు లాగే మనస్సును సర్దిచెప్పుకొని 'అబలా సచ్చరిత్ర రత్నమాల' తెలుగులో మొదటి స్త్రీల చరిత్ర రచనకు శ్రీకారం చుట్టింది.

## అచ్చమాంబ మరణం :

1904-05 ప్రాంతంలో ప్లేగు వ్యాధి బాగా వ్యాపించి ఉంది. ఒకసారి అచ్చమాంబ భర్తతో కలిసి రావద్దని చెప్పినా వినకుండా క్యాంపుకు వెళుతుంది. అక్కడ ఉన్నప్పుడే ఒక స్త్రీకి ప్రసవం చేసింది. ఆ స్త్రీ ప్రసవా నంతరం మరణించింది ఆమె ప్లేగు వ్యాధి వల్ల చని పోయిందని అచ్చమాంబ కు తెలీదు. క్యాంపు నుండి తిరిగి రాగానే అచ్చమ్మకు తీవ్రమైన జ్వరం వచ్చి, జనవరి 9 నుండి 18 వరకు విపరీతమైన జ్వరంతో బాధ పడింది. ప్లేగు లక్షణాలు గమనించి భర్త వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది అచ్చమ్మ జనవరి 18వ తేదీన తుది శ్వాస వదిలారు.

## ముగింపు :

తెలుగు సాహితీ లోకంలో ధ్రువతారగా ఎంతోకాలం వెలగాల్సిన అచ్చమాంబ సమాజ సేవ చేస్తూనే దానివల్లనే మరణం పాలవ్వడం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. చరిత్ర చీకటిలో మగ్గుతున్న అచ్చమాంబను తొలిసారిగా వెలుగులోకి తెచ్చిన కె.లలిత అన్నట్టు ఆధునిక చరిత్రలో మనకు ప్రోత్సాహాన్ని ఇచ్చేటటువంటివి ,మనం గర్వించదగినవి, నమూనాల కోసం వెతుక్కోవాలంటే మొదటగా భండారు అచ్చమాంబ కనిపిస్తుంది.

అచ్చమైన తెలుగు సాహితీలోకం, తెలుగు సమాజం శిరస్సున పెట్టుకోవాలి. ఆమె ఎన్నింటికో ఆద్యురాలిగా తన ముద్రను వేసింది. తొలి కథ, తొలి స్త్రీల చరిత్రనూ, తొలిసారి సమాజాన్ని స్థాపించింది తొలిసారి స్త్రీలను ఐక్యపరచింది. ఇన్ని ప్రక్రియలకు ఆద్యురాలిగా అచ్చ మాంబకు తెలుగు సాహిత్యం ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోగా వెనక్కి నెట్టేసే ప్రయత్నం చేశారు.

చరిత్ర చీకటిలో ఉన్న భండారు అచ్చమాంబ ను తెరమీదకు తెచ్చి తెలుగు సాహిత్యానికి ఆమె చేసిన సేవల మీద వెలుగును ప్రచురించిన పుస్తకం "ఉమెన్ రైటింగ్ ఇన్ ఇండియా" ఈ పుస్తకం కోసం తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా చదివి పరిశీలించిన కె. లలిత తెలుగులో తొలి కథ రాసింది భండారు అచ్చమాంబే అని ప్రమాణ పూర్వకంగా ప్రకటించింది. అంతేకాదు భారతీయ స్త్రీల చరిత్రను "అబలా సచ్చరిత్ర రత్నమాల" గా గుచ్చిన అచ్చమాంబ తొలి స్త్రీవాద చిత్రకారిణినిగా ప్రకటిస్తూ 1903 భూమిక పత్రికలో కె. లలిత వ్యాసం రాసింది. స్త్రీ జాతి ఉద్ధరణ కోసం, స్త్రీ విద్య సమాన హక్కుల కోసం ఆమె పడిన తాపత్రయం అంతా ఇంతా కాదు. ఆమె పెద్దగా చదువుకోకపోయినా అనేకమంది స్త్రీల చరిత్రను' అబలా సచ్చరిత్ర రత్నమాల' పుస్తకంలో

పొందుపరచడం , అలాగే 12 కథలు రాయడం అంటే అసామాన్య విషయం అందుకే భండారు అచ్చమాంబ ను సాహిత్యంలో ధ్రువతార అని చెప్పడంలో అతిశయోక్తి లేదని చెప్పుకోవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తొలి తెలుగు కథా రచయిత్రి భండారు అచ్చమాంబ- కొండవీటి సత్యవతి
2. హిందూ సుందరి పత్రికలు
3. తెలుగు జననా, సతీహిత బోధిని సంపాదకులు- రాయసం వెంకట శివుడు.

❀ ❀ ❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కిన్నెరసాని పాటల్లో స్త్రీ జీవిత చిత్రణ

- డా॥. వై. వి. సిహెచ్. లీలాపద్మజ, తెలుగు అధ్యాపకులు & శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.

సాహితీలోకాన సుపరిచితులైన విశ్వనాథవారు రచించిన కిన్నెరసాని పాటలు మానవ జీవనానికి మార్గ నిర్దేశకంగా వున్నాయి అనడం అతిశయోక్తి కాదు. నేడు సాహితీలోకంలో ఎడనెడా వినిపిస్తున్న స్త్రీవాదాన్ని విశ్వనాథవారు తన రచనల్లో ఆనాడే వినిపించారని పిస్తుంది. కిన్నెర ఒక వాగు. సమాజంలో అత్తా కోడళ్ళ మధ్య వైరం, తల్లికీ, భార్యకూ మధ్య నలిగే భర్త తీరూ ఇందులోని ఇతివృత్తం. ఈ ఇతివృత్తాన్ని చెప్పే ఈ కథల్లో పాత్రల్ని తీసుకోవడంలో ఒక వైవిధ్యాన్ని విశ్వనాథ ప్రదర్శించారు. కవి ఒక సందేశాన్ని సమాజానికి చెప్పడంలో ఒక్కొక్క ధోరణిని అవలంబిస్తారు. పశుపక్ష్యాదుల్నిగాని, మనుషుల్నిగానీ ప్రకృతిలో కొండలూ, కోనలూ ఇలా దేన్నయినాగానీ తీసుకొని విషయాన్ని కవితలో పొదగడ మనే సంప్రదాయం మనకీనాటిది కాదు. నాటి వసుచరిత్ర నుండి మనకు సుపరిచితమే. కిన్నెరసాని పాటలు కులపాలికా ప్రణయవృత్తాంతమునకు ఒక ఉదాహరణ.

విశ్వనాథవారి కిన్నెరసాని పాటలు భావకకవిత్వ ధోరణిలో సాగిన ఒక ప్రబంధ వీచిక. ఒక అభ్యుదయ గీతిక. మొత్తానికి విశ్వనాథకేలుతామర నుండి ఉద్భవించిన ఒక అపూర్వ సృష్టి. కాదేదీ కవితకనర్హం అని ఋక్కులు కవితా ఖండికలో మహాకవి శ్రీశ్రీ అంటారు. మనిషి చుట్టూ వు ప్రతిచెట్టు చేమా కొండాకోన అన్నీ మనిషి జీవితపు మనుగడలో పెనవేసుకున్నాయి. వాటికే నోరుంటే అవి చెప్పే మాటలే కవి కలంలో సిరా చుక్కల తూటాలైనాయి. సనాతన ఆధునాతన భావాల జల్లెడయే విశ్వనాథ కవిత్వం జాడ. కనుక ఒక వాగును ప్రధాన పాత్రగా చేసికొని కవితా వస్తువు ఏదైనా చెప్పే సత్తావుంటే చాలనీ నిరూపించుకున్నారు విశ్వనాథ.

అత్తగారి అపనిందలు పడలేని కిన్నెర, అడ్డుకోలేని భర్త అసహాయయతకు అలుక వహించి అడవులలోకి పరుగులిడింది. అలా పరుగులిడిన కిన్నెర తీరును అతి రమ్యంగా, కరుణరసాత్మకంగా, ప్రబంధ పోకడలతో వర్ణించారు విశ్వనాథ. స్త్రీకి అనేక పర్యాయ పదాలు వాడడంలో తన భాషాపాటవాన్ని చూపడమే కాదు స్త్రీ పట్ల ఆయనకున్న గౌరవాభిమానాల్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఒక విషయం ప్రస్తావించడం సముచితమని పిస్తుంది. కిన్నెరసాని అనే శీర్షికలో ఒక రాణివారు ఆయనను తప్పుపట్టినప్పుడు, ఆయన చెప్పినటువంటి సంజాయిషీగా లేని ఈ వివరణ ఆయన ఆత్మస్థైర్యాన్ని, స్త్రీపట్ల గౌరవాన్ని తెలిపాయి. స్త్రీ జీవితంపట్ల తనకు ఎంత గౌరవం వుందో ఆయన సతీమణి వియోగానికి విలపిస్తూ కరుణరసాత్మకకంగా చెప్పిన వరలక్ష్మీత్రిశతి మరొక ఉదాహరణ.

భర్తపై తొందరపడి కోపించిన కిన్నెర ఎన్ని కష్టాలు గడిపిందీ మరీ చెబుతూ

"నడిచింది కడరాళ్ళు
గడిచింది పచ్చికల్"

అంటూ వర్ణించారు. సుడిసి కిన్నెరసాని జడలుగా కట్టింది అంటూ జడలు - అనే పదంలో ఋషిత్వం దీక్షను సూచించారు. ఇసుక నేలలపైన బుసబుసా పొంగింది అంటూ వాగు సహజత్వాన్ని చూపించారు. పదువు కట్టిన లేళ్ళ కదుపులా తోచింది అనడంలో వాగువేగం కదలు తెల్లని పూలనదివోలె వదలు తెల్లని త్రాచుపడగలో విరిసింది అంటూ నీగి స్వభావాన్ని సూచించారు.

తనను వారిస్తూ తనవెంటనే పరుగులిడుతూ వచ్చిన భర్త రాయిలా మారడాన్ని చూసి విలపించే కిన్నెరసాని తొందరపాటు నిర్ణయం తీసుకొన్నాన అని ఆమె పరితాపాన్ని అతి సహజంగా వర్ణించారు.

"పపతి కిన్నెరసాని విడలేక తిరిగింది
ముగుద కిన్నెరసాని వగచెంది తిరిగింది
తాను నదిగాసేల
నైనాననుచులోన
పూని కిన్నెరసాని పొగిలింది పొగిలింది
ముక్తగీతిక వోలె మోగింది మోగింది

అంటూ తొందరపాటు నిర్ణయం తీసుకొన్న మనిషి అస్థిమిత ఆంతర్యాన్ని ప్రతిబింబింపజేశారు.

ఏవుపాయము చేత
నైన మళ్ళీ తాను
మనిసి కిన్నెరసాని నగుదామయనిపించి
ఆపలేనంత కోరిక చేత విలపించి

కోరిక మనిషి దు:ఖానికి, సుఖానికి ఎలా కారణ మవుతాయో చెప్పారు.

**తనువీడితే వోర్చు**

కొనలేడు కాబోలు" నని తెలుసుకున్న కిన్నెర యిలా విలపించింది.

బ్రతికియుండగా యింత ప్రణయమ్ము కలదంచు తెలిపితే యింకెంత చెలిమి వుండే దంచు తలపోసి తలపోసి సొలసెకిన్నెరసాని" అంటూ అనర్థాల వల్ల కాపురాలు ఎలా చెల్లాచెదురైపోతాయో అని చెప్పాడు. అంతేకాక మమకారం మొహంమీదే ప్రదర్శిస్తే మనసులోని చెలిమి అవతలివారికి తెలిసినాడు కలిమిని బలిమిని పెంచుతుంది. భర్తపట్ల భార్యకు, భార్యపట్ల భర్తకు సరియైన అవగాహన వుండాలి. నమ్మకమూ అనురాగాలే సంసార రథానికి రెండు చక్రాలు అనే ఔపదేశం కనిపిస్తుంది.

"అటువంటి పతితోడి
అటువంటి కాపురం
బిటుచేసి కొంటినం చెక్కడాలేనంత
వగచెంది వగచెంది వనిత కిన్నెరసాని"

తుదకు ఏమీ చేయలేక తనను వెంబడించి వచ్చి కొంతసేపటికి బండలా మారిన తన భర్తను చూసి విలపించింది. తన భర్తలా తాను రాయిలా మారలేక తన భర్తను తనలా (నదిలా) మారమన్న ఆలోచన ఎక్కడా రాయిలా పాషాణం కాకూడదని తేటతెల్లమైన నదిలా వుండాలని చెప్పేదిగా వుంది.

"నాకు మల్లే నీవు నదివోలె పారగా
జలముగా యిద్దరము కలిసి పదాముగా
కెరటాలు కెరటాలు కౌగిలిద్దామురా" అనడంలో ఆమెలోని సున్నితత్వం, అసలు ఆమె కాపురంలో కలతలు రావడానికి కారణమైన అతని పాషాణ మనస్తత్వమే కారణమన్నట్లు సూచిస్తుంది.

"ఓ నాథ! ఓ నాథ!
నీయందు తప్పింక నేను చెయ్యను లేర
ఆనపెట్టితివేని అడుగు దాటను లేర
ఇక జన్మలో కోపమింత పొందనులేర" అనడంలో క్షణికావేశం, కోపం వీటిలో వున్న ప్రమాదమేమిటో ఆమె గ్రహించినట్లు ద్యోతకమౌతుంది.

అలా వగచిన కిన్నెర కొంతసేపటికి తనకు తన భర్తతో మళ్ళీ కలిసి జీవించే ప్రాప్తం లేదనుకొన్నది అని తెలియ జేస్తూ విశ్వనాథ చెప్పిన ఉపమానం "మండి యారిన నిప్పు మాద్రిగా నారింది, తన కర్మమింతియేని లోనను కొంది" అనడంలో ఉత్తముల కోపలక్షణాన్ని తెలియ జేయడమే కాదు, మనది కర్మభూమి అనే విషయాన్ని చాటుతుంది.

"చేతులారాతాను
చేసుకున్ననాని"

ఆమె విలపిస్తున్నప్పుడు ఆమె కన్నీరు కూడా జలములై ఆమెలోన కలిసినావన్న విశ్వనాథ ఊహ చాలా భావ యుక్తంగా, పాత్రోచితంగా వున్నది.

"నేను కోపము నంది
నీ ప్రక్క నుండగా
వలదన్న కొద్ది నా పదము లొత్తుచు నీవు
తెలచి కౌగింటిలో తీర్చుకుంటూ నీవు

నా ఝొమ్ము తలచేర్చగా రావు కాబోలు
తలిరాకు వంటిమె
త్తని యెఱ్ఱపెదవితో
తార్చి నామోము నద్దగ రావు కాబోలు
నా యొదల్ మివుల నందపు కుప్పయాని చెప్పి
ఎల్ల తావులకు ముద్దిడరావు కాబోలు"

అంటూ ప్రబంధ పోకడలు చూపించారు. కిన్నెరచేత విశ్వనాథ ముగ్ధను విలపించింది.

సాధారణంగా స్త్రీని ఎందుకు కోయిలతో పోలుస్తారు గానీ ఏడ్చి, ఏడ్చి అలసి కీచుగొంతు పొందిన కిన్నెర స్వరాన్ని రొదయడంగిన పావురాయి గొంతుకవోలె అంటూ విశ్వనాథ తనదైన విభిన్నత్వాన్ని చూపారు.

భర్తను వదలలేక అతని చుట్టూ తిరుగుతున్న కిన్నెరను జలదేవతలు వచ్చి బలవంతంగా లాక్కెళుతుండా అలా కొనిపోబడుతున్న కిన్నెర విధానాన్ని విశ్వనాథ మనకు నిత్యం కన్పిస్తున్న దృష్టాంతాలలో చక్కగా ఔపమించి తెలుగుదనాన్ని చాటుతూ తన లోకజ్ఞతను కూడా స్పష్టపరచారు.

"తల్లి దగ్గర నుండి మెడకు పలుపోసి
లాగగాబడ్డట్టి లేగలాగ సాగింది
సాగింది సాగింది
జాలుగా సారింది
ఆవు పొదుగున పాలు ధారకట్టిన యట్లు
వనదేవతలు నీళ్ళు వొలకబోసినటయట్టు
తల్లి చల్లని ప్రేమ వెళ్ళివిరినియట్లు
పాలాట్ర గడము పాతర తీసికొన్నట్లు

పాలాట్రాగడము అనగా తెల్లని (వరి) బియ్యము రాశిగా పోసి, పాతర వేస్తా దాన్ని పాలాట్రగడము పాతర తీయడము అంటారు. "బంగారు తీగలో పానకమ్ము పోయ" అనే ఊహ నభూతోనభవిష్యతి అన్నట్లుగా వుంది.

తెనుగు పాటువెంట తీపిలా తోచింది, తెలుగు పిట్టను వొళ్ళు తెలియక పాడినై అనడంలో సమయ అవకాశం దొరికితే చాలు తెనుగుదనం గొప్పతనం చెప్పడం పూర్వజన్మ సుకృతం అనుకొన్న రోజులవి. ఆంధ్రదేశపు మట్టి అది మహత్కసకము ఆంధ్రదేశపు నీరు అంటే నమృతం అని భావించిన మహనీయులున్న రోజులవి.

సముద్రుడు కనుసైగ చేయగా కిన్నెర గోదావరిలో కలిసిపోయి భద్రాచలం దగ్గర ప్రవహిస్తుందని చెబుతూ, కిన్నెరకు గోదావరికి గల సంబంధాన్ని గర్భితంగా చెప్పారు.

విశ్వనాథ కిన్నెర నడకలలో చివరిగా

"అంత ఒయ్యారమ్ము అడుగడుగు పోయింది
అంత యిల్లాలి నెమ్మది తనము చూపింది"

అనడంలో అతివకు అందం, సంసారానికి సౌఖ్యం రెండూ యిచ్చేవి అతివకుండే నెమ్మదితనమునే సత్యాన్ని చెబుతూ సందేశాత్మకంగా స్త్రీ పాత్ర చిత్రణ చేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. రుక్కులు - శ్రీరంగం శ్రీనివాసరావు
2. కిన్నెరసాని పాటలు - విశ్వనాథ సత్యనారాయణ
3. తెలుగు వ్యుత్పత్తి పదకోశం - లకంసాని చక్రధర్‌రావు

❀❀❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# అనంత కథానిక భీష్ముడు సింగమనేని కథలు - స్త్రీ అస్తిత్వ స్పృహ

- డా॥. బత్తల అశోక్ కుమార్, గ్రంథాలయ సహాయకులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్, అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

రాయలసీమలో వ్యవసాయం జూదమని, తాను సృష్టించిన ఉత్పత్తికి వెలకట్టలేని దౌర్భాగ్యం ఒక రైతుకు మాత్రమే దక్కిందన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన అనంతకథాశిల్పి, విమర్శకుడు సింగమనేని నారాయణ. అనంతపురంజిల్లా బండమీదపల్లిగ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సింగమనేని తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, 2001లో పదవీవిరమణ అనంతరం జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన వ్యక్తి. 1970 వ దశకంలో అనంతకథను ఆధునికస్పృహతో, ఆధునిక కథానికా లక్షణాలతో ప్రారంభించిన వారు సింగమనేని. ఈయన తన జీవిత నేపథ్యాన్ని తన కథానికా సాహిత్యంలో కళాత్మకంగా చిత్రించారు. అనంతపురం నుండి సలక్షణమైన ఆధునికకథకు శ్రీకారం చుడుతూ కథావస్తురూపాలను సమున్నత స్థానానికి చేర్చారు. మార్క్సిస్టుతాత్వికత ఈయన కథలలో కనిపిస్తుంది.

సింగమనేని కథానికా సాహిత్యం అనంతపురం రైతాంగ జీవనపార్శ్వాలను బహుముఖీనంగా ఆవిష్కరించింది. సాధారణ జీవన విధానానికి, ఆరోగ్యకరమైన మానవ సంబంధాలకు ఈయన కథానికలు ప్రతిబింబాలు. ఈయన రచించిన తొలికథ 'న్యాయమెక్కడ'? 1960వ సంవత్సరంలో కృష్ణాపత్రికలో ప్రచురించబడింది. సింగమనేని తన కథలలో ప్రాంతీయ అస్తిత్వ చిత్రణకు పెద్దపీట వేశారు. ఈయన 'జూదం' (1988), 'సింగమనేని నారాయణ కథలు' (1999), 'అనంతం' (2007), 'సింగమనేని కథలు' (2012) అను నాలుగు కథానికా సంపుటాలను ప్రచురించారు. 'సంభాషణ' పేరుతో వ్యాససంపుటిని ప్రచురించారు. 'ఆదర్శాలు - అనుబంధాలు' (1965), 'అనురాగానికి హద్దులు' (1966), 'ఎడారి గులాబి' (1972) అను మూడు నవలలను ప్రచురించారు. 'సీమకథలు' పేరుతో తెలుగులో తొలి ప్రాంతీయ కథా సంకలనాన్ని, డా. శాంతినారాయణతో కలిసి 'ఇనుపగజ్జెలతల్లి' కథా సంకలనాన్ని, 'తెలుగు కథకులు - కథనరీతులు' (నాలుగుసంపుటాలు), విశాలాంధ్ర వారి 'తెలుగుకథ' పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 'సమయం - సందర్భం' అను వ్యాససంపుటి కూడా రచించారు.

ఈయన కథలు కన్నడ, హిందీ, మలయాళ భాషల్లోకి అనువదించబడ్డాయి. వీరు రచయితగానే కాకుండా విమర్శకుడిగా కూడా గణతికెక్కారు. కొల్లాయిగట్టితేనేమి, జానకీవిముక్తి నవలలు, చాసో, రారా, మధురాంతకం రాజారాం తదితర కథకుల గురించి విమర్శ రాశారు. రైతు వ్యవసాయ జూదంలో ఓడిపోయి, వ్యాపారి గెలవటాన్ని వ్యథార్థంగా చిత్రించిన కథ 'జూదం'. బోరుబావుల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతుల యధార్థ స్థితిని అక్షరీకరించిన కథ 'ఊబి'. మార్కెట్ మోసాలని చిత్రించిన కథ 'అడుసు'. అస్పృశ్యత ఆధారంగా ఉచ్చు, మకరముఖం కథలు రచించారు. ఈయన స్త్రీ అస్తిత్వ దృక్పథంలో చాలా కథలు రచించారు. అందులో రెండు కథలను మాత్రం ఎంచుకొని, ఆయన స్పృశించిన స్త్రీవాద అసిత్వ దృక్పథాన్ని మీతో పంచుకుంటాను.

## ఒక అసందర్భం :

వివాహ విషయంలో ప్రతి స్త్రీ స్వంత నిర్ణయంతో వ్యవహరించాలని, స్వీయ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి నిరసన మార్గం ఎంచుకోవచ్చునన్న వాస్తవం ఈ కథలో ఆవిష్కరించబడింది.

భారతీయ వివాహ వ్యవస్థలో కన్యాశుల్కం, వరకట్నం తరాలుగా కొనసాగుతున్న సామాజిక రుగ్మతలు. సాహిత్య, సామాజికకారుల కృషి ఫలితంగా కన్యాశుల్కమనే మహమ్మారి తరిమి వేయబడింది. కాని వరకట్నం మాత్రం జడలు విప్పుకొని వికృత రూపందాల్చి అమ్మాయిల కుటుంబాలలో విషాదానికి కారణభూతమవుతున్నది. భూస్వామ్య వ్యవస్థలో వంటింటి కుందేలుగా పరిమిత మైనది సగటు భారతీయ స్త్రీ. పెట్టుబడిదారి వ్యవస్థ ప్రారంభమైన తరువాత పురుషుడికి డబ్బు సమకూర్చే సాధనంగా మారిపోయింది. కట్నకానుకలు తన వెంట తీసుకురావడం ద్వారా పురుషుడికి స్త్రీ ఖజానాగా మారుచున్నది. స్త్రీల వ్యక్తిత్వం, సంస్కారం, చదువు, ఉద్యోగం కన్నా వరకట్నం, కానుకలే పురుషులకు సర్వస్వం. స్త్రీ స్వేచ్ఛ ఆధునిక మహిళ నినాదం. విద్య, ఉద్యోగం, వివాహం, కుటుంబం, సామాజిక జీవనం తదితర విషయాలలో స్త్రీ నేడు ఆధునిక దృక్పథంతో వ్యవహరిస్తున్నది.

వెంకటరత్నం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. తన కుమారుని పెళ్ళికి సంబంధించి ఎనిమిది లక్షల కట్నం పెళ్ళికి ముందే ముక్కుపిండి వసూలు చేసుకొన్న వ్యక్తి. కనీసం పదిశాతం చీరలకు కూడా ఇవ్వడానికి అంగీక రించని మనస్తత్వం కలవాడు. ఇతని కూతురు లావణ్య. బి.ఎస్.సి, బి.ఇడి పూర్తి చేసి గణిత ఉపాధ్యాయురాలిగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తున్నది. అభ్యుదయ భావాలు కలది. ఆధునిక మహిళకు ప్రతిరూపం. స్త్రీ స్వేచ్ఛా పిపాసి. స్త్రీకి సమాజంలో ఆర్థిక, వివాహ స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం వుండాలన్న ఆధునిక దృక్పథానికి లావణ్య ప్రతిరూపం. వెంకటరత్నం తన స్నేహితునితో "లావణ్య పెళ్ళి నిశ్చయమైంది. పేరు రామకృష్ణ, కర్నాటక రాష్ట్రంలోని టుంకూర్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అదృష్టం కొద్దీ దొరికింది, అమ్మాయిని చూడగానే మాట్లాడ కుండానే ఒప్పేసుకున్నాడు, కట్నం పది లక్షలు" అని చెప్పటం సంప్రదాయక పితృస్వామిక భావజాలానికి నిదర్శనం. అమ్మాయిల తల్లిదండ్రులు ఆర్థికంగా బలపడే సంబంధాల వైపు ప్రయత్నించడం, వారిలో వున్న కృత్రిమ గౌరవాన్ని విశదపరుస్తుంది. మంచి సంబంధం కోసం వున్న పొలాల్ని అమ్మడం, పదవీ విరమణ తర్వాత వచ్చిన మొత్తాన్ని కట్నంగా యివ్వడానికి వెనుకాడక పోవడం మొదలగునవి యువతి కుటుంబాలలో ఆర్థిక విషాదాన్ని కలిగిస్తున్నాయి.

వరుడు కర్ణాటక, అమ్మాయి అనంతపురం ఎలా పొత్తు కుదురుతుంది అని ప్రశ్నించగా వెంకటరత్నం, అమ్మాయిని ఉద్యోగం మానేయమన్నారు. మాకేం తక్కువ టీచర్ ఉద్యోగం చేయటానికి అని చెప్పిన సమాధానం పురుషాధిక్య, పితృస్వామిక ఆధిపత్య భావజాలానికి నిదర్శనం. పది లక్షలు కట్నం యిచ్చి నెలకు ఆరేడువేలు వదులుకొని రిక్తహస్తాల్తో అమ్మాయిని భర్త యింటికి నిరాధారంగా పంపించటం బాధాకరం. వివాహం తరువాత భార్య ఉద్యోగం మానివేయాలన్న నిబంధన పెట్టిన భర్త, భవిష్యత్తులో ఆమెను గౌరవిస్తాడనుకోవడం అసాధ్యం. ఉద్యోగం పురుష లక్షణం అన్న సామెత పురుషాధిక్య సమాజానికి నిదర్శనం. స్త్రీకి ఉద్యోగం అవసరం లేదని ఆంక్షలు విధించడం పితృస్వామ్య ఆధిపత్య భావజాలానికి ప్రతిబింబం. పురుషులు ఎందుకు ఉద్యోగం చేస్తున్నారో స్త్రీలు కూడా అందుకే ఉద్యోగం చేస్తున్నారనే నవీన భావనను సమాజం స్వాగతించాలి. ఉద్యోగం స్త్రీ, పురుషులిరువురికి సామాజిక గౌరవాన్ని తెచ్చిపెడుతుంది. ఆర్థిక స్వేచ్ఛను, కుటుంబ నిర్వహణలో సమాన బాధ్యతను కల్పిస్తుంది. లావణ్యను ఉద్యోగం మానివేయమనడం, కట్నం నిక్కచ్చిగా తీసుకోవడాన్ని పరిశీలిస్తే, స్త్రీని వంటింటి కుందేలుగా, పిల్లల్ని కనే యంత్రంగా, బానిసగా చూసే సనాతన భావజాలం కలవాడుగా డాక్టర్ రామకృష్ణ దర్శనమిస్తాడు.

సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో పెళ్ళిళ్ళు మగవారికి ఆర్థిక వనరుగా రూపుదిద్దుకున్నాయి. అమ్మాయిల తల్లిదండ్రులు సామాజిక చట్రంలో

ఇరక్కపోయి కట్నాల రూపంలో అధిక మొత్తాలను చెల్లించి ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోతున్నారు. అధిక కట్నాల వల్ల సుఖపడుతున్నామా లేదా అని వ్యవస్థ ఆత్మపరిశీలన చేసుకోవాలి. సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు మనుషుల్ని మార్చి వేసే గుణం, మానవ సంబధాల్ని కలుషితం చేసే లక్షణం వున్నది. వరకట్నమనే మహమ్మారిన బడిన కుటుంబాలలో వెంకటరత్నం కుటుంబం ఒకటి.

భారతీయ సంప్రదాయ సమాజంలో వరుని ఎంపికలో కుటుంబ నిర్ణయమే వధువుకు శిరోధార్యం. వివాహ స్వేచ్ఛ స్త్రీకి మృగ్యం. ఇది తరాలుగా పురుషాధిక్య సమాజం స్త్రీ వ్యవస్థపై కొనసాగిస్తున్న దమనకాండ. పెళ్ళి విషయంలో తల్లిదండ్రుల మాటను కాదనలేక, ఇష్టం వున్నా లేకపోయినా బలవంతంగా, మనస్సును చంపుకొని, పెళ్ళి చేసుకొని సమిధలవుతున్నారు స్త్రీలు. ఇది సంప్రదాయిక, పితృస్వామ్య భావజాలం. ఆధునిక కాలంలో నవీన మహిళ, వైవాహిక స్వేచ్ఛ ఆర్థిక సమానత్వాన్ని అభిలషిస్తోంది. అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా ఎదిగింది. తల్లిదండ్రులు పెళ్ళి విషయంలో నేడు పిల్లల అభిప్రాయానికి అనుగుణంగా తప్పక ప్రవర్తించ వలసి యున్నది. పెళ్ళి విషయంలో అమ్మాయితో చర్చించాలని, ప్రజాస్వామికంగా వ్యవహరించాలని, పిల్లల అభిప్రాయాలు తెలుసుకోవాలని, తెలుసుకోకపోతేనే నష్టం సంభవిస్తుందని భావించిన వెంకటరత్నం స్నేహితుడు నిజమైన స్త్రీ అస్తిత్వ స్పృహకు నిదర్శనం. ఉద్యోగం చేస్తున్న అమ్మాయికి స్థానికంగా ఉద్యోగం చేస్తున్న వ్యక్తితో వివాహం నిర్ణయించకుండా, చేస్తున్న ఉద్యోగం మానివేయించి, అధిక కట్నమిచ్చి ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహం నిశ్చయించటం నేటి తల్లిదండ్రులలో ప్రొది చేసుకున్న కృత్రిమ గౌరవత్వం, అపసవ్య దిశను వ్యక్తపరుస్తుంది.

ఉదయాన్నే నిశ్చితార్థం ఉండగా పెళ్ళికూతురు లావణ్య అదృశ్యం కావడం తండ్రి వెంకటరత్నానికి మరింత కోపాన్ని ఆవేదనను కలిగించింది. "నాకు ఈ సంబంధం వచ్చినప్పటి నుండి అనుమానంగానే ఉందన్నయ్యా! పది లక్షలు సంబంధమా, అబ్బో అని వెక్కిరించింది. ఉద్యోగం వదులుకొని, నిధులు మూట గట్టుకొని ఊడిగం చెయ్యటానికి వెళ్ళాలన్నమాట" అని నాతో అంది అన్న విషయాన్ని వ్యక్తపరిచిన వధువు తల్లి స్త్రీ అస్తిత్వ స్పృహకు సంకేతం. పిల్లలను ధైర్యంగా ఎదుట పడి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే విధంగా పిల్లలను పెంచాలన్న విషయం ఇక్కడ అవగతమవుతుంది.

ఉద్యోగం వదులుకోవటం, కట్నం తీసుకొనే వ్యక్తిని పెళ్ళి చేసుకోవటం, రాజీపడి జీవించడం ఆధునిక మహిళ దృక్పథానికి విరుద్ధం. ఇందుకు సజీవ సాక్ష్యం లావణ్య ఉత్తరం ద్వారా నిరసన తెలియజేయటం. "పది లక్షల మొగుడిభారాన్ని మోసే స్థితిలో నేను లేను. అదీ చేస్తున్న ఉద్యోగం వదులుకొని, నిరాధారంగా మాటలతో మిమ్మల్ని ఒప్పించలేనని అర్థమైపోయింది. నా నిరసన తెలియజేయటానికే ఇలా నేను వెళ్తున్నాను భయ పడకండి! నాలుగు రోజుల్లో తిరిగి వస్తాను. మీరు మళ్ళీ జాగ్రత్తగా ఆలోచించాలనే నా ఈ ప్రయత్నం" అని లావణ్య ఉద్యోగం మాని వేయించి, కట్నాలు తీసుకొని పెళ్ళిళ్ళు చేసుకొనే పురుష సమాజంపై తిరుగుబాటు ప్రదర్శనం చేయడం ఆధునిక స్త్రీ అస్తిత్వస్పృహకు, చైతన్యానికి చిహ్నం. ఆధునిక యువతి స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వాన్ని కోరుకుంటుందని, మనస్సు చంపుకొని రాజీపడి జీవించి, పెద్దల అభిప్రాయాలను నేరవేర్చదన్న సంకేతాలను లావణ్య సమాజానికి అందించింది. ఉత్తరం చదివిన కుటుంబ సభ్యులు విచికిత్సకు గురి అయ్యారు. పెద్దలు పితృస్వామిక అధిపత్య భావజాలంతో ప్రవర్తించ కూడదని, స్త్రీ వ్యక్తిత్వానికి, అభిప్రాయానికి అనుగుణంగా తల్లిదండ్రులు ఆలోచించి, గౌరవించి ప్రవర్తిల్లాలని సమాజానికి ఎరుక పరిచిన లావణ్య స్త్రీఅస్తిత్వ స్పృహకు నిజమైన నిలువుటద్దం.

## నీకూ నాకు మధ్య నిశీధి :

రచయిత సింగమనేని నారాయణ. యువతీ

యువకులు ఆర్థిక, సాంఘిక అసమానతల్ని పరిష్కరించు కున్నాకే పెళ్ళి విషయం ఆలోచించాలన్న సందేశాన్ని సమాజానికి అందించబడింది ఇందులో. పెళ్ళి విషయం విభిన్న కోణంలో చర్చకు పెట్టబడింది ఈ కథలో. స్త్రీ పురుష సంబంధాలు చాలా సున్నితమైనవి. అసమ సమాజంలో స్త్రీ పురుష సంబంధాల్లో అసమానత లుంటాయి. శారీరక, మానసిక పరిణితి కలిగిన విద్యార్థిను లైన యువతీ యువకులు తమ మధ్య గల సాంఘిక, ఆర్థిక అంతరాలను పరిష్కరించుకొన్నాకే వివాహం వైపు ప్రయత్నించాలని, అప్పుడే ఆ వివాహం నిలబడుతుందన్న ప్రతిపాదన ఈకథలో చేయబడింది. తాత్కాలిక ఆకర్షణ, ఆవేశంతో కూడిన, వివేచన లేని ప్రేమ వివాహాలు విఫలమవుతాయి. సినిమాల్లో చూపించే కృత్రిమమైన ప్రేమ సన్నివేశాలు యువతపై పెను ప్రభావం చూపుతూ సమాజాన్ని అపసవ్యదిశలో పయనింపజేస్తున్నది. ఇది నిజజీవితంలో నిజంకాదన్న సత్యాన్ని గ్రహించాలి.

వాస్తవికతావాది, పరిణిత మనస్కురాలు, ఉత్తమ సంస్కారి, అయిన వైద్యవిద్య చదువుతున్న సుధారాణి అభ్యుదయ ఆలోచన, సామాజిక చైతన్యం, ఆలోచించే గుణం, ప్రశ్నించే తత్వం కలది. సుధారాణి తండ్రి ఉపాధ్యాయుడు. తల్లి చిన్నతనంలోనే చనిపోయింది. తండ్రి శక్తంతా ధారపోసి సంతానాన్ని చదివించాడు. పదవీ విరమణ చేశాడు. అద్దెయింటిలో తండ్రీకూతుళ్ళు జీవనం సాగిస్తున్నారు. అన్నా వదినలు హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నారు. ఇది సుధారాణి సాంఘిక, ఆర్థిక నేపథ్యం. సురేంద్ర స్వస్థలం అనంతపురం జిల్లాలోని ఒక మారు మూల పల్లె. వ్యవసాయ కుటుంబం. కరువుకోరల్లో చిక్కుకొని అప్పుల సేద్యంతో జీవనం సాగిస్తున్న ఉమ్మడి కుటుంబం. గొప్ప స్థితిలో ఉన్న కుటుంబం నేడు దిగజారిపోయి వ్యవసాయ కూలీలుగా మారిపోయే స్థితి దాపురించింది. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముళ్ళ చదువులు కోసం తమ ఊరిలోనే వైద్యవృత్తి కొనసాగిస్తూ, కుటుంబాన్ని ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ముందుకు తీసుకు వెళ్తున్నవాడు. నీళ్ళే నాగరికత అని, రాయలసీమ మరో ఇథియోపియా కావటానికి ఎంతోకాలం పట్టదని సురేంద్ర తన ప్రాంతీయతను సుధకు తెలియజేయటం ప్రాంతీయ అస్తిత్వస్పృహకు నిదర్శనం. ఇరువురు భిన్నమైన సాంఘిక, ఆర్థిక నేపథ్యం గలవారని విశదపడుతుంది.

సురేంద్ర, సుధారాణిలు పి. జి. ప్రవేశ పరీక్ష రాయ టానికి కర్నూలులో బయల్దేరి ఢిల్లీ వెళ్ళి పరీక్ష రాయ వలసియుంది. ఇరువురు కర్నూలు మెడికల్ కాలేజీలో కలిసి చదువుకున్నవారు. ఒకరినొకరు జ్ఞప్తికి తెచ్చుకొని ప్రక్కప్రక్కన సీట్లలో కూర్చొని ప్రయాణిస్తున్నారు. మీరు గతంలో ర్యాగింగ్‌పైన ఉపన్యసించేవారని, సాహిత్య సృజన, సేవాభావం కలవారని సుధ తెలియజేసింది. స్త్రీలు ఒంటరిగా ప్రయాణం చేయడానికి కుటుంబం అంగీ కరించదని మా అన్నతో కలిసి ఢిల్లీ వెళ్తున్నానని సుధ చెప్పటం ఒంటరి మహిళపై సమాజపు తీరును తెలియ జేస్తుంది. ఇరువురి అభిరుచులు ఒకటే కావటం, సుధారాణి కలివిడితనం వల్ల ఇరువురి మధ్య స్నేహ పొదులు తొందరగానే పొడసూపాయి. హైదరాబాద్‌లోని తన అన్న ఇంటికి సురేంద్రను బలవంతంగా తీసుకెళ్ళడం, తన అన్న ప్రభాకర్‌ను ఒప్పించి ఇరువురు ఢిల్లీకి బయల్దేరటానికి రిజర్వేషన్స్ చేయించడం వల్ల అతనికి సుధపై గౌరవం, ఆప్యాయత పెరిగింది. సుధారాణి వ్యక్తిత్వం సురేంద్ర గుండెను తడిపి వేసింది. మీతో కలిసి ఎంత దూరమైనా ప్రయాణం చేయగలనని, కొత్తదనం అనుభవిస్తున్నానని, మీ సాహచర్యం కొత్త అనుభూతిని కలిగిస్తోందని తన అంతరంగంలోని ఆకర్షణను సురేంద్ర ప్రస్తావించాడు. తనకు ఆయాసం రావటంతో సుధ వైద్యం చేసి ధైర్యాన్ని కల్పించిన తీరుకు ఆకర్షితుడైన సురేంద్ర ఎవరో తోడు వుండటం వేరు, మీరు వుండటం వేరు అని తన హృదయాంతరాలలోని అభిమానాన్ని సుధారాణి ముందు వ్యక్తం చేశాడు.

ఢిల్లీలో పి.జి. ప్రవేశ పరీక్ష ముగించుకొని కర్నూలు చేరుకున్నారు ఇరువురు. కర్నూలులోని సుధ ఇంటిలో

ఆమె చేయి పట్టుకొని నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. "మనమిద్దరం జీవిత భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో నా మనసు మీ ముందు పరిచాను" అని అకస్మికంగా వివాహ ప్రతిపాదన చేశాడు. సురేంద్ర ప్రవర్తనతో ఖంగుతిన్న సుధారాణి క్షణకాలం చలించి పోయింది. "ముందు చేయి వదలమని, కొద్ది రోజుల పరిచయానికి ప్రేమా, దోమా అనే పేర్లు పెట్టుకుంటారని అనుకోలేదు. మీరు వాస్తవ ప్రపంచంలోకి దిగిరండి. కొద్దిరోజుల స్నేహం మాత్రమే తప్ప మన మధ్య ఏం నడిచిందని, కొత్తగా పరువంలోకి వచ్చిన ఆడపిల్లనయితే మీ మాట వినగానే మూర్ఛపోవటమో, కొంకర్ల తిరగటమో చేసేదాన్ని" అని సుధ పలికిన మాటలు ఉత్తమ సంస్కారానికి, వ్యక్తిత్వ పరిమళానికి, స్త్రీ అస్తిత్వ స్పృహకు నిదర్శనాలు. పరిణత వయస్కులు జీవితాన్ని గురించి ప్రాక్టికల్‌గా ఆలోచించాలి తప్ప యిష్టాలు, ప్రేమలు గురించి కాదు. "నేను ప్రాక్టికల్ మనిషిని, నేను క్షణికమైన ఆవేశాల్ని ఉద్రేకాల్ని నమ్మను. ఈ ప్రేమల కంటే బలీయమైనది జీవిత వాస్తవికత" అన్న సుధారాణి మాటలు జీవన యధార్థ జీవన తాత్వికతకు, వాస్తవిక జీవన దృక్పథానికి ప్రతిబింబాలు. ప్రతి యువతి ప్రేమ, ఆకర్షణ, యిష్టం గురించి ఆలోచించకూడదని, వాటి వలలో పడకూడదని, వాస్తవిక జీవన విధానాన్ని అలవరచుకోవాలని ఈ సందర్భం విశదపరుస్తుంది.

సుధ కొత్త జీవితానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక. సురేంద్రలో గూడుకట్టుకొన్న మోహం, ఆకర్షణ, ప్రేమ అతని మానసిక దౌర్బల్యాన్ని తెలియజేస్తుంది. మీ కుటుంబ పరిస్థితులు దృష్టిలో వుంచుకోవాలి. పెళ్ళి కావాల్సిన ఇద్దరు చెల్లెళ్ళు, చదువుకోవాల్సిన యిద్దరు తమ్ముళ్ళు, కష్టపడి చదివించిన అన్న, కుటుంబ అప్పుభారం మీపై వుంది. మీ పెళ్ళి మీద మీ వాళ్ళకు ఆశలు ఉంటాయి. మీ చదువుకు మీ కులంలో లక్షల కట్నం వస్తుందన్న యధార్థం విస్మరించటానికి వీలు లేనిది అని సుధారాణి సురేంద్ర వాస్తవిక జీవన పరిస్థితుల్ని ఎరుక పరుస్తూ చురక అంటించటం, నిగ్గు తేల్చటం స్త్రీ అస్తిత్వస్పృహకు, చైతన్యానికి నిదర్శనం. అలాగే మేము సొంత యిల్లు లేని స్థితిలో ఉన్నామని, కట్న కానుకలు యివ్వటానికి మా నాన్న, అన్న దగ్గర నిల్వలు లేవని సుధ తన ఆర్థికస్థితిని వాస్తవికంగా అభివ్యక్తీకరించటం నిజాయితీకి నిలువటద్దం. "నేను కట్నానికి వ్యతిరేకిని, డబ్బులు పోసి మగవాణ్ణి కొనుక్కొని, ఆ వ్యక్తితో జీవితాంతం కాపురం చేయటం నా ఊహలో కూడా లేని విషయం, పి.జీ సీటు వస్తే చదవటం నా ఆశయం. పెళ్ళికోసం నా చదువును త్యాగం చేయలేను. నన్ను నన్నుగా స్వీకరించే వ్యక్తి నాకు కావాలి" అని సురేంద్రతో సుధారాణి వ్యక్తం చేసిన వాస్తవాలు ఆధునిక మహిళ జీవన వాస్తవికతను ద్విగుణీకృతం చేస్తుంది. స్త్రీకి చదువు ముఖ్యమని, కట్నం ద్వారా వైవాహిక జీవితం కొనసాగించడం హేయమైన చర్యని అభివ్యక్తీకరించటం స్త్రీ విద్య, ఆర్థిక స్వేచ్ఛ ఆవశ్యకతను తెలియజేస్తుంది. కులాల మధ్య అంతరాలు సామాజిక అభివృద్ధికి నిరోధకాలు. "మన కులాల మధ్య సాంఘిక అంత రాలున్నాయి. కట్నం లేకుండా, కులాంతరమూ అయిన నన్ను చేసుకోగల ధైర్యమూ, పరిస్థితులు మీకు ఉన్నా యోమో కూడా మీరు ఆలోచించాలి" అని తమ మధ్య వున్న అగ్ర, నిమ్న కులబేధాలు కట్నం లేకుండా కులాంతర వివాహాన్ని స్వాగతించే సంస్కృతి వుందా అని ప్రశ్నించి, పునరాలోచించుకోవాలని, వారం రోజుల పరిచయాన్ని ప్రేమగా భావించడం తగదని హితవు పలకటం సుధా రాణిలో పరిణితిని, దీర్ఘదృష్టిని, నేలవిడిచి సాముచేయని తత్వాన్ని, అస్తిత్వస్పృహను తెలియజేస్తుంది.

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది అన్నది గురజాడ అభిమతం. విద్య, ఉద్యోగం, ఆర్థిక భద్రత, వరుని ఎంపికలో స్వేచ్ఛ, వాస్తవిక జీవితం మొదలగునవి ఆధునిక మహిళ వ్యక్తిత్వ సూచికలు. ఉన్నతవిద్య, ఉద్యోగం, ఆర్థిక స్వేచ్ఛ, సామాజిక ప్రవర్తన, కుటుంబ బాధ్యత, కుల, ఆర్థిక అంతరాలు, ఆకర్షణ, ప్రేమకు

లొంగని తత్వం, ప్రశ్నించే తత్వం మొదలగు అంశాలు సుధారాణి పాత్ర ద్వారా ఈ రచయిత సమాజానికి అందించడం విశిష్టత. సురేంద్రలో మార్పును కలిగించిన సుధారాణి ఆధునిక మహిళ అస్తిత్వ కేతనానికి నిదర్శనం.

**ఆధార గ్రంథాలు :**

1. ఒక అసందర్భం - సింగమనేని నారాయణ
2. నీకు నాకు మధ్య నిశీధి - సింగమనేని నారాయణ
3. అనంతపురము జిల్లా కథానికలు - అస్తిత్వ స్పృహ - డా. జెన్నే యోగీశ్వరనాయుడు (పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథం)
4. సీమకథ - అస్తిత్వం - ఆచార్య కె. శ్రీదేవి
5. తెలుగు కథ - ప్రాంతీయ అస్తిత్వం - డా॥ వెల్దండి శ్రీధర్

# స్త్రీవాద సాహిత్యానికి "అరంజ్యోతి" - ఓల్గా

- కప్పల శ్రీరాములు, సాహిత్య విద్యార్థి, ఎం. చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం, అనంతపురం.

అరుంధతి నక్షత్రాన్ని పల్లీయులు అంటే గ్రామీణ ప్రాంతాలవారు "అరంజ్యోతి" అనడం కద్దు. అరుంధతీ నక్షత్రాన్ని భారతీయ సమాజం ఒక పతివ్రతా శిరోమణికి ప్రతీకగా భావిస్తుంది. అంతటి గౌరవాన్ని పొందిన మహిళ, సప్తర్షుల్లో ఒకడైన వశిష్ఠుని ఇల్లాలు. దళిత కులంలో పుట్టినా, తనదైన విశిష్ట వ్యక్తిత్వంతో ఉన్నతమైన మహిళగా నిలిచింది. అంతటి ఉన్నతస్థానం పొందిన అరుంధతిలాగే స్త్రీవాద సాహిత్యానికి వేగుచుక్కగా కనిపించే రచయిత్రి పోపూరి లలితకుమారి (ఓల్గా).

"ఓల్గా (పోపూరి లలిత కుమారి)ను గురించి మాట్లాడ్డ మంటే తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం సమగ్ర స్వరూపాన్ని రెండక్షరాలలో విమడ్చుడమే. సాహిత్యంలో అన్ని ప్రక్రియలను స్త్రీవాద సంభరితం చేయడంకాక, ఉపన్యాసంతో సహా ఇతర కళారంగాలన్నింటిలోనూ కూడా స్త్రీవాద చైతన్యాన్ని నిక్షేపించి, స్త్రీవాదానికి చిరునామాగా మారిన ప్రతిభావంతురాలు ఓల్గా. కవిత్వం, కథ, నవల, విమర్శ, కాలమ్, అనువాదం, నాటకాలతో పాటు, చలనచిత్రం, టి.వి. సీరియల్, నాట్యం, పాటలతో సహా రచించి, ఏది రాసినా స్త్రీవాద భావజాలాన్ని ప్రకటించి, అన్ని రకాల పాఠకులనూ, ప్రేక్షకులనూ ఈ భావజాలానికి సన్నిహితంగా తెచ్చిన ఘనత ఆమెకు దక్కుతుంది. స్త్రీవాదం ఆమెతో పుట్టలేదు. నిజమే. కానీ, ఈ సిద్ధాంతాన్ని గురించి, దాని అవసరాన్ని గురించి, తన సమకాలీనులందరి కంటే స్పష్టత ఆమెలో వుంది. తను మాట్లాడుతున్నది ఎవరికోసమో, ఎందుకోసమో, దానివల్ల సమాజంలోనూ, అన్ని మానవ సమాజవ్యవస్థలలోనూ మానవీయతను ఎలా పెంపొందించవచ్చో ఆమెకు తెలుసు. ఓల్గా చెప్పే స్త్రీవాదం స్త్రీల అభ్యున్నతికి సంబంధించింది మాత్రమే కాదు. మొత్తంగా మానవీయ మైన ప్రజాస్వామికమైన సంబంధాలతో కూడిన వ్యవస్థను నెలకొల్పడానికి ఉద్దేశించింది. తన సృజనశీలతను అసాధారణ నిబద్ధతతో ఈ దిశగా ఆమె ఉపయోగించు కుంది. ఇంకా ఉపయోగించుకుంటున్నది. ఈ ప్రవాహ శీలతే ఆమె బలం. స్త్రీవాద సాహిత్యాన్ని సృజించిన ఎన్నో కలాలు నెమ్మదించినా, కొన్ని నిలిచిపోయినా, ఆమెలో మాత్రం అలుపన్నదిలేదు. నిరంతర చైతన్య శీలియై, స్త్రీవాద సిద్ధాంతాలవ్యాప్తి ఎన్ని రకాలుగా చేయవచ్చో అన్ని విధాలా చేస్తూ, కేవలం రచయితగానే కాక, కార్యకర్తగా కూడా తెలుగు సమాజంలో ప్రయోజనకరమైన పాత్రను నిర్వహిస్తున్న వ్యక్తి ఓల్గా" అని డా॥ సి. మృణాళిని అన్న మాటలు అక్షర సత్యాలు.

గుంటూరు జిల్లా చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో పోపూరి వెంకటసుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతులకు 1950, నవంబరు 27న పోపూరి లలిత కుమారి జన్మించారు. డిగ్రీ వరకు విద్యాభ్యాసం అంతా గుంటూరు పరిసర ప్రాంతాల్లో జరిగింది. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎం.ఏ; తెలుగు పూర్తి చేశారు. తెనాలిలోని వి.ఎస్.ఆర్ కళాశాలలో తెలుగు అధ్యాప కురాలిగా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. చలం, కొడవటిగంటి కుటుంబరావు రచనల వల్ల ప్రభావితమైన ఓల్గా రచనా రంగంలో అడుగుపెట్టారు. స్త్రీచైతన్యం అంశంగా రచనలు చేసి తనకై ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. పత్రికలలో, సాహిత్యంలో, అనువాద రచనలలో మహిళా హక్కులు ప్రధానాంశంగా రచనలు సాగించింది.

ఓల్గా పెరిగిన కాలం స్వేచ్ఛను, జాతీయ భావాలను గొప్ప విలువలుగా భావించిన రోజులు. అందుకే ఆ వాతావరణంతో స్ఫూర్తి పొంది తన విద్యార్థి దశలోనే సాహిత్య, విప్లవ ఉద్యమాలపట్ల ఆకర్షితురాలైంది. ఆ రోజుల్లో పొందిన ఉత్సాహ, ఉద్రేకాలే సమాజంలో

మార్పుకోసం పనిచేయాలన్న తపన ఆమెలో కలిగించాయి. అక్షరాల ద్వారా ఈ మార్పు సాధించవచ్చునన్న నమ్మకమే ఆమెను రచయిత్రిని చేసింది. క్రమంగా సాహిత్యంలోనూ, విప్లవోద్యమాలలోనూ పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలం ఆమెలోని భ్రమలను తొలగించగా, స్త్రీవాద సిద్ధాంతంలో దానికి సమాధానాలను పొందగలిగింది. అప్పటినుంచీ ఈ భావజాలాన్ని తెలుగు పాఠకులకు అందించాలని ఆమె కృతనిశ్చయురాలైంది. మహిళల స్వేచ్ఛ, హక్కుల గురించి సామాన్యులకు అవగాహన కల్పించిన రచయితలల్లో అగ్రస్థానం ఓల్గాదే. ఆమె రచనలు అనేక పునర్ముద్రణలు పొందడం, అసంఖ్యాక పాఠకులను ఆమెను ఆదరించడం, పరిమిత సంఖ్య పాఠకులు ఆమెను దుమ్మెత్తిపోయడం ఇవన్నీ ఆమె విప్లవాత్మక ఆలోచన సరళికి, ఆమెలోని కాలిక స్పృహకు నిదర్శనాలు.

1986లో 'సహజ' నవలతో ప్రారంభించి ప్రతి సంవత్సరం కుటుంబ సంబంధాల గురించి ఒక్కోనవల రాస్తూ వచ్చింది. ప్రేమ, వివాహం, కుటుంబం అనేవి క్రమేపీ స్త్రీలలోని సృజనాత్మక శక్తిని నాశనం చేస్తాయని ఆమె ఈ నవలల్లో సున్నితంగా హెచ్చరించింది. అయితే ఆమె మగపాత్రలేవీ వికృతంగా, పైశాచికంగా ప్రవర్తించవు. వాళ్ళందరూ మనకు రోజూ కనిపించే పురుషులే. కాకపోతే తమ జీవితాల్లో, అనుబంధాల్లో ఎక్కడ పొరపాటుందో తెలుసుకోలేని అజ్ఞానం వాళ్ళది. వారిపట్ల మనలో ద్వేషం కంటే జాలి కలిగేలా రచించడమే ఓల్గా మేథాశక్తికి నిదర్శనం.

1987లో 'స్వేచ్ఛ' పాఠకులలో ఆగ్రహం, అవిశ్వాసం, మెప్పు, కృతజ్ఞతాభావం వంటి మిశ్రమ స్పందనలు కలిగించడంతో, ఓల్గా పేరు రాష్ట్రమంతటా మారు మ్రోగింది. ఆత్మాన్వేషణ కోసం ఒక స్త్రీ ఇంటిని, భద్రతనూ మాత్రమే కాక, తాను నమ్మిన విశ్వాసాలను కూడా వదులుకున్నట్లు ఓల్గా చిత్రించడం క్షమించరాని అపరాధమే అయింది. పాఠకుల్లో ఈ నవల దిగ్భ్రాంతిని, ఆగ్రహాన్ని, అపనమ్మకాన్ని రేకెత్తించింది. విమర్శకులు ఈ నవలలో సాహిత్య విలువలుకానీ, నైతికవిలువలుగానీ లేవని చీల్చిఛండాడుతుండగానే ఇది ప్రతిష్టాత్మకమైన బహుమానం అందుకొని, అనేక ముద్రణలు పొందడంతో వారికి ప్రజలనుంచి నిఖార్సైన సమాధానం లభించినట్లయింది.

ఓల్గా కథలు పితృస్వామ్య ఆధిపత్య సంస్కృతి కింద నలిగిపోయే స్త్రీల శరీర అవయవాల గురించిన విశ్లేషణలు. పురాణ పాత్రలతో ఆమె రాసిన కథలు ఆమె విశ్లేషణా శక్తిని తెలిపే ఆణిముత్యాలు. అలాగే ఓల్గా కవిత్వం కూడా ఎంతో శక్తిమంతమైంది. ఇవికాక, చరిత్ర పుణాదిగా ఆమె రాసిన 'చరిత్రస్వరాలు', చలం స్త్రీ పాత్రలో కల్పించిన 'వాళ్ళు ఆరుగురు' అందరికీ పరిచితమైన విషయాలనే అసాధారణ రీతిలో, దిగ్భ్రమ గొలిపేలా చేసిన రచనలు. సాహిత్య విమర్శలోనూ, అనువాదంలోనూ తాను చేసిన కృషి అద్భుతమైంది. నృత్యనాటికల్లో ఓల్గా రాసిన కవిత్వంలోని తీవ్రత, ఆయా పాత్రలను సునాయాసంగా సరికొత్త కోణం నుంచి చూపిన వైనం విస్మయాన్ని కలిగిస్తాయి. ఈ నృత్య నాటికలకు అందులోని గేయరచనే ప్రాణవాయువు. వీటి ప్రదర్శనకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉండడం, ఇప్పటికే వందలాది ప్రదర్శనలు జరగడం చెప్పుకోదగ్గ విషయాలు.

ఓల్గా కథలూ, నవలలూ రాసినన్ని కవితలు రాయలేకపోయినా, మరీ తక్కువేం రాయలేదు. రాసిన వాటిలో కొన్ని బాగా పాఠకులను ఆకట్టుకున్నాయి. అంతేకాదు పత్రికల్లో అచ్చయిన రోజుల్లోనే బాగా పేరు తెచ్చుకున్నాయి. 'పంచాది నిర్మల వారసురాలిని (1972), మెహంది స్త్రీల విజ్ఞప్తి (1988) పత్రికల్లో వచ్చిన రోజుల్లోనే ఎక్కువమందిని ఆకర్షించాయి. వాటిని పాఠకులు రకరకాలుగా చర్చించుకునేవారు.

మెహంది స్త్రీల విజ్ఞప్తి కవిత మెహంది స్త్రీల బాధ, వ్యథ, కోపం, కసి వ్యక్త చేస్తూ సాగుతుంది.

"ఓ మగ మద మృగాల్లారా
మీ ఇళ్లల్లో చావండి
మీ భార్య ఒళ్ళుల్లో చావండి
మీ తల్లుల గుండెలపై చావండి
............
...........
చావటానికి మా దగ్గరకు రాకండి
బతకటానికి నానా చావూ చస్తున్నవాళ్ళం"

ఈ కవిత పత్రికలో అచ్చయినప్పుడే చాలామంది అభిమానాన్ని చూరగొన్నది. మెప్పు పొందింది. ఇది చాలా కాలం - కాదు, కలకాలం నిలిచే కవిత. ఓల్గా కవిత్వాన్ని గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ప్రశంసించవలసిన కవిత ఇది.

"ఉపమా కాళిదాసస్య" అని మనకు ప్రసిద్ధ సూక్తి వుంది. ఎవరైనా కవుల విశిష్టత వాళ్ళు వాడిన పోలికలవల్ల తెలుస్తుంది. సమర్థులైన కవులు కొత్త పోలికల ద్వారా తమ విశిష్టతను ప్రదర్శిస్తారు. ఓల్గా అట్లా విశిష్టమైన పోలికలు వాడింది. వాటిలో మచ్చుకు కొన్ని

గృహలక్ష్మి అనే కవితలో

"రుబ్బురోలు పొత్రంలా
తలతిరుగుతూనే వున్నా
ఆలోచనల పప్పు మెదగదు"

రూపరహితమైన ఆలోచనలకు రూప ప్రదర్శన వల్ల ఇక్కడ ఇది సాధ్యమైంది.

కల అనే కవితలో

"పగిలిన పత్తికాయల్లాంటి కళ్ళు
నిద్రకోసం
రాత్రి పాదాలముందే
దీపాలై జ్వలిస్తున్నాయి"

నిద్రలేని రాత్రుల్లో కళ్ళను పగిలిన పత్తికాయలతో పోల్చటం ఇక్కడ విశిష్టత. చెల్లాచెదురైన కళ్ళను పగిలిన పత్తికాయలతో పోల్చటం వల్ల కళ్ళలో అస్థిరత కనిపిస్తుంది.

దాదాపు నాలుగు శతాబ్దాల నుంచి స్త్రీవాదం ఒక బలమైన ధోరణిగా తెలుగు సాహిత్యంలో ప్రవేశించింది. పితృస్వామ్యం, జండర్ విధానం, ఇంటిచాకిరీ, అణచివేత విధానం మొదలైన విషయాలను స్త్రీవాదులు తమ రచనలలో ప్రశ్నిస్తూ, చర్చిస్తూ, విశ్లేషిస్తూ సాహిత్యసృష్టి చేస్తున్నారు. జాతి, వర్గం, సెక్సులనాధారం చేసుకొని ఒకరు మరొకరిమీద అధికారంం చేయడాన్ని అణచివేత రాజకీయాలుగా గుర్తించారు. తమ జీవితాలపై తామే నిర్ణయాధికారాన్ని కలిగి వుండడం శక్తిగా తెలుసుకున్నారు.

19వ శతాబ్దంలో మొదలైన పారిశ్రామికీకరణతో స్త్రీల భౌతిక జీవితంలో అనేక మార్పులు వచ్చాయి. పరిశ్రమ లలో పనిచేయడానికి స్త్రీలు అవసరం అయ్యారు. పెట్టుబడిదారీ సమాజంలో వచ్చిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే కొత్త విలువలు ఆదర్శంగా చూపబడినాయి. కొత్తగా ఏర్పడుతున్న నూతన సమాజా నికీ, విలువలకూ 'ఆధునిక స్త్రీ' ఆవిర్భావం అనివార్య మైంది. మొదట ఉదారవాద భావాలతో స్త్రీలకు కొన్ని హక్కులూ, సౌకర్యాలు సాధించుకుంటే సరిపోతుందని ప్రారంభమైన స్త్రీవాదం, క్రమంగా సమాన హక్కులూ, సౌకర్యాలూ కావాలనే స్థాయికి ఎదిగింది. స్త్రీవాదం గత రెండున్నర దశాబ్ద కాలం నుంచి ఒక సిద్ధాంతంగా పరిణామాన్ని పొందుతూ ఒక నూతన తాత్త్విక దృక్పథంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది.

స్త్రీల జీవితాల్లోని అన్ని స్థాయిలలో బాల్యం మొదలు కొని, వృద్ధాప్యం వరకూ వున్న సమస్యలన్నింటినీ కథలుగా మలచుకోవడంలో ఓల్గా విజయవంతం అయ్యారు. భర్త చనిపోయిన మధ్యవయస్కులైన స్త్రీలు నిస్సారంగా జీవితాలు వెళ్ళబుచ్చుతుంటారనీ, మగవారు తోడు లేకుండా స్త్రీలు బ్రతకలేరన్న భ్రమలు మన సమాజంలో వున్నాయి. అలాంటి భ్రమలన్నింటినీ తన సాహిత్యం ద్వారా ఛేదిస్తున్న ఓల్గా అసలు మగవాళ్ళే స్త్రీల 'తోడు' లేకుండా జీవించలేరన్న వాస్తవాన్ని 'తోడు' కథలో నిరూపించే ప్రయత్నం చేశారు.

ఓల్గా సాహిత్యం ద్వారా మనం ఏం నేర్చుకోగలమంటే,

- ♦ స్త్రీకి స్త్రీయే శత్రువు అన్న అభిప్రాయాన్ని ఖండించి, స్త్రీకి స్త్రీయే సహకరించాలని, స్త్రీలందరూ ఐక్యంగా వుండడం ద్వారానే అణచివేతను తిప్పికొట్టగలరనీ ఓల్గా సాహిత్యం చెబుతుంది.
- ♦ పితృస్వామ్య వ్యవస్థ వల్ల నష్టపోయేది స్త్రీ మాత్రమే కాదనీ, పురుషుడు కూడాననీ, ఆ విషయం పురుషుడు గుర్తించాలనీ ఆమె సాహిత్యం చెబుతుంది.
- ♦ స్త్రీల హక్కులన్నీ మానవ హక్కులనీ, ఏ హక్కుకూ విఘాతం కలగడాన్ని స్త్రీలు సహించి ఊరుకోకూడదనీ ఓల్గా సాహిత్యం బోధిస్తుంది.
- ♦ అసమ సంబంధంలో ఎటువంటి ఆనందమూ లేదన్న నిజాన్ని గుర్తించలేని పురుషుడి పట్ల ఓల్గా జాలిపడుతుంది.
- ♦ స్త్రీల అస్తిత్వం కుటుంబ సంబంధాలకే పరిమితం కాదనీ, స్త్రీ సమాజాభివృద్ధిలో సమాన భాగస్వామి అనీ, ఓల్గా రచనలు మనకు హితవు పలుకుతాయి.
- ♦ స్త్రీవాదం వల్ల స్త్రీల జీవితాలు బాగుపడడమే కాదు, ప్రపంచంలో ఒక శాంతిమయ సహజీవన వ్యవస్థ ఏర్పడగలదని ఓల్గా నమ్ముతుంది.

ఓల్గా సృజించిన సాహిత్యం సమాజాన్ని మంచి మార్గంలో పయనించేందుకు దోహదారి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. స్త్రీవాద సాహిత్యానికి ఆరంజ్యోతి ఓల్గా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని ఈ సందర్భంగా ప్రకటిస్తున్నాను.

## ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
2. విముక్త (నవల) - ఓల్గా
3. ఓల్గా తరంగాలు - అబ్బూరి ఛాయాదేవి, మృణాళిని, పాటిబండ్ల రజని (సంపాదకులు)

❀❀❀

# మాజేటి జయశ్రీ కథల్లో - మహిళ

- *ఎస్. శశికళ,* పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

కాలాలు వేరైన ఈ సమాజంలో మహిళలది కీలకమైన స్థానం. అయితే ఆమెకు తగిన గుర్తింపు ఉందా లేదా అనేది ఆయా కాలాల నాటి సమాజ పోకడలను బట్టి ఉంటుంది. ప్రాచీన సాహిత్యం గమనిస్తే ఒక్కొక్క యుగంలో ఆయా సాహిత్యాల ద్వారా ఆ కాలం నాటి మహిళ స్థితిగతులను కొంత వరకు అవగాహం చేసుకోవచ్చు. అయితే ఆధునిక కాలంలో మహిళ స్థితి గతులను పరిశీలిస్తే ఎంతో విశిష్టంగా కనిపిస్తుంది. మారుతున్న కాలానికి తగినట్లు పాశ్చాత్య సాహిత్య సంస్కృతి ఆధునిక ప్రభావాలు ఆధునిక మహిళపై ఎంతో ప్రభావం చూపాయని చెప్పవచ్చు. ఆధునిక కాలంలో ప్రజలు జీవన విధానం అనేక ప్రాంతాలలో విస్తరించడం ఆయా భాషల్లో సాంస్కృతిక విశేషాలు కూడా బాగా విస్తరించాయి. ఈ నేపథ్యంలో ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళ స్థితిగతులను పరిశీలిస్తే తెలుగు ప్రాంతాల్లోనే కాదు. తెలుగు ఇతర ప్రాంతాల్లో కూడా తెలుగు సాహిత్యం విసృతంగా వెలువడింది. ఈ నేపథ్యంలో తమిళనాడులోని ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే ఎందరో కవుల కవయిత్రలు, ఆధునిక సాహిత్యాన్ని వివిధ ప్రక్రియల్లో సృశించారు. అటువంటి వారిలో ఒకరు డా॥ మాజేటి జయశ్రీ గారు. వీరు కథా సాహిత్యంలో అనేక రచనలను వెలువరించారు. వారి కలం నుండి జాలువారిన కథా సంపుటిల్లో రండి అలోచిద్దాం, మలిసంధ్యలో మలుపు, ఆలోచించు ఎలాగో, ఇదే వాస్తవం, అంచనాలు తారు మారై తెగినవి తెంపబడినవి దాకా కథా సంపుటాలు వెలువిరించారు. అన్ని రచనలు పరిశీలించటం సాధ్యం కాదు కాబట్టి ఈ పరిశోధన వ్యాసం తెగనవి తెంపబడివి వరికే పరిమితం చేయడం అయ్యింది. ఈ కథా సంపుటిలో రచయిత్రి మాజేటి జయశ్రీ మహిళలను చిత్రించిన విధానాన్ని పరిశీలిద్ధాం.

ఈ కథా సంపుటిలో మొత్తం 18 కథలు ఉన్నాయి. ఆయా కథల్లో మహళను చిత్రించిన తీరు తెన్నులను వివిధ కోణల్లో పరిశీలిద్ధాం.

తప్పెవరిది అనే కథని గమనిస్తే ఈ కథలో స్త్రీ పాత్రలన్నీ కూడా సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇస్తున్నట్లుగా రచయిత్రి మాజేటి జయశ్రీ గారు పాత్రల్ని చిత్రించి విధానం, తీరు తెన్నెలు సమాజానికి అనుగుణంగా అభివర్ణించారు. అత్త కోడాలు మద్య సాధరంగా జరిగే ఘర్షణ, తల్లి కొడుకుల మద్య అనురాగం కోల్పోతే జరిగే చర్చ ఇవన్నీ కూడా నిజ జీవితాలలో కూడా చోటు చెసుకుంటున్నాయి. ఈ కథలో అంకిత ఇందుమతి పాత్రలు చాలా కీలకమైనవి. కోడాలు, కొడుకు, ఇందుమతిని ఇంట్లో నుంచి బయటకు వెళ్ళమని కోపంతో చెప్పడంతో ఇందుమతి భదతో వెళ్ళిపోతుంది. కొన్నిరోజులు తరువాత మిని లారీతో ఇంటి ముందు దిగుతుంది. కొడలు అంకిత చూసి "వచ్చింది మళ్ళీ ఎం మొప్పు తెచ్చిపెడుతుంది" అని తలుపులు తీస్తుంది. వెంటనే ఇందుమతి అయిన అత్త " నేను అవసరం లేదు కానీ నా వస్తువులతో అవసరం ఉందా? అంటూ ఇంట్లో అన్నీ వస్తువుల్ని లారీకి ఎక్కిస్తుంది.

వస్తువులన్నీటిని ఒక రూమ్‌లో పెట్టి ఇందుమతి ఓల్డేజ్ హోమ్‌లో కొన్ని రోజులు ఉండి తరువాత తను అద్దెకు రూమ్ తీసుకొని అక్కడకి వస్తుంది. ఇంతలో తన ఫ్రెండ్ జానికి వచ్చి పరామర్శించుకుంటారు. మళ్ళీ ఇంటికి వెళ్ళి మిగిలిన సామాన్లు కూడా తీసుకోరావాలని ఇంటికి వెళ్తుంది. అక్కడ ఉన్న దేవుని మందిరంలో ఉండి సామాన్లు కూడా తీసి పెట్టే సమయంలో ఇంతలో ఇందుమతి భుజంపై ఎవరో చెయ్యి వేసినట్లు అనిపిస్తే తల ఎత్తి చూసింది. ఎదురుగా పద్మావతి, వాసుకి,

స్వరాజ్యలక్ష్మీ, నుంచొని చూస్తున్నారు. "ఏడవకండి ఇందుమతి గారు ప్రస్తుతం లోకం పోకడ ఇది. అన్నింటిని భరించాలి మరి! అన్నది వాసకి. ఇలా తన స్నేహితులు ఇచ్చిన మంచి సలహాలుని తీసుకున్న ఇందుమతి వెంటనే "నేను తప్పు చేశానా? నా సామాన్లు నేను తీసికెళ్ళాను! తప్పా! నేను అక్కడలేనప్పుడు ఇవి మటుకు వాళ్ల కెందుకు? అన్నది ఆవేశంగా... లేదండి, తప్పులేదు! మీరు చేసింది సర్గందే! పెద్దవారిని నిరాకరణ నిరాదరణ ఈ రోజుల్లో ఒక పోకడైంది. మేము అందరం కూడా మిమల్ని చూసే నేర్చుకున్నాం. మరి సామాన్లు అన్నీ ఎం చేస్తారు? అమ్మేస్తారా! అన్నది పద్మవతి కుతుకూహలంగా అంతలోపు స్వరాజ్యలక్ష్మీ గబా గబా ఇంటికి వెళ్ళి వేడి వేడి టీ తెచ్చి నలుగురికిచ్చింది. ఇలా స్నేహితులతో మనసార మాట్లాడి నా కొడుకు నన్ను వెళ్ళమన్నది కొత్త విషయమేమి కాదు. సగట భారతీయునకు జరిగేదే అంటూ ఓల్డేజ్ హమ్ లో మిత్రులకు చెప్తుంది. ఇది విన్న కొంత మంది మహిళలు విని ఊర్కుంటారు. మరికొందరు ఈ సమస్యలకి పరిస్కార మార్గాలను వెతుకుంటారు. మరికొంత మంది ఈ విషయాలును ఇందుమతి ధైర్యసాహసాలును, ఆధారంగా చేసుకొని ఉత్తేజంతో మల్లీశ్వరి, భానుమతి, అనసూయ, చంద్రమతి, అలా అలా మెల్లగా పాకి పాకి ఇంచుమించు ఆ హొమ్‌లో పదిహేడు మంది దాకా ఇందుమతిని ఫాలో అయ్యారు. ఈ విషయం పేపరు న్యూస్‌లో వచ్చింది. ఇంటర్యూలో ఒక జర్నలిస్టు " మీ వాళ్ళు మిమ్మల్ని మళ్ళీ ఇంటికి రమ్మని పిలిస్తే మళ్ళీ వెళతారా? అలా పిలవరు! ఒక వేళ పెలిస్తే వెళ్ళం అని ధీటుగా సమాదానం ఇస్తారు ప్రేమలత.

తన రక్షణ పోషణ తరువాత జన్మనిచ్చిన సంతానం ఉండడమే సౌభాగ్యం"! ఈ రోజుల్లో సంతానమే మన దౌర్భాగ్యం"! అనేట్టుగా మారింది మన సమాజం. అని ఇందుమతి తలపెట్టిన ఈ పోరాట సమయంలో కొంతమంది ఇలాంటి సరిస్థితులను ఎదురవ్వకుండా జాగ్రత్త పడ్డారు. పద్మనాభ నగర్‌లో కొడుకింట్లో ఉంటున్న ప్రమీల గారు ఇంకా హుషారయ్యారు. మలిసంధ్యలో మేలుకొన్న మహిళ, ఇందుమతి చే.... ఊరంతా మారుమ్రోగింది! నిద్రపోతున్న వయోధిక మహిళ లోకాన్ని లేపినట్లుయింది! ఎంత రక్త సంబంధీకులైన అందరూ అన్ని వేళలా ఉండరు! అంటూ తల్లిదండ్రులను ఓల్డేజ్ హొమ్‌కి పంపేయడం లాంటివి అలాగే అత్త కోడాల మద్య జరిగే సంఘర్షణను వివరించి నవ సమాజానికి మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ధైర్యంగా ఎలా పోరాటం చేసి నిలబడాలి అని ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చారు రచయిత్రి మాజేటి జయశ్రీ గారు. ఈ తప్పెవరిది కథలో స్త్రీల పాత్ర చాలా విశిష్టంగా, ధీరవనితగా, సమాజానికి ప్రయోజనకంగా ఉండేలా చిత్రించిన విధానం చాలా గొప్పగా వర్ణించడం జరిగిందని బావించ వచ్చు.

ఇక రెండవ కథ ఊరికి ఉపయోగం అనే కథను గమనిస్తే స్త్రీ వివాహ జీవితంలో మోసపోతే ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటుందో అని సర్వజ పాత్ర ద్వారా సమాజానికి అర్థమయ్యే రీతిలో రచయిత్రి మాజేటి జయశ్రీ గారు చిత్రించారని చెప్పవచ్చు. ఈ కథలో పాత్రలు సర్వజ, రశ్మి, ఇంద్రాణి, కస్తూరి, మంగమ్మ మొదలైన పాత్రలు స్థిరంగా కనిపిస్తున్నాయి. ఇందులో సర్వజ రశ్మి ప్రధాన పాత్రలు. ఇక కథలోని సారంశాన్ని గమనిద్దాం:

సర్వజ సాధరణ కుటుంబానికి చెందింది. చిన్న వయస్సులో తను ఆడుకునే వస్తువుల నుండి వేసుకొని బట్టలు దాకా తన అక్కవే వాడుకునేది. ఒక రోజు సర్వజకి పెద్దింటి సంబంధం వచ్చింది. ఒక్కపైసా కూడా కట్నం వద్దు అని చెప్పడంతో సర్వజ తండ్రి సంతోషంతో విచారించకుండా సర్వజకి పెళ్ళి చేసి సాగనంపుతాడు. కొన్నాళ్ళు అయ్యాక సర్వజ గర్భవతి అవుతుంది. ప్రతి నెల చెకప్‌కి వెళ్ళినప్పుడు డాక్టర్ పాపకి బ్రెయిన్ ఎదుగుదల లేదు అబార్షన్ చేయించుకుంటే ఇప్పుడే మంచిది అని సలహా ఇస్తుంది. దాంతో సర్వజ భర్త

ఒప్పుకోరు. ఇలా నెలలు నిండాక సర్వజ ఆడపిల్లకు జన్మనిస్తుంది. అప్పటికే పాప కంటిచూపు సరిగ్గా లేదని సర్వజ అత్తగారికి భర్తకి అర్థమయ్యి ఏం తెలియకుండా నటిస్తూ పాపని అల్లారి ముద్దుగా చూసుకొంటున్నారు. పుట్టినరోజు నాడే పాపకి రశ్మి అనీ పేరు పెట్టి అందరిని ఆహ్వానించాలని అనుకుంటారు. అనుకున్నది అను కున్నట్లు అందర్ని ఆహ్వానించారు. ఆ సమయంలో తెలియని ముగ్గురు బంధవులు వస్తే సర్వజ ఎవరు అని భర్తని అడిగింది భర్త సమాధానం చెప్పకుండా మాట దాటేస్తాడు. తరువాత ప్రదాయిని సర్వజ చెయ్యి పట్టుకొని సాటుగా వెళ్ళి జరిగిన విషయము మొత్తం చెప్పింది. నీ భర్తకి ముందే పెళ్ళి అయింది మొదటి భార్య అక్కను నేనే మొదటి బార్యని కూడా ఇలానే బెదిరించి కడుపులో బిడ్డ పుష్టిగా లేదు అని తెలిసి కూడా బిడ్డని కనివ్వమని చెప్పడంతో ఆమే ఆత్మ హత్య చేసుకుంది అని చెప్పి వెళ్తుంది. సర్వజకి ఒక క్షణం ఏమి అర్థం కాదు. వెంటనే వెళ్ళి అత్తని భర్తని ప్రశ్నిస్తుంది. అది నిజం కాదు అని మాటలతో బెదిరించి మాటలు దాటి వెళ్తారు. వెంటనే సర్వజ రూములోకి వెళ్ళి చిన్న వయస్సులో అన్నీ సెకండు హ్యాండు వస్తువులే అనుకున్న కానీ ఇప్పుడు భర్త కూడా సెకండు హ్యాండు అని మరింత భాదతో ఏడుస్తూ రెండు రోజుల పాటు ఏడుస్తూ బయటకు మూడోవ రోజు వచ్చి ఎవ్వరికి తెలియకుండి పుట్టింటికి వెళ్ళిపోతుంది. అక్కడ వాళ్ళు తిడితే అక్క ఇంటికి వెళ్ళింది అక్కడ కూడా అక్క తిట్టి పాపని ఎందుకు వదిలేసి వచ్చావు అని అంటుంది. చివరకు భాద తట్టుకోలేక ఒక లేడీసు హాస్టల్‌లో చేరి అక్కడ వార్డన్‌గా చేరింది, కష్టానష్టాలు తెలిసిన మనిషి కాబట్టి హాస్టల్లో ప్రతి స్త్రీకి ఎటువంటి సమస్య లేకుండా అన్ని సదుపాయాలు కల్పించింది. ధైర్యంగా పోరాటం కొనసాగించింది.

కొన్నాళ్ళు తరువాత ఆడపిల్లలు మీద అత్యాచారాలు వింటన్నప్పుడు తన కూతురు రశ్మిని గుర్తు చేసు కుంటుంది. మనుసు ఉండలేక ఒక రోజు తన భర్త ఇంటికి వెళ్ళి చూస్తే ఎవరో కొత్త మహిళ ఉండటం గమనించి పక్కింటి పరిమళని చూసి ఆతృతగా నా కూతురు ఎక్కడ ఉంది? అంటూ ప్రశ్నలు మీద ప్రశ్నలు వేస్తుంది. ఇంకెక్కడ కూతురు నీ భర్త మరోక పెళ్ళి చేసుకున్నారు. రశ్మిని వికాళాంగుల ఉండే హోమ్‌లో చేర్చి అప్పుడప్పుడు వెళ్ళి చూస్తుంటాడు అని చెప్పడంతో సర్వజ అడ్రస్ తీసుకొని తొందరగా అక్కడ నుండి వచ్చి హాస్టల్‌కు చేరుకొని రశ్మి అని పిలుస్తుంది. ఇంతలో హాస్టల్ గేట్ ముందు పోలీసులు జీబు ఆగి ఒక అబ్బాయిని కొట్టడం గమనించింది. పోలీసు వికలాంగుల హాస్టల్ వార్డన్ పిలిచి అందరు మతిలేని పిల్లలే కదా పైగా ఆడపిల్లలు మీ పనులు కోసం అబ్బాయిల్ని రప్పించిడం వలన ఇదిగో 11 ఏళ్ళ ఈ పాప ఆ అబ్బాయి వలన గర్భవతి అయ్యింది అంటూ అయినా తప్పు పిల్లల్ది కాదు వాళ్ళని కన్న తల్లిదండ్రులిది కని రోడ్డు మీద వదిలేసి వెళ్తారు. నేడు బాలికలు మీద హత్యాచారం జరిగే విషయం అందరికి తెలిసిందే కదా అనగానే సర్వజకి చెంప చెల్లుమని కొట్టినంత పని అయ్యింది.

వెంటనే పోలీసు దగ్గరకు వెళ్ళి జరిగిన విషయం మొత్తం చెప్పి ఏవో కొన్ని ఆదారాలు చూపించింది. రశ్మిని తీస్కెళ్తుంది. తనకి తెలిసిన నర్సు కస్తూరి దగ్గరకు వచ్చి పాపకి మంచి వైద్యం చేపిస్తుంది. నర్సు దగ్గరే పాపని వదిలి చూస్కోమని చెప్పి తన హాస్టల్ బాద్యతల్ని కూడా చూసుకోవాలి కాబట్టి బయల్దుదేరుతుంది. ఇంతలో కస్తూరికి అత్యవసర కేసులు రావడం వలన వెళ్ళాల్సిన అవసరం వచ్చింది. పాపని బద్రపరిచి వెళ్తుంది. ఇంతలో పాప కట్టేసిన తాడులను తెంపుకొని పరెగెత్తి మెట్లు ఎక్కి టెర్రెస్సు మీద ఉన్న వాటర ట్యాంకు మీదకు ఎక్కి క్రింద ఉన్న జనంను చూసి ఉత్సాహంతో దూకేసింది. సర్వజకి విషయం తెలిసి ఆ తరువాత ఏమైందో ఊహించ గలిగింది. మాట రావట్లేదు, భాదతో మౌనంగా ఉండి పోయింది. పోలీసులు చుట్టు ముట్టారు. ఇంతలో సర్వజ పక్కన ఏడుస్తూ ఒక ఆవిడ ఏవండి అంటూ అంత

విన్నాను స్వారీ, అండీ, మీరు ఏమనుకోపోతే నాది ఒక కోరిక మావారు ఆక్సిడెంటుకి గురై గుండే బాగా చెడిపోయిందట, అలాగా అయ్యోపాపం అంది సర్వజ. నాలుగైద ఆపరేషన్లు జరిగితే గాని మావారు బ్రతుకరు అందుకే మీ పాపా గుండే మా వారుకి ఇస్తే బ్రతికించన వాళవుతారు అని కాళ్ళ మీద పడడంతో సర్వజ ఆలస్యం చేయకుండా ఆర్గన్ డొనేషన్ ఫామ్స్ తీసుకొని పూర్తి చేసి డాక్టర్లతో తన అభిప్రాయం చెప్పి రశ్మి అవయవాలను దానం చేస్తుంది. దీని ద్వారా అర్ధమయ్యింది ఏంటంటే పిచ్చిపిల్ల సమాజానికి ఎంత ఉపయోగపడింది . రెండు రోజులో రశ్మి పోటో హాస్పిటల్లో నోటీస్ బోర్డ్‌లో చేరింది. పిచ్చిపిల్ల అని సమాజం పట్టించుకోకపోయిన పిచ్చిపిల్ల సమాజానికి ఎంత ఉపయోగపడింది. మూడు ప్రాణాలు కాపాడింది అంటూ రచయిత్రి మాజేటి జయశ్రీ గారు సర్వజ అనే పాత్ర ద్వారా స్త్రీ తలుచుకుంటే దేన్నైన నడిపించగలదు ఎన్నీ కష్టాలు ఉన్న ఎదుర్కోంటూ నిలబడకలదు. అటు ధైర్యవంతురాలుగా, ఇటు మాతృదేవతగా దర్శినమివ్వగలదు తన బిడ్డ కోసం పడిన తపనని సర్వజ పాత్ర ద్వారా చక్కగా మంచి సందేశాన్ని సమాజానికి అందిస్తుంది. అలాగే సమాజంలో వికలాంగుల పట్ల ఉన్న భావాల్ని తొలింగించాలి అనే ద్యేయంతో రశ్మి అనే పాత్ర ద్వారా కూడా గొప్ప సందేశాన్ని తెలిపారు అని అర్ధమౌవుతుంది. ఈ కథ సారాంశం అంత కూడా స్త్రీ ఔన్నాత్యం ఎంటో గమనిస్తే మహిళలు ఈ సమాజంలో ఎదుర్కోంటున్న ఎన్నో ఒడుదుడుకులును, వివాహ జీవితంలో జరిగే మోసాలను వాటికి పరిష్కార మార్గాలను దృష్టిలో ఉంచుకొని తన దృక్పధ కోణంతో సమాజానికి చక్కటి సందేశం అందించారు.

ఇదే కోవకు చెందిన మరో కథ నాభార్య చనిపోయింది. ఈ కథలో శాంబవి, హహిమ, వౌశాలి, కృష్ణవేని మొదలైన పాత్రలు ఉంటాయి. అయితే శాంభవి, మహిమ, పాత్రలు చాలా కీలకమైనవి. ఈ కథలో ఒక అబద్ధం కొన్నాళ్ళు అయ్యాక నిజం అయ్యే సన్నివేశం ఎదురవటం గమనించదగిని విషయం. మహిమ, శాంబవి ఆరు, ఏడు, నెలలు నుండి గాడ స్నేహంలో ఉన్నారు. శాంభవి భర్త వదిలేసి తన దారి తను చూసుకుంటాడు. దీంతో శాంభవి క్యాట్రింగ్ పనులో చాలా బిసిగా ఇంట్లో తల్లికి, కొడుకుకి ఎలాంటి లోటు లేకుండ చూసుకునేది. మహిమకి ఒక కూతురు వైశాలి. ఒకరోజు శాంబవి మహిమ స్కూల్లో ఎదురయ్యే ఒకరికొకరు స్నేహభావంతో మెలుగుతూ తమ పిల్లలు కూడా స్నేహ భావంతో కలిసిపోయారు. ఒకరోజు మహిమ ఊరుకేళ్తు వైశాలి చూసుకోమని శాంబవకి చెప్పి వెళ్తుంది.

అలాగే తన భర్తకి క్యాట్రింగ్ ద్వారా భోజనం పెట్టమని అడ్వాన్స్ కొంత డబ్బు ఇచ్చి వెళ్తుంది. చెప్పినట్లే శాంబవి సహాయం అందిస్తుంది. తన భర్త ఆ భోజనం ఇంతకు ముందే తిన్నట్లే ఉంది అని ప్రతి సారి గుర్తు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుండేవారు. ఇంతలో శాంబవి కొడుకు చిన్న ఆక్సిడెంటు అవ్వడం వలన మహిమ తన భర్త ఇద్దరు తనని తీసుకొవెళ్ళి హస్పిటల్లో చేరుకుంటారు. శాంబవి రాగానే మహిమ జరిగినవన్నీ చెప్పి ఇంటికి తీసుకెళ్తుంది. మహిమ భర్త పోటో చూడగానే ఆశ్చర్య పడింది. నన్ను వదిలేసి మహిమని రెండో పెళ్ళి చేసుకున్నాడు అని భాదపడి మహిమకి జరిగిన వషయం చెప్పకుండా వెళ్ళిపోతుంది.

ఇలా కొన్నాళ్ళు గడిచిన తరువాత భర్త మీద విరక్తితో ఆర్ధికంగా కష్టపడి పై స్తాయికి ఎదిగింది. సొంత ఇల్లు కూడా కొనింది. క్యాట్రింగ్ కూడా బాగానే రన్ అయ్యింది. ఇలా కొన్నాళ్ళు అయ్యాక పనిలో వేడి ఒత్తుడు వలన శాంబబికి టి.బి. ఉందని డాక్టర్లు చెప్పారు. ఇంకో రెండు నెలలు బ్రతుకుంది అని చెప్పడంతో తల్లి బాధపడు తుంది. ఇంతలో మహిమ కూడా విషయం తెలుసుకొని శాంబవికి సహాయం అందిస్తూ, క్యాట్రింగ్ పనులు కూడా చేస్తుంటుంది. అంతలో ఆరోజు రానే వచ్చింది. సాంభవి నిద్రలోని మరణిస్తుంది. సాంభవి మరణం వార్త వినగానే కొడుకు ఏడుస్తు మహిమకి ఫోన్ చేసి విషయం చెప్తాడు. వేగంగా వచ్చి సాంభవిని హాస్పటల్‌కు తీస్కుళ్తుంది. అటు పిల్లవాడిని ఇట్లు సాంభావి తల్లిని ఓదార్చుతూ తన భర్తకి

జరిగిన విషయం చెప్తుంది. అ సంఘటన స్థలానికి చేరుకొని తనకు ఏం చేయ్యాలో అర్థం కాక ఆ బాధతో గుండెలు భాదుకొని ఏడుస్తుంటాడు, మహిమ తన భర్త ఏడుస్తున్న దృశ్యం చూడగానే అయ్యోమయంలో పడి జరగాల్సిన కార్యక్రమాలు మొదలుపెడుతుంది. ఇంతలో తన కొడుకు ఏడవడం చూసి కొడుకుని హత్తుకుని ఏడుస్తాడు. వెంటనే మహిమ ఏమైంది నువ్వెందుకు ఏడుస్తునావ్ అని అడిగితే.. వెంటనే అవేశంగా భాదతో నిజంగానే నా భార్య ఇప్పుడు చనిపోయింది అని వాపోయాడు. చెప్పిన అబద్ధమే నిజం అయ్యింది అని ఏడుస్తుంటాడు. ఈ విషయం అర్థం చేసుకున్న మహిమ దహన సంస్కారాలకి తన నుండి ఒక రూపాయి కూడా తీసుకోకుండా తానే అన్ని ముందు ఉండి చూస్కుంది.ఈ విధంగా ఈ కథలో శోక సన్నివేశానికి కారణం అయింది. ఈ కథలో ఒక మహిళ పురుషాధిపక్యానికి మోసపోవటం, కష్టపడి కుటుంబాన్ని ముందుకు తీసుకోరావటం, పిల్లల్ని పోషించే విధానం, చివరికి తనని తాను కృసించిపోవటాన్ని రచయిత్రి జయశ్రీ గారు సాంభవి పాత్ర ద్వారా చిత్రించిన తీరు ఎంతో ప్రశంసనీయమైంది. మహిమ లాంటి పాత్ర ద్వారా సహాయం అందటం ఒక స్త్రీకి సగటు స్త్రీ సమాజానికి అందించే విధానం ఈ కథలో పాత్రలకి ప్రాణం పోశారు అని చెప్పవచ్చు. ఈ విధంగా సమాజం వైపు రచయిత్రి ప్రతి మహిళ జీవిత విధానాన్ని తెలియ జేస్తున్నారని అని అర్థమౌవుతుంది.

ఇంకా సంఘ ప్రక్షాళన అనే కథలో కూడా ఎంతో విషాధంగా కనిపిస్తుంది. ఈ కథలో తల్లి చేసిన తప్పుకు కొడుకు తండ్రిని చంపేయడం చివరికి తన కుటుంబం గురించి తెలిసి అసహ్య భావంతో తండ్రిని చంపిన పశ్చాతాపంతో లోకంలో ఎన్నో కోట్ల మంది అక్రమ సంబంధాలలో ఉంటున్నారు. సంఘం, సమాజం పిచ్చిది. అందలోని నీడనిస్తుంది. బియ్యంలో రాళ్ళులాగ అంటూ రచయిత్రి ఈ కథా సారాంశంలో ఆవేశంలో జరిగే ఏ సంఘటన అయిన విషాధానికి దారి తీస్తుంది అని నిజనిజాలు తెలుసుకొని స్త్రీ జీవితాల్ని రక్షించుకోవాలి, సమాజానికి స్త్రీ ఒక ఆదర్శ మూర్తిగా, ఒక సందేశ నాత్మకంగా ఉండాలే గానీ అనర్థాలకి దారితీసేలా కాదు అని ఈ కథ ద్వారా తెలియజేశారు రచయిత్రి మాజేటి జయశ్రీ గారు.

ఇలా అనేక కోణాలతో విధి విజేయం, తాను తీసుకున్న గోతులో, వక్రించిన విధి, మారిన విలువలు, పెద్దింటిలో జరిగిందేమిటి?, కడ దాకా కష్టాలు, ఎదురు చూడని మలుపు, అకారణంగా, అబద్దాలు - ఆనందాలు, ద్వితీయ పర్వం, దూరపు కొండలు, పొగడ్తలు ముంచేనయ్, తెంపినా తెగని బంధం, ఎవరి కర్మకి వాళ్ళే బాధ్యులు అనే కథలలో కూడా కొన్ని స్త్రీల పాత్రలను ఆధారంగా చేసుకొని ప్రతి కథలోను సమాజానికి మంచి సందేశాన్ని అందించారు అని చెప్పవచ్చు.

## ముగింపు :

ఈ విధంగా ప్రతి కథల్లోనూ సమాజానికి ప్రయోజన కరంగా సందేశాల్ని అందించి సమాజంలో స్త్రీ ఏ విధంగా మెలగాలో, రచయిత్రి కొన్ని పాత్రలు ద్వారా తెలియ జేసారు. ప్రస్తుతం సమాజంలో మోసపోతున్న స్త్రీలు ఎందరో ఉన్నారు, కుటుంబం విషయంలో ఎదుర్కొం టున్న సమస్యలను వాటికి పరిష్కార మార్గాలను వెలికి తీస్తూ నేటి కాలంలో స్త్రీలు ఎలా ఉన్నతంగా బ్రతకాలి అనేది రచయిత్రి మాజేటి జయశ్రీ గారు ముఖ్య ఉద్దేశం.

ప్రతి కథల్లోనూ రచయిత్రి దృక్పథ కోణాలు ఎలాంటివో, ఏ కోవకి చెందినవిగా ఉంటాయో ఈ కథలను చదవడం వలన ఒక గొప్ప సందేశాత్మక సన్ని వేశాల్ని పరిచయం చేశారు. ఏదేమైనా రచయిత్రి ఆశించిన స్త్రీ చైతన్యం నవ సమాజానికి ప్రయోజనకరంగా అందాలని ఆశిస్తూన్నాను.

## ఆధార గ్రంథాలు :

1. తెగినవి తెంపబడినవి సత్కథల సంపుటి - డా॥ శ్రీమతి మాజేటి జయశ్రీ
2. చిత్తూరు జిల్లా కథాసాహిత్యం - మహిళ - గోపతి సుభాషిణి

# శతక సాహిత్యం - స్త్రీ

- డా॥. పి. రమాదేవి, సహ ఆచార్యులు, తెలుగుశాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు కొనసాగుతున్న సాహిత్య ప్రక్రియ శతకం. సరళమైనభాష, సామాన్య జనాలకు సైతం అర్థమయ్యే శైలి, భావోన్నతమైన రచనా వ్యక్తీకరణ, ప్రాపంచికానుభవం, శతక సాహిత్యంలో కన్పించే గుణాలు. నూరులేదా నూట ఎనిమిది పద్యాలతో కూడిన సంక్షిప్త రచనను శతకమంటారు. సంస్కృత పాకృతాలలో త్రిశతులు, పంచశతులు, సప్తశతులు, సహస్రాలు కూడా ఉన్నాయి. తెలుగులో వేమనగారు ఈ సంఖ్యానియమాన్ని పాటించకుండా మకుట నియమాన్ని మాత్రమే పాటించి వేలసంఖ్యలో పద్యరచన చేశారు. శతకంలో సంఖ్యా నియమం, మకుట నియమం, వృత్త నియమం, ముక్తక లక్షణం, రసనియమం, ఛందోనియమం, ఆత్మానుభూతి మొదలైన లక్షణాలుంటాయి.

ఏ శతకమైన సమాజహితం కోసం, వ్యక్తిత్వ వికాసం కోసమే రచింపబడుతుంది. కావ్యంలో కంటే శతకంలో కవికి స్వేచ్ఛ ఉంటుంది. ఆత్మావిష్కరణకు అవకాశం ఉంటుంది. సాధారణంగా శతకాలంటే భక్తికి సంబంధించినవని సమాజ చైతన్యానికి, వ్యక్తిత్వ వికాసానికి దోహద పడేవిధంగా వుండవనీ ఒక అపోహ వుంది. శతక సాహిత్యంలో భక్తి శతకాలు అధిక సంఖ్యలో ఉండడమే అందుకు కారణమని చెప్పవచ్చు. అయితే అంత మాత్రానా శతకాలలో ఇతర విషయాలకు ప్రాధాన్యత లేదని అర్థంకాదు.. భక్తితో పాటు అనేక ఇతర విషయాలు కూడా ప్రస్తావించబడ్డాయి. స్త్రీలకు సంబంధించిన అంశాలకు కూడా శతక సాహిత్యంలో ప్రాధాన్యత ఉంది. వేమన, వీరబ్రహ్మం మొదలైన శతక కవుల రచనల్లో స్త్రీ ప్రస్తావన ఉంది. పురుషాధిక్యత గల సమాజంలో స్త్రీకి సమున్నత స్థానం ఇవ్వాలని వేమన, వీరబ్రహ్మం తమ కృతుల ద్వారా సమాజాన్ని ఉత్తేజ పరిచారు.

వేమన శతకాన్ని పరిశీలించినట్లైతే వేమన స్త్రీని ఎంత విమర్శించాడో అంతే గౌరవించాడనే విషయం అర్థమవుతుంది. వేమన అనేక సందర్భాల్లో స్త్రీ ద్వేషిగా కన్పించినప్పటికీ స్త్రీల పట్ల పురుషులు చూపుతున్న వివక్షత సహించలేకపోయాడు.స్త్రీ అంగాంగ వర్ణన చేసే ప్రబంధ సాహిత్యాన్ని విమర్శించాడు. వేమన దృష్టిలో స్త్రీకి ఎంత గౌరవప్రదమైన స్థానం ఉందో తెలుసుకోవడానికి ఈ పద్యమే ఉదాహరణ

"తల్లి నెరుగువాడు దైవంబు ఎరుగును
మన్ను నెరుగువాడు మిన్ను నెరుగు
మన్ను మిన్నెరిగిన తన్ను తానెరుగురా
విశ్వదాభిరామ! వినురవేమ!"

సృష్టిలో ప్రతిజీవికి తల్లే దైవమని మన వేదాలు చెబుతున్నాయి. అదే విషయాన్ని వేమన కూడా నొక్కి చెప్పాడు.

వెలయభూమి తల్లి విత్తనంబు తండ్రి
పంట లరయ సుతులు పాడి పరము
ధర్మమె తనపాలి దైవంబు తలపోయ
విశ్వదాభిరామ! వినురవేమ

మానవునికి భూమి తల్లి. విత్తనం తండ్రి. పంటలు సంతానం, పాడి స్వర్గం. ధర్మం(సత్కార్యాచరణం) దైవ. అంటే ధర్మ స్వరూపమైన దైవాన్ని చేరడానికి మూలం తల్లి అని, స్త్రీకి విశిష్టమైన గౌరవస్థానం కల్పించాడు.

తండ్రి చెప్పిన మాటలువిని తల్లిని సంహరించిన పరశురాముడు నిలువనీడ కూడా లేకుండా అగచాట్లు పడ్డారని చెబుతూ వేమన..

తండ్రి మాటలు విని తల్లిని తెగటార్చి
పరశురాముడేమి ఫలము గనియె
నిలువ నీడలేక మలయాద్రి నుండడా?
విశ్వదాభిరామ! వినురవేమ

అన్నారు. ఒక స్త్రీ కి అందులోను తల్లికి అన్యాయం చేస్తే, బాధపెడితే ఎంత గొప్పవాడికైనా ఆ ఉసురు తగలక తప్పదనే సత్యాన్ని చాటిచెప్పాడు.

గుణవంతురాలు అయిన భార్య, చెప్పిన మాటవినే బుద్ధిమంతులైన పుత్రులు ఉన్న వ్యక్తికి స్వర్గం తన ఇంటిలోనే ఉంటుందనే విషయాన్ని వేమన నొక్కి వక్కాణించారు.

సుగుణవంతురాలు సుదతియై యుండిన
బుద్ధిమంతులగు పుత్రులొప్ప
స్వర్గమేటికయ్య సంపారికింకను
విశ్వదాభిరామ! వినురవేమ

వేమనకు జీవితాంతం భర్తకు తోడునీడగా ఉన్న భార్యకు, డబ్బుకోసం ప్రేమను నటించే వేశ్యకు తేడా బాగా తెలుసు. స్వానుభవంతో తాను తెలుసుకున్న విషయాన్ని తన కవిత్వం ద్వారా తెలిపారు.

అదనెరిగిన మగువ యనువెర్లు చనువెర్లు
మదముతోడ మగని మోహ మెరుగు
విభునిశ్రేష్ఠగుణము వేశ్య తానెర్గునా
విశ్వదాభిరామ! వినురవేమ

వేమనకు స్త్రీల పట్ల అపారమైన గౌరవభావం ఉందని, వేమన స్త్రీ ద్వేషికాదు అనే సత్యాన్ని చాటిచెప్పే పద్యాలు అనేకం ఉన్నాయి. వేమన స్త్రీని ద్వేషించేవాడైతే స్త్రీల గురించి అంత గొప్పగా చెప్పేవారు కాదు.

తన్నుగన్న మట్టి తల్లివంటిది సుమ్మ
అన్యకాంత! న్యాయమరసి చూడ
కన్నదాని జనులు కానంగలేరయా
విశ్వదాభిరామ! వినురవేమ

వేమన రచనలో స్త్రీల పట్ల గౌరవం, ఆధరణ కనిపిస్తాయి. వేమన తన కాలం నాటి సమాజంలో ఉన్న వేశ్యా వ్యవస్థను ద్వేషించాడే కానీ స్త్రీలను కాదు.

తరుణి పుణ్యవతిగ నరుని బట్టియెయగు
పాపియగును మగని బట్టియె ఇల
భర్తవర్తనంబె పడతికి గ్రాహ్యంబు
విశ్వదాభిరామ!వినురవేమ!

స్త్రీకి వివాహమైన తర్వాత ఆమె మంచి పేరు తెచ్చుకున్నా, చెడుపేరు తెచ్చుకున్నా అది భర్త ప్రవర్తన మీద పడి ఆధారపడి ఉంటుందని వేమన అభిప్రాయపడ్డారు.

గుణవతియగు యువతి గృహము చక్కగ నుండు
చీకటింట దివ్వ వెలగు రీతి
దేవియున్న యిల్లు దేవార్చన గృహంబు
విశ్వదాభిరామ! వినురవేమ!

గుణవంతురాలైన స్త్రీ తన కుటుంబాన్ని, తన చట్టూ ఉన్న పరిసరాలను చక్కగా తీర్చిదిద్దుకోగలదు. చీకటిగా ఉన్న ఇంట్లో దీపం వెలిగిస్తే ఆ వెలుగులో ఇల్లాంతా ప్రకాశించినట్లు సుగుణ వంతురాలైన స్త్రీ తన గుణ సంపదతో తన ఇంటిని, తన వారిని చక్కదిద్దుకోగలుగుతుందని వేమన అభిప్రాయం.

మన ప్రాచీన సమాజంలో స్త్రీకి అత్యున్నత స్థానం ఉండేది. కానీ కాలక్రమంలో మానవ విలువలతో పాటు సమాజంలో స్త్రీ విలువ కూడా మారుతూ వచ్చింది. బ్రహ్మంగారి కాలంనాటికి స్త్రీని కేవలం ఒక ఆట బొమ్మగా, విలాస వస్తువుగా చూసేవారు.

వీరబ్రహ్మంగారు స్త్రీ అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి స్త్రీలకు వేదవిద్యను అభ్యసించేహక్కు లేదనే వాదనను తీవ్రంగా ఖండించారు. బ్రహ్మంగారు మొదటిసారి గరిమరెడ్డిఅచ్చమ్మ అనే మహిళకు బ్రహ్మోపదేశం చేశారు.

బ్రహ్మంగారి దృష్టిలో తల్లికి మహోన్నతమైన స్థానం ఉంది. మాతృదేవోభవ అనే సూక్తిని నమ్మిన బ్రహ్మంగారు...

జీవులకును మాతృదేవోభవ యటంచు
శ్రుతులు స్మృతులు పలికె శుద్ధముగను
మాతృమూర్తి మించిన మఱి దైవము లేదు
కాళికాంబ!హంస!కాళికాంబ!

అని తల్లిని మించిన దైవం లేదన్నారు.

స్త్రీ శక్తి స్వరూపిణిగా పురుషుని చైతన్యస్వరూపిడిగా భావించారు. వీరి కలయిక సృష్టికి మూలం. ఈ విషయాన్ని బ్రహ్మంగారు "శివుడు శక్తిగూడి సృష్టి కార్యమొనర్చు

శివను వీడ సృష్టి చేయలేడు
శివునికంటే శివయె సృష్టికి మూలమ్ము
కాళికాంబ!హంస!కాళికాంబ!

అనే పద్యంలో చక్కగా వివరించారు. శివ అంటే పార్వతిదేవి, శివన వీడి చైతన్య రూపుడైన శివుడు సృష్టి చేయలేడు. అందువల్ల శివునికంటే పార్వతిదేవి సృష్టికి మూలం అని చెప్పి స్త్రీ ఔన్నత్యాన్ని చాటిచెప్పారు.

ఈ ప్రపంచంలో ఎవ్వరిప్రేమలోనైనా స్వచ్ఛత లేకపోవచ్చు కానీ తల్లి ప్రేమలో మాత్రం ఏ కల్మష ముండదు. ఈ విషయాన్ని బ్రహ్మంగారు

తల్లిప్రేమలోన తుగులదు మాలిన్య
మెల్ల భంగులను సహించుకొనును
తల్లిపదము విన్న నుల్లంబు రంజిల్లు
కాళికాంబ!హంస!కాళికాంబ!

అనే పద్యంలో తల్లి నిష్కళంక ప్రేమను విశిష్టమైన రీతిలోతెలిపారు. అంతేకాదు ఈ ప్రపంచంలో మనం పొందే ఏ ప్రేమైనా కలుషితం కావచ్చేమో కానీ తల్లి ప్రేమలో మాత్రం ఏ కాలుష్యం ఉండదని, తల్లి ప్రేమ స్వచ్ఛమైనదని వీరబ్రహ్మంగారి అభిప్రాయం.

తల్లిదండ్రి గురుడు దైవమ్ములందున
తల్లి పూజ ముఖ్యమెల్లరకును
సృష్టి కంతటికిని స్త్రీ ప్రధానము గదా
కాళికాంబ! హంస! కాళికాంబ!

అనే పద్యంలో మాతృదేవోభవ! పితృదేవోభవ! అంటూ మనపెద్దలు మొట్టమొదట తల్లికే ప్రాధాన్యత ఇచ్చారు. వీరబ్రహ్మంగారు కూడా తల్లితండ్రి, గురువు, దైవాలలో తల్లికే మొదట ప్రాధాన్యమిచ్చి ఈ సృష్టికంతటికీ స్త్రీయే ముఖ్యమని స్త్రీ ప్రాధాన్యతను తెలిపారు.

మాతృపూజ చేయు మగవారి కెల్లను
అన్యకాంత తల్లియట్లతోచు
ఎఱుక మఱచువాడు నరకమ్ము పాలేను
కాళికాంబ!హంస!కాళికాంబ!

అంటూ తల్లిని పూజించేవారికి పరస్త్రీ కూడా తల్లి లాగానే కనపడుతుంది. అనే సత్యాన్ని తెలియజేశారు. ఆటవిక దశగా చెప్పుకుంటున్న వేదకాలాన్ని పూర్వదశలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది. ఋగ్వేదకాలంలో కూడా స్త్రీ పురుషులకు సమానాధికారులుండేవి. బ్రహ్మచర్యాశ్రమం ద్వారా శిక్షణ పొందడం, వేదాధ్యాయనం చేయడం, వైద్య, విజ్ఞాన రంగాల్లో ప్రముఖపాత్ర వహించడం సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే పనులు చేయడం ద్వారా స్త్రీలు పురుషులతో సమానంగా గౌరవింపబడ్డారు. అయితే కాలక్రమంలో స్త్రీ పురుష సంబంధంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.

స్త్రీలను వేదవిద్యకే కాదు మామూలు చదువుకు కూడా దూరం చేశారు. ఈ పరిస్థితిని గమనించిన బ్రహ్మంగారు

వెలదులకును వేద విద్యాధికారమ్ము
లేదటంచు బ్రహ్మ లిఖితమంచు
నోరు తెఱచి మరచినారు వాణిని నిన్ను
కాళికాంబ! హంస! కాళికాంబ! అని ప్రబోధించారు.

స్త్రీలకు వేదవిద్యాధికారం లేదనే వారికి ఓ చురక అంటించాడు. సకల విద్యలకు కారణభూతరాలు స్త్రీయే నని బ్రహ్మంగారు

"సకల విద్యలకును సాక్షి కామాక్షియౌ
మోక్షమునకు సాక్షి ముక్తి కాంత
పుట్టు గిట్టుటలకు భూ దేవతకు సాక్షి
కాళికాంబ!హంస!కాళికాంబ" అన్నారు.

విద్యలకు కారకురాలు కామాక్షీదేవి. అదేవిధంగా మోక్షాన్ని ప్రసాదించే ముక్తికాంత కూడా కామాక్షి. జనన మరణాలకు సాక్షిభూదేవి. వీటన్నిటిని ప్రసాదించేది స్త్రీలేనని బ్రహ్మంగారి అభిప్రాయం.

కడప జిల్లాకు చెందిన జాగరగల్లు సుబ్బరాయుడు 'అమ్మపలుకు శతకం' అనే శతకం రచించాడు. అందులో భార్యను అనుమానించే భర్త ఆ అనుమానపు జబ్బుతోనే కృశించిపోతాడనే విషయాన్ని తెలిపారు.

ఆలి మీదనెప్పుడనుమాన పడువాడు
చింతతోడ జచ్చునంతె కాని
ఆడదాని బట్ట నాబ్రహ్మవరమౌనె?
ఆలకింపుమన్న అమ్మపలుకు

కడప జిల్లా మలినేనిపట్నం గ్రామానిని చెందిన తెలుగు పండిట్ వల్లూరు చిన్నయ్యగారు 'సిద్ధగురుడ'అనే మకుటంతో శతకాన్ని రచించారు. ఇందులో బ్రహ్మంగారి శిష్యుడైన సిద్ధయ్య గొప్పతనాన్ని వర్ణించడమే అనేక సామాజిక రకాలను కూడా ప్రస్తావించారు. తల్లి తన బిడ్డల్ని నవమాసాలు మోసి కని పెంచి పెద్ద చేస్తుంది.కానీ బిడ్డలకు మాత్రం వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు భారం అనిపిస్తారు. నేటి సమాజంలో బిడ్డల ఆధరణకు నోచుకోని తల్లులెందరో ఆ విషయాన్నే చిన్నయ్య గారు

తల్లి పంచుప్రేమ- పిల్లలనందరి
నైన నోర్పుతోడ- అవని జూడ
తల్లిగోడు బాపు తనయులే లేరైరి
సిరుల కాశపడని సిద్ధగురుడ.

అనేక మంది శతకకారులు స్త్రీల గురించి, స్త్రీకి ఉన్న ప్రాధాన్యత గురించి, స్త్రీలకు ఒకప్పుడు సమాజంలో ఉన్న గౌరవస్థానం గురించి అనేక విషయాలు తెలిపారు. అంతేకాక ఈసృష్టికి మూలం స్త్రీ అనే సత్యాన్ని కూడా చాటి చెప్పారు.

**ఆధార గ్రంథాలు:**

1. ప్రజాకవి వేమన- మరుపూరు వేమన
2. లోకకవి వేమన- కోదండరామిరెడ్డి
3. వేమన- నార్ల వెంకటేశ్వరరావు
4. వేమన - రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
5. పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితం-రచనల పరిశీలన-కన్నెగంటి రాజమల్లాచారి
6. కాళికాంబసప్తశతి- పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి(పరిష్కర్త:కొండవీటి వేంకటకవి)
7. వీర కాళికాంబశతకం- పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి(పరిష్కర్త: వి.వి.ఎల్ నరసింహరావు)
8. సంప్రదాయ సాహిత్యం-స్త్రీవాద సాహిత్యం- కాత్యాయినీ విద్మహే
9. అమ్మపలుకు శతకం- జాగరగల్లు సుబ్బరాయుడు
10. సుజన శతకం- హనుమంతరావు
11. మిత్రశతకం - పెద్దనేలటూరి మునెప్ప
12. సంఘజీవి శతకం- సవ్వప్పగారి ఈరన్న
13. తెలుగుబిడ్డ శతకం- పి. ఈశ్వరరెడ్డి
14. శ్రీరాణి శతకం- సుబ్బరాజు
15. సిద్ధగురుడ శతకం- వల్లూరు చిన్నయ్య

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# గురజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' నాటకం - మధురవాణి పాత్రచిత్రణ

- డా॥. బి. సరస్వతి
తెలుగు అధ్యాపకురాలు, గవర్నమెంట్ డిగ్రీకళాశాల,
చింతలపూడి, పశ్చిమగోదావరి జిల్లా.

- డా॥. జి. శ్రీనివాస్
తెలుగు శాఖాధిపతి, గవర్నమెంట్ డిగ్రీకళాశాల,
చింతలపూడి, పశ్చిమగోదావరి జిల్లా.

మహాకవి గురజాడ అప్పారావు సృష్టించిన అపూర్వ కళాఖండం "కన్యాశుల్కం". ఈ నాటకంలోని పాత్రలు వాస్తవపాత్రలుగా వెలుగొందుతాయి. "మధురవాణి - గిరీశం" అనే రెండు పాత్రలు ఆంధ్రపాఠకుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. మధురవాణి పాత్ర అపూర్వమైనది: ఉదాత్తమైనది. ప్రతిభావంతుడయిన గురజాడ మహాకవి సానబట్టిన వజ్రం మధురవాణి పాత్ర! కన్యాశుల్కంలోని ముఖ్యపాత్రలన్నీ మధురవాణి చుట్టూ తిరుగుతాయి. మధురవాణి చాలా చిత్రమైన మంచి మనిషి! ఆమె వేశ్యగా పుట్టినా చిన్నప్పుడు ఆమె తల్లి చేసిన ఉపదేశము వలన ఆమె వేశ్యగా నిజాయితీగల వ్యక్తిగా జీవితం కొనసాగించినది. "చెడని వారిని చెడగొట్టవద్దు!" అని తల్లి చేసిన ఉపదేశం వలన నీతి, నిజాయితీగల వ్యక్తిగా జీవితం కొనసాగించినది. "చెడని వారిని చెడగొట్టవద్దు!" అని తల్లి చేసిన ఉపదేశం మధురవాణికి శిరోధార్యం. ఇక గురజాడ వారు సృష్టించిన మధురవాణి పాత్రను గురించి తెలిసికొందాం.

"మధురవాణి" - ఒక అపూర్వమైన సృష్టి! ఆమె పాత్ర చాలా విలక్షణమైనది. మధురవాణి సానులలో సంసారి! ఆమె సహజ సుందరి! పూజారికి ఆమె పుత్తడిబొమ్మ! కరటకశాస్త్రికి ఆమె త్రిలోక సుందరి, మధురవాణి సంగీతంలోను, సాహిత్యంలోను ఆరితేరినది; వృత్తిలో అందెవేసిన చేయి. కరటకశాస్త్రి దగ్గర సంస్కృతం నేర్చుకొంది. గిరీశం దగ్గర ఇంగ్లీషు నేర్చుకుంది. 'మృచ్ఛ కటిక'లోని 'వసంతసేన' జీవితాన్ని బాగా జీర్ణించుకొన్న వేశ్య మధురవాణి. ఆమె వీణ వాయించడంలో నేర్పరి. కాని "డబ్బులేని విద్య దారిద్ర్య హేతువు" అని వీణను అటు పెట్టినది. రామప్పంతులు మాయలోపడి మధుర వాణి విజయనగరం నుండి రామచంద్రపురం చేరుకొంది. మధురవాణి పాత్రను పోషించడంలో గురజాడ ప్రదర్శిం చిన నైపుణ్యం ప్రశంసనీయమైనది.

మధురవాణి గిరీశం కోతలను నమ్మిన అమాయకు రాలు! "నేనేదో ఉద్యోగాలూ ఊళ్లూ ఏలి తనతో వైభవం వెలిగిస్తాననే నమ్మకంతో ఉంది" అని గిరీశం పలికిన పలుకులు ఇందుకు నిదర్శనం! గిరీశం నటన ఎంతో కాలం మధురవాణి కళ్ళు కప్పలేదు. అన్ని వృత్తులవలెనే వేశ్యావృత్తికి కూడా నీతి ఉండాలని నమ్మిన స్త్రీ మధురవాణి. "మగవాడికైనా, ఆడదానికైనా నీతి ఉం డాలి" - అంటూ రామప్పంతులుతో వెళ్ళిపోడానికి నిశ్చయమైనా, గిరీశంతో తెగతెంపులు చేసికొనేంత వరకు రామప్పంతులును తాకవద్దని చెబుతుంది. మధురవాణి డబ్బు కక్కుర్తి మనిషి కాదు. మొదటి అంకంలో రామప్పంతులు అప్పులు తీర్చుకొనుటకు డబ్బు ఇచ్చి, ఆమె చేయి పట్టుకొనినపుడు ఆ డబ్బు పడేసి "నేను డబ్బు కక్కుర్తి మనిషిని కాదు" అని మధురవాణి పలుకుతుంది. మూడవ అంకంలో రామప్పంతులుతోనే "యేం చిత్రంగా మాట్లాడుతారు పంతులుగారూ - నాకు డబ్బు గడ్డిపరక అని యెంచండి" అని మధురవాణి స్పష్టంగా చెప్పింది. ఆరవ అంకంలో కంటెను కరటకశాస్త్రిని రక్షించుటకు ఇచ్చివేసింది.

చేజిక్కిన వారి గౌరవాన్ని కాపాడటం మధురవాణిలోని మరొక సుగుణం! ఈ గుణం ప్రథమాకంలోనే స్పష్టమవుతుంది. గిరీశానికి పూటకూళ్లమ్మతో సంబంధం ఉన్నట్లు రామప్పంతులు మధురవాణిలో చెప్పాడు. కాని మధురవాణి ఆ విషయం తనకు తెలిసినట్లు గిరీశంతో చెప్పదు. రామప్పంతులు మంచం క్రింద దాక్కొన్న విషయం గిరీశానికి చెప్పటకు మూడు అవకాశాలు దొరికినా చెప్పకుండ మాట మారుస్తుంది. ఏడవ అంకంలో కరటకశాస్త్రి వ్యూహాన్ని గిరీశం మోసాన్ని సౌజన్యారావు పంతులు ఎదుట బయటపెట్టుటకు మధురవాణి చాలా యాతన పడుతుంది.

వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పట్టుదలను ఎటువంటి సందర్భంలోనైనా కోల్పోని స్త్రీ మధురవాణి. నాటక క్రమ పరిణామంలో మధురవాణి సుగుణాలు మనకు స్పష్టంగా తెలుస్తాయి. ప్రథమాంకంలోనే గిరీశంతో తెగతెంపులు చేసికొంటుంది. గిరీశం మధురవాణి భుజం మీద తట్ట బోతాడు. అప్పుడు మధురవాణి "ముట్టబోకండి!" అని తప్పించుకొంటుంది. "అదేమిటి ఆ వికారం" అని గిరీశం అడిగినప్పుడు "ఆఖరు వికారం" అని విసరికొడుతుంది. అదే వారి ఆఖరి కలయిక. తిరిగి వీరిద్దరి కలయిక ఏడవ అంకంలో సౌజన్యారావు పంతులుగారి సమక్షంలోనే జరుగుతుంది.

అగ్నిహోత్రావధానుల చిన్న కూతురు సుబ్బికి లుబ్ధావధానుకు పెళ్లి కుదిర్చినందులకు మధురవాణి రామప్పంతులను మందలిస్తుంది లుబ్ధావధానుల పెళ్ళి తప్పించే వరకు తనను తాక కూడదని ఖచ్చితంగా చెప్పింది. ఈ విషయంలో పరోపకారం చేయుటకు సంకల్పించిన స్వచ్ఛమైన మనస్సుగల స్త్రీగా దర్శన మిస్తుంది. మధురవాణి. సుబ్బి పెళ్ళి తప్పించుటకు పన్నిన వ్యూహం కరకటశాస్త్రి గారిదే అయినను దానిని అమలు పరచుటలోని చాతుర్యం మధురవాణిదే!

మధురవాణి సుబ్బి పెళ్లి తప్పించుటకు అన్ని విధాలుగా సహాయపడతానని కరటక శాస్త్రికి మాట ఇస్తుంది. మధురవాణి ఆ ప్రయత్నంలోనే ఇంటికి వచ్చిన రామప్పంతులుతో నంతనడవిడిని, ప్రత్యేకకాభినయాన్ని ప్రారంభిస్తుంది. జవానుకు ఇచ్చుటకు డబ్బు అడిగిన రామప్పంతులతో తన దగ్గర డబ్బు లేదని పట్టణంలో తల్లికి పంపించి వేశానని అబ్బద్ధం చెబుతుంది. జవాను డబ్బు కొరకు దబాయించినపుడు మెడలోని "కంటె" తీసి ఇచ్చును. ఇంతలో అక్కడనే ఉన్న కరటకశాస్త్రి డబ్బు సర్దుబాటు చేసి పాచిక వేస్తాడు. దీంతో రామప్పంతులు సంతోషపడి కటరకశాస్త్రిని ఆప్యాయంగా పరామర్శిస్తాడు. ఈ విధంగా మధురవాణి తన ప్రవర్తన ద్వారా రామప్పంతులుకి కరటకశాస్త్రి పనిమీద ఆసక్తి కలుగేట్లు చేసినది.

సుబ్బి పెళ్ళి తప్పించుటకు రామప్పంతులు తనంతటతానే పూనుకొనేట్లు చేసినది మధురవాణి. ఈ విషయం నాలుగవ అంకంలో తేట తెల్లమవుతుంది. గిరీశం లుబ్ధావధానుల తమ్ముడు. కావున పెళ్లికి తప్ప కుండ వస్తాడని, వచ్చి రామప్పంతులను తన్నుని, తనకు అది విచారమని మధురవాణి అంటుంది. ఈ మాటల వలన పెళ్లి తప్పించుట వలన తనకు మేలు జరుగునని రామప్పంతులు అనుంటాడు. అందుకే పెళ్లి తప్పి పోవుటకు ఒక తంత్రం పన్ని అగ్నిహోత్రావధానులు రాసినట్లుగా లుబ్ధావధానులకు "మీరు ముసలి వారు. మీకు మా పిల్లను ఇవ్వదలచుకొనలేదు" అని ఉత్తరం రాస్తాడు. ఇది పెళ్ళి తప్పింపోవడానికి మార్గం సుగమం చేస్తుంది. మధురవాణి తన తెలివితేటలతో రామప్పం తుల్ని తన పథకానికి ఉపయోగపడేలా చేసుకోగలిగింది అదే ఆమె విశిష్టత!

మధురవాణి బాల్య వివాహాన్ని తప్పించుటయే కాదు, వితంతు వివాహాన్ని కూడా సమర్ధించే ప్రయత్నం చేయడం గమనార్హం. రామప్పంతులుకి ఇచ్చిన 'కంటె'ను కరటక శాస్త్రి శిష్యుని ద్వారా తెప్పించుకొనును. కాని మరల తన కంటెను తెమ్మని రామప్పంతులను వేధిస్తుంది. కంటె కొరకు లుబ్ధావధానుల ఇంటికి వెళ్ళిన రామప్పంతుల్ని

తనను పెళ్లి చేసికొనమని వెంటబడింది మీనాక్షి. రామప్పంతులు పరుగెత్తుకొని ఇంటికి వస్తాడు. మధురవాణి తన "కంటె" తెచ్చి ఇచ్చువరకు తలుపు తీయనని పట్టుపట్టింది. ఇంతలో లుబ్ధావధానుల కూతురు మీనాక్షి వచ్చి రామప్పంతులు చేయిపట్టు కొనినది. రామప్పంతులు విదిలించి వేస్తాడు. మీనాక్షి కిందపడుతుంది. మధురవాణి రామప్పంతులను తీవ్రంగా మందలిస్తుంది. "ఆడదాని మీదనా చేయి చేసు కుంటారు? ఏమి పౌరుషం? అబద్ధమాడక అన్నమాట నిలబెట్టుకొండి, ఏం కులం తక్కువా? రూపం తక్కువా? ఆమె బ్రతుకు భ్రష్టు చెయ్యనే చేశారు. పెళ్ళాడి వొస్తినే నేను తలుపు తీస్తాను" అని మధురవాణి పలికినది. దీన్ని బట్టి మధురవాణిలోని అసలైన స్వరూపం దర్శనమిస్తుంది. వితంతు పునర్వివాహాల పట్ల ఆమెకు ఉన్న భావన అర్థమవుతుంది.

ఈ విధంగా గురజాడ అప్పారావు గారు కన్యా శుల్కంలో "మధురవాణి" పాత్రను అపూర్వంగా చిత్రించారు.

❀❀❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కార్యనిర్వహణాధికారిగా మార్గదర్శకత్వం వహించగల స్త్రీ మూర్తి తార

- డా॥. గోపవరం పద్మప్రియ, తెలుగు అధ్యాపకురాలు, పి.ఆర్.ఆర్. & వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
విడవలూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

కూజంతం రామ రామేతి మధురం మదురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖం వందే వాల్మీకి కోకిలం.

వాల్మీకి రామాయణం విశ్వజనీనమైన కావ్యం. ఈ గ్రంథం భారతీయ సంస్కృతినీ, సమగ్ర మానవ జీవన విధానాన్నీ శ్రీరామ చరితం ద్వారా అత్యంత సుందరంగా ఆవిష్కరించింది. దేశ విదేశాల్లో దీనికి కల జనాదరణ అనన్య సామాన్యం. యుగాలు గడిచినా, తరాలు, అభిరుచులు మారినా పాఠకుల్లో రామాయణం పట్ల మక్కువ ఏమాత్రం చెక్కుచెదరలేదు. వివిధ భాషల్లోనూ, విశేషించి తెలుగులోను నేటికి రామాయణం ఆధారంగా అనేక ప్రక్రియలు వెలువడుతున్నాయి. దీనికి కారణం ఆ రచనలో లోకోత్తరమైన శైలి ఉంది. శబ్దాల పోహళింపులో పాఠకుణ్ణి మైమరపించే సొగసు ఉంది. పాత్ర చిత్రణలో అంతులేని సొగసు, నిబద్ధత, ఏకాగ్రత కన్పిస్తుంది.

రామాయణంలోని స్త్రీ పాత్రలన్ని పరిశీలిస్తే అందరి లోను వివేకం, విజ్ఞత, సహనం, భావోద్వేగం, సమయ స్ఫూర్తిలో నేటి నారీలోకానికి, సమాజానికి మార్గదర్శకంగా లభిస్తాయి. ఈ లక్షణాలతో పాటు రామాయణంలోని వాలి భార్య కార్యనిర్వహణాధ్యక్షురాలిగా కూడా కన్పిస్తుంది. తార పాత్ర చిత్రణలో మరో ప్రత్యేకత ఉంది. ఈమె మాటల ద్వారా చేతల ద్వారా ఆమె మనస్తత్వం, వ్యక్తిత్వం ప్రస్ఫుటం కావడం సహజమే. అంతకు మించి ఇతరులు ఆమె గురించి మాట్లాడే విధానం ఆమె వ్యక్తిత్వ విశిష్ఠతను బోధపరుస్తుంది.

వాలి సుగ్రీవుల కథ అందరకు విదితమే. వీరి కథలో 'తార' కీలక పాత్ర పోషిస్తుంది. వాలిని సుగ్రీవుడు యుద్ధానికి ఆహ్వానించినపుడు ఆమె ఎంతో ముందు చూపును బంధుజనం పట్ల అభిమానాన్ని ప్రదర్శిస్తుంది. వాలిని "నీ బలం లోకానికతంకూ తెలుసు. నీకు శత్రువులు ఎవరూ లేరు. నిన్ను యుద్ధానికి రమ్మని రెచ్చగొడుతున్నవాడు సుగ్రీవుడే..... నిన్ను గెలవడం సాధ్యం కాదని తెలిసే యుద్ధానికి పిలిచాడు. నీ చేతిలో చావు దెబ్బలు తిని పారిపోయాడు. అటువంటి వాడు మళ్ళీ యుద్ధానికి వచ్చాడంటే అనుమానించాలి. అతని కంఠ ధ్వనిలో ధైర్యం, గెలుస్తాననే నమ్మకం ఉన్నాయి. అతడు తన బలాన్ని నమ్ముకుని ఎదుర్కొనేందుకు రాలేదు. వేరొకరి సహాయాన్ని నమ్ముకుని ఇలా వచ్చాడు కుమారుడు అంగదుడు గూఢాచారుల వల్ల విన్న మాటలు నాకు చెప్పాడు. ఇక్ష్వాకు వంశీయులు ఈ అడవిలో నీ తమ్ముడిని వెదుక్కుంటూ వచ్చారని, వారిని జయించడం ఎవరివల్ల గాదని చెప్పాడు".అని హితవు చెప్పింది. తన మాటను త్రోసిపుచ్చుతాడని తనవి ఊహకాదని గూఢాచారుల వల్ల తెలుసుకున్న విషయాన్ని వివరిస్తున్నానని తెలిపింది. రాజ్యపాలనలో ఎప్పటికప్పుడు రాజ్యం చుట్టు ప్రక్కలు ఏమి జరుగుతుందో తెలుసుకోవడం ఒక వీరుని భార్యకు ఉండాల్సిన ముఖ్య లక్షణం ఇక్కడ కన్పిస్తుంది.

అదే సమయంలో కుంటబ క్షేమాన్ని, దాని పట్ల గల ప్రేమను, బంధుజనుల మధ్య ఉండాల్సిన బాంధవ్యాల్ని వ్యక్తం చేస్తుంది.

సుగ్రీవో విపులగ్రీవో మహోబన్ధుర్మతస్తవ
భ్రాతృ సౌహృదయాలమ్బనాన్యా గతిరిహాస్తి తే.

(నీకు సుగ్రీవుడి కంటే గొప్ప బంధువుల వేరొకడు లేడు. అతడి పట్ల సోదరి ప్రేమ చూపించు అతణ్ణి సుఖపడనీ, నువ్వు క్షేమంగా ఉండు. ప్రస్తుతం అంతకు మించి నీకు వేరొక మార్గం లేదు)

యది తే మత్రియం కార్యం యది చావైషి మాం హితామ్
యాచ్యమాన: ప్రియత్వేన సాధు వాక్యం కురుష్వమే.

నువ్వునాకు ప్రాణాధికుడైన ప్రియుడివి నాకు నీక్షేమం కావాలి. అందుకే ప్రార్థిస్తున్నాను. నేను చెప్తున్న హిత వాక్యం విను. నా మాటలు విని కోపగించుకోకు. రామిడితో విరోధం రాకుడా జాగ్రత్తపడు.ఇలా తన దగ్గర గల అన్ని మార్గాల్లో భర్తకు హితువు చెప్పింది. గూఢాచారుల వల్ల తెలిసింది చెప్పింది. బంధువుల పట్ల ఉండాల్సిన అభి మానాన్ని వివరించింది. చివరకు ప్రియమైన భార్య మాటైనా వింటాడేమోనని ప్రేమతో తన మాటను వెలిబుచ్చింది.

కాని వాలి ఆమె మాటల్లోని లోతును పరిశీలించ కుండా స్త్రీ భావనతో ఒక చులకనను మనసు నందుంచు కుని "నీ హృదయం దర్శితా తావన్మయి భక్తి స్వయాకృతా" (నా పట్ల నీకున్న ప్రేమ వలన భక్తి వల మాట్లాడావు) ఇక చాలు మిగిలిన స్త్రీలతో వెనక్కు అంతఃపురంలోకి వెళ్ళమని శాసిస్తాడు.

సమర్థుల మాటను పాటించకపోతే కలిగే నష్టమే ఇక్కడ కల్గింది. వాలి మరణ వార్తవిని విలపిస్తుంది.

సుగ్రీవస్య త్వయాభార్యా హృతా సచ వివాసితః
యత్తత్తస్య త్వయా పుష్టిః ప్రాప్తేయం ప్లవగాధిప.

(వానర రాజ! సుగ్రీవుడిని రాజ్యం నుంచి వెళ్ళగొట్టావు. అతడి భార్యను అపహరించావు. దానికి ఫలితంగానే ఇంత ఆపద వచ్చింది. నీ క్షేమంకోరి చెప్పిన మాటలు తృణీకరించి వచ్చి యీ స్థితిలో పడ్డావు.

ధర్మాన్ని పాటించకపోతే, అహంకారం వదలకపోతే ఒక్కోసారి మరణాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుందని ఆమె ధర్మ విలాపమే గుర్తు చేస్తుంది.

విలపిస్తున్న తారతో హనుమంతుడు "సుగ్రీవుడు, అంగదుడూ దుఃఖంతో దిక్కుతోచకుండా వున్నారు. ఇప్పుడు అంగదుడికి యౌవనంగా జ్యాభిషేకం చేయాలి. సింహాసనం మీద కూర్చున్నా అంగదుడిని చూస్తే నీ దుఃఖం కొంత ఉపశమిస్తుంది. అనడంతో వానర రాజ్య క్షేమం కూడా ఆమె మీద ఆధారపడ్డట్టు చెప్తున్నాడు. ఆమె లేకపోతే, ఆమె కుటుంబ సారధ్యం వహించకపోతే సుగ్రీవుడు, అంగదుడు దిక్కుతోచని వారవుతారని చెప్పడంలో ఆమె ఉనికి ఆ కుటుంబానికి, రాజ్యానికి ఎంత క్షేమమే అర్థమవుతుంది. ఒక ఒక సమర్థవంతు రాలైన స్త్రీకి ప్రతీకగా ఇక్కడ హనుమంతుడు ఆమెను చిత్రీకరించాడు.

ఆమె సామర్థ్యాన్ని కూడా వాలి చనిపోతూ సుగ్రీవుడికి వివరిస్తాడు. ఆమె సలహా రాజ్యపాలనకు ఎంతో విలువై నదని వివరిస్తాడు. ఎప్పుడూ ఆమె మాటను తృణీకరించ వద్దని ఇలా సలహా ఇస్తాడు. "తార సుషేణుడి కూతురు. ఈమె అతి సుక్ష్మమైన విషయాలను గురించి చాలా చక్కగా ఆలోచించే శక్తి గలది. హఠాత్తుగా వచ్చిపడే పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో నిర్ణయించగల సమర్థురాలు. ఈ పని మంచిది అని యీమె నిర్ణయిస్తే మరో ఆలోచన లేకుండా ఆ పని చెయ్యవచ్చు. ఆమె అభిప్రాయం ఎప్పుడూ సరైనది. అది మారదు" అని తన అనుభవం ద్వారా ఆమె దక్షతను వివరించాడు.

"నాథా! నేను చెప్పిన మాట విని అంతఃపురంలో సుఖంగా ఉండవలిసిన వాడిని నా మాట వినకక ఇలా ఎగుడు దిగుడు నేలపై రాళ్లమీద పడి ఉన్నావా! ...." ఇలా స్త్రీకి సహజమైన శోకాన్ని ప్రదర్శిస్తూ రాముడితో తనను హత్య చేయమంటుంది. స్త్రీకి గల సహజ భావోద్వేగాలలోను తన మాట వినలేదని బాధ కన్పిస్తుంది. భర్త మొండితనానికి, అహంకారాటకి బలైన స్త్రీగా మిగులుతుంది.

రాముడికిచ్చిన మాటను మరచి కిష్కందలో సుగ్రీవుడు చాలాకాలానికి మళ్ళీ దొరికిన రాజభోగాలను తృప్తిగా అనుభవిస్తున్నాడు. తన భార్య రుమ, సౌందర్యవతి తార లభించడంతో రాజ్య భారమంతా మంత్రులకు వదిలేసి స్త్రీలతో ఏకాంతంగా గడుపుతువ్నడు. మంత్రులకు ధర్శనాన్ని కూడా నిరాకరిస్తున్నాడు. ఒకరోజు హను

మంతుడు రాముని గడువును గుర్తుచేసాడు. అన్ని దిక్కులలోని వానరసైన్యాలను వెంటనే కిష్కింధకు చేరమని ఆజ్ఞాపించు అని చెప్పి అంతఃపురంలోకి పోయాడు. ఇక ఆ విషయాన్ని వదిలేసిన సుగ్రీవుడి చర్యకు రాముడు వేదన చెంది కోపాన్ని ప్రదర్శించగా లక్ష్మణుడు కోపోద్రేకంతో కిష్కింధకు బయలు దేరాడు. రాజ్యంలో లక్ష్మణుడు ప్రవేశించిన విషయం తెలుసుకున్న సుగ్రీవుడు భయపడి అతనిని ఎదర్కోవడానికి తారనే పంపుతాడు.

ఇక్కడే అర్ధమతుతుంది. మనకు రాజ్యాంలో మంత్రులు, ఇతర సేనాధిపతులు, పరిపాలనాధిపతులు ఇంతమంది ఉండగా ఒక స్త్రీని లక్ష్మణుడిముందుకు పంపడంతో ఆమె వాక్చాతుర్య సామర్థ్యం, కార్యనిర్వహణ సమర్థత ఎంతటివో చెప్పకనే చెప్తాయి. అతని నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అంతే సమర్థతతో లక్ష్మణుడిని ఆహ్వానించి ఎదుర్కొని నిలబడి శాంతపరుస్తుంది. ఆమె మాటల్లోనే ఆమె ఎంత సూక్ష్మ పరిశీలనా శక్తి, లోకజ్ఞానం కలదో మనకు అర్థమవుతుంది.

సుగ్రీవుడి పొరబాటును అంగీకరిస్తూనే లక్ష్మణుడికి కోపం తగదనే హితువును, స్వాంతన వచనాన్ని పలుకుతుంది. రాకుమారా! నువ్వు గొప్పవీరుడివి. మీరు సాధించాలనుకుంటున్న మహాకార్యంలో స్వజనుల మీదనే కోపం తెచ్చుకుంటే ఎలా? సుగ్రీవుడు చేసింది పొరబాటే అయితే దానిని అర్థం చేసుకొని ఔదార్యంతో క్షమించాలి. మీ వంటి వారు కూడా కోపానికి వశమైతే ఎలా? అని సంభాషిస్తుంది. ఎంత భోగలాలసతలో ఉన్న మీ కార్య సాధనకు అవసమరైన ప్రయత్నాలను ఇంతకముందే ఆరంభించాడనీ వివరిస్తుంది. సుగ్రీవుని కామంపట్ల లక్ష్మణుడికి ఏహ్యం కల్గుతుందేమోననే భావంతో విశ్వామిత్రుడిని గుర్తు చేస్తుంది. మేనకతో పదేళ్ళు సంసార సుఖాన్ని అనుభవించి ఒక్క రోజుగానే భావించాడు. అంతటి మహాత్ముడికే ఆ స్థితి కల్గితే వానరుడైన సుగ్రీవుడి విషయం గురించి ఇక ఆలోచించక్కర లేదనే విషయాన్ని వివరించింది.

రామకార్యం పట్ల సుగ్రీవుడికున్న ఆసక్తిని తన వాక్చాతుర్యంతో ఇలా వివరించింది.

రుమాం మాం చాఙ్గదం రాజ్యం ధనధాన్యవసూనిచ
రామ ప్రియార్థం సుగ్రీవస్త్యజౌదిత మతిర్మయ

(రాముడికి మేలు చేయడానికి రుమనూ, నన్ను, అంగదుడిని, ధన ధాన్యాలను, రత్నాలనూ, రాజ్యాన్ని తృణ ప్రాయంగా త్యజించగలడు) ఏ సుఖాలతో ఐతే సుగ్రీవుడు మునిగి తేలుతున్నాడో వాటన్నింటిని రాముడికోసం విడవగలడనే సందేశాన్ని లక్ష్మణుడికి విన్నవించింది. దాని ద్వారా లక్ష్మణుడికి సుగ్రీవుడి పట్ల లక్ష్మణుడికి విశ్వాసాన్ని కల్గిస్తుంది.

“లంకలో అనేక కోట్ల మంది భయంకరమైన రాక్షసులు ఉన్నారట వారినందరినీ చంపనిదే రావణుడిని చంపలేరు. సీతను పొందలేరు. ఇదంతా రాముడు ఒక్కడూ చేయగలగినది కాదు. సుగ్రీవుడు చేయగలిగినది కాదు. అందుకే కోట్లమంది వానరవీరులను పిలుస్తున్నారు.

సుగ్రీవుడి తప్పును ఎత్తి చూపుతూనే వానర రాజుల అభిజాత్యం, ఆత్మ గౌరవాన్ని కాపాడుతుంది. సుగ్రీవుడి సాయం లేనిదే రాముడు సీతను చేరుకోలేడని రక్షేచలేడని హెచ్చరిస్తుంది. వానరసైన్య సహాయం అనివార్యమనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఇంతలోనే స్త్రీత్వాన్ని ప్రదర్శిస్తూ ‘అసలు అంత కోపంతో రక్తంలా ఎర్రగా ఉన్న నీకళ్ళను చూచి మా వానర స్త్రీలంతా భయ పడుతున్నారు. వాలికి పట్టిన గతే సుగ్రీవుడికి పడుతుందని బెంబేలు పడుతున్నారని” అంతలోనే తాను భయాన్ని ప్రదర్శిస్తూ లక్ష్మణుడి పట్ల వినయాన్ని ప్రదర్శించడం తారకే చెల్లుతుంది. తారను దాటి సుగ్రీవుడిని చేరేటప్పటికి లక్ష్మణుడిని ఒక సౌమ్య మూర్తిగా తన మాటలతో మార్చేసిన విజ్ఞురాలు.

విజ్ఞత, సమయస్ఫూర్తి, ధర్మం, ఆత్మ గౌరవం కలది.

మాటను స్పష్టంగా ధైర్యంగా చెప్పగలిగే వివేకం కలగలది. నేటి పాలనా రంగ, సంస్థల అధికారులకు ఒక మంచి ప్రధాన కార్యనిర్వహణాధికారిగా తార మార్గదర్శకం వహించగలదు.

**ఆధార గ్రంథాలు :**

1. ఉపశ్రీ రామాయణం- తిరుమల తిరుపతి దేవస్థానంల ప్రచురణ
2. వాల్మీకి రామాయణం-తత్త్వ దర్శనం. - డా॥ఎమ్.జి.పి. శ్రీరామచంద్రమూర్తి.

❁❁❁

# బండి నారాయణస్వామి కథానికలు - స్త్రీ అస్తిత్వస్పృహ

- **డా॥. జెన్నే యోగీశ్వరనాయుడు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), అనంతపురము.

తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రభావం చూపిన ఉద్యమాలలో ఒకటి స్త్రీ అస్తిత్వ ఉద్యమం. ఈ స్త్రీ అస్తిత్వ ఉద్యమం తెలుగు నాట 1980వ దశకంలో ప్రారంభమయినది. పితృస్వామిక సర్పపరిష్వంగం నుండి విముక్తి పొంది, పునరుత్పత్తి, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయంలో స్వేచ్ఛ కావాలనే ఆకాంక్ష నుండి పురుడు పోసుకున్నదే స్త్రీ అస్తిత్వ ఉద్యమం. పురుషాధిక్యత, లింగ వివక్ష, పునరుత్పత్తి, వివాహవ్యవస్థ, ఆర్థికస్వేచ్ఛ, విద్య, ఉద్యోగం, గృహహింస, శారీరక దోపిడీ, మహిళలపై దాడులు మొదలగు సమస్యలను చర్చించింది ఈ స్త్రీ అస్తిత్వ ఉద్యమం. ఈ క్రమంలో అనంతపురం జిల్లా నుంచి స్త్రీ అస్తిత్వస్పృహను ప్రతిబింబిస్తూ కథానికా సాహిత్యం సమున్నత రీతిలో వెలువడింది.

ఇక్కడి ఆకాశం చేతులెత్తేస్తే మెలుకువగీతం పాడాల్సిన విత్తనాలు మట్టిలోనే సమాధి అవుతాయి. ఆకాశం భూమి అంటు కడితేనే కదా అనంతరైతు అని అనంతపురం ప్రాంతీయ అస్తిత్వాన్ని, దళిత బహుజన తాత్వికతను, సామాజిక చారిత్రక జీవన పార్శ్వాలను, మాండలిక సువాసనలతో రచనలు చేసిన స్వామిగా పేరుగాంచిన కేంద్రసాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి. ఈయన 1952 జూన్ 3 న జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు హన్నూరప్ప, పోలేరమ్మ. తల్లి,తండ్రి కూలిపని చేసేవారు. తండ్రి తరిమెల నాగిరెడ్డి అనుచరుడు. బాల్యం నుండే స్వామికి పుస్తకపఠనం పట్ల ఆసక్తి కలిగింది. స్థానిక గ్రంథాలయ పుస్తకాలను చదివేవాడు. తండ్రి తెప్పించే సోవియట్ యూనియన్ పుస్తకాలను చదివి ఉత్తేజం పొందాడు. బాల్యస్నేహితుడు దక్షిణామూర్తి ప్రోత్సాహంతో తెలుగు పత్రికలు, నవలలు చదివాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ లో ఉన్నత విద్యను అభ్యసించాడు. బి.ఎడ్.చేశాడు. ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. జ్వాలాముఖి, ఇస్మాయిల్, చిలుకూరి దేవపుత్ర, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, కాళీపట్నం రామారావుల నుండి ప్రేరణ పొందాడు.

సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. రాయలసీమ నీటికోసం శ్రమిస్తున్న వ్యక్తి. 1987వ సంవత్సరంలో ఆంధ్రప్రభపత్రికలో ప్రచురించ బడిన మొదటికథ 'పరుగు'తో రచనా పరుగును ప్రారంభించారు. గద్దలాడ తండాయి, మీరాజ్యం మీరే లండి, రెండుకలలదేశం, శప్తభూమి అను నాలుగు నవలలు రచించారు. శప్తభూమి నవల 2017 తానా పురస్కారం, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు (2019)ను పొందింది. ఇది రాయలసీమ చారిత్రక నవల. తన రచనలకు అనేక సాహితీపురస్కారాలు పొందారు. 'రాయలసీమ - సాహిత్యం - సమాజం' అను వ్యాస సంపుటిని రచించి ప్రచురించారు. వీరగల్లు, చమ్కీదండ, శూద్రపాదం అను మూడు కథాసంపుటాలను వెలువరించారు. దళిత అస్తిత్వస్పృహను కాంక్షిస్తూ 'ప్రశాంతం, తల్లిమట్టి, ఓహెచ్ సరస్వతి' కథలను రచించారు. రైతు ఆత్మహత్యానంతర కుటుంబస్థితిగతులను, నీటి రాహిత్యాన్ని, రైతులు, సామాన్యులు దగాపడుతున్న తీరును 'నీళ్ళు, రంకె' కథలలో నగ్నంగా చిత్రించారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని చిత్రిస్తూ 'వానరాలే, తెల్లదయ్యం, బ్రతుకుఊబి, సావుకూడు' కథలను రచించారు. 'పిప్పి మనిషి, పూచికపుల్లలు, సంఘపశువు, నీడలముడులు, ఆగామివసంతం, చమ్కీదండ, శూద్రపాదం, అద్దం' మొదలగు కథలు ప్రముఖమైనవి. జీవితంలోని అనుభవాలు, అనుభూతులు, అనుబంధాలు, నమ్మకాలు, అపనమ్మకాలు, రాగద్వేషాలు, భౌతిక అభౌతిక

సత్యాన్వేషణలు నేపథ్యంగా అతిసున్నిత పార్శ్వాలను సృశిస్తూ వెలువడినవి బండి నారాయణస్వామిగారి కథలు.

బండి నారాయణస్వామిగారు దళిత అస్తిత్వ స్పృహతో అనేక కథల్ని రాశారు. అందులో రెండు కథల్లో స్పృశించిన స్త్రీ అస్తిత్వ స్పృహను మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

**ఊరుతల్లి :**

భర్త వ్యసనపరుడై నిర్ధాక్షిణ్యంగా భార్య పిల్లలను వదిలిపోతే, నిరాశ నిస్పృహలకు లోను కాకుండా అస్తిత్వ చైతన్యంతో పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఓ స్త్రీ మూర్తి జీవితం ఇందులో ఆవిష్కరించబడింది.

స్త్రీ, పురుష ప్రకృతులు స్వభావరీత్యా భిన్నమైనవి. పిల్లులు, కుక్కలు, ఎనుములు, కోళ్ళు, జంతు పక్షి సంస్కృతికి చెందిన ఆడవి తమ పిల్లల్ని తామే తిండిపెట్టి పోషించుకుంటాయి. ఏదన్నా ఆపదొస్తే పిల్లల్ని ప్రాణాలకు తెగించి కాపాడుకుంటాయి. భూలక్ష్మి అలాంటి ఆడజాతికి చెందిన తల్లి. తన నలుగురు పిల్లల్ని కడుపున పెట్టుకొని పోషించుకున్న కన్న తల్లి. ఎనుపోతులు, గండుపిల్లులు, మగ కుక్కలు తమ వల్లే ఆ పిల్లలు పుట్టాయని, వాటి ఆలనా పాలనా చూడాలన్న బుద్ధిజ్ఞానం వాటికి వుండదు. అలాంటి సంస్కృతికి చెందిన వాడు భూ లక్ష్మి భర్త నారప్ప. జూదం, తాగుడు, వ్యభిచారం లాంటి వ్యసనాలు కలిగిన నారప్ప ఒక రోజు డ్రామాలాడే బుడబుక్కల దానితో వెళ్ళిపోతే గుండలవిసేలా ఏడ్చింది. తన నలుగురు పిల్లలని చూసి "పిల్లోల్లంతా కాకుల మాదిరి చుట్టుకొని అరుస్తుంటే భూలక్ష్మికి కంట్లో నీళ్ళు తుడుచుకొనక తప్పలే! ఇద్దరు మగ పిల్లలను బడికి తరుముతాండే! కడుగొట్టు పిల్లోన్ని చంకలో వేసుకొని కూలికి పోతాండే. ఆడపాపను ఇల్లు చూపెట్టుకో అంటాండె. కోడి తన పిల్లలకు గింజలు గెదిరి గెదిరి పెట్టి, అవి ఈక వేసుకొనేసరికి తనేమో తిండి లేక బెండు మాదిరి మారిపోతుంది చూడు, అట్లాంటి పిల్లల కోడి భూలక్ష్మి" భర్త నిర్ధాక్షిణ్యంగా తనను పిల్లలను వదిలి వేసి వెళ్తే బాధను దిగమింగుకొని పిల్లను బడికి పంపడం, తాను కూలికి వెళ్ళి పిల్లలను పోషించటం స్త్రీ అస్తిత్వస్పృహకు నిదర్శనం.

భర్త నారప్ప కొంతకాలానికి తిరిగి వస్తే మగతోడుంటే చాలులే అని సర్దుకుపోయింది తప్ప ప్రశ్నించలేదు. ప్రశ్నించినా ప్రవర్తన మారదన్న వాస్తవాన్ని గ్రహించిన మనస్తత్వానికి ప్రతీక భూలక్ష్మి. "పెద్దకొడుకు పల్లెప్ప ఉండూరులోనే పెండ్లి చేసుకొని కూలీనాలికి పోతాండె. పిల్లనిచ్చిన మామ అంగడి పెట్టిస్తానంటే నడిమి కొడుకు, పెండ్లాం ఊరు చేరిండె. చిన్న కొడుకు రామచంద్రప్ప మాత్రం చదువుకొని రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉద్యోగం చేస్తాండె. ఒక్కగా నొక్క ఆడకూతురు పెండ్లి చేసుకొని అత్తవారిల్లు చేరిండె" భర్త సహకారం లేకపోయిన, పిల్లలను పెంచి పెద్దజేసి చదువులు, వివాహాలు చేసి వారికి మంచి జీవితాన్ని అందించడం ఆమెలోని అస్తిత్వ చైతన్యాన్ని తెలియజేస్తుంది. భర్త నారప్ప చనిపోవటంతో పెద్దకొడుకు పల్లెప్ప దగ్గరే తాను వుంటూ అతని పిల్లలను చూస్తూ జీవితం గడపసాగింది. కరువు మనుషుల మధ్య పెనవేసుకొన్న పేగుబంధాన్ని కర్కశంగా తెంపగలదు.

పల్లెప్ప తన తల్లిని పోషించటం కష్టం కావడంతో పట్టణంలో చిన్నకొడుకు దగ్గరకు చేరుకొంది. నోట్లో పుండు పెద్దది కావడంతో డాక్టర్లుకు చూపించగా క్యాన్సర్ రోగమని నిర్ధారించబడింది. తల్లి ఎంతోకాలం బతకదని తెలిసిన కొడుకు అంతులేని ఆవేదనకు గురయ్యాడు. జీవిత మంతా పల్లె సంస్కృతితో పెనవేసుకుపోయిన భూలక్ష్మికి పట్టణ సంస్కృతి రుచించలేదు. ఆత్మీయతలు, అను బంధాలు మృగ్యమైన పట్టణంలో ఇమడలేని భూలక్ష్మి పల్లెకు వెళ్ళాలని, పెద్ద కొడుకు పిల్లలను చూడాలని పట్టు పట్టింది. దీన్ని జీర్ణించుకోలేని చిన్నకొడుకు ఇంత పక్షపాతం తల్లికి వుండకూడదని నిష్టూరమాడినా పల్లెమూలాలవైపే మొగ్గచూపడం ఆమెలోని ప్రాంతీయ అస్తిత్వ స్పృహకు దర్పణం పడుతుంది.

మీ నాయన నన్ను ఇడిసిపెట్టిపోయింది అలుసుగా తీసుకొని ఒక దినం ఆ శంకరప్ప నా మీద చెయ్యి వేసినాడు. రామిరెడ్డి, చంద్రాయుడూ అంతా వచ్చి ఆ శంకరప్పని కంబానికి కట్టేసి ఉతికినారు. ఆ ఊర్లో కాబట్టి

ఆడదాన్నియినా ఒంటిగా బతికినాను. ఇంట్లోంటి టౌనులో అయితే నలుగురు పిల్లలతో బతికి బట్టకట్టే దానినేనా? అని భూలక్ష్మి పలికిన మాటలు స్త్రీకి శీలం ముఖ్యమని, బలాత్కరించడానికి ప్రయత్నించిన వారిని ఎదిరించి, జీవించాలని, ఒంటరి మహిళయైనా, పిల్లలను పెంచాలన్న భావజాలం ఆమెలోని అస్తిత్వస్పృహను ఎరుకపరుస్తుంది. చివరకు చిన్నకొడుకుకు చెప్పకుండా పల్లెపై మమకారంతో బస్సెక్కి వూరు కొట్టాలపల్లికి చేరు కుంది. ఊరుతల్లిని చూసి సంతోషం పట్టలేక ఉబ్బి తబ్బిబ్బయ్యింది. కరువుకోరల్లో చిక్కుకున్న పెద్దకొడుకు పల్లెప్ప గ్రామాన్ని వదిలి ఫ్యాక్టరీలో కాపాలాదారుగా పనిచేయడానికి పట్టణానికి బయలు దేరడాన్ని చూసి దిగ్భ్రాంతితో కిందికి కూలబడి పోయి ఆ ఊరికి ఎరువుగా మారిపోవటం విషాదానికి పరాకాష్ట.

ప్రతి స్త్రీ బాధ్యత లేని భర్తను తలచుకొని కుంగి పోకూడదని, సంతానాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు పోవాలని, ఆత్మీయ సంబంధాలతో పరిమళించాలన్న సందేశం సమాజానికి, భూలక్ష్మి అందించడం స్త్రీ అస్తిత్వస్పృహకు సంకేతం.

**అమ్మ :**

స్వార్థపు నీడ లెరుగని అమ్మతనంలోని ఔన్నత్యాన్ని, పల్లెతల్లి సహజ స్వభావాన్ని చిత్రించిన కథ అమ్మ. మధ్య తరగతి నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికి తమ అమ్మను గుర్తు చేస్తుంది ఈ 'అమ్మ' కథ. పల్లెతల్లి స్వభావం సహజసిద్ధంగా ఇందులో చిత్రించబడింది. ఈ తరం ఆడవాళ్ళను చూసి నపుడు అమ్మతనంలోని ఆప్యాయతకోణం తరిగి పోతుందనిపిస్తుంది. ఈ కథలో అమ్మకు వుండాల్సిన సహజమైన లక్షణాలు లేవు. కఠోరమైన వాస్తవజీవితం, స్వార్థపునీడలెరుగని అమ్మతనం లేని ఔన్నత్యం ఇందులో తెలియజేయబడింది. అనేక వైరుధ్యాల మధ్యన డబ్బు సంబంధాల మధ్యన కూడా నిలిచి వెలిగే అమ్మతనం యొక్క గొప్పదనం ఏమిటో ఇందులో నిరూపించబడింది. జీవితమంతా కాయకష్టం చేసిన అమ్మ చిన్నపాటి సుఖాలు కూడా అనుభవించకుండా మరణించడం సగటు పాఠకుని హృదయాన్ని విదారకంగా ద్రవింప జేస్తుంది. కరువు కోరల్లో చిక్కుకున్న కుటుంబానికి చెందిన స్త్రీ యొక్క అమ్మతనం ఇందులో సాక్షాత్కరింపబడింది.

కథకుడు ఉపాధ్యాయుడు. తన తల్లికి జబ్బు చేయటంతో ఆస్పత్రిలో చేర్పించాడు. కామెర్లు ముదిరి పోయి చనిపోతుందని చెప్పటంతో దిగ్భ్రాంతికి, అంతులేని ఆవేదనకు గురి అయ్యాడు కథకుడు. ప్రతి బిడ్డకు అమ్మంటే ప్రాణం, ఇష్టం. అమ్మ అను పదం సృష్టికి పర్యాయపదం. "ఆ మాటలో సృష్టి ప్రతిధ్వనిస్తుంది. పాలసముద్రం పొంగుతుంది. వేషాల్ని కడిగేసుకొని, తొడుగు తీసేసుకొని అస్తిత్వం తన శిశు నగ్నత్వంతో కేరింతలు కొడుతుంది. ఇంద్రియాల వలయంలో కీటకంలో గింగిరాలు తిరిగే అహంకారం ఆమె భావనలో ఆర్ద్రమై, శుద్ధమై కాంతితో మెరిసి ప్రేమగా పరిణమిస్తుంది. ప్రకృతిలోని ప్రతి చైతన్యపు కదలికకు మురిసి తన వాత్సల్యంతో, నిరపేక్ష ప్రేమతో, హృదయపుమూలాల్ని స్పర్శించి దీవించి పునీతం చేస్తుంది!"[8] ఈ వాక్యాలు స్త్రీలోని అమ్మ అస్తిత్వానికి ప్రతీకలు.

మధ్యతరగతి సంపన్నకుటుంబాలలోని అమ్మ మనస్తత్వానికి, కరువుకోరల్లో చిక్కుకున్న కుటుంబానికి చెందిన అమ్మ మనస్తత్వం భిన్నమైనవి. ప్రేమతత్వం సమానం కావచ్చుకాని పరిస్థితులు భిన్నమైనవి. "తన శ్రమ జీవితపు కాఠిన్యంతో అమ్మ మనసు నిండిపోయింది. పనిభారమూ, దారిద్ర్యమూ, పస్తులు, కీళ్ళనొప్పులు... అన్నీ కలిసి ఒక క్రూరత్వమై, కఠినత్వమై తెరమరగు నుంచి ఆడిస్తుంటే కసితో, కోపంతో, ద్వేషంతో, అపార్థాల్లో ఆమె జీవితం ఒక కీలుబొమ్మై కదులుతుంది."[9] పేదరికంతో కూడిన మాతృత్వం హృదయ మార్దవాన్ని కోల్పోవటానికి కారణం తన స్థితిగతులు. సంపన్న స్త్రీల లాగే చరించలేనిదైన్యం ఆమెలో ఆవహించి వుంటుంది.

తెల్లవారినప్పటి నుండి పిల్లలను నిద్రనుండి లేపటంతోనే ఆమె దినచర్య ప్రారంభమవుతుంది.

పొద్దుపైకి ఎక్కినా నిద్రనుంచి లేవకపోతే దరిద్రం వస్తుందని, ధనలక్ష్మి వుండదని, ఆడపిల్ల ఇంటిపనులు చేయకపోతే తనను నిందిస్తారని, భర్త తన కష్టంలో భాగం కాకుండా సుఖంగా ఉన్నాడని, కుటుంబ సభ్యులందరిని నిందించడం ఆమెలోని అమాయకమైన స్త్రీతనాన్ని ప్రతిబింబిస్తుంది. "నిండు మనిషిని, పస్తులు పడుకుం టాంటి. మా పుట్టింటోల్లు ముద్ద తిందువురమ్మని పిలిస్తే అప్పుడే తిన్నానని అబద్ధం చెబుతాంటి. నా మర్యాద ఒకటీనా అత్తింటి మర్యాద వేరొకటీనా అనుకొని! ఆ పొద్దు నుంచి ఒకటే కష్టమే" అని గంగమ్మ పలికిన మాటలు ప్రతి స్త్రీ మెట్టినింట గౌరవం నిలపాలని, ఎన్ని కష్టాలైన భరించాలన్న భావజాలానికి అద్దం పడుతుంది. అదే సమయంలో పుట్టింటి గొప్పతనాన్ని కాపాడటం ఆమెలోని స్త్రీ అస్తిత్వస్పృహను తేటతెల్లం చేస్తుంది. నాకు ఒడి బియ్యం పెట్టక మూడు సంవత్సరాలు దాటిపోయినది. ఆడపిల్లకు చీర పెడితే మీది ఏమయినా కరిగిపోతుందా అని ప్రశ్నించడం ఆమెలోని నిష్కల్మషమైన వైఖరిని విశదపరుస్తుంది. స్త్రీ ఐదవతనాన్ని గౌరవించడం, ప్రతి తల్లిదండ్రుల బాధ్యతని, దాన్ని మరవకూడదని నిలదీయటం ఆమెలోని అస్తిత్వానికి సంకేతం.

పక్కింటి సూరమ్మ కొడుకులు మంచి ఉద్యోగాలు చేస్తున్నారని, బాగా సంపాదిస్తున్నారని, వారిలాగే తన కొడుకులు ప్రవర్తిల్లాలని వాంఛించటం గంగమ్మ మాతృత్వానికి నిదర్శనం. కోడల్లు ఒక చోట చేరి కబుర్లు చెప్పుకుంటే అనుమానం తన మీద కుట్రపన్నుతున్నారేమో అని, సరదాగా నవ్వితే తన గురించేనేమో అన్న భావన ఆమెలోని అనుమానపు అమాయక మనస్తత్వానికి ప్రతీక. కోడల్లను తన చెప్పు చేతల్లో పెట్టుకొని, అత్తపాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తుంది గంగమ్మ. అదే సమయంలో కోడళ్ళను రత్నాలని మెచ్చుకోవటం ఆమెలోని కపటం లేని ప్రవర్తనను పట్టి చూపిస్తుంది. మనమళ్ళతో పసిపాపై ఆడుకోవటం, కొని పెట్టటం, కథలు చెప్పటం, వారసత్వాని చూసి మురిసి పోవటం గంగమ్మలోని అవ్యాజమైన ప్రేమను తెలియజేస్తుంది.

"అమ్మ! కష్టాల మధ్య పుట్టి, కష్టాల మధ్య పెరిగి జీవితమంతా కాయకష్టం చేసి చేతుల్తో పాటు మనసు కూడా మొద్దుబారిపోయిన అమ్మ. హృదయంలోని లాలిత్యాన్ని, మార్దవత్వాన్నీ శ్రమ సంస్కృతిలోని మోటు తనానికి బలిపెట్టిన అమ్మ! చెయ్యెత్తి ఒకసారైనా నీపెళ్ళాన్ని కొట్టని వానివి నువ్వేం మొగునివిరా?" అంటూ ముక్కు మీద వేలు వేసుకొని అశ్చర్యపడిపోయే పాతకాలపు మోటతనపు మనిషి గంగమ్మ. "తన అపార్థాల్తో, అపోహల్తో, కొడుకుల్ని సందేహిస్తూ, కోడళ్ళను తిడుతూ ఎవరికీ లేని బాధలు తనకే ఉన్నాయని, లోకమంతా తన మీద సానుభూతి చూపాలని తాపత్రయపడుతూ, వడియాల మీద కాకుల వాలుతున్నాయనో, వానొస్తే కట్టెలు తడిసి పోతున్నాయనో, బల్లి మీద పడింది శకునం మంచిది కాదనో, ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి ఆందోళన పడుతూ తన ప్రేమలూ, అపేక్షలు, కోపాలు, విచారాలు, ఎప్పుడూ ఎవరో ఒకర్ని ఆడిపోసుకుంటుంటే తప్ప ఇంటా బయటా తన కిరీటం నిలవదేమోననే జాగ్రత్తలూ, భయాలూ, న్యూనతలూ, అధిక్యాలూ తన అస్తిత్వపు బొట్టులో ఎన్నెన్నో రంగులు ఒదిగించుకోవడం" గంగమ్మలోని విభిన్న రకాలైన సందర్భోచిత మనస్తత్వ వైఖరి స్త్రీ అస్తిత్వాన్ని తెలియజేస్తుంది.

## ఆధార గ్రంథాలు :

1. డా॥ వెల్దండి శ్రీధర్ - తెలుగుకథ - ప్రాంతీయ అస్తిత్వం
2. అన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి - అస్తిత్వవాదం
3. ఆచార్య కిన్నెర శ్రీదేవి - సీమకథ - అస్తిత్వం
4. డా. జెన్నే యోగీశ్వరనాయుడు - అనంతపురము జిల్లా కథానికలు-అస్తిత్వ స్పృహ(పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథం)

# "రాముడుండాడు - రాజ్జి వుండాది" - వెనుకబడిన కులాల వృత్తి జీవనం"

- డా॥. యమ్. విజయశ్రీ, అసోసియేట్ ప్రొఫెసర్, జె.కె.సి. కళాశాల, గుంటూరు.

కేశవరెడ్డి గారు ఈనవలలో ఇంత విశాలదేశంలో పనెక్కడైనా దొరకకపోతుందా అని గ్రామాల నుంచి వలసపోతున్న కులవృత్తుల వారి జీవితాలు, మనో ప్రవృత్తులు చిత్రించారు.

చిత్తూరు ప్రాంతంలో వలసపోయే ప్రజలు "రాముడుండాడు రాజ్జి ముండాది" అనే భరోసాతో యలబారిన వైనాన్ని చిత్రించారు.

నేటి సమాజంలో కులవృత్తులు క్రమక్రమంగా ధ్వంసమైపోతున్న వైనాన్ని చూపించడం ప్రధాన ఇతివృత్తింగా గల నవల డాక్టర్ కేశవరెడ్డి రచించిన "రాముడుండాడు రాజ్జివుండాది" ఇందులో దళితులూ ఉన్నారు. దళితేతరులూ ఉన్నారు. కొలిమిపని గిట్టుబాటు గాని ఒక కంసాలిని, కట్టుబానిస కొలువు గిట్టుబాటు గాని ఒక దినకూలిని వ్యవసాయం గిట్టుబాటుకాని ఒకరైతునూ ఈనవలలో చూస్తాం. వీళ్లందరిదీ ఒకే సమస్య - అదే ఆర్థిక సమస్య వీరందరూ పీడికులే పల్లెల్లో కుల వృత్తులు అంతరించిపోతున్నా కులభావం అంతరించి పోవటం లేదు.

పెదనాయుడు గారి పాలేరు కోనిగాడు. ఆవునకు చెల్లించవలసిన బాకీ తీర్చడం కోసం 30సం॥లుగా ఆయన పొలంలో పనిచేస్తున్నాడు. ఏటి దగ్గర నుండి మోకాళ్ళ కొండదాకా పరుచుకుని వున్న రెండు వందల ఎకరాల భూమి యానాది మిట్టలో వరి, చెరకు, రాగి, వేరుసెనగ, పసుపు పండుతాయి. మారుతున్న కాలాన్ని బట్టి నాయుడుగారు ఎడ్ల జతలు తగ్గించి, పాలేళ్లను తగ్గించి, ట్రాక్టర్లు, ట్రక్కులతో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ప్రవేశపెట్టారు.

నాయుడు గారు ఏడాదిలో ఎక్కువ రోజులు జిల్లా కేంద్రంలో, హైదరాబాద్‌లో ఉంటారు. పొలం మీద అజమాయిషీ చేయడానికి పెదనాయుడి ఏజంటు ముత్యాలనాయుడు పల్లెలో వుంటాడు.

వరి పంట కోతకు వచ్చింది. విరగపండిన కంకుల్ని పిచ్చుకలు తిని వేస్తున్నాయి. కంకినలిపితే, దోసెడువడ్లు రాలుతున్నాయి. కోసికళ్ళంచేస్తే ఎకరా మూడు పుట్లకు తక్కువగాకుండా రాలుతుంది.

ఊరికి ఒక్కడే కంసాలి. అతను వూళ్లోలేడు. కంసాలి వచ్చి కొడవళ్ళు చేసి ఇస్తే గాని కోత మొదలు పెట్టడానికి వీల్లేదు. ముత్యాల నాయుడు పని పురమాయించి నప్పుడల్లా కంసాలి కొలిమి పని గిట్టుబాటు కావడంలేదని తనగోడు వెళ్లబోసుకుంటాడు. కదిలిస్తే చాలు "ఈడిగవాడుకూడ అందరి బతుకులూ అట్టనే ఉం డాయి. ఎవనికీ కుల రుతులు గిట్టుబాటు కావడం లేదు" అంటాడు. కులవృత్తి మానేస్తే కూడూ గుడ్డూ గడిచేది యెట్లాగనేదే వాళ్ల సమస్య.

గంగ పండగ అయిపోయినాక కోనిగాడి 30సం॥ పాలేరుతనం పూర్తి అవుతుంది. కోనిగాడి కొడుకు కొంతకాలంగా పట్నంలో రోజువారి కూలిపనిచేసి బతుకుతున్నాడు. ఆ పిల్లవాడ్ని తన దగ్గర పాలేరు పనికి పెట్టుకోవాలని పెదనాయుడు గారనుకున్నారు. కోనిగాడికి ఒక ఎకరం పొలం రాసిస్తానని కొడుకును పాలేరుగా వుంచమని ముత్యాలనాయుడు చేత చెప్పించారు. తెల్లనివన్నీ పాలనుకునే కోనిగాడు అందుకు ఒప్పు కున్నాడు. తానుగూడ ఒకరైతు కాబోతున్నానని ఆశపడ్డాడు పట్నం నుంచి పల్లెకు రమ్మని కొడుక్కి జాబు రాయిం చాడు. కొడుకు వచ్చేలోగా కొండకు పోయి స్వామి దర్శనం చేసుకొని తలనీలాలు ఇవ్వాలనుకొని తిరుపతి వెళ్లాడు.

మిరపతోట దగ్గర పెట్టిన నీళ్లయింజను 'స్టార్ట్' చేయడంలో ప్రమాదం జరిగి పనివాడు గోపాల్ చెయ్యి

విరిగిపోయింది. బండిమీద వేసుకొని ఆసుపత్రికి తీసుకుపోయారు. చెయ్యి తిరిగితే వాడి మీద జాలిపడక పోగా ముత్యాలనాయుడు ''మిరపచెట్టుకు నీళ్ళువడు పెడతాడు'' అని బూతులు తిట్టాడు.

తాతల కాలం నుంచి ఊరివాళ్ళ ముట్టుకోకలు ఉతికినా తమ బతుకులు తెల్లారటం లేదని చాకలి కూడా తన కులవృత్తి మీద అసంతృప్తి వెల్లడించాడు.

కోనిగాడి కొడుకు ఒక లారీ డ్రైవర్ దయతలచి తనతో తీసుకువస్తే పట్నం నుంచి పల్లెకు తిరిగి వచ్చాడు. తండ్రిఊళ్లో లేడని తెలిసి పుర్లిగాడు కంసాలికి సహాయకుడిగా పనికి కుదిరాడు.

ఒక సన్నకారు రైతు తనపొలంలో కలుపుతీయడానికి మనుషులు దొరక్క సతమత మవుతున్నాడు. కూలికి రమ్మని ఎవర్ని పిలిచినా వాళ్ళు పెదనాయుడు పొలంలోకి పోవాలని, తమకు వీలుకాదని చెప్తున్నారు. పెదనాయుడు పొలంలో పనిచేయడానికి వచ్చిన వాళ్ళకు సంగటి పెడతారు. అందులోకి పప్పు, నెయ్యి, కూడా వేస్తారు. చిన్నరైతు సంగటి పెట్టలేడు. తన పైరు తనకిక దక్కవని సేద్యమంటేనే విరక్తి చెందాడు రైతు.

ఊరివాళ్ళందరికి కష్టం పెద్దేట్లో కలిసి పోతున్నది. ఒంట్లో బాగోలేక జ్వరంవొచ్చి వొళ్ళు సలసల కాగిపోతున్నా కూలివాడు పనిలోకి రావలసిందే లేకపోతే దౌర్జన్యం చేసి రప్పిస్తారు. మాలలంతా ఎంతో కొంత నాయుడు దగ్గర అప్పుతీసుకుని బాకీ పడ్డవాళ్ళే. కంసాలికి ఇతర పనులు ఎన్ని ఉన్నా, పక్కనపెట్టి నాయుడు గారి పని చేయవలసిందే. కాదంటే ఊళ్లోంచి వెళ్లగొట్టేస్తారు. చిన్నరైతులు ఇద్దరు తమ పని చేయమని తొందరపెట్టారు. రేపు చేస్తానంటే వినిపించుకోలేదు. బూతులు తిట్టారు. అడ్డుచెప్పినందుకు కోపంతో కొలిమిచక్రం విరగొట్టేశారు. పేదవాని కోపం పెదవికి చేటు. రైతుల్ని ఏమీ చేయలేని కంసాలి కడుపుమంటతో ఆక్రోశించాడు.

''లోకమంతా ఇట్లనే ఎండలు గాసే మండలమంతా ఇట్లనే'' - బైరాగిలోక నైజాన్ని గూర్చి నిట్టూర్చాడు. బయటపడే మార్గం ఏమీ తెల్పలేదు.

ధరలు పెరిగాక గుడి దగ్గర అడుక్కునే బిచ్చుగాడికి జోలె నిండటం లేదు. అరటి పండ్లు డజను నాలుగు రూపాయలు అమ్ముతున్నాయి.

బేంకులో తీసుకున్న అప్పు తీర్చలేదని తిరుపాల నాయుడనే చిన్నరైతు పొలాన్ని అధికారులు వేలం వేశారు. బేంక్ అధికారీ మోసం చేశాడు. పూలమ్మినచోట కట్టెలమ్మలేక తిరిపాల నాయుడు పుల్లిగాడితో కలిసిపట్నం పోయి కూలి చేసుకొని బతకాలనుకుంటాడు.

తిరిపాలనాయుడు దీన గాథ విని గుడి పూజారి దు:ఖించాడు. తాను పూజించే దేవుని మీద నమ్మకం పోగొట్టుకున్నాడు. మూసిన కన్ను తెరువనోడు దేవుడేమిటి? అని విరక్తి చెందాడు. పూజారి తన పనిమానుకున్నాడు.

పుల్లిగాడు, కోనిగాడు, తిరిపాలనాయుడు, కంసాలి, పూజారి మూటాముల్లె సర్దుకునిపట్నం బయలు దేరారు. ''రాముడుండాడు రాజ్జి వుండాది యలబారండ్రా'' అని ఒకరినొకరు పురుమాయిం చుకున్నారు. అందరూ లారీ ఎక్కి పట్నం బయలు దేరారు. లారీ ఎండ మావులను తొక్కుకుంటూ పరుగెత్తసాగింది.

డాక్టర్ కేశవరెడ్డి లోక పరిశీలన, కథాకథన నైపుణ్యం, జీవన వేదాంతమూ చాలా గొప్పది. ప్రస్తుత సమాజంలో పల్లెబతుకులు సంక్షోభంలో చిక్కుకున్నమాట నిజం.

❀ ❀ ❀

# విస్మృత ధీర - యశోబుద్ధ

– డా॥. జి. స్వర్ణలత, శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వినుకొండ, గుంటూరు జిల్లా.

ప్రసిద్ధ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఇటీవల వెలువరించిన నవల యశోబుద్ధ. గౌతమబుద్ధుడి భార్యగా యశోధర పేరు పరిచితమైనదే. ఆమెను యశోబుద్ధగా అభివర్ణిం చడం ఓల్గా ఊహాశక్తికీ, ఆమె ప్రత్యేక దృష్టికోణానికీ ఉదాహరణ. ఈ నవలకు యశోబుద్ధ భావనే ప్రాణం. యశోబుద్ధ అంటే బుద్ధత్వాన్ని పొందిన యశోధర అని అర్థం.

రాహులుడు జన్మించిన ఏడవరోజు గౌతముడు భార్యబిడ్డలను తల్లిదండ్రులను, సమస్తాన్నీ త్యజించి మహాభినిష్క్రమణం చేసి బుద్ధుడయ్యాడని, ఆ తర్వాత చాలాకాలానికి మరోసారి బుద్ధుడు కపిలవస్తు నగరానికి వచ్చినపుడు వీధిలో నడచి వెళుతున్న తండ్రిని రాహులుడికి చూపించి నీకు రావలసినవీ, చెందవలసినవీ పొందు అని యశోధర అన్నదని బుద్ధుడి చరిత్ర కథగానైనా పరిచయమైన వారందరికీ తెలిసిన విషయమే. 'యశోబుద్ధ' కథ కూడా ఇందుకు భిన్నం కాదు.

రచయిత్రి ఓల్గా మొదటి నుండీ పదునైన స్త్రీవాద రచనలు చేసారు. కథ అయినా కవిత్వమైనా, నవల అయినా, విమర్శ వ్యాసాలైనా ప్రతి స్త్రీవాదభావనకూ ఒక సైద్ధాంతిక భూమికను చూపిస్తూ సూటిగా, నిష్కర్షగా వ్యవహరించడం ఆమె శైలి. గౌతముడి మహాభి నిష్క్రమణను గురించి చాలామంది రచయితలు అది యశోధరపట్ల అతడు చూపిన బాధ్యతారాహిత్యంగా అర్థంచేసుకున్న నేపథ్యంలో ఓల్గా ఇందుకు భిన్నంగా ఎక్కడా సిద్ధార్థుడిపై వ్యతిరేక ఆలోచనలు చేయకపోగా సిద్ధార్థుడు యశోధరల ఒకరిని మించిన ఒకరి ఔన్న త్యాన్ని హృద్యంగా చిత్రిస్తూ గౌతముడి జ్ఞానాన్వేషణలో యశోధరను ఒక విలువైన సహచరిగా ఆవిష్కరించారు. గౌతముడు సర్వస్వాన్నీ వదలి బుద్ధుడైతే యశోధర నాలుగు గోడల మధ్యనే బుద్ధత్వాన్ని పొంది వుంటుందని, కుమారుడు రాహులుడు, అత్తగారు గౌతమి బౌద్ధాన్ని స్వీకరించడం వెనుక యశోధర ప్రోద్బలం వుండి వుంటుందని ఓల్గా ఊహ. యశోధర 78 సంవత్సరాల పాటు జీవించిందని, ఆమె కూడా భిక్షుకిగా మారిందన్న చారిత్రక సత్యం ఆధారంగా ఓల్గా యశోధరను యశోబుద్ధగా అభివర్ణించారు.

ఈ నవల ఉపరితలంగా లలితంగా యశోధరా సిద్ధార్థుల వంటి మృదుస్వభావుల చుట్టూ అల్లిన అందమైన ప్రేమకథగా కనిపించినప్పటికీ స్త్రీవాది ఓల్గా ఎక్కడా స్త్రీని కించపరిచే మాటలను సహించడం గాని స్త్రీపాత్రల ఔన్నత్యాన్ని ఆవిష్కరించడంలోగానీ రాజీపడకపోగా స్త్రీలను పశుసమూహంలో ఒక జాతిగానో, ద్వితీయశ్రేణి వర్గంగానే భావించే వ్యక్తులను యశోధర మాటలతోనో గౌతముడి వాదనలతోనో ఖంగు తినిపిస్తుంది. సమాజంలోని హింసను, కృత్రిమ శత్రువు లను, పీడనను అదే తరహాలో వ్యతిరేకిస్తుంది. ఈ నవలను సిద్ధార్థుడి వ్యక్తిత్వం మరియు యశోధర ఔన్నత్యం అనే రెండు అంతర్వులలో అర్థం చేసుకుంటే రచయిత్రి దృక్పథమేమిటో, నవల లోతెంతో తెలుస్తుంది. యశోధరా సిద్ధార్థుల సున్నిత వ్యక్తిత్వాలను చెబుతూనే వివిధ సంఘటనల నేపథ్యంలో వారిద్దరి అంతర్దృష్టిని, తార్కిక శక్తినీ చూపిస్తారు రచయిత్రి.

సిద్ధార్థుడు సుకుమారమైన మనస్సు కలవాడు. తనతోటి వారికి భిన్నంగా కర్రసాము, మల్లయుద్ధం, ఖడ్గచాలనం మొదలైన యుద్ధ విద్యలకంటే తనలో ఉదయించే అనేకానేక ప్రశ్నలను మేథోమథనం చేయడమే అతనికిష్టం. శ్రమణకులతోను, కాలమునితోను ఈ విషయాల గురించి చర్చించే సమయం అతనికి చాలా విలువైనది. సృష్టి గురించి, ప్రకృతి గురించి, చలనం

గురించి, శక్తి గురించి, అనుభూతుల గురించి, అనుభవాల గురించి, మనుషుల గురించి వారి సుఖ దు:ఖాల గురించి తర్కించి, చర్చించి, అశాంతిపడి ఆవేశపడి ఆ తర్వాత అలజడులను అశాంతిని అదుపు చేయడానికి ధ్యాననిమగ్నుడవడం అతని అలవాటు. అలాంటి ఒకానొక సమయంలోనే అతన్ని చూసి అతడి రూపాన్ని తన మనస్సులో ముద్రించుకుంటుంది యశోధర.

సిద్ధార్థుడికి పదేళ్ళ వయస్సులో మనసుకు బాధ కలగడమంటే ఏమిటో తెలుస్తుంది. దేవదత్తుడు ఆటలో ఓడిపోయి ఉక్రోషంతో సిద్ధార్థుడిని మాతృహీనుడన్నపుడు ఆ మాట కలిగించిన నొప్పి అంతకు ముందెన్నడూ అతనికి కలగనిది. మహామాయాదేవి తాను పుట్టిన ఏడురోజులకే మరణించిందన్న విషయం తన పెంపుడు తల్లి గౌతమి ద్వారా తెలుసుకున్న సిద్ధార్థుడు తల్లి మరణానికి తానే బాధ్యుడిననుకునే సున్నిత మనస్కుడు. అప్పటి నుండి ఒక్క తల్లి విషయంలోనే కాక ఉండడానికీ లేకపోవడానికీ మధ్యనున్న దూరాన్ని అంచనా వేయడం మొదలు పెడతాడు సిద్ధార్థుడు.

యశోధరతో తన ప్రేమను నిశితంగా పరిశీలించిన సిద్ధార్థుడు ఈ ప్రేమ ఎలా భిన్నం? అనే ఆలోచననీ చేస్తాడు. ఓల్గా మాటల్లో "ఇంతవరకు తల్లిదండ్రులపై, ప్రాణికోటిపై తనకున్న ప్రేమకూ నేడు యశోధరపై కలిగిన ప్రేమకూ పోలికేలేదు. మిలిగిన అన్ని సంబంధాలలో ప్రేమ యివ్వాలనే భావన తన మనసులో ఆధిక్యస్థానంలో ఉందనీ, దాని వలననే ఆనందం కలుగుతన్నదనీ యశోధర విషయంలో ప్రేమ పొందాలనే కోరిక కూడా గాఢంగా ఉందని గ్రహించాడు" అంటూ స్త్రీ పురుషుల మధ్యనుండే ప్రేమ భావన ఇతర సందర్భాలలో కంటే ఎలా భిన్నమైనదో చాలా తార్కికంగా, సున్నితంగా వివరించారు రచయిత్రి. అలాగే యశోధరకు తన గురించి చెప్పుకుంటూ "నేను క్షత్రియ వంశంలో పుట్టినా, యుద్ధాలన్నా ప్రతాపనిరూపణలన్నా యిష్టం లేదు. నాకు లోకాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక వుంది. అది తప్ప మిగిలిన కోరికలేమీ నన్ను బాధించవు. లోకాన్ని అందులోని శోకాన్ని అర్థం చేసుకోవాలనే ఆసక్తితో మిగిలిన వ్యవహారాలన్నింటికీ దూరంగా ఉంటాను. బ్రాహ్మణ క్రతువులకి కూడా విముఖుడినే. మామూలు మనుషులకు నేనొక విభిన్న మానవుడిగా కనిపిస్తాను. నీ ఆశలగురించి, కోరికల గురించి నాకు తెలియదు. నన్ను కోరుకుంటున్న నీవు అసలు నేనేమిటో తెలుసుకొని నిరాశపడితే ఆ నిరాశ ఇప్పుడు కలగడమే మంచిది కదా?" అంటూ ఉన్నదున్నట్లు యశోధరముందు తనని తాను పరచుకుంటాడు సిద్ధార్థుడు. రెండువేల ఐదు వందల యేళ్ళనాటి ఒక తాత్వికుడు కాబోయే జీవనసహచరి భావికాలపు మన: క్లేశాల పట్ల సహానుభూతితో, నిజాయితీతో స్పందించడం ఓల్గా మృదుత్వాన్ని ప్రతిఫలిస్తూ వివాహబంధంలో స్త్రీ పురుషుల మధ్య ఉండవలసిన పారదర్శకతను సూచిస్తుంది.

మరో సందర్భంలో యశోధరను పొందాలంటే తోటి క్షత్రియ వీరులతో పోటీపడి తనని తాను నిరూపించుకోవాలన్న షరతు ఆమె తండ్రి బింబాననుడు విధించినపుడు "నిన్ను పొందాలనే కోరిక ఉన్నవారందరితో పోటీపడి నిన్ను గెలుచుకోవడమనేది నా మనసుకు హితవుగా లేదు. యశోధరా! మనం కలసి జీవించడమనేది, సహధర్మచారులవడమనేది మనిద్దరికీ సంబంధించిన విషయం" అంటూ వివాహం పట్ల సిద్ధార్థుడికి ఒక ఆధునిక దృష్టికోణాన్ని అనుసంధానిస్తారు ఓల్గా. వివాహానికి సుముఖుడైన సిద్ధార్థుడు జ్ఞానాన్వేషణలో యశోధరను వీడవలసి వస్తే ఆమెకు ఏమి సమాధానం చెప్పాలనే ఘర్షణలో ఉన్నపుడు కాలముని "సమాధానం చెప్పవలసిన అవసరమేమున్నది? గృహస్థాశ్రమం పురుషుడికి శాశ్వత నివాసం కానవసరం లేదు. నీ అభీష్టమే ముఖ్యం. త్యజించేందుకు వారించవచ్చుగానీ ఆపే అవకాశం ఎవరికీ లేదు. నీ నిర్ణయమే ప్రధానం. ఇది ఏ శాస్త్రమైనా అంగీకరిస్తుంది. ఏ ధర్మమైనా ఆమోదిస్తుంది.

పురుషార్థాలలో దేనికైనా ఆమోదిస్తుంది. పురుషార్థాలలో దేనినైనా పొందవచ్చు. నీవు అత్యుత్తమ ధర్మం కోసం సర్వం త్యజించడానికి సంకోచించడం అనవసరం. ఇందులో ఆమె ప్రమేయం ఏమిలేదు. అంటూ ఏ కార్యసాధనకైనా పురుషుడి అభీష్టమే ప్రధానమన్న మాటలకు సిద్ధార్థుడు "శాస్త్రాలు, ధర్మాలు చెప్పినవి అంగీకరించేందుకైతే నా అన్వేషణే అనవసరం మహాశయా - ధర్మశాస్త్రాలు చెప్పేవాటిని మించి నా హృదయధర్మం ఒకటి వుంటుంది. అది నన్ను నడిపిస్తున్నది. దానితో నేను నా నిర్ణయాన్ని తూచి చూసుకోవాలి. వివాహమైనా సన్యాసమైనా" అంటూ తన స్వీయ వ్యక్తిత్వాన్ని, హృదయ గత సంస్కారాన్ని ప్రకటిస్తాడు. మానవ కేంద్రం కాని జ్ఞానప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తాడు. అదే సమయంలో వైదిక కర్మలమీదా, మానవుడికీ దేవుడికీ మధ్య మధ్య వర్తిత్వం నెరిపేవారి మీదా తనకు నమ్మకం లేదని స్పష్టంగా ప్రకటిస్తాడు. యశోధర పట్ల ఆకర్షితుడైనప్పటికీ తానెప్పుడైనా జ్ఞానాన్వేషణలో సర్వం వదులుకొని వెళ్ళ వలసి వస్తుందనే సత్యాన్ని యశోధరకు అనేక సందర్భా లలో చెప్పి ఆమెను సత్యంపట్ల మెలకువతో ఉంచుతాడు. ఎవరినీ నొప్పించని కరుణాంతరంగం అతడిని యశోధరకు మరింత దగ్గర చేస్తుంది.

యశోధర గారాబంగా పెరిగినా ఆడపిల్లగా కొన్ని పరిమితులున్నాయి. సిద్ధార్థుడిని ధ్యానంలో వుండగా చూసి ఆకర్షితురాలైన యశోధర తానే ముందుగా తనను పరిచయం చేసుకుంటుంది. అతడి వివరాలు తెలుసు కుని భర్త స్థానంలో అతడినే ఊహిస్తుంది. ఆమె తనలో ఉన్న విశిష్ట వ్యక్తిత్వంతోపాటు సిద్ధార్థుని మాటలతో చాలా ప్రభావితమవుతుంది. ఆమెను గెలుచుకోడానికి తండ్రి పోటీ నిర్వహిస్తున్నపుడు "వీరులమధ్య పోటీలో గెలవదగిన వస్తువుగా నేను నిలబడదల్చుకోలేదు. నేను సిద్ధార్థుని వివాహమాడడానికి పూర్తి సమ్మతి తెలియజేస్తున్నాను" అంటూ మొదటిసారి తనపట్ల తనకున్న గౌరవాన్ని వెల్లడిస్తుంది. సత్యాన్వేషకుడిగా తాను ఆమెను విడిచి వెళ్ళవలసి వస్తుందని సిద్ధార్థుడామెను హెచ్చరించినపుడు "నన్ను నేనూ పరీక్షించుకుంటాను. సంఘం గురించి నాకు విమర్శ ఉంది. అసమ్మతి వుంది. దానితో మీరెంత దూరం ప్రయాణిస్తారో నేనెంతదూరం ప్రయాణిస్తానో చూడాలనీ ఉంది. సత్యం అనే మాట పైపై మాటలగానే తెలుసు. మీరు వెతకబోయే సత్యం చాలా భిన్నమైనదనిపిస్తోంది. అదేమిటో తెలుసుకోవాలని వుంది" అంటూ సిద్ధార్థుడి బాటకు తానెన్నడూ అడ్డురానంటుంది. అతనిలాగే ఆమెకూడా ఒక ప్రత్యేక చింతనాశీలి అనీ పాఠకులకు స్పష్టమవుతుంది. యశోధర తనకు అనేక విషయాలు ఎరుకపరచిందనే భావం అనేక సందర్భాల్లో ఆమె అర్థవంతమైన మాటల్లో సిద్ధార్థుడు గుర్తించడం విశేషం. వారిద్దరి వివాహం జరిగాక యశోధర సిద్ధార్థుని తాత్త్విక ఆలోచనలను ప్రోత్సహిస్తూ శారీరకంగా కాక మానసికంగా మరింత దగ్గరవుతుంది.

కొలీయులు, శాక్యులు రోహిణీనది నీటికోసం యుద్ధానికి దిగుతున్నపుడు "యుద్ధాలను ఆపగలిగితే శక్తి మీకు ఉంది ఈ భూమిపై యుద్ధాలు జరగకుండా శాంతి సమృద్ధులను సాధించే మార్గం మనం సాధించాలి. మీ అన్వేషణకు ఇది మీరు వేస్తున్న తొలి అడుగు" అంటూ అతడికి ఎనలేని స్ఫూర్తినివ్వడమే కాకుండా యుద్ధం ఆపడంలో విజయాన్ని కూడా సాధిస్తుంది. తన తండ్రి అందరికీ శుభం కలగాలన్న లక్ష్యంతో యజ్ఞం చేయ బోతున్నాడని తెలుసుకొని యజ్ఞం ఎన్ని రకాలుగా సమాజానికి నష్టమో తెలియజెప్పి దానికి బదులు యజ్ఞంలో బూడిద చేసే ధాన్యాన్ని ఆహారాన్నీ పేదలకు పంచమంటుంది. యజ్ఞం దక్షిణల కోసం ఆధిపత్యంకోసం పురోహితులు పండితులు స్వార్థంతో చేసే పని అని తన తండ్రితో ముఖాముఖి వాదనకు దిగుతుంది. యశోధర మాటలకు ఆమెకు మతిస్థిమితం తప్పిందని భయపడి వెంటనే అత్తవారింటికి పంపివేస్తాడు బింబానుడు. ఈ సంఘటన ఆమెలో కొత్త ఆలోచనలకు దారి తీస్తుంది. ఆడదానికి ఆలోచన వుంటే పిచ్చితనాన్ని అంటగడతారని

ఆలోచనాపరులుగా సమాజంలో వారికి స్థానమే లేదని, తానెన్నడూ మార్గదర్శి కాలేనని తెలుసుకోవడమే కాకుండా జ్ఞానిగా సిద్ధార్థుడు సంఘంలో గుర్తింపబడితే అతని ద్వారా స్త్రీలకు నాలుగు గోడలను దాటే స్వేచ్ఛ సిద్ధిస్తుందని కనుక తాను సిద్ధార్థుని జ్ఞానార్తిని మరింత ప్రజ్వలింప చేయాలని, అతని మార్గాన్ని తాను నిరాటంకము, సుగమం చెయ్యాలని అదే తన జీవన సాఫల్యమని లోతుగా ఆలోచనలు చేస్తుంది. రాహులుడు జన్మించిన ఏడోరోజున బిడ్డపై మోహం వ్యామోహమై పీడించకుండా సిద్ధార్థుడిని మహాభినిష్క్రమణం చేయమని ప్రేరేపిస్తూ "మానవ సమూహంలో స్త్రీలకున్న స్థానం గురించి మీకు తెలుసు మీ మార్గంలో అన్వేషించే అవకాశం వారికి లేదనీ తెలుసు. కానీ మీరు ఒక మార్గం కనుగొన్ననాడు స్త్రీలను కూడా ఆదారిలో ప్రయాణం చేసే వీలు కల్పించండి. ఆపని మీరు తప్ప మరెవరూ చేయలేరు" అంటూ సమస్త స్త్రీల గొంతుకగా యశోధరను ఉన్నతంగా నిలబెడుతుంది ఓల్గా.

సిద్ధార్థ గౌతముడికి జ్ఞానోదయం కలిగిన తర్వాత బుద్ధుడు కపిలవస్తుకు వస్తున్నాడన్న మాటతో సమస్తజనులూ సంతోషంతో తలమునకలవుతుంటే యశోధర మాత్రం "బుద్ధుడిపుడు ఒక వ్యక్తి కాడు. కుశాలా ఒక మార్గం. ఆ మార్గంలోనే నేనున్నాను. నేను వెళ్ళి బుద్ధుని సందర్శించాల్సిన అవసరం లేదు. నేను బుద్ధత్వంలో మమేకమైవున్నాను" అంటూంది ఈ మాట లతో యశోబుద్ధ అన్న ఓల్గా శీర్షిక ఎంత ఔచితీవంతమో అర్థమవుతుంది. స్త్రీలకు కూడా బుద్ధుడి మార్గంలో ప్రవేశించడానికి వీలుదొరికిందని, తల్లి గౌతమిని తన సమూహంలో బుద్ధుడు చేర్చుకున్నాడని తెలియగానే యశోధర ఆనందతరంగితమవుతుంది. "స్త్రీలకిక సంసార బంధనం విధిగా కట్టుకోవలసిన పలుపుతాడు కాదు కుశాలా. ఒకవేళ బంధింపబడినా ఎప్పుడైనా విప్పు కోగలిగిన స్వేచ్ఛ దొరికింది. విశాలప్రపంచం లోకి అడుగుపెడదాం. మానవుల దు:ఖాన్ని తొలగించే మంచి మాటలు బోధిస్తూ మనలో కలిగించే ఆనందాన్ని అనుభవిస్తూ మనం సమూహంలో కలిసిపోదాం. సమూహంలో మన అస్తిత్వాన్ని కనుగొందాం" అనే యశోధర మాటలు వేనవేల సంవత్సరాల స్త్రీ దౌర్భాగ్యపు రోజుల నుండి స్వేచ్ఛా పతాకం నెగురవేస్తున్న నేటి రోజుల వరకూ స్త్రీ ప్రస్థానాన్ని కళ్ళకు కడతాయి.

యశోధర కూడా భిక్షుకిగా మారి గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలలో పరివర్తన తెచ్చేందుకు కృషి చేస్తుంది. ఒక గ్రామాలలో అంటువ్యాధి ప్రబలినపుడు మిగిలిన భిక్షువులు భయపడి వెళ్ళిపోతామన్నపుడు యశోధర "మనం సమస్తాన్నీ త్యజించాం. దేనికోసం ? ఈ మానవుల దు:ఖాన్ని పోగొట్టడం కోసం. త్యజించడానికి మన దగ్గర ప్రాణమొక్కటే వుంది. దానిని కాపాడుకోవటానికి మానవ మహాధర్మమైన పరోపకారాన్ని వదిలేద్దామా? బుద్ధుని బోధనలు వదిలేద్దామా? చివరిగా బుద్ధుడినే వది లేద్దామా?" అంటూ ప్రశ్నించడంతో బుద్ధుని మార్గంలో ఆమె ఎంత గాఢంగా మమేకమైందో తెలుస్తుంది. అంటువ్యాధి బారిన పడిన రోగులకు సేవచేస్తూ అదే వ్యాధితో బాధపడుతూ పంపవలసినవారికి తన మరణవార్తను పంపమని తోటి భిక్షుకి కుశాలతో చెప్పి దేహాన్ని త్యజిస్తుంది యశోబుద్ధ.

చరిత్రలో యశోధర లాంటి ఎందరో స్త్రీలు తమను తాము ప్రత్యక్ష కార్యాచరణ రంగం నుంచి ఉపసంహ రించుకొని మరుగున వుండి చరిత్రను నడిపించారని, వారి చరిత్రలగురించి ఊహలైనా మొదలైతే ఆ తర్వాత చారిత్రక పరిశోధన, స్త్రీల చరిత్ర నిర్మాణం జరుగు తాయన్న ఆశతోనే తానీ నవలకు రూపకల్పన చేశా నంటారు ఓల్గా. మహిళలుగా మనమూ అదే కోరు కుందాం.

**ఆధార గ్రంథాలు:**

1. యశోబుద్ధ, ఓల్గా స్వేచ్ఛ ప్రచురణలు, నవంబ్ 2017.
2. బుద్ధుడు - బౌద్ధం, తిరుమల రామచంద్ర (సంకలనం) జయంతి పబ్లికేషన్స్ 2017.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ముదిగంటి సుజాతా రెడ్డి "మరో మార్క్స్ పుట్టాలె!" కథలు - మహిళా దృక్పథం

- జె. కోమలా ప్రియదర్శిని, పరిశోధక విద్యార్థిని, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

ఈ భూమి మీద స్త్రీ పురుషులిద్దరూ ఒకేసారి జీవనం మొదలెట్టారు. జాతి ఉత్పత్తిలో ఇద్దరూ సమప్రాధానయత కలవారు. కానీ పరిణామ క్రమంలో స్త్రీ పూర్తిగా వెనుకపడి పోయింది. పురుషుని అభివృద్ధి స్త్రీ మీద, ప్రకృతి మీద కూడా ఆధిపత్యం చలాయించే వరకు వెళ్ళింది. దీనికి కారణం ఏమిటనే ఆలోచన నుండే స్త్రీవాదం పుట్టింది. కార్లమార్క్స్ చెప్పిన రాజ్యపరమైన దోపిడి, అణచివేతతో పాటు పితృసామ్య వ్యవస్థ స్త్రీలపై చేస్తున్న దోపిడిని ప్రశ్నిస్తూ ఆమేరకు స్త్రీలను చైతన్యపరుస్తూ అనివార్యంగా వచ్చింది.

'గురుకుల ఆరాధన' అని మార్క్స్ చేసిన సూత్రీకరణ నిజానికి ఆయన అది ప్రతిపాదించిన 1860 సం॥లలో ఎంత నిజమోనని, ప్రపంచీకరణలో దశలో అక్షర సత్యంగా మారిపోయిందని శ్రీమతి ముదిగంటి సుజాతా రెడ్డి గారి భావన. సమాజంలో, మార్కెట్‌లో ఈ మార్పులు జరుగుతన్నాయంటే అవి కేవలం సరుకుల్లోనో, అమ్మకాల లోనో, కొనుగోళ్ళలోనే మాత్రమే జరగడం లేదు. మనుషుల్లో, మనసుల్లో జరుగుతున్నాయని ఆమె ఉద్దేశం. ఆ దృక్పథంతోనే "మరో మార్క్స్ పుట్టాలె!" కథల సంకలనంలోని కథలను రచించారు.

### ఆఖరికి మగమహారాజు కథ - స్త్రీవాద దృక్పథం:

సావిత్రి చిన్నతనం నుండి ఎంతో తెలివైనది. ధైర్య సాహసాలు గలది. కానీ చదువులో మాత్రం రాణించలేక పదవ తరగతి కూడా ఉత్తీర్ణురాలు కాలేక పోతుంది. కొన్నాళ్ళకు సావిత్రిక వివాహమై నలుగురు సంతానం కలుగుతారు. భర్త కూడా సంపాదనపరుడు, మంచివాడే. సావిత్రికి పిల్లలు పుట్టిన తర్వాత భర్త ప్రవర్తనలో మార్పు వస్తుంది. మధ్యానికి బానిసై భార్యా బిడ్డలను పట్టించుకోవడం మానివేసి డబ్బంతా వృథా చేసేవాడు. అతని ప్రవర్తనకు విసుగు చెందిన సావిత్రి "నీ పిల్లల్ని నువ్వు ఏమైనా చేసుకో! సాదుకుంటావో సంపుకుంటావో నీ ఇష్టం!" అని భర్త ముఖం మీద అనేసి ఇల్లు విడిచి పుట్టింటికి వస్తుంది. తండ్రి చనిపోవడంతో సావిత్రికి పుట్టింట్లో ఆదరణ కరువవుతంది. కూతురు భవిష్యత్తు కొరకు ఆందోళన చెందుతున్న తల్లితో "నా బతుకు నేను బతికి చూపిస్తా" అని చెప్పి, తన మెడలో పుస్తెను అమ్మి వచ్చిన కొద్దిపాటి పైసలతో సావిత్ర కూరగాయల బేరం పెడుతుంది. ఆరునెలలకు ఆ వ్యాపారం పెద్ద దుకాణంగా మారుతుంది. అది ఏడాదికి డిపార్టుమెంటల్ స్టోర్‌గా మారుతుంది. అప్పటికీ సావిత్రి భర్తలో ఎటువంటి మార్పు రాదు. చివరకు పిల్లలను వదిలేసి ఎటో వెళ్ళి పోతాడు. బాధ్యతారాహిత్యుడైన భర్తను నిందించు కుంటూ పిల్లలను తనవద్దకే తెచ్చుకుంటుంది.

ఈ కథలోనే సావిత్రి స్నేహితురాలు కూడా తాగు బోతైన భర్తను భరిస్తూ, నలుగురు పిల్లలను పెంచలేక నరకయాతన అనుభవిస్తూ తన జీవితాన్ని వెళ్ళదీస్తూ వుంటుంది. కానీ సావిత్రి మాత్రం తన జీవితాన్ని ఆ విధంగా గడపదలచుకోలేదు. భర్తను ఎదిరించి పిల్లలను పెంచే బాధ్యతను తన భర్తకే వదిలేస్తుంది. తాను ఆర్థికంగా బలపడిన తర్వాత పిల్లల బాధ్యతను స్వీకరిం చింది.

### పోరు తప్పదా! - స్త్రీవాద దృక్పథం :

సంధ్య ఇంజనీరింగ్ చదివి సొంత ప్రతిభతో స్కాలర్‌షిప్ తెచ్చుకొని అమెరికా వెళ్ళడానికి సిద్ధపడు తుంది. ఆమె తండ్రి సురేష్ చిన్న ప్రభుత్వ ఉద్యోగి. తల్లి రమ గృహిణి. అన్నయ్య సందీప్ అమెరికాలో వుంటున్నాడు. కొడుకుతో సమానంగా కూతుర్ని చది వించినా కొడుకు అమెరికా వెళ్ళినపుడు లేని అభద్రతా

బావన కూతురు వెళుతుందంటే కలుగుతుంది రమకు. సంధ్య అమెరికా వెళ్ళేలోపు ఆమెకు అమెరికాలో ఉన్న భారతీయునికిచ్చి వివాహం చేయాలని ఎంతో ఆరాట పడుతుంది. సంధ్యను ముస్తాబు చేయించి భర్తతో కలసి పెండ్లి మేళాకు వెళుతుంది. అక్కడంతా మగపిల్లవాండ్ల డిమాండులే వినిపించాయి. అబ్బాయి ఇంజనీరైతే లక్షలు, డాక్టరైతే కోట్లు, అమెరికాలో వుంటే లక్షల కోట్లు. అక్కడ అమ్మకం చేసేవారే కొనుగోలు దార్లను ఆడిస్తున్నారు. రమ ఇక అక్కడ ఎవర్నీ సంప్రదించకుండానే భర్తను, కూతురిని తీసకుని ఇంటికి వచ్చేస్తుంది.

సంధ్య అమెరికా వెళ్ళి ఎమ్.ఎస్. చేసి ఉద్యోగంలో చేరుతుంది. కొన్నాళ్ళకు సంధ్యకు అమెరికాలో ఉద్యోగం చేస్తున్న రోషన్‌తో వివాహం జరిపిస్తారు ఆమె తల్లి దండ్రులు. వాస్తవానికి రోషన్ వాళ్ళ అంతస్తు, సంధ్య వాళ్ళ కంటే ఎక్కువేమీ కాదు. రోషన్ అమెరికాలో ఉద్యోగం చేస్తూ పంపిన డబ్బుతో రోషన్ తండ్రి రావు గారు బంజారాహిల్స్‌లో ప్లాటు కొనుక్కొని అందులోనే వుంటున్నాడు. రోషన్, సంధ్యలు అమెరికాలో ఉద్యోగం చేస్తూ సమానంగా సంపాదిస్తూన్నప్పటికీ వివాహ సంబంధం మాట్లాడుకునేటప్పుడు రావు గారు పది లక్షలు కట్నం ఇచ్చి పెళ్లి ఘనంగా మీరే జరిపించాలని పట్టు బడతాడు. దాంతో అప్పు చేసి మరీ 20 లక్షలు ఖర్చుపెట్టి సంధ్య వివాహం జరిపిస్తాడు సురేష్. సంధ్య రోషన్‌తో కలసి అమెరికా వెళ్ళిన తర్వాత తన తండ్రి అకౌంటుకు తన జీతం నుండి ప్రతి నెలా 500 డాలర్లను పంపుతూ వుంటుంది. ఈ విషయం తండ్రి ద్వారా తెలుసుకున్న రోషన్ సంధ్యను కోపగించుకుంటాడు. ఇక నంచి తన తండ్రికి డబ్బు పంపవద్దని, వారిద్దరి పేర్ల మీద జాయింట్ అకౌంట్ తీసుకోమని గట్టిగా మందలిస్తాడు. ఇద్దరి వాగ్వాదం పెరుగుతుంది. రోషన్ చాకుతో సంధ్య మీద దాడిచేయబోతే సంధ్య తప్పించుకుంటుంది. రోషన్ కొంచెం నిదానించిన తర్వాత ఇటువంటి మూర్ఖునితో ఉండలేనని నిర్ణయించుకుని పెళ్ళైన ఆరు నెలలకే ఇంటి నుండి బయటకు వచ్చేస్తుంది.

ఈ కథలో సంధ్య చదువులోను, ఉద్యోగ సంపాదన లోను పురుషునితో సమానంగా ఉన్నప్పటికీ వరకట్నమనే పిశాచి బారి నుండి తప్పించుకోలేక పోయింది. అంతే కాకుండా రోషన్ సంపాదనలో లేని జోక్యం పురుషాధి పత్యంతో సంధ్య ఎదుర్కొనవలసి వచ్చింది.

పై రెండు కథలలోని పాత్రలను ముదిగంటి సుజాతారెడ్డి గారు చాలా ఉన్నతంగా మలిచారు. ప్రతికూల పరిస్థితులపై ఎదురు తిరిగి గెలిచే లక్షణాలు ఈ రెండు పాత్రలలో మెండుగావున్నాయి. వాస్తవానికి వివాహానికి ముందు ప్రతి యువతి తన భర్త, పిల్లలతో ఆనందమయ జీవితం గడపాలని కలలు కంటుంది. కానీ వరకట్న దాహం, పురషాధిపత్య కోరల్లో చిక్కుకుని ఎందరో స్త్రీలు బలైపోతున్నారు.

కొందరు స్త్రీలు మాత్రం సావిత్రి, సంధ్యల పాత్రల వలె తమ వాదాన్ని బలంగా వినిపిస్తూ తప్పని సరి పరిస్థితుల్లో బలవంతంగా బంధాలను తెంచుకుని బయటకు వస్తున్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు ప్రతికూల పరిస్థితులకు క్రుంగి పోకుండా వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపే విధంగా సుజాతారెడ్డి గారు ఇటువంటి రచనలు చేయడం ఎంతో ప్రశంసనీయం.

# ఆధునిక సాహిత్యంలో డా॥ జోత్స్న ప్రభగారి కవిత్వ 'కలల పరిమళం' - పరిశీలన

- అలువాల మహేందర్, తెలుగు ఉపన్యాసకులు, వివేకానంద డిగ్రీ& పిజి కళాశాల, కరీంనగర్.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళాస్థానం సుస్థిరమైనది. తెలంగాణా మహిళా సాహిత్యంలో స్త్రీకి ఒక ప్రత్యేక స్థానం కలదు. భారతీయ సంప్రదాయంలో స్త్రీ పాత్ర ఎంతో ప్రశంసనీయమైనది. సంసార శకటానికి స్త్రీ పురుషలిరువురు రెండు చక్రాలుగా అమరిపోయి జీవయాత్రలు కొనసాగిస్తున్నారు. భారతీయ సంప్ర దాయాన్ని సంరక్షించడంతో కంకణధారి 'కాంత'యే అని తెలుపవచ్చు.

స్త్రీని తల్లిగా, భార్యగా,బిడ్డగా,అత్తగా, కోడలుగా, స్త్రీ సంసార రంగంలో విశ్వవిహారం చేస్తుంది. గృహజీవితంలో పురుషుడికన్నా స్త్రీకే ఎక్కువ వేడుకలు మనకు ఎక్కువ కనిపిస్తాయి. సంఘంలో స్త్రీల పాటలకు విశిష్ట స్థానం ఎలాఉందో స్త్రీ కవిత్వానికి కూడా పండితాదరణతో పాటు అధికాదరణ ఉందని చెప్పవచ్చు.

పసుపు, కుంకుమ, మాంగల్యం అపూర్వ సంపదలని, అవిలేకున్నా ఎంత ఐశ్వర్యం ఉన్నా స్త్రీ జీవితానికి సార్థకం లేదని జానపద సంప్రదాయ స్త్రీలు భావిస్తారు. అలాంటి నేపథ్యంలో ప్రతి స్త్రీ ఆకాశంలో సగం మేము అంటూ నేడు అన్ని రంగాల్లో అత్యంత గౌరవాన్ని పొందుతుంది. అలాంటి స్త్రీ కవయిత్రులలో తెలుగులో మొట్ట మొదటి రామాయణ కవయిత్రి మొల్లనుండి నేటి ఆధునిక సాహిత్యంలోని స్త్రీలు పసుపులేటి రంగాజమ్మ, ముద్దు పళని, ఇల్లిందల సరస్వతి దేవి, నందగిరి ఇందిరాదేవి, మాలతీచందూర్, డా॥ పాకాల యశోదారెడ్డి, డా॥ముదు గంటి సుజాతారెడ్డి,ఆచార్య కాత్యాయని విద్మహే, ఆచార్య పి.జ్యోతి, ఆచార్య వేలూరి శ్రీదేవి, డా॥అడువాల సుజాత గార్లు ఇలా ఎంతో మంది పేరు ప్రఖ్యాతులు కలిగిన స్త్రీలు ఉన్నారు. అలాంటి వారిలో కరీంనగర్ కళామతల్లి ముద్దుబిడ్డ డా॥ కొండపాక జోత్స్నప్రభ గారు. వారు 1963 అక్టోబర్ 6 వతేదిన కీ॥శే॥ శ్రీ కొండపాక ఆగయ్య-మంగమ్మ అనే పుణ్య దంపతులకు 5వ సంతానంగా కరీంనగర్ జిల్లాలో జన్మించారు.

## బాల్యం, విద్యాభ్యాసం :

డాక్టర్ జ్యోత్స్న ప్రభగారు పుట్టింది కరీంనగర్‌లో, బాల్యం విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లో, వీరి జీవిత భాగస్వామి సుదర్శన్ వీరికి ఇద్దరు కూతుర్లు సమీరా, సుస్వర. డా॥ జ్యోత్స్నప్రభగారు ఎం.ఎ (తెలుగు)లో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో విద్యనభ్యసించారు.

## ఎం.ఫిల్ :

ఆరోహణ- ఒక పరిశీలన అనే అంశంపై పూర్తి చేశారు.

## పి.హెచ్.డి :

పరిశోధనాంశం-"సినారె గేయరచనలు- వస్తుభావ నవ్యత"

## రచనలు :

సవ్వడి (కవితాసంపుటి)-2004.

కలల పరిమళం (కవితా పరిమళం-2017)

కాంతిధృవ (విమర్శగ్రంథం-2017)

వాఙ్మయి, మూసీ, నవతెలంగాణ, వార్త, నేటినిజం పలు పత్రికల్లో వందకు పైగా వీరి రచనలు వెలువడ్డాయి.

28 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా ప్రశంగాల పత్రాల సమర్పణ చేశారు.

2019లో అలిశెట్టి స్మారక రాష్ట్రస్థాయి పురస్కార గ్రహీత, వివిధ రంగాలలో 18 అవార్డులు, రాష్ట్రస్థాయినే ఈమెను వరించాయి. నవతెలంగాణ, ఈటివీ, భక్తిటివి,

మహాటివి, టెన్‌టివి, దూరదర్శనలో ఇంటర్వ్యూలు మరియ కవి సమ్మేళనాలు ప్రసారమైనవి.

శిలాలోలిత, భూమికలో వ్యాసాలు రాశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాచ్య కళాశాలల విభాగానికి పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షురాలిగా రెండు సంవత్సరాలు పనిచేశారు.

ఈమె పర్యవేక్షణలో(సూపరవైజర్) నలుగురు పి.హెచ్‌డి అవార్డులు పొందారు. వీరు పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకురాలుగా (గైడ్) కొనసాగుతున్నారు.

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులుగా ఇదే విశ్వవిద్యాలయానికి పరిశోధక విద్యార్థులకు ఎక్స్టర్నల్ వైవాకు హాజరయ్యారు. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థల కవి సమ్మేళనాలను పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా హయత్ నగర్, హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

వీరి కలం నుండి జాలువారిన "కలల పరిమళం" అనే కవితా సంపుటిని గురించి నా పరిశోధన పత్ర సమర్పణ చేస్తున్నాను. ఈ పుస్తకంలో మొత్తం 38 కవితా ఖండికలున్నాయి. ఈ కవితా ఖండికలోని కవితలు వివిధ పత్రికల్లో అచ్చైనవి. భక్తి టివి, టెన్‌టివిలో ప్రసారమయ్యాయి. ఒక్కో కవిత ఒక్కో విధంగా వైవిధ్యం సంతరించుకున్న ఈ కవితలు దేనికదే ప్రత్యేకమని చెప్పవచ్చు. కుసుమోత్సవం, నడిచే పూలపాదలు, వెన్నెల దీపాలు, శృతకవిత్వం, సూర్యుడు గురుడు, నది హృదయం, మాట మధూదయం, ఒక చెలియకోసం, కలల పరిమళం, స్నేహపరిమళం, కలకలవరింత, కలల గురించినవి ఈ పుస్తకంలోని కవితలు ఎటుచూసిన కవిత్వమే. బాల్యం ఎంతో అమయాకమైనది. కనిపించేది, అనుకోనేది అన్ని తనవే తన కోసమే ఉన్నట్లు కలలో తేలిపోవడం జరిగింది. తన కలల పరిమళం కవితలో ఈ రచయిత్రి అందరి కలలను ఆవిష్కరిస్తారు. అందరిని బాల్యంలోకి మామూలుగా కాదు కవిత్వంతో తీసుకెళ్లతారు.

తన బాల్యాన్ని స్మరించుకుంటూ చెప్పిన విషయాలు పాఠకుల బాల్యాన్ని తలచుకున్నేట్లుగా ఉన్నాయి. కచ్చగాయలాట, చింతగింజలతో ఆట, దాగుడు మూతలాట ఇవి ఆడపిల్లల ఆటలు. బొంగరాలాట, పంతంగులు ఏగురువేయుట మగపిల్లలకు ప్రత్యేకం. ఇవి ఆడాలని వున్నా ఆడలేదు. ఆడలేనందకు బాధ అంటూ ఆటల విషయంలో ఆడమగ భేదాలెందుకో తెలియని వయస్సు అనే వాక్యాలు కవయిత్రి హృదయ సౌకుమార్యాన్ని తెలుపుతాయి అని ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారు అన్నారు.

పూర్వ కవులను అనుసరిస్తూ ఆధునిక భావాలతో ఆధునిక సాహిత్య పదజాలంతో "శేషేంధ్ర జాలం"లో శేషేంద్ర గారిని " జ్వాలజలధి"లో దాశరధి గారిని'సినారె సితార'లో సినారె గారిని కవితల్లో తలచుకుంటూ అందమైన కవిత్వాన్ని రాశారు.

కవయిత్రి సామాజిక స్పృహ, సమాజం ఎలా ఉండాలో చెప్పే 'కాలచక్ర' కవిత నిండా కవిత్వమే. ఇలా కవిత్వాన్ని ఉదహరిస్తూ పోతే 'కిసలయ స్వప్నం' కల, కలవరింత నిండా కవిత్వమే. డా॥జ్యోత్స్నప్రభ గారికి కవిత్వమంటే ఎంత ఇష్టమో ఆ ఇష్టాన్ని కల కలవరింత కవితలో తెలియజేస్తుంది.

కుసుమోత్సవం, నడిచిపూలపాదలు, వెన్నెలధీపాలు మొదలగునవి చాలా చోట్ల మాతృహృదయం ఒలుకుతున్నట్లే కవయిత్రిగారి కవిత్వంలో అంతకు మించి స్త్రీవాద పంక్తులు, భావాలు కోకోల్లలు.

"ఊయలలూపే చేతులే ఉర్విని పాలించగలవు" అనే వాక్యం తన నాన్నగారికి ఈ కృతి అంకింత కవితలో తను తానే గుండెల్లో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపుకునేదాన్ని అంటూ చాలా చక్కగా వివరించారు. ఈ వాక్యాలు స్త్రీవాద కవిత్వానికి నిదర్శనాలు కదా!

"సూక్తులను మంచి పద్యాల విత్తనాలను
మా చిత్త క్షేత్రాలలో నాటుతుండేవాడు

తన వ్యవసాయ పద్ధతులు తనని
మా హృదయ క్షేత్రాలలో కలుపు ఎన్నడూ
పెరగనివ్వలేదు"

ఈనాడు ఏ తండ్రి అయినా చేయ్యాల్సిందే. తండ్రి నిత్యశోధకశక్తి అనునిత్య చైతన్యస్ఫూర్తి కావాల్సిందే. ఆ తండ్రి ఆలోచనలు సౌదామినులు భావాల పరిమళాలు, వెలుగుల జలపాతాలు, వెన్నెలల ప్రవాహాలలో పిల్లలను మంచి తేల్చాల్సిందే. ఈ మాటలన్నీ కవయిత్రివే. ఆ కాంతి దారి నుంచి వచ్చింది. కవిత్వం. తాను నాటిన మొక్క అలవోకగా అదికదలి చివురాకల పెదవులతో నన్ను.....
'అమ్మా' అని పిలిచినట్లే అనిపిస్తుంది.

తొలిసారిగా
మూడు మొగ్గలు వేసింది
నెలవంకను కత్తిరించి
పచ్చిపాల నుర్వును పట్టుదారాలతో
పోత పోసుకున్నట్లు
మంచి బిందువులన్ని ముద్ద చేసుకున్నట్లు
ఎంత ముద్దుగా ఉన్నాయని

ఎన్నో భావ చిత్రాలను.... ఈ కవిత గుప్పిట పట్టుకొన్నది. మూడు మొగ్గల్లో ముల్లోకాల దృశ్యాలు చూపించారు కవయిత్రి. ఇలా కుసుమోత్సవం నిండా కుసుమాలే కనిపిస్తాయని పీఠికలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు ప్రశంసించారు.

**శిల-మహిళ :**

కవిత- స్త్రీవాద కవిత్వానికి అద్దం పట్టేవిధంగా రాశారు. ఇందులో మనుషుల్లో రకాలు, మహిళ్లలోనూ అనేక రకాలు, అందరూ ఒకే రకంగా ఉండరు. ఈ సాధారణ విషయాన్ని తీసుకుని కవయిత్రి శిల-మహిళ అని ఒక కవిత రాసింది. శిలల్లో అనేక రకాలు వెన్నెలకు వెన్న ముద్దలా కరిగిపోయే చంద్రకాంత శిలలు కొన్ని సూర్య కాంతికి కరిగే శిలలు కొన్ని ఇట్లా కరిగే శిలలుంటాయి. నిప్పులను కురిసే శిలలుంటాయి. ఇవి చెకుముకిరాళ్లు ఉలిదెబ్బకు శిల్పలయ్యే శిలలు కొన్ని విసురురాళ్లవుతాయి. పలికేరాళ్లు, పాడే రాళ్లు కొన్ని విశ్లేషించి వివరించారు.

ఇంకా

పువ్వులో నవ్వులో రకాలు ఉన్నట్లే
రాళ్లలోనూ రవ్వల్లోను ఎన్నోన్నో రకాలు
ఒకటి పరిమళిస్తుంది
ఒకటి జ్ఞానం
ఒకటి జీవన గమన స్థితిని పెంచుతుంది.
ఒకటి షహనాయిలా మోగితే
ఒకటి సింగిడిలా సవ్వడి చేస్తుంది
పువ్వులకు పరిమళ భాష ఉన్నట్లే
రాళ్లకు ఒక రహస్యభాష ఉంది" అన్న విషయం ఎప్పుడు తెలుస్తుదంటే" హృదయంతో వింటేనే" ఈ కవితకు శిల-మహిళ' అని పెట్టడానికి మూలం.

శిలయైన అహల్య శిలగా మారటానికి ఆమె భర్త గౌతముడు కారణం. ఈ కథాంశం ప్రేరణగా

"అడుగడుగునా గౌతమ మహర్షులు పురుషేంద్రులు
నడియాడే ఈ లోకంలో నాకెందుకో ఏ ఒంటరి
రాయిని చూసినా
శాపగ్రస్త అహల్యగానే కనిపిస్తుంది"

అనే వాక్యాలు వచ్చినాయి. శాపగ్రస్తమైన అహల్య ఒంటరి రాయిగానే మిగిలిపోతుంది. ఒంటరిరాయిని చూస్తే ఆ శాపగ్రస్త అహల్యగా కనిపించటం మహిళలపట్ల రచయితకి ఉన్న సాధుభావం. స్పష్టం తాను చెప్ప దలచుకున్న విషయాన్ని చెప్పి కవితకు ముగింపు పలికింది.

శిల-మహిళ కవిత కవయిత్రి ప్రతిభకు నిదర్శనం. కలల అద్దాలు-నాభోమణి-ప్రతీకలు, 'నడిచే పూలపొదలనే కవితా శీర్షిక సైతం ప్రతీక. కలల పరిమళంలో రూప అలంకారాన్ని ప్రయోగించారు.

జీవితంలో ప్రతి అంశాన్ని గమనిస్తూ, నాటి సమాజం గురించి వైవిధ్య భరితమైన ఊహాలోకంలోని ఊహాలను ప్రకృతి రమణీయతను మానేరు అందాల్ని చాలా చక్కగా చిత్రీకరించారు డా॥జ్యోత్స్నప్రభగారు.

"కాగితాల ప్రమిదల్లో అక్షరాల వత్తులు వేసి
భావస్నేహం నింపి
నేను వెలిగిస్తున్నా కవితా కాంతి దీపాలను" అని అంటున్న డా॥ జ్యోత్స్నప్రభగారి కవిత్వం భావుకత పాఠకులను తప్పక రంజింపజేస్తుంది.

డా॥ సి.నా.రె "ఋతుచక్రం" దీర్ఘకవిత కాని కవయిత్రి రెండుపుటల్లో ఆరు ఋతువుల కవిత్వాన్ని ఆవిష్కరించారు.

వాసంత సమీరమొకటి
అలవొకగా తను తరువును మీటుతుంది
పులకించి పల్లవించి పుష్పించి
పరిమళ ప్రబంధ కావ్యాలను పంచుతుంది.

ఇందులో శబ్ద చిత్రాలన్ని పరిమళ ప్రబంధ కావ్యాలుగా విషాదాంత కావ్యాలుగా, పచ్చని ప్రణయ కావ్యాలుగా విప్లవ కవితాక్షరాలుగా చిరుకోరకాల ప్రతీకలుగా సాక్షాత్కరిస్తాయి.

ప్రకృతి నిండా కవిత్వాన్ని దర్శించిన కవయిత్రి కలల అనువాదం కవితలో అక్షరాక్షరం కవిత్వమే అంటారు. ఎక్కడ తాకినా కవితా స్పర్శే పరిపక్వమైన శైలిలో భావచిత్రాలుగా రమణీయమైనది.పేరుకు తగ్గట్లు డా॥ జ్యోత్స్నప్రభగారి కవిత్వం వెన్నెల ప్రభవించినట్లు ఎంతో సుమనోహరంగా ఉంది. కవయిత్రికి గారి ధన్యవాదాలు.

**చివరిమాట :**

ఈ సెమినార్ ఈ అంశంపై ప్రశంగ పత్ర సమర్పణకు నాకు అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులకు కృతజ్ఞతలతో సెలవు.....

**ఆధార గ్రంథాలు :**

1. కలల పరిమళం- డా॥ జ్యోత్స్నప్రభ
2. మరికొన్ని కవితాపుస్తకాలు

❀ ❀ ❀

# సాహితీ రుద్రమ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

**– డా॥. వి. శ్రీదేవి,** కళాశాల అధ్యక్షులు, చేబ్రోలు ప్రభుత్వ కళాశాల, గుంటూరు (జిల్లా).

"మహిళాలోకంలో మానవీయురాలు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు. బిరుదుగా, అన్వర్థనామంగా సాహితీరుద్రమ వారికి సముచితం. విద్వత్కవయిత్రిగా, జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తురాలిగా, మహిళాభ్యుదయవాదిగా లక్ష్మీకాంతమ్మగారి సేవ వేనోళ్ళ కొనియాడదగ్గది. మహిళాలోకంలో మణిపూస, ఆదర్శ మహిళ, సాహిత్యరంగంలో, సమాజసేవారంగంలో వారిసేవ అనన్య సామాన్యం, అనితర సాధ్యం." అని ఆచార్య ఎస్. గంగప్పగారు అన్న మాటలు అక్షర సత్యాలు.

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు రాజ మహేంద్రవరంలో 1917 డిశెంబరు 25న జన్మించారు. వీరి తల్లిదండ్రులు నాళం సుశీలమ్మ, నాళం కృష్ణారావు. రాజమండ్రిలో ప్రఖ్యాతిగాంచిన గౌతమీ గ్రంథాలయ స్థాపనలో నాళం కృష్ణారావుగారి పాత్ర అనన్య సామాన్యమైనది. అలాంటి మధురకవి నాళం కృష్ణారావు కూతురుగా జన్మించిన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు సరస్వతీ మధుర కంఠనాళమైంది.

లక్ష్మీకాంతమ్మగారు సంస్కృతాంధ్ర భాషలలో ప్రక్రియా వైవిధ్యంతో 18 గ్రంథాలు వ్రాశారు. చిన్నచిన్న రచనలు, వ్యాసాలు అనేకం రాశారు. వీరు చేసిన ఉపన్యాసాలు శతాధికం. వీరి ఉపన్యాసశక్తి పరమాద్భుతం. "లక్ష్మీ కాంతమ్మ ఉభయభాషా ప్రవీణ పరీక్షలో ఉత్తీర్ణ. ఎం.ఏ చదువలేదు. పిహెచ్.డి. చేయలేదు. అధ్యాపక వృత్తి చేపట్టలేదు. అయినా తగుస్థానాన్ని సాహిత్యరంగంలో ముఖ్యంగా ఉపన్యాస ప్రక్రియలో సంపాదించుకొన్నారు. కొండంత ఆత్మవిశ్వాసం, గోదావరంత వాక్చాతుర్యం ఆమెకు ఆ స్థానాన్ని సంపాదించిపెట్టాయి" అని శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు అన్నమాటలు అక్షర సత్యాలు.

## బాల్యం :

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి బాల్యం అంతా రాజమండ్రిలోనే సాగింది. అన్నగారితో కలిసి ఆట పాటలలో పాల్గొనేది. వారి ఇంటి చుట్టుప్రక్కల ఉన్న మగపిల్లలతో కలిసి ఆడుకోవడంవల్ల ధైర్యం, చొరవ ఆమెకు సహజంగానే అలవడ్డాయి. గులకరాళ్ళతో కలిసిన రత్నం దాన్ని ప్రకాశాన్ని పోగొట్టుకోనట్లే, లక్ష్మీకాంతమ్మ గారిలో సహజసిద్ధమైన సంస్కారానికి ఈ స్నేహాలేవీ ప్రతిబంధకాలు కాలేదు.

## విద్యాభ్యాసం :

లక్ష్మీకాంతమ్మగారి విద్యాభ్యాసం చిన్నతనంలోనే మాతావహులు ఇంట్లో సంగీతంతో ప్రారంభమైంది. ఈమె విద్యాభ్యాసం సంగీతవిద్య, జాతీయవిద్య, కళాశాల విద్య అని మూడు దశలుగా సాగింది. ఆమె విద్యార్జన సర్టిఫికేట్ల కోసం కాకుండా జ్ఞానసముపార్జన లక్ష్యంగా సాగింది. అనంతరం రాజమండ్రిలో నాళం రామలింగయ్యగారు 1920 సంవత్సరంలో స్థాపించిన వైశ్య సేవాసదనంలో ఆమె విద్యాభ్యాసం మొదలైంది. ఈమె మొదటి నుండి అన్ని తరగతులలో ప్రథమురాలిగా ఉండేవారు. ఈమె నాలుగవ తరగతి పరీక్షలో ప్రథమురాలిగా వచ్చినప్పుడు బహుమతిగా ఏం కావాలో కోరుకో అని సేవాసదనం అధ్యక్షురాలు అడుగగా, అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' కావ్యాన్ని బహుమతిగా ఇప్పించవలసిందిగా కోరుకున్న దట. ఆ తర్వాత కళాపూర్ణోదయం, వసుచరిత్ర, విరాటోద్యోగపర్వాలు బహుమతులుగా పొంది, ఆ గ్రంథాలను చదివి క్రమేపి సాహితీ ప్రియురాలైంది. స్కూలు విద్యార్థినిగా ఉన్నప్పుడే ఆశువుగా, అధిక్షేపణ పూర్వకంగా తేటగీతులు చెప్పేవారు. స్కూలు నుండి ఇంటికి వెళ్ళగానే తండ్రితో కలిసి గౌతమీ గ్రంథాలయా నికో, బ్రహ్మసమాజ మందిరానికో, మరేదైనా సాంస్కృతిక సమావేశానికో వెళ్ళేవారు. ఆయాసభలకు, సమావేశాలకు హాజరవ్వటమే గాక, తండ్రితో కలిసి ఆయా ప్రాసంగి

కులతో జరిగే ఇష్టాగోష్ఠులలో పాల్గొనడం వల్ల బెరుకుపోయి, చిన్నవయస్సులోనే ఉపన్యాసాలిచ్చే స్థాయికి లక్ష్మీకాంతమ్మగారు ఎదిగారు.

## జాతీయోద్యమం :

స్వాతంత్ర్యోద్యమం, దేశీయభాషావ్యాప్తి, దీనజనసేవ ఇలా వేరువేరు లక్ష్యాలతో ఎందరో మహాత్ములు, త్యాగ ధనులు తమ సర్వస్వాన్ని త్యాగంచేసి, వారి జీవితా శయాలకు పాటుపడుతున్న సమయమది. ఒక రంగం లోనివారు తక్కిన రంగాల్లో కూడా విధిగా పాల్గొంటూ వుండేవారు. ఆ సమయంలో రాజమండ్రిలో కూడా జాతీయోద్యమం ఉధృతంగానే నడుస్తున్న కాలం. ఆమె చదువుకుంటున్న రోజుల్లో గాంధీజీ పిలుపుతో స్ఫూర్తిని పొంది లక్ష్మీకాంతమ్మగారు సత్యాగ్రహ సమరంలో పాల్గొన్నారు. ఖాదీ వస్త్రాలను అమ్మటం, ఊరేగింపులు మొదలైన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తండ్రి కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా కీలకంగా పాల్గొం టున్న కారణంగా ఆమెకు అది నిత్యకృత్యమైంది. సబర్మతీ ఆశ్రమం నుంచి, కొందరు కాంగ్రెస్ నాయకుల నుంచి ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలు ఇంగ్లీష్‌లో ఉండేవి. అవి రాజమండ్రికి చేరేవి. వాటిని రాత్రిపూట రహస్యంగా తండ్రి కృష్ణారావుగారు అనువాదం చెప్తూ ఉంటే, లక్ష్మీకాంతమ్మగారు వ్రాసేవారు.

## వైవాహిక జీవితం :

లక్ష్మీకాంతమ్మగారు భాషా ప్రవీణ చదివే రోజుల్లోనే చీరాలకకు చెందిన ఊటుకూరి వేంకటేశ్వర శ్రేష్ఠిగారి రెండో కొడుకు హయగ్రీవగుప్తతో 1930 మార్చిలో వివాహం జరిగింది. ఊటుకూరి వేంకటేశ్వరశ్రేష్ఠిగారు కూడా జాతీయ ఉద్యమకారుడే. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారితో కలిసి చీరాల-పేరాల సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. అలాంటి కుటుంబంలో లక్ష్మీకాంతమ్మగారు అడుగుపెట్టిన తరువాత ఆమెకు భర్త మరింత ప్రోత్సాహాన్నిచ్చి ఆమె చదువును కొనసాగింపచేశారు.

## సాహితీ రచనా వ్యాసంగం :

సాహిత్యం వ్యక్తి కీర్తికి శాశ్వతత్వాన్ని సంపాదించి పెడుతుంది. ప్రాచీనకవుల్ని ఇప్పుడు మనం స్మరించుకోవటానికి కారణం వారు సృష్టించిన అద్భుతసాహిత్యమే కకదా! కవి ఆచంద్ర తారార్కం జీవిస్తాడు. కృతి భర్తకు సైతం చావులేదు. అందుకే మహాకవి గుర్రం జాషువా

"రాజు మరనించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకలయందు"

అని అంటారు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి విషయంలో కూడా ఇది నిజమనిపిస్తుంది.

లక్ష్మీకాంతమ్మగారు సంస్కృతాంధ్ర భాషలలో మొత్తం 18 శతకాలు రాశారు. వాటిలో కన్యకాపరమేశ్వరి సుప్రభాతమ్, దేవీస్తవ తారావళి, జాతిపిత ఈ మూడు సంస్కృతంలో రాశారు. మహిళా విక్రమసూక్తం, లజ్జాకిరీట ధారిణి, సదుక్తి మంజరి, మనసాహితి-మధుభారతి, నా తెలుగుమాంచాల, ఒక్కచిన్నదివ్వె, కాంతిశిఖరాలు, కన్యకమ్మ నివాళి, ఆంధ్రకవయిత్రులు, అఖిల భారత కవయిత్రులు, ఆంధ్రుల కీర్తనవాఙ్మయ కళాసేవ, నా విదేశీ పర్యటన - అనుభవాలు, భారతదేశ చరిత్ర-కొన్ని గుణపాఠాలు, సాహితీ రుద్రమ, సరస్వతీ సామ్రాజ్య వైభవం తెలుగులో రచించారు.

## చేపట్టిన పదవులు :

లక్ష్మీకాంతమ్మగారు అనేక పదవులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వం పొందిన మహిళలల్లో ఈమె సుప్రసిద్ధులు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ, తెలుగు భాషా సమితి, గోరంట్ల వెంకన్న ట్రస్ట్‌బోర్డు, ఆంధ్రమహిళా గాన సభ, బాపట్ల తాలూకా తుఫాను బాధితుల పునరావాస సంఘం తదితర వాటిల్లో సభ్యురాలిగా వుండి తన విశిష్ట సేవలందించి, బహు సమర్థురాలిగా మన్ననలు పొందారు.

ఈమె ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల వర్కింగ్ కమిటీ సభ్యురాలు మాత్రమే కాక, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయానికి, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభకు శాశ్వత సభ్యురాలు. వేటపాలెంలోని సారస్వత నికేతనానికి పోషకురాలిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళామండలుల సమాఖ్యకు ఉపాధ్యక్షురాలిగా, విశ్వహిందూ పరిషత్ ప్రాంతీయ సేవాసమితిలో సభ్యురాలిగా, బాపట్లలోని కళాభారతి, భావపురి సంగీతసభకు, బాపట్ల స్త్రీ హితైషిణి మండలులకు అధ్యక్షురాలిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు నిర్వహించిన అఖిలభారత రచయిత్రుల తొలి సభాకమిటీకి వీరు కార్యదర్శిగా వ్యవహరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం సెనేట్‌లోను, ఆలిండియా రేడియో అడ్వయిజరీ కమిటీలోనూ, ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీలోనూ, ఆంధ్రప్రదేశ్ సంక్షేమశాఖ సలహా సంఘంలోనూ లక్ష్మీకాంతమ్మగారు సభ్యురాలిగా వుండి తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శిస్తూ, పేరు ప్రఖ్యాతులు ఆర్జించారు.

ఇంత విలక్షణమైన, విశిష్టమైన ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి, నిర్వహించిన ప్రతి పదవికీ వన్నె, వాసి కలిగించిన కార్య దీక్షాదక్షిణి లక్ష్మీకాంతమ్మగారు. ఈమె పదవులను ఆశింపకున్నా, ఎన్నో పదవులు వరించి వచ్చాయి. లభించిన ప్రతి పదవిని సమర్థవంతంగా నిర్వహించి, చేపట్టాలనుకున్న కార్యక్రమాలను నిర్వర్తించారు.

## బిరుదులు :

ఆధునికాంధ్ర మహిళలో అనేక బిరుదులు పొందిన విదుషీమణి - లక్ష్మీకాంతమ్మగారు. వీరి ప్రతిభకు పట్టంకట్టే ఉద్దేశ్యంతో పలు సంస్థలు, సంఘాలు బిరుదులతో సత్కరించాయి. ప్రాచీన ఆధునిక కవయిత్రులలో ఇన్ని బిరుదులు పొందిన మహిళామణులు లేరనడం అతిశయోక్తి కాదు. రాజమహేంద్రవరంలో శ్రీపాదకృష్ణమూర్తి గారి సమక్షంలో ఆంధ్రవాఙ్మయ సంఘం వారిచే 1935లో 'విద్వత్కవయిత్రి' బిరుదు, రాజమహేంద్రవరంలోని గౌతమీగ్రంథాలయ పర్యవేక్షకులు మున్నంగిశర్మగారిచే 1941లో 'తెలుగుమొలక' బిరుదు, చీరాలలో బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన సభలో జమ్మలమడక మాధవరామశర్మగారిచే 1952లో 'ఆంధ్రసరస్వతి' బిరుదు, విజయవాడ ఆంధ్రరచయిత్రుల సభలో దేవులపల్లి రామానుజరావుగారిచే 1966లో 'సాహితీ రుద్రమ' బిరుదు, గుంటూరుకు చెందిన గోపరాజు వేంకటేశ్వర్లు, జనార్ధన శర్మగార్లచే 19722లో 'ధర్మ ప్రచారభారతి' బిరుదు, విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వ విద్యాలయం వారిచే 1978లో 'కళాప్రపూర్ణ' బిరుదు, ఇవే కాకుండా అనేక సంస్థలు ఆమె సాహితీకృషిని గుర్తించి సన్మానించడం జరిగింది.

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు ఓటమిని ఎరుగదు. కష్టనష్టాలు ఎదురైనప్పుడు పట్టుదలతో పోరాడటమే ఆమె జీవిత లక్ష్యంగా ఎంచుకుంది. ఆమె తన జీవితంలో ఎవరికీ తలవంచలేదు. ఎట్టి పరిస్థితుల్లో కూడా దైన్య భావం ప్రదర్శించలేదు. ఆమె వ్యక్తి కాదు. ఒక సంస్థ. విద్యావతిగా, కవయిత్రిగా, ధర్మప్రచారకురాలిగా, ఉపన్యాసకురాలిగా, సమాజ సేవకురాలిగా విశేష ప్రజ్ఞను ప్రదర్శించిన అరుదైన స్త్రీరత్నం శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు. ఆమె జీవితం, సాహితీజీవనం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

రంగస్థల పద్యనాటకాలకు నెలవైన రాయలసీమలో 1926 నుండే శ్రీ సాధన పత్రికలో ఆధునిక స్పృహతో, సమకాలీన సమాజ పరిస్థితులకు అద్దంపట్టే రీతిలో నాటికలు, ఏకాంకికలు వెలువడినాయి. అప్పటికి రాయలసీమలో వెలువడిన ఇతర పత్రికలలోనూ నాటికలు ప్రచురించి ఉండవచ్చు. కానీ ప్రస్తుతానికి లభిస్తున్నంతలో సాధన పత్రికలో ప్రచురించిన ఈ నాటికలు, ఏకాంకికలు, సంభాషణలు ఆధునిక సాహిత్య ప్రక్రియలలో సీమ భాగస్వామ్యాన్ని తెలియజేస్తాయి. అవి ఆనాటి రాయలసీమలోని సామాజిక ఇతివృత్త చిత్రణలను

ఏ విధంగా ప్రతిబింబిస్తాయో వివరించడం నా పత్రం యొక్క ప్రధానోద్దేశ్యం.

నాటకం కంటే నాటిక చిన్నది. నాటిక కంటే ఏకాంకిక చిన్నది. నాటిక, ఏకాంకికలను ఒకే అర్థంలో నేడు సంబోధిస్తున్నా, వీటిమధ్య తేడాఉంది. నాటిక- రెండు మొదలు ఐదు రంగాలుగా, గంట కాలానికి తక్కువ కాకుండా ప్రదర్శితమవుతుంది. ఏక నాయకుడు, ఏక వస్తువుతో కూడి ఉంటుంది. స్థల, కాలైక్యం విధిగా పాటించనక్కరలేదు. ఏకాంకికను ఆంగ్లంలో 'వన్ యాక్ట్ ప్లే' అంటారు. ఒక రంగంతో ఇరవై నుండి నలభై అయిదు నిమిషాలలోపు ప్రదర్శితమవుతుంది. ఏక నాయక, ఏక వస్తువు, స్థల కాలైక్యాలతో కూడి ఉంటుంది. సంక్షిప్తత ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. సమకాలీన సమాజంలోని పరిస్థితులను వైవిధ్యంగా పాఠకులకు అందించే ప్రయత్నంలో నాటికలు, ఏకాంకికల కన్నా తక్కువ నిడివిగల, ప్రదర్శనకు వీలుకాని సంభాషణా రచనలను కూడా ఒక ప్రత్యేక ప్రక్రియగా పరిగణించవచ్చు. రచయితలు వ్రాసే ప్రతి నాటిక, ఏకాంకిక ప్రదర్శ నానుగుణమైనవని చెప్పలేం. అందరూ ప్రదర్శనీయం కావాలని వ్రాస్తారు. కానీ ఆయా ప్రాధాన్యాలనుబట్టి, ప్రదర్శనానుకూలతనుబట్టి, కొన్నే వేదికపైకి వస్తాయి. వేదికలమీద ప్రదర్శించనంత మాత్రాన అవి నిష్ప్ర యోజనాలని అనుకోరాదు. సాహిత్యపరంగా వాటి విలువ వాటికి ఉంటుంది.

1929 నుండి తెలుగు నాటికల ఇతివృత్తంలో, సంవిధానంలో కొత్త ప్రయోగాలు జరిగాయి. 1930లో పి.వి. రాజమన్నార్ 'తప్పెవరిది' నాటికతో తెలుగు నాటికా సాహిత్యం నూతన అధ్యాయం ప్రారంభమైంది. భమిడిపాటి 'బాగు... బాగు, 'కచటతప', చలం వారి 'భానుమతి, సావిత్రి, సీత అగ్నిప్రవేశం', ముద్దుకృష్ణ వారి 'అనార్కలి, అశోకం, టీ కప్పులో తుఫాను', చింతా దీక్షితుల వారి 'శర్మిష్ట, తుదిపలుకు', శ్రీపాదవారి 'కలంపోటు', నోరి నరసింహశాస్త్రి వారి 'స్వయంవరం', బుచ్చిబాబు వారి 'తిష్యరక్షిత', జి.వి. కృష్ణారావు వారి 'బిక్షాపాత్ర', పాలగుమ్మి వారి 'ఖూనీ', నార్ల వెంకటేశ్వర రావువారి 'కొత్తగడ్డ' (1947) మొదలైన నాటికలు తెలుగు నాటికా సాహిత్యానికి దిశానిర్దేశం చేశాయి.

నాటికలను దృశ్య రూప నాటికలు, శ్రవ్య రూప నాటికలని రెండు రకాలుగా విభజించవచ్చు. దృశ్యరూప నాటికలలో ఆయా పాత్రల హావభావాలను కళ్లేదుట చూడటానికి, సంభాషణలను నేరుగా వినటానికి వీలుంటుంది. శ్రవ్య రూప నాటికలు కేవలం వినడానికి మాత్రమే వీలుంటుంది. వీటినే 'రేడియో నాటికలు' అని కూడా అంటారు. ఆయా పాత్రల మాటలను మాత్రమే విని విషయాన్ని అర్థం చేసుకోగలం. నృత్యానికి అను గుణమైన నాటికలు ఉన్నాయి. దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా వెలువడనప్పటికీ- సమకాలీన సమాజం గురించి నాటికలు, ఏకాంకిల కంటే తక్కువ నిడివిగల సంభాషణా రచనలు పత్రికలలో ప్రచురితమవుతుంటాయి. వీటిని చదవటం ద్వారా మాత్రమే తెలుసుకోగలం. వస్తుపరంగా నాటికలను సామాజిక, రాజకీయ, పౌరాణిక తదితరాలుగా విభజించవచ్చు. సమకాలీన సమాజంలో జరిగే పరి ణామాల గురించి, ప్రజలకు అవసరమైన అంశాల గురించి అందరికీ అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా నాటికలు, ఏకాంకికలు వెలువడడం ఒక సామాజిక అవసరం అయింది. 1920ల నుండి ఆంగ్ల సాహిత్య ప్రభావంతో- తెలుగు సాహిత్యంలో నాటిక, ఏకాంకిక ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. తొలి దశలో ప్రభుత్వ పథకాల ప్రచారంలో, పాఠశాలల్లో జరిగే ఉత్సవాల సందర్భాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో చిన్న నాటికలను ప్రదర్శించేవారు. 1930ల నుండి సాహిత్యంలో ఒక ప్రక్రియగా నాటిక, ఏకాంకికలు నిలదొక్కుకున్నాయి. 1912లో ద్వితీయ ముద్రణ పొందిన 'డ్రామాస్ ఇన్ సివిక్' అనే సంపుటంలో సర్వారాయుడు రచించిన 'గ్రామ కచేరి' అనే ఏకాంకిక- లభ్యమవుతున్న వాటిలో తొలి తెలుగు స్వతంత్ర ఏకాంకికగా చెప్పవచ్చు.

1920 నుండి భారతి, శారద, 1926 నుండి శ్రీ సాధన తదితర పత్రికలు నాటికల ప్రచురణకు కృషి చేశాయి. 1928లో ఇబ్సన్ నాటకోత్సవాల ప్రభావంతో ప్రపంచ నాటక చరిత్రలో నూతన శకం ప్రారంభమైంది. సమ కాలీన, ఆర్థిక, సామాజిక పరిస్థితులను నాటికలలో ప్రతిబింబింప చేయడంలో ఇబ్సన్ ప్రభావం ఉంది. తెలుగు నాటికా సాహిత్యం కూడా ఆ ప్రభావానికి లోనైంది.

## స్వాతంత్ర్య పోరాట వీరుల విజయం - ఓట్ల నాటకం'

1926 అక్టోబనరు 23న 'ఓట్ల నాటకం' అనే నాటిక శ్రీసాధన పత్రికలో ప్రచురితమైంది. మద్రాసు శాసనసభకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో- 'శ్రీమతి అనంతపురి' అనే స్త్రీ, పోటీలోఉన్న ఐదుగురు అభ్యర్థులలో ఎవరిని వరించినదన్న ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది. ఎన్నికలలో అభ్యర్థులైన కేశవ పిళ్లె, తోపుదుర్తి నారాయణ రెడ్డి, చిన్నపొలమడ ఓబిరెడ్డి, చీమలవాగుపల్లి బత్తిని నారాయణరెడ్డి, గార్లదిన్నె రామేశ్వరరావు తమ అభ్యర్థన లను, ఆలోచనలను అనంతపురి స్త్రీకి తెలియజేసి, శాసనసభకు ఎంపికయ్యేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతారు. అంతిమంగా అనంతపురి దేశ ప్రయోజనాల దృష్ట్యా స్వరాజ్య పార్టీ అభ్యర్థులైన ఓబిరెడ్డి, బత్తిని నారాయణరెడ్డిలకు విజయం వరింపజేస్తుంది. ఈతూరికి నాటకం ముగిసినది, ఇంకా మూడేండ్ల వరకు నిశ్చింతంగా నుండగలను. ఈ రెడ్డి యువకులు నా భక్తులనియే నమ్మెదను, చూచెదను గాక' అని అనంతపురి అనడంతో నాటిక ముగుస్తుంది. పూర్వరంగం, ఉత్తరరంగం రెండు భాగాలుగా ఈనాటిక ఉంది. ఆనాటి ఎన్నికల నేపథ్యంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న స్వరాజ్య పార్టీ అభ్యర్థుల గెలుపును ఈ నాటిక సూచిస్తుంది.

## స్త్రీలను చైతన్యపరచిన - స్త్రీ విద్య

1926 నవంబరు 20న ప్రచురించిన 'స్త్రీవిద్య' అనే సంభాషణాత్మక సన్నివేశాన్ని కదిరి వాసి వి.ఖండేరావు వ్రాశాడు. కమల, విమల, శకుంతల, సుమాల్య మొదలగు తదితర పాత్రల ద్వారా సంభాషణ నడు స్తుంది. సాంప్రదాయ భావజాలం గల అవ్వకు- కమల అనే మనవరాలు ఉంటుంది. అవ్వ ప్రభావంతో చదువు విషయంలో కమల శ్రద్ధ వహించక అనాసక్తిగా పాఠశాలకు వెడుతుంటుంది. స్నేహితురాలైన విమల చదువు గొప్పతనాన్ని గురించి కమలకు చెబుతూ 'విద్య ఉద్యోగములు చేయుటకేగాదు, మానవజన్మ ఎత్తి నందుకు జ్ఞానమార్జించుట మనకు విధిగాయున్నది. అట్టి జ్ఞానము ముఖ్యంగా స్త్రీలకే ఆవశ్యము. వారు గదా బిడ్డలను బాల్యమునుండి పెంచెదరు. ఇప్పుడు మన దేశంలో బాలురు బడికు వెళ్ళు సమయమున వారికి జ్ఞానరీతి యందు ఎలాంటి శోధన లేనందున దేశము క్షీణించుచున్నది. తల్లి జ్ఞానవంతురాలైన ఖండితముగా బిడ్డలు గొప్పవారగుదురు' అని తెలియజేస్తుంది. మరో స్నేహితురాలైన శకుంతల ప్రవేశించి ఐరోపా ఖండంలో స్త్రీలు విద్యావంతులవుట వలన జరుగుతున్న ప్రయోజనా లను తెలియజేస్తుంది. దగ్గరలోనే శకుంతలకు పెళ్ళిచేసే ప్రయత్నం తల్లిదండ్రులు చేస్తుండడంవలన విద్యకు దూరమవుతానేమోనని ఆమె చింతిస్తుంది. స్త్రీలు చదువుకొనేందుకు తోడ్పాటు తక్కువగా ఉందని, ఆడపిల్లలకు బాల్యవివాహాల కారణంగా చదువుకోవడం సాధ్యంకాదని తన అభిప్రాయాలను చెబుతుంది.

ఈ మాటలను విన్న కమల 'అందుకే మన కెందుకే ఈ చదువంతా' అని విమలను ఎత్తిపొడుస్తుంది. మరో స్నేహితురాలు సుమాల్య వీరిని కలుస్తుంది. స్త్రీ విద్యపట్ల వ్యతిరేకంగా మాట్లాడుతున్న కమలకు కనువిప్పు కలిగేలా తెలియజేయమని విమల సుమాల్యను కోరుతుంది. ఈ సందర్భంలో సుమాల్య విద్య ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ 'లోకంలో స్థూల దేహమును పెంచుటకు ఆహారం ఏవిధంగా ఆవశ్యకమో ఆ రీతిగానే జ్ఞానదేహమును వృద్ధి పరచుటకు విద్యయను ఆహారం అత్యంత ఆవశ్యకము. సాధారణంగా చదువుకున్నవారు తమ విద్యకు తగిన బుద్ధియు, సత్ప్రవర్తనము గలవారయి, ఏదో యొక

విధమున గౌరవముతో జీవనం చేయుదురు. ఉద్యోగము లలో స్త్రీలు చేరనంత మాత్రాన ఫలనిమిత్తమున నాటిన ఫలవక్షములు నీడనిచ్చుట మొదలగు ఇతర పనులకు ఉపయోగించులాగున, తెలివితేటలకేర్పడిన చదువు సహితము ఇతరా కార్యములకు కూడా నుపయో గించును. జ్ఞానాభివృద్ధికి హేతుభూతమైన విద్య పురుషులకెట్లో స్త్రీలకునట్లే పరమ ప్రయోజనకరమైనదిగా నుండుననుటకు సందేహము వలదు. స్త్రీ విద్య దేశంలో ననాది సిద్ధముగా నున్నది. గానీ ఈ నడుమ కొత్తగా నెక్కడినుండియో వచ్చినదిగాదు. స్త్రీ రత్నములు విద్యలేక సానపట్టని పాతమాణిక్యములవలె ప్రకాశరహితమై యున్నారు. పురుషులతో పాటు స్త్రీలును విద్యగరిచిరేని 'బుద్ధిశ్చాపి చతుర్గుణా' యను సూక్తిసార్థకము చేయ కుందురా. వేదములలోను, పురాణాలయందును చదువు కున్న పొలతులు ఎన్నో ప్రయోజనకరమైన పనులు చేశారు.

తల్లుల గుణశీలములు సులభముగా బిడ్డలకు వచ్చునని శాస్త్రజ్ఞులు వక్కాణింతురు. అందువలన స్త్రీలు కూడా సకల విద్యలనభ్యసించి సద్గుణ సంపద నార్జింప వలయును. ఏలయన మగబిడ్డ లెపుడును తమ జననీ జనకుల యొద్దనే యుండదగినవారు. ఆడ బిడ్డలన్నో ఎప్పుడైననూ వేరొక ఇల్లు చేరవలసినవారేగానీ పుట్టినింటనే కలకాలం ఉండ తగినవారుకారు. కావున పెంచినవారికి అపఖ్యాతి రాకుండుటకై వారి నత్తవారింటికి పంపుకాలము రాకమునుపే ప్రియపుత్రికల నుత్తమ గుణములు గలవారి గాను, తెలివిగలవారినిగాను చేసి మరీ పంపవలెను. మొదట సుగుణములను బోధించి జ్ఞానవంతసుంద్రుగా చేయక సంసార సాగరము నీదుటకై తమ పుత్రికలను పురుషుల గహములకు పంపు తల్లిదండ్రులు ఈత నేర్వనివారిని మహానముద్రమున ద్రోచి వారు కొట్టుకొనుచుండగా కన్నుల గాంచుచూ పిదప పశ్చాత్తాపులై య్యునూ, ఏమియూ చేయనేరక నింద పొందువారివలనే తామునూ పిమ్మట నపకీర్తిపాలై పారములేని దుఃఖాం బుధిని ఈదవలసివారగుదు'రని ఆడపిల్లలను తప్పక చదివించాలని సుమాల్య తెలియ జేస్తుంది. ఇదంతా విన్నతరువాత విమల, కమలను ఇప్పుడేమంటావని అడగగా 'నేనేమని చెవుదూ, మాటలాడుటకు సిగ్గగుచున్న'దని విమల తెలపడంతో నాటిక ముగుస్తుంది. ఈ నాటిక స్త్రీ విద్య ఆవశ్యకత మూలాలను తెలియ జేస్తుంది. యువతులు సంప్రదాయ భావాల నుండి, ఆటంకాలనుండి బయటపడి విద్యను అభ్యసిస్తే కుటుంబానికి, సమాజానికి మేలు జరుగుతుందని తెలియజేస్తుంది. 1926 నాటికే స్త్రీ విద్య అవసరాన్ని నాటిక ద్వారా తెలియజేసి వారి అభ్యున్నతిని కోరుకున్న ఖండేరావు అభినందనీయుడు.

## కల్లు సారాయిలను పారద్రోలాలనే 'కల్లుపెంట'

1931 జూలై 25న పప్పూరు రామాచార్యులు వ్రాసిన 'కల్లుపెంట' నాటిక ప్రచురితమైంది. 1929-31లో ఇల్లూరు, తరిమెల పరిసర ప్రాంతాలలోని యాభై గ్రామాలలో జాతీయో ద్యమంలో భాగంగా సారాయి, కల్లు వ్యతిరేక పోరాటాలు కొనసాగాయి. పప్పూరి రామా చార్యులు ఈ ఉద్యమాలలో ప్రధానపాత్ర పోషించారు. ఆ అనుభవంతోటే గ్రామాలలో కల్లు సారాయిల త్రాగుడు మాన్పించడం కోసం చైతన్యం తీసుకురావటానికి పప్పూరి రామాచార్యులే ఈనాటికను వ్రాశారు. మూడు అంకాలుగా ఈ నాటిక ఉంది. ఆ నాటికలో గాంధీ సిద్ధాంతాలకు ప్రభావితుడైన రామారావు కల్లు వ్యతిరేక ప్రచారంచేస్తూ, దానిని రూపు మాపేందుకు గ్రామాలలో పర్యటిస్తాడు. అనంతపురం పరిసరాలలోని ఒక గ్రామానికి వెళ్తాడు. ఆ గ్రామంలో సుబ్బరాయ శాస్త్రి వద్ద ఆశ్రయం పొందుతాడు. ఆ గ్రామంలో కల్లంగడిని నెట్టికల్లు నడుపుతుంటాడు. అందుకుగాను ఆ గ్రామానికి రెడ్డి అయిన రంగారెడ్డికి సంవత్సరానికి నూట యాభై రూపాయలు నెట్టికల్లు చెల్లించే విధంగా ఒప్పందం ఉంటుంది. రంగారెడ్డి తన కొడుకుకి పుట్టువెంట్రుకలు తీయించేందుకు విదురా శ్వార్థం వెడుతున్న సందర్భంగా, తనకివ్వవలసిన

మొత్తంలో నెట్టికల్లును డెబ్బైఅయిదు రూపాయలు అడుగుతాడు. గత కొన్ని రోజులుగా ఊర్లో కల్లువ్యతిరేక ప్రచారం జరుగుతోందని, వ్యాపారం కష్టంగా ఉందని నెట్టికల్లు తెలియజేస్తాడు.

అదే సమయంలో- జానెడు పొట్టకు మీరాశించిన చెడుకొంపల లెక్కించండీ/ తానొక్కనికై పెక్కు వంశములు చరగూలుట సరియేమండీ/ మఱపి కల్లు సారాయము లమ్మి మత్తుగొల్పి చంపుటకన్నా/ నిరుపేదల గుడిసెలకొక మాఱుగా నిపపెట్టరాదేమండీ!- అంటూ కల్లువ్యతిరేక ప్రచారకులు పాట పాడుతూ వెళతారు. అది విని రంగారెడ్డి, రామారావును ఊరునుండి వెళ్ళగొట్టాలను కుంటాడు. అశ్వర్థం వెళ్లివచ్చిన తరువాతైనా ఆ డబ్బులు ఇవ్వమని నెట్టికల్లుతో రంగారెడ్డి చెప్పివెడతాడు. నెట్టికల్లు మనిషి పుల్లన్న- పోతిగాడికి కల్లుతాపి రామారావును తిట్టమంటాడు. అలా చేస్తే తమకివ్వాల్సిన అప్పు ఇవ్వ నవసరం లేదంటాడు. పోతిగాడు రామారావును తిట్టగా కల్లువ్యతిరేక ప్రచార సభ్యులైన భీముడు, ఆంజనేయులు వాడిని కొట్టేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు రామారావు 'నాయనలారా! ఒక్కరిని హింసించితిమా మన ఉద్య మము అంతలోనే నిలిచిపోవును, వీడి వెనుక ఎవరో ఇలా పంపివుంటా'రని శాంతింపజేస్తాడు. పోతిగాడు వాస్తవాలను తెలుసుకొని ఇక నుంచి కల్లుముట్టనని చెప్పి వెళ్తాడు. నెట్టికల్లు, పుల్లన్నలు పోతిగాడిని పిలిచి రామారావు విషయం అడగగా, మీరు చెప్పినట్లు చేయలేనని, రామారావువాళ్లు మంచోళ్ళని తప్పుకుంటాడు. నెట్టికల్లు, పుల్లన్నలు ఓబిగాణ్ణి పిలిచి పోలేరమ్మ పూనకం వచ్చినట్లు నటింపజేసి ఊరిదేవర చేయాలని సిద్దమవు తారు. మనుషులకు వ్యాధులు రాకుండా ఉండేదుకు, పంటలు పండేందుకు 'దేవర' తప్పకుండా చేయాలని గ్రామస్థులను రెచ్చగొడతారు. హింసాప్రవత్తి మానుకోవా లని, దేవర వలన ఖర్చులు తప్ప లాభంలేదని, దేవర సందర్భంగా చెరువులో జంతు కళేబరాలను కడుగుతారని అందువలన కలరా, అంటువ్యాధులు వ్యాపిస్తాయని కల్లు వ్యతిరేక ప్రచారకులు దేవరను వ్యతిరేకిస్తారు.

దేవరవల్ల లబ్ధిపొందాలనుకునే నెట్టికల్లు, పుల్లన్న, వ్యాపారంచేసే శెట్టి మొదలగువారు దేవరను చేసేందుకు ముందుండి నడిపిస్తారు. జాతర సమయంలో కలరా పురుగులు వ్యాపించి కోనేరులో కలవకుండా రామారావు అతని మనుషులు దగ్గరుండి జాగ్రత్తలు తీసుకుంటారు. జాతరలో కల్లు, సారా, కోడిపందేలు విపరీతంగా సాగు తాయి. ఎన్నో మూగజీవాలను బలి ఇస్తారు. జాతర ద్వారా కల్లు అమ్ముకొని లాభం పొందిన నెట్టికల్లును పుల్లన్న తనకు రావలసిన వాటా అడుగుతాడు. తన వాటా ఇవ్వకపోతే రామారావు దగ్గరకు చేరుతానని చెబుతాడు. అప్పటికే ఊరంతా కలరా సోకుతుంది. పట్టణం నుండి డాక్టరును పిలిపించి కలరా బారినుండి రామారావు బృందం ప్రజలను కాపాడుతారు. కలరా కారణంగా రంగారెడ్డి కొడుకు మరణిస్తాడు. ప్రజలందరూ రామారావు సేవలను గుర్తించి ఆయన మార్గాన్ని కొనియాడుతారు. ఊళ్లో కలరా సోకడానికి కారణం రామారావే, చెరువులో ఏదో మందు కలిపాడని నెట్టికల్లు మనుషులు ప్రచారం చేస్తారు. డాక్టరు ఇచ్చిన మందులను చెరువులో కలి పామని, లేకుంటే అందరికి కలరా సోకేదని రామారావు వివరిస్తాడు. అంతలోనే పుల్లన్న ప్రక్క ఊరైన సిద్ధంపల్లె నుండి కల్లు పిపాయి తెస్తుండగా దొంగకల్లు తాగేవాడు వెంటపడి ఆ పిపాయిలో గొట్టంపెట్టి పీలుస్తుండగా అందులోకే వాంతిచేసుకున్నాడని, ఆ కల్లు తాగిన వారందరికి కలరా సోకిందని తెలియజేస్తాడు. ఈ విధంగా సిద్ధంవారిపల్లిలోని కలరా తమ గ్రామంలోకి వ్యాపించిం దని వివరిస్తాడు. ప్రజలంతా నెట్టికల్లు ఇంటిని కాల్చి వేయడానికి సిద్ధమవుతారు. నెట్టికల్లును అని ఏమి లాభం, మనం కల్లు తాగకపోతే సరిపోతుందని రామరావు వారిని వారించి ఇకనైనా మానండని అంటాడు. అందరూ కలిసి కల్లుతాగమని ప్రమాణం చేస్తారు. రామారావును ఊరిలోనుంచి వెళ్లగొట్టి కల్లు అమ్మకం సాగించాలని నెట్టికల్లు అనుకొంటాడు. రామారావు వైపు ఉన్న పుల్లన్నకు యాభైరూపాయలిచ్చి, కల్లు ఉచితంగా పోస్తానని

లోబరుచుకుంటాడు. ఓబిగాడు కల్లు తాగుతుంటే అడ్డుకొని కల్లు ముంత పగులగొట్టి, వాడి చెంపకు రామారావు కొట్టాడని దొంగ సాక్ష్యం చెప్పించేందుకు సిద్ధం చేస్తాడు.

అధికారులకు నెట్టికల్లు డబ్బులిచ్చి అక్రమకేసు బనాయింపజేస్తాడు. పోలీసులు రామారావును కచేరికి తీసుకువెళతారు. రామారావు అనుచరులు ఆంజనేయులు, భీమలు జైలుకు వస్తామని సిద్ధమవగా రామారావు వారిని వారించి గ్రామంలో కల్లు తాగకుండా చూసుకోమంటాడు. గ్రామరెడ్డి అయిన రంగారెడ్డి మాదిగల నందరిని పిలిపించి కల్లు తాగాలని, లేకపోతే సర్కారుకు నష్టం వస్తుందని తెలియజేస్తాడు. మాదిగలు కల్లుతాగమని చెబితే తనకివ్వాల్సిన అప్పులు కట్టండని రెడ్డి ఒత్తిడి చేస్తాడు. లభిస్తున్నంతలో 'కల్లుపెంట నాటకం'లోని ఇతివృత్తమిది. పప్పూరు రామాచార్యులు ఉద్యమకాలంలో ఎదురైన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ నాటికను రాశారు. పప్పూరువారిపై ఉద్యమంలో ఇలాంటి కేసునే బనాయించారు. ఆ కేసు కోర్టులో వీగిపోయింది. ఈ నాటికలో కూడా కేసు వీగిపోయి ఉంటుంది. ఒక గ్రామం నేపథ్యంగా కొనసాగిన సారా కల్లు వ్యతిరేకోద్యమం ఈ నాటికలో చిత్రితమైంది. గ్రామంలోని పెత్తందార్లు, కల్లంగడి యజమానుల దౌర్జన్యాలు, దోపిడీల స్వరూపాన్ని ఈ నాటిక తెలియజేస్తుంది. అలాంటి సంక్లిష్ట పరిస్థితులలోను గాంధీ సిద్ధాంత అనుయాయులు శాంతియుతంగా అహింసా మార్గాన ప్రజలను చైతన్యవంతులను చేయడం గమనించాలి. ప్రజలు తిరగబడి వారిని ఎదుర్కొనే సామర్థ్యాలు ఉన్నప్పటికీ, గాంధీయమార్గంలో పోరాడాలనే ఈ నాటిక నిర్దేశం చేస్తుంది. మద్యనిషేధ ఉద్యమంలోభాగంగా ఈనాటిక గ్రామాలలో ప్రదర్శితమై ప్రజలు చైతన్యవంతులు కావాలని పప్పూరు రామాచార్యులు కోరుకున్నారు.

### ఆరోగ్యమే మహా భాగ్యమనే 'ఆరోగ్య నాటకం'

1936 జనవరి 11న ఆరోగ్య నాటకం అను మూడు రంగాల నాటిక ప్రచురితమైంది. ఆధునిక వ్యవహారిక భాషలో అందరికి అర్థమయ్యేలా, ప్రదర్శనాయోగ్యమైన నాటిక ఇది. ఈ నాటికలో సూత్రధారుడు ప్రవేశించి చేసిన నాంది ప్రస్తావనలో ఆరోగ్య దేవతలుగా భావించే పంచ భూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం పాత్రలు ధరించిన పిల్లలు నరుడితో తమ ప్రాధాన్యం గురించి వివరిస్తున్నట్లు ఉంది. నాటిక మొదటి రంగంలో మద్యపానానికి అలవాటైన శోభనరావు పుట్టెడు రోగాల పాలై మంచం పడతాడు. అతని భార్య లీలమ్మ, పిల్లల ఒత్తిడికి తలొగ్గి శోభనరావు మద్యానికి దూరమై మామూలు మనిషిగా మారుతాడు. నాటిక రెండవ రంగంలో జిల్లా బోర్డు ప్రెసిడెంట్గా శోభనరావు ఎన్నికవుతాడు. ఆ సందర్భంలో 'నాభార్య లీలకు నేను కృతజ్ఞుడను. ఆ సాధ్వీ పట్టుపట్టకపోతే నా పనేమయి యుండెడో, లీల నా దురభ్యాసాలన్నింటిని వదలగొట్టింది. నా పిల్లలను మంచి మార్గంలో పెట్టింది. మమ్మలినందరిని ఆరోగ్యవంతులను చేసింది. మా ఇల్లు, ఊర్లో వారందరికినీ ఆదర్శ ప్రాయయ్యేట్లుగా చేసింది. పొదుపుగా సంసారం చేసి నా అప్పులన్నీ తీర్చింది. సంసారం బాగుచేయవలెనన్న, పాడుచేయవలెనన్నా ఆడదాని చేతిలోనే ఉంది' అని వివరిస్తాడు. జిల్లా వ్యాప్తంగా విస్తరించిన కలరా, ప్లేగు, స్ఫోటక, చలి జ్వరాల వ్యాధుల గురించి శోభనరావు జిల్లా హెల్త్ ఆఫీసర్ జగదీశ్వరరావును వివరాలను అడిగి తెలుసుకుంటాడు. ఆ అధికారి బాధ్యతా రాహిత్యాన్ని నిలదీస్తాడు. ప్రజలను పట్టిపీడిస్తున్న ఈ వ్యాధులగురించి కాకుండా సంబంధంలేని 'ట్యూబర్క్యులాసిస్' వ్యాధి గురించి కరపత్రం వేయటం, అందులోను ప్రజలకు అర్థంకాని ఇంగీషు భాషలో వేయడాన్ని మందలిస్తాడు. తెలుగు అనువాదం చేసిన మరో కరపత్రం ప్రజలకు అర్థమయ్యే వ్యవహారిక భాషలోకాక గ్రాంథిక భాషలో వేయటాన్ని శోభనరావు ఎత్తిచూపుతాడు.

శోభనరావు, అతని భార్య లీలమ్మ పల్లెల్లో పర్యటన చేస్తూ పారిశుధ్య కార్యక్రమాలలో పాల్గొంటూ స్వచ్ఛంద సేవకులను తయారుచేసి ఒక ఉద్యమంలా నడుపుతున్నా

రని పత్రికల ద్వారా నారపరెడ్డి తెలుసుకుంటాడు. నారపరెడ్డి తాను నివసిస్తున్న గ్రామంలోకి శోభనరావు వస్తాడేమోనని ముందుగా తమ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రజలతో కలిసి చేపట్టుతున్నట్లు తెలియ జేస్తూ నాటిక ముగుస్తుంది. నాటక లక్షణాల ప్రభావం నాంద్రిప్రస్తావనలో కొంత కనిపిస్తుంది. నాటక లక్షణాల నుండి విడివడి నాటికగా నిలదొక్కుకునే ప్రయత్నం ఈ నాటికలో కనిపిస్తుంది. కష్టకాలంలో కుటుంబాన్ని నిలబెట్టడంలో స్త్రీల పాత్రను, ప్రజలతో అర్థమయ్యేలా వ్యవహారికభాషలో కరపత్రాలు రావాలనే వ్యవహారిక భాషా స్పృహను, బాధ్యతలు అదమరచి పనిచేసే అధికారుల బాధ్యతారాహిత్యాన్ని, నాయకులు మాటలద్వారా కాకుండా ఆచరణలద్వారా ముందుకు నడవాలని ఈ నాటిక తెలియజేస్తుంది.

1936 ఫిబ్రవరి 22న ప్రచురితమైన 'గంగా భాగీరథి' నాటికను చిలుకూరు నారాయణరావు రాశారు. నాటకాలు వేసే సమయంలో ఎదురయ్యే పరిస్థితులను, రసా భాసాలను ఇందులో వివరించారు.ఈ విధంగా రాయల సీమలోని ఆనాటి రాజకీయ పరిస్థితులను, స్త్రీవిద్య ఆవశ్యతకతను, మద్యపాన నిషేధ ఉద్యమాన్ని, ఆరోగ్య ప్రాధాన్యతల గురించి వివరించే నాటికలు వెలువడి నాయి. ప్రదర్శనానుగుణ్యంగా రాసిన ఈ నాటికలు తరువాతి కాలంలో సీమలో నాటికా సాహిత్య వికాసానికి దిశానిర్దేశం చేశాయనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీసాధన పత్రిక - పప్పూరి రామాచార్యులు
2. శ్రీసాధన పత్రిక వ్యాసాలు - డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి
3. ఆధునిక తెలుగు నాటకం - డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# మార్క్సిస్టు దృష్టిలో మహిళ

- డా॥. మూనమ మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై.

మేరీ వుల్‌స్టన్ క్రాప్ట్ రెండువందల సంవత్సరాలకు ముందు 1709లో రాసిన "విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమన్" తో స్త్రీల హక్కుల పోరాటం ప్రారంభమైందని చెప్పవచ్చు. అమెరికా వంటి పాశ్చాత్య దేశాలలో ఇప్పుడది చాలా పురోగమించి వుంది. ఆస్తి, పెళ్ళి, హెూదా, పని, ఆదాయం వంటి అనేక సామాజిక జీవితాంశాలకు సంబంధించింది కావడం, ప్రస్తుత వ్యవస్థ పరిధిలో ఈ పోరాటం సాగుతూంది. వీటన్నిటిల్లోనూ పురుషునితో స్త్రీకి సమానత్వం చేకూరినా, ఇంకా కొంత మిగిలిపోక తప్పదు. వ్యవస్థను అతిక్రమించితే తప్ప ఈ కొరత తీరదన్నమాట. బూర్జ్వా సమాజంతోనే స్త్రీ పురుష అసమానత పుట్టనట్లుగా ఈ సమాజంలోనే అసమానత తొలగిపోదు. బూర్జ్వా హక్కులంటేనే అసమానమైన హక్కులని అర్థం. మానవ పరిపూర్ణత, సృజనాత్మకత, యీ రెండూ కమ్యూనిజంలోనే సాధ్యం. అందుకని మహిళ విషయంలో కమ్యూనిజం మహెూపాధ్యాయులు చెప్పిపోయినదాన్ని గుర్తు చెయ్యడం అవసరం.

పుట్టీపుట్టడంతోటే మనిషి ఒక కుటుంబంలో పుట్టలేదు. కుటుంబం అనేది తరువాత తర్వాత ఏర్పడిందేగాని మొదటనుంచి లేదు. దానికి మూలాధారమైన దాంపత్యం కూడా అంతే. పశు, పక్షి, మృగ జాతుల్నుంచి తెచ్చిన పోలిక లతో వెస్టర్ మార్కులాంటి వాళ్ళు మానవసమాజ చరిత్రను తారుమారు చేశారు. నిజానికి, ఏ బంధాలూ గుది బండలూ లేనికాలం ఒకటి మానవజాతి శిశుదశలో ఉండేది. గుంపులు గుంపులుగా మనుషులు సమిష్టి భద్రతను, ఉదరపోషణను సాధించుకునేవారు. శరీరావసరా లలో ఒకటైన రతి (సెక్సు)ను తీర్చుకోవడానికి వావీ వరసలు అడ్డం వచ్చేవేకావు ఇది పాపం. అది పుణ్యం అనే మతస్పర్శగల భావాలు ఏవీ లేనందుచేత, తల్లేది, బిడ్డేది అవసరానికి ఒక్కటే. ఇంక ఫలానా మగాడు తండ్రని తెలిపే సదుపాయం ఎక్కడిది? అందుచేత తల్లికీ బిడ్డకీ ఉన్న సహజ అనుబంధం తండ్రి ఎక్కణ్నుంచి వచ్చేటట్టు? ఈ పరిస్థితినే "మాతృస్వామ్యం" (మదర్ - రైట్స్) అని బాచోఫెన్ వర్ణించాడు. ఇదేదో మహా ఘోరం అన్నట్టు ఆ తర్వాత వాళ్ళు కొందరు కాదన్నా. మార్క్స్, ఎంగెల్సులు దీని సంభవనీయతను నిరాకరించ లేదు సరిగదా, తమ సామాజిక శాస్త్రావగాహనలో తొలి మెట్టుగా చేసుకున్నారు. మరి, మోర్గన్ రచించిన "ఏన్షియంట్ సొసయిటీ"ని ప్రశంసించారంటే, బాచోఫెన్ స్థాపించిన విషయాలను మోర్గన్ ధృవీకరించడమే కారణం. ప్రాణపోషణకు అవసరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసుకునే క్రమాన బాహిర ప్రకృతిమీద ఆధిపత్యం సంపాదించిన ఏకైక జంతువుగా మనిషి, అందుకు అనుగుణమైన సామాజిక దశావస్థలను కూడా పొందక తప్పలేదు. ఈ అంశాన్ని శాస్త్రీయంగా నిరూపించినవాడు మోర్గన్. కిరాతకదశ (శావేజల్), ఆటవిక దశ (బార్బరిజం), నాగరికత (సివిలైజేషన్)అంటూ మూడింటిని, వాటిలో మళ్ళీ నిమ్న (లోవర్), మధ్యను (మిడిల్), ఉన్నత (అప్పర్) ఉపదశలను పేర్కొని వివరించాడు. ఆహార సంపాదనా క్రమంతో ముడిపడినవే ఇవన్నీ. వీటితో ముడిబడిన సామాజిక జీవిత క్రమాన్ని, వ్యవస్థా పరిణామాల్ని కూడా మోర్గన్ వర్ణించాడు. ఎంగెల్స్ రచన "ది ఆరిజిన్ ఆఫ్ ది ఫేమిలీ, ప్రైవేట్ ప్రోపర్టీ అండ్ ది స్టేట్ : చాలావరకు మోర్గన్ రచన మీద ఆధార పడిందే.

ఆడదాన్ని సొంతం చేసుకుని "క్షేత్రం" గా ఎంచే వ్యక్తి - ఆస్తి భావమేకాదు, చివరికి ఈ విషయంలో ఈర్ష్య, అసూయలు సైతం లేని గణజీవిత దశ మానవజాతి కంతటికీ ప్రారంభంలో వుంటూ వచ్చింది. ఈర్ష్య, అసూయ లనేవి ఉండే ఉంటే, గణజీవితంలో ఒద్దికే ఉండేదికాదు.

బృంద వివాహ వ్యవస్థ (గ్రూప్ మేరేజ్) లోనూ, అనేక భర్తృత్వ పద్ధతి (పోల్యాండ్రీ)లో కూడాను, యీ "స్వ" "పర" భావానికి అవకాశం కొద్ది.. స్త్రీ పురుషుల మధ్య యధేచ్ఛారతి ప్రామిస్క్యువిటీ (తరాల అంతరాన్ని రక్త పాశాన్నీ పాటించేది కాదు. ఇవి తరువాత ఏర్పడిన పరిణామాలే. క్రమక్రమంగా నియమాలు నిబంధనలు దూరివచ్చాయి. తలిదండ్రులకూ వారి సంతానానికీ మధ్య, సహోదరులైన స్త్రీ పురుషుల మధ్య 'సమీపజ్ఞాతుల మధ్య, ఇలా చివరికి కొన్ని సమాజాల్లో సగోత్రుల మధ్య వివాహాలు నిషేధానికి గురయ్యాయంటే రక్తపాశమే కారణం.

అఖండ సమిష్టి బృందం కూడా మార్పు పొందక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎప్పటిలా వేర్వేరు కుటుంబాల గాకున్నా, సమిష్టినుంచి వేరుపడ్డ సమిష్టి గృహ బృందాలు తలెత్తాయి. సొంత అన్నదమ్ములు తప్ప తక్కిన మగవాళ్ళతో, ముఖ్యంగా జ్ఞాతులతో, అప్ప జెల్లెళ్ళ వరసగల ఆడవాళ్లు కలిసి అందరికీ భార్యలుగా ఒకే గృహంలో జీవించేవాళ్ళు. ఒక స్త్రీకి ఆ పురుషుల్లో ప్రతి ఒక్కడూ భర్త అయినట్టుగానే ప్రతి పురుషుడికీ ఆ స్త్రీలలో ప్రతి ఒక్కతే భార్య అయ్యేది. దీన్ని బృంద కుటుంబం (గ్రూప్ ఫేమిలీ) అనవచ్చు. ఇందులోనూ బిడ్డకు తల్లి మాత్రమే తెలుస్తుంది గాని తండ్రి తెలీదు. బిడ్డలందర్నీ తన బిడ్డలుగానే పిలుస్తుందావిడ. తన కడుపున బిడ్డలు తెలీకమాత్రంకాదు. ఈ పరిస్థితి మూలాన బిడ్డలు తల్లి వంశాన్నే గుర్తించ గలుగుతారు. ఇలాంటి వారందరితోనూ చేరిందాన్నే తర్వాత తర్వాత "గోత్రం" అన్నారు (జెన్స్) : వంశకర్తృక ఒక్కతే. ఆవిడకు పుట్టిన స్త్రీలూ, వారికి పుట్టిన స్త్రీలూ, ఇలా తరతరాల స్త్రీలంతా ఆవిడ సంతానమే అయినందుచేత పరస్పరం అక్కజెల్లెళ్లుగా లెక్క. వీరి భర్తలు సమానా తమ అన్నదమ్ములు కానందుచేత ఈ "గోత్రం"లో లెక్కకు రారుగాని తమకు పుట్టిన బిడ్డలు మాత్రం వస్తారు.

అనేకమంది భార్యల్లో ఎవతెనో ఒకతెను ప్రధాన భార్యగా మగవాడూ, అనేకమంది భరల్లో ఎవణ్నో ఒకణ్ని ప్రధాన భర్తగా ఆడదీ, భావించడం మొదలైన ప్పుడు, ఆ ఇద్దరూ ఒకరికొకరు దోస్తులై విడిగా కలిసి బతికేందుకు తగిన పరిస్థితులు సమాజంలో ఎక్కువ కొనసాగాయి. ఒక తల్లి కడుపున పుట్టిన స్త్రీ పురుషుల మధ్యనేగాక, అన్నదమ్ముల అప్పజెల్లెళ్ళ వరుసగల స్త్రీ పురుషుల మధ్యను కూడా వివాహాలు నిషిద్ధమయేకొద్దికీ, బృంద వివాహాలకు అవకాశం కుదించుకుపోసాగింది. దానంతటి ఫలితంగానే మిధున కుటుంబం (పేరింగ్ ఫేమిలీ) రూపొందింది. అయితే దీనిలో అడపాదడపా వ్యభిచరించే వీలూ అనేకమంది స్త్రీలను పెళ్ళాడే వీలూ మగవాడికి చేకూరాయి. స్త్రీ గనక అతి చరించిందా, కఠిన దండనే. అయితే మనస్సు కలవదని తేలగానే ఇద్దరిలో ఎవరైనా తన మనువును వదిలించుకుని బయటపడవచ్చు. ఇద్దరిలో బిడ్డలు మాత్రం వెనకట్లా తల్లిసొత్తే. నిబంధనల మీద నిబంధనలు, నిషేధాలమీద నిషేధాలు వచ్చిపడి, పెళ్ళాడేం దుకు స్త్రీలే కరవయ్యాక, ఇప్పుడు స్త్రీలను ఎత్తుకుపోయి పెళ్ళాడ్డం, కొనుగోలుచేసి పెళ్ళాడ్డం మొదలయ్యాయి. మిధున వివాహ పద్ధతి సమాజానికి ఒక ఉపకారం చేసింది. వేర్వేరు- తెగలకు చెందిన స్త్రీ పురుషులు భార్యా భర్తలు కావడం మూలాన పుష్టిగల సంతతి కలగడమే గాక రెండు తెగలనుంచీ వాటి వాటి తెలివితేటల్ని సంపాదించుకోవడం సాధ్యమయిందంటాడు మోర్గన్.

ఇప్పటి వరకు కూడా స్త్రీ దే ఆధిక్యత. తాను తల్లి. తండ్రి ఫలాన అనేది లేదు. భిన్న గోత్రాలనుంచి వచ్చిన భర్తలతో ఏకైక గోతానికి చెందిన భార్యలు కలిసి జీవించే సామూహిక గృహంలో ఈ పరిస్థితి అని వార్యం. ఆ గృహం స్త్రీలది. దానిమీద పెత్తనం. వారిది. అంతమాత్రాన, పని పాటులన్నీ భర్తలవని అర్థంకాదు. పని విభజన తప్పదు. ఆడదాని పనులు ఆడదానివి, మగాడి పనులు మగాడివి. బయట మగాడు, ఇంట ఆడది. అందుచేత ఆడదానికి కదులుబాటు (మొబిలిటీ) తగ్గింది. ఆహార సేకరణ, వేట, యుద్ధం వగైరాలు మగాళ్ళవి. వాళ్లు తెచ్చింది ఉడకేసి

నోటికందించడం, బిడ్డల్ని కని సాకడం, ఇల్లు చక్కబెట్టడం వగైరాలు ఆడాళ్ళవి. వీటిలో ఏవిముఖ్యం, ఏవికావు అనేదాన్ని బట్టి కూడా ఆధిక్య అనాధిక్యాలు నిర్ణయం కాకపోవు.

బృంద వివాహ పద్ధతిని వదిలి మిథున వివాహ పద్ధతిని అభిమానించీ, అక్కడితోనూ ఆగకుండా ఏకపత్నీ పద్ధతిని కోరుకుందీ పురుషుడికంటె హెచ్చుగా స్త్రీయే. పాతపద్ధతులు తనకు సంకట కలిగించడమే ఇందుకు కారణం అనేక భర్తలతో కాపురం చెయ్యవలసిరావడం సుఖమేమీకాదు. దీనినుంచి బయటపడేందుకని "కన్నె చెర" వదిలే తరుణాన ఏ అమ్మవారి గుడిలోనో తనకు నచ్చిన పురుషులనేకుల తోటి సంభోగించి, అలా ఒక్క పూటతో పాతపద్ధతుల్ని పాటించి, ఆ తర్వాత మాత్రం స్వపురుషుడికోసం ఎదురుచూచే మతాచారం కొన్ని జాతులకు ఉండేది. అంటే, అన్యులకు తన "శీలాన్ని" అను భవయోగ్యం చెయ్యకుండా ఒక్కడికే కట్టబెట్టేందుకు స్త్రీ పూనుకొన్నదని అర్థం. ఈ పాటికి మానవ సమాజం ఆటవిక దశకు వచ్చి చేరుకుంది. వేటస్థానాన్ని పశుపోషణ ఆక్రమించింది. పశుపాలక జాతుల్లో పశు సంపద మొదట్లో గణగోత్రానికంతటికీ చెందినదే కావచ్చుగాని, కాలక్రమాన కుటుంబ ఆస్తిగ్గా మారింది. ఇంటి పెద్దకు చెందింది. పశు సంపదతో బాటు లోహంపని, నేతపని, వ్యవసాయం వగైరా కొత్త వృత్తులు వచ్చి, మానవశ్రమకు గిరాకీ పెరగడం కారణంగా, మానవ పశువుల్లాంటి బానిసలచేత చాకిరీ చేయించడం మొదలైంది. తెగల పోట్లాటల్లో ఓడి చేజిక్కిన వాళ్ళను వెనుకటి రోజుల్లోనైతే చంపేవారుబీ ఇప్పుడు ప్రాణాలు దక్కించి పని చేయించుకోసాగారు.

భౌతిక పరిస్థితుల్లో వచ్చిన ఈ పెద్ద మార్పు స్త్రీ హోదాలో కూడా మార్పుకు కారణమైంది. మిథున వివాహ పద్ధతిలో తల్లితో పాటు తండ్రి కూడా ఫలానా అని తెలుసుకునే వీలు కలిగింది. ఆహారోత్పత్తి, దానికి సంబంధించిన సాధన ఉపకరణాలు మగవాడి పరమైనట్టే, యిల్లూ యింట్లో వస్తువులూ ఆడదాని పరమయ్యాయి. పశువులూ, బానిసలూ మగాడివే. తాను సంపాదించుకున్న ఆస్తిని తన బిడ్డలకే దక్కించాలంటే, పాత పద్ధతులు ఆటంకం. వాటి ప్రకారమే పోవలసివస్తే, తన బిడ్డల గణగోత్రమూ తన గణగోత్రమూ వేర్వేరు, ఆస్తి తన గణగోత్రం దాటి అన్యులకు చెందకూడదు కాబట్టి తన అన్నదమ్ములూ అప్పచెల్లెళ్ళూ, అప్పజెళ్ళెళ్ళ బిడ్డలూ, తన పినతల్లి పెదతల్లి బిడ్డలకూ దాని ననుభవించేవాళ్ళు. అంతేగాని, తన బిడ్డలు కాదు. తల్లి గణగోత్రమే వారు దీన్ని కూడా ఆస్తిపాస్తులే వారికి దక్కును. ఈ పరిస్థితి మగవాడికి సరిపడిలేదు. పైగా, ఇప్పుడు కొత్త కొత్త రూపాలలో ఆస్తి పెరిగిపోతూ వచ్చింది. దానితో బాటు తన హోదాకూడా ఈ మార్పుకు తగ్గట్టు ఆస్తులు కూడా మారాలి. కాబట్టి మాతృస్వామ్యం పోవాలి. సంబం తల్లి-గణగోత్రానికి చెందినవారు అందరూ తండ్రి గణ గోత్రానికి చెందిపోవాలి. వారే తండ్రి ఆస్తికి వారసులు కావాలి. తల్లి నిగాక తండ్రినిబట్టి వంశం పేరుండాలి. చిన్నదిగా కనిపించే ఈ మార్పు, పెనువిప్లవమే. ఇది ప్రపంచ చరిత్రనే తారుమారు చేసిందంటాడు ఎంగెల్సు. బయటే కాకుండా చేగాక ఇంట్లోనూ మగాడిదే పెత్తనమైంది. ఆడది గృహబానిసైంది. వట్టి "శృంగార వస్తువుగా, సంతాన సాధనంగా మారింది. పితృస్వామిక కుటుంబమనేది ఇలా రూపొందింది. స్వతంత్రులైన సభ్యులూ అస్వతంత్రులయిన సభ్యులూ యింటి పెద్దయిన "మగ మహారాజు " ఆధిపత్యానికి లోబడివున్న కుటుంబాన్ని పితృస్వామిక కుటుంబమని వర్ణించారు. లాటిన్ భాషలో "ఫేమిలియా" అనే మాటకు "కుటుంబం" అనే అర్థం రూఢిగాక ముందు, మొట్టమొదట్లో ఒక వ్యక్తికి చెందిన బానిసల సమూహమనే అర్థం వుండే. ఈ బానిసలంతా క్షేత్ర వ్యవసాయానికే పనికి వచ్చేవాళ్ళు. ఆడది "క్షేత్రం" అయింది కూడా ఇప్పుడే, అంటే తానూ ఆ ఆస్తిగా మారిందని దాని అర్థం.

పితృస్వామిక గృహసమాజం ఇంకా విడి విడి పితృస్వామిక కుటుంబాలుగా చీలిపోలేదు. ఏకపత్నీ వివాహ

పద్ధతి వెనువెంటనే ఏర్పడలేదు. అనేక తరాలకు చెందిన వాళ్ళంతా కలసి ఒకే ఇంటి పెద్ద అదుపాజ్ఞలకు లోబడి ఒక్కటిగా, సమిష్టిగా, వుండేవాళ్ళు. వాళ్ళకు చివరికి తమ ప్రాణంతో సైతం అధికారంలేదు. యూరపు ఖండంలో రష్యా నుంచి ఐర్లాండు దాకా ఇలాంటి పితృ స్వామిక గ్రహసమాజాలుండేవి. మన దేశంలోనూ ఉండేవి. దీని లక్షణమంతా సమిష్టి భూస్థితి, సమిష్టి సాగు బడి. దీన్నుంచే గ్రామసమాజం రూపొంది, గ్రామ సముదాయ భూము లతో బాటు విడివిడి సేద్యనాద్యాలు ఏర్పడ్డాయని అంటారు.

ఏకపత్నీ వివాహ పద్ధతి (మోనోగమీ) ఈ కొత్త ఆస్తి సంబంధాలకు విహితమైంది. మిథున కొత్త వివాహ పద్ధతికీ దీనికీ మధ్యగల భేదంవల్లా, వివాహబంధం స్త్రీని బంధించి నంతగా పురుషుణ్ని బంధించకపోవడమే. స్త్రీకి పాతివ్రత్యం ఆదర్శం చేయబడింది యిప్పుడే పురుషుడి కెప్పుడూ బహుభార్యా నిషేధంలేదు. తన ఆస్తికి వారసులు కాగల బిడ్డలను కనిపెంచడం ఒక్కటే భార్య ధర్మం. భర్తతోనే భార్య బతుకైనా చావైనా. తనది ఇంటిఖైదు. అంతఃపురాలూ అభ్యంతర మందిరాలూ ఘోషా పర్దా - ఇలాంటివన్నీ అందుమూలంగా చేకూరి నవే. దీనికంతటికీ వ్యక్తి ఆస్తి ఒక్కటే మూలం. చరి త్రలో యిది మొట్ట మొదటి వరవై రుధ్యమని ఎంగెల్సు అంటాడు. తొలి వర్గదోపిడీ సైతం ఇదే - ఆడది యింటి దాసీ,

లోగడ పేర్కొన్న వ్యాసంలో రోగ్జానీ డంబార్ రాసిన మరికొన్ని మాటల్ని ఇక్కడ పేర్కొంటాను.

ప్రకృతిని స్వాధీనం చేసుకోవడంలో మగవాడు స్త్రీని కూడా స్వాధీనం చేసుకున్నాడు. ఆహార ఉత్పత్తి విషయంలో స్త్రీ ప్రకృతితోటి కలిసి పనిచేస్తూరాగా, పురుషుడు ప్రకృతికి ఎదురు తిరిగి పనిచేశాడు. (పుట 47)

భూమిపై స్త్రీలపై ఆధిపత్యంకోసం పురుషులు తమలో తాము పోటీపడుతూ వచ్చిన ఫలితంగా, వారిలో కొందరు తతిమా వారి మీద ఆధిపత్యం చేకూర్చుకో గలిగారు. స్త్రీలేగాకుండా తతిమా మగవారు కూడా కొద్దిమంది పురుషుల ఆధిపత్యానికి లోబడవలసి వచ్చింది. కాయ కష్టం చెయ్యకతప్పని రైతాంగం ఏర్పడింది ఇలాగే. భూస్వామికేగాని యీ రైతుకు మాత్రం పొలం మీదనే గాకుండా తన స్త్రీలమీద సైతం అంతిమంగా ఏ హక్కు ఉండేదికాదు. ఎవరినంటే వారిని భూస్వామి తీసుకుపోవచ్చు, ఎందుకోసమైనాసరే (పుట 48)

ఈ కొత్త వివాహ పద్ధతికి అందరు స్త్రీలూ తల ఒగ్గలేదు. లేదా, పురుషుడే తన ఆనందంకోసమని స్త్రీలలో కొందరిని యీ పద్ధతి నుంచి మినహాయించాడు. వీళ్ళు "స్వీయ"లు కారు, "సామాన్య"లు. గ్రీసులో హేటేరాలని, మన దేశంలో దేవదాసీలని రకరకాల పేర్లు. బృంద వివాహ పద్ధతి తాలూకు సంకటాలనుంచి బయట పడేందుకు, తమ "శీలం" నిలుపుకునేందుకు ఒకప్పుడు మత ఆచారం అనిపించేలా స్త్రీలు ఏదో అమ్మవారి గుడిలో ఒకపూట అందరి అనుభవానికి తమని తాము అర్పించు కునే వారన్నామే, అది ఇలా కొందరి విషయంలో కొనసాగి చివరికి పడుపువృత్తిగా పరిణమించింది. ఈ కొందరు అందరి పక్షాన తాము కన్యలుగా వుండి పురుష లందరికీ ఉపభోగ్యులయ్యేవారు. ఏకపత్నీ వివాహ పద్ధతి తలెత్తాక గూడా పురుషుల సౌకర్యార్థం బృంద వివాహ పద్ధతి అవశేషం కొనసాగిందన్నమాట. స్త్రీకి వ్యభిచారమే మార్గ మైంది. జారిణికి ఘోరమైన దండన. అయినా నిర్బంధ దాంపత్యం నుండి అదొక్కటే ఆట విడుపు.

ఏకపత్నీ వివాహ పద్ధతికి ఆర్థికావసరాలే కారణం గాని, స్త్రీ పురుషుల అన్యోన్య ప్రణయం మాత్రంకాదు. మైథున వాంఛతోగూడిన ప్రణయం ప్రస్తావనేలేదు. వివాహ బహిర్గతమైన ప్రణయాన్నే మధ్యయుగాల యూరపులో సంపన్నవర్గాలు "షివల్రస్ లవ్"గా సంభా వించాయి. మన కృష్ణలీలలకు అవి ఒకలాంటి నకళ్ళు. మన ప్రబంధాల సంభోగ శృంగారానికేమీ తీసిపోవు.

పెట్టుబడిదారీ విధానం వచ్చి స్త్రీని మరీ హీనం చేసింది. ఇప్పుడు స్త్రీకీ, బజారు సరుక్కీ తేడానే

లేకుండాపోయింది. భూస్వామ్య సమాజంనాటి కట్నాలూ కానుకలూ ఏదోరూపాన ఇప్పుడూ కొనసాగుతూనే ఉన్నాయి. కాకుంటే, భారీ పరిశ్రమల పుణ్యమాని అట్టడుగు వర్గాల స్త్రీలు తమ శ్రమశక్తిని ఇంటి చాకిరీనుంచి ఫాక్టరీ చాకిరీకి మార్చుకోగలిగారు. శ్రామికుల కుటుంబాలలో మగవాడి జులుం తగ్గేందుకు కారణం. ఒకొకప్పుడు ఆడదాని సంపాదనమీదనే కుటుంబం ఆధారపడవలసి రావడం. అయితే ఇక్కడ మగవాడి పశుబలానికి దౌర్జన్యానికి ఇంకా అవకాశం ఉంది. సమాన హక్కులు లేకపోవడానికి కారణం ఈనాటిది కాదు. సామాజిక ఉత్పత్తినుంచి స్త్రీని తప్పించడం జరిగినప్పుడే, ఇంటికి పరిమితం చేసినప్పుడే అది దాసీ పనికి మొదలయ్యింది. మళ్ళీ సామాజిక ఉత్పత్తిలో భాగస్వామి అయితేగాని, స్త్రీకి పురుషునితో నిజమైన సమానత కలగదు. సామాజిక విప్లవ ఫలితంగానే ఈ పరిణామం ఏర్పడుతుంది వ్యక్తి ఆస్తిపోయి, ఉత్పత్తి సాధనాలన్నీ సమాజ పరమైన ప్పుడు, స్త్రీ స్థితికూడా మారుతుంది. అప్పుడికా సమాజానికి విడివిడి కుటుంబాలే ప్రాతిపదికగా వుండవు. గృహనిర్వహణ సామాజిక పరిశ్రమగా పరివర్తన చెందుతుంది. పిల్లల పెంపకం కూడా సమాజానికే విధాయకమవుతుంది. కట్టుకున్నవాడికి పుట్టినబిడ్డా, లేక ఇష్టం వచ్చినవాడికి పుట్టినబిడ్డా, అని అడగనిరోజున, ఆ రోజున్నే, ఆడది నిజంగా మగవాణ్ణి ప్రేమించి అతనితో స్వేచ్ఛగా ప్రవర్తించే అవకాశం ఉంటుంది. అయితే ఇది విశ్రుంఖలతకు దారితీయనక్కర్లేదు. దప్పిక ఉన్నప్పుడు గ్లాసెడునీళ్ళుతాగి వెళ్ళే పద్ధతి బూర్జువా అరాచకమే. ఈ గ్లాసెడు నీళ్ళ వాదాన్ని లెనిన్ ఖండించాడు.

వ్యక్తులుగా స్త్రీ పురుషుల మధ్య ప్రేమకు మొటమొదటి పర్యాయం కమ్యూనిస్టు సమాజంలోనే అవకాశం వుంటుంది క్రితంలో సమాజం సహించని ప్రేమ కలాపాలు అవశ్యం చాటుమాటుగానో తప్ప సాధ్యమయ్యేవి కావు. ''పామరుల'' విషయం వేరే. పాత సమాజం క్షీణ దశలో వేశ్యావృత్తికి పూనుకొన్న స్త్రీల విషయంలోనూ ఇవి సాధ్యమే. పరస్పరం ప్రేమ ఉండాలన్నప్పుడు, స్త్రీకి పురుషుడితో సమానత ఉండాలి. గతంలో అదిలేదు. స్త్రీ ఆమోదంతో ఇష్టంతో నిమిత్తం అంతగా లేకుండానే ''శృంగార'' కాండ సాగేది. భూస్వామిక సమాజంలోనూ బూర్జువా సమాజంలో కూడానూ స్త్రీ పురుష సంబంధాలను పరస్పర ప్రేమపరంగా పరీక్షించి 'నిర్ధారణ చెయ్యగల నైతిక మానదండంలాంటిది పేరుకి ఒకటి ఉందనుకున్నా, ఆచరణలో అమలు జరగదు. మధ్య యుగాల్లో వివాహేతరమైన ప్రేమ - ''షివల్రన్ లవ్'' - సంపన్న వర్గాలకు ఆదరణీయమైంది. పెట్టుబడిదారీ సమా జంలో వివాహ పద్ధతికిగల మత సంబంధమైన కట్టుబాట్లు సడలి, వ్యాపార లావాదేవీల్లోలాగా యిద్దరు వ్యక్తుల ఒప్పందం (కాంట్రాక్టు) పద్ధతి బాపతుగా పరిణమించినా, స్త్రీ పురుషుల మధ్య నిజమైన సమానత లేనందు చేత ఏకపక్ష వివాహ వ్యవస్థే కొనసాగుతు రాసాగింది. ప్రేమ వివాహాలనేవి పేరుకే. వర్గపరిమితులను దాటి మాత్రం అవి జరగవు. వివాహంలో సంపూర్ణ స్వాతంత్ర్యం పెట్టుబడిదారీ విధానం రద్దు తర్వాతనే సాధ్యం. ఏకపత్నీ వివాహ పద్ధతి కొనసాగినా, దానితో ముడిపడిన ఆస్తి సంబంధాలనుంచి ఏ యే అవలక్షణా లైతే పుట్టుకొచ్చాయో అవన్నీ పోతాయి. మగవాడి పెత్తనం పీడాపోతుంది. వివాహబంధ అవిచ్ఛిత్తి కూడా అంతే. సామాజిక విప్లవమే స్త్రీ స్వాతంత్ర్యానికి, సమానతకు మార్గం.

**ఆధార గ్రంథాలు :**

1. మార్క్సిజమే తెలియకపోతే, పుట్టినవాళ్ళం పుట్టినట్టే ఉంటాం!- రంగనాయకమ్మ, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2010
2. సాంఘిక విప్లవ రచయితలు - కత్తి పద్మారావు, లోకాయత ప్రచురణలు, నిడబ్రోలు, 1983.

3. సాంఘిక, రాజకీయ శాస్త్రాల ప్రాథమిక జ్ఞానం 'వర్గాలు వర్గపోరాటం అంటే ఏమిటి- ఎ.యెర్మకోవా, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరబాదు, 2012.
4. మేధావులు మెతకలు - అన్నపరెడ్డి వేంకటేశ్వరరెడ్డి, జనన ప్రచురణాలయం, సూర్యారావు పేట, విజయవాడ,2014.
5. జాన్ జాక్ రూసో సామాజిక ఒడంబడిక (ది సోషల్ కాంట్రాక్ట్)- (అ) నాదెళ్ళ అనురాధ, అనకనంద ప్రచురణలు, విజయవాడ, 2018.
6. ప్రవక్త - బెందాళం క్రిష్ణారావు (అ), క్లాసిక్ బుక్స్, విజయవాడ,2017.
7. చిరాయువులు ప్రాచీన రోమన్ చరిత్ర- డా.వి.శ్రీనివాస చక్రవర్తి, మంచి పుస్తకం, సికింద్రాబాద్, 2020.
8. రష్యావిప్లవం భారత స్వాతంత్ర్య సంగ్రామం- జయమోహత (సం) నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2019.
9. అమ్మ - మక్సీమ్ గోర్కీ, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2016.
10. తత్వశాస్త్ర దారిద్ర్యం- క్లార్ మార్క్స్, తెలుగు అనువాదం వై.వి.రమణారావు, హైదరాబాదు, 2019.
11. మార్క్సిస్టు (మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల తాత్విక రచనలు, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాదు, 2011.
12. శంకరనారాయణ (ఇంగ్లీషు-ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు, తెలుగు ఉచ్ఛరణతో) - ఆచార్య పాలూరి శంకరనారాయణ, విక్రమ్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2010.
13. బ్రౌణ్య (తెలుగు - ఇంగ్లీషు నిఘంటు)- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2007.

❀❀❀

# మార్క్సిస్టు దృష్టిలో మహిళ

- డా॥. పి. భగ్గు నాయక్, తెలుగు అతిథి అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రి కళాశాల, పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లా.

బహుభాషాకోవిదుడు, శతావధాని, శతాధిక గ్రంథకర్త వేలూరి శివరామశ్రాస్తిగారు కథలు, నాటకాలు, నవలలు, ఖండకావ్యాలు వంటి విభిన్న సాహిత్య ప్రకియల్లో రచనలు చేశారు. టాల్‌స్టాయ్, శరత్, రవీంద్రుని రచనలను తెలుగులో అనువాదం చేశారు.వీరి నవలలో ఓబయ్య (1920) జాతీయోద్యమం ఇతివృత్తంగా సాగింది. ఖండ కావ్యాలలో ఏకావళి(1940)పేరు పొందింది. కృతి, వీధిబడి, దత్తు, క్షమాపణ, డిప్రెషన్ చెంబు వంటి కథలు పేరుపొందాయి. మాధవశర్మ(1929)చారిత్రక నాటకం, ప్రథమ పాంథికుడు, వేతసి(1924), గురుదక్షిణ(1929), అరణ్య శేషోన్నయం(1960), సుల్తానీ(1962) మొదలగు నాటకాలు, నాటికలు రాశారు.

## సుల్తానీ నాటిక :

వేలూరి శివరామశాస్త్రి 1962లో తెలంగాణ యాసలో ఈ "సుల్తానీ" నాటికను రచించారు. సుల్తానీ రెండు అంకాల నాటిక. ఇందులో సుల్తానీ, పరమానంద, సుల్తాన్, గాలెన్న. రాంగిరి, జోగులక్క, శాంతయ్య, పటేలు మొదలైన పాత్రలు ఉన్నాయి. తెంగాణలోని మారుమూల కుగ్రామంలో ఉన్న పూరిగుడిసెలు స్టేజి మీద కనిపిస్తుండగా ఈ నాటిక ప్రారంభమవుతుంది. కథ మొత్తం ప్రధాన పాత్ర అయిన సుల్తానీ చుట్టు తిరుగుతుంది. సుల్తానీ జీవితంలో ఎదురైన పరిస్థితులను విశ్లేషించడమే ఈ పరిశోధనా పత్రం ముఖ్య ఉద్దేశ్యం.

## స్త్రీ ఆవేదన :

తెలంగాణలోని మారుమూల కుగ్రామంలో జరిగిన సంఘటన ఆధారంగా ఈ నాటిక సాగుతుంది. ఒకవైపు పరమానంద పూరిగుడిసె, ఎడమవైపున రాంగిరి గుడిసె ఉంటాయి. రాంగిరి ఎందుకమ్మా నిన్ను అట్లా కొడు తున్నడు అంటే బర్రెగొడ్లు గోగుల మొక్కలు తిన్నయని కొట్టిండని చెప్పగా ఎందుకమ్మ అట్లా చెప్పుతవు. చీటికి మాటికి నిన్ను కొడుతూనే ఉన్నాడు. ఎందుకని అడుగగా ఎట్లా బతకనిస్తరయ్య, ఎవరు బతకనిస్తరు నన్ను అని తన ఆవేదనను రాంగిరికి తెలియజేస్తుంది సుల్తాని. అప్పుడే ఇంటికి వచ్చిన సుల్తాని భర్త గంజి పొయ్యమని అడుగగా, గంజి కాయడానికి నూకలు లేవని,అంటే "పీకల గంట దాగేశ్నివా?" అని పురుషాధికత్యం చూపించి నింద వేస్తాడు. కాని అసలు విషయం తెలుసుకోడు పరమా నంద. రాత్రి ఉన్న గంజి మొత్తం నీకే బోసానని ఇంట్లో నూకలు అయిపోవడంతో ఈ పూట గంజి కాయలేదని సుల్తానీ చెప్పగా, నూకలు అయిపోయిన విషయం నాకెందుకు చెప్పలేదని నిన్ను మెకం దినిపోనూ, నిన్ను గుట్టమీని నరసిమ్మ సామెన్నడు యిరసక దింటడో, నిన్ను మారెమ్మ మింగిపోనూ నూకలైయి పోయినాయో అని కొట్టబోతాడు.

భర్త నూకలు తేవడానికి పోవడంతో పొయ్యిలో అగ్గి మండిస్తుండగా భజనపోళ్ళు రావడంతో వాళ్ళను చూసు కుంట ఉండగా పొయ్యిలో మసిగుడ్డ అంటుకొని గుడిసె కాలిపోతుంది. దానితో భర్త పరమానంద వచ్చి సుల్తానీని మందలిస్తుండగా పక్క గుడిసె రాంగిరి ఎందుకట్లా ఆమెను బాధపెడుతున్నవని అడిగినప్పుడు

**రాంగిరి :**

కొండాల్ జెప్పుమన్రీ? గుడిసె తగల్బెట్టినాది? నాట్క పోల్లతో నాట్కమాడుతున్నాది. ఏమమ్మా! గిట్లంటరు.

**సుల్తా :**

రాంగిరన్నా! మా దేముడు నూకలకుబోయిండు - పొయ్యిల అగ్గి నుప్పేసిన్ను! కిరసినఁ బుడ్డి పొయ్యి దగ్గర ఉందిగింతలో దేముడయ్యొచ్చిండు. సీతమ్మ కద జెప్తున్నాడునే గట్లనే యినుకుంటున్నను పొయ్యిలో కిరసిన్

బుడ్డి బడి మంటలేస్నిదేమో, నే జూడలే. పొయ్యి గుడిసె కంటిన్నది.

**పర :**

పొయ్యిగుడిసె కంటిన్నాదే? పొయ్యి గుడిసెకంటి న్నాదె? నాల్గేండ్లబట్టి లేని గుడిసె యీ దినమే గుడిసె కంట్నాదె! యీ దినం గుడిసెకు బాకినాదె. తన్కుకు జస్తవ్-ఏడకి జస్తవో జావ్-కదలమంటుండులే(రాంగిరి గుడిసె లోనికి పోతాడు)

**సుల్తా :**

నా కెవరున్నరని బోను, ఏడకు బోను?.....

**సుల్తా :**

నాకెవ్వలూ లేరయ్య, నేపుట్టంగనే మా అమ్మయ్యలు జచ్చిపోయిన్రని మీ బోండ్లయ్యలు బెంచి పెద్దదాన్ని చేసెన్రని గింత ఓలె బుచ్చుకోని యీ అయ్యకొప్ప జెప్పిన్రని-యీ దేముడే జెప్తెయిన్నను. నా కెవలున్నరని బోను-ఏడికనిబోను?(లెంపలేసుకొని ఏడుస్తుంది)

**పర :**

ఏడికిబోతావోపో, గెట్లనట్ల పరమానంద పక్కన, గుడిసెలో కూసుని, కుల్కుదమను కుంటున్నవేమొ! అదికుదర్దు-ముందు మూటముల్లె గట్టు (సుల్తానీ, 2011 : 482) భర్త చేతిలో ఎన్ని చిత్రహింసలకు గురయిన కాని అతనిని వదిలి వెళ్ళడానికి ఒప్పుకోదు సుల్తానీ అందుకు కారణం తన చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి అనాథ అయ్యింది. పెంచి పెద్ద చేసినవాళ్ళు వదిలించుకున్నారు. ఇక తనకు సర్వస్వం అనుకున్న భర్త శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు పెడుతుంటే ఆ బాధను దిగమింగుకుంటూ క్షణమొక యుగంగా గడుపుతూ కాలాన్ని వెళ్ళదీస్తుంది. అయినా సరే భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా చివరకు ఆమెను వదిలించు కోవడానికి సిద్ధపడతాడు. చెడు వ్యసనాలకు బానిసై చెప్పుడు మాటలు విని సుల్తానీని హింసిస్తున్న సంఘ టనను కళ్ళకు కట్టినట్లుగా చూపించారు నాటక రచయిత.

**అమాయకత్వం :**

గాలెన్న మాటలు విన్న పరమానంద సుల్తానీని వెళ్ళగొట్టడానికి నిశ్చయించుకొని నీ మూట ముల్లె సర్దుకొని నా ఇంట్లో నుంచి వెళ్ళిపొమ్మని దబాయిస్తూ ఉంటాడు. అప్పుడు రాంగిరి కలుగజేసుకొని పరమానంద ఎందుగిట్ల పాపం మూట గట్కుంటవ్, ఏదో జరా తప్పు జేసెన్నని లెంపలేస్కుంటున్నది, కాల్లబడుతున్నది-కాల్ల మొక్కు తున్నది. నీవు గొడ్తె గొడ్తదా! తిడితే తిడ్తదా! నీ పెండ్లమయ్యా పెండ్లము కొంచెం మానవత్వంతో దయ చూపించమని చెప్పిన రాంగిరిని కూడా నానా మాటలు అని తిడతాడు. సుల్తానీని తక్షణమే నా ఇల్లు విడిచి పోమ్మని చెబుతాడు. అలాగే కులాచారాల ప్రకారం నేను కట్టిన తాళి ఇచ్చిపోమ్మని కూడా చెబుతాడు.

**పర :**

ఏమట్ల చూస్తవే? జల్దీగా చెల్లు చీట్లిచ్చి ఎల్తవాఎల్లు లేకుంటే ఈ జెట్టుకొమ్మకు ఉరివేస్కోని యీడే జస్తను. అట్లనైన నిన్ను గట్కపోతరు-గాలెన్నా, తాలుర.

**గాలె :**

(వచ్చాడు) తాలుర (చెల్లు చీట్లుదీసి యిద్దరి చేతివేలి ముద్రలు వేయిస్తాడు. వేలిముద్రలు వేయించిన తరువాత) వరెఎల్తదుండు రగడ జేస్తావఁ. మీకు మనసు గుదురదు, మాట గల్వదు. ఎవరి దారి వాళ్ళది.

**సుల్తా :**

వద్దు దొర వద్దనే బోలేనూనే బోలేను (మూట తీసుకుని నడుస్తు వుంటుంది) నీవే సుకంగ వుండు.

**పర :**

ఏమమ్మో మరిగల్తె అట్లనే బోతవా? ఓలె ఇచ్చి నేగట్టిన మరి ఆ తాలెబట్టు?

**సుల్తా :**

ఏం జేయాలె?

**పర :**

యీడ బెట్టిపోవాలె!

**గాలె :**

తాలి బట్టీడ బెట్టకుంటె యీచెల్లు చీటీలు జెల్లవుగ మరిాజెప్పు.

**పర :**

మరి! యిన్నవా మన కుల కట్టడి?

**సుల్తా :**

తాలిబట్టు యీడబెట్టిపోకుంటె, నీకు నాకు చెల్లెట్ల అయితదే? ఎవరి పెండ్లానివే అంటే ఎవరి పెండ్లాన్నని జెప్తవ్! పెండ్లాముండగా బెండ్లామిస్తరా మరి! అందుకీడ బెట్టి బోవాలె! (అని ముందుకు బోతాడు)

**సుల్తా :**

వద్దు దొరా ఇది గోర పాతకమన్నా! యీ సూత్రముం చండి లేకుంటే లోకులు నన్ను జిత్ర చిత్రంగ జూస్తరు - లోకుల కండ్లు నే మూయలేను దొరా! నీ పేరు నేనేడ జెప్పను. (పరమానంద సూత్రంపై చేయివేస్తాడు) దొరా! (పెద్దగా అరుస్తుంది) నీ పెండ్లాన్నని యెవరికి జెప్ప.

**పర :**

గాలెన్న, నీవు జెప్పినట్లుగనే జేసిన-దాని సూత్రం దెంపుకొచ్చి ఎల్లగొట్టిన. నాకు జిల్కను గట్ట బెట్టాలె. (సుల్తానీ,2011:484) ఎంత బతిమాలినా పరమానంద పట్టిన పట్టు విడువక పోవడంతో నెత్తి నోరు కొట్టుకొని చేసేదేమిలేక ఆ అభాగ్యురాలు పరమానంద తాను కట్టిన తాళి తెంచుకొనగా బతుకుజీవుడా అంటూ అక్కడి నుండి నిష్క్రమించడంతో నాటికలోని మొదటి రంగం పూర్తవు తుంది.

**తిరుగుబాటు :**

రెండవ రంగంలో సుల్తానీ, సుల్తాన్‌ను పెళ్ళి చేసు కుంటుంది. శాంతయ్య ఇంట్లో పని చేసుకుంటూ బతుకుతుంటుంది. తమ కులాచారం ప్రకారం భర్త పేరును పిలువరాదని, పేరే లేని తనకు సుల్తానీ అనే పేరు వచ్చిందని, అసలు నన్ను కన్న తల్లిదండ్రులెవరో కూడా తనకు తెలియదని చెప్పునే కులాచారాన్ని పాటించాలని చెప్పడం ద్వారా ఏ సమాజమైనా స్త్రీని చూసే పరిస్థితిని తెలియజేస్తుంది. నాటకం చూడటానికి పోదామని సుల్తాన్ అనగానే తన గత జీవితం నాటకం వలననే నాశనమైందని మళ్ళి నాటకం చూడటానికి భయపడిన సుల్తానీ నేను రానని చెబుతుంది. ఇట్లా తను పడిన బాధలను దిగమింగుకొని కాలం గడుపుతున్న సమయంలో ఆకస్మాత్తుగా ఒకరోజు మళ్ళీ పరమానంద సుల్తానీ దగ్గరకు వస్తాడు. నేను అవసరం లేదని చెప్పి వెళ్ళగొట్టినవు కదా మళ్ళి ఎందుకొచ్చావని సుల్తానీ ప్రశ్నించగా నువ్వు వచ్చేసినా తర్వాత నా దగ్గర నుండి లక్ష్మీదేవి వెళ్ళిపోయిందని అందరూ అంటున్నరు. నేను దిక్కులేని పక్షినయ్యాను. మనాదితో రోగం వచ్చి చావు నోట్లో తలపెట్టి బతికి బయటపడ్డాను. మళ్ళి నిన్ను కలుసుకొనే నుదుటి రాత నాకు ఉంది. కాబట్టి నువ్వు ఇప్పుడు నా దగ్గరకు వచ్చేయ్ మనం మన పల్లెకు వెళ్ళిపోదామని పరమానంద పిలుస్తాడు. అప్పుడు సుల్తానీ మరొకరి సావాసం జేసి ఇష్టం వచ్చినట్లు కులికి, పెండ్ల ముండగ, పెండ్లమిస్తరా అని తాలిబట్టు తెంపుకొని వెళ్ల గొట్టినవ్ కదా! మరి ఇప్పుడెందుకు నా దగ్గరకు వచ్చినవు. నన్ను ముట్టుకున్నవో, ఏడ ముట్టుకుంటే ఆడకు గోసి పారేస్తను జాగ్రత్త నీవు వచ్చిన దారినే వెళ్ళిపో లేకుంటే నీ అంతు చూస్తానని పరమానందపై సుల్తానీ తిరగబడుతుంది.

**భర్తహింస :**

సుల్తానీ ఇంటికి పరమానంద వచ్చిండని, అతనితో నీ భార్య మాట్లాడుతుందని, నీ భార్య పిలవకపోతే అతను ఎందుకు వస్తాడని, జీతం పైసల్ అంత అతనికి ఇస్తుందని మిగతాదంతా ఆ శాంతయ్య దగ్గర దాచిపెట్టిందని జోగు లక్క చెప్పుడు మాటలు వినగానే ఇవన్నీ నిజమని నమ్మిన సుల్తాన్ శాంతయ్య దగ్గర ఎంత దాచి పెట్టినవని ఆ సొమ్ములు తీసుకురమ్మంటాడు. నేనేమి దాయలేదని కాసుల దండ మాత్రం ఉన్నదని అంటుంది సుల్తాని. అది మొత్తం తీసుకొని రా నేను ఖుషి చేసుకోవాలంటాడు

సుల్తాన్. అప్పుడు సుల్తానీ కాసులదండ పరమానంద ఇచ్చాడు కాబట్టి అది అతనికే చెందుతుందని అంటుంది. తన మాట వినలేదని జుట్టు పట్టుకొని కింద పడేసి వేప చువ్వలతో ఇష్టం వచ్చినట్లుగా కొడతాడు. ఒళ్లంతా వాతలు తేలి గాయాలు కన్పింస్తుండడంతో ఏమ్యిందని శాంతయ్య అడుగగా అడవికి కట్టెలకు పోతే కొమ్మలు గీరుకున్నాయని చెప్తుందే కాని తన భర్త కొట్టాడని మాత్రం చెప్పదు. నా కర్మ ఇంతేనని ఏడుస్తుంది.

సుల్తాను కొట్టిన దెబ్బలకు ఒంట్లో శక్తి లేక, నిలబడలేక పోతుందని సుల్తాని కనీసం పైకి లేచి లేవలేక పోతుంది. గుక్కెడు నీళ్ళకోసం పరితపిస్తూ ఉండగా మొదటి భర్త పరమానంద వచ్చి దాహమేస్తున్నదా నేను నీకు నీళ్ళు ఇస్తానని అంటే వద్దు వద్దు నీవు నన్ను ముట్టుకోవద్దని అంటుంది. ఆత్మమాభిమానురాలైన సుల్తానీ. దానితో పరమానంద నా బుద్ధి గడ్డి తిన్నదని, నిన్ను విడిచి నేను ఎక్కడికి పోలేనని నా తప్పు తెలుసుకున్నానని పశ్చాత్తాప పడతాడు. సుల్తానీ తాగడానికి మంచినీళ్ళు అందివ్వబోగా అప్పుడే అక్కడికి వచ్చిన సుల్తాన్ నా పెండ్లాన్ని ఎందుకు ముట్టుకున్నావని పరమానందపై కత్తి విసిరేస్తాడు. అది పోయి పటేలుకు తగిలే సరికి

**పటేల్ :**

(తన్ని) వరె! వాడు నీ పెండ్లామును ముట్టుకుంటె మాకు జెప్పాలె-మరి మామీనకు కత్తివిసుర్తవన్నమాట! మా మీనకు. (కర్రతో కొడ్తాడు)

**సుల్తానీ :**

(అడ్డుపడుతుంది. కర్ర తలపై తగిలింది) అబ్బా! దొరా!

**పటేల్ :**

సుల్తానీ! గెంతపనిజేసినావె-గెంతపనిజేసినావ్. వానిదెబ్బ నీ వెందుకు దిన్నవ్? మల్లన్నా- సుల్తాన్ను బట్కరా-బట్కరా వాన్ని-మల్లన్న అడుగో, సుల్తాన్ ఉరుకుతున్నడు-బట్కరా వాన్ని-తానాకి బట్కరా వాన్ని.

**మల్లన్న :**

గట్లనే దొరా!!

**శాంతయ్య :**

ఇదేమి ఖర్మమే? వాడు నిన్ను కొట్టింది చాలక వాడి దెబ్బలు కూడా నీవెందుకు తిన్నావే? ఆ త్రాగుబోతు సన్యాసి నాకెదురై చెప్పి అట్లా పారిపోతున్నాడు.

**సుల్తానీ :**

దొర! దొర!!(బావురుమంటుంది)......

**సుల్తానీ :**

తమరి కడానే దాసిన కాసులు ఆ పరమనంద కిచ్చెయ్యండి నేనాతనితో జతబట్టినపుడు అతడు సంపాం దించినడు నన్నెల్లగొట్టినపుడుతిని బత్కమన్నడు. ఇది తిని బత్కమన్నడు దొర! (వినమన్నట్లు తలూపు తుంది)

**పర :**

(ప్రవేశించి సుల్తానీని చూస్తాడు) సుల్తానీ!! ఏంగట్ల నున్నవు?

**సుల్తానీ :**

పరమానందా! నీవే వచ్చినవా? నీకె పిలువనంపాలె అనుకుంటున్నను.(శాంతయ్యతో) దొరా! ఆ కాసులు వీనికి ఇవ్వుని.

**పర :**

నాకొద్దు దొర! నాకొద్దు. ఆ కాసులు సుల్తానీకి జెందాలె. ఆ కాసులు సుల్తానీకే ఇవుని, మీ కాల్ మొక్తను.

**సుల్తానీ :**

ఆ కాసులు నా కెందుకు? నాకా వడ్డికాసుల వాడే ఉన్నాడు. ఏడుకొండల వాడా! (సుల్తానీ,2011:491,492) మొదటి భర్త తాళి తెంపుకొని గెంటివేయడంతో సుల్తాన్‌తో నైనా సంతోషంగా ఉండాలని అనుకున్న సందర్భంలో తిరిగి మొదటి భర్త రావడం. అది చూచిన జోగులక్క చిలువవలు పలువలుగా లేనిదంతా ఉన్నట్లుగా చెప్పడంతో సుల్తాన్ కొట్టిన దెబ్బలకు సృహ తప్పి పడిపోయింది. చివరకు సుల్తాన్ దెబ్బలను తాను

తిని మొదటి భర్త ఇచ్చిన కాసుల హారం అతనికే చెందాలని తన నిజాయితిని చాటుకుంటుంది. మొదటి భర్త హింసించి తాను కట్టిన తాళిని తెంపుకొని వెళ్లగొట్టగా, రెండవ భర్త కూడా మానసికంగా, శారీరకంగా హింసించిన కూడా సుల్తాన్‌కు బదులుగా తాను దెబ్బలు తిని చని పోయిన నిస్సహాయురాలైన లంబాడి స్త్రీ దీనగాథ ఇది.

**ముగింపు :**

తనకు ఒక పేరుగాని, తన వాళ్లంటూ ఎవరు లేని ఒక నిస్సహాయ మహిళ జీవిత దీనగాథ ఈ నాటిక. ఆనాటి సమాజంలో మహిళల పరిస్థితులు, ముఖ్యంగా లంబాడి స్త్రీల జీవితాలు ఏ విధంగా ఉండేవో కళ్ళకు కట్టినట్లుగా ఈ నాటికలో రచయిత చిత్రించారు. స్త్రీ అంటే కేవలం చెప్పినట్లు చేసే బమ్మగా భావింపబడి శారీరకంగా, మానసికంగా హింసించబడి తనకంటూ ఒక అభిప్రాయం లేని అబలగా పురుషాధిపత్య సమాజంలో ఇద్దరూ భర్తల చేతులలో దారుణంగా మోసపోయిన విధానాన్ని కళ్లకు కట్టినట్లుగా ఈ నాటికలో రచయిత చూపించారు. ముఖ్యంగా నాగరిక సమాజానికి దూరంగా నివసించే లంబాడి స్త్రీ దీనగాథ ఇది అని తెంగాణ ప్రాంత లంబాడీలు సూరవరం తోటలలో కోతలకు వచ్చిన సందర్భంలో జరిగిన సంఘటనను సులతాని కథగాను, సుల్తానీ నాటికగాను వేలూరు శివరామశాస్త్రిగారు రచించారని. అతని రచనలపై పరిశోధన చేసిన జంధ్యాల మహతి శంకర్ గారు పేర్కొన్నారు. ఎందరో అభాగ్యురాలైన ఆడపడచులు అనుభవిస్తున్న దీనగాథ ఈ నాటికలో స్పష్టంగా కనిపిస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచిక :**

1. గోపాలకృష్ణ పరుచూరి 2015 దృష్టి తెలుగు నాటక రచయితల ప్రత్యేక సంచిక హైదరాబాద్:పరచూరి రఘుబాబు మెమోరిల్ ట్రస్ట్
2. శివప్రసాద్ వల్లూరు, 2011 ప్రసిద్ధ తెలుగు నాటికలు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషంగ్ హౌస్.
3. శివరాజి, సత్యనారాయణ(సం) 2017, ద్రావిడ భాషల్లో నాటక సాహిత్యం వినయంబాడి:ఐలాక్కియా పాతిప్పగం

✿✿✿

# మైదానం రాజేశ్వరి

- లలిత సాహుకారు, శ్రీకాకుళం.

యుగాలు మారుతున్నా మనం ఆధునికీకరణ చెందుతున్న స్త్రీ జీవనం మాత్రం సమాజం కుటుంబం మనిషి అనే ఒక వలయంలో ఎన్నో ఒత్తిడులకుఆంక్షలకు అంతఃసంఘర్షణకు లోనవుతూనే ఉంది. ఆ వలయం నుంచి బయటపడేందుకు అనేక సహజ నైతిక అడ్డు గోడల్ని తెంచుకొని రావటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంది. ఆ ప్రయత్నంలో విఫలమైన జీవితాలే మనకు అనేకం కనిపిస్తాయి. సఫలమైన వాళ్లు తక్కువ. అటువంటి దృక్కోణంలో చలం లేఖిని నుండి వెలువడిన నాటి నేటి సజీవ పాత్ర రాజేశ్వరి.

ఇందులో రాజేశ్వరి పాత్రను విలక్షణ రీతిలో స్త్రీ అంతఃమదనం లోంచి ఎన్నో ఆశలు కోరికలు ఊహ లోంచి పుట్టుకొచ్చిన రాజేశ్వరి అర్థం చేసుకోవాలంటే ప్రతి స్త్రీ తన యొక్క హృదయాంతరాల్లో ఉన్న వేదనని నిస్సిగ్గుగా నిర్మొహమాటంగా చెబితేనే ఇక్కడ సృష్టించిన రాజేశ్వరి మనకు అర్థం అవుతుంది. అలా చెప్ప నట్లయితే ప్రతి స్త్రీ కూడా తనకంటూ ఒక అస్తిత్వం కావాలని కోరు కుంటుంది. నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియా లో చెప్పినట్లు నేను చిత్రం ఆరాధించ తగిన దేవత ను కాను జాలిపడి నిర్లక్ష్యంగా త్రోసివేయదగిన కీటకాన్ని కాను ప్రమాదకరమైన పనుల్లోనూ సాహసోపేతమైన పనుల్లోనూ నీతో కూడా ఉండి నీ జీవిత ధర్మ నిర్వహణలో భాగస్వామినిగా ఉండనిస్తే నాకు నిజం ఏమిటో నీకు తెలుస్తుంది. అనే మాటలు గమనిస్తే ఇక్కడ రాజేశ్వరి కూడా ఏమి కోరుకుంది అనే విషయం మనం గమనించ వచ్చు ఈమె జీవితంలో నాలుగు రకాల పురుషుల మనస్తత్వాలను చూసింది. రాజేశ్వరి కాపురానికి ముందు "నేను కాపరానికి వెళ్లకముందు ఆరు నెలలు నా వెంట వెంటపడి పోవాలని చూశాడు" తన తల్లితో విషయం చెబితే అబద్ధం అని బుకాయించడం ఈ విధమైన ఒక పురుష స్వభావాన్ని మొదట చూసింది. వైవాహిక జీవితంలోకి ప్రవేశించిన ప్రవేశించేటప్పుడు తనను తాను ఆవిష్కరించుకునే వడానికి ప్రయత్నం చేస్తుంది ఆ ప్రయత్నంలో కొన్ని అభిప్రాయబేధాలు కొన్ని అనుకోని సంఘటనలు జరిగినా సర్దుకోవడానికి ప్రయత్నం చేస్తుంది అయితే తన మనసుకు నచ్చినది కళ్లముందు కనబడేది పూర్తిగా వ్యతిరేకమైన అప్పుడు ఆమె ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడానికి ఆలోచన బయలుదేరుతుంది. దాని నుంచి ఆమె తనను తానే తప్పించుకోవడం కష్టం. భర్త ద్వారా నిరాదరణకు గురి అవుతుంది ఆ సమయంలో ఆమెను ఆకర్షించిన వ్యక్తి ఆ మీరు ఇతని లో గల సౌందర్యారాధన నిర్భయము తెగింపు అనే వాటికి ఆకర్షితురాలైంది. అతను చూపే చిరు ఆనందాలు శాశ్వతం కావాలని కోరుకుంది. భార్య పక్కన ఉండగా పరాయి స్త్రీ అందాన్ని వర్ణించే పురుషుడికి , పరాయి పురుషుని తన భార్య చూస్తే సహించలేడు ఆ విధంగానే ఒక తురక స్త్రీ యొక్క అందానికి ముగ్ధుడై ఆమెను కోరుకుంటూ విరహంలో ఉన్న అమీర్ అంతరంగ యుద్ధం మేరా ద్వారా తెలుసుకుని ఆ తురక ఆమెను అమీర్‌కు దగ్గర చేస్తుంది . అంటే స్త్రీ ఒక కరుణ సముద్రం ప్రేమమయి ఆమెను అర్థం చేసుకోవాలంటే ఆమెను చూడడం కాదు గమనించాలి పరిశీలించాలి పరిశోధించాలి...... అటువంటి వ్యక్తిత్వమే ఇక్కడ మనకు రాజేశ్వరి లో కనిపిస్తుంది అయితే సౌఖ్యాలను అనుభవించిన తర్వాత పురుషుడు ఎంత వేగంగా స్త్రీ నుండి పొందిన ప్రేమను మరచి ఆమెను నిరాకరిస్తాడు అనేదానికి అమీర్ "నాకఅకఖ్కర్లేదది". అన్నమాట అందుకు నిదర్శనం. అయితే రాజేశ్వరి మాత్రం" మూలనున్న దాన్ని లాక్కొచ్చి

మనసు లాగే నువ్విప్పుడు వదిలేస్తే" అనే మాటలు పలికి సాటి స్త్రీని అర్థం చేసుకునే మనసు గల మానవతామూర్తి మనకు కనిపిస్తుంది ఇదిలావుండగా స్త్రీ సహజంగా మాతృమూర్తి ఆ మాతృత్వం రుచి చూసే క్షణాలు వచ్చాయి. ఇది అమీర్‌కి నచ్చలేదు వాని ఆనందానికి అడ్డుగా భావించాడు ఆక్షణంలో ఆమెను విడిచి వెళ్ళి నప్పుడు రాజేశ్వరి జీవితంలోకి తటస్థించిన ఇంకో పురుష వ్యక్తిత్వం పదహారేళ్ళ మీరా. మీరాని చూస్తే రాజేశ్వరికి సహజంగా చిన్న పిల్లలని మనం చూస్తే కలిగే సాధారణ భావనే అయితే ఆధునిక భావజాలంతో కూడిన సమాజం మాత్రం రాజేశ్వరి ఒక నీతి లేని సరిగ్గా చిత్రిస్తుంది మానవు లకి అది ఎవరైనా కావచ్చు చిన్న పిల్లలని మనం చూస్తే కలిగే సాధారణ భావనే. అయితే ఆధునిక భావజాలంతో కూడిన సమాజం మాత్రం రాజేశ్వరి ఒక నీతిలేని స్త్రీగా చిత్రిస్తుంది. మానవులకి అది ఎవరైనా కావచ్చు చిన్న పిల్లల పట్ల గల భావన మనకు సహాయం చేసిన వారి పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ ప్రేమ ఆలోచన కలిగిన వారి పట్ల ఒక విధమైన అనురాగ భావం ఉండడం సహజం అదే భావం అంటే రాజేశ్వరి ఉన్నది కూడా.. అయితే మేరా దృక్కోణం సాధారణ వ్యవస్థ దృక్కోణం లోనే ఉన్నాయి తప్ప ఔన్నత్యంతో కూడిన గుణాలు కనిపించవు అయితే మేరా దృక్కోణం సాధారణ వ్యవస్థ దృక్కోణం లోనే ఉన్నాయి తప్ప ఔన్నత్యంతో కూడిన గుణాలు కనిపించవు.

అయితే ఇన్ని భిన్న మనస్తత్వాలు కలిగిన పురుషులు రాజేశ్వరి జీవితంలో లో తారసపడ్డారు. ఆమె జీవితాన్ని శాసించారు. ఇన్ని సంఘర్షణల మధ్య రాజేశ్వరి మంచి వైపు వెళ్లిందా చెడు వైపు వెళ్లిందా అనే విషయం ఆలోచించి నట్లయితే ప్రతి మనిషి మెదడు ఒక పిశాచాల గుట్ట దానికి ఒక ఆలోచన కావాలి అందుకే అన్నారు చలం స్త్రీ తన కాళ్లమీద తాను నిలబడాలని అప్పుడే రాజేశ్వరి లాంటి వాళ్లు సుందరమ్మ అలాంటి వాళ్ళు ఎక్కువగా సమాజపు శాస్త్రం కలలో బంధువులు కారు. సహజంగా స్త్రీకి తనకేం కావాలో తనకి తెలియదు తనకేం కావాలో తండ్రి గమనిం చాలి భర్త తెలుసుకోవాలి.

## ఉపయుక్త గ్రంథాలు :

1. చలం మైదానం (2020)-priyadarsini ప్రచురణలు

❀ ❀ ❀

# ముస్లిం మైనారిటీ కథా సాహిత్యంలో - మహిళ

- **డా॥. ఎం. ఫామిద బేగం,** తెలుగు శాఖ అధ్యక్షులు, సిల్వర్ జుబ్లి ప్రభుత్వ కళాశాల(స్వ), కర్నూలు.

ముస్లిములైనా, ముస్లిమేతరులైనా స్త్రీల జీవితం దాదాపుగా ఒకే విధంగా ఉంటుంది. అగ్రవర్ణ, బహుజన, దళిత, గిరిజన స్త్రీల సమస్యలన్నీ ముస్లిం స్త్రీలకూ ఉన్నాయి. అదనంగా ఇంకొన్ని ప్రత్యేకమైన సమస్యలూ ఉన్నాయి. వాటన్నింటినీ మన కథారచయితలు మొదటి నుంచీ రికార్డు చేస్తూనే వస్తున్నారు. సమాజంలోని ముస్లింస్త్రీల స్థితిగతులను, సుఖఃదుఖాలను, కన్నీళ్ళను, బాధలను అణచివేతలనూ అన్నిటినీ మన కథకులు వదిలి పెట్టలేదు. తల్లిగా, భార్యగా, చెల్లిగా, ప్రేయసిగా, సహ చరిణిగా ఎన్నో పాత్రలను స్త్రీ పోషిస్తుంది. మానవ జీవితంలో స్త్రీ పాత్ర ఎంతో ప్రధానమైనది. అటువంటి ఎంతో ముఖ్యమైన, మన జీవితాల్లో సగభాగమైన స్త్రీ మీద ఆర్థికపరిస్థితులు, మగ అధిపత్యం మొదటినుంచీ మన వ్యవస్థలో దరిద్రంగా భయంకరంగా ప్రమాదకరంగా పెత్తనం చెలాయిస్తున్నాయి. పేదరికంతో బాటుగా భర్తలు, అత్తలు, ఇతర కుటుంబ సభ్యులు పెట్టే హింసలు, వాళ్ళు చెలాయించే అధికారం, ఏ మాత్రం స్వేచ్ఛ భద్రత లేకపోవడంలాంటివన్నీ స్త్రీలందరికీ కామన్.

ఈ కామన్ అంశాలతో ముస్లిమ్ కథలూ చాలానే వచ్చాయి. ఇవి కాకుండా అదనంగా తలాక్, బురఖా, ఎక్కువ మంది పిల్లల్ని కనటం, చదువులేకపోవటం, ఉద్యోగాలు పనులు చేసుకోవటానికి బయటకు పంపక పోవటం, హిందూత్వమతోన్మాదం, ఇస్లాంమతోన్మాదం లాంటివి ముస్లిమ్ స్త్రీలను ప్రత్యేకంగా అణచివేస్తున్నాయి.

1996 నుంచి ఒక ముస్లింస్పృహతో, అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంతో ముస్లిముల నుంచి ఉధృతంగా కథలు వస్తున్నాయి. నర్గిస్, హరాం, దావత్ లాంటి కథలతో మొదలైన ఈ ప్రవాహం ఇప్పటికీ నడుస్తూనే ఉంది. ఈ కాల ప్రవాహాన్ని రెండు దశలుగా విభజించు కుంటే అందులో మొదటి 85 సంవత్సరాలను (1910 - 1995) మొదటి దశ అనుకుంటే ఆ తర్వాతి 15 సంవత్స రాలను రెండవదశ అనుకోవచ్చు. ఈ వంద సంవత్సరాల్లో సుమారుగా రెండు లక్షల కథలు వచ్చి ఉంటాయి. అందులో ముస్లిములకు సంబంధించినవి ఓ మూడు వందల వరకు ఉంటాయి. తిరిగి అందులో ముస్లిం స్త్రీలకు సంబంధించినవి ఓ 50 వరకు ఉంటాయి.

## ముస్లిం స్త్రీ జీవితాన్ని చిత్రించిన కథలు :

యంత్రం, బంగారు కత్తి, స్వయంకృతం, తలాక్, ముత్రా, హరాం, పరదా, ఛోటిబహెన్, మొహబ్బత్, 1424 హిజ్రి, యాస్మిన్ బేగం - బురఖా, సలీం - బురఖా, అమ్మిజాన్, లోహం, అమీన్‌బేగం ఉరఫ్ అలివేలుమంగ, ప్యార్‌మీర్జా మహేశ్వరికా, ఉర్సు, సుల్తానా, సిల్‌సిలా, దావత్, సండాస్, మా, ఘోస్లా, భటక్తా చిరాగ్, నర్గిస్, బందీ పింజరే కేబినా, దిల్‌ఔర్ జిందగి, మున్ని మాకి కహాని, దహేజ్, దాదిమా చెప్పిన భిస్సాలు, కబూతరా, మెహర్, జల్వా, బడోంకి ఈద్, మాజి, దూత్‌బఖష్, నసీమా, ఆరోఅల్లుడు, గాయబాలద్దాఫ్, దావా, ఢాకన్, గోరిమా, కైసరున్నిసాబేగం, పురుడు, జుమ్మా .ముస్లిం స్త్రీ జీవితం ఉన్న కథల పుస్తకాలు ప్రత్యేకంగా లేవు. మొత్తం ముస్లిం కథలే ఉన్న ఈ పుస్తకాల్లోంచి మన ఎన్నుకోవాలి. అలా ఎన్నుకున్న కథలు కొన్ని...

సత్యాగ్ని యంత్రం కథలో రాజాఖాన్‌కు రజియా సుల్తానాకు పెళ్ళవుతుంది. పది సంవత్సరాలు కాపురం చేస్తారు. ముగ్గురు ఆడపిల్లలనుకంటుంది రజియా. అయినా మగపిల్లవాడిని కనలేదని తలాక్ ఇస్తాడు రాజా ఖాన్. అంతేగాకుండా వేరే పెళ్ళి చేసుకుంటాడు. ఈమెకు మళ్ళీ పెళ్ళి చెయ్యాలనుకుంటారు తల్లిదండ్రులు. కానీ రజియా పెళ్ళిచేసుకోకుండా న్యాయవాది కావాలను కుంటింది. మగమహారాజులకు గుణపాఠం చెప్పాలను

కుంటుంది. తలాక్ బాధిత ముస్లిం స్త్రీలకు న్యాయం చేయటానికి పని చేయాలనుకుంటుంది.

నిరాధారమైన అనుమానంతో 'బంగారుకత్తి' కథలో భార్యకు తలాక్ చెప్తాడు మగాడు. ఇలా బయటి ఉండి కూడా ముస్లిం పురుషుడు భార్యకు తలాక్ ఇవ్వటం చాలా తేలిక, ఇద్దరు సాక్షుల సమక్షంలో మూడుసార్లు తలాక్ అంటే విడాకులు అయిపోయినట్లే. అంతేగాక పురుషుడు రెండో పెళ్ళికి అర్హత సంపాదించినట్లే. కాని తలాక్ ఇవ్వబడిన స్త్రీ జీవితం ఈ సమాజంలో నరకం. తలాక్ అంటే ఈజీగా స్త్రీ గొంతు కోసెయ్యటం లాంటిది. అందుకే పెళ్ళయిన స్త్రీలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఉండలేని పరిస్థితి. వాళ్ళు ధైర్యం చేసి భర్తలను ఎదిరించాలన్నా మతం సమ్మతించదు. స్త్రీ స్వేచ్ఛ సమాజానికి అనర్ద దాయకమని అన్ని ధర్మాలు చెప్తున్నాయి. అన్నీ మతల్లాగే ఇందులోను ఆడదే భర్తల అడుగుజాడలోనె ఉండాలని అంటున్నారు. 'స్వయంకృతం' అనే కథ ఉంది. రెండువందల కథలు రాసిన రచయిత్రి షెహనాజ్ రాసిన కథ ఇది. ఈ కథలో తలాక్ వల్లా భర్త విక్టిమ్. తలాక్ అన్న తరువాత, తిరిగి భార్య కావాలనుకుంటే షరియత్ ఒప్పుకోరు. అందుకే ఆ భర్త తిరిగి కావాలనుకున్న భార్య దక్కక పిచ్చివాడైపోతాడు. భార్య తలాక్ ఇవ్వటాన్ని 'ముతా' అంటారు. ముందుగానే ఇంత సమయం కలసి ఉండాలని అనుకుని నిఖా చేసుకునే సాంప్రదాయాన్ని షరియత్ చట్టాలు ఎలా దుర్వినియోగం అవుతున్నాయో చెప్పే కథలు సత్యాగ్ని పాచికలు పుస్తకం నిండా, ఇతర ముస్లిమ్ స్త్రీ కథలనిండా మెండుగా ఉన్నాయి. ముస్లిం రచయిత రాసిన ముస్లిం స్త్రీ జీవితాలకు సంబంధించి కథలున్న మొదటి పుస్తకం ఇప్పటి వరకు చివరి పుస్తకం కూడాను సత్యాగ్ని రాసిన పాచికలే.

ముస్లిమ్ స్త్రీల కథలతో వచ్చిన ఇంకో పుస్తకం గీతాంజలి రాసిన పహెచాన్ కథాపంపుటి. సహానుభూతితో, సంఘీభావంతో రాసిన ఈ మొత్తం పుస్తకం నిండా ముస్లిమ్ స్త్రీల కథలే. ఈ పుస్తకమంతా హైదారాబాద్ ఓల్డ్‌సిటీ ముస్లిమ్ స్త్రీల పైన రాసిందే. ఈ కథలు చదువుతుంటే ఆ సమాజమంతా మన కండ్లముందు ఆవిష్కృతమవుతుంది. ఈ పహెచాన్ కథలు చదివినంత సేపూ మనం పాతబస్తీ ముస్లిమ్ కుటుంబాల్లో కలిసి పోయినట్లు భావన కలుగుతుంది. అఫ్జల్‌గంజ్, కోటిల్లోని జచ్‌కిఖానాల్లో, తబర్ రూముల్లో పురిటివాసనల్తో తిరుగుడుతున్నట్లు అనిపిస్తుంది. పిల్లల్ని కనీకనీ సాగిపోయి ఉన్న బచ్చేదాని (గర్భసంచి), పిల్లలకోడి లాగా ఐదారు గురు పిల్లల్తోని, కడుపులో పిండాన్ని మోస్కుంటు నీరసంగా, బక్కంగా, బలహీనంగా తిరుగుతున్న ముస్లిమ్ స్త్రీలు, 'యా అల్లాఔరత్ కోయే బచ్చేదాని క్యోదియా' అనే నల్లటి బురఖాలలో చీకటి మబ్బుల్లాగా కన్నీళ్ళుకార్చే ముస్లిమ్ ఆడాళ్ళు దయనీయంగా కనిపిస్తారు. ప్రబంధ కావ్యాల్లో స్త్రీ శరీరం చుట్టూ ఏర్పరచిన ఉన్న మాయలు, రంగులు, లైంగిక ఊహలు ఈ కథలు చదివితే పటా పంచలైపోతాయి. నిజమైన దేహవాస్తవికతలో మిగిలి పోతాం. పాచికలు, పహెచాన్ ఈ రెండే ముస్లిమ్ స్త్రీ కథల సంపుటాలు. షరీఫా, రూపీఆపా లాంటి ముస్లిం స్త్రీ కథలు చార్మినార్ కథాసంపుటిలో వున్నాయి. ఇవి 1980 కాలంలోనే రాసి ఉన్నాయి. అందులోని స్త్రీ జీవితాలు కూడా హైదరాబాదు స్థానికతకు సంబంధించినవే. అలాగే రాతిలో తేమ కథా సంపుటిలో శశిశ్రీ సీమ పేద ముస్లిమ్ స్త్రీలను మనకెంతో సన్నిహితంగా చేసి చూపిస్తాడు. ఈ సంపుటాలు చదువుతుంటే ముస్లిమ్ స్త్రీల భాష ఒకటి ప్రత్యేకంగా వుంటుందనిపిస్తుంది. అది వాళ్ళకు మాత్రమే పరిమితమైనదనిపిస్తుంది. ప్రాంతాలతో అక్షరరాలతో సంబంధము లేనిదనిపిస్తుంది. బురఖాకు సంబంధించిన కథలు కొన్ని వచ్చాయి. బురఖా, గోషా, పరదా అన్నిటి గూఢార్థం ఒక్కటే. పురుషుడికి స్త్రీ కన్పించకూడదు. స్త్రీ పురుషులు కలిసిమెలసి ఉందకూడదు. స్నేహంగా, ఆత్మీయంగా పరపురుషులతో ఉండరాదు. స్త్రీ శరీర నిర్మాణమే ప్రత్యేకమైనది. సహజంగానే ఆమె ఆకృతి పురుషుడిని ఆకర్షించి ఎన్నో అనార్థాలకు దారితీస్తుంది.

కనుక స్త్రీలంతా వయసుస్సుతో నిమిత్తం లేకుండా పూర్తిదేహన్ని బురఖాతో కప్పి ఉంచాలి. మస్లిం సమాజాల్లో కుటుంబాల్లో సర్వత్రా చాలావరకు ఈ సాంప్రదాయం ఆచరణలో ఉంటుంది. ఈ విషయం మీద సపోర్టుగా సలీం రాసిన బురఖా లాంటి కథలూ వచ్చాయి. చినిగిన బట్టలు, పేదరికం, దేహం కన్పించకుండా బురఖా పనికొస్తుందని ఈ కథలో రాయటం జరిగింది. అలానే వ్యతిరేకంగా కూడా ఖాజా హరాం లాంటి కథలూ వచ్చాయి. బురఖాలో ఉన్నందున కొడుకు తల్లినే గుర్తించలేకపోతాడు. ఈ కథలో కథ చివరలో తల్లి బురఖాను మంటల్లో విసిరేస్తుంది. స్కైబాబ ఛోటిబహెన్ కథలో పేదరికం, పెండ్లి ఒక అమ్మాయిని ఎట్లా స్వేచ్ఛగా ఆలోచించనివ్వవో, ఇష్టం లేకున్నా బురఖా సాంప్ర దాయాన్ని ఆచరించటం ఎట్లా అనివార్యం చేస్తాయో ఎంతో సహజంగా, వాస్తవికంగా చిత్రించాడు. బురఖా, చదువు, బీదతనం, చెల్లిప్రేమ లాంటి బహూముఖ కోణాలున్న ముస్లిం స్త్రీ కథ ఇది. ఇలా అనుకూలంగా, ప్రతి కూలంగా బురఖా గురించి లోతుగా చర్చించిన కథలు చాలానే ఉన్నాయి. ఆయా స్త్రీలకు ఉండే సంస్కారాన్ని బట్టి, చైతన్యాన్ని బట్టి బురఖా ధరించాలావద్దా అనే స్వేచ్ఛ ఉండే వాతావరణాన్ని కల్పిస్తే బాగుంటుందనే వాదన కూడా ఉంది. అమ్మ కథాంశంతో దూద్‌బఖ్ష్, మాజి, మా లాంటి కథలు, చెల్లెలు సెంటిమెంట్‌తో ఛోటిబహెన్, బడోంకిఈద్ లాంటి కథలు వచ్చాయి. ఇలా అత్మకథ నాత్మక కథలు, పర్సనల్ కథలు ముస్లిం స్త్రీ కథల పరంపరలో ఎక్కువగా వచ్చాయి. ఈ కథలు ఎంతో దుంఖధరితంగా ఉండి మనల్ని కదిలించి, మనసును ద్రవింపచేసి ఆలోచింపచేస్తాయి. మతాఇతర వివాహాల గురించి సుల్తానా, లోహం, అమ్మిజాన్ లాంటి కథలు వచ్చాయి. అనుకూలంగా ప్రతికూలంగా ఆ అంశంమీద కథల్లో, బయటా లోతైన చర్చ జరిగింది, ఉగ్రవాదం, ఆభద్రత అంశాలుగా ధాకన్, దావా, గోరిమా, పురుడు, జుమ్మాలాంటి కథలు వచ్చాయి. ఛోటీసి ఆశ, నర్గిస్ లాంటి కథలు ముస్లిం స్త్రీ చదువు వెనుకబాటు తనంగురించి, పేదరికం గురించి వచ్చిన కథలు ఘోస్లా, సండాస్, భడక్తా చిరాగ్ లాంటివి ఎన్నో వచ్చాయి. ఇలా ఎన్నో విభిన్నమైన కథాంశాలతో ముస్లిం స్త్రీ జీవితం తెలుగుకథల్లో అవిష్కృతమైంది. వారి భయాలు, ఉద్వేగాలు, చిన్ని చిన్ని అనందాలు, భయంకరమైన దుఃఖాలు, సున్నితమైన అంశాలు అన్నీ ఈ కథల్లో ప్రతిఫలించాయి. ఇప్పటి కథంటే ఫైటింగ్ చేసేది. గోరిమా, యంత్రం లాంటి కథల్లో ప్రధానపాత్రలు యుద్ధం చేసే, ధిక్కరించే తత్వం ఉన్న వాళ్ళే, సిల్‌సిలా, గాయబీలద్దాఫ్ లాంటి కొన్ని కథలు నూర్‌బాషీయుల పేదరికాన్ని జీవితాన్ని చిత్రించాయి. ఇలా ఈ కథలన్నీ అన్ని కోణాల్లో ముస్లింస్త్రీని ఆవిష్కరించాయి. మరో వచన ప్రక్రియ రూపమైన నవల్లో కూడా ఈ పనిని సలీం వెండిమేఘం ద్వారా చేసాడు. ముస్లిం సాహిత్యం కథ, నవల, కవిత్వ ప్రక్రియలలో తనదైన ప్రత్యేకముద్రను వేయటమే కాకుండా ఒక తాత్వికస్థాయికి చేరింది. విస్తృతంగా ఎదిగింది. సాహిత్య విమర్శకు సంబంధించి కూడా ఖాజా, షమిఉల్లాలు రెండు గ్రంథాలను వెలువరించారు. ఆఫ్సర్, స్కైబాబ లాంటి వాళ్ళు ముస్లిం సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలు రాస్తున్నారు. షాజహాన, ఖదీర్, ఇనయతుల్లా, స్కైబాబ, ఆన్వర్, ఇంకా కొంతమంది కథలు సంపుటాలుగా రావాల్సి ఉన్నాయి. రహమతుల్లా బా, మా సంపుటాల్లో కొన్ని ముస్లిం స్త్రీ కథలు ఉన్నాయి.

ముస్లింస్త్రీ జీవితాల కథలు ఇంకా చాలా రావాల్సిఉన్నది. ముస్లింస్త్రీల కథారచయిత్రులు ఇంకా చాలా పెరగవలసి ఉన్నది. సమాజంలో ముస్లిం స్త్రీలు చదువు పరంగా, వేరే పరంగా వెనుకబడి ఉన్నట్లే సాహిత్యంలో కూడా వెనుకబడే ఉన్నారు. పట్టుమని పదికథలన్నా రాసిన ఒక్క ముస్లింస్త్రీ రచయిత్రి కాని, పది కథలన్నా చదివిన ఒక్క పాఠకురాలు కాని మన తెలుగు కథా ప్రపంచంలో

లేదంటే అతిశయోక్తి కాదు. ఒక్క షాజహానా మాత్రమే కొన్ని ఎక్కువ కథలు రాసి ఉన్నారు. అగ్రవర్ణ, బహుజన, దళిత రచయిత్రులు, పాఠకులతో పోల్చుకుంటే ముస్లిం స్త్రీలు చాలా తక్కువ మంది ఉన్నారు. ముస్లిం స్త్రీ జీవితంలో కథలుగా రావాల్సిన కోణాలు, వచ్చినవే ఇంకా బలంగా రావాల్సిన కోణాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ రాసి తెలుగు కథను ఇంకా పరిపుష్టం చేయ్యటానికి ముస్లిములు, ముస్లిమేతర రచయితలు చేస్తున్న ప్రయత్నం ఎంతో హర్షించదగినది. ఈ జరుగుతున్న సాహిత్త కృషి ముస్లిం స్త్రీ సమాజాన్ని ఇంకా ముందుకు తీసుకువెళ్ళటానికి తప్పకదోహదపడుతుంది. ఈ కథకులంతా తమదైన మతం ఉపాధి నుంచి, ముస్లిం సమాజం నుంచి జీవనసారాన్ని పీల్చుకుని ఆ మనుషుల సంస్కృతిని, సమస్యలన్నిటిని భయాన్ని, అభద్రతని, భాషాశైలుల్ని నిజాయితీగా, నిర్భీతిగా వ్యక్తీకరించడంద్వారా ఆసమూహానికి ఒక వ్యక్తిత్వ రూపకల్పన చేయడంలో గొప్ప విజయాన్ని సాధించారు. ఇంకోవిధంగా చెప్పాలంటే ఒక బాధ్యతాయుతమైన సోషల్ యాక్టివిటీ చేసారు.

❀❀❀

# స్త్రీశక్తి ప్రతీక – ఉభయభారతి

– **డా॥. యస్. విజయాదేవి,** అధ్యాపకురాలు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ ప్ర.), గుంటూరు.

వేదాంత విరుద్ధమగు మతాలను రూపుమాపి, వేదాంత పరమ సిద్ధాంతమైన జీవేశ్వరైక్య తత్వమును స్థాపించి, అద్వైత తత్వమును లోకానికి ప్రభోధించినవారు

శ్రీశంకరాచార్యులవారు. వీరు ఆసేతు హిమాచలం పలు మార్లు పయనించి ధర్మ రక్షణ చేశారు.

వీరి జీవిత?లో ప్రధానంగా ఇద్దరు స్త్రీమూర్తులు కనిపిస్తారు. ఒకరు వారితల్లి ఆర్యమాంబ కాగా మరో స్త్రీ ఉభయభారతి. ఆమె సాక్షాత్ సరస్వతీదేవి అవతారము.

పూర్వము సత్యలోకములో జరిగిన మహా సభకు విచ్చేసిన మహర్షులు బ్రహ్మదేవుని ముందు తమతమ వేద భాగలను మనోహరంగా గొంతెత్తి పఠిస్తుండగా వారిలో దుర్వాస మహాముని స్వరము తప్పిందట దాంతో వికట?గా వినిపించడంతో సరస్వతీదేవి ఫక్కున నవ్విం దట. కోపించిన దుర్వాసుడు భర్తయైన బ్రహ్మదేవునితో సహా భూలోకంలో జన్మించమని శపించాడట. మన్నించ మని వేడుకున్న శారదామాతతో దుర్వాసుడు "పరమేశ్వ రుడు శ్రీ శంకరాచార్యుల నామధేయంతో మానవ రూపంలో జన్మించ బోవుచున్నాడని ఆ మహాత్ముని సందర్శనంతో దేవతా స్వరూపం లభిస్తుందని" అభయమిచ్చాడు.

విష్ణుమిత్రునికి పుత్రికగా జన్మించిన ఆ భారతీదేవి అసామాన్య ప్రజ్ఞావంతురాలు గాను, సర్వోన్నత గుణము లతో, చతుషష్టి కళామతల్లిగా, సర్వ విజ్ఞాన సమున్నతు రాలిగా విరాజిల్లి?ది. దుర్వాసుని శాప ఫలితంగా చతుర్ముఖ బ్రహ్మ హిమమిత్రుని పుత్రునిగా, విశ్వ రూపునిగా, తన పండిత ప్రకర్షచే మండనమిశ్రునిగా పేరుగాంచాడు.

పండిత ప్రఖాండ శేఖరుడగు మండన మిశ్రుడు అనే నామాంతరము గల విశ్వరూపుని పట్ల ఆకర్షితు రాలయి?ది భారతీదేవి. అలాగే మండన మిశ్రుడు కూడా మహోన్నత స్త్రీ ధర్మం చే ప్రకాశించే భారతీదేవి పట్ల ఆకర్షితుడయి, తండ్రి ఆజ్ఞచే విష్ణుమిత్రుని వద్దకు పెళ్లి రాయభారము పంపాడు. వర పరీక్షానంతరము విష్ణు మిత్రుడు తన తనయ భారతిని విశ్వరూపునికిచ్చి వివాహం జరిపిస్తాడు. ఉభయ వంశాలకు అంటే పుట్టింటి వారికీ, మెట్టినింటి వారికీతన పవిత్రాచరణచే కీర్తిని తీసుకొచ్చినందున ఆమె ఉభయ భారతిగా ప్రఖ్యాతి గాంచింది.

అమృతమయమైన సనాతన బ్రహ్మవిద్యను సహేతుక వాద?తో ప్రతిష్టించిన భగవత్స్వరూపులు శ్రీ శంకరా చార్యులవారు. ఆకాలంలో వేదాంత ప్రతిపాదితమైన పరమహంసలచే గ్రహింప బడిన జ్ఞానకాండము నశించి, కర్మకాండ ప్రభలమై ఉన్నదని గ్రహించిన శంకరులు, జ్ఞాన మార్గాన్ని ఉద్దరించడానికి, కర్మ సిద్ధాంత ఆచ రణుడు, దుర్జయుడైన పండిత ప్రకాండ ప్రవరుడు మండనమిశ్రుని తన వాదనా పటిమతో జయించాలనే సంకల్పంతో మాహిష్మతీ పురానికి విచ్చేస్తాడు.

అక్కడ మండనమిశ్రుని గృహము ఎక్కడని అడగగా వారు "ఎచ్చట శుకాంగణలు (ఆడ చిలుకలు) ద్వార మందలి పంజరములో నుండి వేద వాక్యములు స్వతః ప్రమాణములా? అపౌరుషేయమూలా)? లేక, పరతః ప్రమాణములా? పౌరుషేయమూలా)? అను విచారముతో, గూడిన వాక్యములను ఉచ్చరిస్తున్నాయో, అదే మా మండన మిశ్రుల వారి యిల్లు. జగత్తు నిత్యమగు పదార్థమా ? అనిత్యమగు పదార్థమా ? అను సిద్ధాంతాన్ని కూడా అవి పలుకుటుంటాయి దీనిని బట్టి మీరే కనుక్కోండి" అని చెబుతారు.

అలాంటి మండనమిశ్రులు వారి ఇంటికి చేరు కుంటారు శంకరాచార్యులవారు. ఆ ఇంటి తలుపులు

వేసి ఉండుటచే, స్త్రీకి జన్మించిన నీవు, జన్మస్థానాన్ని వాంఛించడం తెలివిమాలిన తనం అంటారు శంకరులు.

నీవు యతివి కావు, దొంగవు. ద్వారపాలకులను వంచించి, ఇంట్లోకి ప్రవేశించావు, అన్న మండనమిశ్రునితో, గృహస్థుడు కర్మానుష్టానపరుడు, అతిథిని సత్కరించే భుజించాలని తెలియదా అంటారు శంకరులు.

అలా వారిరువురు శృతి, స్మృతి ప్రమాణాలుగా చూపుతూ, ఒకరినొకరు నిందించుకుంటూ, నిష్ఠురాలాడుకుంటూ, ఆక్షేపించుకుంటూ, చమత్కారంగా వాదనలో నాదే పై చేయి కావాలని పరస్పరం వాదించుకున్నారు.

వారి వాదాలను వింటున్నారు జైమినీ, వ్యాసులు. స్వయ?గా వచ్చిన అతిథి ని ఆదరింపక దుర్భాశలాడటం తగదు అంటారు. వారి ఆదేశానుసారం మండన మిశ్రుడు శంకరుని సత్కరిస్తాడు, బిక్షను స్వీకరించమని ప్రార్థిస్తాడు.

అప్పుడు శంకరులు - ప్రాకృతమగు అన్న భిక్ష కోసం నేను మీ గృహానికి రాలేదు. మీతో వాదభిక్ష నర్థించి మీ వద్దకు వచ్చాన?టాడు. ఓడినవారు గెలిచిన వారికి శిష్యులై ఉండేవిధంగా ప్రతిజ్ఞ తీసుకోవాలి అంటాడు. లేదా ఒడిపోయానని ఒప్పుకోవాలి అంటాడు.

శంకరుల సవాలును స్వీకరిస్తూ, మండనమిశ్రుడు- "సహస్ర వదనాలతో విరాజిల్లె ఆదిశేషుడు వచ్చినా కూడా నేను పరాజితుడను కాను" అంటాడు. దానికి సమర్థులైన మధ్యవర్తి ఉండాలి, లేనిచో కంఠశోష మిగులుతుంది, వాద ఫలముండదు అనుకుంటారు యిరువురు. వ్యాస జైమిని మహర్షులను మధ్యవర్తిగా ఉండమని వేడుకుంటారు. వారిరువురూ యదార్థ భాషిణియైన మండన మిశ్రుని ధర్మపత్ని ఉభయభారతీదేవి యే వాద నిర్ణయ సమర్థురాలని చెప్పారు. ఆమె సాక్షాత్ సరస్వతీ దేవి కాబట్టి నిష్పక్షపాత?గా వాదమందలి జయాపజయాలను నిర్ణయించగలదంటారు.

స్త్రీయని తలపక శంకరులు, తన భార్య అని తలపక మండన మిశ్రుడు శ్రీమతి ఉభయభారతీదేవిని వాద మందు సాక్ష్యామిచ్చు దేవిగా ఒప్పుకున్నారు. అది ఆమె ప్రతిభా సామర్థ్యానికి నిదర్శనం.

వేదములే పరమ ప్రమాణాలని మండన మిశ్రుడు
వేదాంతములే పరమ ప్రమాణాలని
- శంకరాచార్యులు

పరస్పర జయ కాంక్షతో సభాముఖంగావాదాన్ని ప్రారంభిస్తారు.

ఉత్తమ గృహిణి యైన ఆమె ఇద్దరి కంఠములందు ప్రత్యేక పుష్ప మాలలను ధరింపజేసి "ఎప్పుడు ఎవరి కంఠమందలి పూలమాల వాడునో అప్పుడు వారు పరాజయము చెందినట్టు"అని చెప్పి, తన భర్తకు భోజనం, యతి శ్రేష్ఠుడైన శంకరునికి భిక్షను సమకూర్చడానికి ఇంట్లోకి వెళ్ళింది, తన పనులలో నిమగ్ననమైది. వారిరువురికి భోజన సమయం గుర్తు చేయడానికి మధ్యాహ్న సమయంలో మాత్రం సభకు వస్తుంది. పక్షపాతము లేకుండా వారిరువురి పట్ల సమాభావంతో ప్రవర్తించింది.

ఇలా అయిదారు రోజులు గడిచాక క్రమంగా మండన మిశ్రుల వాదనా కౌశలం తగ్గిపోసాగింది. కర్మ సిద్ధాంత సామర్థ్యము నశించుటచే, వేదమందలి కర్మకాండను ప్రతిపాదించలేకపోయాడు. ఉపనిషత్తులందు ప్రసిద్ధమైన అద్వైత తత్వాన్ని విమర్శించుటకు పూనుకున్నాడు. కానీ నిలుపుకోలేక పోయాడు. శంకరుల సర్వ శాస్త్ర తత్వార్థమును ఉభయభారతీదేవి ఆమోదించింది.

సాక్షాత్ సరస్వతీదేవీ యొక్క అవతారమైన ఉభయ భారతీదేవి శంకరాచార్యులను పరమ శివునిగా గుర్తించి, తన యొక్క శాప కారణమును వివరించి, శాప విముక్తమైనందున, తనకు బ్రహ్మలోకానికి వెళ్ళడానికి అనుమతిని కోరింది. కానీ శంకరులు తనయొక్క అద్వైత తత్వమును స్థాపించుటకై, సరస్వతీ దేవిని కూడా వాదమందు జయించదలిచి, వనదుర్గా మంత్రముతో ఆ సరస్వతీ

దేవిని బ్రహ్మలోకానికి వెళ్ళనీయక బంధించాడు. తనతో వాదనకు అంగీకరించమని ఆ జగజ్జననిని ప్రార్థించారు మనస్సులో, అందుకు ఆమె అంగీకరించింది.

దాంతో ఉభయభారతి వాదమందు మీతో ఒడపోయినా నా భర్త మీకు శిష్యుడు కాలేడు, ఆయనకు అర్థ శరీరమైన తనను జయించనిదే మీకు పూర్తిగా విజయము లభించదు అని శంకరులను మహా ధైర్య?తో, నిరుపమ ప్రజ్ఞాతిశయంతో వాదానికి ఆహ్వానించింది.

కానీ, పైకి మాత్రం శంకరాచార్యులు "బ్రహ్మచారిని, యతిని అయిన నేను స్త్రీలతో మాట్లాడను, కావున ఓ దేవీ! అది యుక్తము కాదు, నేను మీ బోటి వారితో వాదించుట ధర్మవిరుద్ధము కదా! నాకది అపకీర్తి కదా!" అంటారు.

అప్పుడు భారతీదేవి, "తమ మతమును స్థాపించ దలచిన వారు వ్యక్తి విచారణ చేయకూడదు, స్త్రీ పురుషులెవరైనా వారితో వాదింప వచ్చునని, అప్పుడే సర్వమత సిద్ధాంతము సుస్థిరమగునని, వచోభంగము సమంజసము కాదు, లోకవిరుద్దము, శాస్త్ర సమ్మతమూ కాదు, గుణజ్ఞులు బాహ్యమగు వ్యక్తిని ఆక్షేపించరు, వారి ప్రతిభా శక్తిని యోగ్యతను మాత్రమే చూస్తారు" అంటుంది.

"ఇదంతా ఎందుకు, ఎవరు వాద భిక్షువులై యితర మతాలను ఖండింప దలుస్తున్నారో, వారు స్త్రీలు అనే బాహ్య చిహ్నములను పరిగణించరు" అంటుంది. సమయము వచ్చినపుడు మహాత్ములు వ్యక్తిని గ్రహింపరు, పాండిత్యాది మహాగుణాలనే గ్రహిస్తారు అని ఉదాహరణ పూర్వకంగా వివరిస్తుంది.

పూర్వము జనక చక్రవర్తి సభ యందు సర్వోత్తమ విదుషీమణి, నైష్టిక బ్రహ్మచారిణి అయిన గార్గితో, బ్రహ్మవిద్యా విషయమై శ్రీ యాజ్ఞవల్క్య మహర్షి వాదన చేశారు, ఈ విషయం బృహదారణ్యకోపనిషత్తులో ఉంది అంటుంది, అలాగే, మహాభారతం లో జనక చక్రవర్తి సులభా యోగినితో వాదము చేసినట్లు ఉంది అంటుంది. కాబట్టి యోగ్యతా యోగ్యతల ననుసరించే కీర్తి, అపకీర్తి సంభవిస్తాయి అంటుంది.

దాంతో ఆ మహా సభలో పండిత ప్రఖా?డుల మధ్యలో వాదన చేయడానికి శంకరులు సన్నద్ధులవుతారు. తదుపరి వారు సర్వ వేద వేదాంగ వేదాంతాదులను పరామర్శిస్తూ, నిత్యకృత్యాలను ఆచరిస్తూ సంధ్యా వందనాది నియమిత కాలాన్ని విడిచి, అహోరాత్రాలు ఏకరీతిగా పరస్పర విజయ కాంక్షతో పదిహేడు రోజులు వాదించుకున్నారు.

కారణభూతుడయిన ఆ పరమేశ్వరున్ని జయించలేనని తలచిన భారతీదేవి, ఏదైనా ఉపాయంచే జయించాలని నిర్ణయించుకొని, శంకరులు బాల్యంలోనే సన్యాసం స్వీకరించుటచే, మదన శాస్త్రమందు అతనికి ప్రవేశము లేనందున, కామశాస్త్ర చర్చచే శంకరులను జయించాలని నిర్ణయించుకొంది.

"కలా కియన్త్యోయి వద పుష్ప ధన్వనః కిమాత్మి కాః
కించ పదం సమాశ్రితాః?
పూర్వేచ పక్షే కథ మన్యథా స్తితిః కథం యువత్యా??
కథమేవ పూరుషే"??

అనగా శుక్లపక్షమునందునూ, కృష్ణపక్షమునందునూ స్త్రీ పురుషుల?దు కామకళ ఏవిధంగా ప్రవర్తించును? ఆ కళలెన్ని ? వాటి స్వరూపమేమిటీ ?వాటి స్థానము లెవీ ? అని ప్రశ్నిస్తుంది.

సన్యాసాశ్రమము స్వీకరించిన తనను, సభలో ఇలాంటి ప్రశ్న వేయవచ్చునా అని, శంకరులు కాసేపు ఉదాసీనంగా ఉండి, సకల ధర్మ శాస్త్రజ్ఞుడు కాబట్టి నిపుణతతో, నేను సమాధానము చెప్పనిచో అల్పజ్ఞుడను అని లోకులు భావిస్తారు. ప్రత్యుత్తరం ఇస్తే యతి ధర్మానికి లోపము కలుగుతుందని అనుకుంటాడు.

శంకరులు కూడా సన్యాసాశ్రమానికి విఘాతము కలుగకుండా సర్వ శాస్త్రాలను తెలిసిన వారైనను, కామ శాస్త్రమును మాత్రము తెలియని వారివలే నటిస్తూ, ఒక మాసం వ్యవధిని కోరారు. భారతీదేవి అంగీకరించారు.

శంకరాచార్యులు పరకాయ ప్రవేశ విద్య ద్వారా అమరకుడు అనే రాజు శరీరంలో ప్రవేశించి, కామ శాస్త్రాన్ని ఔపోసనపట్టి, మండన మిశ్రుని గృహానికి చేరుకుంటారు. వారిని సగౌరవ?గా ఆహ్వానించిన ఆ దంపతులు మీతో మాకు పరాజయం కూడా భూషణమే నని వినయంతో విన్నవించుకుంటారు.

ఆ పరిపూర్ణ విజ్ఞాన స్వరూపిణిని కొనియాడుతూ, పరమ భక్తితో స్తుతించారు శంకరులు. ఆదేవి అంతర్ధాన మైన తరువాత మండనమిశ్రులు శంకరులకు శిష్యులై సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు.

సాక్షాత్ సరస్వతీదేవి అవతారమైనా, ఉభయ భారతీదేవి సామాన్య గృహిణి గానే ప్రవర్తించింది. సభలోని వారందరినీ అన్నపూర్ణలా ఆదరించింది. తమ ప్రత్యర్థి అయిన శంకారాచార్యులను అమ్మలా అభిమానించిన పరమ సాధ్వి. ఉత్తమ న్యాయనిర్ణేతగా భర్త పట్ల ఏమాత్రమూ, పక్షపాతము చూపించలేదు, అర్ధాంగిగా తన భర్త ఓటమి తనను ఒడిస్తేనే అని నిష్కర్షగా చెబుతుంది. తనతో వాదించనున్న శంకారాచార్యులను ఒప్పించారు. పదిహేడు రోజులపాటు అలుపెరుగక, విసుగు, విరామము లేక వాదించిన విధుషీమణి. అంతేకాదు, గడువడిగిన శంకరులకు సమయమిచ్చి వారిని పరిపూర్ణులుగా తీర్చిదిద్దిన ఉత్తమ గురువు. గెలుపుకోసం కడవరకూ ప్రయత్ని?చి, ఓటమిని అంగీకరించిన స్ఫూర్తి ప్రదాయిని అందుకే స్త్రీ శక్తికి ప్రతీకగా భారతీయ సాహిత్యంలో దర్శనమిస్తుంది ఉభయ భారతీదేవి.

**ఆధార గ్రంథాలు**

1. శ్రీ శంకర విజయము - శ్రీ విద్యారణ్య స్వామి (మాధవాచార్యులు) తెలుగు వ్యాఖ్యానము టి. శివ చరణము.
2. ఉభయభారతి - విశ్వనాథ పావనిశాస్త్రి.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# షెహనాజ్ కథల్లో - సర్దుబాటు

- డా॥. సిరిగిరెడ్డి గంగాదేవి
పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
శాఖధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

అనంతపురం జిల్లా తొలితరం కథారచయిత్రులలో ప్రముఖులు శ్రీమతి షెహనాజ్ గారు. ఈమె అనంతపురం పట్టణంలో వార్డు కౌన్సిలర్‌గా ఉంటూ తన చుట్టూ ఉన్న కుటుంబాలలోని సమస్యలను పరిష్కరిస్తూ వాటిని కథా వస్తువులుగా తీసుకొని కథలు రాస్తున్నారు. నేటి వరకూ వీరు '5'కథా సంపుటాలను వెలువరించారు. అవి 'మౌనపోరాటం', 'అనుమానం కాటేసిన వేళ', 'శేషప్రశ్న', 'అమ్మ మనసు' 'నాన్నకు సలాం' వీరు సుమారు 200లకు పైగా కథలను వెలువరించారు. అవి వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. వీరి కథల్లో కుటుంబ సంబంధ కథలు ఎక్కువ. అందులోనూ కుటుంబ సర్దుబాటుపై అధిక కథలు వెలువడ్డాయి.

1) 'కొత్తవాచీ' కథలో మధ్య తరగతి ఇల్లాలు సునంద కొత్తవాచీ కొనాలనే కోరికను అణుచుకొని జీవించింది. చాలీచాలని భర్త సంపాదన గృహావసరాలను తీర్చలేక పోయింది. దాంతో సర్దుబాటు ధోరణి అలవరుచుకొంది సునంద. మధ్యతరగతి జీవతం సునంద వాచీ కొనడమనే కోరికను కూడా వాయిదా వేసుకొనేలా చేసింది, 'తల్లిదండ్రుల వైపునుండీ అందిన చిన్న మొత్తాన్ని కూడా పిల్లల అవసరాలను తీర్చడానికే వినియోగించింది.

సనాతన ధర్మం వేళ్లూనుకొన్న అసమ సమాజం వివాహితకు సర్దుబాటును నేర్పింది. అదే సర్దుబాటు సునందను తన కుటుంబసభ్యుల అవసరాలను తీర్చేందుకు అతిచిన్న కోరికను సైతం పదేపదే వాయిదా వేసుకోనేలా చేసింది.

2) మౌనపోరాటం కథా సంపుటిలోని మరో కథ 'త్యాగం' జానకి బ్యాంకు ఉద్యోగిని. జానకి భర్త శేషగిరి. వివాహమయిన కొంత కాలానికి గొడ్రాలన్న నెపంతో భర్త రెండవ వివాహం చేసుకొన్నాడు. శేషగిరి చనిపోయాక ససతి పిల్లలను వదిలి మరొకరిని వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని వెతుక్కొంది. జానకి భర్త పిల్లలను తన పిల్లలుగా భావించి వారిని పెంచి పోషించింది.

జానకికి చదువు, ఉద్యోగం రెండు ఉన్నాయి. అయినా సనాతన ధర్మానికి కట్టుబడి ఉండటం, భర్తను ఎదిరించ లేకపోవటం, అతి సర్దుబాటుతనం అధికంగా ఉన్నాయి. పిల్లలు లేరన్న నెపంతో భర్త మరోవివాహం చేసుకొని మానసిక వేదనకు గురిచేసినా సహించింది. ఇక్కడ "చేసే ఉద్యోగం కానీ, ఉన్నత సాంఘిక స్థాయికానీ ఏవీ పురుషుని అనౌచిత్య ప్రవర్తనకు అడ్డుకావటం లేదు. అవేవి స్త్రీ పట్ల గౌరవభావం పెంచటానికి దోహదం అవటం లేదు. దీంతో హింసా స్వరూపం హెచ్చుమీరిపోతూ ఉంది" 'ఆచార్య కొలకలూరి మధుజ్యోతి. సర్దుబాటు ధోరణి మరీ ఎక్కువఅవటంతో జానకి జీవితం మీద కూడా ఆమెకు హక్కు లేకుండా పోయింది. భర్త మరణించినా మరో వివాహం చేసుకోవాలనే ఆలోచన కూడా జానకికి రాకపోవటం, పైగా ససతి పిల్లలను తన పిల్లలుగా భావించి వారిని పెంచి పోషించటం మరింత త్యాగానికి పరాకాష్ట.

శేషగిరి రెండవ భార్య మాత్రం తన స్వార్థం తాను చూసుకోగలిగింది. తన భవిష్యత్తు అంధకారం కాకుండదని ముందుగానే పిల్లలను వదులుకొని మరో వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని వెతుక్కొంది.

జీవితంలో ఏమాత్రం సర్దుబాటు లేని తనం ఆమెలో కనిపించింది. శేషగిరి సంతానంకోసం మరో వివాహం చేసుకొని మొదటి భార్యకు తీరని వ్యధను మిగిల్చినా అతనిలో సర్దుబాటు లేనితనం, ఎలాంటి పశ్చాత్తాప భావనా కనిపించకపోవటం సుస్పష్టం. రెండో వివాహం చేసుకొని మొదటిభార్య ఆలనా పాలనా చూసుకొకున్నా ఆమె సంపాదనపై ఆధారపడి అది తన హక్కుగా భావించి దర్జాను ప్రదర్శించాడు శేషగిరి. పైగా ఇతనిలో పురుషాహంకారం తొణికిసలాడింది.

3) మౌనపోరాటం కథా సంపుటిలోని కథ ' రెడీమేడ్ కాపురం' . వసుధ భర్త గిరి .వసుధ ఏ పని చేసినా భర్త గిరి తప్పుపట్టేవాడు. చీటికీమాటికి చేయిచేసుకోనేవాడు. వసుధకు భర్త ప్రవర్తన విసుగుతెప్పించింది. స్నేహితు రాలైన పక్కింటి సుష్మతో తన బాధను విన్నవించుకొంది. సుష్మ చెడు సలహాలు వసుధ విడాకులకు దారితీశాయి. వసుధ గిరి కాపురంలోకి వెళ్లిపోగొనే సుష్మ గిరిని వివాహం చేసుకొని రెడీమేడ్ కాపురం ఏర్పరచుకొంది.

వసుధ కుటుంబ సమస్యలను సొంతంగా పరిష్క రించుకోవటంలో అశక్తురాలైంది. సుష్మ సహాయం తీసుకొంది కానీ అందులోని ప్రమదాన్ని ఊహించలేక పోయింది. భర్తతో సర్దుబాటు చేసుకోవడంలో విఫల మైంది. సమాజంలో పురుషుని రెండవ వివాహం ఆమోదయోగ్యమైన విషయం కాబట్టి గిరి చాకచక్యంగా పద్ధతి ప్రకారంగా వసుధను అడ్డు తొలగించే పన్నాగం పన్ని సుష్మను మరో వివాహం చేసుకొన్నాడు. గిరిలో సర్దుబాటు ధోరణి లేకపోయినా కుట్రలూ కుతంత్రాలూ ఉన్నా మరో వివాహం చేసుకొని ఆనందంగా ఉన్నాడు. వసుధ సర్దుబాటు చేసుకోలేని కారణంగా విడాకులు పొందింది. మరో వివాహం చేసుకోలేక ఒంటరి జీవితం కష్టనష్టాలు తప్పలేదు. 'అమ్మలా ఉండాలి', 'శేషప్రశ్న' కథాసంపుటిలోని ' రెండుదారులు' కథలు కూడా స్త్రీ సర్దుబాటునే సమర్థిం చాయి. మౌనపోరాటం కథా సంపుటిలోని మబ్బుచాటు నక్షత్రం కథలో భర్త నుండి విడాకులు పొందాలని పుట్టినిల్లు చేరిన సుధకు అక్క హితోపదేశం చేసి సర్దుబాటు చేసి కాపురం నిలబెట్టింది.

కుటుంబంలో వివాహిత స్త్రీలకు సర్దుబాటు చేసుకోనే ఓర్పు, నేర్పు లేకుంటే పతనం తప్పదనట్లు పై కథల న్నింటిలో చెప్పబడాయి. సర్దుబాటు చేసుకొమ్మని వివాహితులైన పురుషులకు హితబోధ చేయకపోవడం కథతల్లో సుస్పష్టం. "భారతదేశ సంస్కృతిని రక్షించాలనే తాపత్రయంతో కొందరు పైకి గట్టిగా చెప్పకపోయినా, స్త్రీలు వంట ఇంటి కుందేళ్ళయితే బాగుండునని భావిస్తున్నారు. ఈ వైఖరి గర్హనీయం, నింద్యం" మల్లాది సుబ్బమ్మ విద్య, ఉద్యోగం స్త్రీల వ్యక్తిత్వ వికాసానికి, ప్రయోజనానికి నిదర్శనాలు. స్త్రీని వంటింటి కుందేలుగానే ఉంచడానికి స్త్రీలు పట్ల పురుషునికి చులకన భావం, స్వార్థ చింతన, పురుషాధిపత్యం ప్రధాన కారణాలు.

**ముగింపు :**

సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే రచ యిత్రులు కాలంతో పాటు నడవాల్సి ఉంది. అప్పుడే కథలు పాత విలువల నుండీ విముక్తి పొంది కొత్త కోణం ఆవిష్కృతమవుతుంది. కాలం ఒడిలో స్త్రీలను చూసే దృష్టికోణంలో రచయితలో ఒక కాలానుగుణ పరిణామం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సనాతన స్త్రీ ధర్మాలు, పురుషాధిపత్య భావజాలాలతో కూడుకున్న ఇటువంటి కథల వల్ల స్త్రీలతో చైతన్యం లేమి, మరింత పతనం తప్పవు. పురుషుల్లో మరింత ఆధిపత్య ధోరణులు చోటుచేసుకొనే అవకాశం ఎక్కువ.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. మౌనపోరాటం - కథా సంపుటి -షెహనాజ్
2. శేషప్రశ్న - - కథా సంపుటి -షెహనాజ్
3. షెహనాజ్ గారి వివిధ కథలు

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# "రామకథను మలుపు తిప్పిన మహిళలు"

- యం. ప్రదీప్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,

''రామో విగ్రవాన్ ధర్మః''.... అని మారీచుడు రామాయణంలో శ్రీరాముని గుణగణాలను రావణునికి చెప్తాడు. విశ్వవాఙ్మయంలోనే ఆది కావ్యం, ఆదర్శ కావ్యం శ్రీమద్రామయణం. సనాతన ధర్మానికి, సత్య సంధితకు, ఆదర్శమైన జీవితానికి, అన్నదమ్ముల అనుబంధానికి, భార్యభర్తల అనురాగానికి, పితృవాక్య పాలనకు ఆలవాలమైన అపురూప కావ్యం రామాయణం. ఇంతటి విశిష్టత కలిగిన రామకథలోని పాత్రలు త్రేతాయుగం కాలం నాటివే అయినా తలచుకుంటే అవి ఇప్పటికి మన కళ్ళకు కట్టినట్లు ఉండటం విశేషం.

శ్రీరామ జననం, విద్యాభ్యాసం, విశ్వామిత్రమహర్షితో యాగరక్షణ నిమిత్తం వెళ్ళటం, అహల్యకు శాపవిమోచనం చేయటం, జనకుని సభలో శివధనుర్భంగం చేసి సీతమ్మను పెండ్లాడి వైవాహిక జీవితంతో పాటు రాజ్య సంరక్షణ భాధ్యతలతో మహారాజై కోసల రాజ్యాన్ని పరిపాలించాల్సిన కోదండరాముడు అడవుల పాలు కావటం ఏమిటి? ఒక్కసారిగా రాముని జీవితంలలో చెలరేగిన ఈ అలజడి ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం అందరికి తెలిసిన విషయమైన మంథర కైకకు చేసిన దుర్భోధ.

శ్రీరామ పట్టాభిషేకానికి అయోధ్య నగరం పచ్చ తోరణాలతో, పూల మాలలతో అలంకరించబడింది. అయోధ్యనగర ప్రజల ఆనందంగా ఉన్న సమయంలో వచ్చింది మంథర. ఈమె కైకకు అరణపు దాసి మరియు దగ్గరి బంధువు కూడా. రామునికి మహారాజ పట్టాభిషేకం జరిగితే కైక దాస్యం చేయవలసి వస్తుందని తలచి అనుకున్ననే తడవుగా కైక ఇంటికి చేరింది.

కైక రామునికి పట్టాభిషేకం జరిగి మహారాజు అవుతాడని ఎంతో ఆనందంగా వుంది. అది చూసిన మంథరకు ఆశ్చర్యం కలిగింది. కైక దగ్గరకు వెళ్ళి "అయ్యో కైకమ్మ నీకు ఎంత అన్యాయం జరుగుతున్నది. అందరూ నిన్ను మోసం చేస్తున్నారు'' అని అంటూ మాట్లాడటం మొదలు పెట్టి ఆనందంగా ఉన్న కైకకు ఆందోళన కలిగించింది. ఇలా మంథర మాటలకు ప్రేరేపితురాలైన కైక దశరథుడు తనకు దేవాసుర యుద్ధంలో ఇచ్చిన రెండు వరాలు ఆడటంతో రాముడు అడవులకు వెళ్లటం మనకు తెలిసినదే.

ఇక్కడ కైకకు మంథర దుర్భోద చేయకుంటే రాముడు కోసల రాజ్యానికి రాజయి, అయోధ్య నగరంలోనే ఉండే వాడు. ఇలా ఉంటే రావణుడు మొదలైన రాక్షసులకు అంతం ఏది? ఇక్కడే మలుపు తిరిగి పొడిగింపబడింది రామకథ. మంథర మాటల కారణంగా కైక వరాలు కోరడంతో రాముడు అరణ్యవాసం చేసి రావణాది రాక్షసులను శిక్షించటం జరిగింది. అసలు మంథర మాటలాడకుండా ఉంటే రాముడు అరణ్యాలకు వెళ్ళేవాడు కాదు కదా. కాబట్టి ఇక్కడ రామకథను మలుపు తిప్పిన మహిళలు ప్రత్యక్షంగా కైక, పరోక్షంగా మంథర మాటలు.

రాముడు అడవులలో ఉన్నప్పుడు ప్రవేశించిన మరొక మహిళ శూర్పణఖ. ఈమెను లక్ష్మణుడు శిక్షించడంతో అవమానం చెందింది. ఈ అవమానంతో శూర్పణఖ తన అన్న రావణునికి చెప్పిన చెప్పుడు మాటలు సీతాపహరణానికి కారణం అయ్యాయి. మరలా ఇక్కడ రామకథ మలుపు తిరిగి పొడింగిపపడుటకు కారకురాలు శూర్పణఖ.

మొత్తం రామాయణంలో తక్కువ సమయం కనిపించిన పాత్రలు మంథర, శూర్పణఖలు.వీరు రామాయణంలో ఉన్నది తక్కువ సమయం. అయినా రామకథను మలుపు తప్పటంలో విశేష పాత్రను పోషించి

రామాయణాన్ని పొడిగించారు. మంథర మాటలకు ప్రభావితురాలైన కైక కోరిన వరాల కారణంగా అరణ్యవాసం. అరణ్యంలో శూర్పణఖ చెప్పిన మాటల కారణంగా సీతాపహరణం. నిజంగా ఈ రెండు సంఘటనలే జరగకుంటే రామాయణం మలుపు తిరిగేదా! కాదనే చెప్పాలి.

రామాయణంలో మంథర, శూర్పణఖ చెప్పిన మాటలు రామకథను మలుపు తిప్పిన సంఘటనలు. మంథర, శూర్పణఖ మాటల ప్రభావం ఎంతటిదో రామాయణంలో జరిగిన పరిణామాలే ప్రబల నిదర్శనాలు.

రామకథ మాత్రమే కాదు మాటల ప్రభావానికి లోను కాని మనిషి ఉండరని ఈ రెండు పాత్రల ద్వారా మనకు తెలుస్తున్నది. చెప్పుడు మాటలు ఎంత చెడుపు చేస్తాయో మంథర, శూర్పణఖల వల్ల తెలుస్తున్నది. మంథర మాటలు రామున్ని అడవుల పాలు మాత్రమే చేసింది. కాని శూర్పణఖ తన అన్నకు చెప్పిన మాటలకు సీతాపహరణం జరిగి, తరువాత యుద్ధంలో రావణుడి పతనమయ్యేతట్లు చేసాయి. మంథర మాటలు రాముడుకి కష్టం కలిగిస్తే, శూర్పణఖ మాటలు రావణునికి నష్టం కలిగించాయి.

ఈ రామకథను మలుపు తిప్పడంలో కీలక పాత్రను పోషించిన మహిళలు మంథర, శూర్పణఖలు. కానీ మనం వీరిని నీచంగా చూడటం అలవాటయి పోయింది. కారణం రామునికి సీతమ్మకు కష్టనష్టాలు కలిగించటం. సీతారాములకు కష్టం కలిగిన మాట వాస్తవమే కానీ రాముడు అడవులకు వెళ్లకుండా, సీతాపహరణం జరగకుండా ఉంటే దుష్టశిక్షణ-శిష్టరక్షణ అనే రామావతార విశేషం జరిగేది కాదు. వాస్తవానికి మంథర, శూర్పణఖలు లోక కళ్యాణం చేశారనే చెప్పుకోవాలి. దుష్ట శిక్షణ కోసం రాముని ప్రేరేపించిన ప్రముఖ పాత్రలుగా వీరిని చిత్రించుకోవాలి. పరోక్షంగా వీరి ద్వారా జరిగిన లోక కళ్యాణం గుర్తించాలి. మంథర, శూర్పణఖలు నీచ పాత్రలే కావచ్చు. రామాయణ కథాగమనానికి దిశా నిర్దేశం చేసిన కీలక పాత్రలు.

రామకథను కీలక మలుపు తిప్పి లోక కళ్యాణం చేసిన మంథర, శూర్పణఖలు లోకంలో ఇప్పటికి నిందలు పడుతున్నారు. సీతారాములు కష్టాలు పడిన మాట వాస్తవం. కానీ రామావతార పరమ ప్రయోజనం నెరవేర్చేందుకు కారకులైన వారు ప్రధానంగా మంథర, శూర్పణఖలే. పట్టాభిషేకం జరిగి రామకథ సుఖాంతం అవుతుంది అన్న సందర్భంలో మంథర మాటలతో మలుపు తిరిగి పొడిగింపబడిన రామకథ, శూర్పణఖ రావణునికి చెప్పిన మాటలతో తరువాత మలుపు తిరిగి పొడిగింపబడింది. మొదట అయోధ్యలో తరువాత అడవులలో రామ కథను మలుపు తిప్పి లోక కళ్యాణం చేసింది మహిళలే.

## ఆధార గ్రంథాలు :

1. ఉషశ్రీ రామాయణం, ప్రచురణ: తిరుమల తిరుపతి దేవస్థానములు.
2. జీవన చిత్రాలు (రామాయణ పాత్రలు) రచన : అప్పజోడు వెంకట సుబ్బయ్య, ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానములు.

❀❀❀

# 1990 దశకపు పూర్వ తెలుగు కథ - దళిత మహిళ

- డా॥. జంపాల అనూరాధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, ఎస్.ఆర్. & బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (ఎ), ఖమ్మం, తెలంగాణ.

తెలుగు కథలో దళిత మహిళల చిత్రణని విశ్లేషించటం ద్వారా 1990కి పూర్వమున్న సామాజిక నేపథ్యాన్ని దళిత స్త్రీ కోణం నుంచి పరిశీలించటం ఈ వ్యాస లక్ష్యం. దళిత మహిళకు ఆనాటి తెలుగు సమాజంలో వున్న స్థానం, అప్పటి ఆమె మానసిక చిత్రణ, ధిక్కార స్వరం, వివక్షకు బలికావటం మొదలైన అంశాల్ని గమనించటం ద్వారా ఆనాటి సామాజిక, సాహితీ గమనాన్ని పరిశీలించటం వ్యాస ఉద్దేశం. పై పరిశీలన, విశ్లేషణల ద్వారా ఆధునిక పరిశోధకులకు కొంతమేర సమాచార మార్గదర్శనం చేయటం వ్యాస ప్రయోజనం.

1990 దశకం, దానిముందు రచించిన తెలుగు కథల నుండి దళిత మహిళ పాత్రల దృష్ట్యా, ఆ పాత్రల విభిన్నమైన చిత్రణ దృష్ట్యా కథల్ని విశ్లేషించాను. కథల విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ ఒక నిర్దిష్టమైన అంచనాతో మహిళా పాత్రల్ని గమనించి, రచయితలు ఆయా పాత్రలకి ఇచ్చిన ముగింపులని చర్చించాను. తద్వారా సామాజిక అంశాలపై అవగాహనతో సమగ్ర విశ్లేషణ చేసి ఉపయుక్త సమాచారమివ్వటానికి ఈ వ్యాసం ప్రాధాన్యత నిచ్చింది.

## ఉపోద్ఘాతం :

శతాబ్దాలుగా అస్పృశ్యులై వెలివేయబడిన దళితులు, ఆధునిక భారతంలో కూడా అనేక పేర్లతో పిలువబడేవారు. ఎక్స్‌టీరియర్ కాస్ట్స్, అవుట్ కాస్ట్స్ అని 1930 దాకా పిలువబడిన ఈ కులాలు ఆ తర్వాత బ్రిటీష్ ప్రభుత్వ చట్టంతో షెడ్యూలు కులాలుగా మారాయి. 1932 సెప్టెంబర్ 30న బొంబాయిలో మాలవ్యా అధ్యక్షతన దళితవర్గ సమాఖ్య ఏర్పడటంతో దళితపదం వెలుగు చూసింది.

భారత రాజ్యాంగం ఏర్పడిన తర్వాత, ప్రభుత్వపరంగా సహకారం అందినా తరతరాల జాడ్యాన్ని నిర్మూలించ లేకపోయాం. స్థూలంగా పరిశీలిస్తే వర్ణ విభజనలో పంచములై సంఘ బహిష్కృతులైన వారే దళితులు అనాలి. కాని వర్గపరంగా చూస్తే సాంఘిక, ఆర్థిక పీడనకు గురైన అల్పవర్గమంతా దళితులే అనాలి.

వర్గపోరాటానికి ప్రాముఖ్యత నిచ్చేవారిలో కూడా "దళిత" విషయమై భేదాభిప్రాయాలున్నాయి. వర్గ ధోరణిలో దళితవాదాన్ని చేర్చటంపై పలు వివాదాలున్నాయి. దళిత మేధావులు, దేశంలో కులం తప్ప వర్గం లేదంటారు. దేశంలో సాంఘిక, ఆర్థిక అసమానతలే ప్రధాన అసమానతలని వీరి భావం. ఈ అసమానత వల్ల పీడనకు గురి అవుతూ దోపిడీ చేయబడుతున్న నిమ్నకుల ప్రజాబాహుళ్యాన్ని దళితవర్గంగా ఆమోదించవచ్చు.

ఈ పీడిత వర్గంలో మహిళలు మరింత పీడనావర్గంగా భావించవచ్చు. అందుచేత దళిత మహిళలను ప్రత్యేకంగా చూడాల్సి వుంది. సాహిత్యపరంగా కూడా దళిత మహిళకి తగినంత గుర్తింపు లేదు.

1990లలో తెలుగు సాహిత్యంలో దళిత, స్త్రీవాద ఉద్యమాలు పూర్తిస్థాయిలో ఎగసిపడ్డాయి. కానీ రెండు ఉద్యమాలలోనూ దళిత మహిళ మాత్రం గుర్తించ బడలేదు.

స్త్రీవాద ఉద్యమం నిజానికి దళిత కథల్లో కన్పించదు. ఎందుకంటే దళిత మహిళలు శ్రామికులు. వీరు శ్రమ విషయంలో పురుషులతో సమానత్వం సాధించారు. మధ్య తరగతి స్త్రీల విషయంలో కన్పించే స్త్రీ వాద దృష్టి సమస్యలేవీ దళిత మహిళ విషయంలో వర్తించవు.

దళిత మహిళకున్న సమస్యల్లో ప్రధానమైనవి వర్ణ వివక్ష, శ్రమ దోపిడి, లైంగిక దోపిడీ మొదలైనవే. ఈ నేపధ్యంలో దళిత మహిళల సమస్యల్ని 1990 కన్నా ముందు కథలే బలంగా ప్రతిబింబించాయి అనే ఉద్దేశంతో ఆ కాలపు కథలలోని దళిత మహిళల పాత్రల్ని విశ్లేషించటం జరిగింది.

**దళిత మహిళల పాత్ర చిత్రణ :**

1990కి ముందు కథల్లో అందుబాటులో వున్న విలక్షణ ఇతివృత్తాలున్న కథల్ని ఎంచుకుని పరిశీలించిన మీదట ఆ కథలలోని మహిళల పాత్రల్ని ఇలా వర్గీకరించటం జరిగింది.

1. పీడనకు బలైన మహిళలు
2. పోరాటతత్వం గల మహిళలు
3. ఇతరాలు

**పీడనకు బలైన మహిళలు :**

"పన్మిషెంటు" కథ "బోయజంగయ్య" రచన. ఈ కథలో "మోతి" కొడుకుకి హత్యానేరంపై ఉరి శిక్షపడు తుంది. ఊరి పెద్ద ఆ శిక్షను రద్దు చేయిస్తానని, దానికి ప్రతిఫలంగా మోతి కోడలు "లక్ష్మి" శరీరాన్ని కాంక్షిస్తాడు. మోతి కొడుకు మీది ప్రేమతో కోడల్ని బలవంతపెట్టి ఊరి పెద్ద వద్దకు పంపుతుంది. కానీ ఉరిశిక్ష రద్దు కాదు. మోతి కొడుకుకి ఉరి వేస్తారు. గ్రామ పెద్ద కపట నాటకానికి బలైన పాత్ర లక్ష్మి.

"శివల జగన్నాథరావు" కథ "న్యాయం నీ కోటీ నాకోటీ"లో "వరాలు" దళిత మహిళ. భర్త చనిపోగా కొడుకు మీద ప్రాణం పెట్టుకు బ్రతుకుతుంది. కొడుక్కి చదువు చెప్పే పంతులుగారు ఆమె మీద మోహపడితే... కొడుకు చదువు కోసం అతని కోర్కె తీరుస్తుంది. దళిత మహిళ నిస్సహాయతకి అద్దం పట్టే పాత్ర యిది.

వి. రాజారామ్మోహనరావు కథ "కదలిక" లో ఫ్యాక్టరీ కార్మికుని భార్య "రవణ". భర్త జీతంతో ఏడుగురు బ్రతకాలి. భర్తకి సాయపడేందుకు రవణ రహస్యంగా శరీరాన్ని అమ్ముకుంటుంది. ఆర్థిక పీడనలో నలిగి బలైన దళిత మహిళ పాత్ర రవణ.

ఈయనదే మరో కథ "తోడేళ్ళ మధ్య"లో "పుల్లి" భర్త చాటు భార్య. ఆమె భర్త కల్తీసారా వ్యాపారం నడిపేవాడు. అతను అకస్మాత్తుగా చనిపోగా ఎలా బ్రతకాలో తెలీక అదే వ్యాపారం చేస్తుంది పుల్లి. పోలీసులు కేసు పెట్టగా ఆమెను కాపాడిన లాయరు శాస్త్రి ఆమెను ఉంచుకుంటాడు. జీవన పోరాటంలో ఓడిన దళిత మహిళ పుల్లి.

గద్దల భాను కథ "పాపానికి జీతం"లో అరుంధతి భర్త కుట్టిన చెప్పుల్ని దొర గారికి ఇవ్వటానికి వెళ్ళగా అతడు ఆమెను బలత్కరించబోగా ఎదురు తిరిగి నెట్టివేసి వెళుతుండగా దొర ఆమెను చంపి, దొడ్లో గొయ్యి తీసి పాతేస్తాడు. కులదురహంకారానికి బలైన పాత్ర అరుంధతి.

ఈ కాలంలో వచ్చిన కథల్లోని దళిత మహిళల పాత్రలన్నీ ఎక్కువభాగం ఇలా బలైపోయిన పాత్రలే. విప్లవ స్వభావం గలవి తక్కువ. పాఠకుల్లో ఆలోచన, సానుభూతి కల్గించేందుకు రచయితలు దళిత మహిళా పాత్రలని అన్యాయానికి బలైపోయినట్లు చిత్రించారనిపిస్తుంది.

**పోరాటతత్వం గల మహిళలు :**

కొలకలూరి ఇనాక్ కథ "ఊరబావి"లో చిదంబరం భార్య ఒక అపురూప దళిత మహిళ పాత్ర. ఆలోచన, శారీరక శక్తి, పగ, తెగువ, కరుణ కలగలిసిన సంపూర్ణ స్త్రీ ఆమె. ఇనాక్ ఈమె పాత్రకు పేరుపెట్టకపోయినా పాఠకులకి చిరకాలం గుర్తుండే పాత్ర యిది. చిదంబరం భార్యని ఊరబావి వద్ద పెద్దింటి కుర్రాడు అవమానిస్తే ఆమె మామ రాముడు కొడుకుని శాంతపర్చిపంపుతాడు. ఆమె మాత్రం అవమానాన్ని మర్చిపోదు. ఫలితంగా బావిలో రాత్రికి రాత్రి ఎద్దుదట్టెం వేలాడింది. బావి దళితులకి దక్కింది. ఆమె అజ్ఞాత ప్రతీకారానికి మునసబు గడ్డివాములు దహనమయ్యాయి. ఆమె ఉగ్రరూపానికి పెద్దింటి యువకుడు తోకముడిచి పరారయ్యాడు. దళిత మహిళకు పోరాటస్ఫూర్తితో ఆదర్శంగా నిలిచే పాత్ర యిది.

సి.ఎస్.రావు కథ "కొరడా"లో "సింగి" అందమైన దళిత స్త్రీ. ఆమెను లొంగదీయాలని రాయలు దొర ప్రయత్నిస్తే ఆమె లొంగదు. ఆ కక్షతో ఆమె భర్తని కట్టేసి కొడతాడు దొర. సింగి, సివంగిలా తిరగబడితే దొరని పోలీసులు రక్షించాల్సి వస్తుంది. పౌరుషవంతమైన పాత్ర సింగి.

బోయ జంగయ్య "కుండ బద్దలు కొడతా" కథలో పెద్దింటి బిడ్డ చేతిలో అవమానం పాలైన కోడలి తరపున పంచాయితీ పెట్టిన అత్త తన వాగ్ధాటితో గ్రామ పెద్దల్ని అదరగొట్టటమేకాక, న్యాయం చెయ్యకపోతే వాళ్ళ గురించి తనకు తెల్సిన రహస్యాలు బయటపెడతానని బెదిరించి మరీ న్యాయం సాధిస్తుంది.

పినాకిని కథ "మగ తోడు" లో "లచ్చుము" ధైర్య వంతురాలు. భర్త లేకున్నా ఒంటరిగా కూతుర్ని పెంచి, సమాజాన్ని ఎదిరించి కూతురు ప్రేమించిన వాడితో పెళ్ళి జరిపిస్తుంది.

బోయ జంగయ్య కథ "నిజం"లో దుర్గ తనని బలవంతంగా మైలపరచిన మోతుబరి రంగారావుని, మళ్ళీ రమ్మని పిలిచి చంపేసే ప్రతీకారేచ్ఛగల పాత్ర.

**ఇతరాలు :**

అప్పటి నల్గొండ జిల్లా కలెక్టర్ ఎ. విద్యాసాగర్ రాసిన కథ "శాపలు దాగితే సెరు వెండుద్దా సారూ!" చాలా విలక్షణమైంది. ఈ కథలో "పున్నమ్మ" ఒక సజీవ దళిత స్త్రీకి ప్రతిరూపం. గిరిజన మహిళ పున్నమ్మ తన తెలివి తేటలతో ఎలా అధికారుల్ని మెప్పించి గిరిజన గ్రామీణు లందరికీ ఉపాధి కల్పించిందో తెలిపే పాత్ర యిది.

కాళీపట్నం రామారావు కథ "ఆర్తి"లో ఎఱ్ఱెమ్మ, బంగారమ్మలు వియ్యపురాళ్ళు. ఎఱ్ఱమ్మ కూతురే బంగారమ్మ కోడలు. ఆమె ఎవరింట్లో ఉండే వారికి ఒక మనిషి కూలి కలిసి వస్తుంది. ఆ కూలి కోసం వారిద్దరూ తగదా పడతారు. ఆర్థికత, బాంధవ్యాల మీద ఎలా ప్రభావం చూపుతుందో ఈ మహిళా పాత్రల ద్వారా తెలుస్తుంది.

అనిశెట్టి సుబ్బారావు కథ "పాకీది" లో "మాచి" తన కొడుకు "కోటిని" చదివించాలని ఆశ పడుతుంది. కానీ సమాజం అవకాశం ఇవ్వదు. కొడుకు కూడా తనలానే పాకీ పని చేయటం తట్టుకోలేక "మాచి" మానసికంగా "శిల" అయిపోతుంది.

**ముగింపు :**

1990 పూర్వపు తెలుగు కథల్లో దళిత అంశం విస్తృతం గానే కన్పించినా స్త్రీ పాత్రలపరంగా మాత్రం రచయితలు సరైన న్యాయం చేయలేదు అనే చెప్పాలి. దళిత అంశం మీద స్త్రీ పాత్రలపరంగా రచించిన కథలు చాలా తక్కువ. వాటిలో కూడా అన్యాయానికి బలైన మహిళలనే అధికంగా రచయితలు చిత్రించారు. పోరాటస్ఫూర్తిని అందించే మహిళల్ని చిత్రించిన కథలు కొద్దిపాటే. అయితే అవి అత్యంత ప్రతిభావంతంగా వుండటం గొప్ప విషయం.

**ఉపయుక్త గ్రంథం :**

1. కథా వేదిక - ప్రథమ వార్షిక సంచిక - మద్రాసు 1992
2. తెలుగు కథ సమీక్ష - వేదగిరి రాంబాబు, వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాద్, 1994/95/96
3. తెలుగు వచన రచనా పరిచయం - కథానిక - ఆం.ప్ర. సార్వత్రిక విశ్వ విద్యాలయం - 1986
4. దళిత సాహిత్యం - కలేకూరి ప్రసాద్ - దళిత స్త్రీ సాహిత్య పరిషత్ - విజయవాడ - 1993
5. తెలుగు కథానిక - దళిత పాత్ర చిత్రణ - డా. జె. మురళీకృష్ణ - 1996
6. గిరిజన పోరాట కథలు - కరీంనగర్ బుక్ ట్రస్ట్, 1990.

# ఆంధ్ర మహాభాగవతము - మహిళ

- డా॥. కె.వి. సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు, డి.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు.

భక్తి రస సముద్రం భాగవతం. అష్టాదశ పురాణాలన్నిటిలో పరిపూర్ణమైన పురాణం భాగవత పురాణం. అంతటి భాగవతం తెలుగుల పుణ్యపేటి శ్రీ పోతన గారికి దక్కింది. సంస్కృతంలో భాగవతాన్ని వేదవ్యాసుడు వేదాంత జ్ఞానసుధతో రంగరించి చెప్పగా తెలుగు భాగవతాన్ని పోతన భక్తి ప్రధానమైన పురాణంగా తీర్చిదిద్దాడు. భాగవతుల చరిత్రలే భాగవతం. పరమ భాగవతులైన ప్రహ్లాద, ధ్రువ, అంబరీష, నారద, పృథు, అక్రూర, సుదామ, కుచేల, బలి, గోపికాది భక్తుల గాథలే భాగవతం అని చెప్పవచ్చు. వీరి గాథలతో పాటు పరమ భాగవతోత్తములైన స్త్రీమూర్తులు అనేకమంది ఉన్నారు. వీరు కూడా లీలామానుష విగ్రహుడైన ఆ శ్రీకృష్ణుని లేదా శ్రీమన్నారాయణుని ఆరాధించి ప్రేమించి తరించినవారే. వీరిని

1. తాపస స్త్రీలు లేదా ఆశ్రమవాస స్త్రీలు
2. రాజరిక లేదా రాజాంత:పుర స్త్రీలు
3. సామాన్య స్త్రీలని మూడు విధాలుగా విభజించి చూడవచ్చు.

**తాపస స్త్రీలు :**

తాపస స్త్రీలలో దేవహూతి, సుకన్య, అనసూయ, నాభాగ, అదితి మొ. స్త్రీ మూర్తులు వస్తారు. దేవహూతి స్వాయంభువ, శతరూపల కూమార్తె. పెళ్ళీడుకు వచ్చిన తన కుమార్తె దేవహూతిని వెంటబెట్టుకుని కర్దముని దగ్గరకు వెళ్ళి

“వరయోగీశ్వర! దేవహూతి యను నీ కామాక్షి మత్పుత్రి, దా
వరలావణ్య గుణాఢ్యులన్ వినియు నెవ్వారిన్ మదింగోర, కా
తురయై నారదుపంపునన్ మిము వరింతున్నంచు
నేతెంచె, నీ
తరుణీభిక్ష బరి గ్రహింపుము శుభోదాత్త క్రియాలోలతన్.”

అని ప్రార్థిస్తాడు. కర్దముడు అంగీకరిస్తాడు. మహా సాధ్వి అయిన దేవహూతి కర్దమఋషికి అనేక విధాలుగా సేవలు చేస్తుండేది. పతియే ప్రత్యక్ష దైవమనీ, అతడే స్త్రీకి సర్వస్వమనీ నమ్మిన పతివ్రత ఆమె. భర్త మనోగతాన్ని తెలుసుకొని, కామము, క్రోధము, కపటము, లోభము, మోహము లాంటి చెడుగుణాలను దరిచేరనీయక, తన సౌఖ్యాలను, శరీర సౌందర్య పోషణలను కూడ అలక్ష్యము చేస్తూ, అత్యంత భకి శ్రద్ధలతోను, ప్రేమానురాగాలతోను, పతిసేవా శుశ్రూషలు చేస్తుండేది. తానొక లోకాధీశుని పుత్రికనని గాని, అతిలోక సౌందర్యవతినని గాని తలంపైనా లేకుండా మెలగుతుండేది. కర్దముని అనుగ్రహంతో, శ్రీ హరి అంశతో ఆమె గర్భాన పుత్ర రూపంలో కపిల ముని జన్మిస్తాడు. దేవహూతి కపిలుడు చెప్పిన ప్రకారం మనస్సును పురుషోత్తముని యందు నిలిపి ఆయనలో ఐక్యమౌతుంది. ఇలా పరమ పాతివ్రత్యం కల ఇల్లాలిగా దేవహూతిని మలిచాడు పోతనగారు. ఈ కోవకు చెందిన వారే అదితి, అనసూయ, సుకన్య, నాభాగ మొ॥ వారు.

**రాజాంత:పుర స్త్రీలు :**

రాజాంత:పుర స్త్రీలలో రుక్మిణి, సత్యభామ, ద్రౌపది, యశోద, దేవకీదేవి, జాంబవతి, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్ష్మణ, ఉషా సుభద్రలు ప్రముఖులు.

రుక్మిణి భీష్మకుని కుమార్తె. ఆమె దినదిన ప్రవర్ధమానమై విద్యా గుణశీలాలలో ఎంతో పేరు తెచ్చుకున్నది. బాల్యంలో రుక్మిణి బొమ్మలకు పేర్లు పెడుతూ, పెండ్లిండ్లు చేస్తూ తోటి బాలికలతో వియ్యాలు నెరపుతుంది. పప్పు, బియ్యాలు గిన్నెలలో పోసి, కమ్మగా గుజ్జనగూళ్ళు వండించి తన స్నేహితురాళ్ళకు వడ్డన చేస్తుంది. ఇలా రుక్మిణి క్రమంగా పెరిగి పెద్దదై యుక్త వయస్సు (యవ్వనం)లోకి అడుగిడిందని వర్ణిస్తాడు

పోతన. మూల భాగవతంలో లేకపోయినా, ఒక తెలుగింటి అమ్మాయి ఎలా ఆటపాటలతో పెరిగి పెద్దదౌతుందో చక్కగా వర్ణించాడు. కృష్ణుని గుణగణాలు విన్న రుక్మిణి ఆయననే భర్తగా భావించి ఆరాధిస్తుండగా శ్రీకృష్ణుడు కూడా

ఆ లలన రూపు బుద్ధియు, శీలము లక్షణము
గుణము జింతించి దగన్
బాలారత్నము దనకి,ల్లాలుగ జేకొందు ననుచు
హరియుం దలచెన్.

రుక్మిణి రూపం, వివేకం, సత్ప్రవర్తన, శుభ లక్షణాలు, సద్గుణాలు అన్నీ తెలుసుకుని ఆ కన్యామణిని తప్పక పరిణయమాడాలని నిశ్చయించుకుంటాడు. రుక్మిణి తల్లిదండ్రులు, బంధువులు కూడా కృష్ణునికే ఆమెనిచ్చి వివాహం చేయాలని ప్రయత్నాలు ప్రారంభిస్తారు.

కానీ, రుక్మిణి అన్న రుక్మి మాత్రం చెల్లెలిని శిశుపాలునికిచ్చి పెళ్ళి చేయాలని పట్టుదలతో ఉంటాడు, తగిన ముహూర్తం పెట్టిస్తాడు. ఆ వార్త విన్న రుక్మిణీదేవి, చాలా సేపు విచారించి, తన శ్రేయస్సు కోరే అగ్నిద్యోతనుడనే విప్రవరుని రప్పించి, " ఓ విప్రశ్రేష్ఠా! అహంకార గర్వాంధుడైన మా అన్న నన్ను శిశుపాలునకిచ్చి వివాహం చేయడానికి సిద్ధపడుతున్నాడు. మా తండ్రి నిస్సహాయుడై ఊరకున్నాడు. నీవు వెంటనే ద్వారక వెళ్లి శ్రీకృష్ణునకు నా ప్రేమను తెలియజేసి, అతనిని ఇక్కడికి పిలుచుకుని రావాలి అని చెప్పి పంపింది.

ఆ బ్రాహ్మణోత్తముడు ద్వారకా నగరానికి వెళ్ళి శ్రీకృష్ణుని సందర్శించి రుక్మిణీదేవి చెప్పమన్న

"అంకిలి సెప్పలేదు; చతురంగ బలంబులతోడ నెల్లియో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్.

విషయాలన్నీ చెప్పి రుక్మిణీదేవి పంపిన సందేశం ఆమె ఆకార సౌందర్యం వివరించి కర్తవ్యమేమో ఏలినవారే ఆలోచించాలి" అని అంటాడు.

అందుకు శ్రీకృష్ణుడు రుక్మిణిమీద నాకు ఎంతో ప్రేమ ఉందనీ చెప్తూ

"వచ్చెద విదర్భ భూమికి; జొచ్చెద భీష్మకుని పురము;
సురుచిరలీలన్
దెచ్చెద బాలన్; వ్రేల్మిడి, వ్రచ్చెద నడ్డంబు రిపులు
వచ్చిన బోరన్"

బ్రాహ్మణునికి భరోసా ఇస్తాడు.

పెండ్లి దగ్గర పడుతున్నది. రుక్మిణిలో అంతకంతకూ ఆందోళన పెరుగుతున్నది. కృష్ణునకు వార్త అందిందో లేదో, ఆయన విని తప్పుగా తలంచలేదు కదా" అని పరిపరి విధాల మనస్సులో మధనపడ్తూ

"ఘనుడా భూసురుడేగెనో? నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో
విని కృష్ణుండిది తప్పుగా దలచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డను కూలింప దలంచునో తలపడో? యార్యా
మహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుగదో? నా భాగ్య మెట్లున్నదో?

క్షణమొక యుగంగా గడుపుతుంది. పాత్రల స్వరూప స్వభావాలను చక్కగా ఆకళించుకొని చిక్కగా ప్రకటించడం పోతన్న గారి ప్రత్యేకత. రుక్మిణి పడుతున్న ఆవేదన, ఆందోళన పోతన గారు అత్యద్భుతంగా వర్ణించారు.

ఎప్పుడో చిన్నప్పుడు (శంబరాసురుని) తప్పిపోయిన పిల్లవాడు (ప్రద్యుమ్నుడు) పెరిగి, పెద్దవాడై కంటబడితే కన్నతల్లి గుండెల్లో ఎలాంటి ప్రేమానురాగాలు పెల్లుబుకుతాయో

ఇందాక వాడు బ్రతికిన
సందేహము లేదు; దేహ చాతుర్య వయ
స్సౌందర్యంబులు లోకులు
వందింపగ నితనియంతవాడగు జుమ్మీ!

ప్రద్యుమ్నుణ్ణి చూసిన వెంటనే రుక్మిణీదేవిలో పై భావాలు కలగాయని పోతన వర్ణించడం ఎంతో సముచితంగా ఉంది. కమనీయమైన కన్నతల్లి భావనకు కమ్మని ప్రతిబింబం ఈ పద్యం.

సత్రాజిత్తు కుమార్తె సత్యభామ. ఎంతో ధీరురాలైన యువతిగా పోతన చిత్రీకరిస్తాడు.

ఒకసారి లోకకంటకుడైన నరకాసురుడి పైకి యుద్ధానికి వెళుతున్న శ్రీకృష్ణుని చేతులు జోడించి సత్యభామ

"దేవా! నీవు నిశాట సంఘముల నుద్దీపించి చెండాడ నీ
ప్రావీణ్యంబులు సూడ గోరుడు గదా ప్రాణేశ! మన్నించి న
న్నీ వెంటం గొని పొమ్ము, నేడు కరుణన్, నే జూచి
యేతెంచి నీ
దేవీ సంహతి కెల్ల జెప్పుడు భవద్దీప్త ప్రతాపోన్నతుల్"

అని అంటుంది. భార్య సమర రంగానికి వస్తానంటే ఏ భర్తా సమ్మతింపడు. అందువల్ల సంభాషణా చతుర అయిన సత్యభామ ఇలా అంటుందని పోతన చక్కగా పాత్రపోషణ చేస్తాడు.

శ్రీ కృష్ణుడు సత్యభామని యుద్ధానికి వద్దని ముద్దు ముద్దుగా ఎలా వారించడం చేశాడో పోతన

సమద పుష్పంధయ ఝుంకారములు కావు
భీషణ కుంభీంద్ర బృంహితములు;
వాయు నిర్గత పద్మవన రేణువులు కావు
తురగరింఖా ముఖోద్ధూత రజము;
..........................
కన్య ! నీ వేడ ! రణరంగ గమన మేడ?
వత్తు వేగమ; నిలుపుము; వలదు వలదు.

సత్యభామ ప్రస్తుత పరిస్థితినీ, సమర రంగపు భీషణ స్థితిగతినీ సరిసమానంగా వర్ణించి కళ్లకు కట్టారు. మొదటి పాదాలలో పరుషమైన సంస్కృత సమాసాలని ప్రయోగించి రచనలో గొప్ప వైచిత్ర్యం ప్రదర్శిస్తూ చిట్టచివరకు తేట తెలుగు మాటలతో 'త్వరగా తిరిగి వస్తాను. ఆగిపో. రావద్దు' అని తేల్చి చెప్పడం ఆమెను బుజ్జగించే ధోరణికి అనుకూలంగా ఉంది.

యుద్ధభూమికి రాకుండా ఉద్యానభూమిలోనే ఉండమంటున్న కృష్ణునితో సత్యభామ

"దానవులైన నేమి? మఱి దైత్య సమూహములైన
నేమి? నీ
మానిత బాహుదుర్గముల మాటున నుండగ నేమి
శంక?......"

చేతులు జోడించి ప్రార్థిస్తుంది. ఇక్కడ సత్యభామ సద్యస్ఫూర్తి చక్కగా కనపడుతుంది.

భర్తతో యుద్ధానికి సన్నద్ధుడౌతున్న నరకాసురుణ్ణి చూచి ఏమాత్రం కలవరపడకుండా కేశపాశం ముడివేసి, నడుం బిగించి లేచి నిలచిన వీరనారి సాత్రాజితిని పోతన్న గారు

వేణిన్ జొల్లెము వెట్టి సంఘటిత నీవీబంధయై భూషణ
శ్రేణిం దాల్చి ముఖేందు మండల మరీచీ జాలముల్ పర్వగా
పాణిం బయ్యెద చక్కగా దుఱిమి శుంభద్వీర సంరంభయై
యేణీలోచన లేచి నిల్చె తన ప్రాణేశాగ్ర భాగంబునన్.

ఈ పద్యంలో "పాణిం బయ్యెద చక్కగా తుఱిమి" అన్న పదం పోతన లోక పరిశీలనా దృష్టికి నిదర్శనంగా చెప్పవచ్చు. అలాగే యుద్ధం చేస్తున్న తన పతి శ్రీకృష్ణుణ్ణి ఒకవైపు, మరోవైపు నరకాసురుణ్ణి చూస్తున్న సత్యభామను పోతన

రాకేందు బింబమై రవిబింబమై యొప్పు
నీరజాతేక్షణ నెమ్మొగంబు; అని వర్ణిస్తాడు.

సత్య వదనం శ్రీకృష్ణునికి రాకేందుబింబంగాను, నరకాసురునికి రవి బింబంగాను, కనపడిందని పేర్కొంటూ శృంగార వీరరసాల సరస సమన్వయాన్ని సాధించాడు. ఈ విధంగా సత్యభామ పాత్రను మిక్కిలి ధైర్యశాలిగా చిత్రీకరించాడు.

యశోద పాత్రను కన్నతల్లి స్వభావానికి తగ్గట్లుగా చక్కగా చిత్రీకరించాడు. అయితే పోతన గారి భక్తి భావాన్ని ఆయన పాత్రలు కూడా అలవరచుకున్నాయని విమర్శకులు భావిస్తారు. ఆయన పాత్రలన్నీ బాలకృష్ణుని దేవుని గానే భావించాయని వారి భావన. కాళింది మడుగులో పడ్డ కృష్ణుని తలచుకొని పోతన్న సృష్టించిన యశోద "తండ్రీ! నీవు సర్పదష్టుండవై యున్న నిచట మాకు ప్రభువులెవ్వరింక" అని రోదిస్తుంది. ఆమె దృష్టిలో కృష్ణుడు

కొడుకు కాదు. ప్రభువే. ఇలాంటి సన్నివేశాలు పోతనగారి భాగవతంలో తరచుగా కనిపిస్తాయి. అయితే కొన్నిచోట్ల ఆయన పాత్రలు అత్యంత సహజమైనవిగా దర్శన మిస్తాయి. బాలకృష్ణుని ఏడుపు విన్న యశోద

"అలసితివి గదన్న! యాకొంటిని గదన్న!
మంచియన్న యేడ్పుమానుమన్న
చన్ను గుడువు మన్న సంతసపడుమన్న
యనుచు జన్నుగుడిపె నర్భకునకు."

ఎలా తల్లడిల్లుతుందో పోతన వర్ణించడం కన్పిస్తుంది. మరో సందర్భంలో "అల్లరి కృష్ణుణ్ణి బంధించబోతూ యశోద వీరెవ్వరు శ్రీకృష్ణులు గారా! ఎన్నడును వెన్న గానరట గదా!

చోరత్వం బించుకయును, నేరరట? ధరిత్రి నిట్టి నియతులు గలరే!" అని అంటుంది. తన బిడ్డపై నేరాలు మోపిన గోపికలను బుజ్జగించి పంపడంలో యశోద మాటనేర్పు

అన్యమెఱుగడు తనయంత నాడుచుండు, మంచి
వాడీ తండెగ్గలు మానరమ్మ?
రామలార! త్రిలోకాభి రామలార! తల్లులార!
గుణవతీమతల్లులార!

ఈ విధంగా యశోద పాత్రను చిత్రించాడు పోతన.

**సామాన్య స్త్రీలు :**

సామాన్య స్త్రీల కోవలోకి కుబ్జ, గోపికలు వస్తారు. కుబ్జ మరుగుజ్జు పిల్ల. నిజానికి త్రివక్ర. మెడవంకర, నడుము వంకర, కాళ్ళు వంకర. కుబ్జను చూసిన కృష్ణుడు

ఎవ్వరి దానవు? లేపము, లెవ్వరికిం గోరికొనుచు
నేగెదు? నీ పే
రెవ్వతె? మా కిమ్మన్నియు, నివ్వటిలెదు చక్కనగుచు
నీరజ నేత్రా! అంటాడు.

వెంటనే ఆ మాటల్లోని వ్యంగ్యాన్ని గ్రహించిన కుబ్జ కొంచెం రోషంతో

"చక్కని వాడవౌదు! సరసంబుల నొంపకు; యెల్ల వారికిన్
జక్క దనంబు లెక్కడివి? నీవే పెద్ద చక్కనయ్యవులే.

చమత్కారాలు చాలించు. అందరికీ నీ చక్కదనం ఎక్కడి నుండి వస్తుంది? అని ఎదురు ప్రశ్నిస్తుంది.

గోపికలకు శ్రీకృష్ణుడంటే ప్రాణం. అయినా అతని కొంటె పనులకు కొంత రోషం, ఉక్రోషం ప్రదర్శిస్తుంటారు.

తమ వలువలు ఎత్తుకు పోతున్న శ్రీకృష్ణుని
మామా వలువలు ముట్టకు, మామా కొని పోకు
పోకు మన్నింపు తగన్
మా మానమేల కొనియెదు, మా మానస హరణ మేల
మానుము కృష్ణా!

అని ప్రాధేయపడ్డారు. అంతేగాక ఆ నల్లనయ్యతో

ఇంతుల్ తోయము లాడుచుండ మగవారే తెంతురే! వచ్చిరా
యింతల్ సేయుదురే కృపారహితులై యేలోక మందైన; నీ
వింతల్ నీ తల బుట్టె గాక మఱియే వీకృష్ణ! యో చెల్ల! నీ
చెంతన్ దాసులమై చరించెదము మా చేలంబు లిప్పింపవే!

అని అంటారు. ఒక గోపిక యదుకుమారుని పెదవుల క్రింద కదలుతున్న మురళి అదృష్టానికి అసూయపడి

"వనితా! యెట్టి తపంబుసేసె నొకొ యీ వంశంబు
వంశంబులోన్"

అని అంటూ క్రిందటి జన్మలో తన పొరపాటుకు బాధపడ్తుంది.

ఏది ఏమైనా భాగవతంలోని స్త్రీ పాత్రలన్నీ పెద్దగా వైవిధ్యాన్ని చూపించవు. అందుకే కొందరు విమర్శకులు పోతన పాత్రలన్నీ మూసపోసినట్లు ఉంటాయంటారు. దీనికి ప్రధాన కారణం పోతనలోని భక్త్యావేశం. ఆయన సృష్టించిన పాత్రలన్నీ పోతనలోని భక్తినే ప్రతిబింబిస్తుం టాయి. అందుకే తెలుగు సాహిత్య వినీలాకాశంలో పోతన చంద్రుడు వంటి వారు అంటారు. చంద్రుడు చక్కని, చల్లని వెన్నెలలు కురిపిస్తున్నట్లుగా ఆయన సృష్టించిన పాత్రలు కూడా లలితరసాస్వాదన కలిగిస్తాయి. ఈ విధంగా పోతన తన భక్త్యావేశముతో అనుప్రాసాలం

కారంతో ఆంధ్ర మహాభాగవతాన్ని అజరామరం చేశారు. ఆయన ఇప్పటికీ ఆంధ్రుల హృదయాలలో గూడు కట్టుకుని ఉన్నారు. తెలుగు సాహిత్యం జీవించి ఉన్నంత కాలం పోతన బ్రతికే ఉంటారు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆరుద్ర - సమగ్రాంధ్ర సాహిత్యం 4వ సంపుటం
2. ఉషశ్రీ - శ్రీ మద్భాగవతం
3. పోతన భాగవతం - 1, 2, 3, 4, 5 సంపుటాలు, టి.టి.డి ప్రచురణలు
4. శ్రీమద్భాగవత మహాపురాణం - గీతాప్రెస్, గోరఖ్ పూర్

# ఆంధ్ర మహా భారతము - కుంతి మాతృత్వము

- డా॥. భూక్య జ్యోతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, మదనపల్లి.

ప్రాచీన భారతీయ చరిత్రలో ఒక వెలుగుగా వెలిగి నటువంటిది, ధీనురాలైన కుంతీ మహారాణీ వీరోచిత పాత్ర. లక్షా పదివేలు శ్లోకాలతో వర్ణించబడిన గొప్ప పురాణమైన మహాభారతము ద్వారా కుంతీదేవి పాండు మహారాజుకు భార్యగా మహా బలశాలులైన పంచ పాండవులకు తల్లిగా తెలియబడుచున్నది. ప్రపంచములో ఐదు వేల సంవత్సరాల క్రితము నెలకొని వున్న అన్ని పరిస్థితుల గతులను మార్చిన కురుక్షేత్ర మహా యుద్ధమునకు కారణమైన రాజకీయ సంఘటనలలో కేంద్ర స్థానమును ఆక్రమించిన పాత్ర ఈమెది.

స్త్రీకి ఉండే గుణములో మాతృత్వము అత్యంత విశిష్టమైనది. బిడ్డలను కనడం, వాత్సల్యంతో పెంచడం, వారి కష్టసుఖాలను పరితపించటం ఆనందించటం భారత స్త్రీజాతి యొక్క విశిష్ట లక్షణములు. మహాభారతమందలి స్త్రీపాత్రల్లో ప్రముఖమైనది కుంతిపాత్ర. ఆమె గుణ బాహుళ్యమున మాతృత్వం అత్యంత విశిష్ట స్థానమ లంకరించినది. కుంతి మాతృత్వ ప్రాధాన్యతను నిరూపించుటయే ఈ పాత్ర ముఖ్య ఉద్దేశ్యం.

గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుని స్థానములో సోదరుడైన పాండు యువరాజు కాగలిగెను. కొంత కాలము తరువాత పాండురాజు రాజసింహాసనమును అధిరోహించెను. తరువాత ధృతరాష్ట్రుడు గాంధారిని వివాహమాడెను. వారికి వందమంది కుమారులు కలిగిరి. వీరిని కౌరవ వంశీయులుగా పిలువబడిరి. వారిలో పెదవాడు దుర్యోధనుడు చాలా క్రూరుడు, దురాశాపరుడు.

పాండురాజు రాజ్యమును వదలి వానప్రస్థమును స్వీకరించి భార్యలతో అడవిలో జీవించుడెను. అక్కడ కుంతీదేవికి గల అసాధారణ వరమును గురించి తెలిసికొని పాండురాజు యొక్క అభ్యర్థన మేరకు ఆమె ముగ్గురు మహాపరాక్రమవంతులైన పిల్లలకు జన్మనిచ్చినది. మొట్టమొదట ఆమె ధర్మదేవత (యమధర్మరాజు)ను అవాహన చేసి ఆయను ఆరాధించి దుర్వాసముని తెల్పిన విధముగా ధర్మపురుషునితో కలిసి ఒక మగ శిశువునకు జన్మనిచ్చింది. ఆ పిల్లవాడు జన్మించగానే "ఈ పిల్లవాడు యుధిష్టిరుడుగా పిలువబడుతాడు. ధర్మ పరాయణుడు, సత్యవాది, ధీరుడు, త్యాగి అయిన ఇతడు ముల్లోకముల లోను పేరు గడించును అని ఆకాశవాణి పలికినది.

ఇటువంటి ధర్మపరాయణుడైన కుమారుడు తనకు కలుగగనే పాండురాజు కుంతీదేవిని తనకు శరీర సౌష్టవము గల కుమారుని ప్రసాదించమని కోరగా ఆమె వాయుదేవుని అవాహన చేసి తద్వారా భీముని సంతానముగా పొందినది. భీముడు జన్మించగానే ఈ బాలుడు బలవంతులలో గొప్ప బలవంతుడవుతాడు అని ఆకాశవాణి పలికినది.

తరువాత అరణ్యములో గల గొప్ప మునుల సలహా మేరకు అతడు కుంతీదేవిని తపస్సు చేయుమని పాండురాజు కోరెను. ఒక సంవత్సరము తరువాత పాండురాజు కుంతీదేవితో ఓ సౌందర్యవతి స్వర్గలోకాధిపతి నీకు ప్రసన్నుడవుతాడు. కాబట్టి నీవు అతనిని ఆవాహనచేసి ఒక కుమారుని పొందుము అని అనగా ఆమె ఇంద్రుని ఆవాహన చేసి, తద్వారా అర్జునునికి జన్మిచ్చినది. అర్జునుడు జన్మించగానే ఓ కుంతీ ఈ శిశువు క్షత్రీయులలో గొప్పవారైన శిభి, కార్తికేయులవంటి పరాక్రమశాలి. ఇతనితో యుద్ధము చేసి గెలుచుట ఇంద్రుని వల్ల కూడా కాదు. ఇతనికి గల గొప్ప అస్త్రముల వలన మీకు మంచి పేరు ప్రఖ్యాతులు గలుగుతాయి అని ఆకాశవాణి పలికినది. ఈలోపు మాద్రి పాండురాజు ద్వారా నకులుడు, సహదేవుడు అనే ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. వీరు ఐదుగురు పంచపాండవులు అని పిలువబడిరి.

పాండురాజు సింహాసనమును వదలి వానప్రస్థాశ్రమములో నున్నకారణముగా పాండురాజు పెద్ద కురమారుడైన యుధిష్టిరుడు పెద్దవాడయ్యే వరకు దృతరాష్ట్రుడు తాత్కాలికముగా రాజ సింహాసనమును అధిష్టించెను. శాపప్రభావముతో పాండురాజు మరణించగా ఆయన రెండవ భార్య మాద్రి సతీసహాగమనమును చేసినది. అందువలన ఐదుగురు పాండవుల సంరక్షణను కుంతీదేవికి అప్పగించబడింది.

తండ్రిని కోల్పోయిన పాండవులు సకల విద్యలో ప్రావీణులై నిలుచుటచే తనుకన్న కలలు ఫలించెనని ఆమె భావించినది. కానీ ఆమెకు ఆ ఆనందం ఎంతోకాలం నిలువలేదు. ఆ తరువాత రంగమధ్యమున కర్ణుడు నిలిచి తన విద్యను చూపించెను. వీరిరువురి మధ్య పోరుచూసి కుంతి మూర్ఛిల్లినది. ఆ తరువాత అర్జుని పై వాత్సల్యాన్ని కన్నీటితో బహిర్గతంగా ప్రదర్శించగలిగిన కుంతి ప్రథమ పుత్రుడు కర్ణుని పై వాత్సల్యమును పదిలంగా గుండెలలో దాచుకున్నది.

అతను సహజ కవచకుండలములతో ప్రకాశిస్తూ ఉన్నాడు. లోకాపనిందకు భయపడి కడుపు తీపిని చంపుకుని అతనిని ఒకపెట్టెలో పెట్టి నదిలో విసిరివేసినది.

"ఏలయమ్మని నాకునిచ్చె నిమ్మంత్ర మిమ్మంత్ర శక్తియే నెఱుంగగవేడి
మేల పుత్రకుగోరి యెంతయు భక్తి నినుదలించితే చేలినినుదను నాకు
నేత నద్యోగర్భమిచ్చె గుమారుడేల యప్పుడ యుదయించె నింకెట్టు
లీలోక పరివాద మేనుడి గింతునింతకు నింతయు నెఱుగరె జనులు"

ఈ బాలునెత్తుకొని యింటికి జన్ననన్నున్
నా బంధువులందఱు మనంబున నేమనారె
ట్లే బాలసూర్య నిభునిట్టు లడించి పోవ
గా బుద్ధి పుట్టునని కన్యమనంబులోన

ఈ విధంగా ఆమె కర్ణుడిని నదిలో వదిలినప్పుడు పరిపరి విధాల తననుతాను నిందించుకుంటూ, ఎంతో బాధపడినది. అతని జన్మ రహస్యమును బడబాగ్నిలాగా కడుపులోనే దాచుకున్నది. ఆ తర్వాత కుంతి స్వయవరంలో పాండురాజు ఆమె వరించాడు.

ఆ తరువాత ఏకచక్రపురమున పాండవులు బ్రాహ్మణ వేషధారులై బిచ్చమెత్తికొని రాగా కుంతి ఆహారమును రెండు భాగాలు చేసి ఒక భాగం భీమునకు పెట్టి, తక్కిన భాగము పుత్రులతో కలిసి తాను భుజించేది

"కుంతియును దాని రెండు భాగంబులు నేసి యందొక్క భాగంబు భీమున
కుంబెట్టి తక్కిన భాగంబు గడమ కొడుకులుందా మను గుడుచుచు..."

ఈ విధంగా పిల్లల పోషణలో వారికనుకూలమైన పద్దతి అవలంభించుట తల్లి యొక్క ముఖ్య కర్తవ్యం. భీముని ఆకలి తెలిసుకొని సగభాగం తనకు పెట్టి, మిగిలిన భాగం పిల్లలతో కలిసి తాను తినేది. ఈమె మాతృప్రేమ అపారమైనది.

ద్రౌపదీ స్వయంవర సందర్భంలో కూడా తన కుమారుల ఆలస్యమునకు చింతించి దేవతలను ప్రార్థించినది. కౌరవులతో తన కొడుకులకు ఏమైనా ఆపద కల్గిందేమోనని కుంతి చింతించినది. వేదవ్యాసుని వాక్కు నిజము గాకపోవునా అని ఆందోళన చెందినది. ద్రౌపదిని స్వయం వరమున గెలిచి తమ ఇంటికి తెచ్చి తల్లికి భిక్ష తెచ్చితిమని చెప్పగా మీరందరూ సమానంగా ఉపయోగించుకోండి అని ఆదేశించును. ద్రౌపదిని చూచి సిగ్గుతో అధర్మంగా పలికానానని బాధపడుతుంది. ఆ తరువాత దుర్వ్యసనముతో రాజ్యంకోల్పోయిన కుమారులను చూడలేక స్వర్గస్థుడైన పాండురాజే పుణ్యవంతుడని, అతనిని అనుసరించిన మాద్రి అదృష్టవంతురాలని తన దురదృష్టానికి వాపోతుంది. కృష్ణుని అండదండలున్నప్పటికీ పాండవులు అడవుల పాలైనారు కదా అని శోకించినది. కృష్ణుడు రాయభారము

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తీసుకురాగానే అతని మెడపట్టుకుని ఎలగెత్తి ఏడ్చినది. నేను వడ్డిస్తే తప్ప తిని నిద్రించని నా కుమారులు కందమూలాలు ఆహారంగా తీసుకుంటూ పొదలలో, పుట్టలలోపడి ఉండవలనని తలచి శోకసంద్రములో మునిగిపోయినది. పాండవులను పేరుపేరున క్షేమము అడిగి

"తండ్రిలేని ప్రజలు తల్లిని బాసి పె
ర్గయును గాల మివ్విధమున జడిరి
భంగపాటు దు:ఖపాటును సంకట
పాటు గలిగె విరటుపాల! చిదప"

తండ్రిలేని బిడ్డలు తల్లిని కూడా విడిచిపోయినారని ఎంతో విలపించినది. ఆ తరువాత కురుక్షేత్ర యుద్ధ సమయములో పాండవులు కురుక్షేత్రమున ఉన్న గాంధారీ ధృతరాష్ట్రులను కుంతిని సందర్శించి పాదములకు సమస్కరించగా వారిని కౌగలించికొని దీవెనలిచ్చినది. తన పుత్రులు, సవతిపుత్రులు, పైవారి పుత్రులు అను భేదము చూపక అందరి పై మాతృతము చూపించినది. ఆ తరువాత యుద్ధ సమయంలో కర్ణుడిని రహస్యంగా కలసుకుని తన జన్మవృత్తాంతం చెప్పి యుద్ధ నివారణ కోరుతుంది. ఎవరు మరణించినా బాధ పడవలసినది నేనే కౌరవ, పాండవులిరువురునాకు పుత్ర సమానులే అని చెప్పినది.

ఈ విధంగా మహాభారతంలో కుంతిమాతృత్వము ప్రతి తల్లికి ఆదర్శనీయము, ఆచరణీయము.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. పూర్వగాధాలహరి - విక్టరీ పబ్లికేషన్స్.
2. ఆంధ్రమహాభారతం - టి.టి.డి. పబ్లికేషన్స్.
3. కుంతీమహారాణి ఉపదేశములు - భక్తి వేదాంత బుక్‌ట్రస్ట్.

❀ ❀ ❀

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రామాయణంలో మహిళల పాత్ర

- డా॥. ఆర్. అరుణాదేవి

హిందూ జాతిని తీర్చిదిద్ది ప్రపంచానికే మహత్తర సందేశాన్ని అందించిన రామాయణంలో ఉన్నది సీతాచరిత్రమే.

"కావ్యం రామాయణ కృత్స్నం - సీతాయశ్చరితం మహత్"

అని వాల్మీకి అన్నారు. (4-7)

కాబట్టి రామాయణంను సీతాచరిత్రం అనవచ్చు. రామాయణంలో మహిళలు అనగానే మనకు గుర్తుకు వచ్చే మొదటి మహిళ సీత. కథంతా ఆమె చుట్టూనే తిరిగింది.

రామాయణ కథాకాలం, ప్రాదుర్భావ కాలం కూడా ఒక్కటే. అందువల్ల ఆనాటి మహిళ ఆ యుగధర్మానికి ప్రతిబింబంగా కన్పిస్తుంది. ఈ యుగంలో ఏకపత్నీత్వ మున్నది. బహుభార్యత్వమున్నది. దశరథాదులు బహుభార్యత్వానికి ప్రతీకలుగా కన్పిస్తే, శ్రీరామాదులు ఏకపత్నీత్వానికి గుర్తులుగా చరిత్రలో నిలిచారు. మహిళలపై దౌర్జన్యాలు జరిపిన రావణాదులున్నారు. ఈ యుగంలో మహిళల్ని రక్షించిన శ్రీరాములూ ఉన్నారు. తప్పు చేసిన శూర్పణఖాదుల్ని శిక్షించక తప్పలేదు.

మహిళల్లో కొందరు తమున్నది అధర్మ పక్షంలో అయినా ధర్మానికే విజయం సిద్ధిస్తుందని ఆశించారు. అలాంటి వారిలో మండోదరి, త్రిజటను స్మరించుకోవచ్చు. వ్యక్తిగత స్వార్థాన్ని పెంచే ప్రయత్నంలో మంథర సఫలీకృతురాలైనా, అది అరణ్యంలోని ఆశ్రమాల్ని, మునుల్ని, మహాపురుషుల్ని రక్షించే విధంగా హిత కారకమైంది.

ఇలా అనేక అంశాల్ని కథాగమనంలో పొదివికొన్న కారణంగా, అపూర్వ రచనా రామణీయకత వల్ల రామాయణం శాశ్వత కాలాల పాటు నిలిచేటట్లుగా ఉంటుందని రామాయణాంతరగ్రత సాక్ష్మే తెలియ జేస్తుంది.

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చమహీతలే।
తావద్ రామాయణ కథా - లోకేషు ప్రచరిష్యతి॥
(వాల్మీకి రామాయణం బాలకాండ)

ఈ లోకంలో ఎంత వరకు కొండలు, నదీనదాలు, భూమండలం నిలిచి ఉంటుందో అంతవరకు రామాయణ కథ సజీవంగా ఉంటుంది. ఇది బ్రహ్మ వాక్కు.

మండోదరి వంటి హితైషిణి మాటలు రావణుడు విని ఉంటే, సీత మాయలేడి పై భ్రమపడకుంటే, శూర్పణఖ రామలక్ష్మణులపై మోహం పెంచుకోకుండా ఉంటే, కైక తన రెండు వరాలు దశరథుణ్ణి అడగకుండా ఉంటే.... ఇలా ఎన్నో ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలను ఆ మహిళల జీవితాల్ని పరామర్శించి తెలుసుకుందాం !

## మహితమైన దారిలో మండోదరి పాత్ర :

మండోదరి రావణాసురుని భార్య, మయాసరుడనే వారి కుమార్తె. తల్లి హేమద అనే అప్సరస. సౌందర్య వతుల్లో సౌందర్యవతి. రావణుడు సీతను లంకకు తీసుకొని రావడం ఆమెకు నచ్చలేదు. భర్త నడవడిక కారణంగా రాక్షస వంశానికే ముప్పు వచ్చేట్లు ఉన్నదని ఆమె భావించింది.

పరసతిని నీతో తీసుకురావడం తప్పు. ఇంత యుద్ధం జరిగింది. ఇంద్రజిత్తు మరణించాడు. ఇప్పటికైనా సీతను రాముడి దగ్గరకు చేర్చు. నీ తప్పు ఒప్పుకో! నీవు బ్రతుకుతావు. నీ వారలమైన మేము అందరం బ్రతుకుతాం అని వేడుకొంది.

రాముణ్ణి నీవు మానవ మాత్రుడనుకొంటున్నావు. యుద్ధ రంగంలో ఆయన ముందు దేవదానవులెవ్వరూ

నిలవరు. ఆయన ముల్లోకాలకు రక్షకుడే కాదు, ఒక్క బాణం దెబ్బతో మూడు లోకాలను భస్మం చేస్తాడు. ఆయన ధాటికి గురైన ఖరదూషణాదుల్ని గుర్తించు కోవాల్సింది. మారీచ సుబాహులైనా జ్ఞాపకం రావల్సింది. ఇప్పటికీ మించిపోయింది లేదు. రక్షిస్తాడు. సంధి సంప్రదింపులకు దిగుమంటుంది.

అయినా రావణుడు వినడు! ఆమె మాటలను పట్టించుకోకుండా పెడచెవిన పెడతాడు. భర్త చేసిన పొరపాటును భార్య సరిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. ఇది ఈ యుగధర్మం. భర్త విననీ వినకపోనీ, తన అభి ప్రాయాల్ని ప్రకటించడానికి ఈ యుగంలో ఏ మహిళ వెనుకంజ వేయలేదు. దేవతలతోనే ఊడిగం చేయించు కుంటున్న భర్త, ఎన్నో విజయలు సాధించినవాడైనా అతని అధార్మిక ప్రవర్తనను సరిచేయాలని మండోదరి నిరసిస్తూనే ఉంది.

రాముణ్ని జయించడానికి హోమం చేస్తున్న రావణా సురుని ఏకాగ్రత భంగం చేయడానికి అంగదుడు మండోదరి జుట్టుపట్టుకుని రావణుని ఎదురుగా తెస్తాడు. రావణుడు నిజంగానే హోమాన్ని వదిలిపెట్టి భార్యను రక్షించుకుంటాడు.

దుర్మార్గులైన పురుషుల కారణంగా సన్మార్గులైన వారి భార్యలు కూడా అవమానాలు పాలవుతారనడికి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుంది ఈ లోకంలో !

రాముని చేతిలో రావణుడు మరణించాడు. మండోదరి హృదయవిదారకంగా విలపిస్తుంది. ఒక్క బల హీనత కారణంగా తానూ, తన రాజ్యం, కుమారులు, బంధువర్గం సర్వం నాశనం చేసుకున్నావు కదా! అని రోదిస్తుంది. సీత కారణంగా నీ కళ్ళపై పొరలు క్రమ్ముకు పోవడం దురదృష్టం అంటుంది. విధి లిఖితం అంటుంది. చావు మూడిన వాడికి హితోక్తులు రుచించవు కదా!

## రామాయణంలో మరపురాని మహోన్నత మహిళా మూర్తి - ఊర్మిళ :

ఈ లోకానికి ఈమె నిద్ర గురించి మాత్రమే తెలుసు. ఈమె లక్ష్మణుని భార్య, జనక మహారాజు తమ్ముని కుమార్తె. సీతారాముల కళ్యాణంతో పాటు ఊర్మిళా లక్ష్మణుల వివాహం జరిగింది.

పితృవాక్య పరిపాలన నిమిత్తం రాముడు, సీత అడవికి వెళ్తున్నప్పుడు లక్ష్మణుడు వారి వెంబడి వనవాసానికి సిద్ధమయ్యాడు. ఊర్మిళ కూడా అడిగింది. కానీ లక్ష్మణుడు తాను సీతారాముల సేవార్థమే, రక్షణార్థమే ఈ నిర్ణయం తీసుకున్నానని అంటాడు. అందుకే పద్నా లుగు సంవత్సరాలు ఒక తపస్సులాగా నిద్రాయోగంలో ఉన్నది ఊర్మిళ. భర్త మాట జవదాటక పద్నాలుగు సంవత్సరాలు అయోధ్యలోనే ఉన్నది. అలా భర్తను సేవార్థం అర్పించిన, త్యాగం చేసిన ఊర్మిళ నిద్రాయోగ ముద్రితురాలయింది.

## రామాయణం - రమణుల పాత్ర :

రామ అంటే రాముడు. రామ అంటే రమణి (స్త్రీ) కూడా. రమణులు లేని రామాయణం లేదు. భారతీయ మహిళా జీవనానికి సందేశాలందించిన పాత్రలు ఎన్నో ఉన్నాయి.

సీత సాధుశీలి, సాధ్వి, ధర్మాధర్మాలు తెలిసినది. తన అభిప్రాయాన్ని ప్రకటించడంలో వెనుకంజ వేయనిది. రావణుడు భయపెట్టినా లొంగనిది. రాముడే తన పతి, రాముడే రక్షకుడన్న ఆత్మవిశ్వాసంతో జీవించింది. లోకంలో రావణునిలాంటి వారెవరైనా తనలాంటి సీతల్ని అపహరించినప్పుడు వారిని శిక్షించి లోకం నిష్కంటకం చేయాలని ఆశించింది. మట్టి నుండి పుట్టింది. స్వర్ణం లాంటి జీవిత సందేశమందించింది. చివరికి మట్టిలోనే కలసిపోయింది. అందుకే సీత పరమపునీత లోకమాత అయ్యింది.

ఇది సృష్టి చదరంగం. ఈ చదరంగంలోని పావులే స్త్రీపురుషులు. రామాయణంలోని స్త్రీలూ అంతే. ఇంకా సుమిత్ర, త్రిజట, అనసూయ, అరుంధతి, శబరి, కైక, మంథర, శూర్పణఖ, అహల్య, శృతకీర్తి, మాండవి.... ఇలా వారందరినీ గూర్చి రామాయణంలో ఆయా సందర్భాల్లో

కన్పించే వారి ప్రత్యేక వ్యక్తిత్వాలున్నాయి. ఆ వ్యక్తిత్వాలను సరిగ్గా గుర్తించాలంటే మన హృదయం తెరవాలి. వారి ఆవేదన అర్థం కావాలి. రామాయణంలోని ఏ పాత్ర విషయంలోనైనా మనం ఈ పద్ధతే అనుసరించాలి.

"సర్వే భవన్తు సుఖినః సర్వేసన్తు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యన్తు - మాకశ్చిత్ దుఃఖభాగ్భవేత్"
ఓం శాంతిః శాంతిః శాంతిః
గరుడ పురాణం (35-51)

**ఆధార గ్రంథాలు :**

1. వాల్మీకి రామాయణం
2. www.wikipedia.org
3. శ్రీరామాయణం - తెలుగు పుస్తకాలు

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ౨౦ వ దశకంలో స్త్రీవాదం - మహిళ

- డా॥. పత్తూరి శ్రీనివాసులు,
తెలుగు అధ్యాపకాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
చేబ్రోలు , గుంటూరు జిల్లా.

- డా॥. కె. బలరామ్
అతిథి అధ్యాపకాలు, తెలుగు శాఖ, ఆచార్య నాగార్జున
విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు జిల్లా.

ప్రపంచంలోని ఏ సాహిత్యంలోనైనా మొట్టమొదటి ప్రక్రియ ఏది అనే ప్రశ్న వేసుకున్నప్పుడు దాదాపు అందరూ చెప్పే మాట పాట లేక గేయం. ఎందుకంటే జానపద కథలు కన్నా కూనిరాగాలతో కూడిన పాటలను లేక గేయాలనే వారి మానసిక ఆనందానికి ఉప కరించేవిగా భావించారు, ఆచరించారు, వాటినే ప్రచారం కూడా చేశారు. ఈ దృష్టితో పరిశీలన చేసినప్పుడు తెలుగు సాహిత్యంలో కూడా పాట లేక గేయం లేక కవిత్వం మొదటి సాహితీ ప్రక్రియగా రూపుదిద్దుకుందని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యంలో ఈ కవితా ప్రక్రియ ప్రాచీన కాలం నుండి ఆదునిక కాలం వరకు ఎన్నో రూపాలు సంతరించుకొని నేటికి నానీలు, హైకూలు, రెక్కలుగా క్రమ వికాసాన్ని పొందటం గమనిస్తే కవితా ప్రక్రియ ఎంతో విస్తృత స్థానాన్ని ఆక్రమించిందిగా తెలుస్తుంది. 20వ శతాబ్దపు ఉత్తరార్థంలో ఈ కవితా ప్రక్రియ స్త్రీవాద రచయితలకు అస్త్రశస్త్రాలు పొదిగిన ఆయుధమైంది. స్త్రీ వాదులు తమ అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రకటించటానికి హక్కుల్ని, బాధ్యత లను తెలియజెప్పడానికి, అసలు సమాజంలో స్త్రీ అనే ఒక మనిషి ఉందని గుర్తించండి అని చెప్పడానికి ఈ కవితా ప్రక్రియ ఎంతగానో దోహద పడింది. ఈ దశకంలో వెలువడిన స్త్రీవాద కవితా సంకలనాలలోని స్త్రీవాద భావాలు, తత్వాలు ఇక్కడ పరిశీలించబడ్డాయి.

**కవితలు - విశ్లేషణ :**

**ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి :**

ఈ కవితలో భారత చరిత్ర లో ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకూ స్త్రీల స్థితిని, వారి దాస్యాన్ని, తిరిగబడాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది

"అందమైన దోపిడికీ
పవిత్రమైన హింసకూ
న్యాయమైన దాస్యానికీ
బలైపోయిన నేను
భారత స్త్రీని...."

భారత స్త్రీని అనటంలో తరతరాలుగా భారత స్త్రీ అణచివేతను తెలియ జేస్తూ అది ఏఏ కాలాల్లో ఎలా సాగిందో వివరిస్తూ సాగుతుంది మిగిలిన భాగం

"కొంత కాలం పవిత్రతను
కుష్ఠురోగుల ఎంగిళ్ళ కుక్కని" అనటంలో

సుమతి అనే పతివ్రత కుష్ఠురోగంతో భాధపడుతున్న భర్తను వేశ్య దగ్గరికి తీసుకెళ్ళటం, తను తినగా మిగిలిన ఆహారాన్ని తింటునప్పుడు ఊడిపోయిన భర్త చిటికిన వ్రేలు అన్నంలో వస్తే అసహ్యించుకోకుండా ఆ వ్రేలు ప్రక్కకు తీసి మిగిలిన ఆహారాన్ని తినడం వంటి పనులను పాతివ్రత్యం పేరుతో నేటి స్త్రీలకి ఆదర్శంగా చూపించి, అదే జీవితం అన్నట్లుగా ప్రాచీన గాథల్లో చిత్రించిన విషయం తెలియజేస్తుంది.

'సహగమన జ్వాలల శలభాన్ని....'

అనడంలో మధ్యయుగాల చరిత్రలో స్త్రీలకు ఎలాంటి యుద్ధ విద్యల్లో తర్ఫీదు లేకుండా చేసి, శత్రురాజులు దండెత్తినప్పుడు వాళ్ళ నుండి తమ స్త్రీలకు కాపాడు కోవటం అనే పేరుతో తమ స్త్రీలందరినీ సామూహిక సహగమనాలకు, అగ్ని ప్రవేశాలకు పురికొల్పుతూ, ఆ కార్యక్రమానికి మతరంగు పులిమి అదొక పవిత్రమైన

కార్యంగా తయారుచేసిన విషయాన్ని స్ఫురణకు తెల్తున్న కవితా పంక్తి ఇది.

"కొంత కాలం ప్రబంధ కన్యకి
స్తనాల బరువు చచ్చిన శవాన్ని"

ప్రబంధ కవుల రచనలన్నీ స్త్రీల అంగాంగాలను వర్ణిస్తూ, శృంగారం రసరాజమంటూ ప్రపంచంలో శృంగారం తప్ప రెండో (ఆశ) అంశంమేది లేదన్నట్టుగా తయారైన పరిస్థితిని తెలియజేస్తున్న

'పుట్టు వితంతువువి
మొగుడు చచ్చినముండ
ఎవరి కోసం జీవిస్తున్నానో
తెలియని వెర్రితల్లిని....' ప్రాచీన సమాజంలో స్త్రీల బ్రతుకును అర్థం లేకుండా తయారు చేసిన ఇంకొక వ్యవస్థ వితంతువు వ్యవస్థ. స్త్రీ అస్తిత్వాన్ని పూర్తిగా లేకుండా చేసి, వారిని పూర్తిగా గృహ బానిసను చేసిన వ్యవస్థ. ఇదంతా ప్రాచీన, మధ్య యుగాలనాటి స్త్రీ బానిస స్థితి అయితే, ఆధునిక కాలంలో అన్నీ శాస్త్ర, సాంకేతికత విజ్ఞానాలు పెరిగాయి, సౌకర్యాలు పెరిగాయి అను కుంటున్న కాలంలో కూడా స్త్రీల పరిస్థితిలో మార్పేమీ లేదని చెప్తున్న కవితా పంక్తులివి.

"భర్తల హూదాల అధికారాల కార్లకు బార్లకు బందీని
ధనిక వర్గపుదరిద్రాన్ని"

అంటూ ధనిక భర్తలకు భార్యలుగా తప్ప మనిషిగా తనకంటూ స్వంత అస్తిత్వం లేకుండా పోయిన ధనిక వర్గ స్త్రీల స్థితిని,

"తినటం పిల్లల్ని కనటం తప
మరేమి పట్టని
మర చక్రాన్ని ....' అంటూ మధ్య తరగతి మహిళ గానుగెద్దు జీవితాన్ని తెలియజేయటం ఒక ఎత్తైతే పేద మహిళ దీనస్థితిని, రెండు రకాలుగా దోపిడీకి గురయ్యే స్థితిని, పేద, తల్లి స్థితికి కారణమైన ఆర్థిక దోపిడీని, పితృస్వామ్య భావజాలాన్ని కవిత్వీకరిస్తూ భవిష్యత్ స్త్రీ ఎలా ఉండాలో సూచిస్తుంది రచయిత్రి.

"ఇలా శ్రమచేస్తున్న శ్రామిక మహిళను
ఏపుగా పెరిగినా పైరును
నిండు యవ్వనం లేని నన్ను
ఒక కంటితో కామందు చూచినప్పుడు
గుండె పగిలేలా ఏడిస్తే
ఆ కన్నీళ్ళు ఈ భూమినే తడిపాయి."

గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా భూకమందులు కామంతో శ్రామిక మహిళలను లైంగికంగా దోపిడీ చేసే స్థితి, ఆ మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పుకోలేక నిస్సహాయంగా వారికి లంగిపోయి, వారి పొల్లాల్లోనే పనిచేస్తూ జీవనాధరం కోల్పోయే స్థితికి భయపడటాన్ని తెలియజేస్తూ అనటంలో శ్రామిక మహిళల కష్టంలో కామందు ప్రతీసారీ బంగారాన్నే పండించినప్పటికీ, వారి శ్రమకు తగిన ప్రతిఫలం వారికివ్వకుండా రోజురోజుకీ తను ఇంకా పెద్ద భూస్వామిగా మారుతూ తమ శ్రమను దోపిడీ చేస్తున్న వైనాన్ని, తద్వారా తమకు ఆకలే తప్ప పొట్ట నిండే పరిస్థితి లేకపోవడాన్ని వివరిస్తుంది కవిత. ఇది ఓల్గా గారు మార్క్సిస్ట్ దృక్పథంతో వ్రాసిన కవిత. 70వ దశకంలోని ఈ కవిత్వంలో నాటి తెలంగాణ, శ్రీ కాకుళ సాయుధ పోరాటాల ప్రభావం, కమూనిస్ట్ సిద్ధాంతాల ప్రభావాలు, 'ఆకాశంలో సగం మహిళలు' అనే మావో పిలుపు, వీటన్నింటి ప్రభావం కన్పిస్తుంది ఇంటిచాకరీ గురించి స్త్రీవాద అధ్యయనం తర్వాత ఆలోచనల్లో వచ్చిన మార్పు గురించి చెప్తున్న కవిత 'గృహమేకదా స్వర్గసీమ'. ఇది వసంత కన్నభిరన్ రాసిన కవిత. సంప్రదాయక ఆలోచనల్లోని 'గృహమే కదా స్వర్గసీమ'. 'ఆడ బ్రతుకే మధురం'అనే పదబంధాలు జాతీయాలుగా మారిపోయి అదే స్త్రీ జీవితానికి పరమార్థం' అని జీవిస్తున్న స్త్రీల హృదయం మొదటి భాగ్‌లో వివరిస్తున్నది.

"తళతళలాడే సింకులలో
మిలమిలలాడే బండలలో
తెల్లగా తోమిన గిన్నెలలో

నున్నగా తుడిచిన గచ్చులో
శుభ్రంగా స్నానమాడిస్తే
సువాసనలీనే పాపాయిలో
నా హృదయం
మెరిసిపోతూ మురిసిపోయింది......" స్త్రీల స్థితిగతుల గురించి అవగాహన పెరిగాక

"నా ఆత్మ మీద పేరుకున్న గడ్డ గట్టిన
ఉమ్మి చెత్త బురదల కుప్పను
సములంగా తగలబెట్టాలి..."

ఆనటంలో స్త్రీల మనస్సులలో నిండిపోయిన పితృస్వామ్య భానజాలం ఏర్పరచిన మాయలు, భ్రమలు ఏవైతే ఉన్నాయో అవన్నీ మనసులోంచి సమూలంగా పెకలించి వేయాలి అనేవిషయం అర్థం చేసుకొని తను మారటమే కాక తన స్థితికి కారణమైన పురుషుని స్వార్థాన్ని కూడా తీసివేయాలని హెచ్చరిస్తుంది అప్పుడే స్త్రీ పురుషుల సమానత్వం సాధ్యమౌతుందన్న భావన ఈ కవిత లో కనిపిస్తుంది.

"పొరపాట్న కూడా మన కళ్ళు కలుసుకోవు
వేళ్ళు పెనవేసుకోవు
నీ పాదాలు చెప్పుల్లోనే ఉంటాయి
నా పరిసరాలు వీడ్కోలు గొడుగు పడతాయి"

ఉన్న కొద్ది సమయం సంతోషంగా గడపకుండానే సెలవు ముగియడంతో ప్రయాణానికి అతను సిద్ధమైతే, వీడ్కోలులివ్వడానికి ఆవిడ సిద్ధమవటం ఆధునిక ఉద్యోగ జీవన విధానం భార్యాభర్తల మధ్య తప్పనిసరి అడ్డుగోడను కట్టి ప్రేమ రాహిత్యాన్ని పెంచుతున్న వైనాన్ని కళ్లకు కట్టించారు కొండేపూడి నిర్మల గారు. ముల్లు, 70వ దశకంలోనే వచ్చిన నిర్మల గారి పతాక వంటి కవితలు కూడా దాంపత్యబంధంలోని ప్రేమ రాహిత్యాన్ని తెలియ జేసేవే.

### ముగింపు :

తరతరాల నుండి ఎన్నో అవమానాలు, అణచివేతలు, ఆందోళనలు భరించిన స్త్రీల మనోవేదనకు ప్రతిరూపం స్త్రీవాదం. వారి అవమానాలకు, అణచివేతలకు కారణం పితృస్వామ్యం అని గ్రహించిన స్త్రీలు, ఆభావనను ఎదుర్కోవడం కోసం తమ కలాలకు పదునుపెట్టిన ఫలితమే స్త్రీవాద సాహిత్యం .కేవలం కవిత్వంలోనే గాక కథ, నవల వంటి ప్రక్రియలు కూడా మహిళల మనో వేదనను ప్రతిఫలించాయి.

### ఆధార గ్రంథాలు :

1. నీలి మేఘాలు సంకలనం - ఓల్గా
2. కొండేపూడి నిర్మల కవిత్వం - కె. నిర్మల
3. స్త్రీవాద వివాదాలు - డా॥ S. V. సత్యనారాయణ

# ఐతిహాసిక నారీమణుల మాతృ సందేశం

- వడ్డాది బాలగాయుత్రీ, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వ కళా పరిషత్, ఆంధ్రప్రదేశ్.

**సంక్షిప్త పరిచయం (Abstract) :**

సంస్కృత సాహిత్యం మాతృక అయిన కూడా ఈ తెలుగు జాతి అస్తిత్వాన్ని నిలబెడుతూ ఆంధ్ర భాషా సంస్కృతులను సుసంపన్నం చేసిన ఎందరో కవులు, రచయితలు నాటి నుండి నేటి వరకు ఉన్నారు. వారు తమ రచనలలో స్త్రీలలో వివిధ కోణాలను స్పృశించారు. గృహిణిగా, ఆలిగా, జాయగా, శక్తి స్వరూపిణిగా మహిళ ప్రతిఘటనల మధ్య కూడా తనకు తాను నిరూపించు కుంటూ ఉన్నది. ప్రాచీనం నుండి ఆధునిక సాహిత్యం వరకు ప్రస్ఫుటంగాను, అంతర్లీనంగాను ఎన్నో స్త్రీ పాత్రలు పాఠకుల మనసులను, సమాజాన్ని ప్రభావితం చేస్తూ ఆదర్శవంతులుగా నిలిచారు. వారిలో నారీ రత్నాలు అయిన కుంతీ, సుమిత్ర, ద్రౌపది, జిజియాబాయి, వంటివారెందరో తమ పుత్రులను, పరస్త్రీలను మాతృ భావనతో చూసే విధంగా పెంచారు. వారు నేటి వనిత లకు ఎంతో ఆదర్శం.

**ముఖ్యాంశాలు (Key Words) :**

సహనశీలి కుంతీ, సహృదయ మాత సుమిత్ర, క్షమాశీల ద్రౌపది, వాత్సల్యమూర్తి యశోద, రాజమాత జిజియాబాయి నిగమశర్మ అక్క.

**ఉపోద్ఘాతం :**

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" కన్నతల్లి, మాతృభూమి స్వర్గం కంటే మిన్న అని అన్నాడు రాముడు (శ్రీమద్రామాయణం - యుద్ధకాండ). ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పటిష్టమైన విలువలు గల కుటుంబం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంటుంది. అట్టి కుటుంబాన్ని పట్టి ఉంచి గృహాన్ని స్వర్గసీమగా చేయగలిగే సామర్థ్యం అతివల సొంతం. స్త్రీలకు మనోధైర్యం కూడా ఎక్కువగా ఉంటుందని మనో విశ్లేషకులు కూడా చెబుతున్నారు. వారిలో కుంతీ ప్రథమురాలు.

**సహనశీలి కుంతి :**

కురువంశ పాండురాజుకు ధర్మపత్ని, మాద్రికి సపత్ని. తన పుత్రులను ధర్మ, భీమ, అర్జునులతోపాటుగా మాద్రి పుత్రులైన నకుల, సహదేవులను కూడా తన కన్నబిడ్డలు వలె సాకిన మాతృమూర్తి. ఆమె సహనం, క్షమాగుణం, సేవాతత్పరత, ఓర్పు, దైవభక్తి మొదలగు గుణాలు ఏ కోణం నుంచి చూసినా అబ్బురమనిపించక మానదు. సంస్కృత మూలాన్ని పరిశీలించినా, కవిత్రయం అనువాదం చదివినా కుంతీదేవి పడిన కష్టాలు మరెవరూ పడలేదనిపిస్తుంది. చిన్నతనంలోనే భర్త మరణం, తన ఇంటిలోనే పరాయిగా బ్రతకవలసి రావడం, తన ఎదుటే తన పిల్లలపై హత్యా ప్రయత్నం, వారికి అరణ్యవాసం, ఆపై కోడలికి అవమానం, ఆపై యుద్ధం ఇన్ని జరిగినా కూడా తట్టుకొని నిలబడింది. యుద్ధం తరువాత ధర్మరాజుకు రాజ్యాభిషేకం జరిగిన తరువాత కూడా రాజ్యంలో ఉండక గాంధారీ, దృష్టరాష్ట్రుల సేవ కోసం వారితోపాటే అరణ్యవాసానికి వెళ్లింది. తన పుత్రులను ధర్మపరాయణులుగా, శూరులుగా, వీరులుగా, సత్య వంతులుగా, శాస్త్ర విశారదులుగా ఎప్పటికప్పుడు వారిని తీర్చిదిద్దింది. కన్యగా తాను చేసిన తొందరపాటుకు జీవితాంతం పశ్చాత్తాపంతో మధన పడింది.

ఈనాటి తరానికి సందేశం కుంతీ రెండు విధాలుగా చాటింది. ఒకటి వయస్సులో తెలియక చిత్తచాంచల్యానికి గురై అనాలోచితంగా చేసే పని వల్ల భవిష్యత్తులో జరగబోయే విపరీత పరిమాణాలు గ్రహించలేకపోవడం, రెండవది గృహస్థాశ్రమంలో ఒడిదుడుకులను తట్టుకొని పిల్లలను ప్రజా ప్రయోజకులుగా తీర్చిదిద్దగలగడం. నేటి

సమాజంలో వ్యక్తుల అనాలోచిత నిర్ణయాల వల్ల కుటుంబ విచ్ఛత్తిని మనం గమనిస్తూనే ఉన్నాం. అతివలుకు ఆత్మస్థైర్యం పెంపొందించే మహాభారతం చదవదగినది.

### క్షమాశీల మాతా ద్రౌపది :

కురువంశ పంచ పాండవులకు ఉల్లాలు, ఉప పాండవులకు తల్లి. ఈమె ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న ధైర్యశాలి. కురుక్షేత్ర యుద్ధం అంతా అయ్యాక అశ్వద్ధామ ఉప పాండవులను చంపుతాడు. తరువాత అర్జునుడు అతనిని పట్టి తెచ్చి ద్రౌపది ముందు నిలబెడ తాడు. అతనిని సంహరిస్తానంటాడు. కానీ అప్పుడు ద్రౌపది చూపిన క్షమా గుణానికి ఆ హిమాలయ పర్వతం కూడా కరగవలసినదే. తనకు కలిగిన గర్భశోకం అశ్వద్ధామ తల్లి కృపికి కలగకూడదని కోరుకుంటుంది. అశ్వద్ధామను క్షమించి పంపివేస్తుంది.

తనపట్ల ఏమాత్రం చిన్న పొరపాటు జరిగినా తనవారికి కూడా హాని కలిగించడానికి వెనకాముందు ఆలోచించని స్థిమితం తప్పిన మనుషులున్న నేటి సమాజంలో ద్రౌపది క్షమాగుణాన్ని గూర్చి తెలుసుకోవాలి.

### వాత్సల్యమూర్తి యశోద :

పరాయి బిడ్డను తన బిడ్డగా భావించి వాత్సల్యం పంచి పెంచిన యశోద గురించి లోకవిధితమే. నిజం తెలిసినా కూడా మాతృ భావనను నిలుపుకున్న వ్యక్తి. ఈమె వల్లే బహుశ: "కన్నతల్లి కంటే పెంచిన తల్లి గొప్పది" అన్న లోకోక్తి స్థిరపడినట్లుంది.

### సహృదయ మాత సుమిత్ర :

దశరథుని పట్టపు రాణులలో ఒకరు. ఈమె వినయ శీలి, బుద్ధిమతి, అనసూయ. ఈమె కుమారుడు లక్ష్మ ణుడు. కైకేయి వరాలు వల్ల శ్రీరాముడు అరణ్యవాసానికి వెళ్లవలసి వచ్చినప్పుడు శ్రీరామునితో కూడా లక్ష్మణుని అడవికి పంపుతుంది సుమిత్ర.

"రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం
అయోధ్యా మటవిం విద్ధి గచ్ఛ తాత యథా సుఖం"
(శ్రీమద్రామాయణం అయోధ్యకాండ 40-9)

"రాముడుని దశరథుడు అనుకో, సీతను నన్నుకో, అడవినే అయోధ్య అనుకో, సుఖంగా వెళ్లిరా నాయనా" అన్న సుమిత్ర పాత్ర నేటి మహిళకు ఆదర్శనీయం. సవతి బిడ్డతో నా బిడ్డ ఎందుకు వెళ్లాలి అని అనుకోలేదు ఆమె. తన బిడ్డకు సోదరులతో మెలిగే తీరును నేర్పించింది. వదినను తల్లిగా కొలిచే మనస్తత్వాన్ని నేర్పించింది. అందుకే లక్ష్మణుడు కిష్కింధకాండలో సీత ఆభరణాలను రాముడు పోల్చమన్నప్పుడు పాదాలకు ఉన్న నూపురములు మాత్రమే నాకు తెలుసని అన్నాడు. (నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్).

నేటి తల్లులు సుమిత్ర నుండి ఈ విషయాన్ని నేర్చుకొని పిల్లలకు నేర్పవలసిన అవసరం ఉన్నది. మొల్ల రామాయణం, భాస్కర రంగనాథ రామాయణాలు, రామాయణ కల్పవృక్షం వంటివి ఎందరో రచించారు. నేటికీ మరెందరో రచించి తరిస్తున్నారు.

### నిగమశర్మ అక్క :

పాండురంగ మాహాత్మ్యంలో ఈమె నిగమశర్మ అక్క గానే ప్రసిద్ధి. నామక: అక్క అయినా కూడా ఈమె మాత వలె తన సోదరుని తప్పులు సరి చేయడానికి ప్రయత్నిం చింది. తమ్ముడు పట్ల ఈమె చూపిన మాతృ ప్రేమ నేటి సోదరీ సహోదరులకు ఆదర్శం.

### రాజమాత జిజియాబాయి :

చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఉజ్జ్వల తేజం శివాజీ. అతని తల్లి జిజియాబాయి. తన కుమారునికి ఉగ్గుపాలతో శౌర్యపరాక్రమాలను నేర్పిన వీరమాతగా ఆమె ప్రసిద్ధి. పరస్త్రీలను తల్లులుగా భావించి ఉదాత్త భావనలు తన స్వభావంగా కలిగి భారతీయ సంస్కృతిని తన జీవనశైలితో మిళితం చేసుకొని హిందూ రాష్ట్ర నిర్మాతగా, ఈదేశ జాతికే పితృ స్థానాన్ని పొందగలిగే

మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా చత్రపతి శివాజీని మలచింది జిజియాబాయి. కుమారుడిని తీర్చిదిద్దడంలో ఆ తల్లి స్థానం మరువలేనిది. నేటి సమాజంలో ప్రతీమాత ఒక జిజియాబాయి కావాలి.

**ఉపసంహారం (End - Notes) :**

శ్రీ తిరుమల రామంద్రుడు తన స్వీయ చరిత్ర అయిన 'హంపీ నుండి హరప్పా వరకు' రచనలో తన తల్లి చేసిన బోధను వివరిస్తారు. తన మనో వికారాలను గుర్తించి సున్నితంగా సవరించిన తల్లి నేర్పును ప్రస్తావిస్తారు. అలాగే అందరూ తప్పనిసరిగా చదవవలసిన నవలలో ఒకటైన వేయి పడగలులో స్త్రీల ఔనత్యాన్ని, ఔదర్యాన్ని విశ్వనాథ సత్యన్నారాయణ వారు చక్కగా ఉన్నతంగా చూపించారు.

పైవిధంగా చెప్పుకుంటూ వెళితే ఎంతోమంది మాతృమూర్తులు, స్త్రీమూర్తులు ఆంధ్ర సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. ఉదాత్త భావనలు గల సాహిత్యాన్ని చదవడం వల్ల మనో వికృతులు తగ్గి సరియైన మార్గాన్ని ఎంచుకొనే విచిక్షణా జ్ఞానాన్ని మానవులు పొందగలుగుతారు. రామాయణం, భారత, భాగవతాలలో ఉన్నవి కథలు మాత్రమే కావు, అవి వ్యక్తిత్వ నిర్మాణ ఘనులు. వాటిలో ప్రతీపాత్ర నుండి నేటి మానవులు చేయవలసిన పనులు, అలాగే చేయకూడని పనులు, అలాగే అసలు ఆలోచనకైనా రాని విషయాలు తెలుసుకోగలుగుతారు. ప్రాచీన, మధ్య, ఆధునిక ఆంధ్ర సాహిత్యాలలో ఎందరో కవులు, రచయితలు సమాజంలోని రుగ్మతలను రూపు మాపడానికి నాటినుండి నేటివరకు తమవంతు కృషిని చేస్తూనే ఉన్నారు.

**ఆధార గ్రంథాలు (References) :**

1. శ్రీమద్రామాయణం - వాల్మీకి - సంస్కృత మూలం - బాలానందినీ వ్యాఖ్య - ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు - ఆర్ష విజ్ఞాన ట్రస్ట్ - హైదరాబాద్ -1990.
2. మహా భారతం - విశ్వ ప్రసాద్, కిరణ్ కుమారి, నారాయణ రెడ్డి - జె.పి. పబ్లికేషన్స్ - విజయవాడ - 2006.
3. సంస్కృత మహాభారతం - వ్యాసుడు.
4. శ్రీ శివ భారతం - డా॥ శ్రీ గడియారం వేంకట శేష శాస్త్రి - తృతీయాశ్వాసం - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ - తెలుగు దివ్వెలు - 2017.
5. పాండురంగ మాహాత్మ్యం - తెనాలి రామకృష్ణుడు.
6. హంపీ నుండి హరప్పా వరకు - ఆచార్య తిరుమల రామచంద్రుడు.
7. వేయి పడగలు - సమ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కవయిత్రి షాజహాన కవిత్వం - ముస్లిం మహిళల వేదన

- **బసవరాజప్ప** , అధ్యాపకుడు, నలంద ఉపాధ్యాయవిద్యా శిక్షణ కళాశాల, మహబూబ్ నగర్, తెలంగాణ.

తెలుగు సాహిత్యం క్రీ.శ.11వ శతాబ్దిలోనే ప్రారంభమైనప్పటికీ స్త్రీల గొంతు వినబడడం క్రీ.శ.20వ శాతాబ్ది లోనే ప్రారంభమైంది. 15వ శాతాబ్ధిలో తాళ్ళాపాక తిమ్మక్క నుంచి 19వ శాతాబ్ధిలో తరిగొండ వెంగమాంబ వరకు కొందరు కవయిత్రులు కనిపిస్తారు. మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని వంటివారు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్నారు.

కులం, మతం, వర్గం, జాతులు, ప్రాంతాలు అని భేదం లేకుండా స్త్రీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా, లైంగికంగా, కుటుంబ పరంగా పురుషాధిపత్యం చేతిలో అణచివేయబడుతున్నారు. సమాజంలో మిగతా వర్గం స్త్రీల కన్నా ముస్లిం స్త్రీలపై ఎక్కువగా మత ఆచారలు, ప్రితృసామ్య వ్యవస్థ ద్వారా, పురుషాధిపత్యం ద్వారా విధించిన ఆచారలు, ఆంక్షాలవల్ల వారు అణిచివేతకు, నిర్భంధానికి గురువుతున్నారు అని కవయిత్రి తన ఆవేదనను వెల్లడించడం. మిగత సమాజం కన్న మిగత మతం కన్న ముస్లిం సమాజంలో ఇస్లాం మతంలో స్త్రీల పరిస్థితి భిన్నమైనది అని కవయిత్రి షాజహాన భావన.

**కవయిత్రి ఖమ్మం జిల్లా తెలంగాణా రాష్ట్రం :**

తెలుగు కవిత్వంలో షాజహానా ఒక సంచలన కెరటం. ముస్లిం మహిళ జీవితాల్ని, అంతర్జాతీయ కీర్తిని అందుకునేటట్లు చేసిన తొలి తెలుగు కవయిత్రి షాజాహన.

2005లో నఖాబ్ ముస్లిం స్త్రీ కవిత్వంగా ఆమె కవిత్వం వెలువడినప్పటి నుంచి ఆమె ప్రస్తావన లేకుండా సమకాలీన కవిత్వం లేదు. స్కైబాబ తో కలిసి అలావా ముస్లిం సంస్కృతి కవిత్వం సంపాదకత్వం వహించారు. తిరిగి 2009లో స్కైబాబతో చంద్ తార మినీ కవిత్వం వెలువరించారు. 2012లో దర్దీ కవిత్వం సంపుటి ప్రచురించారు. ఎన్నో వ్యాసాలు, కథలు రాశారు. డాక్టరేటు పట్టా అందుకున్నారు. బహుభాషావేత్తా, కవయిత్రి షాజాహనా.

ముస్లిం సంప్రదాయం అంటేనే బురఖా, నఖాబ్, గుర్తొస్తాయి. అవి బాహ్యరూపాలు, వాటి అంతర్గత లోగుట్టును కూడా విప్పిన కవయిత్రి షాజహన. తల్లి తండ్రులు, భర్త, మతం తో ముస్లిం స్త్రీలకు సంకెళ్లువేసి తనను కేవలం వస్తువుగా చేయడానికి కారణం బురఖానే అని స్పష్టమైన అవగాహనతో చెప్పుతున్నారు.

మతం ఏదైనా సరే, స్త్రీల స్వేచ్ఛకు సంకెళ్ళు వేస్తున్నారు, ఆ మతం పేరు చెప్పి పురుషసమాజం స్త్రీని తన చెప్పుచేతులలో ఉంచుకొని, తన అవసరాలను తీర్చుకుంటున్నారు. ఆలోచనలను పంచుకోవడానికే కాదు, నవ్వడానికి, ఏడ్వడానికి కూడా ముస్లిం స్త్రీలకు స్వేచ్ఛ లేదు. మత సంప్రదాయల పేర అణచివేతకు గురువుతున్న విషయన్ని షాజహనా చిన్ననాటి నుంచి చూస్తూ, ఆమె సంకెళ్ళు తెంచుకోవడానికి అవసరమైన తిరుగుబాటు తన మనస్తత్వాన్ని పంచుకుంటూ వచ్చింది. అనంతమైన ముస్లిం దుఃఖమంతా షాజహన కవిత్వంలో కనిపిస్తుంది. తన కవిత్వం లో కొట్టంలో పశువులు, ఫారంలో కోళ్ళును, కట్టిపడేసిననట్లుగా, ముస్లిం మహిళ బతుకులను కూడా అంతే అని ముస్లిం స్త్రీల బతుకు వేదనను, హింసను కవిత్వంగా మలిచిన తొలి ముస్లిం తెలుగు కవయిత్రి షాజాహనా.

వెర్రి ఆచారాలు మర్రివృక్షలున్నచోట
ఒక్కసారి ముసుగు తీసిచూడు
లోపలి స్వేచ్ఛ వెలుతురు పరిమళాన్నంతగా. వెదజల్లి
వెలుగుతున్న ఆడవాళ్ళను చూడు.

పరదాల వెనుక ముసుకపొయిన ముస్లిం స్త్రీల

గొంతుకలకు ప్రతినిధిగా షాజాహనా తీవ్ర స్వరంతో విరుచుకపడింది, వారి తరుపున పోరటానికి నడుము కట్టింది.. మగవాడి ఆధిపత్యం నుండి ముచ్చట కోసం, విలాసాల కోసం స్త్రీల బలిదానాలు రివాజుగా మారాలి. త్యాగల పేరుతో స్త్రీలు ఇలా ఎంతకాలం అణచివేతకు గురికావాలి అంటూ...

నిజంగా నిఖా కుట్రే
షాధీ అయిన నాటినుండి
నేను అతని హవాలా అయిన
నాటి నుండి ఆకాశమంత నవ్వుని కత్తారించి,
చిరునవ్వుగా మార్చాడు.
నా మాట నా నవ్వు
అన్ని నిషేధాలైపోయయి

అంటూ...

ఏ అర్థరాత్రో అతని కామం లాకులెత్తినపుడు
నేను నవరస నాయికనై ప్రవహించాలి,
కదలని అతని కాలం ఓడకినేనో తెరచాప!

పరదాల వెనుక ఇంత బాధవుందన్న విషయాన్ని షాజాహనా ముక్కుసూటిగా చెప్పిన తీరు.... అదేవిధంగా పరదాల గురించి...

బురాఖ వేసుకున్నపుడు
ప్రపంచం నల్లగ అవుపించేది
బురాఖలను చీల్చేసి శారీరాల్తో
సహ తగలబెడ్తున్నప్పుడు
బిత్తరపోయిన ప్రాణాలకు,
ఒక్కసారిగా ఈ దునియ మొత్తం నల్లగా....
ఎండిన రక్తం ముద్దలా,
ఇప్పుడు బురఖా వేసినా వేయకున్నా ప్రపంచమంటే
కాషాయశిల కత్తిమొన
పోడుచుకొచ్చిన పురుషాంగం
ఇంత క్రూరత్వం దాగుంటుందనే గదా,
మమ్మల్ని బైటికి రానివ్వడం లేదంటున్నారు....

ఈ భాయానక నిజం స్వప్నమైతే,
కళ్ళు బూసుల్ని దులుపుకున్నట్లు తుడిచేసేవి
ఇంతింతగా మోసపోవడం అబద్ధమైతే ఖూషిలో
మునిగితేలేవి మనుషులు
కానీ నిజం నిప్పై కల్చింది
నీరై ముంచింది
కాషాయమై
దింపుడు గళ్ళెం లేకుండా చేసింది.

రేగుముల్లుతో ముక్కు కుట్టుకున్న,
కళ్లవెంట పటపటమని జారిన బాల్యం,
రేగుముల్లులో పేదరికపు దుఃఖపు పదును నిక్షిప్తమై
ఉంది.

బాల్యానికి అశ్రువులతో అభేదం చెప్పడం గమనించ దగినది. ఈమె తన కవిత్వ వస్తుజాలాన్ని వ్యంగ్యంగా వైభావాత్మకంగా వ్యక్తికరణరీతిని స్పష్టం చేసింది.

తెలుగులో అస్తిత్వ ఉద్యమాలు వచ్చాక సమాజాన్ని భిన్నకోణాల నుండి అంశాత్మాకంగా పరిశీలించే అవకాశం కలిగింది. ఖౌసెఖిజా అనే కవిత ద్వారా తన కల్మషం లేని భావజాలంతో ఈవిధంగా అంటుంది కవయిత్రి -

ఎవరితోనో లేచిపొయ్యి
ఎక్కడ మత కాలుష్యాన్ని చేస్తానేగా,
గోషాల చెరసాలలు
జీవితం ప్రవహించినంతమేరా
సీసాముక్కలు పేర్చిన ఆనకట్లులు,
కొట్టాల్లో పశువులు
ఫారాల్లో కోళ్లు
చీకటి కొట్లలో మేము
చదువు లేదు ఏ ఇచ్చా ఉండకూడదు,
ఎడ్ల మూతికి బుట్టలాగా
గాలి పీల్చే స్వేచ్ఛ కూడా లేకుండా నఖాబ్‌లు
ముప్పై సార్లు తలాఖ్ లు చెప్పి,
నువ్వైతే ముప్పై మూడుసార్లు నిఖా పేరు మీద,

నిఖార్సయిన వ్యభిచారం బహిరంగంగా చేయ్యొచ్చు
దయామయుడైన అల్లా ఏ ఆంక్షలు విధించడు
నేను మాత్రం కలుగులో ఎలుకలా,
చీకటి మహల్ లో ఒంటరి దయ్యాన్నే....... అంటూ

ముస్లిం స్త్రీల జీవితంలో పరదా కన్నీళ్లనీ, ప్రాథమిక జీవన సత్యాలనీ, ప్రత్యక్ష వాస్తవికతనీ వెతుక్కునే స్థితి ప్రస్తుత దశలో బలంగా కనిపిస్తుంది. విన్న కథల్లోంచి కాకుండా కన్న నిజాల్లోంచి కవిత్వ వస్తువుని తీసుకుంటూ పూర్తిగా తనదైన గొంతుకతో తన భావాల్ని నిస్సంకోచంగా వ్యక్తం చేసింది కవయిత్రి.

షాజాహనా కవిత్వం సుస్పష్టంగా ముస్లిం స్త్రీల వైపు నిలబడింది. స్త్రీవాద భూమికను కూడా అర్థం చేసుకోవాలి. చమ్కీ అబ్ నార్మల్ పెయిన్ జమానత్ దేశాంతర దుఃఖం మొదలైన ముస్లిం స్త్రీ జీవితాన్ని మోసాయి. ఒకవైపు పేదరికం, మరోకవైపు మూఢత్వం చేసే పెత్తనం, ఈ రెండింటి మధ్య బోమ్మల్లా మరిపోయిన స్త్రీల గురించి మున్వీరున్నీసా రాసిన గుడియా కవిత్వం గొప్ప నిదర్శనం.

భారతదేశంలో ముస్లిం స్త్రీలు అణిచివేతకు, దాడికి గురివుతున్నారు. స్త్రీలు వంటింటికే పరిమితమై, బానిస బతుకులు బతుకుతు మనోవేదనకు గురి అవుతున్నారు అని షాజాహనా ఇలా తన కవిత్వంలో...

ఊహ తెలియని వయసు లో
గుమ్మనికి పరదా కడితే
రంగు రంగుల కుచ్చులు చూసి మురిసి పోయినదాన్ని,
గుమ్మానికి కట్టినట్టే
ముఖానికి నఖాబ్ కడితే
స్వప్నం లాంటి జిందగీకి శాపమని అప్పట్లో తెలియనిదాన్ని.
ఎవరెస్టు లేంటి? చంద్రున్ని సైతం తాకొస్తున్న స్త్రీలను
చూస్తు,ఈతరం స్త్రీలను చూస్తు
ఇంకా ఇంకా మౌనంగా ఉండడం నా వల్ల కాదు -

అంటుంది కవయిత్రి.

షాజాహనా రచించిన పర్దా హటాకే దేఖో అనే కవిత, ప్రపంచంలో ఏ మతాన్ని గమనించిన స్త్రీలదగ్గరకొచ్చే సరికి పురుషధిపత్యాం వివిధ ఆంక్షలు విధించి కట్టడి చేస్తున్నారు అని. భారతీయ సమాజంలో దళిత స్త్రీల కన్నా, హిందు స్త్రీల కన్నా ముస్లిం స్త్రీలు మరింత వెనుకబడి ఉన్నారు. దీనికి ప్రధానకారణం, ప్రత్యక్షంగా మత పెద్దలు విధించిన కట్టుబాట్లు ఆయితే, పరోక్షంగా పురుషాధిపత్యం విధించిన షరతులు. ముస్లిం స్త్రీల అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తున్నారు.

విమానంలో ప్రయాణించే సమయంలో ఏవరికైన వచ్చే ఊహలు ఎలా ఉంటాయి... కాని కవయిత్రి మాత్రం విమానంలో బయట అకాల వర్షలకు, గాలికి, క్రింద పగిలిన పత్తి కాయలు కుప్పలు కుప్పలు, మరియు దూది గురించి రైతు పడే బాధ, రైతు కోల్పోయిన వాటి విషయాల గురించి భిన్నమైన ఆలోచనలు చేస్తు, తన నేలతల్లి పరిమళపు శ్వాసను తన నోటికి ఇంత ముద్ద నందిస్తున్న రైతు విషాదాన్ని గురించి కవయిత్రి ఆవేదన వెల్లడి చేయడమే ఇతర కవుల కన్న భిన్నమైనది అని చెప్పవచ్చు. ఆదేవిధంగా పోషకాహారం లేని వాళ్ళ గురించి, నిద్రలేనివాళ్ళ గురించి కావచ్చు కవయిత్రి తన కవిత్వంలో తన భావజాలాన్ని తెలుపుతుంది.

1500 సంవత్సరాలకు పూర్వం అరేబియా దేశంలో స్త్రీకి గౌరవప్రదమైన స్థానం లేదు. స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న అనేక విపరిణామాల కారణంగా కుటుంబ జీవితంలోకి వరకట్నం ప్రవేశించింది. దురాచారం వేళ్లూనుకుంటున్న దేశంలోనే స్త్రీవిద్య, ఉద్యోగాల ప్రాధాన్యతని, సమాజం గుర్తించటం ప్రారంభమైంది. స్త్రీల మనోభావలను అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి స్త్రీవాద దృక్పథం నుంచి రచనలు వెలువడ్డాయి.

ముస్లిం సాహిత్యం రాస్తున్న కొద్దిమందిలో స్త్రీవాద దృక్పథంతో రాస్తున్నవారు చాలా తక్కువ మంది ఉన్నారు. వారిలోను షాజాహన శక్తివంతంగా రాసే కవయిత్రిగా

నిలుస్తున్నారు. ముస్లిం సమస్యలు మరిన్ని బయటకి రావాలంటే ముస్లిం మహిళామణులు తమ మనోవేదనను వివిధ ప్రక్రియలలో తెలియజేసి, సమసమాజ నిర్మాణానికి, మహిళల అభివృదికి తోడ్పడాలి అని కోరుతు.....

**ఆధార గ్రంథం :**

1. షాజహాన కవిత సంపుటి - నఖాబ్

మార్చి 2022

అంతర్జాల జాతీయ సదస్సు
3 - 4 ఫిబ్రవరి 2022

భావవీణ ప్రత్యేక సంచిక

# తెలుగు సాహిత్యం - మహిళ






## ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)
చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఇండియా.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కోవూరు

స్టవ్ బీడి కాలనీ, పెద్దపడుగుపాడు, కోవూరు టౌన్,
నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.